
ఆంధ్ర మహా సావిత్రి



శ్రీ శార్వరి

ఆంధ్ర మహాసావిత్రి

(యోగ విజ్ఞాన సర్వస్వం)

మూలం :

శ్రీ అరవిందయోగి 'సావిత్రి'

రచన

శ్రీ శార్వరి

ప్రచురణ

మాస్టర్ యోగాశ్రమం

ANDHRA MAHA SAVITRI

by ***Sri Sarvari***

Original : **"SAVITRI"** by ***Sri Aurobindo***

Director : Dr. VAASILI VASANTA KUMAR
M.A., Ph.D.,

First (Poetic) Edition (9 Vols)	:	Between 1978-85
Second (Prose) Edition (3 Vols)	:	January 1999
Third Edition (Deluxe)	:	February 2006
Fourth Edition	**:**	**December 2008**

(Published on the occasion of
Silver Jubilee Celebrations of Master Yogaashram)

Price : **Rs. 300/-**

Published by :
MASTER YOGA ASHRAM
Plot 89, Krishna Enclave,
Military Dairy Farm Road, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Phone : (040) 27790094, 9393933946
E-mail : drvaasili@yahoo.co.in
www. masteryogashram.com

Printed by :
YOGAALAYA
Plot No. 90, Krishna Enclave,
Tirumalagiri, SECUNDERABAD - 500 015.
Phone : 27796676

ఆంధ్ర మహాసావిత్రి

మహోదయం



అన్వేషణ



స్పందన



యోగవిభూతి



నిర్వాణం



పర నిర్వాణం



మహాపర నిర్వాణం



దివ్యజ్ఞానం



దివ్యజీవనం




ఓం తత్సవితుర్వరం రూపం జ్యోతిః పరస్య ధీమహి
యన్న స్సత్యేన దీపయేత్ !



శ్రీ అరవిందయోగి

Let us meditate on the most auspicious form of SAVITRI
on the Light of the Supreme which shall illumine us with the Truth.



అరవిందదర్పణం ... యోగదర్శనం ...

శార్వరీయం

'సావిత్రి' చదివారా?

ఆఁ చదివాను.

పుస్తకం మొత్తం చదివారా?

ఒక్కసారి కాదు ... రెండు సార్లు చదివాను.

అర్థమయిందా?

పూర్తిగా అర్థంకాలేదు. కాని, చదువుతుంటే ఏదో ఆనందం కలిగింది.

★ ★ ★

అర్థం కాకపోయినా ఫరవాలేదు. చదవటం ముఖ్యం. చదవటం అవసరం. నిత్యం చదువుతూ ఉండాలి. పారాయణ చేస్తుండాలి. చదివిన ప్రతిసారి మీకు కొత్త అనుభూతి కలుగుతుంది. మీలో జ్ఞానజ్యోతి వెలుగుతుంది. కొత్త అందాలు కనిపిస్తాయి. కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. సరికొత్త విషయాలు మనస్సుకు తెలుస్తుంటాయి. అనుభూతి పెరుగుతుంది. ఒకసారి చదివినపుడు అర్థంకాని విషయాలు, రెండవసారి చదివినపుడు తెలుస్తుంటాయి. ఆ పదాల మాటున, వాక్యాల చాటున ఊహాతీతమైన విషయాలు, అందాలు కనువిందు చేస్తాయి. చదివిన ప్రతిసారి, చదివినంతమేర మీరు ఎంతో ఎత్తులకు ఎదిగినట్లు అనిపిస్తుంది. ఈ లోకం వదలి కొత్త లోకంలో ప్రవేశించినట్లు, కొత్త వెలుగుల్లో విహరిస్తున్నట్లు తోస్తుంది. ఈ విచిత్రమైన అనుభవం, అనుభూతి మీ ఒక్కరికే

కాదు. చదివిన ప్రతివారికీ కలుగుతుంది. ఆ అనుభూతి మీకు కొత్త స్ఫూర్తి కలిగిస్తుంది. బలాన్నిస్తుంది. దివ్యానుభూతి మీదవుతుంది. ప్రజ్ఞ మీకు చేరువవుతుంది.

★ ★ ★

మామూలు పుస్తకాలు చదివినట్లు సావిత్రిని చదవకూడదు. చదివే ముందు మనస్సును 'శూన్యం' చేసుకోవాలి. మనస్సులోకి ఏ ఇతర ఆలోచనలు చొరబడ కూడదు. మనస్సు నిర్మలం అయితే చదివింది 'అధ్యయనం' అవుతుంది. ఏ శ్రమ లేకుండా ఆధ్యాత్మిక సత్యాలన్నీ అర విరిసిన అరవిందా లవుతాయి.

నేను సావిత్రిని ఒకసారి కాదు, ఏడుసార్లు చదివాను. ఏడు సంవత్సరాలు యజ్ఞ దీక్షతో చదివాను. నేను మాస్టర్ సి.వి.వి. గారి యోగంలో 'తీర్థం' పుచ్చుకున్న తొలినాళ్లలోనే సావిత్రి నా చేతికి వచ్చింది. నా యోగం ఎంత శ్రద్ధగా చేశానో, సావిత్రిని అంత శ్రద్ధగా అధ్యయనం చేయసాగాను. నా యోగాభివృద్ధికి సావిత్రి అధ్యయనం బలాన్నిచ్చిందనడం పచ్చి సత్యం. అందుకే నాకు మాస్టర్‌గారి యోగం ఒక ప్రాణం అయితే, సావిత్రి రెండవ ప్రాణం అయింది.

యోగసాధన మొదలు పెట్టిన నాటి నుండి (1969 నవంబర్ 7) నేను కథలు, నవలలు రాయడం మానివేశాను. "రాస్తే యోగంపైన రాయాలి. ఆధ్యాత్మిక విషయాలు రాయాలి. లేకుంటే లేదు" అన్న కృతనిశ్చయం ఏర్పడింది. నేను చదువుతున్న సావిత్రిని మా గురువుగారు తీసుకొని చదివారు. ఆయనకు అర్థం కాలేదు. బట్టతల మీద లేని వెంట్రుకల్ని పీక్కుని "శార్వరీ! ఎప్పటికైనా సావిత్రిని తెలుగులోకి నీవే అనువదించాలి" అన్నారు. యాదృచ్ఛికంగా అన్నా, అది గురువు ఆజ్ఞగా భావించాను. తర్వాత చాలా సంవత్సరాలకు నాదైన శైలిలో 'అనుసృజనకు' పూనుకున్నాను. ప్రతి పదాన్ని అనువదించడం సాధ్యంకాక, భావం చెడకుండా, మూలాన్ని చెదరనీయకుండా కవితాత్మకంగా రాయసాగాను. మొదట చేసింది కవితానువాదం. రచన 1978 నుండి 1985 వరకు, అంటే ఏడు సంవత్సరాలు పైగా సాగింది. 1980లో మొదటిభాగం 'మహోదయం' వెలుగు చూచింది. ఆ తర్వాత వరుసగా అన్వేషణ, స్పందన, యోగ విభూతి, నిర్వాణం, పరనిర్వాణం, మహాపరనిర్వాణం, దివ్యజ్ఞానం, దివ్య జీవనం – పేర్లతో మొత్తం తొమ్మిది భాగాలను వెలువరించాను.

★ ★ ★

ఓ పట్టాన 'నా రచనలు' నాకు నచ్చవు. నచ్చకపోవడానికి కారణం అవి

బాగుండక పోవడం కాదు. ఇంకా బాగా రాసే అవకాశం ఉందనపించడం వల్ల. మరికాస్త బాగుచేసి, సంస్కరించి, మెరుగుపరచి పాఠకుల్ని రంజింప చేయవచ్చు అనిపిస్తుంది. ప్రతి రచయిత ఇలానే భావిస్తాడేమో మరి! అందుచేత నా రచనలు వేటినీ రాసిన వెంటనే ప్రెస్‌కు పంపను. కొన్ని రోజులు ఆగి, మళ్ళీ మళ్ళీ చదివి మార్పులు చేర్పులతో తిరిగి రాయడం జరుగుతుంది. మళ్ళీ రాస్తున్నప్పుడు నా తప్పులు నాకు తెలుస్తాయి. తప్పులు ఎన్నే అవకాశం పాఠకులకు ఉండదు. నా ఆధ్యాత్మిక రచనలన్నీ అలా నిగ్గు తేలినవే. నాకు పూర్తిగా నచ్చేవరకు, సంతృప్తి కలిగేవరకు, మార్పులు చేర్పులు చేస్తుంటాను. అది నా బలహీనత కావచ్చు.

మొదట 'సావిత్రి'ని కవితా శిల్పంగా మలచినప్పుడూ అదే బాధ. తర్వాత వచనంలో **'ఆంధ్ర మహాసావిత్రి'**గా అనువర్తింప చేసినప్పుడూ అదే బాధ. ఆ బాధ నాది. అది తీయని బాధ. తీయని అనుభూతి. మళ్ళీ మళ్ళీ రాయడానికి చాలా ఓపిక, నేర్పు కావాలి, సహనం కావాలి. ఆత్మవిమర్శ చేసుకోగలగాలి. మనస్సును మొండి చేసుకోవాలి. నాకు 'పర్‌ఫెక్షన్' అంటే ఇష్టం. నా రచన శ్రీ అరవిందయోగి రచనకు ప్రతిపదానువాదం అని చెప్పను. భావానువాదం, అనుసృజన అనవచ్చునేమో! హృదయాన్ని కదిలించాలి. అనుభూతి రగిలించాలి. అది నా ధ్యేయం. కవిత్వాన్ని అనువదించడం అసాధ్యం అని. ఒక కవిగా చెప్పగలను. అనువదించే వ్యక్తి కవి అయి ఉంటే, కవిత్వాన్ని అనువదించగలడు. సృజనాత్మకత గల రచయిత అయితే మూలరచయిత హృదయం తెలుసుకోగలడు. అనువాదం చాలా కష్టమైన ప్రక్రియ. చాలా క్లిష్టమైంది కూడా.

ఇప్పుడిప్పుడు అనువాదాలకు సాహిత్యగౌరవం దక్కుతోంది. అనువాదాల్ని సైతం సాహిత్య ప్రక్రియగా అంగీకరిస్తున్నారు. ఇదొక సాహిత్యశిల్పం. దీనిని **'అనుసృజన'**గా భావిస్తే మరింత రామణీయకంగా ఉంటుంది. అసలు 'సాహిత్యం అంతా' అనువాదమే. జీవితానికి అనువాదమే సాహిత్యం కదా!

ప్రతి రచనకు జీవితం మూలం. రచన అనువాదం జీవితాలకు అను కృతులు, ప్రతికృతులే సాహిత్య ప్రక్రియలన్నీ. కవితలో అదనంగా అనుభూతి ప్రవేశిస్తుంది. అంటే అనుభూతిని కలిగించే అదనపు గుణం కవితకు ఉంటుంది. కథ, నవల వంటి వాటిలో రచయిత అనుభవం కొంత కలిసి తీరుతుంది. బైబిల్ నుండి మహాభారతం వరకు అన్నీ అనువాద రచనలే. మూల రచనకు లేని విలువలు 'అనూదిత' రచనలకు అదనంగా అబ్బడం చారిత్రక సత్యం. అసలు కంటే 'అనుసృజన' ఎక్కువ రసాత్మకంగా, భావస్ఫోరకంగా ఉంటుంది. మూల

రచయిత ప్రజ్ఞ, అనువాదకుని ప్రతిభ కలసి, పుస్తకం విలువను పెంచుతాయి. వ్యాస భారతం కన్న కవిత్రయం వారి 'ఆంధ్ర మహాభారతం' ఎన్నో విధాల మిన్న. ఇది కాదనరాని సత్యం.

ప్రపంచ సాహిత్యంలోనే మహా కావ్యంగా పేరు పొందిన 'సావిత్రి'కి నోబెల్ బహుమతి ఎందుకు రాలేదో నాకిప్పటికీ అర్థం కాదు. బహుశా సావిత్రి అర్థంకాక పోవడం ఒక కారణం అయివుంటుంది. ఠాగూర్ గీతాంజలికన్న ముందుగానే సావిత్రికి ఆ అర్హత ఉంది. గీతాంజలిలోని **మార్మికత** కన్న సావిత్రిలోని **ఆధ్యాత్మికత** విశిష్టమైంది. అరవింద మహాయోగి నలభై సంవత్సరాల తపఃఫలం సావిత్రి. బహుశా అకాడమీలు గుర్తించినప్పుడే గ్రంథాలకు, వ్యక్తులకు విలువ పెరుగుతుందా!

'సావిత్రి అర్థం కాదు' అనే ప్రచారం ఉంది. అది అప ప్రచారం. ఒక్కసారి చదివితే అర్థం కాకపోవచ్చు. మళ్ళీ మళ్ళీ చదివితే ఖచ్చితంగా అర్థమవుతుంది. 'అంత కష్టపడి అర్థం చేసుకోవాలని ప్రయత్నించడం ఎందుకు?' అనుకునే వారికి ఎప్పటికీ అర్థం కాదు. సావిత్రిని అర్థం చేసుకోడానికి, అనుభూతి చెందడానికి గొప్ప సంస్కారం కావాలి. పరిణతి కావాలి. హృదయ స్పందన కలగాలి. చదవడం ఒక యోగంగా, ఒక సాధనగా సాగాలి. చదువుతూ పాఠకుడు తనలోకి తాను చొచ్చుకొనిపోవాలి. తనను శూన్యం చేసుకుంటూ చదవాలి. మనస్సును అవతల పెట్టి, హృదయంతో చదవాలి. హృదయ స్పందనతో తలపులు కలపాలి. అందుకు బాహ్య వివేకం కన్న పరేంగిత ప్రజ్ఞ అవసరం. అంతర్‌చక్షువు తెరుచుకోవడం అవసరం. అంతరాత్మ సహకారం అవసరం. తాను సామాన్యుల కోసం రాయలేదని శ్రీ అరవిందులే చెప్పుకున్నారు. 'ఫ్యూచర్ పొయిట్రీ' అని తానే కితాబు ఇచ్చుకున్నారు. అంటే తన తరం వారు చదవకూడదని కాదు. తన తరం వారిలో ఇంకా అంతటి ఆధ్యాత్మిక పరిణతి కలగలేదన్న భావన. పాఠకుడు ఆధ్యాత్మికంగా ఎదిగితే సావిత్రి అర్థమై తీరుతుంది.

ఎవరి కవిత్వమైనా ఎప్పుడూ అందరికీ పూర్తిగా అర్థం కాదు. అలా అర్థం కానిదే గొప్ప కవిత్వం. ఆ మాటకొస్తే ఆధ్యాత్మిక రచనలూ అందరికీ పూర్తిగా అర్థం కావు. మళ్ళీ మళ్ళీ చదివితే, చదివినప్పుడల్లా కొత్త అర్థాలు స్ఫురిస్తాయి. మాటలలో చెప్పలేని మర్మాలు మాటల మధ్య జాగాల్లో ఒదిగి ఉంటాయి. అవి గుప్తంగా, నిగూఢంగా, మార్మికంగా ఉండిపోతాయి. వాటిని పాఠకుడు తన విజ్ఞతతో అందుకోవలసి ఉంటుంది. సావిత్రి మొదట నాకూ అర్థం కాలేదు.

మళ్ళీ మళ్ళీ చదవగా కొంత అర్థమైంది. కొంత అనుభూతి చెందగలిగాను. హృదయంతో అర్థం చేసుకుని అనుభూతించ గలిగినప్పుడు మేధకు పని తగ్గింది. చివరకు నా 'యోగం'తో 'సావిత్రి'ని జతపరిచాను. సావిత్రిని చదువుతున్న సమయంలోనే నేను యోగంలో ప్రవేశించాను. ఆ రెండింటికి ఏదో సంబంధం ఉండి ఉంటుంది. శ్రీ అరవిందయోగి ధ్యానమందిరంలో మాస్టర్ సి.వి.వి.గారి ఫోటో ఉండేదని శ్రీ అరవిందునితో సన్నిహిత పరిచయంగల డా॥ బెజవాడ గోపాల్‌రెడ్డి గారు, డా॥ వి.ఎన్. శర్మగారు (చిల్డ్రన్ గార్డెన్ స్కూలు, మద్రాసు వ్యవస్థాపకులు), డా॥ చిట్టూరి సత్యనారాయణ గారు నాతో చెప్పారు. వారు ముగ్గురు శ్రీ అరవిందుని అభిమానులు, ఆత్మీయులు. వ్యక్తిగతంగా తెలిసినవారు అనేకమార్లు శ్రీ అరవిందుని దర్శించినవారు.

మహాత్ముల అనుగ్రహం లేనిది మార్మిక రచనలు అర్థం కావు. ఇంతో అంతో ఆత్మసంస్కారం లేనిది మహాత్ముల అనుగ్రహం కలగదు. ఆత్మ సంస్కారానికి ఆధ్యాత్మిక చింతన తోడుకావాలి. ఆధ్యాత్మిక రచనలు చేయడానికి కేవలం పాండిత్యం చాలదు. సద్గురువు అనుగ్రహం లభించాలి. వాటిని చదివి అర్థం చేసుకోవాలన్నా సద్గురువు కరుణ మనపైన ప్రసరించాలి. సంప్రదాయం పాటించే వారికి గురువు అనుగ్రహం తప్పనిసరి. స్వతంత్ర సాధకులకు, జిజ్ఞాసులకు 'అనుభూతి' కొలమానం.

చాలామంది నన్ను ప్రశ్నించారు. ఇప్పటికీ అడుగుతుంటారు. "మీరు సాధన చేసేది మాస్టర్ సి.వి.వి. గారి 'సత్యయోగం' కదా! శ్రీ అరవిందయోగి పట్ల మీకంత ఇష్టం ఎలా ఏర్పడ్డది?" అని. అందరూ సావిత్రి వెనుక సత్యవంతుని మూర్తిని చూస్తారు. నేను శ్రీ అరవిందుల స్ఫూర్తిని దర్శిస్తాను. ప్రతిపాత్రలో నాకు శ్రీ అరవిందులే దర్శనమిచ్చారు. శ్రీ అరవిందునిలో 'మాస్టర్ సి.వి.వి.' గారు కనిపించారు సావిత్రీ సత్యవంతుల ప్రేమను, సావిత్రి యమునితో తలపడటాన్ని చూస్తారు. నేను వారిలోని ఆదర్శ జీవనం, యోగ దాంపత్యం గమనించాను. సావిత్రి యమునితో దెబ్బలాడడం కాక, మృత్యువుతో తలపడి, మృత్యువును జయించడాన్ని అనుభూతించాను. 'సావిత్రి' అంటే నా దృష్టిలో మహాయోగిని, యోగేశ్వరి. సావిత్రిలో నేను దర్శించింది యోగహృదయాన్ని. యోగసంస్కారం కలవారికెవరికైనా 'సావిత్రి'లో శ్రీ అరవిందులు, అరవిందునిలో 'పూర్ణయోగం' కనిపించి తీరుతుంది. నేను అనేక యోగాలు చవి చూచాను. ఆచారాలు, సంప్రదాయాలు ప్రక్కలకు తోశాను. వాటిపై అయిష్టం నాలో స్వతంత్ర ప్రతిపత్తిని పెంచింది. అది విరక్తి కాదు. నాది వైరాగ్యం కాదు. స్వతంత్రేచ్ఛ.

అప్పుడు చీకటిలో చిరుదివ్వెలా, అంధకారంలో ఆశాకిరణంలా నాకు కనిపించింది 'సావిత్రి'. సావిత్రి చదివిన తర్వాతనే నేను మాస్టర్‌గారి యోగంలో 'నిమగ్నం' కావడం జరిగింది.

అది నా యోగ ప్రవేశిక. నాలో యోగ విభూతికి అది ఆధారం. అరవిందుని అధ్యయనం చేసి, అభిమానించినంత మాత్రాన వారి యోగమే సాధన చేయాలని లేదు. ఒకరి అడుగుల్లో అడుగులు వేస్తూ నడవడం నాకిష్టం ఉండదు. **'ఇంటెగ్రల్'** అనే పదం నాకు నచ్చింది. అది సమగ్రతకు చిహ్నం. పూర్ణత్వానికి మారుపేరు. ఎన్ని చదివినా, ఎన్ని యోగమార్గాలు అధ్యయనం చేసినా, మనదైన పద్ధతిని మనం ఏర్పరచుకోవాలి. స్వతంత్రంగా సాధన చేయడాన్ని **'ఇంటెగ్రల్ యోగా'** అనవచ్చు. అసలు మనం చదివిన ఏ చదువులు యదాతథంగా మనకు ఉపయోగించవు. చదువువల్ల బుద్ధివికాసం కలుగుతుంది. జ్ఞానం పెరుగుతుంది. స్వతంత్రత అలవడుతుంది. యోగం కూడా అంతే. ఎందర్ని చదివినా, ఎన్ని పుస్తకాలు చదివినా, మనపద్ధతి మనం ఎన్నుకోవాలి. అది నా భూమిక. నాకు **శ్రీ అరవిందుని ఇంటెగ్రల్ యోగం భూమిక. మాస్టర్‌గారి సత్యయోగం నా సాధన. నాకు మిగిలింది, నేను మిగుల్చుకున్నది ఆత్మయోగం.** అది నా బాట. అది నా ఎన్నిక. ఎవరు ఎంత విజ్ఞానం సంపాదించినా, ఏ మార్గంలో యోగ సాధన ప్రారంభించినా చివరకు తనదైన మార్గంలో నడవక తప్పదు. **స్వతంత్రంగా యోగం చేసిన వారే ఎప్పటికైనా పూర్ణత్వాన్ని సాధించగలరు**.

★ ★ ★

ఎంతకాలం అద్దె ఇళ్లలో బ్రతుకుతాం ... చిన్నదైనా, స్వంత ఇల్లు ఒకటి అమర్చుకోవాలన్న కోరిక ప్రతి మనిషికీ ఉంటుంది. ఉండాలి. ఆధ్యాత్మికంగానూ ఆ కోరిక అభిలషణీయమే. ఎన్ని పుస్తకాలు చదివినా, ఎంత విజ్ఞానం పోగు చేసుకున్నా తనవంటూ కొన్ని విశ్వాసాలు ఏర్పడాలి. ఎన్ని యోగమార్గాలు, సాధనా మార్గాలున్నా, మనదైన మార్గం ఏర్పరచుకోవడం అవసరం. శ్రీ అరవిందులు, మాస్టర్ సి.వి.వి., రమణ మహర్షి, జిడ్డు కృష్ణమూర్తి ఇలా 20వ శతాబ్దంలోని ప్రసిద్ధులైన యోగులందరూ స్వతంత్రులే. ఎవరి మార్గం వారిది. ఎవరి సాధన వారిది. నేను కించిత్ స్వతంత్ర పిపాస కలవాడిని. మాస్టర్‌గారి యోగం చేస్తున్నా, అరవిందుని అభిమానించినా, రమణ మహర్షిని ఆమోదించినా, నేను అనుష్టించే పద్ధతి నాది. **ప్రతిసాధకుడు 'ఆత్మయోగి' అయినపుడే 'పూర్ణయోగి' కాగలడని నా విశ్వాసం**. నా జీవితకథను 'ఆత్మయోగి సత్యకథ'గా రాసుకున్నాను. శ్రీ అరవింద సావిత్రిని 'ఆంధ్ర మహాసావిత్రి'గా అనుసృజన చేశాను.

మహాయోగ ప్రస్థానానికి రాచబాట 'రాజయోగ మార్గం'. ఈ బాటకు ఒకవైపున శ్రీ అరవిందులు తయారించిన లతామండపాలు పూర్ణపరిమళాలు, రెండవ వైపున ఆంధ్ర మహాసావిత్రి గుబాళింపులు సత్యదీప్తులు. చాలామంది సాహితీ వేత్తలు అన్నట్లు ఆంధ్రమహాసావిత్రి స్వ–తంత్ర రచన. కాదనలేను. ఇందులో ప్రతి పదంలోనూ అరవింద దర్శనం కలుగుతుంది. ప్రతివాక్య నిర్మాణంలో 'శార్వరీయత' తొంగి చూస్తుంది. పుస్తకంలో ఆమూలాగ్రం సంపూర్ణయోగం ఉంది. సత్యయోగ దీప్తులు ఉన్నాయి. అందులో ఎందరో మహర్షుల, యోగుల తపశ్శక్తి నిక్షిప్తమై ఉంది. ఇది నా ప్రతిభ కాదు. నా ప్రజ్ఞ అంతకన్న కాదు. అది పూర్తిగా శ్రీ అరవిందుల ప్రతిభ. మాస్టర్ సి.వి.వి. గారి ప్రజ్ఞ. నేను అక్షరాల నిమిత్త మాత్రుడిని. కేవలం 'అక్షర' శిల్పిని.

★ ★ ★

ఆంధ్రమహాసావిత్రి వచన రచన. అయితే కవితాత్మక రచన. ఇది 'పునః సృష్టి' అని ఎందుకు అనవలసి వచ్చిందంటే కేవలం అనువాదం కాదు కనుక. 'అనుసృజన' కనుక. ఇది కవితాత్మగల యోగప్రబంధం. ఇది నాలుగవ ముద్రణ. అర్థం కాలేదని అంటూనే ఆంధ్రమహాసావిత్రిని అభిమానించే వారు, చదివేవారు ఎక్కువైనారు. ఇది చదవడం వల్ల అనుభూతి కలుగుతుంది. యోగసాధన పెరుగుతుంది. అన్ని పుస్తకాలు అందరికీ నచ్చాలని లేదు. అయినా నేను అందరి కోసం రాయడం లేదు. అందరినీ అలరించే విధంగా రాయలేను. యోగజిజ్ఞాస కలవారికోసం రాస్తాను. యోగార్హత కలవారు మాత్రమే నా పుస్తకాలు చదవగలరు. అర్థం చేసుకుని, అనుభూతించగలరు. అలాంటి వారికి తప్పకుండా నా రచనలు అర్థమవుతాయి. ఆధ్యాత్మిక తపనగల వారిని ఒక మెట్టుపైకి తీసుకుపోతాయి. ప్రాపంచిక విషయాలపట్ల ఆసక్తి తగ్గి, ఆధ్యాత్మిక విషయాల పట్ల అభిరుచి, అభినుతి పెరిగినవారు నా పాఠకులు. తపనను తపస్సుగా మార్చుకోగలిగిన వారు, ఏదో ఒక యోగమార్గంలో అభిరుచి కలవారు 'ఆంధ్ర మహాసావిత్రి'ని అర్థం చేసుకోగలరు. లబ్ధి పొందగలరు. యోగసాధన చేస్తున్న వారి కోసం **'ఆంధ్ర మహా సావిత్రి'** కొత్త వాకిళ్లు తెరుస్తుంది. మంచి ఆలోచనలు కలగాలంటే ఎలాంటి అనుమానాలు ఉండకూడదు. ఓపెన్ మైండ్‌తో సావిత్రిని చదవాలి. అధ్యయనం చేయాలి. నిత్యం పారాయణ చేస్తుండాలి. ప్రతిరోజు ఒకటి రెండు పేజీలు చదివినా చాలు. చదివిన తర్వాత కళ్లు మూసుకుని అంతర్ముఖులు కావాలి. అంతర్యామిని అనుభూతించాలి, శూన్యం కావాలి.

– శార్వరి

సుహృల్లేఖ

శ్రీ శార్వరి 'సావిత్రి' చదవండి

లోలోపల కాదు ... పైకి ...

అలా వూరికే చదువుతూ పొండి ...

ఎక్కడా ఆగి ఆలోచించకండి .. వ్యర్థం.

ఆలోచించడమనేది పూర్తిగా మానేసి చదవండి.

సావిత్రి వేదబుక్కుల్లా వినబడుతుంది.

అలా వింటోంటే ...

కాస్సేపటికి మురికివదిలి మనస్సు తేలిక పడుతుంది.

అంతరంగంలో తెలియని కొత్త వాకిళ్లేవో

మెత్తగా తెరుచుకుంటున్నట్టనిపిస్తుంది.

ఎన్నడూ సోకని కొత్త గాలులేవో

చుట్టూ సుఖంగా పొరాడుతున్నట్టనిపిస్తుంది.

అనుభవానికి రాని కొత్త సుగంధమేదో

ప్రియంగా ఆవరించుకున్నట్టనిపిస్తుంది.

వూదారంగు ఆవిరి, నీలిరంగు పొగమంచు,

నారింజరంగు శాంబరం మిమ్మల్ని చుట్టేసుకుని,

ఉక్కిరి బిక్కిరి చేసి ఎక్కడికో ఎగరేసుకుపోయి,

మీ కళ్ల ముందే సుడులు తిరుగుతూ,

గోళాలు గోళాలుగా ముద్దకడుతున్నట్టనిపిస్తుంది.


మీదికి వొరిగిపోతున్న చిలకపచ్చ మబ్బుల్లోంచి

కుండపోతగా బంగారువాన కురిసి మీరు ముద్దయిపోతారు.


మీరు చూస్తుండగానే ఆ మబ్బులు రంగులు మారతాయి.

మృదుస్వర కాదంబినిగా మీ మీద వాలిపోతాయి.
అమృతపు మడుగులా మిమ్మల్ని ముంచెత్తుతాయి.
మీరు ఆనందంతో ఉద్దు గడుచుకుంటారు.
పారవశ్యంతో గిలగిల్లాడి పోతారు.
మీ అల్పత్వం మీకు తెలిసివచ్చి
మీ అహంకారం మాసిపోయి
జిజ్ఞాస మొదలవుతుంది ...
అక్కణ్ణించి కొత్తబ్రతుకు.
అలా మొదలైన కొత్త బ్రతుకు పూర్ణయోగంగా
ఎలా మారుతుందో చిత్రించారు శ్రీ అరవిందులు సావిత్రిలో.
అధిమానస అతిలోకమైన మహాయోగి పొందే దర్శనానికి,
అనుభూతికి అతిలోకమైన కవితాభివ్యక్తి 'సావిత్రి'.
దానిని 'తెలుగు' చేయటం మాటలు కాదు.
ఇది అనువాదం కాదు – అనువాదం చిలక పలుకు.
ఇది 'వినిర్మితి' – అంటే విశిష్టమైన నవసృష్టి.
తెలుగులో తిక్కన్నగారు చేసినంతపని.
కాకుంటే, ఇంత సరళ సుందరమైన ప్రావాహిక శైలిలో
'ఆంధ్ర మహాసావిత్రి' అవతరించి ఉండేది కాదు.
నిజానికి – శ్రీ అరవిందులను అర్థం చేసుకోవడమనేది అసలు లేదు.
వారిని అనుభూతికి తెచ్చుకోవలసిందే.
వారు భాషకు లొంగరు, మేధకు లొంగరు, భావనకు లొంగరు.
వారిని అనుభూతికి తెచ్చుకోగల సహృదయత
అలవిమాలిన కవితాత్మగల యోగికి మాత్రమే సాధ్యం.
శార్వరి యోగి, కవి. అతనికి నూరేళ్లు.
అతని యశస్సు 'సావిత్రి' బ్రతికినన్నేళ్లు.

కావలి **– యస్వీ భుంజగరాయశర్మ**



శ్రీ శార్వరి



1. మహోదయం

ఎక్కడో కథ మధ్యన వచ్చే క్లైమాక్స్‌తో 'సావిత్రి' మహాకావ్యం ఆరంభమైంది. మరుక్షణంలో గతం 'ఫ్లాష్ బ్యాక్' అవుతుంది. అది సత్యవంతుడు మరణించవలసిన రోజు. అంటే నారదమహర్షి పెట్టిన గడువు ఆ రోజుతో పూర్తి అవుతుంది. సత్యవంతుడు సకల సద్గుణ వల్లభుడు. అయినా అల్పాయుష్కుడు. అతను ఒక్క ఏడాదిమించి జీవించడని చెప్పాడు నారదుడు. అయినా సావిత్రి అతనినే వరించింది. ఆ రోజుకోసం నిరీక్షించసాగింది. ఆరోజు రానే వచ్చింది. వరించింది.

అది పరమాత్మ జాగృతం కాని 'బ్రాహ్మీ' ముహూర్తం.

రాత్రి గడుస్తున్నది. ఉషోదయం కానున్నది. ఆమెకు మూడు దినాలుగా కంటిపై కునుకులేదు. త్రైరాత్ర వ్రతం చేస్తున్నది. సావిత్రి మద్ర ప్రభువు అశ్వపతి కుమార్తె. రాజ్యభ్రష్టుడై అరణ్యవాసం చేస్తున్న ద్యుమత్సేనుని కుమారుడు సత్యవంతుని ఏరికోరి స్వయంవరం చేసుకున్నది. అత్త మామలతో, భర్తతో కలసి అరణ్యంలో కాపురం పెట్టింది. సావిత్రీ సత్య వంతులది ఆత్మ ప్రణయబంధం. ఏడాదికాలం సుఖంగానే సంసారం సాగింది. సత్యవంతునికి అవసానకాలం సమీపిస్తున్నదని సావిత్రికి తెలుసు. అదే ఆమె కలవరం. అటు ఆసన్న మృత్యువుపై దృష్టి కేంద్రీకరించింది.

అక్కడ జీవి ఆరాటం చిత్ర విచిత్ర సంకేతమయం. సం వేదనామయం. దానిలోకి చొచ్చుకుపోవడం దుస్తరం, అనూహ్యం. అక్కడక్కడ శూన్యంలో మెరుపుల మిణుగురులు, ఒక రూపం ఏదో అరూపంగా తోచి అంతలో మాయమవుతుంది. ఒక్కొక్క అరూపభావన, రూపచిత్రమై ఆకాశమంత విశాలంగా విస్తరిస్తుంది.

మొదట దర్శనమయ్యేది నిశీథం. గాఢాంధకారం. రాత్రి అంతా అలముకున్న చీకట్లు వేరు, ఉషస్సుకు ముందర ముసిరే తమస్సు వేరు.

కన్నుపొడుచుకున్నా కనిపించని చీకటి ఉషోదయానికి ముందరగా అలముకుంటుంది.

ఆ నిబిడాంధకారాన్ని చీల్చుకుని ఉషోరేఖలు ప్రసరిస్తాయి. ఉషోదయంలో చీకట్లు విచ్చుకుంటాయి.

అది ఉషోదయం ... మనిషి ఎదలో కలిగే చైతన్యం. ఉషఃకాంత మత్తు వదిలించుకుని దివ్యత్వాన్ని ఆలింగనం చేసుకున్నది. మనస్సు అజ్ఞానం వదలి, అంధకారం నుండి క్రమంగా బయటపడి, వెలుగు నింపుకుని పరిణామంలో చివరకు దివ్యం కావాలి. ప్రతి ఆత్మ పరమాత్మ స్థాయికి ఎదగాలి. అణువు బ్రహ్మాండం కావాలి.

మనిషి మేలుకొంటున్నాడు. మానవత నిద్ర నుండి బయటపడుతోంది. నిత్యకృత్యాలు జరుగుతున్నాయి. సావిత్రి మనసు శరీరంలో లేదు. రానున్న ఆపద గురించి క్షోభిస్తోంది. ముఖంపైన చెదరని దరహాసం, అంతరంగంలో కల్లోలం, అలజడి. ముఖంపైన చెదరని దరహాసం – అమృతత్వాన్ని కాంక్షించే వారికది మహోదయం. స్వర్గం చేరాలన్నా పరమాత్మను చేరాలన్నా అంత సులభం కాదు.

సావిత్రి రాకుమారిగా, తండ్రిచాటుబిడ్డగా ఉన్నంతకాలం రాజభోగాలు అనుభవించింది. స్వయంవరంతో సత్యవంతుని పెండ్లాడి, కష్టాలు కోరి తెచ్చుకున్నది. ప్రేమ కోసం, విజయం కోసం, ఆత్మవిముక్తి కోసం, దివ్యత్వం కోసం, అమృతత్వం కోసం ఆమె జన్మించింది. ఆమె జగన్మాత అంశ. సత్య వంతుడు 'సత్య' ప్రతినిధి. 'సత్యం' మొదట మృత్యువాత పడ్డది. అజ్ఞానంలో చిక్కుకున్నది. సావిత్రి తన ప్రేమతో సత్యాన్ని జయించి అగ్నిపునీత అయింది. ఆత్మజ్ఞానంతో సత్యాన్ని దర్శించడమే మానవ జీవిత పరమావధి.

అది సావిత్రికి ముంచుకొస్తున్న మృత్యువుకు మధ్య కాలపరీక్ష. మృత్యువుకు, దివ్యజీవనానికి మధ్య తలెత్తిన సమస్య. జీవునికి బ్రహ్మజిజ్ఞాసకు మధ్య జటిల సమస్య. అది సావిత్రికి ఉషోదయం ... జగతికి మహోదయం. మరికొద్ది క్షణాలలో సావిత్రి మృత్యువును దర్శిస్తుంది. యముని ఆగమనం ఆమె జీవితంలో క్లిష్టమైన ఘడియ. తన కర్తవ్యాన్ని విస్మరించి మృత్యువుకు తలవంచడం అన్న ప్రశ్నే లేదు. అప్పుడు సావిత్రిలో దివ్యాంశ ప్రవేశించింది. ప్రాపంచిక బంధాల నుండి మానవత్వాన్ని ఉద్ధరించాలన్న పట్టుదల

పెరిగింది. అది దివ్యసంకల్పం. అది సత్సంకల్పం. ఈశ్వర సంకల్పానికి సావిత్రి ఆలంబన అయింది.

విధి బలీయం అన్నారు మహర్షులు. సావిత్రి ప్రయత్నం ఫలించడానికన్న విఫలం కావడానికే ఎక్కువ అవకాశం అనిపిస్తుంది. అయితే సావిత్రి వెనుకంజ వేయలేదు. వెనుతిరిగి గతంలోకి చూడదలచలేదు. 'విధి' అనే రణక్షేత్రంలో పోరాటానికి సన్నద్ధమైంది.

సావిత్రి జగన్మాత అవతారం. అశ్వపతి తపస్సు చేసి పరమాత్మను ప్రసన్నం చేసుకుని, జగన్మాతను భూమిపైన అవతరించవలసిందిగా అర్థించాడు. మానవుడు మృత్యుంజయుడు కావాలి. పరిణామంలో మనిషి చేరవలసిన గమ్యం ఇంకా చేరలేదు. సాధించవలసిన అమృతత్వాన్ని సాధించ లేదు.

తొలి అధ్యాయాలలో అశ్వపతి విశ్వయోగసాధన కనిపిస్తుంది. అశ్వపతిలో శ్రీ అరవిందయోగి దర్శనమిస్తాడు. పేరు అశ్వపతి. యోగం, అనుభూతి, అనుభవం అన్నీ శ్రీ అరవిందునివి. ప్రబంధం అంతా సంకేతమయం, మార్మికం, అతీంద్రియ విజ్ఞాన భాండాగారం. అశ్వపతి యోగసమాధిలో సృష్టి ఆరంభం వరకు వెళ్లి చూచాడు.

అశ్వపతి పరమాత్మ అంశ… పరబ్రహ్మాంశ. సావిత్రిది జగన్మాత అంశ. ఇరువురు యోగబలంతో తమ లక్ష్యాన్ని సాధించగలిగారు. సావిత్రి యోగప్రస్థానం 'సత్యం' లక్ష్యంగా సాగింది. మృత్యువును జయించి మనిషిని దివ్య మానవునిగా తీర్చిదిద్దడం ఆమె లక్ష్యం. అందుకే అమరత్వానికి అడ్డుపడుతున్న మృత్యువుతో తలపడ్డది. మృత్యువుతో అనేక విషయాలపై వాదించింది.

అశ్వపతి మహాయోగి. ఆయన స్పృశించని యోగభూమికలు లేవు. చతుర్దశ భువనాలను చుట్టిరాగల ప్రజ్ఞ అశ్వపతిది. కాలానికి అతీతంగా పయనించి, సృష్టి ఆరంభం వరకు వెళ్లగలడు. ప్రతియోగి ఇటు సావిత్రిని, అటు అశ్వపతిని ఆవాహన చేసుకుని సాధన సాగించాలన్నది శ్రీ అరవిందయోగి భావన.

"It was the hour before the Gods awake".

అది బ్రహ్మముహూర్తం. పరమాత్మ చైతన్యంతో పులకించి విశ్వసృష్టికి సంకల్పించిన మహత్తర క్షణం. అది పరమాత్మ జాగృతం కాని బ్రాహ్మీ ముహూర్తం. ఆ మహత్తర ఘటన దివ్యసంకల్పానికి ముదల. అది అంతర్హితం కానున్న మహాంధకార నిశీధి. వెలుగులేని ఒంటరితనం, అనంతం, అంధకార మందిరం. మహానిశ్శబ్దం పరచుకున్న నిశ్చలత. అది అభేద్యం. అది అంధ తమస్సు – రానున్నది ఉషస్సు.

ఆ శూన్యంలో నిశ్శబ్ద సంగీతరుతాలు – చక్షురాహిత్యం – అరూపస్థితి అనంతంగా రోదసిలోకి సాగివుంది. అనంతం అరూపంలో లయించివుంది. ఆద్యంతాలు లేని శూన్య విశ్వం, ఆద్యంత రహితమైన శూన్యం నడుమ, ఆద్యంతాలు లేని మహా ప్రాణశక్తి స్వయంగా ఆవిష్కృతమైంది. అదే ఆత్మగా తళుక్కుమని మెరిసింది. తమోగర్భాన్ని నిలువునా చీల్చి, అభేద్యమైన రహస్యాన్ని ఛేదించుకుని సృష్టి ఏర్పడి విశ్వంగా పరిణామం చెందింది. చీకట్లను చీల్చి, వెలుగు చారలు స్రవించి, శూన్య రోదసిలో తన స్థావరాన్ని సుస్థిర పరచుకున్నది. ఆ క్రియాశక్తే ఆత్మగా ఆవిర్భవించింది. అంధ తమిస్ర గర్భాన్ని చీల్చుకుని, సృష్టి రహస్యాన్ని ఛేదించుకొని సుందర సువిశాల మృత్యు మందిరమైన ఈ గోచర ప్రపంచంలోకి పయనించి 'ఆత్మ' తనను తాను అన్వేషించసాగింది. తన గమ్యాన్ని నిర్దేశించుకొనబూనింది.

చరాచర ప్రకృతి. సృష్టికి ఆది లేదు, అంతం లేదు. ఆరంభంలో అంతా అంధకారమే, అయోమయమే, సర్వం జగన్నాధమే. చలనానికి మూలం అచలం. గోచరానికి ఆది అగోచరం. సృష్టికార్యం అసంకల్పితంగా, అదృశ్యంగా సాగింది. దాని వెనుకనున్న సంకల్పం ఎప్పుడూ అగోచరమే. అదృశ్యంగా ఉన్న అజ్ఞాతశక్తి విశ్వాన్ని నడిపిస్తుంది. ఆ అజ్ఞాతశక్తులే విశ్వాన్ని మాయలో, మగతలో ముంచి, నిద్ర పుచ్చుతాయి. ఆ నిద్రలో కదలినప్పుడు, మానవ జీవితాల్లో వెలుగులు నిండుతాయి.

అది సమాధి. శూన్య రోదసీ సమాధి. కరడుగట్టిన మహా చైతన్యసమాధి అది. అందులో ప్రాణి లేదు, ప్రాణ స్పందన లేదు, చైతన్యం లేదు – అందులో ఒక అరూప స్పందన కలిగింది. ఆత్మ లేని శూన్యంలో ఒక కదలిక. ఒక స్పందన నీడలా. ఆలోచనా రహితమైన స్వప్నంలోకి జారినట్లు ఒక భావస్పందన. శూన్య రోదసిలో భూగోళం ఆకృతీకరించింది. నిరాధారంగా కనిపించే భూగోళాన్ని, సుదూరంలోని గ్రహశక్తులు పడిపోకుండా నిలిపాయి. భూమి ఒంటరిగా మిగిలింది. అప్పుడు అంధకారంలో ఒక కదలిక ఏర్పడ్డది. అది ఒక భావ రహిత సంకల్పం. ఒక లక్ష్యం, గమ్యం లేని అసంతుష్ట భావ వీచిక, భావనా శకలం. ఏదో కావాలన్న తపన. మరేదో అయిపోవాలన్న ఆరాటం. సృష్టి పరిణామానికి ఆరాటమే ఊపిరి, పోరాటమే శక్తి. అంధకారం మేల్కొల్పిన అజ్ఞానం జ్ఞానం దిశగా ప్రయాణం. సంకల్పం రగిలి, పొగిలి కకావికలైంది. కల్లోలమైంది. సంకల్పం సంపూర్ణమైన వెంటనే పరిణామం ఆరంభమైంది.

చేతనకు ఆవల ఉన్నది ఉపచేతనా కుహరం. అందులో వెలుగు లేదు, వెన్నెల లేదు, స్పందన లేదు, కదలిక లేదు, చలనం లేదు. అది కాంతికై ఆక్రందించ సాగింది. అంతరంగంలోని స్మృతి కలవరించి కళ్లు విప్పింది. శూన్యంలో లయించిన ఆత్మ కోసం అంగలార్చింది. అన్వేషణ సాగించింది. తన సంకల్పం యొక్క అవసరాన్ని, ఆవేశాన్ని తానే గుర్తించింది. శూన్యం నుండి సృష్టి ప్రభవించింది. లయ నుండి స్థితి రూపొందింది. గతం నుండి వర్తమానం, వర్తమానం లోంచి వస్తు జాలం రూపం ధరించింది. సృష్టికి అవి పురిటి నొప్పులు.

ప్రకృతి పురుడు పోసుకుని సృష్టిని ప్రసవించింది. ఒక ప్రపంచం ఆకృతి దాల్చింది. అరూప చైతన్యం రూప ప్రపంచానికి దారి కల్పించగా, ప్రపంచం తనను చూచుకోడానికి వెలుగును ఆవిష్కరించుకుంది. ఆత్మ తనను తాను వెతుక్కోడానికి శూన్యం, చీకటి అవసరం. లోకానికి వెలుగు అవసరం.

శూన్యంలో దాగివున్న ప్రజ్ఞ చైతన్యాన్ని కోరింది. భవిష్యత్ పరిణామానికి సన్నద్ధమైంది. పసిబిడ్డ వేలు అప్రయత్నంగా చెక్కిలిని చేరింది. వస్తు ప్రపంచ ఆవిర్భావంతో అవసరం అనంతమైంది. జగన్మాత కారుణ్యం లోకవృత్తికి అవసరమైంది. జగత్తు పసిబిడ్డలా ప్రకృతిని పెనవేసుకుంది. అమ్మ ఒడిలో సేద తీరింది. బాధ్యత అమ్మది. అమ్మ జగన్మాత అయింది. అమ్మ ప్రేమ రోదసిని చీల్చి, వెలుగు కిరణాన్ని తెచ్చుకున్నది.

వెలుగు కిరణం రాకతో లోకం పులకించింది. శూన్య హృదయంలో మందస్మితం మొగ్గ తొడిగినట్లయింది. నిద్ర నటిస్తున్న ప్రాణశక్తి ఉలిక్కిపడి కళ్లు విప్పింది. ప్రాణ స్పందనతో అచల ప్రకృతి చలనం పొందింది. శూన్యం ఇప్పుడు శూన్యం కాదు ... చైతన్యం నిండిన జగత్తు. శూన్యం ఇప్పుడు చీకటి కాదు ... క్రాంతి పూర్ణమైన చైతన్యం. సూర్యమండలం నుండి బయలుదేరిన కాంతి కిరణం భూమిని స్పృశించడంతో తెల్లవారింది. లోకంలో చైతన్యం కదలాడింది. సృష్టిలో కదలిక, ప్రాణస్పందన ఏర్పడ్డది. సమాధి స్థితిలోని ఆత్మను కదలించి, తన ఆగమనాన్ని సంకేతించింది. వెలుగు కలిసిన ఆత్మ ఆనందం కొరకు అన్వేషించ సాగింది ... వెదకసాగింది.

మొదట విశ్వం జడప్రాయంగా, చైతన్య రహితంగా వుంది. సూర్యుని వెలుగు కిరణం విశ్వాత్మను సోకగానే ప్రాణం ఏర్పడింది. జడత్వాన్ని వదలి చైతన్య పూర్ణమైంది. శూన్యాన్ని కాంతి తరిమివేసింది. అంధకారాన్ని వెలుతురు తరిమివేసింది. ప్రకృతి ఆనందంతో పులకించసాగింది. అనుభూతి చెంది అనుభవం కోసం తహతహలాడింది. ఆ తీవ్ర తపన ఒక భావ బీజమైంది. భావన ప్రజ్ఞగా ప్రజ్వలించింది. కాలం ఎద కదలికలో ఒక భావన బీజమైంది. 'ఆత్మ' తనకు జనన మరణాలు లేవని తెలుసుకుని మృత్యువు చాటున గత కాలపు జ్ఞాపకాలను దాచివేసింది.

సృష్టించబడినదంతా నశిస్తుంది. నశించినదంతా తిరిగి ఉద్భవిస్తుంది. గతించిన అనుభవం పునరావృతమవుతుంది. పరమాత్మ సంకల్పంలో అనుభవం అనేది లేదు. విశ్వసృష్టి, జగన్నిర్మాణం సైతం పరమాత్మ సంకల్పాలే. భగవదంశ ఒక చిరు ఆశగా మారి సృష్టి మొగ్గ తొడిగింది. పరమాత్మ సంకల్పం ఆత్మకు మరో లోకాన్ని అందించింది. తనదైన కారుణ్యాన్ని, తారుణ్యాన్ని ఆత్మకు పంచి యిచ్చింది. అందుచేతనే ఆత్మకు పరమాత్మను చేరడం పరమగమ్యం. జీవికి ఒక ఆశ్రయం ఏర్పడ్డది. జీవుని ఆశ్రమంలో ఆత్మ తలదాచుకున్నది. జీవాత్మల సహజీవనానికి తగిన నెలవులు కరువైనాయి. అది మహాద్భుత సమాగమం. రోదసిలో, నభోమండలంలో భూలోకం ఒక శకలం. అందులో ఒక జీవి ఎంత? ఆ జీవునికి అమృతతుల్యమైన 'ఆత్మ' సందేశం అందింది. ఆ సందేశం కలిగించిన తపన, అందించిన స్పందన అంధకారాన్ని దాటించి, వెలుగు సీమలకు చేర్చ గలదు. శూన్యాన్ని ప్రశాంతితో నింపగలదు. జీవుని ఆనందం పరమానందంగా భాసించి పరమాత్మకు ఆనంద హేతువు కాగలదు.

అప్పుడే ఒక కాంతి ప్రభవించింది. అది అద్భుతం, అపురూపం. అది ప్రభవించి, కాలయవనికపై ఒక మెరపులా మెరిసి తీరంలో లయించింది. అది సువర్ణ కాంతి, అది ధవళ కిరణం. అప్పుడు మార్మిక లోకపు ద్వారాలు తెరుచుకున్నాయి. స్వప్న సౌధాల గవాక్షాలు విచ్చుకున్నాయి. అది గుప్త విద్య. అది మర్మదేశం. భృక్తమైన రహస్యాలెన్నో. అజ్ఞానంలో, చీకటిలో ఉన్న లోకాలకు ఆ మర్మాలు తెలియవు. ప్రయత్నించి సాధించవలసింది మనిషి. అందుకే మనిషికి ఆలోచన వరం. ఆదమరచి నిద్రిస్తున్న అచ్చర శరీరం పైన దేవతా వస్త్రాల వలె అవి తొలగిపోయాయి. చీకటి తెరలు తొలగి వెలుగు పరదాలు స్వాగతించాయి. జారిపడిన చీకటి వలువలు వేనవేల గోళాలపై అగ్నుల్ని కురి పించాయి. అప్పుడు ఆకసం కాంతిపూర్ణమైంది. అగ్నులు ఏకమై సూర్యబింబమైంది.

దూరతీరాలలో గగనాంచలాలలో దాగిన సౌందర్యాలు పరమాత్మ ప్రతిభకు, తేజస్సుకు ప్రతీకలైనాయి. ఆ తేజస్సు అందించిన సందేశం సృష్టి చలనాలపై తూగాడసాగింది. ఉషఃకిరణాలలో సప్తవర్ణాలు చిత్రంగా కలిసిపోయాయి. ఆది కాలానికి అందం. అందానికి అందని ఆనందం. అది నిమేషకాలంలో దర్శనీయమయ్యే దివ్యత్వం ... అమృతత్వం.....అమరత్వం. ఆ దివ్యభావన క్షణంసేపు జీవన యవనికపై కదిలి వసుంధర ఫాలభాగాన్ని స్పృశించి, లలాటరేఖల్ని రచించింది. అందానికి ఆనందం అద్ది సౌందర్యాన్ని సృష్టించి, తానే సంధానకర్త అయింది. మార్మిక లోకపు భావనలకు రూపకల్పన జరిగింది. అది కారణంగా ఆధ్యాత్మికత నెలకొన్నది. ఆధ్యాత్మిక సౌందర్యానికి మార్మిక స్పందనలు ఆకర్షణలు. సృష్టి యావత్తు ఒక మార్మిక సంపుటి అయింది. నిగూఢ సత్యాలపై ఆధ్యాత్మ మార్మికత మేలి ముసుగువేసింది.

నాడే జగతిపై మాయావిష్కరణ జరిగింది. జగత్తుకు ఆశలు, ఆశయాలు ప్రగతి సంకేతాలైనాయి... సందేశాలైనాయి. అగోచరంలోని అద్భుతసౌందర్యాలు గోచర విశ్వంలోకి రాసాగాయి. శూన్యనిశ్శబ్దాలు కలవరం చెందసాగాయి. జీవునికి కేంద్రం ఒకటి ఏర్పడి, ప్రశాంతికి, ఆత్మకు అది కనిపించని కేంద్రమై సత్యాన్ని, సత్యలోకాలను ఆవిష్కరించింది. అశాంతికి, ప్రశాంతికి మధ్య ద్వారం అయింది హృదయ కేంద్రం. దివ్య సౌందర్యం హృదయానికి ఆవలితీరంలో ఉండిపోయింది.

పరిణామానికి స్తబ్ధతకు మధ్య, జడత్వానికి చైతన్యానికి మధ్య నిలిచిన అదృశ్యశక్తి నేల నాలుగు చెరగులా వ్యాపించి గ్రహాలను, గ్రహగతులను నిర్దేశిస్తూ జీవికీ జీవికీ మధ్య బంధం ఏర్పరచింది. జగన్మాత ఆవిష్కరణకు జగత్తు

సంసిద్ధమైంది. ఒకసారి వెనుతిరిగి అవలోకించింది. మరుగున పడ్డ వెలుగుల్ని చూచింది. సాలోచనగా తన సృష్టి కార్య నిర్వహణకు పూనుకున్నది. జగన్మాత అవతరణతో దివ్యపథం మూతపడ్డది. ఇటు నుండి అటు పయనించడానికి మార్గం చెరిగిపోయింది. ఉన్న ద్వారం ఒక్కటి మూసుకుపోయింది. దివ్యపథం మూతపడినట్లు వసుధ గమనించింది. తానే వసుంధర అయింది. మేల్కొంటున్న ప్రకృతికి జగన్మాత సవ్వడి వినిపించింది. మహాశూన్యంలో జడత్వం పులకించి ఆమెను స్వాగతించింది. మాతృ దరహాసంతో నాలుగు చెరగుల వెలుగులు నిండాయి. లోకాలు మత్తు వదలి చైతన్యవంతమైనాయి. ఇప్పుడు అది లోకం .... నిత్యకృత్యం ఒక నిత్యక్రతువుగా మారింది.

నేలకు, నింగికి మధ్య వాయువు అనుసంధానమైంది. వాయువు స్పందించి, రెక్కలు విదల్చగా ప్రభంజనాలు ఏర్పడ్డాయి. పర్వత శిఖరాలు సైతం ప్రభంజనాల హోరుకు కలత పడసాగాయి. చిన్నచిన్న కొమ్మలు, రెమ్మలు ఆకాశం వైపు దీనంగా చూచాయి. జడంగా, అయోమయంలో ఉన్న పృధ్వి గుండెలో ప్రజ్ఞ ప్రవేశించి చైతన్యం కలిగించింది. ఆపైన ... సత్యం ఎక్కడో దాగింది. లోకం తనను తాను రూపుదిద్దుకొనసాగింది. ఈ కొత్త ప్రపంచం ఎంత చిత్రంగా తయారైంది! సత్యం కనుమరుగుకాగా ఎన్ని వింత పోకడలు పోయింది! ఆనందాలకు అవరోధాలు ఏర్పడ్డాయి. దివ్యత్వం అన్నది మరచిపోయిన మధురస్మృతి. సహజమైన దివ్యజీవనం, దివ్యదృష్టి మహాద్భుతాలుగా మారాయి. దివ్యత్వం క్రమక్రమంగా అంతరించి పోసాగింది. భౌతిక ప్రపంచం సత్యాన్ని, దివ్యత్వాన్ని దూరం చేసుకున్నది.

జారిపోయిన దివ్యత్వానికి తీపి గురుతుగా పవిత్రమైన అనుభూతి, ఆరాటం మిగిలాయి. మానవ హృదయం భరించలేని మహాశక్తి రూపం ఆరాధనీయంగా మిగిలింది. మనిషికి జన్మజన్మలకు ఆరాధన ఒక్కటే మిగిలింది. మహాశక్తికి ఆరాధనే ఆధారమైంది. ఆ రూపంలో ఈశ్వర తేజస్సు అతి స్వల్పమే మిగిలింది. ఆ చిరుతేజస్సు చాలు మానవ హృదయాన్ని దివ్యత్వంతో నింపి, అంచెలంచెలుగా సృష్టి రహస్యాలను, పరమ సత్యాలను ఆవిష్కరించి మనిషిని దివ్య మానవునిగా దిద్దడానికి. అది చాలు అనంత దివ్య సౌందర్యాలను అందించడానికి. మనిషిని అమరునిగా అమృతమయునిగా తీర్చిదిద్దడానికి.

ఒక ఆత్మ మానవ రూపం ధరించడానికి సంకల్పించినప్పుడు కాలానికి అతీతంగా వున్న జీవ పదార్థం కాల పరిధిలో ప్రవేశిస్తుంది. భౌతిక లోకంలో

ఒక అణువుగా మారినప్పుడు, జీవం దానితో కలిసిపోగా, దానిదే అయిన కాలాతీతప్రజ్ఞ పైనున్న సత్యలోకాలకు పోతుంది. పైనుండి దిగివచ్చిన ఆత్మ జీవునిలో ప్రవేశించి సహజీవనం సాగిస్తుంది. మానవ జన్మకువచ్చిన జీవుని ప్రజ్ఞ మరుగున పడుతుంది. ఆత్మప్రవేశంతో జీవునికి కొత్త జీవితం ఏర్పడుతుంది. ప్రజ్ఞ పైలోకాలకు పరిమితం. తన ప్రజ్ఞను తిరిగి అందుకోవడానికై జీవుడు ఆత్మ సహకారంతో ఆరాటపడతాడు. ఆత్మ సహకారం లేనిది దివ్య ప్రజ్ఞ అందడం జరగని పని. దివ్యత్వం తానుగా ఎన్నడూ దిగిరాదు. మానవత్వం అంటే దానికి మోజు ఉండదు. ప్రజ్ఞ ఈశ్వరుని అధీనంలో ఉంటుంది. అది కాలానికి అతీతం.

ప్రజ్ఞ ఎప్పుడు పరానికి, పరలోకాలకు సంబంధించినదే. ఆ ఓజస్సు పైలోకాల నుండి జాలువారవలసిందే. దివ్యత్వం భూలోకంలో నిలబడదు. ఆ పరమాద్భుతశక్తిని భూమి భరించలేదు. ఇక్కడి కాంతి వేరు. వెలుగు వేరు. దివ్యకాంతిని అందుకునే వరకు జీవుడు మరల మరల జన్మిస్తుంటాడు. ఈ లోకపు అలజడిని తట్టుకోలేక, భరించలేక శాశ్వత విశ్రాంతిని అభిలషిస్తుంది జీవి. లోకంలో అన్నీ ఉపచర్యలే. నిస్సారమైన చర్యలు, మార్పులేని కర్మలు, మనుషులు, జంతువులు, చెట్టు చేమ అన్నీ దివ్య సంకల్పానికి విధేయులే. మనిషి తన మేధస్సుతో 'రేపు'లోకి తొంగిచూస్తాడు. 'పరం' పైకి దృష్టిని సారిస్తాడు. విధి వలయం నుండి బయటపడాలని ప్రయత్నిస్తాడు.

★ ★ ★

పరమాత్మ సంకల్పంతో, జగన్మాత విశ్వసౌందర్యానికి ప్రతిబింబంగా, ప్రతినిధిగా అనంతమైన ఆనందాలను పంచుకునేందుకు, పంచిపెట్టేందుకు సావిత్రి జన్మించింది. ఆమె అనంతశక్తికి, అనంతప్రజ్ఞకు ప్రతినిధి అయింది. ప్రాపంచిక సుఖాలు, భోగాలు అనుభవించడానికి సావిత్రి జన్మించలేదు. ఆమె జన్మకొక ప్రయోజనం వుంది. ఆమెది పారమార్థిక స్పందన.

ఆమె సావిత్రి. మానవమేధ అందించే ప్రజ్ఞలు, ఆనందాలు, సుఖాలు ఏవీ తనకు కావాలన్న కోరికలు లేవు. వాంఛలు, భ్రమలు ఆమె హృదయాన్ని స్పందించవు. ఈ సుఖాలు, ఆనందాలు పైపై మెరుపులు. ఆమె హృదంతరాళంలో ఉన్నది ఒకే స్పందన. ఒకే ఒక్క సంవేదన. అది వేదనగా మారి అణువు గుండెలో దాగింది. మృత్యువును జయించాలి ... అమృతత్వాన్ని సాధించాలి – అదే ఆశయం.

ప్రకృతి సౌందర్యాలు, సౌభాగ్యాలు అన్నీ తనవిగా చేసుకున్నా చిరకాలం నిలవవు. లోకమే అశాశ్వతం. ఈ సుఖాలు, సౌందర్యాలు ఎలా శాశ్వతాలు!

కాల ప్రవాహంలో ఎన్ని అగాధాలు! వాటిని దాటడం దుర్లభం. ప్రలోభాలు పరాశక్తిని గుర్తించనీయవు. అల్పత్వం దివ్యత్వాన్ని అందుకోదు. ఆమె తనదైన దివ్యత్వాన్ని, దివ్య చైతన్యాన్ని విస్మరించలేదు. మానవ జన్మకు తన దివ్య ప్రజ్ఞను తెచ్చుకున్నది. తన ఆత్మానందాన్ని ఇతరుల ఆత్మలతో పంచుకోగలిగినప్పుడే బ్రహ్మానంద భవ్యమందిర ద్వారాలు తెరుచుకుంటాయి. కాని లోకంలో సుఖాలు, ఆనందాలు, స్వార్థాలు, భ్రమలు మనిషిని పరమానందంవైపు చూడనీయవు. లోకం ప్రేమపూర్ణం కావాలి. అనురాగ పద్మాన్ని జగన్మాత అంశ అయిన సావిత్రి అందుకున్నది. అది నిష్ఫలం కాదు. అందుకు సావిత్రి అన్ని విధాల అర్హురాలు. అందుచేత ఆమె అవతార మూర్తి. అన్నిదివ్యశక్తులు వరంగా పొంది అవతరించింది సావిత్రి. మానవజాతిని ఉద్ధరించడం కోసం అవతరించిన జగన్మాత. ప్రతి ఆత్మను పరమాత్మ స్థాయికి చేర్చడానికి, భూమిని స్వర్గం చేయడానికి, మనిషిని మనీషిగా తీర్చిదిద్దడానికి ఆమె అవతరించింది. కాని వసుధ స్వభావం మారుతుందా! లోకరీతి మారడం కష్టం! దివ్యత్వాన్ని మానవత్వం భరించగలదా? పంచ భూతాత్మకమైన ప్రపంచాన్ని దివ్యత్వం భరించగలదా? ప్రపంచంలో తాను ఇమడ గలదా? దివ్యత్వం తన ఆనందంలో విషాదం నింపుకుని కుమిలిపోయింది. తనవెంట తెచ్చుకున్న దివ్యకాంతిని వదలి, సత్యానికి అందని భౌతికశక్తుల ఆర్భాటానికి వణికిపోయింది. దివ్యమాధుర్యాలను సైతం లోకం అందుకొనడానికి సిద్ధంగా లేదు.

అంతటి ఔన్నత్యం ఒక్కొక్కసారి పతనం చెందుతుంది. దైవాంశ సంభూతులు సైతం నిరాశకు, వైఫల్యాలకు లోనవుతుంటారు. ఏ కారణంగా మనం పతనం చెందామో అవే మనల్ని ఉద్ధరిస్తాయని భ్రమపడతాం. ఆ భ్రమలోనే పరబ్రహ్మకు దూరం అవుతాం. బాధల్లో, మృత్యునీడలో భగవంతుడు జ్ఞాపకం వస్తాడు. భౌతిక రంగంపైన మెరిసే మెరుపులన్నీ మాయమైపోతాయి. దివ్యభావనలకు దూరమైన కొద్దీ మనస్సును చీకట్లు ముసురుతాయి. ధర్మాన్ని, కర్తవ్యాన్ని విస్మరించి చేసిన దుష్కృత్యాలపై 'కర్మ' ముద్రవేసి ఫలితాలు అనుభవిస్తాం తప్ప పరమాత్మను స్మరించడం మాత్రం జరగదు.

ఆ నైరాశ్యంలో ఒక తేజోశకలం మానవహృదయాన్ని స్పృశిస్తుంది. నిద్ర లేపుతుంది. మత్తు వదిలిస్తుంది. ఆ కాంతిలో ఒక చిన్న జ్యోతిని వెలిగించుకునే వారు కొందరే. తమ జీవన ఆశాజ్యోతుల్ని వెలిగించుకునేవారు కొందరు. సావిత్రి అవతరణ లక్ష్యం మానవజాతి మొత్తాన్ని ఉద్ధరించడం. ఆమె దివ్యత్వం, శక్తి,

భూమిని మించింది. అయితే లోకం ఆమెను తన కబంధహస్తాలలో బిగించింది. లోకసహజమైన బాధలు, బరువులు, కష్టాలు, కామనలు సావిత్రికీ తప్పలేదు. లోకం ఆ జగన్మాతకు విషాదాన్ని పంచియిచ్చింది.

తాను జగన్మాత అవతారం అయినా భౌతికంగా, లోకరీతిగా వ్యవహరించింది. అవతరించినందుకు మనిషి పడే కష్టాలు భగవంతుడైనా పడవలసిందే. ఆమె ప్రపంచ చక్రంలో చిక్కుకున్నది. విధి తనకు నిర్దేశించిన కార్యనిర్వహణలో ఎదురయ్యే కష్టాలు అనుభవించ సిద్ధమైంది. దివ్యలోకాల నుండి తెచ్చుకున్న ఆనందం తొలగిపోయింది. తానూ మాయ ముసుగును ధరించింది. తనను ప్రేమించేవారికి సైతం తన దివ్యస్వభావం ఎరుక పడనీయలేదు. తాను ప్రేమించే వారికి తన నిజస్థితిని తెలియనీయలేదు. విధికి, మానవతకు దైవత్వం సైతం తలవంచక తప్పదు! మానవ స్వభావం బహు విచిత్రమైనది!

కన్నవారికీ, హృదయమున్న వారికీ ఆమె తలలోని నాలుక. భవిష్యత్ విషాదం అప్పుడే ఆమెపై నీలి నీడలు పరచినంత కాలం ఆమె కష్టాలు, కన్నీళ్లు ఒకరితో పంచుకునేవి కావు. ఇతరులకు పంచియిచ్చేవి కావు. గుండెగుప్పిటలోనే కొండంత బాధను భద్రపరచుకుంది. విషాదాన్ని రంగరించి కంఠంలో దాచుకుంది. అందరినీ కంటికిరెప్పలా కాపాడవలసిన వాడు అంధుడైనట్లు మానవ అజ్ఞానానికి ఆమె అవమానంతో కృద్ధురాలైంది. తల వంచింది. తన శత్రువుకు తానే ఆతిథ్యమిచ్చి పరిచర్య చేయసాగింది. విధిని మార్చడం మనిషికి అసాధ్యం! తాను భవిష్యత్తును ధైర్యంగా ఎదుర్కొనడానికి, విధితో తలపడడానికి ఆంతరంగికంగా సన్నద్ధమైంది.

జరగనున్నది తనకు తెలుసు. అందుకు ఇదే సమయం. మళ్లీ తెల్లవారింది. ప్రకృతి ఎవరికోసం ఆగదు. ఎవరినీ గమనించదు. ఒక ఆత్మ ఘోషించినా, ఒక జీవి నిర్యాణం చెందినా ప్రకృతి జాలి చూపదు. అది ప్రకృతి సహజం. ప్రకృతికి అది సహజం. తాను నిర్భయంగా చంపిన శరీరాన్ని అక్కడే వదలి, జీవాన్ని తనలోకి తీసుకుంటుంది. ప్రపంచగతికి ఈశ్వరుడొక్కడే సాక్షి!

★ ★ ★

ఆమె సావిత్రి, ఆమె ఆత్మలో అలజడి, ఆక్రందన. ఆమె మృత్యువుతో తలపడినా, మృత్యుభయంతో కలతపడినా ప్రకృతి పట్టించుకోలేదు. ఆమె పెదవివిప్పి ఎవరి సాయం అర్థించలేదు. రహస్యాన్ని తనలోనే దాచుకున్నది.

ఆత్మసాక్షిగా నిలబడింది. ధైర్యం కూడదీసుకుంది. నిశ్చలస్థితి ఒక్కటే ఆత్మకు అండగా నిలుస్తుంది. లోపల గుండెనిండా విషాదం నింపుకున్నా పైకి ప్రమోదంగానే కనిపిస్తుంది. ఆమె మానవత్వంలో సగం దైవత్వం నిండి వుంది. ఆమె ఆత్మ ఒక్కటి వేనవేల ఆత్మల్ని చైతన్యవంతం చేయగల శక్తి గలది. ఆమె తన సంకల్పంతో, ఆదర్శంతో మానవజాతినే ఉద్ధరించగలదు. మానవతను దివ్యత్వంతో నింపగలదు.

తనలో అందరిని చూచుకోగలదు. అందరి స్వభావాలను తనలో ప్రతిబింబించ గలదు. తాను వేరై ఒంటరిగా ఉంటూ అంతరంగంలో తానుగా జీవిస్తూ, అందరిలో తాను జీవించగలదు. అందరి భారాన్ని తాను భరించగలదు. తాను విశ్వంభర కాగలదు. తన భయం విశ్వానికి అభయం. తన శక్తి విశ్వశక్తి. జగన్మాత ప్రేమానురాగాలే తనవి. సృష్టిలో సహజంగా ఏర్పడిన లోపాలే తన జీవిత దుర్ఘటనలు. తాను లోకాన్ని చక్కదిద్దడానికి జన్మించింది, ఉద్ధరించడానికి ప్రయత్నిస్తోంది. తన కష్టనష్టాలే మార్మికలోకంలో పోరాటానికి ఆయుధాలు. ఏకాగ్ర చిత్తంతో భావశిఖరాగ్రంపైన నిలిచి, తన హృదయాన్ని విశ్వమంత విశాలంగా మార్చుకుని, పరమాత్మ తనకు నిర్దేశించిన మహత్కార్యానికి సిద్ధమైంది. అంతటి బరువుగుండెను ఆ జీవి భరించింది ఆనందంగా. ఆమె పారవశ్యంతో, సమాధి చైతన్యంతో సుషుప్తిలోకి జారిపోయింది. అక్కడి విశ్రాంతి మనస్సుకు శాంతి, ఆత్మకు ప్రశాంతి. ఆమె శిలవలె నిశ్చలమైంది. అది ఇహ, పరలోకాల మధ్య గడ్డకట్టిన నీరవ నిశ్శబ్దం. శూన్యం, విషాదాలు, భయాలు, భ్రమలు ఏవీ లేని వినిర్మల స్థితి. ఏదీ స్మృతిని తాకదు. అది మానస సరోవరం. అక్కడ స్మృతి ఛాయగా కదలాడుతుంది.

గుండెపైన చేయి వేసుకోగా లోపల నిద్రిస్తున్న విషాదం నిద్రలేచింది. వేదన కళ్లువిప్పింది. అది అచిరకాలంగా గుండెలోతుల్లో దాగివున్న విషాదమే. అది అక్కడకు ఎలా చేరిందో తెలియదు. ఎంతకాలంగా నెలకొని ఉన్నదీ తెలియదు. మనస్సు జ్ఞాపకాలను ఎప్పుడో జారవిడుచుకున్నది. స్మృతులు సైతం చెల్లాచెదరై పోయాయి. మనస్సుకు జాగృత పరచే శక్తి ఎప్పుడో పోయింది.

వాంఛలు, లాలసలు ఏవీ జీవిని బంధించలేవు. మన కృషికి ఫలితాలు ఆనందాలు, సుఖభోగాలు కాదు. ఒక దశలో వివేకం సైతం వివర్ణమవుతుంది, నిరుపయోగమవుతుంది. నిస్సహాయస్థితిలో మేధస్సు గతాన్ని పూర్తిగా మరచి పోతుంది. శరీరానికి ఒక్క భౌతికస్పృహ మాత్రం మిగిలి మిగతా అంతా శూన్యం

అనిపిస్తుంది. ఆ స్థితి ఇప్పుడామెది. విశ్వభారాన్ని తలదాల్చిన విశ్వంభర ఆమె. కదలిక మరిచిన శరీరం ఏవో ఆదేశాలను అందుకుంది. గగనయానం చేస్తున్న ఆత్మ తిరిగి శరీరంలో ప్రవేశించింది. అజ్ఞానంలో జ్ఞానం ప్రవేశించింది. అజ్ఞాతంలో జ్ఞాతం కదలాడింది. స్పృహలో ఉన్నప్పటి ఆశలు, ఆశయాలు కలలై మిగిలాయి. స్వాప్నిక లిపిసంకేతాలు ఏర్పడ్డాయి. ఒక వెలుగుబాట చీకటిని చీల్చింది. అవి సాగర తరంగాల కల్లోలాలు. ఆమె ప్రకృతికి ప్రతికృతిగా కల్లోలాలకు ఆకరమైంది.

ఆ తెలివిడితో చీకటి మందిరాలు వెలుగులు నింపుకున్నాయి. క్రమంగా స్మృతి వికాసం కలిగింది. అలసిన ఆలోచనలు మనోమందిర ద్వారాలను చేరుకున్నాయి. ప్రేమ, ద్వేషం, ఔన్నత్యం, పతనం వైరుధ్య భావాలు ఆమెను కలతపెట్టాయి. అధోలోకాలలోని నీచ దేవతలు సైతం ఆమె దుస్థితికి విలపించారు. ఆమెలో దేవాసుర సంఘర్షణ, విశ్వవేదన. అన్నింటికి తానే వారసురాలైంది. శిలగా, మూర్తీభవించిన దైన్యంగా నిలిచిపోయింది. శూన్యంలోకి దిగంబరంగా చూపునిలిపింది. దైన్యం రూపుదాల్చింది. తన జీవిత గమ్యంలో ఇంతటి విషాదమా అనిపించింది.

పరమాత్మ ఆమె మొర ఆలకించలేదు. ఉలుకు పలుకు లేదు. స్పందన లేదు. ఉబికిరాని కన్నీటితో శరీరం తడిసింది. మౌనాన్ని సవాలక్ష సందేహాలు, ప్రశ్నలు చీల్చి వేయసాగాయి. లోకం తన బాధల్ని పరమాత్మకు నివేదించుకున్నది కానీ తానుగా పరమాత్మకు సమర్పించుకోలేకపోయింది. పరమాత్మ లక్ష్యం ఒక్కటే చివరకు నెరవేరుతుంది. ఆమె కళ్లు విప్పి చైతన్యంతో లోకాన్ని గమనించింది. అజ్ఞానం మిగిల్చిన ఆనందం. ఈ లోకంతో ఆత్మకు పనిలేదు. ఆమె ఆత్మ విధితో, కాలంతో తలపడడానికి సిద్ధమైంది. తగిన శక్తిని ప్రోది చేసుకున్నది.

అది సత్యవంతుని అవసానదశ! విధివంచితుడతను!!

2. సృష్టి

సత్యవంతుని మృత్యువు ఆవహించింది. సావిత్రి స్పృహ కోల్పోయింది. మృత్యువు రాకతో అధైర్యపడలేదు. యోగంతో ఆత్మను మేల్కొల్పింది. ఆత్మ శరీరం ధరించింది. భౌతిక శరీరంలో కదలిక లేదు. ఆత్మ శరీరం పొందే శక్తి అపరిమితం. 'ప్రేమ' ఆధారంగా మృత్యువును జయించాలి. సత్యాన్ని రక్షించుకోవాలి. లోకాలకు ఆధారభూతమైనది సత్యం ఒక్కటే. జగత్తు అంతా మిథ్య – పరమాత్మ ఒక్కటే సత్యం.

భౌతిక బంధాలు మనిషిని పట్టి లాగినా ఆత్మశక్తితో, యోగసాధనతో ముందుకు పోవచ్చు. యోగికి అసాధ్యం అన్నది ఉండదు. అపజయం ఉండదు. తాను ఓడిపోతే ప్రపంచంలో ప్రేమకు విలువుండదు. సత్యానికి విలువ ఉండదు. మృత్యువును జయించి, మృత్యుంజయులు కావడం కష్టం కావచ్చు గాని అసంభవం కాదు. ఏ ఒక్కరైనా ఆ పని చేస్తే, తర్వాతివారు ఆ మార్గంలో నడుస్తారు. నిజానికి, అశ్వపతి ఆశించింది కూడా అదే. ఆయన పరమాత్మను అర్థించాడు. జగన్మాతను ప్రసన్నం చేసుకున్నాడు. వారి అంగీకారం పొందాడు. అందుకై అవతరించిన సావిత్రి ప్రేమను ఆయుధం చేసుకుంది. సత్యాన్ని కవచంగా ధరించింది. శూన్యంలోకి ధైర్యంగా పయనించింది. ప్రతియోగి చేయవలసిన పని అదే. శ్రీ అరవిందులు సావిత్రి పరంగా యోగసూత్రాలు బోధించారు. యోగానుభవాలు విప్పిచెప్పారు. ప్రజ్ఞ సాధించడం ప్రతి ఒక్కరి అవసరం. భౌతిక ప్రపంచానికి బంధ విముక్తి కలగాలంటే మనిషి స్వతంత్రంగా యోగభూమికలు చేరాలి. ప్రతి మనిషిలో అతీంద్రియ శక్తులున్నాయి. ఆధ్యాత్మికత ఉంటుంది. వాటిని గుర్తించడు. మనిషిలో శాశ్వతమైనది ఆత్మ. ఆత్మకు 'మృతి' లేదు. అది క్షయం కాదు. అంత మాత్రాన ప్రతి ఆత్మ శాశ్వతత్వం పొందినట్లు కాదు. ఒక్కొక్క జన్మలో ప్రతి ఆత్మ కొంత సంస్కారాన్ని ఆర్జించాలి. కొన్ని మెట్లు పైకి వెళ్లాలి. సంపూర్ణత్వం సాధించిన 'ఆత్మ' చావు లేనిదవుతుంది. ప్రతి యోగి తన 'ఆత్మ' సాధనతో పూర్ణత్వం సాధించుకోవాలి. అప్పుడే అది పూర్ణయోగం అవుతుంది. చనిపోవడం ఆత్మవిముక్తి కాదు. మృత్యువు లేకుండా చేసుకోవడం విముక్తి.

ఆమె కొంత తడవు తనదైన మార్మిక జగత్తులో విహరించింది. జ్ఞాపకాలు గతంలోని అనేక రూపాలను కదిలించాయి. ఈ జన్మకు రావడానికి గల కారణం, సమీప భవిష్యత్తులో జరగబోయే సంఘటనలు మనస్సులో కదిలాయి. జ్ఞాపకాలకు మరణం లేదు. మనిషి మరణించినా, స్మృతులు కలలై మరో జన్మకు పయనిస్తాయి. స్మృతి చిత్రాలు కంటికి కనిపించవు. మనస్సు లోయలలో కదులుతుంటాయి. అగోచరమైనదంతా ఆత్మకు అనుభూతమవుతుంది. మార్మిక ముద్రలు మనస్సు నుండి చెదిరిపోవు.

కాలప్రవాహం మందగించినా, గత జన్మల ఘటనలు కాలంలో కలిసి పోయినా, ఆ తీరాలపై ఎవరి ఛాయలు కనిపించవు. కనిపించేవి సూక్ష్మశరీరాలు, సూక్ష్మరూపాలు ఆత్మ సాక్షిగా సావిత్రి కాలాన్ని సమీక్షించ పూనుకున్నాయి. ఏనాడో ఆశ్వాసించి, స్వప్నించి అనుభవించినదంతా నేడు స్మృతులలో మిగిలింది. గతంలోకి చల్లగా జారిపోయింది. అంతరంగంలో ఉషోదయం. చిత్ర విచిత్ర వర్ణాలు, జీవన దృశ్యాలు, మధురానుభూతులు. మనోయవనిక పైన తాను బాల్యంలో నడయాడిన సుందరసీమలు కొన్ని. యవ్వనాన్ని పరవశింప చేసిన వినీల నీలగిరులు కొన్ని. ఆ బృందావనాలు, ఆ సైకతసీమలు, ఆ సెలయేరులు, ఆ అనురాగ మయూరాలు – అన్నీ స్మృతియవనికపై విరచించిన సుందరచిత్రాలు. స్వర్గనరకాల మైత్రి అది.

కాలం ఎంతో వేగంగా పయనిస్తుంది. సంవత్సర కాలం ఒక్క రోజులా గడిచింది. మనిషి పరమాత్మకు చేరువవుతున్న కొద్దీ కాలం కుదించుకుపోతుంది. కాలానికి విలువ ఉండదు. ఒక అలౌకికమైన ఆనందం, అంధకారం అలము కుంటుంది. ప్రకృతి శక్తులు నిరుపయోగం అనిపిస్తాయి. ప్రపంచమే శూన్యం అవుతుంది. ఆర్జిత జ్ఞానం, వివేకం నిరుపయోగమై మనిషి 'తనలోని' స్వస్థితికి చేరువవుతాడు. అంతదాకా ఆత్మను క్రమ్మిన మాయపొరల్ని చీల్చుకుని, ఆంతర్యంలోని తనను తాను గుర్తిస్తాడు. ఇప్పుడు సావిత్రిది అదే స్థితి. మనః స్థితి. జీవుడు శరీరంలో ఏ కేంద్రంలోనో దాగి ఉంటాడు. మిగిలిన శరీరం

స్తంభించింది. జన్మకు ముందు శిశువు స్థితి అటువంటిదే. శరీర ధర్మాల్ని ఆత్మ తన సంకల్పంతో రద్దు పరచగలదు. ఆత్మ శరీరం ధరించినపుడు భౌతిక శరీరానికి విలువుండదు. శరీరంలో ప్రవేశించని ఆత్మశక్తి మహాద్భుతం. అది కాలాతీతం. అది జన్మతో ఏర్పడే కాల్పనిక యాతనల్ని రద్దు పరచగలదు. ఆత్మకు రూపాన్ని ఇవ్వగలది పరమాత్మ. విధిరేఖల్ని తుడిచి వేయగలది పరమాత్మ శక్తి ఒక్కటే.

జీవన సూత్రం అనేక జన్మల్ని ముడివేస్తుంది. విధి అనేక మందితో జీవుని ముడి పెడుతుంది. అసంఖ్యాకమైన రూపాలు, వ్యక్తిత్వాలు మన కర్మలతో, కృతులతో అసంకల్పితంగా కలిసి వుంటాయి. మనం మరచిపోయినంత మాత్రాన అవి మనవి కాకుండా పోవు. మనం గతంలో చేసిన పనుల్ని, ఆలోచనల్ని విస్మరిస్తాం. శరీరాలు నశించినా కర్మశేషాలు నశించవు! ఒకనాటి ఆలోచనలు, వాంఛలు ఏవీ నశించవు. అవి మనల్ని వెన్నంటి వస్తుంటాయి. నశించిపోయిన భౌతిక శరీరాలు వారసత్వం భరించలేక మరో శరీరానికి కర్మల్ని బదిలీ చేస్తాయి. ఆత్మ ఆ కర్మశేషాల్ని భద్రంగా తెచ్చి కొత్త శరీరానికి అందిస్తుంది.

అవి మనం మరచిపోయిన కథలోని సజీవ పాత్రలు, సజీవ సంఘటనలు. ఆ కథకు మొదలు, తుది మన జ్ఞాపకానికి అందవు. నాటి జీవన గాథ, ఆగిపోయిన ఘట్టం నుండి నేటి జీవనం ప్రారంభమవుతుంది. అదే నేడు మనల్ని నిర్దేశిస్తుంది. అదే విధి. అది గత జన్మల ఫలం. సృష్టి పరిణామం మన అంచనాలకు అందదు. అలాగే జీవి పరిణామం మన మేధస్సుకు అందదు. మనకు తెలియని విషయాలు, నేడు జరిగే సంఘటనలతో తలపడినప్పుడు కల్లోలం ఏర్పడుతుంది. సావిత్రి తన ఆత్మశక్తితో గతాన్ని వర్తమానంలోకి అనువర్తింప చేసుకున్నది. గతం నుండి అనంతంలోకి ఆశయాన్ని సారించింది. వర్తమానాన్ని అధిగమిస్తూ తన మార్గాన్ని నిష్కంటకం చేసుకోగలిగింది. ఆమెకు అనంతత్వమే అవధి, పరమావధి.

★ ★ ★

దివ్యాంబర తీరాలలో ఎక్కడో, ఏమూలనో దేవ గణాలు కలుస్తుంటాయి. ఆ క్షణంలో అది స్వర్గం. అది దేవలోకం. మిగిలినది అంతా శూన్యం. ఆమె ఆత్మ అలాంటి అరూపస్వర్గంలో, శూన్యంలో భయంకర ప్రమాదాలను ఎదుర్కొనడానికి సిద్ధమైంది. తానూ అరూపంగా, ఆత్మికంగా సంకల్పంతో ఘర్షణ పడ్డది. మహా విశ్వంలో ఒక ఆత్మ స్వతంత్రించింది. శూన్య శిఖరాగ్రం పైన తాను ఆత్మగా, శూన్యంగా నిలిచింది. అక్కడ జీవం లేదు. చలనం లేదు. అనురాగాలకు ఆస్కారం లేదు. ప్రళయం అంచున నిలిచిన ఆత్మ భావపరంగా

వాదించాలి. అది భాషా రహితమే తప్ప, భావ రహితం కాదు. మృత్యువు నీడలో జీవుడు ఏకాకిగా, నిస్సహాయంగా తన హక్కులకై పోరాడాలి. అనురాగంతో వాదించాలి. ప్రకృతి ఆమె నైజానికి తోడుగా నిలిచింది. ఆమె గత జన్మబంధాల నుండి విడివడ్డది. గత కాలపు గాథల్ని, బాధల్ని పూర్తిగా మరిచిపోయింది. కాలప్రవాహంలో పయనించి కర్మశేషాన్ని ఆత్మ ఏరివేయగలిగింది. దేవతల ఆధిపత్యాన్ని ధిక్కరించి ఆత్మ స్వతంత్రమైంది. ధర్మం తనపై కక్ష గట్టినప్పుడు విశ్వశక్తుల్ని సైతం ఎదిరించవచ్చు. ఏ యితర శక్తి ఆత్మశక్తిని నిరోధించలేదు.

ఆ ధైర్యానికి దైన్యం తోడు కారాదు. ధైర్యానికి త్యాగనిరతి తోడుగా నిలుస్తుంది. ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొంటుంది. కాలం కల్పించే అవాంతరాల్ని అతిక్రమించి, ఆత్మ తనలోకి చొచ్చుకు పోవాలి. భయంకర మృత్యునేత్రాలలోకి నిర్భయంగా చూడగలగాలి. మృత్యుభయం అసలు ఉండకూడదు. తన ఆత్మ ఆసరాగా పరమాత్మను చేరగలగాలి. అటువంటి మహత్తర క్షణం ఆమెకు ఆసన్నమైంది. ఆ క్షణంలో ఆశలన్నీ అడియాసలై నైరాశ్యం చుట్టివేసింది. బలాలు, శక్తులు పతనం దిశగా పరుగు తీస్తున్నట్లు, తుదిక్షణాలు రోజులై, నెలలై సాగారినట్లు తోచింది. అంతం అరక్షణం దూరంలో వున్నా కాలం యుగాలవుతుంది. ఆత్మీయుల మధ్యన, ప్రేమించిన వారి సరసన ఏకాంతవాసం. అసలైన ఆత్మీయులు మరెక్కడో ఉన్నట్లు అంతర్వీక్షణ. ఆత్మ పరిసరాలనుండి నిర్గమిస్తుంది. నిశ్శబ్దంగా భవిష్యత్తు లీలామాత్రంగా ఆత్మకు స్పందన రూపంలో సంకేతం అందిస్తుంది. అతీంద్రియ లోకాల అందాలు, ఆనందాలు అప్పుడే తెలుస్తాయి. ప్రపంచం పట్ల అభిరుచి తగ్గిపోతుంది. ఆ లోకం మనకు తెలియనిది. ఈ సీమలు మనం గుర్తించలేనివి. అయినా అవి మన స్వంతం. ఆ బాటలో, ఆ పయనంలో ఎన్ని పోరాటాలు సాగించాలో తెలియదు. ఆత్మశక్తి వినా మరో సహాయం ఉండదు. అక్కడ మన ఆరాటాలు అపజయాలు గమనించే వారెవరూ ఉండరు. పైన దేవతలు, క్రింద ప్రపంచం ... చుట్టూ ప్రకృతి. ఇరుపక్షాలు ఆత్మకు అరూపంగా, అదృశ్యంగా వుంటాయి. మనస్సులో మథనం. అంతరంగం ఒక్కటే ప్రత్యక్ష సాక్షి.

అంబరాన్ని చుంబిస్తున్న పర్వతశిఖరాలు తన చుట్టు. ఆ పర్వతాలను పచ్చగా కప్పి వేసిన మహారణ్యాలు. అరణ్య రోదనలు. అరణ్యం నిండా క్రూర అక్రూర మృగ సంచయం. ఆకులపై కురుస్తున్న సూర్యరశ్మి వెలార్చే సహజ

సౌందర్యం. రవికిరణ స్పర్శతో వెచ్చగా వికసిస్తున్న సుకుమార సుమాలు – అవి అన్నీ ఆమె ఆంతర్యానికి ప్రతీకలు. ఆమె ప్రేమకు ప్రతినిధులు.

అప్పుడు ఆమె నిజాంతరంగం ఆత్మస్థాయికి పెరిగింది. అది అద్భుత ప్రశాంతం, ఏకాంత నిశ్శబ్దం. ఆమె నెమ్మదిగా ఆత్మ శిఖరాలకు చేరింది. తనను తాను తెలుసుకున్నది. అది ఆత్మావలోకనం. ఆత్మదర్శనం. అక్కడి పరిసరాలతో మైత్రి నెరపి తన సొంతం చేసుకున్నది. అప్పుడు అక్కడ తనలో ఒక నవ్యమానవత ఆవిష్కృతమైంది. అది అపూర్వం, అద్వితీయం. అమరత్వంలో అమృతత్వం, చిరత్వం, శాశ్వతత్వం. ముప్పేట అల్లుకుపోయాయి. అది పరమాద్భుతమైన అపరోక్షానుభూతి.

నిజాంతరంగ అనుభూతి ఒక్క క్షణం కలిగినా చాలు ప్రాపంచికమైన అలసటను, అలజడిని తగ్గిస్తుంది. ఐహిక ప్రపంచావసరాలన్నీ మోయలేని బరువు లవుతాయి. మనిషిని పశువుగా మార్చుతాయి. అత్యాశలు, ప్రలోభాలు! లోకం ఎంతో విశాలం. అయినా అంతా అనాగరకమే. అన్నీ భీకర కీకారణ్యాలే. అన్నీ అరణ్య రోదనలే. ఎక్కడో ఆకాశతీరాన, వినీలగగనాల నిర్గుణ సంగీతం వినిపిస్తుంది. ఆ క్షణంలో మనిషి ఆత్మ పరమాత్మకై అన్వేషిస్తుంది. అదే జరిగింది ఆమెలో.

ఆ క్షణమే మహానాటకానికి నాంది పలికింది. భూమిపైన అమరత్వం నెలకొనడానికి వీలుగా, ఆ కీకారణ్యం మధ్య నిశ్శబ్దంలో, ఏకాంతంలో ఒక కేంద్రం ఏర్పడింది. తరులు గిరుల మధ్య స్తంభించిన కాలంలో కదలిక ఏర్పడ్డది. అచలంలో సంచలనం. నిశ్శబ్దం నడుమ ఝుంఝుం. అది నిశ్శబ్దంలోంచి ఉద్భవించిన శబ్దం. అది ప్రణవం. అప్పుడు అమరత్వం తానుగా ఆవిష్కృతమైంది. అలనాటి వైభోగాలు పునరుక్తమైనాయి. జడ ప్రకృతి చైతన్యంతో పులకించింది. విషాదంలో బ్రహ్మానంద ఆవిర్భావం. మృత్యుఛాయను దాటిన ప్రేమ ఆమెను ఆశ్రయించింది. ఆమె అంతరంగం ప్రేమమందిరంగా మారింది. అప్పుడు సత్యాన్ని గుర్తించడం జరిగింది. సత్యశోధన మొదలైంది.

నరజాతి సమస్తం ఎంత కాలంగా ఉపవసిస్తున్నా ఏ ఒక్కరూ పరమాత్మను చేరింది లేదు. మనిషి అంతరాంతరాల దివ్య స్పందనే ఒక అగ్ని పరీక్ష. ఒక అలౌకికానుభూతి. నిజానికి మన లోపలి చీకట్లలో ప్రిదిలే కాంతిచ్ఛటలు, మెరిసే మెరుపులు. ఆమె అణు వణువు ఔన్నత్యాన్ని, అమరత్వాన్ని కాంక్షిస్తున్నది. ఆమె లోకానికి ఎంత సన్నిహితమో, సత్యానికీ అంతే సామీప్యం. ఆత్మ పరంగా ఆమె

మహోజ్వలంగా ప్రకాశించింది. ఆత్మసీమల సంచరిస్తూ, అగోచర సత్యాన్ని గ్రహించింది. నిగ్రహం, ఆత్మవిశ్వాసం ఆమెకు అండదండలు. కల్లోల తరంగాలను దాటి నిర్మలాంతఃకరణతో హసించింది.

మార్మికలోకంలో ప్రళయతాండవంచేస్తూ ఆనందపారవశ్యంలో లీనం అయిన పూజారిణి ఆమె. ఆవిష్కృతసత్యాలు అలంకారాలుగా, దివ్యమందిర ప్రబంధాలలో సంచరించింది. కరతలామలకమైన ఆనందం, హృదయంలో నిండిన ప్రశాంతి విశ్వసృష్టి స్పందనలను తనలో గమనించసాగింది. ఒక ఉషస్సు ఆకృతీకరించినట్లు, మహోదయంతో సృష్టి ప్రారంభమైనట్లు దివ్యమందిర కవాటాలు ఆమెను స్వాగతించాయి. పరలోకం ఆహ్వానించింది. పరసీమలు ఆమెకు అమరసీమలైనాయి.

ఆమె హాసంలో, లాసంలో పరప్రజ్ఞా వైభవాలు. ప్రాపంచిక విషయాలలో వాటి ప్రతిబింబాలు. మానవ నవజీవనం దివ్యకాంతులలో ప్రభావితమైంది. ఆత్మసమర్పణం ఆమె నేర్చిన ఏకైక విద్య. అది స్వభావ మంత సహజం. సాగర మంత విశాలం. ఆమె ఔద్ధత్యం విశ్వవ్యాప్తమై, సమున్నతమై జగత్తుతో ఏకీకృత భావన కలిగించింది. ఆమె ఆలన, పాలనలే అందరికీ అమృతవిందు చేశాయి. ఆమె అనురాగమే ప్రేమార్ణవం... అమృతోపమానం.

వేటగాని బారినపడ్డ పావురం విలవిల లాడుతుంది. తప్పించుకున్న శాబకం ఎగిరి పోతుంది. ఆమె ఆత్మ శాబకం వలె, కల్లోల ప్రపంచం నుండి ఎగిరిపోయింది. బాధా, భయ విముక్తమైంది. తనకు ఆశ్రయమిచ్చి సేద తీర్చే నెలవు చేరుకుంది. అది శాంతి ఆశ్రమం. శాంతి ఆశ్రమంలో శాంతి నీరాలను త్రాగి ఉపశమనం పొందవచ్చు. శ్రమను మరచిపోవచ్చు. మరుగున పడ్డ మధురానుభవాల్ని మననం చేసుకోవచ్చు. ఆత్మ పరిష్వంగంలో సర్వాన్ని మరచిపోగలం. ఆ పరిష్వంగమే ఆనందం. అది అందించే సుఖానుభూతులు అనుపమానాలు, అద్వితీయాలు.

అనురాగమే పవిత్రాలయం. ఆనందమే దివ్య ప్రాంగణం. సంకల్పమే స్వర్గం. అనురాగం విశ్వం కన్న విశాలమైనది. ప్రేమ హృదయం కన్న లోతైనది. ప్రేమతో సమస్త విశ్వాన్ని జయించవచ్చు. ప్రేమలో సర్వ ప్రపంచం సేద తీరుతుంది. దేవతలు సైతం ఆ ప్రేమ మందిరంలో సేద తీరుతుంటారు. ఆ చిన్న ఆత్మసామ్రాజ్యం ఎప్పుడూ శూన్యంగానే వుంటుంది. అక్కడకు చేరిన వారికి ఉచ్ఛ్వాస నిశ్వాస లుండవు. శ్వాస లయించి సహజ సమాధి స్థితి

ఏర్పడుతుంది. అది చైతన్య సమాధి. ఆధ్యాత్మికత సర్వాన్ని పవిత్రం చేయగలదు. ఆమె ఆధ్యాత్మికత మనోమందిర చీకట్లను తొలగించి వెలుగులతో నింపగలిగింది.

ఆమె ఇప్పుడు నిశ్శబ్దత్వానికి, నిశ్చలతకు నిలువెత్తు నిర్వచనం. ఆత్మ సామ్రాజ్యం నిండా అలముకున్న ప్రశాంతి. ఆమె జ్వలించి, ఉపశమించిన అగ్నిశిఖ. ఇప్పుడు దైవశక్తులన్నీ తనవే. తనలోనే పరమాత్మను దర్శించగలదు. పరమాత్మ ఔన్నత్యం సైతం తనది చేసుకోగలిగింది. సూక్ష్మ ప్రజ్ఞలన్నీ తనలోనే వున్నాయి. తనను తాను తెలుసుకున్న ఆమె ఆత్మ పరమాత్మ, అనంతత్వానికి ప్రతినిధి అయింది.

కాంతి కిరణాన్ని ఏ విషాదమేఘం ఆపలేదు. వసుధ బలహీనపడినా, ఉచ్ఛ్వాస నిశ్వాసలు మందగించినా, దివ్యత్వం ఆనంద శిఖరాలకు చేర్చుతుంది. అక్కడ జీవుడు ఏ పరిణామాలకు లోనుకాడు. అక్కడ మృత్యువుకు సైతం భయపడడం జరగదు. ప్రాపంచిక సౌందర్యాలు, రూపాలు ప్రలోభపెట్టినా చలించక, కాలయవనికపై కదిలే బొమ్మల వలె దాటిపోయింది. అనేకానేక మార్మికశక్తులు ఆమెకు వశమైనాయి. మానవిగా తన నైజాన్ని, ధర్మాన్ని నెరవేర్చినా ఆమెలోని దివ్యప్రభలు మానవత్వాన్ని మరుగు పరచి దివ్యత్వాన్ని ప్రదర్శించాయి. ఆమె స్వభావరీత్యా దివ్య. ఆమె మనస్సును భౌతిక వాసనలు స్పృశించి మలిన పరచలేదు. గ్రహకాలుష్యం అంటనికారణంగా ఆమె ఆంతర్యం వినిర్మలమై ఆత్మానంద కేంద్రబిందువైంది.

ఆమె తేజస్సును అందుకుని, ఆమె ప్రభావంతో జీవిస్తున్నవారు ఆమె ఔన్నత్యాన్ని గుర్తించారు. ఆమె ఆత్మ పరలోక సంచారం గమనించారు. ఎప్పుడూ ఆత్మ లోకాలలో విహరిస్తూ ఎప్పుడో కళ్లు విప్పి ఇహలోకంలోకి వస్తుంది. ఆమెది ఆనందసీమ. ఆమెది నిర్మల వర్చస్సు. అది సచ్చిదానందం. కాలం ఎవరి కోసం ఆగదు. రెక్కలు అల్లార్చుతూ సాగిపోతుంది. ఆమె కారణజన్మురాలు. పరమాత్మ రక్షణ కవచం ఆమె ధరించింది.

★ ★ ★

ఆమె బాల్యం మహత్వ పూర్ణంగా సాగింది. ఊయెలలూగే వయస్సులో దేవకాంతలతో సయ్యాటలాడింది. యవ్వనంలో నందన వనాల విహరించింది. కానీ ఆ ఆనందం చిరకాలం మనలేదు. తన చుట్టు కారు మేఘాలు ఆవరించ సాగాయి. ఏదో విషాదం సుదూరాల నుండి తొంగిచూస్తున్నది. విధి తన పని తాను చేసి తీరుతుంది. భగవంతుని అనుగ్రహం ఉన్నా, కాలం విధిరూపంలో

కాటువేయక మానదు. ఆమెది మహత్తరమైన కర్తవ్యం అయినా కాలం ఆమెను కనికరించలేదు. ఆధ్యాత్మిక రంగంలో ముందుకుపోతున్నవారిని కష్టనష్టాలు, పరీక్షలు, విషాదం, ఓటమి, మృత్యుభయం నిర్వీర్యం చేస్తుంటాయి. భగవంతుడు ఈ బాధల్ని ఉపేక్షిస్తాడు.. లోకంలో వున్న జాగాలలో మహత్తుల్ని క్రుమ్మరించడానికి పరమాత్మ అంగీకరించదు. భగవంతుని నిర్లిప్తత వల్ల మనిషిలో ఆత్మ విశ్వాసం పెరుగుతుంది. తన శక్తిని మనిషి తానై తెలుసుకొనడానికి పరమాత్మ జోక్యం కూడదు. ఇతరుల జోక్యం, అనుగ్రహం అగాధాలను మరింత విస్తృత పరుస్తుంది. ఆమెలోని దివ్యాంశను పరమాత్మ అలక్ష్యం చేసి, మానవతను మాత్రం మేల్కొల్పింది. అది ఆమె సాధనకు మరింతబలం చేకూర్చింది. అసలు ఆమె మానవకాంతగా జన్మించింది ఆ నేపథ్యంలోనే. ప్రతి మనిషి తన లక్ష్యం ఏదో తెలుసుకోవాలి. లక్ష్య సాధనకు తపన పడాలి. ఒంటరిగానే పోరాటం సాగించాలి. ప్రతివాడు అంధకారంలోనే పోరాటం సాగించాలి. అజ్ఞానం కారణంగా మృత్యువును స్వాగతించకూడదు. ఎవరికి వారు అమరత్వానికి కొత్త బాటలు వేసుకోవాలి. ఎవరి మార్గం వారిది. ఎవరి సాధన వారిది. దేవతల అనుగ్రహాలు, ఆగ్రహాలు నిరుపయోగం. ఆమె విధికి తలవంచి బ్రతకడానికి పుట్టలేదు. విధిని ఎదిరించి, మృత్యువును జయించడం ఆమె కర్తవ్యం, లక్ష్యం. మార్మిక శక్తులేవీ తనకు సహకరించవని గ్రహించింది. ఈశ్వరుని అనుగ్రహం అవసరం లేదు. అలౌకిక శక్తులేవీ ఆత్మశక్తికి మించినవి కావు. జరగనున్నది మనోఫలకంపై లీలగా కదలాడింది. అనుమానపు తెరలు ఒక్కటొక్కటిగా తొలగిపోయాయి. తుఫానులో ప్రయాణానికి సిద్ధమైంది. ఈ తుఫాను ఆగదు. పరిస్థితుల సుడిగుండాలు భయపెడుతూనే ఉంటాయి. జన్మించిన ప్రతి జీవి విధికి తలవంచక తప్పదు. కాని ప్రతిఒక్కరిలో విధిని ఎదిరించే శక్తి ఉంది.

ఆత్మ మృత్యువుతో ఆడే చదరంగం జీవితం. కాలం ఒక్కొక్క పావును కదుల్చుతుంది. ఆట సాగిన కొద్దీ పావులు బలి అవుతుంటాయి. మనిషిని అలా కాలం శాసిస్తుంది. ఆమెది చైతన్య రూపం. ఆమె కున్నది ఆత్మశక్తి. భగవంతుడు నిర్దేశించిన మానవ జీవితంలో ప్రకృతి పాత్ర పరిమితం. పరమాత్మ పాత్ర అపరిమితం. ఆ రెండింటికి ఒక ఒడంబడిక ఉంది. విధికి, కర్మకు కట్టుబడినట్లు జీవితం సాగుతుంది. మనిషి ఆధ్యాత్మిక శిఖరాలకు చేరగానే ఆత్మ రగిల్చిన అగ్నిలో భౌతిక బంధాలు తెగిపోతాయి. పాపాలు, కర్మలు హరిస్తాయి. ఈశ్వరీయత మనిషిలో దివ్యత్వాన్ని పెంచుతుంది.

ప్రగతిబాటలో ముందుకు పోతున్న కొలదీ అవరోధాలుంటాయి. కొన్ని నియమాలు, నిబంధనలు ఉంటాయి. దివ్య మందిరంలో ప్రతి గుమ్మం వద్ద అరూపప్రతీకశక్తులు కాపలా ఉంటాయి. మనిషి వివేకంతో ప్రవర్తించాలి. చీకటి దేవతలు ఆత్మపై తీర్పునిస్తారు. కర్మ సిద్ధాంతం, రాక్షస ప్రవృత్తిని ప్రేరేపించి దివ్యగుణాలను అణచివేస్తుంది. కష్టాల నీడన సుఖాలు, బాధల మాటున ఆనందాలు మనిషిలో కోరికల్ని రగుల్చుతుంటాయి. తను ఉన్న స్థితిని వదలి ఉన్నత స్థితికి చేరడానికి మనిషి ప్రయత్నించడు. అడగడుగునా మొదట అవరోధాలేర్పడతాయి. మానవుని మహాయాత్రకు మృత్యువు అడ్డు తగులుతుంది. దివ్యత్వాన్ని అందుకోదలచినప్పుడు నిజానికి దేవతలే అడ్డుపడతారు.

పశుబలంతో, మానవ ప్రయత్నంతో ఎవరూ ఈ లోకపు సరిహద్దులు దాటిపోలేరు. యుగాలు గడిచినా కాల ప్రవాహాన్ని దాటలేరు. ఇహలోక ప్రయోజనాలతో పరాన్ని చేరడం అసంభవం. యోగి ఏకాంతంగా, తన ఆత్మజ్యోతిని వెలిగించుకోవాలి. అసురశక్తులు దివ్యత్వానికి ఆటంకాలు కలిగిస్తుంటాయి. మన ప్రలోభాలన్నీ అసురశక్తులే. చేసిన నేరాలకే కాదు, అనుభవించిన సుఖాలకు, భోగాలకు శిక్ష పడుతుంది. చివరకు మనిషి అకృత్యాలకు, అత్యాశకు ఈశ్వరుడు శిక్షిస్తాడు తప్పదు. ఆమె అలాంటి శిక్షకు తలవంచలేదు.

విధి తాపులకు కకావికలమైంది. మనస్సు, హృదయం సైతం అల్లకల్లోలమైంది. మనిషి తన సంకల్పానికి, ఆచారాలకు, సంప్రదాయాలకు బానిస. తన ప్రలోభాలకు క్షుద్రదేవతల ప్రభావాలు, ప్రాభవాలు తోడు నిలుస్తాయి. కాని ఆమె దివ్య. ఆమెలో మానవాతీతశక్తి నెలకొన్నది. ఆమెలో అధిమానవతా బీజం పాదుకున్నది. ఆమె స్వప్నించిన సత్యాలను విస్మరించలేదు. ఆత్మసాక్షిగా ప్రాపంచిక సుఖాలను నిర్లక్ష్యం చేసింది. జీవితం అందించే సుఖసువర్ణపాత్రికను నేలజార్చుకున్నది. జీవననైరాశ్యాన్ని తొలగించి దివ్యజీవనపథాన్ని ఆశ్రయించింది.

సత్యం, అమృతత్వం ఆమె నిర్దేశించుకున్న గమ్యాలు. తన దివ్యచైతన్యం ఆమెకు అవగతం. ఆ స్పృహ తనని వీడిపోదు. ప్రాపంచిక బాధల నుండి ఉపశమనం కాదు తాను ఆశించింది. అపజయం అన్న పదం ఆమె జీవిత నిఘంటువులో లేదు. అపజయం భావన మనిషిని సగం క్రుంగదీస్తుంది. తాను చేయవలసిన పని ఒక్కటే, సాధించవలసింది ఒక్కటే. అది ఆత్మకు విదితం. ఆమె పనులు ప్రకృతికి అలంకారాలు కావాలి. ఆమె ఆలోచనలు మృత్యుంజయ మంత్రాలు. తన జీవిత రచనను అసంపూర్ణంగా ముగించడం ఆమె కిష్టం లేదు.

అమృతత్వాన్ని సాధించడం తన ఏకైక లక్ష్యం. ఆ లక్ష్య సిద్ధి కోసమే సాధన. ఆ సంకల్పం తనది మాత్రమే కాదు. భూమి ఏర్పడినప్పటి నుండి ప్రతి మనిషి గమ్యం అదే. అందుకు పూనుకున్న వారు మాత్రం లేరు.

మరణానంతరం లభించే అమరసుఖాలు, స్వర్గభోగాలు తన కవసరం లేదు. ఈ జీవితంలో నైరాశ్యాలు, వైఫల్యాలు ఎందుకు? ఇక్కడ నరకయాతనలు అనుభవిస్తూ, స్వర్గాన్ని సంభావించడం ఎందుకు? మనిషి పుట్టుకకు అర్థం మారిపోయింది. కార్యకారణ సంబంధం వుంది. ఉన్నతజీవితాశయాన్ని విధికి బలిపెట్టకూడదు. తన పవిత్ర కర్తవ్యాన్ని వివేకంతో విశ్లేషించుకున్నది. అంతరంగంలో దాగివున్న కర్తవ్యాన్ని, లక్ష్యాన్ని గుర్తించింది. ఆ లక్ష్యసాధనలో సృష్టి ధర్మాన్ని, విధిని సైతం ధిక్కరించక తప్పదు.. కాలచక్రాన్ని సైతం అవసరమైతే స్తంభింపచేయాలి. ఆత్మ అనంతసీమలలో పయనించినప్పుడు అనంత శక్తుల్ని సమీకరించుకుంది. తనలో నిద్రిస్తున్న శక్తి లేచింది. అది ఈశ్వరశక్తిగా రూపొందింది. భరించగల శక్తి అదే – శాసించగల శక్తి అదే. భయంకరమైన శూన్యాన్ని దాటి పోగలిగినవారే ఆ మహాశక్తిని అందుకోగలరు. ఆ సంకల్పాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదు.

విశ్వయాతన లన్నింటికీ ఎదురు నిలిచింది. కాల పురుషునికి సైతం ఎదురొడ్డి నిలబడింది. ఆమె సంకల్పబలానికి దివ్యశక్తులు వీగిపోయాయి. గ్రహశక్తులు తప్పుకున్నాయి. పరమాత్మ అనుగ్రహం ఒక్కటే ఆమె ఆత్మకు అండ. ఒక్క వినిర్మల ప్రార్థన, ఒక్క సంకల్పం చాలు. మానవశక్తికి దైవశక్తి జత పడుతుంది. సిద్ధులు, మహత్తులు అన్నీ సహజంగానే ఏర్పడతాయి. ఆత్మశక్తి ప్రకృతి మార్గాన్ని తనకు అనుకూలంగా త్రిప్పుతుంది. ఆత్మ సంకల్పమే విశ్వశక్తిగా పరిణమిస్తుంది.

★ ★ ★

ప్రకృతి ఎంత పచ్చగా, హాయిగా వుంది. ప్రాపంచిక సుఖభోగాలకై వెంపర్లాట లేదు. వేటిపైనా మమకారం లేదు. సంకల్పం చెక్కుచెదరదు. సంప్రదాయాలను కాదనలేని వారికి ఆత్మస్థైర్యం అలవడదు. ఎవరి ఆత్మ వారికి సత్యాన్ని, సత్యపథాలను సూచిస్తుంది, నిర్దేశిస్తుంది. వాటిని గుర్తించి, గ్రహించే వివేకం ఉంటే చాలు.

మనిషి ఒక యంత్రం. జీవితం యాంత్రికం. మనస్సుపై ఒత్తిడుల వల్ల ఆలోచనలు ఏర్పడుతుంటాయి. హృదయ స్పందనలు ఉద్రేకాలు కలిగిస్తాయి. అతీంద్రియశక్తి ఆత్మను పరివేష్టించి ఉంటుంది. మానవ మేధస్సు కేంద్రంగా,

జీవనయవనికపైన జరిగిపోయిన సంఘటనలే పునరావృతమవుతుంటాయి. సంఘటనలన్నీ మనస్సుకు బంధాలే. మన ప్రయత్నం లేకుండానే అన్నీ జరిగి పోతుంటాయి. కారణాలు అన్వేషించడం అనవసరం. ప్రతిదానికి కార్యకారణ సంబంధం ఉంటుంది. కారణాలు అన్వేషించగలిగితే, విశ్వరహస్యాలను అన్వేషించగలిగితే, ఆత్మరహస్యాలను తెలుసుకోవచ్చు.

ఆ అన్వేషణ యోగికి సహజం. యోగికి ప్రజ్ఞతో బాటు అంతర్దృష్టి, పరేంగితజ్ఞానం అలవడుతుంది. ప్రకృతికి బద్ధుడైన సాధకుడు తన చైతన్యానికి, ఆత్మశక్తికి తానే కర్త అవుతాడు. ఆత్మావలోకనం వల్ల దివ్యజ్యోతిని దర్శించగలడు. మనిషి మనుగడ వెనుక ఈశ్వరశక్తి ఉంటుంది. యోగాగ్నిని రగల్చగలిగినప్పుడే 'సత్యం' సుబోధక మవుతుంది. పరిజ్ఞానం ఏర్పడుతుంది. అప్పుడే మానవుని ఆత్మ, పరమాత్మ దిశగా పయనిస్తుంది. అగోచరమైన ఈశ్వరీయత అనుభూతికి అందుతుంది. అది పరబ్రహ్మానుభూతి.

సావిత్రిలో జగన్మాత అంశ ప్రవేశించి, జగత్తత్వం ఆవిష్కృతమైంది. యోగసాధన వల్ల విధి బలహీనపడుతుంది. విధి గమనం మారి కర్మశేషం లయిస్తుంది. విధి నడకపై 'ఆత్మ' శక్తి ముద్రలు అడుగడుగునా కనిపిస్తాయి. ముందుకు సాగుతున్న కాలచక్రం ఆగి, వెనక్కి తిరుగుతుంది. గుడ్డిగా సాగుతున్న విధి నడకకు అంతరాయం ఏర్పడుతుంది. దివ్యలోకాల నుండి జాలువారిన దివ్య భావనలు, మూతపడిన మనోమందిర కవాటాలను తెరిపిస్తాయి. జడ ప్రాయంగా వున్న జీవితం చైతన్య వంతమవుతుంది. మనిషి వెనక పొంచివున్న మృత్యువు నీడ తన ఉనికిని మరచిపోతుంది. మనిషికి మృత్యు భయం లేకపోవడమే మృత్యుంజయ రహస్యం.

3. ఆత్మ విముక్తి

సావిత్రి ఎందుకీ సాహసానికి పూనుకున్నది? సావిత్రి విశ్వకామన వల్ల జన్మించింది. విశ్వకామనకు రూపం యిచ్చిన వాడు అశ్వపతి. సృష్టిలో ఉత్తమం మానవజన్మ. మానవుని ద్వారా మాత్రమే దివ్యత్వం ఆవిష్కృతం కావాలి. అందుకు పరమాత్మ అనుగ్రహం, సహకారం కావాలి. అశ్వపతి పరమాత్మ అనుగ్రహం సంపాదించాడు. శరీరం అశాశ్వతం. మనిషిలో శాశ్వతంగా ఉండేది ఆత్మ. ఆత్మ శరీరం పొందగలిగినవారు అనశ్వరులు. శ్రీ అరవిందులే అశ్వపతి. అశ్వపతి తన ఆత్మలోకి చొరబడి ఉత్తమ లోకాలను దర్శించాడు. పరలోకాలతో ఆత్మ సంబంధం ఏర్పరచుకున్నాడు. అక్కడి అనుభవాలు వర్ణనాతీతాలు. కేవలం యోగి అనుభూతికి మాత్రమే అందేవి. శ్రీ అరవిందులు తన యోగానుభవాలను అశ్వపతి పాత్రలో చొప్పించారు. ఆధ్యాత్మిక తృప్తి సమసిపోయేది కాదు. ఒక్కసారి జాగృతమైన ఆత్మ విశ్రమించదు. సదా కొత్తకొత్త అనుభవాలను కోరుతుంది. ఇంకా యింకా ముందుకు పోవాలని ప్రయత్నిస్తుంది. మనిషిలో ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగితే ప్రాపంచిక విషయాల పట్ల మమకారాలు ఉండవు. యోగికి దివ్యజ్ఞానంతో పాటు దివ్యశక్తులు కలుగుతాయి, సిద్ధులూ కలుగుతాయి. ప్రపంచాన్ని వదలిపోవడం యోగజీవనం కాదు. ఇటు ప్రాపంచిక జీవితం, అటు ఆధ్యాత్మిక జీవితం సమంగా అనుభవించాలి. కర్మను, విధిని యోగి తన కంట్రోల్‌లోకి తెచ్చుకోవాలి. జగన్మాత శక్తిని ఆవాహన చేసుకోగలగాలి. అశ్వపతి యోగప్రతినిధి. ఆత్మ జాగృతమైనప్పుడు ఏయే భూమికలు దర్శించవచ్చు? జ్ఞాన సంబంధాలు ఎలా ఏర్పడతాయి? అతీంద్రియ శక్తులు పొందడం ఎలా? సిద్ధుడు, పరిశుద్ధుడు కావడం ఎలాగా? అశ్వపతి వెంట ప్రతి పాఠకుడు, ప్రతి సాధకుడు పయనించాలి. ఆయన వెళ్లిన మార్గాలలో వెళితే మనకూ అలాంటి అనుభవాలు కలుగుతాయి. జీవితాన్ని యోగపూర్ణం చేసుకోవడమే సావిత్రి లక్ష్యం ... అశ్వపతి దీక్ష ... అరవిందుల తపస్సు.

పరమాత్మ సంకల్పం వల్ల పరాశక్తి మానవ రూపం ధరించి 'సావిత్రి'గా అవతరించింది. జన్మించినదాది ఆమె విస్మృతి సీమలలో విహరించసాగింది. చిరంతరాన్వేషణ కొనసాగిస్తూనే వుంది. ఈ జగత్తు ఒక రంగస్థలం. జీవులు పాత్రపోషకులు. పరమాత్మ నాటక ప్రయోక్త. విధిది దర్శకత్వం. పాత్రధారులందరిలో పరమాత్మ ప్రతిభ కనిపిస్తుంది. ఆయన నిర్దేశకత్వం ఉంటుంది. కాలాన్ని ఘడియలుగా విభాగించి, కాలచక్రంలో నిమంత్రించి విధిని, కర్మను సంకేతాలుగా మార్చాడు పరమాత్మ. అంధలోకపు జడంలోకి జీవం ప్రవేశించింది. ప్రాణప్రతిష్ఠ జరిగింది. పరిణామ క్రియకు 'పరాశక్తి' అవసరమైంది. అందుకై పరమాత్మ అంశ ఒక రూపం ధరించింది.

అది పరమాత్మిక తేజస్సుతో, ఓజస్సుతో రూపుదిద్దుకున్న మూర్తి. అమరసీమలు దాటి భూమిపైన అవతరించిన విశ్వపతి అంశం. అంధకార ప్రపంచంలో వెలుగు నింపడానికి దిగివచ్చిన తేజోరేఖ. ఆయన అశ్వపతి. ఆయన పరమాత్మకు సంకేతం. భౌతిక శరీరం ఆయనకొక ఆకరం మాత్రమే. అతీంద్రియ ప్రజ్ఞతో సత్య లోకాలను దర్శించగల జ్ఞానమూర్తులకు ఆయన ప్రతినిధి. ఆయన అంతరంగం నిండుగా మార్మిక సంపదలు. ఆయన పరమాత్మ ప్రతినిధి. దివ్యత్వానికి ప్రతిరూపం. ఆకాశానికి భూమికి, పరానికి ఇహానికి సజీవ వారధి.

మానవ సహజమైన అజ్ఞానం, మమకార బంధాలు ఆయనలోనూ ఉన్నట్లు కనిపిస్తాయి. మానవ జన్మకు వచ్చిన భగవంతుడైనా మానవ బలహీనతలు భరించవలసిందే. తన పూర్వ దివ్యత్వాన్ని విస్మరించక తప్పదు. అంతర్ దృష్టి మాత్రం సత్యం పైన. అతనిలో వున్నది అవ్యక్త దివ్యత్వం. అతిలోక సంకేతాలను అందుకుని, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతూ, తన స్వప్న లోకాలకు తానే అధిపతి అయినాడు. తనకు ఎలాంటి దివ్యతను ఆపాదించుకోలేదు. తనవల్ల సహచరగణ జీవితం గణనీయంగా మారాలన్నదే ఆశయం. తన జీవన గమ్యం పరమాత్మ. మనిషి ఆధ్యాత్మికంగా పురోగమిస్తున్న కొలది అనేక అతీంద్రియ శక్తులు, ఆధ్యాత్మిక సంపదలు ప్రాప్తిస్తాయి. అపూర్వ తేజస్సుతో భాసిస్తాడు. అతని

ఆత్మ పరమాత్మకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆయన మనస్సు దివ్యారోహణలో చైతన్య జ్వాల. అతని సంకల్పం కాంతి సీమలలో జ్వలించే క్రాంతి. అతని ప్రతి శ్వాసలో సాగరమంత విశాల ఆకాంక్ష. ప్రతిచర్యలో భగవత్ ముద్ర, అనుక్షణం అదృశ్యశక్తి చేలాంచల సవ్వడి.

మనిషి జీవితకాలం స్వల్పమే అయినా ఆధ్యాత్మిక శిఖరాల నుండి ప్రసరించే కాంతులు ప్రతి క్షణాన్ని దివ్యమయం చేస్తాయి. ఆ కాంతి కిరణ స్పర్శ మానవ జీవితాన్ని అమృత మయం చేస్తుంది. కనిపించే భౌతిక శరీరం ఎప్పటికి శాశ్వతం కాదు. ఇది మాయారూపం, వ్యక్తిత్వం దాని మేలి ముసుగు. మనిషిలో అనేక రూపాలున్నాయి. అనేక అజ్ఞాత ప్రతిభలున్నాయి. అనేకానేక దివ్యశక్తులకు మనిషి ఆలయం. మానవుని జీవితనావ కాలసాగరంలో పయనిస్తుంది. అనశ్వరమైన ఈశ్వరీయతకు నశ్వరమైన ఈ మాయా శరీరమే ఉపాదేయం.

ఈశ్వర తేజస్సును మానవాత్మ మాత్రమే అందుకోగలదు. ఆత్మశక్తి ఒక్కటే దివ్యాంశను భరించగలదు. దివ్య సంపదలను తనలో దాచుకోగలది ఆత్మ. దివ్యసౌందర్యాన్ని సచ్చిదానందాన్ని తనలోకి ఆహ్వానించి ప్రతిష్ఠించుకోగలదు. నశ్వర శరీరమే అనశ్వరమైన ఈశ్వరత్వానికి ఆటపట్టు. అవిరళంగా అనంత రూపాలను సృష్టిస్తున్న విశ్వశిల్పి ప్రజ్ఞ మనలో మనం గుర్తించలేని విధంగా దాగి ఉంటుంది. మన మార్మిక రహస్యాల సృష్టికర్త తానే. సృష్టి రహస్యాలు అన్నింటికీ ఆధారం మూలాధారం. అవి అక్కడ భృక్తంగా ఉంటాయి. కుండలినిలో దాగివున్న సృష్టి రహస్యం ... ఒక్కొక్క జన్మలో దివ్యత్వం పెరుగుతుంటుంది. రానున్న సంఘటనలు, పరిణామాలు యోగి తన అంతర్దృష్టితో వీక్షిస్తూ అందుకు అవ్యక్తంగా సహకరిస్తూ కాలతీరాలలో పయనిస్తూ అమరసీమలను చేరుకుంటాడు. ఒక్కొక్క జన్మలో మాయ తెరలు, భ్రమలు ఒక్కొక్కటి తొలగిపోగా అపురూపమైన ఆత్మానందాన్ని అనుభూతిస్తాడు. ప్రాపంచిక బంధాలు యోగిని నిలవరించవు. అమృతధార అతనిని అమరునిగా మార్చుతుంది.

యోగి భావనలు ఎప్పుడు అనంతాకాశాలలోనే వుంటాయి. తన ఆత్మను సైతం విశ్వ వైశాల్యమంతగా పెంచుకొని విశ్వ ప్రేమికుడవుతాడు. అప్పుడు ఆత్మ పరమాత్మను చేరగల శక్తిని పొందినట్లు. యోగం పూర్ణయోగమై జీవితం దివ్యపూర్ణమవుతుంది. సదా జగన్మాతక్షీరాలతో మూర్ధాభిషేకం చేస్తాడు. అప్పుడతనిది మానవస్వభావం కాదు. కారణ జన్ముడవుతాడు. అతని ఆత్మ జగన్మాతకు ఆవాసం. ఆమె ఆశించిన విశ్వ పరిణామానికి అతని తపస్సు వేదిక.

ఆమె తన శక్తులను అతనికి అందిస్తుంది. అతను అమరత్వానికి సజీవ రూప ప్రతినిధి. సృష్టి రహస్యం అతనికి అవగతమే. అతని రూపంతోనే జగన్మాత దర్శనం యిస్తుంది. అతని చూపులలో మాతృ మమకారం, కరుణ, చల్లదనం. అతను సర్వ విధాల జగజ్జనని ప్రతినిధి. అప్పుడు మానవుడు పూర్ణ మానవుడైనట్లు. పూర్ణయోగి అయినట్లు. మహాశక్తి యోగిపరమై, అపరావతారంగా భాసిస్తాడు. మనిషి జీవితమే ఒక దివ్య ప్రయోగశాల. అందులో ఆశ నిరాశలు, జయాప జయాలు ఉంటాయి. అగోచరమైన ఆధ్యాత్మిక శక్తులు మనిషిని అలరిస్తాయి. అధిరోహించిన ప్రతిశిఖరం తనదే ననిపిస్తుంది. చుట్టూ అంధకారం అలముకున్నా అంతర్జ్వాల వెలుగుతో చీకట్లను చీల్చుకుంటూ మున్ముందుకు సాగిపోతాడు. అరకొర ఆశలు వీగిపోగా, దేనికోసమో, ఎవరికోసమో అర్థంగాని అన్వేషణ అలా సాగుతుంది.

ఉన్నతలక్ష్యంతో చేసే కృషి ఏదీ వృధా కాదు. ఆరోహణలు, అవరోహణలు ఉంటాయి. నిరాశలు పతన చిహ్నాలు కావు... విజయానికి సోపానాలు. అంతిమ గమ్యం చేరే వరకు ప్రయాణం సాగుతుంది. దివ్యప్రజ్ఞ అజ్ఞాతంగా మనిషిని ముందుకు నడిపిస్తుంది. నెమ్మది నెమ్మదిగా, నిదానంగా పరబ్రహ్మ తత్వానికి చేరువ కాగలుగుతాడు. మనిషి తనదైన మానవ నైజాన్ని వదలి, పరావరణంలో ప్రవేశించాలి. అదొక కాంతివలయం. ఆ కాంతివలయాన్ని పూర్ణయోగులలో, యోగపూర్ణులలో మాత్రమే దర్శించగలం. ఆ దివ్య పరిణామం వారి స్వీయసాధన వల్ల సాధ్యపడుతుంది.

సమస్త ధర్మాలకు, ప్రకృతికి కీలకమైనది మూలాధార కేంద్రం. అందులోనే విశ్వ బ్రహ్మ ఈశ్వరప్రజ్ఞతో సృష్టిని అణురూపంలో భద్రపరిచాడు. పైకి కనిపించేవి మృణ్మయ పాత్రలు. అదొక్కటే హిరణ్యగర్భం. మాయ తొలగిన తర్వాత భగవద్దర్శన మవుతుంది. అతీంద్రియ శక్తుల్ని ఆశించడం తప్పు కాదు. వాటిని భరించగల శక్తి మనిషికి ఏర్పడాలి. దివ్య ప్రజ్ఞలు ప్రకృతి శక్తులతో కలిసినప్పుడు మనిషిలో సగం దివ్యత్వం ఏర్పడుతుంది. ఆత్మప్రజ్ఞ అతీంద్రియ శక్తితో కలిసినప్పుడు పూర్ణత్వం సిద్ధిస్తుంది.

పరమాద్భుతాలు సృష్టించే సృష్టి బ్రహ్మకు సైతం ప్రాణప్రదమైనది ఆత్మ. ఆత్మ ఆధారంతోనే ఈ విశ్వకర్మాగారంలో సౌందర్యాలు తీర్చి దిద్దాడు. కోట్ల జీవుల్ని సృష్టించాడు. సృష్టి పెరగడంతో పరిణామ క్రియ పెరిగింది. అదృశ్యంగా వున్న దివ్య మహత్తులు మనిషికి అందుబాటులోకి రాసాగాయి. శూన్య

కుండలినిలోని మార్మికతలో చలనం ఏర్పడ్డది. సృష్టి పరిణామానికి ఈశ్వర సహకారం ఎప్పుడూ అవసరమే.

చతుర్దశ భువన నిర్మాణంలో పరమాద్భుత సృష్టి మానవుడు. ఇహపరాలకు, భూమ్యాకాశాలకు మధ్య ఏర్పడిన అనుబంధం. కారణజన్ముడైన అశ్వపతి విశ్వశ్రేయస్సుకు, తేజస్సుకు ఒక వైతాళికుడైనాడు. ఆయన జన్మతః మహర్షి. క్షణంలో ఊర్ధ్వ లోకాలు చుట్టిరాగల మహాజ్ఞాని. ఆయన చైతన్యం ఆకాశపు అంచులవరకు విస్తరిస్తుంది. ఊర్ధ్వ గమనంలో మానవుని అహంకారాలు ఒక్కొక్కటిగా కరిగిపోతాయి. అహం కడకు 'ఆత్మ'గా రూపాంతరం చెందుతుంది. ఆత్మశరీరికి రూప ప్రపంచం దూరమవుతుంది. అతని శ్వాస అదృశ్య లోకాలకు బాటలు ఏర్పరుస్తుంది. మనిషి కలలు, ఊహలు శాశ్వతంగా రద్దయిపోతాయి. ఆత్మ కలగనదు, భావించదు. లౌకిక బంధాలు, నిబంధనలు రద్దయిపోయినప్పుడు ఆత్మ స్వతంత్ర మవుతుంది. ఆత్మానుబంధం విలువలేనిదే. ఆత్మకు పరమాత్మతోనే అనుబంధం,భౌతిక ప్రపంచంతో కాదు. మహర్షి దృష్టికి విశ్వమంతా సత్యరోచిస్సులే కనిపిస్తాయి. దివ్యదృష్టికి అలౌకిక ప్రపంచం కనిపిస్తుంది. పరిమిత మేధస్సు అపరిమితమైన తేజస్సుగా మారుతుంది. ఆత్మ పరమాత్మ స్థితికి చేరుకుంటుంది.

జీవుడు సచ్చిదానంద సీమలలో విహరించినప్పుడు, పరిమిత జ్ఞానం ప్రజ్ఞానంగా మారుతుంది. జీవప్రజ్ఞ పరబ్రహ్మ ప్రజ్ఞగా పరిణమిస్తుంది. జీవుడు ఆత్మ సామ్రాజ్యాధినేత. తాను నిర్మించుకున్న భవ్య మందిరానికి తానే స్రష్ట, ద్రష్ట. అమృతత్వ సిద్ధి అప్పుడు కలుగుతుంది. అప్పుడతనిది సంపూర్ణ స్వాతంత్ర్యం. అప్పుడు అసలు సిసలైన ఉషోదయం. అది మహోదయం.

యోగి తన ఆధ్యాత్మిక వైశాల్యంలో ఎదిగిన కొలది అతని వర్తనంలో మానవత క్రమంగా తగ్గిపోతుంది. ఊర్ధ్వగతిని పయనించినకొద్దీ పైలోకాలను దర్శిస్తాడు. సుసంకల్పం సత్యాన్వేషణలోని అవరోధాలను తొలగించి వేస్తుంది. మానసిక బాధలు, వేదనలు వివేకంతో తుడిచి వేసుకోవచ్చు. ఆత్మ అనంతసీమలు చేరుతున్న కొద్దీ ప్రాపంచిక ఒత్తిడులు లయించి పోతుంటాయి. సాధన తొలినాళ్ల లోనే ఈ అనుభవం ప్రస్ఫుటంగా తెలుస్తుంది. యోగి స్వేచ్ఛగా శాంతి సీమలలో విహరిస్తుంటాడు. తనను మార్చి వేసిన అజ్ఞాతశక్తికి యోగి తలవంచి, శిరసా వహించి, మూతపడిన మనోమందిరంలో మైకంలో ఉండిపోతాడు. తనకు తెలియని శక్తులు తనకు సంక్రమిస్తాయి. అతీంద్రియశక్తులు మేల్కొంటాయి. సిద్ధులు, మహత్తులు సహజ ప్రక్రియ లనిపిస్తాయి. దైవదత్తులకు ఆ శక్తులు

సహజంగా సిద్ధిస్తాయి. వాటి ముందు భౌతిక శక్తులు తలలు వంచుతాయి. అవి ఎంతటి దివ్యశక్తులైనా, ప్రకృతికి అనుకూలంగానే ఉంటాయి. సిద్ధులు, మహత్తులు యోగికి ఇబ్బడి ముబ్బడిగా అందుబాటులో ఉంటాయి. అవి అతని జీవితానికి సహజ వనరులు.

నిర్మలాంతఃకరణవల్ల సచ్చిదానందం లభిస్తుంది. ఆత్మదర్శనాకాంక్ష దురాలోచనలకు తావివ్వదు. సంకల్ప మాత్రం చేత యోగి సర్వ ప్రకృతిని, అగోచర విశ్వాన్ని దర్శించగలడు. సాటి మానవుల మనస్సులలోకి, హృదయాలలోకి అలవోకగా చొచ్చుకుపోగలడు. బాహ్య రూపాన్ని విస్మరించి ఆత్మను, సూక్ష్మ శరీరాన్ని దర్శిస్తాడు. సామాన్యులకు సంభవం కాని పరమాత్మను తాను అనుక్షణం దర్శించగలడు. సంకల్పంతో ఇతరుల ఆలోచనలను అనురాగంతో వారి హృదయాలను స్పృశించగలడు. బాహ్య దృష్టికి గోచరం కాని రహస్యాలు, నిగూఢ సత్యాలు అతని ఆత్మకు తెలుస్తుంటాయి.

ఇతరుల జీవ స్పందనలు సైతం సులభంగా గ్రహిస్తాడు. వారి వారి సుఖదుఃఖాలకు గల కారణాలను ఇట్టే గ్రహించగలడు. వారి వారి ఆగ్రహాలు, అనురాగాలు, అవ్యక్త కామనలు, వాంఛలు తరంగాలుగా అతనికి తెలుస్తుంటాయి. అతని హృదయం ఒక నిశ్శబ్ద శూన్యకాసారం. ఎందరి భావ వాహినులైనా అతని హృదయ కాసారంలోకి ప్రవహించగలవు. వాటిని తన అంతర్గత భావ శబ్దాలుగా వినగలడు. తన భావాలను భాషా రహితంగా ఇతరుల మనస్సులోకి బదిలీ చేయగలడు. అతను విశ్వానికే అద్దంపడతాడు. ప్రేమవారధిపై పయనించి అందరి హృదయతీరాలను చేరి వారి ఆత్మీయతను అందుకోగలడు. అయినా, ఏవీ అతనిని అంటవు. వేటికీ చలించడు. తనలో తాను ఏకాంతంగా ఉండిపోతాడు.

ప్రాచీన తంత్రులపై దివ్యరాగాలు పలికించి, తన భవిష్యత్తును శృతి చేసుకుంటాడు. జీవితాన్ని ఇంతకాలం మనస్సు శాసించి, తనకు బానిసను చేసుకుంది. మనోదాస్యాన్ని వదలి ఆత్మానందాన్ని తను అనుభవిస్తాడు. అణువణువులో స్పందన, ప్రతి కణంలో ఆనందం చిప్పిలగా, తానే రసార్ణవంగా మారి, ఆత్మానందానికి తన శరీరాన్ని ఆవాస యోగ్యం చేస్తాడు. అతి సూక్ష్మం, సున్నితం అయిన దివ్యత్వం అతని బాహ్య ప్రకృతిని దివ్యంగా మార్చుతుంది. ఆత్మ పొందే అనుభవాలు ప్రకృతి అధిపత్యాన్ని అంగీకరించవు. మృత్యువు సైతం యోగి ఆత్మను చైతన్యం నుండి వేరుచేయదు. చైతన్యం, ప్రజ్ఞ తన వెంట ఉన్నంత కాలం ఆత్మ మరోజన్మకు పోదు. అటువంటి ఆత్మలే మహాత్ములు. మన ఆత్మ

జాగృతి ఆవలి తీరం అంతా మార్మికం. ప్రకృతికి, మార్మిక లోకానికి మధ్య ఒక సన్నని ద్వారం తెరుచుకోవాలి. భౌతిక ప్రపంచానికి, ప్రకృతికి అందని రహస్యాలు, మార్మిక లోకంలో యోగికి అందుబాటులో ఉంటాయి. మానవ మేధస్సుకు గోచరంకానిది దివ్య ప్రపంచం. మార్మికసీమలలో ముందుకు వెళ్లిన కొలదీ దివ్య సౌందర్యాలను, సత్యాలను విరబూస్తుంది.

జీవుడు అంతర్ముఖుడై, ఆత్మ మందిరాంతర్భాగాలలో దాగివున్న తేజస్సును, కాంతి లోకాలను దర్శిస్తాడు. మనిషిగా కన్న కలలు అక్కడ వాస్తవాలని తెలుస్తుంది. జీవుడు ఆశించినవి, కోరినవి అక్కడ అన్నీ లభిస్తాయి. తనది మరణానికి అతీతమైన స్థితి. మృత్యుంజయుడు తాను. మృత్యుంజయులైన యోగులకు తేజో మండలాలు, కాంతి సీమల పూర్ణత్వం అవగతమవుతుంది. పారవశ్యంతో పరమాత్మకు చేరువవుతాడు.

భావశూన్యతనుండి ప్రభవించిన మార్మిక జగత్తుకు తానే అధిపతి. యోగి సంకల్పానికి దైవ ప్రేరణ తోడు. మార్మిక జగత్తులో పెరిగి పెరిగి ఆత్మ పరమాత్మతో సమం అవుతుంది. మనోకుడ్యాల వంటివి కావు మార్మిక మందిర కుడ్యాలు. మార్మిక మందిరానికి అన్నీ రహస్యద్వారాలే, అన్నీ నిగూఢ పథాలే. అంతర్దృష్టికి మాత్రమే అక్కడి గవాక్షాలు తెరుచుకుంటాయి. అక్కడ కాలపురుషుని ముద్రలు పడవు. మానవ మాయతెరల్ని తొలగించుకుని జీవుడు మార్మిక గవాక్షం ముందు నిలుస్తాడు. అప్రయత్నంగా, ఆత్మశక్తితో ఆ మందిరం ద్వారాలు తెరుచుకోగలడు. అక్కడి నిశ్శబ్దాన్ని దాటి లోపల ప్రవేశించాలి.

అవి పరలోక ప్రశాంతసీమలు. అక్కడ వినిపిస్తాయి పరమాత్మ పవిత్ర పాద నిశ్శబ్దాలు. అక్కడ రవళిస్తుంది దివ్యవాణి. అక్కడ అవగతమయ్యేవన్నీ పరమసత్యాలే. తనదే అయిన మరొక సత్య రూప సందర్శనం కలుగుతుంది. అది తనదే అయిన భౌతిక రూపం కాదు. తనదైన ఆత్మ స్వరూపం. అంతర్లోకాలలో ముందుకు వెళ్లినకొద్దీ కాంతిద్వారాలు తెరుచుకుంటాయి. శాంతి వీచికలు స్వాగతిస్తాయి. అపూర్వసిద్ధులు, శక్తులు ఆయాచితంగా యోగికి సంప్రాప్తిస్తాయి. తనకు తెలియని పారలౌకికదృష్టి, పరప్రజ్ఞ ఏర్పడుతుంది. తేజో మండలాలు, గగనసీమలు, పరలోకాలు, గ్రహ మండలాలు దర్శించగల అతీత ప్రజ్ఞ ఏర్పడుతుంది. అక్కడ తేజశ్శరీరుల దర్శనం లభిస్తుంది. మన కళ్లతో చూచి భరించలేని తేజస్సు వారిది. వారిని నడిపించే శక్తి ఇంద్రియాతీతం. అందరూ మానవాతీతమైన దివ్య శక్తులతో సంచరిస్తుంటారు. ఆ ఆనందాలు మనిషికి

అర్థం కానివి. ఒక జీవిత కాలంలో ఈ ప్రపంచంలో దర్శించ వీలులేని సుందర ప్రపంచాన్ని అక్కడ ఒక్క క్షణంలో దర్శిస్తాము. అవి సచ్చిదానందమయాలు. అక్కడిదంతా ప్రజ్ఞానమే. అది ఆత్మకు, హృదయానికి పరిమితం, అనుభూతం.

మార్మిక లోకాలవైపు మన మనస్సు పరుగులు తీస్తుంది. అక్కడి రహస్యాలకై అన్వేషిస్తుంది. గగనాంతర సీమలు అనేక అద్భుత దృశ్యాలను చూపిస్తాయి. అక్కడివి మనం ఆఘ్రానించలేని పరిమళాలు. అక్కడివి మనకు జీర్ణంకాని అమృతాలు. అక్కడివి సర్వలోకాలను సమీకరించగల సంగీతరుతాలు. ఆ సంగీత స్వరాలు చెవికి సోకగానే పారవశ్యం కలుగుతుంది. ధ్యాన స్థితిలో ఆత్మ 'పర' వశమైనప్పుడు మాత్రమే వాటి అర్థం తెలుస్తుంది. అప్పుడే 'సత్య' వాణి వినిపిస్తుంది. ఆ దివ్యవాణి దిగంతాలను దాటి పయనించగలదు. ధ్యానస్థితిలో చైతన్యంగా ఉండి మాత్రమే ఆ స్వరాలను వినగలం. హృదయానికి వినిపించి అనుభూతికి అందే సంగీతాలవి, సత్యరోచిస్సులవి. మనిషి కలలకు అది సత్యావిష్కరణ. మనిషి వాంఛించే స్వర్గాలు అందుకోడానికి అది ప్రార్థనాగీతం.

కాలం ఆగదు. నాటకం ముగియదు. గమనం ఆగదు. గమ్యం తెలియదు. అపరిష్కృత సమస్యలు మనస్సును వెన్నంటి వస్తాయి. సందేహస్వరాలు అపస్వరాలై వినిపిస్తాయి. విరామం లేని సుఖలాలస. భోగపరత, వాంఛోద్ధృతంతో ఉరుకులు, జీవితమంతా పరుగులు. తీరని కోర్కెల కలకలారవాలు. ఈ జీవితమే సుస్థిరం కావాలన్న వెంపర్లాట. ఇది శాశ్వతం కాదని తెలిసీ శాశ్వతమన్న భ్రమలో బ్రతకటం.

ప్రతి ఆత్మ యుగాలుగా, తరతరాలుగా జన్మిస్తోంది. జీవిగా పరిశ్రమిస్తుంది. కానీ కాస్తయినా పరిక్రమించదు. తన జన్మకు అర్థాన్ని, ప్రయోజనాన్ని గుర్తించ యత్నించదు. అన్వేషిస్తే ఆనందం లభించకపోదు, గమ్యం కనిపించకపోదు, అర్థం స్ఫురించకపోదు. ఆధ్యాత్మికానందం కలిగించే తృప్తి మరొక విధంగా లభించదు. అది సంతుష్టి. జీవితకాలంలో అనుభవించిన సుఖాల మధురిమలు కడకు నైరాశ్యాన్ని, అసంతృప్తిని మిగుల్చుతుంటాయి. కష్టాలకు, కన్నీటికి, ఆనందాలకు, నిర్వేదాలకు క్షణకాలం కలిగే బ్రహ్మానందం ముగింపునిస్తుంది. జీవుని వేదనకు, ఆవేదనకు, అన్వేషణకు అదే ఫలశ్రుతి.

మార్మిక శబ్దాలు, సంకేతాలు లోపలకు ప్రవేశించడానికి స్ఫూర్తినిస్తాయి. హృదయంలో జోరీగల్లా ముసురుతాయి. ఎంతో శ్రమిస్తే తప్ప మార్గం కనిపించదు. దివ్య సౌందర్యాలు ఎందరికి అనుభవం! అక్కడి దివ్య మాధుర్యాలు ఎందరు

రుచి మరిగారు! ఆ దివ్య నాదాలు మన శ్రవణేంద్రియాలకు వినిపించవు. ఆ నాదంలో ప్రపంచ శబ్దచయం యావత్తు లయించి వుంటుంది. మనిషి వివేకం జ్ఞానంగా పరిణమించినప్పుడు ఆ నారద నాదాలను వినగలడు. అప్పుడు లౌకిక ప్రపంచం సైతం అలౌకికానందాన్నిస్తుంది. ఉపచేతనా కుహరాలు దాటి వెలువడిన ప్రణవం అజ్ఞానాన్ని తరిమివేస్తుంది. సమాధానాల్లేని ప్రశ్నలకు అదే చివరి ఊరడింపు.

ఉరుములు, మెరుపులతో అల్లకల్లోలమైన ఎడద బ్రహ్మత్వానికి స్వాగతం చెబుతుంది. అది హిరణ్యగర్భ. అక్కడ చూచిన వాటిని ఇక్కడ మాటలతో వ్యక్తం చేయలేం. అక్కడివి సత్య రోచిస్సులు, సత్య సందేశాలు, సత్య సమీరాలు. అవి అన్నీ ప్రామాణికాలు. అంతర్దృష్టితోనే వాటిని దర్శించగలం. అనుభూతి పరంగా ఆత్మతో అనుభవించగలం. పరలోకవాసుల ఆంతర్యం భాషలకు అందదు. భావం ప్రధానం, అనుభూతి ప్రధానం. విగతజీవులు కొందరు చిరంజీవులై, ఆత్మ శరీరాలతో అక్కడ మనకు దర్శనమిస్తారు. అవ్యక్త ప్రజ్ఞను మనకు అందిస్తారు. పాపులు, పుణ్యులు ఇరువురు పరమాత్మ సన్నిధిలో సమానులే. అక్కడ వైరాలు, వైషమ్యాలు ఉండవు. ప్రతి ఒక్కరి ఆత్మ పరమాత్మ ప్రతినిధి అయినట్లు కనిపిస్తుంది. వెలుగులో వున్నది దేవతలు. చీకట్లను ఆశ్రయించినవి దయ్యాలు.

కాలపురుషుని పొది నుండి వెలువడే ప్రతి ఘడియ ఒక నూతనావిష్కరణకు నాందీ వాచకం పలుకుతుంది. అనునిత్యం ఒక ఆధ్యాత్మికానుభవమే. ప్రతిరోజు మరో నూతన ప్రపంచాన్ని దర్శించిన అనుభూతి. మరో లోకంలో సరికొత్త మలుపు తిరిగిన స్పందన. ప్రతి చిన్న అనుభవం ఒక పెద్ద ఆత్మీయతను పరిచయం చేస్తుంది. ప్రతి స్పందన ఒక మధురమైన నిష్యందన. ప్రతి ఘటన మరువరాని ఒక దివ్యానుభవం. అక్కడ వినిపించే సందేశాలు, అందే సత్యాలు, మనసులోని సమాలోచనలు అన్నీ దివ్యవాణీ నిస్వనాలే. మార్మికవాణి పెదవి దాటిన భాషణ హృదయాన్ని రసప్లావితం చేస్తుంది. సుందరసీమల నుండి జాలువారిన ఆకర్షణలు ఆనందలోకాల ఆకస్మిక పారవశ్యా లవుతాయి. అవి ఆనందసీమలు, అద్భుతావహ లోకాలు. అంతర్దృష్టితో ఆ సీమల సొగసుల్ని ఆస్వాదించవచ్చు. మహద్విషయాలు, అగోచరంగా వున్నవి గోచరమైనప్పుడు ఆశ్చర్యమే!

అధిభౌతిక లోకాలు అతిలోక సుందరాలు. ఆ లోకాలతో ఏర్పడిన సాన్నిహిత్యం అలౌకిక స్పృహ కలిగిస్తుంది. సూక్ష్మలోకాలతో పరిచయం కలిగిస్తుంది. భౌతిక ప్రపంచంలో జీవిస్తున్నప్పుడే సూక్ష్మలోకాల అనుభవం

పొందడం అంటే మృత్యువును జయించడమే. మృత్యువు తర్వాతి అద్భుత జీవితాన్ని ముందుగా రుచి చూడడమే. అప్పుడు సూక్ష్మలోకపు తలుపులు తెరుచుకుంటాయి. మెరుపు మెరిసినంత వేగంగా దివ్యదృష్టి ఏర్పడుతుంది. ఆత్మ చైతన్యం పెరిగిన కొలదీ దివ్యదృష్టి అభివృద్ధి చెందుతుంది. అవి యోగిని జ్ఞాన శిఖరాలపై నిలుపుతాయి. అప్పుడు యోగికి భౌతిక ప్రపంచం పట్ల మమకారాలు, ప్రలోభాలు పోతాయి.

యోగి భౌతికప్రపంచాన్ని వదలి క్రమంగా ఆత్మప్రపంచంలోకి ప్రస్థానం సాగించాలి. శూన్యాన్ని సైతం అధిగమించి అద్వైత స్థితిని చేరుకోవాలి. అక్కడ వివేకం పనిచేయదు. ప్రజ్ఞ దేనినీ గుర్తించదు. శరీరానికి హృదయస్పందన తెలియదు. అందాల కోసం ఆరాటం ఉండదు. సమాధి స్థితిలో అంతా శూన్యంగా తోస్తుంది. ఒక్క క్షణంలో జీవుడు మరో లోకంలో ప్రవేశిస్తాడు. అది అరూపం అయినా అనుభూతికి అందుతుంది. అక్కడ అంతా సజీవ చైతన్యమే. అంతా వెలుగుమయం. వెలుగుబాటల్లోనే ఒకరినొకరు గుర్తించడం. వెలుగు బాసలే జీవుల మధ్య. వాటిని గుర్తించగలది ఆత్మ స్పర్శ. పరమాత్మ సర్వం గమనిస్తుంది. సృష్టించబడిన జీవజాలంలో పరమాత్మ తన ప్రతినిధినే చూస్తుంది. లోకంలోని శబ్దాలు అన్నీ తనవే. తనకు తెలిసినవే.

అన్వేషణకు, అనుభూతికి అనుసంధానమైనది యోగసాధన. ఏ సౌందర్యం అయినా పరమాత్మ కల్పనే. ఏకత్వం అన్నది అనేకాత్మల కలపోత. అన్ని సత్యాలకు మూలం పరమ సత్యమే. భిన్నసత్యాలు అన్వేషణలో పరమసత్యంగా భాసిస్తాయి. ఆత్మ తనలోనే ప్రజ్ఞానాన్ని గుర్తిస్తుంది. సమాధి చైతన్యంలో వివేకం, అతీంద్రియత, శుద్ధసత్యం అన్నీ ఏకమైపోతాయి. అందుకే మహాసమాధిలో యోగి నిశ్చలంగా ఉండిపోతాడు. అది నిశ్శబ్దం, శూన్యం. అయినా అది సర్వజ్ఞ, స్వతంత్రం, ఏకం. అక్కడ వ్యక్తీకరణకు భాష అవసరం ఉండదు. ఆలోచన విహాయస మంత విశాలం. అమరత్వం విసుగు కలిగించదు. అలసట ఉండదు. ఎప్పుడో తప్ప బాహ్య ప్రపంచ స్పృహ కలగదు. అక్కడ మనం అపరిమితం, మన ధ్యేయం అనంతం.

అక్కడ ప్రతి ఆత్మ, ప్రతి జీవి విశ్వమంత విశాలంగా భాసిస్తారు. ప్రతి జీవి లక్ష్యం అనంతత్వమే. యోగికి ప్రాపంచిక స్పృహ ఉండదు. ఇంద్రియాలు నిశ్శబ్దానికి అలవాటు పడతాయి. ఆ శక్తిని అప్రయత్నంగా పొందుతాయి. కాంతి కాసారం దాటి, భావతరంగాల్ని అధిగమించి, ప్రపంచాన్ని విస్మరింప చేయగల

దివ్య జీవనంలోకి, క్రమంగా శుద్ధ చైతన్యంలోకి నిష్క్రమిస్తాడు యోగి. భాషా పరమైన భావాలు మనస్సు పరిధిలోనే ఆగిపోతాయి.

అతీంద్రియ క్రియచే సత్యాన్ని దర్శించే ప్రజ్ఞను అనంతంగా వ్యాపించిన ప్రశాంతి మాత్రమే అందిస్తుంది. విశ్వసృష్టి కార్యంలో రవ్వంత విరామం ఏర్పడినపుడు ప్రకృతి కలత పడుతుంది. అన్ని ఆరాటాలు, అన్వేషణలు, సాధనలు ప్రశాంతితో ఏకమవుతాయి. లోకం అంటేనే ద్వంద్వమయం. పోరాటాలు, ఘర్షణలు, విరుద్ధశక్తుల అనవరత ఘర్షణ. మనస్సే రణరంగం. ఆకాశంలో ఆశా శకలాలు, గుండెలో కదిలే భావన ఒక్కటే నవ సంకల్పానికి నాంది పలుకుతుంది.

కాలప్రవాహంలో ఎన్నెన్నో సుడిగుండాలు ఏర్పడతాయి. మరెన్నో కల్లోలాలు కలుగుతాయి. భోగలాలస మనిషికి ఉద్రేకాన్ని కలిగిస్తుంది. నేలసైతం భోగపూర్ణమే. మట్టిలో కదిలిన కామన, కనలిన ప్రేరణ మానవసృష్టికి దోహదమైంది. ప్రకృతి కామ ప్రకోపానికి మానవుడు బలి అయ్యాడు. ప్రకృతికి, మనిషికి సమంగా వున్న తపన, కామజ్వాల బాధల్ని రగుల్చుతుంది. సత్ప్రవర్తనకు అపజయం శిక్ష. సుఖాలను, ఆనందాలను అపజయం అపహాస్యం చేస్తుంది. ప్రేమకు వియోగం తప్పనట్లే ఆధ్యాత్మిక పురోగమనంలోనూ తొలుత అపజయం తప్పదు. సత్య సందర్శనంతో పరాజయాలన్నీ విజయాలవుతాయి. యోగి ఆత్మ స్వతంత్రమై విజయం సాధిస్తుంది.

ఆత్మ విజయానికి కాలదోషం అంటదు. మనస్సు చంచలంగా ఊగుతుంది. ఆత్మ ఎప్పుడూ స్థిరంగానే వుంటుంది. ఒక సత్యం నుండి మరొక సత్యానికి, ఒక వాస్తవం నుండి మరొక వాస్తవానికి ఆత్మ ప్రస్థానం సాగుతూనే వుంటుంది. ఆత్మకు ఎప్పుడు అలజడి వుండదు. ఎప్పుడూ ప్రశాంతంగా వుంటుంది. ఎప్పుడో రాసుకున్న కథ ఇప్పుడు జరుగుతుంది. యోగి వర్తమానంలో జీవిస్తూ గతంలోకి పయనిస్తాడు, భవిష్యత్తులోకి తొంగిచూస్తాడు. అతనికి భూత, భవిష్యత్, వర్తమానాల మధ్య కాలభేదం కనిపించదు. క్షణకాలంలో యుగాల అనుభవం పొందడం యోగికి సాధ్యం.

ఒక సత్యకిరణం విశ్వం రూపురేఖల్ని మార్చగలదు. అనురాగానికి అర్థాన్ని మార్చగలదు. ఈ భౌతిక ప్రపంచం పరాశక్తిలోని ఒక స్పందన మాత్రమే. అనంత తేజోకిరణం సమస్త లోకాన్ని ఉద్దీప్తం చేస్తుంది, తేజోమయం చేస్తుంది. నీరవ మహార్ణవంలో భావం అభావ మవుతుంది. భావం నిశ్శబ్దంలో లయించి

ప్రశాంత మవుతుంది. అతీంద్రియ ప్రజ్ఞ మానవ హృదయానికి సోకినప్పుడు ఆత్మ భావాతీత స్థితిని చేరుతుంది. అనంతానంద తీరాలకు ఆత్మ చేరకుండా మనస్సు అడ్డు నిలవదు. శూన్యంలో పయనం సాగిస్తున్న ధ్యాని ధ్యానంతో లయించి, ధ్యానంగా మిగులుతాడు. వెలుగు కిరణం మీద పయనిస్తూ పరలోకాలకు చేరుకుంటాడు. అక్కడ ఇంద్రియజ్ఞానం ఉండదు. వివేకం మూగపోతుంది. అవ్యక్తం ఒక్కటే కాంతి సీమలలో పథవిహీన. అవ్యక్తం అంటే ఏకాంతం. రూపాలు, శబ్దాలు లేని ప్రశాంతసీమ. అక్కడ సర్వం నిర్గుణం, సర్వం నిరామయం, నిరాకారం. శూన్యమేధస్సు లోకాలను సృష్టించగలదు. స్వర్గాలను సృష్టించగలదు. సత్యాలను ఆవిష్కరించగలదు. యోగి ఆత్మ వీటన్నింటినీ దర్శించగలదు.

ఆత్మశక్తికి మూలస్థానమేదో ధ్యాని మాత్రమే ధ్యానంలో తెలుసుకోగలడు. అన్ని చలనాలు నిశ్చలంలో లయిస్తాయి. యోగి అంతిమ ప్రస్థానం అదే. ఆత్మకు అప్పుడే పరమాత్మ ఆవాసమవుతుంది. తొలినాళ్లలో ఇలాంటి అనుభవాలు అనేకం కలుగుతుంటాయి. అన్ని ఔన్నత్యాలు, ఆధిక్యతలు యోగి అనుభవానికి అందుతాయి. అవి అంతలోనే అంతర్హిత మవుతుంటాయి. శరీరం శిలాసదృశమై, జీవుడు సమాధి స్థితిని చేరతాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు సైతం తగ్గి మనస్సు భావశూన్య మవుతుంది. ఆలోచనారహిత మవుతుంది. ఆ దివ్యస్థితికి చేరేవరకు యోగి శూన్యంలో పయనించి ఆ తర్వాత శూన్యంలో మిగిలిపోతాడు.

అంతటి నిశ్చల స్థితిని, ప్రశాంతిని మనిషి భరించలేడు. ఆ నిశ్చల స్థితిలోనే గతం తాలూకు జ్ఞాపకాలు, ఆనందాలు, విషాదాలు తలపుకు వస్తాయి. అనవసరమైన విషయాలు జీమూతాల్లా ముసురుతుంటాయి. అప్పుడు తనకు అలవాటైన మార్గాలలో నిష్క్రమించి, అక్కడే ఆ పాత సుఖాలనే ఆపాతమధురంగా అనుభవించాలనుకుంటాడు. నడకనేర్చే వయస్సులో పసివాడు అలసిపోయినట్లు సాధకుడు ప్రతిమెట్టు వద్ద అలసి, విశ్రమిస్తుంటాడు. ప్రయాణం విరమించు కోవాలని చూస్తాడు. పరాన్వేషణకు అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతుంటాయి. హృదయంలో రగిలే అగ్నిని గుర్తించడం కష్టం!

గతకాలపు సంఘటనలు స్మృతిలో మెదులుతూ, ముందుకు పోతున్న ఆత్మను వెనక్కిలాగుతుంటాయి. ఒక విధమైన స్తబ్ధత మనస్సును ప్రాపంచిక విషయాలలోకి మళ్లిస్తుంది. ఒక విధంగా మంచిదే. ఆధ్యాత్మిక పురోగమనానికి నిరాశలు, పతనం సోపానాలవుతాయి. లోకపు అజ్ఞానంలోకి, అంధకారంలోకి,

సంసార జీవితంలోకి అరూప బ్రహ్మభావన ప్రవేశించి ఆత్మను నిద్రలేపుతుంది. కొంతకాలం ఇంద్రియాలకు లోబడినా, ఇంద్రియ సుఖాలు వాంఛించినా, తర్వాత ఇంద్రియాతీతం అవుతుంది. ఆ శక్తే ఇంద్రియాలను జయించి, ఇంద్రియ నిగ్రహం ప్రసాదిస్తుంది.

భగవంతుడు అగోచరంగా మన బలహీనతల్లో చొరబడి, మన అజ్ఞానాన్ని తొలగించి, మనల్ని వాటి నుండి విముక్తి చేస్తాడు. మనంగా మారడానికి సిద్ధపడే వరకు పరమాత్మ ప్రయత్నం సాగుతూనే ఉంటుంది. అందరూ దైవశాసనాన్ని శిరసావహించవలసిందే. మన శరీరంలోని ప్రత్యణువు దివ్యత్వంతో పునీతం అయినప్పుడే ఆత్మ పురోగమిస్తుంది. లేకపోతే ఈ శరీరాన్ని ప్రపంచ సుఖాలకు బలిపెట్టి ఆత్మ తన స్థావరం చేరుకుంటుంది. మనిషి మృగంలా జీవిస్తుంటాడు. ఆత్మ విడిచిన మనిషి పశువుతో సమం. పరమాత్మ కొందరిలోనే తన లక్ష్యాన్ని సిద్ధింపచేస్తుంది.

మనిషి తన ఆత్మను గుర్తించనపుడు, ఆత్మోన్నతికి సహకరించనపుడు, మానవత మరింత పతనం చెందుతుంది. సృష్టి లక్ష్యమే వీగిపోతుంది. పురోగమించని, పరిణామం చెందని సృష్టి, జగత్తు కడకు శూన్యంలో లయిస్తుంది. అదే యుగ ప్రళయం. యుగాంతం. ఉద్ధరించ వలసిన దివ్యశక్తులు ఉపసంహ రించుకుంటాయి. మనిషి సహకరించనప్పుడు ఈశ్వర సంకల్పం వికల్పమవుతుంది.

మానవాత్మ తన పూర్వపుటౌన్నత్యాన్ని ఆశించడం తప్పుకాదు. అందుకు ఆరాటపడ వలసిందే! పోరాడ వలసిందే. ఏ నాటికైనా మానవాత్మ పరంజ్యోతి వెలుగులో ప్రవేశించాలి. తనను ఉద్ధరించమని పరమాత్మను ప్రార్థించాలి. ఒక్క ప్రార్థన చాలు దివ్యత్వం మనలో ప్రవేశించడానికి. అర్థిస్తే దివ్యత్వం ధారాపాతంగా వర్షిస్తుంది. ఆ కారుణ్యధార మనిషిలో ఈశ్వర స్పృహ కలిగిస్తుంది. దివ్యస్పృహ కలిగిన క్షణంలో ఆత్మ దివ్యశిఖరాలను అధిరోహిస్తుంది. ఆత్మపైకి వెళ్లిన కొలదీ మనిషి మహత్తరానుభూతి చెందుతుంటాడు. సరికొత్త అనుభవాలు కలుగు తుంటాయి. పరలోకాలలో విహరిస్తున్న అనుభూతి మనిషిలో దివ్యతను ప్రోదిచేస్తుంది. మనసున వెలుగులు నింపుతుంది. ఇహపరాల మధ్య ఊగిసలాట, పరమాత్మ కొరకు ఆరాటం. అదే అన్వేషణ. శుక్లపక్ష చంద్రునివలె దినదినాభివృద్ధి చెందుతుంది దివ్యత్వం. నిత్యజీవితం దివ్యజీవనంగా మారుతుంది. అనుక్షణం ఆ ఔన్నత్యం ఆత్మకు అనుభూతమవుతుంది. ఆత్మ నివేదన జరుగుతూనే ఉంటుంది.

భౌతికం అధిభౌతికంగా మారి, లౌకికం పారలౌకికం అయినప్పుడు పరమాత్మ సాక్షాత్కారం ప్రతివ్యక్తికి సాధ్యమే. ప్రతిక్షణం బ్రహ్మానుభూతి కలుగుతుంది. మనిషి ఆలోచన, అవగాహన పద్ధతి మారుతుంది. మానవశక్తికి, విధికి మధ్యగల అంతరం సన్నబడి, మన జీవితాలు పరమాత్మకు ప్రతీకలుగా నిలుస్తాయి. ఆధ్యాత్మిక జగత్తులో సుస్థిరస్థానం ఏర్పడుతుంది. ఆ ప్రశాంతిలో, సమాధిలో ఎంతకాలం అయినా చిదానందంగా ఉండిపోగలం. జీవుడు అందుకున్న ఔన్నత్యాలను ఆత్మ అనుభవించి తన సొంతం చేసుకుంటుంది. యోగి ఆ స్థితిలో సదా అతీంద్రియ లోకంలో ఉండిపోగలడు. పరమాత్మ కాలం వెనుక దాగి ఆడించే జగన్నాటకాన్ని దర్శించగలడు. యోగి ఆత్మ పరమాత్మకు చేరువైన కొద్దీ పరమాత్మ శక్తుల్ని పొంది, పరమాత్మతో సమమవుతుంది. అప్పుడు బాధలు, బరువులు ఉండవు. ఎక్కడా ద్వైతం ఉండదు. యోగసాధన వల్ల కలిగే శక్తి అన్ని కల్లోలాలను అధిగమింపచేస్తుంది. అందువల్ల యోగి ఎప్పుడూ ఆనందమయుడే. యోగి సుఖదుఃఖాలకు అతీతుడు. తనకు సంక్రమించిన సిద్ధులకు శక్తులకు మురిసిపోడు, భ్రమ చెందడు. అవి తనవి కావని తెలుసు. దేనిపట్ల వ్యామోహం ఏర్పడదు. అతని పవిత్రాత్మ జగత్తుకు మేలు చేస్తుంది. యోగసిద్ధితో మహత్తర కార్యాలు చేస్తాడు. సృష్టి యావత్తు భౌతిక పదార్థ నిర్మితమే అయినా యోగి అందుకు అతీతంగా జీవిస్తాడు. ప్రపంచాన్ని ప్రలోభపెట్టే వ్యామోహాలు ఏవీ యోగిని కదిలించవు.

మహాశిల్పి కఠినశిలలో కారుణ్యమూర్తిని మలిచినట్లు యోగి తనలో తానే రూపుదిద్దుకుంటాడు. అజ్ఞాన శకలాల్ని ఏరివేస్తాడు. అన్ని ప్రాకృతిక శక్తుల నుండి విముక్తం కాగలడు. పరమాత్మ బాటలోనూ కొన్ని మాయతెరలు అడ్డు నిలుస్తాయి, భ్రమలు ఏర్పడతాయి. వాటిని సైతం గుర్తించి, మెలకువగా దాటిపోతాడు. ఔన్నత్యంలో ఆత్మోన్మీలనం కలుగుతుంది. అది అంతరంగంలో కలిగే మార్మిక పరిణామం. అతని ప్రపంచం సరికొత్త అందాల్ని సంతరించు కుంటుంది. ప్రకృతిలో పరమాత్మ, పరమాత్మలో ప్రకృతి సమభాగులన్న ఆకళింపు కలుగుతుంది. ప్రకృతి పురుషుడు వేరు కాదు. ఒకే నాణానికి రెండు ముఖాలు.

జీవుడు ఆత్మిక శిఖరాలను చేరుకుంటాడు. ఆత్మ, మనస్సు, హృదయం ఒకే తేజస్సుగా, ఒకే తేజోమూర్తికి మూడు ముఖాలుగా ఉంటాయి. అప్పటికీ తను సాధించింది ఏమీ లేదన్న అనుమానం కలుగుతుంది. జీవితపు వెలుగు నీడలలో మెలుగుతున్నట్లు, తన సాధన, శ్రమ వృథా అయినాయన్న అనుమానం.

దివ్య ప్రేరణలు చాలకాలం వరకు స్పష్టంగా తెలియవు. తెలిసినా అర్థం కావు. అంతరంగ నిశ్చలతను ఆత్మ మాత్రమే గుర్తించగలుగుతుంది.

జీవితంలో ఎన్నో వైపరీత్యాలు జరుగుతున్నా మధ్య మధ్య జ్ఞాన ప్రసారాలు జరుగుతుంటాయి. సద్గుణాలు ఒకటి తర్వాత ఒకటిగా అలవడతాయి. కష్టాల కొలిమిలో కాలిన కథలన్నీ అనుభవాలవుతాయి. అనుభవాలన్నీ కొత్త బాటలు చూపిస్తాయి. దైవతావాసాల చుట్టు మనస్సు పరిభ్రమిస్తుంది. ఏదో మహస్సు కోసం, దైవానుగ్రహం కోసం లోపలకు తొంగిచూస్తాం. ముందు మనోమయ జగత్తు మహత్వపూర్ణమవుతుంది. ఆ చైతన్యం నీడన జ్ఞానం ప్రభవిస్తుంది. జ్ఞానార్జనతో మహదానందాలు, మందస్మితాలు ఏర్పడతాయి. సత్యలోకాల నుండి సచ్చిదానందం వర్షిస్తుంది. అదే దివినుండి భువికి దిగివచ్చే దివ్యజ్ఞానం. చీకటి తెరలు ప్రిదిలి వెలుగుకిరణాలు సోకుతాయి. సుస్వరాలు వినిపిస్తాయి. ఆత్మ రహస్య మందిరాంతర్భాగాలలో ఆ స్వరాలు ప్రతిధ్వనిస్తాయి. అవి అదృశ్య అగోచర లోకాల శాంతి శిబిరాలు. ఆ నాదాలకు హృదయం పరవశిస్తుంది. అంతరంగంలో వినే శబ్దాలు, నాదాలు, అందుకునే సంకేతాలు యోగికి అనేక నిగూఢ సత్యాలను అందచేస్తాయి. అవి అగ్ని జ్వాలికలైనా, కాంతి కిరణాలైనా అన్నీ శాంతి సందేశాలే. అవి ఎక్కడ నుండి ప్రభవిస్తున్నాయో యోగికి అర్థం కాదు.

యావద్విజ్ఞానం అంతరంగ గర్భితం. వేయి సంవత్సరాల తపస్సు చేసినా తెలుసుకోలేని సత్యాలను క్షణకాలంలో గ్రహించగలడు యోగి. క్షణంలో చీకట్లు తొలగి సత్యావిష్కారం కలుగుతుంది. తనకుగానే సత్యం గ్రహించ గలుగుతాడు. ఆకసంలో మెరుపు మెరిసినప్పుడు అంతా కనిపించినట్లు ఆత్మజ్ఞానం మొత్తం సృష్టి రహస్యాలను యోగికి నివేదిస్తుంది. క్షణంలో సత్యాసత్యాలను వేరు పరచగలడు. చీకట్లను తొలగించగలడు. జ్యోతుల్ని వెలిగించగలడు. మాయా రూపాలతో తిరిగే క్షుద్రశక్తుల్ని సైతం తరిమివేయగలడు. మాయా మోహాలను తన దరికి రాకుండా చూచుకుంటాడు.

ప్రజ్ఞ పరం నుండి కాంతి వేగంతో విద్యుత్తు వలె మెత్తగా దిగివస్తుంది. స్వప్రజ్ఞతో యోగి సర్వాన్ని దర్శించగలడు. ఆ ప్రజ్ఞ శాంతిదూతగా యోగి హృదయంలో కదలాడుతూ మహద్విషయాలను ఎరుకపరుస్తుంది. భాషకు అతీతమైన సందేశం అది. సంకేతం అది. సువర్ణ పాత్ర నుండి జాలు వారే అమృతబిందువుల వలె ప్రజ్ఞ అమృతాన్ని కురిపిస్తుంది. బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తుంది. అనంతశక్తిని అందిస్తుంది.

తొలినాళ్లలో ఈశ్వరానుభూతి సకృత్తుగా కలుగుతుంది. క్షణంసేపు పారవశ్యంలో లయించి పోయినట్లు తోస్తుంది. అంతలో ప్రాపంచిక స్పృహ కలుగుతుంది. క్షణ కాలంలో ఎంతో విజ్ఞానం భావరూపంలో మనలో ప్రవేశిస్తుంది. హృదయాంతరంలో శుద్ధ సత్యం బీజంగా ఏర్పడుతుంది. అభివ్యక్తం కానిది ఏదో వ్యక్తం అయిన భావన. మరికొంత ఆత్మ ప్రశాంతి నిశ్శబ్దంగా ఏర్పడినట్లు తెలుస్తుంది. ఆ నిశ్చలత అలా కొనసాగితే జగద్రహస్యం ఎరుక పడుతుంది. జగన్మాతకు దగ్గరవుతాం. ఆ పద్ధతిలో దృశ్యాల్ని అదృశ్యాల్ని దర్శించగలం. అగోచరసీమలే జగన్నాథుని ఆవాసాలు. అంతర్దృష్టి ఏకాగ్రం కావడం ముఖ్యం. ఒక అగోచర బిందువుపై అంతర్దృష్టిని కేంద్రీకరించాలి. ఆ బిందువు క్రమంగా తేజస్సుగా మారుతుంది. ఆ తేజస్సులో అనేక రూపాలు, దృశ్యాలు కనిపించి, మనస్సు లయించి యోగి ధ్యానంలో నిమగ్నం కావడానికి హేతువులవుతాయి. అప్పుడొక కారుణ్యకామన అజ్ఞానాంధకారాన్ని చీల్చి వేస్తుంది. కరుణ రసప్లావితమైనప్పుడు పరం పరంగా లభిస్తుంది, దివ్యజ్యోత్స్న వరప్రసాదమవు తుంది.

ధ్యానం పరాకాష్టకు చేరేవరకు నిరీక్షించక తప్పదు. మనోనేత్రం ఏర్పడినప్పుడు ఊహాతీతమైన విషయాలు మనస్సులో ప్రవేశిస్తాయి. పరానికి అడ్డుగా వున్న గోడలు వైదొలగిపోతాయి. అవరోధాలన్నీ తొలగిపోతాయి. ఒక మంత్రం ఆయుధంగా, ఆధారంగా పురోగమించవలసిందే. మహర్లోకాలన్నీ సూక్ష్మలోకాలే. అవి అన్నీ సత్యసీమలే. సత్యాన్ని దర్శిస్తే తప్ప ఆత్మకు తొలి అనుభవం కలగదు. జగత్తును, ఆదిశక్తిని గ్రహించడానికి సత్యం అవసరం. వేనవేల ముసుగులు తొలగించుకుని చూస్తే తప్ప మనస్సుకు సత్యం అందదు. స్వప్నసీమలను అధిగమిస్తే తప్ప దివ్యసీమల్ని చేరుకోము. అవి శూన్యంలో దాగిన అవశేషాలు.

యోగి సంచారం ఉన్నత శిఖరాలకు, అగాధాలకు మధ్యన. ఇరుకు బాటలలో శిఖరాలపైన దృష్టి నిలపాలి. స్వర్గం, నరకం రెండూ యోగికి ఒక్కటే. జ్ఞానాగ్ని ఒక్కటే యోగిలో రగలాలి. అన్వేషణ అనంతంగా కొనసాగాలి. దివ్య సందేశాలను క్షణంలో అందుకోగలగాలి. హృదయకుహరాలను శోధిస్తుండాలి. ఋషిగా దర్శించి, తాను చూచిన సత్యాన్ని ప్రవక్తగా లోకానికి అందించాలి. ప్రతి యోగి చైతన్య ప్రతినిధి, చైతన్యానికి మరోరూపం. పరమాత్మను దర్శించిన ప్రతియోగి అమర సందేశాన్ని మానవజాతికి అందిస్తాడు.

మనిషి వివేకం ఒక అద్భుతమైన మలుపు తిరిగినప్పుడు గొప్ప స్నిగ్ధత్వం కనిపిస్తుంది. అది వెన్నెలను మించిన చల్లదనం. దృష్టిపథాలకు అందనంత దూరాన ఆత్మ గుహలోకి పయనించడం జరుగుతుంది. ఆత్మ ప్రస్థానంలో ఎన్నో జీవన తరంగాలు. అన్వేషణ, ఆత్మ పరిశోధన అనంతంగా సాగుతుంది. ఎన్నో ఆనందాలు, విశుద్ధ శక్తులు లభిస్తాయి. ధ్యానంలో ముందుకు పోయిన కొలదీ అంతా ప్రశాంతతే. అన్నీ ఆనందాలే. అన్నీ స్వాప్నిక భూములే. ఒక ముహూర్తకాలంలో ఆనందాలు, స్వప్నాలు, కాంతిపుంజాలు స్వర్గసోపానా లవుతాయి. సువర్ణ సోపానా లవుతాయి. ఆత్మ సామ్రాజ్యంలో అన్నీ పరమాత్మకు సన్నిహితాలే. కాలానికి అందని అనంతత్వం ఆ తీరాలవెంట నీడలా కదులుతుంది. అది మృత్యుంజయత్వం. అది పరమాత్మ అనుగ్రహంతో అందే తాంత్రిక శక్తి.

యోగి స్వతంత్రంగానే తాంత్రికశక్తిని సంపాదిస్తాడు. స్వతంత్రంగానే అనంతంలోకి పయనం సాగిస్తాడు. ప్రకృతి సహజమైన నిబంధనలేవీ అతని ప్రగతిని నిరోధించలేవు. ఏ ధర్మసూత్రాలు అతనికి అవసరం లేదు. స్వధర్మాన్ని మించిన ధర్మం ఉండదు. ఎన్నో సంకేతాలు కలిస్తేనే విశ్వం. కొంతకాలం భ్రమలకు లోనై, ప్రాపంచిక సుఖాలకు లోనై జీవి పిచ్చిపనులు చేస్తుంది. అదే సంసార చక్రభ్రమణం. ఆ చట్రం నుండి జీవుడు బయటపడినప్పుడు ఆత్మ జీవునికి ఆసరా ఇస్తుంది. అండగా నిలుస్తుంది. ప్రగతికి మార్గం చూపగలుగుతుంది. అన్నింటికి కార్యకారణ సంబంధం వుంది. అన్నింటిని అగోచరంగా ఉన్న ఆత్మ నిర్దేశిస్తుంది. కానీ శాసించదు. అందువల్లనే మనసున్న మనిషి భ్రమలకు లోనవుతుంటాడు. మనసు దాటిన మనిషి ఆత్మదర్శనం పొందగలుగుతున్నాడు. వాస్తవాలనిపించేవన్నీ మనస్సు కల్పించే భ్రమలే. విశ్వమేధ బహువిచిత్రమైనది. మానవమేధకు అది అందదు. ఆత్మకు సంస్కారం అలవడాలి. మానవ మేధకు విశ్వమేధకు సంధానకర్త ఆత్మ.

ఆగోచరాలను గోచరింపచేయడంలో పరమాత్మ అక్షర రమ్యతను పాటిస్తుంది. రూప, నామ, క్రియా రహితమైన మూలతత్వమేదో అగాధాలలో ఉన్నట్లు తోస్తుంది. 'ఆది' సంకల్పమే సృష్టికి మూలాధారం. విశ్వసంకల్పం ప్రకృతికి బీజం. ఆత్మ బీజమై సంకల్పం విశ్వంగా మారడానికి హేతువైంది. అందుకే విశ్వానికి వెనుక ఉన్నది ఆత్మ. అది విశ్వాత్మ. విశ్వవృక్షానికి వేనవేల కొమ్మలు, రెమ్మలు. అది రోదసీ సీమలవరకు విస్తరిస్తుంది.

సృష్టికి, జగత్తుకు సహాయంగా అనేక వాస్తవాలు రూపుదిద్దుకున్నాయి.

పరమాత్మ అదృశ్యం కాగా, మహత్తు నీడలో అమహత్తు రూపుదిద్దుకుంది. ఈశ్వరుడు సైతం రూప నామ క్రియలకు దూరంగా ఉండి భావానికి మాత్రం అందుతాడు. అనుభూతిని మాత్రం అందిస్తాడు. మానవుడు మృత్యుంజయుడు కావడం ఈశ్వరలీల. అందుకు ఆలంబనం యోగం, సాధన, సమాధి, ప్రజ్ఞ. యోగి సమాధి స్థితిలో బాహ్య ప్రపంచానికి దూరం అవుతాడు. పెదవులు కదలవు. చైతన్యమే అనుభూతి. అంతర్దృష్టితో సర్వాన్ని దర్శించగలడు. ఆత్మ దర్శనం కలిగినవానికి పరమాత్మ దర్శనం అవుతుంది. ఆత్మ ప్రవేశద్వారం. కామం నుండే కామ్యం ఉదయిస్తుంది. కామనలోంచి తీరని ఆశ తొంగిచూస్తుంది.

విధివెంట మనిషి పరుగులు తీసినంతకాలం తన స్వప్నాలకు, ఆశలకు అంతం ఉండదు. అర్థం కనిపించదు. ఆశల్ని దాటి, ఆశయాల్ని ఏర్పరచు కోవాలి. ఆత్మ శక్తితో, ఆత్మ ప్రబోధంతో జ్యోతిని ఆశ్రయించాలి. అప్పుడు అనంత పరమ మాటున అద్భుతసృష్టి రహస్యం తెలుస్తుంది. అవి చీకటిలో మెరిసే నక్షత్రాలు. సత్యం వినీల గగనంలో ఉదయించిన చంద్రుని వంటిది. ధ్యాన సమయంలోనే మాయా మోహ బంధాలు తెగిపోతాయి. తెరలు తొలగిపోతాయి. విశ్వప్రేమ హృదయంలో ప్రవేశిస్తుంది. ప్రజ్ఞ మాతృస్తన్యాలను గ్రోలి పరవశించే పసిబిడ్డవలె విధి పరవశం చెందుతుంది. యోగశక్తికి 'శాంతి' నివేదన. అమృతతుల్యమైన తపస్సులో అంతా ప్రవిమల ప్రశాంతి. కాలాన్ని అధిగమించగల సత్తా యోగికి ఏర్పడుతుంది. విశ్వ విరాట్ రూపాన్ని అంతర్దృష్టిలో దర్శించగలడు. దివ్య ప్రేరణతో రగిలిన కాంతికిరణం యోగి హృదయంలో ప్రవేశించి మానవతకు దివ్యత్వపు పూత పూయిస్తుంది. హృదయంలో త్రికోణ పీఠికపై అధిష్టించిన మహాశక్తి త్రికాలజ్ఞానం కలిగిస్తుంది. అప్పుడు భూమ్యాకాశాలు తేజోమయాలై భాసిస్తాయి.

సావిత్రి చీకటి నెలవులలో వెలుగు బావుల్ని త్రవ్వింది. అందని లోతులలో సుందర రూపాల్ని సృష్టించుకున్నది. తారలు, తీరాలు, స్వరాలు లేని గగనాలు అధిగమించి, నేల వైపుగా దృష్టి సారించింది. ఆలోచనలను అనుసంధించింది. అవి దిగంతాల నుండి నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ భూమికి దిగివచ్చాయి. ఆమె హృదయానికి శుభసందేశాన్ని అందించాయి. శూన్యంలో కదిలిన స్వప్న భావన ఆమె అభ్యంతర మందిరంలో ప్రవేశించింది. అక్కడ ఉన్నవన్నీ దివ్య సంపదలే. అంతరంగ ఉపచేతనపైన ఒక మణిదీపం వెలిగింది. ఆ కాంతిలో తన హృదయ కుహర సంపదల్ని, శక్తుల్ని గుర్తించింది. ఆ సంపదలు ఇంద్రియాలకు, ఇంద్రియ సుఖాలకు పనికిరావు. అయినా వాటిని చీకట్లు భద్రంగా రక్షిస్తుంటాయి. ఆ

శక్తులు ఎప్పుడూ చీకటిలో నిద్రిస్తుంటాయి. వాటిని ఉపయోగించగల సమర్థులు ఎప్పుడోగానీ జన్మించరు.

ఉషస్సును తమస్సు గుండెల్లోనే దాచుకుంది. అయినా తొలికిరణ ప్రసారం కోసం నిరీక్షించసాగింది. కిరణం వెంట తేజస్సు ప్రవేశిస్తుంది. లోకాల్లో వెలుగులు నింపుతుంది. ఈ కిరణాలు లోగడ అస్తమించినవే, ఇప్పుడు మళ్లీ ఉదయిస్తాయి. ఈశ్వర సృష్టిలోని ఎన్నో శక్తుల్ని, సంపదల్ని, సౌందర్యాలను జగతి ఉపయోగించు కోలేకపోతున్నది. సృష్టి కార్యంలో అవి వ్యర్థంగా మిగిలిపోయి కాలగర్భంలో కలిసిపోతున్నాయి. అలా చీకటిలోకి జారిపోయిన మహాశక్తుల్ని చీకటి దేవతలు, క్షుద్రశక్తులు తమ సొంతం చేసుకుంటాయి.

ఎన్నో సంపదలు స్వప్న పేటికలలో నిక్షిప్తమై ఉన్నాయి. మన ఆశలకు, ఆకాంక్షలకు అందని దూరాలకు అవి పారిపోయాయి. అలా నిగూఢంగా, నిక్షిప్తంగా ఉన్న శక్తులను, సిద్ధులను మనిషి ఉపయోగించుకుంటే అమరుడు కావచ్చు, మృత్యుంజయుడై శాశ్వతుడు కావచ్చు. ఆధ్యాత్మిక శిఖరాలపై వెలిగే దివ్య కిరణం, నిశ్శబ్దపు లోయలలో దాగిన ప్రజ్ఞను ప్రభావితం చేస్తుంది. అప్పుడు సత్యం విలువ తెలుస్తుంది, పెరుగుతుంది. దివారాత్రుల పరివర్తనం అప్పుడే ప్రారంభమైంది.

జీవితాశయం ఒక్కటే ప్రాపంచిక విలువల్ని పెంచుతుంది. ఒక సద్భావన, ఒక సత్య వచనం చాలు మనిషి మారడానికి, మానవ మేధస్సు ఏండ్లు పరిశ్రమించి గ్రహించే విజ్ఞానం కన్న ఒక్క జ్ఞానకిరణం మిన్న. అది సర్వాన్ని ఎరుక పరుస్తుంది. సర్వత్రా మరమాత్మ శక్తిని, ఈశ్వరలీలలను గుర్తించగల వివేకం, పరిజ్ఞానం అప్పుడు ఏర్పడుతుంది. అంతవరకు ప్రపంచంలో అన్నీ మహా విలువైనవిగా, శాశ్వతమైనవిగా తోస్తాయి.

భూమి తన చుట్టు తాను పరిభ్రమిస్తున్న ఒక గ్రహగోళమే కాదు – అది సజీవ గ్రహఖండం. నేలపైన కనిపించేవన్నీ నిర్జీవ పదార్థాలు, అశాశ్వతాలు కావు. శాశ్వతత్వానికి పునాదులు. ఏవీ నిరుపయోగంగా సృష్టించబడలేదు. వాటిని సద్వినియోగ పరచుకునే ప్రజ్ఞ మనిషికి కొరవడింది. లోకం యాంత్రికంగా సాగడం లేదు. దాని వెనుక పరమాత్మ ప్రమేయం ఉంది. పరబ్రహ్మ సంకల్పం ఉంది. ప్రతి రూపంతో పరమాత్మ అంశ, సంకల్పం, సందేశం దాగి ఉన్నాయి. కదిలే ప్రతి జీవిలోనూ పరమాత్మ సందేశాన్ని దర్శించవచ్చు. ఆత్మను దర్శించ వచ్చు. సుందరమైన ప్రతివస్తువులోను విశ్వ సౌందర్యం దాగి ఉంటుంది.

కనువిందు చేసే ప్రతి వస్తువులోనూ జీవాత్మ చలనం ఉంది. అన్ని ఆత్మలలోనూ పరమాత్మ తనను చూచుకుంటుంది. అవి అన్నీ తన ప్రతినిధులేనని మురిసి పోతుంది. ఏదీ నిరర్ధకం కాదు.

ప్రపంచంలో జరిగే ప్రతి పోరాటంలో ఘర్షణలోని అకృత్యాన్ని పరమాత్మ గమనిస్తూ ఉంటుంది. మార్మిక విద్య అజ్ఞానపు ముసుగు ధరించడమే కారణం. కనిపించని దాన్ని విధి అవసరంగా గుర్తిస్తుంది. అద్భుతమైన దివ్య సంకల్పం ఒక అదృష్టంగా మారుతుంది. మన హృదయాలలోనే మనకు తెలియని రీతిలో మహత్తు, సౌందర్యం, పారవశ్యం, బ్రహ్మానందం ఉన్నాయి. మహదానందాలను బందీలుగా చేయడం వల్లనే ఈ యాతనలు, కష్ట నష్టాలు. బ్రహ్మానందానుభూతి ఒక్కటే కాలాన్ని స్తంభింపచేస్తుంది. విధి నిర్ణయించిన రీతిలోనే దినాలు గడుస్తుంటాయి. ఆత్మ ఆలపించే మౌనగీతాలకు నిశీధిరాత్రులే శ్రోతలు. ఏదో ఒక దివ్య స్పందన హృదయాన్ని కదలించాలి. అప్పుడు మందంగా నడుస్తున్న కాలం వేగం పుంజుకుంటుంది. సూక్ష్మశరీరం దివ్యత్వాకాంక్షతో పరసీమలకు పయనిస్తుంది. మనిషి విజయానికి ఈ లోకం చాలా ఇరుకు. మనిషి అల్పత్వంపైన పరమాత్మ సంతకం చేయదు. మహదాశయంవున్న మనిషికే విలువ. ఉన్నతాశయం కలవారే ఉన్నత పథాలలో పయనించడానికి అర్హులు. వారినే పరమాత్మ అంగీకరిస్తుంది.

మనిషిగా జీవించడమే గొప్ప వరం. అనుభవాలు వరప్రసాదాలు. ఆత్మరోదసీ ప్రయాణానికి ఆయత్త పడుతుంది. ప్రపంచమే పరమాత్మ సంకల్ప సృష్టి. పదార్థంలో ఆత్మ ప్రవేశమే జీవుని ఆవిష్కరణ. ప్రకృతి పరమాత్మను తన కడుపులో దాచుకుంది. ప్రకృతిని చీల్చుకుని ఆత్మ పరమాత్మను చేరాలి.

యోగి జీవనం నిశ్చలం, నిర్మలం అయినప్పుడు ఆధ్యాత్మిక తేజస్సు సుస్నాత అవుతుంది. ఆత్మ గత ప్రజ్ఞానసీమలలో సంచరించి తేజస్సు శాశ్వతంగా తనకు అన్వయించుకుని శాశ్వతత్వం అభిలషిస్తుంది. యోగి శరీరంలోని ప్రతి అణువు భౌతిక విషయాలకు దివ్యత్వం అందించగలదు. లోకంలో ఎల్లెడలా దివ్యత్వాన్ని పరిమళింపచేయగలదు.

అప్పటికే సావిత్రి అమృతానందమయి అయింది. రెక్కలు విప్పి ఆనంద సీమలలో విహరించసాగింది. అశాశ్వతం అనుకున్న తేజస్సును తనలో శాశ్వతంగా నిలుపుకున్నది. అన్ని బలహీనతల్ని అధిగమించి సచ్చిదానందాన్ని అనుభవించ సాగింది. మనిషిలో అంతర్లీనంగా ఉన్న మహత్తులు యోగసాధన వల్ల

బయటకొస్తాయి. సాధన తీవ్రతను బట్టి యోగి ఆత్మ అజ్ఞానం నుండి విముక్తం అవుతుంది. మనస్సు, శరీరం ఆధ్యాత్మికంగా మారతాయి. పరావిద్య ఆత్మ ప్రవేశం చేస్తుంది. ప్రాపంచిక విజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతుంది. కొత్త వాకిళ్లు తెరుస్తుంది.

మనిషి మనసా, వాచా, కర్మణా యోగపూర్ణుడై, బాహ్య జీవన విధానానికి విముఖుడవుతాడు. తనలోనే కొత్త మార్గాలను అన్వేషించి, తనదైన మార్గాన్ని ఎన్నుకుంటాడు. విశ్వ చలనంతో జత కలిసి మహస్సు వైపు పయనిస్తాడు. ప్రకృతి మహాశక్తులన్నీ అతని అధీనంలోకి వస్తాయి. అరూప, అగోచర దివ్యాత్మలతో సంభాషించగలడు. సామాన్యులు చూడలేని మహర్లోకాలను, దివ్యరూపాలను అతను చూడగలడు. అరూపశక్తులకు రూపం కల్పించి దర్శించగల శక్తి సమకూరుతుంది. మహా సంకల్పం వెనక వున్న దివ్యశక్తుల్ని, దివ్యస్పందనల్ని తెలుసుకుంటాడు. కాలంలో దాగిన నిగూఢ శక్తులు, రహస్యాలు అతనికి కరతలామలకాలు. రోదసి మహాప్రబంధంలోని గతం, వర్తమానం, భవిష్యత్తు అతనికి ప్రతి పుటలోనూ కనిపిస్తుంది. విశ్వశిల్పి తన సృష్టికళా చాతుర్యం అతని పరం చేస్తాడు. అతని యత్నాలకు అంతర్జ్యోతి వెలుగు దారి చూపుతుంది. అతని ఔన్నత్యాన్ని నిరోధించగల శక్తి దేనికీ ఉండదు. అతని శరీరంలోని ప్రత్యణువు దివ్య ప్రభావానికి లోనై విధికి అసలైన అర్థాన్ని చూపిస్తుంది. మృత్యువు తర్వాతి జీవితం అందించే ఆనందాలు, శాశ్వత సౌందర్యాలు, సిద్ధించే దివ్యశక్తులు, ఆత్మోన్నత్యాలు అతను ఇక్కడే దర్శిస్తాడు, అనుభవిస్తాడు.

అందుకే ప్రపంచ సుఖాలకు, ప్రలోభాలకు అతీతంగా తన మనోలోకాలలో యోగి చరిస్తుంటాడు. పరమాత్మ ప్రతినిధిగా, ప్రతిరూపంగా అతను మానవ బలహీనతల్ని చక్కదిద్దగలడు. లోపాలను పూరించగలడు. మానవత దివ్యంగా మారడం ఒక్కటే అతని ఆశయం. ఆ మహాశక్తి ఎలా సంక్రమిస్తుందో ఎవరికీ తెలియదు. కానీ విశ్వ శక్తులన్నీ యోగికి అందివస్తాయి. దివ్యానుభవం వల్ల ప్రపంచం అల్పంగా, అశాశ్వతంగా తోస్తుంది. అతను యోగశక్తితో యుగధర్మాన్ని, మానవ విలువల్ని మార్చి వేయగలడు.

సామాన్యుల అంచనాలకు యోగశక్తి అందదు. అర్థం కాదు. అతను రానున్న పరిణామాలను, సంఘటనలను అతీంద్రియశక్తితో ముందుగానే గ్రహిస్తాడు. భవిష్యత్తుకు, మంచిమార్పుకు అనుగుణంగా అనుకూలంగా తన శక్తిని వినియోగిస్తాడు. తను కాలాన్ని, దూరాన్ని అధిగమించి శూన్యంలో జీవిస్తుంటాడు. అతను ఏకాంత జీవి. యోగ ప్రతిభ అతని జీవితం.

4. గుప్తవిద్య

యోగసాధన చేయదలచిన వారికి విషయం బాగా తెలిసి ఉండాలి. ప్రయోగాలు చేయదలచిన వారికి స్వతంత్ర ప్రజ్ఞ, ఆత్మ విశ్వాసం, ధైర్యం పుష్కలంగా ఉండాలి. అనుకరణ పనికి రాదు. తన మార్గాన్ని తాను ఏర్పరచుకున్నవాడే ముందుకు పోగలడు. గమ్యం చేరగలడు. గుప్త విద్యా రహస్యాలు తెలుసుకోడానికి ప్రాచీన భాండాగారాలు తెరవవలసిన అవసరం లేదు. గుండె తలుపులు తెరవాలి. ఆత్మజ్ఞానం ఒక్కటే యోగికి అండగా నిలుస్తుంది. అశ్వపతి గుప్త విజ్ఞాన భాండాగారం తలుపులు తెరిచాడు.

పదార్థ, భౌతిక, మానసిక మండలాలవైపుగా ఊర్ధ్వగమనం, దివ్యచైతన్యం పైనుండి దిగిరావడం – రెండు శక్తులు ఒకచోట కలవడం ... అది దివ్య విస్ఫోటనం. మన ప్రయత్నం, సాధన ఎంత ఉన్నా పరమాత్మ అనుగ్రహం లేనిది సాధ్యపడని కార్యం. పరమాత్మ సైతం బయట లేదు, మనలోనే ఉంది. ఆత్మ తలుపులు తెరుచుకొని ముందుకు పోగా పరమాత్మ స్పందన తెలుస్తుంది. మన లోపల జరిగే పని అది.

మనకు యోగపరంగా సహకరించే శక్తులన్నీ మనలోనే ఉన్నాయి. అవి ఉన్నట్లు తెలియదు. అదే అజ్ఞానం. ఉన్నవని తెలుసుకోవడమే జ్ఞానం. చైతన్యం. వాటిని అందుకొని ప్రగతికి ఉపయోగించుకోవడానికి వివేకం, ప్రజ్ఞ అవసరం. మనిషి నిస్సహాయుడైనప్పుడుగానీ దైవశక్తి అందిరాదు. ప్రకృతి ఆడించినట్లు ఆడినంత కాలం ప్రజ్ఞ బయటకు రాదు. జిజ్ఞాస కలిగి, చైతన్యం పొంది, సాధన ప్రారంభిస్తే మార్గం కనిపిస్తుంది. అంతవరకు అంతా చీకటి. అంతా మాయ. ఆలోచన నిర్మలమైనప్పుడు మాయ తొలగిపోతుంది. మహర్షుల అనుభవాలు మనకు కొంతవరకే పనికి వస్తాయి.

యోగలక్ష్యం మనం విముక్తి పొందడం కాదు.

అశ్వపతి యోగశిఖరాలను చేరుకున్నాడు. అక్కడి ఔన్నత్యాలను, మహస్సులను అందుకోగల స్థితికి చేరాడు. పరమాత్మను చేరేందుకు అనేక విధానాలున్నాయి. అవి ఉషస్సు వరకే తీసుకు వెళతాయి. ఉషోదయం తర్వాతగానీ సవితృ దర్శనం కాదు. రవికిరణం ప్రసారం కాదు. పూర్వ విధానాలలో మనం చూచేది ఉషోరేఖల్ని మాత్రమే. పరమాత్మ అగోచరం అని తెలిసీ పరమాత్మ కోసం ప్రయత్నం చేస్తాం. అగోచరాన్ని గోచరింప చేసుకోవడం సాధనా రహస్యం. అగోచరం అన్నది సామాన్యులకు. యోగసాధకులకు ఏదీ అగోచరంగా ఉండిపోదు. అన్నీ జ్ఞానదృష్టికి గోచరిస్తాయి. మానవాత్మ మహాత్మ స్థాయికి చేరితేనే పరమాత్మ స్పందన. ఆ ప్రయత్నంలో తొలిమెట్టు తపస్సు. అది పరమాత్మ కోసం పడే తపనకు ఉపాధి.

జీవుడు తన స్వప్నాలను పండించుకోడానికి మనిషి రూపానికి వస్తాడు. స్వప్నాలను వాస్తవం చేసుకోడానికి ప్రపంచంలో జీవించడం అవసరం. స్వప్నలిపిని అర్థం చేసుకోడానికి సాధన అవసరం. యోగశక్తి వాస్తవికతను చూపుతుంది. మృత్యువు దిశగా పయనించే జీవితం సర్వస్వం కాదు, యదార్థం కాదు. దాని దిశ మార్చడమే యోగం. మనస్సు మరచిపోయిన ఔన్నత్యాలను, దివ్య ప్రాభవాలను ఆత్మ సహాయంతో అందిపుచ్చుకోవడమే యోగ రహస్యం. అందుకు సాధన, శోధన, అంతఃపరిశీలన అవసరం. ఆత్మ చొరబడని అగాధాలు, ఎగబ్రాకని శిఖరాలు ఉండవు.

దివ్య జ్ఞానానికి మనిషి సమీపంగానే ఉన్నాడు. ముందుగా దివ్య జీవనం అలవరచుకుంటే దివ్యజ్ఞానం అందుతుంది. అనంతంగా వున్న మార్మిక శక్తులు అందుబాటులోకి వస్తాయి. ప్రకృతిలోని ఔన్నత్యాలన్నీ పరానికి, పరమాత్మకు సన్నిహితాలు. అన్వేషణకు అందని లోకాలవి. సాధనలో మాత్రమే చేరుకోదగిన సుందర తీరాలవి. మనకు తెలిసిన బాటలేవీ అక్కడకు చేర్చవు. మన మార్గాన్ని మనం ఏర్పరచుకోవలసిందే. పూర్వపు మార్గాలేవీ మనల్ని గమ్యానికి చేర్చవు. మన ఊహకు, విజ్ఞానానికి అందని శిఖరాలవి. ఎంతో ఉన్నతాలవి. మనలో

అజ్ఞాతంగా ఉన్నవి జ్ఞాతం కావాలి, ధ్యానంలో పునీతం కావాలి. తన్మయత్వంలో శబ్దాలు కరిగిపోగా నిశ్శబ్ద ప్రపంచంలో కళ్లు విప్పాలి. అప్పుడే మనం గమ్యాన్ని చేరినట్లు.

ఆత్మలోకి చూడడంలో విఫలమవుతుంటాం. భౌతిక స్పృహతోనే మనస్సు కొట్టుమిట్టాడుతుంది. అయినా మనం కాంతి వైపుగా పయనిస్తాం. వైఫల్యం ఉండదు. దివ్యలోకాలు, తేజస్సీమలు, ఆనందవనాలు, స్వప్నమందిరాలు అన్నీ పరమాత్మ అధీనాలు. అన్నీ పరమాత్మకు సంకేతాలే. నిరాకార నిర్గుణ స్థితిలో ఒక దివ్య స్పృహ, ఒక దివ్య స్మృతి మనలో కదలాడుతుంది. దృష్టి అంతర్ముఖ మైనప్పుడు బాహ్యజగత్తును కమ్మిన పొరలు తొలగిపోతాయి. అప్రయత్నంగా మనం సత్యపథాలలో పయనించగలుగుతాం. కళ్లకు కమ్మిన మాయ పొరలు తొలగిపోతాయి. క్షణంలో విముక్తి లభిస్తుంది. ఆ ఒక చిన్ని అనుభూతినే మహద్భాగ్యంగా గుండెలో దాచుకుంటాం. హృదయంలో పదిలపరచుకుంటాం. మన ప్రయత్నం స్వల్పం – భగవదనుగ్రహం అనల్పం.

నిర్వికల్ప ధ్యానస్థితిలో మన ఆత్మలు పరంజ్యోతిని దర్శిస్తాయి. ఆ కాంతిలో, పరాశక్తిశిఖరాల్ని దర్శిస్తాం. ఆత్మ దర్శనం వల్ల పరమ ప్రశాంతి లభ్యమవుతుంది. అఖండ సచ్చిదానంద తీరాలకు చేరుకుంటాం. ఆత్మ తనను తాను తెలుసుకునే ప్రయత్నంలో అవ్యక్త మార్మికత అవసరపడుతుంది. కొన్ని సార్లు ఆత్మకు మానవ శరీరం అవసరం. భౌతిక శరీరం ఆధారంగానే ఆత్మ తనను తాను తెలుసుకొని పరమాత్మను గుర్తిస్తుంది.

మహర్లోకాలనుండి ఒక తేజో కిరణం మన వైపుగా సాగివస్తుంది. ఆ క్షణం మనలో దివ్యత్వం పొటమరించి జీవితం వెలుగుమయం అవుతుంది. భౌతిక శరీరం నిశ్చలం, నిర్మలం అవుతుంది. స్తంభించిన శరీరమే పరమాత్మకు ఆవాసమవుతుంది. ఆత్మికశక్తి లోలోపల రగిలి పొగిలి పారలౌకిక ప్రజ్ఞ శాంతి సాగరాలై, పరలోకాల నుండి మనలోకి ప్రవహిస్తాయి. ఆ శక్తిపాతానికి, జ్వలితాగ్నికి ప్రకృతి భయకంపితమవుతుంది. మనిషి అవివేకం పటాపంచలవుతుంది. దుర్గుణాలు, అవగుణాలు కాలిపోతాయి. ఆ శక్తి మనది అని గుర్తించలేం. అపూర్వ పరిణామం మనలో చోటు చేసుకుంటుంది. దివ్య జీవనం సాగిస్తాం. కడకు మన ఆత్మే మనకు మహా గురువుగా మిగులుతుంది.

మనలను అలముకున్న అహంకారపు పొరలు ప్రిదిలిపోయి 'నేను' అన్న అహం లేకుండా పోతుంది. ఆభిజాత్యం నశిస్తుంది. ఈ జన్మకు వేరే ప్రయోజనం

లేదన్న స్పృహ కలుగుతుంది. మరో జన్మకు అవకాశం లేదన్న జ్ఞానం కలుగుతుంది. ఆ స్థితిలో ప్రకృతి మనల్ని పరమాత్మకు సమర్పిస్తుంది. లోపల దివ్య జ్యోతులు వెలిగే ఆ శుభముహూర్తంలో బాహ్యాకర్షణలు, బంధాలు, ప్రలోభాలు, స్వార్థం వదలిపోతాయి. అప్పుడు ఆత్మ ఏకాంతంగా పరమాత్మతో భాషిస్తుంది. ప్రజ్ఞాద్వారాలు తెరుచుకుంటాయి. పరసీమల నుండి దిగివచ్చిన ఒక కాంతి కిరణం, పరమాత్మ దూతగా, మహత్తులకు, మార్మికతకు ప్రతినిధిగా మన తేజశ్శరీరంతో కలుస్తుంది. మనపై, మన జీవితాలపై ఆ ముద్ర చెరగని ముద్ర. అది చిర ముద్ర.

యోగి నిమీలిత నేత్రాలలో ప్రశాంతి, విశ్వశాంతి గోచరిస్తుంది. మానవ మేధస్సు చిరకాలంగా దాచుకున్న రహస్యాలు అతని మందస్మితంలో దోగాడుతాయి. హృదయాంతర సీమలలోకి వెళ్లిన కొలది అపూర్వ అలౌకిక సచ్చిదానందాలు ఆవిష్కృత మవుతుంటాయి. అవి అన్నీ పరమాత్మ సందేశాలే, పరబ్రహ్మ సంకేతాలే. మనస్సు ఎన్నటికీ సత్యాలను గుర్తించదు. మన శ్రవణేంద్రియాలు వినలేని నాదాలను అక్కడ వినగలం. ప్రపంచం అందించలేని సుఖాలను ఆ లోకం అందిస్తుంది. అక్కడ ద్వేషం కనిపించదు. అంతా ప్రేమమయం. మనల్ని ద్వేషించే వారిని సైతం ప్రేమిస్తాం. మనం కాంక్షించేది అనంత తేజస్సు. ఆత్మ వినిపించే దివ్యనాదాలను మరీమరీ వినాలనిపిస్తుంది. యోగాగ్ని వెలార్చిన సువర్ణ కాంతి ఈశ్వర సందర్శనానుభూతిని కలిగిస్తుంది.

ఆ పరమాత్మ సందేశాలు, సంకేతాలు మన ఆత్మకు సుపరిచితాలే. అవి మనకు తెలియకుండానే మనలో ఉన్నవి. ఎప్పుడో కాని దివ్య స్పందన తెలియదు. అనేక ఒత్తిడుల మధ్య మన జీవితాలు సాగుతుంటాయి. ఈశ్వరీయత ఆత్మను ప్రభావితం చేస్తుంది. భౌతిక ప్రపంచాన్ని చుట్టిన లౌకిక మాయపొరలు చిరిగిపోయినప్పుడు ఆధ్యాత్మిక తేజస్సు బహు సుందరంగా దర్శనమిస్తుంది. అప్పుడు దివ్యత్వపు రెక్కల చప్పుడు మనస్సు వినగలుగుతుంది.

ఆత్మకూ మనస్సుకు మాత్రమే అనుభూతమయ్యే పరమాత్మ అసలు ఉన్నదా లేదా? అనిపిస్తుంది. అది శాశ్వతం, అనశ్వరం అని తెలిసినా, భౌతిక శరీర సంబంధి కానట్లు ప్రవర్తిస్తాం. ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో తెలిసిన తర్వాత ఆత్మ అర క్షణం వృధా కానివ్వదు. ఆత్మ అనుక్షణం తనను తాను అన్వేషిస్తుంది. అన్వేషణలో శరీరాన్ని మనస్సును తృణప్రాయంగా విస్మరిస్తుంది.

మనం ప్రపంచాన్ని పరిణామాన్ని గమనిస్తూ, అద్భుతాలను అవలోకిస్తూ కాలక్షేపం చేస్తాం. ఆత్మ అలా కాలయాపన చేయదు. జ్ఞానాన్ని అన్వేషిస్తుంది. జాగృత మవుతుంది. సృష్టి రహస్యం తనంతట తాను భృక్తరహితం కాదు. హృదయంలో ఒక సజీవ చైతన్యం రూపుదాల్చాలి. అది హద్దుల్ని అతిక్రమించి సరిహద్దులు దాటుతుంది.

సృష్టి రహస్యాలన్నీ శూన్యంలోనే దర్శనమిస్తాయి. అందుకు జిజ్ఞాస, అన్వేషణ, సాధన త్రివిధ మార్గాలు, త్రయీ మార్గాలు. లక్ష్యం సత్య దర్శనం. అందరి జీవితాలకు మూలమైనది పదార్థం. గమ్యం పరమార్థం. పదార్థం నుండి పరమార్థానికి ప్రయాణమే ఈశ్వరీయత. అంధకారంలో జ్యోతులు వెలగాలి, అజ్ఞానంలో జ్ఞానం ఉదయించాలి. మనిషిపై పరమాత్మ అనుగ్రహం ప్రసరించాలి. మృత్యువును జయిస్తే అమరత్వం. మనలో జ్వలించిన తపన తపస్సుగా మారినప్పుడు అది యోగం అవుతుంది. అదే ఆంతరంగికంగా మన విధిని మార్చుతుంది. మనలో దివ్య బీజాన్ని నాటుతుంది. అందుకు అవసరమైన ఆధ్యాత్మికత మనలో ఉండనే ఉంది. అది మన ఆశ్రమ జీవిత విశేషం. అదే మన హృదయాలయంలో వెలిగే జ్యోతి. ఆ జ్యోతి అంధకార కుడ్యాలను కూలదోస్తుంది. కాలాన్ని అధిగమిస్తుంది.

యోగి కనీనికలో అనంతశాంతి ద్యోతకవుతుంది. భాష వ్యక్తం చేయలేని రహస్యాలను అక్కడ తెలుసుకోగలం. అచేతనం అనిపించిన విశ్వగమనంలో చైతన్యం కనిపిస్తుంది. కాలరహస్యాలను గుర్తించగలం. అది అంతా అతీంద్రియం, నిగూఢం, మార్మికం. వాటిని దర్శించడానికి జ్ఞానదృష్టి, అంతరవలోకన అవసరం. నిగూఢ సత్యాలు తెలుసుకోడానికి అవగాహన అవసరం.

మన మేధస్సు తాత్కాలిక ప్రయోజనాలను, సుఖాలను కాంక్షిస్తుంది. అగోచరంలోకి మనస్సు చొరబడదు. అక్కడ అధికారం, హక్కు ఆత్మది. ఎవరికో ఎప్పుడోగాని అలాంటి అవకాశం రాదు. వచ్చిన ఆ అవకాశం సంకల్పంగా మారాలి. వత్తిడి ఏర్పడాలి. ఆ వత్తిడే మనలను ఆధ్యాత్మికత వైపు మరల్చుతుంది. అది కీకారణ్యం. అతి భయానకం. ఏదీ సజావుగా ఉండదు. మన జీవితం, మనుగడ ఒక పెద్ద ప్రశ్నగా మిగులుతుంది. అసలు జీవించడమే నిరర్థకం అనిపిస్తుంది. మన ప్రయత్నాలు, ప్రయోగాలు నిష్ఫలం అనిపిస్తాయి. ఆత్మ ఎక్కడో మిణుక్కుమంటుంది. మృత్యువు విసిరిన వలలో మనం చిక్కుకుంటాం. ఆ వలను ఛేదించుకుని మృత్యువును తప్పించుకోగలవారు కొందరే. మనం

నేర్చినదంతా అనుమానంగా మిగులుతుంది. మనం సాధించిన భౌతిక విజయాలు ఏవీ మనకు సహకరించవు. అవి అసలు ఎందుకు ఉపయోగిస్తాయో కూడా అర్థం కాదు. అంతా విధివశాత్తు కర్మవశాన జరిగినట్లు తోస్తుంది. మన ప్రయత్నం, ప్రజ్ఞ వాటిలో కనిపించవు. మనం ఎంత చదివినా ఒక అజ్ఞానంలోంచి మరో అజ్ఞానంలోకి పయనించడమే అవుతుంది. జీవితాంతం శ్రమించినా కడకు సమాధానం లేని ప్రశ్నగానే మిగిలి ఉంటాం.

అజ్ఞానంలో ఉన్నంతకాలం అన్నీ సందేహాలే. విధి గీచిన గీత దాటం. అవతల అన్నీ అపరిష్కృతాలే. ఎప్పుడో నిశీధి నిశ్శబ్దంలో ఆత్మ మనస్సును తట్టి లేపి ఈ శరీరం అశాశ్వతం అని హెచ్చరిస్తుంది. దానిని మనస్సు అంగీకరించదు. ఆత్మబోధ చైతన్యంగా మారి, పరంజ్యోతి వైపు మనల్ని నడిపిస్తుంది. అప్పుడు మనస్సు జోక్యం ఉండదు. ఆ ప్రబోధాన్ని వినిపించేది ఆత్మ, వినేదీ ఆత్మే, ఒకటి ధ్వని, ఒకటి ప్రతిధ్వని. మనిషి హృదయంలోని ప్రతిధ్వని అది. మనిషికి తాను ఎందుకు జన్మించిందీ తెలియదు. లోకంలో ఎందుకు మనుగడ సాగిస్తున్నదీ, ఏం సాధించవలసిందీ తెలియదు. అంతా ఈశ్వర లీల, భగవత్ సంకల్పం అని తలవంచుతాం. అది కాల గమనంలో పరమాత్మ కల్పించే విచిత్ర భ్రాంతి.

జీవుడు అనేక కాంతి సంవత్సరాలుగా అనేక జన్మలకు వచ్చి పోతున్నా అంతా చీకటి ప్రయాణం, అజ్ఞానయాత్రే అవుతోంది. అలసిపోయి చీకటిలో, అజ్ఞానంలో విశ్రాంతి తీసుకుంటాడు. కాలతీరాలవెంట పరుగులుతీసి అలసి పోతుంటాడు. తాను అన్వేషిస్తున్న పరమాత్మ తనలోనే ఉందని మాత్రం గ్రహించడు. చెవులు పనిచేస్తాయి. హృదయం పనిచేయదు గదా! అన్నీ అనుభవిస్తూ అంతా స్వయంకృతాపరాధమని, కర్మ ఫలమని వాపోతాడు. ఆత్మకు తన బాధను నివేదించుకోడు!

★ ★ ★

సావిత్రి తన బాధను ఆత్మకు నివేదించుకుంది. తనకు కర్తవ్యాన్ని నిర్దేశించమని హృదయాన్ని వేడుకుంది. మనో వికారాలను దాటి పైకిపోయింది. తనది కఠోర జీవితం. తనది యాతనామయ ప్రపంచం. అందులో ఆనందం కనిపిస్తున్నదీ లేనిదీ తెలియదు కానీ, ఏదో సంకల్పం ప్రేరణ అయి భావనగా మారింది. భాషను సైతం ఆశ్రయించింది అభివ్యక్తీకరణకు. అప్పుడు తనది బ్రహ్మానంద స్థితి కాదు, కాని అదీ ఆనందస్థితే. ఎంతటి సౌందర్యాలు సైతం ఒకసారి అనుభవించిన తర్వాత భావపరంగా అవి నశించినట్లే. ఆలోచన మనిషిని

గంభీరంగా మార్చుతుంది. లోపలి విషాదం బయటకు కనిపించకుండా గాంభీర్యం అడ్డు నిలుస్తుంది. తాను విజయం సాధించడం తథ్యం. ఔన్నత్యాలను అందుకోవడం తథ్యం. అందుకు తనలో సహనం ఏర్పడాలి. పరమ ప్రశాంతిని హృదయంలో నిలుపుకోవాలి.

అప్రతిహతంగా అజ్ఞానంతో పోరాడటం మొదటి పని. ఆత్మ విజయంతో తనకు సంక్రమించే పూర్ణత్వాన్ని నిలుపుకోవడం రెండవ పని. ఆ నిర్ణయం పరమాత్మ ఆమోదం పొందినట్లే. అపజయాల్ని అధిగమించగల ఆత్మ విశ్వాసం ఏర్పడ్డది. తన అనురాగానికి మృత్యుభయం లేదు. తనకు మరణబాధ లేదు. అన్నికాలాలలోను 'సత్యం' జయించి తీరుతుంది. ఆమెలో ఒక విద్యుల్లత, ఒక ఆశాదీపం తన కర్తవ్యాన్ని తెలియ చేశాయి. అయితే ఇంకా సత్యస్ఫూర్తి కలగలేదు. సత్యం తనకు అందలేదు. ప్రపంచ యాతనలకే ప్రాతినిధ్యం వహిస్తూ సత్యకేతనం నీడన ముందుకు సాగింది. ఏదో తెలుస్తుంది కానీ, స్పష్టంగా అవగతం కాదు. ఏవో సూచనలు మార్గాన్ని నిర్దేశిస్తున్నాయి. దివ్య స్పందనలు ఏవో హృదయాన్ని కదలిస్తున్నాయి. జాగ్రత్ స్వప్న సుషుప్తులలో తనలో మెదలవలసిన సత్యం దూరదూరంగా ఉంది. ఆ సత్యాన్ని తనలో ప్రతిష్ఠించుకోవాలి. అది అసలు తనలో ఉన్నదే. తన అలక్ష్యం వల్ల, అజాగ్రత్త వలన దూరతీరాలకు పారిపోయింది.

సందేహాలు సమసిపోయే సమయం ఆసన్నమైంది. వాయిదా పడుతున్నా మనిషిలో ఆశ, ప్రయత్నం నిర్గమించవు. మానవ ప్రయత్నంతో కొన్నింటిని సాధించడం అసంభవం. ఆమెకు అతీంద్రియ శక్తులెన్నో సంక్రమించాయి. మానసిక బలం తగ్గినప్పుడు, మానవ ప్రయత్నాలు విఫలమైనప్పుడు దైవం తన ఉనికిని చాటుతుంది. ఆమెకు అలాంటి శక్తి వచ్చింది. తనకు పరిచయం లేని భూమికలపైన నడిచింది. తనవి కాని శక్తుల్ని స్వంతం చేసుకున్నది. శూన్యంలోకి చేతులు చాపి కనిపించని దైవాన్ని అర్థించింది. విధిని, కర్మను, కాలాన్ని ప్రక్కలకు తోసి, తనకు కావలసిన దానిని పొందడానికి ఉద్యమించింది.

ఆమె వాంఛించింది భ్రమలకు లోనుకాని స్వచ్ఛమైన అంతఃకరణ, ఆత్మ స్వరూపాన్ని అభివ్యక్తీకరించగల ప్రజ్ఞ, తన లక్ష్యసాధనలో తొట్రుపడని ఆత్మశక్తి, విషాదం ఎరుగని నిర్మలానందం. ఆ దివ్యశక్తుల్ని పొందడం తన జన్మ హక్కుగా భావించింది. ఆమె వాంఛల్ని దేవతలు ఆమోదించారు, అనుగ్రహించారు. ఫలితంగా క్రాంతి దర్శనమైంది. వివేకం అందుకు సహకరించలేదు.

మన జ్ఞాన శకలాలే మనకు కరదీపికలు కావాలి, మన చర్యలకు ఆధారాలు

కావాలి. మనం వద్దని త్రోసివేసిన వాటిని మనస్సు ఆహ్వానిస్తుంది. పరప్రజ్ఞలు, సత్యాలే లోకంలో మనకు మార్మిక మార్గాలు, రాజబాటలు. ఈశ్వర విభూతులు వాటి నీడలు. కొందరే ప్రకృతిని అతిక్రమించి పరాన్ని చూడగలరు. ఇంద్రియాలు పరచిన ముళ్ళకంచెల్ని దాటి ముందుకు పోగలరు. భూ లోకంలోను, భువర్లోకం లోనూ జరిగేదంతా ఒక పథకం ప్రకారమే జరుగుతుంది. సువర్లోకం భౌతిక లక్షణాలకు పూర్తిగా అతీతం. పరమాత్మ అధీనంలో ఉంటుంది సువర్లోక సంపద.

మన అనుభవాలకు బీజాలు మనలోనే ఉంటాయి. ప్రతి సంఘటనకు మూల కారణం మనమే. మూల ప్రకృతి మనదే. విధి అనుకునేది సైతం మన కర్మకు ప్రతిరూపమే. మనం అవివేక ఫలితాలనుకున్నవీ అదృశ్యంగా విధి వేస్తున్న రేఖాచిత్రాల నమూనాలే. అగోచర ధర్మసూత్రాలే గోచరమయ్యే కర్మబంధాలు. మన జీవితాలలో జరిగే సంఘటనలు రోదసిలో, శూన్యంలో కలిగే దివ్యచలనాలు. అవి అస్పష్టంగా ఉండి మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి.

అణగి మణగి పోయిన వాస్తవాలు ఎప్పుడో గాని తిరిగి తలెత్తవు. అవి గుండెలో అడుగుపొరల్లో నిగూఢంగా ఉంటాయి. ఎవరూ ఆ చీకటి కోణాల్లోకి తొంగిచూడరు. వాటికి ఆత్మతోగల అనుబంధాన్ని తెలుసుకొన ప్రయత్నించరు. నిత్యకృత్యాలలో నిమగ్నమైన మనస్సు ప్రాపంచిక విషయాలను మాత్రమే గుర్తిస్తుంది. పరిస్థితుల కాలచక్రం క్రింద పడి నలిగిపోవడమే తెలుస్తుంది. అసలు కారణాలు తెలిసినప్పుడు ఆశ్చర్యపోతాం. అయినా భవిష్యత్తులోకి చూడగల ప్రజ్ఞ మనకున్నది.

మన ఆత్మశక్తిని మనం గ్రహించగలిగితే, అంతర్వాణి ప్రబోధాల్ని మనం వినగలిగితే, భవిష్యత్తులోకి తొంగిచూడగలం. మనలోనూ ప్రజ్ఞ పనిచేస్తుంది. పరేంగిత ప్రజ్ఞ భవిష్యస్సంఘటనల్ని చూపిస్తుంది. ఆ శక్తి మనకు సంక్రమించి నప్పుడు ఆశ్చర్యపోతాం. దానిని నిగ్రహించుకోగలిగిన వారు కొందరే. ఈశ్వర లీలలు సంకేతాలుగా మనకు ప్రజ్ఞ ద్వారా అందుతుంటాయి. విశ్వ మేధస్సు మానవ మేధస్సుతో సంబంధం ఏర్పరచుకుంటుంది. మన ఆలోచనలన్నీ భౌతిక ప్రపంచానికి పరిమితమై ఉంటాయి. ఆలోచించి, అనుభూతి చెందగల మేరకే మన వివేకం సహాయ పడుతుంది. పరమాత్మ స్పృహ మన వివేకానికి అతీతమైంది. ఈశ్వర తేజస్సు, ప్రజ్ఞ మనల్ని ఋషులుగా, యోగులుగా మార్చగలవు.

కనిపించే భౌతిక ప్రపంచమే మనిషికి అవసరం. గతాన్ని భూమికగా చేసుకుంటూ రేపును విస్మరిస్తాం. మనస్సు ప్రలోభంతో ఆత్మను బందీ చేస్తుంది.

కర్మలకు మనిషిని బానిసను చేస్తుంది. ఆత్మ స్వతంత్రిస్తే తప్ప ఎవరూ మనస్సు పెత్తనాన్ని గ్రహించలేరు. స్వతంత్ర సాధకులే ప్రజ్ఞాధురీణులు కాగలరు. మనసుది సంకుచిత తత్వం. పశుత్వానికి వారసత్వం. ప్రకృతి ఒడిలో ఉన్నంతకాలం మనిషి పసిబిడ్డే. జన్మ పరంపరను దాటి పోలేడు. ఎటుగూడి వర్తమానాన్ని అనుభవించక తప్పదు. కాని భవిష్యత్తును స్వప్నించకపోవడం దారుణం. స్మృతులలో గతం తొంగి చూస్తుంది. మనిషి చైతన్యంలో భవిష్యత్తు వంగిచూస్తుంది.

మనిషి అసలు శక్తి స్వరూపాల్ని దర్శించకపోయినా, తాను కల్పించుకున్న రూపాలకు ఆయా శక్తుల్ని ఆపాదిస్తాడు. తన కర్మఫలం వ్యర్థం కాకుండా చూచుకొంటాడు. అతనికి జ్ఞానంతో పాటు అజ్ఞానం కలిసి ఉంటుంది. కర్మ సిద్ధాంతంపై విశ్వాసంతో తన కర్మఫలాలను అనుభవించ సిద్ధపడతాడు. తన ఆలోచనలకు కార్యరూపమిస్తాడు. అసలు సాధించేదేమిటో గ్రహించడు. అది తనకు ఎప్పటికీ తెలియదు. మధ్యలోనే కాలి మసి అయ్యేదీ తెలియదు. గొప్పగా బ్రతికిన లోకంలోనే నామరూపాలు మిగలకుండా పోతాడు. తన జీవితానికి అర్థం గ్రహించక తన శక్తిని నిరర్థకం చేసుకొని జీవితరంగం నుండి నిష్క్రమిస్తాడు.

మహాత్ములు మృత్యుంజయులు కాగలరు, కాలాన్ని అధిగమించి 'పరం'లో జీవించగలరు. వారికి భవబంధాలు, భావదాస్యాలు ఉండవు. వారు సర్వ స్వతంత్రులు, స్థిత ప్రజ్ఞులు. ఇచ్ఛా సంకల్పాలతో విధిని, కర్మను దాటగలరు. విశ్వ రహస్యాలను, విశ్వరచనా చమత్కారాల్ని గ్రహిస్తారు. భగవంతుని సంకల్పం గ్రహించి కాలాన్ని శాసించగలరు. పరిణామ క్రియకు దోహదపడగలరు. పరాశక్తిని నిత్యం అందుకుంటూ లోకాన్ని ఉద్ధరిస్తారు. అతీంద్రియశక్తితో దివ్య జీవనం సాగిస్తూ, లోకపు కన్నీళ్లు, కష్టాలు సాక్షీమాత్రంగా దర్శిస్తూ, తమ శాంతి శిఖరాలపై ఉండిపోతారు. వీరు ఉరుములకు, మెరుపులకు చలించరు. కల్లోలాలకు కలత పడరు. మానవ సమాజంపై వీరివి చెరగని ముద్రలు. వీరి జీవితం మార్గదర్శకం. బోధలు నిత్య సత్య వచనాలు. వీరు విశ్వ శిల్పులై ప్రపంచానికి అతీతంగా జీవిస్తూ సృష్టిరహస్యాలను అవలోకిస్తారు. ప్రాపంచిక ప్రలోభాలకు వీరు లోనుకారు. ఆవేశ కావేషాలు వీరిని అంటవు. ఎప్పుడు ఆత్మలో జీవిస్తుంటారు. పరమాత్మ పదసవ్వడులు చెవియొగ్గి వింటారు. శబ్ద ప్రపంచం వారి ఏకాగ్రతను భంగపరచదు. ఆ స్థితికి చేరడానికి కాలపథంపైన బహుదూరం పయనించాలి. కార్యకారణాలు వెదికేవారికి, కర్మ సిద్ధాంతులకు అవి కనిపించవు. వారు అన్వేషించేది సత్యం ఒక్కటే. సత్యాన్ని అందుకునే అతీంద్రియ జ్ఞానం వారికి ఏర్పడుతుంది. వీరు

భౌతికప్రపంచంలో, లౌకికవ్యవహారాలలో సత్యాసత్యాలను విశ్లేషిస్తారు. వీరికి హృదయమే దివ్యమందిరం. చిత్తవృత్తుల్ని నిరోధించాలనుకోరు. సహజ యోగ లక్షణం అది. ఆశలు, దురాశలు, ఆశయాలు, భ్రమలు లేని నిర్లిప్త జీవనం. వీరు బాహ్య సౌందర్యానికి, రూపాలకు భ్రమసిపోరు. కర్మలకు, విధులకు తల వంచరు. కల్లోలాలకు, ఒత్తిడులకు లోనుకారు. జయాపజయాలకు అతీతులు. వారు కోరేదీ, అనుభవించేదీ ఒక్కటే... బ్రహ్మానందస్థితి.

ఈ మహాయాత్రకు ఆరంభమే కాని అంతం ఉండదు. ఆశయం ఉంటుంది కాని ఆశ ఉండదు. కాలంతో ముందుకు సాగుతూ, మన సాధన మనం కొనసాగించడమే ఉత్తమం. ఆశలు లేని వారి హృదయంలోనే పరమాత్మ ప్రవేశిస్తుంది. అజ్ఞానం గుండె పగిలి అంధకారం అలముకున్నప్పుడు మన హృదయమే మార్గదర్శి అవుతుంది.దైవశక్తి సుతిమెత్తగా మనలోపల చొరబడుతుంది. దాని రాకను ఆత్మ ఆమోదించి స్వాగతం చెబుతుంది. అప్పుడు మనలో ఒక కొత్త శక్తి ఏర్పడుతుంది. దేనిని లెక్కచేయని మొండితనం అలవడుతుంది. జీవితంలో మనకు తెలియని తృప్తి, రుచి, మాధుర్యం. ఇంతకాలం వికృతంగావున్న లోకం అతి సుందరంగా కనిపిస్తుంది. సత్యతేజస్సు ఎప్పుడు ప్రకృతిని జయిస్తుంది. భగవదంశ ప్రవేశంతో హృదయం రసప్లావితం కాగా భూమి స్వర్గంగా, జీవితం దివ్యజీవనంగా మారుతుంది. భౌతిక ప్రపంచంలో ఆధ్యాత్మికత ప్రవేశిస్తుంది. మన భౌతిక శరీరంలో మరొక దివ్యశరీరం రూపుదాల్చుతున్న భావన. ఉద్వేగం వల్ల రోజులు ఆనందమయంగా సాగిపోతాయి. జీవితం ఒక తీర్థయాత్ర అవుతుంది. మన సంకల్పమే ఈశ్వరశక్తిగా పరిణమిస్తుంది. మన ఆలోచనలు ఆధ్యాత్మిక లోచనాలవుతాయి. ఎవరికీ అర్థం కాని విషయాలు మనకు అర్థం అవుతుంటాయి. అవి సత్యానికి అద్దం పడతాయి. జాగ్రత్స్వప్న సుషుప్తులలో ఈశ్వర భావన బలపడుతుంది. చివరి క్షణం వరకు మనిషికి వర ప్రదానం జరగకపోయినా ఈశ్వరీయతలో అనుక్షణం తృప్తిగా జీవిస్తుంటాడు. ఏదైనా బలమైన నిదర్శనం కలిగేవరకు మనిషికి తనపైన తనకే నమ్మకం ఏర్పడదు.

నిదర్శనం ఒక చైతన్య ప్రతీక. దాని యదార్థత సందేహాస్పదమే. అది సందేహాలను, అనుమానాలను కలిగిస్తుంది. జీవుడు వెలుగుచీకట్ల మధ్య తచ్చాడుతూ, పూర్ణత్వం సాధించానన్న భ్రమలో ఉంటాడు. లోవెలుగుల యదార్థతను గుర్తించడం కష్టం. అది ఆదికి అంతానికి మధ్య స్థితి. అది వాస్తవానికి సత్యానికి మధ్య సంధ్యారాగం. అసందిగ్ధ మనసు పూర్ణభావనను, పూర్ణశక్తిని దూరం చేస్తుంది.

ఆద్యంతాల మధ్య శూన్యంలో సందేహం సుడులు తిరుగుతుంది, లేదా స్తంభించిపోతుంది, లేదా అంతంలేని మార్గం వెంట పరుగులు తీస్తుంది.

అంధకారానికి దూరంగా ఎక్కడో ఒక అఖండజ్యోతి వెలుగుతుంది. అది శూన్యంలో నిశ్చలంగా వెలుగుతుంది. నిజానికి అది శూన్యం కాదు. దానికి వేనవేల అర్థాలు స్ఫురిస్తాయి. తాను అగమ్యం అయినా ప్రపంచానికి గమ్యం చూపిస్తుంది. అనేకార్థాలు స్ఫురింప చేస్తుంది. నిదర్శనలు, ఫలితాలు స్పష్టంగా లేనప్పుడు అనుమానాలు, అపార్థాలు ఏర్పడి భావం కల్లోలవుతుంది. సందేశం చేరవలసిన గమ్యాన్ని చేరదు. సందిగ్ధంలో పడితే అనుకున్నదేమీ సాధించలేం. అక్షరాల మధ్య మిగిలేది కడకు శూన్యమే. ఆద్యంతరహితమైన దానికి ఆధారం ఉండదు. శూన్యంలో ప్రభవించి, శూన్యంలో లయించేదే సృష్టి. భూత భవిష్యత్తులు లేనట్లు వర్తమానాన్ని పట్టుకు వేలాడుతుంది. కాలచక్రానికి సంకల్పం ఆధారంగా ఉన్నా, నిరాధారంగానే తిరుగుతున్నట్లు తోస్తుంది.

సృష్టి అంతా నిగూఢంగా, రహస్యంగానే ఉంటుంది. సృష్టికి ఎవరూ కర్త కాదు. అది సృష్టి కర్తవ్యం మాత్రమే. దాని సంకేతాలు మార్మికంగా, అర్థంకాని వ్రాతల్లా ఉంటాయి. ఎప్పుడూ మనకు తెలియని శబ్దాలనే వినిపిస్తుంటాయి. ఉదాత్తమైన దివ్య ప్రబంధంలో ఔన్నత్యానికి ఎక్కడో రవంత ఆధారం లభిస్తుంది. మహత్తులు, సిద్ధులు, ఇంద్రజాలాలు మనిషిని ప్రలోభపెడతాయి, సమ్మోహన పరుస్తాయి. అవి ఎంతకాలం సాగినా శాశ్వతం కావు. ఎంత దూరం ప్రవహించినా ఆ నది సాగరాన్ని చేరదు. కాలం తీరాన జనన మరణాల మధ్యన ప్రవహిస్తుంది.

రెండు విరుద్ధ శక్తుల్ని, భావాల్ని ఒక్కటిగా చేయడం మన కర్తవ్యం. అవి ఎన్నటికీ కలవని వాటివలె, భిన్నధృవాల వలె, సమాంతరంగా పోతుంటాయి. మనం కల్పించుకున్న శూన్యాన్ని మనమే పూరించుకోవాలి. ఈ లోకపు ఎల్లలను దాటి అపరిమితంతో మనస్సును జతపరచాలి. మనస్సుకు భౌతికతతో అనుబంధాన్ని ఏర్పరచుకోవాలి. ఆత్మ పురోగమన మార్గాన్ని సుగమం చేయాలి. వస్తు వివేచనతో రహస్య అనుబంధం పునరుద్ధరించుకొని, హృదయంలో దివ్య భావనలు నింపుకోవాలి. పూర్ణత్వాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకొని అక్షరప్రపంచాన్ని ప్రణవంతో నియంత్రించాలి. అప్పుడే ప్రకృతి ఆత్మ ఏకం కాగలవు. మార్మిక విశ్వవిపంచికి అవి ప్రధాన తంత్రులు.

ఏ సంకేతాలకు అందనిది ఆకాశతత్వం. అది శూన్యం అనిపించినా మహత్వపూర్ణం, తేజోపూర్ణం. అది సువర్ణ ప్రకాశం. ఆ శూన్య ప్రకాశ రోచిస్సులను

మన నేత్రాలు భరించలేవు. ఆత్మ ఒక్కటే దానిని భరించి, ధరించగలదు. ఈశ్వరీయభావన ఒక్కటే ఆత్మని పరిశుద్ధం చేయగలదు.

గాయపడిన హృదయాలు పరమాత్మను అన్వేషిస్తాయి, పరమాత్మ ఒడిలో సేదతీరాలనుకుంటాయి. విషాదం స్థానంలో ఆనందం, నైరాశ్యం బదులు ఊరట పొందుతాయి. దివ్యత్వం ప్రవేశించగానే బ్రహ్మానందంలో సర్వాన్ని మరచిపోతారు. ఆత్మజ్ఞానంతో ఆత్మశక్తిని పెంపొందించుకోవడంతో జీవితం ప్రశాంతమవుతుంది. అంతా ఈశ్వరేచ్ఛ అవుతుంది. పరమాత్మ సందేశాన్ని అనుక్షణం అందుకుంటూ అదే దైవశాసనంగా స్వీకరిస్తారు. వారికి వేరే చేరవలసిన గమ్యం, సాధించ వలసినదేదీ కనిపించదు. కాలానికి కట్టుబడక స్వతంత్రంగా జీవిస్తారు. సాధనతో గమ్యం చేరతారు. పవిత్రజీవనమే వారికి వరం. ఇతరత్రా ఆరాధనలు, పూజలు అవసరం లేదు. వారికి అసలు అవసరాలే ఉండవు. వాటికోసం ఆరాధించవలసిన పని ఉండదు. ఏ దేవతలు కరుణించి వరాలివ్వవలసిన పని లేదు. పాప పుణ్యాల ప్రమేయం ఉండదు. కనుక భయాలు వారిని అంటవు. తమని బెదిరించే శక్తులకూ తలవంచరు. రోషాలకు, దోషాలకు కడుదూరం. వారు సత్యానికి రక్షకులు, ఆత్మ సంరక్షకులు. తమ అచంచల సంకల్పానికి వారే ధర్మకర్తలు.

సర్వ సమర్పణమే వారికి వజ్రాయుధం. అనంతశక్తి పూర్ణమైన 'త్వమేవాహం' భావన వారిని సదా రక్షిస్తుంది. అదే జ్ఞానమార్గం, అదే జ్ఞానయోగం. నిద్రలో జీవిస్తున్నట్లు నిశ్చలంగా ఉంటారు. గ్రహాలవలన బాధలు వారికి అంటవు, వారి ప్రశాంతిని భంగపరచవు. ప్రగతిని నిరోధించవు. విధి విలాసాలను మృత్యువు గమనిస్తుంటుంది. వారు విధిని దాటినవారు కనుక మృత్యువు వారిని పట్టించుకోదు. వారు తన పరిధిలోకి రారని మృత్యువుకు తెలుసు. విధికృత్యాలు ఎంత విపరీతంగా, భయంకరంగా వున్నా వారు చలించరు. తమని తాము విశ్లేషించుకోగలరు. వారే ఈ లోకానికి ఆధారం. లోకం మనుగడకు వారే ఆధారం.

వాంఛలకు, వాసనలకు, పతనాలకు అతీతులు కనుక వారు మహాశక్తి వంతులవుతారు. తాము నిశ్చల సమాధిలో ఉంటూ భూమి భారాన్ని మోస్తారు. వారి జ్ఞానం అజ్ఞానాన్ని తరిమివేస్తుంది. వారిది ఆత్మజ్ఞానం... వారు ఆగ్రహిస్తే లోకం కష్టాలపాలవుతుంది. అట్టడుగు స్థాయి నుండి ఉన్నత శిఖరాలకు నెమ్మదిగా చేరుకోవాలి. సంకుచితత్వం పోయి విశాల దృక్పథం అలవడాలి. సమాజంలో

‘ఏకాంతం’గా మిగలాలి. ఏకాంతంలో ప్రశాంతిని సాధించగలిగినవారే విశ్వ శాంతిని నెలకొల్పగలరు. అనంత శక్తులకు జ్ఞానమే అవాసం, కేంద్రబిందువు.

కన్నీటిని జయించిన వారు మృత్యువునూ జయిస్తారు. జ్ఞానం పొందిన వారు నరకంవైపు చూడనవసరం ఉండదు. కాలాన్ని ఆత్మసాయంతో అధిగమించిన వారికి కష్టాలు, బాధలు ఉండవు. సుఖదుఃఖాలకు అతీతంగా ఉదాత్తంగా జీవిస్తారు. నశించే వాటిలో వారికి ఆసక్తి ఉండదు. పాపాలు చేయరు. ఆత్మశక్తితో గమ్యాన్ని చేరడమే వారి ఏకైక లక్ష్యం. దివ్య జీవనమే ప్రమాణంగా, సత్య సమ్మతంగా జీవిస్తారు కనుక, ఆత్మశక్తికి దివ్యశక్తి తోడుగా నిలుస్తుంది. జీవితం నిస్తేజం నిరుపయోగంగా అనిపించినా అందులో మంచిని మాత్రం స్వీకరిస్తారు. మహాత్ముల జీవనశైలి సామాన్యులకు అర్థం కాదు. యోగి నిగూఢ శక్తులను సంపాదిస్తాడు. గుప్త విద్యా రహస్యాలు తానుగానే గ్రహిస్తాడు. ఒకరు బోధించవలసిన అవసరం ఉండదు. ఒరులు ప్రసాదించవలసిన పని లేదు. అంతా స్వార్జితమే. అంతా సాధనా ఫలమే. ఏది సహజమో, అవసరమో, ధర్మమో అతని హృదయానికే తెలుస్తుంది. క్షణిక భోగాలు, సుఖాలు అతనిని ప్రలోభపెట్టవు. భయాలు, కారుణ్యాలు అతనిని అంటవు. సృష్టి రహస్యాలు ఛేదించి మహాజ్ఞానం పొందాలని అనుకోడు. భగవంతునితో సైతం రాజీ పడడు.

తన లక్ష్య సిద్ధికోసం ఎదురు చూస్తుంటాడు. క్షణం క్షణం అదే నిరీక్షణం. అతని కున్నది ఒకే ఆసరా – ఆత్మ. కాలం సాగుతున్న కొద్దీ అదే బాటలు నిర్మిస్తుంది. ప్రకృతి మహదాశయానికి ఎప్పుడూ తోడ్పడుతుంది. తనలో దివ్యత్వం ప్రవేశించిన తర్వాత అసలు పని ప్రారంభమవుతుంది. మన శక్తికి, ఊహకు మించిన మహత్కార్యాలను అప్పుడు చేయ గలుగుతాం. విధికి లోబడి జీవించినంత కాలం అపజయం, మృత్యువు మనిషిని అపహాస్యం చేస్తూనే ఉంటాయి. ఆ దివ్యశక్తి ఎప్పుడు మనలో ప్రవేశిస్తుందో మనకు తెలియదు. అదే మనల్ని ఆదుకుంటుంది, రక్షిస్తుంది, ముందుకు నడిపిస్తుంది, మార్గం చూపిస్తుంది. మనల్ని జారిపోనీయదు. నిరాశపాలు కానీయదు. చివరకు ఫలితాన్ని అందిస్తుంది. దానిని విధి, కర్మలు మార్చలేవు. ఒక్కసారి మనలో ప్రవేశించిన చైతన్యం తిరిగి జారిపోదు. చేజారిపోదు. ప్రతి ఆత్మ ఆరాటాన్ని పరమాత్మ గుర్తిస్తుంది. మృత్యువును జయించడం ఒక్కటే మానవుని ప్రథమ కర్తవ్యం, అంతిమ లక్ష్యం కావాలి.

మనిషి చేసే తప్పులే భగవంతునికి అనుకూలంగా మారతాయి. మన బలహీనతల్ని తన కార్య నిర్వహణకు సోపానాలుగా చేసుకుంటాడు. మన కష్టాలు,

కన్నీళ్లు, విచారాలు, విషాదాలు భగవంతునికి ఉపయోగిస్తాయి. మన అజ్ఞానంపై దివ్యజ్ఞానం ఎప్పుడూ విజయం సాధిస్తుంది. మన రూపాలు, సౌందర్యాలు ఏవైనా, మన కర్మలు ఎలాంటివైనా చివరకు నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు మనలోకి దివ్యభావన ప్రవేశిస్తుంది. ప్రాపంచిక ద్వంద్వాలను దాటి ఏకోన్ముఖంగా మనం ఆలోచన సారించ గలిగిననాడు పరమాత్మ అనుగ్రహం పొందగలుగుతాం.

ప్రతిమనిషికి నిర్దేశించిన ఒకరోజు ఉంటుంది. ఆనాడే అతనికి దివ్యస్పృహ కలుగుతుంది. దివ్యత్వం అతనిలో బీజం నాటుతుంది. అంతకాలం చేసిన తప్పుల్ని ఆత్మ క్షమిస్తుంది. అంతదాకా దూరంగా పారిపోయిన సద్గుణాలు, సద్భావనలు తిరిగి అతన్ని చేరతాయి.

అజ్ఞాత శక్తులు అంతర్గతంగా తమ పనిని ప్రారంభిస్తాయి. ఒకసారి ప్రారంభమైన దివ్యకార్యం మధ్యలో నిలిచిపోదు. మనలోని సద్గుణాలన్నీ పరమాత్మ ఆశీస్సులకు, ఆజ్ఞలకై ఎదురు చూస్తుంటాయి. మన సంకల్పం అజ్ఞానంపై వారధి నిర్మించి, ఆవలి తీరాన ఉన్న జ్ఞానానికి చేర్చుతుంది.

మన సాధనను బట్టి ఆత్మశక్తి ఉన్నత శిఖరాలను చేరుతుంది. భగవంతుని గూర్చిన సత్యాలు తెలుస్తుంటాయి. అనుభూతి అంచున ఈశ్వరత్వం ఉంటుంది. చీకటి కొనలపై మెరిసే మెరుపులు సత్యాన్ని ఆవిష్కరిస్తాయి. సత్యాన్వేషణ ఎప్పటికీ అంతం కాదు. ఆ అన్వేషణ ఆనంద సీమలలోనే సాగుతుంది. ఈ ప్రపంచం ఒక సురుచిర, సుపరిచిత స్వప్నం అనిపిస్తుంది.

స్వర్ణ శిఖరాల నీడలో రాక్షసత్వం దాగి ఉంటుంది. ప్రకృతి ఎదలో కదిలే చైతన్యం మనం గుర్తించలేక దేవతా మూర్తుల్ని ఆరాధిస్తాం. ఒకే భావనకు అనేక రూపాల్ని కల్పించుకుని ఆరాధిస్తాం. విధికి తలవంచుతాం. బాధ్యతల నుండి తప్పుకోవాలని, ప్రకృతి నుండి దూరంగా పారిపోవాలని ప్రయత్నిస్తాం.

★ ★ ★

సావిత్రి ఈ విశ్వ రహస్యాలను అవగతం చేసుకుంది. ముసురుతున్న చీకట్ల ఆంతర్యం గ్రహించింది. శిఖరాగ్రం నుండి చూస్తే క్రిందివన్నీ కనిపిస్తాయి. ఆమె ఆధ్యాత్మిక శిఖరాన్ని అధిరోహించి అన్నింటినీ స్పష్టంగా చూడగలిగింది. పరిణామం తొలి మలుపు నుండి ఆమె సర్వం గ్రహించింది. దివ్యత్వం కొలువు తీరిన శిఖరాల పైకి ఆత్మ ముందుగా ఎగిరిపోవాలి. అక్కడ సర్వం జగన్నాథమే. దేనికదే విశిష్టం. దేనికదే ఉన్నతం. ప్రతి ఆత్మ పరమాత్మ ప్రతిరూపమే.

పారమార్థికత వల్లనే వాటికి మనుగడ, మార్మికత. పరమాత్మ తాను అవ్యక్తంగా ఉండి వ్యక్త ప్రపంచ ఆవిర్భావానికి కారణమైంది. పరమాత్మ తాను కనిపించకుండా, కనిపించే ప్రపంచాన్ని గమనిస్తుంది.

జగన్మాత ఈ జగన్నాటకానికి కర్త. ఆమె ఆడించే ఆటలో, నాటకంలో ఒక్కొక్క జీవి భూమిపైన అవతరించి తన పాత్ర పోషించి నిష్క్రమిస్తుంది. జీవి అంధకారంలో ఉంటూ అజ్ఞానంతో లోకంలోకి రావడం వల్ల, జ్ఞానాన్ని గుర్తించదు. అసలు జ్ఞానం ఒకటి ఉన్నదని తెలుసుకోదు. ప్రాణానికి యిచ్చిన విలువ ప్రజ్ఞకు, శరీరానికి యిచ్చిన విలువ ఆత్మకు ఇవ్వదు జీవి.

జగన్మాత లక్ష్యం గుర్తించేవారు కొందరే. అలా గుర్తించినవారు తాము పరమాత్మ ప్రతిరూపాలమని, ప్రతినిధులమని భావిస్తారు. సత్యసంకేతాలను అందుకోగలుగుతారు. పరమాత్మ సంకేతం కాలానికి అందనిది. ఆలోచనలకు అందనిది. రూపాలకు అతీతం. అది అతీంద్రియ ప్రజ్ఞ. జగన్మాత తనకు కావలసిన శక్తిని పరం నుండి గ్రహించి పరాశక్తి అయింది. పరమాత్మ అనుమతి పొందింది. ప్రకృతి తన మాయతో, మంత్ర తంత్రాలతో పరమాత్మను మాయ చేసింది. కనిపించకుండా అడ్డు నిలిచింది. ప్రకృతిని తొలగిస్తేనే పరమాత్మ దర్శనం లభిస్తుంది. పరమాత్మ లక్ష్యాలనే ప్రకృతి తన ఆశయాలుగా మార్చుకుని తానే సర్వస్వం అన్న భ్రాంతిని కలిగించింది. పరమాత్మ, జగన్మాత వేరువేరన్న అభిప్రాయం ఏర్పడడానికి ప్రకృతి మాయ కారణం.

జగన్మాత సృష్టించిన జీవజాలంలో పరమాత్మ తన శక్తిని, అంశను ప్రతిష్ఠించింది. ఆ అంశను ఆత్మ సహాయంతో గానీ గుర్తించ వీలుకాదు. పరమాత్మ బహుకొద్ది మందిలోనే తన అంశను చూడగలుగుతుంది. తానే సృష్టికి మూలం, ఆది అయినా, సృష్టికర్త తాను కాదు. సృష్టికి మూలం తానుగా మిగలడం వల్లనే ప్రతిజీవి మళ్లీ మళ్లీ జన్మించవలసి వస్తోంది. పరమాత్మను గుర్తించిన వారికి మాత్రం పునర్జన్మ లేకుండా పోతోంది. పరమాత్మ నిర్మితమైన లోకంలో లోకేశుడు తానే, దృశ్యం తానే, ద్రష్ట తానే, నడిపిస్తున్నదీ తానే, నటిస్తున్నదీ తానే, తెలుసుకునేవాడు తానే, తెలుసుకోవలసింది తననే. స్వప్నం తానే, సత్యం తానే. తాను ఒక్కడే. అనంతవిశ్వానికి అంతరాత్మ తను. అంతరంగం తను. జ్ఞానంలోనూ, అజ్ఞానంలోనూ ఉన్నది తను. ఇది విచిత్రమైన ద్వంద్వం. ద్వంద్వాతీతం కావడం అవసరం.

చీకటి వెలుగులు రెండు కాదు. రెండూ ఒక్కటే. చీకటి లేకపోతే ఉండేదంతా వెలుగు. వెలుగు లేకపోతే ఉండేదంతా చీకటి. అలాగే సరాగ విరాగాలు, సుఖ దుఃఖాలు ... ఒకదానితో ఒకటి కలిసే ఉంటాయి. ఒకదాని లోంచి రెండవది ఏర్పడుతుంది. ఏదీ వాస్తవం కాదు. ఏదీ భ్రమ కాదు. సృష్టి రహస్యం అభేద్యం. కంటికి కనిపించేది యదార్ధం. యదార్ధం పదార్ధమయం. కనిపించిన మేరకు సమస్తం వాస్తవం అవుతుంది. జగన్నాటకంలో దర్శకునిదే ప్రధానపాత్ర. కాని పోషించే పాత్రలు వేరు వేరు.

పరమాత్మ తాను ఆత్మగా, జగన్మాత కృతిని 'ప్రకృతి'గా మార్చి సృష్టిని నడుపుతున్నాడు. మన పాత్ర పోషణ వరకు మనకు తెలుసు. మొత్తం నాటకం ఎలా రక్తి కడుతుందో మనకు తెలియదు. మన భావాలు ప్రకృతి పురుషుల శ్వాసలు. ఆ జగన్మాత ఆంతర్యం మనకు అవగతం కాదు. ఆమె కరుణ, ఉద్ధతి మనకు రుచి తెలియదు. ఆమె ప్రేమ, ప్రజ్ఞ హృదయస్థం. జగన్మాత మహాసౌందర్యం లోని కొంత అంశను మాత్రమే మనం చూచి తరిస్తాం. దివ్యత్వం సైతం భూమిపైకి కొంచమే దిగివస్తుంది. పరమాత్మ తన విశ్వాత్మను, అనంతత్వాన్ని, ప్రశాంతిని వదులుకొని జగన్మాతకే ప్రాధాన్యం ఇచ్చాడు. తనను విస్మరించినా ఫరవాలేదు. ఆమె ఔన్నత్యానికి తాను పరవశమై, ఆమెలోనే తనను చూసుకుంటాడు. సృష్టి సౌందర్యంలో, అమ్మ అనురాగంతో తన ప్రశాంతిని జత పరచి, తాను నిష్క్రమిస్తాడు.

ఈ లోకాలు, పరలోకాలు అన్నీ తనవే అయినా, తానే సృష్టికి మూలం అయినా, విశ్వంపై సర్వాధికారాలు ఆమెకు ఇచ్చివేశాడు. ఆమె కార్యనిర్వహణకు తాను సాక్షి మాత్రమే. జగన్మాత వ్యవహారాలలో తను జోక్యం చేసుకోడు. పైగా ఆమె సృష్టిలో తన అంశను ఆత్మగా ప్రవేశపెట్టి ఆమె సంకల్పానికి చేదోడై, అన్నింటికి దివ్యత్వం కలిగించాడు. లోకం ఆమెకు అనుకూలంగానే సాగుతుంది. ఎక్కడో, ఎప్పుడో గాని పరమాత్మ జోక్యం కనిపించదు. ఆమె తనకన్న ఉన్నతమనే అభిప్రాయం కలిగించాడు. ఆమెను స్మరిస్తే, ధ్యానిస్తే చాలు తనను ధ్యానించినట్లే. తన సర్వాన్ని ఆమె పరం చేశాడు. ఆమె ప్రేమ, అనురాగం తనకు చాలు. తాను విశ్వ ప్రేమికుడు. తన పట్ల ఆమె అనుగ్రహమే తన సర్వస్వంగా భావించాడు. జీవుల ఆత్మశక్తిని ఆమె ద్వారానే పెంపొందిస్తాడు. ఆమె సన్నిధితో తను ఆరాధకుడుగా మెలుగుతూ, సన్నిహితంగా ఉంటూ ఆమె అనురాగానికి

మురిసిపోతాడు. ఆమె కటాక్షవీక్షణాలతో ఎనలేని తృప్తి పొందుతాడు. ఆమె దేవి .... తాను భక్తుడు.

ఆమె వీక్షణలో అమలినానందం పొందుతాడు. ఆమె పెదవులు దాటి వచ్చిన పలుకులు పరవశం కలిగిస్తాయి. తాను ప్రతిపనికి ఆమె పైనే ఆధారపడి ఆమె కారుణ్యం తన అదృష్టంగా భావిస్తాడు. ఆమె మందహాసాలు తనకు ప్రజ్ఞానిధులు. ఆమెను వేయి విధాల, వేయి రూపాల సేవించడం, నుతించడం తనకిష్టం. ఆమె సంకల్పమే తనకు రక్ష. ఆమె లీలలకు తానే అవధి, ప్రతినిధి. తాను లీలామానుష విగ్రహుడు. విశాల విశ్వం యావత్తు పరమాత్మ, జగన్మాత... ఇరువురే. అన్ని ఖగోళాలను, నక్షత్రాలను ముడివేస్తున్నది వీరే. రెండుగా ఉన్నది ఒక్కటి కావడమే సంయోగం. రెండు మూడుగా మారడం సృష్టి. పరమాత్మ అనురాగం, ప్రేమ జగత్తుకు ఆలంబన. ఆయన చర్యలు జగన్మాతకు ప్రీతికరాలు. తాను ఆమెతో నిశ్చింతగా ఉంటాడు. ఆమె వర్తనకు నృత్యానికి తన హృదయాన్ని వేదిక చేస్తాడు. ఆమె మనందరి హృదయాలలో నిత్యం నర్తిస్తూనే ఉంటుంది. మనలోని దివ్యశక్తి మాత్రమే దానిని భరిస్తుంది. ఆ మహదానందాన్ని ఎవరూ వదలుకోరు.

పరమాత్మను సైతం జగన్మాత శాసిస్తుంది. ఆయన భావాలు, కార్యాలు ఆమె నిర్ణయించినవే అవుతాయి. పరమాత్మ స్వస్వరూపం, జగన్మాత సర్వస్వాన్ని ప్రతిబింబించే దర్పణం.ఆమె ప్రోత్సాహ, ప్రోద్బలాలు పరమాత్మకు చరణ కమలాలు. ఆమె అవ్యక్త శాసనాలనే హృదయపూర్వకంగా ఆమోదిస్తాడు. ఆమె స్పర్శతో మానవ జీవితం పులకిస్తుంది. ఆత్మగతంగా పరమాత్మ సంకల్పంతో పయనించడమే జగన్మాత పని. ఆయన మార్గంలో తను, తన బాటలోనే ఆయన పయనిస్తుంటారు. ఆమెకు తాను అంతేవాసి, ఆమె ఆనందోత్సాహాలకు తాను సాక్షి. ఆమె పుణ్యకార్యాలలో తను సమభాగి. ఆమె అనురాగాలకు తాను వారసుడు. ఆమె కృతులపై తన ఆమోద ముద్ర ఉంటుంది. పరస్పరాశ్రితులుగా అనురాగంతో, ప్రేమతో లోకాన్ని ముందుకు నడుపుతారు. మన కళ్లకు అవేవీ కనిపించవు. మన వివేకానికి తెలియవు. అంతా అయోమయం. ప్రకృతి కృత్యాలన్నీ మహాద్భుతాలే.

పరమాత్మ ఆమోదంతోనే జగన్మాత తన ధర్మాన్ని ప్రపంచంలో ప్రతిష్ఠిస్తుంది. ఆమె ఆనందమే మన ఆత్మకు ఆనందం. మనల్ని కదిలించేది ఆమె ఔన్నత్యమే. మనల్ని రక్షించేది ఆమె శక్తి. నీరవ నిశ్శబ్దంలో మన హృదయాలు ఆమెను

వినగలవు. ఆ ప్రశాంతతే మనలో ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగిస్తుంది. జగన్మాత ఊపిరులే మన ఆత్మశక్తి చాలనలు. ఆమె సంబరాలే మన జీవితాలకు సొబగులు, సోయగాలు. మనం లబ్ధిపొందినా, నష్టపోయినా ఆమె కారణంగానే. మన మంచి చెడులకు, ఇష్టాయిష్టాలకు ఆమె కారకురాలు.

ఈ సుందర సామ్రాజ్యాన్ని ఆమె స్వయంగా నిర్మించుకుంది. ఈలోకం ఆమెది. పరమాత్మ సైతం ఆమె నిర్మిత రూపాలలో ఆమె నియమాలు పాటించాలి. చైతన్యం ఆమె ఒడిలో కదిలే పసిపాప. అయినా ఆమె ప్రయోగాలకు పరమాత్మ సంకల్పమే ఆధారం. కాలానికి, రూపానికి ఆమె కట్టుబడి ఉంటుంది. మనస్సుకు ఆమె పరిమితమై ఉంటుంది. విధి, కర్మలకు ఆమె లోకం కట్టుబడి ఉంటుంది. అజ్ఞానం, యాతన, మృత్యువులతో ఆమె ఆటాడుతుంది. ఆ ఆటలో మైమరచిన వారెవరూ పరమాత్మను గుర్తించరు.

సృష్టిలోని ప్రతి అణువులో ఈశ్వరాంశ ఉంది. సృష్టి క్రియకు ఈశ్వరత్వమే హేతువు. సర్వం నశించినా ఈశ్వరీయత నశించదు. జన్మకు జన్మకు మధ్య విరామ సమయంలో జీవుడు అమరత్వం వైపుగా పయనిస్తుంటాడు. జగన్మాత కారుణ్యమే జీవుని చీకటినుండి వెలుగు వైపుగా నడిపిస్తుంది. అందుకు చేయూత నిస్తుంది. జగన్మాత అనుగ్రహం పొందడానికి ఎవరైనా ఆత్మసమర్పణ చేసుకోవలసిందే. అదీ ఐచ్ఛికంగా జరగవలసిన పని. మన ఆత్మ చింతన ఆమెకు నివేదన కావాలి. అజ్ఞానం, అంధకారం విశ్వవ్యాప్తం. అంధకారం తొలగినా అజ్ఞానం తొలగదు. అది అర్థం కాని సృష్టి రహస్యం. మనిషి తనకు నిర్దేశించిన పథంలోనే నడుస్తాడు. అంతా భగవంతుని నిర్ణయం అనుకుంటూ అడుగు ప్రక్కలకు వేయడు. స్వతంత్రించని వారికి పరమాత్మను చేరే అర్హత లేదు.

జగన్మాత తనకు నచ్చిన రీతిలో మనిషిని ఆడిస్తుంది, లాలిస్తుంది, పాలిస్తుంది. మనిషి స్వతంత్రించడాన్ని జగన్మాత అంగీకరించదు. స్వతంత్రంగా వ్యవహరిస్తేనే చైతన్యం కలుగుతుంది. ప్రపంచానికి అవతలి తీరం అమరత్వం. మనిషి కాలంచేతి కీలుబొమ్మ. ఆవైపు చూడడు. దేహాన్ని దేవాలయంగా భావించి భౌతికతకు విలువలు యిచ్చినంత కాలం, మనిషి జనన మరణాల మధ్య ఊగిసలాడుతుంటాడు. అమరత్వం గురించి కలలు కంటాడు తప్ప, అందుకై ప్రయత్నించడు. అతని ప్రయత్నాలను జగన్మాత అనేక రూపాలలో అడ్డుకుంటుం దని భయం. తనను కాదన్న వారిని భగవంతుడు శపించడు. స్వతంత్రించగల వారిని ప్రోత్సహిస్తాడు. ఆపైన ప్రయాణం పరమాత్మ దిశగా. తనకోసం వచ్చేవారికి

ఆటంకాలు కలిగిస్తే పరమాత్మ తనను బంధిస్తాడని జగన్మాతకు తెలుసు. మన హృదయంలో పరబ్రహ్మ భావన ప్రవేశమే దుస్తరం. ఆ పైన దానిని నిరోధించే శక్తులు సృష్టిలో లేవు.

జగన్మాత బహురూపి, మాయామోహిని. ఎప్పుడు రూపం ధరిస్తుందో మనకు తెలియదు. ఆమె మాయరూపం ధరిస్తే ఆ రూపంలోనే ఆమెను పరమాత్మ బందీని చేయవచ్చు. తాను అరూపంగా ఉండీ పరమాత్మ ఆమె ప్రతిచర్యను గమనిస్తుంటాడు. ఆయన సంకల్పమే ఆమె కర్తవ్యం. తన లక్ష్యం మేరకు ఆమె ప్రవర్తించేటట్లు చేస్తాడు. పరమాత్మ సంకల్పానికి అవరోధాలుండవు. పరమాత్మను చేరదలచిన వారికీ అవరోధాలుండవు. పరమాత్మను చేరడానికి పరాశక్తి అనుగ్రహం కావాలి, ఆమోదం కావాలి. ఆమె శక్తితోనే ఆమెను జయించాలి. ఆమె సర్వస్వం అని స్తుతించాలి. పరమాత్మ ఆ పని చేస్తాడు. ఆమె శాసనాన్ని మనిషి ఆమోదిస్తున్నట్లు నటిస్తూ ఆత్మ జాగృతం కాగానే స్వతంత్రిస్తాడు. మానవ హృదయంలో పరమాత్మ ప్రతిష్ఠితం కావాలి.

జగన్మాత అనుశాసనం అనుల్లంఘనీయం. పరమాత్మ సైతం ఆమె ఆడించినట్లు ఆడతాడు. చేతి కీలుబొమ్మలా ఉంటాడు. కదలించినట్లు కదులుతాడు. కలల్లో కదలికలాంటిది పరమాత్మ స్పందన. విధి గీసిన వలయంలో నర్తిస్తుంటాడు. ఆమె ఆగ్రహిస్తే వణికిపోతాడు. అనుగ్రహానికి పరవశిస్తాడు. మనిషి ఎంత వివేకం ప్రదర్శించినా, కాలానికి బానిస కావలసిందే. మన ఆలోచనలకు కర్త ఆమె. లోకరీతి అనుశాసనం. ఎంతటి శక్తి ఉన్నా ఆమె నీడన బ్రతక వలసిందే. మన సంకల్పం విధిని మార్చగలదు. మన దుఃఖాలను తొలగించ గల శక్తి ఆమెదే. ఆమె అధికారాన్ని భగవంతుడే తలదాల్చాడు. వరాలు ఇచ్చినా, శపించినా ఆమె మనిషి బాధల్ని తన స్పర్శతో తీర్చగలదు. అన్ని అనుభవాలలోనూ భగవంతుని స్పందన కనిపిస్తుంది. జగన్మాత సంకల్పం మన హృదయాల్ని అనురాగరంజితం చేస్తుంది. అనుక్షణం మనం బ్రహ్మానందాన్ని అనుభవించగలం.

పరమాత్మకు ఆమె కృతులన్నీ పరమాద్భుతాలే. ఆమె కారుణ్యజలాలలో తను జలకాలాడి పరవశిస్తాడు. విశ్వలీలా వినోదక్రీడలో అలసట ఉండదు. ఆమె ప్రతిభావన, క్రియ తనకు ఆనందదాయకమే. ఆమె చేసే ప్రతిపనికి తను ఆమోద ముద్ర వేస్తాడు. ఆమె కోరిక మేరకే తాను ప్రవర్తిస్తాడు. ఆది బ్రహ్మమే పరబ్రహ్మ. పరమాత్మ అనేక రూపాలకు తన అణువుల్ని ఆత్మలుగా మార్చి యిస్తాడు. ఆపైన మిగిలేది అనంతత్వం. కాలంలో అనేక రూపాలుగా పరమాత్మ

అవతరిస్తూ పరిమితంగా సృష్టి క్రియ నిర్వహిస్తుంటాడు. సృష్టికి మూలమైన పరాశక్తి మనలోనూ ఉన్నది. అదే మనల్ని నడిపిస్తుంది. సృష్టిలోని ప్రతి అణువులోను పరమాత్మ అంతర్గతంగా వుంది. అన్నింటిలోకి మానవ శరీరమే పరమాత్మకు యిష్టం. సర్వజగత్తు ఆయన విలాసమందిరమే. ఆయన మహత్తుల ప్రదర్శనకు లోకం ఒక ప్రదర్శనశాల. అన్నీ తెలిసి, పరమాత్మ మన అజ్ఞానం ఆమోదిస్తుంటాడు. తాను దివ్యుడై, సకల రూపాలలో చరిస్తుంటాడు. తాను శాశ్వతుడై ఉండి కాలానికి, విధికి కట్టుబడి ఉన్నట్లు భ్రమ కలిగిస్తాడు. అమరుడై ఉండి అనునిత్యం మృత్యువుతో పోరాటం సాగిస్తాడు. తానే చైతన్యంగా మారి మనిషి అజ్ఞానంలో ప్రవేశిస్తాడు. ఆనందంగా అవివేకంలో చొచ్చుకుపోతాడు.

ఈ యాతనామయ ప్రపంచంలో ప్రవేశించి సుఖదుఃఖాలను సమంగా అనుభవిస్తూ, అనుభవసారాన్ని ఆస్వాదించి ప్రాజ్ఞుడవుతాడు. ఆ ప్రజ్ఞే లోకాలను పాలిస్తుంది. అదే సూక్ష్మాంశగా మనలో ప్రవేశిస్తుంది. అది మహత్తర శక్తిగా, మహాశక్తిగా మారుతుంది. నిరాకారుడు, నిర్గుణుడు, నిరంజనుడైన పరమాత్మ తన శక్తిని శూన్యం నుండి గ్రహిస్తాడు. ఆ శూన్యతలోనే పరాశక్తి నిరాకారంగా, నిర్గుణంగా నిద్రిస్తుంది. ఆమె యోగక్రియకు కాలమే ఆలంబనం. అదే పరమాత్మకు నిర్వికల్ప సచ్చిదానంద స్థితి.

నిరాకార, నిర్గుణ, నిర్వికార, నిరంజనుడైన పరబ్రహ్మ ప్రశాంతంగా శూన్య రోదసిలో ప్రవేశించి 'ఆత్మ' ఆధారంగా అనేక జీవులకు ప్రాణదానం చేస్తాడు. అందరిలో తన అంశను ప్రవేశింప చేసి, సమస్త విశ్వానికి అధిపతి అవుతాడు. విశ్వం తానే, కాలం తానే. రెండింటికీ అతీతుడు తను.

నిరాకార, నిర్గుణ, నిర్వికార పరబ్రహ్మ మూర్తి మనలో ఉంటూ, మనలో పరమాత్మను ఆత్మగా చేసి నిగూఢంగా ఉంటూ, ఈ అసమగ్రతను ఆనందంగా భరిస్తూ, నశించే శరీరాన్ని, నశింపు లేని తనకు ఆవాస యోగ్యం చేసుకున్నాడు. మానసాంతఃకరణలో ఇమిడిన పరబ్రహ్మతత్వం, మనిషిని తనంతటి వానిగా చేయాలని ఆశిస్తుంది, ప్రోత్సహిస్తుంది. ఆ మహదాశయంతోనే అదను చూచి మనిషిలో దివ్యత్వం ప్రతిష్టించి, మనస్సును, శరీరాన్ని అందుకు యోగ్యంగా పునర్నిర్మిస్తాడు. భౌతిక శరీరాన్ని దివ్యావతరణకు యోగ్యం చేస్తాడు. అల్పజీవులకు అనంతత్వ ప్రాప్తి. అనంతత్వానికి, అమృతత్వానికి ఆలంబన అవుతుంది.

ఎప్పటికైనా భువి దివి కాక తప్పదు. ఏదో ఒక మలుపు మనిషిని దివ్యపథగామిని చేస్తుంది. మనిషి పరమాత్మ ఋణం తీర్చుకునే ఏకైక మార్గం

అది. పరబ్రహ్మ ఆశించినట్లు మన స్వభావాలు దివ్యత్వం చెందాలి. మనం పరమాత్మ అంశతో జన్మించినవారం కనుక పరమాత్మిక సంపదను అనుభవించే హక్కు ప్రతి ఒక్కరిదీ ఉంది. పరమాత్మ అనుగ్రహంతో నెలకొన్న కారుణ్యం మనకు దివ్యత్వం కలిగిస్తుంది. మనల్ని మార్చగల శక్తి పరమాత్మదే. అంతలోనే మనం అంతా భ్రాంతి అనుకుంటాం. ఆత్మకు అటు పరమాత్మ ఇటు జీవుడు భ్రాంతి అనిపిస్తారు. జీవితం ఎంత సుదీర్ఘమో అంత నిరర్థకం అనిపిస్తుంది. ఆ నిరాశకు కారణం పరమాత్మ స్పర్శ కలగక పోవడం. పరమాత్మ ఎప్పుడూ మన జీవిత గవాక్షాలకు ఆవలనే నిరీక్షిస్తుంటాడు. స్వాగతం చెప్పనిదే లోపలకు రాడు.

నశ్వరమైన దేహంలోనే అనశ్వరమైన పరమాత్మ 'దేహి'గా ఉంటుంది. జీవితంలో జరిగే సంఘటనలన్నింటికీ మనస్సు కారణం కాదు. మనస్సుకు అందని రీతిలో కొన్ని కొన్ని సంఘటనలు జరుగుతుంటాయి. అవి అతీంద్రియ దివ్య శక్తి ప్రేరణలు. పరమాత్మ మన శరీరానికి, మనస్సుకు అందనంత ఎత్తుగా జ్ఞానాన్ని భద్రపరుస్తుంది. తాను సృష్టించిన లోకంలోనే తచ్చాడుతూ, ఏదో పోగొట్టుకున్నట్లు వెతుకుతుంటాడు. అది తనలోని ప్రజ్ఞ, తనదైన ప్రజ్ఞ. తను మరచిపోయిన మహాసంపద. చీకటిలో జ్యోతి కోసం అన్వేషిస్తాడు. జ్యోతిని వెలిగిస్తే కదా చీకటి పారిపోయేది? ఆత్మ మందిర సౌందర్యాలు ఆస్వాదించగలిగేది!

పరమ నిగూఢమైన సత్యాలను, మన ఆత్మలోనే ఆత్మతోనే అన్వేషించాలి. ఆ అన్వేషణలో తెలిసే మొదటి రహస్యం – అంతా బ్రహ్మమయం అని. బ్రహ్మమే సర్వం తానే అయినాడని, నానా రూపాలలో ఏకరూపిని దర్శించడమే సత్యసాధన. అనేక రూపాలలో వివిధ శక్తులుగా విభాగితం అయిన మహాశక్తి ఒక్కటే. అదే పరాశక్తి. సృష్టిలో లీనం అయిన తనను తాను పరమాత్మ అన్వేషిస్తే, మనిషి తనలో తాను అన్వేషించి, తన ఆత్మనే తాను దర్శించాలి. అది సాధన. విశ్వవిరాట్ స్వరూపానికి వేయి ముఖాలు, సహస్రదళాలతో వికసించిన పద్మం అది.

పరాశక్తి అయిన జగన్మాతతో పరమాత్మ ఒప్పందం అది. ఆమె పట్ల అనురాగంతో, ప్రేమతో సహజీవనం సాగిస్తూ కాలంతో కలిసి అనంతయాత్ర చేస్తుంటాడు పరమాత్మ. అది సహజీవన రహస్యం. దాంపత్య రహస్యం. ఆమె వృత్తులకు తల ఊపుతూ, ప్రవృత్తులకు తలవంచి, ఆమె చాపల్యాలను సైతం ఆనందంగా భరిస్తాడు. ఇద్దరివి వేరు వేరు గమ్యాలు. అయినా లక్ష్యం ఒక్కటే. కాలాతీతంగా గమనిస్తే వారివి వేరు వేరు దృక్పథాలు, లక్ష్యం ఒక్కటే. పదార్థం

ఆధారం, పరం ధ్యేయం, గమ్యం. సృష్టించబడిన రూపాలలో తన ప్రతిబింబాన్ని చూస్తూ అంతరార్థాన్ని విశ్లేషించి జగన్మాత పరమ లక్ష్యాన్ని ఊహిస్తాడు. ఆమె లీలలకు ఏదో అర్థం, పరమార్థం కనిపిస్తుంది. దారీతెన్నూలేని నిగూఢ అంతస్సాగ రాలపై పయనించే నావికుడు తను. చుక్కాని పట్టేది తనే. పరమాత్మ తాను సర్వజ్ఞుడై, నిరంతరం అన్వేషిస్తూ ఉంటాడు. సాధన చేస్తుంటాడు. అది విశ్వయోగం, ఆయన విశ్వయోగి.

నియతిగా సాగే ప్రపంచంలో అన్నీ ఒక క్రమంగా ఉంటాయి కనుక వాస్తవాలనిపిస్తాయి. మార్పు కనిపించదు. మనం గమనించేటంత వేగంగా పరిణామం ఉండదు. గమ్యం అగమ్యం అయినా అగోచరాలు గోచరాలు. జీవన వాహిని నిశ్చితంగా సాగినా, మనిషి నిశ్చింతగా ఉండలేడు. విధి మనిషిని నిర్దేశిస్తుంది. మనిషి విధిని ధిక్కరిస్తాడు. యుగ యుగాలుగా సాగే జీవన వాహినిపైన కొన్ని మజిలీలు మనిషి ఏర్పరచుకుంటాడు. కొన్ని రేవులు తానుగా ఏర్పరచుకుని విశ్రమిస్తాడు. మనస్సు ఎదురు తిరిగితే ఆవలి తీరాలను చేరవచ్చు. ఒకే తీరంలో రేవులు, మజిలీలు ఎన్ని ఉన్నా ఏం ప్రయోజనం? ఆవలి తీరం చేరడానికి సాహసం కావాలి!

ఏదీ ప్రపంచానికి ఆవలి తీరం కాదు. అన్వేషణకు ముగింపు ఉండదు. ఆలోచనలు క్షణంసేపు విశ్రమించవు. ఆత్మానుభవాలకు అలసట ఉండదు. అంతం ఉండదు. పూర్ణత్వం ఎప్పుడూ అసంపూర్ణమే అనిపిస్తుంది. సుదూర తీరాల నుండి కొత్త సందేశం వినిపిస్తుంది. కొత్త సంకేతం కనిపిస్తుంది. అప్పటికది మహాభి నిష్క్రమణం. అప్పటికి అదే మహాప్రస్థానం.

పరమాత్మ ప్రతినిధి మనిషి. కాల ప్రవాహంపై పయనించే నావికుడు మానవుడు. విశ్వంలో జీవిస్తూ విశ్వరహస్యాలను శోధిస్తాడు, అన్వేషిస్తాడు. పరమాత్మ అశాశ్వతమైన నశ్వరమైన ఈ దేహాలలో ప్రవేశించి తన రహస్యాలను వాటిలో దాచి పెడతాడు. చివరికెప్పుడో మనిషిని ఒక శిఖరానికి చేర్చి, తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు.

ఇది సాహసయాత్ర. ఇది అనంతయాత్ర. ఆరంభంలో అంతా అజ్ఞానం, అయోమయం. అజ్ఞానం కారణంగా సృష్టి రచనా చమత్కారాలు, అందాలు తెలియవు. తను నడిపే పడవ ఓటిదనుకుంటాడు. జ్ఞానం పొందినప్పుడు పడవను మరచి తన సమర్థతపై విశ్వాసం పెంచుకుంటాడు. భయం వల్ల సముద్రం లోపలకు పోడు. తీరాలలోనే నెమ్మదిగా ప్రయాణం సాగిస్తాడు. సాగరఘోషలకు కలవర

పడతాడు. తీరం వెంట పోతూ ఆ చిరు అందాలకే మురిసిపోతాడు. ఆవలి తీరాన అచుంబిత సౌందర్యాలు ఉన్నాయని తెలుసుకోడు. అక్కడ అనాఘ్రాత పుష్పాలెన్నో ఉన్నాయి. ఇవతలి తీరం వెంట ఎంతదూరం ప్రయాణం చేసినా, అవతలి తీరం చేరడం అసంభవం. ఆవలితీరాల నుండి మరో ప్రపంచం రమ్మని పిలుస్తుంది. వెళ్లే సాహసం చేయడు. ధైర్యం ఉండదు. ఊహలలో పరసీమల్ని దర్శించి మురుస్తుంటాడు. ఏవేవో రూపాల్ని చూచి వారే దివ్యజీవులని భ్రమిస్తాడు. తాను చూడనిది వాస్తవం కాదని, ఏవి కనిపించినా అవే 'పర'మని భ్రమపడతాడు.

మనం నడిపే నౌకల ప్రయోజనం పరిమితం. ఇదొక వ్యాపారం. సముద్ర మధ్యలో వున్న ద్వీపాన్ని చేరినప్పుడు గానీ అగోచర తీరాన వెలిగే జ్యోతులు కనిపించవు. అప్పుడు కొత్త లక్ష్యం ఏర్పడుతుంది. ఆవలి తీరాన ఉన్నవి కళా సంపదలు, సుందర శిల్పాలు. దూరం నుండి దర్శించి ప్రయోజనం లేదు. ఆవతలి ఒడ్డుకు చేరినప్పుడే, వాటిని మన సొంతం చేసుకోగలం.

శిలా తోరణాలు ఎన్ని దాటినా, సాగర గర్భంలో సాహసయాత్రకు ధైర్యం చాలదు. దైన్యం. వీడదు. అగోచర సీమలలో చొరబడే సంయమనం ఉండదు. ప్రయత్నించినా మధ్య తుఫాను బీభత్సాలకు తట్టుకోలేక, గాలి తీవ్రతకు ఎటో కొట్టుకుపోతాడు. కొత్త రేవులకు చేరుకుంటాడు. వివేకంతో పయనించే వారికి, చుక్కాని పట్టేవాడు తోడు దొరుకుతాడు. చుక్కాని లేని పడవ ఎప్పుడూ గమ్యం చేరదు. నక్షత్రాలనే దిక్సూచిగా, ఆకాశం వెలుగులు ఆసరాగా పయనిస్తే గమ్యం చేరడం సులభం. ధైర్యసాహసాలు నావికునికి అవసరం.

సాహసం ఏ రంగంలోనైనా విజయాన్ని సాధిస్తుంది. అగోచర సీమలకు, భూమికలకు సైతం సాహసి చేరగలడు. అంతర్లోకాలను సైతం సులభంగా చుట్టి రాగలడు. మన అన్వేషణ ఫలితం మన ప్రయత్నంలోనే ఉంది. మన సాహసంలోనే ఉంది. కాలానికి కట్టుబడి ఉన్నంత కాలం అన్నీ కష్టాలే. స్వతంత్రించినప్పుడే పురోగతి. స్వతంత్రించిన వారి జీవన శైలి మారిపోతుంది. పూర్వ వాసనలన్నీ మాయ ముసుగులు. అవి జారిపోక తప్పదు. ప్రాపంచిక సరిహద్దులు చెరిగిపోయినప్పుడే దివ్య విపంచి సుస్వరాలు వినిపిస్తాయి. దివ్యత్వం మనల్ని ముంచివేస్తుంది.

యోగి భౌతిక బంధాలను వదలించుకోగలగాలి. భౌతిక భావనలు, ఆశలు వదలి పెట్టాలి. లోకపు సరిహద్దులకు చేరి పరం పైకి దృష్టిని సారించాలి. పరాన్ని దర్శించగల అంతర్దృష్టిని పెంపొందించుకోవాలి. తాను కాలయాత్రీకుడు,

మహర్లోకాలు చేరడం తన లక్ష్యం. పరానికి తాను చేరువైన కొద్దీ దివ్య సంకేతాలు కనిపిస్తాయి. దివ్య నాదాలు వినిపిస్తాయి. శూన్యంలో సుందర దృశ్యాలు దర్శనమిస్తాయి. అదొక దివ్య ప్రపంచం. భవ్య ప్రబంధం.

ఆత్మకు మరణం ఉండదు. ఆత్మకు అజ్ఞానం అంటదు. అయినా ఆత్మ అన్వేషిస్తుంది. నిరంతరాన్వేషణ అమృతతుల్యం. అది మృత్యువును దరిచేరనివ్వదు. ఆత్మ తనను తాను సదా అన్వేషిస్తుంది. అంతర్దృష్టికి అనేక నిగూఢ రహస్యాలు తెలుస్తాయి. మానవ శరీరం భౌతికం. అందులో ప్రజ్ఞ పరిమితం. అవధులు దాటి పరిధుల్ని అతిక్రమించాలి. అప్పుడు జీవుడు క్రాంతిని దర్శిస్తాడు. కాల తరంగాలను కాంతి తరగలుగా మార్చుకోగలడు. మనస్సు వెన్నెల కురిపిస్తుంది. పొరలు విడిపోతాయి. స్వాప్నిక తేజస్సుకు మాయపొరలు విడిపోతాయి. మహర్లోక తీరాలు స్వాగతిస్తాయి.

జీవుడు భావ లోకాలు దాటి భవ సాగరాలపై ప్రయాణం సాగిస్తాడు. ఇంతకాలం భావ లోకాలలో విహరించాడు. భౌతిక నావపై పయనించాడు. ఆధ్యాత్మిక కాంతిలో తిరిగాడు. ప్రాపంచిక అలజడుల్ని, శక్తుల్ని ప్రలోభాల్ని క్రమంగా అధిగమించి, అగోచర అగమ్య భూమికల్ని సైతం దాటి మహదాకాశం క్రింద మరో ప్రపంచాన్ని దర్శిస్తాడు. భౌతిక ప్రపంచం ఛాయ కూడా కనిపించదు అక్కడ. దృశ్య ప్రపంచం కనుమరుగై అతి సుందర అదృశ్య ప్రపంచాన్ని చేరినట్లు, లక్ష్యాన్ని చేరుకున్నట్లు. తాను ఏ గమ్యం వైపు పయనిస్తున్నదీ ఎవరికీ గుర్తుండదు. ఏ తీరాన్ని చేరుతున్నదీ తెలియదు. అసలు జగన్మాత సంకల్పం ఏదో, పరమాత్మ సందేశం ఏమిటో తెలియని అగమ్యస్థితి. జగన్మాత సంకల్పాన్ని పరమాత్మ తన సంకల్పంగా చేసుకున్నప్పుడు పరమాత్మకు వేరే సంకల్పం ఉండదు. శూన్యమే గమ్యం అవుతుంది. అది మనకు అ-గమ్యం అనిపిస్తుంది.

ఈ మార్మిక గ్రంథాన్ని చదివినప్పుడు గానీ తెలీదు. ప్రతి పుటలోనూ అద్భుతాలే. తాను ఏ తీరానికి చేరిందీ అప్పుడు అవగతమవుతుంది. అంతదాకా మహా శూన్యం. పరలోకంలో తనది దివ్యశరీరం, దివ్యాత్మ. అంతా దివ్యమే. పరమాత్మ సన్నిధిలో తానొక దివ్యాణువు. తానొక మహా తేజస్సు. తన నశ్వరతను అనశ్వరం చేసుకుంటాడు. ఈలోగా కాలం సాగిపోతుంది. యుగాలు గడుస్తాయి. తాను పయనించే నావ కల్లోల సాగరాలలో నిలిచిపోతుంది. రోదసీ తరంగాలు దాడిచేస్తాయి. ఎన్నో ప్రమాదాలు ఎదుర్కోవాలి. కాని దివ్య స్పృహ ఒక్కటి

ముందుకు నడిపిస్తుంది. జనన మరణాలు అధిగమించడం జరుగుతుంది. జాగ్రత్ స్వప్న సుషుప్తులు ఒక్కటవుతాయి.

ప్రకృతి రూపంలో జగన్మాత తనకు అండగా నిలుస్తుంది. ఆ శక్తి తనను మార్గం తప్పనీయదు. విరామం, విశ్రాంతీ ఉండవు. మహాయాత్రకు అంతం ఉండదు. మనిషి ఆత్మను క్రమ్మిన మాయ తెరలు తొలగినప్పుడు జ్ఞానోదయం అవుతుంది. ప్రకృతి ధర్మానుసారం మనిషి జీవితం సాగుతుంది. పరమాత్మ జగన్మాత రూపాలు వేరు, కార్య నిర్వహణ ఒక్కరే. పరబ్రహ్మ విశ్రమిస్తే, జగన్మాత ఆయన హృదయస్థగా ఉంటుంది. జగన్మాత మరచినా పరమాత్మ మరచిపోడు. పరమాత్మ లేకుండా మనిషికి మనుగడ అసంభవం. మనిషి తెలుసుకోవలసింది ఎంతో ఉంది. ఆ ప్రేరణ పరమాత్మదే. జగన్మాత సృష్టి వాస్తవం. పరమాత్మకృతి మార్మికం. జగన్మాత సృష్టిలో వినోదం ఉంది. ఆమె నాటకానికి ప్రయోజనం ఉంది.

జీవునితోనే జీవనం కలసి ఉంటుంది. జగన్మాత సంకల్పంలోనే జగల్లీలా వినోదం మిళితమై అంతర్లీనంగా ఉంది. సమాధి స్థితిలో చైతన్యం జ్వలించి, ఆత్మ జ్యోతిని వెలిగించి, పరబ్రహ్మ పథానికి వెసులుబాట కలిగిస్తుంది. జగన్మాత తన జ్ఞాన కిరణాలతో అంధకారాన్ని తొలగిస్తుంది. మనిషికి పరబ్రహ్మ స్పృహ కలిగిస్తుంది. అవసరమైన శక్తుల్ని ప్రసాదిస్తుంది. మార్మికశక్తుల ప్రవేశంతో మనిషిలో దివ్యత్వం ప్రవేశిస్తుంది. పరమాత్మ తను నిశ్చలంగా ఉంటూ ఆత్మను తన ప్రతినిధిని చేశాడు. భావ శూన్యంలోనే బ్రహ్మానందం లభిస్తుంది.

5. రాజయోగం

ఆత్మ స్వతంత్రించి ఉన్నత పథాలలో పయనించడం రాజయోగం. అశ్వపతి రాజయోగి. తనదైన మార్గంలో స్వతంత్రంగా సాధన చేశాడు. ఆత్మ దర్శనం పొందాడు. అంటే ఆత్మ చైతన్యం కావడం మొదటి దశ. ఫలితాలు పొందడం రెండవ దశ. పరిణతి పొందడం మూడవ దశ. అశ్వపతి ఈ మూడు దశలు దాటినవాడు. అశ్వపతి మొండిగా, ధైర్యంగా చీకటిలో ప్రయాణం చేశాడు. లోతులకు వెళ్లాడు. శూన్యస్థితిని చేరుకున్నాడు. శూన్యంలో ప్రశాంతి, ఆత్మశాంతి లభించాయి. అనుభవాలు దాటి నిజనిశ్చల స్థితికి చేరాడు. ప్రాపంచికతను పూర్తిగా వదలి 'దీపశిఖ' వలె ఆతని ఆత్మ పైకి లేచింది. దివ్య శిఖరాలను చేరింది. మధ్యలో లక్ష అవరోధాలు ఏర్పడ్డాయి. వేటికీ భయపడలేదు. వేటినీ ఖాతరు చేయలేదు. వాటంతట అవే తొలగిపోయాయి. ఆ పైన అవే సహకరించాయి.

పైకి వెళ్లిన అశ్వపతి ఈ లోకాన్ని మరచిపోయాడు. మనస్సు విస్మరించడం కాదు. ఆత్మ ఆ స్థితిని దాటి పైకి పోయింది. దివ్యత్వం అతనిని ఆవహించింది. భూమి పైన నెలకొని ఉన్న అజ్ఞానాన్ని తొలగించాలని ఆతని నిర్ణయం. అతను ఒక విచిత్ర లోకం చేరాడు. అది స్థితి. అనేక మహత్తులు, శక్తులు అందాయి. అంతర్‌శక్తి ఆది పరాశక్తితో చేతులు కలిపింది. అంతర్లోకాలన్నీ కనిపించాయి. అక్కడ తెలియనిది ఏమీ లేదు. అంతా దివ్యజ్ఞానమే. ఆధ్యాత్మిక సోపానాలు ఆరోహణకే కాదు, అవరోహణకూ పనికొస్తాయి. అక్కడ సృష్టి ఉంది. అక్కడ పరమాత్మ సౌందర్యం ఉంది.

ఆ దశలో అతనికి సృష్టి రహస్యాల పట్ల ఆసక్తి పెరిగింది. యోగ విభూతి వల్ల కలిగిన జిజ్ఞాస వేరు. ఇది ఆధ్యాత్మిక పరిణామం కలిగించిన జిజ్ఞాస. తనకు అవసరమైన శక్తి యోగసాధన వల్లనే సమకూరింది. తన యోగ శక్తిని మొత్తం మానవజాతి ఉద్ధరణకు వినియోగించాలని నిర్ణయించుకున్నాడు.

పరమాత్మను గురించిన జిజ్ఞాస మానవునికి కలిగింది. ఆలోచనకు, అంతర్దృష్టికి మధ్య తెర తొలగిపోయింది. తేజస్సు ముందుకు దారి చూపింది. దివ్య దృష్టి అన్నది ఒక దిగుడు బావి. దాని ప్రక్కన ఒక మార్మిక గుహ. దానికొక రహస్యద్వారం. ఆ గుహలోకి ప్రజ్ఞా విహంగాలతో ప్రవేశించాలి. అక్కడి దివ్య తేజస్సులో సర్వం వివృతమవుతుంది.

మన నమ్మకాలను, విశ్వాసాలను పూర్తిగా వదలి పెట్టాలి. మనస్సుపైన ఎలాంటి బరువులు ఉండకూడదు. సత్యం అనేది ఒక్కటే వాస్తవం. ప్రపంచంతో మనల్ని ముడివేసిన మానసిక బంధాలను, అనుబంధాలను పూర్తిగా తెంచుకోవాలి. భౌతిక ప్రపంచపు ధర్మాలన్నీ అక్కడ ప్రతిబంధాలవుతాయి. దేహ ధర్మాలు ఏవీ ఆత్మశక్తికి నిరోధాలు కావు. జీవ స్పందనలు నిలిచి పోయినప్పుడు మృత్యువు తొంగిచూస్తుంది. శ్వాసను నిమంత్రించి ఆలోచనల్ని నియంత్రించిన యోగి మృత్యువును జయిస్తాడు.

అలా చేసినప్పుడే యోగసమాధి. కొద్దిమంది మాత్రమే ఆ సమాధి స్థితికి చేరగలరు. చిత్త వృత్తుల్ని నిరోధించినప్పుడు మన బలహీనతలు తెలుస్తాయి. దివ్య శక్తులు, మహత్తులు అప్పుడు గ్రహించగలం. దివ్య మందిర ద్వారాలు ఎల్లప్పుడు మూతబడే ఉంటాయి. ఆ మందిరంలో సృష్టి రచనా రహస్యాలు దాగి ఉంటాయి. అక్కడనే సనాతన ధర్మసూత్రాలు ఉన్నాయి. అక్కడే చరాచర జీవరాశి చరిత్రలున్నాయి. అక్కడనే విశ్వ ధర్మాలు, వాటికి భాష్యాలు ఉన్నాయి. తారల, గ్రహాల చలన సూత్రాలు అక్కడనే నిగూఢంగా ఉన్నాయి. అవే మనల్ని శాసిస్తుంటాయి, నడిపిస్తుంటాయి. అవి మన విధుల్ని సైతం నిర్దేశిస్తాయి. అవి అన్నీ సంకేతాలుగా ఉంటాయి. అక్కడే లోక చరిత్రకు మూలాధారాలున్నాయి. జీవుని హృదయ ఫలకం పైన ఆత్మకు, పరమాత్మకు మధ్య గల సంబంధాలు మార్మిక లిపిలో ఉల్లేఖించబడి ఉంటాయి.

అది చైతన్య మందిరం. అది ఆత్మ సంబంధి.

ఆ తొలి వెలుగులో, క్రాంతి నీడలో దాగిన రహస్యాలు అన్నీ సంకేతాలే.

ఆ హ్రస్వ లిపిని చదవడం తెలుసుకోవాలి. జీవుడు ప్రపంచ బంధాల నుండి విముక్తి పొందడం ఎలాగో తెలుస్తుంది. ప్రకృతి మత్తు నుండి, భౌతిక మగత నుండి ఆత్మ మేల్కొని పరమాత్మను వేయి రూపాల దర్శిస్తుంది. ఆ సంకేతాలు, సంక్షిప్త లిపి ఒక పట్టాన అర్థం కావు. వాటిని విశ్లేషించడానికి పరేంగిత ప్రజ్ఞ అవసరం. వాటికి ఎవరి ప్రజ్ఞను బట్టి వారు నిర్వచనాలు యిస్తుంటారు. అంతరార్థాలను వెదికి, భావాలను విశ్లేషించి, అర్థంకాని పదాలను, సమాసాలను శోధించి, సత్యాలను పరిశోధించాలి. ఆ మహత్తర కార్య నిర్వహణకు నియమ నిష్టలకన్న స్వతంత్ర దృక్పథం అవసరం. స్వీయ ప్రజ్ఞ, దార్శనికత అవసరం.

లోకంలో అసంభవాలనుకున్నవి జగన్మాత అనుగ్రహంతో సంభవాలవుతాయి. అందుకు మొదట దేవతలు అడ్డు నిలుస్తారు. ఆటంకాలు కల్పిస్తారు. జగన్మాత యోగనిద్రలో వాటిని గమనిస్తూ, సృష్టిలోని సుఖదుఃఖాలను, వైరుధ్యాలను అనుభూతిస్తుంది. అనేక రూపాలుగా అవతరించి అన్నింటిని తాను అనుభవిస్తుంది. తానే జిజ్ఞాస కలిగించి సత్యసాధనకు ఆమోద ముద్ర వేస్తుంది.

మృత్యువు నీడలో మనిషి జీవితం సాగుతుంది. మనిషిగా జీవిస్తూ, బ్రహ్మానందం పొందాలన్నది ఆకాంక్ష. అన్నీ ఆత్మ ద్వారా నెరవేరుతాయి. ఆత్మ ఆకాశతత్వంలో చేరి కాంతి లోకంలో 'ఆత్మ శరీరం' సంతరించుకుని పరతత్వాన్ని గ్రహించ వలసి ఉంది. అలా ఆధ్యాత్మికంగా పురోగమించే వారికి పరమాత్మ నిశ్చల మనస్సును అనుగ్రహిస్తుంది. బాటను నిష్కంటకం చేస్తుంది. పరమాత్మ సందేశం సదా వినిపిస్తుంది. విశ్వ ప్రేమకు అదే ఆరంభం. తనను సంపూర్ణ మానవుడుగా, దివ్య మానవుడుగా తీర్చి దిద్దుకోవాలన్న తపన. అదే తొలి ఉషస్సు. అంతరంగంలోని తీవ్రమైన తపన కోరికగా బయటపడుతుంది. అంతరంగాన్ని యోగి తన జ్ఞాననేత్రంతో చదవగలడు. తాను అజ్ఞానంతో, అంధకారంలో ఉన్నా జిజ్ఞాసతో ఒక్కొక్క మెట్టు పైకి పోగలడు. చీకట్లను అజ్ఞానాన్ని దాటి పోగలడు. తానే పరానికి సోపానాలు నిర్మించుకుని, జ్ఞానజ్యోతిని వెలిగించుకోగలడు. అజ్ఞానాన్ని అంధకారాన్ని తరిమి వేయాలి. ఈశ్వర ముద్రలను తన హృదయంలో దర్శించి హత్తుకోవాలి. అప్పుడు మృత్యువును అధిగమించినట్లు. అప్పుడు జీవునికి సర్వస్వతంత్రత సిద్ధిస్తుంది.

ఆత్మలేని చోట్ల అరూప భావనలు కనిపిస్తాయి. ప్రతి పదార్థం ఆధ్యాత్మిక కాంతిలో భాసిస్తుంది. సర్వం ఖల్విదం బ్రహ్మ. అగోచరం గురించి తెలుసుకొన డానికి వివేకం సాహసిస్తుంది. పరిణామ క్రియలో జీవుడు హిరణ్య తేజస్సు

పొందుతాడు. శూన్యం అయిన మనస్సు వెలుగులు నింపుకుని ఆత్మ అందించే సంకేతాలను స్వీకరిస్తుంది. విశ్వాన్ని సైతం విశ్లేషిస్తుంది, నిర్వచిస్తుంది. యోగి ఆంతర్యం గ్రహించలేని విషయం ఉండదు. చిక్కుముడులన్నీ విడిపోగా సర్వం జ్ఞాతమవుతుంది. జీవితం విశ్వమంత విశాలంగా, ఆకాశమంత స్వచ్ఛంగా తోస్తుంది. లోకం సమస్తం సుఖంగా ఉండాలన్న కోరిక, లోకాన్ని ఆనందమయం చేయాలన్న ఆరాటం కలుగుతుంది. లోకంలో జరిగే ప్రతిపనికి ఏదో అర్థం కనిపిస్తుంది. పరమార్థం ఉన్నట్లు తోస్తుంది. ప్రతి కదలికకు విధితో సంబంధం ఉందనిపిస్తుంది. శూన్యం చైతన్యంతో నిండిపోతుంది. ఆ మహదాకాశంలో యోగి పరబ్రహ్మను దర్శిస్తాడు.

యోగి హృదయం సంపూర్ణ విశ్వాసంతో నిండినప్పుడు అధిమానవ రూపాల్ని ఆవిష్కరించ పూనుకుంటుంది. అగోచరం అనుకున్న శిఖరాల్ని దాటి అందని ఔన్నత్యాలపై ఆత్మను నిలుపుతుంది. తాను దర్శించిన లోకం భూమిపైన శాశ్వతంగా నిలవాలని కలకంటుంది. యోగి జీవితంలో అంతవరకు చీకట్లు ముసురుకున్నా ఇప్పుడు వెలుగుమయం. ఆత్మ నేర్చిన తొలిపాఠాలు, అర్థం కాని విషయాలు గ్రహించడంతో పరమాత్మ సృష్టి ప్రబంధానికి తను కొత్త భాష్యాల్ని రచిస్తాడు. కొత్త అర్థాల్ని స్ఫురింపచేస్తాడు. ప్రతి మూర్తిలో సత్యం దర్శనమవుతుంది. పరబ్రహ్మ నిజతత్వాన్ని గ్రహించడమే పరతత్వం.

అదే జీవితానికి పరమార్థం, ప్రకృతికి సామాన్య ధర్మం. బ్రహ్మచర్యంతో శరీరం కాంతి పూర్ణమవుతుంది. మనస్సు, హృదయం ఒక్కటిగా పనిచేస్తాయి. ఆత్మచేతన విశ్వచేతనతో సమతుల్యమవుతుంది. పొగమంచుతో కప్పిన కాంతి శిఖర దర్శనం అయినట్లు, పరమాత్మ సముజ్వలంగా దర్శనమిస్తుంది. తనను పోలిన మూర్తులలో పరమాత్మ 'పరకాయ ప్రవేశం' చేస్తాడు. అందుచేతనే దేవతామూర్తులలో, దైవ విగ్రహాలలో పరమాత్మ దర్శనమవుతుంది.

కాని, ఆరాధ్యదేవతలు ఎవరూ పరబ్రహ్మకు వినయంగా ఉండరు. మనిషికి పరమాత్మకు మధ్య వీరు అడ్డు నిలుస్తారు. అడుగడుగునా అడ్డు తగులుతూ, తమ ఆధిక్యాన్ని చాటుతుంటారు. మనిషికి పరమాత్మకు మధ్య అల్పత్వానికి, అహంకారానికి, స్వార్థానికి తావుండదు. మనిషి పతనం కావడం పరమాత్మకు అంగీకారం కాదు. ప్రపంచం అధోగతికి దిగజారడమూ పరబ్రహ్మ అభిమతం కాదు. దేవతలు, తమ పరిధిలో తృప్తి చెందక తామే 'పరబ్రహ్మం' అని భక్తుల్ని వంచిస్తారు. దాంతో ప్రకృతి పరమాత్మల మధ్య ఒప్పందం రద్దయిపోతుంది.

ఇక్కడ ఎంత కృషి చేసినా అది ఆరంభం మాత్రమే. ప్రాథమికమైన పునాదిరాళ్లు పాతడం పూర్తి అవుతుంది. ఆత్మ ప్రవేశించని శరీరం నిరాకార, నిర్గుణ యంత్రం. అన్నీ అరకొరగా కనిపిస్తాయి. ఏదీ పూర్ణం కాదు. ఏదీ పూర్ణ ఫలితాల నివ్వదు. భౌతిక శరీరం వ్యసనాల ఖని. పారలౌకిక విషయాలు ఎన్ని తెలుసుకున్నా తృప్తి ఉండదు. దేవతా రూపాల, దైవశక్తుల జోక్యం వల్ల మనిషి స్వతంత్రించ లేకపోతుంటాడు. అదీ అసలు లోపం.

ఆ సందిగ్ధమే ఒక అయోమయ ప్రపంచాన్ని సృష్టిస్తుంది. అది మొదట పలచగా, శూన్యంలో చిన్న కదలికగా ఏర్పడుతుంది. సొంతజ్ఞానం శక్తి వలయాలను సృష్టిస్తుంది. సౌందర్యాన్ని భౌతిక రూపాలలోకి కుదిస్తుంది. కృత్రిమమైన ప్రేమలు, అనురాగాలు మనిషిని ఆకర్షిస్తాయి. స్వార్థం కరడు కట్టినవారు, అహంకారులు, డాంబికులు మోసం చేస్తుంటారు. జనాల్ని మభ్య పెడుతుంటారు. అలాంటి వారిని ఆశ్రయిస్తే మన ఆశలు తీరవు. సందేహాలకు సమాధానాలు లభించవు. పైగా మరి కొన్ని చీకటి ద్వారాలు తెరుచుకుని, మనకి స్వాగతం చెప్పి, మనకున్న జ్ఞానాన్ని బలి తీసుకుంటాయి. ఆలోచనల వల్ల, ఆడంబరం వల్ల ఆత్మ తేజస్సు పెరగదు. ఇలాంటి నకిలీ వెలుగులు జీవితం పొడవున ఎడనెడ కనిపిస్తుంటాయి. వీరు మనల్ని త్రిశంకు స్వర్గాలకు చేరుస్తుంటారు. అవి నకిలీ స్వర్గాలు, నకిలీ నందన వనాలు. అవి కృతకాలు, కృత్రిమాలు. వాటివల్ల ఆధ్యాత్మికత ముసుగులో కోరినన్ని ప్రాపంచిక సుఖాలు, భోగాలు అనుభవించవచ్చు. కాని ఆత్మ దారుణంగా పతనం చెందుతుంది.

లోకంలో మనం అనుభవించే సుఖభోగాలన్నీ దివ్యానందాలకు వికృత రూపాలు. అసలుసిసలు బ్రహ్మానందానికి అవి వక్రభాష్యాలు. గాయపడిన ఆనందం ఎన్నటికీ శాశ్వతం కాదు. ప్రకృతి తన శక్తుల్ని సమీకరించి భౌతిక శరీరానికి కలిగించే సుఖాలు, ఆనందాలు శాశ్వతం కాదు. అవి అజ్ఞానంతో, అహంకారంతో మనం బలవంతంగా పొందే ఆనందాలు. ఈ లోకంలో మనం కష్టపడి, కామించి సంపాదించిన సుఖాల విలువలు ఎప్పటికైనా నశించేవే. మనం సాధన చేసి ఆర్జించే శక్తుల విలువ అపారం. మనం అనుభవించే సుఖాలు పరమాత్మ పేర రాసే నకిలీ చెక్కులు. కడకు మనం చేసిన పనులన్నీ అర్థరహితంగా మారతాయి. పైలోకాలలో మనకు అన్నీ ప్రతిఘటనలే ఎదురవుతాయి. ప్రతి విజయం వెనుక కొంత అపజయం పొంచి ఉంటుంది.

ఇక్కడ అనుభవిస్తున్నంత కాలం అనుమానం కలగదు. కానీ మనం

గర్వించే ఆలోచనలన్నీ చివరకు నిరుపయోగం అవుతాయి. మనం స్వయంకృషితో సాధించిన విజయాలు చివరకు అపజయ కేతనాల్ని ఎగురవేస్తాయి. అభావ ప్రపంచంలో మనిషి భావనతో బ్రతుకుతుంటాడు. అగోచర సాగరం మధ్య మనిషి ఒక చిన్న ద్వీపం. ఉన్నతుడు కావాలని కలలు కనే అల్పజీవి. కొన్ని మంచి గుణాలున్న పశుప్రాయుడు. మనిషి జీవితం సంస్మరించదగింది కాదు. మనిషి సాధించే ఘనకార్యాలన్నీ అతనితోనే నశిస్తాయి, తెరమరు గవుతాయి. చైతన్యం సైతం చివరకు కొడిగట్టి ఆరిపోతుంది. ఆశ చావక మరొక జన్మకు బదిలీ అవుతుంది. అయినా మనిషి ఆశయం ఉన్నతం. గమ్యం ఉత్కృష్టం. పరమాత్మను చేరడం మనిషి పరమలక్ష్యం. తనను, తన పరిసరాలను పునర్నిర్మించుకుని తను జీవిస్తున్న లోకానికి కొత్త అందాలు సంతరించగలడు. కొత్త రూపాన్ని యివ్వగలడు. తనకు తెలియకుండానే కాలానికి అతీతంగా మనగలడు. ప్రకృతిని, విధిని జయించి, దాటిపోగల శక్తి మనిషి ఆత్మకు ఉంది.

మనిషి చేసే పనులన్నింటిని ఆత్మ పరిగణించదు. మన తాపత్రయాలకు మన ఆర్జనలకు విలువ కట్టదు. గడచినకాలం నష్టపోయినట్లు భావిస్తాం. జీవితంలో అనుభవించిన సుఖాలు, ఆనందాల ఛాయలు కూడా మిగలవు. చివరకు ఆత్మకు ఆసరాగా నిలిచేది నిశ్శబ్దం ఒక్కటే. ఆత్మకు ప్రాపంచిక వ్యామోహాలు, కామనలు అంటవు. అది పరమాత్మ మందిరంలో అనశ్వరంగా నిలుస్తుంది. తన లోకంలో యధేచ్ఛగా సంచరిస్తూ, కనిపించని దివ్యసీమలలో భద్రమంటపాలలో సేద తీరుతుంది. నెమ్మదిగా పరసీమల వైపు పయనం సాగిస్తుంది. పరసీమల నుండి ఒక నాదం వినిపిస్తుంది. అది ప్రణవం. మన భావాలను, బాహ్యప్రపంచాన్ని, మేధస్సును అది కదిలించదు. జీవుడు పరమాత్మ సన్నిధిలో స్థితుడవుతాడు. ఆత్మ ఆలోచన వలయాన్ని దాటిపోతుంది. భావన అనంతపథానికి చేరువ. కన్నులలో కాంతి, శాంతి, హృదయంలో ప్రేమ వాహినులు, మనస్సులో ప్రశాంత వీచికలు. భౌతిక శరీరంలో ఒక దివ్యశక్తి ప్రచోదయమైన అనుభూతి. బ్రహ్మానందం అణువణువునూ పులకింపజేస్తుంది. అదే అనిర్వచనీయానందం.

యోగి తనను వరించి వచ్చిన మార్మిక శక్తులకు పొంగిపోడు. వాటి ద్వారా సచ్చిదానందం వెతుక్కుంటాడు. తాను పరమాత్మ ప్రతినిధినన్న భావంతో, విశ్వమంతా తనదేనన్న అనుభూతితో సంపూర్ణ శరణాగతుడై ఆధ్యాత్మిక జీవనం కొనసాగిస్తాడు. చిరిగిపోయిన జీవన యవనికపై మిగిలిపోయిన రంగులు కరిగి, చిత్తరువు అదృశ్యమవుతుంది. ప్రాపంచికత అతనికి పాదాక్రాంతమవుతుంది.

తాను పరమాత్మ దిశగా మరింత పైకి పయనిస్తాడు. నిశ్శబ్దం నిశ్చలంగా అతని పురోగమనాన్ని స్వాగతిస్తుంది. కాలం వింటిని సారించి ఎక్కు పెట్టిన బాణం వలె, అతను అనంతంలోకి పరిక్రమిస్తాడు. ఒక కిరణం తిరిగి సూర్యుని చేరినట్లు. అతని పురోగమనాన్ని మృత్యువు సహించదు. రెక్కలు విదిల్చి, తన మాయోపాయంతో బంధించమని దుష్ట శక్తుల్ని పురమాయిస్తుంది. అతని ప్రశాంతిని, పురోగమనాన్ని భగ్నం చేయడానికి ఉపక్రమిస్తుంది. ఒక అగమ్య, అనిశ్చిత స్థితిని కల్పిస్తుంది.

మృత్యువు నిద్రాదేవి రూపంలో యోగి తపోమందిరం వద్ద తచ్చాడుతుంది. యోగి బ్రహ్మానంద స్థితిలో నిద్రను, మృత్యువును సైతం లెక్కచేయడు. పరమాత్మను చేరడమే అతని లక్ష్యం. నిద్రాహారాలతో అతనికి నిమిత్తం ఉండదు. అగ్నివలె తనను తాను దహింపచేసుకుంటాడు. ఏ కొందరికో బాహ్య ప్రపంచం నుండి, ప్రకృతి నుండి విముక్తి లభిస్తుంది. ప్రాపంచిక, ఐహిక ప్రలోభాలకు ఆకర్షణలకు లోబడనివారు వేయిమందిలో ఒక్కరుంటారు. ఆ ఒక్కరినైనా పరమాత్మ ఎన్నిక చేసుకోవలసిందే. పరమాత్మ చేయూత వెలుగు రూపంలో లభిస్తుంది. అదే అన్ని అగాధాలను దాటిస్తుంది.

సత్యపథంలో అతను చిర యాత్రికుడు. అతని ప్రజ్ఞ సామాన్యుల అంచనాకు అందదు. ఈ శబ్ద ప్రపంచాన్ని క్షణాలలో అధిగమించి, ప్రాపంచిక నియమాలు అతిక్రమించి, పరమాత్మ సామ్రాజ్యంలో పారమార్థిక లక్ష్యంతో పురోగమిస్తూ అపూర్వానందాలను అనుభవిస్తాడు. ఏ అమృతుని ఆసరా లభిస్తుందో చెప్పలేం. మహాశూన్యంలో అతనికి 'మహాత్మ' సందేశం వినిపిస్తుంది. శబ్ద ప్రపంచం శూన్యంలో కరిగిపోగా, సృష్టికి పూర్వపుస్థితిని చేరుకుంటాడు. ఆత్మ నిర్మలమై, పరమాత్మ మ్రోల నిలుస్తుంది. సృష్టించబడిన ఏ వస్తువు అతనిని ప్రలోభపెట్టదు. ఆలోచనలు ఉండవు, వాటి ఛాయలు కనిపించవు. అన్నీ శూన్యంలో లయించి అంతరించిపోతాయి. రూపాలు, గుణాలు, ఆకారాలు నశించిన జీవాత్మను పరమాత్మ తనదాన్ని చేసుకుంటుంది.

పరమాత్మకై పరుగులు తీసే ప్రతివ్యక్తి స్వతంత్రుడే. గమ్యం చేరిన ప్రతివ్యక్తీ విజేత. అరూప సంకేతాలు గ్రహించగలగాలి. కళ్లు మూసుకుని కాలావధిని దాటగలగాలి. ధ్యానంలో పరమాత్మను మాత్రమే దర్శించాలి. ఎన్నో అద్భుతాలను దాటుకుంటూ నిజస్థితిని చేరుకోవాలి. భౌతికతను పూర్తిగా వదలి దివ్యత్వం దిశగా పురోగమిస్తే ఆత్మదర్శనం అనివార్యం. జీవుడు మానవత్వపు ముసుగు

వదలడమే కష్టం. నగ్నంగా, సూక్ష్మ శరీరంతో ఎన్ని శిఖరాలైనా అధిరోహించ గలడు. మనం పరమాత్మ దిశగా ప్రయాణించినపుడు దివ్యత్వం మన వేపుగా దిగివస్తుంది. అది దివ్యావతరణం.

మహాశక్తి, మహాసౌందర్యం, మహాజ్యోతి అన్నీ మహత్వపూర్ణాలే. అన్నీ దృశ్యాదృశ్యంగా ఆత్మకు సాక్షాత్కరిస్తాయి. అన్నీ నిలువెల్లా చలింపచేస్తాయి, పరవశింపచేస్తాయి. హృదయం, మేధస్సు, అణువణువు దివ్యవివశత్వానికి లోనవు తుంది. పరబ్రహ్మానుభూతి యోగి నైజాన్ని మార్చివేస్తుంది. దృక్పథం మారుతుంది.

మృత్యువు కన్న హ్రస్వం, కాలం కన్న దీర్ఘం అయినది క్షణం. ప్రేమను మించిన బలం, స్వర్గం కన్న సుఖాన్ని యిచ్చేది శక్తి. ఒక్క క్షణంలో ఆ శక్తి ఆత్మను పరమాత్మతో చేర్చుతుంది. అప్పుడు లభించే సచ్చిదానందం అఖండం, అనంతం. ఆనందోద్వేగాలు సుడులు తిరుగుతూ వచ్చి అతనిని అఖాతాల్లోకి, శూన్యంలోకి విసిరి వేస్తాయి. లేదా ఒక్కసారిగా మహోన్నత శిఖరాలకు చేర్చుతాయి. అప్పుడు జీవునకు ప్రపంచంతో సంబంధం పూర్తిగా తెగిపోతుంది. అపూర్వ అనిర్వచనీయ పరిణామానికి లోనవుతాడు.

చూడకుండానే అన్నీ గ్రహిస్తాడు. ఆలోచించకుండానే సర్వం తెలుసు కుంటాడు. లోకాలన్నింటినీ తనలోనే చూస్తాడు. భవిష్యత్తు సైతం అతనికి కనిపిస్తుంది. అతని హృదయం అనురాగ పూర్ణం. మానవత స్థానంలోకి దివ్యత్వం ప్రవేశిస్తుంది. ఇప్పుడతని అన్వేషణ ఏకాంతంగా జరగదు. అసలు అన్వేషించ వలసిందీ ఉండదు. అనుభవించవలసిందే అంతా. అనుభూతి చెందడమే అతని పని. కాలానికి అతీతుడైన కారణంగా విధి, కర్మలు రద్దయిపోతాయి. ఆత్మ స్వచ్ఛంగా, పవిత్రంగా ప్రకాశిస్తుంది. మనస్సు సదా మేల్కొని వుండి ప్రకాశిస్తుంది. అతని ద్వారా పరబ్రహ్మ వాణి పలుకుతుంది. విస్మృతిలోనివేవీ ఇప్పుడు భారం కావు. యోగాగ్నిలో గత జన్మల కర్మశేషాలన్నీ దగ్ధమైపోతాయి. ఆత్మ సరికొత్త జీవితం ప్రారంభించ సిద్ధపడుతుంది. పరమాత్మ స్పర్శ అన్ని మమతల్ని కరిగించి వేస్తుంది. అనేక మార్మిక శక్తులు అతనికి అలంకారాలవుతాయి. అదీ లోకకళ్యాణం కోసమే. ఎన్నో సిద్ధులు, ఎన్నో మహాశక్తులు.

జాగ్రత్, స్వప్న, సుషుప్తుల్ని దాటిన మనస్సు స్వతంత్రంగా పరబ్రహ్మ సాక్షాత్కారం పొందుతుంది. ధరించే వలువల్ని బట్టి మనిషి రూపానికి విలువలు. సాధన రూపాల ద్వారా పారమార్థిక దృష్టి ఏర్పడుతుంది. సాధనలు బహు విధాలు,

మార్గాలు అనేకానేకాలు. చివరకు భ్రమలన్నీ తొలగిపోగా, నగ్నంగా నడక సాగించాలి.

వదలుకున్న అహంకారం తిరిగి యోగిని చేరదు. ఆత్మ యధేచ్ఛగా సంచరించినపుడు శరీరం ఒక భ్రాంతి అనిపిస్తుంది. యోగి హృదయం పరమాత్మకు ఆవాసం. ఆత్మ సైతం మనుగడకోసం శ్వాసించక తప్పదు. అది అధిమానస జగత్తులో మహాప్రాణాయామ క్రియ. భౌతిక శరీరంలో ఆత్మ ఉన్నట్లే, ఆత్మ శరీరంలో పరమాత్మ ఉంటుంది. పరమాత్మ స్పందనతో అక్కడ కల్లోలాలన్నీ సమసిపోతాయి.

పైన అనంతమైన ఆకాశం, క్రింద లోతు తెలియని అగాధం, మధ్యలో భావం, జీవం కదులుతుంటాయి. ముసిరిన చీకట్లను మాత్రం అతిక్రమించిపోవు. అంధకారం ఆత్మను చుట్టు ముట్టి కదలనీయదు. అవివేకం, అజ్ఞానం సరిహద్దులు దాటి ఇవతలకు రావు. అవి దివ్యత్వాన్ని రక్షించలేవు. తమ బాధ్యతల్ని విస్మరించి, అహంకారం వదలి పలాయనం చిత్తగిస్తాయి. నిష్క్రమిస్తాయి.

మన సూక్ష్మశరీరాలు ఒక్కొక్కసారి అరూపం అవుతాయి. అప్పుడు పూర్ణత్వం పరిధి అంతర్హితమవుతుంది. మన విశ్వాసాలు, నమ్మకాలు మనల్ని రక్షించవు. ప్రకృతి, ప్రపంచం క్షణంలో కరిగిపోతాయి. ఏ శాసనాలు, చట్టాలు, అనుమానాలు ఉదయిస్తున్న బ్రహ్మత్వాన్ని ఆపలేవు. విధి లిఖితాలు క్షణంలో రద్దయిపోతాయి. మృత్యువు కబలించగల జీవి ఏదీ అక్కడ కనిపించదు. అన్ని రూపాలు పరమాత్మలో ఐక్యం కావాలని తహతహ లాడుతుంటాయి. మనల్ని రక్షించాలనుకునే శక్తులు ఏవీ మనల్ని రక్షించలేవు. పరాశక్తి ముందు భౌతిక శక్తులు అన్నీ వీగిపోతాయి. ఆత్మ, జగత్తు సమశక్తులుగా ఎదురు నిలుస్తాయి. కాలాతీతంగా పురుషుడు, ఆత్మ సహాయంతో ప్రకృతిని జయించడం అప్పుడు సాధ్యం. ఆ మహాయాత్రకు అవరోధాలుండవు. మార్గాలూ ఉండవు. యోగి అంతర్దృష్టికి సర్వం విదితమవుతుంది.

ప్రకృతి తన రహస్య రక్షా కవచాన్ని తొలగించుకుని ఒకప్పటి భయంకర అంధకారాన్ని, అభ్యంతరాలను వదలి ఆత్మ సంకల్పం సృష్టించిన తేజస్సులో స్పష్టంగా కనిపిస్తుంది. విచిత్ర కాంతులు నిండిన రహస్య మందిరాల తలుపులు తెరచుకోగా అందులోకి శాంతి ప్రవేశిస్తుంది. లోపలకు చొరబడగానే అది ప్రశాంతి నిలయమవుతుంది. ఆ మందిరంలోని అన్ని మార్మిక శక్తులు యోగికి స్వాగతం పలుకుతాయి. అతనికి దాసోహం చేస్తాయి. అప్పుడు జ్ఞానదృష్టి ఏర్పడుతుంది.

ప్రకృతి అంతా రహస్యమే. ఎప్పుడు, ఏది, ఎందుకు జరుగుతుందో తెలియదు. ప్రకృతి శక్తులన్నీ పరలోకాలకు పరిచయమే. పరాశక్తుల ప్రతికృతులే ప్రకృతి శక్తులు. అవి మన అవసరాలను మించి ఉంటాయి. క్షుద్ర దేవతలు కొన్ని మార్మికశక్తులను తమ వశం చేసుకుని, తమ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటాయి. ప్రకృతి తనలో దాచుకున్న శక్తులు, మహత్తులుగా కీర్తించబడే విచిత్ర శక్తులు అన్నీ భౌతిక పరిధిలోనివే.

యోగ విభూతితో ఈ శక్తులన్నీ పులకించిపోతాయి. ప్రకృతి చైతన్య పూర్ణమవుతుంది. అది యోగప్రజ్ఞ. అది ఆత్మశక్తికి లోబడి పనిచేస్తుంది. ఒకప్పుడు అసంభవం అనిపించింది ఇప్పుడు అతి సహజంగా కనిపిస్తుంది. పరబ్రహ్మలోకం ఒక్కటే సత్యం. పరప్రజ్ఞ గల యోగి తాను దర్శించిన లోకం వంటి లోకాన్ని సృష్టించుకోగలడు. తన చైతన్యప్రజ్ఞతో కోరిన రూపాలను సృష్టించగలడు. నిరాకార శూన్యం నుండి కోరిన వస్తువుల్ని సృష్టించగలడు. అతని ఇంద్రజాల, మహేంద్ర జాల విద్యలను ఎవరూ నిరోధించలేరు.

అతని మార్మిక విద్యలకు ఆధారాలు కనిపించవు. అతని మహత్తులు, అతని విధానాలు మన అజ్ఞానాన్ని పరీక్షిస్తాయి. జ్ఞానాన్ని తరతరాలుగా, యుగయుగాలుగా సమాధిచేసిన అజ్ఞానం, అహంకారం మనది. యోగిది సత్యజ్ఞానం. బ్రహ్మను సైతం కాదని యోగి నూతన సృష్టి చేయగలడు.

ప్రకృతి చాపల్యంతో విశ్వసృష్టిని అలక్ష్యం చేసి తానొక సుందర ప్రపంచాన్ని సృష్టించుకున్నది. ఆమె లోకంలో అన్నీ అందాలే కనిపిస్తాయి. అన్నీ ఆనందాలే. అద్భుతాలు విరబూసిన పూలవలె కనిపిస్తాయి. అవి వివేకానికి అందవు. విచక్షణకు అందవు. అవి మార్మికం. ప్రకృతి కొత్త అందాలను పూయిస్తుంది. అన్నీ స్వకల్పితం. మనిషి దివ్యత్వానికి సంధానకర్త మనస్సు. మనోబలం ప్రకృతి శక్తులన్నింటినీ లొంగదీసుకుంటుంది. మనస్సు లౌకిక ధర్మాలను మార్చగలదు, రద్దుపరచనూ గలదు. అదే ప్రపంచాన్ని మత్తు నుండి, మాంద్యం నుండి, బంధాల నుండి వేరుపరచి విముక్తిని కలిగిస్తుంది. అదే మృత్యువు ఆగ్రహదృష్టిని అలక్ష్యం చేసి, అమృతమయం చేయగలదు. దాని భావ తీవ్రత తగ్గి, ఆరోహణలో ఏర్పడే శక్తి నుండి ఉత్పన్నమయ్యే జ్ఞానం విముక్తి కలిగిస్తుంది. శారీరక విశ్రాంతిని ఆలంబన చేసుకొని హృదయారాటాన్ని తగ్గిస్తుంది.

అగోచరం అందుబాటులోకి వచ్చినప్పుడు అసంభవం సంభవమవుతుంది. అవ్యక్త భావన స్వతంత్రంగా వ్యక్తమవుతుంది. యోగి ప్రశాంత సంకల్పం అన్ని

పనులను సానుకూలపరుస్తుంది. తాను నిశ్చల సమాధిలో ఉండి ఎంత దూరంలోని కార్యాలనైనా నిర్వహించగలదు. మనిషి జీవితం స్వల్పం. జ్ఞానం అనల్పం. ఒక్క జ్ఞాన కిరణంతో చీకట్లు ప్రిదిలిపోతాయి. బ్రహ్మానందస్థితి మనలోని రాక్షస ప్రవృత్తులను, క్షుద్ర భావనలను తరిమి వేస్తుంది. అదే మనలో అపూర్వ శక్తిని, అఖండ విజ్ఞానాన్ని కలిగించి మనలో బ్రహ్మ భావనను ఉద్దీపింపచేస్తుంది. మనిషిలో మనస్సు మకుటం లేని చక్రవర్తి. మనస్సుదే రాజ్యం. ఈ మూఢ ప్రపంచం మనస్సుకు దాసోహం అంటుంది. మనస్సు కొన్ని శక్తుల్ని సంపాదించగలదు. అది దైవశక్తి కాదు. మనస్సు చేసే గారడీలు పై భూమికలలో చెల్లుబాటుకావు. ఆత్మశక్తి మానసిక శక్తుల్ని త్రోసివేస్తుంది. అది ప్రకృతి రహస్యం.

ఉజ్వల ఆధ్యాత్మిక మండలాల సరిహద్దులకు ఆవల మహాశక్తి పూర్ణాలైన సత్యలోకాలున్నాయి. అక్కడ రూపానికి, జీవానికి అధిపతి ఆత్మ. స్వసంకల్పంతో, స్వశక్తితోనే ఆత్మ ప్రవర్తిస్తుంది. ఆత్మ ధ్యానంతో అదృశ్యమండలాలను నిర్మిస్తుంది. దర్శిస్తుంది. అన్ని లోకాలను సంధానపరుస్తుంది. తను నిర్దేశించిన నియమాలు పాటించే సాధకునకు ప్రకృతి అన్ని లోకాల ప్రజ్ఞలను అందచేస్తుంది. వెలుగులు నింపుతుంది. సాధకుడు భూమిపైన ఉన్నా అతని సంచార లోకాలు వేరు. అతని మనస్సు భౌతిక స్థితిని దాటి పోతుంది. మనో మండలాలు దాటగానే అద్భుత శక్తులు ప్రాప్తిస్తాయి. ఈ పరిణామ నిర్వహణ ప్రకృతిది. వాని సత్యసంధతకు మూలం ప్రకృతి. స్వర్గనరకాలు భూమికి బాసట కావాలి. మానవ సంకల్పానికి విశ్వశక్తి తలవంచాలి. మానవ జీవితాలను ప్రభావితం చేసే దైవశక్తులకు అనుకూలంగా తాను పరమాత్మ సంకల్ప ప్రతినిధిగా వ్యవహరిస్తూ, తన ఇచ్ఛతో లోకాన్ని సృష్టిస్తుంది ప్రకృతి. లోకాన దౌర్జన్యం ప్రతిష్టించి, అసంభవ కార్యాలలోకి మూర్ఖంగా చొరబడుతుంది. అన్ని తావుల నుండి కుతంత్రాల సరంజామా సమకూర్చుకుని, అన్ని లోకాలతో తన అనుబంధం ఆసరాగా ప్రకృతి స్వతంత్రించి విజృంభిస్తుంది. భౌతిక విజ్ఞానంతో లోకానికి అవసరమైన పరిశోధనలు జరిపి, శాస్త్రీయ దృక్పథానికి కిరీటం అందిస్తుంది. తానే సత్యం అనే భ్రమ కలిగిస్తుంది ప్రకృతి. తన శక్తులనే అతీంద్రియశక్తులుగా మోసగిస్తుంది. పరమాత్మను మరుగు పరచి, సృష్టికి తాను ప్రతిసృష్టి చేస్తుంది. ప్రకృతి అవరోధం వల్లనే ఈశ్వరీయత బహిర్గతం కాదు. పరమాత్మ రహస్యాలు పరానికే పరిమిత మవుతున్నాయి.

సత్యం నియమాలకు, నిబంధనలకు లొంగదు. అంతరంగమే దాని

కార్యక్షేత్రం. సత్యాలు కాంతి శకలాలుగా కనిపిస్తాయి. సత్యశోధనకు అన్నీ అడ్డంకులే. మహాచైతన్యం వెలువడకుండా ప్రకృతి విచిత్రరీతుల ఆటంకాలు కలిగిస్తుంది. ప్రకృతి మహాసృష్టికి కుతంత్రం శిల్పం. ఈ సంకుల సమరం సాధకుని మనస్సులో సాగుతుంది. అవరోధాలు కల్పించిన కొద్దీ దివ్యత్వం తీవ్రమవుతుంది. ప్రతిఘటించిన కొద్దీ దానిపైన పట్టు పెరుగుతుంది. ప్రకృతి చివరకు తన సర్వశక్తులను, ధర్మాలను వదులుకుని యోగికి సహకరిస్తుంది. తానే బ్రహ్మానందానికి బాటలు చూపిస్తుంది. వికృత చేష్టల్ని వదలి తన ధర్మం గ్రహిస్తుంది. తన కోపాల్ని, స్వార్థాన్ని వదలి ఆత్మ సేవలకు తానుగా అంకితమవుతుంది. సాధకుని ఆధ్యాత్మికాభివృద్ధికి ప్రకృతి సహకారం ఎంతో అవసరం.

చివరకు ప్రకృతి శక్తులన్నీ ఓడిపోతాయి. కోటలో పాగా వేసిన ప్రకృతి, తన శక్తుల్ని ఉపసంహరించుకొని ఓటమిని అంగీకరిస్తుంది. తాను పరమానందంలో మునిగిపోతుంది. ప్రకృతి తనవిగా భావించి, అహంకరిస్తున్న శక్తులన్నీ పరమాత్మ ప్రకల్పితలీలలు, అనుగ్రహించిన దివ్యశక్తులు. వాటిని తనవిగా భావించడం ప్రకృతి నేరం. స్వార్థం, అహంకారం యోగికి పనికి రావు.

అలౌకిక సరిహద్దుల కావల అంతా ఆధ్యాత్మిక శక్తే. భౌతిక ప్రపంచం దాటగానే ద్వారం వద్ద ఉన్న శక్తి దేవతాశక్తుల్ని క్రమబద్ధం చేస్తుంది. అన్ని అవరోధాలను తొలగిస్తుంది. దేవతలకు మనిషి మనస్సుపైనే అధికారం కాని, ఆత్మపైన కాదు. అగోచర లోకాలన్నీ అప్పుడు ఆత్మకు చేరువవుతాయి. జగన్మాత వెంట నడిచి పరమాత్మను పరిచయం చేస్తుంది.

ఆ లోకాల రహస్యాలన్నీ జగన్మాతకు ఎరుక. అక్కడ శక్తులపైన కూడా ఆమెకు ఆధిపత్యం ఉంటుంది. మూసిన తలుపుల వెనుక ఆత్మశక్తి నిద్రిస్తుంది. పైకి వెళ్లిన కొద్దీ సోపానాలను నరక యాతనలు క్రమ్మినా, స్వర్గ శిఖరాలు ఆకర్షిస్తుంటాయి. ఆరోహణే లక్ష్యంగా, సంకల్పమే సాహసంగా యోగి సాధన సాగించాలి. అనేక ప్రలోభాలు నిర్విరామంగా అతనిని వెన్నంటి వస్తుంటాయి. అనేక నాదాలు వినిపిస్తాయి. అనేక రూపాలు కనిపించి భయపెడతాయి. ఆపైన కనిపించేది వేయిస్తంభాల మందిర సుందర సింహద్వారం. అక్షయమూర్తి పాదదర్శనం జరుగుతుంది. ఆ ప్రవేశ ద్వారం మెరుస్తూ కనిపిస్తుంది. అది కనిపించీ కనిపించని వెలుగుల్లో చలిస్తూ ఉంటుంది. ఆ భవనంలోకి అన్ని భువనాలు వస్తూపోతూ ఉంటాయి. అక్కడ నుండి సర్వసృష్టిని గమనించవచ్చు.

అవి అన్నీ మహత్వపూర్ణగోళాలు. కాంతి మండలాలు. రోదసి నుండి వాటికి

అవిగానే ప్రభవిస్తుంటాయి. అలాగే అంతరిస్తుంటాయి. అవి కాల నియమాలకు కట్టుబడి ఉండవు. ఎప్పుడు ఉద్భవిస్తాయో, ఎప్పుడు లయిస్తాయో తెలియదు. అవి శూన్యంలోంచి వర్తమానంలోకి దూసుకు వస్తుంటాయి. వాటి వెనక దేవతా శక్తులు మెరుస్తుంటాయి. వాటి రూపాలు అరూప పరబ్రహ్మకు భాష్యాలు. వాటి ఉపరితలాన మెరిసే మెరుపులు పరమాత్మ ప్రజ్ఞా ప్రభలు. శూన్యం నుండే అన్ని రూపాలు ఏర్పడతాయి. సకల చరాచర సృష్టికి అచలమే మూలం. అవి అన్నీ పరబ్రహ్మ అనంత రూపాలు. అది విశ్వరూపం.

జీవుడు చైతన్యంతో శూన్యంలో పయనిస్తూ సర్వం గ్రహిస్తాడు. అగోచర మహర్లోకాల ద్వారాలన్నీ తెరుచుకుని స్వాగతం చెబుతాయి. ప్రకృతి సౌందర్యాలు, అనంత ప్రాభవాలు నగ్నంగా, ఉద్విగ్నంగా దర్శనీయమవుతాయి. ఇక్కడనే ఒక బృహత్పథకం ఏర్పాటవుతుంది. మన భౌతిక శరీర నిర్మితికి అవసరమైన ముడి పదార్థాలన్నీ కృతకాలే. కనుక అవి నశిస్తుంటాయి. అవి శాశ్వతాలు కావు కనుక మన భౌతిక శరీరాలూ శాశ్వతాలు కావు. శాశ్వతంగా నిలవవు. ఆయా రూపాలలోని తేజస్సు బ్రహ్మ తేజంలో లీనమవుతుంది.

మెరుపు సంకేతాలలో బ్రహ్మ లిపి దాగివుంటుంది. అది మనస్సు అందుకోలేని సూక్ష్మ సంకేత చిత్రపటం. మేథో కుడ్యాలపై అందుకోలేనంత ఎత్తున ఆ చిత్రాలుంటాయి. భౌతికరూపాల కాంతి పుంజాలలోని ప్రత్యేక సంకేతాలను విశ్లేషించి పరమార్థాన్ని గ్రహించాలి. దివ్య జ్ఞానదృష్టితో వాటిని అనుశీలించాలి. అప్పుడే పరమాత్మరహస్యాలు మనకు తెలుస్తాయి. జనన మరణాల మధ్య ఎక్కుతూ దిగుతూ జీవుడు పయనించినట్లే, లోకాలన్నీ లయిస్తూ తిరిగి ఉద్భవిస్తూ ఉంటాయి.

మనస్సు మనిషికి వరం. జీవితంలోకి ఆనందాలను, సుఖాలను మాత్రం అందించి, పరవశింప చేస్తుంది. భౌతిక రూపాలలో సౌందర్యాలను నింపేది మనస్సు. చివరకు తాను ఆత్మకు లొంగిపోతుంది. ఉర్ధ్వ లోకాలకు పయనించే శక్తి మనస్సుకు లేదు కనుక ఆత్మను ఆశ్రయిస్తుంది. ఆత్మ ఊర్ధ్వ లోకాలకు చేరడానికి ఒకే ఒక ఉపకరణం దర్శనం. అది ఆత్మ దర్శనం. తనను తాను దర్శించడమే. ఒక చైతన్యస్థితి నుండి మరో ఊర్ధ్వ చేతనకు పయనించేందుకు అతీంద్రియశక్తులపై ఆధారపడాలి. అందుకు అవసరమైనది ప్రజ్ఞ. వినిమయంలో అది ప్రజ్ఞానంగా మారి ఆత్మాభివృద్ధికి సహకరిస్తుంది.

ఒక చైతన్యం నుండి మరో చైతన్య భూమికకు ఆత్మ ప్రస్థానం చేస్తున్నప్పుడు

తాను దాటివచ్చిన శిఖరాలన్నింటినీ ఆత్మ దర్శిస్తుంది. సృష్టికి మూలమైనది అది. అందరూ ప్రవేశార్హత పొందాలనుకునేది అదే. పరబ్రహ్మలీలలు గమనిస్తూ, అబ్బురపడుతూ అనంత ప్రశాంత స్థితికి చేరతాము. ఎన్ని అద్భుతాలు జరిగినా చివరకు గమ్యం చేరుకుంటాం.

ఆత్మ ఉన్నత సీమలకు చేరుతున్న కొలది యావత్ సృష్టిని తానుగానే గుర్తిస్తుంది. ఉద్ధతికి, పతనానికి మధ్య సంచరిస్తుంది. నిమ్నోన్నతాలను స్పృశిస్తుంది. అన్నింటిని ఏకం చేస్తుంది. జగత్తును, జగచ్ఛిల్పిని ఏకం చేస్తుంది. అన్ని లోకాలు లయించిపోగా మిగిలేది మహర్లోకం ఒక్కటే. అది తేజోగోళం. అక్కడ చీకటికి అవకాశం లేదు. అజ్ఞానానికి తావు లేదు. నిద్రకు కళ్లుండవు. త్రిమూర్తుల ఏకీకరణ వల్ల ఏర్పడే తేజస్సు అది. ఎంతో కాలంగా మనం అన్వేషించేవి అక్కడ దర్శనమిస్తాయి. మన పరిమితి నశించి అపరిమితంగా భాసింపచేస్తుంది. అపరిమితానికి శాశ్వతత్వం జతపడుతుంది.

పరమాత్మ మన చైతన్య హృదయాన్ని గుర్తించేది అక్కడ. మన భావం, సంకల్పం, ప్రజ్ఞానం మమేకమై సత్యాన్ని ఆలింగనం చేసుకుంటుంది. నిశ్శబ్ద సంగీతం తనలో దాచుకున్న నాదాన్ని పరమాత్మకు నివేదించుకుంటుంది. అవసరమైనప్పుడే మనకు దివ్యనాదాలు వినిపిస్తాయి, దివ్య సందేశాలు అందుతాయి, వాటి అర్థాలు అవగతమవుతాయి.

మాయ జలతారు తెరల్లో దాగిన అజ్ఞానం కరిగిపోగా ఆత్మ జ్ఞానకిరణాలను ప్రసరిస్తుంది. యోగి పడ్డ శ్రమ, చేసిన తపస్సు వృథాపోవు. మనస్సు వేగిరపాటుతో పొరపాట్లు చేస్తుంది. ఆత్మ ప్రబోధంతో తన పొరపాట్లను దిద్దుకుంటుంది. ఆత్మ లక్ష్యానికి, ప్రగతికి మనస్సు అడ్డు నిలవదు. మనస్సు తన పని తాను చేసుకుంటూ ఆత్మాభివృద్ధికి సహాయ పడుతుంది. జీవితాన్ని పెనవేసిన అలజడులు, సమస్యలు మనస్సు పరిష్కరించలేనప్పుడు ఆత్మకు నివేదిస్తుంది. ఆత్మ పరిష్కరించలేని సమస్య అంటూ ఉండదు. ఆత్మ పరమాత్మకు సన్నిహితం కదా! పారలౌకిక ప్రజ్ఞ మనస్సుకు అందేది ఆత్మద్వారానే. ఆలోచనలను ఆత్మ లెక్కచేయదు. లౌకికమైన అవరోధాలు ఆత్మ ప్రగతిని నిరోధించవు. ఆత్మకు మగత, మత్తు ఉండవు. అంతా చైతన్యమే.

కకావికలైన శకలాలను ఏర్చి, కూర్చి వికలమైన మనస్సును ఊరడించి, ఆత్మ బుజ్జగించగలదు. మనస్సును సేద తీర్చేది ఆత్మ. అసలు సిసలు విలువల్ని చూపేది ఆత్మ. వాటిని కాపాడగలిగిందీ ఆత్మే. అంచేత ఆత్మ శరీరానికి, మనస్సుకు

దూరంగా కనిపించకుండా అందనంత ఎత్తుగా మసలుతుంది. శరీరం, మనస్సు చేసే తప్పుల్ని క్షమించి రక్షిస్తుంది. ఆత్మ దేనినీ శిక్షించదు.


మహామంత్రాలన్నీ పరబ్రహ్మ ప్రార్థనలే. ఆత్మ తేజస్సులోకి నడిపించేవే. అవి క్రమంగా యోగాగ్నిని రగుల్చుతాయి. అమర వాణిని వినిపిస్తాయి. ఒక సత్యం మరొక సత్యాన్ని మించింది కాదు. సత్యానికి బహుముఖాలు. బాహ్య అవగాహనకు భేదాలు అనంతంగా కనిపించినా అన్నింటి ఆంతర్యం ఒక్కటే – బ్రహ్మం – సత్యం.

మనస్సు తొలినుండి సందేహిస్తుంది, అనుమానాలను పోగుచేసుకుంటుంది. చివరకు జ్ఞానం పొంది, సత్యంవైపు మొగ్గు చూపుతుంది. కాలం అన్ని విభేదాలను తొలగించి ఏకాభిప్రాయం కలిగిస్తుంది. అది సత్య సంకేతం. అన్ని నాదాలు ప్రణవ నాదంలో లయిస్తాయి. అన్ని ఆరాధనలు తపస్సులో కరిగిపోతాయి. భౌతికస్థాయినుండి ఆధ్యాత్మిక శిఖరాలపైకి ఆరోహణ జరుగుతుంది. అడుగడుగున విశ్వసంగీతం వినిపిస్తుంది. అనేక దేవతారూపాలు దర్శనమిస్తాయి. చివరకు నిర్గుణ నిరాకార పరబ్రహ్మతత్వం విదితమవుతుంది. అదే అమృతత్వం.

ఆధ్యాత్మికంగా ముందుకు సాగిన కొలది మృత్యు రహిత సత్య లోకాల దర్శనం లభిస్తుంది. అనేక చైతన్య స్ఫృహలు కలుగుతుంటాయి. గమనం, గమ్యం ఒక్కటవుతాయి. ధ్యానం, ధ్యేయం మమేకమవుతాయి. ధ్యాని ధ్యానంగా పరిణామం చెందుతాడు. అంతా నిశ్చలన స్థితిలో జరిగే క్రియ. అన్ని దారులు పరమాత్మ సదనానికి రహదారులే.

ప్రాపంచిక వాసనల నుండి విముక్తమై, నిశ్చల ప్రశాంత మనస్సీమల్ని దాటి, ఆత్మకు ఆవాసమైన శూన్యకాంతుల్ని చేరినప్పుడు భౌతిక నేత్రాలు చూడలేని అలౌకిక సౌందర్యాలను మనోనేత్రంతో దర్శించగలం. అవి మొదట అస్పష్టంగా, అరూపంగా తోచినా, తర్వాత దివ్యంగా కనిపిస్తాయి. అవి సూర్య తేజస్సును మించిన జ్ఞాన మండలాలు, చంద్ర కాంత సీమలను మించిన శీతలాలు, అవ్యక్త ఆనందాలు. అవి అన్నీ మన లౌకిక, భౌతిక ప్రపంచానికి ఆవల కలిగేవి. యోగి ఆ లోకాలు చేరి సింహావలోకనం చేసుకోగలడు.

ప్రతియోగి తనదైన మార్గంలో, తన మార్గంలో స్వతంత్రంగా పయనించాలి. అన్వేషణలో, సత్యశోధనలో ఎదురయ్యే ప్రమాదాలను సాధనతో ఎదుర్కోవాలి. రోదసిని దాటిపోవాలి. లోకాన్ని మరచిపోవాలి. మహర్లోకంలో ఆత్మశరీరంతో ప్రవేశించాలి.


అన్వేషణ

6. ఆశయం

మనిషి ఎంతో విజ్ఞానం సాధించాడు. సంస్కృతిని, నాగరికతను అలవరచుకున్నాడు. మరెన్నో వైజ్ఞానిక విజయాలు సాధించుకున్నాడు. శాస్త్రీయ దృక్పథం అలవరచుకున్నాడు. అశ్వపతి విజ్ఞానఖని. ఆర్జిత విజ్ఞానం అంతా అతనికి తెలుసు. శాస్త్రీయ విజ్ఞానం మనస్సుకు లోబడేది. ఆత్మ సంపాదించేది జ్ఞానం. అది ప్రజ్ఞానం.

యోగంతో పూర్ణత్వం సాధించాలని అశ్వపతి తలపోత. పరిణామానికి యోగం సహకరిస్తుంది. ప్రగతి సాధనకు విజ్ఞానం పనికొస్తుంది. అశ్వపతి త్రికాలజ్ఞానం పొందాడు. గతంలోకి వెళ్లగలడు. భవిష్యత్తులోకి చూడగలడు. బాహ్య ప్రపంచాన్ని దర్శించగలడు. అంతర్లోకాలను వీక్షించగలడు. భౌతిక, మానసిక, ఆత్మిక భూమికలలో పయనించసాగాడు. భౌతిక మానసిక శరీరాలను విడిచి, ఆత్మ శరీరంతో ప్రజ్ఞతో ప్రయాణించసాగాడు. అతనికి స్థూల శరీరం ఎంత ముఖ్యమో, సూక్ష్మ శరీరం అంతకంటే ముఖ్యం. తమో మండలాలు ఎంత ఇష్టమో తేజో మండలాలూ అంతే ప్రీతికరం. చీకట్లను చీల్చగలిగినప్పుడే వెలుగు కనిపిస్తుంది. అజ్ఞానం వదలినప్పుడే జ్ఞాన జ్యోతి దర్శనమవుతుంది.

అశ్వపతి అవరోధాలకు క్రుంగిపోలేదు. సత్యాన్ని తెలుసుకోవాలన్న పట్టుదల. దివ్యత్వాన్ని శాశ్వతంగా తనలో నిలుపుకోవాలన్న తపన. తానొక్కడే కాకుండా ప్రతి ఒక్కరు దివ్యజీవనం గడపగలగాలి. ఆ ప్రయత్నంలో అంతా చీకటి. దారీ తెన్నూ కనిపించలేదు. మళ్లీ యోగం చేశాడు. కొంత నిర్వేదం, నిరుత్సాహం, శూన్యం. లోకపు ఎల్లలు దాటిపోగలిగాడు. దివ్య లోకాల పొలిమేరలు చేరుకున్నాడు. అదొక లోకం. అదే తాను ఆశించిన దివ్యలోకం. ఆ లోకాన్ని భూమిపైన ప్రతిష్ఠించాలని, అందుకు అవకాశం యిమ్మని పరమాత్మను అర్థించాడు.

ప్రపంచం ఇవ్వగలిగిన సంపదలన్నీ అత్యల్పం. విజ్ఞానం, పాండిత్యం, శక్తి – కాలంతో సన్నబడి హరించిపోతాయి. అవి ఏవీ మనిషి ఆత్మకు శాంతి కలిగించవు. తృప్తి నివ్వవు. తృష్ణను తీర్చవు. పూర్ణ రూపాలన్నీ పరమాత్మ రూపాలే అయినా మన జీవితాలు పరమాత్మకు కట్టుబడి ఉన్నా, రూపధారణ వల్ల అవి పరమాత్మను చేరవు. పరమాత్మ సైతం వాటిని తనవిగా భావించడు. శుద్ధ ఆత్మ ఒక్కటే పరమాత్మకు ప్రీతికరం. ఆత్మసాక్షిగా అది ఒక్కటే సత్యం. స్వయంకృతాపరాధం వల్ల పరమాత్మ జాడ తెలియదు. తెలిసినా మనకు అందనంత దూరాన ఉంటుంది. అందుకే దానిని అగమ్యం, అగోచరం, నిర్గుణం, నిరాకారం అంటాం.

లోకానికే అందాల్ని అందించిన పరమాత్మ సౌందర్యం మనకు కనిపించదు, తెలియదు. ఈ లోకం మహత్తులు కోల్పోయిన సిద్ధుని వలె, ప్రియుడు వదిలి వెళ్లిన అభిసారిక వలె నిర్జీవంగా, కళారహితంగా మిగిలింది. లక్ష్యం కోల్పోయిన ప్రపంచం శూన్యంతో సమానం. శూన్యంగానే బ్రతుకుతున్నట్లు. జ్ఞానం కోసం అన్వేషణ ఉత్తి మానసిక శ్రమ అనిపిస్తుంది. యావత్ భౌతిక విజ్ఞానం అవ్యక్తంలో అంతరిస్తుంది. యావత్ జ్ఞానం శూన్యం నుండి ప్రభవిస్తుంది. మనిషి కష్టించి సాధించిన విజ్ఞానం అహంకారాన్ని పెంపొందిస్తుంది. కాలం ఆ విజ్ఞానాన్ని రద్దు పరుస్తుంది. అన్ని ప్రాకృతిక శక్తులు ఈశ్వరీయతలో లీనమైపోతాయి. ఒక చీకటి గుహలో దివ్య వర్చస్సు రక్షింపబడుతూ ఉంటుంది.

అశ్వపతి అన్వేషణకు అంతం లేదు. తపన అనంతంగా సాగుతున్నది. వేదనా హృదయంలో నిశ్శబ్దం నెలకొన్నది. ప్రాపంచిక వాంఛల నుండి, వేదనల నుండి నిర్గమించి పరమాత్మ పిలుపుకు ఎదురు చూడసాగాడు. అజ్ఞాతంగా అతి సన్నిహితంగా వున్న జీవాత్మ సచ్చిదానందాన్ని ప్రశాంతిని అనుభవిస్తున్నా, ఇంకా పొందవలసింది, పొందదగింది ఎంతో ఉన్నదని ఆత్మకు అనిపిస్తోంది. పరం తనకు అందినట్లు అనిపించినా ప్రలోభపెట్టి అంతర్ధానమవుతుంది. అది కోరనప్పుడు దగ్గరవుతుంది. కోరినప్పుడు దూరమవుతుంది. అది అందించే అనుభూతి తప్ప మరేదీ ఆత్మకు ఆనందం కాదు. ఆ స్పృహ లేనప్పుడు మహా

మహాకార్యాలు నిర్జీవాలవుతాయి. దివ్యస్పృహతో చేస్తే అల్పకార్యాలకు సైతం విలువ పెరుగుతుంది. అది ఉన్నంత కాలం శూన్యహృదయం నిండుకుండలా అనిపిస్తుంది. ఆ దివ్యస్పృహ లేనప్పుడు జీవితం అస్తిత్వం కోల్పోయి జడప్రాయ మవుతుంది.

క్రమంగా ఏర్పడిన స్మృతి సీమలు, దివ్యత్వం నింపుకున్న ప్రాపంచిక క్రియలు అశాశ్వతాలు. ఏవీ నిలవవు. ఆ మహత్తు ఏమిటో, ఎవరిదో మనకు అర్థం కాదు. అది అతీంద్రియమై అన్నింటా తానే నిండి, లక్ష లోకాలను సృష్టించి, అన్నింటినీ తనలో లయం చేసుకుంటుంది. వేల రూపాలను ధరిస్తుంది. వేయి పేర్ల స్తుతించబడుతుంది. అది ఆకాశ మంతగా విస్తరించి అంబరం కాగలదు. ఆత్మలో ఇమిడిపోయి అదృశ్యం కాగలదు. ఔన్నత్యం పరమాత్మను దూరం చేస్తుంది. మార్మికత గుండెలో దాగిపోతుంది. అదే కొన్నిమార్లు కల్పనగా, కొన్ని తావుల మాయగా తోస్తుంది. మరికొన్ని సార్లు మహత్తరశక్తి, పరమాత్మ అనిపిస్తుంది.

యోగి పురోగమనంపై పరుచుకున్న అనుమానపు నీడ అన్నింటికి ఆకరమైన శూన్యానికి ఆవల, శూన్యమే అమరమై ఆదిశక్తిగా, ఆత్మశక్తిగా రూపుదిద్దుకుంటుంది. అదే అగోచర పరమాత్మ వైపు, పరసీమ వైపు జీవుని ఆకర్షిస్తుంది. కొన్ని దుష్టశక్తులు నిరోధించినా, మార్మిక శక్తులు సహకరించక పోయినా, చలించక, ఏకైక లక్ష్యంతో పడుతూ లేస్తూ, అవిశ్రాంతంగా సాధన కొనసాగుతుంది. అశ్వపతి చేసింది అదే!

దివ్యత్వం అస్పష్టంగా, అగోచరంగా ఉండి పిలుపుకు తలపుకు అందక జారిపోతున్నా క్రుంగిపోలేదు. పరిసరాలను, ప్రకృతిని శూన్యంలో లయం చేశాడు. తాను నిరాకార, నిర్గుణ స్థితికి చేరుకున్నాడు. ఆపైన ప్రయాణం నిరాటంకంగా సాగింది. అది అతని అనుభూతి! సృష్టించబడినది ఏదీ సృష్టిలో స్థిరంగా నిలవదు. ఆశయాల రహదారులు దాటిన తర్వాతనే అసలు అన్వేషణ. అన్వేషణ చెలియలికట్ట లేని మహాసాగరం. అన్వేషణ సైతం దుర్భరంగా, కఠినంగా మారినప్పుడు కఠోర వాస్తవం తెలుస్తుంది. పరిణామం మానవుని పూర్ణత్వంతోనే సంపూర్ణ మవుతుంది. ఆశారేఖ చివరన మాయ పొరలన్నీ మాయమై మానవ మేధస్సు నభోమండలాన్ని చేరుతుంది. తేజోపూర్ణ మవుతుంది. సత్యాగ్నిలో నగ్నంగా కాలిన శలభంలా మాడిపోతుంది. మనిషి ఏదో ఒక మార్గం ఎన్నుకోవాలి. ప్రధానంగా తనకున్నది, తాను సంపాదించింది ఇక్కడే వదలిపెట్టాలి. అంతా నామరహితమైన వ్యర్థ పదార్థంగా మారిపోతుంది. స్పర్శకు అతీతమైన శక్తితో మనస్సు తలపడుతుంది. ఆలోచనకు కట్టుబడని ఆత్మశక్తి నేరుగా జడత్వంలో జొరబడుతుంది.

రూప ప్రపంచాన్ని వదలి అశ్వపతి ముందుకు సాగాడు. విశ్వవ్యాప్తమైన ప్రజ్ఞ అక్కడ ఆత్మను సోకింది. అది దూరం నుండి వలయాలుగా, తరంగాలుగా దగ్గరకు రాగా, అసలు కర్త అయిన సంకల్పం తన కర్తవ్యాన్ని మరచిపోయింది. అక్కడ సంకేతాలు, సజీవ రూపాలు ప్రయోజనకరం కావు. అజ్ఞానంతో మనిషి కట్టుకున్న ఆశాసౌధాలు అన్నీ కూలిపోతాయి. ఈ లోకాన్ని నడిపిస్తున్న దనుకునే విశ్వశక్తి సైతం అసంపూర్ణం అవుతుంది. అదీ అక్కడి తేజస్సులో కరిగిపోతుంది.

సృష్టించబడినది యావత్తు లయించిపోగా అశాశ్వతమైన ఆధారాలు తెగిపోయి ఆత్మ నిరాధారమవుతుంది. కడకు శూన్యంలో కరిగి 'ఆది'లో తలెత్తుతుంది. ప్రతి ఆత్మ అంతిమ లక్ష్యం ఆదితో లీనం కావడం, పరబ్రహ్మ స్థితిని తిరిగి పొందడం లేదా వాంఛలకు అతీతంగా పయనించి, సత్యాన్ని దర్శించడం. పరబ్రహ్మను చేరాలని సాధన చేసేవారికి సత్యమే ఏకైక మార్గం.

కనిపించే ప్రాభవాలు, మధురిమలు జీవితం నుండి జారిపోతాయి. ప్రవిమల జీవనం వాటిని బహిష్కరిస్తుంది. బ్రహ్మానందస్థితిలో శూన్యంలో లయించి పోవడమే తృప్తినిస్తుంది. దేవతలు, దేవతారూపాలు, దేవలోకాలు అన్నీ వివర్ణమై పోతాయి. ఇంతకాలంగా ఉన్నవనుకున్నవి ఇప్పుడు లేవనిపిస్తాయి. లోకం ధరించిన మాయజలతారు ముసుగులు తొలగిపోయి వాస్తవం నగ్నంగా కళ్ల ముందు కనిపిస్తుంది. యావత్ సృష్టికి మూలం ఈశ్వరీయత అనే సత్యం తెలుస్తుంది.

అశ్వపతి అడుగులు ముందుకు సాగాయి. సుస్థిరమైన పక్షాలను ఆత్మశరీరం అవధరించింది. తాను విశ్వశక్తికి కేంద్ర బిందువైన ఋషి అయి, తన ఆంతర్యం లోకి స్పష్టంగా, స్వచ్ఛంగా, స్వతంత్రంగా చూచుకోసాగాడు. ఆకర్షణలకు లోనై ఉన్నంత కాలం సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. అన్నీ వదలిన తర్వాత తరంగాల ఉధృతం తగ్గి, ప్రశాంత సాగర తలాన్ని చేరుకున్నాడు.

మనిషి ప్రతిభావ్యుత్పత్తులు అక్కడ నిరుపయోగం. విశ్వమేధస్సు ఆమోదించ గలదేదీ మనలో మిగలదు. శాశ్వతత్వ సంకల్పం సైతం నిష్క్రమించి, నిర్వేదంతో మహాశూన్యం పైన మరొక శూన్యపు పొర క్రమ్మినట్లయింది. రోదసి సైతం ఆ మహాశూన్య స్రవంతిలో కలిసి పోవలసిందే. రోదసి సైతం స్వప్న చిత్తరువులా విచలితమైంది.

మరణం లేని జీవాత్మ పరమాత్మలు రెండూ అరూప అవ్యక్త భూతాలవలె కదలసాగాయి. ఆ పరమాత్మ నుండే సర్వ సృష్టి ఏర్పడి, సృష్టి యావత్తు మరల

శూన్యంలో లయిస్తుంది. ఆది ఏమిటో, సృష్టికి అర్థం ఏమిటో మన భావానికి అందదు. దృష్టికి సృష్టి విన్నాణం అగోచరం. రూపరహితంగా జీవాత్మ ఒక్కటే బిక్కుబిక్కుమంటూ మిగిలిపోతుంది. ఎప్పుడో అస్తిత్వంగా ఉన్న దాని అవశేషం అది. అగమ్యం సాగరంలో మునిగిపోక ముందు, కడలిలో కరిగిపోయే తరంగపు చివరి శ్వాస అది. కడసారి అనుభవం అది. తాను నిశ్చల శూన్య సాగర తీరాన సుస్థిరంగా, భద్రంగా ఉన్న భ్రాంతి. తానే మహాసాగరమైన విచిత్రానుభూతి.

రోదసి నుండి దూరం వేరు పరచినట్లు, శాశ్వతత్వం నుండి తనను కాలం విడదీసినట్లు, నిర్వికార, నిరాకార, సచ్చిదానంద ప్రశాంతి నుండి ఆత్మ స్వతంత్రించి వేరు పడిన భావన. నిస్సహాయ స్థితిలో మిగిలిపోయిన వాస్తవం కడకు ప్రిదిలి చిరంతరాన్వేషణలో ఆత్మతో సమాధాన పడ్డది. నిరామయ, నిర్వికార, నిశ్చలత్వంలో లీనమై అభేద్యమైన రహస్యాన్ని తనలో నిగూఢంగా పదిలపరచుకొని, గంభీరంగా, ప్రశాంతంగా, అప్రతిహతంగా సంచరించసాగింది.

ఆత్మకు ఈ లోకంతోటి బంధాలు, అనుబంధాలు తెగిపోయాయి. హృదయంలో స్పందన లేదు, కారుణ్యం లేదు. పెదవులపై ఉదయించిన నిశ్శబ్ద దరహాసం, పరమాత్మ ఆమోదం లభించక అంతలోనే అంతర్హితమైంది. విశ్వ యాతనలన్నీ అజ్ఞానం ముసుగులో తలదాచుకున్నట్లయింది. తెలుసుకోదగిన మేధస్సుకు అక్కడ పనిలేదు. ఆలోచనలు, భావాలు, భావచిత్రాలు అన్నీ చెరిగిపోతాయి. అక్కడ ఎవరికి ఎవరూ తోడు కాదు, తోడు రారు. ఎవరికెవరూ సహచరులు కారు. దేనికదే వాస్తవం, దేనికదే స్వతంత్రం.

భావనలు, ప్రేరణలు లేని స్వచ్ఛమైన అస్తిత్వం అది. అవిభక్త అమల బ్రహ్మానందం నిండిన చైతన్యం అది. అనంతత్వంలో సైతం అది స్వతంత్రంగా మనగలదు. అది పరిపూర్ణం. నిరాకారంగా, నిర్గుణంగా, నిశ్చలంగా ఉన్న జీవాత్మ ఆంతర్యంలో తనను గుర్తిస్తుంది. అంతరంగంలో అది సృజన రహితం. తాను సృజనాతీతమైనా, సృజనాత్మకశక్తి తనకున్నదని తెలుసు.

సర్వ జీవకేంద్రం పరమాత్మ. అది ఎవరికోసం జీవించదు. అఖండ తేజస్సు, ఓజస్సు పరమాత్మ రహస్యం. పరమాత్మ నిర్గుణ బ్రహ్మ కల్పించిన మందిరంలో దాగి ఉంటుంది. మారుతున్న జగన్నాటకం వెనుక మారనిది పరమాత్మ ఒక్కటే. అది అప్రమేయం. నిశ్చల పరమాత్మ అభేద్యం, అనంతం, అనశ్వరం, అనూహ్యం, ఏకం.

7. ఆరాధన

అశ్వపతి యోగం ఫలించింది. పరమాత్మకు చేరువైనాడు. ప్రాపంచిక స్పృహ పూర్తిగా నశించిన తర్వాత దివ్య లోకాలలో ప్రవేశం సాధ్యపడింది. క్షణంలో అతని ఆత్మ ఆవలి తీరం చేరింది. పరమాత్మలో లీనం కావడం తన ఆశయం కాదు. తానొక వ్యక్తి, తాను మానవ ప్రతినిధి. ప్రపంచం కోసం, పరిణామం కోసం, దివ్యజీవనం కోసం తను తపస్సు చేశాడు. ఇంకా ఏదో కావాలి. అందుకే పరమాత్మకు ఎదురుగా నిలిచాడు.

అశ్వపతిలోని జీవుని పరమాత్మ ప్రశ్నించింది. అందులో జీవుని వేదన, జీవుని ఆరాటం ఉన్నాయి. దేనికోసం జీవితం! జీవుని లక్ష్యం ఏమిటి? జీవించడంకాక మరేదో ఉంది. పరమాత్మ అశ్వపతికి అతని గతాన్ని గుర్తు చేసింది. భవిష్యత్తులో సాధించవలసిన దానిని తెలియచెప్పింది. అందుకు తగిన ఉపాయం చెప్పింది. సాధన ప్రారంభించినప్పుడు అతని లక్ష్యం వేరు. జ్ఞానోదయం అయిన తర్వాత గమ్యం వేరు. ముందు తనకోసం యోగం అనుకున్నాడు. తర్వాత తనకోసం కాదనిపించింది. దశ మారింది, దిశ మారింది. లక్ష్యం మారింది, గమ్యం మారింది.

అశ్వపతి నిర్వాణస్థితిని సులభంగా చేరుకున్నాడు. దివ్యమాత అనుగ్రహం పొందగలిగాడు. జగన్మాత అతనిని తన ఒడిలోకి తీసుకుని లాలించింది. తన శక్తులను అతనికి అనుగ్రహించింది. అయినా అశ్వపతికి తృప్తి లేదు. కొత్త లోకాల తలుపులు తెరిచాడు. పూర్ణత్వం అనుభవించాడు. పరప్రజ్ఞ తనదైంది. అయినా అక్కడ ఆగిపోదలచలేదు.

సృష్టి ఆదిని స్పృశించాలి. జగన్మాతకు సర్వ సమర్పణ చేసుకున్నాడు. అడగకుండానే జగన్మాత తన శక్తుల్ని అశ్వపతికి అందచేసింది. దివ్య స్పృహతో లోకాన్ని ఉద్ధరించ పూనుకున్నాడు.

పరిశుద్ధాత్మ పరిక్రమణలో జీవికి నిగూఢ, నిర్గుణ నిస్తబ్ధత ఎదురవుతుంది. ఆ నిస్తబ్ధతలో, ఆత్మ బాహ్య ప్రపంచం నుండి వేరుపడి, వివేకాన్ని రహితం చేసుకుని, మనస్సు గ్రహించి పెట్టినదంతా అవాస్తవమని, ఇంద్రియాలు ప్రోగు చేసుకున్నదంతా అశాశ్వతమని గ్రహిస్తుంది. ఆధ్యాత్మిక ప్రశాంతిలో, సువిశాల ఆత్మసీమలలో భావనాప్రపంచం కరిగిపోగా కాలానికి దూరానికి అందని ఈశ్వరీయత మిగులుతుంది. జీవితావసరాలు అనవసరం అనిపిస్తాయి. మనస్సు నుండి ఆలోచనలు నిష్క్రమించగా, సుఖదుఃఖాల నుండి శాశ్వత విముక్తి లభిస్తుంది. అహంకారం నశించిన క్షణంలో అభిమానాలు, ఆత్మీయతలు అంతరించి పోతాయి.

"ఓ జీవుడా! అప్పుడే స్థిమితపడకు. ఇంకా చాలా వ్యవధి ఉంది. నీవు అనంత ప్రశాంత సీమలకు చేరుకున్నావు. పరమానందదాయకమైన దివ్య అగాధాలలోకి పయనించావు. కాని నీ లక్ష్యం, నీ శక్తి ఏవి? వాటిని ఎక్కడ వదలినట్లు? ఆత్మ ప్రపంచం అనేది ఏదో నీలోనే ఉన్నది కదా! నీ లక్ష్యాన్ని దివ్య తీరాలలో కరిగించావా? మృత్యుతీరంలో మరిచావా? ఈ కాంతిగోళాల మధ్య నీ శాంతిని ఎక్కడ భద్రపరిచావు? బాధ్యతల్ని విస్మరించడంవల్ల విజయం సిద్ధించినట్లు కాదు. పరలోకాల నుండి ఈ లోకంలోకి ఏ లక్ష్యంతో వచ్చావో ఆ లక్ష్యం పూర్తికానే లేదు. కాలం గడిచిపోతున్నది. కారణం? పరమాత్మ అనుగ్రహం నీపైన పూర్తిగా ప్రసరించలేదు. సృష్టి పరిణామ కార్యం సగమే పూర్తయింది. నిరాశ నీలో ప్రవేశించి, నీ కళ్ల ద్వారా లోపల ప్రవేశించి, నీ హృదయాన్ని నలిపి వేయడం లేదూ!

"ఏదీ ఆ ప్రేమమయి 'అవును' అన్న హామీ. నీ హృదయంలో నిగూఢంగా అమృతత్వం ఉంది. సృష్టి కర్తకు అదే నీరాజనం, నివేదన. ప్రణవమే సర్వాంగీకార మహామంత్రం. అదే సచ్చిదానందానికి ప్రశాంతికి మధ్య వారధి. అదే కళ్యాణ సౌందర్యం. నవవధూ మదూలిక. శత్రువుల్ని సైతం కలిపే మైత్రీ బంధం, స్నేహ మందిరం, మందహాసం. జీవన రహస్యంలోని సత్యం అదే. అజ్ఞానం తొలగి నప్పుడు విశ్వపురుషుని ఛాయను మాత్రమే నీవు చూడగలవు. కాని అసలు

వెలుగులు ప్రసరించేదెప్పుడు? విశ్వరూపుని పూర్ణరూపాన్ని దర్శించడం ఎలా? ఈశ్వరలీలలు ఎవరికీ అర్థం కావు. కడపటి అధ్యాయం ముగిసేవరకు అవి అజ్ఞాతాలే. నాటకం అసంపూర్ణంగా ముగుస్తుంది. నాటక ప్రయోక్త నేపథ్యం నుండి నవ్వుతుంటాడు. ఆ దివ్యరూపాన్ని మనిషి దర్శించాలి. ఆ పావనమూర్తిని ఆవిష్కరింప చేసుకోవాలి. అక్కడే దివ్యరహస్యం ఉంది.

ఒక మహత్తర కాంతిపుంజం కనువిందు చేస్తుంది. రోదసిలో ఎక్కడో తేజోమండలాలు అదృశ్యంగా ఉంటాయి. ఆద్యంతాలు లేని లోకానికి ఒక ప్రవేశ ద్వారం ఉంది. అదే దివ్యత్వ ప్రవేశానికి కడపటి ప్రస్థానం. కాలరాహిత్యం పైకి దృష్టి సారించినప్పుడు పరమాత్మ తాను ప్రదర్శిస్తున్న రూపప్రపంచాన్ని ఉపసంహరించుకుంటుంది. వెలుగుసీమల నుండి నిష్క్రమించిన కాంతికిరణాలు అంధకారానికి అవకాశం యిస్తాయి. అప్పుడు పరమాత్మ శూన్యంలో శూన్యంగా మిగిలిపోతుంది. ప్రకృతి స్వతంత్రించి భగవంతుని సైతం కనిపించకుండా దాచివేస్తుంది. ఆ మహత్తర శూన్యంలో సర్వం మసకబారుతుంది కాని ఏదీ స్పష్టంగా కనిపించదు. అసలు ఉన్నట్లు తోచదు. ఉన్న దానిని గుర్తించకపోవడం అజ్ఞానం, చూడకపోవడం అహంకారం. ఎప్పటికైనా అహంకారం నశిస్తుంది తప్ప ఆత్మ నశించదు. అజ్ఞానం తొలగిపోవాలి తప్ప, సత్యం కలవరపడదు. ఆ శూన్యం అమరత్వాన్ని సైతం తనలో దాచుకోగలదు. అదే అంధకార రహస్యం. వినాశం భగవంతుని లక్ష్యం కాదు. అజ్ఞానం తొలగించుకుని అమరత్వాన్ని వెలికితీయడం, పరమాత్మను దర్శించడం మనిషికి జీవితలక్ష్యం కావాలి.

ఈ విచిత్ర విశ్వానికి 'లయించడం' లక్ష్యం కాదు. జీవుని గమ్యం దేనిలోనో లయించి పోవడం కాకూడదు. నిశ్శబ్దంలో నిర్గుణం మహా శక్తిగా నిద్రాణమై ఉంది. అది జాగృతం కావాలి. అందుకు యోగశక్తి సహకరిస్తుంది. యోగనిద్రలో ఉన్న ఆత్మ మేల్కొనాలి. ఒక్క కిరణం చాలు అంతర్జ్యోతిని వెలిగించడానికి. ఆ ఒక్క కిరణ ప్రసారం మొత్తం విశ్వాన్ని దేదీప్యమానం చేస్తుంది. పరాశక్తికి సమతుల్యమైనది ఆత్మశక్తి. ఆ వెలుగు పరమాత్మను రూపుదిద్దగలదు.

ఒక అడుగు ముందుకు వేస్తే, ఒక్క మలుపు తిరిగితే ఆత్మ స్వతంత్రించగలదు. భగవదాశయం, ఆత్మలక్ష్యమూ ఒక్కటే. జీవన తీరంపైన ఆత్మ నగ్నంగా నిలవాలి. అప్పుడు ఆరాటం, అన్వేషణ అన్నీ శూన్యంలో కరిగిపోతాయి. అన్వేషిస్తున్న దివ్యత్వం తనను సమీపిస్తుంది. తనలో సమీకరిస్తుంది.

ఆ దివ్యత్వం పరమ ప్రశాంత నిశ్శబ్దాన్ని చీల్చుకుని అతీంద్రియ కేంద్రం నుండి నిరాకారంగా, నిర్గుణంగా, సచ్చిదానందంగా, తేజశ్శరీరంగా రూపుదాల్చి, మధుర మంజుల మార్మిక నర్తనంతో బయటకు వస్తుంది. కన్నతల్లి బిడ్డను గుండెకు హత్తుకున్నట్లు, ప్రజ్ఞా ప్రాభవాలకు నిలయమైన ఆ ప్రేమమయి ప్రకృతిని, ప్రపంచాన్ని, ఆత్మను తన అక్కున చేర్చుకుంటుంది. తన హృదయంలో దాచుకుంటుంది. నిర్మలంగా ఉన్న శూన్యాన్ని రద్దు పరచి, నిరుపయోగంగా నిశ్శబ్దంగా ఉన్న మౌనాన్ని ఛేదించి, నిర్గుణంలోకి చొచ్చుకుని పోయి హృదయం లోపలకు చొరబడుతుంది. అప్పుడొక సుందర తేజస్సు ప్రభవిస్తుంది. ఆ తేజస్సు ఓజస్సుగా మారి, అమృత కిరణమై, జీవునిలోని చిరకాల తపస్సును రగిల్చి, హృదయానికి బంగారు బాటలు పరుస్తుంది. ఆ సౌందర్య లహరి, సృష్టి చక్రంలో బందీ అయిన అహంకారాన్ని పారద్రోలుతుంది.

హృదయం దివ్యపూర్ణమైనప్పుడు కలిగే స్పందన ప్రపంచం నలుదిశలా వ్యాపిస్తుంది. అది మనస్సును ఆనందనిలయంగా మార్చి, బాధలు, ఆనందాలను సమంగా భరించగల ప్రేమను ప్రసాదిస్తుంది. బాధల్ని ఆనందంగా మార్చగలది ప్రేమ. అది ప్రపంచ విషాదాన్ని సైతం నిర్మూలిస్తుంది. భగవదనుగ్రహం ఏకొంచెం లభించినా ప్రపంచ భారాన్ని ఆనందంగా భరించవచ్చు. బ్రహ్మానందస్థితి జీవితంలో నిగూఢంగా ఏర్పడినా, నిరాడంబర సుఖాన్ని ప్రసాదిస్తుంది. మనిషిని ఉన్నత పథాలలో పయనింపచేస్తుంది. నిత్య నైమిత్తికాలు కొత్త విలువల్ని సంతరించు కుంటాయి.

మనిషి అభిమానంతో పూజించే దేవతల వెనుక ఉన్నది పరబ్రహ్మతత్వమే, జగన్మాత శక్తి విశ్వమంతటా సమంగా వ్యాపించి ఉంది. అది దేనినీ కాదనదు. శూన్యతలో తాను నిండి, చైతన్యం పైన తన ముద్ర వేస్తుంది. సర్వత్రా చైతన్యం ఉంటుంది. అనిత్యమైన మానవ జీవితంలో బ్రహ్మానందాన్ని నింపగలది ఆ చైతన్యమే. సర్వ జగత్తును సృష్టించి, లయం చేసే సమ్మోహనశక్తి అనంత సత్యంగా మారాలి. అప్పుడు లౌకిక, పారలౌకిక శక్తులు రెంటిని పరమ జగన్మాత సంధానపరుస్తుంది. మనిషిని బ్రహ్మభూతుని చేస్తుంది. అంధకారం, అజ్ఞానం తొలగిపోతాయి. దురహంకారంతో మనిషి అనేక తప్పులు చేస్తుంటాడు. మనోవైకల్యం, విషయలాలస తొలగిపోతాయి.

జగన్మాత సాక్షాత్కారం వల్ల ప్రజ్ఞా ప్రాభవాలు పెరగవు. జ్ఞానం స్థిరంగా ఉండదు. సృష్టిలోనే రెండు విభిన్న ధృవాలు, రెండు ప్రతికూల శక్తులు ఉన్నాయి.

రెండూ బలమైనవే. లోక వర్తనకు రెండూ అవసరమే. అవి అంధకార విశ్వం ధరించిన మేలి ముసుగులు. సృష్టిలో ఏదీ లక్ష్యరహితం కాదు. ఏదీ నిష్ప్రయోజనం కాదు. నశించిపోవడం, లయించిపోవడం మనిషి లక్ష్యం కాదు. అది సృష్టికి పరమగమ్యం అంతకన్నా కాదు.

అశ్వపతి అన్వేషణ ఫలించి గుప్తమార్గం కనిపించింది. జీవుని రహస్యం, జన్మ రహస్యం తెలిసింది. భౌతిక విషయలోలత్వం అశాశ్వతం, అసంపూర్ణం అయిన శరీరంలో మనస్సుగా ఏర్పడ్డది. మనస్సు వేదనామయం అయింది. సువిశాల ప్రశాంత సీమగా హృదయం ప్లవించి, ఆధ్యాత్మిక రసార్ణవంలో విప్పారిన సహస్రదళ పద్మంగా ప్రేమ వికసించింది. అజ్ఞానంవల్ల కలిగే విషాదానికి ప్రేమ ఉపశమనం కలిగించింది. జగన్మాత వేదన అంతరించింది.

దివ్యజీవనం మృత్యువును జయిస్తుంది. మనస్సు తప్పుగా ఆలోచించదు. జగమంతా ప్రేమమయం, త్యాగపూర్ణం అయినప్పుడు అకృత్యాలకు అవకాశం ఉండదు. రూపారూపాలు రెండూ జగన్మాత ఇరుపార్శ్వాలు. ఒక్క దివ్య వీక్షణం బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తుంది. ఒక్క దివ్యదర్శనం అమరత్వాన్ని మనిషికి అందిస్తుంది. భౌతికసుఖాలు, భోగాలు, లాలసలు అన్నీ జగన్మాత పైపూతలే. ఆమె సౌందర్యం జగన్మోహనం. ఆమె కర్మకు, విధికి, కాలానికి అతీతురాలు. అన్నీ కాలంలో తిరుగుతున్నా, జగన్మాత సంకల్పంతో క్షణంలో నిలిచిపోతాయి. కాల రక్కసిని జగన్మాత మాత్రమే కబళించగలదు.

నిశీథం తన కడుపులో దాచుకున్న రహస్యం ఆమె. జీవాత్మ ప్రదర్శించే తాంత్రిక శక్తులన్నీ ఆమెవే. తాను సుందర రూపిణి. తానే అమృత వర్షిణి. తానే అగ్నిపుష్పం. తేజోపూర్ణ హృదయిని ఆమె. పరమాత్మ ఆంతరికశక్తి పరాశక్తి. ఆమె ప్రపంచం నిశ్శబ్ద ప్రపంచం. మన యోగ ప్రస్థానం. ఆమె ఆకర్షణ కారణం గానే. మనలో చిరుజ్యోతులు వెలిగించే మహాజ్యోతి ఆమె. పరలోకాల నుండి దిగివచ్చే దివ్యకిరణం ఆమె. మున్నెన్నడు ఆవిష్కరించబడని శక్తి విలాసాలను అశ్వపతి హృదయం గ్రహించగలిగింది. జగచ్ఛక్తి కోటి రూపాలలో ప్రభవించింది.

బ్రతుకు బాధలు, భయాలు, భారాలు ఆమె పాదస్పర్శతో తొలగిపోతాయి. బంధించబడిన మానవ హృదయ కవాటాలను తెరిచేది ఆమె. హృదయంలో జ్ఞానజ్యోతిని వెలిగించమని సర్వమానవాళి, ప్రకృతి ఆమెనే ప్రార్థించాలి. లోకం యావత్తు దివ్యమందిరం కావాలి. వైరుధ్యాలు అన్నీ ఆమె అనురాగంలో కరిగిపోవాలి. మనిషి ప్రజ్ఞా ప్రాభవాలు, మమత, సమత అన్నీ ఆమెకు నివేదనం

కావలసిందే. ఆ దివ్య పారవశ్యంలో సదా జీవించగలిగే వరం పొందాలి. ఆమె కడగంటి చూపు మనిషి వేదనల్ని ఆనందాలుగా మార్చగలదు. ఆమె కారణంగానే మన ఆత్మలు పునీతం కావడం జరుగుతుంది.

పరిణామం ఆమెకే పరిమితం. మానవ జీవితాలు ఆమె పూర్ణానుగ్రహానికి లోనుకావాలి. పైలోకాలలోని నిరవధిక ఆనందమే ఈ లోకంలో దివ్యస్పర్శ వల్ల కలిగే పారవశ్యం. భగవదనుగ్రహం ఒక క్షణంలో మెరుపులా కుదిపివేస్తుంది. ఆపాదమస్తకం ఆ క్షణంలో ఆనంద పారవశ్యంతో నిండిపోతుంది. ఇంద్రియాలు ఉక్కిరిబిక్కిరి అవుతాయి. అలాంటి స్థితిలో అశ్వపతి ఆత్మ జగన్మాత కారుణ్యంతో కలవర పడ్డది.

ఆ జగన్మాత దివ్య సుందర రూపం మరల మరల దర్శించాలని హృదయం ఆరాటపడుతుంది. ఆ అనుభవాన్ని మనస్సు మళ్లీ మళ్లీ వాంఛిస్తుంది. ఆ తృష్ణ చల్లారదు, తనివి తీరదు. ఆమె దర్శనంతో అన్ని కోర్కెలు నశించి ఆమె దర్శనం చాలునన్న తృప్తి మిగులుతుంది. అశ్వపతి ఆ విధంగా ఏకోన్ముఖుడై, ఏకైక లక్ష్యసాధనకు ఉపక్రమించాడు.

అతనికి అనంతంలో ఒక వెలుగు కిరణం కనిపించింది. ఒక నాదం వినిపించింది. ఒక్క క్షణంలో జన్మజన్మల తపస్సు ఫలోన్ముఖమైంది. శూన్యంలో లోకాలు దర్శనమిచ్చాయి. వేల సంవత్సరాల అనుభవ జ్ఞానం క్షణంలో అనుభూతమైంది. తాను చేయవలసిన పని రంగం సిద్ధం చేయడమే. స్వల్ప ఆరంభమే మహత్తర ఫలితానికి ఆధారం.

దివ్యమాత ఆనందం మనలో రూపుదిద్దుకోడానికి, మన జీవన మందిరంలో ఆమె సౌందర్యం, ఔన్నత్యం కొలువు తీరడానికి మనలో పునర్నిర్మాణం జరగాలి. అప్పుడు ఆత్మ విశాలమవుతుంది. లభించిన దానితో తృప్తి కలగదు. అశ్వపతి ఆ దివ్యమాత అనుగ్రహం, ఆనందం, తేజస్సు సమస్త మానవ జాతికి అందాలని కాంక్షించాడు. అజ్ఞానం, మృత్యువు అనే తెరల్ని తొలగించడం సాధ్యం కాదు. మానవ ప్రయత్నం, మానవ శక్తి ఆపని చేయలేవు. మనిషి సామర్థ్యం పసివారి పట్టుదల వంటిది. చాచిన చేతులకు అందనంత ఎత్తు స్వర్గం. ఆలోచనల వల్ల, ఆవేదన వల్ల దివ్యత్వం దిగిరాదు. తేజస్సు అందదు. మనస్సు ప్రశాంతం కావాలి. శరీరం ఇంద్రియాతీత స్థితికి చేరాలి. హృదయం నిర్మల కాసారం కావాలి. అప్పుడైనా దివ్యత్వం అవ్యక్త రాగాలనే వినిపిస్తుంది. అంతా అవ్యక్తంగానే తోస్తుంది. సంపూర్ణ సమర్పణ ఒక్కటే మార్గం. అదే హృదయ నివేదన.

ఊర్ధ్వలోకాలలోని దివ్యశక్తి కదలి రావాలి. మూతపడివున్న మనిషి హృదయ ప్రాంగణంలో ప్రవేశించాలి. అశాశ్వతమైన జీవన పాత్రలో అమృతం నింపాలి. ప్రతిఘటించే శక్తుల్ని చీల్చి చెండాడాలి. ఏ పరమ ప్రయోజనం కోసం మన జీవితాలు ఏర్పడ్డాయో అందుకు ఇహ సుఖాలను, భోగాలను, ప్రయోజనాలను త్యాగం చేయాలి. అప్పుడు వాంఛలు నశిస్తాయి.

అలా అశ్వపతి దివ్యమాత అనుగ్రహం కోసం ఆమె రూపాన్ని తనలో ప్రతిష్ఠించుకున్నాడు. ప్రాణంలో ప్రాణంగా, ప్రాణప్రదం చేసుకున్నాడు. మనస్సు నిండా నింపుకున్నాడు. జగన్మాతను దివినుండి భువికి అవతరింపజేయాలని, ఆమె ప్రేమామృతాన్ని, ఆనంద సుధలను, సత్య రోచిస్సులను లోకంలో అందరికీ పంచాలని, వేదన స్థానంలో ప్రేమను ప్రతిష్ఠించాలని ఆశించాడు. జగన్మాత కారుణ్యంతో లోకాన్ని ఉద్ధరించాలి. అశ్వపతి ఆత్మ విముక్తమైంది. ఆమెకే అంకితమైంది.

8. నవ్యసృష్టి

సృష్టిలో కొన్ని లోపాలున్నాయి. వాటిని సరిదిద్దాలి. సృష్టించిన పరమాత్మ ఆ పనిచేయడం లేదు. పరమాత్మ ప్రతినిధులైనవారు, ఆత్మజ్ఞానం కలవారు ఆ పని చేయాలి. వేల సంవత్సరాలుగా మహర్షులు ఆ ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఆ ప్రయత్నంలో ఏదో లోపం ఉన్నది. రావలసిన పరిణామం రాలేదు. మనిషి చనిపోయిన తర్వాత మోక్షం కావాలని, స్వర్గ సుఖాలు కావాలని ఆశిస్తున్నాడే తప్ప, ఇక్కడ జీవితాన్నే దివ్య జీవనంగా చేసుకోవచ్చునని, భూమిపైనే స్వర్గం తయారు చేసుకోవచ్చునని, భౌతిక సుఖాల స్థానంలో బ్రహ్మానందం పొందవచ్చునని ఆలోచించడం లేదు. అందుకై సాధన చేయడం లేదు.

శ్రీఅరవిందుల లక్ష్యం పూర్వ ఋషులకు భిన్నమైంది. ఇందులో మోక్షం, స్వర్గం ఉండవు. దివ్య జీవనం ఉన్నది. దివ్యత్వం భూమికి దిగిరావడం ఉన్నది. అశ్వపతి తపస్సు కొనసాగించాడు. కోరిక లేకుండా యోగం చేయడం వల్ల వెంటనే ఫలితం కనిపించలేదు. నిరాశ ఆవరించింది. ప్రజ్ఞను కోల్పోలేదు. ప్రపంచాన్ని గురించిన ఆలోచనలు పోలేదు. ప్రపంచం నుండి తనను వేరుచేసి పరప్రజ్ఞ లోకి ప్రవేశించాడు. ఇహపరాలకు సమన్వయం సాధించగలిగాడు.

ఆత్మవిద్య వలన విశ్వవిజ్ఞానం బోధపడింది. తానే కర్త, తానే సాక్షి, తానే సాధన. సమాధి స్థితిలో చైతన్యం ఉంటుంది. అయినా దివ్యత్వం అందుతుంది. దివ్యశక్తులు వచ్చి చేరాయి. ప్రపంచం మారుతుందని, మానవ స్వభావంలో మార్పు వస్తుందని అనిపించింది. దివ్యస్ఫురణతో అనేక కాంతి మండలాలు దర్శించాడు. అంతకు ముందు అవి ఉన్నట్లు తెలియదు తనకు. అన్నీ ఆత్మలో ఏకం అయినప్పుడు కలిగే అనుభూతి అది.

యోగంలో కొన్ని బాధలు, ఆటంకాలు తప్పవు. అన్నింటినీ అధిగమించాలి. తనవే అయిన రెండు శరీరాల్లో జీవించడం నేర్చుకోవాలి. ఒకటి భౌతిక శరీరం, రెండవది ఆత్మ శరీరం. ఒకటి ఇహానికి సంబంధించింది. రెండవది పరాన్ని చూడగలిగేది.

అశ్వపతి యోగసాధనతో ఆర్జించిన దానికన్న చేయవలసిందే ఎక్కువ. మహత్కార్యనిర్వహణ భారం తనపైన వేసుకున్నాడు. మిగతా మానవులను వదలి తానుగా ఆపనికి పూనుకున్నాడు.

అవగాహనకు అందనిది, ఆలోచనకు లొంగనిది అయిన సత్యం ఎక్కడో అతిగోప్యంగా ఉంది. దానిని తెలుసుకునే సంకేతం అవసరం. ఆ సత్యమే లోకాన్ని రక్షిస్తుంది. అతను ఏకాంత ప్రదేశంలో, ఏకాగ్రచిత్తంతో, పద్మాసనంలో స్థిరంగా కూర్చుని భగవద్ధ్యానం ప్రారంభించాడు. ఆత్మ నిశ్చల స్థితిని చేరింది. అంతవరకు పృథ్వికి తెలియని శక్తిని ఆవాహన చేశాడు. మానవేచ్ఛకు అతీతమైన ఈశ్వర సహాయం అర్థించాడు. ఒకానొక సత్యం తనకి కావాలి. ఆ సత్య వర్చస్సు పొందడానికి అవసరమైన శక్తిని అనుగ్రహించమని పరాశక్తిని వేడుకున్నాడు. ఆమె ఆమోదం అవసరం!

ఉన్నత మండలాల నుండి తన ప్రార్థనకు సమాధానం లభించలేదు. కాలం కనురెప్పలు మూతపడి ఎంతో కాలమైంది. అవి తెరుచుకోవు. సంవత్సరాల తపస్సు వృథా అవుతోంది. మనిషికి హద్దులు ఏర్పడినట్లే మానవతకు కొన్ని హద్దులున్నాయి. మనిషి చుట్టు అభేద్యమైన కోటగోడలున్నాయి. మనిషి పిలుపు, అర్థింపు పైవారికి వినిపించదు. మనిషికి అజ్ఞానమే అవరోధం. జీవునికి అవరోధాలు తప్పవు. ఆత్మకూ తప్పటం లేదు. మూల సంకల్పంలోనే ఏదో అవరోధం, ఏదో వ్యతిరేకత, విరుద్ధభావన ఉంది. అజ్ఞానంతో సంధి చేసుకోవడం మనిషి సహజగుణం. అమాయకత్వం నటించడం మనిషి నటనా చాతుర్యం. చీకటి నైజం ఒక పట్టాన బహిర్గతం కాదు.

ఆత్మపరంగా ముందుకు సాగుతున్నా, భౌతికత్వంతో సంబంధం తెగిపోదు. ఆత్మ వెనకకు ముందుకు ఊగిసలాడుతుంది. గతం చెక్కుచెదరక భద్రంగా ఉంటుంది. గత జన్మల లేదా గత కాలపు అనుభవాల నీడలు మనిషిని వదలి పోవడం కష్టం.

అవి వివేకానికి, ప్రజ్ఞకు అందక గుప్తంగా ఉంటాయి. మనస్సు కోరినప్పుడు నెమ్మదిగా బయటపడతాయి. ఆత్మ కోరినప్పుడు మధుర స్మృతు లవుతాయి.

ఎడనెడ రాక్షస ప్రవృత్తులు విస్తరించి, సత్యాన్ని దగ్గరకు రానీయకుండా తరిమి వేస్తుంటాయి. సంప్రదాయాలు, ఆచారాలు, ఆదర్శాలు నిరర్ధకంగా మనిషిని బంధిస్తాయి. స్వర్గం భూమికి దిగివచ్చి, లోకం లోని అసమగ్రతల్ని మానవ స్వభావంలోని తీయని బలహీనతల్ని సరిచేయాలని ఆశిస్తుంది.

అశ్వపతి పరమాత్మ కోసం పరుగులు తీయలేదు. తనలో పరప్రజ్ఞను ప్రతిష్టించుకోవాలని ప్రయత్నించాడు. ప్రకృతిలోని మారుమూలల్ని గాలించి, శోధించి, పరిశీలించగా లోకాన్ని సరిదిద్ది, సముద్ధరించగల తేజస్సు ఎక్కడో దూరంగా, చీకటి మందిరాలలో దాగి ఉన్నట్లు, దానికి అవరోధాలు ప్రతిఘటనలు అనంతంగా, చిరకాలంగా కొనసాగుతున్నట్లు గ్రహించాడు. దివ్యం కానిదంతా నశించిపోతున్నట్లే తోచింది. ప్రతికూల శక్తులు కొన్నింటిని తప్పించుకోవచ్చు కాని అజ్ఞానం కేంద్ర బిందువుగానే మిగులుతోంది. అజ్ఞాన కేంద్రాన్ని ముందు రద్దు పరచాలి. అజ్ఞానమూ అనంతమే. లోతులకు వెళ్లి శోధించినకొద్దీ అది మరింతగా విస్తరిస్తుంది. దాని లోతులు అంతు చిక్కడం లేదు. ఏ వాంఛలైనా సత్యాన్ని మలిన పరచలేవు. సత్యాన్ని స్పృశించకుండా తన కోర్కెల్ని మాత్రం వదలి, శూన్య హృదయాన్ని దేవతలకు నివేదించుకున్నాడు. అలా చేస్తే, మనిషి పాప రహితు డవుతాడు. అప్పుడు అతనిలో మహత్తర పరిణామం చోటు చేసుకుంటుంది.

అశ్వపతి ఆత్మ మహాసాగర గర్భం వలె ప్రశాంతమైంది. తరంగాలు మనస్సును, శరీరాన్ని సాగరగర్భంలోకి తోశాయి. సమస్త విశ్వాన్ని ఆక్రమించాలన్న సంకల్పం ఆత్మది. అది అనంతంగా విస్తరించి, భూనభో మండలాల్ని తాకి, సృష్టిని వలయంగా చుట్టివేసింది. జీవితాన్ని దివ్య ప్రేమతో నింపి భూమిని ప్రేమదేశంగా మార్చాలని తపన పడ్డది. ఆ తపనలోని అపూర్వ ప్రేమ స్పందనతో అతని స్వభావం మారిపోయింది. మానసిక నైజం మారింది. అతని శరీరంలోని ప్రత్యణువు ప్రేమను నింపుకున్నది. ప్రతి జీవిలోను తన అంశను చూడగలిగింది. ప్రతి జీవికి తన ప్రేమను పంచగలిగింది. ఇతరుల ఆనందమే తన ఆనందంగా భావించాడు. ఇతరుల విషాదాలు తాను పంచుకోగలిగాడు అశ్వపతి. సకల జీవరాశి కర్మఫలాలను భూమి భరిస్తున్నట్లు, తాను నిశ్చలంగా, గంభీరంగా ఉంటూ సృష్టి భారాన్ని తలకెత్తుకున్నాడు. సృష్టికి విశ్వకారుణ్య దృష్టి తోడైంది.

తనలో నిగూఢంగా ఉన్న అతీంద్రియశక్తికి పరవశించాడు. ఆపైన సాగే యాత్రలో స్వ పర భేదం కనిపించలేదు. జీవుడు ఆత్మతో ఏకమైనప్పుడు జీవనస్వభావం పోయి, ఆత్మ సహజమైన సచ్చిదానందం మిగులుతుంది. ఒకరి

ఆత్మకు మరొకరి ఆత్మకు మధ్య భేదభావం ఉండదు. ప్రపంచానికి పరమాత్మకు మధ్య అవరోధం ఏర్పడదు. జ్ఞాపకాలు, రూపాలు రేఖల్ని దాటి పోగా మానసిక నియమాలు మటుమాయ మవుతాయి. అవి అన్నీ కరిగిపోయిన తర్వాత మిగిలేది శూన్యం. లోకాల్ని సృజించే చైతన్యం ఒక్కటే మిగులుతుంది. చైతన్యం అపారం, చైతన్యమే తేజస్సు, చైతన్యమే నిగూఢ ఆత్మశక్తి.

తొలిసారిగా మానసిక విస్మృతి కలిగినప్పుడు ఆత్మకు స్వార్థపరత్వం నశిస్తుంది. తాను వేరన్న ప్రత్యేక భావన మిగలదు. అది అంతరించిపోగా, తాను అన్నది లేని స్థితిలో విశాల జగత్తు అంతా ఆధ్యాత్మికం అవుతుంది. అశ్వపతి స్వభావం సర్వజీవుల చలనంగా మారింది. అంటే పరమాత్మ అన్న గుర్తింపు కలిగింది. సర్వజీవులకు అతని ఆత్మ ప్రతినిధి అయి తన నుండి వేరుపడి పరమాత్మను చేరే ప్రయత్నం చేసింది.

మానవ లక్ష్యం సంపూర్ణంగా మారిపోయింది. పరమాత్మ గుప్తంగా పదిల పరచిన మానవ హృదయం తనలోనే దైవశక్తి కదలికను గుర్తించసాగింది. సత్యాన్ని గుర్తించిన తర్వాత మనిషి మరొకదాని కోసం అన్వేషణ సాగించడు.

జీవ ప్రవాహపు ఆవలి తీరం చేరిన అశ్వపతి ఆత్మ, సృష్టి శిఖరాన నిలిచి, ఇంకా పైకి వెళ్ళడం ఎలాగని ఆలోచించింది. తాను పైకి పోయే మార్గం లేక, దివ్యత్వమే క్రిందికి దిగిరావాలని ఆశించాడు. ఆ తలపోతలో, ఆ కామనలో ఒక మహదంశ భూమికి దిగి వచ్చింది. వెన్వెంటనే శూన్యతలాలు తేజోపూర్ణాలయి మాధుర్యంతో నిండిపోయాయి. ఎక్కడో ఉన్న వెలుగులు దగ్గరగా వచ్చాయి. అతి దూరం అనుకున్న దివ్యలోకాలు అతనికి చేరువైనాయి. ఆ మహాద్భుత తేజస్సు సోకినప్పుడు ఇంద్రియాలు పనిచేయవు. అతని చెవులకు ప్రపంచ శబ్దాలేవీ వినిపించలేదు – దివ్య సంకల్పం ఏదీ నిరుపయోగం కాదు. భగవంతుడు సైతం రూప నిష్క్రమణం చేసి, మార్మిక సాగరాలలో దాక్కుంటాడు.

అతని జ్ఞానం శుద్ధమై, నిర్గుణమై దివ్య దృష్టికి అంకితమైంది. ప్రాపంచిక ప్రలోభాలు, ఆలోచనలు నశించాయి. విధి విలాసం లేదు, ప్రకృతి నైజం లేదు. అన్నీ నశించిపోగా, సమ్మోహనమైన ఆ ప్రశాంతిలో స్వఇచ్ఛా సంకల్పాలు ఉచ్ఛ్వాస నిశ్వాసలు సమసిపోయాయి. అతని ప్రతి అవయవం నిస్తబ్దంగా, జడంగా మారి నగ్నంగా, నిర్భయంగా, నిరాటంకంగా పరమాత్మను భరించి, స్వీకరించ డానికి సిద్ధమైంది. చివరి చలనం సైతం ఆగి ఒక్కసారిగా సర్వం స్తంభించి నట్లయింది.

అప్పుడు అదృశ్యంగా ఉన్న పరమాత్మ అతనిపై ఆధ్యాత్మిక ముద్ర వేసింది. ఆ దివ్య స్పందన అతనిని మహాసమాధి స్థితికి చేర్చింది. అతనిప్పుడు ఆత్మశరీరి. అతనిలో భౌతిక ప్రజ్ఞ, మానసిక వికారం లేవు. మహాసాగర తీరాలను చేరే నావికుని వలె, అతను పరమాత్మ స్పందన ఊపిరిగా, క్రిందనున్న అగాధాలను, చుట్టూ ఉన్న అగమ్య అగోచరాలను, పైన ఉన్న నక్షత్ర మండలాలను, రోదసిని క్రమంగా దాటసాగాడు. పరిమితాలైన ప్రాపంచిక శక్తులకు అతీతంగా, అసలైన మూలశక్తి దిశగా ఆత్మ పరుగుతీసింది. మానసికం నుండి మధుర ప్రశాంతికి హృదయస్థ నిశ్శబ్దంలోకి, యోగనిద్రలోకి ఆత్మ జారిపోయింది.

అలా ఆత్మశరీరి భావాలకు, శబ్ద ప్రపంచానికి దూరంగా దృష్టి పథాన్ని దాటి, కడపటి ఆధారాలన్నీ వదలి, మహత్తర తేజస్సులో కలసిపోతాడు. నిర్గుణ, నిశ్శబ్ద శూన్యంలో పయనిస్తూ పథరహితమైన శుద్ధ చైతన్యంలో ఒంటరిగా మిగిలిపోతాడు. ఆత్మ అనాత్మ స్థితుల్ని దాటి, మానసిక, చైతన్య, స్వాప్నిక సీమల్ని దాటి, ఆద్యంత రహితమైన మూలస్థితిని చేరతాడు. అక్కడ నిర్గుణ సీమలలో శబ్దకాలుష్యం ఉండదు. ధవళ తారుణ్యం ప్రకాశిస్తుంది. భౌతిక ప్రపంచానికి దూరంగా పోయినకొలది ఆధ్యాత్మిక ప్రశాంతి పెరుగుతుంది. అక్కడ దేనికీ ఆది అంతం ఉండవు. చలనమున్న ప్రతి వస్తువుకు నికరమైన శక్తి ఉంటుంది. సృష్టికి మూలధాతువైన కృణువు సైతం అచలంగానే ఉంటుంది. ఆ మహాశూన్యంలో సృష్టికి మూలం ఎక్కడున్నదో అంతు చిక్కదు. సృష్టి మహాయంత్రాన్ని ఆత్మ అసలు గమనించదు. విధి నడిపించే యంత్రమంత్రాలు వినిపించవు. ఒకే ఆత్మలో మంచిచెడులు కలసి పోతాయి.

ప్రేమించిన చోటనే ప్రతిఘటన, ప్రేమ పంచే తావునే ప్రతికూలత. జీవితంలో ప్రతి ప్రయోగంలో అంతర్వేదనవల్ల అవకాశాలు అందివస్తాయి. విలువలు మారుతుంటాయి. మానసిక యాతనలు తట్టుకోలేక, మన జీవితాలను దేవతలకు తాకట్టు పెడుతుంటాం, పణంగా సమర్పించుకుంటాం. ఆలోచనలు చీకటి వెలుగులవలె సదా మారుతుంటాయి. బాహ్య చైతన్యంపైన నీలి నీడలు పడుతుంటాయి. నిశ్చలంగా ఉన్న స్వాప్నిక స్థితిలో ఆత్మ లోకాన్ని సాక్షికంగానే గమనిస్తుంది.

వివేకంతో సాధించేదంతా అజ్ఞానమే. అది పరానికి పనికిరాదు. జీవితంలో సాధించేవన్నీ నిష్ప్రయోజనాలే. అప్రయత్నంగా జరిగే సంఘటనలకు, అనూహ్యంగా జరిగే వాటికి చైతన్య ప్రపంచంలో విలువలేదు. ఆత్మశక్తి ఒక్కటే

ఆ చైతన్య ప్రపంచంలో ప్రవేశించ గలుగుతుంది. అది ఒంటరిగానే పయనిస్తుంది. అలా పయనించినప్పుడే విశ్వశక్తుల్ని, మార్మికశక్తుల్ని తనలోకి తీసుకోగలుగుతుంది.

ఒకభావం మరొక భావంతో, ఒక సత్యం మరొక సత్యంతో కలహించవు. ఒక న్యాయం మరొక న్యాయంతో తలపడదు. ఉన్న అవకాశం వదులుకుని కొత్త అవకాశం కోసం ఎదురుచూచే మనుషులకు అక్కడ స్థానం లేదు. జడస్థితిలో తేజోరహితంగా ఉన్న శరీరంలో స్పందనలు యాదృచ్ఛికంగా ఏర్పడవు. యోగాగ్నులలో కాలి, జగన్మాత మందిరంలో సత్యాన్ని నిత్య నివేదన చేసి, పరమాత్మ ధర్మాన్ని తలదాల్చే వారున్నారు. ప్రకృతి మూగగా ఉండీ తనపై ఆధారపడి ఆధ్యాత్మ జీవనం గడిపే వారిని రక్షిస్తూనే ఉంటుంది. వారిని ఎప్పుడూ గుర్తిస్తుంది. అసంఖ్యాకంగా ప్రపంచంలో జరిగే అకృత్యాలకు, అలజడులకు ప్రకృతి కలవరపడదు. పైగా తన ఆమోదముద్ర వేస్తుంది. అందుకే అవి ప్రకృతి సహజం అనిపిస్తాయి. అలాగే సర్వం తానైన పరమాత్మ సర్వాన్ని గ్రహిస్తూనే ఉంటుంది, గమనిస్తూనే ఉంటుంది. ఒక్క జ్ఞాననేత్రం చాలు సృష్టి మొత్తాన్ని పరిశీలించడానికి.

అశ్వపతి కల్లోలాలకు అతీతంగా నిశ్శబ్దంలోకి, అనంత ప్రశాంతిలోకి ప్రవేశించాడు. ఆది అంతం లేని ఆత్మ అతనికి ఆవాసమైంది. ఇప్పుడు పరిపూర్ణ ప్రజ్ఞ అతనికి అండగా ఉంది. అతనిది మహామేధస్సు. అది విశ్వ మేధస్సు. అది ఆలోచనలకు లొంగదు. శూన్యంలో విహరించగలదు. కాలానికి లోబడదు. పట్టువదలనిది ఆత్మ. చిరకాలంగా తన యాతనలకు ముగింపు లభించినట్లయింది. తాను జనన మరణాలకు అతీతుడైనాడు. ఆత్మకు జననం లేదు, మరణం లేదు. పరమాత్మ సామ్రాజ్యంలో తానొక్కడై తానే పరమాత్మగా మారాడు.

ప్రశాంత రోదసిని ఏకాంతం ఆవహించింది. కాలానికి కట్టుబడిన వాటితో రోదసికి ప్రయోజనం లేదు. తన ప్రమేయం లేదు. శూన్య రోదసిలో అంతటి విశ్వం శూన్యమే అవుతుంది. సమస్త సృష్టి కడకు తొలి అరూపస్థితికి చేరవలసిందే. కాల చక్రభ్రమణం నిలిచిపోగా, లోకం స్తంభించి నట్లయింది. తను కలుషిత వాతావరణం దాటిపోయినా తనపైన అనేక గతకాలపు ముద్రలు మిగిలాయి. స్వప్నం క్రమంగా కరిగి పోయినట్లు, బాహ్య ప్రకృతి క్రమక్రమంగా లయించ సాగింది.

ఆ మహాశూన్యంలో సుస్వనాలు వినిపించవు. సుందరసీమలు సమాధానం చెప్పవు. ఎటు చూచినా నిశ్శబ్దం. అది దివ్యావిష్కరణకు ముందర అలముకునే

ప్రశాంతి. పరమాత్మ ఆదేశాలకై సర్వ ప్రకృతి ఎదురు చూస్తుంది. సాగరం తన లోతుల్ని తనే అన్వేషించు కున్నట్లు, ఆత్మ తన లోతులను తానే అన్వేషిస్తుంది. దృష్టి లోచూపుగా మారి అందర్దృష్టి ఏర్పడుతుంది. అప్పుడు దివ్యత్వం గడ్డకట్టినట్లు ఒక బిందువుపై కేంద్రీకరించినట్లు అనేక మహత్తులు అతనిలో ప్రవేశించాయి. తన్మయత్వం, తేజస్సు, ఓజస్సు, ప్రణయజ్వాల అన్నీ బ్రహ్మానందంలో ఏకమైనాయి. దివ్యత్వం నింపుకున్న హృదయానికి అస్తిత్వం అనుభూతమైంది. ప్రతి ఒక్కరు ఆత్మ తేజస్సుతో పరమాత్మను ఆశ్రయిస్తారు.

ఈ విశ్వంలో మహత్తర లీలలు అన్నీ పరమాత్మ స్పందనలే. వాటిని గ్రహించడం అంటే పరంజ్యోతిని దర్శించడమే. మేధస్సు సప్త తంత్రీవాద్య ప్రక్రియ. మనిషి జీవితం అనేక జీవవాహినుల సంగమం.

లోకాలు అనేకాలైనా, అన్నింటి ఆత్మ ఒక్కటే. రోదసిలో విజ్ఞానం బీజం నాటింది. ఆ బీజం తేజస్సులో భద్రంగా దాచబడ్డది. దానికి ఎలాంటి ఆచ్ఛాదనలు అవసరం లేదు. అత్యద్భుతమైన ఆ సమాధ్యవస్థలో ఒక తీవ్ర స్పందన, ఒక చలనం ఏర్పడి అమలిన ఆధ్యాత్మిక విజయంతో నవ్యసృష్టి జరిగింది. అందులో అసంఖ్యాకంగా దివ్యత్వాలు, అపరిమిత ఆనందలహరులు ఏకమైనాయి. అహంకార రహితమైన ఆత్మ మానవుని హృదయంలో ప్రవేశించింది.

బ్రహ్మానంద స్థితిలో ఉద్దీప శక్తులు కాలాన్ని కాలాతీతంగా మార్చగలవు. సర్వం సర్వంతో కలసినపుడు అంతా సంపూర్ణమే. అక్కడ వైరుధ్యాలకు, వైఫల్యాలకు తావుండదు.

ఆధ్యాత్మిక బంధం అన్ని ప్రాపంచిక బంధాలకన్నా గొప్పది. దేనితో దేనినైనా ప్రేమతో ముడివేసి బంధించగలదు. కడకు అక్షరమూర్తితో బంధించి అజరామరం చేయగలదు. దేనికది మౌలికమైనా, అన్నింటినీ సమంగా స్వీకరించి, వైవిధ్యాలను భరించి, తనలో సమస్త విశ్వ విభూతుల్ని దర్శించగలిగాడు. అనంతసృష్టి వలయం యొక్క కేంద్ర బిందువు నుండి శిఖరం వరకు దర్శించి, ఆత్మపరంగా దివ్యానుభూతి చెందాడు. అందరి ఆత్మలు తన ఆత్మ వలె అనుభూతిం చాలని ఆశించాడు. అన్ని రూపాలను, గుణాలను అవ్యక్తం నిరంతరాయంగా తనలోకి ఆకర్షిస్తుంది. దివ్యసీమలలో నిరాటంకంగా సాగినట్లు దివ్యత్వ పరిధి పదింతలుగా పెరిగింది.

ఎవరికెవరూ దూరం కారు. ప్రతి ఒక్కరు ఒంటరిగా జీవించవలసిందే. ప్రతి ఒక్కరు తనలోని, సర్వ జీవరాశిలోని పరమాత్మ కొరకే ప్రాకులాడడం.

ప్రతి ఒక్కరిలో సమస్తం లవలేశంగానైనా వ్యక్తమవుతుంది. అక్కడి ఏకాంతం ఒంటరితనం కాదు. దివ్యత్వం వేయి విధాల అభివ్యక్తమవుతుంది. అది తేజోపూర్ణం. పరిణామం దానిని అంటదు. పరిణామ గతికమైన అసంఖ్యాక రూపాలు దాస్య వృత్తిని ప్రోత్సహిస్తాయి. సూక్ష్మలోకాల నుండి సర్వశక్తులు విశ్వ భావనలై నిర్దుష్టంగా అద్భుతంగా బయటకొస్తాయి.

బాహ్యరూపాలు వేరైనా, అన్నింటి సత్యస్వరూపం ఒక్కటే. రంగాలంకరణ లోనే భేదాలు. మానవులందరిలో ఉన్నది పరమాత్మ అంశలే. అన్ని ఆత్మలు పరమాత్మ అంతర్భాగాలే. తన్మయస్థితి సంపూర్ణంగా కలిగినప్పుడు అన్ని వేదనలు మధుర ప్రేమకు బాసటలవుతాయి. అద్వైత సిద్ధి వల్ల లభించే నిర్మలాంతఃకరణ రక్షణ కల్పిస్తుంది. వైరుధ్యాల సంగమరేఖపై జీవిత నాటకం అర్థాంతరంగా ముగుస్తుంది. ఆత్మదర్శనం లభించిన తర్వాత దివ్యత్వానికి ఆకర్షణ ఉండదు. అంతకు మించి సచ్చిదానందం యోగపరంగా లభిస్తుంది.

అఖండ బ్రహ్మానందస్థితిలో పరబ్రహ్మ సహాయ సహకారాలు పూర్తిగా లభిస్తాయి. అప్పుడు లేమికి, వేదనకు, నిరాశకు తావుండదు. ఒక్కొక్క అనుభవం ఒక్కొక్క ఆనందాన్ని రుచి చూపిస్తుంది. అన్ని అనుభవాల చాటున ఉన్నది బ్రహ్మానందమే. సర్వ ప్రకృతి పరమాత్మ చైతన్య రూపమే. అందరిలోనూ ప్రజ్ఞ నెలకొంటుంది. ఆత్మీయంగా, ఆత్మగా బహిర్గతమవుతుంది. అన్నింటిలోను తేజస్సు ఉంటుంది. సత్యం, జ్ఞానం వలె ప్రభవిస్తుంది. ప్రకాశిస్తుంది. అన్నింటిలోను సృజనాత్మకత అంతర్లీనంగా ఉంటుంది. పరం నుండి అందుకునే శక్తి క్షణంలో మన భావనను కార్యోన్ముఖం చేస్తుంది. నిశ్శబ్దం నుండి ఒక నాదం ప్రణవంగా ఉద్గమిస్తుంది. శూన్యం నుండి ఒక సౌందర్యం రూపుదిద్దుకుని వెలికివస్తుంది. కాలంగుండెను చీల్చుకొని జ్ఞానం ఆవిర్భవిస్తుంది. వ్యామోహ రహితంగా, నిస్వార్థంగా సంకల్పం చేస్తే ఏదైనా సిద్ధిస్తుంది.

దివ్య తేజస్సుతో నిండిన హృదయానికి తన్మయస్థితి నిరాటంకంగా కలుగుతుంది. సర్వం పవిత్ర ప్రేమతో తాదాత్మ్యం చెందుతుంది. సార్వజనీన దృష్టి ఏర్పడుతుంది. అలాంటి హృదయం మరొక హృదయాన్ని స్పందింప చేయగలదు. ఆలోచనల అంతర్గత శబ్దాలను వింటూ హృదయ స్పందనల్ని అనుభూతిగా మార్చుకోగలదు. అనుభూతిని అందుకోడానికి చేతులు చాచ పనిలేదు. చైతన్యానికి మూలమైన ప్రక్రియలు చాలా ఉన్నాయి. అవే ఆత్మకు ఆత్మకు మధ్య అనురాగాన్ని పెంచి ఆత్మీయతను కలిగిస్తాయి. మమేకస్థితిలో ఆధ్యాత్మిక శక్తుల ఏకీకరణం, అతీంద్రియ జగత్తులో ఆత్మ పరివర్తనం విచిత్రంగా

జరుగుతుంది. అలా ఏర్పడిన నవ్యసృష్టిలో అశ్వపతి విశ్వదర్శనం చేసుకున్నాడు. విశ్వవ్యాప్తమైన వెలుగులకు తానే ఆధారమైనాడు. శాంతి మహాసాగరంపై తాను ఏకైక తరంగమైనాడు. అతని మేధ అసంఖ్యాక మేధస్సులకు ప్రాతినిధ్యం వహించింది. రోదసిలో అతని చలనాలే సంకేతాలు. విశ్వస్పందనలకు అతని జీవితమే యవనిక అయింది.

ఒకే లక్ష్యంతో ఒకే గమ్యం వైపు సాగిపోతున్న అనేక అభి'మతాల' పద సవ్వడిలో సారూప్యత కనిపించింది. మతాభిమాన ప్రవాహం సదా నూతనం, సదా ఉత్తేజితం. ఆ ప్రవాహాల ఉధృతికి ఆధ్యాత్మికం కలవర పడుతుంది. అశ్వపతి ప్రత్యణువులో ఆ మాధుర్యాలను అనుభవించ గలిగాడు. అవి నిర్మల స్పందనలై, అఖండ సచ్చిదానంద స్వరాలై కోటికోట్ల ఆనందాలకు నెలవులైనాయి. తాను ఒక్కడై అన్నింటిని ఒక్కటిగా అనుభవించాడు.

ఆ దివ్యప్రకృతిలోని చరాచరాలపైన నిర్మలంగా, ఆపాతమధురంగా ఈశ్వరీయత ప్రసరించింది. పరమోత్కృష్టమైన ఈశ్వర సామ్రాజ్యానికీ తనకూ మధ్య వెలసిన కాంతి మండలాలు క్రమంగా వివృతమైనాయి. ప్రతి మండలం, ప్రతి భూమిక సత్యానికి ప్రతీక అయినా ప్రతిది బ్రహ్మానందానుభూతికి నిలయమే. దేని సౌందర్యం దానిది. దేని నైర్మల్యం దానిది. అన్నీ ఒకే పరమ సత్యానికి ప్రతినిధులు. వాటికి ఆంతర్యంలో ఐక్యత, సారూప్యత ఉంటుంది.

ప్రతి మండలం పరిసర మండలాలకు తన శక్తిని అందిస్తుంది. అందువల్ల తన వర్చస్సును ఏమాత్రం కోల్పోదు. అలా పరస్పరం సహాయం చేసుకుంటూనే మండలాలు తమ శక్తిని అభివృద్ధి చేసుకుంటాయి. అన్ని శక్తులలో తమకు వాటా ఉన్నట్లు భావించి, ఆనందాన్ని సమంగా పంచుకుంటాయి. సమంగా అందుకుంటాయి. ఆ స్థితిలో ఆత్మగతంగా ఆనందం అనుభవించడానికి సంయమనం అవసరం. సమదృష్టి అవసరం. ఏకాంతం మరింత అవసరం. ఒంటరిగా ఉన్నప్పటి ఏకాంతం సమత్వాన్ని ఆశిస్తుంది. అనేకంగా ఉన్నవన్నీ కడకు ఏకాంతాన్ని ఆశ్రయించక తప్పదు. సర్వసృష్టి, సర్వజ్ఞతకు మూలమైన బ్రహ్మానందస్థితి సత్యావిష్కరణకు అనువైన రూపాలను అన్వేషిస్తుంది. సత్యాన్వేషులకే ఆ స్థితిని చేరడం సాధ్యం.

అగోచరుడైన పరమాత్మకు దివ్య సంకేతాలు మెరుపునెగళ్లు. సృష్టి వైచిత్రి ఆత్మకే అనుభవం. ఆత్మ ధావళ్య మండలంలో వర్ణరహిత ఆకాశపటంపైన అవి చిత్ర వర్ణాలుగా భాసిస్తాయి. ఆ రంగులు, హంగులు అన్నీ పరమాత్మవే. అవి పరమాద్భుతాలు. సృష్టికి మూల పదార్థాలు ఆనందం, సౌందర్యం, శక్తి. అవి

సత్యం, నిత్యం అయిన యోగచైతన్యం. ఆ దివ్యసంకేతాలు దివ్యత్వం నింపుకున్న హృదయానికి అందుతాయి. యోగి హృదయం ఆ సంకేతాలను ఆనందంగా స్వీకరించి, అవి అనుగ్రహించే అతీంద్రియ దృశ్యాలతో తృప్తి చెంది, వాటిని నిత్య సత్యాలుగా మార్చుకుంటుంది. యోగి నిష్పక్షపాత హృదయం అద్భుతాలకు, మహత్తులకు నెలవవుతుంది. కాల నిబంధన లేని మార్మిక శక్తులకు అది సంగమస్థలి.

ఆ మహాచైతన్యం పరమాత్మకు రోదసిని భవ్యమందిరం చేసి క్రమంగా అనేక అద్భుత శక్తులను ప్రసాదించింది. అప్పుడు ప్రేమ, సౌందర్యం, మార్మిక సత్యం, సచ్చిదానందం అంటే ఏమిటో తెలిసింది. పరమాత్మది, దివ్యమాతది తల్లీబిడ్డల అనుబంధం. విశ్వమే వారికి క్రీడామందిరం. దివ్యమాత అమృత హృదయమే పరమాత్మకు ప్రేమమందిరం.

ఆమె అనంత సత్యాలే పరమాత్మకు క్రీడా వినోదాలు. ఇక్కడ ఆత్మ వదులుకున్నవన్నీ అక్కడ ఉచిత స్థానం ఆక్రమిస్తాయి. మన మనస్సు చేసే తప్పిదాల వల్ల హృదయాలు పొందలేని శక్తులు అక్కడ పరాశక్తులుగా, పరమ సత్యాలుగా, పరమానంద దాయకాలుగా భాసిస్తాయి. సృష్ట్యాది నుండి తపస్సుతో పండి మహాత్ములైన వారంతా తమ తమ ఆత్మోన్నత్యాలను అందుకున్నారు. వారి ప్రజ్ఞ దివ్య జ్ఞాన ప్రభాభాసురమై, శాంతి కిరణాలకు ఆకరమైంది. వారు భావనా బలంతో దివ్య సీమలలో జీవించగలరు.

సంకల్పం ఒక మహత్తర మంత్రశక్తిగా మారి అగోచరాన్ని సైతం ఆవాహన చేసుకోగలదు. పూర్వ శక్తిని, ప్రజ్ఞను ప్రదర్శించగలదు. తనలో ప్రతిష్టించు కోగలదు. సత్యం విచిత్ర వర్ణ భావ పక్షాలు విదిల్చి హిరణ్య గగనాలలో విహరించ గలదు. పరమాత్మ సైతం పరవసించే మధురగీతాలను గానం చేయగలదు. మహా సంకల్పం ఒక్కటే పరమాత్మను హృదయ మందిరంలో ప్రతిష్టింపచేయగలదు.

అదే మనస్సును, హృదయాన్ని, వివేకాన్ని పరమాత్మ భావనతో నింపుతుంది. ప్రతిశబ్దంలో ప్రణవనాదం వింటూ, ప్రతి వెలుగులో పరంజ్యోతిని దర్శిస్తూ, ప్రతిరూపంలో దివ్యమంగళ విగ్రహాన్ని సందర్శిస్తూ, ప్రతి మంత్ర పదంలోనూ పారవశ్యం చెందుతుంది. ఆలోచనలన్నీ అనంతమూర్తితో నిండిపోతాయి. అప్పుడు భావానికి, వాస్తవానికి మధ్య దూరం కనిపించదు. ఒక శాబకం మరొక శాబకాన్ని పరామర్శిస్తున్నట్లు ఆలోచన, సంకల్పం పరస్పరం సహకరించుకుంటాయి. ఆత్మకు పరమాత్మకు మధ్య అనుబంధం ద్విగుణీకృత మవుతుంది.

ఈశ్వర భావన కాలాన్ని కమనీయం చేస్తుంది. పునీతం చేస్తుంది. దివ్యమాత ఆడించే ఆటలతో జీవుడు అలసిపోడు. ఆమె పెదవులపై సదా చిద్విలాసం, హృదయంలో ప్రేమామృతం జీవికి అలుపు రానీయవు. అది సుందర, సురుచిర, సాహస లాస్యం.

దివ్యమాత అనుగ్రహమే పరిణతికి, పరిపక్వతకు సూచిక. ఆమె ప్రజ్ఞా ప్రాభవాలు రమణీయ చిత్రాలు. అవి కాలంపైన రచించే వర్ణ చిత్రాలు. ప్రతి మలుపులో కొత్త అనుభవాలు కలిగిస్తూ పరిణామ ప్రగతికి దోహదం చేస్తుంటాయి. ఆత్మ పరిశోధన అనంతంగా సాగుతుంది. దివ్యమాత సంకల్పమాత్రంచే అనేక అవరోధాలు సృష్టించి సత్యాన్ని దూరంగా ఉంచి సాహస యాత్రకు ఉసి కొల్పుతుంది. అప్పుడప్పుడు సత్యం మిణుక్కున మెరుస్తుంది. రసరమ్య గీతాలను వినిపిస్తూ గతానుగతికం అనిపిస్తుంది.

యోగి ఆ దివ్యమాత హృదయంపై దాగుడుమూతలాడుతూ కళాకారుని వలె ఆమె సౌందర్యానికి పరవశించిపోతాడు. ఆ పిపాస ఎన్నటికీ ఆగదు. ఆ సుందర రూపాలలో తాను మమేకమై, తనను తాను మరచిపోతాడు. తన ఉనికినే విస్మరిస్తాడు. అలసిపోక, విసుగులేక ఆమె కార్యభారాన్ని తాను తీసుకుంటాడు. దివ్యానందం ఒక విచిత్ర ప్రక్రియ. వివశత్వం ఒక సజీవ గీతమాలిక. విశ్వరూపం ఒక చలచిత్ర చయనిక. ప్రగతికి మనస్సు వేదిక. హృదయావిష్కృత చిత్రాలకు ప్రదర్శన శాల. అది ఒక ఆత్మ పరమాత్మకై పడే ఆరాటం. అక్కడ పదార్థం జీవధాతువు యొక్క సాంద్రస్థితి. అది ఆత్మానందానికి బాహ్యరూపం. భావ చిత్రాలకు భద్రమందిరం. వివేకం తన ఆనంద సీమలను తానే సృష్టించుకుంటుంది. అది అఖండ సచ్చిదానంద నిలయం. ఆ మందిరంలో సంవత్సరాలు క్షణాలవలె గడుస్తాయి. అక్కడ ఇంద్రియాలు ఆత్మకు బానిసలు. ప్రతి చిన్న ఆలోచనకు దివ్యత్వం తోడు నిలుస్తుంది. ఆత్మ వినగలిగేదంతా ప్రణవనాదంగా అనువదించబడుతుంది.

అది జీవాత్మ పన్నిన మెరుపుల వల! నిర్మల ప్రేమ మాత్రమే ఆ వలలో చిక్కుతుంది. మన ఆరాటం ఆరాధనకు జతపడి పరమాత్మ రాకను సన్నిహితం చేస్తుంది. అద్భుతం అనిపిస్తుంది. ఆ పరిణతికి అమరత్వమే ఉపాదేయం. బ్రహ్మానంద లబ్ధికి అవి అన్నీ శాంతి సోపానాలు. దివ్య ప్రజ్ఞను నింపుకున్న తపోధనులు ఆత్మలను వెలుగులతో నింపాలని తపన పడతారు. అందుకై తపస్సు చేస్తారు. ప్రబుద్ధమైన ప్రతిచర్య హృదయాన్ని పులకింపచేస్తుంది. అనుభూతిని కలిగిస్తుంది. మహాత్ముల ఆలోచనలన్నీ ఆత్మానందకారకాలే. జీవుడు పొందే

బ్రహ్మానందం శాశ్వతం. మన లోకంలో గతించేదంతా అక్కడ అనంత సౌందర్యంతో ఆధ్యాత్మిక తేజస్సుగా భాసిస్తుంది.

కొద్దికాలం పాటు దివ్యానుగ్రహం వల్ల అనేక మహత్తుల్ని ప్రదర్శించడం జరుగుతుంది. దివ్యదృష్టితో దైవరూపాలను దర్శించవీలుంది. కాలం అన్నది పరమాత్మ కప్పుకున్న ముసుగు. అశ్వపతి తన ఆత్మపదార్థంతో కఠినశిలలో శిల్పాన్ని నిర్మించినట్లు, ఒక సుందర ప్రపంచాన్ని రూపించుకున్నాడు.

ఆధ్యాత్మిక లోకాలలో సైతం అన్నీ సజావుగా సాగవు. ప్రతికూల శక్తులు ప్రజ్వరిల్లి, ఆత్మ వైభవంపై నీలినీడలు పరుస్తాయి. నీలాపనిందలు ఎంతటి మహాత్ములకైనా తప్పవు. ఆ లోకంలో రెండు శక్తులు పనిచేస్తాయి. తన ఆత్మను గుర్తించకుండా చేసేది ఒకటి, ఆత్మ దేనినీ తెలుసుకోకుండా అడ్డుపడేది ఒకటి.

తనను, తన ప్రపంచాన్ని గుర్తించని ఆత్మ భూలోకంలో చైతన్యరహితంగా కాలం సాగిస్తుంది. స్వతంత్రించడానికి ధైర్యం చాలదు. అవకాశం రాదు. వైరుధ్యాల వల్ల రెండుకొనలు కలవవు. మూడు శక్తులు యోగి ప్రగతిని అడ్డుకుంటాయి. ఒకటి అజ్ఞానం, రెండు వేదన, మూడవది అనిశ్చితత్వం, సందేహంతో కొట్టుమిట్టాడుతున్న మనస్సును ఒక విషాద సంఘటన కుదిపి వేస్తుంది. అజ్ఞానం మహాశక్తిగా మారి ప్రగతికి అడుగడుగునా ఆటంకం కలిగిస్తుంది. అవసరం, అవకాశం చేయి చేయి కలిపినప్పుడు మాత్రమే అజ్ఞానంలో ఉన్న మనిషి వెలుగులోకి రాగలడు. అదీ జగన్మాత మార్మిక పథకంలోని భాగమే.

అజ్ఞానం ఆధ్యాత్మికతకు ప్రథమ శత్రువు. ప్రాపంచిక బంధాల నుండి విడివడనీయదు. పరమసత్యం దిశగా ఆలోచించనివ్వదు. సత్య రుచుల్ని మొగ్గలోనే త్రుంచివేస్తుంది. అజ్ఞానం, లోకజ్ఞత అనే మాయలో ముంచి, సౌందర్య ప్రలోభాలలో కుదించి, సుఖలాలసతనుపెంచి మనిషిని సత్య విముఖుణ్ణి చేస్తుంది.

అయినా జీవునిలోని దివ్య బీజం హరించి పోదు. అది మనస్సులో కదులు తుంటుంది. పాత జీవితంపై రోత పుట్టి కొత్త జీవితానికి వాకిళ్లు తెరుస్తుంది. అజ్ఞానం వెనక దాగిన జ్ఞాన రేఖ ఎప్పుడో బయట పడుతుంది. అంతదాకా నిద్రిస్తున్న వివేకం తల విదిల్చి, మత్తు వదిలించుకుని పైకొస్తుంది. అంతర్వీక్షణలో రవంత దివ్యత్వం కనిపించినా, ఆనంద మందిర ప్రవేశం లభించినట్లే. ఎప్పుడో అశరీరవాణి పిలుపు గుండెకు వినిపిస్తుంది. అది చాలు ప్రజ్ఞ ప్రభవించడానికి, ఈశ్వరలీలలు కాలానుగుణంగా ఉంటాయి.

మనం భ్రమలో జీవించడమూ మహామాయ కల్పనే. భ్రమల వల్లనే

అనవసర ఆర్భాటాలు. ఒకసారి నిశ్చలత్వం అలవడినా అది ఆధ్యాత్మికం కాదు. అనాసక్తత ... ప్రపంచ సుఖాలపట్ల విరక్తి. నిరీక్షణ ఫలించాలంటే అంతర్వీక్షణ అవసరం. అశ్వపతి రేపటి ప్రపంచాన్ని నేడు చూచాడు. అది అంతర్దృష్టి. కాలాతీతమైన భావన అనుభవిస్తున్న దివ్యత్వం కన్న భవిష్యద్దర్శనం మిన్న. చైతన్యానికి సుదూరంగా, కడపటి అంచుపైన భూగోళం అస్థిరంగా, అల్పంగా కనిపించింది. గతించిన గతం తాలూకు చెరగని ముద్రలు అవి. దానిపైన ఆత్మ అవధరించిన సుఖస్వప్న చాలికలు. అశ్వపతి ఆత్మశరీరం మార్మిక మండలాలకు ఎగిరిపోయింది. తనకు ఆ లోకం కొత్తగా, ఒక క్రీనీడగా తోచింది. ఆత్మశరీరానికి ఈ భూప్రపంచం అతి దూరంగా, కళారహితంగా, నిర్జీవంగా తనది కానట్లు అనిపిస్తుంది. ఆత్మ పరమాత్మలు మాత్రమే శాశ్వతాలనిపిస్తాయి. తాను ఎంతగానో ప్రేమించిన వారు, అనుభవించిన సుఖభోగాలు వేదనా శకలాలై మిగిలాయి. తనదే అయిన గొంతుక ఇప్పుడు తను గుర్తించలేనంత కొత్తగా ఉంది. తన పిలుపుకు తన అంతర్వాణి ఏదో సమాధానం చెప్పింది. మార్మికభాషలో అక్కడి ఏకాంతం అనంతత్వంలోని ఒక కొంత భాగం. అది దృష్టికి అందదు. సృష్టికి అతీతం. అంతరంగంలో అణుచలనం.

మహాచైతన్యం తన విశ్వ వ్యాపకత్వాన్ని మరచిపోయి ఆత్మ మౌలికతను మరెక్కడో పదిలపరచి, అనిశ్చితతో కాలాన్ని సాగిస్తూ, తనను తానే మభ్యపెట్టు కుంటుంది. తనదైన దివ్యత్వాన్ని, వైదుష్యాన్ని అవమాన పరుస్తుంది. నిజానికి సర్వోత్కృష్ట సంకల్పం తనదే. తానే దాని ప్రతినిధి. తన జ్ఞానాన్ని అజ్ఞానంతో కబళించి వేసింది. తప్పిదాలను, విచారాల్ని, బాధల్ని, మృత్యువును కోరి తెచ్చుకుంది. అజ్ఞానానికి తగిన పరిహారం చెల్లించనిదే జ్ఞానం బయట పడదు. వివేకం మేల్కొనదు.

భౌతిక జీవితంలోకి, అజ్ఞానంలోకి ఎందుకు తాను ప్రవేశించిందీ ప్రతి ఆత్మకు తెలుసు. అశ్వపతి ఆత్మకూ అది తెలుసు. వక్రమార్గంలోకి లాగే దుష్ట శక్తులు, క్షుద్రశక్తులు తననూ ప్రలోభపెట్టాయి. ఇప్పుడు ఆత్మ జాగృతితో పరమాత్మను చేరుకోవాలని ఆశించాడు. ఇప్పుడు అతనివి రెండు శరీరాలు. ఒకటి – స్వతంత్రం, విశ్వాసం, ఆత్మికం. రెండవది – భౌతికం. లోక యాతనలు, బాధలు భరించడానికి సిద్ధంగా ఉన్నది. స్థూల, సూక్ష్మ శరీరాలను నియంత్రించగల సూత్రం ప్రజ్ఞ. ఇహ, పర లోకాలను కలపగలిగింది ప్రజ్ఞ. కానీ అందుకు అనుకూలత తక్కువ. అది నిష్ఫల శ్రమ. ఈలోగా సర్వం

లయించిపోతుంది. అశ్వపతి అందుకు ఖిన్నుంగా, హృదయపు లోతులలోని చైతన్యం అందిపుచ్చుకున్నాడు. స్వర్గానికి నిచ్చెనలు వేయసాగాడు. గుండెలో చిరుదీపం రెపరెప లాడింది. ఏకాకిగా సంయమనంతో ముందుకు సాగాడు. లక్ష్యం దిశగా హృదయాన్ని సమర్పణ చేసి, మార్మికారాధనలో మునిగిపోయాడు. దూరంగా మినుకు మినుకుమంటూ కనిపించాయి ప్రేమ వెలుగులు. తన వేదన ఫలించింది. ఆత్మ తను చూడని దివ్య శిఖరాలకు పయనించసాగింది. వదిలి రాలేని అగాధాలలో చిక్కి వ్యధ చెందింది.

అదృష్టవశాత్తు నిశ్చల భావసమాధి ఏర్పడింది. స్వతంత్రతకు, అస్వతంత్ర తకు మధ్యన ఈశ్వరీయత. తమస్సుకు, తపస్సుకు నడుమ ఆరాధన మొలక. సచ్చిదానంద స్థితి పరమ గమ్యమైనప్పుడు ఏకాగ్రత లభిస్తుంది. ఆత్మ పరమాత్మ వైపు పయనిస్తుంది. ఆ ఏకాంతస్థితి, ఆ స్వాప్నిక మందిరం, ద్వారాలు మూతబడిన ధ్యాన మందిరంవలె పరమ ప్రశాంతంగా ఉంది. ఎటు చూచినా నిశ్చలత్వమే. లోపల వెలిగే జ్యోతి ప్రసరించే తేజో కిరణాలు – అది నిర్గుణోపాసన.

యోగి హృదయం శాంతి నిలయం, క్రాంతిమయం. అప్పుడు బాహ్య ప్రపంచం శూన్యమవుతుంది. పరం అంటే ఏమిటో, సత్యం ఏమిటో అప్పుడు అవగతమవుతుంది. యోగనిద్రలో శరీరం జడమైపోతుంది. ఒక మహాశక్తి క్రమంగా లోపల ప్రవేశిస్తుంది. అది ప్రపంచ బాధలను, విషాదాలను హాయిగా భరించగలదు, వర్జించగలదు. అలా నిరీక్షిస్తూ జగన్మాతను తనలోకి ఆహ్వానిస్తుంది. అంతర్హితం కావడంవల్ల జ్వాలాగ్ని సమసిపోదు. లోవెలుగులు మనస్సులో ఏర్పడిన శూన్యాన్ని పూరిస్తాయి. సంశయాల స్థానంలో సంకల్పం బలపడుతుంది. ఆలోచనలు పూర్తిగా నశించినప్పుడు ఆత్మశక్తి బలపడుతుంది. మార్మికశక్తి ఉద్భవిస్తుంది. ప్రతికూల ప్రాపంచిక శక్తుల మధ్యనే బ్రహ్మానందం ఏర్పడాలి. అది జీవితంలోని అన్ని లోపాలను చక్కదిద్దగలదు. జాగాలను మహాశక్తితో పూరించగలదు.

మన ప్రార్థన మనస్సును దాటి, ఆత్మతో మమేకమై పరమాత్మను చేరుతుంది. నిశ్శబ్దాలను, మహాశూన్యాలను దాటిపోతుంది. మనస్సును అధిగమించాలి. ఆత్మ నిశ్చల మైనప్పుడు పరమాత్మ సందేశం మనలను వెతుక్కుంటూ వస్తుంది. నిరీక్షిస్తూ ఆరాధనతో ఎదురు చూడడమే ఆత్మ పని.

9. వరప్రసాదం

అశ్వపతి హృదయం ఒక రంగస్థలం. అందులో అశ్వపతి, పరమాత్మ, జగన్మాత పాత్రలు. వీరికి రూపాలు లేవు. అశ్వపతి హృదయమే మూడు పాత్రలను పోషించిందా! కాకపోవచ్చు. అదే మూడు భావాలను ప్రతిబింబిస్తుంది. అద్దం ఒక్కటే. ఎవరు ఎదురుగా నిలబడితే వారి ప్రతిబింబం కనిపిస్తుంది. ఇక్కడ బింబ ప్రతిబింబాలు లేవుగానీ, పాఠకుల సౌలభ్యం కోసం అలా భావించాలి. అన్నీ భావనలే.... అన్నీ ఫీలింగ్స్.

ఈ భావ స్పందనలు యోగి హృదయానికే అందుతాయి. 'సావిత్రి' అసలు ప్రారంభం ఇక్కడ. స్పందన, అనుభూతి, అనుభవం కలగలిసిన సమాధిస్థితి. సమాధి చైతన్యం ఇది. ఇవి బయటకు కనిపించేవి కావు. హృదయం లోపలి స్పందనలు, ఆత్మానుభూతులు. అశ్వపతి తన లోపలికి వెళ్లిన తర్వాత ఈ పరిణామం సాధ్యమైంది. ఇప్పుడు అతనిది బ్రహ్మానంద స్థితి. శరీరం, మనస్సు, ఆత్మ ఒక రేఖపైకి వచ్చి చేరాయి. మూడూ కలసి పోయాయి. ఒకదానిలో ఒకటి లీనమైనాయి. అతనిది తేజోరూపం. అతనిది తేజశ్శరీరం.

మనిషి మృత్యువును జయించాలి. భూమి మృత్యుభయం నీడ వదిలితే తప్ప దివ్యత్వం పొందలేదు. భూమి స్వర్గంగా మారాలంటే దివ్యత్వం భూమిపైన అవతరించాలి. నలు దిశలా దివ్యత్వం పరుచుకోవాలి. అశ్వపతి నవ్యసృష్టిని వాంఛించాడు. జగన్మాతను ప్రసన్నం చేసుకొని తన ప్రార్థన వినిపించాడు. ఆమెను పృథ్విపై అవతరించమని, జగతిని, మానవతను ఉద్ధరించమని వేడుకున్నాడు. లోకంలో అవతరించడానికి జగన్మాత అంగీకరించింది. జగన్మాత యిచ్చిన హామీతో అశ్వపతి తిరిగి ప్రాపంచిక స్పృహలోకి వచ్చాడు. భౌతిక ప్రజ్ఞ పొందాడు. తనది కల కాదు. ప్రపంచంలోకి తిరిగి వచ్చినా తనలో దివ్యస్ఫూర్తి ఉంది. దివ్యత్వాన్ని తన వెంట తెచ్చుకున్నాడు.

అప్పుడు అశ్వపతిలో అకస్మాత్తుగా ఒక దివ్య స్పందన కలిగింది. అది మహాశూన్యంలో నిర్జీవ నిశ్శబ్దం నడుమ అతి గంభీర ఏకాంతంలో పరిచయమైన అడుగుల చప్పుడు. అది నిశ్శబ్దం నుండి వెలువడిన శబ్దంలా, నాదంలా కదలి, స్పందనై అంతరంగంలోని ఆత్మను జాగృత పరచినట్లయింది. ఆ చైతన్య స్పర్శకు అతనిలోని ప్రత్యణువు ఆనందంతో పులకరించింది. అది భౌతిక పరిధిని చేరుకోగా, అధిభౌతిక ప్రజ్ఞ అతని హృదయంలో ప్రవేశించింది. మార్మిక శక్తులు అతని భౌతిక శరీరాన్ని లోబరచుకున్నాయి.

ఆ హృదయ స్పందన నిశ్శబ్దాన్ని ఛేదించింది. ఆ అనుభూతితో మనస్సు, శరీరం ఏకమై అవ్యక్త పరమానందంలో ఓలలాడాయి. మనస్సు, శరీరం, జీవం తన్మయత్వంలో కరిగిపోయాయి. అమృతపానంతో మత్తెక్కిన ప్రకృతిని మమతాను రాగాలు దరిచేరాయి. ప్రకృతిలో సైతం ఒక ప్రేమ స్పందన, ఒక రసానుభూతి మొలకెత్తింది. ఆ మధురిమలు మెరుపులై, వెలుగులై అమృత వర్షంలో పునీతమైనాయి. అది చంద్రుని చేరాలన్న సాగర తరంగ ఉద్విగ్నత.

అశ్వపతి నరనరాన అమృతం ప్రవహించసాగింది. శరీరంలోని ప్రత్యణువు చైతన్యం నింపుకుంది. గుండెలో ఆనంద జ్వాలలు మెత్తగా మండసాగాయి. రక్త మాంసాలు సైతం మాధుర్యాన్ని నింపుకున్నాయి. శూన్యంగా ఉన్న హృదయ కుహరాలు ఆనందపూర్ణాలైనాయి. జగన్మాత పద కంకణ నిక్వాణం జగతిని మేల్కొల్పింది. ఆనంద పారవశ్యంలో జగతి స్వాగత గీతిక లాలపించింది. అశ్వపతి శరీరం జడమై, మనస్సు నిశ్చలమై, ఆత్మ ప్రశాంతమైనా అతని హృదయం జగన్మాత శక్తికి ప్రతిస్పందించసాగింది.

తాను అన్వేషిస్తున్న బ్రహ్మం తనలోనే ఉన్నాడు. ఆ పరబ్రహ్మ జ్వాలా స్నిగ్ధ దివ్య సుందర విగ్రహం ఆత్మకు సాక్షాత్కరించింది. పెదవులు ఏవేవో మంత్రాలను ఉచ్ఛరిస్తున్నాయి. ఉపాసిస్తున్నాయి. కనురెప్పలు జ్ఞానపత్రాలై భారంగా వాలి పోతున్నాయి. తాను చలువరాతి విగ్రహంవలె నిగ్రహంతో ఉండిపోయి ఏకాగ్ర దృష్టితో, సాగరగర్భ గంభీరంతో అర్ధ నిమీలితంగా అంతర్దృష్టితో హృదయాకాశం

లోకి సంకల్పం సారించాడు. పరబ్రహ్మను తనలోనే గుర్తించి, ఆయన రాకను స్వాగతించ సాగాడు. మనోమందిర ద్వారం వద్ద ఒక భావం కదలాడింది. ఒక ఆకారం రూపుదిద్దుకోసాగింది. హృదయం లోతులనుండి ఒక సుస్వరం వినిపించ సాగింది.

"నవ్యసృష్టి శిఖరాలను అధిరోహించిన జ్ఞానమూర్తీ! ఈ ప్రయాణంలో నీ ఆత్మ నీ వెంట ఉండదు. పరలోక ద్వారం వద్ద ఒంటరిగా నిరీక్షించు. నీవు గతంలో ఆర్జించుకున్నదే నీకు లభిస్తుంది. అంతకు మించి ఆశించకు, అర్థించకు. అజ్ఞానావరణలో ఉంటూ నీ ఆత్మ అమరత్వాన్ని కాంక్షించడం అర్థంలేని పని. అంధకార ప్రపంచంలో నలిగిపోతున్న జీవుని కోసం, మూగపోయిన మానవ హృదయంకోసం ఎందుకు పరితపిస్తావు? ఈ అంధకార ప్రపంచంలో అంతర్దృష్టికి అవకాశం ఎక్కడ? వివేక రహితంగా పెరిగిపోతున్న భూభారాన్ని నీవు తగ్గించగలవా? మానవుడు తన మేధస్సుతో సృష్టి రహస్యం తెలుసుకోలేడు. కాంతి గోళాల చలనానికి అంతిమ గమ్యం నేను. నాలోని అగ్నులు, మాధుర్యాలు జీవికి ఆలంబనాలు. నా ప్రమోదాలు, ప్రమాదాలు సైతం లోకానికి అత్యావశ్య కాలు. పతనం నుండి నీవు ప్రపంచాన్ని ఉద్ధరించలేవు. అవసర సమయంలో నన్ను స్మరించు. పరమాత్మను భరించే శక్తి మనిషికి లేదు.

"సత్యం ఆవిర్భవించిన వెంటనే ధరణి భారంతో క్రుంగిపోతుంది. ఆ బరువు భరించలేక ముక్కచెక్కలవుతుంది. సరైన మార్గాన్ని సూచించే బాధ్యత పరమాత్మకే వదలిపెట్టు. నీవు సాధించిన విజయంతో తృప్తిపడి, ఉన్నంతలో లోకానికి సహాయపడు. జీవితం నిష్ఫలమని అనను. కఠిన నియమాలు పాటించి, కర్మవిముక్తి చెందమనీ చెప్పను. మానవాళికి దూరంగా ఏకాంతవాసంలో, పరమనిశ్చలంగా జీవిస్తూ, సదా నిర్మల సచ్చిదానందంలో నిన్ను నాకు అర్పించుకోమని కోరడం లేదు. మృత్యువును జయించే వరకు మనిషికి వేదనలు, రోదనలు తప్పవు. అవి వెన్నంటి ఉన్నంతకాలం ఆత్మ ఎలా విశ్రమిస్తుంది? అందుకు తగిన శక్తిని పొందడానికే మానవ జన్మ ఎత్తింది. నీ ధర్మాన్ని పాటిస్తూ, విధిని నిర్వర్తించు. కష్టనష్టాలను సైతం దైవప్రసాదంగా భావించి ఆమోదించి, నిరాడంబరంగా జీవిస్తూ, విశ్వశ్రేయస్సు కాంక్షించడం వరకే నీ కర్తవ్యం.

"మనిషి స్వరూప స్వభావాలలోనే విశ్వరహస్యం దాగివుంది. మనిషి తన ఆలోచనల నీడల్లో మసులుతూ, వ్యర్థమైన వాటికి విలువనిస్తూ పతనోన్ముఖు డవుతాడు. మనిషి అచేతన ప్రపంచంలో ఒంటరిగా మేల్కొని, తన స్వప్నాలతో

సృష్టినే సంస్కరించాలనుకుంటాడు. మానవులు పూర్ణ తేజోమండలాల నుండి ఉద్భవించడం లేదు. అర్ధ ప్రజ్ఞతో, అల్ప తేజస్సుతో వచ్చినవారు అతీంద్రియ ప్రజ్ఞను పూర్తిగా పొందలేరు. పూర్ణ తేజస్సును పొందలేరు. జీవుడు అనేక లోకాలలో సంచరిస్తూ తన పథాన్ని, లక్ష్యాన్ని తరచు మార్చుకుంటూ వస్తాడు. ఎడారిలో తన కుటీరం వేసుకుంటాడు. చంద్రనిప్పులకు బెంబేలు పడతాడు. పైనుండి స్వర్గం అతనిని జాలిగా చూస్తుంది. ప్రకృతిలో మనిషి అస్థిరుడు, అతిథి. అస్థిమితంగా ఆలోచనా సాగరాలపై పయనించే నావికుడు. కనిపించని దైవ శక్తులు తనకు కావాలని ఆరాటపడతాడు. అవి తనవి కావు. ఎక్కడో ఉన్న వెలుగులకై పరుగులు తీస్తుంటాడు. ఇరుకు బాటల్లో కాక రాజమార్గాన వెడితేనే పరమాత్మ దర్శనం.

“మనిషి ప్రయత్నానికి ప్రకృతి శక్తులన్నీ ఎదురు నిలుస్తాయి. అన్ని శక్తులు కూడబలుక్కున్నట్లు ఏకమవుతాయి. పరమాత్మ అన్వేషణలో తీవ్ర ఆటంకాలు ఏర్పడతాయి. నిర్దయగా శూన్యం అతనిని కబళించి మింగి వేస్తుంది. అంధకారం, అయోమయం అతనిని ఊపిరి సలపనీయవు. గుప్త శక్తులు మోసగించి తరిమి కొడతాయి. భగవంతుని అనుగ్రహం పొందనంతకాలం ప్రకృతి శక్తులన్నీ అతనికి శత్రువులే. అచేతనంగా ఉన్న ఆత్మ, నిద్రాణంగా ఉన్న శక్తి, అతనిని జీవితం నుండి, ఆలోచనల నుండి దూరం చేస్తాయి.

“చీకటి గుహలో చిక్కిన విధిని మృత్యువు తనకు అనుకూలంగా మార్చుకుంటుంది. మనిషి కాలంతో రాజీపడి విధికి తలవంచి బ్రతికినంత కాలం చీకటి మూలల్లో జడలు విరబోసుకున్న అజ్ఞాన రాకాసి కోరలు సాచి కబళించాలని ప్రయత్నిస్తుంది. మనిషి మార్గానికి అడ్డుగా అజ్ఞానాంధకారంలో పొంచి ఉండి ఆత్మను హత్య చేయడానికి అవసరమైన పరికరాలను మనస్సుకు అందిస్తుంది. కాల ప్రవాహంలో మనిషి జీవితం క్షణికం. అతను గంటలకు నిమిషాలకు బలి అవుతుంటాడు. అటు స్వర్గాన్ని చేరలేక, ఇటు భూమిపైన తృప్తిగా, సుఖంగా జీవించలేక పవిత్రత వదలి పశుప్రవృత్తిని పెంచుకుంటాడు. దైవత్వానికి పశు ప్రవృత్తికి మధ్యన తచ్చాడుతుంటాడు.

“మనిషికి తన ఔన్నత్యం తెలియదు. తన లక్ష్యం తెలియదు. ఎక్కడ నుండి వచ్చింది మరచిపోయి, ఎందుకోసం వచ్చింది తెలియక నిరర్థకంగా బ్రతుకుతాడు. ఆత్మ శరీరంతో కలహిస్తుంది. కనిపించే శిఖరాలు చేరుకోలేక నిర్వీర్యుడవుతాడు. అదే పతనం. మానవ ప్రవృత్తి పశు ప్రకృతికి అతిసమీపం.

వైరుధ్యాల మధ్య బ్రతుకు సాగించడమే మనిషికి ఇష్టం. ప్రతికూల స్వభావమే మనిషికి ఇష్టం. స్వేచ్ఛను కాంక్షిస్తూ బానిసత్వంలో బ్రతకడం మనిషి స్వభావం.

"ఏ కొంచెం వెలుగును గుర్తించడానికైనా చీకటి అవసరం. ఏపాటి ఆనందం రుచి తెలియాలన్నా విషాదం అవసరం. ఉత్తమలోకాలకు వెళ్లడానికి మృత్యువు అవసరం. జీవుడు నాలుగు వైపుల చూస్తూ ప్రతి పిలుపుకు స్పందిస్తాడు. మార్గం నిర్దేశించగల స్వచ్ఛమైన కాంతి ఏదీ కనిపించదు. అసలు జీవితమే గుడ్డివాని చేతి దీపం వంటిది. జీవితమే దాగుడుమూతలాట. తనలో తను అన్వేషిస్తూ శరీరం నుండి నిష్క్రమించాలి. తనలోకి తాను చూచినా, అది తానని గుర్తించదు. అనవరతం పురోగమిస్తూ భూమిని మాత్రం వదలకోడు. అందుకే ఎంత కాలం తపించినా తన గమ్యాన్ని చేరడు. లోకాన్ని ఉద్ధరిస్తూ తాను జడంగా ఉండిపోతాడు. ఆత్మను ఉద్ధరించుకునే ప్రయత్నంలో శరీరాన్ని అలక్ష్యం చేస్తాడు. మనస్సు చేజార్చుకున్న తేజస్సును ఆత్మ అందిపుచ్చుకుంటుంది. జ్ఞానం ఎంత సంపాదించినా నిరుపయోగం అవుతుంది.

"తన ఆలోచనల నీడల్లో అగ్ని గోళాల్ని సృష్టించుకుంటాడు. అన్నీ నీలినీడలే. ఏ ఒక్కటీ సత్యం కాదు. తాను ఏం చేస్తున్నది, ఎటు వెళుతున్నది ఆకళింపు లేక అజ్ఞానంతో పరమసత్యాలను సైతం వదులుకుంటాడు. భ్రమల్ని కల్పించుకుంటాడు. తను చేసే తప్పుల్ని దైవానికి, విధికి ఆపాదిస్తాడు. వివేకం మాయముసుగు వేసుకొని అతనిని ప్రలోభపెడుతుంది. తన నిజస్వరూపాన్ని ఎన్నటికీ చూపదు. అతని విజ్ఞానం పైన, పాండిత్యం పైన అజ్ఞానం దలసరి ముసుగు వేస్తుంది. సృష్టి రహస్యాన్ని వైచిత్రిని తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉన్నా, అతనికి వ్యక్తిత్వం చాలదు. అనుమతి లభించదు. తాను ఏమీ 'కాని' స్థితిలోనే ఉండిపోవలసి వస్తుంది. తను శాసించవలసిన అజ్ఞానానికి తనే తలవంచి, ఆత్మాన్వేషణ నెపంతో భౌతిక సుఖాలలో బందీ అవుతాడు. ఆ ప్రయత్నంలో ప్రకృతి కొన్ని క్షుద్రశక్తులను అతని పరం చేసి, అసలు మార్గంనుండి తప్పిస్తుంది. అతను పరమానందంతో వాటిని స్వీకరిస్తాడు. అవి పరమాత్మను చేరే మార్గాలు కావని అతనికి తెలియదు. శ్రమించి, పరిశ్రమించి, ఏవేవో సాధిస్తున్నానన్న భ్రమతో మూర్ఖుడుగా మందబుద్ధితో ప్రవర్తిస్తాడు.

"ఎప్పుడో గాని గుండెలో ఒక అగ్నికణం పడదు. అది జ్వలించి, జ్వలితాగ్ని కావాలి. ఆలోచనలు కాలిపోవాలి. జ్ఞానతేజస్సు అజ్ఞానాంధకారాన్ని తొలగించాలి. లోకాన్ని ప్రేమతో నింపాలి. అప్పుడు మార్మిక జగత్తులో ప్రవేశం లభిస్తుంది.

మేధస్సు ఎన్నటికి భూమిని స్వర్గంగా మార్చలేదు. రెంటినీ సంధాన పరచే శక్తి మేధస్సుకు లేదు. మనస్సు భౌతికత్వంలో వేయిబంధాలు వేసుకుంటుంది. ఆ బంధాలలో చిక్కిన మనిషి కుహనా విజ్ఞానంతో తానే భగవంతుని అవతారంగా ప్రచారం చేసుకుంటాడు.

"అసలైన ప్రజ్ఞ, వివేకం మనిషిలో ప్రస్ఫుటమైనప్పుడు, మనస్సు తన విభవాలను వదులుకున్నప్పుడు, ఆత్మ ఉన్నత పథాలలో పయనిస్తుంది. రేతస్సుతో జన్మించిన మనిషి ఓజస్సును పెంచుకోవాలి. అంతవరకు మనిషికి పశువుకు తేడా కనిపించదు. అంతదాకా త్రిశంకుస్వర్గంలోనే మనగలుగుతాడు. తను కాపాడుకున్న భౌతిక సంపదలను వదలి, శరీరాన్ని యాతనామయం చేసి, కోరి మృత్యువును ఆహ్వానిస్తాడు. ఇంద్రజాల విద్యలతో విసిగిపోయిన ఇంద్రజాలికుని వలె, అతీంద్రియ శక్తులు కోల్పోయిన మాంత్రికుని వలె, ఆత్మ పరమాత్మల స్థితిని శంకిస్తాడు. పరమ మూర్ఖుడై ఈ లోకంలోకి ఎలా వచ్చాడో అలాగే లోకం నుండి నిష్క్రమిస్తాడు. చేయవలసిన పని ఏమాత్రం చేయకుండానే పరమపదిస్తాడు. కీర్తి శేషు డవుతాడు. అలా సృష్టి ధర్మాన్ని నిర్లక్ష్యం చేసేవారే ఎక్కువ మంది. మధ్యలోనే లక్ష్యానికి నీళ్లు వదిలేవారు ఎక్కువ. అది ప్రయోజనం లేని ప్రయోగం. గమ్యం లేని సాధన.

"ఆదర్శం ఉన్నతం కానప్పుడు వక్ర మార్గంలో బుద్ధి పయనిస్తుంది. జీవితానికి గమ్యం లేనప్పుడు అన్ని ప్రయత్నాలు, ప్రయోగాలు ప్రమాదాలనే సూచిస్తాయి. జన్మజన్మలకు ఆ వక్రబుద్ధి సరికాదు. పునరపి జననం పునరపి మరణం. కొంతదూరం పోయి వెనుతిరిగి వస్తారు. ఘనవిజయం సాధించినట్లు మురిసి పోవడమే తప్ప ఫలితం ఉండదు. ఈ నాటకానికి ఎప్పటికీ ముగింపు ఉండదు. అవకాశం ముసుగులో మహత్తర లక్ష్యం ముఖం చాటుచేసుకుంటుంది. ప్రతిభ వల్ల, వివేకం వల్ల లభించే సత్కారాలు మనిషిలో మరింత అంధకారాన్ని పెంచుతాయి. మనిషి ప్రయోగాలు విఫలమైన కొద్దీ భగవంతుడు మరింత దూరంగా తప్పుకుంటాడు. మానవ రూపాలలో ఆత్మమాత్రం చిక్కుపడి చిక్కిపోతుంది.

"పరమాత్మ పర్యవేక్షణలో మనిషికి అపజయం ఉండదు. ఆధ్యాత్మిక పయనంలో వైఫల్యం కలగదు. ప్రయాణం నెమ్మదిగా సాగుతుంది. నిర్గుణం ఈ ప్రపంచ సృష్టికి కారణం. ఒకానొక అతీంద్రియ వీచిక మనిషికి ఆత్మను అందిస్తుంది. ఆ శక్తే ఆత్మను తనవైపు తిప్పుకుంటుంది. దానికి మార్గం తెలుసు.

అది అప్రతిహతం, అనవద్యం. పరమాత్మ తానే మార్గదర్శి అయినప్పుడు గమ్యం అగమ్యం కాదు. మనిషిని మనస్సు మోసగించినా, శరీరం మొరాయించినా, అంతరాత్మ సరైన మార్గంలోకే నడిపిస్తుంది. పరమాత్మను నమ్మితే అపజయం ఉండదు.

"మనిషి గమ్యం తప్పినా, గమనం మందగించినా కడకు పరమాత్మను చేరే మార్గం కనిపిస్తుంది. ఆత్మ పురోగమనానికి అవాంతరాలు ఎన్ని కలిగినా గమ్యం చెదరదు. శరీరాన్ని ఆశ్రయించి ఉన్న ఆత్మ ఎప్పటికి విశ్రమించదు. పరమాత్మను చేరడం దాని లక్ష్యం. జీవితం ముందుకు సాగుతూ అనేక మలుపులు తిరుగుతుంది. అంతరంగంలో పరమాత్మ జాగృతమైనప్పుడు ప్రాపంచిక సుఖాలు, భోగాలు మనిషికి తృప్తి నివ్వవు. పైగా ఒత్తిడి ఎక్కువవుతుంది. తనను తాను అన్వేషించాలన్న తపన ఆత్మను దర్శించేవరకు నిలవనీయదు. మనిషిలోనే మార్గం చూపే వెలుగు, సాయపడే శక్తి ఉన్నాయి. అవి పైకి కనిపించవు. అనుభూతికి అందుతాయి. తనకు తెలియకుండానే సర్వజ్ఞత సిద్ధిస్తుంది.

"మనిషి క్రమంగా అధిమానస శిఖరాలకు చేరుకుంటాడు. దివ్య ప్రకృతిలోని మంచిని పంచుకుని అమరత్వానికి బంగారుబాటలు వేసుకుంటాడు. దివినుండి దివ్యాత్మలు మనిషి చర్యలు గమనిస్తూ నేటి సత్కార్యాలను రేపటి ఉజ్వల జీవనానికి పునాదులు సమకూరుస్తాయి. పరమాత్మ స్పర్శతో మనిషి భౌతికత పులకరిస్తుంది. బ్రహ్మపథంలో ఉన్న అవరోధాలన్నీ తొలగిపోతాయి. అమృతత్వం జీవనంలో చోటుచేసుకుంటుంది. మహాత్ముల శుభాశీస్సులు లభిస్తాయి. వారంతా పరమాత్మ ప్రతినిధులు.

"భౌతిక జీవనంలో దివ్యత్వం ప్రవేశించడమే పెద్ద మార్పు, వెంటనే హృదయం ప్రేమ పూర్ణమవుతుంది. అన్నింటిలోను అద్భుత సౌందర్యమే కనిపిస్తుంది. మహత్తరానందాలు ఎల్లెడలా పరామర్శిస్తుంటాయి. కొన్ని క్షణాల పాటు తను వేరై కళ్ల వెనుక తారాడే దివ్య సీమలలో సంచరిస్తాడు. మృత్యురహిత స్థితి మమతను, మాధుర్యాన్ని అదనంగా అందిస్తుంది. పరమాత్మ అనుభూతికి లోనైన కొద్ది నిమిషాలు మనస్సు అగ్ని తాపానికి సోలిపోతుంది. తన ఆధిక్యతను కొంత కొంత కోల్పోతుంది. మాటల అవసరం లేని దివ్య సందేశాలు వినిపిస్తాయి. ఏవో ప్రజ్ఞలు మనస్సులో సుడులు తిరిగి, చిత్ర విచిత్రాలను ఆవిష్కరిస్తాయి.

"కొన్నిమార్లు ఆనందాన్ని అవ్యక్తంగా ఆత్మలోనే అనుభవిస్తాడు. కొన్నిసార్లు పరమాత్మతో మాటాపలుకు లేకుండా మౌనంగా సంభాషిస్తాడు. అతని

జీవితం ఒక మహాద్భుత కార్యానికి భూమిక అవుతుంది. అతను కారణజన్ముడు. దివ్య జీవనానికి అతను సంకేతం. అతని జీవనశైలి దివ్య సందేశం అందిస్తుంది. అతని జీవితం ఆధ్యాత్మికతకు నెలవు, అమరత్వానికి విహారభూమి, పూర్ణత్వానికి, నిష్కళంక జీవనానికి ఆటపట్టు. అవే మనిషికి మహత్తరమైన వరాలు. పరమాత్మ ఆశించిన పరిణామం అప్పుడు మనిషిలో కనిపిస్తుంది. ఆ పరిణామం జగన్మాత ముందుగా ఊహించిందే. తనలోనే బీజం వేసింది. పృథివి పరిణామశీలి. పరిణామం దివ్యత్వాన్ని అందిస్తుంది. ప్రకృతి నేపథ్యంలో పృథ్విని స్వర్గంగా రూపుదిద్దుకోవాలి. ఆచారం, సంప్రదాయం మనిషిని మారనీయవు, కట్టు బానిసను చేస్తాయి. యుగాలుగా భరిస్తున్న చీకటిని, అజ్ఞానాన్ని మనిషి వదులుకోడు. బాధామయ జీవితంలోనే ఆనంద మార్గాలు వెదకడం మనిషి బలహీనత.

"ఆత్మగతమైన మహత్తర ఆశయాలను నీవు తీసుకో. అజ్ఞానంతో అంధకారంలో ఉన్న జీవునితో పరమాత్మ చేసుకున్న ఒప్పందం ఒకటి ఉంది. దాని కారణంగా మనిషి మనశ్శాంతికి దూరమవుతున్నాడు. ప్రశాంతి లభించడం లేదు. కోర్కెల్ని పెంచుకుని కష్టాలను ఆహ్వానిస్తున్నాడు. నీవు ఆత్మోన్నతిని సాధించడానికి స్వతంత్రంగా శ్రమించాలి. శ్రమించి సాధించి స్థిమితపడు. ఎంత కష్టం కలిగినా లక్ష్యానికి దూరం కావద్దు. ఆత్మజ్ఞానాన్ని అనుమానించకు, జ్ఞానం సంపాదించుకో. ప్రాపంచిక విషయాలపై నీ శక్తిని, జ్ఞానాన్ని వెచ్చించవద్దు. కాలం అనంతం. అయినా కాలానుగుణంగా అవసరమైన కర్మలను ఆచరించు. అనంత పథాలలో పయనిస్తూ, శిఖరాలను అందుకుంటూ, అనంత పథికుడవై, రథికుడవై అగోచర సీమలను దర్శిస్తూ, కాలంతో పాటు మలుపులు తిరుగుతూ దైవత్వాన్ని మానవులకు అందుబాటులోకి తీసుకురా. నా సహాయం నీకు లభిస్తుంది. నా తేజస్సు నీదవుతుంది. నాశక్తిని నీపరం చేస్తాను. అసహనాన్ని నీలో ప్రవేశించనీయకు. అసంపూర్ణ ఫలితాలు ఆశించకు.

"ఒకే ఒక్క వరం కోరుకో! ఆత్మ ఔన్నత్యం ఆ వరం – వరం ఎప్పుడూ పరానికి సంబంధించి ఉండాలి. ఒకే ఒక్క ఆనందం అభిలషించు – అది నీ మంచిని పెంచగలగాలి. విధికి, ప్రతికూల శక్తులకు లొంగనిది సత్సంకల్పం. అది అచలం కావాలి. నీ కర్మ ఫలాలను ఆ మహాశక్తికి నివేదన చేయి! పరమాత్మ ప్రజ్ఞతో సర్వ ప్రపంచం మారిపోతుంది."

గంభీరంగా వినిపించిన ఆ దివ్యవాణి నెమ్మది నెమ్మదిగా శూన్యంలో లయించి పోయింది. గగనం శూన్యమై ప్రశాంతమైంది. శబ్ద ప్రపంచాన్ని పూర్ణ

నిశ్శబ్దం ఆవరించింది. ఎటుచూచినా మూగపోయిన ప్రశాంతి. అశ్వపతి హృదయం దివ్యవాణికి సమాధానం చెప్ప పూనుకున్నది. నిశ్శబ్దాన్ని, శూన్యాన్ని చీల్చుకుని అతని గొంతు వినిపించసాగింది –

“జగన్మయీ! నీ సృష్టి మాయతెర చాటున, నీ సుందర సురుచిర దివ్య రూపాన్ని దర్శించిన నేను ప్రాపంచిక విషయాలలో తలదూర్చి, నిరర్థకంగా కాలం గడుపుతూ ఎలా జీవించను దేవీ! నీ అనుంగు బిడ్డలనే నీవు కఠినంగా శిక్షిస్తావా? అమ్మా! మృత్యురహితమైన మహాశక్తికి వారసులం మేము. దైవతాలను సైతం ఆవాహన చేసుకోగలం మేము. ఈ అంధ ప్రపంచంలో ఎంతకాలం మా ఆత్మలు తపించాలి? ఎంతకాలం మేము ఈ మృత్యుభారాన్ని వహించాలి? నేనిక్కడ నిర్వహిస్తున్న కార్యక్రమం నీదే అయినప్పుడు ఈ ఐహిక కార్యాలతో నేనెందుకు కాలం వృథా చేయాలి. శూన్యంగా ఉన్న మానవ హృదయంలో నీవే చైతన్యం నింపరాదా! నీ మహాతేజస్సు కాస్తంత ప్రసాదించినా చాలు కదా తల్లీ! శతాబ్దాలు, సహస్రాబ్దాలు ఇలా నిరుపయోగంగా గడచి పోతున్నాయి. ఏవీ నీ ఆగమన సూచికలైన ఉషఃకాంతులు? ఏవీ నీ విజయానికి సంకేతాలైన కాంతి కిరణాలు? నాకు వినిపిస్తున్నవి నిష్క్రమిస్తున్న దేవతల పాదసవ్వడులే. అతీంద్రియం, అవాఙ్మానస గోచరం అయిన విశ్వ మేధస్సు వెనుక జ్ఞాన, ప్రజ్ఞలకు సంబంధించిన పథకం ఒకటి తయారైంది. మార్పులు, చేర్పులు లేకుండా యుగాలు గడచి పోతున్నాయి. పునర్నిర్మాణం జరిగేదెప్పుడు? మనిషికి మంచికాలం వచ్చేదెప్పుడు? భూమి స్వర్గంగా మారేదెప్పుడు? మేం ఇలా చచ్చీ చెడి బ్రతకవలసిందేనా! మధ్యమధ్యన ప్రతి జన్మకు ఒక ఆరంభం, ఒక అంతం తప్పదా? జననం వెన్నంటి మరణం ఉండక తప్పడం లేదు. జీవితచక్రం పరిభ్రమిస్తూనే ఉంది. కొత్త యుగాలు పాతవాటివలె నశిస్తున్నాయి. సృష్టి లక్ష్యం నేటికీ నెరవేరలేదు. ఈ విషాదగాథ చరిత్రగా మారుతోంది.

“ఇప్పుడు మాలో కదిలో మార్మికశక్తులు అతిస్వల్పం. ప్రకృతి కనురెప్పలు దాటి వచ్చే కాంతి బహు తక్కువ. మా కష్టాలకు, కన్నీటికి ప్రతిఫలంగా లభించే ఆనందం ఎంత? మా గురించి మేము తెలుసుకోలేని అజ్ఞానంలో, అల్ప బుద్ధితో జీవిస్తున్నాం. మావి కాని, అలవి కాని ఏవేవో ప్రేరణలతో, మా రక్త మాంసాలను ఎండగట్టి ఏదో పరాన్ని సాధించాలని ప్రయత్నిస్తున్నాం. కాని, మాది అరకొర ప్రయత్నం. మా వివేకం పరిమితం. నశ్వరమైన మా దేహాలలో ఉండే అనశ్వరమైన ఆత్మలు మాకు కనిపించవు. పైగా మమ్ము నిరుత్సాహ పరుస్తాయి. మేము

నిరాశలకు, నిస్పృహలకు లోనై బ్రతుకుతుంటాం. ఎవరో ఒక మహాత్ముడు ఎప్పుడో అవతరించి మమ్మల్ని ఉద్ధరిస్తాడని ఎదురుచూస్తాం. ధర్మానికి గ్లాని జరిగితే అవతరించే దేవుడు మనుషులకు ఏంచేస్తున్నాడు? కష్ట కాలంలో మా మధ్యన అవతరిస్తాడని ఆశిస్తాం. ఏడీ ఆ ప్రవక్త? ఆ ప్రేమమూర్తి?

"నీ సృష్టి విఫలం కాదని మాకు తెలుసు. భౌతికపరమైన మసక వెలుగులో నీ కరచరణాలు మాకు కనిపించవు. అవసరం, అవకాశం అనే పరదాల చాటున అవి దాగి ఉంటాయి. నీ యాత్ర నెమ్మదిగా సాగుతుంది. మా బ్రతుకులు ఉరుకులు పరుగులు. మాకున్న జీవన వ్యవధి తక్కువ. నీ సంకల్పం మేరకు మమ్మల్ని పరుగులెత్తించు చాలు, జీవితం ఆరోహణలో ఉంటే చాలు! పరిణామ గమ్యాన్ని మేం మార్చలేం.

"మా బ్రతుకులకు ఆరంభంలోనే అంత్యక్రియలు జరిగాయి. నశ్వరమైన మా శరీరాలు అటు పశు ప్రవృత్తికి, ఇటు పరమాత్మకు మధ్య నలిగిపోతున్నాయి. నీ అద్భుత సృష్టిలో మనిషి ఉత్తముడా? ఏమో! అజ్ఞానంలో, అంధకారంలో ఉన్న మనిషి ఇటు ప్రకృతికి, అటు స్వర్గానికి మధ్య తచ్చాడుతున్నాడు. అతనికి ఆత్మ ఒక్కటే ఆలంబన.

"దృశ్యాదృశ్యమైన ఆనంద రసార్ణవం నుండి ఎప్పుడో దివ్యత్వం ఉద్భవిస్తుంది. నిద్రిస్తున్న గుండె నుండి ఒక శక్తి ప్రభవిస్తుంది. కాలం మందంగా సాగుతుంది. ప్రాపంచిక జీవనం చంచలంగా, అస్థిరంగా ఉంటుంది. అయినా యోగ సాధన కొనసాగుతుంది. ఒక తేజస్సు అతనిని క్రమ్మివేస్తుంది. అది దివ్య జీవనానికి నాంది. సర్వాన్ని దర్శించగల జ్ఞాననేత్రం ఒక్కసారి మసక బారుతుంది. హృదయం నుండి దివ్యవాణి వినిపిస్తుంది. పరమాత్మ నీడలో క్షణాలు యుగాలవుతాయి. కాలాతీత స్థితిని చేరి కాలాన్ని సమీక్షించవచ్చు. మానసిక కట్టడులు, భౌతిక కట్టుబాట్లు ఆత్మను నిరోధించవు. దివ్యదృష్టికి రానున్న విషయాలు సైతం తెలుస్తుంటాయి.

"ఆత్మ పురివిప్పిన మయూరం వలె ఆనంద తాండవం చేస్తుంది. అది రుద్ర తాండవం. అది ప్రళయ తాండవ నృత్యం. నృత్యంలో ప్రళయఘోషలు వినిపిస్తాయి. భూమిని ప్రళయాగ్నులు క్రమ్ముకుంటాయి. మృత్యువు తొంగి చూస్తుంది. మృత్యు దేవత ఆకలికి ఈ లోకం చాలదు. ఎటుచూచినా విలయమే. ఎటుచూచినా ప్రళయ ఘోషలే. నా చెవులతో నేను విన్నాను – ఆ ప్రళయఘోషల రణరంగ కోలాహలం! అదే విశ్వరూపం ... విశ్వ విలయ రూపం.

“అందులో నేను గమనించాను ఈశ్వరప్రజ్ఞ. స్వర్గం అంచున మెరిసే ప్రభలు. సృష్టి సోపానాలపై జన్మకు రానున్న జీవుల తొక్కిసలాట. భౌతిక శరీరాలకై జీవుల ఆరాటం నేను గమనించాను. ఆ జీవులు యుగ సంధ్యను, జీవన సంధ్యను దాటి రావడం నేను గమనించాను.

“ఆ ఉషోదయ బాలలు నా నయన తారకలు. వారే శాంతి సీమలలో సృష్టి సంధాన కర్తలు. వారే ఈ లోకపు అడ్డుగోడల్ని తొలగించి, దివి నుండి భూమికి బాటలు వేయగలరు. జగన్మాత అనుమతి లభిస్తే వారు విధిని ధిక్కరించి పోరాడగలరు. దివ్యసీమలలో పరిశ్రమించే శ్రామికులు వారు.

“వారే అగోచరుడైన పరమాత్మ వార్తాహరులు. అమరత్వానికి ఆద్యులైన శిల్పవరులు వారే. దైవత్వం నుండి పతనమై, మానవ భూమికలకు చేరుతున్నవారు వారే. వారి వదనాలపై ఇంకా చెరగని దివ్య వర్చస్సు కనిపిస్తోంది. వారిప్పుడు పరమాత్మతో హృదయభాషలో సంభాషించగలరు. వారి శరీరాలది ఆత్మ సౌందర్యం. అవి తేజోపూర్ణాలు. వారు మార్మిక మహత్తుల్ని, ఆత్మిక వర్చస్సును, సంపూర్ణ సచ్చిదానందాన్ని వెంటతెచ్చుకుని, భౌతిక శరీరంతో వాటిని అనుభవించా లని ఆశిస్తూ, ఆత్మ సంగతులను వినిపించాలని కాలం కడపటి అంచువరకు వచ్చి మానవజన్మకై ఎదురుచూస్తున్నారు. వారిని నేను స్వయంగా గమనించాను.

“వారు మహర్షులు, మహాయోగులు. వారే ప్రజ్ఞా ప్రాభవాలకు, మమతాను రాగాలకు కర్తలు. తేజోపూర్ణ సుందరసీమల పరిశోధకులు. ప్రేమవాహినులలో ఈదగలవారు. సచ్చిదానంద మందిరంలో నర్తకులు. వారి అవతరణతో లోకంలో బాధలు తగ్గిపోతాయి. వారి ఆగమనం ప్రకృతి పదనంపైన వెలుగు కిరణాలను ప్రసరింప చేస్తుంది.

“మనిషిని శాసించే విధి పరలోకంలో ఉన్నంతకాలం మనిషి శక్తి సామర్థ్యాలకు విలువ ఉండదు. అతను చేసే పనులు నిష్ప్రయోజనాలవుతాయి. బాధల్ని అనుభవించ వలసిందే. మనిషి అసమర్థత, అప్రయోజకత్వం నిరూపణ అవుతుంది. కన్నీరు, శ్రమ ఖర్చయి, బాధలు దుర్భరమైనపుడు దైవానుగ్రహం కలుగుతుంది. మనిషి ఏ మేరకు ఆలోచించగలడో, ఎంత ప్రతిభను వెచ్చించగలడో పరమాత్మకు తెలుసు. మనిషి అపజయం అంగీకరించిన తర్వాతనే దైవం పచ్చజెండా ఊపుతుంది. కొంతకాలం స్వయం ప్రతిభను నమ్ముకుంటాడు. మనిషి తన తెలివికి, ప్రతిభకు తానే పొంగిపోతాడు. ఓటమి దివ్యత్వాన్ని ఆహ్వానిస్తుంది. మనిషి గుండె దివ్యత్వంతో నిండిపోవాలి.

"చిన్న ప్రయత్నాలు పెద్ద ఫలితాలకు మార్గం చూపుతాయి. లౌకికంగా మనిషి అలౌకిక ఫలితాలు పొందవచ్చు. దృక్పథం విశాలం కావాలి. ప్రపంచం అసంపూర్ణం కనుక అతిభారం అనిపిస్తుంది. మనిషి పూర్ణత్వం పొందగలగాలి. కాలం కోసం నిరీక్షించకూడదు. మనిషి ఆత్మపై పడిన ముద్రలు సులభంగా చెరిగిపోవు. ఎంత కృషి చేసినా ఫలితం కనిపించదు. మనిషి అజ్ఞానం, వ్యర్థ ప్రయత్నాలు జగన్మాతకు బాధ అనిపిస్తాయి. సత్యం సురక్షితంగా ఉండిపోతుంది. జగన్మాత అమృతవాణి వినిపించదు. అంతరంగం మూతపడిపోతుంది. మనిషి సరైన ప్రయత్నం చేయాలి.

"జగజ్జననీ, సకల కళా విలాసినీ, సృష్టికర్త్రీ! కాలం తన హృదయాన్ని పరమాత్మ ముందు విప్పలేదని కినుక వహించకమ్మా! విశ్వవినోదకర్తవు నీవు. నీకు మావలె ప్రాపంచిక బంధాలు లేవు. పొందవలసిన పరమార్థం లేదు. అందుకోవలసిన పరమార్థం మాలోపలే ఉందని మాకు తెలియదు. బయట వెతుకులాడే వారికి అది ఎన్నటికీ లభించదనీ తెలియదు. నీదైన విశ్వ రహస్యాన్ని, నీ మహత్తర శక్తిని కాస్త మాకు అనుగ్రహించు మాతా!

"నీ సజీవ రూపం ఏదైనా మానవాళికి ముక్తిదాయకమే. అది భవ్య సందేశమే అవుతుంది. ఒక శరీరంలో నీ అనంతశక్తుల్ని నింపి, ప్రపంచంలోకి పంపించు. నీ దివ్యత్వం ప్రతిష్ఠించిన ఒక రూపం చాలు మమ్మల్ని ఉద్ధరించడానికి. ఒక్క మేధలో విశ్వ విజ్ఞానాన్ని నిక్షిప్తం చేయి. నీ ప్రేమను సమీకరించు.

"దేవీ! మానవరూపంలో ఒక్కసారి అవతరించవూ! భౌతికరూపంలో నీ దివ్య సౌందర్యాలను ఆవిష్కరించు. ఓ శక్తి స్వరూపిణీ! ఈశ్వరీయతను నీ వెంట తీసుకురా. మానవులకు ఈశ్వరీయతను పంచిపెట్టు. నీ కటాక్ష వీక్షణాలే జగతికి ప్రగతిబాటలవుతాయి. నీ అమృత సందేశాన్ని మాకు వినిపించు దేవీ! ఒక్క మహత్కార్యంతో విధి కవాటాలను బ్రద్దలుకొట్టు"

అశ్వపతి ఆశ అడియాస అయింది. అతని విన్నపాలు గాలిలో కలిసి పోయాయి. పరమాత్మ అతని వేడికోలు వినిపించుకోలేదు. ప్రతికూల శక్తుల అవరోధాలు అధిగమించలేకపోయాడు. కాని తనలో ఒక నాదం నినదించింది. ఆ నాదంలో సౌందర్యం ఉంది. ఒక సందేశం ఉంది. అతని ఆత్మచుట్టు తేజో వలయాలు. జగన్మాత పెదవులపై దరహాసం దోబూచులాడింది. ఆమె అశ్వపతి ఆంతర్యాన్ని గ్రహించినట్లు, దానిని ఆమోదించినట్లు అనిపించింది.

"ఓ మార్గదర్శీ! నీ ఆవేదన అర్థమైంది. నీ నివేదన స్వీకరించాను. ఎవరో ఒకరు అవతరించాలి. విధి లిఖించిన కఠిన నియమాల్ని చెరిపివేయాలి. ఆత్మబలంతో మనిషి విధిని మార్చాలి. ఈ ప్రపంచాన్ని మార్చగల పరప్రజ్ఞ, అపరిమిత మేధాశక్తి ఈ స్తబ్దతను, నిశ్శబ్దాన్ని ఛేదించుకుని వస్తుంది. అవతరిస్తుంది. అన్ని శక్తులు, ఔన్నత్యాలు ఆ రూపంలో కలగలసి ఉంటాయి. ఆ రూపంలో ప్రవేశిస్తాయి. ఒక దివ్యసౌందర్యం భువిపైన అవతరిస్తుంది. ఆమె వినీల కపోలాలలో ప్రమోదం దాగి ఉంటుంది. శాబకం తన నిజ ఆవాసమైన వృక్షాన్ని ఆశ్రయించినట్లు అమరప్రేమ ఆమెను ఆశ్రయిస్తుంది. ఆమెలో విషాదం ఉండదు. ఆకర్షణ ఉంటుంది. ఆమె గొంతులో సంగీత మార్దవం. ఆమె నవ్వులో స్వర్గ నిర్ఝర కలస్వనం వినిపిస్తుంది. ఆమె అధరాలు పరమాత్మ మధురపల్లవాధరాలు. ఆమె వంపుసొంపులు బ్రహ్మానంద పూర్ణకుంభాలు. ఆమె హృదయంలో ప్రజ్ఞ నిబద్ధమై ఉంటుంది. విజేత కరవాలం వంటిది ఆమె శక్తి. అది ఆమె స్వంతం. ఆమె చూపులు బ్రహ్మానంద పరిమళాలు. ఒక పారిజాతపు అంటు భూమిపైన నాటబడుతుంది. మృత్యువు సమీపించినప్పుడు అది మహావృక్షమవుతుంది. ఆమె భౌతిక పరిమళాలు ప్రకృతి పరిధుల్ని దాటిపోతాయి. ఆ మానవి సంకల్పం విధిని మార్చగలదు."

అనంత తేజస్సులో ఒక జ్యోతి అంతర్హితమైంది. ఔన్నత్యం అంతర్లీనమైంది. అమృతత్వం మూలప్రకృతిని చేరింది. శబ్దం నిశ్శబ్దమయింది. ఒకప్పుడు చేరువై, సన్నిహితంగా మసలిన ఆనందం సుదూర నిశ్శబ్దంలోకి జారిపోయింది. ధ్యానంలో చెవులు వినలేని నాదాలు అవి. ఒక రుతం సుదూరాన ఉన్న రుతాల్ని పలకరించింది. స్వనం క్రమంగా నిర్గమించి నిస్వనమైంది. ఇంద్రియచాపల్యాన్ని, లోలతను వదిలి పృథ్వి మోహన రూపాన్ని వదలిపెట్టింది. ఆమె అంతరంగం శూన్యమై తేజస్సును నింపుకుంది. అన్నీ అసంపూర్ణ ఆధ్యాత్మిక సీమలే. అన్నీ ప్రశాంతంగా కనిపించే నిరుపహతి స్థలాలే. ఆ నిశ్శబ్దం నీడన ఒక రూపం కదిలింది. ఒక కాంతిరేఖ తొణికింది. తేజస్సు వొలికింది. చైతన్య సాగరంపైన ఒకే తరంగం కలకల నాదంతో, కిలకిల స్వరంతో, ధవళకాంతితో కదలి వచ్చింది. ఒక ఔన్నత్యం పొంగిపొరలింది. నిర్గుణ ప్రశాంత సీమలలో చిరుస్పందన పెనుచైతన్యం. ప్రకృతి కనురెప్పలు బరువుగా వాలాయి.

అశ్వపతి తపోమందిరాలు తేజోమండలాలు దాటి దిగి వచ్చాడు. తేజస్సు నిస్తేజమయింది. తేజో మండలాల శోభలు క్రమంగా దూరమైనాయి. అవి

జారి పడుతున్న ఉల్కల వలె దూరానికి పారిపోయాయి. శరీరం చైతన్యం పొందసాగింది. స్మృతి బాహ్య ప్రపంచపు అంచుకు చేరింది. ఆత్మ వేగంగా శబ్దమయ ప్రపంచంలోకి వచ్చి చేరింది. ప్రాపంచిక కార్యకలాపాలలోకి చొరబడ్డది.

దేవతలు మాత్రమే పయనించవలసిన రథం పైన తేజో చక్రాలను అమర్చి తిరిగాడు. స్వర్లోక సౌందర్యాలు ఆస్వాదించాడు. చివరకు ఆధ్యాత్మిక ద్వారాలు దాటి మన ప్రపంచంలో ప్రవేశించాడు. భౌతిక ప్రపంచం అతనికి ఆహ్వానం పలికింది. పైలోకాలలో తాను ఆర్జించిన జ్ఞానం, తెచ్చుకున్న జ్ఞానశకలాలు అతని ఆలోచనల్లో దాక్కున్నాయి. తన శోధనకు, పరిశోధనకు అవి ఉపకరణా లయినాయి. తాను వాటి ఆసరాతో సత్యలోక తీరాలను చేరుకోగలడు. తాను దాచుకున్న జ్ఞానశకలాలే తనకు ఆధారం.

అశ్వపతి సత్యయోగి అయినాడు. సత్యాన్వేషణ అతని లక్ష్యం, గమ్యం. అనేక జన్మలలో ఆర్జించుకున్న తపశ్శక్తి ఎంతో వుంది. అండగా నిలిచింది. అనేక సాహస కార్యాలు చేశాడు. నిశీధగర్భంలో మేల్కొని అజ్ఞానపు తెరలను ఛేదించుకొని గగన విహారం చేయసాగాడు. తారాపథంలో యోగిగా సంచరించాడు. మనస్సును శోధించి, ఆత్మ శరీరిగా, పయనించాడు. అతీంద్రియ, అగోచర మండలాలను సులభంగా చేరగలిగాడు.

ప్రపంచంలో తన విధ్యుక్త ధర్మాలను, కర్తవ్యాలను నెరవేర్చుతూ తన దివ్య ప్రజ్ఞతో దివ్య లోకాలను సందర్శించాడు. అతను పూర్ణయోగి. అనంత సాగరం మధ్యలో ఘన శిలా వేదికపై నిలిచి, విశ్వంలో తన ఆత్మ సామ్రాజ్యం సుస్థిరం చేసుకోగలిగాడు. భూగోళం అస్థిరం. తన జీవితం అస్థిమితం. అయినా తనది సత్యాన్వేషణ. తన పరిశోధన సత్యలోకాలలో ...

10. సావిత్రి బాల్యం

సావిత్రి బాల్యం యోగసాధకుని శైశవం. తొలినాళ్లలో యోగసాధకుని తొట్రుపాటు చర్యలు, తొందరపాటు, అమాయకత్వం, అత్రుత సావిత్రి బాల్య క్రీడలలో కనిపిస్తాయి. సావిత్రి తండ్రి అశ్వపతి. శ్రీ అరవిందులు యోగ విజ్ఞాన ఖని. ఆతని సంకల్పం మానవుడు పూర్ణ మానవుడు కావాలన్నది. సావిత్రి, అశ్వపతి, అరవిందుల లక్ష్యం ఒక్కటే. పరాశక్తి అయిన జగన్మాత భూమిపైన అవతరించాలి. మానవతను ఉద్ధరించాలి. అశ్వపతి జగన్మాత నుండి వరం పొందాడు. ఆమె సావిత్రి రూపంలో అవతరించింది. సృష్టిలోనూ బాల్యావస్థలు, ఋతుఘోష. ఆమె ఏకాంతం.

ప్రియురాలి స్పర్శకోసం పరితపించే ప్రియుని వలె, క్రాంతి చుట్టూ వాంఛ వలయాలుగా తిరుగుతుంది. దూరంగా ఒక కక్ష్యపై పరుగుతీస్తూ భూగోళం సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తుంది. అది అనంతంగా సాగుతున్న ప్రయాణం. మానవ మేధ శూన్యంలో ఊగిసలాడి సగం మేల్కొన్నది. ఒక గుండె అజ్ఞానంలో జీవితాన్ని స్వాప్నించింది. నిశ్చల ధ్యాన సమాధిలో ఉన్న భావన పరిమిత కార్యక్రమాన్ని రూపొందించుకుని కార్యభారం తనపైన వేసుకున్నది. ఆమెను పరివేష్టించిన దివ్యత్వం వదలిపోగా, విస్తృతంగా పరచుకొన్న ప్రశాంతి వీగిపోయింది. కాల చక్రానికి, మనో వేగానికి బందీ అయిన రోదసి మార్మిక హృదయంలో ఒక స్పందన ఏర్పడ్డది.

నిశ్చల గగనతలాన మిణుకుమనే తారలు చెల్లాచెదరైనాయి. ఒక మహా సంఘటన జరగబోతున్నది. ఒక అపూర్వ శక్తి ఆవిష్కరించబోతున్నది. జగన్మాత లయ విన్యాసం సుదీర్ఘమైన కాలచక్ర భ్రమణ వేగాన్ని తగ్గించింది. ఆ భ్రమణంలో కాంతి వలయాలు అనంతాంబరంలో కాషాయ కాంతులీనుతూ రంగు తీగలవలె కదలిపోతున్నవి దినాలు. గాలిలో కదలాడే అందాల రంగుల హరివిల్లులు ఋతువులతో కలసి నర్తిస్తున్నాయి. ఆ సంబరాలు అంబరాలై కాల సంకేతా

లయినాయి. అగ్ని తప్తమై అలసిన వసుధ గుండెపైన గ్రీష్మ తాపాలు అపరాహ్ణపు నిప్పు నెగళ్లు, వినీల గగన తలాన అగ్నుల కాంతిచ్ఛటలైనాయి.

గ్రీష్మ తాపానికి నెరియవిచ్చిన నేలపైన, ఉష్ణపక్షాల పైన, ఉప్పెనగా వర్షం కురవసాగింది. అగ్నిలో కాలిన ఆకాశంలో నల్లమబ్బులు, ఉరుములు, మెరుపులు. నేల జీవధారలతో తడిసి, తమిసింది. కుండపోత వర్షధారలు నదీ నదాలను సృష్టించాయి. నేల నాలుగు చెరగుల పచ్చదనాన్ని కప్పుకున్నది. చీకట్లు నిండిన నిశీధంలో ఉరుములు, మెరుపులు. నిద్రిస్తున్న స్వర్గాన్ని తారకలు రక్షించాయి. వసుంధర సుందర వదనంపై మబ్బుతెరలు. వైరి సేనలు రణరంగంలోకి దూసుకువచ్చినట్లు మేఘ మాలికలు భూమిని నలుదిశల చుట్టుముట్టాయి. ఆకాశ రాకాసి రానున్న జల ప్రళయాన్ని సూచించింది. మేఘాలు భేరీ నినాదాలు చేయగా, ఆకాశం యుద్ధసందేశాన్ని సూచించింది. కల్లోలసాగరాలు భూమిపైకి ఉరికినట్లు వర్షర్తువు నేల నాలుగు చెరగులా వ్యాపించింది. వర్షపు ధారలు ఎక్కు పెట్టిన బాణాలై, మెరుపులు దిక్కుల్ని పిక్కటిల్ల చేశాయి. శత్రువులు అదనుచూచి శిబిరాలపై దాడి చేసినట్లు ఆకాశం నేల కొరిగింది. హోరు గాలులతో విపరీతంగా వర్షం కురవ సాగింది. ఎటు చూచినా తుఫాను హోరు, ప్రళయ ఘోష. ఎండి పోయిన భూములలో నీరు వరదలై పారింది. దివ్య నీరాలు పగిలిన బీళ్లను నింపి వేశాయి.

జలప్రళయం లోకాన్ని ముంచివేసింది. ఎటు చూచినా జలసాగరమే. ఎటు చూచినా ప్రళయ ఘోష. మసకనేలపై చీకటి బరువు. అతి భారంగా సాగిసాగి ఉభయ సంధ్యలను కలిపివేసింది. అన్నీ అంధకారంలో తలమునక లైనాయి. సగం చీకటిని పగలు తరిమి వేసింది. మసిబారిన ఆకాశంలో ఉషోదయ వెలుగులు సగం చీకట్లను మింగివేశాయి. వర్షపాత జల ప్రవాహాల్లో మునిగిన నేల చిక్కడగా, చీదరగా, అసహ్యంగా మారింది. నేలంతా బురద. ఆకసంలో ఘనీభవించిన నిశ్చలత. కొన్నిరోజులు సూర్యుడు కనిపించలేదు. నిశ్చలత, నిర్మల వాతావరణం. మేఘ రోదనలు లేవు. సంక్షోభం సమసిపోయింది. మేఘాలను చీల్చుకుని ఒక కిరణం లోకాన్ని చూచింది. నేలపైకి ప్రసరించి వచ్చింది. కన్నీటి చాటున ఒక చిరుహాసం మెరిసింది. రావలసిన వెలుగు ఒక్కసారిగా రాదు. ఒక ఆశగా మిగిలిపోతుంది. మరొక జలప్రళయం ముంచుకొచ్చి, సర్వాన్ని ముంచి, జగతిని నిష్కళంకం చేసింది. ఆపైన జల ప్రళయాలు సమసిపోయాయి. చెట్టు చేమలు పచ్చగా ఊసులాడుకున్నాయి.

నేల పచ్చబడ్డది. లోకం ఆనంద తాండవం చేసింది. రోజులు నిశ్చింతగా, తృప్తిగా సాగిపోతున్నాయి. సవిత్రుని వెచ్చదనంలో భూమి పాలు పంచుకోసాగింది.

భగవంతునికి చేరువవుతున్న భావన, ప్రశాంతత. ఒక అతీంద్రియత నేలను, నింగిని ముడివేసిన స్పృహ, పారవశ్యంలో త్వమేవాహం మెలకువ. ధ్యానంలో హృదయం శూన్యంతో పూర్ణమైన తృప్తి. మూగమనసులో ఒక స్వప్నం శూన్యంగా కదలాడింది. కాలం ఆనందంతో తన రహస్య మందిరం తలుపులు తెరచింది. దానిలోకి ఒక ఔన్నత్యం, ఒక ఆశ నెమ్మదిగా ప్రవేశించాయి. ఆత్మ తనలో ఏవేవో స్వర్గసుఖాలను నెమకసాగింది. ఆలోచన అంతరంగంలో ఒక జ్యోతిని వెలిగించి గుప్తంగా దాచుకుంది. అంతర్దృష్టికి మాత్రమే దివ్యతేజస్సు కనిపిస్తుంది.

మూడు ఋతువులు నిండుగా ఉత్తేజంగా గడిచాయి. వాటి బాధ్యతల్ని అవి సక్రమంగా నెరవేర్చాయి. వెలుగు వెనుకనున్న జ్యోతికై నిరీక్షణ, ఒక మహత్తర జన్మకై ఎదురు చూడసాగాయి.

శరత్తు పండు వెన్నెల్ని పండించుకుంది. జలాశయాలు ప్రఫుల్ల పద్మాలైనాయి. హేమంత తుషారాలు శీతలోపచారాలు చేశాయి. సగం నిద్రలో ఉన్న ప్రకృతిని ముద్దాడి లేపాయి. ప్రకృతి రమణీయంగా పులకిస్తూ చాలా ఏండ్లు పరవశించి, మైమరిచిపోయింది. వసంతం ఉన్మత్త ప్రేమికుడై కానలు, కోనలు దాటి వసుధను ఆలింగనం చేసుకుంది. వసుధ నవవధువు అయింది. వసంతాగమనంతో కనుపాపల మెరిసిన ఇంద్రధనుస్సు. అతని కౌగిలి ఆనంద పారవశ్యానికి ప్రతీక. అతని చుంబనం అతీంద్రియ స్థితిలో కలిగే స్పందన. వసంతసంస్పర్శ భౌతిక జీవితాలకు యౌవనాన్ని, చైతన్యాన్ని ప్రసాదిస్తుంది. మాసిపోయిన మధురిమకు కొత్త రుచులు అద్దుతుంది. కోర్కెను కాలానికి కట్టుబడ నీయదు, మృత్యువుకు పట్టుబడనీయదు.

మన హృదయాలను పులకింపచేసే ప్రకృతి అందాలు నిత్య నూతనంగా ఉండాలి. అవే అందాలు తిరిగి తిరిగి పొందలేం. ఆనందాలు శాశ్వతం కావాలి. కానీ అందాలు కావు. వసంతాగమనం ప్రకృతికే అందాలు పొదిగి హృదయాలకు ఆనందాలు సమకూర్చింది. వసంతుని రాక మోడువారిన జీవితాలకు కొత్త చివుళ్లు తొడిగింది. అలసిన జీవితాలకు ఊరట, ఉపశమనం లభించింది. ఆ ఆనందమే ప్రకృతిని బందీ చేసింది.

ఆమె ప్రకృతి, అతను వసంతుడు.

అతని ఆగమనం ఆమె భౌతిక జీవనానికి అందించిన వరం. తనలోని ఉద్విగ్న మమకారంతో, అధర స్పర్శతో ఆమె రూపాన్ని దిద్ది సౌందర్య పూర్ణం చేశాడు. ఆ పారవశ్యం తనలో ఇముడ్చుకోలేని ప్రకృతి నిస్వన విన్యాసాలు చేసింది. తరుగిరులపై మయూరాలు నృత్యం చేయసాగాయి. అతని ఆశ్వాసమే ఆనందానికి, పారవశ్యానికి స్వాగతం. అతని చూపు సోకినంత మేర అంతా సస్యశ్యామలమే. దివ్యత్వం భావంలో కలిసి, అనుభూతిని కలిగించింది. అది సౌందర్యంగా సర్వవ్యాప్తమై ప్రకృతిని సైతం సచ్చిదానందంలో ముంచెత్తింది. క్షణిక సుఖాలపై అశాశ్వత ముద్ర వేసింది.

ఒక సంకల్పం తీవ్ర రూపం దాల్చి దివ్యపూతమైనప్పుడు జీవించడమే ఒక అద్భుతమైన అనుభవం అవుతుంది. ప్రతి అనుభవం ఒక ఆనంద సోపానం అవుతుంది. దృశ్యాలు, శబ్దాలు పారవశ్యం కలిగిస్తాయి. అప్పుడు జీవితం మధురం, కాంతి పూర్ణం, అనురాగ పూర్ణం అనిపిస్తుంది. నిరర్ధకం కాదు. ప్రకృతి కిరణ తోరణాలు కట్టి, రాగ వల్లికలు కూర్చి, సప్తస్వర సంగీత ఝురులు ప్రవహింప చేస్తుంది. తరు శాఖలపై హరిత పత్ర సంగీతం వినిపిస్తుంది. గంధ పరిమళాలతో కాలం పరుగులు తీస్తుంది.

సంకల్పంలో స్వచ్ఛత, పవిత్రత కలగలసినపుడు బొండు మల్లె వాసనలు గుబాళిస్తాయి. మావిచివుళ్లు మెక్కిన కోకిలలు విరహగీతాలు ఆలపిస్తాయి. మధుకరుడు తేనియకై విరబూసిన పూవులపై వాలుతుంటాడు. పరమాత్మ సుందర దరహాసమే హృదయంలో వెన్నెల. ఆ వెన్నెల వెలుగులే ప్రకృతికి వసంతోత్సవం.

ఆ మహత్తర దివ్య ముహూర్తంలో వసుధ ఆరాటానికి, అభిలాషకు సమాధానంగా పరలోకాలనుండి సమాధానం అందింది. శబ్ద ప్రపంచంలో దాగివున్న నిశ్శబ్దమే దానికి సమాధానం అయింది. అదే పరమపథం. జడప్రాయంగా వున్న నేలపైన ఒక మహాశక్తి ఆవిర్భవించింది. అది ఒక జ్యోతిని వెలిగించింది. ఒక చిరురూపం ఏర్పడ్డది. మానవ సంకల్పానికి భగవదనుగ్రహానికి సంధాతగా ఒక తేజోకిరణం నేలను స్పృశించింది. అది స్వర్గానికి భూమికి మధ్య వారధి. ఆ తేజస్సు మనిషి జ్ఞానాన్ని అగోచర ప్రకృతికి బదలీ చేస్తుంది.

దివ్యత్వానికి మూలకారణమైన పరాశక్తి, ఈ అసమగ్ర ప్రపంచంలో అవతరించి అశాశ్వతత్వంతో జతపడినందుకు విచారించలేదు. పైగా అన్నింటినీ సమ దృష్టితో, పవిత్ర ప్రేమతో ఆదరించసాగింది. అతీంద్రియ లోకాలనుండి

తిరిగి వచ్చిన వారు ప్రాపంచిక భారాలను మళ్లీ వహించక తప్పదు. లోగడ వారంతా ఈ బాధల్ని అనుభవించి, బరువులు మోసి అలసిపోయిన వారే.

సావిత్రి దివి నుండి దిగి వచ్చిన దివ్యత్వం. ఆదిశక్తి అవతారం. జగన్మాతకు ప్రతినిధి అయిన అంశ. ప్రపంచంలో జన్మించిన ఆమె తన దివ్య కార్య నిర్వహణకు పూనుకున్నది. కోట్ల సంవత్సరాల కాలాన్ని, మృత్యురేఖను దాటివచ్చింది. అయినా సంయమనంతో కాలంతో తలపడ సిద్ధపడ్డది. దివ్యత్వం సంపూర్ణంగా ఉన్నా, పూర్వ జ్ఞాపకాలపైన, ప్రజ్ఞపైన ప్రకృతి మాయతెర వేస్తుంది. ఆ రహస్యబంధాల్ని కాలం త్రుంచి వేయాలి. అదే భూమికి స్వర్గానికి గల అనుబంధం.

ప్రపంచ పరిధిలో మనిషి పరిశ్రమకు, శ్రమకు, పరాశక్తికి మధ్య ఒక సున్నితమైన అనుబంధం ఉంది. మార్మిక కృషి వల్లగాని అది పూర్ణత్వం సాధించదు. విశ్వ క్రీడలో అది సాహసకార్యం. శూన్యంలో భూగోళం బొంగరంలా తిరిగినప్పుడు, మనిషి మేధస్సులో చలనం పుడుతుంది. జీవం భౌతికరూపంలో కదలాడుతుంది. అనుభూతి రగిలి అజ్ఞానాన్ని త్రోసివేస్తుంది. నిశ్శబ్దంలోంచి శబ్దం ప్రభవించినప్పుడు ప్రకృతి గుండె కదలాడుతుంది. జగన్మాత తన ఆనందాన్ని అందరికీ పంచిపెడుతుంది. జీవరాశిపైన తన ముద్ర వేస్తుంది. అజ్ఞాతంగా ఉన్న అగాధాలలో దివ్యత్వాన్ని దిద్ది, జడపదార్థంలో పరమాత్మ స్పర్శ కలిగించింది.

మానవ మేధస్సు పతనమై ప్రగతిని విస్మరించినా, మానవ ప్రయత్నాలు నిష్ఫలమైనా, భూమిని స్వర్గసీమగా మార్చాలన్న జగన్మాత సంకల్పం మారదు. అపజయాల వల్ల నిరాశ చెందదు. కాలయాపనవల్ల హృదయం శూన్యం కాదు. ఎన్ని యుగాలు గడిచినా లక్ష్యం చెదరదు. విధి, మృత్యువు తనపైన పెత్తనం ఆమె సహించలేదు. ఆమె ఎప్పటికప్పుడు ఆత్మల్ని ఉత్సాహ పరుస్తుంది, చైతన్యంతో నింపుతుంది. అనేక మార్మిక శక్తుల్ని వరాలుగా ప్రసాదించి, ఆత్మ దర్శన లక్ష్యం దిశగా పయనింపచేస్తుంది. పరాశక్తి ఎంత వెచ్చించినా నష్టం లేదు. మనిషికి పరబ్రహ్మపై ఆసక్తి పెరగాలి. అందుకు ప్రతి హృదయం సిద్ధం కావాలి. ప్రతి హృదయం ఆనందానికి భూమిక కావాలి. ప్రతి మనిషికి రవంత దివ్యత్వం అందాలి. మృత్యువు ముసుగులో అమరత్వాన్ని దాచి ఉంచింది. అందుకై దివ్య సంకల్పంతో మరొకమారు మానవాకృతి ధరించింది.

మానవమేధ సత్యలోకాల నుండి శక్తిని, స్ఫూర్తిని గ్రహిస్తుంది. భావ చిత్రాలను రూపొందించుకొని కార్యోన్ముఖం కాగలదు. దివ్య సంకేతాలను అందుకొని, దివ్య ప్రజ్ఞతో సిద్ధుల్ని మహత్తుల్ని ప్రదర్శించి, మానవ శరీరాలను ఆయత్తపరుస్తుంది. ఈ అవతరణ వల్ల మానవునిపై దివ్యప్రభావం ఏర్పడుతుంది.

దాని ఒత్తిడి పెరిగినకొద్దీ మనిషిలో తనకు తెలియని ఒక దివ్యసుందరరూపం ఏర్పడుతుంది. అభిలాష చోటుచేసుకుంటుంది. అది సూచిక, అదే సంకేతం. అది భవిష్యత్తులో దివ్యావిష్కరణకు వెలుగుబాట. మసక చీకట్లలో ఉదయించిన నెలబాలుని వంటిది ఆ ఆశారేఖ. అది జీవితంలో దినదిన ప్రవర్ధమానం కావాలి.

అది మొదట రూపం లేని భావంలా మనస్సులో చొరబడుతుంది. భావం వలె కదలి, నిశ్శబ్దంలో కలసిపోయి మత్తుగా నిద్రిస్తుంది. సాధనలో కానీ అది నిద్ర లేచి హృదయాన్ని వెతుక్కోదు. దాని స్థావరం హృదయం. హృదయాన్ని చేరిన భావం రూపాంతరం చెంది దివ్యత్వంతో చేయి కలుపుతుంది. సాక్షికంగా జాగృతమవుతుంది. ఆత్మశక్తి సహాయంతో అతీంద్రియ ప్రజ్ఞను సాధించు కుంటుంది. అక్కడ ఆత్మకు రూపంతో సంబంధం ఉంటుంది. రూపాన్ని మాత్రమే తొలుత గుర్తిస్తుంది. ఆరాధించ గలుగుతుంది. తేజస్సు పొందిన తర్వాత ఆత్మకు రూపంతో పని ఉండదు. అప్పుడు ఆత్మ స్వతంత్రిస్తుంది.

చిత్రమైన భూగోళంపైన అవతరించిన విచిత్రమైన ఆ శిశువు దూరాన ఆగిపోయిన తన దివ్యత్వాన్ని, దివ్యస్థావరాన్ని స్మరించి, తేజోవంతమైన తన ఆత్మ మందిర ద్వారాలను మూసి, గతాన్ని విస్మరించింది. ఆమెకు బాల్య క్రీడలలోనే అతీంద్రియ లక్షణాలు ఏర్పడ్డాయి. భూమికి కడు దూరంలో ఆలోచనలు విహరించడాన్ని గమనించవచ్చు. అమరత్వాన్ని తన సొంతం చేసుకున్న దివ్య లక్షణాలు ఆమెలో దోబూచులాడాయి. ఆమెలో సహజంగా ఉన్న దైవత్వం స్పష్టంగా కనిపించసాగింది. ఆమెకు తన బ్రహ్మానందస్థితి తప్ప మరేమీ అవసరం లేదు. ఆమె సహజంగా మనగలిగిన లోకం వేరు. ఈ భూలోకం ఆమెకు విడిది.

ఫల, పుష్ప భరితమైన జీవనతరువుపై వాలి కొమ్మకొమ్మను, రెమ్మరెమ్మను పలకరించే శాబకంవలె ఆ వనసౌందర్యానికి పరవశించింది. అమాయకంగా దివ్యశిఖరాలను అందుకోవాలని ఆరాటపడింది. ఆమె భూమినే ప్రభావితం చేయగలిగింది. ఆమె బాల్యం ఆటపాటలతో ఆనందడోల లూగింది. అనుక్షణం ఆమె మనస్సు పల్లవించింది. హృదయం పులకించింది. ఇది కావాలని అడగదు. ఏది కావాలో తనకు తెలుసు. ప్రకృతిని ప్రసాదంగా స్వీకరించింది. ఆమె ఆత్మశక్తి సవిత్రుని తేజస్సు వంటిది. ఆమె పొందే ఆనందం అనంత బ్రహ్మానందం.

పరమాత్మ నుండి వేరుపడి ప్రకృతిలో ప్రభవించిన జీవి ప్రాణం పోసుకుని తనలో పరాశక్తినే చూడసాగింది. బ్రహ్మానందంతో ఆకాశం అంచులు చూడ గలిగింది. జీవితలక్ష్యం జీవించడం కనుక జీవన లాలసతో సంపూర్ణ మానవ

కాంతగా జీవించదలచింది. ఆత్మతో అన్నింటిని అనుభవిస్తూ తృప్తిచెందింది. ఈ లోకపు ఆనందాలకు, ఆ లోకపు ఆనందాలకు పొంతన లేదు. పరిసర వాతావరణంతో అనుబంధం లేదు. ఏ ఆధారం, ఆదరవు, రూప సారూప్యం అవసరం లేని అపూర్వ, అతీంద్రియ పూర్ణత్వం ఆమెది.

వయస్సుతో పాటు మనిషిలో దివ్యత్వం పెరగాలి. మనిషి పరిణామం చెందాలి. అన్ని ప్రసాదనాలు ధ్యానంలో లయించిపోవాలి. చిన్న అనుభూతికే మనసు పరవశిస్తుంది. ఆనందం వెల్లివిరుస్తుంది. ఆమె శీతోష్ణాలను సమంగా భరించగలదు. పత్ర చలనంలో అద్భుతానందం పొందగలదు. పూలనెత్తావులలో నిసర్గ మధురిమలు కొమ్మలలో, రెమ్మలలో ఆనంద నిష్యందాలు, పారవశ్యానికి మూలకారణమైన దివ్యత్వం. ఆకర్షణకు ఆలవాలమైనది అతీంద్రియశక్తి. మాధుర్యానికి అధిదేవత, అగోచర స్వప్నరాగలీన. ఇంద్రియలోలత్వం నుండి మానవ జీవితాలను రక్షించి, ఉద్ధరించే తేజస్సు ఆమెది. ఆమె మార్మిక లోకంలో దివ్య నీరాలలో సుస్నాత అయింది. దివ్య ఔన్నత్యం అణువణువున ఆమెలో దర్శనీయ మయింది.

ఆమె ప్రాపంచిక సుఖాలను కాదనలేదు, నిరసించలేదు. తన ఆత్మ స్థితి నుండి దిగి రాలేదు. దిగి వచ్చినా ప్రాపంచిక, భౌతిక లాలసతో తన ఉనికిని విస్మరించలేదు. ఆమె మేధ ఒక కొత్త ప్రపంచాన్ని రూపుదిద్దుకుంది. మన కల్పనలు చిత్రచిత్ర రూపాల్ని ధరిస్తుంటాయి. ఆమె కలలకు ఆధ్యాత్మిక రంగులను అద్దుకొన్నది. హృదయ మందిరంలో సువర్ణ మూర్తిగా భాసించింది. మనం చూడలేని దివ్యరూపాలను ఆమె చూడగలిగింది. ఆమె ఆత్మశక్తి ఆశించిన రూపాన్ని ఆవిష్కరించగలదు. ఆ రూపాలు బాహ్యప్రజ్ఞకు, వివేకానికి అందనివి.

ఆమె నరాలలో ప్రవహిస్తున్నది సూర్య తేజస్సు. ఆమె మేధ దివ్యచ్ఛటలతో నిండి పోయింది. ప్రపంచం గుర్తించని దివ్యదృష్టి ఆమెది. జ్ఞాన కిరణం ప్రసరించిన చోట్ల పసిభావనలు సైతం పసిమి కిరణాలను పంచిపెడతాయి. ఆమె హృదయం నిండా సత్య దీప్తులే. ఆమె కళ్ల నుండి ప్రసరించే వెలుగు మనిషికి మహాశాంతిని ప్రసాదించింది. ఆమె దృష్టిలో మానవులంతా ఆత్మ స్వరూపులే. చైతన్య పూర్ణమైన ప్రతి అంశం ఆమె కొక దివ్య సందేశాన్ని అందించింది. మన అవగాహన పాక్షికమే అయినా అనంత కాలచక్రంలో ప్రతిక్షణం ఒక శక్తి సంకేతమే. ప్రతిదీ ఒక దివ్య తేజోకిరణమే.

సృష్టిలో ఏదీ జడం కాదు. ఏదీ నిరుపయోగం కాదు. ఆమె పరా ప్రకృతికి ఆలవాలమైంది. నేల నుండి చెట్టు చేమ ఉద్గమించినట్లు, పశుత్వం నుండి మనిషి

పరిణామం చెందినట్లు ఆమెలో ఒక మహామనీషి తయారైంది. ఒక కాంతి, ఒక జీవనశక్తి, ఒక నిగూఢ అమృతత్వం ఆమె నూతన శరీరానికి ఆలంబనలు.

రోజులు గడుస్తున్నాయి, వసంతాలు మారుతున్నాయి.

ఆమె నవ జవ్వని అయింది. పూర్ణ శోభాంగిక. ఆకృతీకరించిన సౌందర్యం. అంగాంగ మధురిమలు. ఆమె శరత్‌చంద్రిక. గంభీర ప్రశాంతత ఆమె రక్షాకవచం. ఏకాంతంలోని నిశ్చలత్వం వృధాపోదు. సూర్యోదయ కాంతులలో తారకలు కనిపించవు. యవ్వనోదయంతో బాల్యచాపల్యాలు కరిగిపోయాయి. ఆమెలో దివ్యత్వం పెల్లుబికింది. ఆమె మానవతకు అద్దిన మధురిమ.

ఆమెను అనుక్షణం పరమాత్మ గమనిస్తూ ఉంది. దివ్య తేజస్సు ఆమెలో ఆత్మతేజస్సుగా మారింది. మనిషికి ఆత్మశక్తే దివ్యశక్తి. అది దివ్యమైన వరం. ఆమె చూపుల్లో కమనీయ రాగాలు. మార్మిక దేవాలయంలో వెలిగే జ్యోతులు, ఆమె నేత్రాలు విస్ఫులింగాలు.

అవి మనిషి గుండెలో దివ్యత్వాన్ని రగిలించగల మధురాగ్నులు. అవి దివ్యసీమలు మెట్టి వచ్చిన కాంతి పుంజాలు. జీవితానికి ఆమె ఒక అమర సందేశం. ఆమె ఫాలభాగాన భాసించే స్ఫూర్తి అంతర్ ప్రజ్ఞను ప్రతిబింబింపచేసింది. ఆమె కనుకొలకుల కదలాడే శక్తి పరాశక్తికి ప్రతిబింబం. అవి దివ్యప్రజ్ఞకు ప్రాపంచిక ప్రజ్ఞకు రెండు నేత్రాలు. కోట బురుజుపై నుండి వినిపించే విజయనాదంవలె ఆమె పలుకు సందేశాన్ని యిస్తుంది. నగరంలో నిశ్శబ్దంగా, గుప్తంగా సంచరించే గూఢచారివలె ఆమెలో శక్తి గుప్తంగా చరిస్తుంది. అదే ఆమె హృదయ సింహాసనంపైనున్న సత్యానికి రక్షణ. ఆమె హృదయం ప్రేమను వర్షించి అందరికీ తృప్తినిస్తుంది. ఆమె ఎవరితో పలకదు. తన హృదయాన్ని సదా నిశ్శబ్దంతో, ప్రశాంతితో నింపుకుంటుంది.

ఆమె వయసు పూర్ణత్వాన్ని అనుగ్రహించింది. ఆమెలో ఎందరో దేవతలు కొలువున్నారు. ఆమె స్వభావరీత్యా గంభీర. ఆమె అనేక రాగాల సమ్మేళనం. అది మహత్వపూర్ణం. అంతటి మహత్తును భరిస్తున్నది ఆ చిన్ని శరీరం. దివ్యకాంతిని అదనంగా పొందిన భౌతిక శరీరం అది. అది స్వాప్నికతకు రమణీయ రూపకల్పన. ఆమె దివ్య నదీ నదాలపైన నిర్మితమైన వంతెన. ఆమె అనంత ప్రశాంతికి అనుంగు నెచ్చెలి. సరోవర తీరంలో ఒంటరిగా నిలిచిన ఖర్జూరం. నందనవనంలోని పారిజాతం. నిద్రిస్తున్న ప్రకృతిలో దేవతల పద సవ్వడులు ఆమె వింటుంది. నిశీథంలో తారకల ప్రశాంతి ఆమె.

11. యవ్వనం

సావిత్రి బాల్యం గడిచింది. యవ్వనంలో ప్రవేశించింది. యవ్వనంతో పాటు దివ్యత్వం ఆమెలో ప్రవేశించింది. ఆమె రాకుమారి వలె కన్పించినా ఆమె యోగిని. ఆమె హృదయం నిండా అతీంద్రియ శక్తులే నిండివున్నాయి. ఆమె షోడశ కళావిలాసిని. పూర్ణ యవ్వని. ఆమెకు తోడు కావాలి. ఆమెను ప్రేమించ దలచిన వారు ఆమెను దేవతవలె ఆరాధించసాగారు. ఆమె శక్తిని భరించగల పురుషుడు కనిపించలేదు. అందరూ ఆమెకు ప్రేమ పూజారులే.

కొండలపైన పుట్టి, కోనలలో మెలి తిరిగి, సారసక్షేత్రాలలో ప్రవహించే నది సాగర సంగమాన్ని కోరడం సహజం. నది వంటిది కన్య జీవనం. ఆ కొండలు, ఆ కోనలు సృష్టికి ఆధారాలు. ఆధ్యాత్మికతకు నెలవులు. విశ్వాత్మకు ఆవాసాలు. మనిషి అతీంద్రియ జ్ఞానం సంపాదించి సత్యం వైపు పరుగులు తీస్తాడు. అది సత్య సంగమం. స్వప్నంలోను, సమాధిలోను పొందే దివ్యానందం శాశ్వతం కావాలన్నది యోగి ఆరాటం. అందుకే ఈ మౌన పోరాటం. ప్రపంచం పరమాత్ముని లీలా వినోదం. మనిషి మనుగడ కోసం పరితపిస్తున్నట్లు, ఆత్మ పరమాత్మ కోసం పరితపించాలి, పరుగులు తీయాలి. ఆత్మ పరమాత్మల సంగమక్రీడ యోగసాధన. అది కలవరించే దశ. ఆ సంగమంలో ఎన్ని రుచులు, ఆకర్షణలు, ఆనందాలు, మహత్యాలు! అన్నీ శాశ్వతాలే కనుక వాటి రుచులు, అభిరుచులు శాశ్వతంగా నిలుస్తున్నాయి. సావిత్రి బాల్యం ఒక మధుర స్వప్నం.

ఆమెలో కోటి కాంతుల ప్రభలు. గతకాలంలో జరిగి మరుగున పడ్డ అనుభవాల వెలుగు నీడలు ఆమె చుట్టు పరిభ్రమిస్తున్నాయి. దివ్యావతరణకు ఆమె చుట్టు తిరిగే కాంతిచ్ఛటల స్వాగతం. ఆమె దివ్యత్వానికి ప్రేరణ. అగోచర శక్తులన్నీ ఆమె నీడన తలదాచుకున్నాయి. దివ్యత్వాన్ని ఆమె తలదాల్చింది. ఆమె హృదయంలో నిండుగా పండిన విజ్ఞానం పరవళ్లు త్రొక్కుతోంది. మేధో

శిఖరాలు దాటి దివ్య సీమలను చేరాలని అనుక్షణం ఆరాటం. భౌతిక ప్రపంచాన్ని వదలి రోదసితో చేయి కలపాలన్న తపన. నరనరాన ఆమెలో భావ ప్రజ్ఞ. ఋషిత్వం అగోచరాన్ని దర్శిస్తూ, ఊహల్ని వాస్తవం చేయాలన్న ఉద్విగ్న భావనతో మనోకవాటాలను తెరిచింది. అనంతంలోకి, అందని తీరాల్లోకి చూపులు సారించింది. మనిషి ఆశలకు అంతం ఉండదు. ఆమె హృదయం కళా నిలయం. ఆమె లావణ్యం సౌందర్య చషకం. ఆమె ఆకృతిలో దివ్యప్రకృతి రూపుదిద్దుకుంది.

మనిషి ప్రాయికంగా ఆత్మస్వరూపి. ధార్మికంగా స్వర్లోకవాసి. కనుక సదా పరాన్ని ఆశిస్తాడు. తన సంస్కారాన్ని ఉన్నతం చేసుకుని, దానితో వివేకాన్ని సమన్వయ పరచి, రవంత ప్రజ్ఞను అందులో చొప్పించి, అగోచరాన్ని దర్శించాలని, వినిపించని రాగాలు వినాలని, గుప్తజ్ఞానాన్ని తెలుసుకోవాలని ప్రయత్నిస్తాడు. అదే అవాఙ్మానస గోచరం. అందుకు భౌతిక సంబంధాలను, కర్మబంధాలను త్రెంచుకోడానికి వెనుకాడడు. విముక్తి కోసం తనను ఈ లోకం నుండి దూరం చేసుకుంటాడు. అలాంటి ఆర్తులకే పరమాత్మ సహాయం అందుతుంది.

ఈ లోకం, ఈ ప్రపంచం తన ఆవాసం కాదని తెలుసుకున్న ఆత్మ రెక్కలు విదిల్చి ఎగిరిపోవడానికి సమాయత్తమవుతుంది. అప్పుడు శూన్యాంబరాలలో స్వేచ్ఛగా, యధేచ్ఛగా విహరించగలుగుతుంది. ఇహపరాల మధ్యగల మార్మిక సంద్రాలను దాటుతుంది. ప్రతి జీవి దాటవలసింది సంసార సాగరం. అయితే ప్రతి ఆత్మ దాటవలసింది మార్మిక మహాసాగరాలు. శూన్యానికి ఆవల ఆత్మ చేరేది మరో భాను మండలాన్ని. భాను మండల మధ్యలో ఉంటుంది ఆత్మకు అనువైన పీఠం. అది పీఠికాపురం. ఉన్నతాసనం తన ఆశయం.

సావిత్రి తన ఆత్మ రహస్యాన్ని గ్రహించింది. దివ్యశక్తుల్ని సంకేతాల ద్వారా తనలోకి ఆవాహన చేసుకుని తన జీవితపథాల్లోకి మళ్లించింది. అది సత్య సమాహారం. అది బ్రహ్మానంద తారకం. అది ప్రకృతి జ్ఞానాలయం. అక్కడిది మార్మిక శిక్షణ. సృష్టిలోని అద్భుతాలు అన్నీ ఆమెకు పరిచయమైనాయి. తన హృదయ మందిరంలో అన్నింటినీ ప్రతిష్ఠించుకున్నది. ఇప్పుడు ఆమె చర్యలు కాలానికి అందవు. ఆమె దినచర్యలు నిత్యనైమిత్తికాలు, త్యాగానికి, సత్యానికి సంకేతాలు. ఉన్నత లోకాలలో ఆత్మకు ఏర్పడిన అనుబంధం మనిషిని కర్మ విముక్తుని చేస్తుంది. విధి నుండి దూరం చేస్తుంది. అందుకు తొలినాళ్ళలో దేవతామూర్తులతో చెలిమి అవసరం. మంత్రం ఒక మార్గం. సాధన ఒక ప్రయాణం. తనలో నిజ దివ్య రూపావిష్కరణ జరిగే వరకు ఈ ప్రయాణం సాగించవలసిందే.

సృష్ట్యాది నుండి చరాచరాలలో చలన రహితంగా చరిస్తున్న ఆత్మ జరామరణాలు లేని అగోచర పరమాత్మకై అన్వేషిస్తుంది. నిగూఢంగా ఉన్న రహస్యాలపై ముసుగు తొలగిస్తుంది. తాత్విక సిద్ధాంతాలన్నీ పరానికి సోపానాలు. శూన్యంలో ప్రయాణానికి కనిపించని బాటలు. మానవ మేధస్సును విశ్వ మేధగా మార్చే ఉపకరణాలు. ఇంద్రియాలకు అందని తీరాలకు ఆవల సృష్టికి మూలమైన దృష్టి ఉంటుంది. ఒక శిల్పం పైన, ఒక చిత్రం పైన మనస్సును లగ్నం చేస్తే దాని వెనుక ఉన్న అగోచర భావన స్ఫురిస్తుంది. అది అగోచర పరమాత్మకు ప్రతీక. ప్రకృతి యావత్తు ఒకే రేఖపై అరూపంగా గోచరిస్తుంది. సమస్త విశ్వం ఒకే దివ్య భావనలో లయిస్తుంది.

మన దృష్టి అంతర్ముఖమైనప్పుడు పరమాత్మ సృష్టి సౌందర్యం ప్రభాస మానమై శిలా ప్రతిమలో సైతం లీలగా గోచరిస్తుంది. ఆ పారవశ్యంలో వినిపించే సంగీతం అమృతవర్షిణి, రాగాలాపన. అది సోకిన హృదయం రసార్ణవం అవుతుంది. తాండవ నృత్యంలో విశ్వ చలనాలే భావ, రాగ, తాళ తంత్రులు. నాట్య ముద్రలు. అవి సూక్ష్మశరీరంపై సున్నిత ముద్రలు వేసి అనుగీతలై స్మృతి పథంలో క్షణకాలం సూక్ష్మలోకాల అందాలను మెరిపిస్తాయి. అవే శాశ్వతాలు అనిపిస్తాయి. అవి మనలో నిక్షిప్తంగా ఉన్న మన రూపాలే. ఆ రసరమ్య గీతాలు చలిత ప్రపంచాలు. భాషలో బంధించబడిన చందాలు. ఆ దివ్య, సూక్ష్మ రూపాల అందాలు, అలంకరణలు శాశ్వతాలు. సావిత్రి ఆ భావప్రపంచాలలో, అభావ ప్రపంచాలలో విహరించి, దైవశక్తులను తనలోకి తీసుకుంది.

అంతర్దృష్టి ఏర్పడిన మనిషి అంతర్లోకాలు దర్శించి రాగలడు. అగణిత ప్రజ్ఞతో విశ్వగణిత సూత్రాల్ని విశ్లేషించగలడు. తన సంకల్పంతో గ్రహగతుల్ని మార్చగలడు. చలనాలను క్రమబద్ధం చేయగలడు. కనిపించే ప్రపంచాన్ని సరిదిద్దగలడు. దాని రూపు మార్చగలడు. తన ప్రజ్ఞతో మేధస్సును దాటి నూతన సిద్ధాంతాలతో సత్యావిష్కరణ చేయగలడు. సావిత్రి ఆ స్థాయికి చేరింది. అయినా ఆమెకు తృప్తి కలగలేదు. చిన్న చిన్న విజయాలు మనిషి ఎదుగుదలకు అవరోధాల వుతాయి.

ఆమెకు అవి మహత్తరమైన అతిలోక విజయాలు. ఆత్మ పరిశోధనలోని అవరోధాలను మనిషి తన వివేకంతో తొలగించుకోవాలి. పరప్రజ్ఞ, అంతశ్శుద్ధి అవసరం. అనేక సత్యశోధనలో అవరోధాలు ఎదురవుతాయి. శాఖోపశాఖలుగా విస్తరించిన ప్రతిభ నిటారుగా మనిషిని ఎదగనీయదు. ఆత్మకు విశాలత్వం

అవసరం. ప్రత్యక్షానుభవానికి అపరోక్షానుభూతి జతపడాలి. అందులో దేవతల, దైవశక్తుల ప్రమేయం ఉండదు.

మనిషి ఆలోచనకు అందనిది, ఆలోచనల్ని మించింది ప్రజ్ఞ. అది హృదయానికి, అనుభూతికి మాత్రమే పరిమితమైన ఆనందం. లోకంలో లభించే వాటిని వదులుకోవడం విముక్తి. విరక్తి విముక్తికి మార్గం కాదు. విముక్తి కోసం విరక్తిని పెంచుకోనవసరం లేదు. ఆమె ఆత్మ ప్రపంచం నుండి విముక్తమైంది. తనకు శక్తిని ప్రసాదించమని ప్రకృతిని అర్థించింది. తాను సహజంగానే ప్రేమించగలదు. జన్మతః రాజసం పల్లవించే రాజయోగిని. ఆమె ఔన్నత్యంలో మాధుర్యం, మహదానందం ఉన్నాయి. విశ్వమంత విశాలమైన ప్రేమ ఆమె హృదయస్థం. అదే ఆమె శక్తి. అదే పరాన్ని జయించడానికి ఆమెకున్న బలం. ఆమె ఆత్మ అవలీలగా పరసీమల్ని చేరింది. పరమాత్మ వెలుగుల్ని దర్శించింది. తనకోసం తనకు బలిమిగా, ఒక అతీంద్రియ రంగాన్ని సిద్ధపరచుకుంది.

అందరిలోను ఉండేవి విశ్వాత్మ అంశలే. ప్రతి హృదయం ఆత్మకు ఆవాసమే. మానవుడే సిద్ధం కావాలి. అనుభూతులు, అనుభవాలు అన్నీ ఆమె లక్ష్యానికి చేరువ. మనస్సు, శరీరం ఆత్మకార్యానికి అడ్డుగా రావు. ఆమె ఆత్మ దివ్య శక్తులను ప్రోది చేసుకున్నది. అదృశ్యంగా ఉన్న అవరోధాలను, మాయా మోహాలను అధిగమించి, ఆత్మను తన నుండి వేరుపరచే ఒంటరితనం వదలి సర్వం ఏకం కావాలన్న సంకల్పం పెంచుకుంది. ఆ ఏకత్వంతో, ఏకతాసూత్రంతో సర్వ జీవుల్ని సమైక్యపరచింది. సర్వ జీవశక్తిని తనది చేసుకుంది. బిందువును సింధువుగా మార్చగల ఆత్మశక్తి ఆమెది. బిందువులో తేజస్సును నిబిడీకృతం చేయగల ప్రజ్ఞ ఆమెది. భిన్నత్వంలో ఉండే అనైక్యత ఏకత్వంలో లయిస్తుంది. పరమాత్మకు, జగన్మాతకు అభేదం.

ఆమె ఆత్మ సందేశం కొద్దిమంది మాత్రమే అందుకోగలిగారు. ఆమె పిలుపు వినగలిగినవారూ కొందరే. ఆమె వెనుకనున్న దివ్యత్వానికి స్పందించిన వారు అతి కొద్దిమంది. ఆమె ఎత్తులకు ఎదిగిన వారు ఆమె దివ్యత్వాన్ని ఆరాధించారు. తేజోమయ రహస్యాలను తెలుసుకున్నవారు, పరంజ్యోతిని దర్శించగలవారు క్షణంలో స్పందించగలిగారు. అనంతంగా విస్తరించిన వెలుగుల్ని దర్శించి భరించలేనివారు, దివ్యశక్తిని భరించలేనివారు తిరిగి ప్రాపంచిక జీవనంలోకి జారిపోతుంటారు. మనిషి సాహసంతో అతీంద్రియ ప్రయోగాలు చేసిన కొలదీ దివ్యత్వం దగ్గరవుతుంది. ఆబగా అత్యాశతో అతీంద్రియ శక్తుల్ని

చేజిక్కించుకున్నవారు నిరుపయోగపరచి పతనం చెందుతారు. భౌతికసుఖాలకు, భోగాలకు బానిసలవుతుంటారు. అలాంటివారు సావిత్రితో పోటీపడలేరు. ఆమె వెలుగు వేగాన్ని తట్టుకోలేరు. ఆజన్మ సంస్కారంగా అబ్బిన బ్రహ్మచర్యం వారి అంచనాకు అందదు. మహత్తులతో వారు అలసిపోతుంటారు.

ఆమె భావాలతో సన్నిహిత సంబంధం కలవారు సైతం ఆమె దివ్య కాంతిని తట్టుకోలేక, ఆమె శక్తిని ఆరాధించి తృప్తి పడ్డారు తప్ప ఆమె ఆత్మోన్నత్యాన్ని అందుకోవాలని యత్నించలేదు. ఎంతగా కలసిమెలసి తిరిగినా మహాత్ముల ఆంతర్యం సామాన్యులకు అవగతం కాదు. వారిని వదలి మహాత్ములు ఏకాంతంగా ప్రయాణం సాగిస్తారు. సావిత్రితో ఎవరూ పోటీ పడలేకపోయారు. ఆమె వారి మనస్సులపై అధికారిణి, హృదయరాజ్ఞి. భౌతికంగా అందరికి సమీపంలో ఉన్నా ఆత్మపరంగా అందరికి దూరం. ఆమె నడకను, నడవడికను విస్మయంతో గమనించారు. ఆమె పరుగులో దైవత్వం ఉంది. ఆమె ఎక్కే శిఖరాలు సామాన్య మానవులు సాహసించలేనివి. మానవ స్వభావానికి భిన్నమైనవి. సామాన్యులు భిన్న మార్గాలలో, భిన్న లక్ష్యాలతో బ్రతుకుతుంటారు. గమ్యం వైపు మాత్రం కదలరు.

ఆమె తేజోమండలం. మిగిలిన వారంతా ఉపగ్రహాలు. ఆమె వెలుగులు స్వీకరించి, గర్వంగా బ్రతకడం వారికి సులభం. చేతులు చాచి, ఆమెను అందుకోలేక, ఆమె నడచిన బాటలలో వెనుకగా దూరంగా నడుస్తుంటారు. స్వతంత్రించలేరు. వారు ప్రాపంచిక సుఖభోగాలు వదులుకోరు. ఆమె వెంట నడవడం మానసిక తృప్తికోసమే, అది ఆత్మతృప్తి కాదు. తాముగా వెలుగును చూడలేక, ఆమె నీడను వెలుగుగా భ్రమిస్తారు. ఇంద్రియాలకు బందీలైనంత కాలం ప్రేమ, ఆరాధనలు తప్ప మనిషికి వ్యక్తిత్వం పెరగదు. సన్నిహితంగా మెలిగినంత మాత్రాన ఎవరి ఆంతర్యం మారదు.

కొందరు జగన్మాతను ఆత్మలో సన్నిహితంగా దర్శించగలరు. ఆమె మహస్సు మనస్సుకు అందీ అందనంత దూరం. ఆమెను దర్శించడమే ఆమెను ఆరాధించటం. ఆమెకు దగ్గర కావడం మహాశక్తిని పొందటం. భగవంతుని చూడలేమని తెలిసీ మనిషి అతనిని ఆరాధిస్తాడు. పరబ్రహ్మానూ ఆరాధిస్తాడు. ఆయనను దర్శించినట్లు, శక్తిని పొందినట్లు పొంగిపోతాడు. బ్రహ్మానంద భరితుడవుతాడు. ఆ దివ్యస్పర్శకే హృదయం పులకిస్తుంది. దివ్య ప్రవేశంతో జీవనం దివ్య జీవనం అవుతుంది. హృదయం విశ్వమంత విశాలమవుతుంది.

ఒక్క దివ్య స్పందనతో మొత్తం జీవితం పరిమళిస్తుంది. అప్పుడు నిజమైన స్వాతంత్ర్యం, ఆత్మ స్వాతంత్ర్యం అనుభూతి కొస్తుంది. లోకం స్వర్గం కాగా, ఆత్మ అంతర్ముఖమై వెలుగు సోపానాలు నిర్మించుకుంటుంది. తనదైన దివ్య శరీరాన్ని ఆత్మ పొందగలుగుతుంది. ఆత్మ తన దివ్య శరీరాన్ని చూచి పరవశిస్తుంది. అప్పుడు ప్రాపంచిక కార్యాలలో దివ్యశక్తుల సహకారం లభిస్తుంది. హృదయం మధురిమలతో నిండుతుంది. తనకు తెలియని ఆ వ్యక్తిత్వం శాశ్వతం, అజరామరం అవుతుంది. శరీరంతో పైలోకాలకు వెళ్లలేకపోయినా పరాప్రకృతి మనిషికి వశమవుతుంది. ఆ స్పర్శ చాలు మనిషిని మృత్యుంజయుని చేయడానికి. రవి కిరణం సోకిన మొగ్గ పుష్పించినట్లు దివ్య కిరణ స్పర్శతో మనిషి పావనమూర్తి అయి పరిమళిస్తాడు. భగవంతుడు ప్రతిఫలం ఆశించడు.

సావిత్రి మానవతను మించిన వ్యక్తి. మానవజాతికి మణిమకుటం. ఆమెను అర్థం చేసుకుని ఆరాధిస్తే చాలు. ఆమె శక్తి ప్రతి మనిషి హృదయాన్ని స్పృశిస్తుంది ... పరుసవేది స్పర్శ లోహాన్ని బంగారంగా మార్చినట్లు. ఆమె మాట అక్కడివారికి శాసనం. ఆమె ఆరాధనీయ. హృదయాధిదేవత. అందరూ ఆమె ఆజ్ఞను శిరసావహిస్తారు. ఆమె తన సత్యయోగదీప్తితో తమను ఉద్ధరించాలని ఆశిస్తారు.

సమీపంలోనే ఉజ్వలభవిష్యత్తు కనిపిస్తోంది. అందరికి మార్గాన్ని చూపించి చేయూత నిచ్చి బాసటగా నిలిచింది. అగోచర పథాలలో వారు ఆమె వెంటనంటి నడవ సాగారు. విశ్వాసం వారికి ఊపిరి. ఆనందం వారి పరమావధి. ఆమెలో లీనమై జీవించడంలోనే తృప్తి ఉంది. కొందరే ఆమెను ఆశ్రయించారు. ఎవరి స్వభావం వారిది.

ఆరాధించినవారు కొందరు, ప్రేమించినవారు మరికొందరు. ఆమెను వాంఛించి కలలు కంటున్నవారు ఇంకొందరు. అత్యాశకు అవమానం తప్పదు. అర్హతలేని వారు భంగపడక తప్పదు. ఆమె దివ్య వర్చస్సును సౌందర్యంగా భ్రమించి ఆమె పొందు కోరినవారున్నారు. ఆ కాంక్షకు కామం అద్దినవారున్నారు. హృదయాలతో ప్రేమకు బందీలైనవారున్నారు. బంధాలు బాధిస్తాయని తెలిసీ వాంఛిస్తారు. బరువులు వదల్చుకోకపోగా కొందరు మరిన్ని బరువులు తలకెత్తు కుంటారు. అది ఆమె సౌందర్యం విసిరిన వల. అది ఆమె యవ్వనం ఎక్కు పెట్టిన బాణం.

కొందరు ఆమెను వాంఛించారు. తమకే స్వంతం కావాలన్నంతగా కోరుకున్నారు. తన ప్రేమను విశ్వంలో ప్రతి జీవికి పంచాలన్నది ఆమె నిర్ణయం. తమకే పరిమితం చేసుకోవాలన్నది వారి స్వార్థం. ఆమె ప్రేమలో మాతృత్వం ఉంది. అల్పబుద్ధులకు లభించేది కడకు నిరాశ. తమకు దక్కలేదని చిక్కిపోయిన వారు కొందరు. ఆమె స్పర్శ కాల్చి వేస్తుంది. ఆమె తలపు భగ్గుమంటుంది. ఆమె శిలగా మారింది. ఆమెది శిలా హృదయమన్నవారున్నారు. ఎండలో మాడి నీడకు చేరి సేద తీర్చుకున్నారు. ఆమె సాహచర్యం అలవి కానిదని వారి నిర్ణయం. ఆమె మధుర ప్రేమ తమకు అందనందుకు క్రుద్ధులై, తమ బలహీనతకు, అయోగ్యతకు, అసమర్థతకు బెంగపడిపోయిన వారెందరో!

వాంఛించిన సుఖం పొందనందుకు బాధ. ఆశించిన దివ్యశక్తులు లభ్యం కానందుకు విచారం. ఆమెలో ఏ మహత్తులూ లేవని ప్రచారం. కొందరు అప్రయత్నంగా ఆమె ప్రతిభకు దాసోహం అన్నారు. కొందరామె ప్రభావానికి లోనైనారు. మాధుర్యాన్ని, మహత్తుల్ని పరోక్షంగా అనుభూతించారు. తాము సూక్ష్మ శరీరాలు పొందలేక, పరలోకాల మహత్యాలు రుచిచూడలేక, ఉన్నత స్థితికి చేరలేక, ఆమెనే తమ స్థాయికి దిగజార్చాలని కుతంత్రించారు. ఆమెను సామాన్య స్త్రీ అన్నారు. ఆమె చుట్టూ తమ ప్రేమవలల్ని విసిరి బంధించ యత్నించారు. ఆమె ఔన్నత్యం వారి అజ్ఞాన తెరల్ని త్రెంచి, వారి ఆత్మలు తనకు బందీ అయ్యేట్లు చేసుకుంది.

ఆమె పిలుపు అందుకున్న వారిలో ఎవరూ ఆమెకు సాటి లేరు. ఆమెకు తోడు నిలవలేకపోయారు. ఆమె తన అంతస్తు దిగివచ్చింది. ఉన్నత సీమలకు అల్పబుద్ధులు చేరలేరు. వారంతా తన వారన్న తలంపుతో వారందరికి తన అభిమానాన్ని అందచేసింది. ఒక దివ్యశక్తి అణుమాత్రమైనా మానవునిలో ప్రవేశిస్తే జాతి మొత్తం ఉత్తేజితమవుతుందని ఆమె అభిమతం. తానే వారి భౌతిక స్థాయికి దిగివచ్చి తన స్నేహహస్తం అందించినా వారు అందుకోలేదు. వారి అవసరాలు ఆమెకు తెలుసు. వారంతా అవకాశవాదులు. వారి శూన్యజీవితాలలోకి తానే చొచ్చుకుపోయింది. వారి వారి సుఖాలలో, దుఃఖాలలో, స్పందనలో భాగం పంచుకున్నది. వారి కన్నీటిని తుడవడానికి శాయశక్తులా శ్రమించింది, పరితపించింది. తాను శిఖరాగ్రాన నిలిచినా, తన శక్తితో వారి మూగబాధల్ని వినగలిగింది. వారి ఆత్మ ఘోషల్ని తన పరిధిలోకి రప్పించుకుని తన ఆంతర్యపు ప్రశాంతిలో వాటిని ఉపశమింపచేయ చూచింది. జగన్మాత పరమాత్మకు ప్రతినిధి

అయినా, జగత్తుకు అధికారిణి. జీవుల బాధ్యత తనది. ఆమె వారి ప్రాపంచిక అవసరాలు తీర్చింది. వారి అశాశ్వతత్వంపై అగ్నుల్ని రగలించి, తన గుండె తాపాన్ని తగ్గించుకున్నది.

ప్రకృతి మూగపోయి, స్తంభించిన నిశ్శబ్దంలో, ప్రశాంతిలో ఆమె తనను తాను అన్వేషించింది. దివ్యతను అనుభవించింది. ఆమె శక్తి మానవతలో మహత్తుల్ని కలిగించగలదు. తన ఆనందం కొరకు పశు పక్ష్యాదులలో, చెట్టు చేమలలో సైతం ఆత్మల్ని వెదకసాగింది. అన్నీ ఆమెలో లయించిపోయాయి. మనిషిలోనే, ఎంత ప్రయత్నించినా, అశాంతి నిలిచిపోతున్నది. అశాంతి వల్లనే మనిషి దివ్యత్వానికి దూరమై, అంధకారంలో అలమటిస్తున్నాడు. ఆమె ఆకర్షణకు లోనై, ఆమెను కోరినవారిలో ఉన్నత లక్ష్యాలు, ఆదర్శాలు కలవారు కనిపించలేదు. ప్రకృతి, పరమాత్మలవలె తనతో కలసిపోగల పుణ్యపురుషుడు ఒక్కడు దొరకలేదు. తనకు కావలసింది ఆత్మబంధువు. చేరువైన కొందరు ఆమె స్పర్శకు కాలి మసై పోయారు. ఆమె శక్తిని భరించడం కష్టం. చుట్టూ ఉన్న రోదసిలో వెలుగు నింపి సూర్యుడు శూన్యంలో మిగిలిపోయినట్లు ఆమె పరిసరాలకు దివ్యత్వం పంచి, తాను శూన్యంలో మిగిలింది. ఆమెది ఏకాంతం. సన్నిహితులు సైతం క్రమంగా దూరం అయినారు. ఆమె ఆత్మ ఒంటరిగా అన్వేషిస్తూనే ఉంది.

ఆమెకు ఈ విశాల ప్రపంచంతో సంబంధం లేదు. వయస్కులతో పరిమిత సంభాషణ. యవ్వనం పరిసరాలకే పరిమితం. అది ప్రాపంచిక విషయాలతో తొలి పరిచయం. యవ్వనంలోనే ఆమెలో దివ్యత్వం ప్రవేశించింది. జన సంచారం లేని చోట వికసించిన పుష్పం వలె ఆమె యవ్వన వికాసం, అనాఘ్రాతం. నందనవనంలో నడయాడే ఒంటరి దివ్యాంగన ఆమె. ఆమెలో రగిలే అగ్నిని లోకం గుర్తించలేదు. లోపల వెలిగే జ్యోతి వెలుగులు బయటకు కనిపించవు. కాని లోలోపల ఒక స్పందన, ఒక కదలిక, ఒక పొంగు. అది వలపు పిలుపు. యవ్వనపు హెచ్చరిక. ఇంద్రచాప స్వప్న చాపల్యం. పరిణామపు రెక్కల మెత్తని చప్పుడు. అదో అపూర్వ, వినూత్న స్పందన. కాలం గుండెను తట్టిన అనుభూతి.

ఆమె అవసరాలకు పుడమి పులకరించింది. మహావిశ్వం ఆమె ఆశయాన్ని, అవసరాన్ని గుర్తించింది. అద్భుతం గొంతు విప్పింది. అసలు రహస్యం ఆమెలో ఇంతకాలం భృక్తంగానే ఉంది. ఆ రహస్యానికి కీలకం అగ్నియోగం. ఆమె పేరు మంత్రజపం. యువతకు అది విరచించిన ప్రణయప్రబంధం. అది ఒక మహర్షి గానం చేసిన విశ్వగీతం. అభావ సంగీతం. ఆమె అందచందాలు,

ఆకర్షణలు అందనంత దూరాన మెరిశాయి. సంధ్యారుణిమ వలె అది అనుభూతి పర్వం. ఆమె హృదయాన్ని రంజింపగల హృదయం ఒక్కటి కనిపించడం లేదు. ఆమె ప్రశాంతిని భంజింపగల భౌతికాకర్షణ ఎవరిలోనూ కనిపించదు. ఆమె ప్రేమను పొందగల ప్రేమ పూజారి కనిపించలేదు. ఆమె కన్నులను అలరించగల చూపులే కరవు. మానవ లోకంలో ఆత్మకు రక్షణగా ఉన్న వివేకం ఆమెలో మేల్కొన్నది. ఆమె సుందర ప్రణయమూర్తి అయింది. ప్రపంచంలో తనూ ఒక జీవి. మానవ హృదయాలు భౌతిక సౌందర్యాన్నే అన్వేషిస్తాయి.

అమరసీమల నుండి దిగి వచ్చిన దివ్యసౌందర్యాన్ని మానవులు భరించలేరు. ఆ రూపాలు ఈ ఆత్మలకు సరిజోడు కావు. దివ్యంకాని ఆత్మలు దివ్యాత్మలతో యోగించలేవు. అంచేత మహాత్ములు ఒంటరిగా జీవించడాన్ని ఇష్టపడతారు. వారు ఏకాంతంలో ప్రశాంతిని పొందగలరు. తనకోసం, తనవారికోసం ఆరాటపడరు. వారికి సరిజోడు పరమాత్మ ఒక్కటే. అదే సావిత్రి విషయంలోనూ సార్థకమైంది.

అందరూ ఆమెను ఆరాధించారు కాని ఎవరూ ఆశించలేదు. ఆమె మహోన్నత శిఖరాలకు ఎవరూ చేరుకోలేదు. ఆమె బ్రహ్మానంద హృదయ మందిరంలోకి ఎవరూ ప్రవేశించలేదు. ఆ మందిరంలో వెలిగే జ్యోతి ఎవరికీ కనిపించదు. పూజారి లేని ప్రేమ మందిరం ఆమె హృదయం. పరిభ్రమించే జీవుల మధ్య ఆమె ఆత్మ ఏకాంతంగా సంచరిస్తూ అదృష్టానికి ఎదురు చూడసాగింది.

12. ప్రేరణ

సౌందర్య దేవతవలె కనిపిస్తున్న సావిత్రిని యువకులు ఆరాధిస్తున్నారు తప్ప ఆశించడం లేదు. ఆమె తనకు అనుకూలుడైన పతికోసం తానే ఆలోచించ సాగింది. తనది స్వయంవరం. శోభన ముహూర్తం ఆసన్నమైంది. ప్రకృతి అందుకు అనుకూలం. ఆమెలో ప్రేమ పొంగి, కాంక్ష ఉబికి వచ్చింది. ఒక విధంగా భూమి స్వర్గమే. దేవతలు సైతం ప్రచ్ఛన్నంగా భూమిపైన విహరిస్తుంటారు. మహర్షులు సైతం మారు రూపాలు ధరించి తిరుగుతుంటారు. వారిని సామాన్యులు గుర్తించలేరు. అశ్వపతిది పితృ హృదయమే కాదు యోగ హృదయమూను. ఆమె సామాన్యకన్య కాదని ఆయనకు తెలుసు. తనకు యోగించిన భర్తను తానే ఎన్నిక చేసుకోగలదు. ఆమె అన్వేషణకు సిద్ధమైంది. రాచనగరు, అంతఃపురం, అయిన వారిని, అందరినీ వదలి ఒంటరిగా 'సత్యా'న్వేషణకు బయలుదేరింది. ప్రతి సాధకుడు అలా 'సత్యా'న్వేషణ జరపాలన్నది అరవిందుల ఆంతర్యం.

నవ్య సృష్టికి సుప్రభాతం. నిర్మలాకాశంలో మహత్తర సూర్యతేజస్సు. జడంగా ఉన్న మూల ప్రకృతిలో సంచలనం. పరిణామం దిశగా కదలిక. లోకాన్ని క్రొంగొత్త సౌందర్యాలు కదలించాయి. వాంఛ కొత్త చివుళ్ళు తొడిగింది. కామనతో పరిసరాలు పరవళ్లు త్రొక్కాయి. బ్రహ్మానందానుభూతితో కొట్టుకునే ఆత్మల వలె, పెనుగాడ్పులకు మహావృక్షాలు కదలసాగాయి. మహారణ్య మధ్యలో దాగిన నిక్షేపాలు హృదయంలో దాచుకున్న వలపు నిక్షేపాలు. అవి నిక్షిప్తాలు. కొమ్మ మీద కోయిల పదే పదే ప్రేమగీతికను ఆలపించసాగింది.

లోకపు అలజడులకు, సవ్వడులకు అతి దూరంగా మన ప్రశ్నలకు సమాధానాలు లభించే పరసీమలలో చెవులు వినలేని శబ్దాలు శబ్దించే చోట అశ్వపతి ఆత్మతో వినగలిగాడు. మన జీవితాల చుట్టూ పరివేష్టించిన సూక్ష్మ

మండలాలు. మూతపడిన సమాధి ద్వారాలు తెరుచుకోగానే అంతరాత్మ కదలిన సవ్వడి. ప్రకృతిలో వినిపించని దివ్యనాదాలేవో అతనికి వినిపించాయి. జీవుల చక్రభ్రమణానికి ఆవల, రోదసి శూన్య వేదనా హృదయం నుండి పరమాత్మను స్తుతించే నిశ్చలన గీతం ఒకటి వెలువడింది.

వెలుగు కిరణాల కటకటాల వెనుక జన్మించని దివ్యశక్తుల అణచివేతకు వేదిక సిద్ధమైంది. మరొక మారు వాంఛ రగిలి, జ్వలించి మనిషి ఎడద పూర్ణ యోగజీవనా కాంక్షను వ్యక్తం చేసింది. అస్థిరమైన మేధ సుస్థిరతను కాంక్షించింది. బాధామయ మానవ హృదయం నిర్మలాంతఃకరణను, మాయా జగత్తులో సత్య ప్రతిష్ఠాపనను, మానవ రూపంలో దివ్య జీవన ప్రతిష్టను వాంఛించింది.

భావాంబరాల నుండి ఉబికి వచ్చే నాదం వినగలిగిన కొందరికే అది వినిపిస్తుంది. మానవ మేధ రహదారులలో పయనించదు. కొత్త బాటలు సృష్టించి తన ముద్రలు వేస్తుంది. అదే స్వతంత్రత.

అశరీరవాణి వినిపించింది "ఓ మానవుడా, విధి వశాన నీవు మానవజన్మకు వచ్చావు. అనంతవిశ్వంలో సాహసయాత్రకు సిద్ధమైనావు. సంకుచితత్వంలో బందీ అయినావు. నీ ఆత్మ చుట్టూ అల్ప విషయాలు తిరిగినంత కాలం ఈ జీవనచక్రంలో తిరగక తప్పదు. ఎదుగు బొదుగూ లేని ఈ మానవత్వం నీ లక్ష్యం కాదు. మళ్లీ మళ్లీ మరణించడానికా నీవు జన్మించేది? నీవు అమృతుడవు కావాలి. నీవు చేసే పనులు మానవ వికాసానికి దివ్య సోపానాలు కావాలి. నీ శరీరం దైవత్వానికి విశ్రాంతి మందిరం కావాలి.

"మనిషీ! నీలో ఒక ఋషి, సృష్టికర్త ఉన్నారు. నీ నిత్యకృత్యాలపై అమృతం కురుస్తుంది. ప్రకృతిలో అడుగడుగున పరమాత్మ శక్తులున్నాయి. నీకై సుందర భవిష్యత్తు ఎదురు చూస్తున్నది. భౌతిక ప్రపంచంలో జీవిస్తూ స్వసంకల్పంతో, స్వయంకృషితో, సాధనతో నీవు నీ గమ్యాన్ని చేరుకోవాలి. నీ ప్రయత్నంలో అతీంద్రియ సహాయం అవసరం.

"అజ్ఞానంతో ఎంత కాలం జీవించినా ప్రయోజనం లేదు. అంధకారం వదలి రాలేవు. గాఢ నిద్ర నుండి మేల్కొనలేవు. దివ్యదృష్టితో సత్యాన్ని దర్శించాలి. సత్యం చుట్టు అలముకున్న మాయపొరల్ని తొలగించాలి. నీ హృదయం దివ్యత్వంతో నిండినప్పుడే సత్యదర్శనం సాధ్యం. ఆధ్యాత్మిక జ్ఞానం పొందు. దివ్యత్వం నింపుకో. జాగృతమై హృదయాన్ని చీకటి గోడల్ని ఛేదించు. అనుభూతి చెందగలిగినప్పుడే హృదయంలోని నిశ్శబ్దాన్ని వినగలవు. కళ్లు విప్పి బాహ్య

సౌందర్యాన్ని చూస్తావు తప్ప కళ్లు మూసుకుని అంతః సౌందర్యాన్ని దర్శించ యత్నించవు. పరమాత్మ మందిరం ముంగిట నిలిచి నీ శంఖాన్ని పూరించు.

"ఎందరో మహర్షులు, యోగులు అనేక ప్రయోగాలు చేసి, ప్రమాదాలు దాటి, ఆత్మ మండలాలను చేరే మార్గాలను సిద్ధపరిచారు. నిన్ను జాగృత పరచి, జగన్మాతను అనుభూతించడానికి, పరమాత్మను స్పృశించడానికి, జీవాత్మను పరమాత్మతో సంధాన పరచడానికి తగిన విధానాలు రూపొందించారు. నీవు నివసిస్తున్న భూమికి నీవు చేరవలసిన పరానికి మధ్యన సన్నని తెర ఉంది. నీ జీవిత విధానం, నీ జీవితం ఆ తెరను చీల్చి అవతలి వైపుకు నిన్ను పోనివ్వదు, అటు చూడనీయదు. నీ జీవన కవాటాల వెనుక అనేక అతీంద్రియ శక్తులున్నాయి. సమీపంగా ఉన్నా వాటిని నీవు గుర్తించవు, అందుకోవు. ఆత్మ శిఖరాల పైకి ఎక్కిచూడు ... ఎన్ని దివ్యసౌందర్యాలు కనిపిస్తాయో! ఎన్ని దివ్యస్వరాలు వినిపిస్తాయో!

"నిన్ను నీవు అధిగమించాలి. అదే సూత్రం. లోపల కంచుఢక్కలు మ్రోగినా కొందరే వినగలరు. కొందరే దానివైపు పరుగెత్తగలరు. తన్మయస్థితిలో రగిలే అగ్నుల్ని కొందరే భరించగలరు. ఆశ నిరాశలు వసుధ గుండెను బ్రద్దలు చేస్తాయి. ఇచ్ఛా సంకల్పాలు పెరిగి పెరిగి, రూపాన్ని అరూపం చేసి, విధిని వశపరచుకుంటాయి. మానవ జన్మ కొచ్చిన దేవతలు సైతం అజ్ఞానంలో చిక్కి, అంధకారంలో చరిస్తూ, పరాన్ని గురించి కలలు కనవలసిందే. యాతనలు భరిస్తూ ఆనందాలను కలగంటారు. నైరాశ్య సీమలలో ఆశాసౌధాలు నిర్మించు కుంటారు.

ఒక్కమెట్టు పైకిపోతే చాలు లోకాన్ని, సర్వాన్ని విస్మరించగలవు. కాని మనిషి బాధలలోనే సుఖాన్ని వెతుకుతాడు. ఆనందాన్ని అన్వేషిస్తాడు. మానవ హృదయంలో అన్వేషణ అల్పంగా, పరమాత్మ అదృశ్యంగా, ఆరాధన లీలగా ఉంటుంది. మనిషి పరబ్రహ్మను సైతం పరిమిత దృక్పథంతో ఊహిస్తాడు. ఒక మానవ రూపంలో సంభావించి, ఒక పేరుతో నిమంత్రించి తన వరకు బంధించుకో చూస్తాడు. అతీత ప్రజ్ఞల్ని వదులుకుని అల్ప ప్రయోజనాలు ఆశిస్తాడు. ఆరాధన పేరుతో దేవాలయంలో దీపాలు వెలిగిస్తాడు తప్ప తన లోపలి జ్యోతిని దర్శించలేడు. తన వేదనల్ని పెంపొందించే అజ్ఞానాన్ని ప్రేమిస్తాడు. మహత్తర శక్తులపై 'మాయ' ముసుగువేస్తాడు.

"అంతర్వాణి ప్రబోధాలు కాదని, జ్ఞానపీఠమైన మూల త్రికోణంపై ముసుగు వేసి, హృదయంలో ఒక కల్పిత రూపాన్ని ప్రతిష్టించుకుంటాడు. మహామాయ అతని వివేకాన్ని కప్పివేస్తుంది. ఆత్మ సంకేతాలన్నీ నిష్ప్రయోజనా లవుతాయి. మహాత్ముల బోధలు, మహర్షుల తపశ్శక్తి నిరుపయోగాలవుతాయి. మహాయోగులు సూక్ష్మ లోకాలలో సంచరిస్తుంటారు. నీ స్వప్నాలలోకి సూక్ష్మ శరీరాలతో వస్తుంటారు. కవులు బాహ్య రూపాలను వర్ణించి, స్తుతిస్తారు. అంతరాగ్ని రేపటి ప్రవక్తలకు ఆధారం. పరలోకాల నుండి తేజస్సులు దిగివచ్చి, ఆత్మలు సిద్ధంగా లేక తిరిగిపోతుంటాయి. ఎంతకీ జ్ఞాననేత్రం తెరుచుకోదు. పరమాత్మ సంకేతాలను ఎవరూ గ్రహించరు. విధి పరమాత్మను సైతం దరికి రానీయదు. అంతరంగం సైతం ఆహ్వానించదు. చేసే ప్రయత్నాలకు అవివేకం అడ్డుపడుతుంది. అప్పటికి మేధ కొంత మేలుకొంటుంది. జ్ఞానులు సైతం సత్యాన్ని స్వల్పంగానే తెలుసు కుంటారు. పండిత ప్రకాండులు తొలిశిఖరం వరకైనా వెళ్లలేరు. అహంకారం వారిని అసలు ముందుకు పోనీయదు. మనస్సు ఆధారంగా చేసిన ప్రయత్నాలలో పరమాత్మ కొంతవరకే అర్థమవుతుంది. మిగిలింది అంతా రహస్యం. అది గుప్త విద్యారహస్యం".

అశరీరవాణి దిగంబరి అయింది. ఆకాశంలో కలసిపోయింది. ఒక దివ్య సందేశం సావిత్రిని చేరింది. దిఙ్మండలాలు దాటి వచ్చిన తేజో కిరణ సంకేతం అది. అంబరాలను చుంబించే మహా వృక్షాల మధ్య, రంగురంగుల వలువలు ధరించిన వన దేవత ఆమె. అరణ్య మధ్యలో రగిలే జ్వాల. ఆకాశమే హద్దుగా, వసుధ భూమిక అయిన ప్రేమాలయంలో ఆమె ప్రేమ స్వరూపిణి. ఆమె ఏకైక పాంథురాలు.

సత్యావిష్కరణకు సమయం సమీపించింది. ఆమె ఆంతర్యంలో సృష్టికి సమాధానం లభించింది. అది కాంతిహీన. భౌతిక నేత్రాలకు కనిపించదు. అది ప్రాపంచిక దృష్టి కాదు. అది పరాకాష్టకు చేరిన పారవశ్యం. అది అద్భుత కళా విలాసం. అది జ్ఞానార్తులకు దేవతలు అందించే అమృత భాండం. అది పరబ్రహ్మ సచ్చిదానందం. అది యోగాగ్ని నుండి ఉద్భవించిన అమృత కలశం. అన్నీ ఆమె ముందు సాక్షాత్కరించాయి. పూర్ణత్వం చెందిన ఆత్మ నివేదనకు సిద్ధమైంది. అనేక జన్మల సంస్కారం సువర్ణఛాయగా, కాంతి వలయంగా మారి ఆమెను పరివేష్టించింది.

ఆమె ఫాలభాగం చెరగని స్వర్గాలకు ప్రతీక, ఆమె తపోశక్తికి, ధీశక్తికి

చిహ్నిక. ఆమె అధరాలపై కదిలే మందహాసం ఆనందమయ లోకాలకు వాహిక. మేఘ మాలికలైన ఆమె వినీల కుంతలాలు రెక్కలు విప్పిన నిశీధాలు. చంద్రవంకల వంటి కనుబొమలు కన్న కలలకు ప్రతిబింబాలు. నిజ జీవితంలో సత్యాలు ఎంత దూరమో భావలోకంలో అంత సమీపం. అమృతభాండం ఆమె లావణ్యం. బ్రహ్మానందంతో నిండిన బంగరు కలశం ఆమె హృదయం. ఆమె రూపంలో భూమి స్వర్గాన్ని ఆరాధిస్తున్నది. సౌందర్యం సజీవ రూపం ధరించి, పూర్ణ యవ్వనాన్ని ఆవిష్కరిస్తున్నది. ఆమె భౌతిక సౌందర్యం చాటున ఉన్నదంతా ఆత్మ సౌందర్యమే. అది అవ్యక్తం. అది అంతర్దృష్టికి మాత్రమే కనిపిస్తుంది.

బాహ్య ప్రపంచాన్ని వదలి అంతర్ముఖి అయింది. భౌతిక స్పర్శ నుండి తనను విముక్తం చేసుకుంది. రూపాలన్నీ ఒకే ఒక్క అరూపశక్తికి అనురూపాలు, అనుబంధాలు. మానవతలోకి, కార్మికతలోకి దివ్యత్వం అతి నిగూఢంగా ప్రవేశిస్తుంది. అది మనిషిని అంటీ ముట్టనట్లు వేరుగా ఉంటూ పరిణామానికి సహకరిస్తుంది. భావకుడ్యం పైన దివ్యత్వం శిల్పాకృతి ధరించి, కదలని కాలంపై ప్రతిఫలించి, హృదయ మందిరంలో ఒక దేవత అయింది.

మనస్సు కల్పించిన భ్రమలు, మనం ఆపాదించుకున్న విలువలు కరిగిపోతాయి. శరీర స్పృహ నశించిపోతుంది. మానవత ఉన్నత స్థితిలో అమృత తుల్యమవుతుంది. బాహ్యరూపం వెనుక దాగిన ఆత్మతత్వం సత్యమై నిత్య నైమిత్తికాల నుండి, బాధ్యతల నుండి మనిషిని విముక్తం చేస్తుంది. శరీరం, అవయవాలు, వాటి నిర్మాణం వెనుక ఆత్మ.

అంతర్దృష్టికి ప్రేరణ అవసరం. ఆంతర్యపు లోతులలో ప్రేమ ఉదయిస్తుంది. శిఖరాగ్రాల నుండి పరమాత్మ పలకరిస్తుంది. ఒక్క సంఘటన జీవితాన్ని మార్చి వేస్తుంది. అజ్ఞాతంగా మనల్ని గమనిస్తున్న మహాత్ములు క్షణంలో మనలను మార్చగలరు. అది విధి లిఖితం కాదు. ప్రజ్ఞాపాటవం.

అశరీరవాణి మరోమారు వినిపించింది.

"అచిరకాలంగా ప్రయాణం సాగిస్తున్న ఓ ఆత్మా! సావిత్రీ!

దిగంబరాల నుండి నీవు దిగి వచ్చి, మానవ శరీరం దాల్చి కడగండ్ల కవచం ధరించావు. విధిని, కాలాన్ని జయించాలన్నది నీ ఆశయం కావచ్చు. నీవలె, ఆ శశాంకుడు ఆకాశంలో కలలు కంటున్నాడు. నీకు దివ్యత్వం అండగా ఉంది. నీవు మహాత్మవు కనుక పరాశక్తులు నీకు రక్ష. నీ అదృష్టం నీ జీవితానికి చాలా దూరంగా ఉంది. నీవొక ఆత్మగా మాత్రమే అవతరించలేదు. ప్రేమకు,

సౌందర్యానికి నీవు ప్రతినిధివి. కన్యత్వం నీకు అలంకారం, వర ప్రసాదం. అమర సందేశాలు పరమాత్మ తేజోలిపిలో లిఖించి ఉంచాడు. వాటిని శోధించి, జీవితానికి అన్వయించుకున్న వ్యక్తికే నీ హృదయాన్ని సమర్పించు, నీ అధరాలు పగడాలు. అవి మందస్మితాలు, అవి మధుర సంగీత రుతాలు. నీ నయనాలు నిశీధి తారకలు. నీ అవయవాలు సువర్ణ భూషణాలు. నీలోని కళాకాంతులు అచ్చరల వంపు సొంపులు. వలపు హొయలు, ప్రేమ నీ ఆకర్షణ.

"నీ సహచరుని అన్వేషిస్తూ లోపలికి పో! ఎక్కడో నీకై ఎదురు చూస్తున్న నీ ప్రియసఖుడు అదృశ్యంగా ఉంటాడు. అన్య సహాయం నీ కవసరం లేదు. నీ ఆత్మ నీకు తోడు, నీ గుండెలో రగిలే వెచ్చని సెగలు నీకు మార్గం చూపిస్తాయి. నీ స్వభావానికి అనుగుణమైన వ్యక్తి, కడవరకు కలసి అడుగులు వేసేవాడు, నీతో సహజీవనం చేసేవాడు, నీ హృదయ తంత్రులను సున్నితంగా మీటగలవాడు, నీవు ఎదురు చూస్తున్నవాడు, నీకు లభిస్తాడు. నీ అన్వేషణ ఫలిస్తుంది. నీ హృదయం ప్రణయరాగం ఆలపిస్తుంది. ఆనందంలో మీరు మమేకం అవుతారు. ఇరువురిలో దివ్య స్పందన సమతుల్యం కావాలి. మీరిరువురు జగన్నాటకంలో కొత్త అంకం ప్రారంభిస్తారు. అనంతశక్తి ఏదో నిన్ను ముందుకు నడిపిస్తుంది. నీలో, నీ చుట్టూ ఒక తేజో వలయం ఉంది. చేయి చేయి కలిపి జీవితాల్ని ఏకం చేసుకోండి. ఆనందాలు పంచుకోండి. మాయ కల్పించే కష్టాలను ఎదుర్కోవాలి. ప్రకృతిని దాటి పరాశిఖరాల పైకి చేరండి. దివ్య లోకాలలో పరమానందం అనుభవిస్తూ కాలాన్ని అధిగమించి, నీ ఆత్మను పరమాత్మకు అర్పించు".

అదే సత్తుకు, సర్వ జగతికి మూలాధారం. మూతపడివున్న ఆమె మనోగవాక్షాలను అంతర్వాణి తెరచినట్లయింది. ఆమెకు జన్మ రహస్యం తెలియ చేసింది. గమ్యాన్ని సూచించింది. యోగి చెవిలో మంత్రం ప్రవేశించి ఒక సందేశంగా మేధలో ప్రతిష్ఠిత మవుతుంది. ప్రార్థనా తరంగాలు చీకటి కోణాలను వెలుగులుగా మారుస్తాయి. మంత్రార్థం ఋషికి అనుభూతమవుతుంది. భావం మనస్సులో సుడులు తిరిగి అభావమవుతుంది. అప్పుడు యోగి సత్య స్వరూపాన్ని కాక, సత్య సంకేతాలను అందుకుంటాడు. తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఆత్మకు సందేశాత్మక మవుతుంది. మంత్రమే శబ్ద తరంగ మవుతుంది. శరీర స్పృహలో భావం, దృశ్యం, స్పందన, అనుభూతి విశ్రమిస్తాయి. అంతరించి పోతాయి. యోగి పరిణతికి అవే నిదర్శనాలు. యోగ ప్రగతికి అవే సూచికలు. యోగి తానే అనంత శక్తిగా పరిణామం చెందుతాడు. అన్ని విద్యలు అతనిలోకి

ప్రవహిస్తాయి. ఆధ్యాత్మిక సాగరంలో సుస్నాతుడైన యోగి స్వర్గాలలో దిగంబరంగా సంచరిస్తాడు. అతనికి ఆచ్ఛాదనలు అవసరం లేదు. పరమాత్మతో నేరుగా సంభాషించగలడు.

సావిత్రి మహాయోగిని. యోగశక్తులన్నీ ఆమెకు కైవసాలు. యోగ భూమికలు ఆమెకు మెట్టినిల్లు. మనస్సు ప్రశాంతమైంది. పరిచయమైన వ్యక్తుల మధ్య, పరిచయం లేని శక్తుల మధ్య సునాయాసంగా సంచరిస్తూ, చిద్విలాసంగా జీవిస్తూ తన ఔన్నత్యాలను వెతకసాగింది. అనుభవం కాని ఆత్మీయతకై అర్రులు చాచింది. వేగిర పడ్డది. విశ్వ రహస్యం ఆమెకు తెలుసు. ఉదయం గడిచింది. బాల్యం గడిచింది. అపరాహ్నంలో ఎండకు కనలింది. ఆమె నిశ్చల సమాధిలో కెంపువలె మెరిసింది. సాయం సంధ్యలోకి పొద్దు వాలింది. గగనతలాన చంద్రోదయమైంది. రేయి అంచులను స్వప్నం తాకింది. ఆకాశంలో తారకలు మెరుస్తున్నాయి. మనస్సు రహస్యం గూటిని వదిలింది. ఆకాశం చీకటి రెక్కల్ని విదల్చి, బాహ్య ప్రపంచానికి అనుమానం కలగకుండా తన అనుభూతుల్ని దాచుకుంది. స్వప్న లోకాలలో అందని లోతులకు వెళ్లసాగింది.

చీకటి ముసుగు తొలగించి ఉదయం తొంగి చూచింది. సంధ్య వెలుగులు ఆమె వదనంపై ప్రసరించాయి. తన అంతరంగం వలె అంతఃపురం శూన్యంగా తోచింది. రాజ ప్రాసాదంలో ఆనందాలు లేవు. సంతోషాలు లేవు. వెన్నెల పరచిన నేలపై ఆమె పాద ముద్రలు పడలేదు. దివ్యత్వం, సౌందర్యం మోహాలు చాటు చేసుకున్నాయి. విశాల విశ్వంలోకి – ఆమె అన్వేషణకై బయలుదేరింది. ఆమెది సత్యాన్వేషణ. 'సత్య' వరాన్వేషణ.

13. అన్వేషణ

సావిత్రిది పరాన్వేషణ. యోగిది సత్యాన్వేషణ. సావిత్రి రాచనగరు, రాజప్రాసాదం వదలి బయలు దేరింది. లోకంలోని కొత్త బాటలలో పయనించింది. కనువిందు చేసే అందాలను తిలకించింది. దేశ దేశాలు తిరిగింది. రాచబిడ్డల్ని చూచింది. అంతా తన వారే అనిపించింది, తానే అనిపించింది. మలయానిలాలు, తారకలు తానే, తనవే. అంతటి తాదాత్మ్యస్థితి, తన్మయత. అన్నీ తనకు నేస్తాలే. తాను లోగడ మెట్టిన బాటలే. అవి జ్ఞాపకాల పొరల్లోంచి బయట పడ్డట్లు అనిపించింది. కొత్త దేశాలు తిరగాలని తపన. కొండలు, కోనలు, కారడవులు గాలించింది. ఆశ్రమాలు, మునివాటికలు దర్శించింది. యోగులకు, మునులకు మ్రొక్కింది. వారంతా తపోధనులు, పరమజ్ఞానులు. వారి శక్తులు అపారం. వారు భావించినా, సంభాషించినా వర ప్రసాదమే. ఆశ్రమాలు తిరిగిన సావిత్రిలో జ్ఞాన తృష్ణ అధికం కాసాగింది. ఆమె ఆర్తి వేరు,, అన్వేషణ వేరు. ముందుకు సాగింది. దివ్యశక్తుల్ని తనకు సహకరించమని ప్రార్థించింది. యోగి అన్వేషణ అలాగే సాగుతుంది. యోగి అన్వేషణ ఆంతర్యంలో. అన్నీ కొత్త లోకాలు, కొత్త భూమికలు.

లోక రీతుల్ని అవలోకించసాగింది సావిత్రి. ప్రాపంచిక మార్గాలు తనకు పరిచితాలే. తొలుత చిత్ర విచిత్ర తేజో మండలాలు కళ్ళ ముందు కదలి, మనస్సును మురిపించాయి. ముందుకు సాగిన కొద్దీ ఆమెలో కొత్త చైతన్యం పెల్లుబికింది. అన్ని రంగాలు, ఆవరణలు ఆమెకు సుపరిచితాలు. ప్రతిదేశం, ప్రతిస్థానం ఆమెకు స్వస్థానమే అనిపించింది. మానవత తనది కావాలి. తనలో ప్రతిఫలించాలి. సమస్త మానవాళి స్వజనంగానే అనిపిస్తోంది.

మార్గంలో కనిపించిన ప్రదేశాలన్నీ తనకి చిరపరిచితాలు. తన వివేకానికి, అంతర్ ప్రజ్ఞకు అందినవే. ఆ సుందర సీమలు తాను మరచిపోయిన మహిమాన్విత

మండలాలు. నగరాలు, నదీనదాలు, నాగరికతలు అన్నీ తన స్మృతి సీమలలో కదలాడాయి. తారకలూ తన చిరకాల మిత్రులే. వీచే గాలులు సైతం పురాతన విషయాలను స్మృతికి తెస్తున్నాయి. ఎప్పుడో ప్రేమించి, అభిమానించిన వారందరినీ పరామర్శించింది.

అన్నీ తాను మరచిపోయిన స్వవిషయాలే. స్పష్టాస్పష్టంగా మెరుపు శలాకల వలె గతకాలపు శక్తులన్నీ స్మృతియవనికపైకి రాసాగాయి. ఆమె చలనం, గతి కొత్త కావు. ఒక మహత్తర సంఘటనకు ప్రయోక్త వలె ఆమెకు ఆత్మ సాక్షిగా నిలిచింది. చేసిన పనులనే తిరిగి చేస్తున్నట్లు తోచింది. నిస్తేజంగా, మందంగా సాగే చక్రభ్రమణాన్ని అసహాయంగా మార్చి, జడలు విరబోసుకున్న చీకటి దేవతలు సాధకునిపై స్వారీ చేస్తుంటారు. మనిషి జన్మించినదాది అతనిని అంటిపెట్టుకుని బాహ్యక్రియలలో, అంతరంగంలో అతనిని శాసిస్తుంటారు. సాధకుని సంకల్పానికి అపజయానికి వారు కారకులు. వారే విజయానికి సాక్షులు.

తమ కర్తవ్యాన్ని కఠినంగా అమలుపరుస్తూ గత జన్మల కర్మశేషాన్ని మనకు అందిస్తూ, జీవుని స్వభావం చెదిరిపోకుండా రక్షిస్తుంటారు. విధి విహితమైన జీవన మార్గంలో వారు సహాయకులు. మన ఆనందాలలో, బాధలలో, నిత్యకర్మలలో వారి ప్రమేయం కనిపిస్తుంది. మన ఆలోచనలు, పనులు ఏవీ నిష్ఫలం కావు. ప్రతిదానికి కొంతశక్తి ఖర్చవుతుంది. మన గతం లేశమాత్రంగా మన నిత్యకృత్యాలలో కనిపిస్తుంది. ఇప్పుడు సాగుచేసిన నేలలో ఎప్పుడో మనం విత్తుకున్న విత్తనాలు మొలకెత్తుతుంటాయి. పురాకృత కర్మల ఫలాలను ఇప్పుడు పండించుకుంటాం. ఈ ఫలాలు ఏ చెట్టువో, ఏ కొమ్మవో మనకు తెలియదు. కనిపించని గతంలో ఈ చెట్టు వేళ్లు పాతుకుని ఉంటాయి. మనం ఎప్పుడో గతంలో పుట్టి నేడు వర్తమానంలో జీవిస్తున్నాం. ఇవి అన్నీ ఒక మహాయంత్రంలోని చిన్నచిన్న భాగాలు. భౌతికసూత్రాలు యంత్రమనే మేధకు సంబంధించినవి. అయినా అంతా దివ్యసంకల్పమే, విధివిలాసమే. అన్నింటిని చూడగల చక్షువు పైనుండి గమనిస్తుంటుంది.

విధి, దైవేచ్ఛ రెంటినీ జతపరచి విధాత మన జీవితాల నమూనాలు తయారుచేసి పంపుతాడు. మనం చేసే ప్రతి పని విధాతకు తెలుసు. మనలోని దివ్యశక్తులు, క్షుద్రశక్తులు రెండూ అతనికి ఎరుకే. కనుబొమల మధ్యన పరమాత్మ కొలువుతీరి ఉంటాడు. ఆ పరమాత్మకు విధి మలుపులు. నాసికాగ్రం మానవ లక్ష్యాలు ఎరుకే. అదే శరీరి కార్యనిర్వహణకు భూమిక. అన్వేషించే కళ్లకు అవి

మార్గజ్యోతులు. పగ్గాలను చేబూనిన విధికి అవి సజీవ ప్రకరణాలు. అంతా ఒక పథకం ప్రకారమే జరుగుతుంది. పరమాత్మ సిద్ధపరచిన మార్గంలో దోషాలకు తావుండదు.

పగలనక రేయనక, మండుటెండల్లో, వానల్లో ఆమె ప్రకృతిలో మమేకమై తిరిగింది. లోకంలోని అన్ని శబ్దాలను విని విని నిశ్శబ్దమైంది. నిశ్శబ్దంలో అంతరాత్మ బోధలు వింటూ ముందుకు సాగింది. అపరాహ్నపు టెండలో మెరిసే మేఘాంచలం వలె ఆమె హృదయం నిర్మలమైంది. తొలుత జనపథాలలో సంచరించింది. ఆధ్యాత్మిక అలజడులను ఎదుర్కొన్నది. మనోవికారాలు భరించింది. ఆమె మనోరథంపై ముందుకు సాగింది. ఉరుకులతో, పరుగులతో జనసంకీర్ణ భూములు దాటింది. నిర్జన ప్రదేశాలకు చేరుకున్నది. గతానికి ప్రతీకలైన మనోమందిరాలు. స్వప్నసీమలు దాటి వినీల గగన సీమలలో చరించింది. సుందర సురుచిర వనాలు చూచింది. పరమాత్మ మానవ జీవితాలను రక్షించే సురక్షిత స్థావరం చేరుకుంది. అమరత్వాన్ని అహంకారంతో కోల్పోయిన దేవతలు, భ్రష్టులైన ఋషులు ఎందరో అక్కడ కనిపించారు.

నిశీథంలో ప్రయాణం. సాయంసంధ్య నుండి ఉషోదయం వరకు చీకటి ప్రయాణం. ప్రకృతి కుడ్యాలపై వెలిగించిన జ్యోతులు వెన్నెల నీడలలో ప్రకాశించాయి. నిశీధిలో స్వప్నాల వెంట పరుగులు తీసింది. రాజభోగాలు అనుభవిస్తూ అంతఃపురాలలో నిదురించిన ఆమె ప్రకృతి ఒడిలో నిద్రించింది. విధి బలీయం!

ఆమె రథం నగరాలను, పల్లెలను దాటింది. తనకు పరిచయమైన నేలపై మనిషికి మమకారం. తాను అనుభవించిన జీవితంతో అనుబంధం. అశాశ్వతమని తెలిసీ మమతలు పెంచుకుంటాడు. అది జీవనశోభ. భౌతికంగా మనిషిలో మార్పు కనిపించదు. మనిషి స్వతంత్రం పొంది ఆత్మవైపు పయనిస్తేనే ఆత్మకు శాంతి, మనస్సుకు విశ్రాంతి. మొత్తంమీద ప్రశాంతి. ఆమె సుఖ దుఃఖాలకు అతీతంగా నిలిచింది.

భూమి శైశవ స్థితిలో నిశ్చలంగా ఉండేది. అప్పుడు మనిషికి నాగరికత తెలియదు. బరువులు, బాధ్యతలు లేవు. భగవంతుడు ఒక కృషీవలుడు. ఈ సృష్టి అతని కృషి. సావిత్రి రథం పర్వతాలు, అరణ్యాలు దాటింది. అరణ్యరోదనలు పర్వత సంగీతాలు, నదుల నాదాలు వింటూసాగిపోయింది. గతాన్ని చీల్చుకుని

అనేక స్మృతులు వెలువడ్డాయి. అవి కాలం మిగిల్చిన అవశేషాలు. నిర్మలాంతః కరణతో కాంతి మండలాలు దర్శించింది. ఆమె ప్రశాంతిని భయంకరశబ్దాలు భంగపరిచాయి. నిశ్శబ్దాల నిగూఢ రహస్యాలు రంగుల వలయాలుగా ఆమె మనో రథాన్ని చుట్టుముట్టాయి. కాలపురుషుని అడుగుల సవ్వడులు ఆగిపోగా ఆమె ముందుకు సాగింది. కాలం ఆమె ప్రయత్నాన్ని నిలవరించ లేకపోయింది.

ఆ నిశ్శబ్దాలను వినగలది జ్ఞానేంద్రియం ఒక్కటే. బ్రహ్మానందంలో అది సర్వాన్ని ఆకర్షించగలదు. భావశబ్ద రహితమైన కొద్దీ స్పందన తీవ్రత జీవితాన్ని సమీక్షించి, సమీకరిస్తుంది. అప్పుడు ప్రపంచశబ్దాలు దూరం నుండి వినిపిస్తున్నట్లు తోస్తుంది. సమాధిలో రగిలిన తాపమే తపమై కర్మల్ని దహించి ధర్మాన్ని సత్యసమ్మతం కావిస్తుంది.

శబ్దప్రపంచం అంతా ఆర్భాటమే. భయంకర శబ్దాలకు దూరం జరిగితే నిశ్శబ్దం. నిశ్శబ్దం లోతులకు పోతే ప్రశాంతి. ఆ ప్రశాంతిలో మనస్సు సర్వం గ్రహిస్తుంది. అది ప్రజ్ఞ. బాహ్యప్రపంచాన్ని వదలి లోపలకు పోవడమే కష్టం. అందుకు ప్రేమ, ఓర్మి అవసరం. ఆత్మకు అన్నీ తెలుసు. ఆత్మ తెలుసుకోవలసింది ఏదీ లేదు. ఆత్మను తెలుసుకోవడమే మనిషికి ప్రధానకర్తవ్యం.

ఆత్మకు ఇంద్రియచాపల్యం ఉండదు. ఆత్మను తనలో దాచుకున్న శరీరం ఇంద్రియాలకు లోబడి పరితపిస్తుంది. మనస్సు శరీరానికి, ఆత్మకు మధ్య అడ్డుగోడగా నిలుస్తుంది. మనస్సు మాట శరీరం వింటుంది. శరీరావసరాలను మనస్సు రెచ్చగొడుతుంది. రెండూ కలిసి ఆత్మను నిర్లక్ష్యం చేస్తాయి. అందుచేత ఆత్మ తనకు ఇష్టం లేకపోయినా మనస్సు చెప్పినట్లు, శరీరం కోరినట్లు నడుస్తుంది. మనస్సు పంచన ఆత్మవంచన తప్పదు.

మాతృహృదయం సదా నిర్మలంగా ఉంటుంది. అమ్మలోని అనురాగం, వాత్సల్యం జంట ప్రేమాలయాలు. పవిత్ర క్షేత్రాలు. అమ్మ ప్రేమ అనంతం, దివ్యం, స్వార్థరహితం. జగన్మాత అందించే అనురాగమే పరమశక్తి. సరాగంతో అమ్మ మార్మికశక్తులను అందిస్తుంది. అమ్మ కళ్లలోని పవిత్రత, అమ్మ హృదయంలోని ఆనందం వర్ణనాతీతం. అమ్మ హృదయం ఒక రసభాండం. అమ్మవి సువిశాల ఆనందక్షేత్రాలు. ఆమె వెన్నెల రహదారులలోకి మళ్లింది. తారకలు వెలిగించిన మసకరాత్రులు అవి. ఆ నిశీథిలో ఆమె ఒంటరిది.

పరమాత్మ దృష్టిలో ఆమె మాననీయ, మహిమాన్విత. ఆమె అనుక్షణం

పరమాత్మ తేజస్సును అందుకోగలదు. పరమాత్మతో భాషించగలదు. తన ఆనందం శాంతి అనుభవించడానికి ఆమె కొందరినే అనుమతించింది. వారు ఆ ప్రశాంత సీమలు లోగడ తిరిగినవారే. అనేకమంది మహర్షులు, యోగపుంగవులు సాధనచేసి, ప్రపంచ ఒత్తిడుల నుండి విముక్తమై నిర్జన ఏకాంత ప్రదేశాలకు చేరారు. అమ్మఒడిలో చేరిన పసిబిడ్డలు వారు. హాయిగా, ప్రశాంతంగా తపస్సమాధిలో పరమాత్మ ఒడిని చేరగలరు.

వారు ఈ విపినాటవుల్లో పశుపక్ష్యాదులతో సహ చరించ గలరు. ఆకులను పరకరించగలరు. నిశీథాన్ని, భయాన్ని భరించగలరు. తారలతో ఆడుకోగలరు. ఆకాశ పందిరి క్రింద విశ్రమించగలరు. వారికి దివారాత్రుల భేదం లేదు. కొందరు లోతులకు పోయి, బాహ్యాజీవిత బంధాలు త్రెంచుకుని, సృష్టి రహస్యాలు తెలుసుకోగలరు. ఆత్మసామ్రాజ్యంలో అనంతశాంతిని పొందుతారు. బ్రహ్మానందం అనుభవిస్తారు. అమరవాణిని వింటారు. దివ్యజ్యోతిని దర్శిస్తారు. కాలం వారిని బంధించలేదు. కర్మ వారిని బాధించదు. వారి సంకల్ప తరంగాలే విశ్వ చలనాలు. వారు ప్రతిమనిషికి చేరువై ఆత్మను నిద్రలేపగలరు.

వారు శబ్దప్రపంచానికి, నిశ్శబ్దానికి మధ్యన నిలబడి చెరసాల వంటి మనసు ముడిని విప్పగలుగుతారు. వారు సాక్షీమాత్రులు. వారి దృష్టికి అందని విషయం ఉండదు. ప్రతిరోజు దివ్యశిఖరాల్ని అధిరోహిస్తారు. సత్యం వారికి సదా అందుబాటులో ఉంటుంది. మార్మిక తేజస్సు వారిపైన అవ్యాజంగా ప్రసరిస్తుంది.

సాంసారిక బంధాలలో చిక్కనివారు, వాంఛలకు అతీతులై నిర్మలంగా సత్యయోగ సాధన చేస్తారు. ఏకాంతంగా, నిర్వికారంగా ఆత్మోన్నతిని సాధిస్తారు. నిత్యసాధన సాధకుని యోగశిఖరాలకు చేర్చుతుంది. ప్రశాంతిని కలిగించి, తేజస్సును ప్రసాదిస్తుంది. తాపసులు దిగంబరంగా సంచరిస్తారు. ప్రాపంచిక ఆచ్ఛాదనలు వారికి అవసరం లేదు. వారు పర్వతశిఖరాల వలె నిశ్చలంగా ఉంటారు. వారి చుట్టూ ఆలోచనల వలె జిజ్ఞాసాపరులు మూగుతుంటారు.

మహర్షుల లక్ష్యం విశ్వశ్రేయస్సు. దేవుళ్ల రూపాలతో, వారి వరాలతో వీరు తృప్తిపడరు. వారిని విషాదం అంటదు. వారికి జీవితంలో వైఫల్యాలు ఉండవు. కొండను కప్పిన పచ్చని చెట్లవలె వారిని శిష్యబృందం పరివేష్టించి ఉంటుంది. తమ మాటతో, చూపుతో, స్పర్శతో వారిలో చైతన్యం కలిగిస్తారు. వారు లోపలకు వెళ్లినకొద్దీ ఉన్నత ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించినట్లే.

ఈ మహాయోగంలో చిరకాల సాధకులు తమ తృష్ణ చల్లారడం కోసం ప్రశాంత నెలవులు వెతుక్కుంటారు. ఆశ్రమాలు ఏర్పరచుకుంటారు. వారికి ప్రశాంతిలోనే సర్వాభీష్టాలు నెరవేరతాయి. ఆశ్రమజీవనం వారికి సరిగంగ స్నానాల వంటివి. అదే వారికి పవిత్రక్షేత్ర దర్శనం. అప్రయత్నంగా శాంతి వారిని వరిస్తుంది. వారికి జీవితమే ప్రశాంత నిలయం.

ప్రపంచంలో ఆధిపత్యం కాంక్షించేవారు, కీర్తికాముకులు అంతా అమాయకులు, అజ్ఞానులు. రానున్నకాలంలో తామే అధికులమని అహంకరిస్తూ, గాలిలో మేడలు కట్టి ఆ మేడల్లో విహరిస్తుంటారు. గార్ధబాలవలె గాండ్రించి బ్రతుకుతుంటారు. అలాంటివారు దైవకృపకు అర్హులు కారు. వారిని దైవప్రజ్ఞ వరించదు. తామే పుంభావ సరస్వతులైనట్లు నీతిబోధలు చేస్తారు. లోకం అలాంటి భ్రష్టుల్ని అనుసరిస్తుంది. వారు అవసర సన్యాసంతో లోకాన్ని నమ్మించి బ్రతుకుతారు. అలాంటి కుటిలాత్ములు పరమాత్మను చేరలేరు. పరమాత్మ అనుగ్రహం పొందినవారు నిరాడంబరంగా, స్నేహంగా మెలుగుతారు. సావిత్రి అలాంటి యోగ్యత సంపాదించింది. మహర్షులైన వారికి స్వార్థం, సంకుచితత్వం ఉండవు. ఎవరితో వారికి అనుబంధం ఏర్పడదు. అందరూ ఆత్మస్వరూపులే. అందరూ ఈశ్వర తేజస్సులోని కాంతికిరణాలే. అందరి ఆనందం, సంతోషం, సంక్షేమం కాంక్షిస్తుంటారు. అజ్ఞానుల్ని, అహంకారుల్ని సైతం మార్చడానికి ప్రయత్నిస్తూ వారిలో జ్ఞాన బీజాలు నాటుతారు. సత్యాన్ని బోధిస్తారు. వారిలో కొందరికి మాత్రమే స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తారు. ప్రపంచ బాధల్ని తొలగించ డానికి తమ తేజస్సును, శక్తిని వెచ్చిస్తారు. భవబంధాలు త్రెంచుకుని స్వతంత్రులైన వారు ఆ మహాత్ముల సందేశాలతో తృప్తిగా జీవించగలరు. తమ ప్రజ్ఞను, యోగశక్తిని సమాజానికి ఉపయోగిస్తారు. వారి భాష, భావం, మౌనం.... మూడూ ప్రయోజకాలే. వారి స్పర్శ మహదానందం కలిగిస్తుంది. వారి చూపు, ఓదార్పు మనస్సుకు శాంతిని ప్రసాదిస్తుంది. క్రూరమృగాలు సైతం వారి ముందు తలవంచుతాయి.

అసూయాద్వేషాలు లేనివారికి జగన్మాత ప్రేమపాత్రికను అందజేస్తుంది. గాయపడిన మానవతకు కరుణతో చికిత్స చేస్తుంది. వారు ఇతరుల ప్రజ్ఞాబంధా లలో చిక్కుకోరు. తమ మేధస్సును, అంతర్స్ఫురణను నమ్ముకుంటారు. శూన్యం నుండి మహాశక్తి వచ్చి వారిని చేరుతుంది. ప్రతిఅణువు శక్తిపూర్ణమవుతుంది. వారు పూర్ణయోగులు. వారి వాణి భవిష్యత్తును తెలుపుతుంది. పరలోకాల

జ్ఞానం వారికి సులభంగా అందుతుంది. అంతా పరమాత్మ కృపగా భావిస్తారు, వారికి గుండెలోతుల నుండి దివ్యనాదాలు వినిపిస్తాయి.

కొందరు ఆ మహాశక్తులను, సిద్ధులను తమ లబ్ధికోసం, ప్రయోజనాలకోసం, ప్రాపకంకోసం ఉపయోగించుకుంటారు. బహుకొద్దిమంది మాత్రమే పరబ్రహ్మ స్థితిని అపేక్షిస్తారు. వారే పరబ్రహ్మను చేరగలుగుతారు. వారు భవిష్యత్తును రూపుదిద్దగలరు. విధివిలాసాన్ని మార్చగలరు. మరికొందరు గగనాలకు ఎగిరిపోయిన పక్షులవలె పరమాత్మ తేజస్సులో లీనమవుతారు. కొందరు నిశ్చలంగా, నిర్వికారంగా ప్రపంచాన్ని వీక్షిస్తారు. లోకం మిధ్య, బ్రతుకు అశాశ్వతం అంటూనే ప్రపంచానికి, పరిణామానికి సహాయపడతుంటారు. కొందరు ఆత్మలో ఐక్యమై బ్రహ్మానందస్థితిలో ఏదీ పట్టించుకోరు. అలాంటివారు జీవసమాధి చెందుతుంటారు. అలాంటి నిర్వికార, నిర్వికల్ప యోగులకు ఎలాంటి శక్తులూ లభించవు. వారికి జన్మబంధాలు, మానవ సంబంధాలు ఉండవు. అలాంటివారు సరాసరి నిర్గుణస్థితిని చేరుకుంటారు.

ఒక సూర్యకిరణం తరుచ్ఛాయలలో ప్రవేశించింది. సర్వాలంకార శోభితమైన సావిత్రి రథం తపో వనభూములు ప్రవేశించింది. అసురసంధ్యవేళ, ఆశ్రమబాటలు తిరిగి వెళ్లే ఆలమందల గోధూళితో నిండి పోయాయి. మండుటెండలు సాయంత్రపు నీడల్లో చల్లబడ్డాయి. ఆమె ఒక తపోవనం చేరి, నిర్మల ప్రశాంత వాతావరణంలో విశ్రమించింది. ఆ తపోవన సీమలలో సింహాలు, ఆవులు చెలిమి చేస్తున్నాయి. నదీతీరాల తరువులు స్వాగతించాయి. ఎటుచూచినా ప్రశాంతత. ఆమె రథ వేగం తగ్గింది. అది తనకు అనుకూలమైన వాతావరణం అనిపించింది.

తాపసులు స్వతంత్రులు, సత్యస్వరూపులు. బ్రహ్మముహూర్తంలోనే వారి తపశ్చర్య ప్రారంభమవుతుంది. ఆ పవిత్ర, దివ్యస్పర్శ ఆమెను ఆకర్షించింది. ఆమె అన్వేషణకు శుభసూచనగా ఉషోదయమైంది. ఆమె మేల్కొన్నది. తన కార్యనిర్వహణకు పూనుకున్నది. నిద్రిస్తున్న దేవతలను వాంఛలు వరాలు కోరినట్లు, ఒక నక్షత్రం రోదసిలోకి జారిపోయింది. ఆమె తన విధి వలయాన్ని ఛేదించడానికి ఉపక్రమించింది.

అక్కడి ఏకాంత ప్రశాంత సీమలు అనేకం దర్శించింది. అక్కడ మనిషిలో మానవత నామమాత్రమే. ఆపైన మనిషి ప్రకృతిలో ఒంటరిగా పోరాడవలసిందే. అతీంద్రియ శక్తుల స్వాధీనతకై ప్రయత్నిస్తాడు. సుఖభోగాలలో మైమరచిన వారికి అతీంద్రియశక్తులు అలభ్యం. అవి వారికి మరు మరీచికలు.

ఆమెకు ప్రపంచం తన నిగూఢ సౌందర్యాలను, మర్మాలను చూపింది. అశరీరవాణి ఆమెను ఓదార్చింది. పర్వతసానువులు, అందులో నెలకొన్న ప్రశాంతి, ఆరణ్యక సంగీతాలు ఆమెకు దివ్యమందిర ద్వారాలు తెరచినట్లయింది. స్వప్నసీమల నిస్తబ్ధ వాతావరణంలో కాంతిహీనమైన పర్యావరణం మృత్యుమందిరమే అనిపించింది. చీకట్లు ముసిరిన ఆకసంలో వింత ఆకర్షణ ఉంది. అది యుగసంధ్య. ఆ క్రీనీడల్లో విశ్రమించింది. పర్వతపంక్తులు ఆకాశ సోపానాలని పించాయి. ఆమె ఉద్విగ్నభరిత అయింది.

ఆమె సంచరిస్తున్న కనిపించే సీమలు మరుభూములు. అవి గాఢనిద్రలో ఉన్న స్వర్గాలు. వాటిని కాపలా కాస్తున్న చంద్రికలు. ఆ స్వప్నసీమలలో, నిర్జనారణ్యంలో ఒంటరిగా శయనించింది. శూన్యంలో అన్వేషించసాగింది. పక్షుల కలకూజితాలు విన్నది. నిశ్చల కాంతి మార్గం ఆమెది. అది మలుపులు తిరిగి అనంతంలోకి దారిచూపిస్తున్నట్లు అనిపించింది.

ఎక్కడా జనసంచారం లేదు. పశుచలనం లేదు. ఒంటరిగా సుందర, దుర్గమారణ్యంలో ఒక ప్రశాంతసీమను చేరింది. ఎండకు బీటలు వారిన ఊసర క్షేత్రాలను దాటిపోయింది. క్రూరమృగాల మధ్య నిశి విజ్ఞాపనలు ఆలకించింది. ఆమె తన అన్వేషణ కొనసాగించింది. అది విధి. విధి నిర్దేశించిన జీవుడు తనకు కనిపించలేదు. మొత్తం మానవజాతిలో తన సహచరునికై అన్వేషించ సాగింది.

ప్రతిక్షణం ఒక మహత్తరక్షణమే. ప్రతిరోజు ఒక అవ్యక్త అనుభవ నిష్యందమే. అన్వేషణలో దినాలు, మాసాలు గడిచిపోతున్నాయి. సూర్యుని ప్రతాపానికి నేల బీటలు వారింది. ప్రచండ గాడ్పులతో వసుధ గుండె బ్రద్దలైంది. ఆమె కన్నులలో కనిపించని తడి ... గుండెలో వినిపించని ఆవేదన ... అడుగులలో తడబడని కనపడని ఆరాటం ... కళ్లలో దాచుకున్న ఆకాంక్ష ... వెరసి ఆమెది సత్యాన్వేషణ.

శీతల పవనాలు కనిపించక ఆకాశం కన్నెర్ర చేసింది. ఆమె కన్నులలో ఎర్రని జీరలు.


స్పందన

14. స్పందన

***సావిత్రీ** సత్యవంతులు కలుసుకునే సమయం ఆసన్నమైంది. అందుకు రంగం సిద్ధమైంది. అది విధి. జగత్తులో అన్నీ పరమాత్మ నిర్ణయం మేరకే జరుగుతాయి. పరమాత్మ నిర్ణయాలు కొన్ని ఆదేశాలు, కొన్ని సందేశాలు. వారిరువురు కలుసుకున్న ఆశ్రమ భూములు తపోవనాలు. అవి ప్రశాంతికి నెలవులు. ఆత్మకు ఆవాసాలు. ఇహపరాలకు సంగమాలు. భూమి, స్వర్గం కలిసే చోటులు. సౌందర్యం, సత్యం ఒకటయ్యే దివ్యక్షణాలు. అవి ఏకాంత వాసానికి అనువైన వనాలు. అమర సుఖాలు అనుభవించగల క్షేత్రాలు. సావిత్రి అన్వేషణ ఫలించింది. సత్యం ఒడిలో ప్రేమ సేద తీరింది. ప్రేమ అనురాగాన్ని పెనవేసుకుంది.*

ముహూర్తం ఆసన్నమైంది. సావిత్రి గమ్యం చేరుకుంది. అలవోకగా తాను చేరవలసిన చోటుకు వచ్చిచేరింది. సర్వం పరమాత్మ స్వరూపమే, అయినా విధి మనుషులపైన అజ్ఞానం ముసుగువేసి అంధకారంలో ముంచుతుంది. అవకాశాలను వక్రీకరిస్తుంది.

అది విధి సయ్యాట. అన్నింటిలోను సమంగా ఉన్న శక్తి మన పనులలోనూ కనిపిస్తుంది. ప్రతి క్రియలోనూ తొంగిచూస్తుంది. ఈ మహానాటకంలో, నియమిత సమయంలో, ప్రతి ఒక్కరిలో ఆ పని జరిగి తీరుతుంది.

అది కరుణకు, ఆనందానికి ఆటపట్టు. మంద మలయ సమీరం. అది ప్రమోదానికి ఆకరమైన స్వతంత్ర ప్రపంచం. గ్రీష్మం, వసంతం కలబోసినట్లు అక్కడ ప్రేమ, అనురాగం పెనవేసుకుని పరవశిస్తాయి.

ఆశావిహంగం రెక్కలు విదిల్చినట్లు, ఆత్మ ఆకసాన్ని చీల్చుకుని భూమికి దిగివచ్చినట్లు, రానున్న పరిణామానికి ఆమె ఆత్మ పులకించింది. స్వాప్నిక విరహాలను విరజానందాలతో రంగరించి కాలానికి, విధికి కట్టువడని ఆత్మకు

తలవంచి, పరమాత్మ సన్నలలో విస్తరించిన స్వచ్ఛంద సౌందర్యాలను తిలకించింది, అంబరచుంబితాలైన హిమన్నగాల రణోత్సాహం స్వర్గం. అమరవీరుల పాదాల క్రింద భూమి నలిగిపోయింది.

పర్వత సానువులలో పెరిగిన మహావృక్షాలు నిశ్చింతగా నిద్రిస్తున్నాయి. కొండలనుండి పారే సెలఏరుల జలధారలు ముత్యాల సరాలు. ఆ అరణ్యంలో కదిలే ప్రతి ఆకులోను ఆనందోద్వేగం, మలయపవన మాధుర్యం. తమలో నింపుకున్న నికుంజాలు, పరిమళభారంతో బరువెక్కి మత్తిల్లిన కుసుమ పరాగాలు, బారులు తీరిన శాబకాలు స్వాగతించాయి.

నేలపైన పురివిప్పిన మయూరాలు, చెట్లపైన గొంతు విప్పిన కోయిలలు ఆహ్వానం పలికాయి. పావురాల కువకువలు, సరోవరాల విహరించే రాయంచలు రమ్మని పిలిచాయి. ప్రియాతిప్రియమైన స్వర్గాలింగనంలో వసుంధర మైమరచింది. ప్రియకాంతుని కంటికి కనిపించకుండా ఆమె అందాలను రహస్యంగా దాచుకుంది.

ఆమె ఆనందపారవశ్యంలో పులకించి, రసార్ణవంలో మునిగిపోయింది. గొంతులో కళ్యాణరాగాలు పలికించింది. ఇంతకాలం జీవితం నిరర్థకంగా సాగింది, వలపు సుగంధాలు గాలిలో కలిసిపోయాయి. వంపుసొంపులు వలపువయ్యారాలు అడవికాచిన వెన్నెలైనాయి.

ఇప్పుడు ఎటుచూచినా వలపు వసంతం, ప్రతి ఊర్పులో గగుర్పు. ఆమె ఆత్మావలోకనంలో పరిసరాలను గమనించింది. హృదయం భావోద్రేకంతో పరుగుతీసింది. లోపలి మమతలు, అనురాగాలు పురివిప్పుకున్నాయి. ఆమె ఆమోదాలు ప్రమోదాలై, చూపులు ఇంద్రజాలాలై హృదయాన్ని దివ్య పారవశ్యంతో నింపాయి. ప్రేమమందిర కవాటాలు భళ్లున తెరచుకున్నాయి. ఆత్మశాంతి నల్దిశలా విస్తరించి హృదయం ప్రశాంతమైంది. ప్రకృతి ఒడిలో సృష్టి ఆదమరచింది.

మనిషి భావుకుడు, ఆలోచనాజీవి కనుక ప్రశాంతంగా జీవించలేడు. ఎప్పుడూ శాంతిని వెతుక్కుంటూ పరుగులు తీస్తాడు. తనలోనే ఉన్న ఆత్మను, శాంతిని విస్మరిస్తాడు. ఆత్మశాంతిలో భావం ఉండదు. శ్రమ ఉండదు. పరిశ్రమ ఉండదు. అంతా నైర్మల్యమే. జీవితం ఒక పరిధిని దాటిపోదు. జీవి తన లక్ష్యాన్ని చేరదు. ప్రశాంతిలోనే జగన్మాత విశ్రమిస్తుంది. అంతా ఆ జగన్మాత సంకల్పమే. సహకరించడంలోనే మనిషి ప్రజ్ఞ.

ప్రకృతి పులకించినప్పుడు చెట్లు చేమలు, సమస్త విశ్వం పచ్చదనాన్ని కప్పుకుంటుంది. సాధుజంతువులు నిర్భయంగా విహరిస్తాయి. ఆ మహారణ్యం ఆమెకు అభయారణ్యం. అరణ్య మధ్యలో సన్నని కాలిబాట. బాటకు ఇరువైపుల పూలతావులు, ఆవిరులు. ఆత్మ ఔన్నత్యాలకు ప్రతిబింబా లనదగ్గ తరులతలు. ప్రణయతాండవ నర్తనంలోని రసానందం. మేలిముసుగు వెనక దాగిన సరససౌందర్యాలు. ఆ ఏకాంత నిశీధిలో రవళించిన రామణీయకాలు.

ప్రాపంచిక సుఖాలు అశాశ్వతాలని, అరణ్యాలలో పర్వతగుహలలో తపస్సమాధిలో నిశ్చలంగా కూర్చున్న ఋషి వలె ఆమె వినీలాకాశం క్రింద నిర్మోహంగా ఉండిపోయింది. తనలోకి చూచుకున్నది.... తన ఆత్మశక్తి అనంతంగా వ్యాపించినట్లు తోచింది. ప్రపంచం నుండి ఒక ఆత్మ నిర్గమించినట్లు.

మహారణ్య మధ్యలో ఒక సుస్వనం ఆమె చెవులకు సోకింది. జగన్మాత కొంతకాలం సుఖించడానికి ప్రాపంచికతను రుచిచూడడానికి ఎన్నుకున్న ఆనంద సీమ అది. జనజీవనానికి దూరంగా, ఏకాంతంగా ప్రపంచ సుఖదుఃఖాలకు అతీతంగా జగన్మాత తన పాత్ర పోషించ నారంభించింది. ఇంద్రియాలు అతీంద్రియ ప్రజ్ఞకోసం ఆరాటపడ్డాయి. ఆమె మార్మిక రహస్యాలకై వెదకసాగింది. పరలోక సౌందర్యాలకు ద్వారాలు తెరుచుకున్నాయి. మార్మిక మందిరం ఒక్కసారి వెలుగులు నింపుకున్నది. అపూర్వ కలకలం.... ఆమె ఎదలో కలవరం. అది మాధుర్య మందిరం. మమతల పల్లకిలో ఊగి తూగింది.

★ ★ ★

కాలపు విషాద రహదారిలో అతనొక బాటసారి. మృత్యుభారాన్ని వహించనున్న చిరంజీవి. విధికి బలై పోయినా, విధిని తనకు బలి తీసుకున్న ధీరుడు. అకాల మృత్యువు కబళించినా కాలాన్ని మృత్యువును దాటగల సత్యవ్రతు డతను. లోకంలోని బాధలు, ఆనందాలు సైతం అనుభవించాలి. ఆ మహారణ్యంలో సావిత్రి తన ఆత్మసఖుని కలుసుకున్నది.

15. ప్రణయాంకురం

అరణ్యంలో ఒక్కటే బాట. సావిత్రి రథం ఆ బాటలోనే పయనిస్తున్నది. అల్లంత దూరాన సత్యవంతుని చూచింది. రథం ఆగింది. మనోరథం ముందుకు కదిలింది. అతనిది మూర్తీభవించిన తేజస్సు. యువకుడే కాని ఋషి. విధి అతనిని అరణ్యవాసానికి పంపింది. అతనికి మహారణ్య మార్గాలన్నీ సుపరిచయాలు. ఆనాడు అదృష్టం అటుగా నడిపించింది. ఆమె సుందరమూర్తిని అలవోకగా దర్శించాడు. ఆమె కళ్యాణి. అమృత హృదయిని.

సత్యవంతుని చూచిన క్షణంలో సావిత్రి భ్రుకుటి ముడివడింది. చూపు మరల్చుకోలేక పోయింది. ఆమె చూపుసోకిన సత్యవంతుడు స్థాణువైనాడు. ఇరువురి హృదయాలలో అనిర్వచనీయమైన స్పందన. మూగబాస ఊసులు. అతని మూర్తి ఆమెలో ప్రవేశించింది. అతని రాగం ఆమెకు అనురాగం. అతని తాపం ఆమెకు అనుతాపం. ఆత్మలు గాఢాలింగనం చేసుకున్న అనుభూతి. ఒకరికొకరు కొత్త అనిపించలేదు. ఆత్మల అనుభవాల్ని కలబోసుకున్నారు. పిపాసతో, ఆర్తితో ఒకరి నొకరు గుర్తించారు.

ఆ గుర్తింపుకు మరోపేరు ప్రేమ. ప్రేమాంకురం స్వర్గంలో ఏర్పడుతుంది. భూమిపైన ప్రేమ వలపు చిగుళ్లు వేస్తుంది. మనిషికి జీవితంలో ప్రేమ ఒకేసారి, ఒక్కరితోనే ఏర్పడుతుంది. ప్రేమ పారిజాతం ఒకేసారి వికసిస్తుంది. ఒకే పూవు పూస్తుంది. అది వాడిపోదు. పరిమళం చెడదు. జీవితకాలం మధురిమల్ని క్రుమ్మరిస్తూనే ఉంటుంది. ఆ ప్రేమలు పండించుకోడానికి శరీరాలు అవసరం.

సావిత్రీ సత్యవంతుల జీవితంలో అది తొలి సమాగమం. అది ప్రణాయాంకురం.

విధిలిఖితం ఆమె కళ్లలో కదలాడింది. ఆధ్యాత్మికంగా పై అంతస్థులకు చేర్చవలసిన బాటలు వదలి, మానవ మానసాల వైపుగా నడిపించింది. అది ఒక మలుపు. అది మహారణ్యం మధ్య భయానక ఏకాంతం. పైన చంద్రనిప్పులు కురిపిస్తున్న తరుణ భాస్కరుడు. అరణ్యాలను వీక్షిస్తే స్వర్గంలో మరచిపోయిన ఔన్నత్యాలు జ్ఞప్తికి వస్తున్నాయి. ఆమె అంతరంగం సైతం ఒక మహారణ్యం అయింది. అందులో మార్మిక స్వరజతులు. అక్కడ ఆనందానికి, అనుభవానికి మధ్య ఒక రహస్యద్వారం ఉంది. ఆ ద్వారం తెరవడానికి కొన్ని నిశ్శబ్ద సూచనలు, మార్మిక సంకేతాలు ఉన్నాయి.

లోపల అగోచర ప్రపంచపు సరిహద్దురేఖపైన ఒక వెలుగుకిరణం వంపు తిరిగి విశ్రమించింది. అక్కడి వికసిత సుమాలు వనదేవతల నేత్రాలు రహస్య స్థావరాల నుండి తొంగిచూచాయి. వెలుగుకిరణాలు తాకిన కొమ్మలు, రెమ్మలు ఊసులాడి ఆనందం ముసుగులో ముద్దులాడి అలసి విశ్రమిస్తున్నాయి. చెదురుమదురుగా బద్ధకంగా వీస్తున్న నిట్టూర్పు గాలులు పచ్చిక బయళ్లపై వేడిసెగలు అద్ది సాగిపోతున్నాయి. అరణ్య మధ్యలో ఏకాంతంలో దాగిన నిశ్శబ్దం ఆకుల గలగలల్లో ఆత్మీయతల్ని పొందుపరుస్తున్నది.

కాముని వాంఛవలె అదృశ్యంగా, ఆపాతమధురంగా, మత్తుగా గమ్మత్తుగా అంతరాంతరాలంలో దానికి సమాధానం దొరికింది. ఆ వెనుక ఎక్కడో ఏకాంతం మత్తుగా నిద్రిస్తున్నది. అది ప్రకృతి మేలి ముసుగులో ఎవరికీ కనిపించదు. ఆమె దివ్యదృష్టికి, అంతశ్చేతనకు సర్వమూ విదితమే.

సుందర ప్రవాసంలో వసుధకు బాధ్యతలు లేవు. ఆత్మకు ఆలంబనగా ఒకే ఒక్క శాంతి సందేశం వినిపించింది. మానవ సంచార సంకేతంగా ఒకే ఒక్క సోపానం ఉంది. స్వాప్నిక ఏకాంతంలోకి చొచ్చుకుని సువిశాల, సుందర, నిగూఢ హృదయ గహ్వరంలోకి బాణంవలె దూసుకుపోతున్న బాటలో ఆమె ఎవరికై ఎదురు చూస్తున్నదో, ఎవరిని అన్వేషిస్తున్నదో అక్కడ ఒంటరిగా అతనినే కలుసుకుంది.

ప్రకృతి యవనికపై ఉల్లేఖించబడిన ఆత్మచిత్రణ. స్వప్నమందిరంలో క్షణం కాలం స్తంభించగా, ఆ శూన్యంలో అనంత జీవన లాలస తొణికిసలాడింది. ఆ కామనఫలంగా వెలుగు కిరణాలకి, గుండె వెచ్చదనానికి మధ్యన ఆ మహారణ్యం మధ్యలో అతను దర్శనమిచ్చాడు – సత్యతేజస్సుకు తానే సజీవ రూపం అయినట్లు. ఆతని సుందరరూపం ఉషఃకాంతిలో మిరుమిట్లు గొలిపింది. పరసీమల శాంతిపర్వం వలె అతని మనస్సు ప్రవిమలం. ఫాలం అనంత విజ్ఞానానికి సంకేతం. మనస్సు వివేకానికి భూమిక. ఆపాదమస్తకం సత్యచైతన్యం. వదనం సచ్చిదానందానికి నిలువుటద్దం. అతని రూపులో, చూపులో విమలదరహాసం. అతని తలచుట్టూ దివ్యతేజోవలయం, జ్ఞానప్రకాశం. అణువణువున రాజసం, చూపుల్లో ప్రేమ నీరాజనం. నడకలో ఠీవి, ఉత్సాహం, ఆనందం. సజీవ సుందరశిల్పం కదలి నడిచిన భ్రాంతి. అతని దర్శనంవల్ల ఆ తపోవన భూములు చైతన్యం పొందినట్లయింది.

అనేక సంవత్సరాలుగా అంధకారంలో మ్రగ్గుతూ, విధికి తలవంచి బ్రతుకు సాగిస్తూ, ఇప్పుడు జగన్మాత దర్శనానికి ఈ సుందరారణ్యాలకు వచ్చినట్లుంది. ఆ దివ్యమాత కృప వల్ల, స్పర్శ వల్ల, దర్శనం వల్ల తానిక్కడి సౌందర్యానికి, ఏకాంతానికి బందీ అయినాడు. దివ్యప్రజ్ఞకు తాను ఏకైక వారసుడు. ఆకాశానికి భూమికి హితుడై, సన్నిహితుడై సృష్టిని ఆకళించుకున్నాడు.

అతను వేదమూర్తి. ఇంకా రాయని మహాకావ్యంలో కథానాయకుడు. ఆమె రూపంలో దాగిన సంకేతాలను అన్వేషించసాగాడు. అర్థంగాని ఔన్నత్యాలను గ్రహించి అంతరార్థాలను వెదకసాగాడు. ఆమె ప్రవిమల రూపం వెనుక భావసంపదల్ని వెదికి పట్టుకున్నాడు. అతనికా రహస్యం సెలయేటి పాటలలో, ఆరణ్యగీతాలలో, గ్రహాలలో, అనుగ్రహాలలో, తారలలో, తెరలమాటున, కొమ్మలపై కూసే శాబకాలలో, అరణ్యమృగాలలో కనిపించింది.

ఆమె కార్యనిర్వహణకు తాను తోడుగా నిలిచాడు. వర్షానికి విడిగి విప్పారిన పుష్పం వలె తాను విచ్చుకున్నాడు. ప్రకృతి స్పర్శతో పెరిగే చెట్ల వలె, సూర్యరశ్మికి వికసించే పూలవలె తాను క్రమంగా రూపుదిద్దుకున్నాడు. తన స్వేచ్ఛ తనది. ఈ ప్రకృతి తనది. ఆధిపత్యం తనది. అనురాగం ఆమెది. ఆనందం ఇద్దరిది.

సర్వభూతాలలో దాగిన ఆత్మ తానేనని గ్రహించి, పరమాత్మ సన్నిధిలో తన ఆత్మను, అనుభవాన్ని నివేదన చేసుకున్నాడు. తన ప్రజ్ఞతో ఆమె అనంత ప్రజ్ఞను అర్థం చేసుకున్నాడు. తన చర్యలన్నీ ఆమె శక్తి చాలనాలే నని గ్రహించి భౌతికంగా తనను ఆమెకు సర్వసమర్పణ చేసుకున్నాడు.

తనకు పరిచితాలైన మార్గాలన్నీ దాటివచ్చాడు ఆనాడు. ప్రతి క్షణం కాలాన్ని, విధిని సమీక్షించే పరమాత్మ మనం ప్రయత్నపూర్వకంగానో అప్రయత్నంగానో వేసే ప్రతి అడుగు, ప్రతి చర్య గమనిస్తుంది. ఆనాడు పరమాత్మ అతనిని ఆ బాటలోకి నడిపించింది. కోటి రూపాలకు, ఆకృతులకు ఆకరమైన ఆమె జీవులందరికి భద్రమందిరం. ఆ మందిరంలో ఆకాశం, తారకలు, కొండలు, కోనలు సహజ సుందరంగా చరిస్తున్నాయి. అక్కడి పచ్చిక బయళ్లు కనువిందు చేశాయి. మలయానిలానికి ప్రకృతి పరవశించింది. చెట్లపై విశ్రమించిన పక్షులు పలకరించి స్వాగతించాయి. పరిసర ప్రకృతి మేల్కొన్నది.

కాని ఇంకా జీవస్పందన కలగలేదు. చైతన్యం పొందలేదు. అతను పరమాత్మకు బందీ అయినట్లు మృత్యుమందిరంలో సేదతీరిన వీరునిలా ఉన్నాడు. కానీ అతనిలో ఒక నిగూఢ శక్తి ఉంది. ఆరాధన ఉంది. అభిమానం ఉంది. అన్నీ రూపుదాల్చిన ఆ మూర్తిలో భగవచ్ఛక్తి కనిపిస్తుంది. ఎక్కడో ఒక అపస్వరం ఉంది.

ఈ ప్రపంచంలో ఆలోచించగల జీవి మానవుడొక్కడే. మనిషి తన మనస్సుతో ఖగోళాలను దర్శించగలడు. సౌందర్యాన్ని అనుభవించగలడు. అతని కళాభిజ్ఞత కార్యోన్ముఖం కానపుడు అజ్ఞానంలో; అంధకారంలో మిగిలి పోతాడు. మనిషికి స్మృతి ఒక వరం, విస్మృతి ఒక శాపం.

ఆమె స్మృతులలో అన్నీ ఉన్నాయి. పైకి కనిపించవు. మనిషి లోపలి ప్రజ్ఞ పైకి కనిపించదు. మేధస్సును ఆశ్రయించి, అది నడిపినట్లు నడవడం మనిషికి అలవాటు. మనస్సును జయించిన మనిషి మహాత్ముడవుతాడు. ఆమె మనస్సుకు ఇవతల తిరుగుతూ ఆత్మవిషయం మరచిపోయింది. మనిషి తన జీవితలక్ష్యం తెలుసుకోడు. పరాన్ని విస్మరిస్తాడు. ఏరి కోరి దురదృష్టాన్ని వరిస్తాడు.

ఆమె అంతే చేసింది. లాలసకు లోనై, ప్రాపంచిక సుఖాలకు మురిసి ఆత్మను అలక్ష్యం చేసింది. భగవంతుడు సమయం వచ్చినప్పుడు ఆత్మను జాగృతం చేస్తాడు. ఆమె దృష్టి నిశ్చలం అయింది. ప్రస్తుతంలో ఆమె లక్ష్యం వేరు. అందులో ఆత్మ సంచారం లేదు. తొలుత ఆమె మనస్సు దివ్యస్వప్నాలను ప్రోత్సహించింది. ప్రాపంచిక సుఖ దుఃఖాలకు మన ప్రవృత్తులే సంకేతాలు. అవే అగోచర లోకాలకు సందేశాలు, భవిష్య ఘటనలకు సూచికలు. ఆమె అతనిలో భౌతిక ప్రజ్ఞను గుర్తించి కేంద్రబిందువుపై దృష్టిని నిలిపి అతని అంతర్ రూపాన్ని చూచింది. అతను తన జీవన ప్రభువు. తన ఆనందానికి కేంద్రబిందువు. తన లక్ష్యసిద్ధికి మూలాధారం. అది క్షణిక స్వప్నం.

అప్రయత్నంగా ఆమె ఆత్మ అతని హృదయాన్ని శోధించింది. చూపుకు అందని అలౌకిక దృష్టి అది. అది అలౌకిక ప్రజ్ఞ, దివ్యదృష్టి. అన్ని బంధాలను మించిన అనుబంధం... ఆత్మీయతానుబంధం.

క్షణంలో అంతా అద్భుతంగా తోచింది. అది అతీంద్రియ బ్రహ్మానంద పారవశ్యం. భావతరంగాలు, రంగుల హరివిల్లు. ఒకనాడు కరిగిపోయిన కలను పునరుద్ధరించింది. లోకాన్ని పునర్నిర్మించడానికి తాను జన్మించింది. మానవ పరిణామం తన ధ్యేయం. అది తనలోని ఆరని జ్వాల. ఆమె లోలోతులలో అద్భుతమైన మార్మిక స్పందనలు ప్రశాంతంగా, స్వాప్నికంగా తోచాయి. మనోభూమికలలో జవజీవాలు ప్రవహించాయి. వెన్నెల పరచుకున్న అంబరాన అస్పష్టమైన అనుభూతులు. మరో ప్రపంచం ఏర్పడుతున్న స్పృహ. అన్నీ ఆమె హృదయ ఫలకంపైన కదిలాయి. దైవశక్తులు ఆమెను ఒక్కసారిగా చుట్టుముట్టి నట్లయింది.

మహర్షుల ప్రార్థనలు ఆమెకు స్వాగత గీతాలైనాయి. ఆమె రాకను వారు మనసా స్వాగతించారు. విచిత్ర పరివర్తన అందరిలో కలిగింది. పరమాత్మ స్పర్శతో మానవ ప్రవృత్తి మారిపోతుందన్నది సత్యం. తనను సమీపిస్తున్న రెండు నయనాలు అపూర్వ తేజస్సును నింపుకుని కాలాన్ని తనకు అనుకూలంగా మార్చివేశాయి. తనలో ఆశాదీపాలు వెలిగించాయి. మార్మికస్పందనతో ఆమె హృదయం చలించింది. గుండె కదలింది. కొమ్మమీది కోయిల మరో కొమ్మపైనున్న నెచ్చెలిని చేరింది.

అశ్వాల వేగాన్ని బట్టి రథవేగం మందగించింది. గాలి స్తంభించినట్లు రథం నిలిచిపోయింది. తన హృదయ ద్వారాలు తెరిచి సత్యవంతుడు బయటకు చూచాడు. ఆమె రూపం, లావణ్యం, యవ్వనం, విలాసం అతని నరాలపై స్వరాలు పలికించగా తన యవ్వనం పురివిప్పిన నెమలి అయింది. ఆమె సుందర రూపం అతని హృదయంలో ప్రవేశించింది.

గండు తుమ్మెద వికసిత కుసుమ పరాగాన్ని ఆస్వాదించినట్లు చేతులు చాచి ఆమెను తన ఆత్మలోకి తనవైపు ఆహ్వానించాడు. పూర్ణ చంద్రోదయంతో సాగరం ఉప్పొంగింది. తాను కలలో కలవరపడ్డాడు. ఆమె తలచుట్టూ నీలకాంతులు. ఒక తేజస్సు ఆమెను చుట్టివేసింది. ఆత్మసంస్కారం కలవారికి మాత్రమే తేజోవలయం కనిపిస్తుంది.

అగ్నితప్తమైన సువర్ణంవలె కాంక్షలో కాలిన అందం పునీతమై కాంతుల్ని

వెదజల్లింది. తను తాను కాదు. తన జీవి మరొక జీవితోడు కోసం వెదుక్కుంది. ఇంతకాలం కలల్లో దాగిన కమనీయ రూపం సజీవంగా నడచివచ్చింది. భ్రాంతి చెదిరిపోగా, వాస్తవం కళ్ల ముందు నిలిచింది. తనకన్న మిన్న అయిన పరమాత్మను ఆరాధించడం ఆత్మ లక్షణం.

ఏదో ఆకర్షణ అతనిని ఆమెవైపు ఆకర్షించింది. అమితాశ్చర్యంతో తన స్వప్న లోకాన్ని దాటి వచ్చాడు. చూపుతో చూపు కలిసింది. మనస్సు మనస్సును ఆలింగనం చేసుకుంది. అది ఆత్మసంయోగ క్రియ.

ఆమె వదనబింబం నిర్మలం, ఉదాత్తం, మహత్తరం. అది ఉజ్వల కాంతి కిరణాలతో పరివృతమైంది. అది తాపసులు మాత్రమే దర్శించగల తేజస్సు. ఆ దివ్య వర్చస్సును సామాన్యులు పాక్షికంగానే పొందగలరు. యోగపూర్ణులు మాత్రం సంపూర్ణంగా ఆరాధించగలరు. ఆమె అంతర్దృష్టికి అంతా తెలుసు. ఆమె విశాల ఫాలం గతానికి చిహ్నం. ఆమె కళ్లలో గతం, భవిష్యత్తు నీడలు. ఆమె ఆత్మ తనను అభిలషించే నేస్తాన్ని గుర్తించింది. తమ ప్రేమబంధం జన్మజన్మల అనుబంధంగా గ్రహించింది. ఆమె గుర్తింపులో అతను పరవశించి తనను తాను గుర్తించగలిగాడు. అది మూగభాష. అముద్రిత రూపం, రగలని ప్రేమాగ్నికణం. అది యుగయుగాల స్వప్నాలకు స్వస్వరూప కల్పన.

ప్రపంచంలో జీవించిన కాలంలో స్వల్పంగానైనా అనుభవించాలని ప్రతివ్యక్తి కోరేది అది. పరమాత్మ మానవ రూపం ధరించి వచ్చినట్లయింది. ఆమె సువర్ణ సుందరి. అతని ఆశయాలన్నింటినీ తన గుండెలో దాచుకుంది.

బ్రహ్మానందాన్ని భువిపై అవతరింపచేయడానికి, ఆవిష్కరించడానికి, శాశ్వతంగా నిలుపుకోడానికి సత్యయోగం అవసరం. భౌతికతను సత్యంతో యోగించినప్పుడే మానవ హృదయాలు పరమాత్మకు చేరువ కాగలవు. ఎందరో మహాత్ములు అందుకై తమ తపస్సును వెచ్చించారు. మనిషిని మృత్యుంజయుని చేయడమే మహాయోగుల పరమాశయం. అందుకు పరబ్రహ్మ అనుగ్రహంతో విశ్వప్రేమను, పరమాత్మ కారుణ్యంతో కొన్ని మార్మిక శక్తులను సంపాదించ గలగాలి.

ఒక దివ్య సంకల్పం దివి నుండి భువికి దిగి వచ్చింది. ఆధ్యాత్మిక శిఖరాలను దాటి మానవతను సమీపించింది. అయినా దాని దివ్యప్రకృతికి నాశం లేదు. భూగోళం మూగగుండె పైన మనం ఒకరి కొకరం తెలియనట్లే బ్రతుకుతాం. కాని ఎవరి కెవరూ కొత్త కాదు. మనం సాగిస్తున్న జీవితాలూ

కొత్త కాదు. ఒక కారణం మనల్ని దగ్గరగా చేర్చుతుంది. అందుకు కలిసి బ్రతుకుతుంటాం.

తమను వేరు పరచిన కాలాన్ని ధిక్కరించి ప్రతి ఆత్మ తనకు అనుకూలమైన మరొక ఆత్మను గుర్తిస్తుంది. జీవన రహదారులలో ఈ ఆత్మలు ఒంటరిగా పయనిస్తూ కొత్త రూపాల ఆకర్షణకు లోనై ప్రేమకు స్పందిస్తాయి. ఆ కలయిక శాశ్వతానందానికి ప్రేముడి కావాలి. ఆ ఆనందానుభవం శాశ్వతం కావడానికి శరీరాలు భోగిస్తుంటాయి. అది సంయోగం. సంభోగం యోగానికి అవసరమైన పునాది.

వివేకం చివరి మెట్టు కాదు. వివేకాన్ని మించిన ఆత్మజ్ఞానం కలిగించగల శక్తి ప్రతిమనిషిలో ఉంది. అది ఆలోచనల కన్న ఉన్నతం. అతి దూరం. జీవితంలో రకరకాల దృశ్యాలు కనిపించినట్లే కొన్ని దివ్యదృశ్యాలు స్వప్నాలలో కనిపిస్తాయి. ప్రేమించడం, జీవించడం రెండూ దివ్యచిహ్నాలే. శాశ్వతమైన పరలోకాలు చేరడానికి 'ప్రేమ' ఒక రహదారి.

ఏవో ప్రలోభాలకు లోనై క్షుద్రశక్తులు పొందినవారు అవమానాల పాలై పతనం చెందుతారు. పరమాత్మను విశ్వసించినవారు క్షుద్రశక్తుల్ని కోరరు. మనలో అన్ని శక్తుల్ని కలిగించేది పరబ్రహ్మమే. ఒక్కసారి బ్రహ్మానందానుభూతి కలిగితే మన జీవితాల పునర్నిర్మాణం ప్రారంభమయినట్లే. వికసించిన పూలలో పరిమళం వలె మనిషిలో ప్రేమ గుబాళిస్తుంది. అది ఆత్మ పరిష్వంగ సుఖానికి ఉరకలు వేస్తుంది. మన కలల్లో, ఆలోచనల్లో భగవద్దర్శనం అనేకమార్లు, అనేక రూపాల కలుగుతుంది. కానీ మనం గుర్తించం. మనకు తెలిసిన భాషలో, మనకు అర్థమయ్యే సంకేతాలకై ఎదురుచూస్తాం. అవి అందినప్పుడు గుడ్డిగా అనుసరిస్తాం. మనలో దివ్యస్పందన కలగడానికి ఒక స్పర్శ చాలు, ఒక చూపు చాలు, ఒక శబ్దం చాలు. భౌతికంగా మనం ఆ సందేశాన్ని అందుకోవడమే కష్టం. మనలో అంతర్దృష్టి మన ప్రమేయం లేకుండానే ఏర్పడుతుంది.

అనేకానేక విశ్వాసాలతో మనిషి తనకు అండగా ఒక దైవాన్ని ఎన్నుకుని, ఒక విశ్వాసం ఏర్పరచుకుంటాడు. తద్వారా సత్యాన్ని దర్శించాలని ప్రయత్నం. ఏవేవో రూపాలు కల్పించుకుని అవన్నీ పరమాత్మ విభిన్న రూపాలనుకుంటాడు. అనశ్వరమైన రూపాలలో దివ్యత్వాన్ని ఆపాదించుకుని తన శరీరమే పరమాత్మ నివాసం అనుకుంటాడు.

సత్యప్రేమికుడు అంతర్దృష్టి గల ఋషితుల్యుడు. తన లోపలనే పరమాత్మను దర్శించగలడు. సర్వజగత్తులో పరబ్రహ్మ తత్వాన్ని అనుభూతించగలడు. కాని మనస్సు వెర్రిగా ఆలోచిస్తుంది – "నేను ఇంతకాలంగా నిరీక్షిస్తున్నది దేనికోసం? నా ప్రశస్తమైన కాలాన్ని దుర్వినియోగం చేశానా?" అని. ఒక హృదయం మరొక హృదయం కోసం ఆరాటపడుతుంది. ఒక శరీరం మరొక శరీరంతో సుఖపడాలని కోరుతుంది. పూర్ణత్వం కోసం అవిరళ ఆరాటమే తపన. దివ్యత్వం వేరు, ప్రేమ వేరు. దివ్యప్రేమ అర్థం లేనిది. దివ్యత్వానికి దూరంగా మనగలుగుతుంది మానవ ప్రేమ. ప్రేమ సత్యాన్ని కోరుతుంది. సత్యాన్ని జయిస్తుంది. దివ్యత్వం అసత్యం దరికి చేరదు.

జీవితం అశాశ్వతం. అంతా అంధకార బంధురం. సుఖాలు, ప్రలోభాలు, ఆర్జితశక్తులు మనిషి పతనానికి హేతువులు. దైవానుగ్రహం వల్ల లభించే శక్తులు మాత్రమే శాశ్వతం. దైవచింతన ఆనందం కలిగిస్తుంది. తృప్తి నిస్తుంది. ఆ తృప్తి మానసికం మాత్రమే ... ఆత్మికం కాదు. ప్రేమను భరించి ఉదారంగా పంచి ఇవ్వగలవారు అరుదుగా ఉంటారు. భగవదవతారాలు ఉండవు. భగవదం శంలో జన్మించడం జరగదు. వేయి సంవత్సరాలలో ఒక ఆత్మకు ఆ శక్తి ఏర్పడవచ్చు. రూపాలు వేరైనా ఆత్మశక్తి గలవారు పరస్పరం సులభంగా గుర్తించగలరు.

బాహ్యరూపాలు భిన్నంగా ఉన్నా శరీరం, మనస్సు గుర్తించ వీలులేనంతగా మారినా, రెండు ఆత్మల మధ్య అనేక జన్మల అంతరం ఉన్నా, ఆత్మల మధ్య అనుబంధం ఎప్పుడూ పాతదే. ఎంతో కాలం నిరీక్షించి, ఒకరి నొకరు కాంక్షించడం వల్ల జన్మకు రాగానే హత్తుకుపోతారు. అది విడరాని బంధం అనిపిస్తుంది. కాలపథంలో వారు చాలా దూరం కలిసి పయనించినవారై ఉంటారు. విధి శాసనం వల్ల వారు కలుస్తూ విడిపోతూ ఉంటారు.

గతం మనిషి ఆత్మలో నిక్షిప్తమై ఉంటుంది. అది భవిష్యత్తును సుందర స్వప్నంగా రూపొందిస్తుంది. లేదా వర్తమానం రమణీయంగా మారుతుంది. వీక్షణ మాత్రం చేత సావిత్రికి గత ఔన్నత్యం అభివ్యక్తమైంది. రూపం వెనుక దాగిన ఆత్మశక్తి చివ్వున తలెత్తింది. ఇరువురి జీవితాలను క్రమ్మిన మాయ తెర తొలగిపోయింది. ఆమెకై అతను చేతులు చాచాడు. ఇరువురు ఆనంద పరవశు లైనారు. తొలి వీక్షణంలోనే ఆత్మీయతలు పండాయి. క్షణమాత్రంలో తేజోకిరణం కదిలింది. కాలానికి కొత్త బాటలు పరచిన క్షణం అది.

16. సంగమం

సావిత్రిని చూచి సత్యవంతుడు వివశుడైనాడు. ఆమె మానవరూపం ధరించివచ్చిన అప్సరసగా భావించాడు. ఆమెకు ఆతిథ్యం ఇవ్వడం తన ధర్మం. అందుకే అన్నాడు : "దేవీ! దాపుననే మాతండ్రిగారి ఆశ్రమం ఉన్నది. నీవు విశ్రమించడానికి అనువైన తావు అది."

సావిత్రి తనను పరిచయం చేసుకుంది.

"నేను మద్ర రాకుమారిని. నా పేరు సావిత్రి".

"మీ రెవరు?" అని ప్రశ్నించింది.

సత్యవంతుడు తనను పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు సత్యవంతుడు. సాల్వ ప్రభువైన ద్యుమత్సేనుని కుమారుడను. మా తండ్రిగారు రాజ్యాన్ని, దృష్టిని కోల్పోయి అరణ్యవాసం చేస్తున్నారు."

ఆ కారణంగా సత్యవంతుడు అరణ్యంలో తపస్సు చేసుకుంటూ తల్లిదండ్రులకు సేవ చేస్తూ గడుపుతున్నాడు. మిగిలిన తాపసులతో కలిసి బ్రహ్మాన్ని అన్వేషిస్తున్నాడు. అజ్ఞానం, నైరాశ్యం, మత్యువు – అతనిని వదలడం లేదు.

సావిత్రి తన సహచరి అయితే, తను లక్ష్యం సాధించవచ్చు ననుకున్నాడు. ఆమె తొలి సందర్శనంతోనే తనలోని నైరాశ్యం తొలగింది.

సావిత్రి సత్యవంతుని చూడగానే తన అన్వేషణ పూర్తి అయిన అనుభూతి చెందింది.

సత్యవంతుడు ఆమెను తమ ఆశ్రమానికి తీసుకువెళ్లాడు. ఆమె ఒకసారి తన తల్లిదండ్రులను దర్శించి వారి ఆశీస్సులు పొంది వస్తానని బయలు దేరింది.

గతమంతా నైరాశ్యం, నిర్వేదం, నిశ్శబ్దం. వాస్తవంలో ఆశ, అన్వేషణ. తెలిసినా మరచిపోయిన అనుబంధాలు, ఆత్మీయతలు. కాలం పరచిన రహదారిలో ఆత్మల సహవాసం. ఇరువురిలో గుండె బరువు, రహస్యపు ఒత్తిళ్లు. చైతన్యం పొర చిరిగిన శబ్దం-నిశ్శబ్దంలో. ఒకరినొకరు ఎన్నడో ఎరిగిన గుర్తింపు. హెచ్చరిక. తొట్రుపాటులో తొందరపాటు. తొలి సమాగమ మాధుర్యం. తొలి దర్శనంలోనే విధి ముద్ర. ఒక జీవి మరొక జీవి కలయికను ఆశించినపుడు బాహ్యావివేకాన్ని, భౌతికప్రజ్ఞను చీల్చుకుని అంతర్‌ప్రజ్ఞ, స్పందన పనిచేస్తుంది. మాటల కోసం పెదవులు ఆరాట పడతాయి. కళ్లు పలకరించుకుంటాయి. సంభాషణ అవసరం ఉండదు.

భౌతిక బంధనాలను ప్రజ్ఞ ఛేదించివేస్తుంది. అది వారు కలుసుకున్న ముహూర్తబలం. ఆంతర్యంలో పరస్పరం గుర్తించుకున్నారు. విస్మృతి తొలగి పోయింది. నీవే నేను, నేనే నీవు - త్వమేవాహం అనుకున్నారు. మొదట సత్యవంతుడే పెదవి విప్పి పలకరించాడు :

"కాలాన్ని అధిగమించి నీవు నా కొరకు అవతరించావు. నీ దర్శనం నా హృదయంలో బ్రహ్మానందాన్ని నింపినట్లయింది. నీవు అచ్చరవా? దేవతవా? మానవకాంతవా? నాకు తెలియటం లేదు. ఈ లోకపు అవధుల్ని దాటి నీ ఆత్మ నన్ను పలకరించింది. నా ఆత్మ పరవశిస్తున్నది. నీ చూపుతో, రూపుతో భౌతిక స్పృహను సైతం కోల్పోతున్నాను. మానవ ప్రపంచంలో నిన్ను ఏ పేరుతో సంభా వించాలి? నీ శుభనామం ఏది? నాకు పరిపూర్ణత కలిగించడానికై నీవు ఎప్పుడు అవతరించావు దేవీ! నీ ప్రకాశనం వేసవిని మించింది. నీ సౌకుమార్యం కుసుమాన్ని మించింది. నా ఏకాంత జీవిత సరిహద్దులు దాటి లోపలకు వచ్చావు. సూర్యకాంతివై, స్వర్ణకాంతివై వచ్చావు. మీ దేవతలందరూ మా మానవులకు సన్నిహితులే దేవీ!

"నా ఆత్మ రాత్రింబవళ్లు ఇంతకాలం దేనికోసమో అన్వేషిస్తూ ఉంది. అది నీ కోసమేనేమో! అనేక అద్భుతాలను చూచాను. ఏ శక్తుల్నీ ఈ లోకం

నానుండి మరుగుపరచలేదు. నేను ఇంతకాలం ప్రపంచంలో తిరుగుతున్నా, భౌతిక విషయాలలో తలమునకలైనా నేనెన్నడూ బాహ్యరూపాలకు బందీని కాలేదు. అలౌకిక విషయాలలోనే భగవంతుని దర్శించడం నేర్చుకున్నాను.

"ఆకాశంలో వెలుగు పరదాల మాటున, నీ కమనీయ రూపాన్ని అంతర్ దృష్టితో దర్శించాను. తొలి సంధ్యలో కాంతిసోపానాలు అధిరోహిస్తూ వెచ్చని ఉషస్సును మత్తుగా అనుభవించాను. అపరాహ్న వేళ, సూర్యతాపానికి పగిలిన నేలపై రగిలే మంటల్ని రుచి చూచాను. అర్థరాత్రి ప్రశాంతంగా రోదసిలో పరచుకున్న వెన్నెలలో నీకోసం పరుగులు తీశాను. ప్రతీక్షించాను. అనంతంలోకి సాగిపోయే తారల్ని తీరాలవరకు వెంబడించాను. రేబవళ్లు తమ రహస్యాన్ని నాకు వింగడించి చూపాయి. రోదసీ తీరాలనుండి అవని రహస్యాలు నాకు అందాయి. ఆనంద లహరులు, జ్వాలా తోరణాలు నాకు అవగతాలు.

"గాలి పడవలపై వచ్చే సహజ సంగీతాలు విన్నాను. అవి గంధర్వ గానలహరులై నా చెవులకు సోకాయి. సరోవర నీరాలలో జలకాలాడే వనకన్యలను చూచాను. తమ వెంట పడే ప్రియుల్ని పిల్లగాలులు నాకు చూపించాయి. వేయికిరణాల కాంతిమందిరంలో ప్రచండ రవి కుమారుల్ని చూచాను.

"ఈ వాతావరణానికి ఆవల, దివ్య ఉషస్సు నుండి నీ రథం కదలి వచ్చిందని, నా మనోరథం నెరవేరనున్నదని నా మనస్సు హెచ్చరిస్తున్నది. నా హృదయం చెబుతున్నది. నీ సౌందర్యం స్వర్గలోకానికి చెందినదే అయినా, నీ అధరాల మాధుర్యం చవిచూడాలని నా మనస్సు వేగిరపడుతున్నది. మానవాతీత మైన రసస్పందన ఏదో నాలో కలుగుతున్నది. నీ రూప దర్శనంతో నా హృదయం స్పందించింది. నాది మానవ స్వభావం. ప్రాపంచికమైన మమతలు, బంధాలు నిన్ను అలరిస్తాయని నా కనిపిస్తున్నది. ఈ ప్రపంచంలో జన్మించినపుడు సుఖంగా జీవించాలి. నీ సువర్ణ సుందర శరీరం ఆనందనిలయం కావాలి. నీ ఆకర్షణ, అనుభవం మాధుర్యాలను అందించాలి. అలసటలో దివ్య పారవశ్యం అనుభవం కావాలి. దేవీ! నీ అన్వేషణ ముగించి నన్ను అనుగ్రహించు.

"ఈ దవ్వులనే నా పితృదేవుల ఆశ్రమం ఉంది. ఈ మహావృక్షాల చాటున అది బయటకు కనిపించదు. అక్కడ వేదగానంలో సుస్వర సంగీతం వినిపిస్తుంది. కొమ్మలు, రెమ్మలు సంగీత మాధుర్యానికి పరవశిస్తాయి. సుఖజీవనంలోకి నన్ను నడిపించు దేవీ! ఇక్కడ ఆశ్రమ జీవితం పరమ ప్రశాంతం, నిరాడంబరం. ఈ ప్రపంచంలో అతి విలువైనది యోగాశ్రమ జీవితమే. మా ఆశ్రమాలపై వీచే

పిల్లతెమ్మెరలు పరలోక ప్రశాంతిని జ్ఞప్తికి తెస్తాయి. ఆకాశం కాషాయ వర్ణంలో పరలోక రహస్యాలను తెలుపుతుంది.

"జలాశయాలలో అంతరంగ ప్రశాంతి. నలుదిశల విస్తరించిన మహారణ్యం, కాలాన్ని తమ కౌగిళ్లలో బంధించిన వనదేవతలు కాలాతీత సౌందర్యానికి ప్రతీకలుగా నిలుస్తారు. బంగారు ఉషోదయ కాంతులు మా ఆశ్రమాలకు వెలుగులు. ఈ ప్రశాంత వాతావరణం, దేవీ! నీవు సేద తీరడానికి అనువైనది, అనుకూల మైనది."

సత్య స్వరం ఇంకా వినాలనిపిస్తున్నది. ఆత్రంగా ఆగి... పారవశ్యపు మత్తు నుండి విడివడి ... నెమ్మదిగా పలికింది సావిత్రి : "నన్ను సావిత్రి అంటారు. మద్రరరాజ కుమారిని. మీ రెవరు? మీ శుభనామం ఏది? ఏ క్షేత్రాన్ని పునీతం చేసిన మీ వంశవృక్షం ఏది? ఏ కొమ్మ పుణ్యం చేసుకుని పూచిన పుష్పం మీరు? యవ్వనం అనుభవించవలసిన సుఖభోగాలు వదలి ఈ నిర్జనారణ్యంలో ఉంటున్న కారణం? నిర్మానుష్యమైన ఈ భయంకరారణ్యంలో ఆత్మసాక్షిగా ఒంటరి జీవితానికి హేతువు? నాగరికతకు దూరంగా, నిశ్శబ్దంగా నెలకొన్న నట్టడవి జీవితం మీకు ఎందుకు?'

సావిత్రి సందేహాలకు సత్యవంతుడు ఇలా సమాధానం చెప్పాడు –

"ప్రపంచాన్ని, జీవితాన్ని స్పష్టంగా, సవ్యంగా చూడగల దృష్టి ఉన్నపుడు సాల్వ వంశజుడైన ద్యుమత్సేన ప్రభువు ఈ కొండలకు ఆవలనున్న విశాల సామ్రాజ్యానికి ప్రభువు. ఆ రోజులలో జీవితమే స్వర్గం. ఎల్లెడలా సంతోషం. దక్షిణాపథాన్ని స్వర్గధామంగా మార్చిన రోజులవి. కాని విధి వక్రించింది. ఆయన బ్రతుకు బాటలలో చీకట్లు క్రమ్మాయి. దేవతల అనుగ్రహం దూరమైంది. ఇచ్చిన వరాలను ఉపసంహరించుకున్నారు. ఆయన కళ్లలోని తేజస్సు తొలగించారు. జగన్మాత అనుగ్రహం ఆయనకు లేకుండా పోయింది. దృశ్య ప్రపంచానికి దూరమైనాడు. చూడగల వారి చూపుకు అంధుడైనాడు.

"ఆయనకు ఇప్పుడున్నవి రెండూ ఏకాంతాలే. ఒకటి అంతరంగం. అది ఎప్పుడూ ఏకాంతమే. రెండవది ఈ మహారణ్య మధ్యన ఒంటరితనం. ఆయన కుమారుణ్ని నేను. నా పేరు సత్యవంతుడు. ఇక్కడ ఏకాంతంగా ఉన్న నాకు నీ ఉనికి తెలియదు. ఆధ్యాత్మిక శిఖరాలపైన తిష్ట వేసిన నన్ను ఏ ప్రాపంచిక అలజడులు కలవర పరచవు. ఈ నిశ్శబ్ద ప్రపంచమే నాకు రక్ష. సంపదలు పోతే తిరిగి పొందవచ్చు కాని ఆధ్యాత్మికంగా పతనం చెందిన వారిని ఉద్ధరించడం

అసాధ్యం. అలౌకిక సామ్రాజ్యానికి నేను అధిపతిని. ఇది నా స్వారాజ్యం. నేను స్వతంత్రుడను. నిర్మోహత్వంలో నేను భగవంతుని దర్శించగలుగుతున్నాను.

"ఆ జగన్మాత మనోమయ మందిరాలలో నేను స్వేచ్ఛగా తిరుగుతున్నాను. జగన్మాతను దర్శిస్తున్నాను. అమ్మ మందిరంలో ఆత్మసోదరులతో చెలిమి చేశాను. సత్యలోక సుఖాలన్నీ అనుభవించాను. సూర్యకాంతి నా ఫాలభాగాన్ని ముద్దాడింది. రాత్రివేళ చంద్రికలు నన్ను చల్లగా తమ ఒడిలోకి తీసుకుని నిద్రపుచ్చుతాయి. ఈ ప్రపంచంలో అన్ని ఉషస్సులు నావే. ప్రతి ఉషస్సు నేనే. ఈ వన సౌందర్యం వదలలేక ఎండలో వానలో తిరుగుతుంటాను. విశ్వవాణికి నేను తొలిశ్రోతను. నా ఆత్మ అసంతృప్తి ఎరగదు. మనిషి పుట్టుక దైవసంకల్పమని, సుఖదుఃఖాలు జీవికి సహజమని, నన్ను ఈ ప్రపంచంలోకి పంపకముందే నా అంతరంగం స్పష్టంగా నాకు తెలియచేసింది.

"నా మేధకు పూర్వప్రజ్ఞ కొంత కొంత తెలుసు. తొలుత భౌతిక తత్వం నా ఆత్మను ఆవహించినపుడు నా దివ్యత్వం తరిగిపోసాగింది. ఏదో జడత్వం నన్ను ఆవహించి నా చైతన్యాన్ని నిద్రపుచ్చింది. ఈ ప్రపంచం విస్తృతంగా, వికృతంగా కనిపించింది. నా ఆత్మ ప్రపంచం నా లోపలికి పోయి పోయి అంతర్లోకంగా మారిపోయింది. ఆ లోకం ఇప్పుడు అంతర్దృష్టికి, ప్రజ్ఞకు మాత్రం అందుతుంది. బాల్యంలోనే నా దృక్పథం, ప్రవర్తన మారిపోయాయి. కన్నులు చూడగలిగిన అందాలను నా మనోనేత్రం మరో కొత్త కోణం నుండి చూచేది. ఆ రూపాలు నా ఆత్మను అలరించేవి. వశపరచుకునేవి. బాల్యంలోనే ఒక అజ్ఞాతశక్తి నాచేయి పట్టి నడిపించింది. నాకు తెలియని చిత్రాలు, రూపాలు నా కళ్లలో కదిలేవి. అవి చెరగని ముద్రలుగా నా మనస్సులో నిలిచిపోయాయి.

"నా చిన్ననాటి నేస్తాలందరూ దివ్యసుందరులే. ఆశ్రమభూములలో నా జీవితం ఆనందంగా సాగుతున్నది. నాలో అనేక కొత్త ద్వారాలను తెరచి, కొత్త లోకాలను చూపింది. సంధ్యవేళ సంచరించే హరిణాలు నాకిష్టం. చీకటి సరస్సులో చేపల వలె మెరిసే తారకలు నాకిష్టం. అవి పరమాత్మ దివ్యనేత్రాల నిపిస్తాయి. సరోవరాలలో విహరించే రాయంచలు నా కలల్లో కదలాడే దివ్య రోచిస్సులు.

"పవనుని ప్రేమస్పర్శకు వజవజ వణికే పత్రాలు, అనంతసీమలలో ఉద్భవించే మారుతాలు నా అంతరంగానికి పరిచయాలు. అక్కడ తరులు, గిరులు, భగవద్భావనల వలె నిశ్చలంగా ఉంటాయి. అక్కడ సీతాకోక చిలుకలు చైతన్య పుష్పాలు. చిత్రవిచిత్ర విన్యాసాలు చేసే పక్షుల సమూహాలు, పురివిప్పి నాట్యం

చేసే మయూరాలు అన్నీ నా మనోఫలకంపై ఎప్పుడూ కనిపిస్తుంటాయి. అక్కడ రాళ్లలో, చెట్లలో నా ప్రతిరూపాన్ని చూచుకుంటాను. ఆ ప్రశాంత వాతావరణంలో ప్రణవనాదం వినిపిస్తుంది. పరమాత్మ సందేశాలకు అది సంకేతమేమో! ప్రకృతి నాదాలలో పరమాత్మ స్వరాన్ని వినగలను. ఏదో ఒక స్పర్శానందం, ఒక వలపు పిలుపు నన్ను మేల్కొల్పుతుంది. కాని పరమాత్మ రూపం అరూపంగానే ఉంటుంది. పరమాత్మ పాదాలను నాచేతులతో బంధించలేను. కాని మానవులలో పరమాత్మ ప్రతిరూపాన్ని చూడగలను. అవి అణువులుగా మనగలుగుతున్నాయి. ప్రతిమనిషి తనకోసం తానుగా జీవిస్తున్నాడు. తక్కినవారితో తాత్కాలిక బంధాలు ఏర్పరచు కుంటున్నాడు. కానీ తన లోపలి తనను అన్వేషించడం లేదు. ప్రాపంచికమైన సుఖదుఃఖాలకు తలవంచి బ్రతుకుతున్నాడు తప్ప తనలోని పరమాత్మకు తలవంచి నమస్కరించడం లేదు, తన ఆత్మను గుర్తించడం లేదు.

"నేను ప్రకృతిలో శ్రుతి కలిపి తారలతో కలిసి పాడాను. అర్ధరాత్రి సమయాల్లో భగభగమండే అగ్నిగోళాలు చూచాను. జ్యోతిర్మండలం నుండి ప్రసరించే తేజస్సును జగన్మాతగా గుర్తించాను. అరణ్యాలలో మహర్షులతో కలిసి తపస్సు చేశాను. మహాచైతన్యం నాలోకి ప్రవహించి వచ్చి నన్ను జాగృతపరచింది. ఇప్పుడు అందరిలోను పరమాత్మను దర్శించ గలుగుతున్నాను. అతీంద్రియ ప్రజ్ఞ నాలో ఉంది. భౌతికత్వంలో పరమాత్మ మేల్కొనదు. ఆత్మ అనశ్వరంగా ఉండి భౌతిక శరీరం నశిస్తుంది. శరీరం కృశించి, నశించి, మృత్యువుకు తలవంచి, మృత్యువు వెంటపడి పోతుంది. దానికి అజ్ఞానం ఆధారం, శూన్యం దాని అవధి.

"దేవీ! నీ రాకతో ఈ వ్యవస్థ మారుతుందని నా నమ్మకం. నీ రూపం వెనుక జగన్మాత ప్రజ్ఞను దర్శించగలుగుతున్నాను. నీ మాటలలో దివ్యవాణి వినిపిస్తున్నది. నా భౌతిక అజ్ఞానం తొలగిపోవాలి. ఆత్మ వలె నేను, నా శరీరం స్వతంత్రం కావాలి. స్వతంత్రమైన ఆత్మ అజ్ఞానాన్ని, మృత్యువును జయిస్తుంది."

సావిత్రి సత్యవంతునికి సుస్వరంతో సమాధానం పలికింది –

"సత్యా! మీ సుమధుర స్వరం ఇంకా యింకా వినాలనిపిస్తున్నది. మీ అంతరంగం, ఆంతర్యం నన్ను తెలుసుకోనివ్వు. మనం ఒకే ఆత్మగా చాలాకాలం నుండి కలిసి జీవించామని నాకు తెలుసు. ఒక ప్రజ్ఞాకిరణం నాలో ప్రవేశించేవరకు భౌతికంగా నిన్ను నేను సంపూర్ణంగా అర్థం చేసుకునేవరకు నాలోని మృత్యురాహిత్య స్థితికి చేరుకునేవరకు చెప్పు. ఈ ప్రపంచంలో జీవిస్తున్న మనుషులలో, రూపాలలో,

శూన్యాలకు ఆవల ఎక్కడో నా ఆత్మ అన్వేషిస్తున్నది నిన్నే నని, ఆ వ్యక్తివి నీవేనని అనిపిస్తున్నది."

సావిత్రి సుస్వర తరంగాలు ఆతని గుండె లోతులను తట్టి లేపినట్లయింది.

"ఓ సువర్ణసుందరీ! మాటలకు అందని ఎన్నో విషయాలను నీకు విన్న వించుకోవాలని ఉంది. నీవు నానుండి గ్రహించ గలిగినదంతా అనిర్వాచ్యమే. అంతా ప్రేమస్పర్శతో వ్యక్తం కావలసిందే, అలా గ్రహించవలసిందే. దేవతల కారుణ్యం జాలువారిన మధురక్షణాన నీ సాన్నిహిత్యం నా జీవితానికి కొత్త ఆశలు తొడిగింది, కొత్త రూపులు దిద్దింది. నేను ఇంతకాలం నిరీక్షిస్తున్నది ఈ సుముహూర్తం కోసమేనని నాకు తెలుసు. ఈ మధుర సంగమం కొరకేననీ తెలుసు. నా జీవితానికి అర్థం కోసం తిరిగి చూస్తే, పరమార్థం ఇదేనని ఇప్పుడు తెలుస్తున్నది. ఈ భూమిపైన నా ఆత్మ ఇంతకాలంగా నీకై నిరీక్షిస్తున్నది. ఇంతకాలం నేనూ అందరిలా జీవించాను. అందరిలా కష్టపడ్డాను. నష్టపోయాను. కేవలం ఒక మనిషిగా జీవించాను."

"ప్రతిమనిషిలో పూర్వసంస్కారాలు అంతరంగంలో కదులుతూ, తదను గుణంగా ప్రవర్తింపచేస్తుంటాయి. రూపొందవలసిన ఒక 'సత్యం' మనిషి మదిలో అరూపంగా ఉంటుంది. లక్ష్యసిద్ధికి ఔన్నత్యం తోడుపడాలి. భౌతికరూపాలలో జీవం కానిదేదో అస్పష్టంగా తోస్తుంది. అది సజీవరూపంగా మారాలి. భావదీప్తిలో ఆ రహస్యానికై నాలో వెతుక్కున్నాను. భాషకందని రీతిలో అది మిణుకుమని మెరిసింది. కనిపించీ కనిపించని దానికొరకై తప్పటడుగులు వేశాను. నా ఆత్మ హెచ్చరించింది. పరమాత్మ నా గమ్యం నిర్దేశించింది. అయినా సత్యపథాన నడక సాగించలేకపోయాను.

"కనిపించని రూపాన్ని మనస్సులో బంధించాలని వ్యర్థంగా ప్రయత్నించాను. మానవ సహజమైన మేధతో దానికి నియమాలు ఏర్పరచాను. 'సంయమం' సాధ్యపడలేదు. పరమాత్మ తత్వాన్ని, స్వ-తంత్ర ప్రతిపత్తిని సంకుచిత బుద్ధితో బంధించి, ప్రాపంచిక చట్రంలో బిగించ యత్నించినప్పుడు 'సత్యం' నామ మాత్రంగా మిగిలింది. మహత్తర శక్తిని అయిదువేళ్లతో పట్టుకోగలమా?

"వెలుగులో వెతికితే చీకటి కనిపించనట్లు 'సత్యం' మరింత దూరానికి తప్పుకుంది. ఎంత ప్రయత్నించినా సృష్టి రహస్యం అణుమాత్రం అర్థం కాలేదు. అసలు సృష్టికర్త ఎక్కడ ఉన్నదీ తెలిసిరాలేదు. ఆయన ప్రణాళికలు మానవ మాత్రులకు అర్థంకావేమో! లోవెలుగుల్లోకి చొచ్చుకునిపోయి అంతర్దృష్టితో

అన్వేషించాను. మనిషికి, మనస్సుకు ఊడిగం చేస్తున్న భౌతిక బంధాలు కనిపించాయి. వాటిని త్రెంచివేస్తేగాని సృష్టిరహస్యం తెలియదు. అదే మార్మికత. మేధతో వెతికితే సృష్టిరహస్యం తెలియకపోగా మరింత క్లిష్టమవుతుంది. మరింత దూరమవుతుంది.

"సుందరరూపాలలో, కళాఖండాలలో ఆత్మకై అన్వేషించాను. కాని ఏ రూపంలోను అంతర్గత శక్తి అభివ్యక్తం కాలేదు. హృదయం మాత్రం అన్వేషణతో కాస్త స్పందించింది. ఆత్మ స్పందించినప్పుడు మాత్రమే చిన్నసంకేతం అందు తుంది. ఆత్మ తన ఔన్నత్యాన్ని, రహస్యాన్ని ధ్యానంలో నిక్షిప్తం చేస్తుంది.

"ఒక్క కాంతికిరణాన్ని చూడగలిగాను తప్ప సంపూర్ణ కాంతిగోళాన్ని దర్శించలేక పోయాను. ప్రాపంచికమైన మోహాలు ఆత్మను దరి చేరనివ్వవు. ఆత్మను తెలుసుకున్నప్పుడు ఈ ప్రపంచాన్ని విస్మరిస్తాను. నా సర్వస్వం భగవంతు నికి సమర్పిస్తే తప్ప భగవదనుగ్రహం కలగడం లేదు. ఆత్మదర్శనం కావడం లేదు. ఇహలోకానికి పరలోకానికి, బాహ్యప్రపంచానికి అంతరంగానికి మధ్యగల సంబంధం ఆత్మను సత్యంతో అనుసంధించినప్పుడు మాత్రమే తెలుస్తుంది. ఈ ప్రపంచం ఏర్పడడానికి హేతువు సంకల్పం. ఆ సంకల్పం రూపుదిద్దడానికి మార్మికత అవసరం. అమృతత్వం అంటే ఏమిటో ఇప్పుడు అర్థమవుతోంది.

"నీ పద కంకణ నిక్వాణంలో నాకు పరమార్థం తెలిసింది. నీ పాద మంజీర నాదాలు నా చెవులకు సోకగానే తెలిసింది. నీ ముఖారవిందంలో పరమాత్మ దర్శనమైంది. దివ్యతేజస్సు కనిపించింది. నీ వలన నేను మరో ప్రపంచం చేరగల ననిపిస్తోంది. దివ్యస్వనాలు నా చెవులకు వినిపిస్తున్నాయి. నీ చూపులోంచి ఒక చైతన్యప్రవాహం నాలోకి ఉరకలు వేస్తూ వస్తున్నది. రోదసీకుహరంలో ఒక కొత్త తార తళుకొత్తింది. నీ చూపులో తొణికే అనురాగం, నీ ప్రేమ నన్ను రగిల్చి, నా మనస్సు బ్రహ్మానందస్థితిలో ఋషిత్వం పొందేలా చేసింది. సచ్చిదానంద తరంగాలు ఉప్పెనగా నన్ను చుట్టుముట్టి నా అంతరంగాన్ని మార్చివేశాయి. నీ రాకతో ఇక్కడి గాలి, నీరు, నేల పునీతమైనాయి దేవీ! విశ్వం కళ్యాణోత్సాహం పొందుతోంది. రవి తేజస్సు నీ తేజస్సుకు ఛాయ మాత్రమే, నీ చూపు నాలో పరివర్తన కలిగించింది. ఆ తేజోరథాన్ని దిగి నా దగ్గరకు రా దేవీ! ఈ పచ్చిక బయళ్లు, ఈ వన భూములు మనవేనని చెప్పు. ఇక్కడ మార్మిక క్షేత్రాలన్నీ మనకోసం ఏర్పడినవే. ఈ పర్వతగుహలు నీ రూపాన్ని ఇంతకాలం భద్రంగా ఆరాధిస్తున్నాయి. ఆ సుఖాలు, ఆనందాలు నీవి చేసుకో దేవీ!

"ఓ ఆనందమయీ! నీ బంగారు పాదాలు నేలనాన్చి నడిచి రా! క్రిందికి దిగి రా! మేము జీవిస్తున్న ఈ లోకాన్ని ఆనందమయం చేయి. ఓ సుకుమారీ, సావిత్రీ, సుగాత్రీ! నా తృప్తికోసం, ఆనందం కోసం నీ ఆనందాన్ని, సంతోషాన్ని నా జీవితంలో ప్రవేశపెట్టు. నా హృదయమే నీకు ఆలయంగా చేస్తాను, రా దేవీ! ఆత్మలు సమావేశమయ్యే వేళ ఇది. నా కోరిక మేరకు నా పర్ణశాలలో ప్రవేశించు. ఈ లతా మండపాలలో విశ్రమింతువు రా. సుమసౌరభాలు వెదజల్లునంతకాలం, పక్షులు పారవశ్యంతో పాడునంతకాలం నీ హృదయస్పందనలు నావిగా మార్చి నాలో నీవై జీవించు దేవీ!"

సత్యవంతుని ప్రార్థనకు సావిత్రి పరవశురాలైంది. ఆమె చూపులో అంతరాత్మ అంగీకారం కనిపించింది. తడబడే మాటలు ఆమె పెదవులు దాటడానికి తొందరించాయి. ఒక్క మాటలో ఆమె తనను నివేదించుకున్నది.

'సత్యా! నీ గురించి విన్నాను. నీవు నాకు తెలుసు. నాకు తెలుసు నీవు నేనేనని ... నేనే నీవని."

ఆమె తన మనోరథం దిగివచ్చింది. మృదువుగా, నెమ్మదిగా అడుగులు వేస్తూ వచ్చింది. ఆమె ధరించిన దివ్యాంబరాలు చిరుగాలికి రెపరెపలాడాయి. రెక్కలు ముడిచిన పక్షివలె ఆమె శరీరం సిగ్గులో ఒదిగిపోయింది. పసిరికపై ఆమె బంగారు పాదాలు కనలినట్లయింది. ఆమె పైన సోకిన కిరణాలు పూర్వస్మృతులను కదిలించినట్లయింది. ఆమె నడచినంతమేర నేల ఆమె అనురక్తిని, వాంఛను ఆకళించుకున్నది. సూర్యకాంతిలో వెలవెలపోయే మిణుగురు వెలుగుల వలె ఆమె కాంతిచ్ఛటలకు సూర్యకిరణాలు చల్లబడ్డాయి. వసంతసమీరాలు నెచ్చెలులై ఆమె ముంగురుల్ని సవరించాయి. చిరుహాసాలు వలపుమాలలు కట్టగా ఆమె వేళ్లు పూలకు మెత్తదనం అలదినట్లయింది. ఆమె చరణాలు కళ్యాణగీతానికి చరణాలు. అతను పల్లవి. రంగుల సమ్మేళనం అది. పరిమళాల కలపోత అది. వాంఛల సంకేతాలను కలగలిపి పవిత్రతను ప్రేమతో ముడివేసుకున్నారు. ఒక్కటైనారు సావిత్రీ సత్యవంతులు.

తన అనురాగాన్ని ఆరాధనగా మార్చి తన జీవిత సర్వస్వాన్ని అతనికి సమర్పించుకున్నది. తన ఆత్మ వాంఛించిన వ్యక్తి సాన్నిధ్యంలో మధురబంధంలో బందీ కావాలన్న తపనతో చేతులు చాచి ప్రియుని హృదయంపై వాలిపోయింది.

వరాలిచ్చే దేవుడు కరుణించి ప్రత్యక్షమైనట్లు, చీకట్లను చీల్చుకుని వెలుగు ప్రసరించినట్లు, తన ప్రణయమూర్తిని సౌందర్యంతో ఆరాధించడానికై

పాదాభివందనం చేసింది. తన జీవితాన్ని అతని ముంగిట పరచింది. తన శరీరం అతనికి ఆనందనిలయంగా చేసింది. తన హృదయస్పందన అతనికి ఆనందహేల అయింది. అతను వంగి ఆమెను తనలో పొదువుకున్నాడు. కళ్యాణకాంక్ష కోర్కెలపురి విప్పింది. ఇరువురు బాహ్యప్రపంచాన్ని మరచి ఎప్పుడో తమదైన తావుకు తిరిగి చేరినట్లు సేద తీరారు. ప్రపంచంలోని సర్వసుఖాల్ని తానే అనుభవిస్తున్న తమకంతో సావిత్రిని తన ఆలింగనంలో బంధించాడు. ఆ పరిష్వంగసుఖం జన్మజన్మల ఆత్మీయతను స్ఫురింపచేసింది. అది అనుబంధానికి సంకేతమైంది. అది పారవశ్యానికి తొలకరి చినుకు. సంపూర్ణ జీవితానికి సంక్షిప్త భాష్యం. ఇరువురు కలుసుకున్న ఆ క్షణం నదీసాగర సంగమం. ఆమె సర్వస్వంగా అతనిలోకి ప్రవహించింది.

ఒక ఆత్మ పరమాత్మలో లయం కావడానికి ఎంత తొందర! బ్రహ్మానందానుభూతికి ఎంత ఆత్రుత! ఆమె అతనిని చేరిన చైతన్యతరంగం. అతను తరంగాన్ని తనలో కలుపుకున్న సాగరుడు. రెండు వ్యక్తిత్వాలు ఏకమైన వ్యక్తిమత్వం అది. ఆకాశం భూమిని గాఢంగా ఆలింగనం చేసుకుంది. అతను ఆనందపారవశ్యంతో ఆమెను తనలోకి చేర్చుకున్నాడు. ఈ ప్రపంచాన్ని తమలో ఐక్యం చేసుకున్నారు. ఆ ఏకాంతంలో వారు ఏకమైనారు. ఆ ఏకాంతం వారిని మమేకం చేసింది. విశ్వాత్మ ఒక విశ్వాన్ని క్రమ్మినట్లు ఆమె తనను ప్రేమలో ముంచివేసింది. అతను ఆమెను ఆక్రమించాడు. మానవుడు అమరత్వంతో పునీతుడైనాడు. పరిమితం అపరిమితంలో లయించింది. ఆమెలోకి తాను చొరబడి తన లోకి ఆమెను తీసుకున్నాడు. ఒకరిలో ఒకరు లీనమై కాలాన్ని స్తంభింపచేసి, తురీయస్థితికి చేరుకున్నారు.

ఇప్పుడు ఈ ప్రపంచం ఇద్దరికీ కొత్త. అది కొత్త ప్రపంచం. అది ప్రణయ ప్రబంధం. సంయోగంలో ఇరువురు సమభాగులే. ఇరువురి ఆనందం ఒక్కటే. వారి సమాగమం జీవాత్మ పరమాత్మల యోగక్రియ. వారి కళ్యాణానికి పురోహితుడు కర్మసాక్షి. హృదయాగ్ని సాక్షిగా వారు ఏకమైనారు. అది భగవంతునికి భగవతికి భూమిపైన జరిగిన కళ్యాణం. జగన్నాటకంలో అదొక కొత్త అంకం. సత్యయుగానికి యుగకర్తలు, సత్యయోగప్రవక్తలు వారు. ఆ తపోవన భూములలో పక్షుల కలరవాలే మంత్రాలు. పవన స్వనాలే వింజామరలు. ప్రేమైకజీవులకు ప్రాపంచిక లాంఛనాలు అవసరం లేదు.

అప్పుడొక మహాద్భుతం జరిగింది. పరిణామంలో అది గొప్ప మలుపు.

జడప్రకృతిలో చైతన్యం చొరబడింది. ఆ కలయిక సన్నని బాటలో. ఆ బాట వారిని ప్రపంచం కడపటి అంచువరకు నడిపిస్తుంది.

అడవిబాట చివరన వుంది పర్ణశాల. అది తాను నివసించవలసిన చిన్న కుటీరం. అది సత్యవంతుని ఆశ్రమం. లతా నికుంజాలు, పూతీ వెలు ... అది స్వప్నసదృశం. ఆ కుటీరంలో తాను ఆనందంతో అలసిపోయి, సుఖాల బరువుకు నలిగి, రేగిన జుత్తుతో ఆవిరులైన స్వేదంతో నిద్రిస్తున్నట్లు భావించింది. ఆ కుటీరం బయట, నలుదిశల దట్టమైన అరణ్యం. తన అదృష్టానికి మురిసి పోయింది. ముచ్చట పడ్డది.

పారవశ్యంలో మాటరాని మనోహర ముగ్ధ ఆమె. అతిశయించిన ఆనందం మాటలను బయటకు రానీయదు. మదన కుతూహలంతో ఆమె సత్యవంతునితో అన్నది –

"నా హృదయం ఈ అరణ్యంలో చిక్కుపడిపోయింది. నేను దూరమైనా నా హృదయం నీ కుటీరానికే అంకితం. నా అన్వేషణ పూర్తయింది. కాని ఒక్కసారి నా పితృదేవులను దర్శించి రావాలి. పుట్టినింటితో గల అనుబంధం ఇకపైన ఉండదు కదా! ఆ ఇంట ఇంతకాలం వినిపించిన నా స్వరం ఇకపైన వినిపించదు. తిరిగి వెళ్లనవసరంలేని విధంగా మరలి వస్తాను. అది శాశ్వత ప్రస్థానం. సమాగమంలో పొందిన ఆనందం ఒంటరితనంలో కలగదు. విధి మనల్ని విడదీయలేదు."

సావిత్రి సర్వాలంకృతమైన రథం అధిరోహించింది. మధ్యం దినార్కుని ప్రచండ తాపాన్ని లెక్కచేయకుండా మనోవేగంతో రథం బయలుదేరింది. హృదయం ఉద్విగ్నమైంది. గతం మనస్సులో మెదులుతున్నది. తాను ముందుకు పోతున్నది ... చల్లని గాలులు, నల్లని నీడలు దాటి రథం అరణ్య మార్గాన పోతున్నది. ఆమెకు సత్యవంతుని రూపమే కనిపిస్తున్నది. ఆశ్రమ కుటీరాలు క్రమంగా దూరమైనాయి. అది ఆమె ఆనందానికి కొత్త వనస్థలి.

ఆత్మకు ఆటపట్టు ప్రేమాలయం.... స్వర్గం కాదు.

అది ఆమెకు తెలుసు... అందుకే ప్రేమకై పరుగులెత్తింది.

17. విధివిలాసం

సావిత్రి తల్లిదండ్రుల ఆశీస్సులు పొందడానికి తిరిగివచ్చింది. తన హృదయాన్ని సత్యవంతుని వద్ద ఉంచింది. ఆమె వచ్చేసరికి నారదమహర్షి అశ్వపతితో సంభాషిస్తున్నాడు. రాజదంపతులు నారదమహర్షికి అతిథిపూజలు చేశారు. నారదుడు సూచనప్రాయంగా విషయాన్ని అశ్వపతికి అందించాడు. వారి సంభాషణలో రాణికి అశుభం తోచింది. సావిత్రి తన నిర్ణయం తెలియచేసింది. సత్యవంతుడు ఒక్క సంవత్సరం కన్న జీవించడని, తన నిర్ణయం మార్చుకొనమని నారదమహర్షి సలహా ఇచ్చాడు. అశ్వపతి కూడా అదే సలహా ఇచ్చాడు. సావిత్రి తన నిర్ణయం మార్చుకోలేదు.

ఇక్కడ కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. విధి బలీయమా? జరిగేది జరగక మానదా? అయినపుడు తపస్సు చేయడం దేనికి? మంచి పనులు, పూజలు, యోగం అన్నీ వృధా కావలసిందేనా? సావిత్రి విధితో పోరాడదలచింది. మృత్యువును సైతం ఎదిరించ నిశ్చయించింది. అంటే విధి కన్న, మృత్యువు కన్న ఆత్మశక్తి గొప్పదని అర్థం. రానున్న ఉపద్రవం గురించి సావిత్రి విచారించలేదు. మృత్యువు సత్యవంతుని కబళిస్తుందని తెలిసీ చలించలేదు. తను నమ్మిన సత్యం వేరు. తనకు ఆత్మవిశ్వాసం ఉంది. ఆత్మశక్తి ఉంది.

నారదమహర్షి, అశ్వపతి, రాణి, సావిత్రి నలుగురు పాత్రలు. రాణి సామాన్య మానవ ప్రవృత్తికి ప్రతినిధి. ఆమె దృష్టిలో ప్రేమ, పెళ్లి, మృత్యువు, కర్తవ్యం – అన్నీ మామూలు. అశ్వపతి యోగి, జ్ఞాని, మేధావి. నారద మహర్షి అశ్వపతి కన్న పైమెట్టులోనివాడు. మూడు లోకాలు సంచరించ గలడు. మూడు కాలాలు తెలుసుకోగలడు. నారదమహర్షి, సావిత్రి జ్ఞానమండలాలలో ఒకరిని మించి ఒకరు వెళ్ళగల సమర్థులు. అధిమానసిక స్థాయి వరకు వెళ్లగలిగినవారు. సావిత్రిది జగన్మాత అంశ. మృత్యుం జయత్వం సాధించడానికి భూమిపైన అవతరించింది. ఆమె లక్ష్యసాధనకు 'సత్యం' ఆలంబన.

మానస మండలాలను, శూన్య సరోవరాలను దాటి, తేజోపూర్ణమైన సువిశాల గగనాలను దాటుకుంటూ ఊర్ధ్వలోకాలనుండి దివ్యశరీరుడైన నారదమహర్షి భూలోకం వైపుగా కాంతివేగంతో పయనిస్తున్నాడు. గగన విహారమే ఆయనకు గానం. గానమే ఆయన వాహనం. నభోమండలంలో తన చుట్టూ తాను తిరిగే గోళం భూమి ఒక్కటే. సూర్యరశ్మి సోకి భూమి పాక్షికంగా మెరుస్తున్నది. ఒక అదృశ్యహస్తమేదో భూగోళాన్ని త్రిప్పుతున్నట్లు తోచింది. నారదమహర్షికి మానవసంచారం గల భూమి అంటే ఇష్టం. ఆయన దేవతలకు, మానవులకు మధ్యవర్తి. పరిణామంలో ఆయనది ప్రముఖపాత్ర. ఆయన అమరలోకాలను వదలి మృత్యువుతో, ఆశ నిరాశలతో పోరాటం జరిపే మర్త్యలోకానికి దిగివచ్చాడు.

ఆయన ఆవాసం సత్యలోకం. అది సదా నిశ్శబ్దం. నా రదం. ఆయన నిష్కళంక, అలౌకిక లోకాలు దాటి భూ ప్రపంచం చేరుకున్నాడు. అనేక అంధకార శక్తుల్ని దాటివచ్చాడు. వియన్మండలంలో ఎన్నో జ్వలితగోళాలు, అగ్నిగోళాలు, వాయుగోళాలు. అవి రోదసీ సాగరంలో తేలే పడవలు. భూలోకపు వాతావరణంలోకి రాగానే గాలి కదలిక అతనిలో చలనం కలిగించింది.. ఆనందం తొణికిసలాడింది. ఒక రహస్యశక్తి భూగోళానికి ఉచ్ఛ్వాసనిశ్వాసలతో ఊపిరిపోస్తుంది. ప్రాణా యామం జరిగినంత కాలం జీవం తొణికిసలాడుతుంది.

సృష్టికి మూలమైనది అగ్ని. అది రహస్యంగా మూడుశక్తుల్ని ప్రభవిస్తుంది. భూమి మనుగడకు, మనిషి మనుగడకు ఆ మూడు శక్తులు అవసరం. పాలపుంతలోని గోళాలు, గ్రహాలు తమ ఉచ్ఛ్వాస నిశ్వాసలతో భూమికి అండగా నిలుస్తున్నాయి. అవే భూమికి ఆధారాలు. సూర్యతేజస్సు ప్రిదిలి శకలాలై, కాంతి కణాలైనాయి. నారదమహర్షి సూక్ష్మశరీరి. ఆయనకు భౌతికమైన అవరోధాలు ఏవీ అడ్డురావు. ఆయన మానవజీవితాన్ని, మృత్యువును అనుభూతించాడు. పదార్థ భౌతికస్థితిలో ప్రవేశించినపుడు మృత్యువునీడ పడక తప్పదు. సూక్ష్మశరీరం మృత్యువును అనుభవించింది. భిన్నరూపాలలో సారూప్యత కనిపించింది. అదే భిన్నత్వంలో ఏకత్వం. అన్నిటిలోనూ నిద్రిస్తున్న ఆత్మ ఉంటుంది. ఆయన విశ్వశిల్పి

రచనా చమత్కృతికి అచ్చెరు వందాడు. సృష్టిలోతుల్ని, వైశాల్యాలను గమనించాడు. కనిపించని సంకేతాలను అంతర్దృష్టితో గుర్తించాడు. సృష్టిలో దేవతల నిర్వహణ అవిరామంగా సాగుతున్నది. అలాగే మానవజీవనం అవిశ్రాంతంగా సాగుతున్నది.

ఆలోకన తర్వాత నారదుని గొంతులో స్వరం మారింది. ఆనందం స్థానంలో విషాద జీర. ఆయన గాన ఝరి నిలిచిపోయింది. మహతి మొరాయించింది. భూ లోకంలో బ్రహ్మానందం గురించి పాడడం కాని పని. ఏ దేవుని ఇక్కడ నుతించడం, స్తుతించడం అనవసరం. ఇది మృత్యులోయ. ఆయన మనస్సులోకి విధి, అజ్ఞానం, ప్రపంచం పుట్టుక, మనుగడ, ఆనందాలు వచ్చి చేరాయి. లోకం, నక్షత్రాలు, జీవం ఎలా ఏర్పడుతున్నాయో అవగతమైంది. తనలోనూ ఆత్మ కదలికను గుర్తించాడు. తన ఆత్మ కదలి, పరమాత్మకు నివేదన అయింది. ఆత్మకు తన శక్తి తెలియదు. భావన, సంకల్పం, ఇచ్ఛ ఆత్మకు అండగా ఉంటాయి. ఆ మూడింటి ప్రమేయం లేకుండా ఆత్మ జాగృతం కాదు. అది నిగూఢ రహస్యం.

వెలుగులా మారిపోవాలన్నది అంధకార తొందర. చీకటి తెరలలో ప్రేమ పరిమళిస్తుందని గుర్తించదు. మానవుడు మృత్యువు గురించి పట్టించుకోడు. అమరత్వాన్ని ఆశిస్తాడు. నారదమహర్షి తన మహతిపై విశ్వగీతం ఆలపించాడు. చీకటి లోతులలో దాగిన సత్యం గురించి, ప్రకృతి గుండెలో దాగిన ప్రజ్ఞ గురించి, జగన్మాత సృష్టి నిర్వహణలోని నిమగ్నత గురించి, ఆమె సంకల్పంలో రూపాంతరం చెందే మహత్తుల గురించి, క్షతాలలో నక్షత్రాలలో నిద్రాణంగా ఉన్న జీవం గురించి, మానవమేధ గురించి, జీవచైతన్యం గురించి గానం చేశాడు.

ఒక మహాద్భుత సంఘటనకు తాను నాందిగీతం ఆలపించాడు. దివ్యత్వంపై కప్పిన ముసుగు తొలగనున్నది. సచ్చిదానందకారకులైన దివ్యమూర్తులను, అనంతశక్తిని, హృదయమాధుర్యాన్ని నుతించాడు. ఒక హృదయానికి స్పందన కలిగించే హృదయం, ఒక భావాన్ని రగిల్చే భావం, ఆనందం కలిగించే అనుభూతి, తాదాత్మ్యత, బ్రహ్మానందం ఆయన మహతీ నాదాలలో రవళించాయి. నారద గాన మాధుర్యానికి భూతప్రేతాలు కలవరపడ్డాయి. తమకు కాలం సమీపించిందని అనుమానించి తల్లడిల్లాయి. క్షుద్రశక్తులు తమకు ఓటమి లేదన్న అహంకారంతో ఉంటాయి. ఇప్పుడు ఓటమికి సిద్ధమైనాయి. తామూ పరమాత్మను చేరగలమన్న ఆశ. కొత్త అవకాశం కలిగినందుకు హ్లాదం.

మహర్షి ఆగమనం సంభావించాడు అశ్వపతి. అశ్వపతి సూక్ష్మశరీరంతో అమరలోకాలు తిరిగివచ్చినవాడు. దివ్యలోక మర్మాలు ఎరిగినవాడు. మానవ

రూపంలో ఉన్నా పరప్రజ్ఞ కలవాడు. ఆయన దేవర్షి రాకను భావించాడు. ఒక విద్యుల్లత మెరుపువలె, దివ్యత్వం దిగివచ్చినట్లు ఆనందార్ణవంపై తేలి, తేజోపథాలు దాటి, ఆకాశమార్గాన దిగివచ్చాడు. మహర్షి వదనంలో నిర్మల తేజస్సు కనిపించింది. ఆయన అరమోడ్పు కన్నులు అరవిచ్చిన పద్మాలైనాయి.

నారదమహర్షి రాక అశ్వపతి ప్రాసాదానికి దివ్యకాంతిని తెచ్చింది. అది మద్రలో పాలరాతి యోగముద్ర. అది రాజప్రాసాదం. మహర్షికి రాజదంపతులు స్వాగతం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. అశ్వపతి ప్రక్కన పట్టపురాణి వివేకవతి. ఆమె రూపం హోమాగ్నిని తలపింపచేస్తుంది. ఆమె సావిత్రిని కన్నతల్లి. జగన్మాతకు మానవరూపం ఇచ్చిన మాతృమూర్తి.

రాజదంపతులు కొంతసేపు ప్రాపంచిక విషయాలు మరచి ధ్యాన మగ్నులైనారు. మహర్షి దివ్యగాన మాధుర్యాన్ని వినసాగారు. మహర్షి రాజప్రాసాదం సమీపించగానే మానవుల మహత్తును, దేవతల ప్రమేయాన్ని, దేవ మానవ సంబంధాల్ని అనుబంధాన్ని, ప్రేమను గానం చేశాడు. మానవ హృదయపద్మంలో దాగిన ప్రేమ గురించి, సహస్రదళ పద్మం గురించి సంకేత సత్యాల గురించి గానం చేశాడు.

స్పర్శకు స్పందన, ఆనందానికి అనుభూతి సహజం. నాదం బ్రహ్మానందాను భూతి కలిగిస్తుంది. స్పందన వల్లనే ప్రేమ పుష్పిస్తుంది. పుష్పవతి తన మనస్సుకు నచ్చిన వానిని ఆశ్రయిస్తుంది, ప్రేమిస్తుంది. అనుభూతి రగలి, పగిలి ఆనందం పరవళ్లు తొక్కుతుంది. పదార్థంలో కదలిక పేరు చైతన్యం. మనిషి స్వప్నించడం చైతన్యం. ఈశ్వరార్చన చైతన్యం. మహర్షి గానానికి వసుంధర పులకించింది. భూమి పరవశించింది. ఎలుగెత్తి పిలిచినట్లు, ఆ పులకింతకు సావిత్రి రథం దిగివచ్చింది. ఆమె రాకతో పరిసరాలు వెలుగులు నింపుకున్నాయి.

ఆమె చూపులో కొత్తదనం, వ్యక్తిత్వంలో పూర్ణత్వం కనిపించాయి. ఆమె కళ్ల నుండి జాలువారుతున్న తేజస్సు స్వర్గలోకం నుండి వచ్చిన రాయబారి కర్తవ్యపాలనలో విజయం పొందిన తృప్తి ఆమెలో కనిపించింది. తన ప్రేమకు దేవతల ఆమోదం లభించింది. విజయగర్వంతో ఆమె తండ్రి సింహాసనం ముందు నిలిచింది. దివి నుండి దిగివచ్చిన దేవత. వసుధకు కొత్తసౌందర్యం రూపుదిద్దు కున్నది. ఆమె నవవికసిత పుష్పం. ప్రేమపూజకు సిద్ధమైన పుష్పం.తన మధురిమతో ప్రియుని అర్చించ సిద్ధంగా ఉన్నది.

మహర్షి దృష్టి ఆమెపై ప్రసరించింది. ఆయన అంతర్దృష్టితో ఆశీర్వదించాడు. తన ప్రజ్ఞను హృదయంలోనే దాచి, లాంఛనంగా పరామర్శించాడు.

“ఎవరీ కళ్యాణి? ఏమా తేజస్సు! ఈమె శిరస్సు చుట్టూ వెలుగులు వాగులై ప్రవహిస్తున్నవి. ఈ తేజఃపుంజాలు ఎక్కడివి? చిరంజీవీ! ఏ హరితవర్ణ కాంతి సీమల నుండి వచ్చావు? ఏ నీరవ నిశ్శబ్దాలను చీల్చుకుని వచ్చావు? వెన్నెల చల్లదనాన్ని మరపించే శీతల తటాకం వలె ఉన్న నీ కళ్లలోని చల్లదనం ఎక్కడిదమ్మా? ఈ కమ్మదనం ఏ లోకానిది?

“భూమిపైన ఎన్నో పుణ్యతీర్థాలు, పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. నిశిరాత్రులలో తలలెత్తుకునే గిరిశిఖరాలున్నాయి. వాటిని పరివేష్టించిన సుందర వనాలున్నాయి. ఒడ్డుల్ని ఒరుసుకు ప్రవహించే ఆనంద నదాలున్నాయి. ఇక్కడ ఆనందాలను వేయివిధాల అనుభవించవచ్చు. పొంగులువారే ప్రేమ ప్రవాహాలలో ఈదులాడవచ్చు. పవిత్ర పరిష్వంగంలో అధర పల్లవాలను ఉపభోగించవచ్చు. పచ్చనిశయ్యపై ఆదమరచి ఆత్మలవలె నిదురించవచ్చు. భూలోకపు సొబగులు ఎన్నో ఉన్నాయి. అన్నీ సుఖశయ్యలే. వాటిమధ్య ఆధ్యాత్మికానందం పొందే వీలున్నది. కేవల శరీర సుఖం వాంఛించేవారికి ఆత్మానందం లభించదు.

“బాలా! ఆధ్యాత్మికసీమల అందాలు వేరు. భౌతిక ప్రపంచపు ఆనందాలు వేరు. ఆధ్యాత్మలోకపు ఆనందాలు కళ్లుమూసుకుని, ధ్యానమగ్నవై అనుభవించ దగినవి. అదృశ్యసౌందర్యాలు అవి. వాటిని అనుభవించడానికి మనస్సు ముఖ్యం కాదు. తపస్సు ముఖ్యం. ఆత్మతో అనుభవించగల బ్రహ్మానందం అది. అక్కడ నీకు వినిపించేవి దివ్యనాదాలు. అవ్యక్తమైన నీ మనోగతం నేను గ్రహించగలను కుమారీ! ఈ మృణ్మయ పాత్రికలో అమృతపానం చేయగలవా? ఈ ఉషస్సుకే మురిసిపోతే ఎలా? ఈ వెలుగుల్ని చీల్చి చూడు. ఆవల ఇంకెన్ని కాంతి మండలాలు ఉన్నాయో? అవి అన్నీ నిన్ను పరివేష్టించి నీ చుట్టూ తిరుగుతున్నవే ... నీకు తెలియదు.

‘‘దేవీ! అప్సరసలు గంధమాదన పర్వతంపైన విహరిస్తుంటారు. ఆ పర్వతసానువులపై నున్న దట్టమైన అరణ్యాలలో తొంగిచూచే సూర్యకిరణాలు చల్లగా ఉంటాయి. నీ చూపుల్లో ఆ కిరణాల శైత్యం ఉంది. నీ స్వరంలో మాధుర్యం ఉంది. నీ శరీరంలో లావణ్యం ఉంది. మానవకన్యగా ఉన్నా నీలోని దివ్యత్వాన్ని నేను చూడగలను. నీ ఆత్మ అగోచర పరమాత్మ కలయికకై ఆతృత పడుతున్నది.

"దేవతల అడుగుల సవ్వడులు నీ లోపల నుండి వినిపించడం లేదా! స్వర్గ వేణునాదాలు నీకు వినిపించడం లేదా? వినీల గగనాలు దాటివచ్చిన మలయ పవనాలు నిన్ను సేదతీర్చటం లేదా? అవి నీ ప్రశాంతికి అవరోధాలు కావు. అవి నీవు మెట్టిన బ్రహ్మానంద చంద్రికా శిఖరాలు. చెప్పు రాకుమారీ! ఎక్కడెక్కడ సంచరించి వచ్చావు? ఏయే సుక్షేత్రాలను పునీతం చేసి వచ్చావు? కోయిల కూజితానికే నీ తనువు ఒంపులు తిరుగుతున్నది కారణం? నీ ముకుళిత హస్తాలు గులాబీగుచ్ఛాలైనాయి, కారణం? నీ నలిగిన సౌందర్యంలో ఏదో పరిష్వంగ పారవశ్యం దోబూచులాడుతున్నది? నీ కళ్లలోని మధురానుభూతికి కారణం? నీ హృదయం అమృతసేవనంలో మత్తిల్లింది. నీలో సరికొత్త తీయం దనాలు కనిపిస్తున్నాయి.

"ఈ లోకంలోని బాధలు, యాతనలు నీకింకా తెలియవు. జీవితంలో రోదనలు నీ చెవులకు సోకలేదు. నీకు ఇంతకాలం వినిపించినవి రసరమ్యగీతికలే. అవి పర్వతసానువులపైన పారే నిర్ఝరప్రవాహాలు. అవి ప్రకృతిని పరవశింప చేయగల స్వరార్ణవాలు. నీ అంతరంగంలోని ఆనందంలో మునిగివున్నావు నీవు. అరణ్యంలో విహరిస్తున్న బంగారులేడివి నీవు. స్వప్నసీమలలో విడిగివిప్పారే పగడపుష్పానివి. ఆకుమాటున దాగి తొంగిచూచే వనదేవతవు. ఎర్రకళ్ల తెల్లపావు రానివి. నీది పవిత్రాశయం. నీవు అరణ్యంలో వికసించిన అనాఘ్రాతపుష్పానివి. నీది ఆత్మ సౌందర్యం. నీవు భాసమానవు సకుమారీ!

"ఇవి నీ భౌతిక సంపదలు, భౌతిక సౌందర్యాలు. వాటి వెనక దాగిన సత్యం నీకు తెలుసు. అది నీలో నిద్రిస్తున్నది. అది నీదైన ఆత్మ. నీ భౌతిక సౌందర్యం ప్రకృతికి కనువిందు చేస్తున్నది. నీ ఆత్మసౌందర్యం పరమాత్మను అలరిస్తుంది. నీ ఆనందం దేవతలను తలపిస్తున్నది. నీవు మానవరూపంలో అవతరించావు. నీవు నీ స్వాప్నిక లోకాలను వదలిరావడం లేదు. ఈలోకంలో ప్రేమ, సౌందర్యం ఏవీ స్థిరంగా ఉండవు. నీ మనుగడకు ఈ ప్రపంచం చాలా చిన్నది. ఆత్మలోకం అనంతమైంది. కనుక కలలలోనే సుఖంగా జీవించు.

"విధిని ఏమార్చ లేవు. ఆనందతీర్థాలలో చిరకాలం కాపురం చేయలేవు. మానవజీవితాలలో చైతన్యం తక్కువ. ఆత్మలోకంలో చిరకాలం ప్రశాంతంగా ఉండగలవు. ఇది మానవలోకం. విధి దేగకన్ను నిన్ను గమనిస్తున్నది."

మహర్షి పలుకుల్లో ములుకులున్నాయి. మాటలలో మార్మిక ఈటెలున్నాయి. మెరుపుల మాటున నల్లని మేఘాలున్నాయి. మేఘాల గుండెల్లో గర్జనలున్నాయి.

ఏవో రచించని చిత్రాల్ని ఆవిష్కరించి నట్టనిపించింది. సంగీతంలోని సంగతుల వలె ఆయన మాటలవెనుక భావాలు వేరు. అవి బాధాకరాలనిపించినా ఆవేదన వాటి గురించే. గ్రీష్మతాపానికి వడగాలి తోడయినట్లు తోచింది. ఆమె వాటిని తన సర్వజ్ఞత మరుగున దాచుకున్నది.

దేవర్షి మాటల అంతరార్థం గ్రహించిన వారికి భవిష్యత్తు బోధపడుతుంది. మనిషి బాధలకు సానుభూతి లభిస్తుంది. రసానుభూతి కలుగుతుంది. దానికి దేవతల ఆమోదం ఉంటుంది.

మహర్షి అనుమానం అశ్వపతి గ్రహించాడు. కాని నిగ్రహం పాటించాడు. రానున్న ఆపద మనస్సును మెలిపెట్టింది. నీలినీడలు పరచుకున్నాయి. విధిని ఎదుర్కొనడానికి తాను మానసికంగా సిద్ధమైనట్లు, భౌతిక జీవితంలో ఆటుపోట్లు, కష్టసుఖాలు సహజమేనన్న భావనతో గంభీరంగా అశ్వపతి మహర్షికి సమాధానం పలికాడు.

"దేవర్షీ! సర్వం మీకు అవగతం. అయినా రేఖామాత్రంగా నా మనోభావాలను తెలియపరచడం నా కర్తవ్యం. అది సంకేతం. తమ దివ్యమేధ నా ఆంతర్యాన్ని సులభంగా గ్రహించగలదు. ఒక భవ్యజీవి అడుగులు నాకు వినిపిస్తున్నాయి. దివ్యస్పందన వినిపిస్తున్నది. ఈ ప్రపంచంలో అమృతత్వం చోటుచేసుకోబోతున్నది. అది అగోచరానికి గోచరానికి మధ్యన, దృశ్యానికి అదృశ్యానికి నడుమ సరిహద్దు రేఖపై జన్మించి పరమాత్మ సంకేతాలకు వ్యాఖ్యగా, అంతర్మండలాల తేజస్సుగా భాసించనున్నది. అది భృక్తమైన వాటిని రహితం చేస్తుంది. ఆపైన పరమాత్మ ప్రసాదితమైన సచ్చిదానందానుభూతిని అందు కుంటుంది. అది స్వర్గమందిర మణిమయ కవాటాలను దాటి, పరమపావనమైన పరమాత్మ రహస్యస్థావరం చేరుకుంటుంది. అది భౌతిక సరిహద్దుల్ని అతిక్రమించ గలదు. సృష్టికి మూలమైన ఆదిబ్రహ్మంలో అంతర్లీనం కాగలదు. చీకటి కవాటాలను భేదించి, రహస్య మార్మిక మార్గాలలో పయనించి దేవతల విహార మందిరాలను చేరుకోగలదు.

"మనిషికి జన్మల మధ్య కొంత విరామం ఏర్పడినా, కొన్ని మహత్తర సంస్కారాలు పైజన్మకు మిగిలి ఉంటాయి. వాటి ఆధారంగా ఎప్పుడో మనిషిలో దివ్యత్వం ప్రవేశిస్తుంది. ఆ క్షణంలో మనిషి మహనీయుడవుతాడు. ప్రపంచంలో అలాంటి దివ్యక్షణాలు అరుదుగా ఉంటాయి. గ్రహప్రభావాల వల్ల మహాత్మ శరీరం ధరించడం కష్టం. జీవితాన్ని యోగార్హం చేసుకోవడం కష్టం. మనిషి

జీవితంలో రాగద్వేషాలు తప్పవు. అవి నిరంతరం జీవిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఓటమి పాలు చేస్తుంటాయి.

"ఒక అప్సరస వెలుగుమేఘం వలె దిగివచ్చి నప్పుడు ఈ జీవన సంగీతంలో తలమునక లవుతుంది. ఆమె వల్ల భువి స్వర్గంగా భాసిస్తుంది. ప్రేమానురాగాలు నింపుకున్న ఈ కోమలాంగిని చూడండి. ఈమె నిష్కలంక. సువర్ణసుందరి. పూర్ణసుమంగళి. ఉల్లాసభరితమైన పూర్ణయవ్వని. భూలోకంలోని ఆనందాల్ని, సుఖాలను తనలో నింపుకున్న పుత్తడిబొమ్మ సావిత్రి. ఈమె కళ్లలో స్వాప్నికజ్యోతులు నిర్మలంగా వెలుగుతున్నాయి. ఆ కళ్ల లోతులలో స్వర్గాలు కనిపిస్తాయి. ఆమె శరీరమే కాదు, ఆత్మసైతం సుందరమే.

"ఆమెలో ఉషఃకాంతులు. రజతఫలకంపై పడే అగ్నికణాలవలె ఆమె కన్నీరు ఆత్మను అంటదు. ఆమె ఆత్మసౌందర్యం నవనవోన్మేషంగా భాసిస్తుంది. ఆ కళ్ల నీలకాంతిలో విశాలవిశ్వం గోచరిస్తుంది. ఆకాశంలోని శీతల చంద్రికల వలె ఆమె ఆశించే సుఖాలు, ఆనందాలు చల్లనివి. అవి విధిని, మృత్యువును అపహసించగలవు. జీవితంలో కొన్ని కొన్ని అద్భుతఘటనలు కాలాన్ని సైతం శాసించగలవు. విధిని సైతం ధిక్కరించగలవు. ఆనందం చిరకాలం మనగలిగితే విషాదం గతంలోకి జారిపోతుంది.

"మహర్షీ! ఈమెను తమ జ్ఞాననేత్రంతో గమనించండి. ఈ సుకుమారి జీవితం విషాదాలకు దూరమై ఆనందప్రదం కావాలని ఆశీర్వదించండి. ఆమె గుండె ప్రేమామృతంతో నిండాలి. ఆమె కరుణతో పులకించి పృథ్వి సచ్చిదానం దంతో పులకించాలని ఆశీర్వదించండి.

"అలకాపురి సుందర నందనోద్యానంలో పుష్పించే పారిజాతం ఉషస్సులో ఎంత అందంగా ఉంటుంది! గంధర్వకన్యలు వర్షంలో తడిసి మరీ అందాలు ఒలికించినట్లు ఈమె సౌందర్యం ఐంద్రజాలికం. ఈమె బాల్యం ఎంతో ప్రశాం తంగా గడిచింది. ప్రజలపై ఆమెకున్న ప్రేమ అపారం. దివ్యతేజస్సు రూపుదాల్చి ఈమె జన్మించింది. ఈ జ్యోతి భూలోకంలో కొత్తవెలుగులు ప్రసరిస్తుందని మా ఆశ.

"జగన్మాత నిర్దాక్షిణ్యంగా తన సృష్టిని విధికి వదలి నిశ్చింతగా ఉంటుందా? పరమాత్మ వీణ మూగపోతుందా? ఈ ప్రాపంచిక కోలాహలంలో బ్రహ్మానందం లభించదు. మానవహృదయం మూగపోతుంది. మాకు విషాదాలు చాలా ఉన్నాయి

భూలోకంలో. కాని సావిత్రి పిలుపుతో స్వర్గం ఇక్కడకు దిగిరావాలని మా ఆకాంక్ష. ఆత్మకు సైతం అగ్ని పరీక్ష తప్పదా? పరమాత్మను చేరాలనుకునే వారికి దేవతలు అవరోధాలు కల్పిస్తారా? ప్రేమ, విశ్వాసం, ఆనందం కవచాలుగా ధరించి జీవితంలో పోరాటం సాగించవలసిందేనా!?"

★ ★ ★

విధి బలీయమని తెలుసు. మాటలు నిష్ప్రయోజనమనీ తెలుసు. నారద మహర్షి మౌనం వహించాడు. కంటితో కళ్లకు కనిపించని పరమాత్మను చూడాలని ప్రయత్నించే మానవుని అజ్ఞానానికి నిట్టూర్చి ఇలా ప్రశ్నించాడు మహర్షి –

"ఆమె సంకల్పం ఏమిటో నాకు అవగతం కాలేదు. ఆమె కళ్లలో నాకు స్వర్గం కనిపిస్తున్నది. ఇంతటి పూర్ణత్వం ఆమెకి ఎక్కడిది? పరమాత్మ దర్శనం పొందిన వారికున్న తృప్తి ఆమెలో కనిపిస్తున్నది."

అశ్వపతి మహర్షికి ఇలా సమాధానం చెప్పాడు : "ఆమె రాకపోకలను, చలనాలను అ శోకం గమనిస్తున్నది. ఒంటరిగా కాలం గడపలేని పక్షి ఆకాశంలోకి ఎగిరిపోయినట్లు ఈమె తన సహచరునికై అన్వేషిస్తూ వెళ్లింది. ఆమె అవతరించి నప్పటినుండి ఇంతవరకు అతని జాడలేదు. ఆమె ఆత్మ రెక్కలు కట్టుకుని అతనికై అన్వేషించింది. ఉషోదయాలలో, వెలుగుబాటలలో నిత్యం వెతుకుతూనే ఉన్నది.

"అమ్మా! సావిత్రీ! నీవు అలసిపోయావు. బడలికవల్ల నీ కళ్లు బరువెక్కాయి. అయినా నీ అధరాల వెనుక అమృత దరహాసం దాగివుంది. నీలో ఆనందం పరవశిస్తోంది. నీ ఆనందానికి హేతువు ఏది? నీవు ఎవరిని వరించావు?"

విధికి తలవంచని ధీరవనిత వలె సావిత్రి నిబ్బరంగా గంభీరంగా వారికి సమాధానం పలికింది – "నాన్నగారూ, నేను మీ సంకల్పాన్ని నెరవేర్చాను. దూరదేశంలో నా మనోవల్లభుని కలుసుకోగలిగాను. నా హృదయం ఆమోదించిన వ్యక్తి అతను. నా స్వప్నం నిజమైంది. సాల్వదేశంలోని భయంకరారణ్యాల, పర్వతాల నడుమ ఒక పర్ణశాల ఉంది. అది ద్యుమత్సేనుని ప్రస్తుత నివాసం. ఒకనాడు ఆయన మహారాజు. ఇప్పుడు అంధుడు, రాజ్యభ్రష్టుడు. ఆయన కుమారుడు సత్యవంతుడు. అతనిని నిర్జనారణ్యంలో కలిశాను. నా స్వయంవరం జరిగి పోయింది. నా నిర్ణయానికి తిరుగులేదు."

అందరూ నిరుత్తరులైనారు. అశ్వపతి అంతర్దృష్టితో వీక్షించాడు. అతని పేరుపైన దృష్టి నిలిపాడు. అతని రూపం పైన భయంకరమైన నీడలు క్రమ్మడాన్ని గమనించాడు. ఆయన కూతురు చూపుతో చూపు కలిపి అన్నాడు –

"మంచిపని చేశావు బిడ్డా! నీ నిర్ణయం బావుంది. అదే జరిగితే అంతా సక్రమంగా జరిగినట్లే. అంతకు మించి జరిగితే మరీ మంచి జరిగినట్లు. మానవదృష్టికి అది చెడ్డ కావచ్చు. పరమాత్మ సంకల్పం అదే కదా! అది మంచికే అయివుంటుంది. విధి ఎప్పుడూ రెండు విధాలుగా రాయబడి ఉంటుంది తల్లీ! వైరుధ్యాలను దాటుకుంటూ పరమాత్మను చేరడం ఒక పద్ధతి. చీకట్లలో మసలుతూ వెలుగుదిశగా పయనించడం రెండవ పద్ధతి. ఇది మృత్యువునే అమరత్వానికి చక్కని బాటగా మలచుకోవడం. ప్రాపంచిక విషాద స్వనాలే కడకు అమరత్వాన్ని ప్రసాదిస్తాయి."

నారదమహర్షి ఏదో చెప్పబోతుండగా అశ్వపతి వారించి ఇలా అన్నాడు– "గానకళా విశారదా! అంధులకు దృష్టిని ప్రసాదిస్తే ప్రమాదం. భవిష్యత్తును దర్శించగల మీ త్రికాలజ్ఞత అందరికీ సరిపడదు. రానున్న కష్టాలను ముందుగా గ్రహించి, నిలువరించగల నిబ్బరం సామాన్య మానవులకు ఉండదు. మాబోంట్లకు అప్పుడే దివ్యత్వం అనుగ్రహించకు. ఇక్కడ గంధర్వులు విహరించే సుందరశిఖరాలు లేవు. వైకుంఠం చేరే సోపానాలు లేవు. మేము కఠిన శిలాసోపానాలను అధిరోహించ వలసినవాళ్లం. ఒక్కసారిగా పైకి ఎగిరే సాహసం చేయగలవారు అరుదు. దూరాల నుండి పిలుపు వినిపిస్తుంది. కానీ మేము నడిచే బాటలు ఇరుకు. కాళ్లక్రింద నేల జారిపోతూ ఉంటుంది. మావంటి దుర్బలులతో దేవతలు సాహచర్యం చేయలేరు. వారిని విధి బాధించదు. కనుక వారు ఎప్పుడూ స్వర్గసుఖాలనే అనుభవిస్తుంటారు. వారికి మా బాధలు, కష్టాలు తెలియవు. మానవ రోదన వారికి వినిపించదు. మనిషి బాధలతో, నిరాశలతో క్రుంగిపోతాడు. కాలం గడిచిన కొద్దీ మృత్యువు సవ్వడి వినిపిస్తుంటుంది. భవిష్యత్తు అగమ్యంగా తోస్తుంది. ఏదో రహస్యమార్గాన్ని వెతుక్కుంటాడు ... మృత్యువు వాతపడకుండా తప్పించుకోవాలని. ఒక్కరోజు తప్పించుకున్నా చాలునని ఆశపడతాడు. విధి విధించే శిక్షల్ని తట్టుకోలేక రవంత శక్తిని ప్రసాదించమని అర్థిస్తాడు. అదృశ్యంగా ఉన్న ఆ శక్తికై ఎదురుచూస్తాడు. ఏదో ఒకరోజున మృత్యువు తనని సమీపిస్తుందని తెలుసు. దానినుండి తప్పించుకోలేననీ తెలుసు. కాని అనుక్షణం తన ఆశకు ప్రాణం పోస్తుంటాడు. ప్రాణం పోయినా ఆశ చావదు. మృత్యువు నుండి తనను రక్షించుకోలేదు. ఇనుపకౌగిలి మృత్యువుది. మనస్సే మనిషిని మోసం చేస్తుంది. అయినా మనస్సును జయించడానికి ఎప్పుడూ

యత్నించదు. తన నిర్ణయాలనే విధికి ఆపాదిస్తాడు. సంకల్పంలోని తప్పిదమే విధి అనిపిస్తుంది."

అశ్వపతి మాటలకు నారదుడు సమాధానం చెప్పకముందే భయవిహ్వల అయిన రాణి గొంతు విప్పింది :

"మహర్షీ! తాము సమయానికి వచ్చారు. తమ వాక్కుతో లోకుల శోకాలు పరిహరించ గలరు. రెండు తారల సమాగమాన్ని హర్షించి ఆశీర్వదించండి. మీ ఆశీస్సులు వారికి రక్షగా ఉండనీయండి. మా శంకలను నివారించండి మహర్షీ. వారు ఊహించే దుర్విధిని వాస్తవం కానీయకండి. నాకు భయానికి కారణం కనిపించడం లేదు. సావిత్రిని ధైర్యంగా ప్రేమను పొందనీయండి. అనేక ఆత్మలలో ఆమెది ఒక ఆత్మ. తన సహచరునిగా సావిత్రి ఎన్నుకున్న సత్యవంతుడు మానవోత్తముడు, యోగ్యుడు. రాజరికం లేకపోవచ్చు. అతను ఎన్నుకున్న ఆశ్రమజీవనం ఉత్తమం. మా సావిత్రి అక్కడ సర్వసుఖాలు అనుభవించ గలదని మా నమ్మకం. వారిరువురిది ఆత్మీయబంధం కావాలని నా తపన.

"మహర్షీ! తమ ఆశీస్సులతో వారి జీవితాలు ఆనందమయం కావాలి, అమృతతుల్యం కావాలి. వారి జీవితాలపై క్రమ్మే కారుమేఘాలను పారదోలండి. మనిషికి తన పైన పడే నీడ కూడా బరువే. ఆ భారం మనిషిని సుఖంగా బ్రతకనీయదు. హాయిగా, నిశ్చింతగా ఉండనీయక అనుక్షణం భయపెడుతుంది. విధి కొట్టే దెబ్బలు మనషి కంటికి కనిపించవు. మనస్సుకు అందవు. 'అదృష్టం' చివరి కొసన అలాంటి ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. అది సుఖమయ జీవితంలో ఊహించని మలుపు. ఆ విధిని చూచి దేవతలు వెక్కిరిస్తారు. భయంకర మృత్యువు అదృశ్యంగా పొంచి ఉన్నప్పుడు 'పాపం' రెక్కలు విదల్చి మనిషిని కప్పివేస్తుంది. ఆ క్షణంలో మనిషి ప్రక్కకు చూచి మృత్యువాత పడకుండా తప్పించుకోవాలని యత్నిస్తాడు. 'అవకాశం' 'విధి'తో చేయి కలుపుతుంది."

వివేకవతి మాటలకు మహర్షి సమాధానం చెప్పక తప్పలేదు.

"భవిష్యద్దర్శనం వల్ల కలిగే మేలు ఏమున్నది దేవీ! ప్రమాదం తప్పిపోదు. రక్షణ ద్వారాలు మూతపడిపోతాయి. భవిష్యత్‌జ్ఞానం వల్ల బాధలు మరింతగా పెరుగుతాయి. విధి నిర్మించిన రంగస్థలంపైన బరువులు బాధాకరం. అరుపులు అనవసరం. ఈ సృష్టి మహాకావ్యాన్ని రచించినవాడు ప్రతిపుటలో, ప్రతిపదంపైన

తన ముద్రవేసి ఉంచాడు. మహాత్ములు అదృశ్యంగా తిరుగుతుంటారు. సామాన్యులు మాత్రం ఆహార్యం మార్చుకుని తమ తమ పాత్రలు పోషిస్తుంటారు. పెదవులు ఉచ్ఛరించే మాటలే మనిషి వినగలడు. ఆ పెదవి కదలిక వెనుకనున్న ప్రజ్ఞను మనిషి గ్రహించడు. ఒక అగోచరశక్తి మనిషిని నడిపిస్తుంది. నడిచే జీవితం కన్న నడిపించే ఆత్మ బలమైనది. ఆత్మశక్తిని ఎవరూ ధిక్కరించలేరు. మనిషి లక్ష్యానికి తగినట్లే ఆలోచనలు, ఆచరణలు ఉంటాయి. లక్ష్యం పరమాత్మపైన ఉన్నప్పుడు మనిషి విన్నపాలకు, విచారాలకు అర్థం కనిపించదు."

మహర్షి మాటలు జీవితంలో విషాదం లేనివారికి, ఏ విచారం లేకుండా జీవిస్తున్నవారికి తృప్తి కలిగిస్తాయి. కాని ప్రాపంచిక సుఖాలతో శాంతి పొంద లేనివారి మాటేమిటి, కల్లోల ప్రపంచంలో ఆటుపోట్లకు నిత్యం గురయ్యేవారి మాట?

వివేకవతి తన గుండెను ఎవరో గాయపరచినట్లు కలత చెందింది. ఏదో మహాశాపం తన బిడ్డకు చుట్టుకున్నట్లు, తన బిడ్డ అదృష్టాన్ని ఏ అదృశ్యహస్తమో హరిస్తున్నట్లు విలవిల్లాడింది. మూగగా రోదించింది. ఇష్టదేవతల్ని సంభావించి వేడుకున్నది. అందరు దేవతలను అర్థించింది. ప్రార్థించింది. మనస్సు పలువిధాల పరితపించసాగింది. వివేకం వెనుక స్వార్థం తొంగి చూచింది. ఆమెలో దివ్యజ్ఞానం ఎంత సంపూర్ణంగా ఉన్నా, అశ్వపతి దేవేరిగా నిబ్బరం ప్రదర్శించినా, మానవ మాత్రురాలిగా దుఃఖాన్ని దిగమింగలేకపోయింది.

న్యాయదేవత రాయిగా మారిందని, ఆమె హృదయం పాషాణమని నిందించింది. విధిని ఎదుర్కొనే మహాశక్తి కావాలని కోరలేదు. భగవంతుని నిర్ణయం అక్రమమనీ, అన్యాయమనీ, అది పక్షపాతమనీ ఆక్రోశించింది. కాని నిర్మలమైన తన ఆత్మశక్తిని మరచిపోయింది. సామాన్య మానవులు కష్టాలు భరించలేక అవివేకంతో భగవంతుని, సృష్టికర్తను నిందించినట్లు ఆమె పలువిధాల వాపోయింది.

"ఈ కన్య ఆ కీకారణ్యాలకు ఏల పోవలె! ఈ పెను విపత్తును ఏల తెచ్చుకోవలె! సాల్వరాకుమారుని సుందరరూపంలో క్రూరవిధి దాగివున్నదని తెలియదు. అతను పూర్వజన్మలో ఈమెకు బద్ధశత్రువై ఉంటాడు. పూర్వజన్మలలో చేసిన పాపాలు ఈ రూపంలో వచ్చి ఉంటాయి. అతనికి తన గురించి తెలిసి ఉండకపోవచ్చు. ప్రేమ, ద్వేషం ఎంత ఇష్టంగా పెనవేసుకుని ఉంటాయి. అవి

కాలప్రవాహంలో మన కాళ్లకు చుట్టుకుంటాయి. ఈ గొలుసులో మనం గొళ్లాలం. అవసరాలు గుర్తించి కర్మ మనపై కక్ష తీర్చుకుంటుంది. పాత పగలవలె గత జన్మల పాపాలు మన వెంటపడి సాధిస్తుంటాయి. మనం మరచినా దేవతలు వాటిని మరవరు. శాసనం కఠినంగా అమలు జరుగుతున్నప్పుడు మన అభ్యర్థనలు ఏ దేవుడూ వినడు. విధినిర్ణయాలను మన మనస్సులు ఆమోదిస్తాయి. మనం అజ్ఞానంతో వివేకం కోల్పోయి ఆత్మల్ని నిందిస్తుంటాం. ప్రేమ సైతం తన మహత్తుని కోల్పోయి క్షుద్రశక్తులకు తలవంచుతుంది. దేవతలు తమ ఆనందాలను వదులు కోరు. మనకోసం వారెలాంటి త్యాగాలు చేయరు. ఆత్మల్ని సైతం ఊరడించరు. మన దుస్థితికి మనమే కారకులమని వారికి తెలుసు. అందుచేత మనల్ని రక్షించడానికి రారు.

"ప్రపంచంలో కనిపించని వేదనలు, వినిపించని రోదనలు, బాధలు, విషాదాలు అనేకం ఉన్నాయి. కష్టాలలో ఉన్నవారిని పరుల సానుభూతి, అనునయ వాక్యాలు మరింతగా బాధిస్తాయి. క్రుంగదీస్తాయి. విధి వేసిన శిక్షను భరించే శక్తి మనలోనే ఉంటుంది. కర్మ నుండి విముక్తి చెందగల ఉపాయం వెతుక్కోవాలి. అది ఎంతటి న్యాయం అయినా ప్రాపంచిక పరిధిలో ఆందోళన కలిగిస్తుంది. వ్యర్థమైన పనులు చేసి బాధలు తెచ్చుకుంటాం. ఇతరుల కష్టాలు చూచి కన్నీరు కార్చుతాం. మనకూ కష్టకాలం ఉంది. మనం కష్టాలు, కన్నీరు లేని దేవతలం కాదు. సాటివారి బాధల్ని చూచి స్పందించకుండా ఉండలేం. పైనున్న దేవతలు మనల్ని గమనిస్తుంటారు. తాత్కాలిక సుఖాలకు దుఃఖాలకు వారు చలించరు. ప్రతికూల సంఘటన ప్రతిదీ మనిషిని బాధిస్తుంది. మన గుండెలు బరువెక్కి ఊపిరాడదు. సాటివారి బాధలు చూచి చలించడం, వారి కష్టాలలో మనం భాగం పంచుకోవడం అంటేనే మానవత.

"వయస్సు మళ్లినా మనం కఠినంగా నిర్దయగా బ్రతకలేం. దేవతల వలె మనుషులు పట్టనట్లు ఉండలేరు. మన బాధలు, విషాదాలు మనకు చాలనట్లు ఇతరుల బాధలకు, కన్నీటికి స్పందించి కొత్త బాధల్ని అందిపుచ్చుకుంటాం. గతించిపోయిన విభవాలను స్మరించుకుంటూ మురిసిపోతాం. అశాశ్వతమైన వాటికోసం అశ్రులు చాస్తాం. ఆక్రోశిస్తాం. పరాయివారి బాధ మన గుండెను కోస్తుంటే నిబ్బరంగా భరిస్తాం. కాని, మహర్షీ! ఇది నా బిడ్డ. అశుభం అనివార్యం అయితే మభ్యపెట్టకండి. కనిపించని దురదృష్టం మరీ బాధిస్తుంది. కనిపించే నష్టం కన్న కనిపించని కష్టం మిన్నగా బాధిస్తుంది. రాత్రింబవళ్లు ఏదో దుర్విధి

మమ్మల్ని వెంటాడుతున్నది. మావెంట నీడలా కదులుతున్నది. కనిపించని విషాదం ఏదో ముంచుకొస్తున్నది. అది దుర్భరం అయినా తెలుసుకోవడం అవసరం.”

★ ★ ★

సావిత్రి నిర్ణయాన్ని అన్యాపదేశంగా మహర్షి మాటలు సమర్థించడం కన్నతల్లి గుండెలో శూలాలైనాయి. ఆయన మాటలు ‘విధి’ని తెలియ పరచాయి. మానవుల హృదయ వేదనల్ని, కర్మలను దేవతలు సృష్టిపరిణామంలో ‘స్వ’ కార్యానికి వినియోగిస్తుంటారు. తమ దివ్యకార్యాల విజయానికి మానవకృషిని పెట్టుబడిగా చేసుకుంటారు. సృష్టిలోని లోపాలను చక్కదిద్దడం మనిషి వల్ల కాదు. జగన్మాత తన బిడ్డలను తానే బలితీసుకోవడం ఎంత దారుణం! దివ్యమాత సంకల్పిస్తే ఏదీ అసాధ్యం కాదు. ఆమె సంకల్ప మాత్రంతో లోకాలనే సృష్టించగలదు.

మహర్షి తన నిర్ణయం తెలియపరిచాడు –

“అమ్మా! నీవు కోరిందీ సత్యమే. నేను చెప్పిందీ సత్యమే. మానవ కాంతలలో సావిత్రి ఒక ప్రత్యేక వ్యక్తిత్వం కలది. ఒక ప్రత్యేక ప్రయోజనం కొరకు జన్మించింది. భూమి – ఆకాశం కలవడం వంటిది సావిత్రీ–సత్యవంతులు కలియడం. పరిణామ కార్యానికి వీరి కలయిక అవసరం. అతను విశిష్టవ్యక్తి. స్వర్గం నిద్రిస్తున్నప్పుడు జారిపడిన రత్నం. అతని ఆత్మ సచ్చిదానంద నిలయం. పరంజ్యోతి వెలుగు అతనే. ఆనందం ప్రసాదించగల ప్రశాంతి అతనిది. అతనిలో రాచఠీవి, దివ్యత్వం కలబోతగా ఉన్నాయి. అతని కన్నులు బ్రహ్మానంద మధువుల్ని వొలికిస్తాయి. అతను ఆకాశంలో సంచరించే చంద్రునివంటివాడు. వసంతంలో మధురోహలు నింపుకున్న కోయిల. ఇరు తటాలను చుంబిస్తూ ప్రవహించే నది. ఆత్మశక్తి, వివేకం అతనికి ఆభరణాలు. స్వర్గ సుఖాలకు అతను ప్రతినిధి. ప్రాపంచిక ఆశలకు, ఆరాటాలకు అతను ప్రతీక. అనంతత్వం కాలానికి అందించిన చిరుకానుక. అతనే తేజస్సు. అతనే ఆనందం. అతని తత్వంలో ఆత్మ, ప్రకృతి చెరి సగం. సమపాళ్లలో కలిసి మెలిసి సఖ్యంగా ఉంటాయి. అతని మనస్సు భూమ్యాకాశాల పరిధుల్ని దాటి ఉంటుంది. మానవ వినిర్మితిని దాటిన సత్యప్రభ అతను. అన్ని ఆనందాలు ప్రకృతి ప్రసాదనాలే. అన్నింటినీ సమంగా ఆనందంగా అనుభవించగల సమభావన కలవాడు. అతని వాక్కులో సత్యం ప్రకాశిస్తుంది. అతని చూపులో దివ్యప్రజ్ఞ కనిపిస్తుంది. అతని బుద్ధికి ఏదీ గుప్తం కాదు. ఏదీ రహస్యంగా ఉండలేదు. మానవరూపం ధరించిన

మహర్షి సత్తముడు. నిశ్చలంగా, నిర్మలంగా ఉంటూ ఆలోచన లేని మేధస్సువలె నిశ్చింతగా ఉంటాడు.

"అతని సన్నిధి ప్రశాంత రోదసిని, తేజస్సును నిస్తబ్ద సంగీతాన్ని తలపింప చేస్తుంది. ఉషోదయం విరచించిన రసానందం కలిగిస్తుంది. పర్వతాలకు ఆకుపచ్చని అరణ్యాలు ఎంత శోభనిస్తాయో అతని మిత్రత్వం అంతటి శోభను కలిగిస్తుంది. అమ్మా! ఇవీ అతని రూపాలు. గుణగణాలు. అతని సుందర రూపం వెనుక ఉన్న లోతులు అందరకీ కనిపించవు.

"అతని ఉన్నత సంకల్పం మనకు ఆనందహేతువు. భౌతిక సౌందర్యం కాదు ఆకర్షణ. దివ్యత్వాన్ని అందుకోవాలన్న ఆశయం అతని ఆకర్షణ. అది అతని పారవశ్యంలో అగుపిస్తుంది. అతని మమతానురాగాలు అందరికీ వర్తిస్తాయి. అందరినీ అలరిస్తాయి. అతనితో జీవించడం ఒక అద్భుత వరం. పరాన్ని చేరుకోగల శక్తి అతనిలో నిక్షిప్తమై ఉంది. మానవశిల నుండి మలచిన దివ్యరూపం అతనిది. ఆ సుందరమూర్తి తనకై నిర్దేశించిన జీవన మాధుర్యం అనుభవించక ముందే మృత్యువు ఆసన్నమైతే ఆ సుందరరూపం పంచేంద్రియాలలో కలసిపోతే దేవతలు తాము ప్రసాదించిన సంపదను తామే అపహరించుకు పోయినట్లు అవుతుంది. అహా! ఎంత విచిత్రం ఈ జగన్నాటకం?

"ఒక సంవత్సరం తర్వాత, ఇదే రోజున, కాలం కొమ్మపైన ఇదే ముహూర్తం వాలినప్పుడు స్వర్గం భూమికి ప్రసాదించిన వరం అంతరించిపోతుంది. భూలోకం నుండి ఆ దివ్యవర్ఛస్సు అంతరించిపోతుంది. స్వర్గం నుండి ఔన్నత్యం దిగివచ్చి రూపు దాల్చింది. కానీ అది భూమి ఆవరణంలో ఇమడలేదు. అతనికి పన్నెండు నెలల వ్యవధి మాత్రమే ఉంది. వచ్చే ఏడు ఇదే రోజున సత్యవంతుడు మరణిస్తాడు."

ఆ కఠోరసత్యం బాకులా గుండెల్లో దిగబడింది. రాణి విలపించింది.

"భగవంతుడు ఎంతటి నిర్దయుడు? ఏవో వరాలు అనుగ్రహించి మనల్ని మభ్యపెడుతుంటాడు. మనిషి ఆ మాధుర్యాలను అనుభవించేలోపు మధుపాత్రను నోటికి దూరం చేస్తాడు. మానవులు సుఖించడం దేవతలకు ఇష్టం ఉండదు. వారి వరాలు, శాపాలు మాకు వద్దు.

"సావిత్రీ! నీ రథం బయటకు తీసి, మరొక మారు అన్వేషణకు బయలుదేరు. ఒకసారి అరణ్యాలలో నీవు మోసపోయావు. ఈ దురదృష్టాన్ని అక్కడే వదలి మరొకర్ని వరించు. నీవు ఎన్నిక చేసిన ఆ మూర్తిని మృత్యువు ఆవహించిందట.

మృత్యు నీడలో నీవు సుఖించలేవు. మృత్యువు నీడ సోకితే ప్రేమ నశిస్తుంది. మాధుర్యం రుచి పోతుంది. నీ మార్గం సుందరమే అయినా సుగమం కాదు. అల్ప సుఖం కోరి అనల్ప దుఃఖం తెచ్చుకోకు. మృత్యువు పొంచి ఉన్నపుడు మన వాదనకు అర్థం ఉండదు. నీ యవ్వన విలాసాలు నిష్ప్రయోజనం కారాదు. అవి ఊసరక్షేత్రంలోని నిక్షేపాలు కారాదు. నీ ఎన్నికలో మన్నిక తగ్గినా ఫరవాలేదు. చిరకాలం నీవు సుఖించగలగాలి..."

అందుకు సావిత్రి నిబ్బరంగా సమాధానం చెప్పింది. ఆమె స్వరం గంభీరంగా, నిశ్చలంగా, నిర్మలంగా ఉంది –

"ఒకరిని ప్రేమించిన హృదయం మరొకరిని ఆశ్రయించదు. ఇచ్చిన మాటను తిరిగి తీసుకోలేను. నా ఆమోదం భగవంతుని ఎదుట చేసిన ప్రమాణం వంటిది. ఒకసారి పలికిన సత్యం ఎన్నటికీ నశించదు. మనస్సు మరచిపోవచ్చు కాని శబ్దశక్తి అనంతం, శాశ్వతం. అది స్మృతి పొరలలో దాగివుంటుంది. విధి చేయిదాటిపోయినపుడు తథాస్తు దేవతలు 'అస్తు' అంటారు. నా తనువు, మనసు, హృదయం సత్యవంతునికి అంకితమైనాయి. నా నిర్ణయాన్ని విధి మార్చలేదు. విధి, కాలం, మృత్యువు దానిని కదిలించలేవు. ఆత్మల్ని ఒక్కటిగా చేసుకున్నవారు ఎన్నటికీ విడిపోరు.

"మృత్యువు మా శరీరాలను వేరుచేయవచ్చుగానీ మా ఆత్మల్ని విడదీయలేదు. మృత్యువు ఆసన్నమైనపుడు ఎలా ఎదుర్కోనాలో నాకు తెలుసు. విధిని తన ఇష్టం వచ్చినట్లు ఆడించనీయండి. నేను విధి కన్న, మృత్యువు కన్న శక్తి గలదానిని. మా ప్రేమ ఈ ప్రపంచంలో శాశ్వతంగా నిలుస్తుంది. మా అమరత్వానికి అడ్డుగా నిలిచిన విధి ఓడిపోతుంది. విధి శాసనం మారవచ్చుగానీ, నా నిర్ణయం మారదు."

ఆమె కాంశ్యవిగ్రహంవలె కఠినంగా ఉంది. ఆమె మాటలు వింటే మృత్యువును ఏరికోరి ఈమె వరిస్తున్నదా అనిపించింది. తప్పించుకునే అవకాశం ఉన్నా కాదంటున్నది. ఆ కన్నతల్లికి రవంత ఆశ కనిపించలేదు. ఆశ నిరాశల మధ్య నిట్టూర్చి సావిత్రితో అన్నది. ఆమె విషాదంలో కాస్తంత సుస్వరం చేర్చాలని ఆమె ప్రయత్నం –

"అమ్మా! సావిత్రీ! నీ ఆత్మశక్తి అద్వితీయమైంది. నీ పారలౌకిక ప్రజ్ఞాప్రాభవాలు నేను ఎరగనివి కావమ్మా. నీ ఆలోచనలు మానవాతీతం. నీవు మానవులలో మణివి. అశాశ్వతమైన ఈ భూప్రపంచంలో ఎవరు ప్రియులు,

ఎవరు అప్రియులు? ఎవరు హితులు, ఎవరు అహితులు? అందరూ వెళ్లిపోయే వారే! ఎవరూ మిగలరు. ఇక్కడ ఏదీ స్థిరం కాదు, ఎవ్వరూ శాశ్వతంగా ఉండరు.

"నీవు ప్రేమించిన వ్యక్తి ఏలోకాల నుండో వచ్చినవాడు. తిరిగి మరెక్కడికో, ఏ శూన్యలోకాలకో వెళ్లిపోతాడు. ఈ రంగస్థలంపైన అతని పాత్ర ముగియగానే నిష్క్రమిస్తాడు. తర్వాత కొత్త రంగాలు, కొత్త నటులు వస్తారు. తెలియని ముఖాలు, సుఖాలు, దుఃఖాలు. నీవు ప్రేమించిన వాని శరీరం శాశ్వతంగా ఉండదు. ఈ కర్కశలోకం నుండి నిష్క్రమిస్తుంది. ప్రకృతి అందరినీ తనలో లీనం చేసు కుంటుంది. కొత్త జీవితాలు పాత ఆనందాలకు సరికొత్త ప్రతులవుతాయి.

"సృష్టిచక్రం అలా తిరుగుతూ ఉంటుంది. మన ఆత్మలు ఆ చట్రంలోకి వస్తూ పోతూ ఉంటాయి. నటరాజు చేసే తాండవ నర్తనంలో మన ఆత్మలు గిరగిర తిరుగుతూ నర్తిస్తుంటాయి. మన ప్రేమలు, వాంఛలు ఎంత బలంగా ఏర్పడినా నశించవలసిందే. ప్రణయ సంగీతంలో ఇవి నిస్వనాలవుతాయి. ప్రణయో ద్వేగంలో హృదయాలు చేరువై కాలాన్ని అనుక్షణం ముడివేయడానికి ప్రయత్ని స్తాయి. స్వర్గంలో లభించే సుఖాలు ఇక్కడ అనుభవించాలని, అక్కడి సచ్చిదానందం ఇక్కడ పొందాలని ఆరాటపడతాం. చేతికి అందినట్లే అంది దివ్యత్వం చేయిజారిపోతుంది. చేరువైన కొలదీ దివ్యత్వం మనిషికి దూరమవుతుంది.

"మధురిమలన్నీ ఇక్కడ లాంఛనాలు, సంకేతాలు. వీటి అసలు రూపాలు ఆపైన లభిస్తాయి. ప్రియునికన్న ముందుగానే ప్రేమ చచ్చిపోతుంది. మన ఆనందాలు పగిలిన పూలకుండీలలోని పరిమళాలు. ఈ ఉప్పెనలు ఎందుకు? ఈ తుఫానులో నౌకలు బ్రద్దలయిపోతుంటాయి. హృదయాలు నావికునకై విలపిస్తాయి.

"అమ్మాయీ! భగవంతుని నిర్ణయం నీవు మార్చగలవా? ఆ నిర్ణయాన్ని ఔదల దాల్చాలి. లేదూ తిరస్కరించాలి. పరమాత్మ నిర్ణయాన్ని తిరస్కరించడానికి ఆత్మస్థైర్యం కావాలి. ఆత్మబలం కావాలి. ఆత్మశక్తితో విధిని శాసించగలవు. లోకాన్ని శాసించగలవు. అప్పుడు భగవంతుడు, తేజస్సు, సత్యం – మూడూ ఒక్కటవుతాయి. అప్పుడు నీ నిర్ణయాన్ని దేవతలు హర్షిస్తారు. దైవం అనుకూలి స్తుంది. నీవు మానవమాత్రురాలివి. దేవతవలె ఆలోచించకు.

"మనిషి స్థితి దైవత్వానికి కొన్ని మెట్లు క్రింద, పశుత్వానికి కొన్ని మెట్లు పైన. మనిషికి అదనంగా ఉన్నది వివేకం. అనాలోచితంగా మనిషి ఉద్రేకపడ

కూడదు. పశువులకు పక్షులకు మనిషికున్న వివేకం ఉండదు. ఆలోచన ఉండదు. అవసరం కొద్దీ మనిషి ఆరాటపడరాదు. బుద్ధిలేని ప్రాణికోటి అవివేకంగా ప్రవర్తిస్తుంది. రాక్షసులు, పిశాచాలు అవివేకంగా స్వర్గాన్ని పొందాలని ప్రయత్నిస్తారు. తమ అర్హతను గుర్తించరు. తామున్న నరకాన్ని నలువైపుల విస్తరింపచేస్తారు.

"మనోవికారాల కారణంగానే మనిషి దివ్యత్వానికి దూరం అవుతున్నాడు. స్వయంకృతాపరాధాలతో పతనం చెందుతున్నాడు. మనిషి బుద్ధిజీవి. వివేకంతో మంచిమార్గాన్ని ఎన్నుకోవాలి. అనేక మార్గాలలో తనమార్గం తను నిర్ణయించుకోవాలి. ఏ మార్గాన వెళ్లినా గమ్యం చేరడం అంత సులభం కాదు. గమ్యం వదలి అహానికి దాసోహం అయినవారి గతి అధోగతే. మనోభూమికల్ని దాటి ముందుకు పోవాలి. అలా పైకి పోగలిగితే పరమాత్మ సన్నిధికి నెమ్మదిగా చేరగలవు. బ్రహ్మానంద స్థితిలో ప్రేమ సంపూర్ణమవుతుంది. శాశ్వతమవుతుంది. మానవప్రేమ స్థానంలో దివ్యప్రేమ ప్రవేశిస్తుంది. ప్రపంచంలో ప్రతి పనికి ఒక న్యాయం, ఒక శక్తి ఉంటుంది. అదే నీ ఆత్మశక్తిని ద్విగుణీకృతం చేస్తుంది. నీవు పరమాత్మకు చేరువవుతున్నకొలదీ ఆలోచనలు, కర్మబంధాలు వీగిపోతూ దివ్యానందాన్ని కలిగిస్తుంటాయి. అప్పుడు నీ జీవితం ఒక మహాయాత్ర అనిపిస్తుంది. పురోగమనంలో ప్రతి అనుభవం ఒక మలుపు, ఒక మైలురాయి, ఒక సూచిక. ప్రతి ఉదయం దివ్యతేజస్సును మరికాస్త చేరువ చేస్తుంది. నీవు చేసే పనులే నీకు సహాయంగా ఉంటాయి. ఒకానొక అద్భుతశక్తి జాగ్రత్స్వప్నాలలో తోడుగా నడుస్తుంది. నీ ఆత్మ దివ్యత చెందేవరకు ప్రశాంతంగా గడుపు. అదే కాంతిగా మారుతుంది."

అమ్మ మాటలు విని సావిత్రి కృతనిశ్చయంతో అన్నది –

"అమ్మా! నా సంకల్పం భగవత్సంకల్పంలో ఒక భాగం. నా ఆత్మశక్తి నా అదృష్టాన్ని నిర్ణయిస్తుంది. నా ఆత్మశక్తిని భరించగలదే నా విధి. విధికి నేను తలవంచ లేను. నాది రాక్షసబలం కాదు, దైవబలం కాదు. ఆత్మబలం. సత్యవంతునిలో నా ఆత్మను దర్శించాను. నా ఆత్మ నాలోనే కాదు అతనిలోనూ ఉంది. నా ప్రేమే నా ఆత్మ.

"నా ఒక్కదాని శ్రేయస్సు నేను కాంక్షించను. నాలో ఉన్నది స్వార్థం కాదు. నా సుఖం కోసం నా లక్ష్యాన్ని త్యాగం చేయలేను. నాలోని ప్రశాంతి,

సుషుప్తి నశించాయి. ఇప్పుడు నాకున్నది ఆత్మప్రపంచం ఒక్కటే. నేను కలల్లో బ్రతకలేను. కలల్లో సుఖపడలేను. నా ఆత్మ నా లక్ష్యాన్ని గుర్తించింది. ప్రేమాగ్నిలో నా హృదయం తప్తమైంది. సత్యవంతుని అమరత్వంతో నా అమరత్వం పెనవేసు కుంది. మా ఆత్మలు కాలప్రవాహంలో ఎన్నో ఆటుపోటులు అనుభవించాయి. ప్రేమించడానికి ఎప్పుడూ అవకాశం ఉంది.

"ఇది నా కడపటి ఆనందం. దీనిముందు వేల సంవత్సరాల అనుభవాలు పేలవంగా మారాయి. నాకు సుఖాలు, సంపదలు అవసరం లేదు. మృత్యువంటే భయం లేదు. విషాదం నా దగ్గరకు రాదు. నాకు సత్యవంతుడు కానపుడు ఎవరూ అక్కరలేదు. అతని కౌగిలిలో కనిపించిన స్వర్గం వదులుకోలేను. అతని ప్రేమను వదలి నేనుండలేను. అతనే నా ఆత్మ. అతని దర్శనంతో నా జన్మ చరితార్థమైంది. వెలుగులో, చీకటిలో అతనితో కలిసి నేను పయనించగలను.

"ఒక్క సంవత్సరం చాలు ... అదే నా విధి అని నేను నమ్మడం లేదు. జీవించడం, ప్రేమించడం, చనిపోవడం ముఖ్యం కాదు. నా ఆత్మ ఈ ప్రపంచంలో ఎందుకు అవతరించిందో ఆ పని పూర్తిచేయాలి. నేను ఎవరో, నేను కోరుకున్న ఆ వ్యక్తి ఎవరో, నా ఆత్మ ద్వారా తెలుసుకున్నాను. సత్యవంతునిలో నేను పరమాత్మను దర్శించాను. అతను మానవరూపంలో ఉన్న పరమాత్మ."

ఆమె మాటలకు ఎవరూ సమాధానం చెప్పలేదు. అందరూ నిశ్చలంగా, నిశ్శబ్దంగా ఉండిపోయారు. విధివైపు అందరి ఆలోచనలు పరుగులు తీశాయి.

18. విధివిన్యాసం

రాణి వివేకవతి. విధివిన్యాసం గురించి మహర్షిని ప్రశ్నించింది. "మనిషికి బాధలు ఎందుకు వస్తాయి? భగవంతుని లోపమా! ఏదైనా ప్రతిఘటన వలనా! మనిషి చేసే తప్పుల వలనా?

మహర్షి మానవనైజం గురించి, విధిని గురించి వివరించాడు – "మనిషి అజ్ఞానంలో ఉన్నంతకాలం ఆత్మజ్ఞానం కలగదు. అజ్ఞానం వల్లనే మనిషికి కష్టాలు కలుగుతుంటాయి. ప్రతి మనిషిలోను దివ్యాంశ ఉంటుంది. భగవంతుడు తన కార్యాలకు కొందరినే ఎన్నిక చేస్తాడు."

రాణి మనస్సు గ్రహించిన మహర్షి ఆమెను ఊరడించాడు. విధి నిర్ణయాన్ని మార్చడానికి ప్రయత్నించవద్దు. భగవంతుని నిర్ణయాలకు మనిషి సహకరిస్తే కడకు మేలు జరుగుతుందని చెప్పాడు. అశ్వపతికి కొన్ని సందేహాలు కలిగాయి. అంతా విధి నిర్ణయమే అయితే మానవప్రయత్నం ఎందుకు? విధిని మార్చే శక్తి మనిషికి ఉండదా? సావిత్రిలో అలాంటి శక్తి ఉన్నదని ఆయన నమ్మకం.

మనిషి ప్రార్థనలు భగవంతుడు వినడు. సావిత్రిలో దివ్యతేజస్సు ఉంది. ఆమె విషయంలో పరమాత్మ నిర్ణయం వేరు. మనిషి తన కర్మఫలాన్ని అనుభవించవచ్చు. తిరస్కరించవచ్చు. ఒకసారి విధిని ధిక్కరించగలిగితే అతను పైకి పోతూ ఉంటాడు. పరమాత్మ సన్నిధికి చేరుకుంటాడు.

మహర్షి, అశ్వపతి, వివేకవతి విధివిన్యాసం గురించి విపులచర్చ చేశారు. చర్చ రసవత్తరంగా సాగింది. విధి, కర్మ, మానవసంకల్పం – మొదలైన విషయాలపై ముగ్గురి అభిప్రాయాలు కలగలిపితే ఒక సమగ్ర చిత్రణ ఏర్పడుతుంది.

నారదమహర్షి చివరకు ఒక మాట అన్నాడు – "జరిగేది జరగనీయండి. అడ్డుపడితే ఏదీ ఆగదు. సావిత్రికి ఆత్మశక్తి ఉన్నది. ఆత్మశక్తితో పోరాడితే విధిని, కర్మను జయించవచ్చు. పరమాత్మను చేరడానికి సాధన అవసరం."

విధినిర్ణయంపైన నిశ్శబ్దం వల విసిరింది. విధి అన్నది పరమాత్మ నిర్ణయానికి పర్యాయపదం. దానిని ఏశక్తి మార్చలేదు. పరమాత్మ సంకల్పం ఒక్కటే విధి లిఖితాన్ని మార్చగలదు. పరమాత్మ అనుగ్రహానికి పాత్రులైనవారు విధిని దాటిపోగలరు.

“విధిని, దైవనిర్ణయాన్ని మానవసంకల్పంతో మార్చవీలున్నది.” అనే వాణి వివేకవతి చెవులకు సోకింది. అది ఆమెలో రవంత ఆశను చిగిర్చింది. కాని ‘మృత్యువు’ అనే మాట ఆమెను కల్లోలపరచింది. తన మనశ్శాంతిని ఎవరో లాగేసినట్లు అనిపించింది.

కొంతసేపు మానసికస్థాయికి దిగివచ్చింది. మనిషి విషాదాలను భరించక తప్పదు. ప్రకృతి తన పని తాను చేసుకుంటూ పోతుంది. బాధలు భరించక తప్పదనిపిస్తుంది. మహాశక్తిని భూమి భరిస్తున్నట్లు ఆమె విషాదాన్ని గుండెలో నింపుకుని ప్రకృతిలోని అసంతృప్తికి తానే ప్రతినిధి అయింది. మూగజీవుల ఆవేదన తనదే అనిపించింది. మూర్తీభవించిన అజ్ఞానంలోని విషాదంవలె సూటిగా పరమాత్మనే నిలదీసి ప్రశ్నించినట్లు మహర్షిని ప్రశ్నించింది.

“మహర్షీ! మానవజీవితంలో ఈ చిత్రమైన ద్వంద్వప్రవృత్తికి ఏమిటి కారణం? ఈ దుర్ఘటనలు నిర్దయగా ఎందుకు జరుగుతున్నట్లు? సృష్టికర్త సంకల్పంలో పలికిన అపస్వరమా! ఏ పొరపాటువల్ల, ఏ గ్రహపాటువల్ల క్షణంలో విధివక్రించి జీవితం తొట్రుపడి ఈ విషాదాలు, వియోగాలు ఏర్పడుతున్నాయి. ఈ క్రూరనిర్ణయం భగవంతునిదా? లేక మరేదైనా కారణం ఉన్నదా? వినాశకర శక్తులు సుందరసృష్టిని వికృతం చేస్తున్నవా? భగవంతుడు ఏమీ చేయలేక తన సృష్టిని తాను రక్షించుకోలేకపోతున్నాడా? జీవితం ఆరంభంలోనే ఈ మృత్యుబీజం పడడానికి ఏది కారణం?

“భూలోకం అంటేనే పాపపుణ్యాల సమ్మేళనం. ఆ తర్వాత ఏర్పడ్డది రుగ్మత. ఈ మానసిక రుగ్మతకు భావశబలత కారణం? సరైన జీవితలక్ష్యం ఏర్పడక పోవడం కారణం. పాపపుణ్యాలు మంచిచెడు కార్యాలుగా మారి అనాగరిక పశు

ప్రవృత్తిని ప్రేరేపిస్తున్నాయి. ఇంద్రియలోలత్వం వల్లనే మనిషి దివ్యమార్గాలు మరచి వక్రమార్గాలు అనుసరిస్తున్నాడు. మనిషి తన లక్ష్యాన్ని ఆకాశం నుండి జారిపడే నక్షత్రకాంతులలో అన్వేషిస్తాడు. ఆలోచనకు నిలకడ ఉండదు. సంకల్పం అస్థిరం. అంతర్దృష్టి ఏర్పడితే అహంకారం నశిస్తుంది. ఆత్మ స్వతంత్రించి సత్యంవైపు ఎదుగుతున్న కొద్దీ ప్రవృత్తిమార్గాలు మూడపడి పోతాయి.

"కాలాన్ని అధిగమించిన ఆత్మలు కాంతిసీమలలో తిరుగుతాయి. అవి జన్మించనవసరం లేదు. ఈ ప్రపంచంలో తిరిగి జన్మించడం అంటే ఏరికోరి కష్టాలను, విషాదాలను తెచ్చుకోవడమే. జీవుని పుట్టుక వేదనతో, రోదనతో జరుగుతుంది. వసుధ అమృతత్వాన్ని ఎప్పుడూ స్వాగతిస్తుంది. భౌతికత అమరం కావడం భూమికి ఇష్టం. కాని మానవజీవితం వేయి అపశ్రుతులతో దివ్యరాగాలను ఆస్వాదించనీయదు. జీవితంలో కనీస ఆనందం సైతం కరువవుతుంది.

"మనిషి శరీర నిర్మాణంలోనే లోపం ఉంది. అంచేత అవయవాలన్నీ ఎప్పుడో ఒకప్పుడు చెడిపోతుంటాయి. ఆ లోపాలను సరిచేసే వరకు మనిషిలో దివ్యత్వం శాశ్వతంగా నిలిచే అవకాశం లేదు. మానవప్రవృత్తి రాక్షసనైజానికి స్వాగతం చెబుతుంది. ప్రమాదాలను ఆహ్వానిస్తుంది. వేదనలు, రోదనలు తప్పించుకొన వీలులేని విధంగా రక్తంలో కలిసిపోయి ఉంటాయి. కాలానికి, కర్మకు, విధికి మనిషి ఋణపడుతున్నాడు. క్రమంగా మృత్యువును చేరుతున్నాడు.

"ఈ కష్టాలు మనిషి అనుభవించిన సుఖాలకు చెల్లించే పరిహారం. అవి మనిషిపైన చెరగనిముద్రలు వేస్తున్నాయి. మనిషి శరీరంలో అనేక రుగ్మతలు ప్రవేశించి లోపాలు కారణంగా స్థిరపడిపోతాయి. అవే జీవుని హింసిస్తూ మృత్యువును ఆహ్వానిస్తాయి. అవి కుత్సితాలుగా మనస్సులోపల దాగి చీకటిలో అజ్ఞానం తిని బలిసి అవకాశం వచ్చినపుడు బయటకు దూకుతాయి. ప్రమాదాల రూపంలో ముంచుకొస్తాయి. అవి రోగాలనే మహాదుర్గాలు నిర్మించుకుని మనిషి శక్తియుక్తుల్ని హరించి అకస్మాత్తుగా చంపుతాయి.

"మనిషి మనస్సే మారణాయుధాల్ని తయారుచేస్తుంది. మంచిని శత్రువుగా భావించడం మనస్సుచేసే మొదటితప్పు. కలుగుల నుండి వెలువడే ఎలుకల వలె అవి బయటపడి దివ్యవీణాతంత్రుల్ని కొరికివేస్తాయి. ఆపైన దివ్యవీణ పలకదు. దివ్యవాణి వినిపించదు. బ్రతుకంతా అపస్వరాలే. అన్ని ద్వారాలు మూతపడిన కోటలో మనిషి బ్రతుకుతుంటాడు. అజ్ఞానం అనే గాఢనిద్ర నుండి లేవడు. కలలు కంటూ పలవరిస్తుంటాడు. ప్రేమరాహిత్యంవల్ల మనిషి జీవితం నిస్సారమవు తుంది. విలువలేని దవుతుంది.

“చీకటిలో గుప్తనిధిని అన్వేషించినట్లు, నిరాయుధుడైన యోధుడు బీరాలు పలికినట్లు, పరిజ్ఞానం లేని కార్మికుడు పరిశోధనకు పూనుకున్నట్లు, అజ్ఞాని అయినవాడు న్యాయమూర్తి అయినట్లు... మన జీవనయాత్ర మూతపడిన స్వర్గాల దగ్గర ఆగిపోతుంది. మన ఔన్నత్యం, ఆడంబరం అహంకారం వల్ల బూడిదపాలైన అమృతం వలె నిరుపయోగమవుతుంది.

“మనిషికి ప్రకృతి ప్రసాదించిన వరాలన్నీ కడకు శాపాలుగా పరిణమిస్తాయి. అన్ని మార్గాలలో అపజయాలు, ప్రాతికూల్యం తప్పవు. మనిషి ఆలోచనల్లో ఎప్పుడూ దోషాలు దొర్లుతుంటాయి. ఎదలోపల సత్యం కదలాడినా, పైన అసత్యపు పొరలు. సుందర సుమాలలో ‘విషం’ దాగి ఉంటుంది. ఆ విషం సోకి ఆత్మ ఎర్రబారుతుంది. ‘సద్గుణం’ అన్నది భావదాస్యం. అది మానసిక కారాగారం. అడుగడుగునా మనిషిని వలలో బంధించచూస్తుంది. వివేకానికి, ఆత్మకు అందనంత దూరాన చీకటిగుహలో మనిషిని కర్మలు బంధిస్తాయి. అజ్ఞానపు చీకటిలో ఏమీ పాలుపోదు. బయటపడే అవకాశం ఉన్నా ప్రయత్నించడు. గత జన్మలలో చేసిన పాపాలు ఈ జన్మలో శాపాలుగా మారతాయి. నేటి దుష్కర్మలే వచ్చే జన్మకు కర్మశేషాలు. మనిషి అనేక జన్మలుగా తప్పులు చేస్తూ విషసంస్కృతిని పోగు చేసుకుంటాడు. అవే పాపాలుగా, శాపాలుగా చుట్టుకుంటాయి.

“గతజన్మ పాపం చాలనట్లు మనిషి ఈ జన్మలోనూ స్వజీవనక్షేత్రంలో నాగటిచాళ్లలో కష్టాల బీజాలు నాటుకుంటాడు. అవే బాధల పంటలు పండిస్తాయి. స్వయంకృత దుశ్చర్య మనిషిని కట్టికుదుపుతాయి. మనిషి తానుగానే నరకంలోకి నడిచిపోతాడు. మనిషి తనకు తనే ప్రబల శత్రువు. అతని అజ్ఞానమే అతని పతనానికి కారణం. తన వారికి అపకారం చేయడానికి భూమిని శోధిస్తాడు. ప్రకృతిని పరిశోధిస్తాడు. స్వసుఖాన్ని, పరుల ఆనందాన్ని నాశనం చేయడమే సంస్కారంగా భావిస్తాడు. కాలం గడిచినా, చరిత్ర తెలిసినా ఏమీ నేర్చుకోడు.

“కర్మను విశ్వసిస్తూ అజ్ఞానంలో బ్రతికినంతకాలం గతజన్మ సంస్కారాలు మనిషిని పీడిస్తుంటాయి. ఆత్మను సైతం బాధిస్తాయి. ప్రశాంత జీవితంలో యుద్ధవాతావరణం నెలకొంటుంది. మనిషి అత్యాశతో జరిపే పోరాటంలో అరాచకం, వినాశం ప్రధానపాత్ర వహిస్తాయి. చిరకాలంగా పోగుచేసుకున్న ‘మంచి’ క్షణంలో కరిగిపోతుంది. ద్వేషం, అసూయ మంచిని సమాధిచేస్తాయి. మనిషిని నాశనం చేస్తాయి. వివేకంతో సంపాదించుకున్న ఔన్నత్యం, కీర్తి, శ్రమించి సంపాదించుకున్న సంపదలు నాశనమవుతాయి. మనిషి తను కూడబెట్టుకున్న దంతా కూలదోసుకుంటాడు. తన సమాధిని తానే నిర్మించుకుంటాడు. తన

అల్పబుద్ధితో నరకం సృష్టించుకుంటాడు. ఎవరో దిగివచ్చి తనను ఉద్ధరిస్తారని భ్రమపడతాడు. తను సరాసరి స్వర్గానికే వెళతానని భ్రమపడతాడు. తాను తీసుకున్న గోతిలో తను పడిపోతున్నానని గ్రహించడు. మానవ విపత్తుకు, విశ్వ విషాదానికి, ప్రపంచ పతనానికి మనిషిదే బాధ్యత. కాలం, కర్మ, మృత్యువులతో కుతంత్రం సాగిస్తాడు. ఇక్కడ భూమిపైన తన నివాసం తాత్కాలికమేనని గ్రహించడు. చివరకు సాధించేది మాత్రం శూన్యం.

"పరమాత్మ తేజోవలయంలో ప్రవేశించిన జీవి నిరాశకు, నిస్పృహకు లోనుకాడు. కలత చెందడు. అతని సాధన అనంతంగా కొనసాగుతుంది. అతని సత్యాన్వేషణ నిరంతరం సాగుతుంది. కొత్త ఆశలు చివురించినా లక్ష్య పెట్టడు. గతజన్మ సంస్కారాలు అతనికి నిరుపయోగమవుతాయి. గతం అతనికి కరిగిపోయిన కల. అందులో వాస్తవం ఉండదు.

"ఈ ప్రపంచం ఏమిటి? ఎక్కడి నుండి ఇక్కడికి వచ్చాం? ఇది సృష్టికర్త ఆడించే నాటకం అయితే, మన ఆత్మలు తిరిగి స్వస్థానానికి వెళ్లిపోవడమే గమ్యమైతే, ఈ జీవన యాత్రలు ఎందుకు? కాలగతిలో అన్నీ నిరర్థకాలేనా? కాక, జీవులకు, జీవితాలకు వేరే పరమార్థం, ప్రయోజనం ఉన్నాయా? ఆత్మకు అజ్ఞానం ఏమిటి? కన్నీటికి కథ లెందుకు? ఆత్మ జాగృతమైతే బాధలు, విచారాలు కలగ నవసరం లేదు కదా? సృష్టి అకారణంగా, విధాత విలాస క్రీడగా ఏర్పడిందా? ఏ ఒత్తిడివల్ల ఆత్మ మనిషిలో ప్రవేశిస్తున్నది? ఒక్కసారి మనిషి అమృతత్వం రుచిచూస్తే అమరుడు, మృత్యుంజయుడు కాగలడు. కాని నిరుపయోగమైన ఆలోచనలతో అమృతత్వానికి దూరంగా పోతాడు. స్వప్నాలలో జీవిస్తాడు. సగం వెలుగు నిండిన మానవ జీవితంలో ఆత్మ పూర్ణత్వం పొందేది ఎప్పుడు?

"ఏ కారణంగా ఆత్మ పూర్ణ సచ్చిదానందం పొందలేకపోతున్నది? తనదైన అమృతత్వాన్ని ఎందుకు దూరం చేసుకుంటున్నది? జీవించడం అనే వాంఛ ఆత్మకు ఎందుకు కలిగినట్లు? ఈ విషాదమయ సుందర ప్రపంచంలోకి ఎందుకు దిగివచ్చింది? మానవ శరీరంలో ఉంటూ ఆనందాలు, ప్రేమలు, విషాదాలు ఎందుకు అనుభవిస్తున్నట్లు?

"ప్రపంచంలో జరిగే ఈ ఘోరసంఘటనలను ఎవరూ పట్టించుకోరా? అయినప్పుడు పరమాత్మకు మనుషులతో ఏం పని? ఏం సంబంధం? భూమి లాంటి గోళాలు ఎన్నో వేలు ఉన్నాయి. వాటిని ఏ మహామాయ నిర్మించింది.

ఆత్మకు ఆవాసం ఏది? రక్షణ ఎక్కడ? ఖగోళంలో భూమి అర్ధరహితంగా చరిస్తున్నదా? భూమికి కాలదోషం, కర్మదోషం పట్టిందా? ప్రపంచానికి ఏది ప్రయోజనం? ఈ సృష్టికి ఆది ఎక్కడ? అంతం ఎప్పుడు? అసలు మనిషి ఉన్నదనుకునే ఆత్మ ఉన్నదా? అదీ కల్పన కాదు కదా? సమాధ్యవస్థలో మనం అనుభూతించే పరమాత్మ యదార్థమా? లేక అదీ మానసిక కల్పనా?"

నారదమహర్షికి మానవనైజానికి సంబంధించిన సంకేతాలు అందాయి. ఆయన భృకుటి ప్రకాశించింది. ఫాలనేత్రంతో దృశ్యాలు తిలకించాడు.

పరలోక జ్ఞానభాండాగారం తలుపులు తెరిచినట్లయింది. భాష అవసరంలేని భావజాలాన్ని అందుకున్నాడు. ఆయన ముఖవర్ఛస్సుకు కాంతి వెలవెలపోయింది. మార్మికరచనలు బయటకొచ్చాయి. దివ్యప్రణాళికలు కళ్లలో మెదిలాయి. అసంపూర్ణంగా ఉన్న విషయాలు సైతం సంపూర్ణంగా కనిపించసాగాయి. అప్పుడు అన్నాడు :

"అమ్మా! తల్లీ! చీకటిపడినంతమాత్రాన సూర్యుడు లేడనగలవా? మనిషి హృదయంలో భగవంతుని స్థానం ఎప్పుడూ భద్రంగా ఉంటుంది. ప్రతివ్యక్తి ఆత్మమందిరం పరమాత్మకు ఆవాస యోగ్యమే. విషాదాలు లేని వెలుగు అక్కడ ప్రకాశిస్తుంది. మనిషికి భగవంతునికి మధ్య అడ్డుతెర అజ్ఞానం. ఆ పరమాత్మ రూపాన్ని మనిషి చూడలేడు. ఆ తేజస్సును చూచి భరించలేడు.

"మహారాణీ! నీ ఆలోచనపైన అజ్ఞానపుపొర ఉంది. అది భగవంతుని ప్రత్యక్షంగా చూడనీయదు. అది చీకటి లోకాలనే చూపిస్తుంది. ఈలోకంలో భగవదర్థం దాగి ఉంటుంది. అదొక పరమరహస్యం. నీ మనస్సే పరమాత్మను నీలో చొరనీయదు. నీ కోర్కెలు పరమాత్మను నీకు దూరం చేస్తాయి. భౌతిక సుఖభోగాలు కాంక్షించినంత కాలం, వాటిని అనుభవిస్తున్నంత కాలం, బ్రహ్మా నందం నీదరికి చేరదు. నిన్ను వెన్నంటి నడిచే క్షుద్ర, నీచ దేవతలు నిన్ను మభ్య పెడతారు. అజ్ఞానం నీడల్లో బాధలు కాపురం చేస్తాయి. వెలుగుకై చీకటి పడే ఆక్రందన లాంటిది నీ విచారణ .

"ఈ అజ్ఞానపు చీకటి ప్రసవించిన తొలిశిశువు 'యాతన'. అది నీ భౌతిక శరీరానికి తొలి ఆధారం. అది కదలక మెదలక నీలో నిద్రిస్తుంది. అది చీకటికి ఛాయ లాంటిది. కొంత జీవితం ముందుకు సాగేవరకు అది వేచి ఉంటుంది.

"ఒక శక్తి అగోచరంగా మనిషిలో ప్రవేశించి తల ఎత్తుతుంది. అది ద్వంద్వంగా పనిచేస్తుంది. ద్విపాత్ర పోషణ దానిది. ముందు కలిగేది బాధ.

తర్వాత ఆనందం. ఆ రెంటిమధ్యన నలిగి 'యాతన' స్థిరపడుతుంది. యాతన వల్ల శక్తి పుట్టుకొస్తుంది. ఘర్షణ కారణంగానే జడం నుంచి చైతన్యం రగులుతుంది. అది భౌతిక శరీరంలో అచేతనావస్థలో ఉండి నిద్రిస్తున్న మేధను మేల్కొల్పుతుంది. తను కలగన్న లోకాన్ని తానే సృష్టించుకోగలదు. ఉపచేతనలో దాచుకున్న రూపాలను బయటకు తీస్తుంది. తాను సృష్టించుకున్న లోకంపైన తన ఆధిపత్యం చలాయిస్తుంది. విషాద ఆనందాల వలె చీకటి వెలుగులు కవలలు. నిర్జీవంగా ఉన్న లోకం తనలోకి జీవాన్ని గ్రహిస్తుంది. కానప్పుడు జడప్రపంచం పరిణామం చెందే అవకాశం లేదు. మానవ హృదయంలోని ప్రతిఘటించే గుణాలను తునాతునకలు చేయగల వజ్రాయుధం 'బాధ'. అది దేవతల అధీనంలో ఉంటుంది. అది సజీవశిలలోని జడత్వం లాంటిది.

"హృదయానికి వాంఛలు లేనపుడు కన్నీటికి అవకాశం ఉండదు. మానవాత్మ తృప్తిగా, నిశ్చింతగా ఉండగలుగుతుంది. మానవత్వం క్రింది మెట్టుకు దిగజారదు. పరమాత్మ దిక్కుగా పైకిపోవాలన్న ప్రయత్నమూ ఉండదు. ఈ ప్రపంచమే యాతనా మయం. బాధలతో నిండింది. అన్ని వేదనలు భూదేవి భరిస్తుంది. యాతనలేని జీవి ఒక్కటి చాలు భూదేవి భారం తగ్గించడానికి, కన్నీరు తుడవటానికి. శతాబ్దాలు, సహస్రాబ్దాలు గడచిపోతున్నాయి. యుగాలు మారిపోతున్నాయి. ఇంకా ప్రపంచంలో దివ్యత్వం నెలకొనడానికి వెనకాడుతోంది. భూదేవి అన్ని బాధల్నీ భరిస్తున్నది. యాతనలోనే ఆనందం పొందుతున్నది. ప్రసవవేదన తర్వాతనే సృష్టి జరుగుతుంది.

"ఈ ప్రపంచంపై నీచదేవతల ప్రభావం ఎక్కువ. క్షుద్రశక్తుల ఆర్భాటాలు ఎక్కువే. విధి ప్రోద్బలం వల్ల అవి మరీ విజృంభిస్తున్నాయి. విశృంఖలంగా విహరిస్తున్నాయి. అవి తమ సంకల్పంతో నకిలీ దివ్యత్వాన్ని సృష్టిస్తున్నాయి. పరమాత్మ సంకల్పం నెరవేరాలంటే జన్మజన్మలుగా పేరుకుపోయిన పాపాలు క్షాళన కావాలి. మనిషి అజ్ఞానం నుండి, మూర్ఖత్వం నుండి బయటపడాలి. మనిషి స్వతంత్రం అయ్యేవరకు ఈ ఆత్మహింస తప్పదు.

"మనిషికి ఎప్పుడూ ఆరాటాలు, పోరాటాలు... కదన కుతూహలం... గుండెల్లో సాగరఘోష... మృత్యుఘాతాలకు నీరసించిన నవ్వులు. రక్తం, స్వేదం, కన్నీరు కల్పించే నిరాశలు, నిస్పృహలు – మనిషి మరణిస్తాడు. మానవత్వం జీవిస్తుంది. కాలం ఎంత క్రూరంగా సాగినా నిశ్శబ్దం భరిస్తుంది. ఆ నిశ్శబ్దమే మనిషిని మహనీయునిగా రూపుదిద్దుతుంది. మనస్సు సహకరించకపోయినా, ప్రకృతి ఆటంకాలు కలిగించినా, దివ్యత్వం మనిషిలో ప్రవేశించి తీరుతుంది.

"మనిషిలో రాక్షసప్రవృత్తులు అధికం. అవి మారణాయుధాలుగా మారి వినాశానికి ప్రయత్నిస్తాయి. తమకు లోబడిన వారిపైన పెత్తనం చలాయిస్తాయి. అవి కొట్టే దెబ్బలముద్రలు మాసిపోవు. మనిషిపైన క్షుద్రశక్తుల ప్రభావం దారుణంగా ఉంటుంది. అతి దుర్భరంగా ఉంటుంది. క్షుద్రశక్తి మనిషి లోలోపల పెరుగుతుంది. అది కాటువేసిన ప్రతిసారి మనిషి వికృతానందం అనుభవిస్తాడు. వాటి ప్రభావాలకు లోనుకాకుండా తనను తాను రక్షించుకోగల వ్యక్తి నిర్మలంగా జీవిస్తాడు.

"లోకాన్ని ఉద్ధరించాలనుకున్నవారు కష్టపడక తప్పదు. బాధలు అనుభవించక తప్పదు. అలాంటి వారిలో తీరని తపన ఉంటుంది. ప్రపంచాన్ని బాధల నుండి విముక్తం చేయాలని ప్రయత్నించడం వల్ల తను బాధ పడతాడు. తను ఛేదించాలను కున్న చట్రంలో తానే ఇరుక్కుంటాడు. కర్మభారాన్ని తన భుజస్కంధాలపైన వహించకతప్పదు. ఇతరులకు స్వర్గసుఖాలు అందించేవారు తాము నరకయాతన పడతారు. జ్ఞానసంపదకై తమ జీవితాలను బలిపెడతారు.

"భగవంతుని కుమారుడు కరుణామయుడుగా జన్మించాడు. లోకంలోని విషాదాన్ని మ్రింగి తండ్రి రుణం తీర్చుకున్నాడు. పతితులకు, భ్రష్టులకు, బాధాసర్పదష్టులకు భగవంతుని సానుభూతి లభిస్తుంది. వారు బాధల ద్వారా మృత్యువును చేరుతుంటారు. వారి జీవితాల్లో సుఖశాంతులు కనిపించవు. కష్టాలు అనుభవిస్తే కర్మవిముక్తి లభిస్తుంది. వాస్తవానికి మనిషి రూపంలో ఈ బాధల్ని అనుభవిస్తున్నది భగవంతుడే. తన రక్తంతోనే మానవుని విముక్తిపత్రంపై సంతకం చేస్తాడు. తానే స్వర్గద్వారాల తలుపులు తెరుస్తాడు. మనిషి సంకల్పానికి భగవంతుని సహకారం ఎప్పుడూ ఉంటుంది. భగవదంశలో జన్మించిన వారినే ఎక్కువ కష్టాలు కాటువేస్తాయి.

"భగవదంశలో జన్మించినవారు మహాత్ములై మనిషికి మంచిమార్గం సరిచేయడానికి జ్ఞాని తన ప్రజ్ఞను చూపిస్తారు. వారి అవతార లక్ష్యం అదే. మనిషి అజ్ఞానం వల్ల చేసే తప్పులు వెచ్చిస్తాడు. అతని జీవితం మహత్తర త్యాగంతో ముగుస్తుంది. విశ్వకల్యాణం కొరకే మహాత్ములు బలి అవుతుంటారు. తాము శిలువను ధరించి ఆ శిలువపైనే ప్రాణ త్యాగం చేస్తారు. శిలువ మానవ విషాదానికి ప్రతీక. ప్రజల కర్మల్ని తాము స్వీకరించడమే మహాత్ములు చేసే పని. అలాంటివారు లోకాపవాదాలను, అవమానాలను, అవహేళనలను భరించక తప్పదు. దివ్యజీవన మార్గానికి మహాత్ముల రక్తం తిలకం దిద్దుతుంది.

"తాను భగవంతుని ప్రతినిధినని తెలుసుకున్నవాడు మృతి చెందిన వెంటనే తేజస్సుగా మారిపోతాడు. అతని జ్ఞానం మృత్యువు తర్వాత విశ్వవ్యాప్త మవుతుంది. అతని శక్తి సర్వత్రా వ్యాపిస్తుంది. శరీరంతో ఉన్నప్పటి కంటే శరీరం వదలిన తర్వాత 'ఆత్మ' శక్తి వేయింతలవుతుంది. 'నేనే బ్రహ్మం' అని అంతరాత్మ బోధిస్తుంది. 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అని హృదయం తెలుసుకుంటుంది.

మానవ హృదయక్షేత్రాలలో దైవత్వం బీజరూపంగా ఉండి, సమయం వచ్చినప్పుడు వృక్షంగా మారి దివ్యపుష్పాలను పూయిస్తుంది. తన ఆత్మను సర్వజీవులలోని ఆత్మగా భావించగలగాలి. భగవంతుని ప్రతినిధులుగా వచ్చిన మహాత్ములు మానవ కళ్యాణానికి సహాయంచేస్తూ మానవాత్మలను ఉన్నత పథాలకు మళ్లిస్తారు. ఇతరుల బాధల్ని తాను భరించినట్లే, ఇతరుల బరువుల్ని తాను మోయక తప్పదు. ప్రపంచంలోని చెడులను, కష్టాలను రుచిచూసిన తర్వాతనే నివారణకు పూనుకుంటాడు. నిర్మోహత్వం, నిర్మమకారం మానవ విషాదాలను తొలగించ గలవు. గొప్పతనం బయటకు కనిపించదు. పోరాటం పైకి కనిపించదు. ఆవేదనలు, పోరాటాలు అన్నీ అంతర్గతాలే. విశ్వకల్లోలాన్ని తనలోకి ఆవాహన చేసుకుంటాడు. పాపాలను, శాపాలను ఆలోచనతో కరిగించివేస్తాడు. భూభారం అతని గుండెపై వాలుతుంది. సామాన్యులను చీకటిదేవతలు అడుగు ముందుకు వేయనీయరు.

ఎంతటి ప్రతికూలాల్ని మహాత్ములు భరించగలరు. వారికి పురోగమనమే తప్ప తిరోగమనం ఉండదు. ముందుచూపే తప్ప వెనకడుగు వేయడం జరగదు. వారిది మహాయాత్ర... అది కురుక్షేత్రం... కోటి కుత్తుక గుండెను కోస్తున్నా భరించగలరు. వారి జీవిత లక్ష్యం వేరు. కారుచీకటిలోనే అప్రమత్తత అవసరం. ప్రతికూల శక్తుల నిరోధం తప్పదు. వారి అంతరంగమే ఒక రణరంగంగా మారు తుంది. బాధలు దారుణంగా పెరగవచ్చు. ఫలితాలు విపరీతంగా ఉండవచ్చు. అహంబ్రహ్మ భావన వదలదు. బ్రహ్మచర్యం వల్ల లోకం లోని విషాదాన్ని మొత్తం తానే భరించగలడు. సర్వజీవకోటి విషాదాలు అతని గుండెను తట్టి లోపల ప్రవేశించి అక్కడ నిద్రిస్తాయి. అతని కారుణ్యం అందరి యాతనల్ని తన ఆనందంగా మార్చుకోగలదు. విశ్వాన్ని ప్రేమించడం అతనికి వరం.

"ఎంతటి బలమైన ప్రతికూల శక్తులనైనా ఎదిరించగలడు. ఎన్ని దెబ్బలనైనా అతని గుండె నిబ్బరంగా భరిస్తుంది. యుగయుగాల వేదన అతని కన్నీరై స్రవిస్తుంది. అందరి కళ్ల రక్తజీరల్ని తాను అమృతమయం చేయగలడు.

అతను గరళకంఠుడు. అందరి విషాదం విషంగా మారి అతని కంఠంలో దాగివుంటుంది. ప్రాపంచికత ప్రధానమై కష్టాలలో కాలిపోతున్న సమిధకు తనను కట్టివేసుకుంటాడు. తాను కాలిపోవడం అవసరం. తన భౌతిక ప్రయోజనాలను ఆధ్యాత్మిక సంపదలుగా మార్చుకుని తాను చేస్తున్న యజ్ఞానికి తానే ఆహుతి అవుతాడు.

భగవత్తత్వం ప్రాపంచిక బంధాలకు కట్టుబడి అశాశ్వతత్వానికి బందీ అయి కాలరహదారులలో ఎప్పుడో, ఎక్కడో తళుక్కున మెరిసి సాక్షాత్కరించి అంతర్ధానమవుతుంది. క్షణకాలంలో అనంత స్పందనను రగుల్చుకుంది. అవే ఎవరికైనా దివ్యక్షణాలు. లోకంలో మరల పుట్టి, మరల జీవించడం కోసం మనిషి మరణిస్తాడు. మరణించడానికి మరల జన్మిస్తానన్న ఆశ పునాది. ఎన్ని అగ్నుల్ని తప్పించుకున్నా, ఎన్ని బాధలలో మునిగినా మనిషికి త్యాగఫలితంగా స్వర్గం ప్రాప్తిస్తుంది. నరకాన్ని జయించడానికి పుణ్యం ఒక్కటే చాలదు. భీకర పోరాటం సాగించాలి. మనిషి తనలోని ప్రతికూల శక్తుల్ని ఓడించాలి. కాలం గుండెలో సుందరసృష్టిని నాశనం చేయగల అగ్నులు రగులుతుంటాయి. మనిషి పురోగమించడానికి యత్నించినా ప్రతికూలత నిగూఢంగా ఉంటుంది. దాని ప్రభావం మనిషి మనోవాక్కాయ కర్మలపై ఉంటుంది. చేసిన పనులన్నింటిపైన ఓటమి ముద్రలు కనిపిస్తుంటాయి.

మనిషికి బాహ్యశత్రువులకన్న అంతశ్శత్రువే బలవంతుడు. ఆ శత్రువు అగోచరంగా తనలోనే ఉండి గమనిస్తుంటాడు. మనల్ని కబళిస్తుంటాడు. మనవి కాని ఆలోచనలు మనకు కలిగిస్తూ, మనల్ని లోబరచుకుని మనచేత తప్పులు చేయిస్తాడు. ఆ విషవలయంలో మనం చిక్కుపడిపోతాం. చిరకాలంగా ఒక ప్రతికూల శక్తి మనిషిని దివ్యపథానికి దూరంగా తరిమివేస్తున్నది. పరమాత్మ తేజస్సునుసైతం కనిపించకుండా చేసే మాయ అది. దానికి పరమాత్మను ప్రతి ఘటించే శక్తి ఉంది. అదే భగవంతుని సందేశాలు మనకు అందకుండా చేస్తుంది. అదే మన జీవితాలలో అపశ్రుతులు పలికిస్తుంది. మనిషి మేధను పాపాలవైపుగా పరుగులు తీయిస్తుంది. ఆత్మను జ్ఞానాన్ని కలవకుండా నిరోధిస్తుంది.

మనషి కష్టాలకు, బాధలకు అదే మూలకారణం. అదే లోకాన్ని విషాదంలో ముంచుతుంది. ఆత్మశాంతిని పొందినవారు వీటిని లెక్కచేయరు. మనస్సులో దాగిన ఈ రహస్య శత్రువును ముందుగా మనిషి జయించాలి. లేనప్పుడు 'పరం' ఎన్నటికీ చేరలేదు. ప్రతి ఒక్కరిలో ఈ అంతర్మథనం, అంతర్యుద్ధం తప్పదు.

లోకాన్ని ఉద్ధరించబూనిన మహాత్ములకూ కడగండ్లు తప్పవు. ప్రపంచమే అతని పట్ల శత్రుత్వం వహిస్తుంది. తనను శత్రువుగా భావించేవారిని, తనను ద్వేషించిన వారిని అతను రక్షిస్తున్నట్లు అవుతుంది.

ఈ ప్రపంచం అజ్ఞానాన్నే ఇష్టపడుతుంది. ఎవరైనా రక్షించదలచినా, అజ్ఞానం అడ్డుపడుతుంది. చేసిన త్యాగానికి, ప్రేమించిన నేరానికి ఫలితంగా మహాత్ములనే బలి తీసుకుంటుంది, శిలువ వేస్తుంది. మహాత్ముల కృషి క్షణికం. మహాయాత్రలో ఒక మహాత్ముని మజిలీ ఏపాటి? సాధించేది ఎంత? ఏ మహాత్ముడైనా కొందరిని మాత్రమే ఉద్ధరించగలడు. మిగిలినవారు పతనం చెందుతారు. సూర్యుడు అస్తమించగానే చీకటి వ్యాపిస్తుంది. ఒక మహర్షి అస్తమయంతో లోకం చీకటి మయమవుతుంది. పరమాత్మ తేజస్సును చేరుకునే మార్గాలు అనేకం ఉన్నాయి. వెలుగు బాటలలో నడిచేవారు తక్కువ. ఆత్మశుద్ధి కలవారు మాత్రమే స్వతంత్రంగా వెలుగుబాటలు ఏర్పరచుకోగలరు. కొందరు మార్గం కనిపిస్తున్నా తాము ఉన్న చీకట్ల నుండి బయటపడరు. బంధాలు వదిలించుకోరు. అలా తప్పించుకున్న కొందరు మాత్రమే లోకాన్ని ఉద్ధరించ పూనుకుంటారు. అధికభాగం మానవులు బాధలతోనే నలిగిపోతుంటారు. తప్పించుకున్నంత మార్గాన పరమాత్మను చేరరు. పురోగమనం సాధించాలి.

లోకాన్ని వదలి పారిపోయినవారు విముక్తి పొందినట్లు కాదు. వారు ఎవరినీ ఉద్ధరించలేరు. తమనే ఉద్ధరించుకోలేరు. వారు విజయం పొందరు. దివ్యశక్తిని అందుకునే సంస్కారం, సాధన అవసరం. లోకంపైన వెలుగు పరచు కున్నంతమాత్రాన మహాత్ముల సంకల్పం నెరవేరినట్లు కాదు. మారు మూలల్లో చీకటి నక్కివుంటుంది. ప్రతికూల శక్తులు అవకాశం కోసం ఎదురు చూస్తుంటాయి. వాటిని సమూలంగా నిర్మూలించేవరకు మహాత్ములు అప్పుడప్పుడు జన్మిస్తూ ఉంటారు.

ఆ మహత్కార్యానికి ఎవరో ఒకరు పూనుకోవాలి. సంసిద్ధం కావాలి. అలాంటివారిని విజయాలు, అపజయాలు కదిలించవు. వారు చీకటిలోనూ ఉండ గలరు, వెలుగుల్ని సృష్టించుకోగలరు.గమ్యం దూరమైనా వారి గమనవేగం మారదు. చీకట్లు వారికి నిరాశ కలిగించవు. వారు క్షుద్రశక్తులను ఎన్నడూ ఆశ్రయించరు. దేవతల్ని అర్థించరు. తమ లక్ష్యం పైన నిశ్చలంగా దృష్టిని నిలుపుకుంటారు.

మనిషి చంచలస్వభావి. ప్రక్కత్రోవలు పట్టి, సులభమార్గాలు వెతుకు తుంటాడు. యోగి కఠినమైనా ఉన్నత మార్గాన్నే ఎన్నుకుంటాడు. ఆ ఒక్క మార్గమే

సూటిగా పరమాత్మను చేరగల మార్గమని అతనికి తెలుసు. ఉన్నత శిఖరాలకు చేర్చేది అదే. సీదాసాదా సీమలన్నీ అతను ఎరిగినవే. ఇహ పర లోకాలు అతనికి సహకరిస్తాయి. వాటి నిబంధనలు అతని ప్రగతికి అడ్డుకావు.. అన్నీ తన హృదయానికి, అభ్యుదయానికి అనుకూలంగా మార్చుకోగలడు.

యోగి ప్రగతికి ప్రకృతి ఎప్పుడూ ప్రతికూలం కాదు. పరమసత్యాన్ని అంతర్దృష్టితో దర్శించగలడు. కర్మబంధాలు అతనిని ఆపవు. అతని సంకల్పాన్ని మార్చవు. మార్గాలు ఎంత భయంకరమైనా, ఎంత ప్రమాదాలైనా అతను చలించడు. ఎన్ని ప్రతికూలాలనైనా నిరోధించగల ఆత్మ స్థైర్యం అతనికి ఉంటుంది. సంయమనంతో బాధల్ని, అనుభూతుల్ని దాటి, మంచి చెడుల్ని ప్రశాంతంగా విశ్లేషించుకోగలడు. బాధలు, యాతనలు అనుభవిస్తున్నట్లు కనిపించినా అతను వాటిని దాటిపోతాడు. అప్రయత్నంగా ప్రజ్ఞను అందుకోగలడు.

భగవంతుడు యోగనిద్రలో కన్నకలలు నిజాలై లోకాలుగా రూపొందాయి. యోగి తన యోగనిద్రలో ఆ లోకాలన్నీ దర్శిస్తాడు. ఆత్మశక్తితో సృష్టిలోపాలు గమనిస్తాడు. మనిషి ఆలోచనలకు పొంతన కనిపించదు. కఠోర కార్యాచరణ వ్యర్థం కావడానికి కారణం కనిపించదు. యాంత్రిక జీవితంలో ఎన్ని అనుభూతులు, ఆలోచనలు వ్యర్థమైపోతున్నాయో! అన్నీ మనిషిని తప్పుదోవ పట్టిస్తాయి.

యోగస్థితిలో అన్నీ తెలుస్తాయి. కాని ఏవీ నిలవవు. అన్ని నాదాలు నిశ్శబ్దంలో పుట్టి నిశ్శబ్దంలో లయిస్తుంటాయి. ఆ నిద్రాణస్థితి నుండే విశ్వం రూపొందినట్లు తెలుస్తుంది. అసంకల్పిత చైతన్యం వల్ల లోకం జీవం పోసుకుంది. శూన్యంలో పుట్టి శూన్యంలో లయిస్తున్న అంధకారం సృష్టికి ఆధారమైంది. పరార్థం నుండి పదార్థం ఏర్పడింది. ప్రతిఘటన మనిషి అజ్ఞానానికి తొలిమెట్టు.

యోగి తన తపస్సుచే చీకటికోణాలను వెలుగులతో నింపాలి. అంతవరకు సత్యం భౌతికత్వాన్ని జయించదు. లోకం సదా భగవంతుని వైపు చూస్తుంది. మనిషిని కప్పిన మాయ పొరలన్నీ తొలగిపోవాలి. మనిషి ఆత్మశక్తి అజేయంగా నిలబడాలి. మాయతెరలు తొలగిపోవాలి. వెలుగుకై యోగి అంధకారంలో అన్వేషించక తప్పదు.

అతని అంతర్దృష్టికి చెడు స్పష్టంగా తెలుస్తుంది. సృష్టి సాగటానికి కొంత చెడుకూడా అవసరం. చీకటి ఉన్నప్పుడే వెలుతురుకు విలువ. ప్రకృతికి రెండింటి అవసరాలు తెలుసు. మనిషిలో రాక్షసుడు ప్రవేశించటానికి కారణం ఉంది. కొంత అసురప్రవృత్తీ అవసరం. అసత్యమూ అవసరమే. వాటిని దాటి అనంతసీమలలో

చొరబడాలి. భగవంతుని సమక్షంలో వెలుగునీడల క్రీడలు గ్రహించాలి. అఖాతాల లోకి, సాగరాలలోకి దిగితేగాని లోతులు తెలియవు.

ఆత్మకు నాశం లేదు. యోగ ప్రజ్ఞ అనంతం. లోకాన్ని రక్షించడానికి నరకంలో ప్రవేశించాలి. లోకాల మధ్య సంధిరేఖపై తేజశ్శరీరంతో పయనించాలి. ప్రకృతి శిఖరాగ్రాలు ఎక్కిచూస్తే గానీ సృష్టిరహస్యాలు అవగతం కావు. వైరుధ్యాలు సమసిపోగా ప్రతికూలాలు ఏకమై, నిట్టనిలువున ఎగిరి పోవాలి.

ఆ లోకంలో బాధసైతం మహదానందం కలిగిస్తుంది. చెడు సైతం మంచిగా మారుతుంది. బ్రహ్మానందస్థితిలో విషాదానికి తావుండదు. ఇప్పుడు సావిత్రి పరిస్థితి అది. ఆమెకు ఆనందమే తెలుసు. బ్రహ్మానందస్థితిలో విషాదానికి చోటులేదు. ఆమె పొందుతున్న ఆనంద పారవశ్యంలో బాధకు ఏ మాత్రం అవకాశం లేదు! భూలోకమే స్వర్గంలా భాసిస్తున్నది. సామాన్యుని హృదయం మహర్షికి అవగతమైంది. ఆమె నేత్రాలు దివ్యకాంతితో మెరుస్తున్నాయి.

సత్యచైతన్యం భూమిపైన అవతరించనున్నది. తేజోకిరణాలు భూమిని దీప్తివంతం చేస్తాయి. ప్రశాంతిలో దివ్యభావనలు మేల్కొంటాయి. మూగ హృదయం దివ్య శబ్దాలను వినగలుగుతుంది. మనిషి దివ్యత్వాన్ని భరించగలుగుతాడు. శరీరం, ఆత్మ అమరత్వాన్ని అనుభవించే సమయం ఆసన్నమైంది. అప్పుడు యోగ లక్ష్యం నెరవేరినట్లు. అంతవరకు మనిషి బ్రతుకులో మృత్యుబీజం పెరగవలసిందే.

మానవుడా! ఈ యాతన నీవు పడవలసిందే. ఈ ప్రపంచం బాధల పల్లవిగా ఉన్నంతకాలం నీకు మనుగడ కష్ట సాధ్యం. దివ్యశక్తులపై నీవు ఆధారపడక తప్పదు. కనుక ప్రేమను, శాంతిని కోరు. సత్యాన్ని ఆశ్రయించు. పరమాత్మ అనుగ్రహం నీకు లభిస్తుంది. జీవితానికి కాస్తంత దివ్యస్పర్శ కలుగుతుంది. జీవితాన్ని యోగభూమికగా మార్చుకో. అదే మార్గం. బాధలను, సుఖాలను మరచి భగవంతునివైపు చూడు. ప్రమాదకరమైన పద్ధతులతో దివ్యత్వం కొరకు ప్రయత్నించకు. సిద్ధుల కొరకు, శక్తుల కొరకు హృదయకవాటాలను తెరవకు. క్షుద్ర మార్గాలలో పయనించి, క్షుద్రవిద్యలు అభ్యసించి ఎన్నటికీ లక్ష్యాన్ని చేరలేవు.

మనిషి ధర్మవిరుద్ధంగా తన సంకల్పాన్ని మార్చుకుంటాడు. అందుకు తన శక్తియుక్తుల్ని ఉపయోగిస్తాడు. అపమార్గంలో స్వర్గాన్ని చేరాలని చూస్తాడు. తాను మృత్యువును జయించి మృత్యురహిత లోకాన్ని చేరాలనుకుంటాడు. దివ్యశక్తుల్ని స్వశక్తితో ఆర్జిస్తున్నట్లు అహంకరిస్తాడు. ఇహపరాలను, ప్రకృతిని

జయించాలని ప్రయత్నం. అయినా పరమాత్మ దాపులకు చేరడు. తనను ఉద్ధరించడానికి భగవంతుడు సిద్ధపడేవరకు ఆగడు. తను శాసించినట్లు భగవంతుడు దిగివస్తాడని భ్రమ.

తన ఆత్మ పరమాత్మ కన్న గొప్పదైనట్లు విర్రవీగి పోటీపడతాడు. అంతా తన స్వంతం కావాలని ఆశ. స్వంతం చేసుకోవాలన్న అత్యాశ. భగవంతుడు ప్రసాదించిన మంచిమార్గాలు వదలి ఈ ప్రపంచంలోని గాలి, ధూళి పోగుచేసుకుని గాలిమేడలు కడుతుంటాడు. విశ్వశక్తులపై, దివ్యశక్తులపై తనదే అధికారం అయినట్లు ఇతరులను చులకనగా చూస్తాడు. ఇతరుల బలహీనతల్ని తనకు అనుకూలంగా ఉపయోగించుకుని సింహాసనం అధిష్టిస్తాడు. కీర్తి పొందినా, కడకు అవమానం పాలవుతాడు. తన కాళ్ల క్రింది నేల కరిగిపోతుంది. పైన ఆధారం లభించదు. అయినా తానుమాత్రం పరబ్రహ్మస్థితి పొందిన భ్రమలో ఉంటాడు. తానే భగవంతుడిననుకుంటాడు. తనను తాను భగవదవతారంగా చెప్పుకోవడం అతని పతనానికి పరాకాష్ట.

అసురప్రవృత్తి గుండెలో రగిలే అగ్ని వంటిది. అది వినాశాన్ని, పతనాన్ని, మృత్యువును ఆహ్వానిస్తుంది. మనిషి పడే బాధలు, కష్టాలు దానికి బలం. లోకంలో విషాదాలు, విచారాలు దానికి ఆనందం కలిగిస్తాయి. గర్వం మనిషికి అలంకారం కాదు. కష్టాలు తెచ్చిపెడతాయి. 'కర్మ' ముసుగులో మనిషి తన కష్టాల్ని దాచు కుంటాడు. తాను అంధుడై ఉంటూ వెలుగును చూస్తున్నానని భ్రమిస్తాడు. వెలుగు చూడగలది అంతర్దృష్టి. అది హృదయం నుండి ఎప్పుడో నిష్క్రమిస్తుంది. అది లేనప్పుడు పరమాత్మ దివ్యతేజస్సు చూడడం అసంభవం. పరం 'ఆత్మ' రహితమైనపుడు సర్వం శూన్యం. తాను అలవాటుపడిన చీకటినే పరంగా భ్రమిస్తాడు. అవాస్తవ శూన్యస్థితినే అతని హృదయం ఆమోదిస్తుంది. అదే ఏకైక సత్యం అన్న భ్రమ. తన రూపాన్ని భగవంతుని ప్రతిరూపంగా లోకాన్ని నమ్మిస్తాడు. తననే పూజించమని శాసిస్తాడు. తన నామాన్నే లోకం జపించాలి. తానే విశ్వవ్యాపకుడనని, తానే బ్రహ్మనని అంటాడు. తన ఆత్మనే పరమాత్మ అంటాడు. తన ఆత్మనే పరమాత్మగా భావించి ఆరాధించమంటాడు. "నేను–నాది" అన్న అహంకారం మొత్తం వివేకాన్ని స్వాహా చేస్తుంది. అహంకారమే అనంతంగా వ్యాపిస్తుంది. అతని మేధలో ఉండేది శూన్యం. కాలంతోపాటు ఆలోచన స్తంభి స్తుంది. ఒక ఆత్మ శూన్యమైనపుడు శూన్యసిద్ధాంతాన్ని తయారుచేసి అది తనది అని ప్రచారం చేసుకుంటాడు. అతనొక త్రిశంకుస్వర్గం సృష్టించిపెడతాడు.

అతని ఆత్మ శూన్యానికి దారిచూపుతుంది. మానవుడా! నీవు అలాంటి పనిచేయకు. నీ ఆత్మను అంధకారంలోకి తోయకు.

ఆత్మ క్షోభపడితే అమరత్వం సిద్ధించదు. అందరు కష్టాలు అనుభవించి తీరాలన్న నియమం లేదు. మానవుడా! బాధలు భరించు. కాని కావాలని కష్టాలు తెచ్చుకోకు. విషాదం నిన్ను వదలిపోనివ్వు. నీవుగా చేయవలసిన పని అది. కొన్ని హద్దులమధ్య మానవశక్తి సురక్షితంగా ఉంటుంది. హద్దు మీరితేనే ఇక్కట్లు. కన్నీటి వెనుక బ్రహ్మానందం లభిస్తుంది. నీ ఆత్మ నీకు అంతిమలక్ష్యం. నీకు కావలసిన మహాశక్తి నీలోనే ఉంది. నీ హృదయం లోనే తేజస్సు దాగివుంది. కాలక్రమేణ అది బయటకు రావడానికి ప్రయత్నిస్తుంది. దానికి సహకరించు. బంధించ ప్రయత్నించావో అది నిన్ను బాధిస్తుంది. స్వేచ్ఛ కావాలి. అది భగవత్ప్రసాదం. జీవితంలోని ఏ బంధాలు దానిని అంటవు. అజ్ఞానం కారణంగానే ఏదైనా 'బాధ' అనిపిస్తుంది. నీలో నిగూఢంగా ఉన్న ఆత్మను గుర్తించలేకపోవడమే పెద్ద అజ్ఞానం. ఆ పరమాత్మను గుర్తించేవరకు నీకు తపన తప్పదు.

కర్మను దాటిపోవాలంటే ఆత్మను తెలుసుకోవాలి. అప్పుడు సచ్చిదానందానికి మార్గం ఏర్పడుతుంది. జీవులందరిలో బ్రహ్మానందం నిగూఢంగా ఉంటుంది. ప్రపంచంలో సుఖాలకు బాధలు, విచారం పైముసుగులు. నీ విచారం వెనుక, ఆక్రందన వెనుక ఆనందం లభిస్తుంది. నీ శక్తి భగవచ్ఛక్తిలో లవమాత్రమే. ఆ కాస్త శక్తిని స్వార్థంతో, అహంకారంతో పోగొట్టుకుంటావు. నీలోని చైతన్యాన్ని మరచి జడప్రాయంగా జీవిస్తున్నావు.

శారీరక భోగాలకు అలవాటుపడి దివ్యానందాన్ని పొందలేకపోతున్నావు. దివ్యత్వమే అసంభవం అనిపిస్తుంది. సుఖం, దుఃఖం అనేవి అనుభూతులు. నటరాజ తాండవంలో అవి భిన్న ముద్రలు. నీలో ఆనందించే శక్తిని బయటకు తీసుకురా. నీ ఆత్మశక్తే నిన్ను బ్రహ్మాంతవాడిని చేస్తుంది. నీ వ్యధలు క్రమంగా కరిగి మహదానందంగా మారతాయి. వైరాగ్యం పెరిగి పెరిగి మానసిక నిర్మలత్వం అలవడుతుంది. క్రమంగా నిర్గుణ, నిరాకార, ఆనంద శిఖరాల్ని చేరగలవు. కర్మను, మృత్యువును నిందించే నీవు, నీవై చేసుకుంటున్న అపకారాన్ని గుర్తించవేం? ఈ కల్లోలం నీవు సృష్టించుకున్నది కాదా? ఈ కష్టాలు, బాధలు తెచ్చిపెట్టుకున్నవి కావా?

ఒకప్పుడు నీ ఆత్మ అమరం, అనంతం. సత్యం, చైతన్యం, తేజస్సు తానే అయిన ఆత్మ తన సచ్చిదానందస్థితిని వదలి, కుంచించుకుపోయి నీలోకి

వచ్చిచేరింది. జీవునితో మమేకమై జీవితాన్ని పంచుకుంటోంది. తనకు మృత్యువు లేదని ఆత్మకు తెలుసు. తాను నశించనిదనీ తెలుసు. నశించే నీ శరీరం తనకు ఆవాసం చేసుకున్నది నిన్ను ఉద్ధరించాలని. నీవే ఆత్మను గుర్తించవు. దానికి సహకరించవు. సత్యం సత్యంకానిదానిపై ఆసక్తి పెంచుకుని మరొకదాని మనుగడలో వినోదిస్తుంది. తన ఉనికిని మరచిపోతుంది. సత్యం చీకటిలోకి చూస్తుంది. అక్కడొక మూర్తి. అదే ప్రతికూలత. శూన్యమే నిర్గుణం అనిపిస్తుంది. శూన్యంలో కాలం అనంతం అనిపిస్తుంది. అదే పరమాత్మ అనే భ్రాంతి కలుగుతుంది. ఇదంతా భ్రాంతి. ఇది పదార్థ జడత్వం.

అజ్ఞానంలో ఆత్మది అంధకారప్రజ్ఞ. అందులో జనన మరణాలవి, అవివేకానిది ప్రధాన పాత్రలు. అజ్ఞానం సృష్టించుకున్న మేధ ఎప్పటికీ వాస్తవంకాలేని రూపాలను సృష్టించుకుంది. వాస్తవరూపాలన్నింటికీ ప్రతిరూపాలు, కృత్రిమరూపాలు ఏర్పడ్డాయి. జీవుని గతి దుర్గతి అయింది. అంధకారమే ఆలవాలమైంది. అంధకారంలో జీవం కలసిపోయింది. ఆత్మ తన దారి తాను చూసుకుంది. జీవరహితమైన తమస్సు చైతన్యానికి ఆటస్థలం అయింది. జీవుల సహజ లక్షణం అంతరించిపోయింది. అంధకారమే జీవితం అయి బ్రహ్మానందం బ్రహ్మపదార్థమైంది. మనిషి ప్రజ్ఞకు, వివేకానికి అందనిది బ్రహ్మపదార్థం.

దివ్యత్వం మనిషిలో ప్రవేశించి నప్పుడు ఆత్మ అతీంద్రియ లోకాలలో విహరిస్తుంది. అఖాతాలలోకి క్రుంగిపోదు. నిరాశా నిస్పృహ లుండవు. అనుక్షణం ఉత్తేజకరంగా, నవ్యంగా ఉంటుంది. అజ్ఞానం పైన నిత్యం విజయం నమోదవుతుంది. అనుభవాలు, అనుభూతులు పరమ విచిత్రంగా, అద్భుతంగా ఉంటాయి. అదే చైతన్యం. అదే ఆత్మకు ప్రగతి. ఆ మహానుభూతి ఆత్మను దివ్య సీమలకు చేర్చుతుంది. ఆత్మ పైకి పోవడమే తప్ప పతనం కావడం జరగదు. ఒక్కొక్కసారి ఆనందం విసుగనిపిస్తుంది. ఎదుగుదల మనస్సుకు తెలియదు. అప్పుడు దివ్యత్వం పట్ల అయిష్టత ఏర్పడి, లౌకిక విషయాలలో మనస్సు చొరబడి లేనిపోని కష్టాలను తెచ్చుకుంటుంది. విషాదాలు, వియోగాలు, బాధలు కావాలని కర్మబంధాలలో చిక్కుతుంది. ఆత్మలు కలుసుకుంటాయి. భ్రాంతివల్ల దివ్యత్వం కొంతకాలం దూరమవుతుంది. అది తిరోగమనం. అదే పతనం.

జీవుడు సత్యాన్ని దర్శించినపుడు, ఆ సత్యం సృష్టించుకున్న ప్రపంచాన్ని ఆత్మ స్వాధీన పరచుకుంటుంది. కాలానికి అతీతంగా వెళ్లిన స్థితిలో ఏర్పడే భావం సృష్టిలో మార్పుకు ఒక సూచిక. ఆ భావన మనిషికి దేవతలకు మధ్యవర్తి.

అది కాలచక్రంలో ఒక భ్రమణం. అజ్ఞానం వల్లనే ప్రపంచంలో అసంతుష్టి చోటుచేసుకుంటుంది. దానివల్లనే బాధలు. మన వాంఛల కుటీరాలు విషాద కేంద్రాలు. ఒక మహామాయ బ్రహ్మానందాన్ని దాచిపెడుతుంది."

అప్పుడు అశ్వపతి దేవర్షిని ప్రశ్నించాడు – "ఈ బాహ్యప్రపంచమే జీవుని శాసిస్తుందా మహర్షీ! దానికి అంతరంగంలో పరిష్కారమే లేదా? ఆత్మకు సంకల్ప శక్తి లేనప్పుడు విధి ఎందుకు? అంతా కాలక్రమాన జరిగిపోవలసిందే కదా? సావిత్రిలో ఒక మహాశక్తి నెలకొన్నదని నా నమ్మకం. ఆ మహాశక్తి కర్మను శాసించలేదా?"

అందుకు నారదమహర్షి నర్మగర్భంగా అన్నాడు – "అశ్వపతీ! బ్రాహ్మీ ముహూర్తంలో నీవు నడిచే బాటలు అవే కదా! నీ తడబాటును సైతం దేవతలు గమనిస్తారు. భవిష్యత్తు అగోచరం అయినా కాలప్రవాహ తీరంలో జీవితం ఎన్నో మలుపులు తిరుగుతుంది. ఆ మలుపులు నీకు కనిపించవు. అవి లేవని కాదు. అదృశ్యలిఖితాలు. వాటి నిమంత్రణ దివిజుల చేతుల్లో ఉంది. ఆ సంకేతాలు భావానికి అందవు. విశ్వమేధను నేనెలా విప్పిచెప్పగలను. మనిషి చేసే ప్రార్థనను దైవం సులభంగా త్రోసివేస్తుంది. మనిషి ఇష్టాయిష్టాలు దైవాన్ని మోసగించలేవు. మనిషి ఆశలు, భయాలు సైతం దైవాన్ని కదిలించవు. ప్రేమ ఒక్కటే వైతరణిని దాటించగలదు. ఆపైన మనిషి కష్టాలకు ప్రతిఫలం లభిస్తుంది.

"నీ బిడ్డలో ఒక ఔన్నత్యం ఉంది. అది ఆమెను, తన పరిసరాలను మార్చగలదు. ఆమె గమ్యం చేరడానికి కష్టాల పాషాణాలు దాటాలి. ఆమె స్వర్గం నుండి దిగివచ్చిన అమృతరూపిణి కావచ్చు! స్వర్గలోకం నుండి దిగివచ్చినప్పుడే స్వర్గవాసనలను వదులుకుంది. కనుక మానవ సహజమైన కష్టాలు, విషాదాలు అనుభవించాలి. ఆమె పడే బాధలు క్రమంగా ఆనందహేతువు లవుతాయి.

"మనిషి ఆలోచన మాటల్లో వ్యక్తమవుతుంది. కోటగోడల వంటి భావకుడ్యాల మాటున దృష్టి దాగి, తెరచిన ద్వారాలనుండి తొంగిచూస్తుంది. భగవంతుడు ఏకైక సత్యాన్ని ముక్కచెక్కలు చేసి ఆకాశంలో వెదచల్లాడు. ఒక్కొక్క ముక్క ఒక్కొక్క గోళంగా మారింది. అవకాశం కోసం అనంతమని తెలిసీ కాలానికి ఒక క్రమం ఏర్పరచి స్వీయప్రజ్ఞతో పూర్ణఫలితాలకై ఎదురుచూస్తాడు మనిషి. ఆ ప్రయత్నం ఫలించదు. ఒక తీరూ తెన్నూ కనిపించదు. మనిషి ఆశించినట్లు మృత్యువు అదృశ్యమైపోదు. జగన్మాతకు సమాధానం చెప్పుకోలేరు. ఆమె

దివ్యస్పందనలు గ్రహించరు. ఆరాటం గ్రహించరు. చట్టాలు, నిబంధనలు నిర్జీవంగా మారిపోతాయి.

"జగత్తు సత్యం, పరమాత్మ నిర్గుణం, నిరాకారం. అధిరోహించవలసిన సోపానాలు కంటికి కనిపించవు. కాలు క్రింద ఆనదు. స్వతంత్రం అవసరం. సంకల్పం కాలాతీతం కావాలి. లేకుంటే విధి బలీయం, కఠినం అవుతుంది. భౌతిక నియమాలు, సూత్రాలు తెగిపోవాలి. ప్రతిపనికి జీవుని ఆమోదం లభించాలి. నియమాలను అనుసరిస్తూనే స్వేచ్ఛగా, స్వతంత్రంగా ముందుకు సాగాలి.

"పరమాత్మ సహకారంతో అంతా మారిపోతుంది. పరమాత్మ సంకల్పానికి మనిషి సంకల్పం తోడుకావాలి. అప్పుడు ఈశ్వరభావన బలపడుతుంది. మనిషి ఆలోచన పరమాత్మలో ప్రతిధ్వనిస్తే మనిషి శక్తివంతుడు అవుతాడు. కాని మనిషికి సంశయాలు ఎక్కువ. అయినా మానవమేధ ఈశ్వర తేజస్సును అందుకోగలదు.

"భగవదేచ్ఛ మానవప్రజ్ఞను నడిపిస్తుంది. భగవంతుని సహాయంతోనే మనిషి మహాద్భుతాలు చేయగలడు. కొంతవరకు ప్రకృతిని, మనస్సును నమ్ముకున్న మనిషి ఆపైన భగవంతుని మాత్రమే విశ్వసిస్తాడు. సత్యవంతుడు మరణించక తప్పదు. అది విధి లిఖితం. నిర్ణీత సమయానికి మృత్యుఘాతం తప్పదు. ఆపైన ఏం జరిగేది నేను చెప్పలేను! అది సావిత్రి ఆత్మకే తెలుసు. ఆ ముహూర్తం ఆసన్నమై విధిరాత తెలిసే వరకు అది నిగూఢంగా, అస్పష్టంగానే ఉంటుంది. పరేంగిత ప్రజ్ఞ విధి కృతాలను మార్చి సత్యసమ్మతం చేస్తుంది.

"రాజా! నీ విధిని నీవు నిర్వర్తించావు. నీ ఆత్మకు, విధికి మధ్యన ఈశ్వర సంకల్పం మరొకటి ఉన్నది. అది పరమాత్మకే ఎరుక. అదృష్టం అనే మహాగ్రంథంలో కర్మాధ్యాయం ఉన్నది కదా! మనిషి విధిని ఆమోదించవచ్చు. తిరస్కరించవచ్చు. ఆ కర్మాధ్యాయాన్ని స్పృశించకుండా వదలివేస్తావా? నీ యిష్టం. ఈశ్వరుడు శాసించినా విధిని తిరస్కరించగల శక్తి మనిషికి ఉంది.

"జీవికి మృత్యువు చివరి మజిలీ కాదు. అదొక మార్మిక ముద్ర కాదు. జీవన సంగ్రామంలో జయాపజయాలు చవి చూచి, బాధలు క్లేశాలు భరించి, శరీరం జీర్ణమైన తర్వాత 'ఆత్మ' మహాశక్తిని పొందుతుంది. పరమాత్మను గుర్తిస్తుంది. ప్రతి ఓటమి ప్రగతిపథంలో ఒక మలుపు. మనిషిలో దివ్యత్వం పెరిగేది అపజయాల వల్లనే. అపజయాలు కడకు విజయపథాలవుతాయి.

"మానవుడా! నీ జీవనయానంలో అనేక దుర్ఘటనలు ఎదురవుతాయి. నీ శరీరాన్ని, మనస్సును కుదిపివేస్తాయి. ఆత్మను సైతం హింసిస్తాయి. అవి

కర్మఫలాలు కావు. అవి అలా వచ్చిపోతాయి. నీ ఆత్మ పరమాత్మవైపు పురోగమిస్తే మృత్యువు దానిని ఆపలేదు. నీవు ఒక మార్గం ఎన్నుకోవడంలో వుంది. విధిని దాటడం అంటే పరమావధిని చేరడమే. నీ ఆలోచనల్ని, హృదయాన్ని, కర్మను, విధిని అన్నింటిని బలిపీఠం ఎక్కించు. నీ ఆత్మరహస్యం నీకు తెలిసేవరకు, పరమాత్మను చేరేమార్గం కనిపించేవరకు, ఆరాటం తప్పదు. అన్వేషణ ఆగదు.

"ఓ ఆత్మా! ప్రకృతిలో చొరబడటమే తరువాయి. నీవు అజ్ఞానంలో కూరుకుపోయినట్లే. అగోచర పరలోకాలవైపు పయనించాలని నీ సంకల్పం. దివ్యశిఖరాలు అధిరోహించాలని వెంపర్లాట. నీవు విధితో పోరాడుతూ ముందుకు సాగిపోవాలి. అదృశ్యంగా ఉన్న ప్రతికూల శక్తులను జయించాలి. పదార్థస్థితి నుండి ఆత్మస్థితికి, వ్యక్తస్థితి నుండి అవ్యక్తస్థితికి చేరుకోవాలి. కాలంతో సాగుతూ అనేక జన్మల సంస్కారంతో ముందుకుసాగాలి. ఎన్నో జన్మలు నీవు దాటవలసి ఉంది. ప్రపంచంలోని కశ్మలం అంటకుండా, దుమ్ము ధూళి సోకకుండా, ప్రమాదాల్ని అధిగమిస్తూ, పడుతూ లేస్తూ, ఓడిపోతూ ఆదర్శం అనే కంచుకోటను చేరుకోవాలి. ఒంటరిగా ఉన్నప్పుడే పిరికితనం ఆవహిస్తుంది. చీకట్లో పయనించాలి.

"ఉషోదయ నగారాలు వినగలగాలి. ఉదయకాంతులలో నీవు పునీతం కావాలి. ప్రయాణం ఎడారిలో, ఊసరక్షేత్రాలలో, అడవుల్లో సాగుతుంది. అన్నింటినీ దాటిపోవాలి. కారుచీకటిలో ఎప్పుడో ఒక కాంతికిరణం కనిపిస్తుంది. ఆ వెలుగులో దివ్యదర్శన మవుతుంది. ఆ తర్వాత బ్రహ్మానందం అనుభూతికి అందుతుంది. ఆ చిరువెలుగుల్లోనే దేవతలు కనిపిస్తారు. ఎప్పటికో గాని అసలు ఆనందం అనుభవానికి అందదు. అప్పుడు మనిషి తాను మరచిపోయిన ఆత్మను జ్ఞాపకం చేసుకుంటాడు. తాను వదులుకున్న స్వర్గాలు స్ఫురణకు వస్తాయి. అప్పుడు తన కర్తవ్యం గుర్తుకు వస్తుంది. ఆవరించిన అజ్ఞానం వదలిపోగా ముందుకు సాగుతాడు. అంతవరకు ప్రకృతి నిబంధనలు అతిక్రమించలేడు. కానీ అగోచరంతో ఒక బంధం ఏర్పడుతుంది. దృశ్యప్రపంచంలోని ప్రధాన స్థావరాలు దాటి పరమాద్భుతమైన రోదసిలో ప్రయాణం సాగిస్తాడు. ఈ ప్రాపంచిక జడశిఖరాలు దాటి పరమాత్మిక చైతన్య శిఖరాలను చేరుకుంటాడు.

"సత్యవంతుని గురించి నీవు విచారించ నవసరం లేదు. అతని మరణం మరొక జీవితానికి ఆరంభం. మృత్యువు ఒక సంఘటన. ఆత్మ ఆ సంఘటనకోసం, అనుభవం కోసం ఎదురుచూస్తుంది. ఒక మహాసంకల్పమే రెండు ఆత్మల్ని ఒకచోట చేర్చింది. ఇద్దరిని ఒకటి చేసింది. ఒక లక్ష్యం కోసమే ప్రేమ, మృత్యువు కలిసి పథకం వేశాయి. బాధల నుండే కాదు ... ప్రమాదం నుండి కూడ దివ్యానందం

ఏర్పడుతుంది. దానిని కాలం గుర్తించదు. అది ఘటన ... అది ఈశ్వర సంకల్పం. చెదురు మదురు సంఘటనలతో ప్రపంచం ఏర్పడ లేదు. భగవంతుడు అంధుడు కాడు. అజ్ఞాని కాదు. చైతన్యమే భగవంతుడు. ఆ చైతన్యశక్తి జీవితపథకాన్ని రచిస్తుంది. పథకం ప్రకారం మన జీవితాలు సాగుతాయి. ప్రతి మలుపుకు ప్రతి ఘటనకు ఒక ప్రయోజనం ఉంటుంది. అర్థం ఉంటుంది. జగచ్ఛిల్పరహస్యం అందరికీ అర్థం కాదు. ఎందరో మహర్షులు, దివ్యశిల్పులు, సిద్ధపురుషులు అజ్ఞాతంగా దానిని సిద్ధపరుస్తుంటారు. వారంతా పరమాత్మ సంకల్పాన్ని, ఆదేశాన్ని పాటిస్తున్నవారు. అటువంటి సిద్ధపురుషులలో నీ సావిత్రి ఒకరు.

"మహారాణీ! దైవేచ్ఛను శంకించకు. దానిని మార్చడానికి సంకల్పించకు. సృష్టి ప్రణాళికలో ఈ సంఘటనలు అవసరం. తన ఆత్మ సంకల్పమే పరమాత్మ సంకల్పంగా గుర్తించిన వ్యక్తి సృష్టికార్యాన్ని నిరోధించదు. నిస్సహాయత నీ కన్నీటికి, ఈశ్వర సంకల్పానికి ప్రతిబంధకం కానీయకు. ఆమె ఆత్మ భగవంతుని నిర్ణయాన్ని ఎప్పుడో ఆమోదించింది. అందుకు అనుకూలంగా స్పందించింది. ఈ అవరోధాలను ఎదుర్కొని మృత్యువుతో తలపడుతుంది. దుర్విధి ఎదురైనప్పుడు ఎవరైనా ఆత్మబలంతో ఒంటరిగానే పోరాడాలి. ఆమె శక్తి అజేయమైంది. ఆమె ప్రేమ మహత్తరమైనది. ఆమె స్వశక్తితో పోరాడగలదు. దైవసహాయం, మానవ సహాయం ఆమెకు అవసరం లేదు. ఒక్కొక్కరి జీవితం విధిని మార్చగలదు.

"సావిత్రి కాలానుగుణమైన శక్తుల సహాయం అర్థించదు. తానే అన్నింటికీ సిద్ధపడుతుంది. ఆ సంఘర్షణ నీకు అర్థం కాదు. దానిలో జోక్యం కలిగించుకోవద్దు. ఆమె ప్రజ్ఞ నీ వివేకానికి అందదు. అది ప్రకృతి నియమాలకు తలవంచదు. ఆమె ఆత్మ స్వతంత్రంగా మృత్యువుతో పోటీపడుతుంది. ఇది పరమాత్మ సంకల్పం. పరమాత్మకోసం జరిపే పోరాటం మృత్యువుతో పోరాడటం కాదు.

"ఒక నక్షత్రం రోదసిలో వెలుగుతూ కదలుతున్నప్పుడు ఇతర నక్షత్ర కాంతులకు అసూయ చెందదు. రోదసి సంపదల్ని చూచి అబ్బుర పడదు. మహాత్ములూ అంతే. ఒంటరిగా ఉన్నప్పుడే తమ ప్రజ్ఞను ప్రయోగిస్తారు. భగవంతుని అనుగ్రహమే వారి సంపద, శక్తి సంపత్తి. ఏకాంతంలో ఆత్మ వెలుగుల్ని చూపిస్తుంది. ప్రగతికి బాటలు ఏర్పరుస్తుంది. ఆత్మ స్వతంత్రమైనపుడే పరమాత్మను చేరగలదు. ఆ ఒంటరితనమే యోగానికి ముఖ్యమైన ఆధారం. సావిత్రి ఒంటరిగా నిలిచే రోజు వస్తుంది. ఆ రోజు ఆమెకు, లోకానికి సుదినం. ప్రపంచ భవితవ్యం ఆమె గుండెలో దాగి ఉంది. నిరాశ అంచున పతనం పొంచి ఉంటుంది. జీవితరేఖ చివరి అంచున మృత్యురేఖ. దానిని ఎవరైనా ఒంటరిగానే దాటవలసి ఉంటుంది.

లోకకళ్యాణం కాంక్షించేవారు చైతన్యశిఖరాలు చేరుతుంటారు. అంతవరకు తనకు విజయమో పరాజయమో ఎవరికీ తెలియదు. ఆత్మ పురోగమనం అప్పుడు పరాకాష్టను చేరుతుంది. మృత్యువుతో పోరాటం సాగిస్తుంది. కాలానికి, కాల రాహిత్యానికి మధ్యన సరిహద్దు రేఖపై జీవం అంతరించి మరో జీవితం పునః ప్రారంభమవుతుంది. అది సంధిరేఖ. ఆ ఘడియల్లో మానవసహాయం పనికిరాదు. ఏ రూపంలోనూ భగవంతుడు వచ్చి ప్రక్కన నిలబడడు. భగవంతుని అర్థించే సమయం కాదది. తనను తానే రక్షించుకోగలగాలి. అందుకు ఆత్మశక్తి అవసరం. సావిత్రి ఆ స్థితిలో తనను రక్షించుకోగలదు. అవసరమైన శక్తిని తానుగా అందుకోగలదు. మహాచైతన్యం సంకల్పంగా మారి, మానవరూపంలో సావిత్రిగా అవతరించింది. ఆమె తనను రక్షించుకోగలదు. లోకాన్ని ఉద్ధరించగలదు.

“మహారాణీ! ఆ మహత్తర కార్యానికి నీవు అడ్డురాకు. కాలానికి ఆమెకు మధ్య నిలవకు. ఆ ముహూర్తం వచ్చి తీరుతుంది. దానిని ఎవరూ ఆపలేరు. విధి సైతం ఆపలేదు. పరమాత్మ ఆమెకు అప్పగించిన బాధ్యత నుండి మళ్లించవద్దు. మహాసంకల్పం నుండి ఆమె మనస్సును మళ్లించాలని చూడకు. ఆ పోరాటంలో నీ పాత్ర లేదు. నీకు స్థానం లేదు. నీ ప్రేమ, అనురాగం, అభిమానం అక్కడ నిరుపయోగాలు. ఆమెను, ఆమె నిర్ణయాన్ని భగవంతుని కృపకు వదలిపెట్టు. భగవంతుడు తన సంకల్పం మార్చుకుని, తన సహాయం ఉపసంహరించుకుంటే మనం చేయగలిగింది లేదు. అప్పుడు పరాజయం తప్పదు. మృత్యువు సమీపించి నప్పుడు ఆమె చైతన్యం సమీకరించుకుంటుంది. పరమాత్మ శక్తితో విధిని ఎదిరిస్తుంది. అంతిమ ఘడియల్లో మృత్యువు ఆసన్నమైనపుడు ఏ మానవ యుక్తీ ఆపలేదు. మానవశక్తి ఎవరినీ కాపాడదు. నీవు భగవదేచ్ఛను కాదనకు. ఆమె ఆత్మశక్తిని, ధీశక్తినీ శంకించకు. విధికి, ఆత్మకు ఆమెను వదలిపెట్టు.”

అని హితవు పలికి నారదమహర్షి భూలోకం వదిలి తన సచ్చిదానంద సీమలకు పయనమైనాడు. ఒక వెలుగుకిరణం బాణంలా ఆకాశంలోకి దూసుకు పోయింది. దేవర్షి శరీరం తేజశ్శరీరంగా మారింది. మధ్యందినార్కుని వలె అది నిర్మలం, కాంతిమయం. రోదసిలోకి నిష్క్రమిస్తున్న నక్షత్రం. అదృశ్యమైన కాంతిలోకి నిర్గమించిన కాంతి. రోదసి తీరాల నుండి నారదనాదం వినిపిస్తూనే ఉంది. అది ప్రణవనాదం. ప్రపంచంలోని మానవజాతికి అది ప్రాణం, ప్రియం.

అది అంతరాంతరాలలో ఎవరికైనా వినిపిస్తుంది. అది అశరీరవాణి, అది అమృతవాణి.



19. యోగవిభూతి

నారదమహర్షి భవిష్యత్తు గురించి భయపెట్టినా సావిత్రి సత్యవంతునే వివాహ మాడదలచింది. అది విధి లిఖితం అనికాదు. విధిని తప్పించుకొన వీలున్నదని సావిత్రికి తెలుసు. మానవకాంతగా విధిని కాదనలేదు. తల్లిదండ్రుల్ని వదలి ప్రియుని చేరింది. అరణ్యావాసం ... ఆశ్రమజీవితం. తనలోని దివ్యాంశను మరచి ఒక సామాన్య యువతిగా గార్హస్థ్య జీవితం సాగించింది.

హృదయం మహర్షి మాటల్ని మరచిపోనీయటం లేదు. ఆ రహస్యం సత్యవంతునికి గాని, అత్తమామలకు గాని తెలియదు. ప్రేమ పిపాసతో దానిని మరచిపోదామని ప్రయత్నించింది. సత్యవంతుని ఆలింగనాలు, ప్రేమ ఆమె లోపలి గాయాల్ని మాన్చలేదు. రోజులు గడుస్తున్నాయి. క్షణకాలం వియోగం కూడా దుర్భరం అనిపిస్తోంది. ఆమె ఉద్విగ్నతను సత్యవంతుడు గ్రహించలేదు.

ఆమె తృప్తి కోసం తను చేయగలిగినంత చేస్తున్నాడు. ఆమె సన్నిధి వదలడు. ఆమె ఆలోచనలు వేరు. సత్యవంతుడు మరణించగానే తాను సహగమనం చేసి పరలోకాలకు వెళ్లడమా! అక్కడ స్వర్గంలో ఇంతకు మించిన సుఖాలు అనుభవించవచ్చునా? భౌతిక శరీరాలలో సుఖించడంలో ఉన్న తృప్తి సూక్ష్మశరీరాలు సుఖించడంలో ఉండదు. ఇంద్రియాలు లేని సుఖంలో ఇంద్రియ సుఖం ఉండదు! అతీంద్రియ సుఖాల పరమార్థం వేరు.

చేసిన పాపాలకు ఫలితం మృత్యువు కాకూడదు. పుణ్యం చేసినవారూ మరణిస్తారు. మనిషి పరిస్థితులకు బానిస, కర్మకు బద్ధుడు. మృత్యువు, కామం, నిస్సహాయత మనిషిని క్రుంగదీస్తాయి. అజ్ఞాన స్థితి నుండి జ్ఞానస్థితి వరకు ఉన్నది మానవతే. మనిషి స్వప్రయత్నం వల్ల కర్మబంధం నుండి తప్పించుకొన వీలున్నది. విధిని సైతం దాటి పోగల అవకాశం ఉంది.

దృష్టి అనినంత వరకు విధి ఆమెను వెన్నాడింది –

మనిషి ఆశలు, ఆశయాలు అతని లక్ష్యానికి అనుగుణంగానూ, గమ్యానికి చేర్చేవిగానూ అనిపిస్తాయి. విధి అతని చర్యలను రూపుదిద్దుతుంది. సంకల్పం జీవితాన్ని గుడ్డిగా నడిపిస్తుంది. దానికి అనుగుణంగానే బుద్ధి పనిచేస్తుంది. వీటి మూలాలు ఆత్మలో రహస్యంగా ఉంటాయి. అవి అమూల్యాలు. భౌతిక శరీరానికి పంచభూతాలు ఆధారం. వాటి స్వభావానికి, అవసరాలకు అనుకూలంగానే ఆత్మ చరిస్తుంది. ప్రకృతి, కర్మ మనిషి సంకల్పాన్ని మార్చుతుంటాయి.

మహాత్ములు ఈ కార్యక్రమాన్ని తమకు అనుకూలంగా మార్చుకోగలరు. మహాత్ములైన వారి ఆత్మలు విధిని మార్చి తీర్చి దిద్దుకోగలవు. సత్యం ముందు అజ్ఞానం వీగిపోతుంది. పుట్టుకతో ఏర్పడిన బుద్ధులు పుడకలతో గాని నశించవు. మనిషి కష్టాలు, బాధలు జీవుడు ఇక్కడ కల్పించేవి. ప్రతి పనికి, ఫలితానికి కార్య కారణ సంబంధం ఉంటుంది.

సావిత్రికి లోకరీతులు, లౌకికాలు, రివాజులు తెలుసు. ఆమె మనసు మెత్తన. హృదయం కఠినం. అనంత ప్రేమరూపిణి. కృతనిశ్చయంతో, స్వశక్తితో, సృష్టిని మలుపు తిప్పాలని సంకల్పించింది. తిరిగి రథాన్ని అధిరోహించి బయల్దేరింది. వెంట సహాయంగా వచ్చిన సైనికుల రథాలు అక్కడే ఆగిపోయాయి. ఆమె మనోరథం మాత్రం ఒంటరిగా ముందుకు సాగింది. మగతగా నిద్రిస్తున్న వసుధ ఎదలో చైతన్యం కదలాడింది. వసుంధర మేల్కొన్నది. రథవేగానికి భూమి దద్దరిల్లింది. భూదేవి ఆమె ఆ వేగాన్ని ఆమోదించింది. ఆమె ఆవేదన పుడమి తల్లికి తెలుసు.

ఆకాశం పందిరి క్రింద విస్తరించిన వేసవి భూముల్ని దాటింది. మండు టెండల్లో కాలిపోతున్న పర్వతాలను దాటింది. నదీతీరాలు, సుక్షేత్రాలు, పసిరిక బయళ్లు దాటింది. చంద్రకాంతిలో మెరిసే నగరాలను దాటింది. సింహాలు సంచరించే దుర్గమారణ్యాలు దాటింది. కడకు సాల్వదేశ సరిహద్దులలోని అభయారణ్యం చేరుకుంది. అవి ఆనందం గూడు కట్టుకున్న మరుభూములు.

అవి పవిత్రతకు నిదానాలు. ప్రశాంతి నిలయాలు. స్వచ్ఛతకు ఆవాసాలు. తనకు విధి నిర్దేశించిన సుందర సుక్షేత్రం అది. అక్కడ తపోవనాలు ఆనంద తీర్థాలు. అక్కడనే తాను మొదట సత్యవంతుని చూచింది. అతను కనకపుష్యరాగంవలె, దివ్యాంశతో అవతరించిన గంధర్వ యువకుని వలె, తనకు తోచింది అక్కడే. అతనిది కాలాతీత సౌందర్యం. కలలో వాస్తవం మేల్కొన్న అనుభూతి తనకు కలిగించాడు. ఇప్పుడు గతం తనకు భవిష్యత్తును అందించే వాస్తవం. తను వాస్తవాధీనరేఖపై నిలిచింది.

మద్రలోని విశాల రాజవీధులు, రాజభవనాలు మనస్సు నుండి దూరమవుతున్నాయి. రత్నస్థగిత మంటపాలు, మందిరాలు, పాలరాతి మేడలు, శీతల తరుచ్ఛాయలు, జలాశయాలు, సుందర వనాలు క్రమంగా మధుర స్మృతులుగా మారసాగాయి. ఆమె మనస్సు కొండపై నుండి జారిపడే జలపాతం, మిట్ట మధ్యాహ్నం భావసమాధిలో ఉన్న వేడి నుండి సాయంత్రపు ప్రశాంతిలోకి, స్వప్నంలోకి జారే సంధ్య, రాత్రి మలిజామున చల్లగా సాగిలపడే చంద్రిక. ఆమెకు తెలిసిన ముఖాలన్నీ మనస్సుకు దూరమైనాయి. ఆనంద పారవశ్యంలో కదిలే మధురాధరాలు, చేయి చేయి కలిపి ఆడుకున్న నెచ్చెలులు, కళ్లలో ప్రేమ జ్యోతుల్ని వెలిగించుకున్న ప్రేమ పూజారులు, అందరూ కనుమరుగై, మతిమరుపై ఆమెను ఒంటరిని చేశారు. ప్రకృతి ప్రశాంతంగా మారింది. మనస్సు నిర్మలమైంది. ఇక్కడ వినిపించేది అరణ్య రోదనలు, పక్షుల కిచకిచలు. నిశ్చలమైన గుహలో ఆత్మాశ్రయం పొందిన తాపసికి అరణ్య రోదనలు వినిపించవు. పరిసరాలతో పని ఉండదు. ఆమె ఆత్మను ఆశ్రయించింది కనుక అరణ్య భయం లేదు. పరిసరాల పనిలేదు. మానవ సంచారం లేదు. అంతా మానస సంచారమే.

సాయంసూర్యుని మేఘం కమ్మి నేల చల్లబడ్డది. పూతోటల మధ్య కాలి బాటల నడవసాగింది. నింగి కళ్లు విప్పి తొంగిచూస్తున్నది. బయళ్లు దాటి, ఆశ్రమాన్ని సమీపించింది. నడచిన బాటలు, గడచిన కాలం అస్పష్టంగా, అగమ్యంగా ఉన్నాయి. పెద్ద పెద్ద మానుల నీడలలో బాటలు కరిగిపోయినట్లు, ఎండకు లతా మంటపాలు వాడిపోయినట్లు ఆమె సూర్యతాపానికి అలసిపోయింది. దూరాన ఆశ్రమ పర్ణశాలలు కనిపించాయి. అవి ఆకాశపు పందిరి క్రింద ముడుచుకున్నట్లు తోచాయి. అది అరణ్య మధ్యలో ఉన్న ఒకే ఒక ఆశ్రమ జనావాసం. అక్కడ ఒక మానవ సంకల్పం, మహదాశయం సేదతీరుతున్నదని ఆ అరణ్యానికి తెలుసు ... ఆశ్రమానికీ తెలుసు.

ఆశ్రమ జీవితం నాగరికం కాదు. కొంత ఆటవికం. విధి తనను ఇక్కడకు తెచ్చింది కనుక తనకు ప్రతికూలం కాదు, అయిష్టం కాదు. సత్యవంతుని సాహచర్యం ఆశించింది. అంధుడైన మహారాజు సేవ తన కర్తవ్యం. ఆయన పతనమైన అధికారానికి ప్రతినిధి. వంగిపోయిన రాచరిక స్తంభం. ఒకప్పుడు మహారాణి. ఇప్పుడు ముసలి వగ్గు. ఆమెకు ఎలాంటి కోరికలు లేవు. ఆమె ఆశలన్నీ సత్యవంతునిపైన. అతను సుఖపడాలి. అతనికి స్వర్గ సుఖాలు, సంపదలు దక్కాలి. అందుకై అహర్నిశలు భగవంతుని ప్రార్థిస్తుంది. సత్యవంతుడు సుందరుడు, సుగుణమణి. దేవతలు సైతం అతనిని ప్రేమిస్తారని ఆమె ఆశ. అతని ఆనందం, అదృష్టం చూచి మురిసిపోవాలని ఆ ముసలి తల్లి అభిలాష. కాని చేరువనే పొంచి ఉన్న ప్రమాదం ఆమెకు తెలియదు.

సావిత్రి వెంట వచ్చిన వారు కొంతకాలం అరణ్యవాసం చేశారు. ఆమె వియోగాన్ని భరించలేకపోయారు. స్నేహ బంధాల్ని త్రెంచుకోలేకపోయారు. కడసారి ఆమె దర్శనం చేసుకున్నారు. విధి తమను సావిత్రి నుండి విడదీస్తున్నదని వాపోయారు. క్రమంగా ఆమెను విధికి వదలి వెనుతిరిగారు. కర్మ ఒక్కటే ఆమెను నడిపిస్తుందని, ఆమె నిర్ణయాన్ని తాము మార్చలేమని గ్రహించి, ఆమె ఆనందాలకు, విషాదాలకు ఆమెను వదలి వెళ్లిపోయారు. ఇప్పుడామె ఒంటరిగా మిగిలింది.

ఒకప్పటి సుఖజీవనం తెరమరుగైంది. ఇప్పుడు కొత్త జీవితం ప్రారంభ మైంది. సత్యవంతునితో కలసి ఆశ్రమవాసం అది అరణ్యవాసం. ఆమె పొందే సుఖాలపైన మృత్యునీడ. ప్రేమకోసం ప్రేమరాహిత్యంతో బ్రతుకు సాగిస్తోంది. రోజులు గడుస్తున్న కొద్దీ ఆత్మ సంయమనం ఎక్కువవుతోంది. ఆత్మ నిశ్చలంగా కాలాన్ని గమనిస్తున్నది. ఆమె అనురాగానికి ప్రతీక. ఆత్మశక్తికి ప్రతిరూపం. దేవతల సుస్థిరతకు మానవుల అస్థిరతకు మధ్య ఊగిసలాట. ఆమెలో కొంత ప్రశాంతి, కొంత అశాంతి.

వినీలాకాశం క్రింద ఆశ్రమజీవితం తొలినాళ్లలో ఆనందంగా, సుఖంగానే ఉంది. అది స్వప్నసదృశం. మండే ఎండలు ప్రచండాగ్నుల్ని కురిపించినా, ప్రేమ పారవశ్యంలో గమనించలేదు. అంబరాన్ని చుంబించే తరుఛాయలు తనకు శీతలమందిరాలైనాయి. అరణ్యశోభలు ఆనందహేతువులైనాయి. ప్రతిస్వరం కళ్యాణి రాగాన్ని ఆలపించింది, మనస్సును అలరించింది. అక్కడ వీచే గాలులతో సంగీతాలు విన్నది. ప్రతి కిరణంలో వెచ్చదనాన్ని అనుభవించింది. ప్రతి రేయిని

తొలిరేయిగా, శోభనరాత్రిగా మలచుకున్నది. కఠిన శిలాతల్పాన్ని హంసతూలికా తల్పంగా మార్చుకున్నది. చీకట్లు సైతం పండువెన్నెలలైనాయి. ప్రతి పగలు ఒక రమణీయ చిత్రం. ఉదయం నుండి సాయంత్రం వరకు విరహ నిరీక్షణ.

కాంతుడు దరిలేని సమయాలు ఏకాంతాలు. అతని సాన్నిహిత్యం ఒకకొలువు, భూలోక సుఖాలను స్వర్గలోక సుఖాలతో కలబోసుకుని అనుభవించారు. సుఖపారవశ్యంలో అంతులేని ఆనందం పొందారు. రెండు శరీరాలు ఒక్కటి కావాలన్న తమి, రెండు జీవులు ఒకటిగా మమేకం కావాలన్న తహతహ, ఒకే జ్వాలలో రెండు శరీరాలు కాలి, కరిగిపోతున్న అనుభూతి. మహానంద ద్వారాలు తెరుచుకున్నాయి. భూతల స్వర్గంలో రెండు జీవితాలు ఒక్కటైనాయి. ప్రేమ తీవ్రతలో విధి, విషాదం కనిపించకుండా పోయాయి.

వేసవిగాడ్పుల ఉధృతం తగ్గింది. ఆకాశంలో నీలి మేఘాల సంచారం ప్రారంభమైంది. ఎండకు వాడిన ఆకులపై చిరుజల్లులు కురిశాయి. అరణ్యం వర్షంలో తడిసింది. ఉరుములు, మెరుపులు, కుంభవృష్టి. హోరున వీచే ప్రచండ మారుతాలు. అడవి ఏడ్చింది. అల్లకల్లోలమైంది. నిశి విచారంతో, భయంకర శబ్దాలతో క్రుంగిపోయింది. ప్రపంచంలోని విషాదం యావత్తు ఆ అడవిని చుట్టుముట్టింది. ఆ విచారమంతా ఆమెను పరివేష్టించింది. ఆ నిశి ఆమెకు విధిని జ్ఞాపకం చేసింది. భవిష్యత్తు దోబూచులాడింది.

తన ప్రియబాంధవుని కాటువేయడానికి ఆపద పడగ విప్పింది. అది మృత్యు నీడ. ఆమె హృదయం పైన భయం ముద్ర పడ్డది. రోజులు వేగంగా గడుస్తున్నవి. నారదుడు పెట్టిన గడువు సమీపిస్తున్నది. సుఖాలు తృప్తి నివ్వడం లేదు. సంపదలపై దృష్టి లేదు. నేటికీ గడువుకూ మధ్య ఎన్ని దినాలన్నదే ఆలోచన! స్పష్టంగా వినిపిస్తున్నాయి. విషాదం ప్రేమగా వచ్చి ముంగిట కూర్చున్నది. సత్యవంతుని కౌగిలిలో ఉన్నంతసేపు విచారం దూరంగా పోయినా, కౌగిలి విడిన క్షణంలో తిరిగి తనను ఆక్రమిస్తోంది. ఇప్పుడు ప్రతి ఉదయం భయానకమైన ఉషోదయం. కనిపిస్తున్న విషాదాన్ని కాదని, ఆనందంలో పరవశించాలని, సుఖించాలని ప్రయత్నం చేస్తున్నది. అది విఫలయత్నమే. ఎంత లోతుగా ప్రేమలో లీనమైతే బాధ అంత ఎక్కువనిపిస్తోంది. మాధుర్యపు లోతుల నుండి విషాదం తన్నుకొస్తున్నది. స్మృతికావ్యం నుండి రోజూ ఒక్కొక్క పుటను నిర్దాక్షిణ్యంగా తొలగించక తప్పడం లేదు. ఒకవైపు ఆనంద ప్రభంజనాలు, ఒక ప్రక్క విషాద తరంగాలు. రానున్న ఉపద్రవ సూచనగా గుండె ఊహించని బరువు.

అంతరంగంలో దేనిస్థానం దానిది. ఆమె కళ్లలోతుల్లో భవిష్యత్తు అంధకార జీరలు. తాను ప్రేమించే వారి మధ్య తిరుగుతూ వారిని ఆత్మతో అవలోకిస్తుంది. శారీరకంగా దగ్గర అవుతున్నా మానసికంగా అతిదూరం. అజ్ఞానం కారణంగా ప్రపంచం ఎంతో సుందరంగా, సుఖంగా కనిపిస్తుంది. మనుషులు ఎంత నిశ్చింతగా జీవించగలుగుతున్నారు! తాను కనిపించని మృత్యువు దిశగా, బరువుగా సాగిపోతున్నది.

ఎవరెంత దగ్గరగా మసలుతున్నా ఎవరి లోకం వారిది. వారందరికీ రేపుపై ఆశ ఉంది. భవిష్యత్తుపై ప్రేమ ఉంది. అందుకే నేటి భయాలను, బాధలను మరచిపోతుంటారు. తనకు రేపు భయం, బాధ. కనుక తాను ఏకాకి అయింది. గుండెలో రహస్యం పదిలంగా ఉన్నంత కాలం తను జలతారు పరదాలలో సుఖించగలిగింది. ఏకాంతంగా ఉన్నప్పుడు రహస్యం గుండెను చీల్చుకొని బయటపడేది. అది ప్రశాంతిని భగ్నం చేస్తుంది. అది విషాదమని ఎవరికీ తెలియదు. తన ఆనందాన్ని పంచుకోగల లోకం తన విషాదంలో భాగం పంచుకోదు. ఈ ఆనందం తనకుండేది స్వల్పకాలమే. ప్రపంచంలో ప్రేమలు, అనురాగం యిచ్చే సుఖాలు, ఆనందాలు ఎంత చిత్రంగా ఉంటాయి!

పైకి నిబ్బరంగా, నిశ్చలంగా కనిపిస్తున్నా ఆమెకు నిత్యకార్యాలలో ఆసక్తి లేదు. ఆత్మ శాంతికోసం, నిశ్చలత్వం కోసం గుండెలోతుల్లోకి దూసుకుపోయి వెదుకులాడేది, పెనుగులాడేది. లోపల, ఆంతర్యంలో అచలంగా ఉన్న జీవుడు చలించలేదు, కనిపించలేదు. జీవుడు బయటకు కనిపించకుండా మనిషి జీవితాన్ని నడిపిస్తుంటాడు. మనస్సు, హృదయం పొందే విచారాలను సమర్థిస్తూ ప్రపంచ బాధల్ని, కర్మల్ని భరించే గుండెధైర్యం కలిగిస్తుంది. ఏవో మెరుపులు కనిపించినా, పరమాత్మ అసలు రూపం తెలియదు.

ఆమెది వ్యధాకలిత హృదయం, క్షుభిత యవ్వనం. అచంచలంగా విధిని ఎదుర్కొన సిద్ధపడ్డది. ఎవరికైనా మానవ సహజమైన కల్లోలాలు తప్పవు. వాటి నుండి తప్పించుకోలేరు. పూర్తిగా తలదాల్చనూ లేరు. అవి బయటపడకుండా నిగ్రహించడంలో వివేకం ఉంది. ఆమె చేసిన పని అదే. ఆత్మీయులందరికీ ఆమె ప్రేమపాత్రురాలు. కాని ఆమెలోని విషాదాన్ని ఎవరూ పసికట్టలేదు. ఆమె తన నడవడికలో, కనిపించే ఆనందాలలో విషాదాన్ని తొంగిచూడనీయలేదు.

ఒకప్పుడు రాకుమారి హోదాలో సేవలు పొందింది. ఇప్పుడు తాను ఇతరులకు సేవలు అందిస్తున్నది. ఇల్లు ఊడ్వటం, పాలు పితకడం లాంటి

పనులు, ఏటి నుండి నీరు తేవడం, యజ్ఞవాటిక సిద్ధం చేయడం వరకు ఆమె పనులే. వంట పనులు, ఇంటి పనుల నుండి పూజామందిరం వరకు ఆమె పనే. ఒక గృహిణిగా చేయవలసిన పనులన్నీ చేస్తుంది. ప్రతిపనిలోనూ దివ్యత్వం కనిపిస్తుంది. శుచి, శుభ్రత, మనస్సు, హృదయం కనిపిస్తుంది ఆమె ప్రతి కదలిక లోనూ. లోకానికి అవసరమైన వెలుగులున్నాయి. అతి సామాన్యకార్యాలలో తన ప్రేమను పొదివి ఉదాత్తంగా మలుస్తుంది.

తన ప్రేమతో అందరినీ అందరితో చేర్చి ముడివేస్తుంది. ప్రేమమూర్తిగా మిగిలినా తనలోని విషాదం పైకి పొంగినప్పుడు ఆనందానికి, సుఖాలకు ఆధారమైన విషయ లాలసలు అర్థరహితంగా పైమెరుగులుగా కనిపించేవి. అంతా యాంత్రికం, శూన్యం అనిపించేది. అంతరంగానికి బాహ్యక్రియలకు పొంతన లేదు. ఆ విచిత్రమైన ద్వంద్వ ప్రవృత్తి చాటున ఆమె ఆత్మ జ్వలితాగ్ని జ్వాల అయింది. కల్లోల కాసారం అయింది. ప్రియుని అనుక్షణం తనలో కలుపుకోవాలని తపన చెందింది. తన ఆలింగనంలో పతిని భద్రంగా ఉంచుకోవాలన్న ఆత్రుత. రాత్రి అంతా క్షణాలు లెక్కిస్తూ నిద్రకు దూరమయ్యేది. అతనిని అణువణువునా ముద్దాడేది. అలసి నిద్రిస్తున్న సత్యవంతుని లతవలె పెనవేసుకునేది. తన పెదాలను అతని పాదాలకు చేర్చి ముద్దాడేది.

ఉదయం మేల్కొనగానే విడిపోవాలనిపించేది కాదు. పెదవులతో పెదవులు కలిపి అరమోడ్పు కళ్లతో పరవశించేది. మధువుల్ని వదులుకోలేని మధురోహలు. అతని శరీరం తనకు దూరం కారాదన్న ఆరాటం ఆమెది. మమతకు, అనురాగానికి చిహ్నాలు అవి. వలపు తాళ్లతో గట్టిగా బంధించాలన్న ఆశ. ప్రణయ మాధుర్యాన్ని, ఒక జీవిత కాలపు అనుభవాలను ఒక్కరోజులో పొందాలన్న తొందర. కాలాన్ని స్తంభింప చేస్తే, సుఖం శాశ్వతం కాదా! రెండు మానవ జీవితాలు సంయోగ పారవశ్యంలో కలిసిపోతాయి. వారి ఆత్మలు ఏకమౌతాయి.

ఎంత అనుభవించినా తృప్తి లేదు. ఇంకా ఇంకా అనుభవించాలన్న ఆరాటం. ఎంత బిగికౌగిలి అయినా ఇంకా అసంతృప్తే.

"ప్రియతమా! నీ వలపు ఇంకా ఇంకా నాకు పంచి ఇవ్వవూ! నిన్నే ప్రేమిస్తున్న నాకు నీ ప్రేమ ఇంకా యింకా కావాలి. నా అణువణువులో నీ ముద్రలు పడనివ్వు. నా హృదయాన్ని నీ సంగతులతో పులకించనివ్వు. సంగమ సుఖాన్ని మనం విడిపోయి జన్మచక్రవలయంలో మరల ఎప్పుడు, ఎంత కాలానికి కలుస్తామో? ఈ ప్రేమానుభవాన్ని మనం మళ్లీ పొందగలిగేది ఎన్నటికో!" అని

చెప్పాలనిపించేది. కానీ ప్రేమాతిశయం వల్ల ఒక్కమాట అనలేక పోయేది. ఉబికి వస్తున్న దుఃఖాన్ని గుండెలోనే అదిమిపెట్టేది. నిస్సహాయంగా నిబ్బరంగా ప్రవర్తించేది.

అప్పుడప్పుడు సత్యవంతునికి రవంత అనుమానం కలిగేది. ఆమె మాటలలో శ్లేష ధ్వనించేది. సమాధానం స్పష్టంగా లేనట్లు అనిపించేది. మనస్సులో కలతపెట్టే ఆలోచనలు లేనప్పుడు మాటలు స్పష్టంగానే ఉంటాయి. ఆమె ప్రేమ తీవ్రత వల్ల సర్వం మరచేవాడు.

కట్టెలు కొట్టుకు రావడానికి అడవికి వెళ్లిన సమయం, కందమూలాల సేకరణకు వెళ్లిన సమయం, అంధుడైన తండ్రి అవసరాలు తీర్చే సమయం మినహా మిగిలిన కాలం సావిత్రి సాన్నిధ్యంలో గడిపేవాడు. ఆమె ఆనందం కోసం, సంతోషం కోసం తనను సమర్పించుకునేవాడు. ఆమెకు ఇష్టమైన విషయాలు ముచ్చటించేవాడు. అనుక్షణం ఆమె స్పర్శను పొందేవాడు. తను ఎంత అనురాగం అందించినా ఆమెకు తృప్తి కలిగేది కాదు. అతని సమక్షంలో లోపలి బాధను కొంత మరచినా, అతను దూరమైన క్షణంలో అది మరింత తీవ్రమయ్యేది. ఒంటరిగా ఉన్న వేళల్లో మరీ రానున్న రోజుల శూన్యత అతలా కుతలం చేసేది.

మృత్యుద్వారం దాటి వెళ్లిన తర్వాత స్వర్గసీమలలో పునస్సంధానం సాధ్యమేనా? చితి మంటలలో శరీరం దగ్ధం కావడం దుర్భరమనిపిస్తుంది. అతనితో సహగమనం చేయవచ్చు. అతని చేయిపట్టుకుని పరలోకాలకు పయనించవచ్చు. స్వర్గంలో సుఖించనూ వచ్చు. ఆ సుఖాలకు ఈ శరీరా లుండవు. ఆ సుఖాల కోసం ప్రస్తుత సుఖాలను వదులుకోదలచలేదు. దైన్యంలో జీవిస్తున్న అతని తల్లిదండ్రులకు, శూన్యమైన వారి జీవితాలకు ఆసరా కావాలి.

ఒక్కొక్కసారి ఆమెకు అనిపించేది ఈ యుగయుగాల విషాదం తనలోకే ప్రవహిస్తున్నదా అని. ప్రపంచపు బాధ తనలోనే గూడు కట్టుకున్నట్లు అనిపించేది. తన ఆత్మలోని ప్రేమ మందిరంలో విషాదం ప్రవేశించి ప్రేమతో జతకట్టినట్లు, కనిపించని దేవతలను మూగగా అర్థించింది, ఆరాధించింది. నిశ్శబ్ద నివేదన వారికి రుచించలేదేమో ఎవరూ కనికరించలేదు. కరుణ చూపలేదు. తన విషాద హృదయాన్నే నివేదించుకున్నది. దానినే ఆరాధనా పుష్పంగా మార్చి సమర్పించింది. తన జీవితాన్ని బలిపీఠంగా మార్చి, తన బ్రతుకునే బలిచేసు కుంటున్నది. అయినా వారు ఒకరిలో ఒకరు లీనమై పోయేవారు.

ఏ శక్తి తమను వేరుచేయలేదన్న నమ్మకం, చివరకు తమ శరీరాలను వేరు పరచలేదన్న ఆశ. అతను అరణ్యంలో తిరుగుతున్నప్పుడు కూడా అతని ఆత్మ తన దగ్గరే ఉన్నట్లు భావించేది. తన వెంట నడుస్తూ తన ప్రతిచర్యను గమనిస్తున్నట్లు భావించేది. అది తెలియక సత్యవంతుడు ఆమె రూపాన్ని ఊహిస్తూ, మనస్సులో ఆరాధిస్తూ ఆరాటపడేవాడు. భయ సందేహాలు పవిత్ర ప్రేమకు చిహ్నాలు. ఆమె వ్యథ పెరిగి పెరిగి విశ్వమంతా పరుచుకుంది. అదే ఆమెకు జీవితం. మనిషిగా జన్మించి, కాలంతో ముడిపడిన కారణంగా, ఆత్మకు చావులేదని తెలిసినా, మానవాత్మ కలత చెందకమానదు. ఆమె శక్తి అనంతం – అయినా కాలం, కర్మ, విధి దెబ్బలకు గురి అయింది.

సరదాలకు విసిగిపోయింది. విషాదాలకు కనలి పోయింది. ఆత్మపరంగా ప్రశాంతిని సాధించింది. గంభీరత ఆమెకు అలంకారం. భయంకర పోరాటానికి కృతనిశ్చయురాలైంది. ఫలితం ఏమైనా ఫరవాలేదు. పోరాటం తప్పనిసరి. ఒక మహా సంఘటన జరగాలి. కన్నీటిని తొలగించాలి. మృత్యువును జయించాలి.

సరిహద్దురేఖపై ఏడాదికాలం అంతర్యుద్ధం సాగింది. ఇప్పుడు తుఫాను బీభత్సం లేదు. ప్రపంచాన్ని కబళించగల మేఘగర్జనలు లేవు. కానీ ఆకాశంలో ఎక్కడో ఒక ఉరుము ఉరిమింది. ఆకాశం ఏడ్చి ఏడ్చి కన్నీరు కార్చినట్లుంది. మేఘాలు నెమ్మదిగా భూమిని అలముకున్నాయి. ఆమె హృదయం విషాదాకాశమే అయింది. ఆత్మ ఎక్కడ దాక్కుందో తెలియడం లేదు. ఎక్కడా వెలుగురేఖ కనిపించడం లేదు. మరచిపోయిన ఔన్నత్యాలను జ్ఞప్తికి తెచ్చే అమరవాణి వినిపించడం లేదు. తనలో రహస్యంగా రగులుతున్న వ్యథ గురించి, వైవాహిక బంధం గురించి, కర్మశేషం గురించి ఆలోచించసాగింది.

20. ఆత్మశోధన

నిద్రిస్తున్న సత్యవంతుని చూస్తూ కూర్చున్నది. సావిత్రికి నిద్ర రాదు. క్షణం విపత్తును మరచి మగతగా కన్నుమూసింది. సమాధి స్థితిలో అంతర్వాణి హెచ్చరించింది. 'నీవు వచ్చిన పనేమిటి? నీవు చేస్తున్నదేమిటి?'

'ఏదీ చేయాలన్న ఆసక్తి లేదు. అందుకు తగిన శక్తి లేదు' విన్న వించుకుంది.

సత్యవంతునితో సహగమనం చేసి స్వర్గంలో సుఖించవచ్చు. భగవంతుడు, పరమాత్మల గొడవెందుకు అనుకున్నది. తాను జగన్మాత అంశలో జన్మించింది. తను చేయవలసిన పనికి భూమిక సిద్ధమైంది. కాని మార్గం కనిపించడం లేదు. ఆత్మ ముందుకు సాగాలంటే భౌతిక బంధనాలు, వాసనలు అడ్డు వస్తున్నాయి.

కదలక మెదలక నిశ్చలంగా హృదయంలోకి చూపు నిలిపింది. ఆత్మ దర్శనమైంది. ఒకనాడు సత్యవంతుని కోసం అన్వేషించింది. ఇప్పుడు సత్యం కోసం అన్వేషిస్తున్నది. అంతర్ దృష్టికి గతం కనిపించింది. మానవ పరిణామం తెలిసింది. స్వర్గ నరకాలు ఎలా ఏర్పడేది అర్థమైంది. మనిషి రాక్షసుడు కాగలడు. క్షుద్రుడు కాగలడు. దివ్యుడు కాగలడు. మనస్సులోపలి పొరల్లో ఎన్నో శక్తులున్నాయి. వాటిని నిద్ర లేపాలి. క్షుద్ర శక్తులు మనిషిని పతనం చేస్తాయి. దివ్యశక్తులు ఉత్తమ గతుల్ని కలిగిస్తాయి.

మనిషిలో మంచి, చెడు ఉన్నాయి. మంచివైపు పయనించడం కష్టం. చెడు వైపు లాగే ప్రలోభాలు చాలా ఉంటాయి. అటు వెళితే స్వర్గం. ఇటు తిరిగితే నరకం. మనిషిలో బుద్ధి కాక వేరొక శక్తి ఉంది. అది అతీంద్రియ ప్రజ్ఞ. అది చైతన్యం. ఆ చైతన్యం కలిస్తే జడం జీవపదార్థం అవుతుంది. మనిషి అధిమానవుడుగా, దివ్యమానవుడుగా పరిణమిస్తాడు. సావిత్రి కళ్ల ముందు గతం విచ్చుకున్నది. జగన్మాత సంకల్పం గ్రహించింది. తనను తాను గుర్తించింది.

రాత్రుళ్లు నిద్రమాని జాగరణ చేస్తున్నది, సత్యవంతుని చూస్తూ, అతని చేయి వదలదు. విఘడియలు మందంగా, బరువుగా గడుస్తున్నాయి. విషాద భారాన్ని ఎదలోపల గడియవేసి క్షణాలు లెక్కించసాగింది. సమీపించనున్న విధి కోసం ఎదురు చూపు. హృదయం లోపల నుండి ఒక పిలుపు వినిపించింది. అది నిశీధిని చీల్చుకొని వచ్చిన అంతర్వాణి. భృకుటి పైగా ఇచ్ఛా, జ్ఞాన శక్తులు కలిసే అజ్ఞాచక్రం నుండి అంతర్వాణి వెలువడింది. మహోన్నత శిఖరాలు దిగి వచ్చినట్లు, అయినా విశాలప్రపంచం అంతా తనకు తెలిసినట్లు, కాల గమనంలో సంఘటనలన్నీ తనకు ముందే తెలిసినట్లు పలకసాగింది. అచంచలమైన అంతరంగాన్ని శోధించి బయటకు లాగినట్లయింది. దృష్టికి అందినంతమేర మనిషి సృష్టిని తెలుసుకోగలడు. దివ్యవాణి స్పర్శతో ఆమె శరీరం పులకించింది. జడంగా మారి, చేష్టలు దక్కి సమాధి స్థితికి చేరుకుంది. నిశ్చల సమాధిలో ఆమె సువర్ణమూర్తిగా భాసించసాగింది. ఆత్మజ్యోతి వెలుగులో పరమాత్మ తేజస్సును దర్శించవచ్చు. ఆమె చుట్టు కాంతి వలయం. హృదయం సున్నితంగా అంతర్వాణిని వినసాగింది. మనస్సు ఆలోచనల్ని వదలి నిరామయమైంది.

"మృత్యువాత పడే ఈ ప్రపంచంలోకి నీవు ఎందుకు వచ్చావు? జీవితం అజ్ఞానమయం. అంతటా ప్రతికూల వాతావరణం. కాలం అనే బలిపీఠంపై ప్రతిఒక్కరు ఆత్మ బలిదానం చేసుకోవలసిందే. తేజస్వినీ! ఈ విషాదాన్ని భరిస్తూ, కన్నీరు కార్చుతూ, కర్మను అనుభవించడానికి సిద్ధంగా ఉన్నావా? లేదా, ఆత్మని మేల్కొల్పి, మృత్యువుతో పోరాడటానికి సిద్ధమైనావా?"

సావిత్రి గుండె నిబ్బరంతో అంతర్వాణికి సమాధానం చెప్పింది.

"నా శక్తిని కూడదీసి మృత్యువుకు బహూకరిస్తున్నాను. మూతపడిన స్వర్గానికై ఎలా చేతులెత్తి మ్రొక్కగలను. విధి అనివార్యమైతే విధితో ఎలా తలపడగలను? అజ్ఞానం పేరుకుపోయిన మానవత్వాన్ని ఉద్ధరించి ఏం సాధిస్తాను? మానవులు కర్మబద్ధులు. కర్మకు తలవొగ్గి క్రాంతిని దూరంగా తరిమి వేస్తారు. తమ ప్రజ్ఞ గొప్ప అనుకుంటారు. నిర్జీవమైన జడమే శాశ్వతమా?

కఠోర వన శిఖరాలు, అజ్ఞాన తిమిరాలు శాశ్వతాలా! మనిషి రోదన వినే నాథుడెవరు? ఏ దేవుడైనా వింటున్నాడా? భగవంతుడు కనిపించడు, కనికరించడు. మనిషి స్వశక్తితో మృత్యువుతో, పరంతో తలపడేటట్లు చేస్తుంటాడు. నేను ఈ చీకటిని తొలగించి, మోక్ష ద్వారం తెరచి, మూసుకుపోయిన జీవితాల్లో ఎందుకు వెలుగు నింపాలి? అల్ప మానవ ప్రపంచంలో అనల్పమైన దివ్యప్రజ్ఞను ప్రతిష్ఠించడం ఎందుకు?

"నాకుగానీ, నా సత్యకుగానీ ఆ అవసరం లేదేమో? భౌతిక నిబంధనలు నేనెందుకు త్రోసివేయాలి? ఆసన్న మృత్యువును చూచి నేనెందుకు విలపించాలి? నేనూ విధికి తలవంచి, నా ప్రియుని వెంట పయనించి, అసురసంధ్య నుండి సూర్యోదయం అయ్యేలోపు ఆ నిశిలో పయనించి ఇహపరాలకు మధ్యనున్న వైతరణిని దాటిపోగలను. ఈ చీకటి ప్రవాహం భూమిని స్వర్గం నుండి వేరు చేయనీ. ఆపైన నేను, నా సత్య ఒకరి కౌగిలిలో ఒకరం మైమరచి, ఆలోచనలు, బాధలు, భయాలు, వియోగాలు లేని స్వర్గంలో సుఖపడతాం. అక్కడ మానవత్వం, జీవితం, కాలం మమ్మల్ని విడదీయలేవు కదా! పరమాత్మ జోలి మాకెందుకు".

ఆమె వాణిని అంతర్వాణి విన్నది.

"అది చాలునా నీకు! నీ ఆత్మ జాగృతమై తాను వచ్చిన పని ఏదీ పూర్తికాలేదని తెలుసుకున్నప్పుడు, నీవు ఏమని సమాధానం చెబుతావు? ఇందుకేనా నీవు భూమిపైన అవతరించింది! మానవ కాంతగా జన్మించింది! ఇందుకేనా పరమాత్మ నిన్ను ఇక్కడకు పంపింది. అనేక వందల సంవత్సరాలుగా ఈ వేదనలు, రోదనలు వింటూ, భరిస్తూ మానవజాతి క్షుద్రశక్తుల అడుగుజాడల లోనే నడుస్తోంది. ఈ పాత నియమాలు తొలగించవా! లోకాన్ని మార్చకుండా వెళ్లిపోతావా! ఈ లోకానికి పచ్చదనం కనిపించదా! మార్పు రానే రాదా? అజ్ఞానం నుండి, అంధకారం నుండి లోకం బయటపడే మార్గమే లేదా? వెలుగులు దర్శించే అవకాశం చేజారినట్లేనా? మానవాత్మ ఇలా కర్మకు, విధికి తలవొగ్గి ఉండవలసిందేనా? విధి కవాటాలు ఛేదించడానికి ఈ ఇనుప ద్వారబంధాలు తెరచి, అశాశ్వతత్వం నుండి శాశ్వతత్వానికి మార్గం చూపు. చీకటి నుండి వెలుగులోకి పయనించడానికి చేయూతనివ్వు. మనిషిని అసత్యం నుండి సత్యం వైపు మళ్లించు. ఆ పని నీవు చేయకపోతే, నీవు చేయ నిరాకరిస్తే రేపు పరమాత్మ సన్నిధిలో సిగ్గుతో తలవంచుకోవలసివస్తుంది. పరమాత్మ నిర్దేశించిన పని నీవు నిర్వర్తించినట్లు కాదు. నీ విద్యుక్త ధర్మం నెరవేర్చకుండా నిష్క్రమించినట్లు కాదా?"

సావిత్రి హృదయం మూగపోయింది. మనసు మాట వెలువడ లేదు. క్షుభిత, కల్లోల హృదయాన్ని నిగ్రహించుకుని శిల వలె ఉండిపోయింది. అజ్ఞాన సాగరాలను దాటి నిశ్చల పర్వత శిఖరంపైన ప్రతిష్ఠించినట్లయింది. ఆమెలోని దివ్య శక్తి నిశ్చలత్వాన్ని బ్రద్దలుకొట్టి బయటపడ్డది.

“నేను జన్మించింది నీ అంశలోనే. నా కార్యనిర్వహణ బాధ్యత నీదే. నీవు నా వలె ఎల్లప్పుడు ఉన్నతంగా ఉంటావు. అమరవాణీ! ఆప్తవచనాలు పలుకు. నీ సంకల్పం మేరకే నా కర్తవ్యం, కనుక నీవు నన్ను శాసించవచ్చు.”

అంతర్వాణి హెచ్చరించింది. “నీవు ఎందుకు జన్మించావో గ్రహించు, నీ ఆత్మను ఆశ్రయించు. నిగూఢంగా ఉన్న ఆత్మశక్తిని పైకి తీసుకురా. నిశ్శబ్ద ప్రశాంతిలో భగవంతుని లక్ష్యం గుర్తించు. అప్పుడు మానవత్వం మానవీయంగా, దివ్యంగా పరిణమిస్తుంది. మనోమందిర ద్వారాలు తెరచి, సమాధిలో ప్రవేశించు. నీ నుండి ఆలోచనల్ని దూరం చేస్తే నీకే అవగతమవుతుంది. ఆత్మకు అవరోధంగా ఉన్న మాయ తెరల్ని తొలగించు. నీవు మహాశూన్య స్థితిని చేరుకున్నప్పుడు పరమాత్మను దర్శించగలవు. ప్రపంచమే పరమాత్మికమవుతుంది. అదే పారమార్థిక దృష్టి. అన్ని ప్రాపంచిక విషయాలలో పరమాత్మ స్పర్శ కనిపిస్తుంది. హృదయ స్పందనల్ని జయించడమే తన్మయత. పరమాత్మ చేసే పనులకు నీ స్వభావం ఆధారం. పరమాత్మ ఔన్నత్యం నీ మాటలలో బయటపడాలి. అప్పుడు నీవు నాశక్తి ద్వారా నిగ్రహించగలవు. మృత్యువును సైతం జయించగలవు”.

★ ★ ★

విధి వంచితుడైన పతిదేవుని ప్రక్క సావిత్రి స్థాణువులా ఉండిపోయింది. ఆమెలో చలనం లేదు. ఉలుకు లేదు. పలుకు లేదు. అంతరంగంలో రగులుతున్న అగ్నికి ఆమె ప్రతిరూపంగా ఉంది. అంధకారం రానున్న ప్రమాదాన్ని సూచిస్తోంది. పిడుగులు పడ్డాయి. కుంభవృష్టి కురిసింది. మింటిపైన కోటి అడుగుల నర్తనలు. వికృతంగా బీభత్సం. ఆ భయంకర ఘోషలో సైతం ఆమె నిశ్చలత చెదరలేదు. తన మనోభావాలను జీవిత సంఘటనలతో సమన్వయ పరుస్తూ ఆంతర్యంలోకి, అంతరంగంలోకి వెళ్లసాగింది.

గతం స్వప్నం వలె తోచింది. సృష్టికి మూలమైన మార్మిక రహస్యాలు మనస్సుకు అందసాగాయి. విశ్వకర్మకు తొలి ఆరంభాలవి. సత్యజ్యోతిలో నిగూఢ సత్యాలు సంకేతరూపంలో అందాయి. విశ్వరచనా చమత్కృతి ఆమెకు స్పష్టమైంది. సృష్టి ఆరంభంలో అంతా అయోమయం. అంతా అస్థిరం. రూపరహితం.

శూన్యం. ఆ మహాశూన్యం నుండి ఒక మహాసంకల్పం విడివడి, సృష్టికి దోహదం చేసింది.

జీవం ఒక జీవిగా మనగలగడానికి ఆకృతి పొందిన శరీరం ఆకరమైంది. ఆకరమే ఆకారమైంది. అదే జీవికి ఆవాసం. ఆలోచించగలిగిన జీవికి మనస్సు అవసరమైంది. మనస్సు ఏర్పడిన జీవి మనిషి అయింది. మనస్సుకు వ్యక్తిత్వం తోడైంది. రోదసి నిండా జీవ బీజాలు విరజిమ్మబడ్డాయి. అవి నేలను తాకి, పంచభూతాల సంయోగంతో రూపాలు ఏర్పరచుకున్నాయి. పరిణామంలో మానవ రూపం విశిష్టమైనదిగా రూపుదిద్దుకుంది. పరిణామానికి మనస్సు దోహదం చేసింది.

అనంతంగా ఉన్న శూన్యం నుండి ఒక జీవకెరటం నెమ్మదిగా కదిలింది. ఆ కదలిక లోనిదే చైతన్యం. అది నిశ్చల శూన్యంలో ప్రవేశించింది. చైతన్యం కలిగిన శూన్యంలో సుఖదుఃఖాలు, చీకటి వెలుగులు ఏర్పడ్డాయి. అది అంతా ఒక అతీంద్రియ శక్తి చలనమే. ఆ పరాశక్తి తన ప్రవేశం, ప్రమేయం లేకుండా నిస్తబ్దంగా ఉన్న శూన్యం ద్వారా విశ్వానికి రూపురేఖలు దిద్దసాగింది. అల్పజీవుల్ని సైతం చైతన్యమే సృష్టించి పెట్టింది. ప్రతిజీవి లోనూ ఇంద్రియలాలస ఏర్పడింది. ఇంద్రియతకు 'అహం' కేంద్ర బిందువైంది. ఆ కేంద్ర బిందువు చుట్టూ ప్రాపంచికత గూడు కట్టింది. చైతన్యం ఎక్కువగా పొందిన ఒక జీవి కదలి ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో జీవచలనం కలిగించుకుంది. అదే జీవి జీవన సూత్రం. అదే ప్రాణాయామ రహస్యం. జీవజాలం పైన చైతన్యం తన ప్రభావం చూపసాగింది. ఆలోచనలు, అనుభూతులు రాకపోకలు సాగించాయి. జ్ఞాపకాల నురగలు గట్టిపడి ఆలోచనకు, వివేకానికి ఆధారంగా నిలిచాయి. అదే మనిషి వ్యక్తిత్వానికి నిలువెత్తు తార్కాణం.

పునరుక్తమైన అలవాట్లు శాశ్వతంగా నిలిచిపోతాయి. మానవ మేధ తొలుత చైతన్యాన్ని పసిగట్టింది. కదిలిపోయే నేలపై కదలని నింగిని సృష్టించింది. లోతు తెలియని సాగరంలో తేలే ద్వీపాల్ని నిర్మించింది. అంతటి కృషి ఫలితంగా విశ్వచైతన్యం రూపుదాల్చింది. అప్పుడు సృష్టి తనలోకి చూచుకున్నది. కష్టాల కోనలు, భయంకర కాననాలు, కఠినమైన నెగళ్లు, నెరియలు కనిపించాయి. భౌతికత శాశ్వతం కాదని తెలిసీ అదే శాశ్వతం అన్న భ్రాంతిలో ఏర్పడిన చిన్న శరీరంతో మనుగడ సాగించింది. అశాశ్వతమైన శరీరమే భవ్యమందిరం అయినట్లు నీలాకాశం నీడలో అమరత్వాన్ని కలలుగనడం ప్రారంభించింది. నిర్జీవ ప్రపంచంలో జీవం ఒక్కటే చైతన్యం కలది. భౌతికశరీరం జీవం లేకుండా ఒక్క

క్షణం మనజాలదు. మన ఆశలు, ఆలోచనలు, కలలు సృష్టికి జీవకర్రలు. సృష్టి ప్రక్రియలన్నింటిపైన పరమాత్మ ముద్ర ఉంటుంది. మేధ ఒక్కటే స్వతంత్రిస్తుంది.

కాల ప్రవాహం పైన తేలిపోయే మందిరం లాంటి మనస్సు అవిరామంగా పనిచేస్తుంది. కాల పురుషుని నర్తనంలో అది ఒక భంగిమ. అనుక్షణం కాలంతో కదులుతుంది. ఆ కదలికల్ని కలిపితే జీవిత చిత్రం. మనస్సు జీవుని అవసరాలు గుర్తిస్తుంది. అందుకు దోహదం చేస్తుంది. తగినట్లు ఆలోచిస్తుంది. మనస్సుకు విశ్రాంతి ఉండదు. ప్రశాంతిని కోరదు. మనస్సులో సదా ఆలోచనలు తిరుగు తుంటాయి. మేధ యంత్రం వలె పనిచేస్తుంది. ఎప్పుడూ ఆగిపోదు. మానవ శరీరంలోని అన్ని భాగాలకు, అన్ని శాఖలకు అనవరతం సందేశాలను అందిస్తుంది. అవి కోటి గొంతుల కలస్వనాలు, కలరవాలు, ఉరుకులు, పరుగులు, తీవ్ర ప్రకంపనలు, స్పందనలు. బయట గుమ్మం వద్ద కలిగే ప్రతీ స్పందనకు ప్రతిస్పందిస్తుంది. ప్రతి సందేశాన్ని లోపలికి పంపుతుంది. అన్ని సందేహాలకు సమాధానం చెబుతుంది. ఇంద్రియ వ్యాపారాలన్నీ తన ద్వారా కొనసాగించడమే మనస్సుకు ఇష్టం. నిద్రా సమయంలో రవంతసేపు విశ్రమించినా, స్వప్నాలలో జీవితాన్ని సమీక్షిస్తుంది. మనస్సు వెనుకనున్న ఆత్మ సూక్ష్మలోకాలలో తిరిగి సంకేతాలను మనస్సుకు అందిస్తూ, మనిషిని సంస్కరించడానికి సహాయ పడుతుంది.

మనస్సు ఒక్క క్షణం ప్రశాంతంగా ఉండదు. తనలోకి, లోలోతులకు చొచ్చుకుని పోయి, రెక్కలు విప్పుతుంది. మహావేగంతో పయనించి, ఖగోళాన్ని చుట్టి వస్తుంది. తనకు తెలియని, పరిచయం లేని సూక్ష్మలోకాల విషయాలు అందుకుంటుంది. అందుకు మనస్సుకు పరోక్షంగా సహాయపడేది ఆత్మ. భావ శిఖరాలపై తను కల్పించుకున్న దేవతా రూపాలను ప్రతిష్ఠించుకుంటుంది. అటు స్వర్గం, ఇటు నరకం. రెంటితో మనసు చెలిమి చేస్తుంది.

అది మానవ జీవిత ఉపరితలం. లోపలి మనస్సే మనిషి. మనసే సమస్తం. మనస్సు పరమాత్మను పరామర్శించగలదు. నరకాన్ని స్పృశించగలదు. అక్కడ అంతర్లోకం ఒకటి ఏర్పరచుకుంటుంది. అది మనస్సుకు సొంతం. ఆ లోకం అవతల మనస్సుకు అందని మందిరం ఒకటి ఉంది. దాని లోపల ఒక మహాశక్తి ఉంది. అది జీవునికి అందని ఆనందాలను తనలో దాచి ఉంచుతుంది. ప్రశాంతికి ఆలంబనలైన సుధలు అక్కడ లభిస్తాయి. అది అవ్యక్త దివ్యత్వం.

చాలాదూరంగా ఆత్మ అంతర్మందిరంలో అది నిగూఢంగా ఉంటుంది. ఎన్నో చీకటి ద్వారాలను తెరుచుకుంటూ ముందుకు పోతేగానీ అక్కడికి చేరలేం. అది సుషుప్తి సీమలలో రహస్యంగా ఉండి మనస్సుకు అందదు. పరమాత్మ తన సందేశాలను, తన శక్తిని, తేజస్సును ఆ మందిరంలోనే ఆత్మకు ప్రదానం చేస్తాడు. కాల రహస్యాలన్నీ అక్కడ అద్దంలో బింబంలా కనిపిస్తాయి. మనిషి చేసే మంచి పనులన్నీ భగవంతుడు కన్న కలలే.

సృష్టిలోని వైరుధ్యాలన్నీ అక్కడ కనిపిస్తాయి. ప్రకృతికి అది ఒక సంక్షిప్త రూపం. అతి నిగూఢ మహాశక్తికి అది అక్షర రూపం. మనిషి ద్వారా వ్యక్తమయ్యే దంతా ప్రకృతిలో అవ్యక్తంగా ఉన్నదే. ప్రకృతి ప్రతిబింబాలుగా చీకటి వెలుగులు మనిషి మనస్సులో చొరబడతాయి. మానవ మనోమందిరంలో దేవతలకు మాత్రమే ప్రవేశం పరిమితం కాదు. అతీంద్రియ శక్తులు, అగోచర శక్తులు అనేకం అందులో ప్రవేశిస్తాయి. అందులోని చీకటిగదుల్లో కొన్ని క్షుద్రశక్తులు కొలువుతీరి ఉంటాయి.

మనిషి తనలోని దివ్యశక్తుల్ని గుర్తించలేక అత్యాశతో ప్రమాదకరమైన నీచ, క్షుద్ర శక్తుల్ని ఆహ్వానిస్తాడు. అవి తనను రక్షిస్తాయని, తనకు మహత్తులు ప్రసాదిస్తాయని నమ్మకం. చీకటి గుహల్లో పాశవిక శక్తులు నిద్రిస్తుంటాయి. తనే వాటిని నిద్రలేపుతాడు. అవి మనిషిపైనే తిరగబడతాయి, లోబరచుకుంటాయి. అవి మేల్కొనగానే అధోలోకాల తలుపులు బ్రద్దలుకొట్టి బయటపడతాయి. వాటిని అదుపు చేయడం మనస్సువల్ల కాని పని. అప్పుడే మనిషి రాక్షసుడవుతాడు. అణగిమణగి ఉండవలసిన క్షుద్రశక్తులు అతని మనస్సును, జీవితాన్ని, క్రియల్ని శాసించ మొదలు పెడతాయి. మనిషి జీవితం నరకప్రాయమవుతుంది. అన్ని రంగాలలో ప్రతికూలత ఎదురవుతుంది.

తలుపులు మూసినా దుర్గంధం వలె దుష్టశక్తులు లోపలకు జొరపడతాయి. అందంగా ఉన్న మందిరాంతర్భాగాలను, కుడ్యాలను వికృత పరచి వివర్ణం చేస్తాయి. పాపపు మరకల్ని, మృత్యు చారికలను పులిమిపోతాయి. కలుషితమైన ఆలోచనలు కలిగి మనిషి దుర్గుణాలకు, దుర్వ్యసనాలకు లోనవుతాడు. మనిషికి వికృతరూపం ఏర్పడి, రాక్షస గుణాలు అలవడతాయి.

అంతవరకు స్థిరంగా ఉన్న దివ్యభావనలు, పవిత్ర రూపాలు తప్పుకుని ఎప్పుడోగాని జీవితంలోకి తొంగిచూడవు. సత్కార్యాచరణ సమయంలో అతిథు లుగా వచ్చి కొంతసేపు ఉండిపోతాయి. అతని తప్పిదాలను క్షమించవు. జాలి పడతాయి. ఆ తర్వాత దివ్యశక్తుల ప్రభావం అతనిపైన ఉండదు. క్షుద్ర శక్తులు

రాత్రనక, పగలనక మనిషిని ఆవహించి ఉంటాయి. ఉన్న కాస్త వెలుగును మ్రింగి, జీవితాన్ని చీకటిమయం చేస్తాయి. కల్లోలం సృష్టిస్తాయి. అందిన మేరకు మనిషి స్వభావాన్ని తమ స్వంతం చేసుకుంటాయి. అది కూడ ప్రకృతిలో ఒక భాగం అనే భ్రమ కల్పిస్తూ, మనస్సును దోచి, ఆలోచనల్ని చెరచి, కేకలతో, అరుపులతో నరకం సృష్టించి, మనశ్శాంతి లేకుండా చేస్తాయి. క్షుద్రశక్తుల్ని ఆహ్వానించి మనస్సులో ప్రతిష్టిస్తాయి. సుఖభోగాల పట్ల, పాపకార్యాల పట్ల అనురక్తి కలిగించి జీవితాన్ని కూకటివేళ్లతో కబళిస్తాయి. ఆ రాక్షసవాంఛలు తీర్చలేక జీవుడు నిస్సహాయుడవుతాడు. క్షుద్రశక్తులు ఆవహించి ఉన్నంత కాలం దేవతలు వచ్చి ఆదుకోరు. దైవశక్తి పనిచేయదు. అప్పుడు మనిషికి తన శరీరంపైన, మనస్సుపైన తన పెత్తనం ఉండదు. పరాధీనుడవుతాడు. ఆ క్షుద్ర శక్తులకు ఆత్మను బలిదానం చేస్తాడు. మురికి కూపంలో పడి సుఖాలలో కుళ్లిపోతాడు.

తన స్వభావంలోని విచ్ఛిన్నకర శక్తులు విజృంభించి అతనిపై తిరుగుబాటు చేస్తాయి. అట్టడుగున చీకటి గదుల్లో దాగిన శక్తులు ఒక్కసారి బయటపడతాయి. అతని బలహీనతలే అతనికి ఆధారం. క్షుద్ర శక్తులు అనేక రూపాలలో భ్రమపెడు తుంటాయి. మనిషి బలహీనత ఆ క్షుద్రవిద్యల్ని ప్రోత్సహిస్తుంది. క్షుద్రశక్తుల్ని పోషిస్తుంది. అది మొత్తం మానవజాతినే నాశనం చేయగల శక్తి కలది. అవి ప్రకోపించి మనిషి ఆత్మను స్వాధీనం చేసుకుంటాయి. ప్రతి మనిషిలో ఎప్పుడో ఒకసారి ఈ బలహీనత బయటపడుతుంది. యమకింకరులు మారువేషాలలో సంచరిస్తారు. అన్ని వేపుల నుండి అవి మనిషిలో చొరబడతాయి. రక్తపిపాస, హత్యాభిరతి మానవతను నాశనం చేసి, సృష్టి సౌందర్యాన్ని దగ్ధం చేస్తాయి. మృత్యువు, యమదూతలు అనేక రూపాలలో భూమిపైకి వస్తారు. మృత్యుదేవత ప్రతి ఇంటి తలుపు తడుతుంది. ప్రపంచాన్ని చూచి, మనుషుల స్వభావాలను చూచి మృత్యుదేవత నవ్వుకుంటుంది. స్వర్గాన్ని కోరే మనుషులను యాతనలకు గురిచేస్తుంది. మృత్యు దేవతకు సర్వం ఆహుతి కావలసిందే. సృష్టి సైతం ఆపాతశిఖరం చలిస్తుంది.

మానవహృదయంలో పాపపు ప్రవృత్తి ప్రమాదకరంగా మారుతుంది. ఒక్క ఆత్మశక్తీ దానిని దగ్గరకు చేరనీయదు. ఆత్మను గుర్తించిన మనిషి పాపాన్ని తన దగ్గరకు చేరనివ్వడు. భగవంతుని దివ్యశక్తికి ధీటుగా నిలుస్తుంది క్షుద్రశక్తి. అది పాపాలను పోగుచేసుకుంటుంది. మనిషిని వ్యసనాలకు బానిసను చేస్తుంది. దివ్యధామానికి చేర్చే రహదారులన్నింటినీ మూసివేస్తుంది. తానే 'దివ్యం' అన్న

భ్రమను కలిగిస్తుంది. తానే దివ్యరూపాలను ధరిస్తుంది. తనే భగవాన్ ముసుగు వేసుకొని మోసగిస్తుంది. తానే సృష్టికి కర్తనని, పోషకుడినని, లయకారకుడనని చెప్పి, మనిషిని మోసం చేసి, మానవత్వాన్ని మంట కలుపుతుంది.

లోకాన్ని ఉద్ధరించగల శక్తి ఒక్కటే. అదే దివ్యశక్తి, పరాశక్తి, అదే దివ్య పరాశక్తి. మనిషిని భగవంతుడు సదా గమనిస్తూనే ఉంటాడు.

ఒక మహావృక్షం మొత్తం చిన్న బీజంలోనే నిక్షిప్తమైనట్లు సృష్టి మొత్తం మనిషిలో నిక్షిప్తమై ఉంది. మనిషికి గతం ఉంది అదే భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. వర్తమానంలో చేసే సత్కర్మలు, దుష్కర్మలు భవిష్యత్తుకు రూపాన్నిస్తాయి. జీవన మందిరంలో దేవతలు అదృశ్యంగా ఉంటారు. రాక్షసశక్తులు మనస్సును స్వాధీన పరచుకుంటాయి. తమ ఆశయాన్ని అతని ఆశలతో జతపరచి, రూపాలుగా మలుస్తాయి. ఆ రూపచిత్రాలు ఆధారంగా మనిషి మేధ తన లోకాన్ని వినిర్మించు కుంటుంది. మనస్సు తన చుట్టు తనదైన ప్రపంచాన్ని ఏర్పరచుకుంటుంది. అన్నీ ఎక్కడో ఉన్నవే అతనిలో పునర్జన్మిస్తాయి. రూపాలు ధరించిన వాటినే ఆత్మ గుర్తిస్తుంది. అనంతంగా సాగే సృష్టిలో మన మానసిక ప్రపంచం అణుమాత్రం.

క్షుద్రశక్తులు ఆశించేది వేరు. అవి బహుళ ప్రయోజనాలు కావు. విశ్వ వికాసంతో వాటికి పనిలేదు. పరిణామం, ప్రగతి వాటికి అవసరం లేదు. క్షుద్ర శక్తుల పథకాలు మనిషి మేధకు అందవు. వాటి లక్ష్యం మనిషి అంచనా వేయలేడు. పరమాత్మ సంకల్పం సుదూరాన కనిపిస్తుంది. మనిషి జీవితం మలుపులు తిరిగినప్పుడే మంచి అవకాశం ఏర్పడుతుంది. అది మనస్సులో స్థిరపడినప్పుడు గమ్యం తెలుస్తుంది. ఆ దిశగా ప్రయాణం మొదలవుతుంది. వివేకం బాహ్య విషయాలకే పరిమితం. మనల్ని అదృశ్యంగా ఒక పరాశక్తి నడిపిస్తుంది. గతాన్ని వర్తమానంతో సంధానపరచి, భవిష్యత్తుకు అదే బాట వేస్తుంది. జీవితంలో గొప్ప మలుపులన్నీ అసంకల్పిత చర్యలే. ఏకొద్దిమందికో భవిష్యద్దర్శనం సాధ్యపడుతుంది. కొందరికే స్థిర సంకల్పం ఏర్పడుతుంది. కొందరికే జీవితానికి లక్ష్యం, గమ్యం తెలుస్తాయి. మనిషి నిర్వహించవలసిన మహత్కార్యాలు ఎన్నో ఉన్నాయి.

మనిషి బ్రతికేది చీకటి గుహలో కాలంలో అన్నీ కరిగిపోతాయనుకున్నా గత జన్మల నీడలు ఆంతర్యంలో మసలుతుంటాయి. కనిపించని గతజన్మల ప్రభావంతోనే భవిష్యత్తులో మన ఆత్మ పరిశోధన సాగుతుంది. ఆత్మలు, సంఘటనలు ఒకే గొలుసులోని గొళ్లాలు. కాని ఎప్పటికప్పుడు అప్పుడే జరుగు

తున్నట్లు అనిపిస్తుంది. మనం మరచిన పురాకర్మలు పునరావృతం అవుతాయి. మన గతమే భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. మన వేగాన్ని గతం తగ్గిస్తుంది.

పాతిపెట్టిన శవాల నుండి భూతాలు పుట్టుకొచ్చినట్లు, ఇప్పటి ప్రేమలు, ద్వేషాలు, ఇష్టాలు, కోరికలు అన్నీ పాతవే. అవి మనం నిద్రించేటప్పుడు మనస్సులో ప్రవేశిస్తాయి. అప్రయత్నంగా మన పెదవులు దాటి బయటపడే ఆలోచనలు పూర్వసంస్కార ఫలితమే. సంకల్పాన్ని కలిగించేవి, వివేకాన్ని కదిలించేవి అవే. మన వ్యక్తిత్వంలో గతం కనిపిస్తుంది. ఒకనాడు మనదైన వ్యక్తిత్వాన్ని ఇప్పుడు త్రోసివేయలేం. మన జీవన విధానంలో గతం స్పష్టాస్పష్టంగా కనిపిస్తుంది. గత జన్మల కర్మశేషం అంతరంగంలో చీకటి కోణాలలో దాగి ఉంటుంది. అన్నింటికీ మనస్సు కేంద్రం. మనస్సు వాటిని అదుపు చేసి శాసించ గలదు.

మనోమందిర ద్వారాలవద్ద ఉన్న రక్షకులు వాటిని పట్టించుకోరు. జ్ఞాపకాలు సైతం వాటిని వదలిపెడతాయి. ఆ అలక్ష్యం వల్ల అవి మరింతగా తలెత్తుతాయి. ఒకప్పుడు ఉన్నవి పూర్తిగా నశించిపోవు. మనలో, మనచుట్టూ ప్రపంచంలో చీకటి కోణాలలో, గతంలో వదలిన గుణాలు కదులుతూ ఉంటాయి. ఆలోచనల అవశేషాలై అవి మన స్వప్నాల్లోకి నిరాటంకంగా నడిచివస్తాయి. అవి ప్రేరణ కలిగించి, ఆలోచన రగిలించి, ఉద్దీపించి అదొక అద్భుత ప్రపంచమనే భ్రాంతిని కలిగిస్తాయి. ప్రకృతి సంఘటనల్ని మనం ప్రతిఘటించలేం.

పూర్వ జన్మలలో మిగిలిపోయిన పాపాలు బీజాలై ఈ జన్మలో మొలకెత్తుతాయి. అప్పుడు విస్మరించిన పాపకార్యాలను ఇప్పుడు తలకెత్తుకుంటాం. గతజన్మ పాపాలన్నీ ఈ జన్మలో ఆత్మను పట్టుకుంటాయి. గతజన్మ శేషమే ఈ ప్రస్తుత జన్మ ... పుణ్యం పొడిగింపు. చీకటి నుండి అజ్ఞానంలో జన్మించిన మనం, మనోకాంతిలో జీవిస్తూ ప్రపంచాన్ని జయించాలని కలలు కంటుంటాం. సృష్టి రహస్యం ఎన్నటికీ మన మేధకు అందదు. మన మనస్సు ఒక పొరగా ఉంటుంది. అది పరమాత్మ వెలుగులోనే కనిపిస్తుంది. మన చుట్టూ పరచుకున్నది దట్టమైన అజ్ఞానం. ఈ అజ్ఞానానికి మన మేధ వెలుగు చూపిస్తుంది. మన లోపల అజ్ఞానం గాఢంగా నిద్రపోతుంది.

ఇది తొలి ఆత్మ పరిశీలన. అజ్ఞానం నుండి జ్ఞానం దిశగా ప్రయాణంలో అది తొలి మజిలీ. ఇదే మన ప్రపంచం కాదు. ఇదే జీవితమూ కాదు. మహత్తరమైన ఆత్మజ్ఞానం మనకొరకు సిద్ధంగా ఉంది. సత్యమైన చైతన్యసీమలకు చేర్చే వెలుగు

బాట వేరుగా ఉంది. ఆలోచించే వారికి దూరంగా, అందని శిఖరాన కనిపిస్తుంది. దానిది అతీంద్రియ తేజస్సు. ఆ తేజస్సు తానుగా శిఖరం నుండి దిగి రావాలి. మన జీవితాలు పునీతం కావాలి. ఈ లోకాన్ని సృష్టించింది సత్యం. అంధ ప్రకృతి కాదు. ఇక్కడ మనం చేరవలసిన శిఖరాలు కనిపించవు. అవి ప్రజ్ఞా శిఖరాలు. మనం ఆశించే దివ్యత్వం పరమాత్మ సన్నిధిలో ఉంటుంది. మనకు కనిపించే వెలుగులు అక్కడివే. శాశ్వతత్వం అక్కడిది. మన అసలు నివాసాలు అక్కడే ఉన్నాయి.

అది జరామరణాలకు అతీతమైన స్థితి. మనిషి కర్మను, మృత్యువును అధిగమించ గలిగేది ఆ స్థితిలోనే. అదే ఆనందం, అమరత్వం, శాశ్వతత్వం. ఆపైన బ్రహ్మత్వం, మనలో నిగూఢంగా అనేక శక్తులు, మహత్తులు ఉన్నాయి. అవి సమయం వచ్చినపుడు బయటపడతాయి. దేవుళ్లు ఎవరో మనకు సహాయం చేస్తున్నారనుకుంటాం. లోపలనుండి అంతర్వాణి, పైనుండి దివ్యవాణి వినిపించి నట్లవుతుంది. మరేదో వెలుగు కనిపిస్తుంది. మన ఆత్మ తన మార్మిక మందిరం నుండి పని ప్రారంభిస్తుంది. దాని ప్రభావం మనస్సుపైన, హృదయంపైన పడుతుంది. అంటే మనం ప్రపంచ పరిధుల్ని దాటి పైకి పోయినట్లు.

ఆత్మ ఎప్పుడూ మంచినే అన్వేషిస్తుంది. సౌందర్యాన్ని ఆరాధిస్తుంది. పరమాత్మను వెతుకుతుంది. ఈ మనశరీరం దాటిన తర్వాతనే ఆత్మ అనంతత్వం లోకి ప్రవేశించ గలుగుతుంది. ప్రపంచ పరిధిలో అన్నీ అర్థ సత్యాలే గోచరిస్తాయి. దృశ్య ప్రపంచానికి ఆవల సత్య ప్రపంచం ఉంది. సత్యాన్ని దర్శిస్తే ఆ సత్య ప్రపంచంలో ప్రవేశించినట్లు. మన అంతర్ మేధకు పరమాత్మకు సంబంధం ఉంది. పరంజ్యోతి వెలుగులు మార్మిక ద్వారాల ద్వారా మనలోకి ప్రవేశిస్తాయి. ఆ మందిరంలోనే తేజశ్శరీరులు, ప్రజ్ఞానిధులు కనిపిస్తారు. వారి తేజోస్పర్శ మన శరీరాలకు సోకినప్పుడు పులకించిపోతాం. తలెత్తి ఆత్మజ్యోతిని దర్శిస్తాం. ఈ మన జీవితం అవతల మహత్తరమైన మరో జీవితం ఉంది.

మనం రెండు రెక్కల సాయంతో ఎగురుతున్నాం. అంటే రెండు శరీరాలతో బ్రతుకు సాగిస్తున్నట్లు. సూక్ష్మశరీరం బయటకు కనిపించదు. అది యోగులు మాత్రమే చూడగల శరీరం. సామాన్యులకు అది ఎప్పుడో స్వప్నంలో కనిపిస్తుంది. పరమాత్మ భావనలకు స్పష్టమైన ఛాయలవి.

మానవజాతి ఆవిర్భవించిన తొలినాళ్లలో మనిషి వానరుడు. వంగి నడిచే వాడు. తర్వాత పరిణామంలో కుండలినీ శక్తి వెన్నుదండం ద్వారా ప్రసారం

అయినపుడు వెన్ను నిటారై నిలబడి నడిచాడు. దైవశక్తుల్ని కూడతీసుకుని ప్రజ్ఞను పెంపొందించు కున్నాడు. కన్నులలో ఆలోచనలు, హృదయం నుండి ఆత్మ తొంగిచూచాయి. నిటారుగా నిలిచి, భృకుటి ముడిచి ఆలోచించసాగాడు. ఆకసంలోకి చూచి నక్షత్రాల్ని గమనించాడు. సృష్టి సౌందర్యంతో తన అందాన్ని పోల్చుకున్నాడు. హృదయంలోని తేజస్సును వదలి స్వప్నసీమలలో విహరించ సాగాడు. తను ఆత్మ ద్వారా అందుకోవలసిన లోకాలు ఉన్నాయని గ్రహించాడు. అది ఆత్మజ్ఞానం. కొంతకాలం చీకటిలో క్షుద్రశక్తులతో సహవాసం చేశాడు. అంధకారం నుండి వెలుగు కోసం అన్వేషించాడు. దివ్యనాదాలు విని అగోచరాన్ని ఊహించసాగాడు. భవిష్యత్తులోకి తొంగిచూచి, పరం ఉంటుందని భావించాడు. అధిభౌతిక శక్తుల్ని ఆసరా చేసుకున్నాడు. అసంభవాలను వెదకడమే పరిశోధన అయింది. పరబ్రహ్మాంశను ఎప్పుడో గమనించి, దాని ఆధారంగా విశ్వశక్తుల్ని అంచనా వేయసాగాడు. అది మనస్సుతో చేసే పని. మనస్సు వదలి చేస్తే అది అన్వేషణ.

భౌతిక శరీరం ఆధారంగా పరమాత్మ కోసం పరుగులు తీయడం మనిషి చేస్తున్న పని. కనిపించని స్వర్గాల్ని కలగంటాడు. తన మనస్సు చూపే దృశ్యాలనే పరలోకాలని భావించి అనంత విశ్వాన్ని తన మనో పరిధిలోకి తెచ్చుకుని తృప్తి పడతాడు. దీర్ఘకాలం అలా పయనించి చివరికి ఒంటరిగా మిగిలిపోతాడు. తన కాళ్ల క్రింది నేల శిఖరాగ్రం అని భ్రమ. సూర్యతేజస్సును చూచి ఆధ్యాత్మిక తేజస్సు అని భ్రమపడతాడు. సంకల్ప మాత్రం చేత ప్రాపంచికతను దాటి పోగలగాలి. ఆత్మ సామ్రాజ్యంలో పునర్జన్మ ఎత్తితే తప్ప భౌతిక బంధాల నుండి విముక్తి లభించదు. స్వచ్ఛంగా, స్వతంత్రంగా ఆత్మలో జీవించ గలగాలి. తన మూలాధారం నుండి బయలుదేరాలి.

సావిత్రి తనలోని గుప్త జ్ఞానంతో ఈ పనులు చేసింది. మానవ శరీరంలో జగన్మాత అంశ ప్రవేశించినట్లు, ఇప్పుడు తనలో పరమాత్మశక్తి ప్రవేశించింది. దేవతలు చేయవలసిన పనికి తాను సిద్ధపడ్డది. అందుకు తాను కేంద్రబిందువు. ఆమె ఆత్మ సంకల్పించిన మహత్కార్యం మనిషిలో పరమాత్మ అంశను భద్రంగా నిలపడం, అంధకారంలో ఉన్న విశ్వానికి వెలుగు ప్రసాదించడం లేదా మరొక 'నవ్యమానవత' ఆవిష్కరింప చేయడం.

భూమి పరిణామం చెంది స్వర్గంతో సమం కావాలి. లేదా స్వర్గమే ఈ ప్రాపంచిక స్థితికి దిగిరావాలి. ఆ మహత్తర పరిణామం జరగడానికి మనిషి

హృదయంలో దాగి ఉన్న మార్మిక శక్తులు బయటకు రావాలి. 'మాయ' తెరను శాశ్వతంగా తొలగించాలి. మానవ ప్రవృత్తి దివ్య ప్రవృత్తిగా మారాలి. మనిషి స్వభావం నిష్కల్మషం కావాలి. ఆలోచనల్ని, జీవితాన్ని 'మంచితనం' ప్రభావితం చేయాలి.

పరమాత్మ శాసనం ఔదల దాల్చి ఆమె నిశ్చింతగా ఉంది.

కాలం, జీవితం, మృత్యువు – మూడూ వస్తూ పోతూ ఉంటాయి. కదలుతుంటాయి. అవి ఆమెకు అవరోధం కాదు. సామాన్య మానవునికి సైతం దివ్యదృష్టి కలిగించవచ్చు. అందుకు సావిత్రి సిద్ధమైంది. ఆమె మనోనేత్రం తెరుచుకుంది. స్వార్థం మనిషిపైన ముసుగువేసి ఉన్నంత కాలం ఆత్మను మాయ వదలదు. సావిత్రి 'నా' అనే స్వార్థం వదిలింది. 'తన' సత్యవంతుని మరిచింది. విశ్వకామన ఆమెలో చోటుచేసుకుంది. మాయతెర తొలగిపోయింది. ఆమె ఆత్మ దర్శనానికి సిద్ధమైంది.

21. గవేషణ

జిజ్ఞాస, తపన, అన్వేషణ, సాధన – నాలుగు మెట్లు. బాహ్య ప్రపంచాన్ని వదలి అంతర్లోకాలకు పయనం సాగించడమే అంతర్యోగం. వ్యక్తిగతంగా ఏదో సాధించడం సావిత్రి లక్ష్యం కాదు. మొత్తం మానవజాతిని మేల్కొల్పాలి. సత్యవంతునికి వచ్చిన కష్టం మనుషులందరికీ వచ్చేదే. మృత్యువు నుండి మనిషికి విముక్తి కలిగించడం తన లక్ష్యంగా తెలుసుకున్నది.

అంతర్లోకాల అన్వేషణలో సావిత్రి ఒక లోకాన్ని చేరింది. దానికి తలుపులు లేవు. అందులో ప్రవేశం నిషిద్ధం. ఆ ద్వారాన్ని ఒక కాలసర్పం రక్షిస్తున్నది. అది బుసకొట్టి పైకి లేచింది. సావిత్రి భయపడలేదు. లక్ష్యాన్ని వదలలేదు. ప్రయాణం ఆపలేదు. ద్వారం తెరుచుకుంది. ఆ తొలిద్వారం దాటడానికి ధైర్యం, స్థైర్యం, ఆత్మనిగ్రహం, సాహసం అవసరం. అక్కడి శక్తులు బాటసారిని బాధించవు గాని భయపెడతాయి. ధైర్యంగా నిలిచిన వారికి అవి సహాయం చేస్తాయి.

అంతర్లోకాలు ఒక్కటొక్కటిగా ఆమెకు స్వాగతం చెప్పాయి. అవి కొత్త అనుభవాలు. మొదటిది సూక్ష్మ ప్రపంచం. అక్కడ ఏదీ స్పష్టంగా ఉండదు. ఏ ఇద్దరు సాధకుల అనుభవాలు ఒకటిగా ఉండవు. తర్వాతవి కాంతిలోకాలు. అక్కడ సావిత్రికి శబ్దశక్తి అవసరమైంది. మంత్రోచ్చారణ వల్ల శబ్దశక్తి పుడుతుంది. గురూపదేశం సాధకునిలో శబ్దశక్తిని కలిగిస్తుంది. ఆ శక్తే ఆధ్యాత్మ జీవులకు ఆధారం. అక్కడ భయం, నిరాశ, ఆనందం మూడు ఉంటాయి.

సావిత్రి అక్కడి బాధల్ని ఆనందంగా అనుభవించింది. పైలోకాలు చేరింది. చివరిది తేజోలోకం. తేజశ్శరీరులకే అందులో ప్రవేశార్హత. ఒక్క సాహస కార్యంతో అక్కడ మృత్యువును దాటి పోవచ్చు. సావిత్రి ముందుకు సాగింది. తేజశ్శరీరుల దర్శనమైంది. ఆ తేజోమూర్తులు తనకు సహాయం చేస్తారని ఆశించింది.

రణగొణధ్వనులు దాటి నిశ్శబ్ద గుహాలయంలో ప్రవేశించినట్లు, ఆమె క్షణమాత్రపు అంతరవలోకనంతో మానసిక కల్లోలాలను దాటి శూన్యస్థితికి చేరుకున్నది. మహా నిశ్శబ్దమే ఇప్పుడు ఆమెకు ఆధారం. ఆమె మనస్సును పూర్తిగా వదలి శూన్యంలో వెదకసాగింది. ఔన్నత్యాలు లేని కారణంగా లోతులూ శూన్యాలైనాయి. అన్నీ ఆమె నుండి నిష్క్రమించి ఆమెకు శూన్యాన్ని మిగిల్చాయి.

తిరిగి ఆలోచించగల స్థితికి చేరినప్పుడు తన అనుభవాలు మిగల లేదు. అనుభవాలను, అనుభూతులను నమోదుచేసే మనస్సు లేనప్పుడు మిగిలేది శూన్యమే. ఏ అనుభూతినీ వ్యక్తం చేయలేని అశక్తత అది. ఎన్ని ఆధ్యాత్మికానుభవాలు కలిగినా, మనస్సు ద్వారం దాటి భౌతిక స్పృహకు రాగానే తపస్వి సామాన్యుడవుతాడు. భౌతిక ప్రపంచంలో అధికారం, పెద్దరికం మనస్సుది. మేధ అజ్ఞానం గురించి ఆలోచిస్తుంది. జ్ఞానం మేధ పరిధిలోకి రాదు. జీవం, జీవశక్తి ప్రాపంచిక క్రియలకే పరిమితం. భౌతిక ప్రపంచం మనిషిని పరిమితం చేస్తుంది. మూర్తినే భగవంతుడని భ్రమించే స్థితిని దాటి, ఆమె ముందుకు సాగింది.

మార్మికశిఖరాల నుండి వాణి వినిపించింది "నీ అన్వేషణ నీ కొరకు కాదు. సర్వమానవుల కోసం. భగవంతుడు మనిషికి మేధను ప్రసాదిస్తే, అందులో అజ్ఞానం చొరబడి తిష్టవేసింది. భగవంతుడు అవతారమెత్తి మూడడుగులతో అజ్ఞానం తొలగించగలిగాడా? మనిషిలో సృష్టి ఔన్నత్యం అజ్ఞాతంగా ఉంది. అది మనసుకి అందడం లేదు. ఏవో రహస్య ద్వారాల ద్వారా వెళ్లి ఆత్మ పరమాత్మను దర్శిస్తోంది. భగవంతుని విధానాలనే మనిషి అనుసరిస్తాడు. మనిషికి నీవు వెలుగు చూపించాలి. భౌతిక స్పృహతోనే మనిషి ఆత్మను గుర్తించగలగాలి".

అప్పుడు సావిత్రి తన పార్థివ శరీరాన్ని భూమ్యావరణలో వదలి, శూన్యంలో కొంతదూరం నిలిచి, తన సూక్ష్మ శరీరాన్ని నిశితంగా పరిశీలించింది. హృదయకేంద్రంలో ఒక పద్మం మొగ్గగా ఉంది. అందులో దాగి ఉన్నది ఆత్మ. నిర్నిద్రంగా ఉన్న తన ఆత్మను దర్శించింది. అంతరంగంలో అంతా చీకటే. చీకటి గవాక్షం వద్దకు చేరిన మేధకు లోపల ప్రవేశం లభించలేదు. జీవులంతా

శ్వాసతోనే జీవిస్తున్నారు. ఆమె శ్వాస ప్రక్రియతో ఆ రహస్య ద్వారాన్ని తట్టింది. ఆ ద్వారాలకు ప్రాణం ఉన్నట్లు బుస్సున లేచి ఆక్రోశించాయి. ఒక జీవి దౌర్జన్యంగా తమను భంజించడం వల్ల అవి అంతరంగానికి ఫిర్యాదు చేశాయి.

లోపల నుండి ఒక నిషిద్ధ స్వరం వినిపించింది. "భూచరమా, వెనక్కి వెళ్లిపో. లేదంటే నానా హింసలు అనుభవించి, కుళ్లి కృశించి, మృత్యువు పాలపడతావు."

ఆ శబ్దం భయంకరంగా నిశ్శబ్దాన్ని ఛేదించింది. ద్వారం వద్దనున్న నాగుకాల బుసకొట్టింది. అది పడగ విప్పి, కోరలు సాచింది. రాక్షసి వలె భీకరంగా, వికృతంగా గర్జించింది. బుసలు కొడుతూ ఆవేశ కావేషాలను వెదజిమ్మింది. ఆ భీభత్సానికి ఆమె రక్తం సలసలకాగింది. రానున్న ప్రమాదానికి అది సూచిక.

నిశ్చలంగా ఆమె మూతపడివున్న ద్వారం పైనే సంకల్పాన్ని కేంద్రీకరించింది. ప్రతికూల శబ్దాలతో తలుపులు తెరచుకున్నాయి. గవాక్ష రక్షణగా ఉన్న ప్రతికూల శక్తులు నిర్గమించసాగాయి. ఆమెలోని జీవుడు గుమ్మం దాటి అంతర్లోకాలలో ప్రవేశించాడు. ఆ నిశ్చల చైతన్య ద్వారం అవతల ఉన్నది సన్నని ఇరుకు బాట. అక్కడ శ్వాస ఆడటమే కష్టం. ఆ పైన శ్వాసతో పనిలేదు. శ్వాస మందగిస్తేనే ఆత్మ ప్రయాణం ముందుకు సాగుతుంది. సావిత్రి తన ఆత్మకై వెదకసాగింది. కంటికి కనిపించని సూక్ష్మపదార్థం ఏదో సమీకృతమైనట్లు తోచింది. అజ్ఞాత శక్తి ఏదో దానికి అండగా చేరింది. అయినా దొంగదారులు ఎన్నో ఉన్నాయి. ఎటు వెళ్లాలో తెలియదు. ఆలోచించే మనస్సు లేదు. ఆత్మకు ఇంకా దారి నిర్ణయించే ప్రజ్ఞ అలవడలేదు. ఆమె శరీర స్పృహ వదలగానే ఆమెలోని చైతన్యం వేరై ఆత్మలో జొరబడ్డది. అప్పుడు ఆత్మకు కొత్త శక్తి ఏర్పడింది.

ఆత్మ స్వశక్తితో అగోచరం, జటిలం అయిన సరిహద్దుల్ని దాటగలిగింది. అక్కడ జీవుడు అచేతనంగా నిశ్శబ్దంలో స్తబ్దంగా ఉండిపోతాడు. జీవునిలో కదలిక ఉండదు. చలనం ఉండదు. లేదా వెనుతిరిగి మానసిక స్థితికి, భౌతిక స్పృహకు చేరడం జరుగుతుంది. అప్పుడు కల్లోలం, పోరాటం మామూలే. ఆలోచనలు అస్పష్టంగా ఏర్పడి, రూపాలు అస్పష్టంగా ఏర్పడతాయి. ఫలితంగా మనిషికి కామవాంఛ అధికమై భ్రష్టస్థితి కలుగుతుంది.

ఆమెకు ఆ ఇరుకుబాట బాధగా అనిపించింది. లోపలకు చొరబడడం అసంభవం అని తోచింది. అక్కడ అస్థిరత జాస్తి. శక్తులూ అస్థిరమే. బలాలు

అస్థిరాలే. సంకల్పాలూ అస్థిరమే. అన్నీ ఉన్నట్లు తోస్తుంది. కానీ ఏదీ సవ్యంగా ఉండదు. స్పష్టంగా కనిపించదు. ఏదీ అందుబాటులోకి రాదు. మార్గం కనిపించినట్లే కనిపించి మాయమవుతుంది. ఆమె తన నిగూఢ అంతరంగ కల్లోలాన్ని దాటి ముందుకు సాగింది. ధైర్యంగా లోపలకు ప్రవేశించిన తర్వాత మంచి బాటలు కనిపించాయి. ఆ బాటలలో పయనించి కడకు అరూపస్థితిని చేరుకున్నది. స్వభావరూపాన్ని సైతం కోల్పోయింది. అది పరిమితికి అంతం. అపరిమితానికి ఆరంభం. అది అరూప భావ ప్రపంచం అయినా అంతా అయోమయం. ఏదీ ఆత్మకు అందడం లేదు. జీవుని ఆక్రందనలు తప్ప అక్కడ ఆత్మకు శాంతి లేదు. అక్కడ భయానక వాతావరణం జీవుని చుట్టుముట్టింది. శబ్దాల హోరు, అరుపులు, ఆక్రందనలు. అస్పష్టంగా అనేక దృశ్యాలు కదలిపోతున్నాయి. వాటికి ఒక క్రమం లేదు, ఒక పద్ధతి లేదు. గుండె బరువెక్కుతున్న భావన. ప్రతి శక్తి జీవుని తనవైపు ఆకర్షించాలన్న ప్రయత్నం. ఏ ఒక్కదానికి అవసరం లేదు, లక్ష్యం లేదు – అహంకారం, పొగరు తప్ప. చిత్తశుద్ధి లేని ఆలోచనల ఆర్భాటం, ఒకదానితో ఒకటి పోటీగా మేధను వేధించసాగాయి. వివేకాన్ని సమూలంగా పెరికివేసి, అవశేషాల్ని జీవుని ప్రక్క పడవేశాయి. అది ప్రకృతి బురదలో కలిసిపోగా క్రమేణ విస్మరించబడుతుంది.

అలా జీవశక్తి మానసిక బంధాలకు దూరమవుతుంది. ప్రకృతి పరమైన బురదను దాటిపోతుంది. ప్రాపంచిక శక్తులు, భౌతిక సుఖాలు ఆనందాలు అందించి అంతరిస్తాయి. అరాచకంలో ఆనందం లభిస్తుంది. ప్రతి సంఘటన ఉన్మాదం కలిగించేదే. ఇంద్రియ లోలత్వంలో ఆత్మకు ప్రవేశం ఉండదు. ఆత్మ తనకు ఏమాత్రం శక్తి లేనట్లు దూరంగా తప్పుకుని, ఇంద్రియాలకు స్వేచ్ఛనిస్తుంది. లోపల ఉన్న దివ్యత్వాన్ని తట్టి లేపి జాగృత పరచి పరమాత్మను చేరేందుకు జీవుని సిద్ధం చేస్తుంది. మనిషి మనస్సు అగాధాలలో కూరుకుపోయినప్పుడు ప్రజ్ఞా వైభవాలకు అవకాశం ఉండదు. మనస్సులేని దేహానికి తేజస్సుతో పని ఉండదు. జీవికి ఆత్మానందం కలగదు. అప్పుడు బ్రతుకే అంధకారమవుతుంది లేదా జడప్రాయమవుతుంది. ప్రకృతి పుస్తకంలోని ప్రతిపుటలో అవ్యక్తం ముద్ర పడుతుంది. లేకుంటే మనస్సు ఉన్మత్త చర్యలకు పాల్పడుతుంది. ప్రాపంచిక సుఖాలకై ప్రాకులాడుతుంది. వికారాలు, ఉద్రేకాలు ఏర్పడతాయి. అప్పుడు ఆనందం, శాంతి, వెలుగు ఏవీ కనిపించవు.

ఆ భయానకస్థితిని ఆమె దాటింది. జనావాసాలలో ఉరుకులు, పరుగులు,

అస్థిరత. ఆమె విశ్రాంతి లేకుండా తిరిగింది. స్థిర సంకల్పం, వివేకం ఆమెకు అండగా నిలిచాయి. అన్ని వత్తిడులు తట్టుకుని పరమాత్మపై లక్ష్యం కేంద్రీకరించింది. అప్పుడు సర్వం నిర్మలంగా మారింది. వత్తిడులు లేవు. అలజడులు లేవు. తనకు విముక్తి లభించిన దానికి గుర్తుగా ప్రశాంతత ఏర్పడ్డది. కొంతసేపు మహాశూన్యంలో గడిపింది. అగోచరగోళం నుండి ఒక కాంతిరేఖ దిగి వచ్చింది. ఆనంద మేదో ఆమెను అలరించింది. శూన్యంలో సచ్చిదానంద పారవశ్యం. అంతలో మరొక ప్రమాదం ముంచుకొచ్చింది.

శారీరకమైన అలసట లేదు. మానసికమైన వత్తిడి లేదు. అజ్ఞాతంగా పరుగులు తీయటం లేదు. ఏదీ లక్ష్య రహితంగానూ లేదు. ఉపచేతన మనస్సు ఆధీనంలో ఉండదు, ఆత్మ ఆధీనంలో ఉండదు. ఉపచేతన జీవునికి సమీపంగా ఉంటుంది. అన్ని శక్తులు ఉపచేతనలో ఏకబిందువుపై కేంద్రీకృతమవుతాయి. ఆమె తన శక్తిని మహాశక్తిగా మార్చుకున్నది. అంతరంగం నిశ్చలం అయింది. శూన్యం నుండి ప్రవిమలనాదం వినిపించింది.

ఆ శూన్య సాగరాలపైన అలల కల్లోలం, ఉరుకులు పరుగులు. గ్రీష్మ సైకతాలపై విరుచుకు పడుతున్న తరంగాలు. అవి గాలితరంగాలు. ఆ తరంగాల తాకిడికి తీరాలు పగిలిపోయాయి. ఆ శబ్దం భయంకరంగా అనంతంలోకి సుడులు తిరుగుతూ ప్రవహించింది. ఆ శబ్దం ఆమె చెవులకు సోకింది. అది పరమాత్మకు దాసోహం అనమని శాసించింది. ఒక అంధశక్తి కుప్పలుగా పోగుపడినట్లు, వేల వేల శబ్ద సమూహాలు నిశ్శబ్దంలో లయించిపోయాయి.

అదే ఆమెకు ఆలంబనగా నిలిచి ఆనందం కలిగించింది. అదే ఆత్మసాక్షి. ఆత్మ అంగీకారానికి ప్రబల నిదర్శనం. ఆమె తాటస్థ్యమే మహాశక్తి. ఆమె ఆత్మ సీమలలోకి మహదానందాలు కుప్పతెప్పలుగా వచ్చి పడ్డాయి. ఆ తరంగాలు లోకపు ఆశల్ని, భయాల్ని మోసుకొచ్చాయి. ప్రకృతికి, జీవులకు సహజమైన ఆరాటాలు అవి. అవి మనిషి కామనలకు సమాధానం యివ్వవు. కానీ ఆత్మ రహస్యాలను అందించింది. ఆరని అగ్ని మార్మికతకు సంకేతమైంది. స్పందన నియంత్రించబడిన బ్రహ్మానందానికి తొలి సంకేతం.

అగోచర, అంధకారమయమైన అధోలోకాల నుండి ఆనందం పొంగి పొర్లినట్లయింది. వెలుగులోకి అద్భుతం ప్రవేశించింది. ప్రకృతి సహజమైన అనాగరికతలో ఆనందం రగిలి అగ్నిధారగా మారింది. అది లోతు తెలియని లైంగికానుభూతికి ప్రతీక. లైంగికానందాలకు మృత్యువుకు విడదీయరాని

సంబంధం. అది తీయని విషధార. జీవుల సుఖభోగాల సుందర స్వప్నం. అది స్వర్గసుఖం అనే భ్రాంతి కలిగించి కాటు వేస్తుంది.

దైహిక సుఖలాలస అంచలంచలుగా పెరుగుతుంది. మనిషి తెలిసి చేసే తప్పులకన్న తెలియక చేసే పాపకార్యాలు అధికం. మనస్సు మనిషిని మభ్య పెడుతుంది. ఎన్నటికీ తృప్తినివ్వని కామనలు, తీరని కోరికలు, వాస్తవం కాని కలలు ... స్వల్పజీవితంలో ఎన్నని అనుభవించడం? ఎన్నని సాధించడం! అంతంలో శూన్యంలో అన్వేషణ, మహత్తుల కోసం తపస్సు.

ఎప్పటికీ తెలియని దానికోసం ఘోరంగా తపస్సు చేయడం. అందని దానికోసం అర్రులు చాచడం మనిషి బలహీనత. మనిషి వాస్తవాన్ని వదలి జ్ఞాపకాలలో వెతుకులాడటం జ్ఞానం అనుకుంటాడు. హృదయం దాటగానే ఆకర్షణలు అన్నీ హరించుకుపోతాయి. మనిషి హింసించగలడు, హింసలో ఆనందం పొందగలడు. తెలియని విషయాలకు ఊహారూపాలు కల్పించగలడు. ప్రేమ పేరుతో విశృంఖలంగా కామవాంఛల్ని తీర్చుకోగలడు. అందులో పశు వాంఛ కలుస్తుంది. ప్రతికూల శక్తుల ఆర్భాటాలు, హాహాకారాలు తేజోమండలాల వరకు వెంటపడతాయి. ఆకాశాన్నంటే అగ్ని కీలలు అడ్డునిలుస్తాయి. మనం స్వప్నసీమలలో నిర్మించుకున్న హర్మ్యాలు, సౌందర్యాలు చీకటిలో, శూన్యంలో కరిగిపోతాయి. మన అనురాగ సుధలు, ద్వేషాలు, వెలుగులు, ఆనందాలు, కన్నీళ్లు అఖాతాలలో కరిగిపోతాయి. మన భయాలు, పారవశ్యాలు, పరితాపాలు, అతీంద్రియ ప్రజ్ఞలు, స్వర్గ నరకాలపై నమ్మకాలు అన్నీ లయించిపోతాయి. ఆత్మశక్తి ముందు ఆ శక్తులేవీ పనిచేయవు. విజృంభించలేవు. ప్రపంచ సుఖాలు సుధల్ని పంచుతాయి. విషాలను చిందిస్తాయి. దివ్యజీవనంలో ఒక మాధుర్యం, ఒక తీవ్రత ఉంటాయి. అది నిశీధిలో స్వర్గాన్ని చూపిస్తుంది. దివ్యత్వం వైపు పరుగులు తీయిస్తుంది.

ఉన్నత సీమల నుండి దివ్య భావనలు దిగివస్తాయి. కళ్లలో అద్భుత తేజస్సు కనిపిస్తుంది. అది జ్ఞానజ్యోతిగా మారుతుంది. ఆ జ్యోతి వెలుగులే మార్గం చూపుతాయి. ఉద్రేకాలు తగ్గి, దేవతల వలె మెరుపువేగంతో ఆకాశం వైపు పరుగు తీస్తారు. అనుమానాలు, శంకలు నశిస్తాయి. 'అనాసక్తత' క్రమంగా దివ్యత్వంగా మార్పు చెందుతుంది. ఇక్కడ మనం సంపాదించే జ్ఞానం ఏదీ మన స్వంతం కాదు. కనిపించే సౌందర్యాలు ఏవీ స్వర్గానికి సంబంధించినవి కావు.

ఆ మహాశక్తి మొత్తం కనిపించినా ప్రమాదమే. అదే శక్తి విషాన్ని అమృతంగా మార్చగలదు.

ఈ ప్రపంచంలో ఔన్నత్యంపైన అసత్యం స్వారీ చేస్తుంది. సత్యం అసత్యపు ఆలింగనంలో ఒదిగి ఉంటుంది. కాంతి ప్రవాహాలు ఒడ్డులొరసి ప్రవహి స్తుంటాయి. అనృతం తీయగా, ఆకర్షణీయంగా ఉంటుంది. అధోలోకాలలో అన్ని వైరుధ్యాలు బారులు తీరి ఉంటాయి. అన్నింటినీ గమనిస్తున్నా సత్యం నోరు విప్పదు. కళ్లు తెరచి చూడదు. అక్కడ అజ్ఞానమే ప్రజ్ఞగా కీర్తించబడుతుంది. అది మధ్యలో ఆగిపోక తప్పదు. అక్కడ మృత్యువు ఎదురు చూస్తుంది. లేదా అధః పాతాళం ఆహ్వానిస్తుంది. ఆ చీకటికోనలలో చిక్కిన ఆత్మలకు విముక్తి లభించదు.

శాశ్వతంగా అధోగతిపాలైనవారు బానిసల వలె జీవుని వాంఛలు తీర్చుతుంటారు. వారికి శరీరసుఖాలే సర్వస్వం. క్షణికమైన సుఖాలు వాంఛించి, కరిగిపోయే కలల్ని నమ్మి ఆత్మను దూరం చేసుకుంటారు. భౌతిక ప్రపంచం వదలి, అధోలోకాలకు చేరుకుంటారు.

కొందరు ఎంతగా భౌతికంగా సుఖభోగాలకు దాసులైనా హృదయంలో సత్యానికి, దైవత్వానికి చోటు కల్పిస్తారు. అనుభవాల నుండి వివేకం పొంది, జ్ఞానం సంపాదిస్తారు. చీకటి గోడల్ని ఛేదించి బాటలు ఏర్పరచుకుంటారు. ఆపైన సత్యపథంలో పయనించడానికి అర్హత సంపాదిస్తారు.

ఆమెకు ఇదంతా రూపుకట్టినట్లు కనిపించింది. ఆమె ఒక ప్రశాంత ద్వీపం వలె నిలిచింది. సాగర తరంగాలు కొండను ఢీకొట్టినట్లు ఏ అలజడులు ఆమెను కదిలించలేదు. అలలు సాగరతీరాన్ని తాకినా, నురగల్ని మాత్రం మిగిల్చాయి. అంతలో ఒక వేయికాళ్ల రక్కసి పరుగున వచ్చింది. దాని భీకరస్వరం భూమ్యాకాశాలను దద్దరిల్లచేసింది.

ఆ తర్వాత అంతా నిర్మలం. వినీలాకాశం, పచ్చనినేల అందాల్ని చెరిసగం పంచుకున్నాయి. అవి చిరకాల మిత్రులు. భూమ్యాకాశాల మైత్రి సృష్టి ఏర్పడి నప్పటిది. విశ్వం ఆనందంతో పులకించింది. నేల నాలుగు చెరగులా ప్రశాంతి. బాహ్య ప్రపంచంలోని కల్లోలం, ప్రశాంతి ఆమెకు చెందవు. ఆమె అంతరంగం నిశ్చలమై, ప్రశాంతమై, గంభీరమై స్వతంత్రమైంది.

సంయమనం ప్రసాదించిన ఆత్మశాంతితో ఆమె ముందుకు సాగి ఒక

తేజోమండలం చేరుకున్నది. అక్కడ జీవుడు పరమశాంతిని అనుభవిస్తాడు. ఇంతకాలం తిరుగుబాటు చేస్తున్న ఆమె హృదయం స్థిమితపడ్డది. క్రమ పురోగమనానికి అలవాటు పడడం వల్ల మొదట ఉన్న ఆత్రుత, తొందరపాటు ఇప్పుడు సమసిపోయాయి. స్వాతిశయాన్ని, అహంకారాన్ని వదిలిపెట్టింది. తన జాత్యభిమానం, రాచరికపు అభిజాత్యం వదలిపెట్టింది. లోకంలో తనకు ఉన్న సంపదలు, వైభవాలు ఇక్కడ నిరుపయోగాలని గ్రహించింది. ఆవేశ, కావేషాలను పూర్తిగా వదలిపెట్టింది. వాంఛలు లేవు, లాలసత్వం లేదు, ఉద్రేకం లేదు. అంతా నిర్లిప్తస్థితి. పంతాలు, పట్టుదలలు లేవు. ఇంద్రియాల తొందరపాటు, తిరుగుబాటు లేవు. తన పరిధులేవో స్పష్టంగా జీవుడు తెలుసుకునే స్థితి అది.

స్వేచ్ఛ లేని ఔన్నత్యం రాజరికానిది. సింహాసనంపై నున్న ప్రభువు మంత్రుల మాట మన్నించినట్లు మేధ, వివేకం దేహికి వినమ్రంగా ఉంటాయి. సేవలు చేస్తాయి. కఠిన నియమాలు దేహికి రక్షణ. వివేకవర్తనం దేహికి సుఖ శాంతులనిస్తుంది. ఆమె సంకల్పం న్యాయబద్ధం. ఉద్రేకం సంకెళ్లు బిగించినట్లు స్తబ్దమైంది. ఆలోచనలు కోటలో బందీలైనాయి. ఇప్పుడు తనకు ఏదీ కావాలని లేదు. తానేమీ వాంఛించదు. వాస్తవం, వివేకం ఆమెకు సహజాలంకారాలు. కేవలం సత్యాలను మాత్రమే ఆమె మనస్సు గ్రహిస్తుంది. అవే ఆమెను సింహాసనంపైన అధిష్ఠింప చేశాయి. తనలో ఉన్నది ఒక చిన్న ప్రపంచం. యుగాలప్రజ్ఞ ఆమెలో విజ్ఞానరేఖగా మారింది. అనువాదానికి అనుకూలమైన గ్రంథం జీవితం. ఇక్కడి విజ్ఞానంలో ఆత్మ స్వతంత్రం కాలేదు.

ప్రతిసాధకుడు విశ్వవిద్యాలయంలో ఒక విద్యార్థి. జీవితంలో ఎక్కువభాగం విద్యార్థి మేధతోనే జీవిస్తాడు. ఇరుకుగదుల్లో పరుగులు పెట్టడం లాంటిది విజ్ఞానం. ఆత్మ జ్ఞానానికి దూరంగా ఉంటుంది. ఆత్మ శూన్యం నుండి జ్ఞానాన్ని అందు కుంటుంది. మనిషి భావతరంగాలు ఒక నియతికి లోబడి ఆలోచనలనే స్తంభాలకు కట్టుబడి తిరుగుతాయి. లేదా నేలను అంటి పెట్టుకుని ఉంటాయి. నేలను, భౌతికతను వదలిన తర్వాతనే ఆత్మ ఉన్నత స్థితికి చేరుకోగలుగుతుంది. ఆదర్శం అనే పరమధర్మం ఆత్మకు ఆలంబన కావాలి. అప్పుడు ఆత్మ భౌతిక హద్దుల్ని అతిక్రమిస్తుంది.

జీవునిది నియమబద్ధ ప్రపంచం. పైలోకాలలో జీవుని ఆలోచనలు సుశిక్షితులైన సైనికుల్లాంటివి. అవి నిర్ణీత స్థావరాలు వదలిరావు. తమ విధులు మాత్రం నిర్వర్తిస్తాయి. ప్రతి నక్షత్రం తన స్థానాన్ని వదలదు. గతిని మార్చదు.

గగనంలో ఎంతో నియమంగా సంచరిస్తాయి. తమ విధుల్ని నిర్వర్తిస్తాయి. అవి కులీన వంశంలో జన్మించిన రాచబిడ్డలవలె, తారకలు మేలి ముసుగులు ధరించ కుండా బయటకు రావు. అందుకే తారలకు ఆ తళతళలు, జిలుగు వెలుగులు.

ఆమె రాచబిడ్డ. అంతఃపురాలలో ఉండవలసింది. ఆమె విహారాలు సుందరోద్యానవనాలకే పరిమితం కావాలి. రాచబిడ్డ జీవితం సురక్షితం. క్లిష్టమైన పర్వత శిఖరాలు ఆమె ఆరోహించకూడదు. ఒక తార మరొక తారతో చెలిమి చేయదు. ప్రమాదాలు తెచ్చుకోదు. తన మందిరంలోకి మరొక దేవతను ఆహ్వానించదు. ప్రపంచ పరిధుల్ని దాటిన పరమాత్మకు దివ్యత్వంతో పనిలేదు. జ్వాలలతో లోకాన్ని భస్మం చేయదు. జీవితం సజావుగా సాగిపోతుంది. అవకాశం ఉన్నంతవరకే ఔన్నత్యం అనుభవించాలి. తన ఆలోచనలు దాటిపోదు. ఒకవేళ ఆలోచించినా ఆకాశపు సరిహద్దులు దాటిపోదు. ఆకాశంలో నీలి యవనికపై అందమైన చిత్రాన్ని రచించుకుంటుంది. సుఖజీవనం కాంక్షిస్తుంది. ఆమె చర్యలు యదార్థాలు, వాస్తవాలు. ఆమె అగ్రహించదు. లోకాన్ని బాధించదు. వివేకంతో వేసే ప్రతి అడుగు గమ్యానికి చేర్చేదై ఉంటుంది.

లేదా, అక్కడ జీవుడు నిశ్చల సంకల్పంతో ఒక దివ్య శాసనాన్ని ఆమోదిస్తాడు. క్షుద్రశక్తుల్ని జయిస్తాడు. వాటి సంపదలను కొల్లగొడతాడు. ఒక అజ్ఞాత సామ్రాజ్యాన్ని తనకై నిర్మించుకుంటాడు. ఆ మహత్కార్యంలో అణుమాత్రం స్వార్థం కనిపించదు. అపశృతి వినిపిస్తే అది జీవుని మానసిక వికారాలకు ఒక సూచన మాత్రమే. అది ఆత్మ చైతన్యానికి గురుతు. పరమాత్మతో జీవాత్మ సంస్పర్శకు ఒక సూచన. లేదా, బ్రహ్మపథంలో పరిపూర్ణత్వ చిహ్నం లేదా ఒక మహదాశయా నికి, ఆశయసిద్ధికి అనుకూలమైన శరీరాన్ని నిర్మించుకోవడం. ఒక ఆదర్శంతో, ఒకే భావనతో ఆత్మ చుట్టూ ఘనమైన కుడ్యాన్ని ఏర్పరచుకోవడం.

ఎంత ఇరుకు జాగాలో కూర్చున్నా ధ్యానం కుదురుతుంది. ఏ ధ్యానం అయినా పరమాత్మకే చెందుతుంది. ఎవరూ చూడకుండా తలుపులు మూసి గదిలో కూర్చున్నా, ధ్యాన తరంగాలు విశ్వమంతటా వ్యాపిస్తాయి. నిర్వికార సమాధి స్థితికి వెళ్లినప్పుడు రూపాలు కనిపించవు. ప్రేమలు, అగ్నుల అలజడి ఉండవు. మతం మనిషిని ముందుకు పోనీయదు. ఎంత గొప్పదైనా మతం మనస్సును నిర్జీవ పరుస్తుంది. జీవితాన్ని నీతి నియమాలతో కట్టడిచేసి, నిబంధనలతో బంధించి ఎదగకుండా చేస్తుంది. ఎన్ని త్యాగాలు చేసినా, దాన ధర్మాలు చేసినా అవి ఆత్మ పురోగతికి సహకరించవు. వాడి, వేడి లేని జీవితం నిస్సారమవుతుంది.

పవిత్ర గ్రంథాలు భద్రంగా ఉంటాయి. పట్టుదారాల ముడి విడదు. ఆధ్యాత్మిక రహస్యాలు ఏ మతం ద్వారా అంతుపట్టవు.

మనస్సు నిశ్చలం, నిర్మలం కావడం ప్రధాన అర్హత. ప్రశాంతి ఏర్పడాలి. అప్పుడు జీవితం మామూలు జీవితం కాదు. ఆ జీవితంలో ఉద్రేకాలకు ప్రవేశం ఉండదు. ఇంద్రియ చాపల్యాలు, ఆర్భాటాలు లయించిపోతాయి. అప్పుడు ఆత్మ వేరు, మేధ వేరుగా ఉండవు. ఉండేది ప్రజ్ఞ ఒక్కటే. మనసే ఆత్మగా, ఆత్మే ఆత్మశక్తిగా మనస్సు ద్వారా బహిర్గతమవుతుంది. ఆత్మ భావనగా పరిణమిస్తుంది. అది పరిణమిస్తుంది. ఆత్మశక్తిసైతం ఒక విధమైన మానసిక శక్తి. ఆత్మశక్తి సూర్య కాంతిని సైతం మరపింపచేసే వెలుగు, అది తేజస్సు. ఆ స్థితికి సావిత్రి చేరుకున్నది.

అక్కడ అంతా నిశ్చలంగా ఉంది. వేటి స్థానాలలో అవి భద్రంగా, స్థిరంగా ఉన్నాయి. దేని లక్ష్యం దానిది. దేని గమ్యం దానికి తెలుసు. అన్నింటి లక్ష్యం సుస్థిరత. అక్కడ ప్రతిశక్తి అధికారంతో నిలిచి, శాసించగల స్థితిలో ఉంది. మాటలో, చూపులో, చలనంలో అధికార దర్పం. వాటి ప్రతిమాట ఒక శాసనం.

"ఆత్మబలంతో, దివ్యకాంతులు వెలార్చే అంతర్లోకాలను చేరుకోగలిగిన ఓ ఆత్మబాంధవీ! నీవు ధన్యవు. ఓ సముజ్వల జీవనపథగామీ! సత్యాన్వేషీ! ఇదే నీ గమ్యం! ఇంక అన్వేషణ ముగించు. శాంతించు దేవీ!

"సృష్టిలో సుస్థిరతకు ఆవాసం ఇది. ఇదే సత్యం. ఇదే పరమాత్మ ప్రేమ మందిరం. మహాత్ముల పట్టికలో నీ పేరు నమోదు చేసుకో! నీ ప్రవేశాన్ని ఇక్కడ అందరూ ఆమోదిస్తున్నారు. నీ రాకను హర్షిస్తున్నారు. వివేకంతో నీ మనస్సును శుభ్రపరచుకో. జీవన్ముక్తుల శ్రేణిలో నీవూ ఉన్నావు. మాలో ఒకరివైన నీవూ మహాత్మవే. సూక్ష్మరూపంలో నిక్షిప్తమై ఉన్న సృష్టి రహస్యాలను నీ మనస్సు గ్రహించగలదు.

"పరమాత్మ జీవునకు ప్రసాదించేవన్నీ ప్రణాళికాబద్ధమే. అదే అన్నింటికీ అంతం. ఆపైన మరేమీ మిగలదు. అదే అన్నింటికి కట్టకడపటి హద్దు. అదే వెలుగు. అదే నిర్మలత్వం. ఏకైక సత్యం. అక్కడ బ్రహ్మానందం మణివలె ప్రకాశిస్తుంది. అక్కడ స్వర్గం, ప్రకృతి కలిసి జీవిస్తాయి. ఒకదానిలో ఒకటి లీనం అవుతాయి".

మహర్షి మాటలకు అర్థాలు తెలిశాయి. ఆయన మార్మికంగా, నర్మగర్భంగా చెప్పిన మాటల అర్థం బోధపడ్డది. అంతర్వాణిని హృదయం వినగలుగుతుంది.

కాని హృదయం తిరిగి సమాధానం చెప్పదు. వివేకం ప్రజ్ఞను పొందడమే సూచన. ఆమె వివేకం సమాధానం పలికింది.

"ఈ అయోమయ, అరాచక ప్రపంచంలోకి జీవులు కాలానుగుణంగా, కర్మానుసారం వస్తూ పోతుంటారు. లౌకిక న్యాయాన్ని పాటిస్తారు. ఆత్మ ధర్మాన్ని అనుసరించరు. సత్యాన్ని గ్రహించినవారు సుఖిస్తారు. సత్యాన్వేషులు భయ భ్రాంతులకు లోనుకాకుండా, వ్యామోహాలకు దూరంగా జీవిస్తారు. అస్థిరలోకంలో స్థిరసంకల్పంతో, స్థిర లక్ష్యంతో జీవించే వారు అరుదు. అయినా వారు ధన్యులు, సిద్ధపురుషులు. తమ హృదయంలో ఒక ఆధ్యాత్మిక బీజాన్ని నాటుకుని కల్పవృక్షాన్ని పెంచుకున్న వారూ ఉత్తములే. విశ్వాసం చెక్కుచెదరని వారు సుఖపడతారు, గమ్యం చేరగలుగుతారు. ఈ అన్వేషణ ఇంతటితో ముగించి శాశ్వతం, సుస్థిరం అయిన సత్యాన్ని తెలుసుకోవాలి. విశ్వరచనా చమత్కృతిని అర్థం చేసుకోవాలి. దృశ్య ప్రపంచపు విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలి. నేను ఇక్కడ నిలిచి పోకూడదు. నా ఆత్మను తెలుసుకోవాలి".

ఆ తేజోలోకాలలో అందరూ పూర్ణప్రజ్ఞులే. ఎవరికి లేనిది ఏదీ లేదు. ఆమె ఆర్తి అర్థం చేసుకోడానికి, సమాధానం చెప్పడానికి ఎవరూ ప్రయత్నించలేదు. ఎవరి మానాన వారు నిశ్చింతగా ఉండిపోయారు. అసలు ఆ లోకంలో అంతవరకు ప్రశ్నించినవారు లేరు. అక్కడ వినిపించిన స్వరం లేదు. శబ్దం లేదు. అలాంటిది ఒక జీవవాణి ప్రశ్నించడం విని నిరుత్తరులైనారు. పరాన్ని గురించి పూర్తిగా తెలియనివారు, తేజో మండలాల నుండి వచ్చిపోతున్నవారు, ఆమె ప్రశ్నలలోని భావాన్ని, భావాల అర్థాన్ని వెదకసాగారు.

ఆత్మ రక్తమాంస నిర్మితం కాదని, అది మేధకు ఆలోచనకు అందనిదని, అది మనోవ్యాపారాలను కలచివేయగలదని, ప్రకృతి భౌతిక మందిరంలో మనుషుల హృదయాలలో కొలువు తీరి ఉంటుందని, మనిషికి ఆలోచనలు కలిగించేది ఆత్మ అని, మనిషికి క్షణికమైన సుఖభోగాలతో పారవశ్యం కలిగించేది ఆత్మ అని, మృత్యుసాగరం వరకు మనిషిని వెన్నంటి ఉండేది ఆత్మేనని తెలియని ఈ జీవి ఎవరై ఉంటారని ఆశ్చర్యపడ్డారు.

ఆమె తన ఆత్మనే అన్వేషిస్తూ పరమాత్మను అన్వేషిస్తున్న భ్రాంతిలో ఉందని, అది ఆదర్శలోకంలోని అపూర్వ నిగూఢ సంపద అని, ఆత్మశక్తి అనేది మానసిక విభ్రమమని, దాని రూపం ఉనికి ఎవరికీ తెలియవని, ప్రతిజీవి పరమాత్మ ప్రతిరూపమేనని, తల్లిదండ్రులలో మనస్సు ఒకరు, హృదయం ఒకరని, చైతన్యం

పైన దివ్యతేజస్సు ప్రకాశిస్తుందని, కనిపించే జగత్తును సృష్టించింది భగవత్సం కల్పమే అయినా మనిషి స్వర్గాన్ని సృష్టించుకుంటున్నాడని, లోకంలో ఉన్నది, తేజోలోకాలలో ఉన్నది, మనిషిలో ఉన్నదేనని మరికొందరు రకరకాల వ్యాఖ్యానించు కున్నారు. నానార్థాలు చెప్పుకుని అన్వయించుకున్నారు.

కొందరు అసంతృప్తికిలోనై, తమ మార్మికప్రజ్ఞను పోగొట్టుకుని, తమ విశ్వాసాలు తామే హరించినట్లు బాధపడ్డారు... 'ఇంకా పరమాత్మను అన్వేషించే జీవి ఒకటి ఉన్నదా? పరమాత్మను చేరేమార్గం అంటూ ఉందా? ఉన్నా అది మనకోసం తెరుచుకుంటుందా?' అని వ్యాఖ్యానించారు. అన్నింటినీ సంశయించడం వారి నైజం.

ఏమీ పట్టనట్లు, అక్కడ ఎవరినీ గమనించనట్లు ఆమె తన అంతరంగంలోకి దూసుకుపోసాగింది. శూన్యాన్ని, చీకటిని, వెలుగుల్ని దాటి జీవసందోహంతో క్రిక్కిరిసిన రహదారిని చేరింది. అక్కడ సిద్ధులు, తేజోమూర్తులు, మహర్షులు, మహాయోగులు అనేకమంది కనిపించారు. వారంతా సత్యలోకపు ప్రహరీలు ఎక్కడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు కనిపించని ద్వారాలకై వెతుకుతున్నారు. రహస్యద్వారాలు దాటి లోపల ప్రవేశించాలని వారి ప్రయత్నం.

అక్కడ వెలుగు లేదు. స్వరాలు వినిపించవు. వారంతా మనిషి ఔన్నత్యానికి ప్రతినిధులు. ఆత్మ మందిరంలో వారే సంచాలకులు. అక్కడ అందరూ ఆధ్యాత్మికంగా మగతలోనే ఉంటారు. జాగ్రదవస్థలో మహాద్భుతాలు, మహిమలు ప్రదర్శిస్తారు. వారి మనోభావాలు కొన్ని దారితప్పివచ్చి మనిషిని చేరుతుంటాయి. అవి మన స్వప్నాలకు, వాస్తవాలకు నీడలు.

దివ్యచక్షువులు గల దేవతలెందరో అక్కడ కనిపిస్తారు. సౌందర్యరాశులైన అచ్చరలు ఏవేవో ఆశలు సృష్టిస్తారు. భ్రమలు కలిగిస్తారు. మధుర స్వప్నాలలో బంగారు లోకాలు, అద్భుత సుఖాలు చూపిస్తారు. తీరని మన కోరికలు, ఆశయాలు అరూపంలో భ్రమల్ని కల్పిస్తుంటాయి. దివ్యభావనలు, నిర్మలత్వం హృదయానికి దివ్యానుభూతుల్ని కలిగిస్తాయి.

సావిత్రి వారి మధ్య చరించింది. వారి తేజస్సును అభినందించింది. వారి వలె తనకూ ఈ తేజోలోకాలలో సుస్థిర, శాశ్వత ఆవాసం కలగాలని కోరింది. కాని ఆమె హృదయం లోపలనుండి లక్ష్యాన్ని గుర్తు చేసింది. తన లక్ష్యం నెరవేరాలంటే ఈ తేజోలోకాలలో ఆగిపోకూడదు. తన ఆత్మను గుర్తించాలి. తమను తాము ఉద్ధరించుకున్నవారే ఇతరుల్ని ఉద్ధరించగలరు.

ఆమె కఠోరమైన జీవిత సమస్యనే ఎదుర్కొన్నది. మానవుల కష్టాలు తొలగించాలని, సుఖాలు ప్రసాదించాలని మహాత్ములు తాము సంపాదించుకున్న శక్తులతో జనంలోకి పరుగెడతారు. ఆమె సృష్టి మూలాన్ని అన్వేషిస్తున్నది. మృత్యువుకు అతీతమైన స్థితిని వాంఛించింది. అందుచేత దివ్య జీవులను ఉద్దేశించి, చేతులెత్తి నమస్కరించింది.

"ఆనందస్వరూపులైన తేజోమూర్తులారా! నేను వెతుకుతున్న మార్గం మీకు తెలిస్తే చెప్పండి. మీరూ ఆ బాటలో పయనించి ఉంటారని నా నమ్మకం. నిస్తులంగా ఉన్న ఈ మహాతేజస్సుకు మూలం ఏదో సెలవీయండి. నా ఆత్మ ఎక్కడున్నదో దాని ఆవాసం ఎక్కడో చెప్పండి".

అంతరంగంలో ఒక మూల, చాలా దూరంగా యోగనిద్ర వంటి మహాప్రశాంత స్థితివైపుగా, శూన్యంలోకి, శూన్యంగా ఒకరు దారి చూపించారు.

"సావిత్రీ! గుహ్యమైన ఆత్మనుండే మేమూ ప్రభవించాము. నీ, మా ఆత్మలన్నింటికీ మూలస్థానం ఒక్కటే. మానవులను అజ్ఞానం నుండి, అంధకారం నుండి ఉద్ధరించి వారిలో ఆరాధన, దివ్యాకాంక్ష కలిగించే దేవదూతలం మేము. పాపం ప్రస్తరిల్లినప్పుడు పుణ్యజ్యోతిని వెలిగిస్తాం. అజ్ఞాన రహదారులలో జ్ఞాన మజిలీలు సృష్టిస్తాం. చీకట్లలో నడిచే వారికి వెలుగు దీపాలు చూపిస్తాం. వెలుగు చూడాలన్న సంకల్పం దివ్య సంకల్పమే. అది నీ మా సహ సంకల్పం.

"ఓ, ప్రచ్ఛన్న దేవతామూర్తీ, మానవరూపిణీ! గుప్తంగా దాచుకున్న నీ తేజస్సును ఎవరు దర్శిస్తారు! ఎవరు కాంక్షిస్తారు? నీకు తెలియని సత్యస్వరూపం వేరెవరికి తెలుస్తుంది? ఈ సుదీర్ఘమైన అనంతమైన రహదారిలో అంత శ్రమపడి ఎవరూ ప్రయాణించరు. కొందరు మాత్రమే ప్రశాంతంగా తమ మజిలీలు చేరతారు. మూల త్రికోణ పీఠికపై జ్వలించే అగ్నిని గమనించు తల్లీ! అదే గుహ్యంగా ఉన్న నీ ఆత్మ ఆవాసం".

అప్పుడు సావిత్రి విశాలమైన చుట్టుమార్గాలను వదలి ఇరుకు మార్గంలో చొరబడింది. అక్కడ పూర్వ యాత్రీకుల అడుగుజాడలు అతి తక్కువగా ఉన్నాయి. అక్కడ కాలుమోపిన వారందరి పాదముద్రలు అక్కడ ఉంటాయి. అందరినీ పాద ముద్రల్ని బట్టి గుర్తించవచ్చు. ఆరాధించవచ్చు. వెలుగుతెరల చాటు నుండి కొందరి దివ్యరూపాలు కనిపించాయి. వారు ప్రశాంత దృక్కులతో ఆమెను అభినందించి ఆశీర్వదించారు. అక్కడ ప్రశాంతిని భంగపరచే శబ్దం ఏదీ లేదు. అంతా నిశ్శబ్దమే. అందరిది ఆత్మానందమే. ఆత్మీయతామైత్రి వారందరిది.

22. శక్తిత్రయం

సావిత్రి సంకల్పం చేసి అంతరంగం లోపలకు పయనించింది. ఆమెకు మూడు శక్తులు ఎదురైనాయి. ముగ్గురూ స్త్రీమూర్తులే. ప్రతి ఒక్కరు సావిత్రి తానే నన్నారు. ఆ సారూప్యాన్ని సావిత్రి అంగీకరించలేదు.

మొదట ప్రత్యక్షమైంది విషాదం మూర్తీభవించిన దైన్యం. ఆహార్యంలో దారిద్ర్యం. కూర్చున్న పీఠం పాషాణం. మనిషి పుట్టిన నాటి నుండి మరణించే వరకు అనుభవించే కష్టాలు, కార్చే కన్నీరు, ఊర్చే నిట్టూర్పులకు ఆమె ప్రతినిధి. ఆమెలో మనిషి బాధల పల్లవి వినిపించింది. లోకంలోని క్రౌర్యం, విషాదం సమూలంగా నిర్మూలించగల శక్తిని తాను సంపాదించి మనిషి కన్నీరు తుడిచివేస్తానని ప్రతిన పూనింది.

తర్వాత సావిత్రికి ఎదురైంది శక్తిస్వరూపిణి. చేతిలో త్రిశూలం ధరించిన సింహవాహన. ఆమె శక్తి స్వరూపిణి. ఆమె తానే సావిత్రిలోని ఆత్మనని నమ్మబలికింది. తానే దుర్గ. తానే లక్ష్మి నన్నది. మనిషి తన అనుగ్రహంతోనే శక్తులు సంపాదించి సుఖపడుతున్నాడని చెప్పింది. అంత శక్తి పొందిన మనిషిలో ఎందుకు భయం పోవడం లేదన్నది సావిత్రి సంశయం. భయాన్ని తొలగించగల శక్తిని సంపాదించా లనుకున్నది సావిత్రి.

తర్వాత శాంతమూర్తి అయిన తేజస్వినిని దర్శించింది. ఆమె రత్నఖచిత స్వర్ణ సింహాసనంపైన కొలువు తీరింది. ఆమె వదనంలో భాసురతేజస్సు, పెదవులపై దరహాసం. తానే సావిత్రి ఆత్మ నన్నది. ఆమె మనిషికి కలలు అనుగ్రహిస్తుంది. ఆదర్శాలు కలిగిస్తుంది. స్వతంత్రం, సౌందర్యం, మంచితనం అన్నీ ఆమె వరాలే. మనిషి జ్ఞానం పొందడానికి, దివ్యత్వం సాధించడానికి ఆమె సహకారం అవసరం. మనిషి విజ్ఞానం సంపాదించడం ఆమె వల్లనే అయినా సృష్టిరహస్యం తెలుసుకోలేదు. మనిషి జన్మరహస్యం సృష్టిరహస్యం తెలియాలంటే ఆత్మ దర్శనం కావలసిందే.

సావిత్రి మళ్లీ ముందుకు సాగింది. నిరామయ, నిర్వికల్ప, నిశ్చేతన స్థితిలో సంకల్పం మరొక మలుపు తిరిగింది. అక్కడ ఒక దేవి సాక్షాత్కరించింది. సుదీర్ఘ నీలకుంతలాలు, వదనంలో దైన్యం. ఆమె పీఠం కఠిన శిలాసదృశం. ఆమె పాద పీఠం పదును తేలిన గండశిల. ప్రపంచంలో గూడు కట్టిన దైన్యం ఆమె శిఖలు. సర్వజీవుల బాధలు ఆమె వలువలు. ఆమెలో, ఆమె చుట్టూ అస్థిర ప్రపంచం. బాహ్యంలో ఆడంబరాలు, అంతరంలో విషాదాలు.

ఈ లోకమే మాయ. కనిపించేదంతా అశాశ్వతం. ఈ అస్థిర సృష్టి మహా శూన్యం వరకు వ్యాపించింది. సావిత్రి ఆమెలో ప్రపంచంలోని జీవుల కష్టాలు, బాధలు, గ్రహ చలనాలు, గ్రహ గతులు, జీవుని యాతనలు, మృత్యువు – అన్నీ చూచింది. ఆ దేవి విషాద ప్రపంచాన్ని తన శరీరంగా మార్చుకుని, సప్త వ్యసనా లను గుండెలో ధరించింది. ఏడు గాయాలతో గుండె తూట్లు పడి రక్తం స్రవించగా, విషాదం ఆమె వదనంపై దోబూచులాడింది.

యుగయుగాల కన్నీటి ధారల చారికలు ఆమె చెక్కిళ్లపై స్పష్టంగా కనిపిస్తున్నాయి. విశ్వ విషాదంతో ఆమె గుండె బరువెక్కింది. విచారంతో కాలం కన్నీరు కార్చినట్లయింది. ఆమె స్వరంలో విషాదఛాయ. అయినా ఆమెలో ఏదో ఆనందం, ఆకర్షణ, వున్నాయి. బరువుకళ్ల వెనుక ఆశ తళుకొచ్చింది. ఆమె మంద స్వరంతో పలికింది –

"సావిత్రీ, నీవు అన్వేషిస్తున్న ఆత్మను నేనే. విశ్వంలోని విషాదాలను భరించడానికి పూనుకున్నాను. నా బిడ్డల కష్టాల్ని నా గుండెలోనే దాచుకుంటాను. ఈ ప్రపంచంలో జీవులందరికీ ఊరట కలిగించేది నేను. దైవ ధిక్కారం కారణంగా శాపగ్రస్తులై నానాబాధలు పడి, నైరాశ్యంలో క్రుంగిపోతున్న వారికి ఊరట కలిగించేది నేను. నేను అబలను, లోకసేవికను, బానిసను, పశువును. నన్ను క్రూరంగా హింసించేవారిని ప్రేమించడం నా నైజం. నన్ను గర్హించి, ద్వేషించేవారిని నేను లాలిస్తాను. ప్రేమిస్తాను. నన్ను అందరూ వాంఛిస్తారు. నేను అందాల రాశిని, అందరికీ తృప్తి కలిగించేది నేను. దేవాలయాలలో పూజలందుకునే దేవతను నేను. బాధల్లో, ఆక్రందనల్లో, అంతటా, అన్నివేళలా నేనుంటాను.

“ఇహం నుండి పరానికి చేరడానికి ఆధారమైన మంత్రం నేను. ప్రాణుల ఆవేదనల్లో నేను కనిపిస్తాను. బాధామయ జగతికి మూల కారణం నేను. మనిషి శారీరక, మానసిక దుర్భర వేదనలు, రోదనల్ని పరలోకాలు పట్టించుకోవు. అవి తిరిగి వచ్చి నా గుండెను తాకి, నా ఆత్మను బాధిస్తాయి.

“ఏం చేయను? నేను నిస్సహాయురాలిని. ఆకలిమంటకు అహుతి అయ్యే బక్కరైతును చూచాను. పురిటి పొత్తిళ్లలోనే హత్య కావించబడే పసిబిడ్డల్ని చూచాను. అబలల్ని వివస్త్రల్ని చేసి, మానభంగం చేస్తుంటే ఆ కామపిశాచాలను ఏమీ చేయలేక, కన్నీరు కార్చాను. వారి ఆర్తనాదం నా గుండెను తూట్లు పొడిచినా నేనేమీ చేయలేకపోయాను. ఎవరినీ రక్షించే శక్తి నాకు లేదు. రక్షించగల ఆయుధం, శిక్షించే చట్టం నా చేతిలో లేవు. పరమాత్మ నా జాలిగుండెలో ప్రేమను నింపాడు తప్ప నాకు శక్తి నివ్వలేదు.

“చెర్నాకోలు దెబ్బలు తిని ఉత్సాహం పొందే పశువు, కాడి బుజాన వేసుకుని శ్రమిస్తుంది. దాని కష్టంలో నేను పాలు పంచుకోగలిగాను కానీ, కాడిని దింపలేక పోయాను. నిరంతరం కడుపుకోసం తిరుగుతూ భయంకరంగా ప్రాణభయంతో జీవించే పశువుల్ని, పక్షుల్ని చూచి చలించాను. అవి ఆకలితో అలమటించి, అర్థాంతరంగా చనిపోతే చూస్తూ ఊరుకున్నాను. నేనేం చేయగలిగాను?

“సామాన్యుల జీవన పోరాటంలో నేనూ పాల్గొన్నాను. వారి అల్ప సంతోషాలలో, బహుదుఃఖాలలో భాగం పంచుకున్నాను. బాధలు భరించలేక, కష్టాలలో కనలి, తమ నష్టాలకు ఏమాత్రం పరిహారం లభించదని క్రుంగిపోవడం చూచాను. నిరంతరం శ్రమిస్తూ, సుఖశాంతులు లేక కుమిలిపోవడం గమనించాను. వారి బాధలు నా కన్నీరుగా మారింది. గాయపడిన వారి గుండెను ఊరడించ గలిగాను. సానుభూతి భారాన్ని కొంతవరకు ఉపశమింప చేస్తుంది. అగోచరమైనా భగవంతునితో మనిషికి పరిచయం ఉంది. బాధితులతో కలిసిన బాధను నేనైనాను. హతులతో కలసి నేను నేలకొరిగాను. బంధితులతో కలసి భయంకర కూపాలలో జీవించాను. కాలం మోపిన బరువులన్నీ మోశాను. ఆ భారాన్ని నేను మోస్తూ సృష్టి భారాన్ని, భగవంతుని భారాన్ని కొంత తగ్గించాను. ఈ ప్రపంచం, సృష్టి కడసారి దీర్ఘనిద్రలోకి జారినప్పుడు నేను శాశ్వతంగా నిద్రిస్తానేమో తెలియదు. స్వర్గలోకపు వైముఖ్యాన్ని ఓపికతో భరించాను. బాధితుల మొరాలకించకుండా భగవంతుడు తప్పుకున్నప్పుడు ప్రకృతి శాపాల్ని నేను భరించాను. భగవంతుని నిర్ణయాన్ని నేను ఎన్నడూ కాదనలేదు. ఆయన విశ్వధర్మాన్ని నేను ఏనాడూ తూలనాడలేదు.

"ఈ లోకంలోని కాఠిన్యాన్ని, యాతనలను నిర్మూలించాలని నా హృదయం నిశ్శబ్దంగా రోదించింది. ప్రార్థించింది. కాని నాలో వైరాగ్యభావన మెదిలేది. నాలో అంధవిశ్వాసం, నిర్దాక్షిణ్యం చోటు చేసుకున్నాయి. ఎప్పటికీ ఆరని అగ్నిని నేను మోస్తున్నానని తెలుసు. నా అనురాగమే గ్రహాలను శూన్యంలో నిలబెడుతున్నది. ఆశతో పరమాత్మ అనుగ్రహానికై ఎదురు చూస్తున్నాను. ఇంత వరకు ఆ పరమాత్మకు నాపై కనికరం కలగలేదు. 'ఉండు ... వస్తాను' అన్న మాట మాత్రం వినిపిస్తున్నది. ఎప్పటికో ఒకనాటికి పరమాత్మ వస్తాడని మాత్రం ఆశ".

ఆ దేవి అంతర్థానమైంది. ఆమె ఆవేదనకు సమాధానం క్రింది లోకాల నుండి వినిపించింది. అది భయానక వికటాట్టహాసం. ఆక్రోశం. ఆగ్రహించిన అడవి సింహం గాండ్రించినట్లు, మనిషి లోలోతుల నున్న పశుత్వం నోరు విప్పినట్లు, సమాధానం చెప్పినట్లు అనిపించింది –

"నేను విషాదం మూర్తీభవించిన మానవుడిని. ఈ విశ్వ శిలువపైన బంధించబడిన వాడిని నేను. నా విషాదం చూచి వినోదించాలని భగవంతుడు లోకాన్ని, నన్నూ సృష్టించుకున్నాడు. నా అనురాగమే జగన్నాటకానికి కథా వస్తువు. ఈ విషాదమయ ప్రపంచంలోకి నన్ను ఒంటరిగా పంపి, నన్ను నగ్నహింస చేస్తూ ఆనందిస్తున్నాడు. నేను ఏడ్చి ఏడ్చి, అలసిపోయి తన పాదాలపైనబడి, నా కన్నీటితో, నా రక్తంతో తనకు పాదాభిషేకం చేయాలని ఆయన కోరిక. రాబందు నోట చిక్కిన బలశాలిని నేను. ఆహితాగ్నుల్ని అవిష్కరించిన నేనే ఆ అగ్నిలో పడి శలభం వలె కాలిపోతున్నాను. గమ్యం ఎన్నటికీ చేరలేని చిరాన్వేషిణి నేను. ఎన్నటికీ విజయం పొందలేని సైనికుడిని నేను. ఎంత వేగంగా పరుగెత్తినా గమ్యం చేరుకోలేక పోతున్నాను.

"నా విపరీతపు ఆలోచనలే నాకు నరకాన్ని సృష్టిస్తున్నాయి. సుందర స్వప్నాలలో మాత్రం స్వర్గ సుఖాన్ని అనుభవిస్తాను. నా వలన నీకేమిటి ప్రయోజనం? మానవాత్మ ఎందుకు ఏర్పడినట్లు? నేను ఆత్మను విస్మరించి, పశువులా బ్రతికి, పశువులా మరణిస్తాను. తిరుగుబాటు చేసినా కడకు ఓటమి తప్పడం లేదు. బందీనవుతున్నాను. విధి, కాలం, సాటి మనుషులు నన్ను మోసం చేస్తున్నారు. హింసిస్తున్నారు. నా సర్వస్వం వెచ్చించి అయినా సరే స్వతంత్రం పొందడానికి సిద్ధంగా ఉన్నాను. నేనూ విముక్తి పొందాలి. శత్రుఘాతాలను ఎదుర్కొంటాను. కొత్త నియంతలు మళ్లీ నా తల కెక్కుతారు. నా గురువులందరు నాకు బానిస బతుకే నేర్పారు. శుశ్రూషనే ఒంట పట్టించారు. విధి రాసిన రాతల్లో,

భగవంతుని ముద్రల చాటున విషాద పూర్ణమైన నా హస్తాక్షరాలు కనిపిస్తాయి. నేను అందర్నీ ప్రేమిస్తాను. కాని ఎవరూ నన్ను ప్రేమించరు. నా కష్టార్జితాన్ని మరెవరో అనుభవిస్తున్నారు. నాకు చివరికి మిగిలేది దురదృష్టం. గాయపడిన నా భావాలు అటు భగవంతునితోను, ఇటు సాటిమనిషితోను నిత్యం పోరాడు తుంటాయి.

"నేను సంపదల్ని ద్వేషించను, సుఖాలను కాలదన్నుకోను. నా కృతి, ప్రకృతి ఏవీ మారవు. నేను నా కోసమే ప్రేమిస్తాను. ఇతరుల కొరకు కాదు. ప్రకృతి ధర్మానుసారం ప్రతి మనిషి ఒంటరివాడే. ఎవరికి ఎవరు ఏమీ కారు. అంత నిర్దాక్షిణ్యంగా భగవంతుడు లోకాన్ని, మనుషుల్ని సృష్టించిపెట్టాడు. అలాగే మనిషికి అల్పహృదయాన్ని యిచ్చాడు. అందుకే మనిషి దౌష్ట్యంతో, దుర్మార్గంతో బ్రతుకు తుంటాడు. సానుభూతి చూపడం మనిషి బలహీనత. మనిషిలోని మంచితనం, ఆర్ద్రత, మార్దవం, కరుణ మరో మంచి జన్మకు పెట్టుబడులు. పరోపకారం మనిషి అహానికి మరొకరూపం. లోకంలో గుర్తింపు పొందడానికే లోకులకు సేవ చేస్తాడు.

"నాలో నిద్రాణంగా ఉన్న మహాశక్తి ఒక్కసారిగా మేల్కొంటే, సాగర మథనంలో అమృతం ఉద్భవిస్తే, నేనే ఈ లోకానికి ప్రభువును. భగవంతునితో సమానంగా మనిషి శక్తివంతుడవుతాడు. కానీ భగవంతుడు నా మౌలిక శక్తుల్ని మటు మాయం చేశాడు. నా హృదయం దానిని అమాయకంగా అమోదించింది. దాతృత్వంవల్ల నేను ఓడిపోయాను. కష్టాలలోనూ తృప్తిని పొందుతాను. బాధలలోనే ఔన్నత్యం పొందడానికి ప్రయత్నించాను. భయంకరమైన రోగాలను అనుభవించేది నేను. అసలీ పైశాచిక కృత్యాలకు కర్తను నేనే. పాపకార్యాలు చేయడానికే పుట్టాను. నేను జన్మపాపిని. ఒకరి తృప్తి కోసం కాదు, నా కొరకే నేను పాపం చేస్తాను. ప్రకృతి నాకు అప్పగించిన పనిని నిర్వర్తించడమే నా విధి. ఇంక ఏడ్చినా, మొత్తుకున్నా, ద్వేషించినా, రోదించినా ఫలితం శూన్యం".

సావిత్రి ఆ స్వరం విని విహ్వల అయింది. ఆమెలో కరుణ జాలువారింది. ఇలా సమాధానం చెప్పింది :

"బాధలను, విషాదాలను భరిస్తున్న ఓ దేవీ, నాలో నీవూ ఒక భాగానివి. నీ కారణంగానే మనిషి విధికి తలవంచడం లేదు. సుఖాలకై విధితో పోరాడు తున్నాడు. నీ కారణంగానే మనిషి తనలో ఆశలు పెంచుకుంటున్నాడు. నీకు ఊరడించే హృదయం ఉంది, కాని రక్షించే శక్తి లేదు. ఒకనాటికి నేను ఆ

రక్షణశక్తి నా వెంట తెస్తాను. ఆ దివ్యామృతం నీకు తాగిస్తాను. అప్పుడు భగవచ్ఛక్తి నీ నరాలలో ప్రవహిస్తుంది. నీ హృదయం ప్రజ్ఞాపూర్ణమవుతుంది. నీ అనురాగం మానవతకు ఆత్మీయబంధం అవుతుంది. నీ ప్రేమ కార్యాచరణతో కలుస్తుంది. లోకం నుండి విషాదం పూర్తిగా నిష్క్రమిస్తుంది. ఆగ్రహావేశాల నుండి మనిషికి విముక్తి లభిస్తుంది. కర్కశత్వం, రాక్షస ప్రవృత్తి కనిపించకుండా పోతాయి. లోకంలో శాంతి సుఖాలు శాశ్వత ప్రాతిపదికపై నెలకొంటాయి".

సావిత్రి ఊర్ధ్వ గమనంలో మరింత ముందుకు సాగింది. గండశిలలు, అగడ్తలు, అవాంతరాలు దాటి మహోన్నత స్థితిని చేరుకుంది. ఒక సుకుమార మారుతం హృదయాన్ని తాకి గిలిగింతలు పెట్టినట్లయింది. సుమ పరిమళాలు పరవశింప చేశాయి. అక్కడ అంతా సుందరం, సుకుమారం, ఉన్నతం అనిపించింది. అక్కడ ఒక గండశిలా సింహాసనం పైన ఒక దేవి పట్టు పీతాంబరాలు ధరించి త్రిశూలధారిణిగా దర్శనమిచ్చింది. ఆమె చేతిలో డమరుకం ఉంది. సింహంపైన కూర్చొని ఉన్నది. సింహవాహిని. ఆ దేవి అధరాలపై ఆమె సుందర మందహాసం. ఆమె కన్నుల్లో అగ్నిరేఖలు. ఆమె శౌర్యసాహసాలకు ప్రతినిధి. దివ్యత్వం రూపు దాల్చినట్లుంది. క్షుద్రశక్తులన్నింటినీ తన పాదాక్రాంతం చేసుకున్న ఠీవి, దర్పం ఆమె వర్ఛస్సులో కనిపించింది.

ఆమె శిరస్సు చుట్టూ ప్రకాశమాన భాసుర కాంతివలయం. ఆమె ధరించిన దేవతావస్త్రాలలో దర్పం, మహత్తు. రూపంలో రాజసం, చూపులో విజయగర్వం. ఈ విశ్వానికి తానే మహారాణినన్న అహం ఆమెకు అలంకారాలు, అభరణాలు. మృత్యువుకు తరతమాలు లేనట్లే ఆ దేవికీ తరతమాలు లేవు. అందరిపైన సమదృష్టి సారిస్తుంది. అన్ని శక్తులు ఆమెకు వశమే. ఆమెలో సత్యం ప్రకాశిస్తున్నది. తానే జ్యోతి స్వరూపం. ప్రేమ, ప్రజ్ఞ, బ్రహ్మానందాలకు ఆమె నిలువుటద్దం. నిర్మల కాంతి, తేజస్సు ఆమెకు ఆలంబనలు, మేధ అంతరాంతరంలో ఆమె స్థానం స్థిరం. ఆ శక్తి స్వరూపిణి కాల ప్రవాహాన్ని తిలకిస్తూ, భవిష్యనాదాన్ని వినగలదు. నిర్విఘ్నంగా సాగే గ్రహగతుల్ని వీక్షిస్తుంది. భగవంతుని లీలలు, మృత్యుఘోషలు వింటుంది. ఆయా శక్తుల విజృంభణలో, పోరాటంలో ఆమె సంకల్పానికి తిరుగులేదు. ఆమె సంకల్పమే శాసనం. ఆమె పలుకు రణభేరి. పతనం చెందిన వారికి ఆమె దర్శనం ఒక ఆశాకిరణం. ఆమె మధుర స్వరంలో అనురాగం చిప్పిలుతుంది. ప్రేమ పొంగి పొరలుతుంది. ఆ దేవి అన్నది :

"సావిత్రీ! నిగూఢంగా ఉన్న నీ ఆత్మను నేను. నేనే నీవుగా ఈ మానవ ప్రపంచంలోకి దిగి వచ్చాను. అనుక్షణం నిన్ను నన్ను పరమాత్మ గమనిస్తూ

ఉంది. ఈ భూమిపైన మంచికి, చెడుకు మధ్య పోరు సాగుతుంది. సురాసురశక్తులు కలబడుతుంటాయి. అందుకే నేను దిగి వచ్చాను. విషాదాలలో ప్రమాదాలలో చొరబడి భ్రష్టుల్ని, ఆశోపహతుల్ని కనికరిస్తుంటాను. నీతివంతులకు సత్ఫలితాలు అందిస్తాను. కోరిన వారికి కోరుకున్న ఆనందం యిస్తాను. అహంభావుల్ని పండితులను సమాజం గుర్తించేట్లు చేస్తాను. ఆ తర్వాత వారిని విధి పాదాల క్రింద కర్కశంగా నలిపి వేస్తాను. దీనజనుల ఆక్రందనలు సానుభూతితో చెవియొగ్గి వింటాను. నియంతల్ని, హంతకుల్ని కూలదోసి కాలరాస్తాను. ఈ లోకం నిర్దాక్షిణ్యంగా, నీచంగా అణచి అవమానిస్తున్న పతితుల్ని ఆదరిస్తాను. చీకటి జీవితాలు గడిపేవారిని ఆదుకుంటాను. నా ప్రమేయంతో వారికి కొత్త శక్తి కలుగుతుంది. కొత్త ఆశ చిగురిస్తుంది. భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకుంటారు. లోకాన్ని వేధించే రక్కసిని అణచివేస్తాను. హతం చేస్తాను. శక్తి స్వరూపిణి అయిన దుర్గను నేను. సిరిసంపదలు అనుగ్రహించే లక్ష్మీదేవిని నేను. మారణకాండలో ప్రధాన పాత్ర పోషించే మహాకాళిని నేను. రాక్షస గుణాల్ని సమూలంగా నాశనం చేయగలిగింది నేను.

"పరమాత్మ అభిమతం మేరకు నేను కర్తవ్య పాలన చేస్తాను. భూలోకపు అవరోధాలు ఏవీ నా పనికి ఆటంకం కావు. నాకు పుణ్యపాపాల గురించి తెలియదు. నాకు తెలిసింది కార్య నిర్వహణ ఒక్కటే. స్వర్గం ఆగ్రహించినా నాకు అవసరం లేదు. అసుర శక్తుల ప్రతిఘటనల్ని నేను పట్టించుకోను. లక్ష అవరోధాలను క్షణంలో అవలీలగా దాటగలను. మనిషిని మంచి మార్గంలోకి మళ్లించడమే నా కర్తవ్యం. పాపాల నుండి, శాపాల నుండి మానవుని విముక్తం చేయగలను. మనిషి చేతికి దివ్యత్వమనే ఆయుధం యిచ్చి క్షుద్రశక్తుల నుండి రక్షణ కల్పిస్తాను. మనిషిలోని అహంకారాన్ని తొలగించి, వివేకంతో సత్యం గురించి ఆలోచింపచేస్తాను.

"మనిషిని సంకుచిత విజయ ప్రలోభాల నుండి తప్పించి, దివ్యజీవనం కలిగిస్తాను. మనిషి భౌతికంగా మరణించి నా ఆత్మపరంగా జీవిస్తాడు. నాకు గమ్యం తెలుసు. మార్గం తెలుసు. లోకాల అనుపానులన్నీ నాకు తెలుసు. యుద్ధ రంగంలో సేనానిని, మార్గతారను నేను. ఈ ప్రపంచం మూర్ఖంగా నా ప్రయత్నాలు విజయవంతం కాకుండా నిరోధిస్తుంది. మనిషి హృదయంలోని కుత్సితం, కుటిలత్వం నరకం కన్న భయానకం. ఆయా దుష్టశక్తులు అతిలాఘవంగా విధిని వెనక్కు మళ్లిస్తాయి.

"భగవంతుని సంకల్పాన్ని మనిషి మార్చడానికి ప్రయత్నిస్తాడు. సృష్టిలోని లోపాలను సరిదిద్దడం, దోషాలను పరిహరించడం కాని పని. నా వైపుగా పయనించే వారికి నేను సహకరిస్తాను. మంచివారిని రక్షించ గలుగుతున్నాను. అహంకరించే వారు పతనం చెందుతున్నారు. నా హృదయాన్ని పాషాణంగా మార్చి, నిర్దయగా నా పని నేను చేస్తుంటాను. క్రమంగా ప్రాగ్దిశలో ఉషోదయం అవుతుంది. వెలుగులు వెలారుస్తాయి. లోకం పరమాత్మ పథంలో పయనిస్తుందని నా నమ్మకం. నేను నిర్వహించే పనులపైన నా ముద్ర ఉంటుంది. అది విఫలం కాదు. స్వర్గద్వారాలు తెరుచుకున్న శబ్దం నాకు వినిపిస్తుంది. పైకి పయనించిన ఆత్మలు పరమాత్మను కలియడం నాకు తెలుస్తుంది".

ఆమెకు సమాధానం అధోమానస లోకం నుండి వినిపించింది :

"వికృతరూపంతో, ప్రకృతికి బందీ అయిన క్షుద్రశక్తి తన సహజస్వభావంతో తిరుగుబాటు చేస్తుంది. ఈ ప్రపంచంపై ఆధిపత్యం సంపాదించాలని, లోకాన్ని లోబరచుకోవాలని దాని ప్రయత్నం.

"భగవంతుని ప్రణాళికలో మహాకామన పరమాత్మ సంకల్పం. అది భగవంతుని స్వార్థం కాదు. తప్పిదం కాదు. భూమిని స్వర్గతుల్యం చేసి, అందులో మనిషిని పరమాత్మ తన ప్రతినిధిని చేశాడు. మనిషిలో ఉత్తమ మానవీయ గుణాలు, దివ్య లక్షణాలు ఉన్నాయి. కనుక భగవంతుడు మనిషికి ఆత్మను అనుగ్రహించాడు. పరిణామంలో మనిషి దివ్యుడు కావాలన్నది పరమాత్మ సంకల్పం. దివ్యత్వానికి మనిషి ఆధారం. మనిషి భావజీవి. ప్రకృతితో పోరాడ గలవాడు, ప్రకృతిని జయించ గలవాడు. తన పోరాటానికి ఫలంగా, తన మనస్సును, శరీరాన్ని బాధలకు గురి చేసుకుని, సమాజధర్మానికి తలవంచుతున్నాడు. మనిషి పడే కష్టాలవల్లనే ప్రకృతి పరిణామం చెందుతున్నది. అమరత్వసాధనకు మృత్యువు రహదారి. మృత్యుద్వారం దాటకుండా ఎవరూ స్వర్గాన్ని చేరుకోలేరు. అందుచేతనే మనిషి శాశ్వతత్వానికి తలవంచుతున్నాడు. తన స్వేచ్ఛకు తానే కళ్లాలు వేసుకొని పరమాత్మకు తనను సమర్పించుకుంటున్నాడు. అయినా మనిషి స్వతంత్రుడే.

"తాను స్వతంత్ర ప్రజ్ఞ కలవాడై ఉండి, మేధావి అయి, ఆమె నిర్దేశించిన పథాలలోనే నడుస్తాడు. శక్తివంతుడై ఉండీ, తాను శక్తిహీనుడ ననుకుంటాడు. అది అతని వినమ్రత, సౌశీల్యగుణం. తాను యజమాని అయినా సేవకులు చెప్పినట్లు చేస్తాడు. కారణం అతని ఆత్మ ప్రకృతికి అతిథి. ఆత్మ తనది కానట్లు

ఆత్మ కోసం తన శరీరానికి సేవలు చేస్తాడు. మనిషికి చైతన్యం, ప్రజ్ఞ, వివేకం ఉన్నాయి. ఆమె మనిషిపై తిరుగుబాటు చేయడం అన్యాయం".

ఆ స్వరం పెరిగి పెరిగి నభోమండలం చేరింది –

"భూమి మీద శక్తులన్నింటిపైన వారసత్వపు హక్కు నాది. ఆత్మ సామ్రాజ్యంపై ఆధిపత్యం సంపాదించేది నేను. మట్టికి దివ్యత్వం సంపాదించి పెడతాను. స్వర్గాన్ని చేరుకుని దానిని నా స్వంతం చేసుకుంటాను. భూమిపైన చివరన జన్మించింది నేనే అయినా అధికారం అంతా నాదే. కోట్లాది జీవరాశులు నా రాకకై నిరీక్షించాయి. మృత్యువుకు చిక్కినా, కాలానుగుణంగా జీవించినా శరీరానికి, ఆత్మకు అధిపతిని నేను. నక్షత్ర మండలంతో వెలిగే బృహత్తారకను నేను. లోకం యావత్తు నా కోసమే సృష్టించబడ్డది. నశ్వరమైన లోకంలో అనశ్వరమైన ఆత్మ నాది. మనిషి అందుకోవాలని అర్రులు చాచే పరమాత్మను నేను. అందుకోలేకపోయినా, ఆత్మ చివరికి పరమాత్మను చేరుతుంది. ఆ పరమాత్మ భువికి దిగి వచ్చి 'నేను'గా మారక తప్పదు. సూర్యచంద్రులు నా మార్గంలో వెలిగే దీపాలు. నా శ్వాస కోసమే వాయువు సృష్టించబడ్డది. రోదసి నా రథయాత్రకు మార్గం సుగమం చేసింది. ఈ సాగరాలు నా కోసమే సృష్టించబడ్డాయి. నా సుఖం, ఆనందం చూచి సృష్టి అసూయ పడుతుంది. మృత్యువును చూచి నేను నవ్వుతుంటాను. ఈ భూలోకం నా విహారభూమి, ఆకాశం నాకు క్రీడావని. యుగాలక్రితం ఇవి నా కోసం సృష్టించబడ్డాయి.

"మొదట భగవంతుడు ఖనిజాలను, తర్వాత జంతుజాలాన్ని సృష్టించాడు. జంతురూపాలతో ప్రయోగాలు జరిపాడు. ఆ ప్రయోగాలు విజయవంతమైన తర్వాత నన్ను సృష్టించాడు. నేను అంతా తన పోలికే. పుట్టిన కొత్తలో చాలా అర్భకంగా అజ్ఞానంగా ఉండేవాడిని. నేనొక నిస్సహాయజీవిని. మృత్యువు నీడలో నడుస్తూ నా జీవితకాలం స్వల్పమని తెలిసి ప్రకృతిని మించిపోవాలని, నేనే భగవంతుని కావాలని, నేనే అఖండ మేధావినని అనుకున్నాను. భగవంతుడు, ప్రకృతి ఊహించనంత ఎత్తులకు ఎదిగాను. దివ్యశక్తులు స్వాధీనం చేసుకుని నా స్వంతానికి ఉపయోగించుకున్నాను. నేనుగా కొత్త ప్రయోగాలు ప్రారంభించి, కొత్త సృష్టి జరుపుతున్నాను. నేను విజ్ఞానశాస్త్రవేత్త నైనాను.

"పాల నుండి వెన్న తీశాను. పారదర్శకతను అలవరచుకున్నాను. నీటిని ఘనీభవింపచేశాను. ఇనుప కవచం తయారుచేశాను. భగవంతుని వలె నేను అనేక రూపాలు, ఆకారాలు తయారు చేశాను. ఆ భగవంతునికే ఒక రూపం తయారు చేసి పెట్టాను. నేను ఊహించిన మేరకు నాదే ఆధిపత్యం అయింది.

నేను సాధించలేనివేవీ లేవు. భగవంతుడు అసంపూర్తిగా వదలిన సృష్టిని నేను పూరించాను. నా మేధతో ఆత్మ సహాయంతో సృష్టి లోపాలను చక్కదిద్దడానికి పూనుకున్నాను. భగవంతుడు తొలి సృష్టికర్త. నేను మలి సృష్టికర్తను. చివరివాడిని. విశ్వసృష్టికి మూలమైన పరమాణువుల్ని నేను తెలుసుకున్నాను. అణుశక్తితో నా శత్రువును జయించాను. సృష్టిని సర్వనాశనం చేయగల అణుశక్తి నాకుంది. లోకాన్ని లయింప చేయగలను.

"లేదా, పరమాత్మ శక్తిని నాలోకి గ్రహించి నా ఆత్మశక్తితో జతచేసి నా సుఖాలు, సంపదలు, భోగాలు ఇనుమడింప చేసుకోగలను. ఆ విధంగా నా ఇంటిని, నా లోకాన్ని స్వర్గం చేసుకోగలను. ఈ అద్భుతశక్తులన్నీ నేను భగవంతుని నుండి సంపాదించినవే. ఆయన పక్షాన నేను అద్భుతాలు చేసి, నేనే భగవంతుని అవతారం అనిపించు కున్నాను. స్వార్థం తల విదిల్చినప్పుడు లోకహితాన్ని కాంక్షిస్తాను. జీవితాన్ని కళామయం చేయగల మార్గాలు అన్వేషించాను. సమస్త ప్రాణుల్ని మచ్చిక చేసుకోగలిగాను. అవి నాకు విధేయంగా ఉంటాయి.

"రోదసీ తరంగాల రహస్యాలను తెలుసుకుని, దూర దర్శన, దూర శ్రవణ విధానాలు నేర్చాను. గగన విహారం చేస్తున్నాను. ఖగోళ రహస్యాలు సైతం కనుగొనాలని నా ప్రయత్నం. నాకు అజ్ఞానంతో బ్రతకడం, జ్ఞానిగా జీవించడం రెండూ తెలుసు. పాపపుణ్యాలు నేను సృష్టించుకోగలను. వాటిని జయించగలను, దాటి పోగలను. మార్మిక సత్యాలు, అతీంద్రియ శక్తులు నాకు తెలుసు. ఒక్క చూపుతో, భావనతో ఎవరినైనా శపించగలను. ఇతరుల మనస్సులు చదవగలను. మాట్లాడని మాటలు వినగలను. దివ్యదృష్టితో ఎవరినైనా చూడగలను. భూమిని జయించిన తర్వాత స్వర్గం పైకి వస్తాను. క్షుద్రశక్తుల్ని నా స్వాధీనం చేసుకున్నాను. అవి ఇప్పుడు నాకు దాసోహం అన్నాయి. నా వాంఛలు పూర్తిగా నెరవేరనిది నేను లయించను. మానవత్వం మరణించదు. విశ్వవ్యాప్తమైన సర్వశక్తులు నావే. నేనే విశ్వాత్మనై, నేనే అన్నీ అవుతాను".

భేరీనినాదం వంటి మానవ వాణిని సావిత్రి విన్నది – ఆ వాణి వెనుక 'అహం' ఉంది. అహం చాటున మరేదో మహాశక్తి ఉంది. ఆ శక్తిని సంబోధిస్తూ సావిత్రి అన్నది –

"ఓ శక్తి స్వరూపిణీ! సృష్టికర్త్రీ! తేజోమయీ! మనిషి మనుగడకు సహకరిస్తూ, ఇన్ని కష్టనష్టాలను భరిస్తున్న నీవు నా ఆత్మవంటిదానవా? నీవు తనలో ఉన్నందువలనే మనిషి గర్వంగా జీవిస్తున్నాడు. అహంకారంతో ఊగిపోతున్నాడు.

నీవల్లనే మానవాత్మలు స్వర్గం చేరగలుగుతున్నాయి. పరమాత్మ సన్నిధిలో దేవతలవలె మెలుగుతున్నాయి. వివేకరహితమైన శక్తి గాలి బుడగ లాంటిది. అది ఆకాశం వరకు ఎగరగలదు. కాని పరాన్ని చేరుకోలేదు.

"నీవు మనిషికి వివేకాన్నిచ్చావు, బుద్ధినిచ్చావు. కాని జ్ఞానం ఇవ్వడం మరచిపోయావు. ఆ జ్ఞాన తేజస్సుతో నేను తిరిగి వస్తాను. పరమాత్మ జ్ఞాన పథకాన్ని నీకు అందిస్తాను. నీవు నా ఆత్మను, లోకాన్ని నా ద్వారా చూడగలవు. నీ ఆత్మ పరిశుద్ధమైతే అందులో కనిపిస్తుంది. అప్పుడు నీ శక్తితో జ్ఞానం పెరుగుతుంది.

"అప్పుడు మానవ హృదయంలో ద్వేషానికి తావుండదు. భయాలు, బలహీనతలు మనిషి జీవితంలో కనిపించవు. అహంకారం లోలోపలనే అణగి పోతుంది. నీ సింహగర్జనకు లోకం పరవశిస్తుంది. అందరూ సచ్చిదానందంలో పరిపూర్ణు లవుతారు".

ఆమె ఆత్మ ఊర్ధ్వదిశగా పయనించి మరింత ఎత్తుకు చేరింది. అది ఆనందమయ సముజ్వల శూన్యం. ఆ విశాల శూన్యశిఖరం నుండి సర్వం వీక్షించవచ్చు. అంతా ఒకే దృష్టికి అందుతుంది. దూరానికి భిన్నదృశ్యాలు కలగా పులగంగా కనిపించినట్లు, అన్ని నాదాలు ఒకే నాదమైనట్లు, సర్వం బిందురూప మయింది. అక్కడ గాలి నిశ్చలం. వాతావరణం గంధపూర్ణం. అక్కడ ఏ శబ్దాలు చెవికి సోకవు. అంతా సహజం, వాస్తవం. ఆత్మకు తన నిజ ఆవాసం చేరిన తృప్తి. నిగూఢ విషయాలు సన్నిహితంగా, సత్యాలుగా భాసించాయి. ఆ ప్రశాంతసీమలో తానే మూలత్రికోణ బిందువైనట్లు ఒక శ్రీదేవి ఆశీనురాలై ఉంది. ఆమె కన్నులలో స్వర్గ సౌందర్యాలు విరబూస్తున్నాయి. ఆమె పాదాలు చంద్రకిరణాలు, వదనం సూర్యబింబం. ఆమె చూపు మృతి చెందిన వారికి సైతం జీవం ప్రసాదించగలదు. ఆమె మృదు మధుర స్వరంతో అన్నది –

"సావిత్రీ! గుప్తంగా వున్న నీ ఆత్మను నేనే. క్షతగాత్రుడై, నిస్సహాయ స్థితిలో ఉన్న మానవుని ఊరడించి, లాలించి, బాధలు తొలగించి, హృదయంలో శాంతిని నింపి 'అమ్మ' ఒడిలో విశ్రమింప చేయాలని, పరమాత్మను స్మరిస్తూ, దివ్య స్వప్నానుభూతి పొందాలని, ప్రేమామృతం పంచిపెట్టాలని, అనురాగం ఒలికించాలని వచ్చాను. అందుకై లోకానికి తేజోరూపాలు ప్రసాదించి కల్లోల జీవితాల్లో కారుణ్యం కురిపించాను. ఉదాత్త విషయాలన్నీ ఇప్పుడు సాధారణ విషయాలైనాయి. శక్తికి అవి వివిధ రూపాలుగా ప్రకటమవుతున్నాయి. చాలాకాలం

పోరాడి అలసిపోయి విశ్రమిస్తున్నాను. నరకంలో జీవిస్తున్న మనిషి కాస్త మంచిపనులు చేసి, తనలో దివ్యదూతలకు ఆశ్రయం కల్పిస్తున్నాడు. అభయ హస్తంతో ఆశీర్వదించడం నా పని. కల్లోలప్రపంచంలో శాంతిని నేను. సృష్టి పటంపైన విజ్ఞాన చంద్రికలను వర్షించేది నేనే.

"మానవ జీవితం పాపపుణ్యాలు, మంచిచెడుల సంకీర్ణం. జీవితంలో అడుగడుగునా వెలుగు నీడలే ఉంటాయి. మనిషి సంపాదిస్తున్న విజ్ఞానం అంతా అజ్ఞానమే. మనిషిని ఎప్పటికైనా సన్మార్గంలో నడిపించేది నేనే. భగవంతుని ప్రతినిధిగా మనిషిని ఉన్నత పథాలకు చేర్చవలసింది నేను. మనిషి చేసే తప్పులు, పాపాలు అతని పరమపథానికి సోపానాలు. అన్ని అనుభవాలు చిరు చిరు వెలుగుబాటలే. మౌనంతో చైతన్యం చిప్పిలించ చేస్తాను. మృత్యుపథం లోనే అమరత్వాన్ని సిద్ధింపచేస్తాను.

"మనిషి సృష్టించుకున్న పరమాత్మ రూపాలు అనేకం. అవే మనిషికి అండగా ఉండి వరాలిస్తుంటాయి. తాను కల్పించుకున్న రూపానికి వ్యక్తిత్వం, దివ్యత్వం ఆపాదించి దాని విలువను పెంచి, సుందర సువర్ణమూర్తిగా మలచగలడు. మనిషి ఆరాటం, పోరాటం, మరణం అన్నీ పరమాత్మ కొరకే. అసుర శక్తులపై సమరం సాగించేది అందుకే. చితిలో కాలి స్వర్గాన్ని చేరడం అందుకే. ఆశోపహతులకు ధైర్యం యిచ్చేది ఆత్మ విశ్వాసం. జీర్ణించిపోయే శరీరాన్ని రక్షించు కోవాలన్న తపన అందుకే. మృత్యువు దరికి రాకుండా కాపలా కాస్తున్నదీ అందుకే.

"అగ్నికీలలకు ఆహుతి అయిన సత్యాన్వేషి మనిషి. వైరాగ్యాన్ని ఆనందంగా అనుభవించే తపస్వి మనిషి. కాలం చేసే గాయాలన్నింటికి తట్టుకోగల ధీశాలి మనిషి. విధితో, మృత్యువుతో పోరాడగల వీరుడు మనిషి. తన వివేకంతో, ప్రజ్ఞతో, ఆత్మబలంతో సింహాసనం అధిష్టించగలవాడు మనిషి. అతనిది యోగహృదయం. అది నిశ్చలం, నిర్మలం, దివ్యం.

"అతనిది వేదవాక్కు, యోగదృష్టి. తానే సౌందర్యం. తానే ఆత్మానంద మాధుర్యం. ఆత్మకు ప్రస్థానమైన 'సత్యం' కూడా తానే. ఆధ్యాత్మిక సంపదలన్నీ తానే. నిరాశాపూర్ణ జీవితాలపై ఆశావృష్టి తాను. అనుక్షణం అమృతత్వం తనకు అందుతుంది. రవంత అవకాశంలోనూ ఆకాశమంత దివ్యత్వం ఒదుగుతుంది. మృత్యువు ముసుగులో దాగిన అమృతత్వం అది.

"ఆ శక్తులన్నీ నావే. నేను కోరినప్పుడు వస్తుంటాయి. ఆ శక్తులను ఉపయోగించి మనిషిని వెలుగుకు దగ్గరగా చేర్చుతుంటాను. కాని మనిషి మేధ

ఎదురుప్రశ్న వేసి అజ్ఞానం వైపు పరుగుదీస్తుంది. మనిషి ఎప్పుడూ అల్ప సంతోషి. స్వల్ప ప్రయోజనాలు ఆశిస్తుంటాడు. తాత్కాలిక సుఖాలతో తృప్తి పడతాడు. భౌతిక సుఖాలు, భోగాల కోసమే తను జన్మించా ననుకుంటాడు. పరమాత్మ చేయిచాచి పిలిచినప్పుడు, అనంతత్వం మస్తిష్కంలో చొరబడినప్పుడు పరమాత్మ దిశగా తిరుగుతాడు.

"ఈలోగా నేను దేవతల్ని దివినుండి భూమికి రప్పిస్తుంటాను. నిరాశాజీవికి రవంత ఆశ కలుగుతుంది. ఉత్తములు, అర్హులైన వారిని ఉద్ధరిస్తాను. అవివేకుల్ని సైతం క్షమించి కనికరిస్తాను. వారిలో మార్పు రావాలి. మూర్ఖుల్ని ఎవరూ మార్చలేరు. సిద్ధపడితే మొత్తం ప్రపంచాన్నే మార్చగలను. అప్పుడు ప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. మానవమేధ సత్య స్వరూపాన్ని తెలుసుకున్నప్పుడు మనిషి పరమాత్మను అర్థం చేసుకోగలడు".

★ ★ ★

ఆమె మాటలకు అజ్ఞాన తిమిరాంధలోకం నుండి సమాధానం వచ్చింది. అది భయంకర వికటాట్టహాసం.

"మానవ మేధ ప్రామాణికం కాదు. వివేకం ముక్కచెక్క లవుతుంది. తునా తునక లవుతుంది. మేధ, వివేకం భౌతిక ప్రయోజనాలకు పరిమితం. మనిషి మేధ అజ్ఞానంలో బందీ అయింది. ప్రజ్ఞ ముందు మానవమేధ నిష్ఫలం. అందుకే మనిషి పరమాత్మ జోలికి పోడు. చిల్లర దేవుళ్లను ఆరాధిస్తుంటాడు. తానే బ్రహ్మమనే విషయం మరిచిపోతాడు.

"మనిషి భౌతిక రూపాలను, బాహ్య ప్రపంచాన్ని మాత్రమే చూడగలడు. రూపంలేని పరమాత్మను ఆరాధించడానికి మనిషికి మనసొప్పదు. తన వివేకంతో పరిశోధిస్తాడు. అది ఉపరితల శోధన. లోతులకు వెళ్లడు. మధ్యన ఆగిపోయి హృదయంతో వినోదిస్తాడు. పైపైన ఎంత శోధించినా సత్యం కనిపించదు. మాయా రూపాలతో తృప్తిపడి ఆత్మలోకి చూచుకోడు. చివరకు అన్ని భ్రమలు తొలగిపోయి నపుడు ఆర్తితో జ్ఞానం కోసం వెదుకుతాడు. జ్ఞానానికి వివరణలు వ్యాఖ్యానాలు అవసరంలేదు. తనలోకి వెళ్లడమే అసలైన జ్ఞాన మార్గం. బాహ్యరూపాలు ఏవీ అందుకు సహకరించవు. తన తెలివితో ఎంత వెతికినా చేతికి ఏదీ అందదు. శూన్యంలోకి దూకడం ఒక్కటే అసలైన అన్వేషణ. వెతికినంత కాలం 'పరం' కనిపించదు.

"అగోచరం నుండి ప్రేరణ పొందినప్పుడు మనిషి తన వివేకాన్ని, వివేచనను

వదిలివేస్తాడు. అవి నిరుపయోగమని గ్రహిస్తాడు. అంతవరకు తన వివేకమే అనుకుంటాడు. అలా చివరి గొప్ప ప్రయత్నం ఫలిస్తుంది. అతని జ్ఞానం సముద్ర తీరంలో మెరిసే రాళ్లవంటిది. అజ్ఞానమే మహాసాగరం. దాని తీరంలో మెరిసే అలలు జ్ఞాన శకలాలు. సాగర ఘోషలో సైతం పరమాత్మ స్వరం వినగలగాలి. అలా వినగలిగినవాడే జ్ఞాని".

ఉపచేతన నుండి మానవమేధ పలికింది – "భగవంతుడు సృష్టించిన అజ్ఞాన ప్రపంచంలో జ్ఞానం కలిగించింది నేను. నా వివేక సోపానాలపై పయనించి జ్ఞాన శిఖరం చేరగలను. పరాన్ని పరిశోధించగల దివ్యభావన నా అధీనంలో ఉంది. భౌతిక లాలసతో క్షుద్రశక్తిగా మారాను. ముళ్లకంచెల మధ్య పశువులా బందీ అయినాను. ఆహార నిద్రా మైథునాల కొరకే మనిషిని జీవింపచేస్తున్నాను. పట్టెడు అన్నానికి మానసిక దాస్యం చేస్తున్నాను. దాస్యబంధాలు త్రెంచుకోగలను. నేను ఆకాశంలో సంచరించి, గ్రహాల రహస్యాలు గ్రహించాను. శూన్యంలో చలించే గోళాలను తెలుసుకున్నాను. గ్రహానికి, గ్రహానికి మధ్య దూరాన్ని లెక్కకట్టాను. కాలంలో గ్రహగోళాల మనుగడను సైతం లెక్కించాను. నేల కలుగులలో చొరబడి రత్నాలను వెతికి తెచ్చాను. రాతి పొరల్ని చీల్చి, శిలా హృదయం గుర్తించి, ప్రపంచ నాగరికతల చరిత్ర రాసుకున్నాను. ప్రకృతి పుస్తకంలోని ప్రతి పుట నాకు తెలుసు.

"సృష్టి, పరిణామం నాకు తెలుసు. ఈ విశ్వవృక్షం యొక్క ప్రతి కొమ్మా, ప్రతి రెమ్మా నాకు పరిచయమే. చరిత్రలో వాటి రూపాల్ని, రూప భేదాల్ని, గతిని గమనించాను. జీవంతో ఉన్న ప్రతి ప్రాణి నాకు పరిచయమే. సృష్టికి మూలమైన ధాతువులు, జీవకణాలు నేనెరుగుదును. మానవుని పూర్వస్థితులు, పరిణామ రూపాలు, మూలప్రకృతి అన్నీ నాకు తెలుసు. మనిషి ఏ స్థితి నుండి ఏస్థితికి వచ్చింది ఎరుగుదును. ఎలా పుట్టేది, ఎలా మరణించేది తెలుసు. మృత్యువు తర్వాత మనిషి ఏమయ్యేది మాత్రం తెలియదు.

"మనిషి లక్ష్యం ఏది? గమ్యం ఏది! ఈ మహత్తర సృజనకు ప్రయోజనం ఏది? ఇన్ని శక్తులు సంపాదించి మనిషి చివరకు సాధించేది ఏమిటి? దేనిని? సృష్టి రహస్యాలన్నీ నిశ్శేషంగా గ్రహించాను. సృష్టికి మూలమైన కీలకం నా చేతిలో ఉంది. సృష్టి శక్తులన్నింటినీ నా ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాను. అసంఖ్యాకంగా ఉన్న ధాతువులు, అదృశ్యంగా, అగోచరంగా ఉన్న అణు సముదాయం, నేను అన్వేషించిన ఈ పదార్థ భౌతిక గ్రంథం లోనివే. ఇంకా నేను పూరించవలసిన పుటలు కొద్దిగానే ఉన్నాయి.

“జీవన విధానాలను మానస మండలాల నుండి చూచి తెలుసుకున్నాను. పిపీలకం నుండి బ్రహ్మం వరకు వాటి వాటి వర్తన, ప్రవర్తన, పరివర్తన తెలుసుకున్నాను. భగవంతుని రహస్యాలు తెలుసు నాకు. వాటికి మూల కారణం ఏదో నాకు అర్థం కాలేదు. అన్వేషించిన కొద్దీ అంతా అయోమయం, శూన్యం అవుతోంది. అంతా తెలిసిన తర్వాత ఏమీ తెలియనట్లే అనిపిస్తుంది. సృష్టికి, పరిణామానికి మూలమేమిటో ఇప్పటికీ నాకు అవగతం కావడం లేదు. బహుశా ఎప్పటికీ తెలియదేమో!

“ఈ సృష్టి ఏర్పడడమే ఒక మహాద్భుత చర్య. ఆలోచించగలిగిన మానవ మేధ మరీ అద్భుతం. జీవిలో కదలాడే ప్రాణశక్తి పరమాద్భుతం. నేను తెలుసుకున్న దాన్ని మనిషి వివేకం వ్యతిరేకిస్తుంది. నేను నిర్మించుకున్న దాన్ని విధి కాదంటుంది. భౌతిక శక్తులు చేయించే పనులన్నీ నాకు తెలుసు. కాని విధి మనిషిని ఎలా నడిపిస్తుందో మాత్రం తెలియదు. తన ఇష్టం వచ్చిన రీతిలో విధి మనిషిని శాసిస్తుంది. విధి రథ చక్రాల క్రింద పడి మనిషి నలిగిపోతాడు. తాత్త్విక సిద్ధాంతాలన్నీ నేను ఊహించినవే. అవి నా ఆలోచనలే. మనిషి ఆశించే స్వర్గాలు మానవమేధ సృష్టించుకున్నవి. అవి కరిగిపోయే కలలు. కల్పనా చిత్రాలు. కడకు ఈ ప్రపంచమే ఒక సంశయం అవుతుంది.

“ఒక్క అణుభేదంతో రూపురేఖలు, గుణాలు మారిపోతాయి. ఈ ప్రపంచం మన దృష్టి దోషమా? అపరిమితాన్ని పరిమితం హేళనచేస్తుంది, శంకిస్తుంది. వివేకపు ప్రతిమెరుపులో ఒక వైచిత్రి ద్యోతకమవుతుంది. వాస్తవం అసత్ అయితే మేధ ఎలా వాస్తవం అవుతుంది? మేధ ఆత్మకు రూపం కల్పించడానికి ప్రయత్నిస్తుంది. ఒక మాయ ఏదో సృష్టిని క్రమ్మివేసి శూన్యాన్ని మిగుల్చుతున్నది.

“నేనొక్కరు ఊర్ధ్వ చేతన స్థితిని చేరినంత మాత్రాన, అశాశ్వతమైన దానిని జయించినంత మాత్రాన ప్రయోజనం ఏమిటి? అశరీరి అయిన ఆత్మను ఎంతకాలం అన్వేషించను? అగోచరమైన దానికోసం ఎంతకాలం వెతికి ఏం ప్రయోజనం! అల్పబుద్ధి మనల్ని అజ్ఞాతం నుండి రక్షించదు. అగమ్యంగా ఉంటున్న నన్ను మృత్యువులోకి ఆహ్వానించకు. ప్రతిజీవి ప్రకృతి ధర్మానుసారం జీవించ వలసిందే! కనుక సహజమైన విధిని తప్పించుకొనడం అసాధ్యం. నేను మనిషిని, నన్ను మనిషిగా బ్రతకనివ్వండి. శాశ్వతంగా కన్నుమూసే వరకు మనిషిగానే మననివ్వండి. ఇదొక ప్రలోభం. ఇదొక మాయాజాలం. ఈ నేలపైన భగవంతుని వెతకడం అవివేకం. సత్యం కాలంతో ముడిపడి ఉన్నదనుకోవడం భ్రమ. ఆత్మను,

లోకాన్ని ఉద్ధరించాలని అంగలార్చడం అజ్ఞానం. మనిషి ఎలా మృత్యువును జయించగలడు? ఎలా అమృతుడు కాగలడు? అది దేవతలకే సాధ్యం కాని, మనుషులకు మరీ అసాధ్యం".

రణభేరీ నినాదం వలె వినిపించిన మానవ అంతర్వాణి అది. సావిత్రి తన ఆత్మను ఉద్దేశించి సమాధానం చెప్పుకున్నది –

"ఓ తేజస్వినీ! శాంతికి, కాంతికి ఆలవాలమైన జగన్మాతా! మహాదేవీ! నా ఆత్మశక్తిని సృష్టి శిఖరాగ్రానికి చేర్చే పరాశక్తివి, ఆదిశక్తివి నీవు. నీలోని ఒక అంశను నేను. కనుక నీవే నేను. నేనే నీవు. నీ దివ్య స్పర్శతో నా ఆత్మ జాగృతమైంది. నీ సహాయంతోనే నా ఆత్మ పరమాత్మను చేరగలదు. నీ వల్లనే లోకంలో ప్రేమ ఉద్దీప్తం కావాలి. నిశీథంలో దివ్యప్రజ్ఞ మేల్కొంటుంది. మానవ మేథ శిలగా మారిపోయింది. అమృతవర్షం కురవనిదే ఈ నేలపైన దివ్య పారిజాతం ఎలా పుష్పించగలదు? ఈ మానవ జీవన తరుశాఖలపై దివ్యశాబకం ఎలా వాలి విశ్రమించగలదు? నందనవన సౌరభాలు మానవ ప్రపంచంలో ఎలా గుబాళి స్తాయి?

"నీవు ప్రజ్ఞా కిరణాలను భూమిపైన ప్రసరింప చేసినా వాటిని ఏవో మెరుపులని మనిషి భ్రమపడుతుంటాడు. అతని ఆత్మశక్తి అహంకారంతో కలుషితమయింది. యోగి హృదయం ఏకాంతంగా కలలు కంటుంది. అప్పుడే పరమాత్మ ప్రవేశానికి వీలున్నది. మనిషి పరలోక వాంఛను తీర్చవలసింది నీవు. మనిషి హృదయంలో దివ్యాగ్నుల్ని రగిలించేది నీవు. మనిషి శరీరంలోకి, జీవితంలోకి పరబ్రహ్మను ఆవాహన చేయవలసింది నీవు. ఆ పరబ్రహ్మ వర్చస్సుతో, అనుగ్రహంతో నేను తిరిగి వస్తాను. ఆ నిర్గుణ నిర్మల సచ్చిదానందం నీవూ అనుభవించగలవు. అప్పుడే పవిత్రమైన ఈశ్వర ప్రణిదానం సాధ్యమవుతుంది. అప్పుడు ఈ లోకం దివ్యంగా భాసిస్తుంది. లోకాలన్నీ శాంతిపూర్ణాలై క్రాంతి గోళాలవుతాయి".

23. ఆత్మ దర్శనం

దేవీ త్రయాన్ని విస్మరించి హృదయకుహరంలో గుహ్యంగా ఉన్న తన ఆత్మకై అన్వేషించసాగింది. పారమాత్మికమైన తేజస్సులో ప్రాపంచిక విద్య, వివేకం, విజ్ఞానం, అర్థాలు, నిర్వచనాలు తెలిశాయి. అదంతా మహాసాగరంలో ఒక నీటి కణం. అక్కడ చైతన్యం కలిగింది. చీకటి విచ్చుకుని పగిలి పగలైంది. గుహ్యంగా ఉన్న ఆత్మ అనుభూతికి అందింది.

ఆ గుహను రెండు సర్పాలు కాపలా కాస్తున్నాయి. కుడ్యాల నిండుగా దేవతా చిత్రాలు, శిల్పాలు, అవర్ణ, సవర్ణ చిత్తరువులు. జననం, జీవనం, మృత్యువు, మరణాతీతస్థితికి అర్థాలు తెలిశాయి. జగన్మాత సరస్వతి, పార్వతి, రాధ, అందరూ తనే. తన రూపాలే. ఆత్మ తన స్థావరం చేరుకున్నది.

అది నిశాంతం. సావిత్రి తన ఆత్మ లోకాన్ని దర్శించింది. అన్ని ప్రాకారాలు దాటింది. దేవతల్ని చూచింది. పరమయోగుల్ని, ఋషుల్ని దర్శించింది. తన ఆత్మను దర్శించింది. తిరిగి మానవ ప్రపంచంలోకి వచ్చింది. ఇప్పుడామె పూర్వపు సావిత్రి కాదు.

ఆమెలో నిండుగా దివ్యశక్తి చేరింది. ఆమెలో దివ్యత్వం గుబాళిస్తోంది. సంపూర్ణంగా మారిపోయింది. ఆమెలో మెండుగా, నిండుగా ఆధ్యాత్మిక విలువలు. ఆమె చేసే ప్రతి పని భగవత్ కార్యమే.

శిరస్సు, భ్రూమధ్యం, కంఠం, హృదయం, నాభి, మూలాధార కేంద్రాలు వరసగా చైతన్యం పొందాయి. రేకలు విచ్చుకున్న పద్మాలైనాయి. మానవిగా ఉన్న సావిత్రిలో సంపూర్ణత్వం. ఆమెది దివ్య జీవనం.

ఆత్మకు నెలవైన మార్మిక గుహను అన్వేషిస్తూ ముందుకు సాగింది. ప్రథమంలో పారమార్థిక నిశీధం ఎదురైంది. జగత్తుకు ఉపయోగించే వెలుగు

లేదక్కడ. మానవ జీవితాలను ఉద్ధరించే శక్తులు లేవక్కడ. మానవ మేధ అక్కడ పని చేయలేదు. ఆలోచనలు కలగవు. హృదయం ఆరాటపడదు. ఆశలకు స్వస్తి చెబుతుంది. మనిషి విజ్ఞానం అక్కడ నిరుపయోగం. భావాలు, రూపాలు నశిస్తాయి. వివేకం అందనంత దూరంగా పారిపోతుంది. భాషకు, భావానికి అందని పరమసత్యం ఏదో అరూపస్థితిలో అనుభూతికి అందినట్లయింది.

మనిషి జ్ఞానం యావత్తు అజ్ఞానంగా మారి, అమాయకంగా నిర్గుణ పరమాత్మకు నివేదన చేసుకుంది. ఆరాధన ఒక్కటే మిగిలింది. అక్కడ ఏదీ తనకు కావాలని అనిపించదు. తనది అనిపించదు. పవిత్ర శూన్యంలో భావం అభావమై అగోచరం ముందు తలవంచింది. అది సర్వసమర్పణ. అనాచ్ఛాదంగా మిగిలిన ఆత్మ సర్వసమర్పణ చేసుకున్న సంకల్పం మిగిలాయి.

ఆమెకు ఇప్పుడు శక్తి లేదు, బలం లేదు, అహంకారం లేదు. భగభగమండే కోరికలు చల్లారిపోయాయి. తన అహంకారం, ఆత్మ ఔన్నత్యం సైతం కనిపించడం లేదు. స్వర్గం, మోక్షం కావాలని అనిపించడం లేదు. మానవత్వం మహోన్నతం అనిపించలేదు. ఏదో సాధించాలన్న కోరిక లేదు. అసలు ఆత్మ మిగిలిలేదు. ఉన్నదొక్కటే పరమాత్మ. మిగిలినదంతా శూన్యం. ఆ పరమాత్మ ఉనికి తనకు తెలియదు. ఉన్నదని మనస్సు కల్పించిన ఆలోచన. తనలో చీకటి ఆవరించింది. ఈ చీకటి భయం కలిగించలేదు. పవిత్రంగా, ప్రశాంతంగా ఉన్నది.

ఈ ప్రపంచం మహాంధకారంగా, శూన్యంగా తోచింది. సృష్టి కన్న శూన్యమే శక్తివంతమైంది. శూన్యాన్ని భరించడం కష్టం. కాలం మోయలేనంత బరువు శూన్యం. చీకటి పరమాత్మకు నెలవు. కాని సర్వం నిరాకారం, నిర్గుణం, అనంతం, నిశ్శబ్దం.

రంగస్థలంపైన ఒక నీడ కదలినట్లు, అవ్యక్త అగాధ నిశీథం నుండి ఒక వెలుగు కిరణం బయటకు వచ్చినట్లు – ఆమె శూన్యమై, శూన్యంలోకి పయ నించింది. ఆమె సంకల్పం అనంతకాలాన్ని దాటి విశాల శూన్యం చేరింది. ఇప్పుడు శూన్యమే ఆత్మకు ఆశ్రయం.

చివరకు ఒకానొక పరిణామ క్రియలో శూన్యం బ్రద్దలైంది. లోపల ఒక తరంగం కదిలింది. విశ్వం కల్లోలమైంది. మరొక మారు ఆమె తన అంతరంగాన్ని ఆశ్రయించవలసి వచ్చింది. అయితే గమ్యానికి చేరువవుతున్న ఆనందం కలుగుతోంది. అది అనుభూతి, ఆత్మానుభూతి. స్వర్గమే దిగి వచ్చింది. పరిసరాలు

ప్రేమతో, ఆనందంతో పులకించాయి. స్వాప్నిక తరుశాఖపై ప్రజ్ఞాసరోజం విచ్చుకున్నది. వెన్నెలను దాటి సంధ్య ఉషస్సులోకి తొంగిచూచింది. తెల్లవారింది. ఆమె లోకారాధనకు ఉపక్రమించింది. విశ్వపురుషుడు అంబరాన్ని ధరించి, స్వర్గాన్ని వల్లెవాటుగా మార్చి, ఎర్రని సూర్యబింబాన్ని నుదుట దిద్దుకున్నాడు.

ఎన్నడో మరచిన కల నిజమైంది. అనంత శోభలను ఆమె మననం చేసుకున్నది. పరిసరాలను నింపిన మాధుర్యం తలపోసింది. మనస్సుతో మధువుల్ని రుచి చూచింది. తన జీవనశైలిని విశ్లేషించుకుంది. తనలో భృక్తంగా ఉన్న గుహాలయాన్ని గుర్తించింది. అందులో పరమాత్మ గుహ్యంగా ఉండి ఉండాలి. ఎన్నో అతీంద్రియ ద్వారాలు, మార్మిక అగాధాలు దాటి పోతే గానీ సత్యం కనిపించదు. ఊహకు అందనంత లోతుల్లో ఉంది ఆత్మ. పర్వతాల నడుమ లోయలో దాగినట్లు, ఆరాధించే మనుషులకు, ప్రపంచానికి దూరంగా భగవంతుడు పారిపోయాడు. అది అతీంద్రియానికి సైతం అందనంత దూరం. అది హృదయ వాంఛలకు చిక్కనంత దూరం. ఆమెకు అద్భుతమైన వెలుగు సోకింది. శూన్యంలో నిశ్చలత్వం. ఆ గుహ బయట చీకటి కవాటాలు. అది సమాధి స్థితి. రెండు విషసర్పాలు పెనవేసుకొని ఉన్నాయి. అవి తమ క్రాంత దృష్టిని నిశితంగా సారించాయి. నిశ్చల స్వప్నంలో ఆత్మ విస్మరించిన అగ్నికీలలు. ఆలయగోపురాలపై పావురాల కువకువ. కాంతిని ముద్ద చేసి, మహాశిల్పి మలచిన పావురాలు అవి. తొలి ప్రాకారంలో కాపలాగా ఉన్న నిద్రను దాటి పోయింది.

అనేక దేవతామూర్తుల దర్శనమైంది. అవి శిలాకృతులో, సజీవమూర్తులో తెలియదు. ఆత్మ గమనికలో రెండూ సమానమే. అవి విశ్వాత్మకు కార్య నిర్వాహకులు, అనశ్వర శక్తులకు ప్రాపంచిక సంకేతాలు. ఆ గోడలపై రకరకాల చిత్రాలున్నాయి. మానవ జీవితాలు, జంతు విన్యాసాలు, దేవతా భంగిమలు, లోకాలు, జీవులు, రోదసి ... మొత్తం సృష్టికి అది సంక్షిప్త చిత్రణ. ఒక్కొక్క మండలాన్ని అధిరోహించినపుడు కలిగే అనుభవాలకు సరూప చిత్రణలు. అన్నీ చిత్ర సందేశాలు, సంకేతాలు. అవి పరమాత్మ కోసం ఎదురు చూస్తున్నాయి. అక్కడ మనిషి చేసే చిన్న, పెద్ద పనులు, ప్రేమలు, జీవనం, మరణం. మరణానంతర జీవితం కనిపించాయి. అన్నీ కడకు పరమాత్మను చేరవలసినవే. పవిత్రత అన్ని తావుల ఒక్కటిగానే ఉంటుంది. చైతన్యం, శక్తి బ్రహ్మానందానికి సోపానాలు. కాలానికి కట్టుబడిన ఆనందానికి, కట్టుబడని మార్మికతకు అన్నీ

తానే అయి అన్నింటిలో తాను చరిస్తూ, దేనినీ అంటక ఉండేది పరమాత్మ. అక్కడ ఉచ్ఛ్వాస నిశ్వాసలతో అవసరం లేదు. కేవలం ఆత్మకు సన్నిహితమైన అనుభూతి, ఆనందం. అన్ని లోకాలను పరమాత్మలోనే దర్శించవచ్చు. అక్కడ ప్రతి సంకేతం వెనుక సత్యం ఉంది. పరమాత్మ సందేశాలు అన్నీ సంకేతాలే.

ఆమె వాటిని అవధరిస్తూ అనుభూతి చెందింది. అది ఆలోచన కాదు, భావన కాదు ... ఆత్మానుభూతి. అక్కడ వెలుగు సూర్యునిది కాదు ... చంద్రునిది కాదు ... నక్షత్రాలదీ కాదు. అది అంతరంగ కాంతి. అది తేజస్సు. అది అత్యంత ఆత్మీయం, సన్నిహితం. ఏ రహస్యాన్నైనా అది చూపించగలదు. మన దృష్టి, మనస్సు, వివేకం మోసగించవచ్చు కాని ఆత్మ అనుభూతించినదంతా సత్యమే అవుతుంది.

తర్వాత ఆమె మార్మిక మందిరం ప్రవేశించింది. గండశిలా నిర్మితాలైన ద్వారాలు, గవాక్షాలు, మందిరాలు దాటింది. అన్నిచోట్ల అన్నింటిలోనూ తనే ఉన్నది. తనలో భృక్తంగా ఉన్న తన్మయత్వం మేల్కొన్నది. తానే పరమాత్మకు ప్రీతిపాత్రమని తెలుసుకున్నది. ఈ దేవతలు, దేవుళ్లు, అంతా తామిరువురే. మహాశివుని ఆనందానికి అధినేత్రి తాను. బ్రహ్మ అమేయ సృష్టిలోని వాగేశ్వరి తానే. మహాశివుని పర్యంకంపైనున్న ఆదిశక్తి తాను. అన్ని జీవులకు ఆధారమైన పరమగురువు, జగన్మాత తామిరువురే. తమ అనుబంధమే లోకాలకు రక్షణ. అది రాధామాధవుల బ్రహ్మానందం. ఆరాధకుడు, ఆరాధన ఆత్మపరంగా ఒక్కటే.

చిట్టచివరి మందిరంలో సువర్ణసింహాసనంపై ఒక దివ్యమూర్తి ఆశీనురాలై వుంది. ఆమె వర్ణనకు అందదు. ఈ లోకం అలభ్యమయ్యే అమలానందం ఆమె సొత్తు. ఆమె విశ్వశక్తికి ప్రతినిధి. అద్వితీయ, అనిర్వచనీయ సౌందర్యరూపిణి. ఆమె వాంఛకు ఆతీతురాలు. ఆశకు అందనిది. ఆమె తేజస్సు ముందు సూర్యకాంతి మొత్తం ఒక కిరణం. ఆమె ఔన్నత్యమే సృష్టి. ఆపైన అంతా ఆత్మలో కరిగి, కలసిపోతుంది. సర్వం రూప రహితం, గుణ రహితం, మాలిన్య రహితం. గండశిలను తొలచి మార్గం ఏర్పరచుకున్నట్లు ఆమె అతి ప్రయాసతో ఆ తేజస్సును చేరుకుంది. అది తేజస్సు, ఓజస్సు, వర్చస్సు సమ్మిళితమైన దివ్యభావన. మార్గంలేని మహాగ్ని కుడ్యాలను ఛేదించి ముందుకు పోవలసివచ్చింది. అక్కడ గుహ్యా స్థావరంలో ఆమె ఉన్నది. అదే తన ఆత్మ స్థానం. అదే తన మహాప్రస్థానం.

సమాధి స్థితిలో జీవుడు అజేయంగా, నిశ్చలంగా ఉంటాడు. ప్రాపంచిక

విషయాలలో జీవన్ముక్తుడు. అతని చల్లని చూపులో ఆనందం, శాంతి జాలువారుతుంది. ఆ నిర్మలత్వాన్ని విచారాలు, విషాదాలు కలుషితం చేయవు. భౌతిక విషయాలన్నింటిపై అధ్యాత్మిక నీడ పడుతుంది. యోగి కాలాన్ని నిశ్శబ్దంగా, నిర్మోహంగా గమనిస్తాడు. జగన్నాటకంలోని అన్ని దృశ్యాలను దర్శించగలడు. అయినా పరమాత్మకు అనుగుణంగా తన పాత్ర పోషిస్తూ, తానే చైతన్య ప్రతినిధి అవుతాడు. తానే భగవంతుని ప్రతినిధి అయి విశ్వమిత్రుడవుతాడు.

ఆమె తిరిగి తన భౌతిక శరీరంలోకి వచ్చింది. కాలానికి, పరిస్థితులకు అనుగుణంగా మారింది. ఆమె మనుగడ లోకానికి ఆనందహేతువైంది. జగతిపై మమత ఆమె కళ్లలోని కాంతి, సుఖదుఃఖాలు ఆమె పెదవులపై లాస్యం చేస్తున్నాయి. ఆనందాలు విషాదాలు చిరునవ్వుతో స్వీకరిస్తుంది. ఆమె చూచినవన్నీ పరమ సత్యానికి ప్రతీకలు. అవి అన్నీ అజ్ఞానం ముసుగులు ధరించాయి. ఎప్పటికో అమరత్వాన్ని అందుకోగలవు. ఆమె నిగ్రహంతో అన్నింటినీ భరించ సిద్ధమైంది.

ఆమె కిప్పుడు మనోవేదనలు తెలుసు. జీవన శ్రమలు తెలుసు. కన్నతల్లి వలె బిడ్డల మనస్సు తెలుసుకోగలదు. ఆమె తన ప్రేమను అందరికీ పంచిపెట్ట గలదు. హృదయంలో జీవం అంగుష్ట ప్రమాణంలో ఉంటుంది. అది బయటకు కనిపించదు. ఆనందాలను, కష్టాలను అనుభవిస్తుంది. బాధల్ని సహించి భౌతికంగా నానాహింసలకు గురవుతుంది. గ్రహగతి ననుసరించి తానూ శ్రమిస్తుంది. జీవం మనలోనే ఉంటూ నవ్వుతుంది. ఏడుస్తుంది. విజయాలకు పొంగిపోతుంది. అధికారానికి ఆరాటపడుతుంది. తానే శరీరం, మనస్సు అయినట్లు ఓటమి, విజయం తనవిగా అనుభవిస్తుంది. విధి వేటుకు తలవంచుతుంది. అయినా ఆత్మ అక్షయం. అది వేదనాతీతం. తనను ధరించిన వారి బాధలు తను భరిస్తుంది.

ఆత్మ తన ప్రతిభను, శక్తిని మనిషి పరం చేస్తుంది. అగాధాలు దాటించి విజయశిఖరాలకు చేర్చుతుంది. నిత్య వ్యవహారాలలో అవసరమైనప్పుడు ధైర్యాన్నిస్తుంది. సానుభూతి పంచి, మన విచారాలను దూరం చేస్తుంది. మానవజాతికి మనం చేసే స్వల్ప సహాయం ఆత్మబలమే. జగత్తు సక్రమంగా సాగడానికి మన పాత్ర మనం నిర్వహించాలి. ఈ ప్రపంచభారాన్ని మన భుజ స్కంధాలపైన ఎత్తుకోవాలి.

ప్రతిమనిషిలో కొంత దివ్యత్వం ఉంటుంది. ఆ కొంచెం దివ్యత్వం మనలో ఉన్నది కనుకనే పరమాత్మ మనల్ని విస్మరించదు. మనలో తన పాత్ర తాను

నిర్వహిస్తుంది. ఒక వెలుగు తర్వాత మరొక వెలుగును ఒక శక్తి తర్వాత మరొక శక్తిని మనకు అందిస్తూ ఉంటుంది. శరీరం బలహీనమైనా హృదయం శక్తి పూర్ణంగానే ఉంటుంది. మనం ధైర్యం కోల్పోయినా, పరమాత్మ హస్తం ఆదుకుంటూ నడిపిస్తుంది. ఆత్మశక్తి భౌతికశరీరంలో నెలకొనాలి.

జ్యోతిర్మందిరంలో సావిత్రి, దివ్యమాత కలుసుకున్నారు. ఒకరినొకరు గుర్తించారు. ఒకరు దేవత, ఒకరు మానవరూపం. ఒకరు ప్రశాంత పరమాత్మ. ఒకరు కల్లోలితాత్మ. పరిణామంలో రెండూ ఒకటి కావాలి.

★ ★ ★

సావిత్రి భూమికి మరలి వచ్చింది. మానవ స్వభావం అందిపుచ్చుకుంది. భయంకర నిశీధిలో, వర్షతప్త మహారణ్యం మధ్యన, జీర్ణ పర్ణశాలలో, అంతవరకు యోగసమాధిలో ఉంది. అంతవరకు అంతర్దృష్టితో తిలకించిన అద్భుత మార్మిక ప్రపంచం క్రమంగా మనస్సు పొరల చాటున దాగింది. సూక్ష్మ ప్రపంచం అంతరంగంలో మరుగునపడ్డది.

అర విరిసిన ఆమె హృదయ కమలం ఇప్పుడు పూర్ణంగా వికసించింది. ఆమె ఆత్మ వర్ఛస్సు బయటకు కనిపించసాగింది. ఆత్మను మనస్సును వేరు పరిచే అడ్డుగోడ లేదిప్పుడు. జీవునికి అందని మార్మిక రహస్యాలు లేవు. హృదయ పద్మంలో ఆమె ఆత్మ సుస్థితమైంది. ధ్యానముద్రలో అచల యోగిని వలె ఉన్నది. ఈ లోకాన్ని తన ఆవాసంగా మార్చుకోమని జగన్మాతను ప్రార్థిస్తున్నట్లుంది.

ఒక దివ్య తేజోకెరటం విరిగి, నేలకు జారి, రూపం ధరించి, ప్రాణం పోసుకుని, సావిత్రిగా రూపొందిందా అనిపిస్తుంది. ఆమె చైతన్యం సోకగానే లోకం పులకిస్తుంది. అంతరంగం నిర్మలమవుతుంది. అంధకారం నుండి, అభావం నుండి అనాత్మ నిద్రలేచిన సర్పం వలె బుస కొట్టింది. ఆ శక్తి నిట్టనిలువుగా పైకి ప్రవహిస్తుంది. జ్ఞానకేంద్రాలను స్పృశించి, చైతన్యవంతం చేస్తుంది. గాఢనిద్ర నుండి మేల్కొన్నట్లు శక్తిస్పర్శతో కేంద్రాలు వెలుగు నింపుకుని ఆనందతీర్థా లవుతాయి. అది పరబ్రహ్మ స్థితికి రాచబాట. యోగమార్గం. మూలాధారం నుండి సహస్రారం వరకు అన్ని కేంద్రాలలో దివ్యత్వం, చైతన్యం ప్రవహిస్తుంది. అగోచరశక్తులు, అతీంద్రియశక్తులు శక్తిపీఠం దిగివచ్చి మనల్ని ప్రాపంచికత నుండి ఉద్ధరిస్తాయి. రోదసిలో ఆత్మదర్శన మవుతుంది. ఒక మహాశక్తి రూపం ధరించినట్లు జగన్మాత దర్శనమిస్తుంది.

జ్ఞానానికి సంకేతం మార్మిక శక్తి, అతీంద్రియ శక్తి. ఆ శక్తి బహురూపాలలో బహిర్గత మవుతుంది. ఒక చేయి అభయముద్ర దాల్చి విశ్వశక్తికి సంకేతమైంది. ఆమె పాదాల మ్రోల భయద భీకర సింహం నాల్కలు సారిస్తుంది. దాని చూపు నుండి అగ్ని ధారలు స్రవిస్తాయి. విశ్వం అద్భుత పరిణామానికి సిద్ధమైంది.

అజ్ఞానాంధకార బధిర మహాకుడ్యాలను ఛేదించి, అవిద్యా వలయాల తెరలను చించి, అమరత్వాలు, అమృతధారలు ఉప్పొంగివచ్చాయి. జీవుని ప్రత్యణువు పరమానంద భరితమైంది. ఆనంద తరంగాలతో శరీరం పునీతమైంది. అన్నిచోట్ల ఆ దివ్యమూర్తి ప్రభావం ద్యోతకమైంది. ప్రతి అణువులో ఆమె మూర్తి మత్వమే.

శిరస్సుపై సహస్రారకేంద్రం అరవిచ్చిన అరవిందం. ప్రజ్ఞ సర్వాన్ని ఆక్రమిస్తుంది. భ్రూమధ్య స్థానం జ్ఞానకేంద్రం. దివ్యదృష్టి. సంకల్పం కిరణాలుగా ఏర్పడతాయి. తామరతూడు వంటి కంఠనాళం కేంద్రంలో భావానికి భాష, మనస్సుకు వాచికం ఏర్పడతాయి. హృదయస్థానంలో కలిగిన స్పందన అనుభూతి చెంది పవిత్ర కార్యోన్మీలన కలుగుతుంది. మనోభావాలు ప్రపంచ పరిధిని దాటిపోతాయి. దివ్య భావనలు ప్రాపంచిక బంధాలను తెంచివేస్తాయి. ప్రతి పనికి దివ్యత్వం, దైవసంకల్పం ఆధారమవుతుంది. అన్నింటిలో సత్యం రేఖామాత్రంగా తొంగిచూస్తుంది. అదే లోకాన్ని పునర్ వ్యవస్థీకరించగల మార్గం. ప్రతిరూపంలోనూ అతీంద్రియ జ్ఞానం సంకేత మవుతుంది. ప్రతినిర్మాణం వెనుక ఉన్నది పరమాత్మ సంకల్పమే. ఆ మహదాశయం, భావనా చమత్కృతి పరమాత్మ లక్ష్యానికి అనుగుణంగా ఉంటాయి. మన జీవితంలోని అపశృతులు, అపకృతులు పరమాత్మకు అన్నీ ఎరుకే. అవి ఒకనాటి మన ఆకాంక్షల, అవసరాల అవశేషాలు. ఆనాడు వాటిని మేధ అణచివేసింది. ఇప్పుడు జీవితం పైన మేధ ఆధిపత్యం లేదు. దివ్య సూత్రానికి కట్టుబడి ఉంటుంది జీవితం. ప్రతిపని వెనుక పరమాత్మ సంకల్పం కనిపిస్తుంది. ప్రతి విజయం వెనుక పరమాత్మ అనుగ్రహం ఉంటుంది. హృదయ సామ్రాజ్యంలో ప్రేమ స్వేచ్ఛగా, మధుర గీతాలు ఆలపిస్తుంది. పవిత్రత మనస్సుకు, శరీరానికి అవసరం. ప్రేమలు, ఉద్రేకాలు పరమాత్మకు నివేదనలు కావాలి.

నాభి కమలం సువిశాలం. అతిశయాలు, అహంకారాలు, వ్యామోహాలు అక్కడ జన్మిస్తాయి. అవి దివ్యత్వంలో కరిగిపోయి, పరమాత్మ కార్య నిర్వహణకు సిద్ధం కావాలి. ఆ కేంద్రంలో సుఖ, భోగ, లాలసలు నిత్యం తలెత్తుతుంటాయి. భౌతిక సుఖభోగాలే మధురం అనిపిస్తుంది. క్షుద్రశక్తులు విజృంభిస్తాయి.

మూలాధారంలో మహాసర్పం నిద్రిస్తుంది. దానికి భౌతికశక్తులపైన పూర్తి ఆధిపత్యం ఉంటుంది. క్షణికమైన జీవితంలో సుఖప్రాప్తి కలిగిస్తుంది. పరమాత్మ శక్తి భూమిపైన అవతరించి, ప్రవేశించేది మూలధార కేంద్రం ద్వారానే. మహాశక్తికి, మహిమలకు మూలస్థానం అది. అన్నింటి వెనుక ఆత్మ సంచరిస్తుంది. అన్ని క్షుద్ర శక్తుల నుండి విముక్తి పొందితేనే ఆత్మజ్ఞానం.

జగచ్ఛక్తికి సంపూర్ణంగా ఆత్మ సమర్పణ చేసుకోవడం ఒక్కటే మార్గం. అజ్ఞానం నుండి రక్షించేది జగన్మాత. జగతికి ఆధారమైనది ఆత్మ. అది మన అజ్ఞానాన్ని శాసించగలదు. పరమాత్మ లక్ష్యం, ప్రకృతి ధర్మం ఆత్మదర్శనం తోనే తెలుస్తాయి. ఒక్కసారి రహస్య ద్వారాలు తెరుచుకుంటే పరమాత్మ ప్రకృతిలో అడుగిడినట్లే అవుతుంది. జటిలంగా, అగమ్యంగా ఉన్న ముడి వదులవుతుంది. మనస్సు జీవుని అధీనంలోకి వస్తుంది. జీవితం ఆత్మ శాసనం మేరకు నడుస్తుంది. అప్పుడు అంతా జ్ఞానమయమే, బ్రహ్మానందమయమే.

ఒక దివ్యశక్తి మనలో ప్రవేశించినప్పుడు అదే మన గమ్యాన్ని నిర్ధేశిస్తుంది. మనల్ని నడిపిస్తుంది. మన కలలకు కాణాచి, ఆశయాలకు పట్టుగొమ్మ అది. జగన్మాత తన కరుణను మనలోకి పంపుతుంది. అప్పుడు భౌతిక శరీరంలోనే బ్రహ్మానందాన్ని అనుభవించవచ్చు. ఒక అతీంద్రియ సూత్రం మనిషి జీవితాన్ని చక్కదిద్దుతుంది. మన మాటలు సత్య వచనా లవుతాయి. ప్రతి భావన తేజ స్సాగరంపై కదిలే తరంగం అవుతుంది. ప్రతి తరంగం పాపపుణ్యాల అంచుల్ని దాటిపోతుంది. సత్యం మన హృదయంలో నెలకొంటుంది.

అప్పుడు చేసే పనులన్నీ పరమాత్మ సంకల్పాలే అవుతాయి. ప్రతిపని భగవ త్కార్యమే అవుతుంది. పాపం, అసత్యం, అయిష్టం అయినవి మన దరికి రావు. మనసు పొరలలో అవి నలిగిపోతాయి. అప్పుడు మనస్సు విజయశంఖం పూరిస్తుంది.

"ఓ ఆత్మా! స్వర్గాన్ని సృష్టించుకున్నది మేము. మాలోనే పరమాత్మను దర్శించగలం. మా జ్ఞానంతో ఒక కోటను నిర్మించుకుంటాం. రెండు ప్రవాహాల మధ్య మా జీవితాలు చిక్కుబడి పోయాయి. మేము రోదసిని శాంతిసాగరంగా మార్చుకుంటాం. మా శరీరాలను బ్రహ్మానంద నిలయాలు చేస్తాం. ఏం కావాలంటే అది చేసుకోడానికి మేం సిద్ధంగా ఉంటాం".

అది జీవుని పరితాపం, ఆశ, ఆశయం.

జీవుడు మృత్యువుకు జన్మకు మధ్య విరామంలోనే ప్రగతిని సాధిస్తాడు. ఎప్పటికో, ఎన్ని జన్మలకో పూర్ణ మానవుడు కాగలడు. మానవ స్వభావం ఎంత సంకుచితమైనా, అందులో భగవంతునికి రవంత జాగా ఉంటుంది. ఒక్క వ్యక్తి పూర్ణయోగి అయినా చాలు, దివ్యత్వం దివి నుండి భువికి దిగివస్తుంది. ప్రతి యోగి భగీరథుడు కావాలి. అప్పుడు అమరసీమలకు ఎన్నో కొత్త బాటలు ఏర్పడతాయి. సత్యంతో జీవితం సంధానమవుతుంది. మనిషి జీవితం పరబ్రహ్మకు అంకితం కావాలి.

నిర్వాణం



24. నిర్వాణం

యోగారూఢంలో *సావిత్రి పొందిన తొలి ఫలాలు ఆనందం, శాంతి, శక్తి. భావాతీతస్థితికి చేరినా ప్రపంచ స్పృహ పోలేదు. సత్యవంతుని తోడి సాహచర్యం జీవితానికి పరమార్థం ప్రణయార్థం చూపింది. సత్యవంతుడు మృత్యుద్వారం వద్ద ఉన్నా అది మృత్యుద్వారం కాదు. మరో లోకానికి బంగారు వాకిలి. అది ప్రేమ చొరరాని లోకం. ప్రేమానుభవం జీవితంలో సుఖానికి ఆనందానికి చివరి మజిలీ. తర్వాత అంతా శూన్యం. సావిత్రి శూన్యంలో ఆత్మను అన్వేషించపూనుకున్నది. తనను తాను తెలుసుకోవడంతో తన శక్తిని కోల్పోయింది. ఇప్పుడు పరాశక్తి అవసరం. మనస్సును శూన్యం చేసుకున్న తర్వాతనే తానేమిటో తెలిసింది. ఒకేసారి మనిషి రెండు స్థితుల్ని పొందలేడు. బాహ్య ప్రపంచం వేరు, అంతర్లోకాలు వేరు. ఒకటి భౌతికం, ఒకటి ఆత్మికం.*

సావిత్రి వెనుతిరిగి చూచింది. జీవితం కల్లోలం– మనస్సు చంచలం– భావాలు సంకుచితం. అదీ ప్రపంచం. ఆలోచనలు మెదడులో పుడతాయా, రోదసిలో ఏర్పడుతున్నాయా? ఆమెలోని ప్రతి అణువు ఒక భావచిత్రం అయింది. సామాన్య మానవునికి తెలియని సత్యం ఆమెకు అవగతమైంది. కనుక ఆమె స్వతంత్రంగా ఆత్మ మందిరంలో ప్రవేశించ గలిగింది. మనిషి మేధ ఒక యంత్రం లాంటిది. అది ఆగిపోయింది. ఆమె పైస్థితికి చేరింది. అది సాధన వల్ల ఏర్పడే ప్రశాంత ధ్యానస్థితి. మానసిక వ్యాపారం అసలు లేకుండా పోవాలి. శరీరం జడం కావాలి. అప్పుడు లోపల ఎక్కడో ఒక భావం కదలాడుతుంది. దానిని గుర్తించకపోతే సమసిపోతుంది. ఆలోచన చెదిరినా, శరీరం కదలినా తెలియదు. ద్వంద్వాలకు అతీతమైన స్థితి. ఆమె సృష్టి కడపటి అంచుకు చేరింది. అదే నిర్వాణ స్థితి, నిర్గుణ స్థితి.

నిర్మలాకాశం నుండి సూర్యకిరణాలు తొంగిచూచాయి. ముసిరిన మేఘాలు చెదరిపోగా, వర్షం కడసారి అరణ్యాన్ని పలకరించిపోయింది. ఉండి

ఉడిగీ చెట్లచాటున చిరుసవ్వడి వినిపిస్తోంది. ఆకాశం క్రమంగా నీలి పరదాలను పరుచుకుని తన ఆనందాన్ని వ్యక్తం చేసింది. తుఫాను నిర్దయగా మింగిన అరణ్య శోభలు పగటి వేడికి ముస్తాబు చేసుకోసాగాయి. శారద చంద్రికలలో నలిగిన అందాలు గాలి కెరటాలకు ఊగి తూగుతున్నాయి.

భూదేవి వలె సావిత్రి నిండుగా ఉంది. ఆనందంతో తొణికిసలాడుతోంది. తనను తాను తెలుసుకున్నది. తన లక్ష్యాన్ని గుర్తించింది. అంతరంగం మహత్తర పరిణామానికి లోనైంది. అది హృదయగతం. బయటకు కనిపించదు. చుట్టూ ఉన్న లోకంపై దాని ప్రభావం సోకుతుంది. ఆ రహస్యాన్ని చెట్లు గుసగుసలాడాయి. గాలులు మోసుకెళ్లాయి. పుష్పాలు వెర్రి ఆనందంతో ఊగిపోతున్నాయి. పక్షులు సైతం ఆనందాతిరేకంతో పరుగులు పెడుతున్నాయి. వన్యమృగాలు సైతం తమ వైరం మరచి సఖ్యంగా ఉన్నాయి.

అరణ్యంలో చిరకాలంగా తపస్సు చేసుకుంటున్న మునులు బ్రహ్మానందాన్ని అనుభవించసాగారు. వారికి తమ తపస్సు ఫలించిందన్న అనుభూతి కలిగింది. ఆమె అంతరంగం యోగపూర్ణమై, తేజస్సు నింపుకుని పొంగి, పొరలి, బాహ్యప్రపంచాన్ని పునీతం చేయసాగింది. నిస్తేజంగా ఉన్న ప్రకృతి, పరిసరాలు సుందరంగా మారి ప్రతిక్షణం దివ్యంగా మార్చుకోసాగాయి. ప్రతి చిన్నపని మహత్తరంగా, ఆనందకరంగా మారసాగింది.

లోకంలో ఆత్మ నివేదనలన్నీ పరమాత్మకే చెందుతాయి. ఒక కాంతిరేఖ తేజస్సుగా మారి సర్వ ప్రపంచాన్ని చుట్టివేసింది. హృదయంలో సచ్చిదానందం చిప్పిలసాగింది. ఆమె స్పర్శకు విషాదం సైతం ఆనందంగా మారింది. సత్యవంతుని తల చుట్టూ విధి కప్పిన చీకటి ముసుగు ఆమెకు కనిపించలేదు. ఆ ముసుగులో మృత్యువు దాగి ఉన్నదని తెలియలేదు. అది తేజోవలయం అని భ్రమించింది. ఆ సువర్ణ కాంతివలయంపైకి తన దృష్టిని సారించింది. అది జీవుని పవిత్రతకు చిహ్నం. దివ్యత్వానికి సంకేతం. ఆమె స్వప్నాలు, భావాలు కరిగిపోయాయి. భవిష్యత్తుపై పరచుకున్న ఆచ్ఛాదన తొలగిపోయింది.

సత్యవంతుడు ఇప్పుడు విషాదానికి ప్రతిరూపం కాదు. మృత్యువు అతనిని కబళించలేదు. అతను ఆమెకు దూరమై ఆనందతీరాలకు చేరుకున్నాడు. ప్రాపంచిక మాధుర్యాలు, సుఖాలు అతనికి జ్ఞప్తి లేవు. గాఢోపగూహన ప్రణయ పారవశ్యం లేదు. ఆత్మానందంలో అమరసుఖాలు అనుభవిస్తున్నాడు. నిజానికి అతని ఆత్మ

సజీవంగా ఆమెలోనే ఉన్నది. కళ్లు మూసినా అతని మూర్తి కనిపిస్తుంది. ఆమె అనుభూతికి అతను ఎప్పుడూ చేరువే. ఆత్మ రూపులైన సావిత్రీ సత్యవంతులు ఈ మహారణ్యాలలో తిరగ నవసరం లేదు. ఇక్కడ హరిణాలతో, పక్షులతో స్నేహం చేయరు. ఇక్కడ మహర్షుల ఆశ్రమాలకు వెళ్లరు. జనం మధ్య, వనం మధ్య సంచరించరు.

భౌతికంగా వారు దూరంగా తిరిగినా మానసికంగా ఎప్పుడూ ఒకటిగానే మసలుకున్నారు. ఏకశరీరులై, ఏకాత్మగా, ఒకే సంకల్పంగా, ఒకే ఆశయంతో జీవించారు. ఆ రోజుల్ని తమవిగా చేసుకుని ప్రేమైక జీవులైనారు. భూమ్యాకాశాల వలె వారిది విడదీయరాని దాంపత్యం. ఆమె కొంతసేపు బంగరుబాటలలో పయనించింది. కొంతసేపు భయంకర నిశీథంలో కొట్టు మిట్టాడింది. ఇప్పుడు తొలిసంధ్య వెలుగుల్ని చేరుకున్నది.

ఒకప్పుడు ప్రియుని బిగి కౌగిలిలో పరవశించి మధురోహల తేలిపోయింది. తన ఆనందంతో భూమికి స్వర్గానికి వారధి నిర్మించుకుంది. ఇప్పుడామె గుండె కల్లోలమైంది. బ్రతుకు అఖాతమైంది. తెలియని భయం, తెలిసిన భవిష్యత్తు గుండెను పట్టివేస్తున్నది. ఆ భయం తనది కాదు. తనలో ఎలా ప్రవేశించిందీ అర్థం కాదు. లోపల గుప్తంగా ఉన్న భయం ఇప్పుడు బయటకు వస్తోంది.

భయానికి రూపం లేదు. దాని రెక్కలు కనిపించవు. అది ప్రపంచాన్ని తన రెక్కల చప్పుళ్లతో భయపెడుతుంది. అది కాళరాత్రిని, ఆకాశాన్ని, భూమిని క్రమ్మివేస్తుంది. మృత్యువు తెలీదు. కాని మృత్యుభయం మనిషిని ఉపద్రవంగా వచ్చి మ్రింగివేస్తుంది. తన ఉధృతితో ఆకాశాన్ని కదలిస్తుంది. పవనాలను సైతం కదిలించి కన్నీరొలికిస్తుంది. జీవితంలోని ఆనందాలకు తిలోదకాలిస్తుంది మృత్యుభయం.

ప్రాణమే ఆమెను పరిహసించి, పరిత్యజించినట్లు అనిపించింది. తనకు ప్రాణాధికమైనవన్నీ తనను వదలిపోతున్నట్లు తెలుస్తోంది. అతి ప్రయాసతో ఆమె శరీరాన్ని మనస్సు వదిలిపెట్టింది. అంతర్గతంగా ఒక అగోచరశక్తి సహాయం తీసుకుంది. చుట్టూ కారుచీకటి, లోపల కల్లోలసాగరం.... ఆమెకు ఒక హెచ్చరిక. అది అనంత మహాంధకారం అందించిన భయానక సందేశం. అది కఠోర నిశ్శబ్దం అందించిన చేదు సందేశం. భయంకర శూన్యం నుండి వెలువడిన సందేశం భావరహితమైన శూన్యత..... ఆ స్థితి బ్రహ్మానందానికి అనర్హత. చైతన్యం లేని జీవం. జీవితమే శూన్యం అయి ఆత్మ పారిపోయింది. మూగవోయిన కల్లోల

హృదయానికి అవాచ్యమైన అవ్యక్తభావం అభివ్యక్తమైంది. ఆమె తన లోపలి అవ్యక్త భావాన్ని వినసాగింది. ఈ ప్రపంచం, జీవితం అంతా అవాస్తవంగా, అసత్యంగా తోచింది. అంతరంగంలోని అవ్యక్తభావం ఇప్పుడామెకు ఆధారమైంది. తన భావన, తన అంతరంగం తనను హెచ్చరించింది.

"జీవితానికి విశిష్ట ప్రయోజనం ఆశిస్తున్న నీవు ఎవరవు? తన ఆత్మ శాశ్వతం అనుకుంటూ అసంపూర్ణంగా ఉన్న మనిషిని, పశు ప్రవర్తన వదలని మనిషిని, దైవత్వం వైపు మళ్లించాలని ప్రయత్నిస్తున్న నీవెవరు? ఈ ప్రపంచమే బాధలమయం. ఇందులో ఆనందం శాశ్వతంగా ఎలా నెలకొంటుంది? అశరీరవాణి విని ఏవేవో భ్రమలకు లోనుకావద్దు. అవ్యక్తమైన కాంతిని చూచి భ్రమించకు. అగోచరమైన పరమాత్మను అందుకోవాలని, దర్శించాలని, నిరాకార నిర్గుణ తత్త్వాన్ని నిర్వచించాలని, దివ్యత్వాన్ని నీ భౌతిక శరీరంలో నెలకొల్పాలని వృథా ప్రయాస చెందకు. మానవ సుఖాలు నివేదన చేసి పరమాత్మను ప్రసన్నం చేసుకోగలవా? అసంభవం.

"సర్వాన్ని సృష్టించేది నేను. లయం చేసేది నేను. మృత్యువును కల్పించేది నేను. జీవులకు అభయమిచ్చేది నేను. నగ్నంగా నర్తించే 'భద్ర' కాళిని నేను. నేను మాయను. ఈ సృష్టి అంతా నా మాయా కల్పితమే. ఒక్క నిశ్వాసతో మనిషి ప్రాణం హరించివేస్తాను. ఆనందానికి సమాధి కడతాను. బ్రతకాలన్న కాంక్ష, సుఖించాలన్న వాంఛ లేకుండా చేసేది నేనే. అంతా కడకు శూన్యంలో కలిసిపోవలసిందే. అంతా చివరకు నిర్గుణంగా, నిరాకారంగా మారవలసిందే. మహాశూన్యం ఒక్కటే చివరకు మిగిలేది. మిగిలినవన్నీ మనోయవనికపై చెరిగిపోయే చిత్తరువులే. మేధ అనే శూన్యఫలకం మీద కదిలే బొమ్మలు నీ ఆలోచనలు.

"నీ ఆంతర్యం కల్పించిన సుందరసృష్టి నీది. అది వాస్తవం అనే భ్రమ కలిగిస్తుంది. మనిషి ఆలోచనలకు, ఆశలకు మూలమైన ఓ జీవీ! ఈ కాలప్రవాహంలో నీ పయనం ఎంత కాలం! నీ స్థితి, అస్తిత్వం క్షణికం కదా! నీవే భ్రాంతికి కేంద్ర బిందువు. నీ అస్తిత్వం అస్థిరం. నిన్ను నీవు తెలుసుకుని, నీ అస్తిత్వాన్ని నాకు వదలిపెట్టు".

ఒకానొక నిర్గుణతత్త్వం నీడ వలె కదిలి గతంలోకి, చీకటిలోకి జారి పోయింది. ఆమె నుండి అంతర్వాణి పైకుబికి వచ్చింది. అంతరంగ జగత్తు శూన్యంగా మారింది. శూన్యతను మోయలేక ఆమె హృదయం బరువెక్కింది. ఇప్పుడు ఆమెకు ఆనందమయ లోకాలు కనిపించడం లేదు. ఒక్క ఆత్మ మాత్రం

నగ్నంగా, నర్మ గర్భంగా మిగిలింది. అదీ శూన్యంలో మారి శూన్యంగా పరమాత్మ ఆజ్ఞకై ఎదురు చూడసాగింది.

అప్పుడొక మహత్తు శిఖరాలు దిగివచ్చి ఆమె మనస్సును, హృదయాన్ని తాకినట్లయింది. అది ఆత్మ తేజోవాణి. ఆగాధాల సందేహాలకు ఆకాశం సమాధానం చెప్పింది. అంతరంగ కల్లోలం కొంతసేపు సమసిపోయింది.

“ఓ ఆత్మా! నీ స్వారాజాన్ని పరుల పరం చేయకు. నీ బ్రహ్మానందానుభవం నీలోనే దాచుకో. విధి, కాలం తమ మార్గం తాము ఎన్నుకుంటాయి. నీ మందిర కవాటాలను తట్టనీయకు. వాటిని పగులకొట్టనీయకు. నీ ఆత్మ సంపదలు అవే పెరుగుతాయి. కేవలం నీ ప్రయోజనానికై ఆత్మను జయించలేవు.

“ఒకే ఒక్క విజయంతో తృప్తిపడకు. విశ్వాన్నంతా నీ పరం చేసుకోగలగాలి. ఉన్నత లోకాలలోకి చొచ్చుకుని పోవడానికి నీ శక్తిని ఉపయోగించు. చివరకు మిగిలేది శూన్యమే గదా అని నిరాశవద్దు. అది పరమాత్మికమైన శూన్యస్థితి. అదే ముందుగా నీవు సాధించవలసింది. నీ సర్వస్వం ఆ నిర్వికల్ప స్థితిని చేరుకోవాలి. నీవు చిన్నగా, భూమిపైన ఒక మనిషి రూపంలో ఉన్నందున దివ్యత్వాన్ని చూచి మురిసిపోతున్నావు. నీ అంతిమ గమ్యం పరమాత్మ.

“నీవు వచ్చింది నీ కొరకే అయితే, ఒక వ్యక్తిని బ్రతికించడానికే అయితే ఇంత అన్వేషణ, ఆత్మశక్తి, తపస్సు, యోగం నీకెందుకు? చీకటిలో ఈ వెతుకులాటకు, వెలుగుబాటకు అర్థం! తిమిరంతో ఈ సమరం సాగించడం ఎందుకు? వెలుగుకై చీకటి తలుపులు తెరవడం దేనికి? అసలు నీవు ఇంతదూరం రావలసిన పని ఏముంది? నీవు అవతరించింది ఈ కల్లోల ప్రపంచంలో పీడిత, తాడిత, అజ్ఞాన మానవులను ఉద్ధరించడానికి, చూడలేని కళ్లకు వెలుగు ప్రసాదించడానికి, హృదయాలను పూర్ణానందంతో నింపడానికి, ఆనందం కలిగించడానికి. నీవు భూమికి స్వర్గానికి మాధ్యమంగా మారి, శ్రామిక జగత్తును రక్షించదలిస్తే, విశ్వంలోని విషాదాన్ని నీవే భరించాలి. నీవు నిర్మూలించదలచిన విషాదాన్ని నీవూ భరించక తప్పదు. వెలుగును మోసేవాడు చీకటిలోనే నడుస్తాడు. లోకాన్ని మోసేవాడు లోకంలోనివాడే! లోకాన్ని రక్షించాలనుకున్నవాడు బాధల్ని అనుభవించి తీరా విషాదం ఎలా ఉంటుందో అనుభవించకుండా దానిని ఎలా నిర్మూలించగలవు?

“నీవు భౌతికమండలం దాటి పైపైకి వెళ్లిపోతున్నావు. అందరూ అంత

ఎత్తులకు రాగలరా! నీ అంత ఎత్తుకు ఎదగ గలరా! ప్రతి ఒక్కరు స్వర్గాన్ని చేరగలగాలి. ఆ తర్వాత వారూ నీవలె పై శిఖరాలను అధిరోహించగలరు. భగవంతుడైనా మానవ అవతారం ఎత్తితే మనిషిగానే జీవిస్తాడు. సామాన్య మానవుడు మహిమాన్వితుడై భగవంతుడు కావాలి. లోకాన్ని రక్షించే వాడు లోకంలో ఒకడుగా మెలగాలి. అతని హృదయంలో విషాదాలన్నీ కదలాడాలి. లోకంలోని బాధల్ని, ఆనందాలను తనలోకి ఆహ్వానించాలి. అతని ఆత్మ విశ్వం కన్నా విశాలం అవుతుంది. అనంతత్వం తన ఆత్మతత్వం కావాలి. క్షణికమైన జీవితంలో 'తన' కేమీ మిగలదు కనుక తాను కాలాన్ని జయించగలుగుతాడు. విధిని దాట గలుగుతాడు. ఈ చరాచరసృష్టి విశ్వచైతన్యంలోని ఒక స్పందన మాత్రమేనని గ్రహించు. ఈ విశ్వం ఒక మహాగ్నిగుండంలో రగిలే నిప్పు కణిక. ఆద్యంతాలు లేని ఆత్మలు ఎక్కడెక్కడో విశ్వంలో తిరుగుతుంటాయి. ప్రపంచ ప్రళయాలు సైతం విశ్వ స్పందనలే. అన్నీ కడకు శూన్యంలో సమిసిపోయేవే.

"ఈ పొడవైన గొలుసును కాస్త కదలించు, వదులు చెయ్యి, సృష్టి కారణమైన సంకల్పం నుండి దూరంగా వెళ్లు. ఈ అనంతత్వం అనే దానికి దూరంగా జరుగు. నీ ప్రజ్ఞను అనంతశూన్యంలో ప్రళయతాండవం చేయనివ్వు. అప్పుడు తెలుస్తుంది నీకు సృష్టి ఏమిటో? పరమాత్మ అంటే ఏమిటో? కనుక నీ ఆలోచనలన్నీ దాటి మహాశూన్య స్థితిని చేరుకో. అప్పుడు అగోచరంగా ఉన్న పరమాత్మ నీకు గోచరమవుతుంది. అక్కడ దివ్యత్వం విరబూస్తుంది. చైతన్యం వెల్లివిరుస్తుంది. సృష్టి రహస్యం నీకు అవగతమవుతుంది. నీవు సూటిగా పరమాత్మ తేజోనేత్రాలలోకి చూడగలవు. శూన్యంగా, అభావంగా ఉన్న చోట్ల సత్యాన్ని అన్వేషించు. తెలిసిన విషయాలలోనే తెలియవలసిన మర్మాలు దాగి ఉంటాయి.

"అప్పుడు నీవు భగవత్తత్వానికి, సత్యానికి చేరువవుతావు. తానై ఈ అద్భుత ప్రపంచంగా మారిన భగవంతుడు తన రహస్యాన్ని తనలోనే దాచుకున్నాడు. ప్రకృతి హృదయమే చైతన్యం. కనిపించని వెలుగు దివ్యతేజస్సుగా మారింది. జీవితం అధ్యాత్మిక సరోరుహమవుతుంది. భౌతికత్వం ఎప్పుడూ ఆధ్యాత్మికతకు అండగా నిలుస్తుంది. అన్నింటినీ కాదని, అన్నింటినీ వదిలి కాలంలో కరిగిపో. మనస్సును దాటు, రూప ప్రపంచాన్ని దాటిపో. నీలో శూన్యాన్ని నింపుకో. నీవే పరమాత్మవైపోతావు."

మహాద్భుతమైన అశరీరవాణిని సావిత్రి విన్నది. విని, వినమ్రంగా తలవంచి ఆలోచించింది. అంతరంగంలో చొరబడి ముందుకు పోయి పోయి ప్రశాంత

నిశీధం వంటి అంతర్మందిరాన్ని చేరింది. తన జీవిత నాటకానికి తానే ప్రేక్షకురాలిగా మారి అనంతంగా సాగుతున్న దృశ్యాలను అంతరంగ ఫలకంపై చూడసాగింది.

ఆమె దర్శించినవి కల్లోల జీవితాలు, జీవన చిత్రాలు. మనో మండలాల్లోని సంకీర్ణభావ తరంగాలు. కల్లోల శబ్దాలు. అనంతంగా సాగే ఆలోచనలు, ఆర్భాటాలు ఆమె సంభావించిన ప్రతిదీ ఒక రూపంగా మారసాగింది. ఆమె తన సర్వస్వం కాలానికి కైంకర్యం చేసింది. ఇప్పుడు అంతా ప్రకృతి విలాసం.

మానవ వేదికపై జీవన నాటకంలో ప్రతి అంకానికి, ప్రతి దృశ్యానికి వెనుకనున్న ప్రయోక్తను గుర్తించింది. ఈ విశ్వరూపక కర్త అద్వితీయ ప్రతిభావంతుడు అనుకుంది. మనస్సు లోతులనుండి వెలువడే భావాలను గ్రహించింది. జీవన తరుశాఖలపైన పశుప్రవృత్తులు ప్రతి హృదయంలో కొత్త చివుళ్లు వేసే కామవాంఛలు, నరాలను జివ్వుమనిపించే ఆకాంక్షలు. అందని లోతులలో దాగిన దివ్యశక్తుల్ని ఆమె దర్శించింది. ఒక్క కాంతికిరణం ఆత్మను విముక్తం చేయగలదు. ఆమె అంతర్దృష్టితో ఆలోచనల మూలాన్ని అన్వేషించింది. అవి బాహ్యమేధకు అందనివి. బయటకు కనిపించనివి. అన్వేషణకు తనకు అధికారం ఉన్నదా అని ఆమె ఆలోచించలేదు. మేధ స్వచ్ఛందంగా కొన్ని రూపాలను విడుదల చేస్తుంది. అదే మేధ విశ్వభావాలను, శబ్దాలను అందిస్తుంది, వినిపిస్తుంది. మనిషి వినలేని శబ్దాలు మేధలోపలనే లయించి పోతాయి. కాని మేధ సృష్టించే సంపదలు అపారాలు, అసంఖ్యాకాలు. మనస్సులో ఎన్నో అరలుంటాయి. అన్నింటిలోనూ సంకేతాలే ఉంటాయి. మనస్సు సినిమా రీలువలె తిరుగుతుంది. గ్రామఫోనువలె వినిపిస్తుంది. అందులో కొన్ని సంకేతాలు, కొన్ని చిహ్నాలు, కొన్ని సూచికలు.

మన సూక్ష్మశరీరంలో ఒక భావం ఉదయిస్తుంది. అది రోదసి వెలువడి వచ్చి కారణ శరీరంలో ప్రవేశిస్తుంది. మరొకసారి ఆత్మ నుండి భావం వెలువడ వచ్చు. ఆ భావం తేజోపూర్ణం. అది చూడగలదు. ఇతరులతో భాషించగలదు. ఆమె హృదయం నుండి ఒక తేజోరూపం వెలువడింది. అది ప్రేమ కోసం, జీవితం కోసం, సత్యం కోసం వెదకసాగింది. స్వర్గాన్ని కాంక్షించి, విశ్వాన్ని ఆలింగనం చేసుకుంది. మానవ జీవితాకాశాన చంద్రుని వెన్నెల పరుచుకున్నది.

ప్రాపంచిక సుఖాలపై వ్యామోహం లేదు. ఆత్మ విశ్వాసం అనే అమలిన సౌందర్యానికి ఆమె ప్రతిరూపం అయింది. హృదయ మందిరంలో చీకటిలో

పూజాసుమాలు సేకరించి బంగారు పూలకుండీలో అమర్చిన సజీవ సరోజం అయింది. హృదయంలో ఒక మంత్రం పనిచేయ నారంభించింది. అది హృదయం నిర్మలమై తేజోపూర్ణం అయ్యేవరకు, ఆశయ సాఫల్యం జరిగే వరకు, ఊర్ధ్వ దృష్టికి, ప్రగతికి మంద్రంగా సహకరించింది. కనుబొమల మధ్య ఆజ్ఞాకేంద్రంలో దివ్యదృష్టి ఏర్పడ్డది. మనస్సులో దేవతాసంచారం ఎక్కువైంది. ఒక్కొక్క దేవత ఒక జ్ఞాన వీచిక. అసంకల్పితంగా నమస్కార ముద్రలు, యోగ భంగిమలు ఏర్పడ్డాయి. భౌతిక శరీరంపై దివ్య కిరణాలు ప్రసరించాయి. గుండె నిండి ఆలోచనలు పైకుబికి రాసాగాయి. అవి అలౌకిక సౌందర్యఝురులు, ఆనందహేలలు, సుందర సురుచిర స్వప్నాలు, మహాద్భుత ప్రహేళికలు.

నాభికేంద్రానికి సమీపంగా ఒక కేంద్రం ఏర్పడి వలయాలుగా తిరగ సాగింది. అందులో కామనలు, ఉద్రేకాలు, ఉద్వేగాలు ప్రవాహాలై అరూప భావనలుగా కదలసాగాయి. అవి గళసీమకు ప్రాకి చైతన్య కుసుమంగా రూపొంది అవ్యక్త మధురిమల్ని సృష్టించసాగాయి. అక్కడే దివ్యవాణికి సంకేత రూపాలు ఏర్పడ్డాయి. వాటి సరసన వాంఛలు విజృంభించి, కోరికల్ని రగిలించి, మాధుర్యాలను సుఖాలను ప్రోగుచేసి, సుఖలాలసకు సంకేతాలను ఏర్పరచాయి. అవే ఆత్మకు ఆలంబనలు, ఆనందాలకు పట్టుగొమ్మలు. అణువణువున చైతన్యం జ్వలించి, ఆలోచనలు ముసురుకున్నాయి. ఆ వాంఛలు పెరిగిపెరిగి, అణగిమణగి మార్మిక శిఖరాలపై అంతరిస్తాయి. ప్రాకృతిక స్పర్శలు, స్పందనలు అన్నీ పరమాత్మకు అనుబంధాలే.

బాహ్యమేధలో బందీ అయిన మనిషి ప్రవేశ ద్వారంలోనే తన పరిచయ పత్రాన్ని సమర్పించుకోవాలి. లేకుంటే ప్రవేశం లభించదు. మారువేషాలు ధరించాలి. మేధ తమ అధీనంలోనే ఉన్నట్లు నిరూపించుకోవాలి. నిజానికి సత్యం ఏమిటో మేధకు అసలు తెలియదు. మేధాంతర ప్రజ్ఞ ఒకటి ఉంది. దానికి సత్యాన్ని నిర్వచించగల శక్తి ఉంది. అదే ఒక రూపాన్ని సృష్టించి ఆ రూపం ద్వారా సత్య సందేశం అందించగలదు. అప్పుడైనా మార్గం తెలుస్తుంది కాని మర్మం తెలియదు. ఆంతర్యానికి కొంత అర్థమవుతుంది. దివ్యదృష్టికి వాస్తవం తెలుస్తుంది. అంతర్ప్రజ్ఞకు మూల రహస్యం అర్థమవుతుంది. మన స్వభావాలే ఆత్మకు సంకేతాలు.

భౌతిక విజ్ఞానానికి అందని విషయాలు, రహస్యాలు అభేద్య దుర్గాలలో భద్రంగా ఉన్నాయి. ఆత్మకు ఆవాసమైన మందిరాల తలుపులు మనం తెరవలేం.

వాటంతట అవిగా తెరుచుకోవలసిందే. సావిత్రికి అంతర్మందిర ద్వారాలు తెరుచుకున్నాయి. తమ రహస్యాలను నివేదించుకున్నాయి. అదృశ్యంగా ఉన్న కుడ్యాన్ని సంకల్పశక్తితో ఛేదించగలిగింది. అన్ని మార్మిక ద్వారాలను సంకల్పంతోనే తెరిచింది. తొలి మందిరంలో మానవమేధను విస్తృత పరిచే భావసంపదలు కనిపించాయి. కొడిగట్టనున్న దీపాలను ఆదర్శంతో పైకి త్రోసి, భౌతికతను ఆధ్యాత్మిక సీమలలో ప్రవేశింపచేశాయి. అప్పుడు అగోచరాన్ని దర్శించగల జ్ఞానదృష్టి ఏర్పడ్డది. మానవనేత్రాలు చూడలేని సుందర రూపాలను, దివ్య చిత్రాలను చూచింది. మనిషి కర్ణేంద్రియాలతో వినలేని దివ్యనాదాలను విన్నది. దివ్యస్పర్శతో అద్భుత మాధుర్యాల రుచి తెలిసింది. ఇక్కడ నిరుపయోగం, నిష్ప్రయోజనం అనుకున్న విషయాలు అక్కడ మహత్తర మధురానుభవాలను కలిగించాయి. అవి ఆలోచనలకు, అనుభవాలకు మధ్య రేఖను తుడిచివేశాయి.

భౌతిక దృష్టికి అందకుండా నిగూఢంగా ఉన్న దృశ్యాలు, సూక్ష్మలోకాలలో సంచరించే జీవులు ఆమెకు దర్శనమిచ్చారు. పరలోకాల సుందర జీవితాన్ని గమనించింది. అక్కడ శబ్దాలకు దూరం అవరోధం కాదు. మేధస్సును దాటి ఆమె శూన్యంగా తిరగ గలిగింది. గతించిన సంఘటనలన్నీ కదలాడాయి. ఆ మహర్లోక విషయాలన్నీ ఆమెకు స్వవిషయాలనిపించాయి. వాటిని ఎవరూ ఇంతకాలం పొందలేకపోయారు. అవ్యక్త భావాలు ఇంతకాలం వ్యక్తం కానే లేదు. అవి ఉపచేతనలో తెలిసీ తెలియని సంకేతాలు. వాటి అర్థాలు నిగూఢం, నిక్షిప్తం, సాంకేతికం. ఆ నిగూఢమైన మార్మిక భాషకు అర్థం తెలీదు. వాటి వెనుకనున్న వాస్తవికత, సత్యం అసలు బోధపడదు.

అగోచరం యావత్తు క్రమంగా గోచరమై అవ్యక్తం వ్యక్తమైంది. దూరతీరాల నుండి రాబందులు తరుముకొచ్చినట్లు మహాచైతన్య శిఖరాల నుండి మార్మిక భావనలు క్రిందికి దిగి వచ్చాయి. మహాసాగరం నుండి సువర్ణమీనాలు ఒడ్డుకు చేరినట్లు అగాధాల లోతుల నుండి ఆలోచనలు పైకి వచ్చాయి. ఈ ప్రపంచం అతి విశాలం, అంతు చిక్కదు. విరుద్ధ శక్తులు అన్ని తావులలో ఉంటాయి. అనుగ్రహ శిఖరాలు, అయోమయ అగాధాలు ఉన్నాయి. మనిషి దివ్య శిఖరాలను అధిరోహించినా తన వాంఛలను వదులుకోడు. తన ప్రవృత్తిని మారనీయడు. ఎంతగా దివ్యత్వం సాధించి, పరలోకాల విహరిస్తున్నా తన బలహీనతల్ని వదలిపెట్టడు. అంత ఔన్నత్యం నైచ్యంతో కలుస్తుంది, కలుషితమవుతుంది. అది భగవంతుని లీలావినోదం.

అనేక జన్మల అనుభవాలు, సంఘటనలు ఆమె చూచింది. గత జన్మలు అనంతంగా, అసంఖ్యాకంగా ఉన్నాయి. పరమాత్మ లీలలు, ఆయన వలె శాశ్వతాలు. అవి కాలంతో జన్మించి శూన్యంలో లయించి పోతుంటాయి. ఆమె మేధ సర్వాన్ని సాకల్యంగా తెలుసుకున్నది. నశించినదే మళ్లీ తయారవుతుంది. కాని కొత్తగా జన్మించడం లేదన్నది సత్యం. భౌతిక శక్తులవల్ల అది శరీరంలో దాగి ఉంటుంది. మనస్సు మహాశక్తివంతమైన చిన్న యంత్రం. అది అరిగిపోయేవరకు పనిచేస్తుంది. ఆలోచనలను ఉత్పత్తి చేస్తుంది. బాహ్య ప్రపంచం నుండి తన ముడి పదార్థాలను స్వీకరిస్తుంది. దాని నమూనా తయారు చేసేది విశ్వకర్మ అయిన పరబ్రహ్మ.

మన భావాలు తరచుగా సృష్టిలోనే పూర్ణంగా తయారవుతాయి. అవి యథాతథంగా మనో కవాటాలు దాటి బయటపడుతుంటాయి. అవే మన ప్రచేతనలో స్వేచ్ఛగా విహరిస్తుంటాయి. కాలానికి కట్టుబడి భావాలుగా చలామణీ అవుతాయి. ఆయా వ్యక్తుల అభిప్రాయాలుగా ముద్ర వేసుకుంటాయి. మనిషి మాయ కారణంగా అవి అన్నీ తన ప్రతిభకు తార్కాణలు అనుకుంటాడు. అంతా ప్రకృతి సంపదలే అయినపుడు మనిషి ఆలోచనలూ ప్రకృతి సంపదలే కావాలి. ఏవీ మనిషి సొంతం కాదు!

మనం శ్రమిస్తాం, పరిశ్రమిస్తాం. అయినా మనం నిమిత్తమాత్రులమే.మనం సృష్టించేది, ఆలోచించేది ఏదీ మన స్వంతం కాదు. మనది అనుకునే శక్తీ మనది కాదు. మన ప్రజ్ఞ సైతం పైనుండి దిగివచ్చి మనలో ప్రతిష్ఠితమయ్యేదే. ఆ రహస్యం మనకు తెలియకపోవడమే దివ్య రహస్యం. ఆ పనికే 'శాశ్వతం' అని ముద్ర వేస్తాం. ప్రజ్ఞ, ప్రాభవం, రూపం, ఆకర్షణ, కీర్తి, దీప్తి అన్నీ ఒక అగ్నిగుండం లోని జ్వాలలే. భగవంతుని కర్మశాల ఒక ప్రయోగశాల. అక్కడ తయారయ్యే ప్రతిదానిపైన సర్వాధికారాలు, హక్కులు భగవంతునివే. వాటికి 'మానవత' అనే పైపూత అద్ది భూమికి దిగుమతి చేస్తారు. స్ఫూర్తి అనే వార్తాహరుడు వాటిని మోసుకొచ్చి అందించగా మనస్సు ఆ అమూల్య విషయాలను తన స్వంతం అని ప్రచారం చేసుకుంటుంది. స్వీకరించే మేధోలోపం వల్ల వాటి విలువ కొంత తగ్గుతుంది. కొంత మనస్సులో తయారయ్యే ఆలోచనలతో కలిసి చెడిపోతాయి. అవి ఎంత తక్కువ చెడితే అంత ఎక్కువ దివ్యత్వం నిలుపుకున్నట్లవుతుంది.

ఈ లోకం తనదే, తన కోసమే అంటాడు మనిషి అహంకారంతో. సృష్టిలో మనిషి ఒక చిన్న యంత్రం లాంటివాడు, సగం పని ప్రకృతి చేస్తుంది. సగం పని పురుషుడు, పరమాత్మ నిర్వహిస్తారు. మనిషి చేయవలసిన పని ఆత్మ సమర్పణ

ఒక్కటే. ఈ సృష్టి ఏర్పడక పూర్వం స్వయంభువు అయిన శక్తి, అద్వితీయ స్వతంత్ర ప్రతిపత్తిగల మహాశక్తి సృష్టిని అమోదించి, తనను ప్రకృతితో అనుసంధానం చేసుకుంది. ప్రకృతి నుండి స్వతంత్రం పొందిన మనిషి భగవంతునికి కృతజ్ఞతగా ఉండాలి. ఇది పైకి కనిపించే మన భౌతికశరీరం. కానీ అసలు శరీరం సూక్ష్మంగా, మహాశక్తివంతంగా లోపలనే ఉంటుంది. మన ప్రజ్ఞాప్రాభవాలు అమోఘం. భౌతిక కుఢ్యాలను ఛేదించి లోపల ప్రవేశించినపుడు మనం ఏమిటో తెలుస్తుంది. ఆధ్యాత్మిక జగత్తులో ప్రవేశించడమే తొలి ప్రస్థానం. అక్కడ మన ఆత్మలోకానికి మనమే అధిపతులం. అక్కడ శరీరం నామమాత్రంగా మిగులుతుంది. మనస్సు కొంత సహకరిస్తుంది. ఆత్మకే సర్వాధికారాలు. జీవన సత్యం నగ్నంగా ఆత్మను అంటిపెట్టుకొని ఉంటుంది. అక్కడ నుండి 'పర' వశంతో అది ప్రపంచాన్ని వీక్షిస్తుంది, సమీక్షిస్తుంది.

మేధ కట్టడులను తప్పించుకొని ఆమె పురోగమించింది. అక్కడ ఆంతర్యపు లోతుల క్రీనీడలలో సేద తీరవచ్చు. లేదా, అగోచర ప్రశాంతితో కలసి నిశ్శబ్దంగా ఉండిపోవచ్చు. ఆమె ప్రకృతి నుండి విడివడి స్వతంత్రమై, ఔన్నత్యం సాధించింది. అక్కడనుండి సృష్టిని గమనించసాగింది. ఆపైన అంతా ఆమె ఇచ్ఛకు అధీనమే. ఆ పైన సర్వం పరమాత్మకు అంకితమైన ప్రశాంతి.

ఆమె అంతరంగం నిశ్శబ్దమైంది. స్తబ్దమైంది. నిశ్శబ్ద సాగరాలపై ఎప్పుడో కదిలే అలల వలె, ప్రశాంత సరస్సుపై ఎప్పుడో తేలే నీటి బుడగల వలె, ఎప్పుడో ఆమెలో చిన్న ఆలోచనలు కదులుతున్నాయి. ఒక రాయి విసిరినప్పుడు సరస్సులో కలిగే సంచలనం లాంటిది. మనస్సు ఒక కర్మాగారమే అయినా, పని నిలిచి పోయింది. శక్తి యంత్రం పనిచేస్తున్న సవ్వడి వినిపించడం లేదు. ప్రశాంత సీమల నుండి ఎలాంటి సంకేతం లేదు.

ఆమెలో ఏమాత్రం చలనం లేదు. మనస్సు మహాశూన్యంగా మారిపోయింది. అది ఎలాంటి శబ్దం సహించని ప్రశాంత సువిశాల క్షేత్రం. అదే సమాధిస్థితి, అది బ్రహ్మానందస్థితి. కానీ ఆమె అంతర్దృష్టికి అన్నీ ఉన్నట్లే తోస్తుంది. పైన మూత బిగించి కల్లోలభాండాన్ని మూసినట్లు ఆమెలో ఆలోచనలు, ఉద్రేకాలు లోలోపల అణగిపోయాయి. అవి బయట పడాలని అప్పుడప్పుడు ప్రయత్ని స్తుంటాయి. కాని, నిశ్శబ్దమైన మేధ వేటినీ లక్ష్యపెట్టదు. అన్నింటినీ అణచివేసిన కారణంగా ఏదీ బయటపడదు. పైకి రాదు. ఏ క్షణంలోనైనా ఉప్పెనవలె విరుచుకుపడే ప్రమాదం ఉంది. ఆమె ఆ స్థితిని దాటిపోయింది. శరీరం శిలవలె

బిగుసుకుపోయింది. ఇప్పుడు సర్వం సువిశాల శూన్యం. అయినా అది బ్రహ్మానందం కాదు. ప్రశాంతి లేదు. పరమాత్మ ఆమోదముద్ర పడని పరిస్థితి. ఆనంద సాగర నిశ్శబ్ద ప్రశాంతి కనిపించదక్కడ. కొన్ని భావాలు ఆ ప్రశాంతిని చీల్చుకుని బయట పడుతుంటాయి. అవి హృదంతరం నుండి, లోతుల నుండి వచ్చినవి కావు. అరూప స్థితిలో ఉద్భవించి రూపం కోసం తహతహలాడుతున్న భావాలు. అవి శరీరానికి, మనస్సుకు సంబంధించినవి కావు. కాలావసరాన తయారైనవి తప్ప జన్మించినవి కావు. రోదసిలో ఏ తీరం నుండో వచ్చి వాలినవి. ఆలోచనలు పదాలు అరూపాలు రూపాలుగా మారాలి. అప్పుడే వాటికి విలువ, గుర్తింపు ఏర్పడతాయి. అవి బహుదూరాల నుండి పెద్ద పెద్ద తెరచాపలతో గాలి పడవలపై వచ్చి పడతాయి. అలా మనలో చొరబడడం వాటి హక్కు అయినట్లు, సరాసరి చెవుల ద్వారా లోపల చొరబడి, ఆత్మ అంతఃపురాలను చేరుతుంటాయి. అంతా వెలుగుమయం కావటాన ఆ లోకాలలో బాటలు వేరుగా కనిపించవు.

తనపై దురాక్రమణ చేస్తున్న భావాలలో వెతకగా మహోన్నతమైన ఆధ్యాత్మికానుభూతి కనిపించింది. అది క్రమంగా తనను, లోకాన్ని, రోదసిని ప్రభావితం చేసింది. వాయువును ఈథర్ ఆక్రమించుకున్నట్లు, ఒక భావం సుతిమెత్తగా గాలిలో పయనించసాగింది. తీరాన్ని చేరనున్న నావ ప్రశాంతంగా కదులుతున్నట్లు, భావం అన్ని అవరోధాలను, అభ్యంతరాలను తొలగించుకుని, మేధలోని తన స్థావరాన్ని చేరుకోగలిగింది. తనకు పరిచయమైన మార్గం ద్వారా లోపలకు ప్రవేశించగా ఇచ్ఛ దాని ప్రవేశాన్ని నిరోధించింది. మరోశక్తి అడ్డు నిలిచింది. ఆ భావం అనంతంలో పయనించి శూన్యంలో లయించిపోయింది.

మరికొంతసేపటికి మరొక భావం పొటమరించింది. ఒకదాని వెంట ఒకటిగా అనేక భావాలు చుట్టుముట్టాయి. సాగరతీరంలో రేవులో అనేక నావలు గుమిగూడినట్లు అదృశ్య తీరాల నుండి అనేక ఆలోచనలు వచ్చి చేరాయి. అన్నింటి ప్రయత్నం విఫలమైంది. ఏవీ మనస్సు వరకు చేరలేదు. అన్నీ నిశ్చలం అయ్యాయి. దేనిలోనూ చలనం లేదు. చైతన్యం లేదు. నిశ్చలం, నిర్వికల్పం, కాలాతీతం. ఏకాంతం అయిన ఆత్మ ప్రశాంతంగా రోదసి నిండా విస్తరించింది.

ఆ నిర్గుణ, నిరాకార, నిర్వికార, నిశ్చల, నిరామయ, నిరంజన స్థితిలో సర్వవ్యాపకమైన మహాశూన్యం ఒక తేజస్సుగా మారింది. అలా శూన్యం తేజస్సుగా మారడమే దివ్య రహస్యం, దివ్యత్వ సూచన. అలా మారినప్పుడు ప్రకృతి, ఆత్మ

శూన్యంగా మారిపోతాయి. ఆత్మ భావన పలచనై కాంతి హీనమవుతుంది. అరూప, అభావ, నిర్గుణ చైతన్యం శుద్ధ ప్రజ్ఞగా మారి మనస్సును వెనక్కు నెట్టివేస్తుంది.

ఆమెలోని జీవుడు నామమాత్రంగా మిగిలాడు. ప్రపంచం ఒక సంకేతంగా మారిపోయింది. రూపాలు స్వప్నాలుగా, శబ్దాలు వేరొక స్వప్నంగా మారి విశ్వమే ఒక ఛాయాచిత్రమైంది. జీవుడు మాత్రమే ఆ విశ్వరూపాన్ని దర్శించగలడు. ఆ నిశ్శబ్దంలో అంతా ఆత్మకు దర్శనీయమే. అక్కడ రూపాలు, భావాలు ఏర్పడే అవసరం లేదు. అవకాశం రాదు. వస్తువుకు రూపం, గుణం కన్పించవు. అక్కడ ఉన్నది ఆత్మదృష్టి. అది అభావం. హృదయగతమైన ఉద్రేకాలు ఎప్పుడో సమసిపోయి శాంతి అడుగున సమాధి అయినాయి. అన్ని అనుభూతులు చల్లబడి తమ ఉనికిని కోల్పోయాయి.

ఆపైన హృదయ స్పందన తెలియదు. తంత్రులు పనిచేయవు. ఆనందాలకు, విషాదాలకు ఆస్కారం లేదు. హృదయ స్పందనకు ప్రతిస్పందన ఉండదు. బాహ్య సంఘటనలకు, శబ్దాలకు చలించడం జరగదు. బాహ్య స్పర్శకు ఆంతర్యం సమాధానం యివ్వదు. నరాలు ఉద్రేకపడవు. ప్రతికూలత ఉండదు. అయినా శరీరం పనిచేస్తుంది. మాట్లాడటం, చూడటం జరుగుతుంది. భావసహాయం లేకుండా, మాటల అవసరం లేకుండా మనుషుల మనోగత భావాలు తెలుస్తాయి. అవ్యక్తం వ్యక్తమవుతుంది. అత్యవసరమైన పనులనే శరీరం చేయగలుగుతుంది. ఆ పనుల వెనుక ఆత్మీయత ఉండదు. ఆలోచించే మనస్సు, పలికించే మేధ ఉండవు. అన్నీ యంత్రభాగాల వలె పనిచేసుకుంటూ పోతుంటాయి. అలవాటు ప్రకారం దినచర్య సాగిపోతుంది.

లయించపోని శక్తి ఒకటి శరీరాన్ని నడిపిస్తుంది. శరీరం తను చేయవలసిన పనులు చేసుకుపోతుంది. స్పృహలో ఉండి అన్నీ గమనించడం జరుగుతుంది. దేనిపైన ఇష్టాయిష్టాలు ఏర్పడవు. రాగద్వేషా లుండవు. ఏదీ తనకు కావాలని పించదు. కోరిక ఉండదు. కనుక కోరిక తీరే ప్రసక్తి లేదు. తాను మహాశూన్యంలో సంచరిస్తున్నా ఈ లోకంలో శరీరం చేయవలసిన పనులన్నీ చేస్తుంది.

ఆమెకున్నది ఆత్మబలం. అది పరిశుద్ధం. ఆమె చేష్టలకు చూపులకు ఆలంబన అదే. అది లేనప్పుడు అన్నీ అంతరించిపోతాయి. వ్యక్తిగత ప్రపంచం సైతం అంతరించిపోతుంది. శూన్యంలో తనకు స్థానం ఏర్పడిన తర్వాత వివేకం తన స్వంత మందిరాన్ని ఏర్పరచుకుంటుంది. ఇక్కడ ద్రష్ట, దృశ్యం వేరు వేరు

కాదు. తెలివి లేకపోయినా తెలియవలసినదంతా తెలుస్తుంది. లోకరీతి అవగాహన అవుతుంది. దివ్యదృష్టికి ఈ మహావిశ్వం అవాస్తవం, అఖాతం అనిపిస్తుంది. ఆత్మ ఈ జగత్తును చూస్తుంది కాని జీవులలో చలనం కనిపించదు. మూర్తులలో జీవం కనిపించదు. అన్నీ మృతప్రాయంగా ఉంటాయి. ఆలోచన సమసిపోగా, అన్నీ లయమైపోతుంటాయి. ఒక్క శూన్యం మాత్రం మిగులుతుంది. తన భౌతిక శరీరం తెలుస్తుంది. అంతా తేజస్సుకు నీడలా కనిపిస్తుంది. లోకంలో కదిలే జీవాలు, కదలని నిర్జీవాలు అన్నీ నీడలే. కనిపించే మహానగాలు, నగరాలు మేధకు అల్పరూపాలే. అవి పదే పదే అంతర్దృష్టికి గోచరించడం వల్ల వాస్తవాలనే భ్రమ కలుగుతుంది.

మహావృక్షాలతో పచ్చలు పొదిగిన మహారణ్యం, పీతాంబరం పరిచినట్లు కనిపించే నేల, చిత్రిత వర్ణ చిత్రాలుగా కనిపిస్తాయి తప్ప శూన్యం అనిపించదు. కానీ అంచులలో కొసమెరుపులు కనిపిస్తాయి. గగనతలంపైన నీలం మన మనస్సు చేసిన కల్పన. లోకం సైతం మనస్సు కల్పించుకున్న రూపం. అవాస్తవ గగనం క్రింద కదిలే మనుషులు అట్టబొమ్మల వలె కనిపిస్తారు. అదృశ్యహస్తం ఏదో వారిని నేలపైన నడిపిస్తుంది. లేదా కాల్పనిక చిత్రంలో వారు కదిలే బొమ్మలవుతారు. మనో ప్రకంపనలే ఆలోచనల్ని కలిగిస్తాయి, ఆత్మకు, జీవానికి వాటితో సంబంధం లేదు. ప్రతి స్పందనకు నరాలు ప్రతిస్పందిస్తాయి. హృదయం స్పందిస్తే ఆనందాలు, విషాదాలు, ప్రేమలు పుట్టుకొస్తాయి. వాటిని శరీరం అనుభవిస్తూ, భరిస్తూ అన్నీ తనవే అనుకుంటుంది. భౌతిక శరీరం అణువులతో, వాయువుతో ఏర్పడుతుంది. ఇది మాయ కల్పించి తయారు చేసిన అసత్యం. మనిషి జీవనమే ఒక స్వప్నం. నిద్రలోని శూన్య శాంతి. సర్వాన్ని దర్శించగలది జ్ఞాననేత్రం ఒక్కటే.

అడవిలో మృగాలు గుంపులుగా కదులుతుంటాయి. ఆనందంగా గెంతుతుంటాయి. ఒంటరిగా చరిస్తుంటాయి. వాటి కదలిక వెనక ఏదో శక్తి ఉంది. వాటికి మనస్సు లేదు. వాటికి అంతర్దృష్టి లేదు. పరమాత్మ కాలానికి దూరానికి అందనితీరంలో సర్వాతీతంగా ఉండిపోయింది. ఒక రూపంలో, ఆకారంలో, రేఖలో, రీతిలో సత్యం ఇమడదు. మిగిలినదంతా ఆత్మగతం, నిరాధారం. సత్యం ఒక్కటే వాస్తవం. అది కాలానికి అందదు.

యోగిదృష్టికి మాత్రమే సత్యం అందుతుంది. దానికొక రూపాన్ని దృష్టి కల్పించదు. చెవులకు వినిపించదు. మనస్సుకు కనిపిస్తుంది. ఆత్మకు వినిపిస్తుంది. ఇంద్రియాలకు మనస్సుకు లోబడనిది సత్యం.

చెవికి అందని సుస్వనమేదో ఆమెకు వినిపించింది. అది అగోచర, అదృశ్య లోకాల నుండి వెలువడిన నాదం. అది సర్వత్రా వ్యాపించి ఉన్నదే అయినా పరిధులు, అవరోధాలు, నియమాలు ఉండనిది. అది అస్థిరం. అది అనేకత్వం లోని ఏకత్వం. అదే అనంతం. అది అనంతత్వానికి ఏకైక సంకేతం!

అది అపరిమిత శూన్యమని ఆమెకు తెలిసింది. కనిపించేవి ఏవీ యదార్థం కాదు. శాశ్వతం కావు. ఎప్పటికీ రూపుదాల్చనిది శాశ్వతం ఒక్కటే. మనం ఊహించలేనివి, రూపం కల్పించలేనివి, శూన్యంలోనే ఉండిపోయినట్లు, అనంతత్వం, అమరత్వం అనేవి మన ప్రయోగాలు. మహత్తరమైన సత్యానికి, మనస్సు కల్పించుకున్న మాటలు. ఆ మహాతేజస్సులోని ఒక భాగం లోకాన్ని సృష్టించింది. గంటలు, రోజులు కాలరాహిత్యం వెదజల్లిన శకలాలు. వస్తు ప్రపంచం యావత్తు పరమాత్మ కాంతికిరణాలు. ఆత్మదర్శనం అయినప్పుడు అవి మన మనస్సు నుండి నిర్గమిస్తాయి.

అద్దంలో మన ప్రతిబింబాన్ని చూచినట్లు, ద్రష్ట లేకుండా దృశ్యాన్ని దర్శించవచ్చు. సత్యం ఎదుట జ్ఞానం, జ్ఞాతం, జ్ఞాని అన్నీ నిరర్థకాలు. ప్రేమ తన పారవశ్యంలో మునిగిపోతుంది. ప్రేయసి, ప్రియుడు ఇద్దరుండనవసరం లేదు. వ్యక్తిగతం కాని ప్రేమ విశ్వప్రేమగా మారుతుంది. విశ్వవ్యాప్త మవుతుంది. అదే మహాశక్తిగా పరిణమిస్తుంది. అప్పటి బ్రహ్మానందానుభూతిని సామాన్యులు భరించలేరు. అక్కడ ఎవరూ మోసపోరు. శూన్యంలో అగుపించే సత్యమే శక్తివంతం. అస్తిత్వంగా ఉన్నదంతా నశించినా, జీవం మొత్తంగా నిర్జీవమైనా, ఆ నిర్జీవ పదార్థం శూన్యంతో లయించినా, వాస్తవం తాలూకు మహత్తు మిగిలే ఉంటుంది.

అరూపస్థితిలో ఉన్న ఆమెకు స్వతంత్రం చేరువైంది. ఒకప్పుడు రక్తంలో, మేధలో జీవంగా ఉన్న జీవస్థితి ఇప్పుడు శరీరాన్ని, మనస్సును దాటిపోయింది. ఇప్పుడామె ఈ ప్రపంచానికి చెందిన వ్యక్తి కాదు. ఆమె అనంతత్వంలోకి ఎదిగి పోయింది. ఒకప్పుడు 'నేను' అనుకున్నది ఇప్పుడు లేకుండా పోయింది. ఆమె శరీరానికి ఇప్పుడు ఆకారం లేదు. ఆత్మకు ఆధారం లేదు.

ఇంద్రియ సుఖభోగాలను వదలి, ఆలోచనలు సైతం అవసరం లేకుండా చేసుకుని, జ్ఞానం నుండి, అజ్ఞానం నుండి దూరమై, సత్యాసత్యాలకు అతీతంగా మహాచైతన్యంలో ఓలలాడింది. ఆత్మ భావుకతను సైతం దాటిపోయింది. అది మహాచైతన్యానికి తొలిమజిలీ. అక్కడ జీవరాశి లేదు. అస్తిత్వం లేదు. ఆనందం పొందాలన్న ఇచ్ఛా లేదు. సర్వం నిరామయం. అంతా శూన్యం. స్రష్టా స్పష్టంగా

కనిపించే వెలుగు రేఖలు తనవైన గత జన్మల జ్ఞాపికలు. అగోచరం ఇప్పుడు ఆమె కేంద్రబిందువు. ఆ శూన్య గ్రంథంలో చివరి పుటలు మిగిలాయి. అది శూన్యంలోని అవ్యక్తం, అసందిగ్ధ స్థితి. జీవి తాలూకు స్పృహ మాత్రం మిగిలివుంది. ఆ స్పృహ ఒక్కటే తనను శూన్యం నుండి వేరు పరుస్తున్నది. అది బ్రహ్మాన్ని చేరినా ఇంకా బ్రహ్మైక్యం కాలేదు. తను శూన్యానికి చేరువైనా తన నీడ దూరంగానే ఉంది. ఛాయ కరిగిపోనంతవరకు జీవికి స్వస్థితి ఉంటుంది. తను తానుగా జీవించగల స్థితి. అయోమయస్థితి నుండి తిరిగి జీవస్థితికి రావీలున్నది. తాను ఏది సంకల్పిస్తే అది కాగలదు. అగోచరం కాంక్షిస్తే తానుగా ఉండిపోవలసి వస్తుంది. తానే సర్వం కాగలదు. లేక ఆ శూన్యం రూపం దాల్చితే, తాను మళ్లీ మనిషిగా జన్మించ వలసి ఉంటుంది 'శూన్యస్థితి' మాహాత్మ్యాన్ని ఆమె గ్రహించింది. లేక, ఇదే సర్వానికి సమాప్తం కావచ్చు. జీవి నిష్క్రమణ కావచ్చు, లేదా చూపుకు, మనస్సుకు అందని అంధకార మార్గం కావచ్చు. పరమాత్మను చేరుతున్నప్పుడు సూర్యుని రాహువు మ్రింగి చీకటి ముసిరినట్లయింది.

ఇప్పుడు ఆమెలోని జీవుడు శూన్యాన్ని, ప్రశాంతిని చీల్చుకుని వెలుగు కిరణంపై జీవితంలోకి రాగలడు. అది మహాద్భుతంలోని ఒక వెలుగుకిరణం. విశ్వసృష్టికి మూలమైన శుద్ధ చైతన్యం. అది పరమసత్యానికి ప్రత్యక్ష కాంతి దర్పణం. అన్నింటిలోను ఒకే సత్యం భాసిస్తుంది. అదే మనిషి ఆత్మకు ఆత్మతత్వాన్ని, నిజతత్వాన్ని చూపిస్తుంది.

అప్పుడు ఐచ్ఛికంగా బ్రహ్మసాయుజ్యం కోరవచ్చు. అది సృష్టికి, చీకటి వెలుగులకు అతీతమైన స్థితి. ఆపైన అంతా స్వచ్ఛ ధావళ్యమే. అప్పుడది అధి వాస్తవం. అత్యంత దూరం. మార్మిక శూన్యం కొంత దానికి అడ్డుగా ఉంది. అనంత శూన్యంలో గాని అసలు ఆధారం అందదు. లేకుంటే వాస్తవం వాస్తవంగానే కనిపిస్తుంది. నిర్గుణ, నిరాకార చైతన్యమే సర్వసృష్టికి, జగతికి ఆధారం. అజ్ఞాన ప్రపంచాన్ని ఉద్ధరించగలది ఆ చైతన్యమే. ఆత్మను అనంత శాంతిజలాలలో ఓలలాడించగలదీ ఆ చైతన్యమే.

25. త్వమేవాహం

సావిత్రి భౌతిక స్థితికి వచ్చింది. యధారీతి అరణ్యంలో ఆశ్రమజీవితం కొనసాగిస్తున్నది. ఆమె అంతరంగాన్ని, దాని పరిణతిని ఎవరూ గుర్తించలేదు. ఆమె విశిష్టవైఖరిని ఎవరూ శంకించలేదు. ఆమె పలుకు, ప్రవర్తన మామూలుగా ఉన్నా, మానసికంగా ఎంతో మార్పుకు లోనైంది. తన శూన్యాన్ని మహాశక్తిగా మార్చుకోగలుగుతున్నది. ఇప్పుడు సత్యవంతుని సహచరిగా మసలుతున్నా, ఆశ్రమవాసుల మధ్య మనుగడ సాగిస్తున్నా, ఆమె అంతస్తు వేరు, అంతర్స్థితి వేరు. ప్రకృతి, పరమాత్మ నడిపించినట్లు నడుస్తుంది. అనుక్షణం అనంత సీమల్లోకి పయనించి ప్రశాంతిని అందు కుంటుంది.

సత్యవంతుని సరసన కూర్చున్న సావిత్రికి తనది కాని ఒక 'వాణి' వినిపించింది. ప్రాపంచిక మాయ తొలగిపోయింది. అవాస్తవం కరిగిపోయి సత్యం గోచరమైంది. శూన్యం కన్న బలమైనది, శక్తివంతమైనది సత్యం. తన ఆత్మ విశ్వాత్మకు ప్రతినిధి. అదే త్వమేవాహం అనుకోగల స్థితి. ఇప్పుడామెకు లోకమే పరమాత్మ స్వరూపంగా కనిపిస్తున్నది. అన్నీ తానేనన్న అనుభూతి చెందుతోంది. అది ఆత్మ దర్శనం. అంతర్మథనం ఫలితంగా అందుకున్న అమృతభాండం అది.

మహారణ్యం మధ్య చిన్న పర్ణశాల. పగలు వెనుక రేయి. రేయి వెనుక పగలు. జీవితం సాదాగా సాగుతోంది. నిత్యనైమిత్తికాలలో మార్పులేదు. బాహ్యజీవనం ప్రశాంతంగా సాగుతున్నట్లే అనిపిస్తున్నది. పరిసరాలు పూర్వవైభవాన్ని సంతరించుకోసాగాయి. జనాలకు ఆమె మామూలు సావిత్రి వలె తోచింది. వేదమాత తన బిడ్డను హృదయానికి హత్తుకుని, చేతులు బిగించి, సందిట పొదుగుకుంది. ఆ కౌగిలిలో ఆత్మ, శరీరం, ప్రకృతి మాతృ ప్రేమానురాగాలు

తనివి తీరా అనుభవించాయి. ఆ పారవశ్యంలో పరిణామం ఉంది. ఏ మాత్రం మృత్యుభయం లేదు.

ఆమె బాహ్యలక్షణాలు గమనించే వారికి ఆమెలో ఎలాంటి నవ్యత, దివ్యత్వం అగుపించవు. పరమాత్మ ప్రతినిధి అయిన వ్యక్తి మహాపురుషుడైనా కావాలి.... శూన్యహృదయుడైనా కావాలి. అందరి దృష్టికి సావిత్రి ఒక సంపూర్ణ వ్యక్తి, పూర్ణయోగిని. ఆమె ఔన్నత్యం మాధుర్యం ప్రేమతో పరిసరాలను ప్రభావితం చేస్తుంది. అయినా ఆమె తన సావిత్రి. తమకు తెలిసిన సావిత్రే. ఆమె దినచర్యలలో గుర్తించదగిన మార్పు కనిపించలేదు. అందరితో సంభాషిస్తుంది. అన్ని పనులు యథాప్రకారం చేస్తుంది.

విశ్వరూపాన్ని ఆమె దర్శించింది. ఆమె ఆత్మ చుట్టూ పూర్వపు నిశ్చలత్వం, నిర్మలత్వం. అంతరంగంలో మాత్రం శూన్యం, చైతన్యం. ఆ శూన్యంలో 'వాస్తవం' తప్ప మరేమి కనిపించదు. మాటలకు, చేతలకు వెనుక భావం లేదు. శూన్యం అవ్యక్తంగా ఆమెను నడిపిస్తుంది, పలికిస్తుంది. అది ఊహాతీతం, అదృశ్యం, అగోచరం. తన శరీరాన్ని భవిష్యత్తులో జరిగే ఒక మహత్కార్య నిర్వహణకై పోషించుకుంటున్నది. ప్రకృతి ఆమెను బ్రతికించుకుంటున్నది. ఆమె జీవించడం ప్రకృతికి, పరమాత్మకు అవసరం.

ఇప్పుడు ఆమె హృదయం అన్ని ఆత్మలకు ఆలవాలమైన శూన్యం. విశ్వంలో జరిగే అనేక సంఘటనలు గ్రహిస్తుంది. అది పరమాత్మకు సంకేతమైన మహాశూన్యం. జీవుని పూర్ణత్వానికి చిహ్నం. ఆమె మాటలలో, చేష్టలలో పూర్ణత్వం వ్యక్తమవుతుంది. అదే ఆమె సౌందర్యం, ప్రాణం. అసలు సిసలు మార్మికత సావిత్రి రూపుదాల్చింది. ఆమె అంతరంగంలో 'ప్రత్యగాత్మ'. పరమాత్మ ప్రజ్ఞ తనలో కలిగినపుడు భౌతిక ప్రజ్ఞ కోల్పోతుంది. అహంకారం వదలిపెట్టిన శరీరం నిరుపయోగం అనిపిస్తుంది. నిస్తేజంగా ఉంటుంది. అనంతసాగర తరంగాలపై పరుగులు తీస్తుంది. స్వప్న రాగలీన అయిన సావిత్రికి సగం జీవితం ప్రజ్ఞ, సగం జీవితం వాస్తవం అయింది.

అంతర్దృష్టికి భవిష్యత్తు కనిపిస్తుంది. అది ఆత్మ అప్రయత్నంగా గ్రహించే విషయం. ఇప్పటికీ అది అనివార్యమే అనిపిస్తుంది. వ్యక్తి మరణించినా సృష్టి కొనసాగుతుంది. భౌతికత్వం సమసిపోగా అతీంద్రియత్వం మిథ్య అవుతుంది. అప్పుడు భగవంతుని అవసరం కనిపించదు. అవతార ప్రయోజనం కనిపించదు.

అంతా నిర్వ్యాపారం. ఒకప్పటి వాస్తవం ఛాయగా మిగిలిపోతుంది. 'జీవి'గా ఉన్నంతకాలం సృష్టించాలన్న కోరిక ఉంటుంది. అది సృష్టి రహస్యం. ఆమె తిరిగి తనదైన నిర్మల, నిశ్చల స్థితిని పొందింది.

మహాశూన్యంలో అంతా పూర్తిగా లయం కాదు. జీవం సంపూర్ణంగా శూన్యంలో కరిగిపోదు. అది ఎవరికీ అర్థంకాని పరమరహస్యం. ఆమె సత్యవంతుని సరసన ఒంటరిగా ఉన్నప్పుడు ఆమె మనస్సు అతని మనస్సుతో ఏకమవుతుంది. చీకటిలో ఉన్నప్పుడు, హృదయం చీకటిమయం అయినప్పుడు సత్యం తెలుస్తుంది. సత్యం వాస్తవానికి భిన్నం. సత్యం హృదయంలో నిగూఢంగా దాగి ఉంటుంది. ఆలోచన చేర్చగల శిఖరాన్ని చేరుకుంటుంది. అక్కడ నుండి తన వేదన గుర్తిస్తుంది. వేదన మనిషి ఆర్తిని గమనిస్తుంది, కానీ సమాధానపడదు.

అవ్యక్త సందేశాలు ఆత్మశిఖరాల నుండి దిగి వస్తుంటాయి. వాటిని మనిషి అందుకోడు. వాటి వెలుగులు లోకాన్ని తాకవు. ఆమె మనస్సు నిర్మలం. నిర్మలమైన మనస్సు మాత్రమే సత్యాన్ని స్వీకరిస్తుంది. సత్యాన్ని ప్రవచిస్తుంది. అవి అగ్నులు కల్పించుకున్న ఆకృతులు. ఒక్క మాట చాలు ప్రజ్ఞా హృదయం స్పందించడానికి. ఒక్క ప్రజ్ఞ చాలు మనిషి పెదవులు అమృత వాక్కులు చిందించడానికి.

ఆశ్రమాలలో, తపోనిధుల సమక్షంలో ఆమె ప్రవచనాలు, ఉపనిషద్వచనా లవుతున్నాయి. అవి మానవ వివేకానికి, ప్రజ్ఞకు అతీతమైనవి. అవి అత్యంత నిగూఢం, మార్మికం, అసామాన్యం. ఆమె శరీరం, మనస్సు మార్మికతకు నెలవు. ఆమె నోటి నుండి వెలువడే మాటలు పరమసత్యా లవుతున్నాయి. ఆమె నుండి విజ్ఞాన వీచికలు వెల్లువలై ప్రవహిస్తున్నాయి. ఆమె జ్ఞానం అందరినీ అబ్బుర పరుస్తుంది. ఎంతో సాధనతో గానీ గ్రహించ వీలులేని పరమసత్యాలను ఆమె నుండి పొందుతున్నారు.

ఆ భావాలు ఆమె మనస్సు సృష్టించినవి కావు. ఆమె శూన్యహృదయంలోని నిస్తంత్రీ విపంచి పలికిస్తున్న శబ్దాలివి. ఆమె నుండి ఒక మహాతేజస్సు ఉద్భవించింది. జీవుని జ్ఞానశిఖరాల పైన ద్వంద్వశక్తులుంటాయి. అవి అదృశ్యంగా పనిచేస్తుంటాయి. ఆమె శూన్యస్థితిలో వాటిని తెలుసుకుంటుంది. ప్రకృతి తన ధర్మాలనే సమర్థిస్తుంది. మానవ శరీరాన్ని, మనస్సును తన ప్రయోజనాలకై ఉపయోగించుకుని, పని తీరిన తర్వాత మనిషిని నిరుపయోగం చేసి మృత్యువు ఒడిలోకి విసిరివేస్తుంది, లేదా శూన్యంలో లయింపచేస్తుంది.

శూన్యంలో దాగివున్న మార్మికత మనిషి ఆలోచనను ఆధ్యాత్మికతత్వంతో జత చేస్తుంది. మౌన సంభాషణ అద్భుతం. ఆత్మ సంభాషణ అంతకంటే మహాద్భుతం. ఆమె తన ఆత్మ సామ్రాజ్యంలో ప్రశాంతంగా ఉండి రోదసీ శూన్యం నుండి వెలువడే భావాలను గ్రహిస్తుంది. వాటిని సత్యాలుగా ప్రవచిస్తుంది. అవి మనస్సులో నిలబడవు. ఆత్మ సైతం వాటిని నిలవరించలేదు. అవి ప్రజ్ఞా తరంగాలుగా ప్రపంచవ్యాప్తం కావడానికే వ్యక్తమవుతుంటాయి. శూన్యంగా వున్న ప్రతి తావుకు అంతరంగతరంగాలు పయనిస్తాయి. నిరామయమైన ప్రతిజీవి వాటికి కేంద్రమే. శరీరం అడ్డుకాదు. మనస్సు అడ్డుకోదు. అది కేంద్ర బిందువుపైని వర్తులం. అన్ని హద్దులను అతిక్రమిస్తుంది. అనంతం వరకు పయనిస్తుంది. భావతరంగాలు ఎప్పటికీ తరిగిపోవు. శూన్యంలో సైతం కరిగిపోవు.

జీవుని స్వక్షేత్రం అనంతాకాశంలోని అఖండ శూన్యం. ఆ జీవక్షేత్రానికి హద్దులు, సరిహద్దులు ఉండవు. దానికి రూపం, ఆకారం ఉండవు. భూమ్యాకాశాలు, భావాలు ఏవీ అడ్డు కావు. అది నిర్మల ప్రశాంతిలో అపరిమితంగా విస్తరిస్తుంది. జీవి తనను గమనిస్తూ, లోకాన్ని గమనిస్తుంది. అక్కడ మనిషి ఉండడు. మేధ ఉండదు. అనుభవాలు, అనుభూతులు ఉండవు. సంఘటనలకు అవకాశం లేదు. ఉద్రేకాలు, ఉన్మాదాలు, ప్రమోదాలు, ప్రమాదాలు ఏవీ ఉండవు. అంతర్లోకంలో చలనం ఉండదు. సంచలనం ఉండదు. అంతా నిర్మలం, అంతా నిరామయం. ఆ స్థితి కోసమే పరమాత్మ ఎదురుచూపు ... ప్రతీక్షణ.

సొమ్మసిల్లిన సత్యవంతుని ప్రక్కన కూర్చుని ఉన్నా, ఆమె అంతరంగంలో మథనం సాగుతోంది. ఆమె మనస్సు జాగృతంగానే వుంది. అగాధం వంటి నిశీధం ఆమెను పరివేష్టించి ఆమెను పలకరిస్తోంది. హృదయవాణి పదేపదే ఆమెను పలకరించ యత్నిస్తోంది. అది ఆమె వాణి కాదు. అంతర్వాణి కాదు. ఏదో భావవాణి. పరిణత భావ విపంచి. ఆ వాణీ నిస్వనానికి బాహ్యం, అంతరం పులకించి నట్లయింది. గతం వర్తమానంలో కలసిపోయింది. సకల జీవరాశి ఒక్కరూపుగా తోచింది. అవాస్తవ ప్రపంచం పూర్తిగా అంతరించిపోయింది. మానస కల్పితం ఏదీ లేదక్కడ. దానికి రూపం, ఆకారం, సంకేతం ఏవీ ఉండవు.

ఒక జీవం, ఒక ఆత్మ సకల సృష్టిని దర్శించగలదు. తానే అసంఖ్యాక రూపాలుగా మారగలదు. జీవం తాను చూచింది, తానైనది, తను కాగలది, అన్నీ అంతా ఒక మహత్తర సత్యానికి ప్రత్యక్ష నిదర్శనం. సత్యం అసత్యం కావడానికి వీలులేదు. అది సజీవం, అది చైతన్యం. అది సత్యం, నిత్యం అయినది. అక్కడ అవాస్తవానికి ఆస్కారం లేదు. అవాస్తవిక భావన ఎప్పుడో లయించి

పోయింది. అక్కడ విస్తరించిన చైతన్యం అనంత నిర్మితం. అంతా బ్రహ్మపదార్థం. అది తిరిగి శూన్యంగా మారదు. అది తనలో నుండి విశ్వాన్ని ఒక సంకల్పంతో స్వాప్నికంగా రూపొందిస్తుంది. తిరిగి ఆ విశ్వాన్ని శూన్యంలోనే లయింప చేస్తుంది. సృష్టించ బడినదేదీ అవ్యక్తం కాదు. అవాస్తవం కానేరదు. అవాస్తవ శూన్యంలో అనంతంగా వ్యాపించిన శూన్యం అది. అనుభవం ఆత్మకు అందుతుంది. ఆత్మ అనుభవానికి చేరువవుతుంది. ఒకటి మరొకటి కాదు.

అది ఆమె ఆత్మ. అందరి ఆత్మ ఒకటే. అస్తిత్వం పొందిన వాస్తవిక సత్యం. సకల జీవరాశికి ఆటపట్టయిన చైతన్యం అది. అదే కాలం.... కాల రహితం.... కాలాతీతం. చూచేది, చూడబడేది అదే. రూప, అరూప స్థితులలోని సచ్చిదానందం అదే. అదే ప్రేమకు పరాకాష్ట. అదే పరిష్వంగ పారవశ్యం. అది మేధలోని భావం, లోచనం. బ్రహ్మానంద శిఖరాగ్రాన నెలకొన్న ఆనందం అది.

ఆమె కాలాన్ని అధిగమించి, అనంతత్వాన్ని చేరుకుంది. పరిమితి నుండి జారి అపరిమితాన్ని చేరుకుంది. ఆమె ఆత్మ అందని శిఖరాలకు ఎగబ్రాకింది. జీవియాత్రకు ఆది, అంతం ఉండవు. అది అగాధాలలోకి చొచ్చుకుని పోతుంది. నిశ్శబ్ద మార్మికతకు అంతం లేదు. ఒకే ఒక్క హృదయంలో విశ్వం యావత్తూ ఇమిడిపోగలదు. అయినా సృష్టిలో అనేకత్వం ఎక్కువ. అనేకత్వంలో ఏకత్వ సాధన జీవి పరమగమ్యం.

ఆత్మ విశ్వవాప్తం, అగణితం, అపరిమితం. అది శిఖరాలను అధిగమిస్తుంది. అఖాతాలను చూస్తుంది. అనంతకాలంలో జీవిస్తుంది, పయనిస్తుంది. అయినా మృత్యువును భరిస్తూ కాలచక్రంలో తిరుగుతుంది. ఆత్మలో అన్ని వైరుధ్యాలు సమసిపోయి సత్యాలుగా భాసిస్తాయి. ఆత్మ పరిణామాన్ని, పరిమాణాన్ని, పరిస్థితిని అధిగమిస్తుంది. ఒకజీవి విశ్వాత్మతో తాదాత్మ్యం చెంది, పరిణామంలో పాలు పంచుకొని, విశ్వపురుషుని రహస్యాన్ని పరిరక్షిస్తుంది. సృష్టికి కర్త తానే అవుతుంది.

మనస్సు ఒకేసారి అనేక కోణాలలో తనను తాను చూచుకుని పరిణామాన్ని అనుశీలిస్తుంది. జీవితం నాటకం, విశాల జగత్తు నాటకరంగం. విశ్వమే శరీరం, భగవంతుడు ఆత్మ. సమస్త సృష్టి ఒకే ఒక్క సత్యానికి అనేక రూపాలు. ఒకే ఒక్క వాస్తవానికి భిన్న స్వరూపాలు. ఆమె ఆత్మదృష్టికి ప్రపంచం సజీవదైవం. అంతా పారమార్మికమే. అదే ఆత్మ సత్యం. తన ఆత్మ సత్యాన్వేషణ చేస్తుంది. సమస్త విశ్వం తానే అయినా, ఆత్మ 'సత్యం' కొరకు ఈ విశ్వంలోనే అన్వేషిస్తుంది. ఆమె సత్యాన్వేషణలో కాలాన్ని దాటి వెళ్లింది.

ప్రకృతి సంఘటనలన్నీ ఆమె అనుభవాలే. సృష్టిలోని స్పందనలు సైతం ఆమెవే. సకల జీవులను ఆమె సంభావిస్తుంది. అన్నింటినీ అనుభూతిస్తుంది. విశ్వాన్ని తానై పూర్తిగా ఆక్రమిస్తుంది. రోదసీ తీరాలు ఆమెకు హద్దులు. విశ్వజీవనం ఆమె స్వీయజీవనం. ఆమె మేధకు విశ్వమేధతో సారూప్యం ఉంది. తన రూపానికి విశ్వం బృహత్తర రూపమే. అందులో తాను జీవిస్తూ తానే 'తత్' గా మారుతుంది. 'తత్త్వమసి' అనుకుంటుంది. విశ్వంలోని అనేక రూపాలలో తనదీ ఒక రూపం. తాను ఒంటరి అయినా అన్నీ భరిస్తుంది. విశ్వంలో ఎక్కడైనా సంచరించగలదు. అందరి ఆలోచనల్ని తాను గ్రహించగలదు. అందరి భావాలతో ఆమెకు అనుబంధం ఏర్పడ్డది. అందరి శరీరాలు తన శరీరం వంటివే. తను తాను కాదు, విశ్వం అంతా తానే. దిగంతాల నుండి సర్వవిజ్ఞానం, విశ్వప్రజ్ఞ ఆమెను చేరుతుంది. తానే తిరిగి అనంతంలోకి, దిగంతాలలోకి వ్యాపిస్తుంది.

అనంతత్వం ఆమె నిజ నివాసం. తాను ఒక్కచోట ఉన్నా తన ఆత్మ అన్ని తావుల సంచరిస్తుంది. తారకలు సైతం ఆమె చుట్టూ పరిభ్రమిస్తుంటాయి. ఆమె ఉన్నది భూమిపైన అయినా, అన్ని భువనాలలో సంచరిస్తుంది. పరలోకాలు, దివ్యజ్ఞాన లోకాలు అన్నీ తనవే. ఆమెలో విశ్వం పునర్వికాసం చెందింది. ప్రకృతిలోని కృతులన్నీ ఆమె ప్రతికృతులే. అందరి ఆత్మ తానే అయి, ఏకాత్మ అవుతుంది. అందరిలో ఉన్నది తనే, అన్నీ తనలోనే ఉన్నాయి.

ఆ తాదాత్మ్యస్థితి తొలిసారిగా కలిగింది ఆమెకు. ఆ భావనతో తనను తాను మరిచిపోయి, అభావమైంది. తానుగా కనిపించేది సర్వానికి, సత్యానికి ప్రతిరూపం. చెట్లలో, ఆకులలో, పూలలో ఉన్న చైతన్యం తాను. పూలలో దాగిన మకరంద మాధుర్యం తాను. సౌందర్యం, సౌకుమార్యం తాను. వలపులు పరిమళించే ప్రేమకుసుమం తాను. సరోవరంలో వికసించే అరవిందం తాను.

ఉపచేతన నుండి ఆమె మానసిక స్థాయికి చేరుకుంది. విశ్వ హృదయంలోని ప్రేమానురాగం తానైంది. మానవ హృదయంలో దాగి ఉన్న దివ్యత్వం తానైంది. ఆత్మ పరమాత్మను చేరడానికి తొలి సోపానం తానైంది.

తనలోనే సృష్టి వికసిస్తుంది. తానే సృష్టికి ఆధారం. కాలం తనే. కాలగతికాలైన స్వప్నాలు తనే. తానే పృథ్వి. సృష్టిని నడిపించే కాలం తానే.

ఆ స్థితుల్ని దాటి, కాలాన్ని దూరాన్ని అతిక్రమించింది. మహాప్రజ్ఞ ఆమెకు సహజాలంకారమైంది. అనంతత్వం ఆమెకు అనుక్షణ నీరాజనమైంది. అమరత్వం ఆమె నుండి కాలంలోకి తొంగిచూచింది.

26. మృత్యువు

"అది సత్యవంతుడు మరణించవలసిన రోజు" – మహోదయం తొలి అధ్యాయంలోని చివరి వాక్యం. సావిత్రి *49* అధ్యాయాలు కాగా *38* అధ్యాయాలలో యోగమీమాంస జరుగుతుంది. కథ పలచగా, తెరచాటుగా కనిపిస్తుంది.

మహాదుర్గను అర్చించిన సావిత్రి అత్తగారి దగ్గరకు వెళ్ళి సత్యవంతునితో కలసి అరణ్యానికి వెళ్ళడానికి అనుమతి కోరింది. పెళ్ళయి పన్నెండు నెలలైనా ఎన్నడూ అలాంటి కోరిక కోరలేదు. నేడు సత్యవంతునితో కలిసి సహ చరించడంలోని ఆంతర్యం అరణ్య శోభలు అనుభవించాలని కాదు... అతనికి రానున్న ఉపద్రవం తెలిసి. సత్యవంతుడు అరణ్యంలో తనకు పరిచయమైన ప్రదేశాలన్నీ సావిత్రికి చూపించాడు.

తన ప్రియబాంధవి ప్రక్కన ఉందన్న సంతోషంతో సత్యవంతుడు చెట్లు నరకసాగాడు. అతని తీవ్రతను గమనిస్తే మృత్యువునే గొడ్డలితో నరికి వేస్తున్నాడా అనిపించింది. కాని అంతలో సత్యవంతుడు అలసిపోయాడు. శక్తి హీనుడైనాడు. చేతిలో గొడ్డలి జారిపోయింది. కుప్పకూలిపోయాడు. అతనిని తనలోకి తన ఒడిలోకి తీసుకుని ఉపచరించసాగింది. స్పృహ కోల్పోయిన సత్యవంతుని ముఖంలో జీవకళ తగ్గసాగింది. శరీరం గట్టిపడుతున్నది. అతను మృత్యువు కౌగిలిలోకి వెళ్ళిపోయాడు.

నారద మహర్షి పెట్టిన గడువు చివరిరోజు అది. ఇంతవరకు అశ్వపతి యోగం, సావిత్రి అనుభవాలు, నారదుని విశ్లేషణ... ఇలా యోగ విషయాలే ముచ్చటించడం జరిగింది. మృత్యువు రాకతో అసలు కథ మొదలైంది. సావిత్రి మృత్యువును ఢీకొనడమే కథన కుతూహలం. కథ కందని కదనరంగం ఇది.

మళ్లీ తెల్లవారింది. సూర్యుని బంగారుకిరణాలు జగతిని మేల్కొల్పాయి. ప్రాణవిభుని ప్రక్కన పడుకున్న సావిత్రి దిగ్గున లేచింది. గతం స్ఫురణకు వచ్చింది. ఆ గతం కళ్లకు కట్టింది.

గతంలో సత్యవంతుడు అందరిలా సుఖాలు అనుభవించాడు. ఇప్పుడు అంధకారంలోకి పయనించనున్నాడు. గతం ఆమె స్మృతిసీమలలో మెదిలింది. ఒక్క సంవత్సరకాలంలో జరిగిన సంఘటనలన్నీ మననం చేసుకున్నది. లేచి నిత్యకృత్యాలు నిర్వర్తించి అరణ్యంలో సత్యవంతుడు నిర్మించుకున్న దుర్గాలయాన్ని దర్శించి, దుర్గామాతను అర్చించింది. తన ఆత్మగత మేధోమాతకు తెలుసు. తన విన్నపాలు తెలుసు. ఆ నిర్జనారణ్యంలో జగన్మాతమూర్తి అయిన దుర్గాదేవి తన బిడ్డను గమనిస్తూనే ఉంది. ఆమె మూగబాధ అమ్మ గ్రహించలేదా!

సావిత్రి దైన్యమూర్తి అయిన మహారాణిని సమీపించి, నిర్మల వదనంతో విడీవిడని పెదవులు కదిలించింది. ఆమె చూపులో భావం, పెదవి విప్పకపోయినా వినిపిస్తుంది. అది తల్లిగుండెను తాకి కలవర పరచింది. జీవితంలో సర్వం కోల్పోయినా జీవించాలన్న ఆశ చావదు. రానున్న ఉపద్రవానికి అది తొలి హెచ్చరిక. అవసరమైన మేరకే మాటలు వెలువడ్డాయి. మిగిలిన మాటల్ని గుండె బరువెక్కి బయటకు రానీయలేదు. పైకి మాత్రం మాటలలో నిబ్బరం, ప్రశాంతత కనిపించింది.

"సంవత్సర కాలంగా సత్యవంతునితో కలిసి జీవిస్తున్నా, సహజీవనం చేస్తున్నా, అరణ్య శోభలను పర్వతసానువుల సొగసుల్ని చూచింది లేదు. ఆ ప్రశాంత నిశ్శబ్దాలను అనుభవించిందీ లేదు. ఆ రహస్యాలను తెలుసుకోవాలన్న వాంఛ తీరలేదు. మన ఆశ్రమ పరిసరాలే ఇంతకాలం నా చిన్న ప్రపంచం అయింది. ఇప్పుడు నా హృదయం ఆరాటపడుతున్నది. అనుభవాల కోసం తొందరచేస్తున్నది. సత్యవంతునితో చేయిచేయి కలిపి, అరణ్యాలకు వెళ్లాలని, అక్కడ పక్షుల కలకూజితాలు వినాలని, ప్రతికొమ్మను, ప్రతిరెమ్మను పలకరించాలని, ఆకుల కదలికలోని అందాలను ఆస్వాదించాలని కోరికగా ఉంది. నాకు విముక్తి కలిగించండి. నా హృదయాన్ని స్వేచ్ఛగా విహరించనీయండి".

ఆమె అన్నది: "అమ్మా, సావిత్రీ! నీ వివేకమే నీకు మార్గం చూపిస్తుంది. నీవు కోరినట్లే కానివ్వు, నీ అమాయక ప్రశాంత నేత్రాలు నిన్ను నడిపిస్తాయి. మా దుర్భర జీవితాలపై వెలుగులు కురిపించడానికి వచ్చిన దేవతవు నీవు. నీవు వినయంగా మాకు సేవలు చేసినా, మేము అందుకోలేనంతటి ఔన్నత్యం నీది. లోకానికి వెలుగునిస్తున్న సవిత్రుని వంటి దానివి నీవు".

విధివాత పడనున్న భర్త అతను. ఆ రహస్యం తెలిసిన ఇల్లాలు ఆమె. చేయిచేయి కలిపి అరణ్యాలలో ప్రవేశించారు. అంద చందాలు, అవ్యక్త స్వప్నాలు, మార్మిక నిశ్శబ్దాలు అనుభవించారు. పరమాత్మతో అనుసంధానమైన అనుభూతి వారిది. ప్రక్కన నడుస్తున్న సత్యవంతుని లోని ఆనందం అపూర్వం, వర్ణనాతీతం. ఆమె తన కిష్టమైన వనాలలో సంచరిస్తున్నది. అతనామెకు అరణ్యశోభల్ని పరిచయం చేశాడు. సుమ సౌరభాలు, కుసుమ పరాగాలు రుచి చూపించాడు. తరులతా గుల్మాలను ఎరుక పరచాడు. కొమ్మకొమ్మన వాలే శాబకాల శ్రుతి, లయ స్వరాలను పరిచయం చేశాడు. సుందర ప్రకృతి మనసుల్ని రంజింపచేసింది.

సత్యవంతుడు తన చిన్ననాటి విషయాలు ముచ్చటించాడు. చిన్ననాటి నేస్తాల గురించి, సహచరుల గురించి వివరించాడు. అరణ్యంలో ప్రతి చెట్టు, ప్రతి తావు తనకు పరిచయమైనవే. వాటి రహస్యం సామాన్యమేధకు తెలియదు. తాను అనుభవించిన ప్రతిదానికీ అర్థం ఉంది. వాటి ప్రతి కదలికకు తాను స్పందించగలడు. అతని మాటల్ని ఆర్తిగా విన్నది. కాని ఆ మాటల మాధుర్యం, మార్దవం ఎక్కువ కాలం నిలవదని ఆమెకు తెలుసు. ఆ అనుభూతిని తనలోనే భద్రంగా దాచుకున్నది. తను ఏకాంతంగా మిగిలినప్పుడు ఆ జ్ఞాపకాలు తనకు ఉపశమనం కలిగించవచ్చు. ఇప్పుడు ఆమె వాటి అర్థాల కోసం వెదకడం లేదు. జీవితానికి మృత్యువు చరమాధ్యాయం. తన ప్రేమకు ఎన్ని శరాఘాతాలు. అడుగడుగునా బాధలతో విలవిల్లాడిపోయింది.

"ఇక సత్యవంతుని స్వరం శాశ్వతంగా వినిపించదు" అనుకున్నది. గుండెలో విషాదాన్ని అదిమిపట్టింది. భయంకర మృత్యుదేవతను చూచినట్లు కళ్లలో కలవరం. ఆ రోజు పగలు, రేయి తామిరువురూ అరణ్యంలోనే ఉండిపోవాలనుకున్నాడు సత్యవంతుడు. అరణ్యహృదయంలో తమ హృదయతంత్రుల్ని జత కలపాలను కున్నాడు. ఆ రాత్రి ఆకాశం క్రింద, హాయిగా ఆమె కౌగిలిలో కరిగిపోదామను కున్నాడు.

అతనికి ఎంత దగ్గరగా ఉన్నా ఆ శరీరం తనకు దక్కదని సావిత్రి గ్రహించింది. అతని శరీరం సుఖాన్నివ్వదు. ఆనందం కలిగించదు. అనుభూతి రగిలించదు. ఆ సుఖాలను తాను వదలుకోలేదు. అతని జీవితం గంటలు కాదు... నిముషాలలో ముగుస్తుంది. లోభి తన అర్జిత సంపదను లెక్కించినట్లు, వ్యాపారి తన సంపాదనను విశ్లేషించుకున్నట్లు, ఆమె తమ అనుభవాలను, అనుభూతుల్ని, సుఖాలను భద్రంగా మననం చేసుకోసాగింది.

సత్యవంతుడు లేచి నూతనోత్సాహంతో గొడ్డలి పైకెత్తాడు. ఏవో గీతాలు ఆలపించాడు. ఆ పాటల మాధుర్యానికి మృత్యువు మైమరచి పారిపోవచ్చు. సత్యను క్షమించి వదలివేయవచ్చు. ఎన్నోసార్లు ఆమె ప్రేమగా చెప్పిన మాటల్ని తాను ఎగతాళి చేశాడు. ఆమె ఆడపులి వలె అతని మాటల్ని తన కడుపులో దాచుకుని నిబ్బరంగా మెలిగింది. అతను శ్రమిస్తుండగా మృత్యువు సమీపించింది.

శరీరం ఒక్కసారిగా కంపించింది. నిలువెల్లా వణికింది. నరనరాన నీరసం, బాధ.... ఆ బాధ ఆపాదమస్తకం పరచుకున్నది. నెమ్మదిగా జీవనతంత్రుల్ని ఛేదించసాగింది. ఆమె చేయూతనివ్వగా లేచి నిలబడ్డాడు. నోటికి చిక్కిన వేట తప్పించుకు పోయినప్పుడు అడవి జంతువు ఆక్రోశం అతనిది. ఈ సారి గొడ్డలి పట్టినా, ఆ పట్టులో గట్టిదనం లేదు. బలం లేదు. కాలకింకరుని చేత చిక్కిన అతని శక్తి క్షీణించసాగింది. గొడ్డలి చేజారి దూరంగా పడ్డది. ఆమె ఆత్రంగా వచ్చి సత్యవంతుని పట్టుకుంది.

"సావిత్రీ, నా గుండె పగిలి, ముక్కలై పోతున్నది. నా గొడ్డలి దెబ్బ చెట్టును కాదు, నన్నే తాకింది" అని విలపించసాగాడు.

"నేను అనుభవిస్తున్న బాధ అ తరుశాఖకు తెలుసు. అది నేల కూలినప్పుడు ప్రాణం విలవిలలాడి ఉంటుంది. నన్ను కొంచెం నీ ఒడిలో విశ్రమించనీ దేవీ! ఈ దుర్విధి నుండి నన్ను రక్షించు, నీ స్పర్శతో మృత్యువు పారిపోవచ్చు".

సావిత్రి శీతల తరుచ్ఛాయలో కూర్చున్నది. అది సత్యవంతుని గొడ్డలి వేటు తిన్న చెట్టు కాదు. ఆ చెట్టుకు ఆమె దూరంగా వచ్చింది. ఒక మర్రినీడన సత్యవంతుని తన ఒడిలో చేర్చుకున్నది. అతని శరీరాన్ని స్పృశిస్తూ, మృత్యువు సమీపించకుండా రక్షించసాగింది. ఆమెలో ఇప్పుడు భయం, విషాదం లేవు. అద్భుతమైన గుండె నిబ్బరం, మనస్సులో ప్రశాంతి, అతని బాధను ఉపశమింప చేయాలన్న ఏకైక వాంఛ. అతనిని ఎలాగైనా బాధా విముక్తుణ్ని చేయాలన్న ఆరాటం. ఆమె నిశ్చలంగా, ధైర్యంగా, దేవతామూర్తి వలె ఉంది.

అతనిలో జీవకళ క్రమంగా క్షీణించసాగింది. అతని కళ్ళు కాంతిని కోల్పోతున్నాయి. తాను మోజుపడిన తేజస్సు అతనిని వదలిపోతున్నది. కేవలం భౌతిక శరీరంగా నిర్జీవంగా మిగిలింది. ఆత్మ సంబంధమైన తేజస్సు తగ్గిపోయింది. అది చివరిసారిగా పోయే ముందు సత్యవంతుడు బాధగా మూలిగాడు.

"సావిత్రీ, నా సావిత్రీ, నా ఆత్మా, చచ్చిపోతున్న నాకు ఒక్క ముద్దివ్వు"

ఆమె పెదవులు అతని పెదవుల్ని ముద్దాడాయి. ఆ ముద్దులో వేడి లేదు. జీవం లేదు. తపన లేదు. ఆ ముద్దు మధురిమను పంచి యివ్వలేదు. స్పందించలేదు. ఆమె బంగారు చేతులతో అతని చెక్కిలి నిమిరింది. ఎండిపోతున్న పెదవుల్ని ముద్దాడుతూనే ఉంది. కాని ఆ పెదవులపై తడి లేదు. తన ముద్దులతో పోతున్న ప్రాణం తిరిగి రప్పించాలన్న కోరిక, ఆత్రుత. అప్పుడు గ్రహించింది అక్కడ ఉన్నది తాము ఇద్దరు మాత్రమే కాదని, అక్కడ కనిపించని చైతన్యం మరేదో కదలాడింది. తన ప్రక్కన ఎవరో కదులుతున్న అనుభూతి ఏర్పడ్డది. అది అపరాహ్నం అయినా చిమ్మచీకట్లు ముసురుకున్నాయి. వాతావరణంలో భయంకర నిశ్శబ్దం తాండవిస్తున్నది. పక్షులు, జంతువులు అరవడం మానివేశాయి. ఒక భయం, ఒక వేదన అరణ్యాన్ని ఆక్రమించింది. ఒక మహామార్మిక చైతన్యం ఒక్కచోట పోగుపడినట్లయింది.

విశ్వమేధ లోకాన్ని వీక్షిస్తుంది. ఆ చూపుల్ని భరించడం కష్టం. దాని దృష్టిలో సృష్టి అంతా ఒకటే. ప్రకృతి ఆనందాలన్నీ దయనీయ స్వప్నాలే. అన్ని సుఖాలను, ఆనందాలను విరక్తి దూరం చేస్తుంది. కనిపించేది ఏదీ వాస్తవం కాదన్న పరమసత్యాన్ని మహత్తర సందేశంగా వైరాగ్యం అందిస్తుంది. మనం శాశ్వతం అనుకునే జీవితం ఎప్పుడూ అశాశ్వతమే. విశ్రాంతి, విరామం లేకుండా కాలం సాగిపోతుంది.

నిర్గుణం, నిరాకారం అయినది ఏదో నిశ్శబ్దం లోకి నిష్క్రమిస్తుంది. అది కాలాన్ని, ధర్మాన్ని, ఆలోచనను దాటిపోయి, జ్ఞాపకాలను దాచిపెడుతుంది.... అదే శాశ్వతత్వానికి నకలు.

సావిత్రికి తెలుస్తోంది మృత్యువు తన ప్రక్కనే ఉందని – సత్యవంతుడు ఆమె కౌగిలి నుండి, ఆమె పట్టునుండి జారి, నేలకు వొరిగాడు.

27. మహాశూన్యం

మహారణ్యం మధ్యలో సావిత్రి ఒంటరిగా సత్యవంతుని తల ఒడిలో పెట్టుకుని సామాన్య స్త్రీ వలె కొంతసేపు రోదించింది. అంతలో ఒక తేజస్సు ఆమెలో జొరబడినట్లు వివేకం తట్టి లేపింది. ఆమె సహస్రారకేంద్రంలో స్పందన కలిగింది. తనలో సహస్రదళ పద్మం వికసించినట్టయింది. కుండలినీ శక్తి సహస్రారాన్ని చేరింది. మృత్యువును ధిక్కరించగల సాహసం కలిగింది. తన ప్రక్కనే మృత్యువును భర్త శరీరాన్ని చూచింది.

సత్యవంతుని మృతదేహానికి అటుగా యముడు, ఇటు సావిత్రి. అటు మృత్యువు, ఇటు స్త్రీ శక్తి. సత్యవంతుని ఆత్మశక్తితో బంధించి ఉంచడం అసంభవ మనుకుంది. సత్యవంతుని శరీరానికి దూరంగా జరిగింది. యముడు సత్యవంతుని ప్రాణం హరించదానికి వంగాడు. సావిత్రి తన యావచ్ఛక్తిని కూడదీసుకుంది. సత్యవంతుని భౌతిక శరీరం అక్కడే ఉంది. అందులో నుండి మరొక తేజశ్శరీరం పైకి లేచింది. అది ప్రాణ శరీరం. అది యమునికి, సావిత్రికి మధ్యన నిలిచింది. ఎటు వెళ్లాలి? యముని వెంటనా, సావిత్రి వెంటనా! ఎవరో బలంగా త్రోసినట్లు సత్యవంతుని ప్రాణ శరీరం ముందుకు కదిలింది. దాని వెనుక యముడు. అతని వెనుక సావిత్రి. మాటా పలుకూ లేకుండా ముగ్గురు కదిలారు. సావిత్రి సత్యవంతుని వెంటబడి నడిచింది. భయంకర శూన్యాలలోకి నడిచింది.

కొంతసేపు భౌతిక భావాలు ఆమెను వదలలేదు. భూ లోకపు సరిహద్దులు చేరారు. ఆపైన మృత్యువు, సత్యవంతుని ప్రాణశరీరం తనకు కనిపించకుండా పోయాయి. ఆమె ఆత్మ శరీరంతో పయనించసాగింది. మృత్యువు వెనుతిరిగి చూచింది. తమ వెంట సావిత్రి ఆత్మ శరీరిగా వస్తున్నది. "పై లోకాలలో ప్రవేశం నిషిద్ధం" అని మృత్యువు హెచ్చరించింది. సావిత్రి యముని హెచ్చరికను లక్ష్యపెట్టలేదు.

మహారణ్యం మధ్యన సావిత్రి ఒంటరిగా మిగిలింది. చుట్టూ అంధకారం. శూన్యమైన ఆమె మనసు నిండా సత్యవంతుని స్మృతులు. తన నష్టం గురించిన ఆలోచన లేదు. విచారం లేదు. కరడుగట్టిన వేదనను కన్నీటితో కడగలేదు. మృత్యుదేవతను సైతం నిందించ దలచలేదు. తాను ప్రేమించిన సత్యవంతుని శరీరం ప్రక్కన కొంతసేపు నిశ్చలంగా ఉన్నది. సావిత్రి సత్యవంతునితో సహగమనం చేసిందా అన్న భ్రమ కలిగింది. అంతలో ఆమెలో స్పందన. చైతన్యం మానవత్వం కదలాడాయి. ప్రాణం పోయినా సత్యవంతునిలో ఇంకా ఏదో ఉన్న దనిపించి ఒకసారి గుండెకు హత్తుకున్నది. తమ ఏకత్వాన్ని రక్షించుకోవాలని, అతని ఆత్మను ఇంకా ఆ శరీరంలో పట్టి ఉంచాలని ప్రయత్నం.

అకస్మాత్తుగా ఆమెలో చైతన్యం కలిగింది. అది అందరిలో ఎప్పుడో కలుగుతుంది. ఆ క్షణంలోనే మానవాత్మ తన ఔన్నత్యాన్ని గుర్తిస్తుంది. తనకు మూలమైన తేజస్సును చూస్తుంది. అది 'మాయ' అనుకోగానే ఆ తేజస్సు మన నుండి అస్తమిస్తుంది. ఆ తేజస్సును చూడగలది, చూచి భరించగలది ఆత్మ ఒక్కటే. అది మనిషి కనుబొమల మధ్య జ్ఞానకేంద్రంలో వికసిస్తుంది. అది మన ఆలోచనలకు, క్రియలకు అందదు. అక్కడ నిశ్చలత్వంలో ప్రాపంచిక విషయాలన్నీ మరచిపోతాం. అదే ప్రకృతిని శాసిస్తుంది. మన జీవితాన్ని చక్కదిద్దుతుంది. ఆ జ్ఞానదృష్టి మనల్ని గమ్యానికి చేర్చగలదు. మనం చేసే తప్పుల్ని క్షమించి, మంచి మార్గంలో పెడుతుంది. మన సంకల్పానికి అనుగుణంగా, మన ప్రయత్నాలకు అతీతంగా, మనల్ని విషయప్రపంచానికి దూరం చేసి ఆత్మ పథంలోకి నడిపిస్తుంది.

తాను చూచిన ఓజస్సుపై ఆత్మ పురోగమిస్తుంది. జీవనస్వరాలు విశ్వ నాదాలతో శ్రుతి కలుపుతుంటాయి. మహాద్భుతమైన మెరుపురెక్కలపై వచ్చిన క్షణాలు, దివ్య భావనను మేధకు కలిగించి ఆశ్చర్యపరుస్తాయి. అద్భుతమైన మహత్తులో జన్మించాలన్న సంకల్పం ఆత్మకు నామమాత్రంగా ఏర్పడుతుంది. ఆత్మ శూన్యతేజస్సుపై తేలి వచ్చి, దివ్య శక్తుల్ని పొంది, నిశ్శబ్ద భావన పతనమవుతుంది. అప్పుడు మృత్తికరూపానికి జీవం జతపడుతుంది. విశ్వ శిల్పి అదృశ్యంగా దానికి రూపురేఖలు దిద్దుతాడు.

నవ్య దృక్పథం ఏర్పడినప్పుడు మనలో కొత్త స్వరాలు ఏర్పడి దివ్య సంగీతానికి ఆకృతి నివ్వడం జరుగుతుంది. ఇవి అని చెప్పరాని దివ్య స్పందన లేవో కలుగుతాయి. దివ్యస్పర్శ వల్ల కలిగిన స్పందనలు ప్రశాంత స్థితికి దోహదం చేస్తాయి. ఏకాంతంలోనే పారవశ్యం అనుభూతమవుతుంది.

సావిత్రికి క్షణంలో ఆ స్థితి ఏర్పడ్డది. మనిషి ఆలోచనకు అందని, కంటికి కనిపించని అనేకానేక విషయాలు ఆమెకు అవగతమైనాయి. ప్రకృతిని నడిపిస్తున్న జీవశక్తులు గ్రహగోళాల నుండి కాంతి తరంగాలుగా భూమికి చేరుకున్నాయి.

ఆమె ఆత్మ మహాగ్ని కీలగా మారి ఆకాశం ఎత్తుకు ఎగసింది. ప్రకృతి బంధాలను త్రెంచుకుంది. మహోన్నత శిఖరాల పైకి చూస్తున్నట్లు వీక్షించింది. అవి సనాతన దివ్య శిఖరాలు. ఆమె వాటి పైన మనశ్శరీరిగా విహరించింది. ఆత్మ తన ఏకాంత భూమికపై తిరుగాడింది. వాటికి మూలం ఏదో ఆమె ఎప్పుడో గ్రహించింది. అది శూన్య గగనంలో రోదసి వరకు విస్తరించింది. అది క్రమంగా విస్తరించిన విశ్వసంకల్పం. పరమాత్మ సంకల్పం. అదే పరమసత్యం. అచంచల శక్తికి ఆత్మీయమైన ఆధారం అది. అదే దృశ్య శ్రవ్య ప్రపంచాన్ని నిండిన దివ్యత్వం. అదే కేంద్రీకృత సర్వస్వం. అదే అనంత జీవనపథం.

ఒక నిశ్శబ్దం, ఒక అవేగం, ఒక ప్రజ్ఞ అఖాతాలపై పరచుకున్నది. వినిపించని శబ్దాలలోని అంతర్లయ వలె దిగంత కాంతి వలయాల నుండి ఒక శక్తి దిగి వచ్చింది. అది క్షణాలను కాలంగా సాగదీసి, అనంతంతో బంధించి, అక్షయంగా భూమికి అనుసంధించింది. అది ఆమె ఆత్మలో ప్రవేశించగా, తానే ఆత్మ అయిపోయింది. ఒక ప్రవచనంతో భావం వ్యక్తమవుతుంది. ఆ మహత్తరశక్తి ఒక వ్యక్తిలో వ్యక్తమవుతుంది. ఆ శక్తి స్పర్శతో ఆమెలోని ప్రత్యణువు స్పందించసాగింది. దివ్యత్వం ఆమెను కప్పివేసింది. అనిర్వచనీయ సత్యం ఆమె పెదవులపై తారాడింది. తేజోవలయం కాంతి ప్రభల్ని విరజిమ్మింది.

ఆ శక్తి ఆమె సహస్రహార కేంద్రాన్ని చేరి వికసించింది. ఆ సహస్రహార పద్మమే మానవతకు, మనుగడకు, ప్రజ్ఞకు కేంద్ర బిందువు. అదే మనస్సును కదిలిస్తుంది. మనిషినీ కదిలిస్తుంది. అది క్షయం కానిది. అది సర్వశక్తిమయి. ఆ శక్తి ఆమెను నిశ్చలంగా, నిర్మలంగా, నిర్వికారంగా నిలిపింది. ఒకప్పుడు తన సర్వస్వం అనుకున్న మానవదేహాన్ని మృత్యువు కబళించింది. ఇప్పుడు మహాప్రజ్ఞ ఆమెలో ప్రవేశించింది. ఆధ్యాత్మికంగా సంయమనం సాధించింది. జీవన సాగరాన్ని శూన్యగగనాలకు నిలువుటద్దం చేసింది. ఆమెలోకి దివ్యత్వం చొరబడి, ప్రత్యణువును తారుణ్యపూర్ణం చేసింది. పైకి వేదన కలచి వేస్తున్నట్లు, రోదన వదలినట్లు

అనిపించినా, ఆంతర్యంలో విషాదం తొలగిపోయి నిర్మలమైంది. దివ్యచైతన్యంతో హృదయం ప్రశాంతమైంది. మానవత్వపు పట్టు విడిపోయింది. ఇప్పుడు ఆమె చేసే పనులన్నీ దైవ ప్రేరితాలే.

తన ఒడిలో ఉన్న సత్యవంతుని మృత శరీరాన్ని నేలకాన్చి, తనను దూరం చేసుకున్నది. తాను ఒంటరిగా మృత్యువును ఢీకొనడానికి సన్నద్ధమైంది. ఆమెలోని మహాత్మ ప్రాపంచికత నుండి విముక్తమై తాను నిర్వహించవలసిన బృహత్కార్యం లోగడ ఎక్కడ నిలిపివేసిందీ మననం చేసుకున్నది. మనస్సు అంతా గ్రహిస్తూనే పరిక్రమిస్తుంది. వక్ర గతులు, విచిత్ర ప్రవృత్తులు సహజంగా ఏర్పడు తుంటాయి.

ఎవరైనా మానవ స్వభావాన్ని ఆమోదించక తప్పదు. అవసానదశలో వానిని అతిక్రమించక తప్పదు. అధిగమించడానికి స్వతంత్రం అవసరం. భగవదనుగ్రహం అవసరం. క్షణకాలం ఆమె నిశ్చలంగా ఉంది. తన చెంతనున్న సత్యవంతుని మృతదేహాన్ని పరిశీలించింది. గాలి హోరును తట్టుకొని తలెత్తిన మహావృక్షం వలె ఆమె గంభీరంగా లేచి నిలబడ్డది.

ఒక మహాశక్తి తన ఎదుట నిలిచినట్లయింది. సర్వప్రాణికోటికి ప్రాణదానం పెట్టగల మహాశక్తి కదలినట్లయింది. సమస్త లయకారుల దైన్యం భయంకర రూపం దాల్చింది. ఆ మూర్తి పెదవులపై విషాదం తాండవిస్తున్నది. అది 'వినాశం' తప్ప మరొక పదాన్ని ఉచ్చరించదు. ఆ ముఖకవళికలో అనంత నిశీథం, సర్వ ప్రపంచాన్ని తనలో లయం చేసుకోవాలన్న ఆరాటం. జీవుని విశ్వవేదన నుండి బాధల నుండి విముక్తం చేయాలన్న అవ్యక్త వాంఛ కనిపించింది. మహాశూన్యం రూపుదాల్చినట్లు, ఆ రూపం చుట్టూ చీకట్లు ముసిరాయి. జీవుని కబళించే కాల సర్పం ఆ కళ్లలో బుసకొట్టింది. ఆ మూర్తి చూపుల్లో కాలచక్రాలు తిరుగుతున్నాయి. అందులో గ్రహాలు, నక్షత్రాలు సుడులు తిరుగుతున్నాయి.

వారిరువురూ చూపులతోనే పరిచయమైనారు. ఒకరు మానవస్త్రీ. ఒకరు విశ్వలయకారుడు. ఆమె చుట్టు దుర్భరమైన శూన్యత పరచుకున్నది. అది ఆమెను చుట్టి వేసింది. అనేక అమానుష శక్తులు ఆమెను సమీపించాయి. అవి అనంత శూన్యాలు. అన్ని ఆశలను వదలినట్లు, ఆమెపై నిర్జీవ దృక్కుల్ని సారించాయి. అధోలోకాలన్నీ ఏకమై, ఎలుగెత్తి అరచినట్లు, ఒక భయంకర స్వరం విషాదపూర్ణంగా ఆమెకు వినిపించింది. అది మృత్యుస్వర రవళి.

"మానసీ! నీ పట్టు విడిచిపెట్టు. నీవు ప్రకృతికి బానిసవు. పట్టుదల వద్దు. మారని ప్రకృతి ధర్మంలో మారే పరికరం నీవు. నా శాసనాన్ని ధిక్కరించకు. ఏడ్చి ఏడ్చి అతనిని మరిచిపో. నీ అనురాగానికి సమాధికట్టు. ఒకప్పుడు అతని

దేహాన్ని ప్రేమించావు, నిజమే. ఇప్పుడు ఆ శరీరం నిర్జీవం. వెళ్లిపో. ప్రపంచంలో నీ బ్రతుకు నీవు బ్రతుకు".

కాలుని బెదిరింపుకు సావిత్రి ఉలకలేదు, పలకలేదు. మానసవీణాతంత్రుల్ని శ్రుతి చేసుకున్నది. కాలుని హెచ్చరిక దైవదూషణగా వినిపించింది. అది సాగర భీషణ ఘోషణలా నినదించింది.

కాలుని స్వరం మళ్లీ వినిపించింది :

"నీ అనురాగ బంధాన్ని శాశ్వతం చేసుకోగలవా? అతని వలె నీవూ ఒక నాటికి మరణించవలసిన దానవే. అతనికి మరణం ప్రసాదించే ఆత్మశాంతిని ఎందుకు కాదంటావు. అతనిది, నీది భౌతిక సంబంధం. ఇప్పుడు అతని ఆత్మ మహాశక్తిలో కలిసిపోతుంది. మానవీ, నీ భర్త మరణించక తప్పదు".

సత్యవంతుని శరీరంతో గత తన అనురాగబంధం సడలించింది. తన ఒడిలో ఉన్న మృతదేహాన్ని ప్రక్కన పసిరికపై ఉంచింది. ఇప్పుడతను నిద్రిస్తున్నట్లు తోచింది. ప్రభాత సమయంలో నిద్రలేచి నిత్యకృత్యాలకు సిద్ధమైనట్లు ఆమె లేచింది. ఎవరో పిలిచినట్లయింది. యావచ్ఛక్తిని కూడదీసుకుని, జాతి ఉద్ధరణకు సమాయత్తమైన రణవీరుని వలె లేచింది. ఈ క్షణం కొరకే ఇంతసేపు నిరీక్షిస్తున్నది.

తన లక్ష్యం ఏదో తనకు తెలుసు. తన ఆత్మ ఏ మహోన్నత ప్రయోజనం కొరకు నిర్దేశించబడిందో తనకు తెలుసు. పర్వత శిఖరంపైన నిలిచిన ఏకైక ప్రతినిధి తను. ఆమె ఆత్మ రెక్కలు విదల్చి ఆకాశంలోకి ఎగిరింది. ఆమె ఇప్పుడు ప్రశాంత సాగరంపై తేలిపోతున్న నావ. తనలో వ్యామోహం లేదు. ఒక ప్రేరణకై ఇంతకాలం ఎదురుచూచింది. ఆ శక్తి లోపల నుండి పైకి రావాలి. సాయంవేళ అలసిన నేలను నిశి ఆక్రమించినట్లు ఒక్కసారిగా మృత్యువు తనను కమ్మింది. సాయంసంధ్య చీకట్లలోకి తప్పుకుంది. చంద్రుని రాకతో లోకం మార్మికతను సంతరించుకుంది.

మృత్యుదేవత భయంకరంగా, నిటారుగా నిలబడింది. మృత్యువు పాదాలు నేలసోకగానే ఒక స్వప్నం నుండి మరొక స్వప్నం కదలినట్లు, సత్యవంతుని మృతశరీరం నుండి తేజశ్శరీరం దిగ్గున పైకి లేచింది. కనిపించని తీరాలకు ఎగిరిపోవాలన్న ఆరాటం, అదృశ్య లోకాలకు పరుగు తీయాలన్న ఆవేగం.

భౌతిక రూపంలో ఉన్న స్త్రీమూర్తికి, అధిభౌతికమైన మృత్యువుకు మధ్యన సత్యవంతుని తేజశ్శరీరం నిలిచింది. మరణించిన వ్యక్తి మహాతేజస్సుతో అక్కడ అవతరించాడా అనిపించింది. ఆ కాంతి శరీరానికి ఈ ప్రపంచంలో విలువలేదు.

మనిషి మనస్సు లోగడ ప్రేమించిన వారినే మళ్లీ వాంఛిస్తుంది. అస్వాభావిక విషయాలను కోరుతుంది. తను ప్రేమించినదే అయినా మృతదేహాన్ని మనస్సు వాంఛించదు. మనిషి శవాన్ని ప్రేమించడు. తేజస్సును మనిషి భరించలేడు. కాంతిని, క్రాంతిని అతిగా మనిషి భరించలేడు. ఈ భూమిపైన జరిగే సృష్టిని మాత్రమే మనస్సు భరిస్తుంది. ప్రాపంచికమైన సుఖాలను, అనుభవాలను మనిషి కోరతాడు. దివ్యత్వాన్ని మన ఇంద్రియాలు పూర్తిగా భరించలేవు. ఒక్క ఆత్మ మాత్రమే మరొక ఆత్మను భరించగలదు, ప్రేమించగలదు, గ్రహించగలదు. ఎంతకాలమైనా ఒక హృదయం తను ప్రేమించే హృదయాన్ని గుర్తిస్తుంది.

ఇహ పర లోకాల మధ్యన సత్యవంతుని తేజశ్శరీరం నిలిచింది. ఏదో విచిత్ర సంఘటన జరగనున్న సూచన. పరమాత్మ ఆజ్ఞ కొరకు నిరీక్షణ. భౌతిక ప్రపంచంలో మూడు శక్తులు ఒక్కచోట సమావేశమైనాయి. మానవ రూపధారణ చేసినా వారి శక్తులు భౌతికం కాదు. ప్రతి ఒక్కరికీ రెండేసి శక్తులుంటాయి. నిశ్శబ్దం.... నిశ్శబ్దంలో విస్మృతి.....విస్మృతిలో కలుస్తుంది. పరమపథం ఏదో సావిత్రి అనుభూతికి అందింది. నక్షత్రాలకు ఆవాసమైన గగన తలాన్ని, శూన్యాన్ని దాటి అదృశ్యలోకంలో ప్రవేశించ ప్రయత్నిస్తున్నది.

సత్యవంతుని తేజోరూపం ఊర్ధ్వగమనంలో కదిలింది. ఆ వెనుక కాలయముడు నిశ్శబ్దంగా కదిలాడు. ప్రశాంత సీమలలో పశువుల కాపరి వెంట పశువులు నడిచినట్లు యముని వెన్నంటి సావిత్రి రూపం నడక సాగించింది. యముని వేగంతో సమానంగా తాను నడవ సాగింది.

ఆమె దృష్టిలో ఉన్నది యముడు కాదు. తన ప్రియసఖుడు సత్యవంతుడు. అతనిని దృష్టిలో ఉంచుకుని వెన్నంటి నడుస్తోంది. అతని అడుగులలో తను అడుగులు వేస్తున్నది. ముగ్గురూ ఈ లోకాన్ని దాటి శూన్యసీమలు చేరుకున్నారు. ముందు మహాంధకార మహారణ్యాలలో పయనించారు. అక్కడ భూమిపైన నడిచినట్లు లేదు. నడవ నేలకాదది. కనిపించిన శూన్యంలో కాలు కదల్చరాని నడక, చుట్టూ భావనారణ్యాలు, మహావృక్షాలు పరదాలై కాళ్ళకు చుట్టుకోసాగాయి. దట్టమైన లతలు, తీగలు కాళ్లకు చుట్టుకుని కదలనీయడం లేదు. ఎటు చూచినా చిత్ర విచిత్ర స్వరాలు, భయంకర ఘోషలు. ఆకుల చాటున దాగిన మార్మిక సౌందర్యాలు ఆమెను చుట్టు ముట్టి ముందుకు కదలనీయడం లేదు. అవి పోనుపోను ప్రతికూల శబ్దాలుగా మారసాగాయి.

ఎంతోకాలం తను ప్రేమగా పోషించుకున్న శరీరం ఇప్పుడు భారంగా ఉంది. నిష్ప్రయోజనం అనిపించింది. అశరీరం ఇది కాదు. దానికిది ఛాయ

మాత్రమే. తానొక మహోన్నత లోకాన్ని చేరుకోబోతున్న అనుభూతి కలిగింది. ఆ లోకాన్ని చేరడం సమాధిస్థితిలో యోగులకు మాత్రమే సాధ్యమయ్యేపని. అది మహోదాత్తమైన నిరామయ స్వాప్నికావస్థ. తేజోరూపంలో సత్యవంతుని ఆత్మ ముందుకు సాగింది. దాన్ని వెన్నంటి మృత్యువు కదిలింది. అక్కడ పుణ్యలోకాల ప్రవేశానికి త్రొక్కిసలాట. తీరని వాంఛలతో, భూలోకంపై తీపితో ఎందరో వెనుతిరిగి వస్తున్నారు.

సావిత్రి ఆత్మకు భౌతిక వాసనలు పూర్తిగా పోలేదు. ఇంద్రియలాలస ఆమె ప్రగతికి అవరోధం కలిగిస్తున్నది. మధురోహలు, ప్రియబాంధవ్యాలు దూర మైనాయి. భూమి వేరైనా తనకు అతి దగ్గరగా ఉన్నట్లు అనిపిస్తోంది. ఆమెను మాధుర్యాలు, పరిమళాలు, ఆనందాలు ముంచివేస్తున్నాయి. సూర్యకాంతి క్రమంగా స్వర్ణకాంతిగా మారిపోతున్నది. అటు గగనం, ఇటు భూమి .... అన్నీ హిరణ్యమయాలే. జగన్మాత తన ఆత్మజకు ఈ ప్రపంచంలో కోరినదంతా అనుగ్రహించింది. భౌతిక శరీరం ప్రాపంచిక సుఖాలు మరిగి దివ్యత్వాన్ని ధిక్కరిస్తుంది. దైవకార్యాన్ని మరుస్తుంది. అయినా పరమాత్మ కరుణతో జీవుల్ని దివ్యపథానికి చేర్చే ప్రయత్నంలో అవరోధాలను తొలగిస్తూ, సరిహద్దుల వరకు తీసుకుపోతుంది. పరలోక స్పర్శతో మానవాత్మ తనను తెలుసుకుని, తను ప్రేమించిన ప్రపంచాన్ని విడిచి పెట్టక తప్పదు.

ఆ వాతావరణం మహోద్భుతం. అది అనంతంగా విస్తరించి ఉంది. అక్కడ చలనం లేదు. శబ్దం లేదు. గాలి కదలదు. ఆత్మ స్వేచ్ఛగా విహరిస్తుంది. విస్తరిస్తుంది. పరాకర్షణ వల్ల ఆత్మ భూమ్యాకర్షణకు దూరమవుతుంది. భూమి ఆధిపత్యాన్ని ఆత్మ సహించదు. అదే ఆత్మ విముక్తి.

శరీరం అనే గూడు నుండి ఆత్మ జ్యోతివలె లేచి సత్యవంతుని వైపు చూచింది. తను ఒక్కసారి స్వర్గంలోకి ఎగబ్రాకినట్లు అనిపించింది. మృత్యువు తనను కబళిస్తున్న భయం కలిగింది. సావిత్రి ఆ మృత్యువుకు అడ్డు నిలిచింది. మృత్యువు భయంకరంగా అరచి నట్లయింది. ఆమె ముందుకు సాగింది. భయంకరాగ్నుల్ని దాటింది. ఇహ పర లోకాల సరిహద్దు రేఖను దాటింది. అప్పుడు భౌతికమైన తెరలు, ఒక్కటొక్కటిగా ఆమె ఆత్మను వదలి దూరంగా సాగిపోయాయి. ఒక్క క్షణంలో ఆమె మార్మిక శరీరం నిద్ర నుండి లేచినట్లు లేచింది. ఇప్పుడు ఆమెకు భూమి, ప్రపంచం, ప్రకృతి, గ్రహాలు ఏవీ స్పృహలేదు. సర్వాన్ని, చివరకు తన ఉనికిని, స్థితిని విస్మరించింది. అంతా పరమాత్మ సంకల్పమే మహోద్ధృత

సాగరం. మహాసంకల్పానికి లోబడి ఆత్మలు మనవలసి ఉంటుంది. తనను తాను గుర్తించిన సావిత్రికి తన లక్ష్యం, గమ్యం, సృష్టికి మూలం 'సత్య' మనిపించింది. పరమసత్యానికి ప్రతినిధి సత్యవంతుడు.

ఆమె ఆత్మ ఏకాగ్రతకు బందీ అయింది. అక్కడ సత్యవంతుని హృదయస్పందన వినిపిస్తున్నది. తాను వేరై, ప్రేమ స్వరూపమై, శూన్యంలో లయించిపోయే సృష్టిని రక్షించపూనుకున్నది. అతని చుట్టూ ఆమె ఆత్మ ప్రదక్షిణం చేసింది. అతని ఆత్మతో ఆమె ఆత్మ అనుసంధానమైంది. మనిషికి మరణం ఉన్నది కాని ప్రేమకు మృతి లేదు. దివ్యస్పర్శతో ప్రేమ మరింతగా రాణిస్తుంది..... పవిత్రతను సంతరించు కుంటుంది.

సమాధిలో శాంతి సాగరజలాలలో సుస్నాత అయి, క్రాంతి ప్రవాహంలో తలమునకలైంది. ఒక్కసారిగా కాలంలో కళ్లుతెరచి పరిసరాలను వీక్షించింది. సగుణ ప్రపంచపు సరిహద్దుల్ని చేరుకుంది. దృశ్య ప్రపంచం ఆవల జ్ఞానరోచిస్సులు కనువిందు చేశాయి. ఆత్మలోకంలో ముప్వరి ప్రయాణం ఒకే దిక్కుకు, ఒకే రేఖ పైన సాగింది. స్వప్నరాగాలపైన నడుస్తున్న వైనం. ఆమె ఒక భావచిత్రమై తనవలె మిగిలిన వారున్నారన్న స్పృహ. వారిరువురికీ ఆమె పట్ల అదే భావన, అదే భ్రాంతి. అవి తనకు పరిచితాలే కానీ, వాస్తవం కాదు, చేతికి అందనివి అవి. నిరాధార భావశిఖరాలపై మెరుపులు. దృశ్యాలు కదలినట్లు అనిపిస్తుంది. యదార్థానికి అందవు. అవి గత స్మృతులలోకి ఏ క్షణంలోనైనా జారిపోగలవు.

అవి నిశ్శబ్దసీమలు. ఆత్మ రూపాలు నిశ్శబ్దంలోనే సంచరించగలవు. ఆ కొత్త లోకంలో అవి వేటికవే ఒంటరిగా ఉంటాయి. వాటికి ఉండేది స్పందనలు మాత్రమే. అవి శూన్యంలో చొచ్చుకొనిపోయే ప్రవాహాలు, భావనలు. అవి స్వాప్నికమూర్తులు నివశించే శూన్యగేహాలు. అక్కడ పచ్చని పసిరికలు, చెట్లు చేమలు, రాచబాటలు, పరిసరాలు, అందచందాలు అన్నీ భ్రాంతులే. అభూత లోకాన్ని, విభ్రాంతసీమల్ని చేరుకోవాలి. మహోత్తుంగ ద్వారబంధాలు దాటితే కనిపించేవి భావశిఖలు. ఆ నిశీథంలో గండశిలలే కరిగిపోతాయి. అది మహాంధ కారం ప్రగాఢంగా నిద్రిస్తున్న శైథిల్యం. అది అర్వాచీన తమస్సుకు సంకేతం. అక్కడి పాలనకు అవి చిహ్నాలు. నోళ్లు విప్పి తమలోకి ఆహ్వానిస్తున్న రూపాలు. అ సొరంగమార్గంలోకి జీవుడు ప్రవేశిస్తాడు. అరూపం తనలోకి జీవుని తీసుకుని చంపివేయాలని చూస్తుంది. ఆ రూపాలన్నీ ఆమెను నిశితంగా పరిశీలిస్తున్నాయి. అవకాశం కొరకు నోళ్లు తెరచి చూస్తున్నాయి. చీకటి తలలు విరబోసుకుని

ఆహ్వానిస్తున్నాయి. ఆమె అడుగులు ఆ నీడల్ని తాకే సమయాన సత్యవంతుని తేజోరూపం ఆమెను ఆపింది. సత్యవంతుని దివ్యప్రజ్ఞ ఆమెలో ప్రవేశించింది.

కానీ మృత్యువు ప్రళయభీకరంగా అరిచింది – "ఓ మనిషీ! నీవు మర్త్య లోకానికి మరలివెళ్లు. మృత్యువును వెన్నంటి, మృత్యుగహ్వరంలోకి రావద్దు. కాలం తీరినవారు ప్రాణంతో ఉండడం అసంభవం. నీ మనస్సు కల్పించిన ప్రేమ శాశ్వతం కాదు. దివ్యం కాదు. నీ ఆత్మ భౌతికస్థాయి దాటి పైకి రాదు. భౌతికతను ఛేదించడం అసాధ్యం. నిరాధారమైన శూన్యంలో నీ పాదాలను మోపలేవు. పథరహితమైన అనంతంలో నీవు పయనించలేవు. అక్కడ నీ భౌతికశరీరంతో నీ ఆత్మకు సంబంధం ఉన్నంత కాలం నీ ప్రయత్నం సఫలం కాదు.

"ప్రపంచ పరిధిలోనే మనిషి సుఖంగా జీవిస్తాడు. కాలాతీతులమని చెప్పే వారి మాట నమ్మకు. అవన్నీ భ్రమలు. అందరూ స్వప్నలోకాలలో విహరిస్తుంటారు. ఏదైనా మహాశక్తి నిన్ను ఆవహించి పరలోకాలకు పంపిస్తానని చెప్పినా నమ్మకు. అది అసంభవం. జీవితంలో నీ ఆశలకు అక్కడే సమాధి కట్టు. దివ్యశక్తులు పొందామని విర్రవీగి ప్రయోజనం లేదు. మనిషికున్న శక్తులు, అవకాశాలు చాలా పరిమితం. అజ్ఞానంతో తన హద్దుల్ని అతిక్రమించి తానే భగవదవతారం అని చెప్పి ప్రకృతిని చిత్రహింస చేస్తాడు.

"దివ్యత్వం గురించి కలలు కనే ఓ స్వాప్నికుడా! ప్రశాంత యోగభూమికల లోకి వెళ్లడానికి యత్నించు. అప్పుడు నీ మానవ బలహీనతలన్నీ నశించిపోతాయి. అశాశ్వతమైన జీవులు, వారి ప్రేమలు, విషాదాలు అవేవీ దేవతలకు రుచించవు. వాటివల్ల ఎవరికీ దైవత్వం సిద్ధించదు".

★ ★ ★

ఆ భయంకర నినాదం నిశ్శబ్దంలో కలిసిపోయింది. వెంటనే ప్రశాంత వాతావరణం నెలకొన్నది. ఆ హెచ్చరికను నిశి అమోదించినట్లయింది.

కానీ సావిత్రి ఆత్మ సమాధానం చెప్పలేదు. ఆమె నర్మగర్భంగా, భౌతిక ఆచ్ఛాదనల్ని వదలిపెట్టింది. ఇప్పుడు ఆమె విధికి తలవంచదు. విధికి ఎదురు తిరిగింది. కాలధర్మాన్ని ధిక్కరించింది. స్వసంకల్పాన్ని శక్తిగా మార్చుకుంది. గంభీరంగా నిలబడ్డది. ఆమె కదలని శిలాప్రతిమలా ఉంది. నిశ్శబ్దంలో ఏకాంతం ... అనంతంలో ఒంటరితనం. భయంకరమైన చీకటిలో అర్ధరాత్రి ధైర్యంగా అగ్నిశిఖ వలె, తేజస్విని వలె సావిత్రి లేచి నిలబడ్డది.

28. కాళరాత్రి

మూడు ఆత్మలు కాళరాత్రి కొసకు చేరుకున్నాయి. ఏదో అపూర్వ సంఘటన జరుగుతుందని ఎవరికి వారు అనుకున్నారు. ఊర్ధ్వలోకాల నుండి ఒక కాంతిరేఖ జారిపడ్డది. సావిత్రి ధైర్యంచేసి దానిని అందుకోవాలని అంధకారంలో దూకింది. అది మృత్యులోయ. మనస్సు పనిచేయదు, ఊపిరాడదు. మృత్యువు ఖంగుతిన్నది. సత్యవంతుని తేజోరూపం నుండి కొంత చైతన్యం ఆమెలోకి ప్రసరించింది. ఆమెలో నూతనోత్సాహం నెలకొన్నది.

మృత్యువు సావిత్రిని హెచ్చరించింది తిరిగి పొమ్మని. హెచ్చరికను లక్ష్య పెట్టలేదు. యముడు ఆమె ప్రేమశక్తికి మెచ్చి వరాలు కోరుకోమన్నాడు. సత్యవంతుడు బాల్యంలో కన్న కలలు నెరవేర్చమని అడిగింది. యముడు ఆ వరం ప్రదానం చేశాడు. ద్యుమత్సేనునికి తిరిగి రాజ్యం, సంపదలు, చూపు కోరింది. వాటిని అనుగ్రహించాడు యముడు.

అయినా సావిత్రి వెనుతిరిగి పోలేదు. సత్యవంతుడు తనతో కలిసి వస్తేనే భూలోకానికి వెళ్లగలనని మొండికెత్తింది. యమునికి సావిత్రిపై ఆగ్రహం కలిగింది. మరల నిశిరేఖపై మరికొంత సేపు ప్రయాణం చేశారు ముగ్గురు. తిరిగి యముడు హెచ్చరించాడు. ఆమె ఆ హెచ్చరికను పెడచెవిని పెట్టింది. ముగ్గురూ ప్రయాణం సాగించారు.

భయద శీతల నీరవ నిశ్శబ్ద నిశీధి అంచుకు చేరారు ముగ్గురు. విశ్వం యావత్తు అక్కడ శూన్య అఖాతంలోకి జారిపడబోతున్నట్లు అనిపించింది. విహ్వలగా నిలబడిపోయారు. ఆ నిశ్శబ్దాన్ని, చీకటిని, ఆకాశాన్ని చీల్చుకుని ఒక తేజోకిరణం మేఘాల చాటున తొంగిచూచింది. నిరాశ అంచున ఆలోచన నశించినట్లు, కడపటి ఆశ శూన్యంలో లయించినట్లు, అన్ని ఆశలు కరిగిపోయి వారు అక్కడే

నిలిచిపోయారు. ఎదట జుత్తు విరబోసుకున్న చీకటి. వారి వెనుక విగతజీవి నిర్జీవ చూపువలె, జీవం లేని సాయంత్రపు చీకటిలో నిశి ఆమె ఆత్మను ఆక్రమించింది. అయినా ఆమె సంకల్పం చెదరలేదు. ఆశ చావలేదు. వివేకం దృఢంగా పనిచేసింది. ఆమె ఆత్మ నిర్మలంగా జ్యోతివలె ప్రకాశించింది. ప్రజ్వలించింది. గాలి చొరని గదిలో జ్యోతి వలె నిశ్చలంగా, నిర్మలంగా ఉంది. అది చీకట్లను పారదోలగల అఖండజ్యోతి.

కాళరాత్రిలో పయనించడానికి ఆమె సిద్ధమైంది. శూన్యంలోకి లంఘించింది. కాంతిని కవచంగా ధరించి, భయంకర శూన్యంలోకి అఖాతంలోకి దూకింది. ఆమె ఎదురయ్యే ప్రమాదాలను శంకించలేదు. ఆమె పాదాలు చీకటి నేలపై తారాడాయి. ఆమె మనోవేగంతో ముందుకు దూసుకుపోసాగింది. మూసిన కళ్లలో కదిలే బొమ్మల వలె, కొంతసేపు ఆమె ఈదినట్లు సాగింది. స్వప్నంలో నడిచినట్లు నడిచింది. అనేక శిలాసదృశ కుడ్యాలను దాటింది. కాలంలో అనేక పథాలు కలిసిపోయి కనుమరుగైనాయి. గతం, వర్తమానం కాలంలో కరిగి రహితమైనాయి. అతి సాహసంతో చీకటి సాగరాలపై ఈది ఈది, సాగి సాగి ఆవలి ఒడ్డుకు చేరుకున్నది.

భవిష్యత్తు శూన్యంగా మారిపోతున్నది. చీకటి దారులలో వారు ముగ్గురు అదృశ్యమైనారు. అంధకారంలో అన్నీ చీకటి నీడలే. నీడలు కదులుతున్నా తెలియదు. ఎక్కడకు కదలవలసిన పనిలేదు. కాలం, దూరం దాటి వచ్చిన ఆత్మలు. అవి అన్నీ చీకటి చిత్రాలు, చీకటి చిత్ర సమాహారాలు, చైతన్య రూపాలు, వాస్తవిక చిత్రాలు. అక్కడ ఒక్కటీ కనిపించదు. ఎటు చూచినా భయంకర శూన్యం. భయానక నిశ్శబ్దం. ఆ శూన్యమే అన్ని ప్రచండ శక్తులకు మూలం. ఎంత లోతుకు వెళ్లినా ఏమీ తెలియదు. భయంకర చీకటి ఆమెను మ్రింగివేసింది. అది స్వాప్నికమైన ఆత్మక్షోభ. భయం ఆమెపై తెరవేసింది. వివేకం చీకటి పంజరంలో బందీ అయింది.

గాఢాంధకారంలో చెట్లు నీడలుగా మారి, చీకటిలో కలసిపోయినట్లు, వెలుగు కొస మెరుపులు సైతం కాటుక నద్దుకున్నాయి. చీకటి రాత్రి వేటగాడు అరణ్యంలో మృగాన్ని మాటు వేసినట్లు ఆలోచనలను భయం కాటు వేసింది. జీవితాశ లేదు. జ్ఞాన పిపాస అంతకన్నా లేదు. అసలు ఆలోచనే లేని స్థితి. స్వప్నంలో వలె అన్నీ ఏ ప్రమేయం లేకుండా జరుగుతాయి. భావం నశిస్తుంది. అంధకారంలో శూన్యం కావడమే భావగమ్యం, అగమ్యం. ఆ శూన్యం ఒత్తిడిని మేధస్సు భరించదు,

శ్వాస ఆడదు. ఆత్మ దేనినీ మననం చేసుకోదు. అనుభూతి చెందదు. కడకు అంతా శూన్యసాగరం అవుతుంది. ఆ సాగరంలో మునిగిపోతుంది. తనను కప్పి ఉన్నది, క్రమ్మి ఉన్నదీ శూన్యమే. అది పరమాత్మ ఆనందానికి మాత్రం అవరోధం కాదు. ఏ విధమైన ప్రశాంతి దానిని భంగ పరచదు.

అక్కడ మిగిలింది పరబ్రహ్మత్వం ఒక్కటే. అది పరమాత్మతత్వం. అది ఆత్మ చైతన్యాన్ని, సత్య వచనాన్ని, నిర్మల సచ్చిదానందాన్ని, నిర్మల ప్రేమను, సత్య జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఒక జ్యోతి చీకటిలో పయనించినట్లు కంటికి కనిపించని దూరాలకు సాగినట్లు, సావిత్రి ఆ చీకటిలో కలిసిపోయింది. అక్కడ ఒక మార్గం లేదు, గమ్యం లేదు, అంతం లేదు. అయోమయమైన అఖాతాలలో, సంకల్పరహితంగా పయనించి చీకటి లోకంలో పరుగులు తీసింది. గాలి ఎటు వీస్తే, అటు తూగింది. సర్వం విధికి వదలిపెట్టింది.

ఆ శూన్యంలో ఆమెకు ఎవరూ తోడులేరు. అక్కడ ఎవరికి ఎవరూ తోడు రారు. మృత్యువు వెనకపడినట్లుంది. కనిపించడం లేదు. సత్యవంతుని తేజశ్శరీరమూ కనిపించడం లేదు. అయినా ఆమె ఆత్మశక్తి సడలలేదు. మరింతగా పట్టుదల పెరిగింది. దీక్ష బలపడింది. ఇంకా లోతులకు వెళ్లసాగింది. బాహ్యం ఇంద్రియాలు ఆమెను బంధించకపోయినా, ప్రేమించినదాన్ని వదులుకోలేక పోతున్నది. తాను జీవించి ఉన్న కాలంలో అరణ్యాలలో సంచరించిన తీరు జ్ఞాపకం వచ్చింది. అవన్నీ ఆమెకు అనుభూతులుగా మారాయి. అతను అందించిన సుఖాలు తనకు ఆనందగిరులు. ఇప్పుడు హృదయం నిండుగా ఆనందపు అసూయలు. అతనితో చేయిచేయి కలిపి అనుభవించిన పారవశ్యం, చూచిన దృశ్యాలు అతని అడుగులో అడుగువేస్తూ నడిచిన గుర్తులు, నాడు తమ శరీరాలు పెనవేసుకుని పొందిన సుఖాలు అనుభూతిస్తోంది. ఇప్పుడు శరీరాల మధ్య అంతరం అఖాతం. మరల తనకు అలవాటైన ఒంటరితనం మిగిలింది.

ఆమె నుండి అతని సర్వస్వం, చివరకు ప్రేమ సైతం వేరైంది. దూరమైంది. కాలం దీర్ఘమైతే నిట్టూర్పులు, నిస్వనాలు బాధను బహిర్గతం చేస్తాయి. అవాస్తవం కాని చీకటిలో, శూన్యంలో ఆమె విగతజీవిగా, జీవచ్ఛవంలా పయనిస్తున్నది. పోయి పోయి ఆత్మలు లయించే శూన్యంలో, చీకట్లలో కలిసిపోయింది. వేదనతో, రోదనతో ఏకాకి అయి, మృత్యువును సైతం ఎదిరిస్తూ విజయం పొందుతూ ముందుకు సాగుతోంది. అయినా ఆమెకు ప్రాతికూల్యం తప్పలేదు. ఒంటరితనం

వల్ల, వేదనాభారం వల్ల అలసిన ఆత్మక్షోభతో దిగజారిపోవలసి వచ్చింది. కాంతిహీనం అయినా అది అక్షయం. విగతాత్మల స్మృతి వలె అది చీకటిలో చిరుదీపమైంది. స్మృతి తిరిగి సజీవరూపం దాల్చినప్పుడు మేధ ప్రకృతి నుండి వేరై నిద్రలోకి జారుతుంది.

ఆమె చివరి చంద్రరేఖ వలె దిగులుగా పయనిస్తోంది. ఆత్మ భయంకర నిశీధంలో వివృతమైంది. వెలుగు కిరణం సోకి చీకట్లు వణికిపోయాయి. అంధకార కోణాలు మార్మిక తేజస్సుతో వెలుగులు వెలార్చాయి. చీకటి తెరలు ఒక్కటొక్కటిగా జారిపోసాగాయి. చీకటి వెలుగుని భరించలేదు. ఆమెలో కొత్త ఆశ చివురించగానే నైరాశ్యం దిగులుపడ్డది. ఆ ప్రగాఢ స్తబ్దతకు కాళరాత్రి కళవళ పడినట్లయింది.

కాంతి కిరణం తనలో ప్రవేశించగానే కాళరాత్రి గుండె పగిలింది. తన సర్వస్వం కోల్పోయినట్లు విలవిల్లాడింది. తన శూన్యతకు ముప్పు వాటిల్లనుందని గ్రహించింది. శూన్యం తన శక్తిని కూడదీసుకుని తేజస్సును ఎదుర్కొనడానికి సిద్ధమైంది. ఉన్నదానినంతా మింగివేయాలని నోరు తెరిచింది. తేజస్సు వెనుకనున్న సత్యాన్ని దర్శించి నిరుత్తరైంది. సత్యాన్ని చీకటి స్పృశించదు.

ఆ కాంతి కిరణం మరింతగా ప్రవర్ధమానమైంది. సావిత్రి విస్మృతి నుండి బయటపడ్డది. ఆమె అవయవాలు మృత్యువు నీడ నుండి తప్పుకున్నాయి. అణువణువులో తేజస్సు ప్రవేశించింది. హృదయ చైతన్యం వేదనను తిరస్కరించింది. ఆమె తిరిగి తన ఆనందాన్ని అందుకోగలిగింది. ఇప్పుడు ఆమెకు సత్యవంతుని ఆత్మ కనిపించడం లేదు.

ఆమె ముందు ఘనీభవించిన నిశ్శబ్దంలో యముని చలనం వినిపించింది. అంధకారం నుండి సత్యవంతుని తేజస్సు నీడలా కదిలింది. అప్పుడు మృత్యులోకం నుండి ఒక హెచ్చరిక వినిపించింది. దాని శబ్దానికి రాతిగుండె సైతం బ్రద్దలవుతుంది. ఆ విషాద కాళరాత్రిలో మృత్యువు గొంతు ఇలా వినిపించింది :

"ఇది నా సామ్రాజ్యం. ఈ చీకటి సామ్రాజ్యం నాది. నా సర్వస్వం. ఇది అనంతం. ఇది కాళం. ఇది జీవన లాలసను, అహంకారాన్ని సమాధి చేసే రహస్యం. పరాన్ని వాంఛించేవారి మూలాధారం ఇదే. ఓ మనిషీ! ఇదే నీ అంతిమగమ్యం. ఇదే నీ కలల నెలవు. ఈ నా శూన్యంలో, అంధకారంలో జీవించాలని, లయించిపోవాలని ఆశపడుతున్నావా?"

ఆమె సమాధానం చెప్పలేదు. ఆమె ఆత్మ మృత్యుభావాన్ని, కాళప్రజ్ఞను

తిరస్కరించింది. ఆద్యంతాలు లేని అనంతంలో ఆధ్యాత్మిక శిఖరాల ఔన్నత్యం మాత్రమే ఆత్మ ఆమోదిస్తుంది. అమలమైన నెలవులను మాత్రమే దర్శిస్తుంది. తనకు మరో జన్మ లేదని ఆత్మకు తెలుసు. అయినా మృత్యు శాసనాన్ని ఆమోదించ దలచలేదు. నిశ్చలంగా ఉన్న ఆమె కళ్లలోకి మృత్యువు తొంగిచూచింది –

"నీవు ఈ శూన్యతను ధిక్కరించడం క్షంతవ్యం కాదు. కాలధర్మాన్ని కాలరాయడం నీవు చేస్తున్న నేరం. నిస్తబ్ద శూన్యంలో ఇంతకాలం ఉన్నావు. ఎంతో వేదన అనుభవించావు. సత్యవంతుడు లేని జీవితాన్ని ఊహించు. అలా కొంతకాలం జీవించి చూడు. నీకు జగన్మాత యిచ్చిన వరం ఏది? స్వాప్నికమైన అస్తిత్వాన్ని పెంచుకోవడం అంటే శాశ్వత సుఖాలకు దూరం కావడమే.

"ఎంతకాలం జీవించినా మనిషికి బ్రతుకుపై ఆశ చావదు. ఎంత ఆలోచించినా జీవితం విచిత్రం అనిపిస్తుంది. కాలం పసికూనవలె సంబర పడుతుంది. నీ చుట్టూ ఉన్న శూన్యాన్ని ఎలా తొలగించగలవు! జీవుడు ఏ శూన్యం నుండి వచ్చాడో ఆ శూన్యంలోకి తిరిగి వెళ్లిపోక తప్పదు. మనిషి అహం పెంచుకుని అహంకారంతో తనే పరమాత్మ ననుకుంటాడు. తన ఆశలను నెరవేర్చమని దేవుళ్లను ఆశ్రయిస్తాడు, ఉపాసిస్తాడు. ఎంతసేపు స్వర్గం పైనే మోజు. తను మనిషినని మరిచిపోయి స్వర్గసుఖాలు వాంఛిస్తాడు. పైన ఉన్న లోకాలు మనిషికి ఎలా అందుతాయి. అవి భూమికి చాలా దూరం. అవి మనస్సుకు సైతం అతి దూరం. కృత్రిమమైన నీలిమ తప్ప ఆకాశం, గగనం అంతా శూన్యమే. ఆ శూన్యంలోనే మార్మికమైన కాంతులు, మహత్తరమైన శక్తులు ఉన్నాయి. మనిషి చుట్టూ ఉన్నవి సముద్రఘోషలు. కాళ్ల క్రింద ప్రచండ భూకంపాలు, గుమ్మంలో రగిలే అగ్నులు. ప్రతి అడుగులో మృత్యువు నీడ పడుతుంది.

"మనిషి అందని దివ్యత్వాన్ని కాంక్షించి కాస్త స్పందనకే పులకించి, సర్వం దైవానికి సమర్పించుకుంటాడు. ఆ దివ్యత్వాన్ని తన స్వప్న సౌందర్యంతో అలంకరిస్తాడు. లోకాన్ని వీక్షిస్తున్న దేవతలు, శూన్యం నుండి వారి నడవడికను గమనిస్తుంటారు. మనిషికి ఆలోచించే మనస్సును ప్రసాదించారు. ఆలోచనతో మనిషి తన గుండెలో అగ్నుల్ని రగుల్చుకుంటాడు. ఆశల్ని పోగు చేసుకుంటాడు. తీరని అశాంతికి గురి అవుతాడు. మనిషి మేధ ఎప్పుడూ ఊహల్ని సృష్టిస్తూ ఊహాలోకాలను అందిస్తుంది. ఏవేవో రహస్యాలను శోధించానని మురిసిపోతుంది. మనిషి తన ఆనందాలు, విషాదాలే ప్రపంచం అనుకుంటాడు.

"మనిషి జీవితం ఈ కలల్లోనే గడుస్తుంది. స్వప్నాలలో తేలిపోతుంది. ఏ

ఆహారం తీర్చలేని ఆకలి మనిషిది. దేవతల దృష్టిలో మనిషీ ఒక పశువే. అతని సర్వస్వం ఈ శరీరమే. ఆశలు, ఆనందాలు, విషాదాలు అతనికి ఆహారం. జీవన క్షేత్రం చుట్టూ అజ్ఞానపు ముళ్లకంచె. మనిషి హృదయం అతి బలహీనం. మృత్యువును జయించాలని అహరహం వ్యర్థ ప్రయత్నం చేస్తుంటాడు. లక్ష్యం లేకుండా శ్రమిస్తాడు. మధ్య మధ్య తన బాధల ఉపశమనం కోసం భగవంతుని స్మరిస్తుంటాడు. కాని అతని కోరికలన్నింటిని ఏ దేవుడూ నెరవేర్చడు. అందుకే క్షుద్రశక్తులకు బానిస అవుతాడు.

"ఇంకా నీ కోరికల వేడి చల్లారకపోతే, నీ ప్రేమ తీరకపోతే, భౌతిక శరీరంలోకి వెళ్లిపో. నీలో మిగిలిన ప్రేమతో జీవించు. కానీ సత్యవంతుని మాత్రం తిరిగి పొందలేవు. నీవు అబలవు. ఈ కష్టాలను భరించలేవు. నీ క్షత జీవితానికి నేను ఊరట కలిగిస్తాను. మనుషులు అసంభవంగా భావించే వరాలు నీకు అనుగ్రహిస్తాను. ప్రపంచంలో మనిషి కోరే మాధుర్యాలన్నీ అందిస్తాను. నీకు ఇష్టమైతే నా వరాలు స్వీకరించి, తృప్తిగా వెళ్లిపో. నీకు సద్గతి కావాలో, భౌతిక సుఖభోగాలు కావాలో చెప్పు".

మృత్యువాణి వినిపించగానే వెన్నెల కిరణాలు సోకి సముద్ర తరంగాలు ఉప్పొంగినట్లు. అంతర్ ప్రశాంత సాగరాల నుండి శాంతి భావ తరంగాలు ఉప్పొంగి వచ్చాయి. ఆమె హృదయం నుండి వెలువడిన స్పందనలు, ఆలోచనలై మాటలు మూటలు కట్టినట్లయింది.

"ఓ మృత్యుదేవా! నీకు నేను తలవంచను. నీ పంచన తలదాచుకోను. వినమ్రమైన మానవాత్మపై నీ వొక చీకటి పరదావి. నీవు అవాస్తవం అయినా అనివార్య మృత్యువువి. నీవు అమరమైన నాతో తలపడుతున్నావు. దివ్య చైతన్యంతోనే నేను నీ వెంట వస్తున్నాను. నా శక్తి ఏమిటో, నా చైతన్యం ఏమిటో నా ఆత్మకు తెలుసు. నీ గుమ్మం వద్ద బిచ్చం అర్థించడానికి నేను సిద్ధంగా లేను. నీ పట్టు విడిపించుకుని తొలి విజయం సాధించాను. నా విషాదం నా మనో నిబ్బరాన్ని కదల్చలేదు. కారని కన్నీరు నా ఆత్మశక్తికి నిదర్శనం. నా శరీరం యావత్తు ఆత్మశక్తితో నిండిపోయింది. క్షుద్రశక్తులతో జరిపిన పోరాటంలో నా ఆత్మ మొండికెత్తి, మరింత బలంగా తయారైంది. లోక తిరస్కారాలను నేను లెక్కించను. పైపై మెరుగులకు భ్రమపడి, సుఖాలకు పరవశించే నీచస్థాయికి నేను దిగజారలేను. నీ ప్రలోభాలకు లొంగి నీ వరాలను తీసుకోను.

"క్షుద్రశక్తులతో పోరాటమే నా ధ్యేయం. ఎన్ని సంవత్సరాలు పట్టినా ఈ గ్రహాలకు అతీతంగానే జీవిస్తాను. ఈ గ్రహాలు భౌతిక విషయాలపైనే తమ ప్రభావాన్ని పరిమితం చేసుకున్నాయి. భౌతిక బంధాల నుండి నా ఆత్మ ఎప్పుడో విముక్తమైంది. ఇప్పుడు నాలో భౌతిక వాంఛలు లేవు. నేను వాంఛించేది నా ఇష్టసఖుని సుఖజీవనం. నా సత్యవంతుడు బాల్యం నుండి కన్న బంగారు కలలు నిజం కావాలి. వాటిని అనుభవించాలి. విధి కారణంగా అనుభవించలేకపోయిన జీవితాన్ని అతను సంపూర్ణంగా అనుభవించాలి. అతనికి పూర్ణ జీవితం ప్రసాదించ గలిగితే ఆ వరం ప్రసాదించు".

భగవంతుడు ఈ ప్రపంచాన్ని సృష్టించినా ఈ ప్రపంచాన్నే మనిషికి వరంగా అనుగ్రహించాడు. ప్రపంచ సుఖాలను మృత్యువు అవహేళన చేయడం సావిత్రి సహించలేకపోయింది. ఆమె వాదనకు మృత్యువు తలవంచింది. అయినా కాలనాథుడు భీకరంగా అన్నాడు :

"నా స్పర్శతో నీ స్వప్నాలు ఫలిస్తాయి. అంధుడైన అతని తండ్రి చిరకాల వాంఛలు నెరవేరుతాయి. కోల్పోయిన రాజ్యాన్ని, సంపదలను, అధికారాన్ని, బంధు మిత్రులను తిరిగి పొందుతాడు. వృద్ధాప్యంలో రాజభోగాలు అనుభవిస్తూ సుఖంగా జీవిస్తాడు. మనిషి చివరి దశలో సుఖపడాలని కోరుకుంటాడు.

"విధి వక్రించినపుడే మనిషి వివేకాన్ని ఉపయోగించాలి. క్షోభ చెందిన ఆత్మ పరలోక సంపదలను సులభంగా అందుకోగలదు. వ్యామోహాలు వదలిన తర్వాతనే అసలైన ఆనందం లభిస్తుంది. అలాంటి వారికే అంతర్దృష్టి ఏర్పడుతుంది. కాని అది పరాన్ని దర్శించగల జ్ఞానదృష్టి కాదు. చీకటిలోకి, శూన్యంలోకి చూడగల దృష్టి వేరు. వెలుగులోకి చొచ్చుకు పోగలిగిన దృష్టి వేరు. అదే మనిషి వాంఛించి పొందలేక పోతున్నాడు. అందుకే లోకంలో జీవించి ఉన్నంతకాలం సుఖాలను వాంఛిస్తున్నాడు, సుఖిస్తున్నాడు. ఈ శూన్యమైన లోకాలలో నీవు వాంఛించేది ఏమీ ఉండదు. నీ చిన్ని సుఖప్రపంచంలోకి తిరిగి వెళ్లిపో. నా మాట మన్నించకపోతే నీవూ మృత్యువాత పడవలసి వస్తుంది. ఇప్పటికే నీవు దైవశాసనం ధిక్కరించావు. దైవం నీ తప్పిదాలను గమనిస్తూనే ఉంది".

అందుకు సావిత్రి వినయంగా సమాధానం పలికింది "విశ్వాత్మా! నేనూ నీ వలె ఆత్మరూపిని. నీకూ నాకూ భేదం లేదు. నేను భౌతిక శరీరాన్ని ఆశ్రయించి ఉన్నా, నేనూ అమరజీవినే. నీ బెదిరింపులకు, క్రూరమైన హెచ్చరికలకు నేను చలించను. నీ కఠోర నియమాలు, శాసనాలు నన్ను కదిలించవు. కబళించ

లేవు. విధి, కర్మ, ధర్మం అనేవి నాకు వర్తించవు. నేను వాటిని ధిక్కరించగలను. కనుక నీలో దాచుకున్న నా సత్యవంతుని భూప్రపంచంలోకి సజీవంగా విడిచిపెట్టు. అతను మానవ శరీరంతో ఉండి మధురంగా జీవిస్తేనే నా సంకల్పం నెరవేరుతుంది. లేకుంటే నాలోని అగ్ని చల్లారదు. అతనితో చేయి చేయి కలిపి జీవిస్తేనే జగన్మాత నాకు నిర్దేశించిన పని నిర్వహించగలను. అతని సహచరిగా ప్రాపంచిక పథాలలో పయనించి పరమాత్మను చేరగలను.

"లేకపోతే నా ముందు పరచుకున్న ఈ విశ్వాంతరాలు, గోళాలు, నా చుట్టు తిరుగుతున్న ఈ గ్రహమండలాలు అన్నీ అంతరించిపోతాయి. మేమిద్దరం కలిసే జీవిస్తాం, కలిసే అగోచర దివ్య లోకాలలోకి పయనిస్తాం. అతనితో సహజీవనం చేసిన నేను అతని అడుగులు గుర్తించగలను. అతని అడుగుజాడలలో చీకటిలోనైనా నడవగలను. అగమ్య, అగోచర లోకాలలోకి సైతం వెళ్లగలను. ఎవరూ వెళ్లలేని లోకాలకు సైతం మా ఆత్మలు పయనించగలవు. నీవు అతని ఆత్మను తీసుకువెళ్లే తావులకు నేనూ రాగలను".

ఆమె వాదనను మృత్యువు అంగీకరించలేదు. అలా ఆమోదిస్తే దైవశాసన ధిక్కారం జరిగినట్లవుతుంది. దైవశాసనం అనుల్లంఘనీయం. సృష్టించబడినదంతా నశించవలసిందే. పుట్టిన ప్రతిజీవి గిట్టవలసిందే. ఆమె కోరిక మేరకు సత్యవంతుని విడిచిపెట్టడానికి మృత్యువు అంగీకరించలేదు. మరొకసారి మృత్యువాణి భీకరంగా వినిపించింది. అది నిశి హృదయం చీల్చుకుని వచ్చిన ఘోష. సముద్రాన్ని ఈదే వానిని, తరంగాలు కల్లోల పరిచినట్లయింది. ఆమె హృదయం మృత్యువాణిని నమోదు చేసుకుంది.

"పై లోకాలలో విహరించడానికి నీకు ఏమైనా రెక్కలు మొలిచాయా! నీ పాదాలకు రెక్కలొచ్చాయా? మానవ హద్దుల్ని అతిక్రమిస్తున్నావు. నీ ఆలోచన హద్దు మీరుతోంది. ఏమిటి నీ సాహసం! నీ ఆత్మ ఈ శరీరంలో ప్రవేశించక పూర్వమే ఈ జీవి కార్యక్రమం నిర్ణయమైంది. నేను శూన్యం నుండి సృష్టించాను. నేను సృష్టించిన వాటిని నాశనం చేసే హక్కు నాదే. లోకాలన్నీ నేను పరచుకున్న వలలే. నీ ఆనందాలన్నీ భ్రమలు. మనిషి ఎన్ని బాధలు పడితే నాకంత ఆనందం. జీవితం ముందుకు సాగిన కొద్దీ నేను దగ్గరవుతుంటాను. నా నీడ చిన్నదవుతుంది. మనిషిలో చలించే శ్వాస నాకూ ప్రాణమే. నా దరహాసమే మనిషిలో కదిలే చైతన్యం. నీవు నీ హృదయంలో దాచుకున్న ఆనందాలు ఏవీ శాశ్వతం కాదు. విధి కోరలలో నీవు చిక్కినపుడు అవి నిన్నే వెక్కిరిస్తాయి. నీవు నా శక్తి ముందు ఎప్పుడూ తక్కువే.

నీవు బానిసవు. నేనే నీ చేత పాపాలు చేయించి, ఆ చేసిన పాపాలకు నిన్ను శిక్షిస్తుంటాను. నిన్ను నిరాశా నిస్పృహలకు లోను చేసేది నేను. చివరకు బేలవై, నిస్సహాయంగా నన్ను చేరతావు. అప్పుడు నీవెంత నిస్సహాయస్థితిలో ఉన్నావో తెలుస్తుంది. నీ అజ్ఞానం బరువు తెలుస్తుంది. జారిపోయిన మధుర క్షణాలను ఏరుకోలేవు. నా తీర్పును ఆమోదించిన వారికి పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. నీవు ధ్యానంలో, సమాధి స్థితిలో, ఆనందంలో లయించినా, నీ గుండెకు నిద్రమత్తు వదలదు. తీరిన కోర్కెలు సైతం నీపై పగ సాధిస్తాయి.

"అనురాగ పూర్ణాలైన ఊర్ధ్వలోకాలలో భయానికి అవకాశం లేదు. అగోచరమైన ఊర్ధ్వ లోకాల కాంతులు సైతం మొదట భయం కలిగిస్తాయి. ఒంటరిగా పయనించే ఆత్మను దివ్యనాదాలు తరుముతాయి. ఆత్మ సైతం గాయపడుతుంది. అనేక జన్మలలో అనేక హింసలకు గురి అవుతూ వస్తుంది. ఎన్ని జన్మలెత్తినా ఆ గాయాలు మానవు. పాపం పరిహారం కాదు. ఈ ఆత్మల్ని స్వర్గం ఆమోదించదు. నరకం జాలి పడదు. నీపైనున్న చీకటి ముసుగును తొలగించవలసింది నేనే. నీ గుండె నుండి కర్మశేషాన్ని తొలగించవలసింది నేను. శాంతి నీ పరమగమ్యం అయితే ఆ శాంతినే పొందు".

సావిత్రి మాటకు మాట సమాధానం చెప్పసాగింది. భయంకర మృత్యువుతో మానవాత్మ తలపడ్డది.

"ఈ అంధకారాన్ని సృష్టించిన నీవు దేవుడివా? నాశనం చేయడానికే అయితే అసలీ లోకాన్ని సృష్టించడం దేనికి? ఈ బీభత్సం ఎందుకు? నీ ఆధిపత్యం కోసం ఈ గ్రహాలను, గోళాలను సృష్టించావా? నా హృదయంలో నెలకొన్న పరమాత్మవు నీవు కాదు. నా హృదయాన్ని పవిత్రక్షేత్రం చేసిన పరబ్రహ్మవు నీవు కాదు. నా సంకల్పం పరమాత్మ సంకల్పం. దానికి ఓటమి ఉండదు. నా ప్రేమే దైవం. ఆ ప్రేమ కోసం ఎన్ని బాధలైనా భరిస్తాను. ఆ ప్రేమకు నా ఆశల్ని నివేదన చేస్తాను. నా మమతల్ని అనురాగాన్ని పూలుగా అర్పిస్తాను. నా మార్గాన్ని ఎవరూ నిరోధించరు. ఎవరు కాదనగలరో చూస్తాను. నా ప్రగతికి అవరోధం ఉండదు. అది ఆగదు.

"నా ప్రియుడు సహస్ర జీవన పథాలలో పయనించే పథికుడు. అతని పాదాలకు స్వర్గభూములన్నీ పరిచయమే. నరకంలో కత్తుల బాటల్లో హాయిగా అతను నడవగలడు. నరకంలో సైతం ఆనందం అనుభవిస్తాడు. ప్రేమ రెక్కలు చాచి నీ శూన్యాన్ని కప్పివేయగలడు. మా ప్రేమకాంతులు నీ కాళరాత్రిని

చీల్చివేయగలవు. ప్రేమికుల పాదాలు ఏ కఠినలోకాలలోనైనా నడుస్తాయి. ప్రేమికులు పతనం చెందినా సుఖిస్తారు. ఉన్నత స్థితిలోనూ సుఖిస్తారు. నీ లోకాన్ని తుడిచిపెట్టి పరమాత్మ మరో సుందరలోకాన్ని సృష్టించుకోగలదు.”

ఆమె మాటలకు కొద్దిసేపు మౌనం తెర వేసింది. జవాబు రాలేదు. ముగ్గురూ అంధకారంలో ముందుకు సాగుతూనే ఉన్నారు. సన్నటి వెలుగురేఖ ఆమెకు కనిపిస్తూనే ఉంది. దాని కాంతికి చీకటి కలత పడ్డది. మరికొంతసేపు ఇరువురి మధ్య మౌనం. చీకటి శూన్యంలో వాస్తవం కాని ప్రయాణం. మరొకసారి శూన్యాన్ని చీల్చుకుని భావం తొంగిచూచింది. భావం భాషగా మారింది. మానవాత్మకు సమాధానం చెప్పింది.

“ఏమిటి తల్లీ నీ అత్యాశ? అసలు నీవు కోరుతున్నది ఏమిటి? ఇదేనా నీవు శరీరంతో పొందడానికి ఆశించిన మధురానుభవం, నీవు ఎంత సుకుమారివైనా, రాకుమారివైనా, నీ ఇంద్రియాలు కొద్దికాలమే తృప్తి చెందుతాయి. కొద్దికాలమే భౌతికసుఖాలు మధురంగా ఉంటాయి. హృదయతాపం చల్లారిన తర్వాత నీవు వాంఛించేది ఏముంది? అప్పుడైనా ఏకాంతమే కదా నీకు మనశ్శాంతి నిస్తుంది.

“కనుక ఓ జీవాత్మా! ఏం సాధించగలవు నీవు? నీ ప్రేమ, కామనలు, కోరికలు, ఉద్రేకాలు, ఆలోచనలు అన్నీ క్షణికాలు. అశాశ్వతాలు. అవి చీకటిలో మెరిసే మిణుగురు వెలుగులు. జీవితం పైన కమ్మిన సన్నని పొర అది. నీవు వాంఛిస్తున్నది శాశ్వతత్వం. నీవూ అతనూ శాశ్వతంగా సుఖించాలన్నది నీ ధ్యేయం. శాశ్వతంగా ఉండేవి శూన్యం, మృత్యువు రెండే రెండు. నేనొక్కడినే అనంతుడిని. నాకు మృత్యువు లేదు. నేను నిరాకారిని, నిర్గుణ చైతన్యాన్ని, శూన్యాన్ని నేను. మీరు ఆకాశం అని పిలుచుకునే శూన్యాన్ని నేను. సర్వసృష్టిని నడిపిస్తూ, భరిస్తున్న శూన్యాన్ని నేనే. నేనే అనంతుణ్ని, అజేయుడిని, అద్వితీయుడను. నేనే పరమాత్మను. నేనే మృత్యువును. వేరే దేవతలు లేరు. స్వర్గాలు లేవు. అన్నీ మీ కల్పనలోని ఊహాచిత్రాలు. అందరూ నా నుండి జన్మించి, నాలోనే లయిస్తుంటారు. చివరకు నాలోకి రావలసిందే. నాలో లయించవలసిందే.

“నా చైతన్యంతోనే లోకాన్ని సృష్టించాను. నా శక్తి ప్రకృతిగా మారి లోకాన్ని పాలిస్తున్నది. దానిని నిర్మించేది నేను. ప్రకృతి నాకు సహకరిస్తుంది. నా శక్తి మీలో మమతల్ని, కోరికల్ని కలిగిస్తుంది. ప్రకృతి కార్యభారం వహిస్తున్న మనిషి ప్రకృతికి బానిస. మనిషి శరీరమే నాకు విహారభూమి. అతని జీవితమే నాకు

ఆహార్యం, ఆహారం. మనిషికి మృత్యువు తప్ప మరొక మిత్రుడు లేడు. చివరకు శాంతి కోసం, విశ్రాంతి కోసం నన్ను ఆశ్రయించక తప్పదు.

"చివరకు నీ ఆత్మకు ఆశ్రయం యిచ్చేది నేనే. మీరు పూజించే దేవుళ్లు ఎవరూ మిమ్మల్ని రక్షించలేరు. మీ దేవుళ్లంతా నా కల్పనలే. నా శక్తితో మనిషి మనస్సులో ఆ భావాల్ని రూపాల్ని కల్పిస్తాను. నీవు చావు పుట్టుకలు లేనిదని భావించే నీ ఆత్మ సైతం నా అనంతత్వంలోని ఒక శకలం. అదీ మృత్యుద్వారం దాటితేనే అమరత్వం పొందగలదు. నేను చరించను కాని సకల సృష్టి నాలో చరిస్తుంది. నేను ఎప్పటికీ నశించేది లేదు. అన్నీ నా ద్వారా నశిస్తాయి. నేను మనిషి కంటికి కనిపించను, చెవికి వినిపించను, నా భావన శూన్యానికి రూపాన్నిస్తుంది.

"నీవేదో దివ్యత్వాన్ని కాంక్షించి, నాతో కయ్యానికి దిగి, నన్ను ప్రేరేపించావు. కనుక నేనూ ఒక రూపం ధరించి నీతో సంభాషించవలసి వచ్చింది. కాని, మన సంభాషణ వింటున్న మరొక జీవి లేదు. నీ మనోవాంఛ తీరడానికి ఎవరూ సాయపడరు. ఈ అయోమయంలో నీ మొర ఎవరూ ఆలకించరు. అతనిప్పుడు నిశ్చలుడు, నిర్గుణుడు, పరిపూర్ణుడు.

"ఒక్క అనంతుడే దీనిని చూడగలడు. ఇందులో మహాగోళాలు సైతం కరిగిపోతాయి. శాశ్వతంగా ఉండేది ఒక్క పరమాత్మ. జన్మించడానికి సత్యవంతుడుండడు. ఆశించడానికి సావిత్రి ఉండదు. బాష్పతప్త నేత్రాలు ప్రేమను నిలుపుకోలేవు. అక్కడ కాలం, దూరం, ఆకాశం ఉండవు. దానికి ఆకృతి లేదు. పేరు లేదు. అక్కడ దృష్టి, స్పందన, జీవం ఏవీ ఉండవు. ఆనందాలలో తేలడానికి, భాగం పంచుకోడానికి మరొక జీవి కనిపించదు. అదే శాశ్వతమైన సచ్చిదానందం.

"నీవు అమరత్వాన్ని వాంఛించినట్లయితే నీ వరకు పరిమితంగా, ఏకాంతంగా జీవించు. నీకు నీవుగా, నీలో జీవిస్తూ నీవు ప్రేమించిన వ్యక్తిని మరిచిపో. చివరకు మరొక జన్మకు రానవసరం లేకుండా మృత్యువు రక్షిస్తుంది. నామరూపక్రియా రహితమైన మూలస్థితికి చేరగలవు."

మృత్యు స్వరానికి సావిత్రి సమాధానం చెప్పింది –

"ఓ మృత్యుదేవా! నీవు వాదిస్తున్నావు. నేను వాదించను. నా వివేకంతో నీ వాదనను విశ్లేషించగలను, తార్కికంగా ఎదిరించగలను. కాని వాదన వలన ప్రయోజనం లేదు. నిర్మాణాత్మక కృషి సాధ్యపడదు. నేను ప్రేమించాను. కనుక ప్రేమశక్తి నాకు తెలుసు."

మృత్యువు ఆమెకు జవాబుగా ఆగ్రహంతో అరిచింది –

"నిన్ను నీవు తెలుసుకున్నప్పుడు ప్రేమకు విలువే లేదు. నీ ఆత్మను నీవు ప్రేమిస్తే మరొక వ్యక్తిని ప్రేమించవు. ఒక దృఢ సంకల్పం ఉన్నప్పుడే ఆత్మ విముక్తమవుతుంది. శాశ్వతత్వ వాంఛతో స్థిరంగా ఉండగలుగుతుంది. ఏదీ శాశ్వతం కాదన్న సత్యాన్ని ముందు గ్రహించు".

మానవతకు ప్రతినిధిగా సావిత్రి అన్నది :

"నా ప్రేమ శాశ్వతమని, నేను ప్రేమించినప్పుడే నాకు తెలుసు. ప్రేమ ఎంత పవిత్రమో, శక్తివంతమో నాకు తెలుసు. దాని పరిణామం నాకు తెలుసు. జ్ఞానతృష్ణ ఎంత విస్తృతమో నాకు తెలుసు. లోకంలో ప్రేమించగల ప్రతిజీవిని నేనే. నేను ప్రేమకు ప్రతినిధిని. ప్రతి హృదయం ప్రేమిస్తుంది. ప్రతి హృదయంలో ఉన్నది పరమాత్మయే. ప్రేమించడం అంటే పరమాత్మను చేరడమే. ఆ పరమాత్మ లోకాన్ని రక్షిస్తున్న శక్తి ఆచ్ఛాదన ఏదైనా ఆంతర్యంలోని ఆత్మ ఒక్కటే. రహస్యంగా ఉండి హృదయంలో ప్రేమాగ్నిని రగిలించేది ఆ పరమాత్మే. విశ్వంలోని శబ్దాలన్నీ నేను వినగలను. నా అవతరణకు ప్రయోజనం ఉన్నదని నాకు తెలుసు. నా జన్మను గ్రహాలు ఆమోదించాయి, సహకరించాయి. నాలోని ప్రేమను ప్రేమించే వ్యక్తిపై మృత్యువు వల విసిరింది. మనిషి జన్మపై కొన్ని పాపగ్రహాల దృష్టి పడుతుంది. అయినా మనిషి నిన్ను జయించగలడు. గ్రహప్రభావాల నుండి తప్పించుకోగలడు".

కాల పురుషుని సంకల్పం అచంచలమైంది. అతనికి తన శక్తి తెలుసు. తన లోకం తెలుసు. మృత్యువాత పడే ఒక మనిషికి సమాధానం చెప్పడం యిష్టం ఉండదు. అంధకారంలో, నిశ్శబ్దంలో, నిశ్చలంగా ఉంటూ ఒక నీడలా తిరుగుతూ తన పని తాను చేసుకుపోతాడు. మేఘాలచాటున ఒక నీడ కదిలింది. అంధతమస్సు ఆ మూర్తి శిరోజాలు. చితాభస్మం ఆ మూర్తి నుదుటి సంకేతం. అతను కాలుడు. కాళరాత్రిలో కాలుడు ముందుకు కదిలాడు.

మృత్యుదేవుని శాపం పొందిన దానివలె సావిత్రి శూన్యంలో, శూన్య హృదయంతో వెంటబడింది.

ఆమెను మరిన్ని చీకట్లు ముసురుకున్నాయి. ఆ శూన్యం, మృత్యుభయం కలిసి ఆమె ఆనందాన్ని హరించాయి. ఆమె జీవితాన్ని, ప్రేమను, స్పందనల్ని హరించసాగాయి. అది అభౌతిక మార్గం. ఆ బాటలో మళ్లీ ముగ్గురూ ముందుకు సాగారు.



29. పరనిర్వాణం

సావిత్రి సత్యవంతుల ఆత్మలు మృత్యువుతో కలిసి పయనిస్తూనే ఉన్నాయి. ఆమె మృత్యువు బెదిరింపులకు లొంగలేదు. మాటకు మాట సమాధానం చెప్పింది, వాదించింది. ప్రయోజనం ఏమిటి? తిరిగి సత్య వంతుని పొందలేదు. మృత్యువును జయించినట్లు కాదు. ఆమె తిరిగి భూలోకానికి వెళ్లిపోనూ లేదు. సత్యాన్ని దర్శిస్తే మృత్యువును జయించినట్లు. ఇక్కడ మృత్యువు సత్యదర్శనానికి అడ్డుగా ఉంది. అంధకారం తేజస్సును కనిపించనీయటం లేదు. వెలుగు బయటకొస్తే చీకటి పటాపంచలవుతుంది.

ఆ నిశిని మండించగల హిరణ్యజ్యోతి ఒకటి కనిపించింది. అంధకారం కలవరపడ్డది. జ్ఞానోదయం అయ్యే అవకాశం కనిపిస్తుంది. సావిత్రిలో ఒక ఆనంద రేఖ పొడచూపింది. అది ఒక స్వర్గం, ఒక ఆనంద లోకం.

మృత్యువు అజ్ఞానానికి ప్రతినిధి. జ్ఞానికి మృత్యుబాధ ఉండదు, మరణించడం జరుగుతుంది. మరణం తర్వాత దివ్యలోకాలకో, సత్యలోకాలకో వెళ్లడం పుణ్యాత్ముల సుకృతఫలం. సావిత్రిని ఎలా ఒప్పించాలో మృత్యువుకు తెలియలేదు. వరాలివ్వడం జరిగిపోయింది. వరం పొందడం తన హక్కుగా ఆమె భావించింది. స్వీకరించింది. అది మృత్యువు పరాజయంలో తొలి అధ్యాయం.

చుట్టూ భయంకరమైన చీకటి. గాఢమైన నిశ్శబ్దం. రవంత మార్పు లేదు. మారుతుందన్న ఆశ లేదు. మహాశూన్యానికి ఆకరమైన ఆ చిమ్మచీకటి స్వప్నభ్రాంతి కలిగిస్తోంది. ఎంత దూరం గమించినా ఎక్కడికి చేరడమో తెలియదు. అది అగమ్య ప్రయాణం. ఒక లక్ష్యం, గమ్యం లేకుండా ముగ్గురూ కదులుతున్నారు. చీకటి మరింత దట్టమైంది. భయం మరింత పెరిగింది. జీవి మనడానికి వీలులేని చోట, అరూప, అగోచర, అగమ్య, అంధకారంలో సాగిపోతున్నారు.

గత వైభవ స్మృతి చిహ్నంగా ఒక వెలుగు కిరణం అతి ప్రయాసతో అంధకారంలో చొరబడ్డది. వారి వెంటపడి పయనించింది. అది శూన్యాన్ని, చీకటిని చీల్చుకుని, పెరుగుతూ వస్తున్నది. అది అఖండజ్యోతి. సావిత్రిని పరివేష్టించిన మాయ తన రుణం తీర్చమని ఒత్తిడి చేసింది. జీవుని ఆవేదన ప్రపంచ యాతనల నుండి విముక్తి కోసం. పాపశేషం ఎప్పుడూ జీవించాలన్న వాంఛ కలిగిస్తుంది. మన పాప పుణ్యాలు, ఆర్జిత సంపదలు, అహంకారాలు ఇహానికి సంబంధించివని తెలిసినా, పరానికి తీసుకుపోవాలని ప్రయత్నిస్తాం. బురదలో పుట్టి పెరిగిన పురుగు బురదను ప్రేమిస్తుంది. దాన్ని అసహ్యించుకోదు. కొందరికి నీచంగా, హీనంగా కనిపించినా ప్రకృతిలోనివే అవి.

కొందరు ప్రాపంచిక సుఖాలను, జీవితాన్ని క్షుద్రంగా భావించి గర్విస్తారు. తాము భగవంతుని అవతారమని, దివ్యత్వానికి ప్రతినిధులమని, తమకు మాత్రమే ఊర్ధ్వలోకాలలో ప్రవేశించే అర్హత ఉన్నట్లు భావిస్తారు. అంధకారం దుర్భరం. అంధకారం నుండే సృష్టి ఏర్పడ్డది. చైతన్యం వల్ల పరిణామక్రియ జరుగుతున్నది. ఆ పరిణామాన్ని ఆమె గమనించింది. అచేతన స్థితిలో ఉన్న అజ్ఞానం చైతన్య స్పర్శతో బీటలు వారింది. ఆత్మ మొదటిసారి తిరుగుబాటు చేసినప్పుడే శూన్యంలో చలనం కలిగింది. జీవునితో బాటు విషాదం పుట్టుకొచ్చింది. వాస్తవం భ్రమతో అవాస్తవికత పరిణామాన్ని నిరోధించింది. అసలు సృష్టి జరగనప్పుడు జీవజాలం ఉండే అవకాశం లేదు. కాలధర్మాన్ని నిరోధించినప్పుడు సృష్టి ఆగిపోతుంది. వినాశం వల్ల అశాంతి ఏర్పడుతుంది. మనిషి తన ఆవిర్భావానికి హేతువైన దివ్యత్వాన్ని కోల్పోయి, విషాదంగా జీవించవలసివస్తుంది. ఆమె పవిత్రత, అమరత్వం అండగా, జీవిత లక్ష్యాన్ని సాధించాలి. సర్వాన్ని త్యజించి అనంతంగా అమరత్వం సాధించగలగాలి.

శుద్ధ నిర్గుణస్థితికి 'మాయ' అన్నది ఒక ముసుగు. ఒకానొక మార్మిక 'సత్యం' కదలిక వల్ల లోకం ఏర్పడ్డది. అనంతమైన 'పరప్రజ్ఞ' మనిషి వివేకంతో జతపడి మేధను మేల్కొల్పింది. అజ్ఞానం అనేది పరప్రజ్ఞలోని జడస్థితి మాత్రమే. అది ముసుగు వేసుకున్న వివేకం. అదే సృష్టిలోని వైవిధ్యానికి హేతువు. అదే మనిషిలో ఆధ్యాత్మిక భావనను కలిగిస్తుంది. అగోచరంగా పెరిగి, పెరిగి, అదే జిజ్ఞాసగా మారి శక్తిని ప్రసాదిస్తుంది. అదే మనిషిచేత మహత్కార్యాలను చేయిస్తుంది.

ఈ లోకంలో ఉన్నవన్నీ విచిత్రమైన వైరుధ్యాలే. జీవుని లోపలి తేజస్సును

మరుగు పరిచే చీకట్లు, నిగూఢ బ్రహ్మానందాన్ని మాయచేసే యాతనలు కనిపిస్తాయి. జీవితం శాశ్వతం కావడానికి ఆధారం మృత్యువనిపిస్తుంది. జీవనపథంలో మనిషి వెంట మృత్యువు నడుస్తూ ఆరంభంలో అజ్ఞాతంగా మసలుతూ, మనిషి చేసే పనులపై తుది తీర్పు నిస్తుంది. ద్విస్వభావజీవి అయిన మానవునికి ఎప్పుడూ మృత్యువు ఒక సమస్య. అయితే ఊర్ధ్వలోక పయనానికి మృత్యువు ప్రధాన ద్వారం. ఒక జన్మ నుండి మరో జన్మకు ఆత్మ మృత్యుద్వారం దాటి పోవలసి ఉంటుంది. ఓటమిలోనే విజయం ఉంటుంది. అమృతత్వం సాధించడానికి ఎవరైనా చావు దెబ్బలు తినవలసిందే.

అజ్ఞానంలో జీవించడం మనిషి స్వయంకృతాపరాధం వల్లనే. మనిషి అజ్ఞానం శాశ్వతమైన బ్రహ్మ తేజస్సు కల్పించే ఛాయ. ఈ చీకటి మనిషికి ఆరంభం కాదు, అంతమూ కాదు. చీకటి అవసరం, బాధలు అవసరం. ఉపశమనం పొందడానికి జగన్మాత ఒడిలో విశ్రమిస్తాం. దివ్యకాంతుల్ని వదులుకుని శాంతి కోసం పరుగులు తీస్తాం. శాంతితోనే జీవనం అనుకుని ఆ శాంతిలోకే నిష్క్రమిస్తాం. భయంకర అంధకారం మన జీవితం. అంతా శూన్యం అయినప్పుడు ఒక చిన్న కిరణం కనిపిస్తుంది. అదే జ్యోతిగా మారి చీకట్లను చీల్చివేస్తుంది. ఆ కిరణం మన కంటికి కనిపించనంత సన్నగా, అస్పష్టంగా ఉంటుంది. అదే క్రమంగా సూర్యబింబం చుట్టూ ఒక తేజోవలయంగా, కాంతిమండలంగా ఎదిగి, చివరకు సూర్యనేత్రంలోని కేంద్రబిందువుగా మారుతుంది.

ఒక హిరణ్యజ్యోతి కాళరాత్రి గుండెను మండించింది. మనస్సులేని చీకటి కలగన్నది. అచేతనలో చైతన్యం కదలి చీకటికి ఆలోచన నేర్పింది. ఆ భయంకర నిశ్శబ్దాన్ని భరించలేక చీకటి దూరాలకు పారిపోయింది. అక్కడక్కడ వెలుగు మాటున నీడల్లో కొన్ని మచ్చలు మిగిలాయి. అంతరించిపోతున్న అంధకారం అంచున ఒక రూపం ఘనీభవించింది. ఉషస్సు నెమ్మదిగా ప్రవేశిస్తున్నది. మార్మికత పురిటి నొప్పులు పడుతోంది. ఎంత ప్రతిఘటించినా ఉషోదయం కాకమానదు. ప్రతిఘటనకు బలం చాలదు.

ఉషఃకాంతి శూన్యంలో పరుచుకుంది. దానికి దివ్యత్వం తోడైంది. నిద్రిస్తున్న దేవతలు మేల్కొన్నారు. పరమాత్మ దీర్ఘనిద్రమాని కళ్లు విప్పినట్లు తోచింది. నూతన సృష్టికి అవసరమైన సరంజామా ఏర్పడుతోంది. వాడి, వేడి, వెలుగు, చైతన్యం కలిశాయి. కనుపాపలలో మధుర దృశ్యాలు కదలాడాయి. స్వప్నాలు దాటి వచ్చిన దివ్యపురుషులు దర్శనమిచ్చారు. వారి ఆలోచనలకు అనుకూలంగా రూపుదిద్దు

కున్నవే స్వర్గాలు, దివ్యలోకాలు. సంకల్పమాత్రంతో స్వర్గసృష్టి జరిగిపోతున్నది. అవి అంతవరకు రోదసిగర్భంలో నిశ్చింతగా నిద్రిస్తున్నాయి.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి సాంద్రత తగ్గి, నిశి కల్పించిన విషాదం తొలగిపోయింది. అందుకోవాలని చాచిన చేతులకు స్వర్గం అందినట్లు, ఒక్కసారిగా కలలు ఫలించి, వాస్తవం ప్రత్యక్షమైంది. వెలుగు, ఆనందం, ప్రేమ– త్రివేణి సంగమం అయ్యాయి. ఆ త్రివేణి సంగమంలో ఆమె సుస్నాత అయింది. సుదూర తీరాల తచ్చాడుతున్న ఆనందహేళలు చేరువైనాయి. తాను పొందాలని, అనుభవించాలని ఆశించిన సుఖాలు ఆవాహనతోనే అనుభూతి కలిగించాయి, పారవశ్యం చవిచూపాయి.

అవి దివ్య భూములు. ముత్యాలు పొదిగిన రెక్కలతో రాజహంసలు విహరిస్తున్నాయి. ఆ వాతావరణం ఎక్కువ వెలుగును, వేడిమిని భరించదు. అన్నీ దివ్యక్షేత్రాలు, దివ్యవనాలు. ఉషోదయపు తొలి వెలుగులో అవి చిత్రాల వలె కనిపిస్తున్నాయి. పచ్చిక బయళ్లలో కపిలధేనువులు తిరుగుతున్నాయి. అక్కడ సంచరించే దివ్యాత్మలకు ఆచ్ఛాదనలు లేవు. ఆత్మలను సంగీతరుతాలు పరవశింపచేస్తున్నాయి. రాగాలు దూరతీరాలకు మందంగా సాగిపోతున్నాయి.

రూపాలు కనిపిస్తాయి కాని చేతికి చిక్కవు. అన్నీ తేజస్సు నిండిన రూపాలు, తేజశ్శరీరులకు అభౌతిక రూపాలకు చేరవలసిన గమ్యం ఉండదు. అవి స్వర్గ భూములలో యథేచ్ఛగా, స్వేచ్ఛగా మసలుతుంటాయి. నేలపైన కాలు మోపవలసిన అవసరం కలగదు. మధుర స్మృతులు, జ్ఞాపకాలు ఏవీ ఉండని స్థితి, సంకల్ప మాత్రం చేత చేరవలసిన తావులకు చేరుతుంటాయి. అవి అన్నీ దేవతల వలెనే జీవిస్తాయి, సంచరిస్తాయి. మెరుపు రెక్కలతో వినువీధులకు ఎగిరిపోతాయి. శరీరాలు అగోచరాలు. ఆలోచనలు అస్పష్టం ... అవి వాంఛల సంకలనాలు. వాటి స్వరాలు మంద్రంగా వినిపిస్తాయి. అక్కడ రవి తేజోకిరణాలు మంచుపొరలను చీల్చుకుని శీతల కిరణా లవుతాయి. గాలిలో తేలిపోతూ, కనిపిస్తూ, కరిగిపోతూ ఆత్మకు మాత్రం దర్శనమిస్తాయి.

ఆ లోకంలో జీవిస్తున్నవారు వారే. వారే లోకేశులు. అక్కడ ఏదీ స్థిరం కాదు, స్థితంగా ఉండదు. ఏదీ చిరకాలం నిలవదు. మానవులు ఆ లోకంలో ప్రవేశించ వీలు లేదు. ఏ ప్రాణి అక్కడ శరీరంతో ఉండదు. ఆ లోకం నిండా ఆనందనృత్యాలే. అన్నీ ఆనందతీర్థాలే. అంతా సౌందర్యమే. అంతా అస్థిరం. స్పృహ ఒక్కటే మిగులుతుంది. అందుకే అది స్వాప్నికం, స్వర్గం అయింది. ఆహ్లాదం

సర్వే సర్వత్రా ఒకే విధంగా పునరుక్తమవుతుంది. అదే శాశ్వతం అన్న అనుభూతి కలిగిస్తుంది. అక్కడి రూపాలలో చిత్రమైన సారూప్యత ఉంది. అక్కడ అందరి భావాలు ఒకే తీరుగా ఉంటాయి. అన్ని సౌందర్య లహరులు అనంతాలే, నిత్య నూతనాలే. అనుభవించగల హృదయాలకు అవి పారవశ్య పారదాలు. కోరుకున్న సంగీతం పదేపదే వినిపిస్తుంది. ఎప్పుడూ మధుర స్వనాలే వినిపిస్తుంటాయి.

ఎన్నటికీ అందవనుకున్న సంపదలు సులభంగా లభిస్తాయి. అగోచర, అదృశ్య లోకాలు సైతం అక్కడ దర్శనమిస్తాయి. అదృశ్యమైపోయే నక్షత్ర మండలం నుండి రంగు రంగుల కాంతులు వెల్లువలై ప్రవహించి, మెరుపులు వర్షిస్తాయి. స్వర్గం రంగవల్లికలా మారింది. చెవికి సోకగానే సొమ్మసిల్లి పోయే ప్రతిశబ్దం అపూర్వ బ్రహ్మానందానుభూతిని కలిగిస్తుంది.

ఆశించే ప్రతిహృదయం ఆరాధనతో నిండిపోతుంది. అది పవిత్రం. అది దివ్యసాన్నిధ్యం. అది విచిత్ర సౌందర్యం. అదే సచ్చిదానందం. ఆ అనుభూతి క్షణికమే అయినా శాశ్వతానందాన్ని కలిగిస్తుంది. అది క్షణంలో అదృశ్యమైనా జీవితాంతం స్మృతిలో మిగులుతుంది. స్పర్శానుభూతి కాకపోయినా హృదయానికి శాశ్వత అనుభూతి నిస్తుంది. క్షణికానందమే శాశ్వతానుభూతి. అన్ని ఆనందాలకు తావలమైన మధురిమ అది. స్వర్గం ఇవ్వగల బ్రహ్మానందం అది.

స్వర్గం నిత్యనూతనం. సచ్చిదానందపూర్ణం. అతి భూమి పురాతనం, స్థిరం, జడం. ఆ సుస్థిరత్వం వల్ల భూమిపైన అలసత్వం ఏర్పడ్డది. సృష్టి అందాలు ఎంతకాలమైనా అనుభవించదగ్గవి. కానీ దివ్యలోక దృశ్యాలు పరమప్రామాణికాలు, సత్యసోపానాలు. అవి దివ్యత్వంతో, సత్యప్రేరణతో మలచబడిన దృశ్యాలు, రూపాలు, లేదా పరబ్రహ్మ స్వయంగా శిలలలో మలచిన కలల రూపాలు.

అవి సంపూర్ణ చైతన్యంతో నిండిన అమరమూర్తులు. అక్కడ చరిస్తున్న వారంతా దేవతలతో సమానులే. వారికి ఉన్నవన్నీ శాశ్వతమైన విలువలు. అవి స్వచ్ఛం, ఉన్నతం, పూర్ణం. నీడలు, తెరలు ఏవీ దివ్యత్వాన్ని అడ్డగించవు. దివ్యదృష్టిని నిరోధించవు. అక్కడ కాంతికి గ్రహణం పట్టదు. పైగా అవి హిరణ్య సచ్చిదానంద స్పర్శను కలిగిస్తాయి. దివ్యకాంక్షకు వెలుగురేఖ లవుతాయి. అక్కడ మనిషి ఆశలు నెరవేరుతాయి. ఆశయాలు సిద్ధిస్తాయి.

దివారాత్రుల సరిహద్దు రేఖ నుండి నయనతార జార్చిన తొలికాంతికిరణాలు పూర్ణత్వానికి శుభారంభాలు. అవి స్వర్గలోకపు వాకిళ్లనుండి తొంగిచూచిన

తొలికాంతులు. అవి అమందానందాలను కలబోసుకుంటాయి. అక్కడ హద్దులు, అవరోధాలు ఉండవు. అన్నీ ఛాయలే. నిప్పునెగళ్ల ప్రక్కన కదిలే రూపాలవలె ఉంటాయి. స్పష్టాస్పష్టంగా కనిపించే రూపురేఖలు. వెండిమబ్బులపై నుండి తొంగిచూచే వర్ణచిత్రాలవి. భయసంకోచాల వల్ల ఆ దృశ్యాలు కనిపించకుండా పోతాయి. చెవికి శబ్దం అందదు. అవి క్షణికానందాలు. ఆత్మలు సిగ్గుతెరల మాటున దాక్కుంటాయి. కాని దేవతలు సహృదయంతో ఆదరించినపుడు ఆత్మలు తమ ఇహలోకవాంఛలను తీర్చుకుంటాయి.

అక్కడ నందనవనాలలో దేవతలు విహరిస్తూ సంకల్పమాత్రంచే కదలిపోతుంటారు. అమలిన శృంగారం బ్రహ్మానందం కలిగిస్తుంది. అక్కడ అన్నీ దివ్యప్రభా భాసురాలే. ఎంత అనుభవించినా తనివి తీరదు. ఆనందాలు మొక్కపోవు. క్షణంలో అంతరించి, మరుక్షణంలో అవతరిస్తుంటాయి. అన్నీ సుందర సీమలే. నందన వనాలే. మధురానుభవాలే.

ఆమె నిలిచిన నేల కరిగిపోతున్నది. ఆశకు అంతం లేనట్లు ఆమె ప్రస్థానానికి అంతం లేదు. తనలోకి ప్రవహించే శబ్దాలు వింటూ, కొండకొమ్మన కదిలే మేఘమాలికలను గమనిస్తూ మార్మిక సీమలలో నడిచింది. విదేహ సౌందర్యాలను స్పృశించిన అనుభూతి కలిగింది. అత్యున్నత శబ్ద మాధుర్యాలను వినగలిగింది. అవి గాలి కెరటాలపై రాగాలాపన చేస్తూ వచ్చాయి. ఆ సంగీతం అతి ప్రాచీనం అయినా నూతనంగా ఉంది. అది వేదస్వర ఝరి. అది ఆమె హృదయతంత్రులపైన మీటినట్లుంది. అవి ఆమె మనస్సును కదిలించి పరవశింప చేశాయి. ఆత్మీయంగా పలకరించాయి. అక్కడ కామన కలత పెట్టదు. కోరికలు తీరకపోయినా తృప్తిగా ఉంటుంది. బ్రతుకు నిండుగా పండుతుంది. ఆ శబ్దాలు హృదయంలో నిశ్శబ్దంగా, మధురంగా మార్మోగుతుంటాయి. అన్నీ ఉన్నవే. ఏవీ శాశ్వతం కావు.

మనస్సు మాత్రమే చూడగల ఈ అందాలు సత్యవంతుని చుట్టూ కాంతి వలయాలైనాయి. సావిత్రి స్వప్నాలకు అవి పతాక సంకేతాలు. ఆ భావచిత్రాలకు ఆమె సాక్షి, అధికారి, ఆత్మ. అక్కడ మృత్యువు భయంకర రూపం విషాద వాతావరణం ఉండవు. అక్కడి ఆనందాన్ని, సౌందర్యాన్ని ఏవీ కదిలించలేవు. నిర్మూలించలేవు. స్పష్టాస్పష్టంగా ఉన్న ఆ దివ్యఛాయలు అక్కడి అందచందాలను ద్విగుణీకృతం చేశాయి. అక్కడి ఆనందాలు మరింత ఆత్మీయంగా మారాయి. ఆ

సౌందర్యాలు హృదయానికి కొత్త అర్థాల్ని అందించాయి. అక్కడ జీవునికి బాధ అన్నది లేదు. ఆ దివ్యతేజస్సులో చీకటినీడ లుండవు.

క్షణమాత్రంలో సావిత్రి దివ్యత్వాన్ని పొందగలిగింది. ఆమె యోగం సంపూర్ణమైంది. స్వచ్ఛమైన ఆత్మావలోకనం వెలుగుకు, తేజస్సుకు, ఓజస్సుకు ఆమె ఏకైక ప్రతినిధి. క్షణంలో ఆమె వదనం చంద్రధావళ్యమైంది. భావసాగరంపై తేలిపోసాగింది. మనస్సుకు అందనంత దూరం వెళ్లిపోయింది. తనచుట్టు ముసురుకున్న ఆనందస్వప్నాలలో సగం కరిగి మహదానందసీమలలో సగం తిరగసాగింది. అయినా ఆమె ఆత్మ అధీనంలోనే ఉంది. ఆమె పరనిర్వాణస్థితిలో ఉన్నా ఆత్మ సర్వం గ్రహిస్తూనే ఉంది. దివ్యత్వాన్ని సంగ్రహిస్తూనే ఉంది. కాని ఆమె ఆత్మ అచలం, శాశ్వతం.

30. మృత్యు సందేశం

మృత్యువు సావిత్రి మనస్సు మార్చాలని మరొక వల విసిరింది. ఆమె కల్పించుకున్న సుఖాలు, స్వర్గాలు భ్రమలని, ఏవీ చివరకు నిలచేవి కావని హెచ్చరించింది. అసలు 'ప్రేమ' అనేదే లేదని వాదించింది. స్త్రీ పురుషుల సంగమ వాంఛ ప్రేమ కాదని, అది ఇరువురి శరీరాల ఆకర్షణ అని, ఆధ్యాత్మిక స్థాయి ఆకర్షణ అసలైన ప్రేమ అని నమ్మబలికింది. భగవంతుడనేవాడు లేడని, ఉన్నా అతను మనుష్యుల గురించి పట్టించుకునే అవసరం లేదని చెప్పింది. ప్రపంచంలో ఎంతోమంది అవతార పురుషు లున్నారు, వారేం సాధించారు? తపస్సు చేసిన వారంతా ఏం సాధించారు?

"కనుక సావిత్రీ, నీ ప్రేమాలాపన వ్యర్థం. నీ ప్రేమ దైహికావసరాలకి ముద్దుపేరు. నరాల తీపు, రక్తంలో వేడి తగ్గగానే – నీ ప్రేమ చస్తుంది. నీవూ చస్తావు" అన్నాడు.

సావిత్రి అన్నది "నా ప్రేమకు, శరీరానికి సంబంధం లేదు. అది భగవత్ప్రసాదం. నా ప్రేమలో దివ్యత్వం ఉంది. అది భూమికి పరిమితం కాదు. సృష్ట్యాది నుండి నేనూ, సత్యం కలిసే జీవిస్తున్నాం." అంటుంది.

తాను ప్రేమకు, సత్యవంతుడు సత్యానికి ప్రతినిధులమని ఆమె భావం.

"నీ మనస్సు నిన్ను మోసం చేస్తున్నద" ని మృత్యువు సావిత్రిని నమ్మించ యత్నించింది.

"మట్టి నుండి పుట్టిన మనిషి మట్టిలో కలిసి పోవలసిందే" నని హెచ్చరించింది మృత్యువు.

అప్పుడు ఒక గంభీర స్వరం నినదించినట్లు వెలువడింది. అది జీవన సత్యాలను తుత్తినియలు చేసింది. నిరాశానినాదాలతో రోదసి దద్దరిల్లింది. సుందర

ప్రపంచం రసహీనమై క్షీణించి బలహీనమై ముసిరిన చీకట్లలో కలసిపోయి నట్లయింది. అసురసంధ్య వెలుగుల్లో అవి కారు మొయిళ్లయినాయి.

"నానా రూపాలు ధరించే జీవుడా! నీవు ప్రకృతికి బందీవి. స్వకల్పిత అమరత్వాన్ని ఆశిస్తూ ఊహాలోకాలలో విహరించే భావుకుడివి నీవు. సున్నితమైన నీ మానవమేధ అంతరిస్తుంది. అప్పుడు నీ ఆశయాలు, ఆరాటాలు అర్థరహితాలు. మట్టినుండి అమరత్వం పొందాలని మనిషి తనచుట్టూ ఆలోచనలను అల్లుకుంటాడు. తాను ఊహించిన దివ్యత్వాలు ఎప్పటికీ నిజాలు కావు. తన కలలలోకంలో సుకుమారంగా జీవిస్తుంటాడు.

"కరిగిపోతున్న ఆ కాంతి రూపాలను గమనించు! అవి నిరాకార, నిర్గుణ, దివ్యరూపాలు. సచ్చిదానందం నీలోకంలో ఎన్నటికీ లభించదు. కేవలం నీ ఆశలే అమృతసోనల్ని కురిపిస్తాయి. ఒక నీడకు మరొక నీడ తోడు. ఒక భ్రాంతి మరొక భ్రాంతికి జన్మనిస్తుంది. అవే నీవు మాధుర్యాలని, ఆనందాలని మురిసిపోతావు. ఈ వ్యర్థమైన పదార్థంతోనే నీ ఊహాలోకం ఏర్పడుతుంది. దాన్ని శిల్పించేది నీ భావం. దానికి ఆధారం నీ హృదయవాంఛ. నీ ఆరాటాలకు వాస్తవంలో సమాధానం లభించదు. నీ కల్పనాలోకం అటు స్వర్గంలోను, ఇటు భూమిపైన ఉండదు. మనిషి మత్తులో గమ్మత్తుగా ఊహించుకునే మధురలోకం అది. మనిషి తన కల్పనలోని మధువు త్రాగుతూ మైకంలో తూగుతుంటాడు.

"అది నీడ కల్పించే అద్భుతమైన స్వప్నభ్రాంతి. మనిషి దృష్టి దోషం వల్లనే ఆకాశం నీలంగాను, ఇంద్రచాపంలో సప్తవర్ణాలు కనిపిస్తాయి. మీ భౌతిక ఆరాటాలే ఆత్మకు ఒక రూపాన్ని కల్పించిపెడతాయి. నీలోని దివ్యభావననే 'ప్రేమ' అని భ్రమపడుతున్నావు. ప్రేమకు రెక్కలు నీ ఆనందాలు, ఉద్రేకాలు. ప్రేమ నీలో అట్టడుగున పలచని పొరగా ఉంటుంది. నీ శరీరంతో పాటు అదీ మరణిస్తుంది. నీలో రగిలే ఉద్రేకాన్ని 'అనురాగం' అనుకుంటావు. కామవాంఛ తీరడానికి ఒక శరీరం మరొక శరీరం తోడు కోరుతుంది. నీకు అనుకూలంగా ఉండే మరొక మనిషి నీకు కావాలి. అలా అనుకూలమైన తోడు దొరికే వరకు కలలుకంటావు. జీవించి ఉన్నంత కాలం ప్రతి మనిషికి తోడు కావాలి. మనిషి ఒంటరితనం భరించలేడు. ఆకలి మీదున్న జంతువు ఏ పొదమాటునో దాగి వేటకోసం చూస్తుంది. మనిషీ అంతే. తన కామం తీరడానికి మరొకరి కోసం వెదుకుతాడు. అలా జీవితాంతం వాంఛించడమే శాశ్వతత్వం అనుకుంటున్నావు?

"ఓ మనిషీ! క్షణికమైన సుఖం కోసం ఎంతకు తెగిస్తున్నావు. ఈ నిరాకార, నిర్గుణ, శూన్య అఖాతాలలోకి నన్ను వెంబడించి వచ్చావు. చీకటిలో వెదుకు తున్నావు. అశాశ్వతమైన సుఖానికి అమరత్వం ఆపాదించుకుని నీ హృదయాన్ని ప్రలోభాలకు లోనుచేశావు. నీవుగా కల్పించుకున్న కృత్రిమ అమరత్వం ఇది. ఇక్కడ సృష్టి జరిగేది శూన్యంలో. అన్నీ శూన్యం నుండి పుట్టేవే. అవి తిరిగి శూన్యంలోకి వచ్చి, రోదసిలో కలసిపోతాయి. అంతవరకు ఒక అగోచరశక్తి వాటిని నడిపిస్తుంది. ఆ తర్వాత తమ 'ఆది' అయిన శూన్యాన్ని అశ్రయిస్తాయి. చివరకు మిగిలేది అచలం, ఏకత్వం. ఆ ఏకత్వంలో నీ ప్రేమకు అవకాశం లేదు. దానికి నశించిపోయే ప్రేమపూత అవసరం లేదు. అసలు నీది అనేది ఏముంది? నీ అస్తిత్వంతో అన్నీ అరువు పదార్థాలే.

"నీలో సహజంగా ఉన్న దివ్యత్వం మాసిపోయేది కాదు. నీవు కల్పించుకున్న అమృతత్వం ఎప్పటికీ లభించదు. ఒక రూపంలో దాగి వున్నంత కాలం దివ్యత్వానికి విలువ రాదు. దాని ఔన్నత్యం నిలవదు. అసలు ఒక శరీరంలో ప్రవేశించగానే దివ్యత్వం నిద్ర పోతుంది. అది మనిషికి దూరంగా ఉన్నంతసేపు మహోన్నతంగా ఉంటుంది. అది భౌతికతలోకి అయిష్టంగానే ప్రవేశించి, హృదయంలో అజ్ఞాతంగా దాగి ఉంటుంది. మనిషి కాదన్నా అది అక్కడ నుండి కదలదు. అది నిరాకారం, నిశ్చలం. కనుక మనిషికి దానివల్ల ఇబ్బంది లేదు. మనిషి ప్రార్థనలు, విన్నపాలు మౌనంగా వింటుంది, కాని సమాధానం చెప్పదు. అడిగినవన్నీ అనుగ్రహించదు. మనిషిలోని దివ్యత్వానికి కాళ్లు, చేతులు లేవు. కనుక అది కదలదు, మెదలదు.

"అది పరమాత్మను నిరాకారం చేసింది. అదే మనిషిని ఆలోచనాజీవిని చేసింది. అదే దివ్య భావాలకు అనేకరూపాలు చిత్రించింది. మనిషి చేసే అన్ని పనులపైన దాని ప్రభావం ఉంటుంది. దాని స్మృతులే మనిషికి మతం, సంప్రదాయం. మనిషి నిర్జీవ సంప్రదాయాలను పట్టుకుని వదలడు. తన సుగుణాలపై ఆదర్శం అనే ముసుగు కప్పుకుంటాడు. దివ్యత్వం అనే తెరమాటున తన అల్పత్వాన్ని ప్రదర్శిస్తుంటాడు. భౌతికరూపం ప్రాపంచిక అవగుణాలు కప్పిపుచ్చుకోడానికి అతని దివ్యత్వం నటన. భూమి ఎప్పటికీ స్వర్గం కాదు. స్వర్గం అంటూ ఉంటే, అది స్వీయప్రతిభ వెనుక దాగి ఉంటుంది. అనంతసత్యం అనేది ఉంటే అది అగోచరంగానే ఉంటుంది. అదీ పరమాత్మ అధీనంలో ఉంటుంది. ఈ లోకపు అసత్యాలకు సత్యం ఎన్నటికీ చేరువ కాదు.

"ఏ సుఖం లేని భూమి పైకి స్వర్గం ఎలా దిగి వస్తుంది? కరిగిపోయే కాలంలో అమరత్వం ఎలా నిలుస్తుంది? అశాశ్వతమైన నేలపైన స్వర్గం నిలవరించుకోలేదు. ఇక్కడి జీవితం ఆశల మయం, ఆవేశాల మయం. ఇది శ్రమలతో నిండి ఉంటుంది. పదార్థంతో ఏర్పడ్డ భూమికి పదార్థమే పోషణ. ప్రకృతి కొలిమిలో అగ్ని రగులుతుంది. మృత్యువు అంతిమ గమ్యంగా జీవనయాత్ర సాగుతుంది. అవతార పురుషులు అనవసరంగా వచ్చి పోతుంటారు. ఋషుల బోధనలు, ప్రవక్తల హితోక్తులు నిరుపయోగాలు. ఎక్కడా ఊర్ధ్వ లోకాలకు చేరే మార్గం కనిపించదు. బొంగరం వలె తిరుగుతున్న సూర్యుని చుట్టు భూమి గతి మార్చకుండా తిరుగుతుంది. కాని తిరిగేది భూమి, తిరగక స్థిరంగా ఉండేది సూర్యుడు. భూమి పతనోన్ముఖంగా పయనిస్తుంది. ఏశక్తి భూమి లోపాన్ని సరిదిద్దడం లేదు. మనిషి అజ్ఞానంపై దివ్యకాంతి ప్రసరించడం లేదు. మృత్యువు తిరిగే చోట దైవత్వం స్థిరపడదు.

"సూర్యుని రథం పైన పయనిస్తున్న సారధీ! ఈ పవిత్రమందిరంలో నీవొక పూజారివి. నీ విచిత్ర కర్మకాండలతో ప్రేమను, దివ్యత్వాన్ని ఆరాధిస్తావు. నీ ప్రేమకు విలువెంత? నీ చరిత్రకు విలువెంత? నీవు అపరిమితంగా వాంఛిస్తున్నది ప్రేమ. ఆ ప్రేమ నీ నరాలను మండిస్తుంది. వాంఛల్ని రగిలిస్తుంది. ఆ ప్రేమతో నీ ఆనందం, సుఖం, విషాదం ముడిపడివుంది. నీ జీవితం మహోజ్వలంగా గడుస్తుంది ప్రేమ ఉన్నంతకాలం. ఆ తర్వాత లోకం యదాతథంగానే సాగుతుంది. జీవితంలో ఎవరికైనా కొంతకాలం మాధుర్యం, కొంతకాలం యాతన. దివ్యత్వం కోసం ఆరాటం దివ్యత్వం కాదు. కాల ప్రవాహాన్ని దాటి అవతల ఒడ్డుకు చేరితేనే దివ్యత్వం కనిపిస్తుంది. జీవితం ఈ ఒడ్డు నుండి చూస్తే అవతలి ఒడ్డు కనిపించదు. నీ ఆకాంక్ష జీవితాన్ని అమరత్వంతో ముడివేసే బంధం.

"కాని, అది చాలా దుర్బలం. నీ ఆనందం క్షణికం. దేవతలు మనిషికి ప్రసాదించే వరాలన్నీ తాత్కాలికాలే. ఆత్మకు ఆత్మకు మధ్య అనుబంధం ఎప్పుడూ ఉంటుంది. శరీరాల కలయిక వల్ల పొందే ఆనందం ఆత్మానందం కాదు. అది నరాలు కలిగించే తృప్తి, అది సుఖం. ఇంద్రియసుఖాలు కలిగించేది చిత్రమైన పారవశ్యం. సత్యవంతుడు జీవించి ఉంటే ప్రేమ మరణించి ఉండేది. ఇప్పుడు సత్యవంతుడు మరణించాడు కనుక ప్రేమ బ్రతికి పోయింది. నీ ప్రేమ అతని రూపం నీ మనస్సునుండి తొలగిపోయే వరకు ఉంటుంది. తర్వాత వేరే రూపాలు ఆ స్థానం ఆక్రమిస్తాయి.

“తొలిసారిగా ప్రేమ తన జీవితంలో ప్రవేశించినప్పుడు మనిషి తానొక విచిత్ర లోకంలో ఉన్నాననుకుంటాడు. చిత్రమైన అనుభూతికి లోనవుతాడు. ప్రేమ పారవశ్యంలో తానున్నది స్వర్గం అనుకుంటాడు. వాస్తవానికి అస్థితి ఈ ప్రపంచంలోనిదే. అదొక మైమరపు. అది స్వర్గసుఖం అనుకుని అనుభూతితో పరవశిస్తాడు. ఆ ప్రేమ సరోజం రేకల మాటున విషం ఉంటుంది. అక్కడొక విషనాగు ఉంది. ఒక్క అనృతం చాలు, ఒక్క దుష్కర్మ చాలు దివ్యత్వాన్ని కాటు వేయడానికి. మనిషి అమరత్వం అతి దుర్బలం, అత్యంత సున్నితం.

“మనిషిని బాధించడానికి, చంపడానికి వేయి మార్గాలున్నాయి. స్వర్గ సుఖ భోజ్యాలతో ప్రేమ నిలవదు. ప్రేమ బ్రతకడానికి భౌతికమైన ఆలంబనలు అవసరం. ఇంద్రియ సుఖాలకు మరొక ముద్దుపేరు అనురాగం. శరీరానికి, హృదయానికి ఆకలి ఉంటుంది. అనురాగం తగ్గిపోతుంది, నశిస్తుంది. ప్రేమ విఫలం కావచ్చు. ప్రతికూల వాతావరణంలో ప్రేమికులు చిత్రహింసలు అనుభవిస్తారు. ఒక ప్రేమ విఫలమై చెలికాడు దూరమైతే, మరొకరికి నీ ప్రేమను పంచియిస్తావు. ప్రేమ స్థానంలో కొంతకాలం నిరాశ, నిర్వేదం చోటు చేసు కుంటాయి. నీ కిష్టమైన మరొకవ్యక్తి ప్రేమ నీ హృదయంలో చొరబడుతుంది. అయిష్టంగానైనా దాంపత్యసుఖం అనుభవిస్తావు. కాలంతో రాజీ పడి జీవించడం అలవాటవుతుంది.

“ఏవో దివ్యశక్తుల ప్రమేయంతో, ఒక సుముహూర్తంలో ఆధ్యాత్మిక క్షేత్రంలో అమర్త్వత బీజాలు నాటుకుంటాయి. అప్పుడు భౌతిక సుఖాలు లేకపోయినా దంపతులిద్దరూ కలిసే జీవిస్తుంటారు. ఇరువురి ఆత్మలు ఒకటి కావడానికి తపస్సు చేస్తారు. మనుషులు వేరైనా వారి మనసులు, ఆలోచనలు ఒకటిగానే ఉంటాయి. ఇరువురి ఆత్మలు ఒకే బాటలో పయనించడం ఆత్మ దాంపత్యం. మనిషికి పెద్ద ప్రలోభం స్వర్గం, స్వర్గసుఖాలు. సవ్యంగానో, అపసవ్యంగానో కొన్ని భ్రమలు ఏర్పడతాయి. కొన్ని జీవన విధానాలు ఆత్మల్ని నిస్సహాయం చేస్తాయి. స్వర్గంగా భావించిన జీవితం నరకప్రాయమవుతుంది. ఆ ప్రమాదం నుండి సత్యవంతుని, నిన్నూ రక్షించేది మృత్యువు. అతనిప్పుడు జీవితం నుండి విముక్తి చెంది ఆనందంగా ఉన్నాడు, సురక్షితంగా ఉన్నాడు. నీవు చెప్పే నిశ్శబ్దంలో బ్రహ్మానందం అనుభవిస్తున్నాడు. అతనిని మళ్లీ ప్రపంచ కశ్మలంలోకి రమ్మని పిలవకు. చాపల్యపూర్ణమైన మానవ జీవితంలోకి ఆహ్వానించకు. నా విశాల శాంతి సీమలలో అతనిని సుఖించనివ్వు, అక్కడ విశ్రమించనివ్వు.

"మృత్యువు ప్రసాదించే ప్రశాంతిని మించిన శాంతి జీవికి ఎక్కడా లభించదు. ఆ ప్రశాంతి గుండెలో ప్రేమ శాశ్వతంగా ఉంటుంది. పవిత్రంగా ఉంటుంది. నీవు నీ అస్థిర ప్రపంచంలోకి ఒంటరిగా వెళ్లిపో. నీ హృదయాన్ని జ్ఞానంతో, ప్రజ్ఞానంతో నింపుకో. నీ స్వభావం స్వచ్ఛందంగా జీవన శిఖరాలను చేరనివ్వు. ఆ శిఖరాలపై నుండి స్వర్గాలను దర్శించు. నీలోని జీవునికి కలలుకనే అవసరం రానీయకు.

"జీవునికి కలలుకనే అవకాశం ఇచ్చినప్పుడు ఏదో ఒక అవసరం, ఒక వ్యామోహం కలుగుతుంది. అంతవరకు నీవు పొందుతున్న స్వచ్ఛమైన ఆనందం కలుషితమవుతుంది. హృదయం బలహీనం కారాదని, ఊగిసలాట పనికి రాదని నీవు గ్రహించు. ఆత్మ ఒక్కటే ఆనంద సాగరాలపై పయనించగలదు. నీ మనస్సు చేసే కల్పనలన్నీ నిరుపయోగాలు. ఆశలు, ఆనందాలు, ఆశయాలు వదలిపెట్టు. నిష్కళంక నిష్కల్మష హృదయం నిశ్శబ్దంలో శాంతిని పొందగలదు. అదే నిన్ను నీ మార్మిక సీమలకు చేరుస్తుంది. నా అనంత సామ్రాజ్యంలో నీవు గతాన్ని విస్మరించు. నీ ఆత్మశక్తిని వదులుకుంటే, గత జన్మల బాధలు మరచిపోతావు. సృష్టికి పూర్వం నెలకొన్నస్థితి నాది. ఇక్కడ అంతా ఆధ్యాత్మికానందమే. అగ్నిపుష్పాల వలె రగులుతున్న గోళాలు, అంబరాలను తాకే ఆలోచనలు, రోదసిలో చలిస్తున్న గోళాలు అన్నీ మరచిపో. కాలాన్ని మరచినప్పుడే ఆత్మ అమరత్వాన్ని పొందగలదు".

అంతటితో ఊరుకోక ఆమె కాల పురుషునికి సమాధానం చెప్పింది –

"ఓ మృత్యుదేవా! నీవు ఎన్నుకున్న భయంకర సంగీతం విషాదస్వరాలను వినిపిస్తోంది. నీ భావాలు బాధాకరంగా ఉన్నాయి. అలసిపోయిన నా ఆశలు కొత్తచివుళ్లు వేశాయి. నీ అనృతాలు సత్యంపై నల్లని చారికలైనాయి. నీ స్వరం నా ఆత్మను కదలించలేదు. నా ప్రేమ హృదయానికి, శరీరానికి సంబంధించింది కానే కాదు. అది ఆకలి కాదు. కామం అంతకన్నా కాదు. అది పరమాత్మ నుండి వచ్చింది. తిరిగి పరమాత్మనే చేరాలి.

"మనిషి తన జీవితంలో ఎంత క్షోభ పడినా, ఎంతగా హత్య చేయబడినా అతనిలో రవంత దివ్యత్వం లీలగా కదులుతూనే ఉంటుంది. పైలోకాల నుండి దివ్య పరిమళాలు అందుతూనే ఉంటాయి. మనిషికి ప్రేమే దైవం, ప్రేమే స్వర్గం. ఆ ప్రేమ తీయని వలపుగా, వలపే ప్రేమాగ్నిగా మారి దహిస్తుంది. అపరిమితమైన ఆరాటంలో ఆశ జనిస్తుంది. విస్మరించిన ఔన్నత్యం పిలుపు వినిపిస్తుంది.

దివ్యసీమలలో సంచరించే ఆత్మలు ఆవేదన గ్రహించి సహాయం చేస్తాయి. కనుక ఆత్మ ఎప్పుడూ స్వచ్ఛంగా, నిర్మలంగానే ఉంటుంది.

"పాప పంకిలంలో బ్రతికినా, ఒకనాటికి క్షాళన జరిగి తీరుతుంది. దేవతా ప్రభావాల నుండి తప్పుకుంటాం. మాదైన సత్యలోకాన్ని చేరగలం. జగన్మాతను సేవించగలం. మా ఆత్మల్ని అమ్మకు పూజాసుమాలు చేసి సమర్పించగలం. అప్పుడు మాకు అర్హమైన, మేం అన్వేషించే బ్రహ్మానందం లభిస్తుంది. పరబ్రహ్మత్వం సిద్ధిస్తుంది. స్వర్గం అప్రశమంగా చేజిక్కుతుంది. ఆపైన దేవతల కోసం అన్వేషణ ఉండదు. కాని, అదనెరిగి క్షుద్రశక్తులు మనుషుల్ని లోబరచుకుంటాయి. దివ్యశక్తులు చేయవలసిన పనులు అవి చేస్తాయి. అయినా జగన్మాత అనుగ్రహం ఉంటుంది. ఆ దేవి అభయహస్తం మమ్ము రక్షిస్తూ ఉంటుంది. చెడిపోయిన బిడ్డలను సైతం ఆ తల్లి క్షమిస్తుంది.

"ప్రేమను తనలో నింపుకున్న వ్యక్తి, తానే ప్రేమమూర్తిగా ప్రేమ స్వరూపమై, ఈ విశ్వంలో అందరికీ తన ప్రేమను పంచియిస్తాడు. ఆ ప్రణయ తాండవంలో ఆకర్షణ వికర్షణలు పుట్టి లయించి పోతుంటాయి. మనిషి తన మనస్సు కల్పించే ప్రలోభాలకు లోనై కన్నీటిలో మాధుర్యం, ఆనందంలో పశ్చాత్తాపం పొందుతాడు. ఆగ్రహాలకు అనుగ్రహాలకు పాత్రుడవుతాడు. ఆత్మ సంగీతంలో అన్నీ జంటస్వరాలే. రెండూ చివరకు అమరత్వంతో రాజీపడతాయి.

"పరమాత్మ దివ్యమూర్తిమత్వం కాల ప్రవాహాలను ఈది సరికొత్త రూపాలలో మమ్మల్ని చేరుతుంది. ఆ అనుగ్రహమే మాకు రక్ష. అది దూరం నుండి వినిపించే వేణునాదం వలె సమ్మోహన పరుస్తుంది. జనారణ్యాలలో వెన్నెల కొమ్మలపై వాలి, క్రిందికి జారి, మా అన్వేషణను ప్రోత్సహిస్తుంది. అదే నా ప్రియుని రూపంలో నన్ను చేరింది. నా ఆత్మకు అండగా నిలిచింది. ఆ ప్రేమమూర్తి నా కోసం సత్యవంతుని రూపం దాల్చాడు. మేమిద్దరం అనాదిగా దంపతులం. ఒకే అగ్నికి చెందిన రెండు సమిధలం. పరలోకం నుండి అతను నాకై దిగివచ్చాడు. ఈ మహారణ్యాలలో నా కోసం ఎంతో కాలంగా వేచి ఉన్నాడు. నన్నే వెతుకుతూ కాలం గడిపాడు. నా కోసం ఎంతగా తపించాడో నాకు తెలుసు. సృష్టి ఆరంభం నుండి 'సత్యం' నన్ను వాంఛిస్తూనే ఉన్నాడు.

"జలప్రవాహంలో ఎగసిన తరంగం వలె నన్ను తనలోకి లాక్కున్నాడు. నా గతం నుండి నన్ను ఉద్ధరించాడు. మంద మలయానిలం వలె అతని చేతులు

నన్ను స్పృశించాయి. నేనొక పూలతీవ వలె అతన్ని అల్లుకున్నాను. అతని అనురాగాగ్నిలో నన్ను ఆనందంతో కాల్చి వేశాడు. నేను తనని అనేక సుందర రూపాలలో గుర్తించగలిగాను. ఎంతదూరం నుండి పిలిచినా అతని పిలుపుకు పరవశించాను. మేము ఇద్దరం కలిసి అనేక అవరోధాలను దాటగలిగాం. అతనిని మించిన దేవుడు ఎవరైనా ఉంటే ముందుగా నా సత్యవంతుని రూపం ధరించమనండి. నేను ప్రేమించే అతని ఆత్మలో తన్మయత్వం చెందమనండి. నేను ఇష్టపడే రూపంతో నన్ను పాణిగ్రహణం చేయమనండి.

"నా హృదయానికి స్పందన కలిగించగలది ఒకే హృదయం. నా హృదయ పీఠం పైన ఉన్నది ఒకే ఒక్క దేవుడు. ఈ ప్రాపంచిక భ్రమలను దాటిపో మహాత్మా! కాలపురుషా! ఈ లోకంలో అందరి వంటి దానిని నేను కాను. నేను అగ్నిని, తేజస్సును. నీవు ఊహించినట్లు స్వప్నసుందరిని కాను."

మృత్యువు మరొకమారు తన ప్రయత్నం కొనసాగించింది. తన భయద గంభీర స్వరంతో ఆమె హృదయాన్ని గాయపరచింది.

"నీ ఆలోచనలన్నీ అందమైన కలలు. ఆధ్యాత్మిక స్వప్నాలలో తూగిపోతూ సుఖాలకు, లాలసకు బానిసవై పోతున్నావు. చిన్నపక్షి సూర్యగోళాన్ని చేరాలని తపించినట్లున్నది నీ వాలకం. నీ హృదయారాటం మాటల రెక్కలు కూర్చింది. ప్రేమించే హృదయంలో ప్రజ్ఞ నిలవదు. హృదయం అందించే మాటలు 'వివేకం' నుండి జారిపోతాయి. భూమిని స్వర్గంగా మార్చాలన్న నీ ప్రయత్నం నెరవేరదు. అసలు స్వర్గం, దివ్యత్వం రెండూ కల్పనలే. జీవం ప్రవేశం వల్ల ద్రవ్యం చైతన్యం పొందుతుంది. ద్రవ్యచలనం వల్ల మేధ ఏర్పడుతుంది. మనిషి ఎంత ఎత్తులకు ఎదిగినా కాపురుష లక్షణాలను వదలడు. ప్రాయికమైన పరిజ్ఞానంతో ముందుకు పోతున్నాననుకుంటాడు.

"మనిషి మనస్సు గగనసీమలలో స్వేచ్ఛగా తిరుగుతుంది. నేలపైన మాత్రం కుంటినడక నడుస్తుంది. జీవితంలోని ఒడిదుడుకులు, ప్రతికూలతలు మనిషి తట్టుకోలేడు. ఇంద్రియవాంఛల్ని అదుపు చేయలేడు. ఆలోచనలు మాత్రం స్వర్గం వరకు పరుగుతీస్తాయి. స్వర్గం నుండి సుఖ నిక్షేపాలను ఆశిస్తాడు. చేష్టలు మాత్రం నేలబారుగా ఉంటాయి. నీ స్వప్నాలను సృష్టించేది భౌతికమైన నీ మేధ. అది భౌతికమైన బందిఖానాలోనే తృప్తిగా ఉంటుంది. అదే మనకు వాస్తవం, యదార్థం.

"కాలానుసారం సృష్టికి అనుకూలంగా ఏర్పడిన రూపమే యదార్థం

అయింది. భూమి ఏర్పాటుకు పదార్థం అవసరం. పదార్థం వల్లనే రూపం ఏర్పడి వాస్తవం అనిపిస్తుంది. మనస్సు, జీవం పోయిన తర్వాత గానీ పదార్థం నశించదు. అది నశించినప్పుడు ఆ జీవి తాలూకు సర్వం నశించినట్లే. 'పదార్థం' ఏర్పరచిన శరీరంలో మనస్సు మోజుపడి పెంచుకున్న పూవు 'ఆత్మ'. అది పూచిన చెట్టు నుండి క్రిందికి దిగదు. 'ఆత్మ' భూమిని వదలి ఎప్పుడు ఆకాశంలోకే చూస్తుంది. నీ ఆలోచనలన్నీ భౌతిక ప్రపంచపు కొసమెరుపులు. నీ జీవితం భవసాగరంపై కదిలే ఒక తరంగం.

"'సత్యపథం' చాలా ఇరుకు. ఆ ఇరుకు బాటలో అప్రమత్తంగా పయనించాలి. చెదరిపోయిన శక్తుల్ని కూడదీసుకోగలగాలి. అప్పుడే 'సత్య' దర్శనం సాధ్యం. అది వివేకం అనే కత్రాతికి మనస్సును కట్టివేస్తుంది. జీవితంలో ప్రలోభాలకు మనిషిని బానిసను చేస్తుంది. 'ధర్మం' పేరుతో అందరినీ బంధిస్తుంది. ఈ మానవ శరీరంలో ఏర్పడే అనేక రసాయనిక పరిణామాలు మేధను జీవితంతో కలిపి నడిపిస్తాయి. పదార్థ ప్రక్రియ విఫలమైనపుడు పగుళ్లు ఏర్పడతాయి. పదార్థంలో జీవం ఉన్నంతకాలం అంతా బాగానే అనిపిస్తుంది. అయినా మనిషికి భద్రత లేదు. 'జీవం' నిష్క్రమించగానే మనిషి 'నావి' అని చెప్పుకునే శక్తులన్నీ మట్టి కరుస్తాయి.

"ఏవీ లేకపోయినా ఉన్నవనే భ్రమ కలుగుతుంది. ఆకృతి, సంకేతం – అన్నీ శూన్యాలే. జీవుని రూపాలకు తిరిగి జన్మించే హక్కు లేదు. సుస్థిరమైన జీవాత్మకు అస్థిరమైన రూపం ఒక ఆచ్ఛాదన. విశ్వశక్తి తాండవంలో అవి కొన్ని భంగిమలు. అవి చలనరూపాలు. శూన్యమైన రోదసిలో అవి మెరుపుల మరకలు. ఏ మార్పు లేకపోయినా మారుతున్నట్లు కనిపిస్తుంది. అయినా మారడం సహజం. చివరి మజిలీ మృత్యువు. ఒకప్పుడు ఎంతో వాస్తవం, స్థిరం అనుకున్నది మహాశూన్యంలో కలుస్తుంది. ఆ విచిత్ర రూపాలు బుసకొట్టి మనిషి వివేకాన్ని కబళిస్తాయి. ఆద్యంతాలు లేని శూన్యం సైతం ఒక కల్పనే అవుతుంది. నిజానికి ఏమీ లేనిది ఉన్నదనే భ్రమ శూన్యమే. మరేదో దివ్యశక్తితో సృష్టి, రూపాలు ఏర్పడుతున్నాయన్నదీ భ్రమే. మృత్యువు అనుగ్రహంతో అన్నీ కొంతకాలం జీవిస్తాయి. మృత్యువు వల్లనే ఆలోచిస్తాయి, పరిశ్రమిస్తాయి.

"నీ ఆలోచనల మాధుర్యపు మత్తులో నీ హృదయంలోని అసలైన చిత్రాలను చూడలేకపోతున్నావు. అంతర్దృష్టితో నీలోకి చూడాలని ప్రయత్నించవు. కళ్లు మూసుకుని నీ ఇష్టదైవాలని ఆరాధించాలనీ అనుకోవు. నీవూ, నీ చుట్టూ ప్రపంచం

ఎలా ఏర్పడ్డదో తెలియాలంటే కళ్లు మూసుకుని నీలోకి చూచుకో! అంతా గమనించు.... అర్థమవుతుంది.

"అసలు ఉన్నదంతా శూన్యం. అందునా అంధకారం. అందులో ఒక చలనం కలిగినప్పుడు సృష్టి జరిగింది. సృష్టి కొంతకాలం భద్రంగా, అచేతనావస్థలో ఉంది. కానీ, అలా ఎక్కువ కాలం కొనసాగలేకపోయింది. తర్వాత జడప్రపంచపు చీకటి గుండెలో ఒక వెలుగు ప్రవేశించింది. చైతన్యం కలిగింది. జీవజాలం ఏర్పడి చూడడం, తెలుసుకోవడం, ప్రేమించడం, అనుభూతించడం మొదలైంది. ఆ కదలికలో ఆత్మను ఊహించింది. ఆత్మ సత్యాన్వేషణ సాగించి పరమాత్మను సంభావించసాగింది. సృష్టి చైతన్యరహితంగా ఉన్నంతకాలం అంతా సవ్యంగానే ఉంది.

"నేను మృత్యువును. నా అధికారం ఎన్నటికీ పోదు. నా పథకం చెడదు. నా సంకల్పం మొక్కవోదు. సర్వాన్ని నేను సృష్టించుకోగలను. అవాస్తవికమే అయినా తిరిగి నా అధికారాన్ని శూన్యం ఆమోదించి నేను కోరిన రూపాలను ఇస్తుంది. నేను అనాలోచితంగా ప్రవర్తించినా, అదే చివరకు విధిరాతగా పరిగణింప బడుతుంది. ఏ ధర్మసూత్రాలైనా విధిని కాదనవు. అన్నీ కడకు నిర్వీర్యమై శూన్యంలో కలిసిపోయేవే. అన్నీ ప్రకృతికి అనుగుణంగా వర్తించవలసిందే. ఈ మహా శూన్యంలో 'రోదసి'ని ప్రకల్పించింది నేను. రోదసిలో ప్రాణవాయువును నింపింది నేను. ఈ విశ్వకార్యానికి అగ్నుల్ని రగిల్చింది నేను. ఒక మహాగ్నిని రగిల్చి దానిని ముక్కలు చేసి శూన్యంలో విసిరివేశాను. అవే గోళాలుగా మారాయి. అవే రోదసిలో నియమబద్ధంగా చరిస్తున్నాయి.

"అణువుల్ని, వాయువును కలిపి ఈ సుందర ప్రపంచాన్ని సృష్టించాను. రసాయనాలు కలిపి మనిషిని తయారుచేశాను. మనిషికి ఆలోచన ఏర్పడింది. విశ్వంలో సామరస్యం దెబ్బతిన్నది. మనిషి భౌతికతను ఆశించడం, ఆహ్వానించడం జరిగింది. నరాలు అణువులు కలిసి ఆనందాన్ని, విషాదాన్ని సృష్టించుకున్నాయి. లోకం ఆలోచించసాగింది. భగవంతుని సైతం మనిషి ఊహించగలిగాడు. అతనికి వివేకం తోడైంది. మనిషి వాంఛలు, కోరికలు ఆకాశం ఎత్తుకు పెరిగాయి. ఇంకా జడస్థితిలోనే ఉన్న భూమి కలవరపడ్డది. ప్రశాంతంగా ఉండే ప్రకృతికి మనిషిపై కోపం వచ్చింది.

"అప్పుడు ఆత్మ జీవుని సుఖదుఃఖాల నుండి దూరంగా జరిగింది. వాటితో తనకు నిమిత్తం లేదని తన క్షేత్రాన్ని ఏర్పరచుకుంది. భౌతికత నిద్రిస్తుంది. మనస్సు

శాశ్వతం కాదు. జీవులంతా ప్రకృతి అధీనంలో ఉండేవే. మానవ ప్రజ్ఞ పోయిపోయి అజ్ఞానంలో చిక్కుబడి పోయింది. ఇదీ నీవు మెచ్చే ప్రపంచం. ఇది నీ మానవమేధ సృష్టించిపెట్టిన అయోమయం. మానవ జీవితం నిత్యం పరిభ్రమిస్తుంది. నీవు ఆత్మమార్గంలో పరమాత్మను సంభావిస్తావు. ఒక యంత్రంలా పనిచేస్తున్న నీ శరీరంలో ఆత్మకు, పరమాత్మకు, ఈశ్వరీయతకు చోటు ఏదీ? స్వల్పమైన ప్రాణాన్ని నీవు ఆత్మగా భావిస్తున్నావు. పంచభూతాలతో ఏర్పడిన శరీరంలోని మేధను మహత్తరం అని భ్రమిస్తున్నావు. అదే పరమాత్మ అంటావు. అది నీ నీడ మాత్రమే.

"ఊర్ధ్వలోకాలకు, అధోలోకాలకు మధ్యన శూన్యంలో చిక్కుకున్న నీ ప్రజ్ఞ నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మాత్రమే తెలుసుకోగలదు. అది నీ జ్ఞానానికి వికృతరూపం. ఏవో ఊహించి, ఏవేవో పొందాలని యత్నిస్తుంది ప్రజ్ఞ. అసలు సత్యంలో సగమైనా భూమిపైకి వచ్చి ఈ చీకటి నేలపై వెలుగును క్రుమ్మరిస్తే కొంతవరకైనా తేజస్సు ప్రచలితమవుతుంది. నీ ఆత్మ కేదో అమరత్వం సిద్ధింప చేయాలనుకుంటున్నావు. అసంపూర్ణంగా ఉన్న మానవునికి అమరత్వం ఎలా సిద్ధిస్తుంది? అడుగడుగున హింసలకు పాల్పడుతున్న ఈ జీవుడు అనంతంగా బాధలకు గురికావలసిందే. ప్రజ్ఞ, ప్రేమ నీ జన్మహక్కు లన్నావు. ఈ ప్రపంచంలో స్వచ్ఛమైన జ్ఞానం ఎక్కడుంది? ఎవరికి ఉంది? అజ్ఞానం పొరల క్రింద ముక్కిపోయింది నీ వివేకం.

"నీ మానవప్రేమ ఈ ప్రపంచానికే పరిమితం. కిన్నెర నృత్యాన్ని కాకులు అనుసరించినట్లు – అనుభవంతో పొందదగిన జ్ఞానాన్ని మనిషి వివేకంతో కల్పించుకుని జ్ఞాపకాల అడుగున దాచుకుంటాడు. ఎప్పటికైనా అది పని కొస్తుందని మనిషి ఆశ. కామగ్రంథులలో కలిగే ఉద్రేకాల వల్ల, నరాల ఒత్తిడి వల్ల పుట్టే వేడి వల్ల ఏర్పడే మధురరసం నీ ప్రేమ. అది నీ హృదయంలోకి చేరి విషంగా మారుతుంది. దానినే అమృతం అని భ్రమిస్తున్నావు.

"మానవవిజ్ఞానం మహత్తరమైనదేమీ కాదు. ప్రేమ అనేది స్వర్గం నుండి దిగి వచ్చిన సుధారసం కాదు. భౌతిక వాతావరణం దాటి పైకి పోదలచినప్పుడు మైనపు రెక్కలు కట్టుకుని సూర్యునికి దగ్గరగా పోకూడదు. భ్రమలలో ఎత్తులకు ఎగరలేవు. ఈ భూమిపైన దివ్యప్రజ్ఞ నిలవదు. ఈ నేలపై అమర ప్రేమకు అవకాశం లేదు. స్వర్గం చేరినవారు స్వర్గంలోనే జీవిస్తారు తప్ప భూమిపైకి దిగిరారు. స్వర్గజీవితం సైతం ఒక మెరుపు స్వప్నం. నీ ఊహలు అన్నీ స్వప్న సదృశాలు. నీ మనస్సు, జీవం రెండూ ప్రాపంచిక మాయలు. నీ మనస్సు నీ కొరకు ఒక

స్వర్గాన్ని కల్పించవచ్చు. అది ఒక ఆనందభ్రాంతి. వెలుగుకిరణంలో నీ భౌతిక జీవనం కల్పిస్తున్న భ్రాంతి.

"సహజమైన దివ్యత్వాన్ని తనలోకి ఆహ్వానించలేక కనిపించే అవాస్తవంతో రాజీపడి తనకు పరమలక్ష్యం అయిన దివ్యత్వం దూరం కాగా, మట్టిలో పుట్టిన మనిషి మట్టిలోనే కలిసిపోతున్నాడు. అతని భౌతిక సంపదలన్నీ అగోచర శక్తిలో కరిగిపోతాయి. అగోచరశక్తి మహాశూన్యంలోని ఒక మధుర స్పందన. ఆ స్వర్లోక సౌందర్యాలను భూమిపైకి ఎలా రప్పించగలవు? అసలు నీ జీవితమే స్వప్నం. ఆ స్వప్నంలో నీ కల్పన మరొక స్వప్నం. నీకై ఊహించుకున్నది ఎలా యదార్థం అవుతుంది?

"నీవు సృష్టించుకున్న స్వర్గం నీ మనో కల్పన. నీ భావం, భాష కల్పించిన సుందరరూపం. నీ సౌందర్యారాధన వల్ల ఆ రూపాన్ని ఊహించగలిగావు. ప్రకృతి దానిని ఆమోదించదు. అసలు దివ్యరూపాలు నీకు ఎన్నటికీ కనిపించవు. కనిపించే వన్నీ నీ మనస్సు కల్పించే రూపాలు. నీ కోరిక జీవితకాలంలో తీరదు. నీ ఆలోచనల మెరుపులు నీ ఆత్మను మోసగిస్తాయి.

"స్వర్గాన్ని స్వప్నిస్తున్న ఓ లలనా! నీవు ప్రాపంచిక ధర్మాలను పాటించు. నీ జీవితంలో ప్రవేశించే వెలుగుల్ని అనుభవించు, సుఖించు. జీవితం అందించే ఆనందాలను పొందు. చివరకు విధి శాసనానికి తలవంచు. నీ వంతు కష్టాలు, బాధలు నీవు అనుభవించక తప్పదు. నీ కన్నీళ్లు నీకొరకే! నీ అనురాగ హృదయానికి ఊరట కలిగించు. చివరకు శాశ్వతనిద్రలోనే పరమసుఖం లభిస్తుంది. ఎక్కడనుండి వచ్చావో అక్కడికి తిరిగి వెళ్లిపో!"

31. ప్రేమ : మృత్యువు

'ప్రేమ'కు మృత్యువు కల్పించిన భాష్యం సావిత్రి కనిపెట్టింది. అది చెప్పిన సత్యం విశ్వవినాశకారి. అది, తను ఆశించేది విశ్వకల్యాణం. పాషాణంలోనూ పరమాత్మ అంశ ఉంటుంది. మనస్సు విప్పి చూస్తే పరిణామం కనిపిస్తుంది. మానవుడు అధిమానవుడై దివ్యుడు కావడం తథ్యం. సృష్టి అసమగ్రమని, మనిషి అసంపూర్ణుడని మృత్యువుకు తెలుసు. సృష్టికర్త పొరపాట్లను, సృష్టిలోపాలను మృత్యువు తనకు అనుకూలం చేసుకుని తానే అంతా సృష్టిస్తున్నానని చెబుతోంది. రేపు మానవుడు పూర్ణమానవుడై మృత్యువును జయిస్తాడు. మనిషి శక్తి మృత్యువుకు తెలియదు. ఆధ్యాత్మిక శక్తితో మనిషి మృత్యువును జయిస్తాడు.

లోకంలో వైరుధ్యం ఉన్నా ఏకత్వం అసాధ్యం కాదు. మనిషి అంతర్దృష్టితో సృష్టిరహస్యం తెలుసుకుంటాడు. వేయి వెలుగుల సాయం పొంది అమృతుడు కాగలడు. విషాదంనుండి ఆనందం ఉద్భవిస్తుంది. సత్యవంతుడు బ్రతకడం లోకానికి అవసరం. అతను ఒక వ్యక్తి కాదు. సత్యం – శివం – సుందరం. సావిత్రి అభిప్రాయాన్ని మృత్యువు త్రోసివేసింది. పరమాత్మ, ఈశ్వరుడు అంటూ ఎవరూ లేరన్నది.

లోకంలోని విషాదాన్నంతా భరించే శక్తి తనకున్నదని సావిత్రి అన్నది. మరో వరం ఇస్తానంటాడు మృత్యువు. తనకు కావలసింది సత్యవంతుడు. వారిద్దరి వాదన అలా కొనసాగుతూనే ఉంది.

అంతటి భయంకర మృత్యువాణి విషాదంలో లయించింది. తాను ముందుకుపోతూ ఆ జడంలోకి, శూన్యంలోకి సత్యవంతుని జీవాన్ని లాగుతోంది. మృత్యువు శక్తి, చాతుర్యాలు తెలిసిన సావిత్రి ఇలా ఎదుర్కొన్నది –

“నీవు విశ్వంలోని విషాదాన్ని, దైన్యాన్ని అంతా నీ స్వంతం చేసుకున్నావు. వాస్తవంపై మాయపొర కప్పావు. ప్రకృతి సౌందర్యాన్ని, అందచందాలను నీ వికృత చేష్టలతో నికృష్టం చేశావు. అమరత్వాన్నే ఆక్షేపించి, అవమానిస్తున్నావు. మానవమేధపై అజ్ఞానం ముసుగు వేశావు. మా భావాలకు ‘భ్రమ’ లనే వక్రభాష్యం చెబుతున్నావు. మనిషిని మనస్సుకు బానిసనుచేసి మురుస్తున్నావు. ఈ విశ్వంలోని విషాదమే నీకు ఆనందహేతువు. జీవితంలోని క్రూరత్వమే నీకు రుచిస్తుంది. నీ పరుషభాషణతో కాంతిని, శాంతిని ధ్వంసం చేస్తున్నావు. సత్యాన్ని అనృతానికి బలిచేస్తున్నావు. వాస్తవం తలవంచినపుడు అసత్యం రాజ్యమేలుతుంది. సత్యానికి వక్రభాష్యమే నీ నుదుట బాసికం అయింది.

“మృత్యుదేవా! నీవు ప్రవచించే వాస్తవం వినాశహేతువు. నా సత్యం విశ్వకళ్యాణ హేతువు. తనను తాను గుర్తించదలచిన ప్రతివ్యక్తి ఈ భౌతిక ప్రపంచం నుండి బయలుదేరవలసే ఉంటుంది. ఆ తర్వాత శూన్యాన్ని ఆశ్రయించి, శూన్యమే తన నివాసం చేసుకుంటాడు. నిశీధిలో పయనిస్తే గాని ఉషస్సును చేరలేడు. అమరత్వ సాధనకు మృత్యువును కేవలం ఆధారంగా తీసుకుంటాడు.

“భౌతికత్వం ముసుగులో అమరత్వం దాగి ఉంది. అజ్ఞానం నీలి పరదాల మాటున చైతన్యం కదలాడుతుంది. విశ్వవిజ్ఞానం యావత్తు అయోమయం కావచ్చు కానీ ఆత్మ జ్ఞానానికి ఎప్పుడూ కళంకం అంటదు. అనంతత్వం పూర్ణమానవుని కలల పంట, కంటి వెలుగు. అప్పుడు జీవుడు పొందే ఆనందం అతీంద్రియం, వర్ణనాతీతం. అనంతత్వం అంటే ఆధ్యాత్మిక వైభవం. అది శూన్యంగా కనిపించినా అది పరిపూర్ణం. అనశ్వరత్వం శూన్యం అయితే శూన్యమే పూర్ణత్వం అవుతుంది. ఒక సద్భావన కాలాన్ని దాటిపోయినప్పుడు శూన్యంలోకి పోయినట్లే అవుతుంది. శూన్యంలోనే కదా విశ్వానికి రూపకల్పన జరిగింది. జీవుడు సాహసించి ‘కాలం’లో అడుగు మోపుతున్నాడు. మూర్ఖంగానే విధితో తలపడుతున్నాడు. పోరాటం సాగిస్తున్నాడు. ఆత్మ ఒంటరిగానే విశ్వాంతరాళంలోకి విశ్వాత్మను అన్వేషిస్తూ పోతుంది. నిర్గుణంలో అది ఒక భావంగా మిగిలిపోతుంది. నీవు చెప్పే శూన్యంలోనే ఆత్మ ప్రవర్ధమానమై పరమాత్మ తుల్యమవుతుంది. ఆత్మ వెలుగుగా మారి చీకట్లను సునాయాసంగా దాటిపోతుంది. అది యోగాగ్నిగా మారి మహాతేజస్సును సృష్టించుకుంటుంది.

“శూన్యాంతరంలో ఒక శక్తి ఉద్భవించింది. అది నిరాకారంగా కదిలింది. ఆ చలన తీవ్రతలో ఆకృతులు ఏర్పడ్డాయి. రూపంలేని పదార్థం రూపాలకు

ఆకరమైంది. కదలీ కదలని పదార్థంతో మేధస్సు ఏర్పడ్డది. మనిషికి జీవచైతన్యం కలిగింది. జీవచైతన్యం పెరిగి పెరిగి ఘనీభవించి అవయవ నిర్మాణం జరిగింది. జడంలో చైతన్యం ప్రవేశించింది. అచల పదార్థంలో చలనం ఏర్పడ్డది. విశ్వ హృదయం స్పందించి కళ్లు విప్పింది. మేధలో దాగిన భావ సముదాయాలు సుడులు తిరుగుతూ బయటపడడానికి ప్రయత్నించాయి. భావ వ్యక్తీకరణకు భాష అవసరమైంది. సంకేతాలు అవసరమైనాయి. అజ్ఞానానికి జ్ఞానానికి మధ్య అలా ఒక వెలుగు వంతెన ఏర్పడ్డది.

"మేధకు పదును పెట్టి మనిషి భావుకుడుగా మారాడు. పశుప్రాయుడైన జీవి వివేక, ప్రజ్ఞల వల్ల మనిషిగా మారాడు. మిగిలిన జీవకోటిపై ఆధిక్యత సంపాదిస్తున్నాడు. తన ఇష్టం వచ్చిన రీతిలో జీవితాన్ని మలుచుకోగలిగాడు. మనిషి తన ప్రజ్ఞతో విశ్వాన్ని పరిశోధించసాగాడు. విధిని ధిక్కరించి, అగోచర శక్తులతో పోరాడటం నేర్చాడు. విశ్వం ఏ సూత్రం పైన నడుస్తుందో గ్రహించాడు. ఆకాశయానం నేర్చాడు. గ్రహాంతరయానం చేయబూనాడు. తన చుట్టూ ఉన్న ప్రకృతికి తానే ఆధిపత్యం వహిస్తున్నాడు.

"మనిషి తన మనఃకవాటాలను పూర్తిగా తెరిచాడు. ఆత్మ పరదాల వెనుక దాగిన దేవతా శక్తుల్ని అర్థం చేసుకున్నాడు. అగోచరాన్ని గమనించి, సత్యస్వరూపం కోసం అన్వేషిస్తున్నాడు. బ్రహ్మ తేజస్సు నుండి కొంతభాగం మనిషికి అందే అవకాశం ఏర్పడ్డది. సాధనతో మనిషి పరప్రజ్ఞను పొంది చైతన్యమూర్తి అవుతున్నాడు. ఇప్పుడు మనిషిలో ప్రజ్ఞ ప్రవేశించింది. దివ్యత్వాన్ని సొంతం చేసుకోగలడు. పరబ్రహ్మ అనుగ్రహం సంపాదించగలడు.

"ఓ మృత్యుదేవా, నీ వెరిగిన విశ్వం అసంపూర్ణం. అప్పుడు అస్థిరం కనుక నీ ప్రతాపం చూపించగలిగావు. మేధ అసమగ్రంగా ఉన్నంతకాలం మనిషి పరమాత్మను గుర్తించలేదు. ఏదీ విశ్వసించలేదు. మనిషిలో పసితనపు చేష్టలు పోలేదు. ఇంకా ఎంతో ఎదగవలసి ఉంది. పూర్ణత్వం సాధించవలసి ఉంది. ఇంత పసివాడు ఎప్పటికి పెరిగి పెద్దవాడవుతాడని, పూర్ణమానవు డవుతాడని అంటావా? అజ్ఞాని ఎప్పటికీ అజ్ఞాని గానే ఉండడు. జ్ఞాని అవుతాడు.

"చిన్న విత్తు నుండే మహావృక్షం మొలకెత్తుతుంది. చిన్న జీవకణం వల్ల మహామేధావి తయారవుతాడు. వీర్యంలోని ఒక కణం ఫలదీకరణ చెంది, శిశువుగా ఆకృతీకరించడం లేదా? ఆ శిశువు పెరిగి ఒక మహర్షిగానో, మహారాజుగానో పరిణమించడం లేదా? ఈశ్వర రహస్యం నీకెలా తెలుస్తుంది? ఆధ్యాత్మికంగా

కలిగే అభివృద్ధిని నీవెలా ఊహించ గలవు? కనుక భగవంతుడు, ఆత్మ లేనేలేవని బుకాయించకు.

“ఇప్పుడు చైతన్యం ఎరగని జడప్రకృతిలో రేపు చైతన్యం మేల్కొనవచ్చు. ఆ చైతన్యం తన మార్గం తానే సిద్ధం చేసుకోగలదు. ప్రాచీన మార్గాలు దానికి అవసరం ఉండదు. తన ‘ఇచ్ఛ’ ఫలవంతమవుతుంది. ప్రకృతి ఆశించేది ఏదో ఆ తర్వాత జరుగుతుంది. ఆత్మ పరమాత్మగా మారడం జరిగితీరుతుంది. తనను మించి ఎదగడమే పరిణామం. నేడు రహస్యంగా అతి భృక్తంగా ఉన్నది రేపు భక్ర్యరహితమై పరిణామం చెంది పరమాత్మ స్థాయికి చేరుతుంది. నేడు అసంపూర్ణం రేపు సంపూర్ణమవుతుంది.

“ఆత్మ పెరగడానికి మానవ శరీరం అవసరం. మనం పరిమితం అనుకునేదంతా అపరిమితంలోని భాగమే. కాలం క్రమేణ అవ్యక్త అనంతంలోకి జారిపోతుంది. అది విశ్వకర్మ రచనా చమత్కృతి. లోకంలోని మహత్తులు లోకుల కంటికి కనిపించవు. ఆ రహస్యం మనకు అర్థంకాని భాషలో రాయబడి ఉంటుంది. అది విశ్వరచనలోని అద్భుత చమత్కృతి.

“ఈ సృష్టిలో ప్రతి ఒక్కటి ఈశ్వర ప్రజ్ఞకు నిదర్శనమే. అన్నింటిలోను ఈశ్వరీయతను గుర్తించవచ్చు. ఈ అద్భుత సృష్టికి ప్రత్యక్షసాక్షి కర్మసాక్షి సూర్యుడు. ఈశ్వర ప్రజ్ఞకు మరొక తార్కాణం చంద్రుడు. ఆయన విభూతికి నిదర్శనం రోదసి. ఆయన ప్రభలే తారాసమూహాలు. ఈశ్వర సౌందర్యం ప్రతి చెట్టులో, ప్రతి జీవిలో కనిపిస్తుంది. సాగర సంగీతంలోను, సాగర సంగమంలోను కనిపిస్తుంది. ఈ విశ్వం ఈశ్వరుని బాహ్యరూపం. మన వివేకానికి, ప్రజ్ఞకు ఈశ్వరీయత అందదు. అదొక అద్భుతశక్తి. దాని ముందు మనిషి ప్రజ్ఞాప్రాభవాలు నిరుపయోగాలు. మనం అల్ప విషయాలకే ఆధిక్యత కల్పించుకుంటాం. అగోచర శూన్యం నుండి లోకాన్ని సృష్టించిన మహాప్రజ్ఞ పరమాత్మది. పరమాణువు నుండి బ్రహ్మాండాన్ని సృష్టించగలడు. అణువులో బ్రహ్మాండాన్ని ఇమడ్చగలడు. పదార్థం నుండి పరమార్థం పిండగలడు.

“బుద్ధి వక్రించినపుడు జీవితం నిరర్థక మవుతుంది. మనిషి చేసే దుర్మార్గాలు, అకృత్యాలు, రాక్షసకార్యాలు అన్నీ ఆయన ఆడించే నాటకంలోని సంఘటనలే. అవి నాటకంలో రసపోషణకు, రక్తికి అవసరం. అది నాటకం కాని రూపకం. చీకటి వెలుగుల మధ్య సన్నని రహస్యరేఖపై పరమాత్మను చేరవచ్చు. ఆ పరమాత్మ ఈశ్వరీయతకు ఆకాశాన పహరా కాస్తున్నవి నక్షత్రాలు. సృష్టిలో అణువణువున

అంతర్గర్భితంగా ఉన్న ఈశ్వరీయత భౌతిక ప్రపంచంలో దివ్యత్వాన్ని నిక్షేపిస్తుంది. అదే మనసులో సంకేతంగా, జీవితంలో అవ్యక్త భావనగా ఉజ్వలిస్తుంది. యాంత్రికం అనిపించినా ప్రకృతి కార్యాలు పరమాద్భుతాలు. మనిషి ఆలోచన బట్టి ప్రకృతియంత్రం పనితీరు మారుతుంది. ఆత్మశక్తిని బట్టి మనిషి ఆలోచనలు మారుతుంటాయి.

"జగన్మాత తాను సృష్టించిన లోకాన్ని తనలోకి తీసుకోగలదు. కఠోర నియమాలతో ఆత్మను పరీక్షిస్తుంది. ప్రపంచానికి అందనంత ఎత్తున భగవంతుని దాచి వేస్తుంది. క్రిందికి దిగి రాకుండా భగవంతుని జోకొట్టి నిద్ర పుచ్చుతుంది. అలా పరమాత్మను బయటకు రాకుండా చేసి తన శక్తిని ప్రదర్శిస్తుంది. ఆమె ప్రతి అడుగులో దివ్యత్వం భాసిస్తుంది. ఆమె కార్యాలు, ప్రేరణలు అన్నీ మనిషి పూర్ణత్వానికి దోహదపడతాయి. మరణంతో అమరత్వం తప్పక సిద్ధిస్తుంది. కాలం గడిచిన కొద్దీ పరమాత్మ రూపం దర్శనమవుతుంది. మొత్తం ఈశ్వరీయత అజ్ఞానం వెనుక తలదాచుకుంటుంది.

"పాపకర్మల తర్వాత పుణ్యభావన ఏర్పడుతుంది. చేసిన తప్పుల పరితాపం సత్యపథాలకు దారి తీస్తుంది. వేదన బాష్పకణాలలో బ్రహ్మానందం తొంగి చూస్తుంది. వేయి మార్గాలూ పరమాత్మ సన్నిధికి చేర్చేవే. ద్వంద్వ ప్రకృతిలోంచి ఏకైక ఈశ్వరీయత బయటపడుతుంది. అనంత రూపాలు పరమాత్మలో సంగమిస్తాయి. అన్ని వైరుధ్యాలూ తాండవంలో లయిస్తాయి. అన్నీ కడకు ఒకే ఒక్క దివ్య ప్రేమ బంధానికి ముడిపడేవే. అన్ని పోరాటాలు అవ్యక్తంతో రాజీపడతాయి.

అసలు మార్గం ఏదో మార్గం చూపేవారికీ తెలియదు. సరైన మార్గంలోకి చేరేవరకు తప్పటడుగులు తప్పవు. తెలియని మార్గంలో వెళితే గమ్యం అగోచరంగా ఉంటుంది. ఎన్ని తప్పులు చేసినా చేరవలసింది పరమాత్మనే. ఏదో శాపం పట్టి పీడిస్తున్నట్లు కొన్ని క్షుద్రశక్తులు మనిషి ప్రగతిని నిరోధిస్తుంటాయి. దివ్యశక్తులు సైతం సమయానికి సహాయపడవు. ఆ దివ్యశక్తులు దివ్యత్వం కోల్పోయిన రాతి విగ్రహాలుగా మారతాయి. ఆ క్షుద్రశక్తులే మనిషిలో పశు ప్రవృత్తుల్ని కలిగిస్తాయి. మనిషి ఆలోచనలు వికృత రూపం ధరిస్తాయి. అలా మనిషి హృదయం మొద్దుబారిపోతుంది.

అజ్ఞానాంధకారంలో పుట్టిన అసురశక్తుల్ని సైతం ఆనందలోకం ఆహ్వానిస్తుంది. ఆదరిస్తుంది. అవి సుందరవనాలలో, రాచబాటలలో, విశృంఖ లంగా విహరించి, మధుపానమత్తులై దివ్యరూపాలను పరిహసిస్తాయి. పసివాడు

మట్టిలో, బురదలో ఆటలాడి ఆనందిస్తాడు. వివేకం పరమాత్మను చేరే మార్గాన్ని చూపిస్తుంది. వివేకం ఒక్కటే ఈ విషాదనాటకంలో మనిషికి, మనస్సుకు తోడు. ఈ సుదీర్ఘ జీవనపథంలో అన్ని అండదండలు కోల్పోయిన ప్రకృతికి దారీ తెన్నూ కనిపించవు. మనిషికి మిగిలేది ఆత్మగౌరవం, వివేకం, స్థిత ప్రజ్ఞత. అంతరవ గాహన ఆత్మ వివేచనకు బలాన్నిస్తుంది. వివేకం వాటినే లోకానికి అందిస్తుంది. చైతన్య సాగరంపైన విసిరిన వివేకపు వలలో చిన్న చిన్న సత్య శకలాలు చిక్కుతుంటాయి. మహత్తర సత్యాలు ఆ వలకు చిక్కవు. సృష్టి రహస్యాలు తెలియనీయకుండా బాహ్యదృష్టి అడ్డుపడుతుంది. అంతర్ దృష్టికి సత్యం, అసలు రహస్యాలు తెలుస్తాయి. అవి మనస్సు విసిరిన వలలో పడవు. మానవ ప్రయత్నాలకు సత్యం అందదు.

మానవ దృష్టి కళ్లకు పరిమితం. ఈ కళ్లతో ఆంతర్యపు లోతుల్లోకి చూడలేం. మన అవివేకానికి పునాదులు మనం చేసే తప్పులు. నకిలీ దేవతల్ని ఆరాధిస్తూ, నకిలీ సత్యాలను వెదుకుతాం లేదా ఒక ప్రతికూల వర్గంగా మారిపోతాం లేదా అందివచ్చిన పలు సత్యాల్ని అనుమానించి వదలివేస్తుంటాం. మూర్ఖుడు వెలుగులో నిలబడి, అది చీకటి అని భ్రమిస్తాడు. ప్రతిదాన్ని అవహేళన చేస్తూ కాలాన్ని వృథా చేసుకుంటాడు. నిత్యశంకితుడు దైవత్వాన్ని అంగీకరించడు. ముందుకు సాగిన కొద్దీ చీకట్లు ముసురుతుంటాయి. తన మేధ గొప్పదని అహంకరించడం వల్ల వివేకం పనిచేయదు. పైగా వెలుగు నిరోధిస్తుంది.

ప్రకృతి గుమ్మంలో వెలుగు నిలబడి ప్రతి బాటసారిని లోనికి ఆహ్వానిస్తుంది. ప్రతి ఆత్మలో ఒక జ్యోతిని వెలిగిస్తుంది. అంధకార గగనంలో అది మార్గం చూపే నక్షత్రం. అజ్ఞానంలో ఉన్న వారికి జ్ఞానమార్గం చూపిస్తుంది. మనిషిలో జ్ఞానం పెరిగిన కొద్దీ లోపల వెలుగు పెరుగుతుంది. అది మనస్సును క్షాళనం చేసి, శుద్ధి పరిచే తేజస్సు. అది మానవ హృదయాకాశంలో ఎగిరే విహంగం. అదే ధర్మక్షేత్రంలో రక్షణ కవచం. అదే శివధనస్సు.

జ్ఞానోదయం కాగా వివేకం విస్తరిస్తుంది. తత్వజిజ్ఞాస జ్ఞాన శిఖరాలకు చేరుకుంటుంది. అతీంద్రియ శక్తుల్ని విజ్ఞానం వదిలి పెడుతుంది. మనిషిని అల్పసుఖాల వైపు లాగే క్షుద్రశక్తులు, మహత్తులు తెరమరుగైపోతాయి. మనిషి ప్రకృతి తనకు అనుగ్రహించిన శక్తితోనే ప్రకృతిని జయిస్తాడు.

మనస్సు ఎంత శ్రమించినా అందుకోలేని శిఖరాలను ఆత్మ అందు కుంటుంది. కాలం కడపటి అంచులు దాటి ఆత్మ పయనిస్తుంది. మృత్యువు

కూడా ఆత్మ పురోగమనాన్ని అపలేదు. అప్పుడు మానవ ప్రజ్ఞ దివ్యప్రజ్ఞ అవుతుంది. అప్పుడది మార్మికజగత్తు. అక్కడి తేజస్సు యోగుల, మహర్షుల కళ్లలో వెలిగే కాంతి. అది బ్రహ్మ వర్చస్సు. అదే దివ్యదృష్టిని అనుగ్రహిస్తుంది. అది మనస్సుకు అంతరవగాహన కలుగచేస్తుంది. ఆలోచన సమసిపోగా అద్భుతశూన్యం ఏర్పడుతుంది. ఆ శూన్యం నుండి ఆలోచనలు ఉద్భవిస్తాయి.

ఆ మార్మిక జగత్తులో ఒక నాదం ఉద్భవిస్తుంది. అది తుఫాను హోరుతో భయం కలిగిస్తుంది. మనస్సు శూన్యం అయితే గాని ఆ శబ్దం గుండెకు వినిపించదు. మేఘగర్జన లాంటి పిలుపు అది. ఈ లోకాన్ని వదలి ఆత్మ పైలోకాలు చేరినప్పుడు ఒక అదృశ్యహస్తం చేయూత నిస్తుంది. ఇక్కడ చీకటి సరిహద్దుల్ని దాటగానే పరదాలన్నీ పటాపంచలైపోతాయి. మన ఆత్మశక్తి పరమాత్మను చూపిస్తుంది. మన హృదయాలు దివ్యనాదాలను వింటాయి. మనస్సు గ్రహించలేని భావాల్ని హృదయం అలవోకగా అందుకుంటుంది. మనం సత్యసుధల్ని తృప్తిగా సేవిస్తాం. ఇవి అన్నీ నిశ్శబ్దంలో, యోగలయతో ఏర్పడతాయి.

కాలపురుషా! ఈ మార్మికత నీకు అర్థం కానిది. భూమి సూర్యుని చుట్టూ పరిభ్రమిస్తున్నట్లే అనిపిస్తుంది. కానీ ఎన్నో గ్రహగోళాల మధ్య దేనికీ అంటకుండా తిరుగుతుంది. నీ వల్లనే లోకాలకు చీకట్లు. నీవే ఈ చీకటి ప్రపంచాన్ని పాలిస్తున్నావు. పరమాత్మను నీ ముసుగులో దాచిపెట్టావు. ఈ లోకాలను సృష్టించిన మహస్సు నిద్రిస్తున్నదా, ఏదీ? మహాకాశంలో మత్తుగా సోలిపోతున్నదా? ఆ మహస్సు తాను సృష్టించిన లోకాన్నే గుర్తించలేనంతగా పాప పంకిలమైంది. మైకంలో కదలినప్పుడు అందాలు పైకొస్తాయి. అప్పుడే గగనం నీలికాంతుల్ని సంతరించుకుంది. లోకం పచ్చని మేలి ముసుగు వేసుకుంది. ఉదయాస్తమయ శోభలు అవే. అవే తపోదీక్షలో ఉన్న హిమగిరులు, గిరిశిఖరాలు. అవే వసుధను పులకింపచేసే వర్షధారలు. ఆ ఆనందం లోనే ప్రకృతి పరవశం చెందుతుంది.

భూమి తన అందచందాలను ఏమాత్రం కోల్పోలేదు. పైగా ఆకర్షణ పెరిగింది. అందాలు పెరిగాయి. దివ్యత్వం మాత్రం మరుగునపడ్డది. మనిషి దివ్యత్వానికి విముఖుడు కాగానే జగన్మాత ముఖం చాటు చేసుకున్నది. జగన్మాత విషాద వదనం మనం చూడలేం. ఆమె వెనుతిరిగి పోయి శూన్యంలో దాక్కుంది. నాటికి నేటికి విస్మృతిలో దాగిన జగన్మాత బయటకు రావటం లేదు, మేల్కొనడం లేదు. తన అందచందాలకు మెరుగులు పెట్టుకోవడం లేదు. ఆమె ప్రవృత్తి ఏమిటో తెలియదు! తనలోని సచ్చిదానందాన్ని సైతం మరిచిపోయింది.

తను ఆనందలోకాల్ని సృష్టించడం మరచి తాను విలపిస్తూ తనను నమ్మినవారిని సైతం ఏడిపిస్తోంది. బాధలకు గురి చేస్తోంది. తనను నమ్ముకున్న వారి గుండెల్ని విషాదంతో నింపి, జీవితాలను నిరర్థకం చేస్తున్నది. ఆ కన్నీటిని, ఆ విషాదాన్ని మేము వరాలుగా స్వీకరించాం. అసంపూర్ణ చైతన్య స్వప్నాలను భ్రాంతులుగా భావించి, తాను హింసపడి, మమ్మల్ని హింసించి, ఆమె మా జీవితాల లోకి, హృదయాలలోకి బాధల్ని, యాతనల్ని పంపిస్తోంది.

పూర్వజన్మ సుకృతం వల్ల మనిషి ఇన్ని కష్టాలు నష్టాలు భరించినా పరాన్ని ఆశిస్తూనే ఉన్నాడు. కష్టాలు కర్మఫలాలని మనస్సును మోసగించుకుంటున్నాడు. ఎన్ని విషాదాలనైనా, వియోగాలనైనా 'స్వర్గం' కోసం, 'మోక్షం' కోసం భరిస్తున్నాడు. మనిషి జీవితానికి ఏదో శాపం ఉంది. మనిషి సుఖాలపై, ఆనందాలపై నల్ల మబ్బులు క్రమ్ముకున్నాయి. సౌందర్యం పరమాత్మ సంకేతం. యోగులు, మహర్షులు వాంఛించేది సచ్చిదానందం. అది దూరం అయితే ఏదో పోగొట్టుకున్నట్లు బాధపడతాం. అదేదో దుష్టశక్తి పన్నాగం అనుకుంటాం. ఆ అనుమానం ఎంతటి మహర్షికైనా, యోగికైనా వస్తుంది.

కావాలనే భగవంతుడు మనకు కష్టాలు కల్పిస్తాడు. మన ఆనందాలను హరిస్తాడు. సుఖాలు అందకుండా చేసి మృత్యుముఖంలోకి విసిరేస్తాడు. పారవశ్యంలో మనం ఎన్నో పాపాలు చేస్తాం. అయినా ప్రతిజీవి ఆనందం కోసం, సుఖం కోసం, తృప్తి కోసం అంగలార్చుతుంది. అది ప్రకృతి సహజం. ఒక్క సుఖానికి ఎంతటి కన్నీరైనా ఎన్ని కష్టాలైనా భరిస్తాం. ఈ ప్రకృతి నుండి రవంత సచ్చిదానందం పొందాలని ప్రయత్నిస్తాం. ఆ కాస్త ఆనందం విధి మనకు అందకుండా చేస్తుంది. విధి పన్నిన ఉచ్చులో చిక్కుపడిపోతాం. ఇంత ప్రయాస కాస్త ఆత్మశాంతి కోసమే. కనిపించని పరం కోసమే. క్షణికానందం కోసం మొత్తం జీవితాన్ని నివేదన చేస్తాం. భూమి సృష్టించబడింది ఆనందానుభూతి కొరకే గదా! విషాదం కొరకు కాదు. ఆనందం స్వప్నం లాగ కరిగిపోగూడదు.

భగవంతుడు తన వినోదం కొరకు లోకాన్ని సృష్టించుకున్నాడు. కాని ఒక మాయాశక్తి లోకం బాధ్యతను తాను తీసుకుని, తన సంకల్పంతో మృత్యువును సృష్టించి, లోకాన్ని శాసించసాగింది. అందుకే జీవితం విధి ఆడిస్తున్న నాటకంగా మారిపోయింది. ఆత్మలు వినీలగగనాలలో సంచరిస్తాయి. అవి సచ్చిదానంద లహరులు. వాటి స్పందనల్ని మన మనస్సులు, శరీరాలు గ్రహిస్తాయి. ఇంద్రియాలు సైతం ఆ తరంగాలకు స్పందిస్తాయి. ఆ స్పందన కలిగినపుడు

లోకం శూన్యం అనిపిస్తుంది. శూన్యం అయిన తర్వాత జీవం ఉండదు, స్పందన ఉండదు. అన్నింటికి మూలమైన బ్రహ్మానందానుభూతి ఒక్కటే మిగులుతుంది. ఆ నిర్మలానంద స్థితిలో అసంఖ్యాకమైన మన గత కర్మలు లయించడం తెలుస్తుంది. ప్రతి పనిలోనూ ఆనందం అనుభవిస్తాం. అందుకు మన ఆత్మలు సహాయం చేస్తాయి. అందుకే లోకం ఏర్పడ్డది. విశ్వంలోని సత్కర్మల అంతిమ లక్ష్యం బ్రహ్మానందం. అ ఆనందాన్ని కొన్ని ఆత్మలు మాత్రమే పొందగలుగుతున్నాయి.

విశ్వపురుషుడు రోదసిని తనకు ఆవాసం చేసుకున్నాడు. ఆ విశ్వబ్రహ్మకు శూన్యాకాశమే అద్భుత మందిరం. భౌతిక శరీరాలలో ఆయన ఆత్మశక్తిని ప్రవేశపెట్టాడు. ఆయన ఔన్నత్యం సూర్యరశ్మి వంటిది. ఆయన ఓజస్సు చంద్రకాంతి వలె చల్లగా ఉంటుంది. ప్రతి శబ్దంలోను అనుభూతి ఉంది. పరచుకునే చంద్రకాంతి వలె ఈశ్వరగీతం చల్లగా ఉంటుంది. తారకల ప్రశాంతి ఈశ్వరుడే. ప్రతి ఉదయం మనల్ని మేల్కొలిపేది ఈశ్వరుడే. ప్రతి కొమ్మ నుండి, రెమ్మ నుండి భగవత్తత్వం తొంగిచూస్తుంది. చెట్టు చేమలలో, రాయి రప్పలలో ఈశ్వరుని దర్శించవచ్చు.

మనిషికి అజ్ఞానం, అలసట, శ్రమ, పరిశ్రమ తప్పవు. అడుగడుగునా కష్టాలు, నిష్ఠూరాలు తప్పడం లేదు. పాపమైనా, పుణ్యమైనా, మృత్యువు వెంట పడినా మనిషికి కడవరకు సుఖించాలని ఉంటుంది. ఆ తపన చల్లారదు. అనుభూతి కలిగించే ప్రతిదానిలోంచి ఆనందం పొందవచ్చు. ఆత్మకు చెందిన ప్రతి అనుభూతి ఆనందహేతువే. పాపం, పుణ్యం మంచి, చెడు అన్నింటిలో ఆనందం ఉంది. కర్మ సిద్ధాంతం ఎంతగా భయపెట్టినా మనిషి వెనుకంజ వేయడు. నిషిద్ధ కార్యాలలోనే ఎక్కువ సుఖం దక్కుతుంది. బాధలో ఆనందం పొందడం, కష్టాలలో సుఖాలు వెదకడం మానవ లక్షణం.

విధి ఆడించే నాటకంలో విషాదానికి, ఆనందానికి కన్నీరు కార్చుతాం. ప్రమాదాలు, కష్టాలు మనిషి ఓర్మికి, పట్టుదలకు పరీక్షలు. ఆ లక్షణం క్రిమి కీటకాలలోనూ ఉంది. మానవశక్తి విచిత్రం. ఇన్ని కష్టాలు పడి, ఇంత నిరాశకు గురైనా ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతుంది. భూతప్రేతాలతో చెలిమి చేస్తుంది. నక్షత్రకాంతులలో సేద తీరుతుంది. వేడినీ తట్టుకుంటుంది. సూర్యచంద్రులు తమ అగ్నితో, జ్యోత్స్నతో జీవుల్ని పోషిస్తారు. చివరకు స్వర్గం వైపు, నరకం వైపు దారి చూపిస్తారు. జీవునికి భూమిపైన ఆనందాలు, విషాదాలు రెండూ సమ భోగ్యాలే. రెంటినీ అనుభవిస్తుంది. స్వర్గసుఖాలను, నరకయాతనల్ని అనుభ విస్తుంది. తన చుట్టు స్వర్గాన్ని, నరకాన్ని సృష్టించుకోవడం మనిషికి అలవాటు.

మనిషి తాను అనుభవించే స్వల్పసుఖాలనే ఆనందాలుగా, అనురాగాలుగా భావిస్తాడు. విషాదంలో, కన్నీటిలో సుఖాల్ని చూచి అవి రత్నకిరీటా లనుకుంటాడు. ముళ్లకిరీటాలు ఆనందంగా ధరించగలడు. అమృతాన్ని, విషాన్ని తాగి హరించుకో గలడు. ఆ ఆర్తి, అనుభవం అంతా బ్రహ్మానందం కొరకే. అన్ని అంగలార్పులు దివ్య ప్రబంధాల కొరకే. జీవుడు ఈ ప్రపంచంలోకి వస్తూనే కొంత దివ్యత్వాన్ని వెంట తెచ్చుకుంటాడు. అది జీవుని సంకల్పంతో, సాధనతో పెరుగుతుంది. అదే మనిషికి మహత్తర సత్యపథాన్ని చూపిస్తుంది. అదే మనిషి చేత తప్పుడు పనులు చేయించి అధోగతులు కల్పిస్తుంది. పతనానికి, ఔన్నత్యసాధనకు కారకుడు మనిషి. అతని సుకృతాలు, దుష్కృతాలే కారణం.

మనిషిలో దేవతలు, దైత్యులు ఉంటారు. మనిషిపై ఆధిపత్యానికి ఇరువర్గాలు పోటీ పడుతుంటాయి. సృష్టిలోని సౌందర్యం ఆరాధించి, అనుభవించిన వారికి ఔన్నత్యం, అల్పత్వం రెండూ సమానమే. తన ఆధిక్యతకు గానీ, అధోస్థితికి గానీ, ప్రలోభాలకు గానీ లోబడటం జరగదు. విశ్వశిల్పి చమత్కృతిని ప్రశంసిం చినా, ఎల్లకాలం విషాదాంత నాటకాన్ని అనుభవించలేం. లోకానికి విముక్తి కలిగించగల ప్రజ్ఞా ప్రాభవాలు ఆవలితీరాన ఉన్నాయి. మనిషి యోగసాధనతో ఆ తీరానికి చేరగలడు. సత్యాన్ని నిగ్రహంతో గ్రహించగలడు.

చివరిదశలో ఆత్మ అలౌకిక విషయాలను గ్రహిస్తుంది. ప్రతి మందిరంలో పరమాత్మను అన్వేషిస్తుంది. అప్పుడు సృష్టి రహస్యం తెలుస్తుంది. ఆశించిన లక్ష్యాన్ని మనిషి చేరగలుగుతాడు. సచ్చిదానందం గగన పుష్పం అయి, అనంత కోటి నక్షత్రాలతో మంతనాలు జరుపుతుంది. కాలం పారవశ్యంతో స్వాగత గీతాలు ఆలపిస్తుంది. రోదసి ఆనంద తాండవం నర్తిస్తుంది. ఆత్మ క్షుభిత మానవ హృదయ విషాదాన్ని దాటి, శబ్ద ప్రపంచాన్ని వదలి, ఊహా లోకాలను సైతం దాటిపోయి, అభావ, నిర్గుణ భూమికలను వదలి శూన్య శిఖరాలను చేరుతుంది. అక్కడనుండి భవిష్యత్తులోకి చూడగలదు. క్రింది లోకాలన్నింటినీ చూడగలదు. తాను గమించిన లోకాలన్నింటినీ అధిగమించి, అతీత తురీయస్థితికి చేరుతుంది.

ఆత్మ నిశ్చల సాగరాలపై విహరించే దివ్య విహంగం వలె సత్య తేజస్సును పొంది, స్వర్ణకాంతి కిరణాలను విరజిమ్ముతూ సృష్టిలోని ఆనందాలను అనుభవిస్తుంది. అదే 'ఆత్మ లక్ష్యం'. ఆత్మకు ఇష్టం. అది పరమాత్మ న్యాయం. గాఢతమోగర్భంలో సౌందర్యం కలిసి పోయినప్పుడు ప్రకృతి చేసే పని అది. అప్పుడు మరల మహాశూన్యం నుండి మరోసృష్టి ఆవిర్భావం జరుగుతుంది.

ఆ మహాసృష్టికై జీవం శూన్యంలో ప్రవేశించి భౌతిక పదార్థానికి తన శక్తిని సంగ్రహిస్తుంది. అర్ధరాత్రి దేవాలయంలో వెలిగే దీపం వంటిది మహస్సు. మృత్యులోకంలో సైతం అనుభవించదగ్గ అమరత్వం అది. ఈ పరిణామం అతి నిగూఢంగా సాగుతుంది.

భూమిపైన ప్రతిజీవి మట్టిలో పుట్టి మట్టిలో కలవవలసిందే. మానవ ప్రేమలో పశువాంఛ మిళితమై ఉంటుంది. కామన కారణంగానే హృదయం ఆనందిస్తుంది. కామన విషంగా మారి మనస్సుతో మైత్రి చేస్తుంది. అది కడకు ఆధ్యాత్మికంగా పరిణమిస్తుంది. అప్పుడు ఆత్మ అన్ని బంధాలు వదలి, ఒంటరిగా, పరమాత్మకై అన్వేషిస్తుంది. ప్రేమించే మనిషి పరమాత్మను ప్రేమించగలడు. మానవ ప్రేమను పరమాత్మ ఆమోదిస్తుంది. పవిత్రప్రేమకు ఈ భౌతిక శరీరం ఒక దేవాలయం వంటిది. అదే ప్రేమాలయం. ప్రేమ ఉన్నంతకాలం జీవునికి ఒంటరి తనం ఉండదు. ప్రేమే సర్వం అనుకుంటూ ప్రేమతోనే భగవంతుని అర్చిస్తాడు. భగవంతుని ప్రేమించగలుగుతాడు. తన ప్రేమ మందిరంలో నిలిచిన ప్రేమ పూజారి సమస్త విశ్వాన్ని, సకలజీవులను ఆహ్వానిస్తాడు, ఆకర్షిస్తాడు.

అతనిని చీకటి, మృత్యువు ఏమీ చేయలేవు. తన్మయస్థితిలో అసలు ప్రపంచస్ఫురణ ఉండదు. శరీర స్పృహ ఉండదు. అంతా ప్రేమమయం. అంతా ఆత్మనివేదనం. ఆ ఆనందస్థితిని వదలి ఎవరూ బాధలలోకి వెళ్లరు.

కాలపురుషా! నేను ఆత్మపరంగా నిన్ను ఎప్పుడో జయించాను. ఇప్పుడు నేను విషాదాలకు చలించను. నా హృదయంలో నెలకొన్న ప్రశాంతి నా శరీరాన్ని, వివేకాన్ని ఆవరించింది. అది ఎంతటి విషాదాన్నయినా మహాశక్తిగా మార్చగలదు. అది ప్రపంచంలోని చిరుఆనందాల్ని బ్రహ్మానందంగా మార్చివేయ గలదు. నా అనురాగం ఈశ్వర ప్రణిదానానికి ఆలవాలం. నా ప్రేమ ఈ ఖగోళాలను దాటి పోయింది. ఏ రహస్యం అయినా నేను తెలుసుకోగలను. నేను మానవ పథాలను దివ్య పథాలుగా మార్చగలను. భౌతికసుఖాలలో దివ్యత్వాన్ని పూరించగలను.

కాలపురుషా! నేను సత్యవంతుని కోరడం నా సుఖసంతోషాల కోసం కాదు. నా ఆనందం కోసం కాదు. శారీరక సుఖాల కోసం అంతకన్నా కాదు. నా గమ్యం తన లక్ష్యం వెరసి మా ఇరువురి జీవిత పరమార్థం నెరవేరడానికి. ఈ లోకంలో మేము పరబ్రహ్మ ప్రతినిధులం. ఆయన తన పని నిర్వహణ కోసం మమ్మల్ని భూలోకానికి పంపాడు. మృత్యువు నీడలో బ్రతకాలని మాకు తెలుసు. కానీ ప్రపంచానికి దివ్యత్వం అందించాలి. ప్రతి ఎదలో ఈశ్వరప్రజ్ఞను ప్రవేశింప

చేయాలి. మానవుల హృదయాలలోని శూన్యంలో భగవత్ ప్రేమను నింపాలి. ఆయన అనుగ్రహంతో విషాదాన్ని తుదముట్టించాలి. నేను జగన్మాత అంశలో జన్మించాను. సత్యవంతుడు పరమాత్మ ప్రతినిధి.

"కాలమూర్తీ! నీ శాసనం కన్న నా సంకల్ప బలం గొప్పది. నీ విధి కన్న నా ప్రేమ బలమైనది. మా అనురాగానికి పరమాత్మ ఆమోదముద్ర ఉన్నది. నీ వల్ల నాశనం కాకుండా అనురాగాన్ని, ప్రేమను నేను రక్షించుకుంటాను. లోకంలో బ్రతకడానికి నేను ప్రేమను బలిచేయనవసరం లేదు. ఇహపరాలను ముడివేసేది ప్రేమ ఒక్కటే. సుదూరాన ఉన్న భగవంతునితో మనిషిని జతపరుస్తుంది ప్రేమ."

మృత్యువు స్వరంలో వ్యంగ్యం, అవహేళన ధ్వనించింది. విధిని, గ్రహగతుల్ని విమర్శిస్తున్నట్లు పలికింది :

"మనుషులు తమ మనస్సుతో సత్యాన్ని వమ్ము చేస్తారు. ఎండమావుల వంటి ఆలోచనలు నమ్ముకుని నీవు దివ్యలోకాలకు దూరమవుతున్నావు. నీ శారీరక సుఖాలకు, వాంఛలకు 'హృదయం'తో సంబంధం లేదు. దురాలోచనతో జీవితం రసహీనం చేసుకోకు. మనస్సు నిర్మలం అయినప్పుడే అధిభౌతిక, అలౌకిక విషయాలను గ్రహించగలుగుతుంది. నీవు చెప్పే 'ఆత్మ' నీ శరీరంలో ఒక భాగం. నీవు నిర్మించుకున్న ఊహాలోకంలో ఆత్మకూడా కల్పనే అవుతుంది. నీ మాటలు మార్మిక జగత్తులో వినిపించే శబ్దాలు. కలుషితమైన మానవ హృదయంలో నీవు చెప్పే పరమాత్మ ఎలా సుస్థిరంగా ఉండగలదు? మనిషిగా వ్యవహరిస్తున్న ఈ ద్విపాద పశువులో దివ్యత్వాన్ని ఎలా ప్రతిష్ఠించగలవు? నీ మనస్సు కల్పించిన రంగుల తెరల్ని ముందుగా తొలగించుకో. ప్రకృతి మనిషిని సైతం పశుపక్ష్యాదులతో సమానంగానే సృష్టించింది. నీ ప్రయత్నం నిరర్థకమని గ్రహించు. వాస్తవం మృత్యు వంత కఠినం, అది పాషాణం. కనుక ప్రకృతికి లోబడి, సహజంగా జీవించు."

సావిత్రి మరల మృత్యువుకు సమాధానం పలికింది : "నేను మనిషిగానే జీవిస్తాను. మనిషిగానే పుట్టాను. జంతువులా కాదు. మానవ వికాసంలో పరమాత్మను దర్శించగలను. నిన్ను దాటిపోయి అమృతపానం చేయగలను. విషాదాన్ని, వియోగాన్ని భరించి, మృత్యువు తలదన్ని అమరత్వం, శాశ్వతత్వం సాధించగలను. మానవత్వపు ముసుగులో ఈశ్వరీయత ఉంది. ఉండగలిగింది కనుకనే ఉన్నది. దివ్యత్వం ఉంది. అది నీవు కాదనలేని సత్యం. నేను చేసే ప్రతిపనికి కర్త భగవంతుడు. కనుక భగవంతుడు అనుక్షణం నాతో ఉన్నట్లే కదా! ఈశ్వరుడే ఈ సృష్టిని నడిపిస్తున్నాడు. ఆయన తేజోరూపాన్ని నేను.

ఈశ్వరప్రజ్ఞకు ఈ ప్రపంచంలో ప్రతినిధిని నేను. అజరామరమైన ఈశ్వర సంకల్పం నేను. ఆయన నిర్గుణ తత్వానికి సగుణ రూపాన్ని నేను. నాలో అవ్యక్త పరబ్రహ్మత్వం వ్యక్తమవుతుంది.”

మృత్యువాణి అంధకారాన్ని చీల్చుకుని వెలువడింది: “ఊహామందిరంలో పూజారిణివి నీవు. ప్రకృతి ధర్మాలు అనుల్లంఘనీయం. వాటిని అనుసరించి ప్రవర్తించు. నిత్యకృత్యాలను అసంభవాలతో ముడిపెట్టకు. రెండు విరుద్ధ శక్తులు ఒక్కటి కావు. నీవు వాటిని ఏకం చేయడానికి ప్రయత్నిస్తే అవి వాటి ఔన్నత్యం కోల్పోతాయి. బలవంతపు మైత్రి వల్ల రెండూ నిరుపయుక్తమవుతాయి. నీ సంకల్ప బలం ఎంతటిదైనా అసత్యాన్ని సత్యంతో జతపరచలేవు. భౌతిక విలువలు పెరిగిన చోట్ల ఆధ్యాత్మిక విలువలు తరిగిపోతాయి. అంతా ఆధ్యాత్మికం అయినప్పుడు భౌతికం అంటూ ఏదీ మిగలదు. కానప్పుడు ఈ విశాలవిశ్వం సైతం అవాస్తవం అవుతుంది. వాస్తవం అవాస్తవంతో ఎప్పటికీ జతపడదు.”

“భగవంతుని వాంఛించే వ్యక్తి ప్రపంచాన్ని వదులుకోవాలి. ఆత్మలో జీవించ గలిగినవారికి బాహ్యప్రపంచంతో నిమిత్తం ఉండదు. పరమాత్మను కోరే వానికి స్వార్థం ఉండకూడదు. రకరకాల మార్గాలలో పయనించి పరమాత్మను చేరాలని ప్రయత్నించేవారు సృష్టి చివరి అంచువరకు వెళ్లగలరు. ఆధ్యాత్మిక సాగరాల లోతుల్ని అన్వేషించిన మహర్షులు శూన్యంలో లయించడమే పరమగమ్యం అనుకుంటున్నారు. మనిషిని ముక్తిపథానికి చేర్చే గుమ్మాలు రెండు. ఒకటి శరీరం నిర్జీవం కాగానే లభించే శాంతి మొదటి ద్వారం. ఆత్మ పరమాత్మను చేరినపుడు లభించే బ్రహ్మానందం రెండవ ద్వారం. చివరకు అందరూ నన్ను ఆశ్రయించ వలసిందే. నాలో ప్రవేశించవలసిందే. నేనే మృత్యువును. నేనే బ్రహ్మన్ని.”

సావిత్రి మృత్యువు వాదనను ఖండిస్తూ సమాధానం చెప్పింది : “నీ తర్క మీమాంసల కన్న నా వివేకం గొప్పది. నీ చేతిలోని పాశాల కన్న నా హృదయ స్పందనలకు బలం ఎక్కువ. నా హృదయ స్పందన లాంటిది అందరి హృదయాలలో కలుగుతుంది. ఒకే అతీంద్రియ తేజస్సు అందరిలో ప్రభవిస్తుంది.

అది పరాశక్తి అనుభూతిని కలిగిస్తుంది. అంధకారంలో అది పరమాత్మ అనుభూతి నిస్తుంది. ఎంతటి విషాదాన్నయినా భరించే శక్తి నా గుండె కుంది. అది నా మార్గం వదలి పక్కదారులు పట్టదు. ఈశ్వరీయతలో నిర్మలంగా రాణిస్తుంది. అది సచ్చిదానంద సాగరాలను ఔపోసన పట్టగలదు. తన ఆధ్యాత్మిక

ఔన్నత్యాన్ని ఎన్నటికీ కోల్పోదు. అంతరంగంలో ఎప్పుడూ ప్రశాంతినే అనుభ విస్తుంది."

కాలపురుషుడు తన వాదాన్ని కొనసాగించాడు : "నీ మానవ హృదయం అంత దృఢమైనదా? నీ ఆత్మకు అంత స్వతంత్రం ఉందా? అయినా నీవు నా మార్గంలో పయనించినా సుఖించగలవు. సుఖదుఃఖాలను ఆస్వాదించవచ్చు. నీ గమ్యం దాటిపోనవసం లేదు. ప్రపంచసుఖాలనే కోరుకోనవసరం లేదు. ఏదీ నా శాసనం ధిక్కరించి నీ శక్తిని, స్వేచ్ఛను ప్రదర్శించు?"

సావిత్రి సమాధానం చెప్పింది : "నా జీవన వనాలలో యధేచ్ఛగా సంచరిస్తూ అక్కడ విరబూసిన సుఖసంతోషాలను అనుభవించగలను. సత్యవంతుని ఆనందాలే నావి, నా సుఖసంతోషాలే తనవి. మా ఇరువురి గమ్యం, లక్ష్యం ఒక్కటే. ఇరువురి జీవనం కలిసే ఉండాలి. నేను విజయం సాధిస్తే ఈశ్వరీయత, కాలం మా అధీనంలోకి వస్తాయి. నేను ఓడిపోతే నేను సత్యవంతుని దగ్గర ఉంటాను. మాది ఒకే పథం. ఒకే పథకం. మేం చేసే ప్రతిపని మా ఆత్మ ప్రమేయంతో చేస్తున్నదే. ఏదైనా మమ్మల్ని లక్ష్యానికి దగ్గరగా చేరుస్తుంది."

శూన్యమే తానైన మృత్యువు మరల సమాధానం చెప్పింది : "భౌతిక సుఖాలు కాంక్షించి, దేవతలకు నీ శక్తియుక్తులేవో నిరూపించి చూపించు. ఇటు స్వార్థం కావాలి, అటు ఆత్మ విముక్తి కావాలంటే కుదరదు. భౌతిక బంధాల నుండి, సుఖాల నుండి విముక్తం కానిదే జీవి పరం పొలిమేరలకు చేరదు. నీ ఆత్మ కోరినవన్నీ అనుగ్రహిస్తాను. పరిగ్రహించు. ప్రపంచంలో మనిషి అనుభవించే సుఖాలన్నీ అశాశ్వతాలు, క్షణికాలు. అన్నింటిని మించినది, అద్వితీయమైనది ఒక్కటే ఉంది. ఎన్ని కాదని వాదించినా విధిని మాత్రం కాదనలేవు. ఎంత కాలం గడిచినా నా సంకల్పం మారదు. సత్యవంతుడు ఎన్నటికీ తిరిగి నీ వాడు కాడు."

ఆ మహాశక్తికి సావిత్రి మరో సమాధానం చెప్పింది : "నీ చీకటి కళ్లు సత్యాన్ని చూడగలిగితే నా హృదయం లోకి చూడు ... నేనెవరో తెలుస్తుంది. నువ్వు ఇవ్వగలిగింది, ఇవ్వదలచింది ఏది కానీ, నాకు సత్యవంతుడు తప్ప వేరే వరం ఏదీ అవసరం లేదు."

అనేక సందేహాలు మృత్యువును కలవరపరిచాయి. ఓటమిని అంగీక రించడం మృత్యువుకుససేమీ ఇష్టం లేదు. తలవంచి నెమ్మదిగా సమాధానం పలికాడు –

"మృత్యువును, విధిని కాదనకు. సత్యవంతుడు సజీవుడై ఉంటే నీవు

ఆశించినవన్నీ అనుగ్రహిస్తాను. అప్పటి సుఖాలు, ఆనందాలు, వైభోగాలు అన్నీ సమకూరుస్తాను. నీవంటి సౌందర్యం గల బిడ్డల్ని ప్రసాదిస్తాను. సత్యవంతుని వంటి పుత్రులను ఇస్తాను. నీకు ఇష్టమైన మరొక వ్యక్తిని భర్తగా చేసుకో, సుఖపడు. కొత్తసంసారంలో లోగడ అనుభవించక మిగిలిపోయిన సుఖాలు, ఆనందాలు తృప్తిగా అనుభవించు. నీ ప్రేమను ఎందరికైనా పంచిపెట్టు. వయస్సులో అనుభవించ వలసినవన్నీ నీ ఆత్మీయులతో కలిసి అనుభవించు. నిన్ను ప్రేమించిన వారందరికీ నీ ప్రేమను పంచిపెట్టు. సావిత్రీ! ఆనంద ధ్రువాలను ఒకటి చేసుకో. నీవు వదలి వచ్చిన ప్రపంచంలోకి తిరిగి వెళ్లిపో."

సావిత్రి అన్నది : " నీ వరాలు ఏవీ నాకు అవసరం లేదు. నేను ఒంటరిగా తిరిగివెళ్లితే నా ప్రపంచానికి మేలు కలగదు."

తప్పించుకు పారిపోతున్న వేటపై సింహం ఆగ్రహించినట్లు మృత్యువు మరొకసారి సావిత్రిపై మాటల ఈటెలు విసిరింది :

"పరిణామం గురించి నీకు తెలియదు. ఒక వ్యక్తి మరణంతో ఆనందాలన్నీ హరించి పోతాయనుకోకు. కడవరకు విషాదంలో జీవించాలని అనుకోకు. మనస్సు అలసిపోతే విషాదం అంతరిస్తుంది. శూన్యమైన జాగాలోకి ఇతర విషయాలు ప్రవేశిస్తాయి. పనీపాటు లేనప్పుడు యౌవన చాపల్యంతో చిత్రించుకున్న బొమ్మ ప్రేమ. అది సౌందర్యంతో జతపడి ఆకర్షణగా మారుతుంది. అనంతసాగరాలపై పయనించే వారికి ప్రతికెరటం ఒక కొత్త అనుభూతిని కలిగిస్తుంది. ప్రతిక్షణం వారు పరిణామం రుచిచూస్తుంటారు."

కాలపురుషుని మాటలకు సావిత్రి తిరిగి సమాధానం చెప్పింది : "నా సర్వస్వం అయిన సత్యవంతుని నాకివ్వు. నీ వాదనలు నాకు తృప్తి కలిగించవు. ఈ ప్రపంచంలో ఉంటూనే అమరత్వాన్ని సాధించుకుంటాను."

మృత్యువు ఆగ్రహంతో అరచింది : "వెళ్లు..... వెళ్లి నీ ఆత్మనే ఆశ్రయించు, అర్థించు. అందచందాలు, శక్తిసాహసాలు కల పురుషులు, నీ కోర్కెలు తీర్చగలవారు, అనేకమంది ఉన్నారు లోకంలో. నీవు గతాన్ని విస్మరించగానే వారిలో ఎవరో ఒకరు నీకు, నీ హృదయానికి దగ్గరవుతారు. నీకు తన ప్రేమను పంచి ఇవ్వగల వ్యక్తి కనిపిస్తాడు. మనిషిగా బ్రతికినంతకాలం ఎవరూ సుఖపడరు. నీ సత్యవంతుడు విస్మృతిలో కలిసిపోతాడు. నీ నుండి అతని మధురస్మృతులు జారిపోతాయి. నీ కొత్త ప్రియుడు, నీ పిల్లలు నీ ప్రేమను పంచుకుంటారు.

అసలు నేను సత్యవంతుని లోగడ ప్రేమించానా! అని నీవే ఆశ్చర్యపోతావు. ఇదీ ప్రపంచం పోకడ. జీవన ప్రవాహం ఒకచోట నిలబడదు. నిలకడగా ఉండదు.”

సావిత్రి మృత్యువుకు తిరిగి సమాధానం చెప్పింది: “భగవంతుని, సృష్టిని విమర్శించడమే నీ పని అనిపిస్తోంది. మనస్సు, శరీరం చేసే తప్పుల్ని వెతుకుతుంటావు. ఒకానొక శుభముహూర్తంలో కలిగే హృదయ స్పందన నీకు తెలీదు. ఆ క్షణంలో ఆత్మ అమర సుఖాన్ని అనుభవించి, అమృతతుల్య మవుతుంది. ఎడబాటు చెందినా ప్రేమ, ఆరాధన నిత్యమైనవి. హృదయం తనకిష్టమైన మూర్తినే ప్రేమిస్తుంది, ఆరాధిస్తుంది. అతని అడుగులో అడుగు కలిపి నడవాలని, అతని ప్రేమాగ్నిలో కాలిపోవాలని కోరుతుంది. భగవంతుని సన్నిధిలో, ఆధ్యాత్మిక శిఖరాలపై మహాశూన్యాన్ని భరించినవారమే మేము.

“మృత్యుదేవా! ఎందుకు నాతో వ్యర్థంగా వాదిస్తావు. ఆలోచనలు దాటిపోయిన మనస్సు సృష్టి రహస్యాలను తెలుసుకోగలదు. నాకు స్పష్టంగా తెలుసు..... ఈ వెలిగే నక్షత్రాలు, గోళాలు నా తేజస్సును పంచుకున్నాయని. సజీవస్మృతులే వాటి ప్రభలని. ప్రేమించడానికి జీవితం అవసరం. జీవన పోరాటంలో విజయం పొందడం అవసరం. అన్నీ నశించిపోయేవని, లయించి పోతాయని నాకూ తెలుసు. సప్తపదిలో ఈ మాయలన్నీ తొలగిపోతాయి. ఆ సమయంలో అందరూ ఆదిదంపతుల ప్రతినిధులే. అందరూ కళ్యాణ దంపతులే. మా అపజయాలను స్వర్గం ఆమోదిస్తుంది కానీ అభిశంసించదు. జీవన సాగరంపై కాలం కదలించే కల్లోల తరంగాలవి. ఎక్కడా ఒక్క ఆశాకిరణం కనిపించదు.”

సావిత్రి మాటలకు ప్రకృతి పులకించింది. అవి దేవతలకు సైతం తెలియని రహస్యాలు. సమాధిలో యోగులు, మహర్షులు పొందే అనుభూతులు. అక్కడ మహాశూన్యంలో ఒక ప్రచండ వాయువు వీచి ఆమె చుట్టూ అలముకున్న చీకటిలో ఒక వెలుగు కిరణం ప్రవేశించింది. ఇరువురి వాదన అలా సాగింది. వారి ఆత్మలను పరివేష్టించిన ఓజోవలయాలు రెక్కలు విదిల్చినట్లు దూరంగా పరుగులు తీశాయి. ఆమె భావాలు మెరుపు తీగలై చీకటిలో దూసుకుపోయాయి. ఆమె మాటల్లో మార్మిక రహస్యాలు తొంగిచూచాయి.

అక్కడ ఇంద్రచాపంలో కరిగే రంగులు, సుదూర తీరాల కదిలే నిశ్శబ్దాలు, భావాలు, భావప్రకంపనలు మనసు పొరల క్రింద మేలి ముసుగులు ధరించాయి. ఆమె స్థిరసంకల్పంతో దుర్గ్రాహ్య శూన్యంలోకి పయనించసాగింది. ఆమె ముందర కరిగిపోయే కలలు. కరిగిపోతున్న చిత్రాలు ... ఆమె వెనుక రెపరెపలాడే జ్ఞాపికలు.

ఆమె ఆత్మశక్తి అగ్నిశిఖ వలె స్వరాన్ని తనలో భస్మం చేసుకోగలిగింది. ఆమె యోగభూమికపైకి పరుగులిడింది. అక్కడ సత్యం ఒక్కటే మనగలుగుతుంది. అది అనశ్వరం. అది ఆత్మజ్యోతి. ఆ జ్యోతి పరాప్రకృతుల సంయోగ జనితం. ఆ వెలుగులో దేవతల్ని దర్శించవచ్చు. పరలోకాలను దర్శించవచ్చు. అన్నీ కదులు తున్నట్లు తోస్తుంది, కానీ ఏదీ కదలదు, ఏదీ మారదు. ఆ లోకాలన్నీ తన కోసం వస్తున్నట్లు అనిపించింది.

ముందు జీవుడు, ఆ వెనుక దివ్యుడు, చివరగా ఆత్మ పయనిస్తున్నాయి. ఆ ప్రయాణానికి నాయకత్వం సావిత్రిది. ఆమె సంకల్పం మేరకే మిగిలినవారి వేగం. శూన్యాలను దాటి ముందుకు సాగుతున్నారు. చుట్టూ అలుముకున్న గాఢతిమిరం. ఆమె ఆత్మ శక్తి వలయం దాటిపోవాలన్నా పోలేని నిస్సహాయత. మృత్యువు వెంట సత్యవంతుడు పరుగుతీస్తున్నాడు.

ఒక రాజహంస రెక్కలు విప్పి, పగడాల లోయలోకి ఆత్మల్ని మోసుకు పోతున్నట్లు ఆమె ముందుకు సాగింది. ఆమె ముందు సత్యవంతుడు, మృత్యువు. మృత్యువుకు ముందర ఒక నక్షత్రం వెలిగింది. అంతా విధి ..... రోదసి ... శూన్యం .... చీకటి.

32. స్వప్నవాస్తవం

ఈ ప్రపంచం వాస్తవం కాదన్నది ఎంత సత్యమో, వాస్తవమే నన్నది అంతే సత్యం. కాని ప్రపంచం ఒక భావన మాత్రమే నని, వాస్తవం కాదని సావిత్రిని నమ్మించ చూచింది మృత్యువు. సృష్టి సమస్తం పరమాత్మ కృతమని ఆమెకు తెలుసు. మృత్యువు వాదన వీగిపోయింది. సత్యవంతుని విడిచి పెడితే తప్ప తాను భూలోకం తిరిగివెళ్లనని ఖచ్చితంగా చెప్పింది. వారు పరలోకపు చీకటి సరిహద్దులు చెరపి భూలోకం అంచులవరకు దిగివచ్చారు. అక్కడ మనుషుల ఆరాట పోరాటాలు కనిపించాయి. వాటిలో మనిషి సాధించేది ఏమిటని మృత్యువు ప్రశ్న. స్వర్గంతో, దేవతలతో పోల్చితే భూమి, మనుషులు స్వల్పం. కానీ పరిణామానికి ప్రపంచం, మనిషి అవసరం.

ఊహిస్తున్న సత్యం ఎలాంటిదని మృత్యువు ప్రశ్న. సత్యమే భగవంతుడైతే తాను భగవంతుడేనని మృత్యువు వాదన. మనిషి చరిత్ర సృష్టించినా, సంపూర్ణత సాధించలేదు. ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించిన వారైనా పూర్ణసత్యయోగులు కారు. సత్య సమగ్రరూపాన్ని దర్శించలేదు. అయినా మనిషి సాధన చేస్తున్నాడు. తపస్సు చేస్తున్నాడు. సత్యం కొంతవరకే తెలుస్తోంది. అనుభవంలో తెలుసుకోవలసింది సత్యం. సృష్టిరహస్యం తెలిస్తే మృత్యువు ఉండదు.

'నీవెవరవు' అని మృత్యువు సావిత్రిని ప్రశ్నించింది. సావిత్రి తానే ఆదిశక్తి నని తన విశ్వరూపాన్ని చూపింది. అనంత విశ్వంలో సావిత్రి భౌతికరూపం చిన్నదే. కానీ విశ్వరూపం అద్భుతం. తర్వాత సత్యవంతుని తనకోసం విడిచిపెట్టమని కోరింది. ఇద్దరి మధ్య నిశ్శబ్దం తాండవించింది. సత్యవంతుని బ్రతికించి పంపడమా, మానడమా? అన్నది మృత్యువుకు ఎదురైన ప్రశ్న!

ఏటవాలుగానున్న జారుడు ప్రదేశం చేరారు. అక్కడ నుండి జారితే ఏ అఖాతంలోకో చేరడం. మనస్సులో కదిలే స్వప్నం కరిగిపోయింది. సుందర

తేజోస్వప్నాలు మహత్తుల్ని సృష్టించే సూక్ష్మస్థితి దాటింది. ఆలోచనలు అధోలోకం వైపు పరుగిడుతున్నాయి. వాస్తవాలు నగ్నంగా కళ్లముందు కనిపించసాగాయి. సంధ్యారాగాలు ప్రవహిస్తున్న రంగులు మారసాగాయి. సంతోషం కలిగించే స్వప్నం చెదిరిపోయింది. స్వర్గం ఆకాశంలో కనుమరుగైంది. అన్నివర్ణాలు రక్తారుణిమలో కలిసిపోతున్నాయి. పట్టపగలు ఎర్రటి శాలువా కప్పుకున్నట్లయింది. ఏదో నిరాశ, నిస్పృహ ఆమె హృదయాన్ని పట్టిలాగుతోంది. ఆమె వివేకం భరించలేని భారం భావనలో, చెవులకు భయంకర శబ్దాలేవో వినిపిస్తున్నాయి. కళ్ల మసకతెరలు తొలగిపోగా జారిపోతున్న నేలలు, మేఘాలు పరుచుకున్న పర్వతాలు, పరుగులిడే ప్రవాహాలు, నగరాలు, శిఖరాలు, బురుజులు .... అన్నీ కనిపించి ఆకాశంలో కలసిపోసాగాయి. అందులో నౌకాశ్రయాలు, తీర్థాలు, మందిరాలు, మంటపాలు, ఓడలు, రేవులు కనిపించి క్షణంలో అంతరిస్తున్నాయి.

అవి వాస్తవాలేనని తన నమ్మకం. కాదని అవి కరిగిపోవడం. అవి అన్నీ స్వప్నవాస్తవాలు. అవి ఒక స్వప్నంలో గుదిగుచ్చబడిన వాస్తవాలు, వాస్తవ చిత్రాలు. సాగిపోతున్న జీవన ప్రవాహంపై తేలిపోతున్న నావల తెరచాపలు. అవాస్తవం వాస్తవమే నన్నంత విశ్వాసం తనలో కలిగింది. మృత్యుస్పర్శతో జీవనరంగమే మారిపోతుంది. తెరపడుతుంది. బ్రతుకులో ఆరాటాలు, పోరాటాలు. అవిరళ కృషి, నిరాశలు, నిట్టూర్పులు. ఆలోచనకు, ఆచరణకు పొంతనలేని కర్మకాండ. భయంకర యంత్రం చేస్తున్న రొద. ఆమె ఆత్మను కబళించడానికై జరిగిన ప్రయత్నం. కదలని మహాపర్వతాన్ని సాగరతరంగాలు కబళించ ప్రయత్నిస్తున్న తీరులో ఆమెను ఒక భూతం ఆవహించింది. అది ఆమె ఆత్మను ఆక్రమించు కోవాలని ప్రయత్నిస్తోంది.

దిగంతాలను దద్దరిల్లచేసే హాహాకారాలు. అంతటా విషాద సంగీతం, యంత్రఘోష. అంతటి భయంకర వాతావరణం క్షణంలో నిశ్శబ్దమైంది. కల్లోల గగనాన్ని చీల్చుకుని వెలుగు తొంగిచూచింది. ముసిరిన మేఘాల తీరాలను, కొలిమినుండి ఎగసివచ్చే నిప్పురవ్వలు, పొగలు ఆక్రమించాయి. స్తబ్దంగా ఉన్న విశ్వమేధ సృష్టికి పూనుకుంది. ఆమె క్రిందికి జారిపోతూ కదిలిపోతున్న చిత్రాలను చూచింది. అవి అన్నీ మనిషి ఆలోచనలే, కలత పడ్డ ఆశలే. అవి ప్రకృతికి ప్రతికృతులు, మానవకల్పనలు, సిద్ధాంతాలు, నీతినిధులు. అవి గతించిపోయిన నాగరికతల స్మృతిచిహ్నాలు. అండ, పిండ, బ్రహ్మాండాలకు సంకేతాలవి.

మతి మరచిన మహత్తరకాంతి తొలి విశేషాలవి. ఆమె మనస్సు పొరలలో మరుగుపడిన విజ్ఞాన ఖండికలు, మంత్రాలు, తంత్రాలు, మహద్వాక్యాలు నిష్ప్రయోజనాలై మానవుని ఉద్ధరించే మహత్తు తమలో లేదని రెక్కలు కట్టుకుని చీకటి కోనల్లోకి జారిపోతున్నాయి. మహాత్ముల దివ్యసందేశాలు, మహర్షుల సూక్తులు, దేవతారాధనలు అన్నీ నిరర్థకాలవుతున్నాయి. సత్యవచనాలు ఎప్పటి కప్పుడు మారిపోతున్నాయి. ఆదర్శాలు, విజ్ఞానం, కళలు, కవిత్వాలు, సిద్ధాంతాలు అన్నీ నశిస్తున్నాయి. మళ్లీ మరొక రూపంలో తలెత్తుతున్నాయి, ఉద్ధరింప బడుతున్నాయి. ఏదో అజ్ఞాత శక్తి వాటిని మళ్లీ మళ్లీ కల్పిస్తోంది, ఉద్ధరిస్తోంది. కాని అవి అన్నీ స్వప్నాలై కడకు శూన్యాలే అవుతున్నాయి.

పర్వతగుహలలో, నదీతీరాలలో, అరణ్యాలలో తపస్సు చేసే మహర్షులు, మునులు స్వర్గాన్ని చేరాలని, ప్రపంచానికి అతీతంగా శాంతిని పొందాలని యత్నిస్తారు. కాని, అలా విగ్రహాలుగా మిగిలిపోతారు. భావనలోకంలో మరొక స్వర్గాన్ని సృష్టించుకునే వారు కొందరు, ధ్యానసమాధిలో ప్రపంచాన్ని మరిచి పోయేవారు కొందరు, ఎవరూ ఏమీ సాధించరు. వారి ఆత్మలకు విశ్రాంతి లభించదు. అంతా భ్రాంతి. అంతా స్వాప్నికం. గతంలో సృష్టించబడిన వాటి అవశేషాలు అవి. ఒకప్పటి సజీవరూపాలకు నిర్జీవప్రతిమలు. ఈనాడు మనం మోజుతో ఆరాధించే రూపాలు కొంతకాలానికి విస్మరించబడతాయి. యుగ యుగాలుగా మానవుడు కష్టించి సమకూర్చుకున్నవన్నీ తర్వాతి కాలంలో నిష్ప్రయోజనాలు, నిరుపయోగాలు అవుతుంటాయి. ప్రతియుగంలో ఈ చరిత్ర పునరావృత్త మవుతుంది.

అలుపు సొలుపు లేకుండా అన్నీ మళ్లీ మళ్లీ ఏర్పడుతుంటాయి. వాటిని అన్వేషించడంలో ఒక ఆత్మానందం ఉంటుంది. పరిశ్రమించడంలో తృప్తి. జయాపజయాలలో ఆనందం. సృష్టించి, పోషించి, అనుభవించి, హత్యచేయటంలో ఆనందం. కాలచక్రం అలా తిరుగుతూ ఉంటుంది. అన్నీ వస్తూ పోతూ ఉంటాయి. అవే పనులు చేయడం, అవే ఫలితాలు సాధించడం. ఎప్పటికప్పుడు కొత్తవి రావడంతో ఉన్నవి పాతబడి పోతుంటాయి. మరల పాతవే కొంతకాలానికి కొత్తరూపాలు ధరించి కనిపిస్తుంటాయి.

మరొకమారు మృత్యువాణి భయంకర గర్జన వినిపించింది :

“ఈ లోక తంత్రాలన్నీ కడకు నిష్ప్రయోజనాలే. అన్ని శక్తులు మహాశక్తికి లోబడినవే. అన్నీ కాలంలో కలిసిపోవలసిందే. ఈ లోకంలోని జీవుల్ని గమనించు.

ఇవి స్వప్నంలోని అస్థిరరూపాలు. అన్నీ స్వప్నభ్రాంతులు. ఇవే ప్రాపంచిక విన్యాసాలు. అనవరతం కదలిపోతున్న మానవజీవనంలో స్థిరమైనది, ప్రకృతి సహజమైనది ఎంతో నీకు తెలియదు. జన్మించిన నేరానికి బలహీనతలకు లోనై జీవించాలన్న వాంఛ బలీయం కాగా, మనిషిని 'ఆశ' ఒక మహాజాడ్యంగా పట్టుకుంది. గతి తప్పని ఈ పరిణామక్రియలో, ప్రకృతిలో ఏమార్పూ లేదు. మనిషిలో మార్పు లేదు. ప్రకృతి ధర్మాలను, సూత్రాలను మనిషి పాటించి తీరవలసిందే. జరిగిపోయిన కథలే ప్రకృతి మళ్లీ మళ్లీ విప్పి చెబుతుంది. కాలచక్ర భ్రమణంలో మానవమేధ రోదసీతీరాన్ని తాకుతుంది. మనిషి అంటేనే మేధ, మనస్సు. మనస్సును దాటి మనిషి పైకి పోడు. ఆ హద్దుల్ని దాటగలిగితే మనిషికి ప్రమాదం తప్పినట్లే. చూడగలడుగానీ, ఆ చూచిన పరలోకాలకు చేరలేడు. రెక్కలు కట్టుకుని ఎగిరినా క్రిందనే పడతాడు. తన మనస్సు అనే వలలోనే మనిషి బందీ అవుతున్నాడు. ఆత్మ రెక్కలు విప్పుకుంటే ఈ ప్రపంచాన్ని దాటిపోవచ్చు. అన్ని అవరోధాలను మనిషి దాటిపోగలడు.

తన కిష్టమైన ధ్యానంతో హృదయాన్ని జాగృతపరచి నిరాకారంగా ఇష్టదేవతలను ప్రతిష్టించుకుంటాడు. కడకు తానే నిరాశతో శూన్యాన్ని ఆశ్రయించి, ఆ శూన్యాన్నే బ్రహ్మానందంగా భావించి, అదే ముక్తిమార్గం, అదే మోక్షం అనుకుంటాడు. అది ఆత్మలు ఆశించే పరనిర్వాణస్థితి. తన ధ్యానానికి ఆలంబనగా ఉన్న మంత్రం సైతం శూన్యంగా మారిపోతుంది. భౌతికంగా సుఖాలు, సంపదలు అనుభవిస్తూ అవాఙ్మానసగోచరుడైన పరమాత్మను ఆహ్వానిస్తాడు. తన ఆత్మను పరమాత్మతో జతపరచాలన్న తపనతో తన శక్తిని శూన్యంలో లయింప చేసుకుంటాడు. అన్నిజీవులలోనూ తన ఆత్మ వంటి ఆత్మ ఉన్నదనుకుంటాడు. అచల పరబ్రహ్మకు తన ఆత్మ నివేదన చేసుకుని ఆగ్రహానుగ్రహాలను ఆ పరమాత్మకు ఆపాదిస్తూ వేయినామాలతో స్తుతిస్తాడు.

నిజానికి పరమాత్మ తత్వాన్ని తన జీవనంలో శ్రుతి కలపాలి. తన జీవితంతో సమన్వయించుకోవాలి. ఆ పని మాత్రం చేయడు. అనంత పరబ్రహ్మను భూమిపైకి రప్పించడం సాధ్యమా? అయినా ఎందుకు? కరిగిపోయే కాలంలో అనంతం ఎలా నిలుస్తుంది? ఈ భౌతిక ప్రపంచంలో ఏదో ఉన్నదనుకుంటారు. ఇక్కడ ఏముంది? లక్ష్యం లేదు, ఉన్నదొక్కటే ఆశ. ప్రకృతి ధర్మానుసారం అన్నీ సదా చరిస్తుంటాయి. అవి అన్నీ కొంతకాలం ఉండి కనుమరుగయ్యే రూపాలే. ఎంతో శ్రమతో తయారుచేసుకుని పోషించుకున్నవి నిమిషంలో అంతరించిపోతుంటాయి.

ఆ ఆకృతుల్ని శాశ్వతం చేసే 'సత్యం' లేదు. రక్షిస్తామనే వారే తమని తాము రక్షించుకోలేరు. కాలచక్రాల క్రింద పడి అన్నీ నలిగిపోతుంటాయి. నామరూపాలు లేకుండా పోతుంటాయి. మనిషి చేసే ఆలోచనలకు ఏవో పరిష్కారం చూపుతారు. కాని భూమి ఏర్పడినప్పటినుండి ఇప్పటి వరకు ఏ ఒక్క సమస్యకు పరిష్కారం లభించలేదు.

మీ విజ్ఞాన శాస్త్రాలన్నీ మహత్తరంగానే కనిపిస్తాయి. ఈ గోళాలు, లోకాలు ఎలా ఏర్పడ్డాయో పరిశోధించి చెబుతారు. ఎందుకు ఏర్పడ్డాయో ఎవరూ చెప్పరు. అన్నీ మనిషి అవసరాలకే ఏర్పడ్డాయా అనిపిస్తుంది! మనిషి ఆకాశంలోకి ఎగురుతున్నాడు. సముద్రం లోతులు చూస్తున్నాడు. కాని ఎలా? ఎందుకు? ఏర్పడ్డాయో తెలుసుకోలేడు. మానవమేధ లాఘవంగా ఏర్పరచుకున్న విజ్ఞానం ఇది. అందులో మంచిని మించిన చెడు ఉంటోంది. మానవశక్తికి ఎప్పుడూ అవరోధాలు, అడ్డుగోడలు ఉంటాయి. అన్నీ కూలిపోయే భవంతులే. తాను నిర్మించుకున్న సుందరభవనాలలో మనిషి బందీ అవుతున్నాడు. అక్కడ దీపాలు చమురున్నంత కాలం వెలిగి చప్పున ఆరిపోతుంటాయి.

ఈ పరిణామంలో రాక్షస కృత్యాలున్నాయి. వికృత చేష్టలున్నాయి. మానవత్వం వేయి విధాల గాయపడింది. మనిషి శరీరం నిండా గాయాల మచ్చలే. వాటిని కప్పిపుచ్చుకోడానికి కొత్తబట్టలు వేస్తుంటాడు. రోజు కొక వేషం మారుస్తుంటాడు. సృష్టిలో ఏజీవి తన సహజత్వాన్ని కప్పిపుచ్చుకోదు. ఒక్క మనిషికే ఆ లక్షణం అబ్బింది. మనిషి స్వార్థం వల్ల, అత్యాశవల్ల రక్తపాతం జరుపుతాడు. యుద్ధాలు చేస్తాడు. సాటిమనిషిని హింసించి తను ఆనందిస్తాడు. శతాబ్దాల కృషి ఫలం క్షణంలో అంతరించిపోతుంది. గెలిచినవారి ఔన్నత్యం, ఓడిపోయినవారి నైచ్యం తర్వాతి తరాలవారి జీవితాల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. గెలిచినవారు తాము దేవతల మనుకుంటారు. వారి రాక్షసానందంలో క్షుద్రశక్తులు విందు చేసుకుంటాయి.

ఔన్నత్యం, పశుత్వం, అవమానం – ఒక్కటేమిటి పరిశ్రమలు, ప్రతాపాలు, ఆనందాలు, విలాసాలు, ఆరాటాలు, ఆక్రోశాలు, ఆశలు, ఆశయాలు, యుద్ధాలు, విజయాలు, అపజయాలు అన్నీ లక్ష్యం లేని గమ్యాలే. ఈ యాత్రకు అంతం అనేది ఎక్కడ? మేల్కొని ఉన్నంతసేపు మనిషికి ఆరాటం. నిద్రలోనే విశ్రాంతి. ఈ త్రుళ్లింతలు, కేరింతలు, ఆనందాలు, విషాదాలు, వినోదాలు, విలాపాలు దేవతలిచ్చిన వరాలా? అసలు ఎక్కడికీ ప్రయాణం? ఎంత దూరం? ఈ పథ

యాత్రలో మజిలీలు ఎన్ని? ఎవరు కల్పించారు ఇవన్నీ! ఈ ప్రపంచం తనంత తానుగా సాగిపోతున్నదా? ఆశల్ని, కలల్ని సృష్టించే మనస్సు తప్ప మరేదీ ముఖ్యం కాదా? ఎందుచేత ప్రపంచం మాయ అయినా వాస్తవంగా మనగలుగుతున్నది. ఇది స్వప్న వాస్తవం. ఇది చైతన్యం పొందిన మేధ చెప్పుకున్న కథ, విప్పుకున్న ముడి. భౌతికత మేధకు ఆధారం, ఆలంబనం. కానీ కనిపించే ఈ లోకానికంతటికీ కనిపించనిది మరేదో ఆధారం ఉంటుందని మనిషి గ్రహించడు.

ఈ సృష్టికి కర్త, రంగం, నటుడు, ప్రేక్షకుడు అన్నీ మనస్సే. మనస్సు ఆలోచిస్తూ గమనిస్తుంది. అదే సర్వస్వం. మనస్సు సర్వం అయినపుడు ఆనందం సైతం మనస్సుకు పరిమితమే. అదే సర్వస్వం అయినపుడు 'సత్యం' అవసరం లేనే లేదు. మనస్సు ఎప్పటికీ సత్యాన్ని తెలుసుకోలేదు. మనస్సుతో భగవంతుని చూడలేవు. అది ఈశ్వరీయత కనుక దాని ఛాయను మాత్రమే చూడగలవు. మనస్సు భగవంతుని పట్ల వైముఖ్యం ప్రదర్శించి, అనశ్వర సుఖాల్ని కాంక్షిస్తుంది.

మనస్సు వెలుగునీడల మిశ్రమంతో ఏర్పడుతుంది. అందుకే మనస్సులో వెలుగు నీడలు, మంచి చెడులు కలిసే ఉంటాయి. సత్యానికి అసత్యానికి మధ్య, ఆనందానికి విషాదానికి మధ్య ప్రకృతి తనకు అనుకూలంగా మనస్సును ఏర్పరచుకున్నది. ఈ వైరుధ్యపు జంటల్ని ఏ శక్తి విడదీయలేదు. ప్రతి ఆలోచన బంగారంలా మెరుస్తుంది. ప్రలోభపెడుతుంది. సత్యాసత్యాలు మనస్సనే నాణానికి బొమ్మ బొరుసులు. ఈ బంగారు నాణాలను మనస్సు విపరీతంగా ఉత్పత్తి చేస్తుంది. మనస్సు తయారు చేసేవన్నీ ఇటువంటి నాణాలే.

కనుక సత్యాన్ని ఈ ప్రపంచంలో ప్రతిష్ఠించాలని ప్రయత్నించకు. ఈ భౌతిక ప్రపంచాన్ని పరమాత్మకు ఆవాసంగా మార్చలేవు. ఇక్కడ సత్యభావన తప్ప మౌలిక సత్యం ఇమడదు. ఇక్కడ భగవంతుని నామమే తప్ప అసలు భగవంతుడు ఉండడు. ఒకవేళ ఉన్నా అదృశ్యంగా ఉంటాడు. ఎవరికీ కనిపించడు. ఆత్మ ఉన్నదంటావు! అది అశరీరి. శరీరంతో కలిసి ఉండదు. ఆత్మ ఎవరి సొంతమూ కాదు. ఎవరికీ చెందనిది ఆత్మ. అయినప్పుడు ప్రపంచంలో ఆనందహేతువు ఏది? మనస్సును, శరీరాన్ని వదలినప్పుడు కదా ఆత్మ నీదవుతుంది. కాదు, నీవు ఆత్మవు కాగలవు. ఆ స్థితిలో ఏకాంతంగా సర్వం నీవే అవుతావు. భగవంతుడు అనాసక్తంగా అన్నీ గమనిస్తుంటాడు. మనిషి హృదయంలో ఆశల్ని, నిరాశల్ని నింపుతుంటాడు. నీ మూగ ప్రార్థనలు ఆయన చెవులకు వినిపించవు.

ప్రపంచం అల్లకల్లోలం అయినా భగవంతుడు పట్టించుకోడు. తాను కల్పించిన వాటికి తానే చలించడం ఏమిటి? గ్రహగతుల్ని, వాటి ప్రభావాలను శాసిస్తాడు. మానవ విధిని గ్రహాల సహకారంతో మార్చుకుంటాడు. నీ మానవ ప్రజ్ఞకు భగవంతుని సంకల్పం అతీతం. ఆయన ఆనందానికి నీ ప్రేమ పూజలు అవసరం లేదు. మనిషి ఎంత ఆలోచించినా, పరబ్రహ్మతత్వం అర్థం కాదు. సత్యం అవగాహనకు రావాలంటే మనస్సును నిశ్చలపరచాలి. కనిపించని మహాకాంతిలో నీ అజ్ఞానాన్ని అంతం చేయి. ఈశ్వర సచ్చిదానందం మానవ భూమిక పైన లభించదు. జగన్మాత మహత్తరమైన తన సచ్చిదానందాన్ని అశాశ్వతమైన మానవదేహంతో ఎలా నిలపగలుగుతుంది. విషాదపూర్ణమైన నీ హృదయంలో అమలిన బ్రహ్మానందాన్ని ఎలా ప్రతిష్టించుకోగలవు. మీ శరీరాలు ఏ క్షణంలో మృత్యువాత పడేదీ మీకు తెలియదు. భగవంతుడు సృష్టించిన లోకరీతిని మార్చడానికి నీవెవరు? భగవంతుని సంకల్పాన్ని మనిషి మార్చగలడా!

నీ ఆనందం, విషాదం స్వర్గ ద్వారాలను దాటిపోవు. భూమిపైన లభించని ఆనందాలు స్వర్గంలో లభిస్తాయని కదా నీ ఆశ. నిజమే, అమృతమయమైన పైలోకాలన్నీ స్వర్గాలే. అక్కడ వినిర్మలమైన తేజస్సు, సచ్చిదానందం అవిరళంగా లభిస్తుంటాయి. అక్కడ దివ్యాత్మలకు మృత్యువు ఉండదు. మృత్యుబాధ, భయం ఉండవు. నీదైన అమృతస్థితిని నీవు ఎప్పుడైనా పొందవచ్చు. అక్కడ నీ స్థానం ఎప్పుడూ భద్రంగా ఉంటుంది.

నీవు నిజంగా ఆత్మవే అయితే, భౌతికశరీరం నీ ఆత్మకు ఆచ్ఛాదన అయితే, ఆచ్ఛాదన తొలగించుకుని, నిజాత్మను ఆశ్రయించు. అది పరమసత్య స్వరూపం. దానికి మృతి లేదు. ఏకాంతంగా ధ్యానించి, నిశ్చల పరబ్రహ్మస్థితిని సాధించుకో. ఇక్కడ సర్వం వర్జించినప్పుడే అక్కడ పరబ్రహ్మత్వం సిద్ధిస్తుంది. సత్యవంతుని, ఈ ప్రేమను సైతం నీవు మరచిపో. అచంచలమైన నిశ్చల ప్రశాంతిలో నిన్ను నీవు లయం చేసుకో. నీ ఆత్మను ఆ మహత్తరమైన శూన్యసీమలకు చేరనివ్వు. నిన్ను నీవు శూన్యం చేసుకుంటే గాని భగవత్తత్వంలో జీవించలేవు. అమరత్వాన్ని చేరడానికి ఎవరైనా నాలోంచి పయనించవలసిందే".

సావిత్రి కాల ధర్మానికి ఇలా సమాధానం చెప్పింది : "సత్యం కన్ను మూయడానికి నీవు మరోమారు అసత్యాన్ని ఆశ్రయిస్తున్నావు. అజ్ఞానం పన్నిన వలలో జ్ఞానం చిక్కదు. నీ వాదనతో నా ఆత్మను అపమార్గం పట్టించ యత్నించకు. ధర్మమూర్తీ! అలసిపోయిన సామాన్య జీవులకు నీ వరాలు రుచిస్తాయి కాని నాకు

కాదు. కాలం చేసే గాయాల బాధను భరించలేని వారికి నీ వరాలు ఉపశమనం కలిగిస్తాయి. శరీరానికి, మనస్సుకు బందీలైన ఆత్మల విషయం నీవు చెప్పేది. అలాంటివారు ప్రయత్నించి ఆ బంధాలను త్రెంచుకోవాలి, వెలుగులోకి రావాలి. నేను ఆ రకం కాదు. నీవు పరబ్రహ్మవైతే నీవు అనుగ్రహించే వరాలు గొప్పవే అవచ్చు.

"అయినా ఈ అశాంతిలో నాకు విశ్రాంతి ఎలా లభిస్తుంది. అశాంతి సైతం జగన్మాత ప్రసాదమే కదా! ఆమె తన దివ్యదృష్టితో సమస్త విశ్వాన్ని గమనిస్తుంది కదా! ఆమె ప్రజ్ఞా ప్రాభవాలు ఏ సంకల్పాన్నయినా నెరవేర్చగలవు. ఆమె అనురాగ హృదయంలో శాంతి సమీరాలే తప్ప అగ్నికీలలు ఉండవు. ఈ ప్రపంచం ఒక ఆధ్యాత్మిక చిత్ర చయనిక. ఒక అవసరం కోసం జగత్ సృష్టి జరిగింది. భాషకు, భావానికీ అతీతమైనది భగవంతుని సంకల్పం. సృష్టిలో అనేక విన్నాణాలు, విన్యాసాలు ఉన్నాయి. కొన్ని సంకేతాలు వివరణకు అందవు. భాషతో వాటిని వ్యక్తం చేయలేం. అలాంటిదే సత్యం. సత్యం అవ్యక్తం. సత్యం పరమాత్మ అదేశానుసారం క్రిందకి దిగి వచ్చింది. అంధకార శూన్యంలో చొరబడింది. మహత్తరమైన విశ్వసృష్టికి సహకరించింది. సృష్టించబడిన ప్రతి దానిలో అంతర్లీనంగా సత్యస్ఫూర్తి ఉంటుంది.

"నిరాకార, నిర్గుణ పరమాత్మకు ప్రతినిధి ఆత్మ. మనస్సు అవాఙ్మానసం గురించి ఆలోచిస్తుంది. మనిషి పరమాత్మకే రూపం కల్పించాలని చూస్తాడు. మానవశరీరం పరబ్రహ్మను భరించగలదా? సత్యం నుండి, పరమాత్మ భావన నుండి లోకం ఎప్పటికీ దూరం కాదు. నీవు నిరుపయోగమైన మహాంధకారాన్ని సృషించిపెట్టావు. అభేద్యమైన చీకటి గోడల్ని నిర్మించావు. మానవత్మ నీ ద్వారా స్వర్గలోకాలు చేరాలని నిబంధన విధించావు. కానీ దివ్యతేజస్సు చీకటిని చీల్చివేయగలదు. మృత్యువును అవలీలగా దాటిపోగలదు. జీవుని చరమావస్థలో ఆ వెలుగు ఏదో కనిపిస్తుంది, కనికరిస్తుంది.

"నా మనస్సు అనంత తేజస్సుతో ప్రభావితమైంది. నా ప్రాణం పరమేశ్వరి నుండి వేరై వచ్చింది. నా ఈ భౌతిక శరీరం భగవంతునికే అంకితమైంది. ఇది దివ్యత్వానికి నెలవు. ఇప్పటికే నాలోని దివ్యజ్యోతి అఖండ జ్యోతిగా మారింది. నా జీవకేంద్రం పరమాత్మశక్తికి కేంద్రమైంది. నా శరీరంలో ఆత్మ, పరమాత్మలు సాహచర్యం చేస్తున్నాయి. నీవు ఎలా చెప్పగలవు మానవమేధలో సత్యం నిలవదని,

మానవహృదయంలో బ్రహ్మానందం నెలకొనదని, తాను సృష్టించుకున్న లోకంలోకి సృష్టికర్త రాడని? ఇది ఆయన సొంత ఇల్లు!

"సృష్టి అర్థంలేని శూన్యం నుండి ప్రభవించిందా? అరూపం నుండి పదార్థం తయారైందా? ఒప్పుకుంటాను. ఈ జడ ప్రపంచం చైతన్యవంతమైంది కదా! చెట్టు చేమలపై హరితానందం పరచుకున్నది కదా! ప్రతి పూవులో తావి, మాధుర్యం ఏర్పడుతోంది కదా! లోకంలో అణువణువున చైతన్యం తాండవిస్తున్నది కదా! మానవమేధలోని సూక్ష్మపదార్థం ఆత్మావలోకనం చేస్తే, ఆత్మ తన నెలవు వదిలి, అణువణువునా చైతన్యం కలిగిస్తే బ్రహ్మ తేజస్సు మానవులపై ప్రసరించదా! ప్రకృతిలో నిద్రాణంగా ఉన్న శక్తులు మేల్కొనవా? నక్షత్రాల వలె సత్యప్రభలు జ్ఞాన ప్రాంగణంలో ప్రసరిస్తాయి. అప్పుడు పరమాత్మ ప్రేమను పంచుకోగలం. దివ్యలోకాల ద్వారాలు ఏ కొంచెం తెరుచుకున్నా చాలు దివ్యకాంతులు మాపై ప్రసరిస్తాయి. నీ చీకటి ఆ వెలుగుల్ని అడ్డుకోలేదు. మాలో దాగిన ఆత్మను వెతికి బయట తీయగల శక్తి అది.

"ఇప్పుడు పరమాత్మ నాలో ఉంది. సత్యం నాకు సన్నిహితంగా ఉంది. నీ వంటి నాస్తికులు దాని ఉనికిని గుర్తించరు. మహర్షికి జ్యోతి దర్శనం, యోగికి ఆత్మ దర్శనం జరిగి తీరుతుంది. నీవు ఆపలేవు. నేను రూపానికి, మనస్సుకు, ఇంద్రియాలకు కట్టుబడి లేను. నేను పరబ్రహ్మప్రజ్ఞతో చరిస్తున్నాను. నిర్గుణం, నిరాకారం అయిన పరబ్రహ్మ నాకు ఎప్పుడూ సన్నిహితమే. ఆ పరమాత్మ నాకు సహచరుడు, నా నేస్తం. సృష్టి చివరి వరకు పయనించిన నేను ఈ సృష్టి సమస్తం పరబ్రహ్మ అని తెలుసుకున్నాను. నా ఆత్మ పరమాత్మతో, నా శక్తి ఆది పరాశక్తితో కలిసే ఉంటున్నది. నేను అనంతుని రూపాన్ని ప్రేమించాను. ఆ పరమాత్మను మరొక భౌతిక రూపంలో అన్వేషిస్తున్నాను. తన ఆత్మను అందరి ఆత్మగా భావించే మనిషి స్వతంత్రంగా జీవించలేడు. నేను మానవాళికి ఏకైక ప్రతినిధిని. నాకున్న ఆత్మ స్వాతంత్ర్యం నా వారందరికీ కావాలి".

★ ★ ★

మరొక మారు మృత్యువు సావిత్రిని హెచ్చరించింది. తన కఠిన శాసనం క్రింద తానే నలిగిపోయినట్లు భావించింది. అర్థం లేని తన పట్టుదలతో తనే ఓడిపోయినట్లు, అలసట అవిశ్వాసంతో తలెత్తింది. మృత్యువాణిలో ఇదివరకున్న గాంభీర్యం లేదు. స్వరం కాస్త మందగించింది. మృత్యువులో ఒక తలపోత. అనవరతం అసంఖ్యాక జీవనపథాలలో తిరుగుతుంది. నిరంతరం శ్రమిస్తుంది.

తాను సాధిస్తున్నదేమిటి? అనే ప్రశ్న తలెత్తింది. ఒక్కొక్క జన్మలో, పరిణామంలో కొంత శక్తిని కోల్పోతున్నది. ఒక రాటకు కట్టినట్లు తిరుగుతుంది. తనకు ఒక లక్ష్యం, గమ్యం లేనట్లున్నది. ఎంత వేగంగా పయనించినా, ముందుకు సాగుతున్నది లేదు.

విధి, కాలం, అదృష్టం ఆడిస్తున్న నాటకంలో చివరి అంకంతో జీవితం ముగుస్తుంది. జయమో, అపజయమో తప్పదు. మనిషి కొంత జ్ఞానంతో, కొంత అజ్ఞానంతో నలిగిపోతున్నాడు. జ్ఞానం ఎంత పెరిగినా మనిషి కృషించి, నశించి పోతున్నాడు. చివరకు విసిగిపోతున్నాడు. చివరకు మిగిలేది ఏదీ కనిపించదు. ఏం సాధించింది తెలుసుకోకుండానే మరణిస్తున్నాడు. తన జ్ఞానఫలం తాను అనుభవిస్తున్నదీ లేనిదీ తనకే తెలియదు.

చీకటి నుండి బయటపడినట్లే అనిపిస్తుంది. తేజస్సు శాశ్వతంగా నిలవడం లేదు. ఈ మార్పులు పరిణామం కాదా? ఎప్పటికి మనిషి తపస్సు పండడం? శ్రమ ఫలించడం? శ్రమించినవానికి తన శ్రమఫలం దక్కని పరిస్థితి. తన అనుభవానికి అందని తపస్సు, సాధన ఏం ప్రయోజనం?

మృత్యువాణి ఇలా పలికింది :

“కనిపించే రూపాలను, ఆ రూపాల వెనుకనున్న శక్తిని నీవు విశ్లేషించగలవు. ఆ ప్రజ్ఞ నీకున్నదని నాకు తెలుసు. నీకు కనిపించేవన్నీ దేవతలు కల్పించిన రూపాలు. స్వతంత్రంగా జీవనలాలస నుండి మనస్సును మళ్లించు. దేవతల వలె నీవూ నిశ్చల ప్రశాంతిని అనుభవించగలవు. కాని, కల్లోలమైన నీ హృదయం ఎప్పటికీ శాంతించదు. ఇది స్వార్థం, అహంకారం రేపిన కల్లోలం. ఇది నిన్ను పతనం చేస్తుంది. విధి శాసనం నీవు చదవలేని బ్రహ్మలిపి. అదే మృత్యుశాసనం. అదే ధర్మం. అదే పరమాత్మ సంకల్పం. నీలో కోరికలున్నాయి. ఏ కోరిక లేనివారే పరమాత్మ అనుగ్రహపాత్రు లవుతారు.

నీవలె ఆలోచించే వారంతా నీవంటి వారే. నీ వలె వారూ సంక్షుభిత జీవన వలయంలో చరిస్తుంటారు. కాలాన్ని అధిగమించే దివ్యత్వం వారు పొందలేరు. శక్తిని ఆరాధించేవారు తమ లోపాల్ని కప్పిపుచ్చుకుంటారు. తీవ్రమైన వాంఛలతో, స్వార్థంతో శక్తిని వశపరచుకుంటారు.

జ్ఞానులు మహాపర్వతాల వలె నిశ్చలంగా ఉంటూ ఆకాశమంత ఎత్తుకు ఆధ్యాత్మికంగా ఎదుగుతారు. ఉన్నచోటు నుండి కదలక పోయినా వారు పరలోకాలలో విహరించగలరు. వారి ఆత్మలు ఆశించిన దివ్యశిఖరాల పైకి

చేరుతున్న కొద్దీ, పురోగమిస్తున్న కొలదీ, మధ్య నున్న మహాత్ములు వారి ప్రగతిని, అభ్యుదయాన్ని గమనిస్తుంటారు. తాము అచలస్థితిలో ఉండీ పరిణతి చెందుతారు. యుగాలు మారినా వారి యోగశక్తి తరగదు. కాలంలో జరిగే మార్పులు మహర్షులకు ముందుగానే తెలుస్తాయి. కాలం కదలికల్ని వారు గుర్తించగలరు. వారు కదలరు, మెదలరు. కాని సర్వం వారికి విదితమవుతుంది. సామాన్యుల జీవితం శూన్యంలో కలిసిపోతుంది. సాగరంపై పయనించే నౌకలను అఖాతాలు, సుడిగుండాలు మింగినట్లు మానవ జీవితాలను శూన్యం తనలోకి తీసుకుంటుంది.

క్షుద్రశక్తులు చేరువైనప్పుడు అంతా కలవరమే. అన్నీ అపస్వరాలే. అంతా అరాచకమే, అంతా వినాశమే. కాంతికణాల వలె క్షుద్రశక్తులు పరుగులు తీస్తుంటాయి. భూమి అసమగ్రతలను స్వర్గం పూరించదు. అయోగ్యమైన ఆత్మలను ఏ జ్ఞానం ఉద్ధరించదు. దేవతలకున్న శక్తి సామర్థ్యాలు పరిమితాలు. పరమాత్మ భావం అయోమయం. పరమాత్మ అగోచరం. అసలు పరమాత్మ ఉనికి సంశయం. ఈ ప్రపంచపు పోడమిలో పరమాత్మకు గుర్తింపులేదు. నీవు దివ్యశక్తులు పొందావు. నీవు శక్తివంతురాలివే. ఈ చీకటి అరణ్యంలో ఎందుకీ విలాపం! రాక్షసులకూ ఆత్మలున్నాయి. వారి వలె నీవు నీ ఆత్మశక్తిని వృథా చేసుకోవద్దు. ధర్మాన్ని, సంప్రదాయాన్ని ధిక్కరించకు. కాలక్రమేణా వస్తున్న ఆచారాలను, పద్ధతులను మన్నించి, గౌరవించడం నేర్చుకో."

★ ★ ★

ఆ మాటలలో పొంతన లేదు. తర్కం లేదు. వాదన కోసం వాదించినట్లుంది. సావిత్రి మృత్యువుకు నిబ్బరంగా సమాధానం చెప్పింది –

"ధర్మదేవతా! నీవు అనుగ్రహించే ప్రశాంతి ఆత్మశూన్యమై, మనస్సు పాషాణంగా మారినప్పుడు, స్వప్నాలలో దాగిన రాక్షస ప్రవృత్తులు పైకొస్తాయి. మార్పు అసంభవం అయితే ఆత్మ ఆరాటానికి అర్థం లేదు. ఈ కాంతిరేఖలు పరమేశ్వరుని అస్తిత్వానికి నిదర్శనాలు. ఈ చీకట్లను తుదముట్టించకపోతే ఎన్ని యుగాలు మారినా ఏ ప్రయోజనం ఉండదు. మనిషి ఆధ్యాత్మికంగా పరిణామం చెంది వెలుగుబాటలో వేగంగా పయనించాలి. దివ్యపథాలు ఏవీ మనిషి ప్రయాణానికి అడ్డు కావు. జడ ప్రకృతి సూత్రాలు, సిద్ధాంతాలు, మనస్సు, హృదయం ఉన్న మనిషికి అన్వయించవు. చైతన్య రాహిత్యం పశువులకు అన్వయిస్తుంది. అవి ఎంతకాలం గడచినా మారవు. మనిషి నిత్యం

మారుతుంటాడు. వెలుగుబాటలో మనిషి దివ్యత్వం సాధించాలి. నిన్నూ, నీ ధర్మాన్ని నేను గౌరవించలేను.

"స్వతంత్రం పొందడానికే నేను జన్మించింది. నాలోని శక్తిని ఆవిష్కరింప చేయనివ్వు. నాలోని తేజస్సును ఉజ్వలింపనివ్వు. నా శక్తులు దివ్యశక్తులు కాకపోతే నేను నిరాశతో క్రుంగిపోయి ఉండేదాన్ని. నిద్రలో నా దివ్యత్వానికి ప్రయోజనం కలగదు. కాలాన్ని అధిగమించి నా సంకల్పాన్ని నెరవేర్చుకుంటాను. పరమాత్మ నాకు నిర్దేశించిన పనిని నన్ను చేయనివ్వు".

★ ★ ★

మృత్యువు: "మహాత్ములు అమరలోకాలు చేరినా తిరిగి ఎందుకు భూలోకంలో జన్మిస్తున్నారు? తమకున్న స్వతంత్రతను, దివ్యత్వాన్ని ఎందుకు వదులు కుంటున్నారు? ఆర్జితశక్తులు, సిద్ధులు, జ్ఞానం అన్నీ వదిలి మృత్యువుకు చిక్కడానికా మరల జన్మిస్తున్నది? తమ శ్రమను, తపశ్శక్తిని క్షుద్రశక్తులతో పోరాడటానికి వినియోగించాలనా ఈ పునర్జన్మలు? ఎందుకీ విషాద ప్రపంచంలో తెలిసి తెలిసి కావాలని జన్మిస్తున్నారు. ఈ ప్రపంచం ప్రసాదించే సుఖాలు, భోగాలు మళ్లీ అనుభవించాలనే కదా!

"బిడ్డా! ఆ క్షుద్రశక్తులన్నీ నాకు దాసోహం చేశాయి. అవి అందించగలవి భౌతిక సుఖాలు. నీవు ప్రేమించిన వ్యక్తికి పరలోక సుఖాలను వంచించి, అతనికి దక్కనున్న విముక్తిని ఎందుకు దూరం చేస్తావు? ఈ అల్ప ప్రపంచంలోకి ఎందుకు ఆశిస్తున్నావు? పరమేశ్వర సన్నిధి కన్న నీ సాహచర్యం సుఖమా? చెప్పు?"

సావిత్రి : "ఈశ్వరుడు నాకై నిర్దేశించిన బాటలో నేను పయనిస్తున్నాను. ఆయన ఆజ్ఞ మేరకే బ్రతుకుతున్నాను. నేను ఈశ్వర ఆజ్ఞానువర్తిని. భగవంతుడు ఈ బ్రహ్మాండాన్ని, ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించాడు? ఈ అనంత విశ్వంలో ప్రాణశక్తిని ఎందుకు నింపినట్లు? నాకీ భౌతిక శరీరాన్ని ఎందుకు ప్రసాదించినట్లు? నా శరీరంలో కామనలు, ప్రేమలు ఎందుకు కలిపినట్లు? నాలో ప్రేమ పరిపూర్ణంగా వికసించింది. ఈ మానవ శరీరంలోనే దివ్యశక్తుల్ని ప్రోగుచేసి, భూమిని స్వర్గంగా మార్చమని ఈశ్వరుని ఆదేశం. భగవంతునికి స్వర్గాలు సృష్టించడం సులభం. భూలోకసృష్టి కష్టం. భూమిని స్వర్గంగా మార్చడం మరీకష్టం. మానవ స్వభావాన్ని మార్చి ఉద్ధరించడం అంత సులభం కాదు. అది బ్రహ్మాతరం కాదు. అందుకే ఆ బాధ్యతను నాకప్పగించాడు.

“ఇక్కడ క్షుద్రశక్తులు తమ మాయలతో, మంత్రాలతో, మోసంతో నకిలీ దేవుళ్లను, స్వర్గాలను సృష్టించిపెట్టాయి. ఆత్మ శాశ్వతమే. అది ప్రాపంచిక బంధాలలో చిక్కదు. అసలు ఆత్మ భౌతిక ప్రపంచంలో ఎందుకు ప్రవేశించాలి? మానవాత్మకు ఈ మహత్తరశక్తిని ప్రసాదించింది ప్రకృతి ధర్మానికి లోబడి బ్రతికి చావమని కాదు. ఆత్మకు స్వేచ్ఛ ఎప్పుడు ఉంది? ఎంత భౌతిక బంధాలకు కట్టుబడినా, జీవన పరిధులతో నిమంత్రించబడినా, గ్రహాల నుండి తనకు కావలసిన శక్తిని అందుకుంటుంది. ఆర్జిత జ్ఞానంతో భవబంధాలను త్రెంచి వేయగలదు. అంధకారంలో ఉంటూ ప్రేమ సామ్రాజ్యంలో దివ్యత్వాన్ని సాధిస్తుంది.

“స్వతంత్రించని ఆత్మకు ఎన్నటికీ విముక్తి కలగదు. అన్ని బంధాలు ఛేదించుకుని స్వతంత్రించాలి. అప్పుడే పరమాత్మ ఆత్మను ఆదుకుంటుంది. తన కౌగిలిలో బంధించి తనలో కలుపుకుంటుంది. జీవాత్మ తన హృదయంలోకి పరమాత్మను ఆహ్వానించి, ఆ పరమాత్మ కౌగిలిలో తాను బందీ అయి, లయించి, బ్రహ్మానందానుభూతి చెందుతుంది. ఆ సుఖమే శాశ్వతమని భావిస్తుంది. మృత్యుదేవా! నీ ప్రలాపాలకు ఇదే నా సమాధానం”.

మృత్యువాణి మరల ఆమె వాదనను కొట్టివేసింది.

“సావిత్రీ! నీవు శక్తివే కావచ్చు. దేవతలు సైతం నీ శక్తిని ప్రస్తుతించవచ్చు. నీ భౌతికజీవన విధానం, అనుబంధాలు, అనురాగాలు ఏవీ సృష్టిలో ఈశ్వరుడు ఏర్పరచిన శాసనాలను, కట్టుబాట్లను ఉల్లంఘించడానికి వీలులేదు. నీవు మానవరూపంలో ఉన్న దేవతవైనా, పరాశక్తివైనా, జగనాత్మవే అయినా, నీకు విధి పైన, లోకాల పైన ఆధిపత్యం ఉన్నా, నీ మనోనిబ్బరం కన్న, సంకల్పం కన్న సృష్టి ధర్మం గొప్పదని అంగీకరించు. భగవంతుడు భూమిపైన అవతరించినా ఇక్కడి నిబంధనలను అతిక్రమించడానికి వీలులేదు. లోకధర్మం ఎప్పటికీ మారదు. కాలప్రవాహంలో మనిషి ఎంతటి వాడైనా ఒక బుద్బుధప్రాయమే.

“రానున్న సత్యయుగానికి నీవు ప్రవక్తవో, ప్రయోక్తవో కావచ్చు! స్వతంత్ర ధర్మాన్ని నీ ఆత్మ అనుసరించవచ్చు. తన శక్తిపై ఆధారపడవచ్చు. ‘పర’ తేజస్సును నీవు మాత్రమే దర్శించగలవు. ‘సత్య’ ఫలాలను నీవే మొదటగా రుచి చూస్తావు. అయితే ఏది సత్యం? దాని రూపం ఎందరికి తెలుసు? మనిషి వివేకం సృష్టించే అనేక సుందరరూపాల నడుమ, మనస్సు రూపించే అనేక అరూప చిత్రాల మధ్య, లోకంలోని వైరుధ్యాల నీడలలో, పరమాత్మే కనిపించకుండా పోతున్నదే! నీ సత్యాన్ని గుర్తించడం ఎలాగ!

"సత్యం ఎక్కడ ఉంది! ఏదీ దాని చిరునామా! ఏదీ దాని పదసవ్వడి! అనంతంగా వినిపిస్తున్న ఈ కోటానుకోట్ల గొంతుకలలో నీ సత్యవాణి ఏది? నీ మనస్సును, నీ ఆత్మను అది మోసగించడం లేదు కదా! లేక సత్యం అంటూ ఉంటే అది మనిషికి అందదా! అది భావనకు మాత్రమే పరిమితమా? లేక మనిషి స్వభావానికి అనుగుణంగా, కోరికను బట్టి ఏర్పడుతుందా! మనస్సే తను కోరిన రూపంలో సత్యాన్ని దర్శిస్తుందా! లేక ఆ కామనే సత్యంగా భాసిస్తుందా? మనిషి మనసుపడ్డ వాటిలో సత్యం తలమానికమా!

"నీడగా బ్రతికే మనిషి భావాలలో అదీ ఒక భావమే. అది మనోఫలకంపై విశృంఖలంగా నర్తిస్తుంది. లేదా అమాయకంగా స్వాప్నికస్థితిలో కనిపిస్తుంది. ఇక్కడ అన్నీ పరమాత్మ సదసత్తుల మధ్య చరించేవే. రెండూ వాస్తవిక శక్తులైనా పరస్పర విరుద్ధాలు. మనస్సు అనే వెన్నెల రాత్రిలో కనిపించే తారామిధునాలు రెండూ వేర్వేరు దిక్కులకు పయనిస్తాయి. మార్మికత్వానికి ఒకటి తల, రెండవది తోక. ఒక దాని కాలు కుంటి, ఒకటి సవ్యం. ఒకటి రెక్క విరిగిన రిక్క, ఒకటి నర్తిస్తుంది. ఈ ప్రపంచం నామమాత్రం. అది ఆకాశంలో విహరించే విహంగం. నీవు భావిస్తున్న సత్యం అంతా అసత్యం, అతి భయంకరం. అది భౌతిక జగత్తులో నిలబడదు. ఈ ప్రపంచమే వాస్తవం, సత్యం. నీ భావనలన్నీ శూన్యంలో లయించిపోయేవే. లోకంలో సృష్టించబడినవి, మానవ కల్పితాలు అన్నీ కడకు శూన్యంలోనే లయిస్తాయి.

"కనుక, ఒక విధంగా మనిషీ పశువే. ఒక విధంగా దేవుడు. భగవంతుని సృష్టిలోనే అసమానత్వం బలంగా ఉంది. అది కారణంగా ఈశ్వరీయత రూపం ధరించదు. మనిషి ఒక విధంగా అల్పుడు. ఒక విధంగా అధికుడు. ఔన్నత్యం పొందగల పశువు. పతన స్థితిని చేరిన దేవుడు. అయినా మనిషి పశువులా, దేవునిలా ప్రవర్తించడు. తనకు మనిషిగా జీవించడమే ఇష్టం. తన శ్రమతో ఉన్నత స్థితికి చేరాలనుకుంటాడు. పరమపథ సోపానాలపై ఉన్నత స్థితికి చేరతాడు. జీవితం వైకుంఠపాళి. నీవు సత్యం అనుకున్నవన్నీ భ్రమలు. సత్యం ఎవరికీ అవగతం కాదు. నీ ఆలోచనలన్నీ అజ్ఞానం వల్ల ఏర్పడిన కల్పనలు. ప్రాపంచిక అవివేకంతో సత్యం మనుగడ సాగించదు. జీవితం హేతురహితం, కల్లోల సమ్మేళనం. అవివేకపు చీకటి కోణాలలో వివేకం దాగి ఉంటుంది. అది చివరకు సంశయంగా పరిణమిస్తుంది. పరమసత్యం భౌతిక జ్ఞానానికి అందదు. ఒకవేళ సత్యం నీ హృదయంలో ఉన్నదంటావా! ఏదీ ఆ సత్యాన్ని చూపించు నేను

ఆరాధిస్తాను, ఆమోదిస్తాను. నీ సత్యవంతుని తిరిగి నీకు యిచ్చి పంపుతాను. ఇక్కడ ఉండే కఠోర నియమాలు, శాసనాలు నీకు తెలియనివి. నాకు తెలిసిన సత్యం సత్యవంతుడు మరణించాడని, నీ పవిత్రప్రేమ అతనిని తిరిగి బ్రతికించ లేదని. ఏ మార్మికశక్తి చనిపోయిన జీవిని బ్రతికించలేదు. జరిగిపోయిన దానిని ఏశక్తి పునరుద్ధరించలేదు. నిశ్చల శూన్యంలో తృప్తిగా ఉండేది ప్రాణం మాత్రమే. కాలం ఏర్పరచే శూన్యాన్ని భావం ఒక్కటే పూరించగలదు. కనుక సావిత్రీ! చనిపోయిన ఈ మనిషిని వదలిపెట్టి వెళ్లిపో, నీ పాటికి నీవు జీవించు".

★ ★ ★

ఆ ఛాయామూర్తికి సావిత్రి ధీటుగా సమాధానం చెప్పింది. ఆమె మాట్లాడుతుండగా భౌతికత అంతరించిపోయింది. ఆమె కళ్లలో దివ్యత్వం కాంతులీనసాగింది. ఆమె వదనంపై స్వర్గలోకపు దీప్తి కదలాడింది.

"మృత్యుదేవా! నీవు దివ్యమూర్తివే గాని పరబ్రహ్మమూర్తివి కావు. పరబ్రహ్మ కార్యనిర్వాహకులలో ఒకరివి. నీవు ఆయన ఛాయవు. నీకు తెలియదు, ఎప్పుడూ చీకటిలో ఉండే నీకు వెలుగు గురించి తెలియదు. చీకటిని వదలి వెలుగులోకి ప్రవేశించగానే మనిషి అజ్ఞానం వదలిపోతుంది. పరమాత్మ రూపానికి నీవు చీకటి శిరస్సువు. ఆయనలోని అజ్ఞాన భాగానికి నీవు ప్రతినిధివి. చీకటి కడుపులో కదిలే శిశువు నీవు. ఆయన అమర స్వభావానికి నీవే పెద్ద అవరోధం.

"అవరోధాలు, వైరుధ్యాలు ప్రకృతి కల్పనలు కావు. అవీ పరమాత్మికాలే. అనేకానేక రూపాలు ఆ ఏకత్వంలోని భిన్నరూపాలు. ఏకత్వం అనేకత్వాన్ని తనలో దాచుకోగలదు. అందుకే పరమాత్మ అవ్యక్తం, అద్వితీయం, అతీంద్రియం, అతి నిగూఢం అన్నారు. ఆయన సమస్త విశ్వాన్ని వీక్షించగలడు, సమీక్షించగలడు. ఏకైక నిశ్శబ్దమే. పరమాత్మ తేజస్సులో విశ్వవినోదం ఉంది. అదే అచల హృదయం, అచల రహస్యం, అచల మర్మం. ఆ ప్రశాంతికి సంకేతం వెలుగు. అదే ఆత్మను సృష్టిస్తుంది. ఆత్మ సర్వశక్తిమయం. పరమాత్మిక సంకేతం. ఆత్మ తన సంకల్పం మేరకు దేవతామూర్తుల్ని సృష్టించుకుంటుంది.

"మనిషి ఇంకా పూర్తి చైతన్యం పొందలేదు. అందువలన కొంత వైముఖ్యం కనిపిస్తుంది. ఆ వైముఖ్యానికి కారణం అజ్ఞానం, అవగాహన లోపం. వైరుధ్యాలు, ప్రతికూలశక్తులు పరమాత్మకు కుడిఎడమలు. రెండు బలమైన చేతుల మధ్య చిక్కిన అస్తిత్వం నలిగిపోతుంది. మనస్సును ఎదుర్కొంటుంది. దిగువన

అంధకారం, పైన దివ్యతేజస్సు. ఆ రెండు కాంతిలో కలిసినా, మనస్సు వాటిని వేరుచేస్తుంది.

"అవి నిజానికి అవిభాజ్యాలు, అయినా పరస్పర ప్రతికూలాలు. విశ్వ కర్మకు ఈ వైరుధ్యాలు అవసరమేమో! ఈ విరుద్ధ శక్తుల రాపిడివల్లనే అనంతంగా విశ్వశక్తి ఉద్భవిస్తున్నదేమో అనిపిస్తుంది. ఇది పరమాత్మ మహత్తరరహస్యం. సృష్టికి అతీతమైనది. అందుచేత పరమాత్మకు ఆది, అంతం లేవని చెప్పవచ్చు. అందుకే మనిషి వైరుధ్యాలను అధిగమించి అద్వైతసిద్ధిని పొందగలుగుతున్నాడు.

"పరమాత్మతత్వం మనస్సు అందుకోలేని నిగూఢ రహస్యం. ఆయన లీలలు మనిషి జ్ఞానాన్ని కలవర పరుస్తాయి. నిజమే. అల్పత్వంలో పరమాత్మ ఔన్నత్యం ఇమడలేదు. అన్నింటిలో ఉన్న పరమాత్మ తత్వం ఒకే ఒక్క మహత్తర తత్వంగా భాసిస్తుంది. కానీ ఏమీ తెలియదు. అదీ చిదంబరం. అంతా వ్యక్తం అవుతూ అవ్యక్తం అనిపించడమే విచిత్రం. సగుణంగా ఉన్నది నిర్గుణం కావడం జరుగుతోంది. ఆ నిర్గుణమే శాశ్వతం, సత్యం కావడం జరుగుతోంది. శాశ్వతం అయిన ఆత్మ శూన్యంలోకి పోయి లయిస్తుంది. మరల జన్మకు వస్తుంది. కాలానికి, భౌతిక ప్రపంచానికి కట్టుబడి ఉన్నట్లు నటిస్తుంది. భ్రమ కలిగిస్తుంది. తానే ఆత్మ పదార్థం అయి, సర్వం శూన్యమైపోతుంది. నామ, రూప, క్రియల్ని వదిలిపెట్టి అపరిమితం, అశరీరం కావడం జరుగుతుంది. ఒక శరీరంలో దాగిన ఆత్మ పరమాత్మ స్థాయికి ఎదుగుతుంది. పశుప్రవృత్తి నుండి మానవుడు దివ్యుడుగా పరిణమిస్తున్నాడు.

"సాగరం నిశ్చలంగా ఉన్నా, తరంగాలు ఘోషిస్తుంటాయి. కల్లోలాన్ని సృష్టిస్తుంటాయి. పరమాత్మ నిశ్చలంగా ఉన్నా, ఆత్మలు తరంగాలవుతాయి. జీవితాలను కల్లోలపరుస్తాయి. ధర్మం, న్యాయం మనిషి కల్పించుకున్నవి. పాపపుణ్యాలతో పరమాత్మకు సంబంధం లేదు. పుణ్యాత్ములను విధికి వదలి, పాపం పెచ్చరిల్లేట్లు చేస్తాడు. లక్ష్య రహితంగా, అవివేకంతో మనిషి చేసే పనులకు ఎన్నో ప్రతికూలాలు ఏర్పడతాయి. అవి ప్రకృతి సహజాలనిపిస్తాయి. ఒక వైపున మాత్రమే చూడగల కళ్లకు పూర్ణత్వం కనిపించదు. మనిషి బాహ్యాన్ని చూస్తూ ఆంతర్యాన్ని అంచనా వేస్తాడు, లోతులకు వెళ్లడు. అంతర్దృష్టికి మాత్రమే అందుబాటులో ఉంటుంది అసలు సత్యం. ఒక మహామాయ అంతర్దృష్టికి అవరోధాలు కలిగిస్తుంది.

"మనిషి ఘనీభవించిన అంధకారంలో, అజ్ఞానంలో ఉన్నా ఎప్పుడో రవంత వివేకం కలుగుతుంది. మనిషి పతనానికీ ఒక ప్రయోజనం ఉంటుంది. ప్రకృతిలో ఎంత నిరుపయోగం అనుకున్నా దానికి మనకు తెలియని ప్రయోజనం ఉంటుంది. అదీ పరిణామం చెందుతుంది. నిస్తబ్దంగా, నిస్తేజంగా, జడంగా నేడు కనిపించవచ్చు. ఒక్క సంకల్పంతో లక్ష చలనాలు ఏర్పడతాయి. మహాచైతన్యం ఏర్పడుతుంది. ఒకానొక పరమ సత్యప్రకాశనం వల్లనే విశ్వం రూపుదిద్దుకుంది. సత్యానికి భౌతిక రూపం ఏర్పడ్డది. దానిపై అజ్ఞానం మృత్యువు వలె ముసుగు కప్పింది. పైకి అజ్ఞానం కనిపిస్తుంది, చాటున ఉన్న మృత్యువు కనిపించదు. సత్యం కారణంగానే నక్షత్రాలకు కాంతి ఏర్పడ్డది. మనిషి మేధలో ఆలోచనలు కలుగుతున్నాయి. దిఙ్మండలాల నుండి వినిపించే సంగీతాలు మనిషికి విజ్ఞానం ప్రసాదిస్తున్నాయి.

"పరిమిత క్రియలలోనూ చైతన్యం ఉంటుంది. భౌతిక ప్రలోభాల కారణంగా అది బయటపడదు. తాను నిద్రిస్తూ లోకాన్ని జాగృత పరుస్తుంది. ఆ చైతన్యమే మనస్సును కదలిస్తుంది. హృదయాన్ని రగిలిస్తుంది. ఆత్మకు ఉత్తేజం కలిగిస్తుంది. అదే మనిషిని కర్మయోగిని చేస్తుంది. కర్తవ్యపాలన చేయిస్తుంది. ఎంత చిన్నపనిలో నైనా పూర్ణత్వం పొందగలగడానికి ఈ చైతన్యమే హేతువు. చిన్నచిన్న మెరుపుల్లో వెతికితే చైతన్యం కనిపిస్తుంది. అజ్ఞానం జ్ఞానానికి నీడలాగా వెంటపడుతుంది. దూరంగా సాగిపోతుంది.

"భౌతిక శరీరం జడమైనా మేధ నరాశయం కారణంగా చలనం పొంది, సుఖదుఃఖాలు అనుభవించే జీవి అవుతోంది. జీవితంలో ఆటుపోటుల వల్ల వివేకం కలుగుతుంది. అనుభూతి కలుగుతుంది. శరీరం నశించినా అనుభూతులు జ్ఞాపకాలుగా మిగిలి ఉంటాయి. మృతశరీరం ఎందుకూ పనికి రాదు. హృదయ కేంద్రంలో ఆత్మ గుప్తంగా ఉంటుంది. అది శరీర వ్యాపారానికి అవసరమైన శక్తిని, ప్రజ్ఞను అందిస్తుంది. ఆ ప్రజ్ఞవల్ల మనిషిజ్ఞానం ప్రపంచానికి ఉపయోగ పడుతుంది. జీవితానికి విలువ ఏర్పడుతుంది. మనిషి పశుస్థాయి నుండి పైకి ఎదుగుతూ వస్తున్నాడు. మట్టిలో పుట్టినా, మట్టిపైన పెరిగినా మనిషి చూపు స్వర్గం వైపే. ఆలోచనలు స్వర్గం గురించి, ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, కలలు కంటూ తన కోర్కెలు తీర్చుకుంటాడు. ఒక విద్యార్థి వలె పరిశోధనకు ఉప క్రమిస్తాడు. మనిషి తన చుట్టూ ఉన్న అవరోధాల్ని అధిగమిస్తాడు. ప్రాపంచిక పరిధుల్ని దాటిపోతాడు. చివరకు ఆధ్యాత్మిక జీవనంలో తలెత్తుతాడు. అప్పుడు

అసలైన స్వాతంత్ర్యం, సిసలైన తేజస్సు పొంది, అనంతపథాలపై పయనం సాగిస్తాడు. తన ఆత్మలోనే విశ్వాన్ని దర్శిస్తాడు. కాలాన్ని, దూరాన్ని అధిగమించి పోతాడు. ఆ కాంతి కిరణాలపై జీవుడు ఎంత దూరమైనా పయనించగలడు. తన హృదయం తలుపులు తెరచి, పరబ్రహ్మను ప్రసన్నం చేసుకుంటాడు. కాని, అలాంటి సందర్భాలు బహు స్వల్పంగా ఉంటాయి. సత్యం ఎప్పుడో గాని ఆత్మను తట్టిలేపదు. నిర్మల నిశ్చల సరస్సులో సూర్యుని బింబం స్పష్టంగా కనిపిస్తుంది.

"పరనిర్వాణ స్థితిని కొందరే చేరగలరు. ఆ మహాజ్వాలా కాంతిశిఖల్ని కొందరే దర్శించ గలరు. పరలోక వాతావరణాన్ని సామాన్యులు భరించి, నిగ్రహించుకోలేరు. పరమాత్మ సందేశాలు అందుకొనడానికి కొందరే అర్హులు. జ్ఞాన తేజస్సులో స్నానం చేయగలవారు బహుకొద్దిమంది. మానసిక ఏకాగ్రత వల్ల కొన్ని శిఖరాలే చూడ గలరు. కొన్ని సౌందర్యాలను సంపదలను పొందవీలున్నది. కాని సత్యదర్శనంవల్ల పూర్ణత్వం సిద్ధిస్తుంది. మనిషి యోగ సాధనతో ఆ స్థితికి చేరగలడు. కానీ అక్కడ స్థిరంగా ఉండిపోడు. అక్కడా విశ్వజ్ఞత్వం ఏర్పడుతుంది. ఉన్నత భావాలు అమితంగా ఏర్పడతాయి. చిన్న చిన్న సందేశాలు సైతం గొప్ప స్ఫూర్తినిస్తాయి, సూక్తులుగా మారతాయి. అది తాత్విక భూమిక. భావాల లోతులు అందవు. మాటల అర్థాలు బరువుగా ఉంటాయి. ప్రతిపలుకు లోను ఒక సందేశం ఉంటుంది. ప్రతి భావం పరబ్రహ్మ లక్ష్యానికి దగ్గరగా చేర్చుతుంది.

"పైకి వెళ్లిన కొద్దీ మరింత తేజస్సు చుట్టు ముడుతుంది. అక్కడ కనిపించే కాంతి గోళాలు అసంఖ్యాకాలు. అక్కడ అన్నీ శాంతి సాగరాలు, ప్రశాంత తరంగాలు, క్రాంత సీమలు. ఒకే ఒక్క దివ్యభావన మనస్సుకు మార్గం చూపుతుంది. మనస్సు వెంట భావం తోకచుక్కలా సాగుతుంది. హృదయం కాంతిపూర్ణమై విశ్వాన్ని దర్శిస్తుంది. సత్యాన్ని పలకరిస్తుంది. పైకి వెళ్లిన కొద్దీ అంతర్దృష్టి లోతు పెరుగుతుంది. వెలుగు అధికమవుతుంది. జ్ఞానం స్వతంత్ర మవుతుంది. అప్పుడు అన్ని లోకాలు తనవే. అన్ని గోళాలు తనవే. అక్కడ సత్యదర్శన మవుతుంది.

"నిర్గుణ పరబ్రహ్మను అన్వేషిస్తూ ఆత్మ అనేక అగోచర, మార్మిక మందిరాలలో చొరబడుతుంది. మనస్సులోని విశాల గగనాలు గమిస్తున్న కొలదీ హృదయ మందిరాలు తేజోపూర్ణాలవుతుంటాయి. సునిశిత ఆత్మావలోకనం సాధ్యమైనపుడు నామ, రూప, గుణాచ్ఛాదనలు, యవనికలు తొలగిపోతాయి.

ఆత్మ తన రహస్యాన్ని తనే ఛేదించుకుని సుస్థిరమవుతుంది. అదే ఆత్మ దర్శనం. అప్పుడు ఆలోచన అగ్నినేత్రంగా ఆవిష్కరించబడి, ప్రతిపదం, ప్రతిశబ్దం శక్తిపూర్ణమవుతుంది. అదే సత్యదర్శనం. ఆత్మ నిత్యసత్యమైన గుహ్యామందిరంలో ప్రవేశిస్తుంది. జీవితానికి, భగవంతునికి మధ్య తెర తొలగిపోతుంది. అప్పుడు ప్రపంచ సరిహద్దుల్ని అధిగమించి, విశ్వమేధ కల్పించే విశాలవిశ్వాన్ని దర్శించి కాలాన్ని, దూరాన్ని అతిక్రమించగల శక్తిని ఆత్మ పొందుతుంది. ఇది మానవాత్మ అనుభవానికి అందని మానవాతీత ప్రజ్ఞ.

"అక్కడ అంతా హిరణ్యమయం". అది హిరణ్యగర్భ. సృష్టికి మూలాధారమైన శక్తులు అనంతసీమలలో వాటి వాటి స్థావరాలలో ఉంటాయి. అక్కడ ఉండే ప్రతి దేవుడు తనకొక లోకాన్ని సృష్టించుకుంటాడు. అక్కడ నుండి భావాలు రోదసిలో ప్రవేశిస్తాయి. ఆ భావతరంగాలు క్రిందకి దిగి వచ్చి మనిషి మనస్సును తాకుతుంటాయి. కాలం ఒకే భావంగా, దూరం ఒకే అభావంగా మారుతుంది. దివ్య భావవీచికలు హృదయాన్ని తాకితే ఆత్మ జాగృత మవుతుంది. అప్పుడు ఈశ్వరీయత పరిఢవిల్లుతుంది. మనస్సు నియమాలు, సరిహద్దులు అతిక్రమిస్తుంది. గ్రహాలను, గోళాలను వేరుపరచే రేఖను దేవతలు రద్దుచేస్తారు. అంతా పరమాత్మ తత్వమే. అదే విశ్వాన్ని నియంత్రిస్తుంది.

"దివ్యకాంతులు ప్రసరించే లోకాలు ఎవరి శాసనానికి తలవంచవు. సత్యం ఒక్కటే సర్వవ్యాపకం, సర్వశక్తిమయం, సర్వస్వం అవుతుంది. ఆ హిరణ్య లోకంలో సత్యం అనంతం, అద్వితీయం. ఆ మందిర ప్రాంగణంలో ఆత్మ తిరుగుతుంది. నిర్గుణం నుండి వెలువడే నాదాలను వింటుంది. అక్కడ సత్యానికి రూపం ఉండదు కనుక మనిషి దృష్టికి కనిపించదు. ఆ సువిశాల నిరామయానికి అవతల ప్రశాంతికి పైగా, రూపాలను సృష్టించగల అరూపప్రజ్ఞ నెలకొని ఉంటుంది. దానికి పేరుండదు కానీ దానిని దివ్యత్వం అనవచ్చు. అది కాలానికి అతీతం. అక్కడ విమలకాంతిలో జగన్మాత దర్శనం లభిస్తుంది. ఆమె అనంతం అనే శిశువును తన ఒడిలో లాలిస్తుంది. ఆ శిశువు విధికై కేరింతలు కొడుతుంది.

"అదే మనిషి ఆశలకు, ఆశయాలకు అవధి. ఆ వెలుగు కొరకే ఇంతకాలం శూన్యంలో, చీకటిలో పయనించింది. ఆ మహావర్చస్సు అక్షయం. జగన్మాత అనురాగం లోక కళ్యాణ కారకం. అన్ని వైరుధ్యాలు, సంశయాలు ఆ జగన్మాత సన్నిధిలో కరిగిపోతాయి. లోకంలో సత్యాలకు అదే మూలం. లోకంలోని చీకట్లను తొలగించగల వెలుగు అదే. లోకుల శోకాలను హరించగలిగిన బ్రహ్మానందం

అది. అమ్మ అనురాగంలో క్లేశాలన్నీ తొలగిపోతాయి. మనం భూమిపైన చూచే ప్రజ్ఞ అక్కడిదే. ఆ పరబ్రహ్మ భావన మానవాత్మల్ని శుద్ధి చేస్తుంది. ప్రపంచం, ప్రకృతి, మనిషి కలలు కనేది ఆ సౌందర్య దర్శనం కొరకే. అక్కడ పూర్ణత్వం పరమాత్మ నుండి ప్రభవిస్తుంది. ఆ పూర్ణత్వాన్నే ప్రకృతి అభిలషిస్తుంది. సత్యం వలె ఈశ్వరీయత మనిషికి అందనంత దూరంగా మసలుతుంది. భౌతిక నేత్రాలకు ఈశ్వరుడు కనిపించడు. క్షయం కాని తేజోమండలం ఒకటి ఉంది. దానిని మన ఊర్ధ్వ చేతన మాత్రం తెలుసుకోగలదు. అక్కడ సత్యం పరమగోప్యంగా ఉంటుంది.

"హేతువాదంతో, తర్క వితర్కాలతో సత్యం యొక్క రహస్యం తెలియదు. భౌతిక రూపాలకు సత్యస్వరూపం ఆవిష్కరించబడదు. యోగజీవనులు మాత్రమే సత్యాన్ని దర్శించగలరు, సత్యాన్ని అందుకోగలరు. భౌతిక పదార్థాలతో తయారైన శరీరం అగ్నికి ఆహుతి కావలసిందే. ఆత్మ సంస్కారాలు కర్మలుగా రూపాంతరం చెందుతాయి. మనస్సు భావంగా పరావర్తనం చెంది నిష్కళంక, నిర్గుణస్థితికి చేరుతుంది. అప్పుడు జీవితమే యోగం అవుతుంది. అన్ని క్రతువులు బ్రహ్మానంద స్థితికి ఉపకరణలే. అదే ఆధ్యాత్మిక వివేచన, నివేదన.

"భౌతిక శరీరం ఆధ్యాత్మికతకు వేదిక అయినపుడు తన్మయత్వం సచ్చిదానంద దాయకమవుతుంది. ఆ స్థితిలో నిర్గుణరూపం ఛాయగా దర్శనమిస్తుంది. అది క్షణికమే అయినా అది సత్యం. అది క్షణికం అయినా పరమాత్మికం. అది ఆత్మ పొందే తొలి ఈశ్వరీయానుభూతి. ఆత్మ అనూహ్య పరిణామానికి లోనవుతుంది. ప్రపంచం అర్థం చేసుకోలేని మార్మిక లోకంలో ఆత్మ ప్రవేశిస్తుంది. తనను కోటి రూపాలలో చూచుకుంటుంది. అన్నిరూపాలపైన తన ముద్రలు కనిపిస్తాయి. అన్నింటిలో తాను అమరంగా ఉండిపోతుంది. అప్పుడు నిత్య కృత్యాలలో ఈశ్వరీయత ప్రతిబింబిస్తుంది. తన నిశ్చలత్వంలో, నిర్మలత్వంలో పరమాత్మ ప్రతిబింబాన్ని చూపిస్తుంది. తానే నిర్మలమైన ఆనందానికి నెలవు అనిపిస్తుంది.

"సాగే కాలం వెనుకనే కాలరాహిత్యం ఉంటుంది. వాచ్యం వెనుకగా అవాచ్యం ఉంటుంది. మాటలే మంత్రాలవుతాయి. శబ్ద సౌందర్యం, నాద శక్తి నిర్దుష్ట లక్ష్యానికి చేరుస్తుంది. ప్రతి ఆలోచనలోనూ విశ్వప్రేమ సమోదవుతుంది. పరమ సత్యానికి నియమాలు, నిబంధనలు ఉండవు. అన్ని కాలాలలో, అన్ని దేశాలలో సత్యం సర్వ సమ్మతమే అవుతుంది. అది ఎన్నటికీ వన్నె తరగని బంగారం. కాని ఉపయోగార్థం అనేక రూపాలలో కనిపిస్తుంది. ఆ మేలిమి

బంగారమే అమృత పానపాత్ర, పుష్పలావిక. అక్కడ ఉండేది ఒకే ఒక్క దివ్యప్రబంధం. అక్కడ ప్రతి ఒక్కటి మహాద్భుతం, మహాసుందరం. అన్ని ఆనందాలు బ్రహ్మానుభూతిని కలిగిస్తాయి. అన్ని ఇంద్రియాలు అనుభూతి వరప్రసాదాలు. అక్కడ ప్రతిజీవి ఒక ఆత్మకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అన్ని భావనలు దివ్యప్రబంధంలోని భాగాలే, అనంతకాలం లోని క్షణాలు వేదంలోను, నిర్వేదంలోను, మోదంలోను, ఖేదం లోనూ ఆనందం, మాధుర్యం ఉంటుంది. అన్నీ పరబ్రహ్మకు సంక్షిప్త సంకేతాలే. ఆ సత్యరూపాన్ని నీకు ఎవరు చూపించగలరు? మానవభాష సత్యాన్ని నీడవలె కప్పివేస్తుంది. ఆలోచనకు సత్యదీప్తులు అందవు. ఆ మహాద్భుతం భాషకు, భావానికి అందనిది."

"మృత్యుదేవా! నీవు సత్య స్వభావాన్ని తెలుసుకున్నా, సత్య రూపాన్ని దర్శించినా, నీ ప్రజ్ఞ తారుమారై నీవు నీవుగా మిగలవు. మా ఆత్మలు సత్యాన్ని స్పృశించగలవు. పరమాత్మను దర్శించగలవు. ప్రేమతో మేము ఆత్మానందం పొందగలం. దివ్యకాంతి ప్రేమ వాకిళ్ల ద్వారా మా హృదయాలలో ప్రవేశిస్తుంది. పరబ్రహ్మతత్వంలో మా జీవితాలు పునీతం అవుతాయి. భౌతిక జీవనం దివ్య జీవనంగా మారుతుంది. నీవు సత్యాన్ని, పరమాత్మను దర్శించలేవు, స్పృశించలేవు".

మరొకమారు మృత్యువు సావిత్రిని సమాధాన పరచడానికి ప్రయత్నించింది.

"సత్యం ఉత్తమోత్తమమే. ఆ పరమసత్యం తన ఛాయను ఇక్కడ ప్రసరింపచేస్తే, మనిషి సత్యజ్ఞానంతో, సృష్టి శిఖరాలకు చేరితే, ఆ సత్యానికి, సత్యం వల్ల ఏర్పడిన ప్రపంచానికి మధ్య ఎవరు వారధి నిర్మించగలరు? ఆ పరమసత్యాన్ని ఎవరు మానవులకు అందించి, ఈ ప్రపంచంలో దానిని రక్షించ గలరు? సత్యం తన సత్యలోకాన్ని వదలి ఈ వ్యర్థ ప్రపంచంలో మనగలదా?

"ఓ సుందర సుకుమారీ! అదే నీ బలం, శక్తి అయితే కానివ్వు. నా వల నుండి తప్పించుకోవడం అసంభవం. మానవ రూపంలో ఉన్న నీవెవరు కళ్యాణీ? నీ స్వనంలో దివ్య మాధుర్యం వినవస్తున్నది. నీ స్వరంలో మంత్రజాలం ఉంది. నీ ఆంతర్యంలో పరప్రజ్ఞ, నీ వాక్కులో సత్యం ధ్వనిస్తున్నవి. నీ కన్నులలో దివ్య ప్రకాశం ఉంది. నీవు ఎవరు? కాలాన్ని, మృత్యువును ఎదిరించే సాహసం నీకెవరిచ్చారు? భూలోకంలో దివ్యప్రజ్ఞను అవతరింపజేయగల శక్తి నీకెలా వచ్చింది? ఇక్కడ సత్యానికి, జ్ఞానానికి మనుగడ లేదు. గౌరవం లేదు. నీ జ్ఞాన ప్రసాదం వల్ల ఈ లోకం యావత్తు మారిపోతుందా? నీ శక్తిప్రసారం వల్ల ఇక్కడ సత్యం ప్రతిష్ఠింపబడడం అనుమానమే.

"ఈ లోకాన్ని సృష్టించింది సత్యం కాదు. అది ఒక అజ్ఞాత శక్తి. ఇక్కడ జీవుల్ని శాసించేది సత్యం కాదు, ఒక అంధశక్తి. దేవతలు ప్రపంచాన్ని పాలిస్తున్నది ప్రజ్ఞతో కాదు, వరాల బలంతో, సౌహార్ద్రంతో. ఆ దైవశక్తికి పరమాత్మ అంగీకార ముద్ర ఉంది. నీవు అమరత్వాన్ని కాంక్షిస్తున్నావు. ఏదీ నీ శక్తి నాకు చూపించు? నీ ఆత్మశక్తిని నాకు రుచి చూపించు. అప్పుడు సత్యవంతుని నీకు అప్పగిస్తాను.

"ఆ జగజ్జనని స్వభావమే నీదైన పక్షంలో ఏదీ ఆ దివ్యరూపాన్ని నాకు చూపించు. నేనూ దర్శించి, ఆరాధించి, తరిస్తాను. మరణం ఎరగని జగన్మాతను నా కళ్లలోకి చూడనివ్వు. అజరామరమైన ఆ దివ్య మాతృస్పర్శతో, సందర్శనంతో నా మృత్యువుకు అమరత్వం కలగనివ్వు. అప్పుడు మృతి చెందిన నీ ప్రియసఖుడు సజీవుడవుతాడు. అవనతమైన భూమి తలెత్తుకోగలుగుతుంది. అప్పుడు నీ ప్రేమ, ఆనందం శాశ్వతం అవుతాయి".

★ ★ ★

సావిత్రి మృత్యువు వైపు తీవ్రంగా చూచింది. సమాధానం చెప్పలేదు. విశ్వాంధకారం యావత్తు కరడు గట్టి, దివ్యకాంతి ఏ మాత్రం చొరవీలులేనట్లుంది. మృత్యువు, పరమాత్మ చొరరాని తావుండదు. ఆమెలో అద్భుత పరిణామం చోటుచేసుకున్నది. ఆమెలో అంతర్గతంగా నెలకొనివున్న దివ్యత్వం, వర్చస్సు ఆమె వదనంపై ప్రతిఫలించింది. మహాకాంతి ఆమె శరీరాన్ని ప్రఫుల్లం చేసింది. ఆమె శరీరకాంతి క్రాంతి సాగరమైంది. ఆమె మహాతేజస్వినిగా మారిన క్షణంలో అవతార రహస్యంపై తెర తొలగింది. అనంతవిశ్వంలో అది చిన్నిరూపమే కావచ్చు కాని దాని అవధి అనంతం, అమరం అనిపించింది. ఆమె ఆత్మ మహావిశ్వానికి కేంద్రబిందువైంది. విశాల రోదసి ఆమె ధరించిన వలువ అనిపించింది.

పరలోకాల సహజ ప్రశాంతి నెమ్మదిగా భూ ప్రపంచంలోకి దిగి వచ్చింది. ఆమె నేత్రాలు లోకాన్ని వీక్షిస్తున్న తారకాద్వయం. ఆమె సహస్రార కేంద్రంలో పద్మస్థితమైన దివ్యశక్తి క్రిందకి జారి భ్రూమధ్య కేంద్రంలో ప్రభాసమైంది. అదే జ్ఞానంగా భాసించసాగింది. అదే మనఃకారకుడైన సూర్యునికి నెలవు. అక్కడ అంతర్దృష్టిని, మనస్సును లగ్నంచేసి ఏకాగ్ర పరచినప్పుడు అద్భుతమైన జ్ఞాననేత్రం ఏర్పడుతుంది. అది మనిషిలో కనిపించకుండా ఉండే మూడవ నేత్రం. అగోచరంగా ఉండే ఆ జ్ఞాన నేత్రం అగోచర ప్రపంచాన్ని చూపిస్తుంది. మనస్సు బ్రహ్మానందం పొంది నప్పుడు హిరణ్యకాంతి వెలువడుతుంది. సంకల్ప మాత్రంచేత ప్రజ్ఞ

ప్రభవిస్తుంది. అప్పుడే యోగి ప్రజ్ఞా ప్రభాకరు డవుతాడు. ఆపైన పరాప్రజ్ఞ ఒక్కటే యోగికి మార్గదర్శక మవుతుంది.

ఆ శక్తి కంఠస్థానం చేరినప్పుడు ప్రేరణ అవుతుంది. పలికే ప్రతిమాట అమృతవాక్కు అవుతుంది. జీవితం విశ్వాత్మకు విహారకేంద్ర మవుతుంది. భావం విశ్వభావనగా పరిణమిస్తుంది. బ్రహ్మతేజస్సు హృదయ కేంద్రాన్ని స్పృశించినప్పుడు ఏ అల్పశక్తులు, క్షుద్రదేవతలు దాని ప్రవేశాన్ని నిరోధించలేవు. ఆ తేజస్సు సరాసరి హృదయపద్మంలో ప్రవేశించి స్థిరపడుతుంది. విధిని సైతం మార్చగల మహాశక్తిని అది ప్రసాదిస్తుంది. ఆ తర్వాత తేజస్సు నాభి కేంద్రాన్ని చేరుతుంది. అది పద్మ రాగమే. అది జీవునికి, ప్రకృతికి కేంద్రం. అదే దైహిక సుఖాలను అనుగ్రహిస్తుంది. అదే మనిషిలో వాంఛల్ని కలిగిస్తుంది, రగిలిస్తుంది. విశ్వనిర్వహణకై ఆ శక్తి రగిలి రగిలి, ఒక గుహలోకి చొచ్చుకుపోతుంది. అక్కడ వేయిపడగల ఆదిశేషుని నిద్ర లేపుతుంది. అక్కడ యోగాగ్ని రగిలి, పొగిలి భౌతికతను అధ్యాత్మికతతో జత పరుస్తుంది. ప్రాపంచిక ప్రక్రియలన్నింటికి ఆత్మశక్తి ఒక్కటే ఆధార మవుతుంది.

ఆమె క్షణంలో అన్ని పరిణామాలకు లోనైంది. ఆమె నోట మాట వెలువడలేదు. నిశ్శబ్దమే ఆమె భాష. మౌనమే ఆమె భావన అయింది. మృత్యువు కళ్లలో కళ్లు కలిపి నిశితంగా చూచింది. మృత్యువు చీకటిలో ఉండి పరమాత్మ స్ఫూర్తిని అందుకున్నది. నిశ్చలత్వానికి కేంద్రమైన నాభి కేంద్రం నుండి ఒక శబ్దం వెలువడింది. అది అనంతత్వపు ఆంతర్యం చీల్చుకుని వెలువడిన ధ్వని తరంగం. అది హృదయంలోని నిశ్శబ్దాన్ని, స్తబ్దతను తట్టిలేపింది.

"మృత్యుదేవా! అమేయశక్తి స్వరూపా! నీకు జోహారులు. అనంత విశ్వంలోని అంధకారశక్తి అద్వితీయం. అందరూ జీవించగలిగిన శూన్యాన్ని నీవు సృష్టించు కున్నావు. సమస్త విశ్వాన్ని, రోదసిని, లోకాలను, గ్రహాలను నీలో లయం చేసుకో గలవు. స్వాహా చేయగలవు. నీ అగ్నికీలల కోరలతో సమస్త విశ్వాన్ని నమిలి మింగేస్తావు. కాల్చి బూడిద చేస్తావు. నీలో మిగిలిన శక్తితో నక్షత్రాల్ని సృష్టించగలవు. చైతన్యంలేని తావుల చైతన్యం కలిగించగలవు. సర్వవిజ్ఞానం నీ అజ్ఞానం ముసుగులో దాగి ఉంది. హృదయం శూన్యమైనపుడు జ్ఞానం పైకొస్తుంది. అజ్ఞానం మనసు చీకటిలో ఉంది. వెలుగులోకి వస్తే అదే జ్ఞానం. మృత్యుదేవా! నీవు నా వాడివే, నా శాసనం ఆమోదించవలసిన వాడివే. నీకు ఈ భయంకర బాధ్యత యిచ్చింది నేను ... ఈ పనికి నిన్ను నియోగించింది నేను. నీకు సహాయంగా విషాదం, భయం, బాధలను యిచ్చాను.

"మనిషి తెలియనితనంతో, అజ్ఞానంతో పోరాటం చేయిస్తున్నది నేను. స్వయంకృతాపరాధాలతో మనిషికి కనువిప్పు కలిగిస్తాను. ఔన్నత్యం అందిస్తాను. బ్రహ్మానందానుభూతికి భూమికను నేను. మనిషి ఆరాటం అంతా అమరత్వం కొరకే. మృత్యుదేవా! నీవు నా ఉపకరణానివి. ఒక నాటికి మనిషి నీ హృదయాన్ని తెలుసుకోగలడు. నా ప్రశాంతిని అనుభూతించగలడు. ఈశ్వరధర్మానికి తలవంచి జీవించగలడు. నీ చూపులో ఎంతటి దైన్యం తొంగిచూస్తుందో నీకు తెలియదు! కాని, మహాత్మా! ప్రస్తుతానికి దూరంగా తప్పుకో. నా మార్గానికి అడ్డు రాకు. నీ ముసుగులో దాచిన నా తేజోమూర్తిని వదలిపెట్టి వెళ్లిపో. సత్యవంతునిలోని మహాత్మకు విముక్తి కలిగించు. వేదన నుండి, అజ్ఞానం నుండి స్వేచ్ఛను కలిగించు. మనిషి స్వతంత్రుడైతే విధిని, కర్మను జయించగలడు. ఉన్నతుడు కాగలడు. పరమాత్మ సన్నిధిలో కొలువుతీరివున్న జ్ఞానమూర్తులు, తేజోసంపన్నులు అందరూ మానవ ప్రతినిధులే. ఇది విశ్వ కళ్యాణమార్గం. ఈ మార్గంలో నీవు అడ్డు నిలవకు."

★ ★ ★

ఆమె మాటలు మృత్యువుకు రుచించలేదు. అంతా తెలిసినా తెలియనట్లు, చూస్తున్నా చూడనట్లు, ఆసక్తి లేనట్లు, తన పంతం నెగ్గాలన్న మొండి వైఖరి మృత్యువులో కనిపించింది. మృత్యువు ముందు ఆత్మశక్తి తలవంచింది.

స్వర్గీయులు సైతం కాదనరాని ధర్మం అది. ఎవరి ధర్మం వారికి గొప్పగా ఉంటుంది. రెండు శక్తులు ఎదురెదురుగా నిలిచాయి. మృత్యువు రూపం అంధ పర్వతంలా పెరిగిపోయింది. దానిని ఆమె జీవ సాగరమై ముంచి వేయసాగింది. కొంతసేపు స్వర్గం సైతం కలత చెందింది. నలువైపుల ఒత్తిడి తీవ్రమైంది.


మహాచైతన్యం కరడు కట్టినట్లు ఆమె సంకల్పానికి ఆత్మశక్తి తోడైంది. దానిని నిలవరించడం మృత్యువు వల్ల కాలేదు. ఆమె శక్తి ప్రవాహం ఉధృతంగా మారింది. మృత్యువు ఎదురునిలవలేక పోయింది. మృత్యువు గుండె బరువెక్కింది. తల బరువెక్కింది. ఆమె శక్తి నాల్కలు చాచి ఆలోచనల్ని మింగివేసింది. ఆమె క్రాంతికీలలు మృత్యు హృదయాన్ని దహించసాగాయి. అది తీయని వేదనై, నరనరాన్ని ఊచకోత కోయసాగింది. ఆమెలో రగిలిన అగ్నికి, మృత్యువుకు అడ్డుగా ఉన్న చీకటి మాయమైంది.

ఆమె ప్రతిపలుకు ఒక శరాఘాతంవలె మృత్యువును తాకింది. మరో సంకల్పానికి అవకాశం లేకుండా పోయింది. మృత్యువులోనూ శూన్యం మిగిలింది.

మృత్యువు నిశిని ఆహ్వానించింది. కానీ అంధకారం దూరంగా తప్పుకుంది. నరకానికి స్వాగతించగా అదీ తప్పుకుపోయింది. అజ్ఞానాన్ని తనకు అండగా ఉండమని మృత్యువు కోరింది. కాని అజ్ఞానం ఉండేది చీకటిలో, అహంకారంలో కనుక అదీ ఉలకలేదు. కడకు మృత్యువు శూన్యంలో ఒంటరిగా మిగిలిపోయింది. తాను సృష్టించిన శూన్యం తననే మ్రింగివేస్తున్నది. పరాశక్తిని ఆవాహన చేసింది. కానీ ఏ శక్తి ఆదుకోలేదు. ఇప్పుడు మృత్యువు వెలుగులో మిగిలిపోయింది.

మృత్యువు యొక్క తేజస్సు సంగ్రహించింది. మృత్యువుకు అపజయం అనివార్య మనిపించింది. తన రూపాన్ని క్రమంగా కోల్పోసాగింది. మనిషి ఆత్మను కబళించాలన్న తన ఆశ నిరాశ అయింది. అమరమైన ఆత్మశక్తి ముందు మృత్యువు ఓడిపోయింది. ఆమె భావనకు అందనంత దూరంగా మృత్యువు పారిపోయింది. క్షీణించిపోతున్న చీకటిలో తలదాచుకోవడం కష్టం. విశ్వంలో, ఆ తొలిసంధ్యలో, ఛాయ అంతర్హితమైంది. వదిలివచ్చిన శూన్యాన్నే మృత్యువు తిరిగివెళ్లి ఆశ్రయించింది. తన లక్ష్యాన్ని నేరవేర్చుకోలేకపోయింది.

వారి వారి ఆత్మలను కమ్మిన చీకటి తొలగిపోయింది. సావిత్రీ సత్యవంతులు ఒంటరిగా మిగిలారు. ఎవరిలో చలనం లేదు, చైతన్యం లేదు. రెండు రూపాల మధ్య నీడ లాంటి ఒక గోడ నిలిచి ఉంది. శూన్యంలోనూ చలనం లేదు. కదలిక లేదు. పరమాత్మ పిలుపు కొరకు ఇరువురూ ఎదురు చూడసాగారు.


మహాపర నిర్యాణం

33. మహాపరి నిర్వాణం

సావిత్రీ సత్యవంతులు శూన్యంలో మిగిలారు. ఇద్దరి మధ్య తెర. ఒకరి కొకరు చేరిక కాలేని అంతరం. ఉషోదయం అవుతున్నది. ఆ వెలుగులే స్వర్గదీప్తులు. అది సత్యశివసుందరం. అది తేజోపూర్ణం, కాంతిమయం. అక్కడ ఎన్నో స్వర్గాలు. ఆ స్వర్గాలకు నిచ్చెనలు వేసి పైపైకి పోవచ్చు. వేడి లేని కాంతి కిరణాలు. అది ధవళిమ, తారుణ్యం. అదే పరమాత్మకు నెలవు. అమృత స్పర్శతో సావిత్రి ఆత్మ పులకించింది. అమృత ధారలతో తడిసి, పునీతమై పరబ్రహ్మకు చేరువైంది. అక్కడ చీకటి, మృత్యువు లేవు. అక్కడి ఏడు స్వర్గాలపై మృత్యువు నీడ పడదు. అక్కడివారికి ఆకలి దప్పు లుండవు. అవసరా లుండవు. గాలిలో తేలిపోతారు. అవసరమైన రూపాలు ధరిస్తారు. అందరూ స్వర్ణశరీరులు, నిత్యయవ్వనులు. ఆ స్వర్గాలలో దేవతలు, గంధర్వులు, కిన్నెరలు, కింపురుషులు ఎందరో దర్శనమిచ్చారు. అవి ఆనంద తీర్థాలు.

గగనతలం ఒక్కసారిగా వెలుగు వెల్లువైంది. ప్రజ్ఞాప్రభాకరుని తొలి కిరణాలు నేలకు జారుతున్నాయి. లోకం నిద్రలేచింది. ఆనందం తొంగిచూచింది. పారమాత్మిక సచ్చిదానంద లహరులేవో ఆమె హృదయంలోకి ప్రవహించి ఆనంద స్పందనలు కలిగించాయి. పరబ్రహ్మ తేజస్సు అనంతంగా ఆమెను చుట్టుముట్టింది. అనిర్వచనీయ తేజోమండలాలు దర్శనమిచ్చాయి. సచ్చిదానందం ప్రకృతిని ఉక్కిరి బిక్కిరి చేసింది.

పరమాత్మ స్పందనతో ఆమె పులకించింది. ఆత్మ ఆనందనిలయమైంది. అనంత దివ్య సంపదను తాను పరిమితంగా పొందగలిగినా అది యిచ్చిన ఆనందం అపరిమితం. అనుభూతి నూతనంగా ఉంది. ఆత్మావలోకనంతో అమరత్వం ద్విగుణీకృతమైంది. శక్తి, ఆనందం ఆత్మానందంగా మారి కాలానికి కట్టుబడింది. తెలియని లోతుల నుండి వెలుగులు పైకి రాసాగాయి. అగోచర శిఖరాల నుండి ఆధ్యాత్మిక శక్తులేవో వచ్చి తనలో చేరుతున్నాయి. అమలిన

ప్రేమ హృదయాన్ని రసప్లావితం చేస్తున్నది. ఆ మధురానుభవం, దివ్యచిత్రాలు ఎన్నటికీ మరవరానివి, మాసిపోనివి.

మనస్సు, దృష్టి మహదానందభరితాలైనాయి. ఆ మహత్తర ప్రశాంతిలో ఏవో నిర్మలమైన మండలాలు ఏర్పడి ఆకాశం నుండి దిగి వచ్చినట్లయింది. కోటి అరుణిమల కాంతి... ఆమె ఆ కాంతిని భరించగలిగింది. అమరులు కోరకుండా దర్శనమిచ్చారు. ఆ వాతావరణం చీకట్లను భరించదు. ఆ కాంతిలోకాలలో చీకటికి ప్రవేశం లేదు. పూర్ణత్వం సాధించిన ప్రతి హృదయం నిర్మలంగా ఉంటుంది. అక్కడివన్నీ ఆధ్యాత్మిక వనరులు. ఆనందం సృష్టించే అందాలు. అందరివీ సూక్ష్మరూపాలు. మానవులకుండే భౌతిక రూపాలు అక్కడ ఎవరికీ ఉండవు. కానీ చూడడానికి కాంతి అద్దిన భౌతిక రూపాలనే భ్రమ కలుగుతుంది. మధుర భావాలను ఆకృతించిన దివ్యరూపాలవి. అవే ప్రశాంతికి చిహ్నాలు. దివ్య సందేశాలు అందుకోడానికి, అనుభూతించడానికి శరీరాలు, మనస్సు అవసరం. మహత్తరమైన పరమాత్మ శక్తి కాలంతో పరుగులు తీస్తుంది. ఆత్మ ఎప్పుడూ అనంతసీమలలో శూన్యాలనే వాంఛిస్తుంది. తేజోమండలాలలో, తారా సందోహాలలో పరమాద్భుతమైన ఆనందం సదా వెల్లివిరుస్తుంది. ఈ లోకాలను సృష్టించిన కళాతపస్వి లోకంలోని ప్రతిజీవిలోనూ తన ప్రతిభను వ్యక్తపరిచాడు.

ఆ దివ్యలోకంలోని అందచందాలలో, అద్భుతాలలో విశ్వజనీనత ఉంది. శాశ్వతత్వం దానికి భూమిక. అదే సర్వస్వం. అది భౌతిక పదార్థాలతో తయారైనది కాదు. అవి తమ తమ సంకేతాలు ఎరుకపరుస్తాయి. తమ శక్తులను పంచి పెడతాయి. మూడు పొరల గగనం క్రింద సప్తలోకాలు దివ్యంగా భాసిస్తున్నాయి. మృత్యుంజయులకు, అనిమేషులకు అవి ఆవాసాలు. అక్కడ విషాదానికి, బాధలకు ఆస్కారం లేదు. పరలోకాన్ని అన్వేషించినవారు, ఆత్మవిధులు, దివ్య సందేశం తమది చేసుకున్నవారు, తపస్సులో సమాధిస్థితికి చేరినవారు అక్కడ బ్రహ్మానందం అనుభవిస్తుంటారు.

పరమాత్మ యోగనిద్రలో కలగన్న దివ్యలోకాల ఆలోచనలు రెక్కలు విప్పి, గగనంలో విహరించి, అంతరిక్షంలో అంతర్హితమవుతుంటాయి. భౌతిక స్వభావం మారినప్పుడు మనస్సుకు శాంతి లభిస్తుంది. మన చుట్టూ వాతావరణమే శాంతిసాగర మవుతుంది. బ్రహ్మానందం అనుభూత మవుతుంది. ఆత్మ శాంతిస్తుంది. నలుదిక్కుల నిశ్శబ్దం అలముకుంటుంది. అదే సచ్చిదానంద స్థితి. భౌతికజీవనం

ఆధ్యాత్మికత కలిసిపోయి ఒక్కటవుతాయి. అంతా పరమాత్మ భావనతో పునీత మవుతుంది. దివ్య జీవనానికి అర్హత కలుగుతుంది.

ఆ లోకాలలో చిట్టచివరిదీ ఒక స్వర్గమే. అక్కడ అంతా అమర వాతావరణం. పరిసరాలు దివ్య తేజస్సుతో, అనిర్వచనీయ సౌందర్యంతో నిండి ఉంటాయి. అక్కడ పర్వత శిఖరాలపై బంగారు మెరుపులు. ఆకాశంలో ఇంద్రనీల మేఘాలు. మధ్యాహ్నం వేళ స్వర్గం సరిహద్దులలో కదలిక. ఆ స్వర్గాలన్నీ పరమాత్మ భవ్య మందిర సోపానాలు. ధ్యానస్థితిలో మనం మహర్షుల్ని దర్శిస్తాం. వారు పైకి పోతున్నట్లు కనిపిస్తారు. వారి కాళ్ల చప్పుడులు వినిపిస్తాయి. వారి ఆనందం పరిమళాలు విరజిమ్ముతుంది. పర్వతసానువులపై నుండి గానం జాలువారి కొమ్మ కొమ్మన పూల నిట్టూర్పులతో జతపడుతుంది. పూల తావులు. అవే మధురిమలు. ఎటు చూచినా బ్రహ్మానందమే కనిపిస్తుంది. వాంఛలు దివ్య మకరంద మాధుర్యాలవుతాయి. ఆ తరగలలో ఆనందాలు కలిసి, కలపోతగా మహత్తర ప్రశాంతిగా మారుతుంది. మన కలల్లో కనిపించే బహు సుందర దృశ్యాలు, రూపాలు అవే. ఆ స్వప్నాలే మన ఆత్మలకు విశ్రాంతి మందిరాలు.

నిర్వికల్ప సమాధిలో, నిరవధికానందం అనుభవిస్తూ మనస్సును బ్రహ్మ భావనపై లయింపచేసినప్పుడు ఆత్మలు దివ్య శిల్పాలవలె నిశ్శబ్ద ప్రవాహాలపై పయనించి కలలు కంటూ, నిర్మలానంద శిఖరాలను చేరుకుంటాయి. ఆ స్థితిలో ఆమెను దివ్యబాలలు చుట్టుముట్టారు. ఆనందంతో నర్తించసాగారు. అది కరగని, తరగని ఆనందం. అది అమృతంతో సమానం. ఆ ఆనందంలోనే అమరత్వం, అమృతత్వం ఉన్నాయి. ఆమె చుట్టూ అమరులు పరివేష్టించి పలకరించారు. వారివి ఆత్మ తేజోరూపాలు. వారు కాంతికి ప్రతినిధులు, సౌందర్యరాశులు. అక్కడ భవనాలు, నిలయాలు అన్నీ చైతన్య మణులతో ప్రకాశిస్తున్నాయి. సౌందర్యసీమలు అన్నీ కాంతిసీమలే. అక్కడ అందరివీ దివ్యశరీరాలే. అందరూ క్రాంతిమూర్తులే. వారికి పైభాగాన గోళాలు గిరగిర తిరుగుతున్నాయి.

అక్కడ ఏవీ స్థిరంగా ఉండవు. శాశ్వతంగా మనలేవు. క్షణంలో మాయమై, మరుక్షణంలో రూపుదాల్చుతుంటాయి. వారిపై గ్రహ ప్రభావాలుండవు. వినదలచిన వారికి వారి మాటలు వినిపిస్తాయి. లేకుంటే అందరూ మౌనులే. ప్రతి కదలికలో సంగీతం వినిపిస్తుంది. వసివాడని కొమ్మలపై నిలిచిన సారికలు, ఊహల రెక్కలతో విహరిస్తూ ఇంద్ర ధనుస్సు లనిపిస్తాయి. అనేక వర్ణచిత్రాలను ఆకాశవీధులలో రచిస్తూ పోతుంటాయి. అక్కడి గాలులు దివ్య పరిమళాలను నింపుతాయి. ఆత్మల్ని

నందనవనాలకు తీసుకుపోతాయి. ఆ నిత్యనూతన వసంతంలో అందరూ వాసంతికలే. ఆకాశంలో కదిలే నక్షత్రాల వలె మెరుస్తూ కనిపిస్తారు. వారి కళ్లు విరిసిన పూవులు. మెరిసే నక్షత్రాలు. కదిలే ఆనందాలు. అన్నీ పరమాత్మ స్పర్శతో పరవశం కలిగించేవే.

ప్రతి కొమ్మ, ప్రతి రెమ్మ, ప్రతి పూవు వేయితావులు చిందిస్తూ కళ్లలో దాగిన కలలవలె కదలాడతాయి. దివ్య గంధర్వ స్వరాలు ఆమె చెవులకు సోకాయి. భవ్య శిఖరాల నుండి సందేశాలు వినిపించసాగాయి. ఆ సందేశాలు హృదయంలో చొరబడి ఆధ్యాత్మిక కవాటాలను తెరచినట్లయింది. అవి దేవ రహస్యాలు. ఆత్మ ఆనందంగా గాలిలో విహరించింది. రాయిలో, రప్పలో, ఆకులో, పూవులో ఆత్మ దర్శనమైంది. భావం చైతన్యమై, చైతన్యమే జీవ స్పందనగా మారింది. అప్పుడు నిశ్శబ్దం నుండి, శూన్యం నుండి, అవ్యక్తం నుండి అనిర్వచనీయ భావం వెలువడింది. అదే ఆమెకు పరమాత్మ అందించిన సందేశం.

ఆ నిశ్శబ్ద సోపానాలపైకి పోతున్న కొలదీ అడుగులు తడబడవు. దృశ్యమాన మైన తాంత్రిక భూమికలు ఉండవు. అనుక్షణం కొత్త అనుభూతులు కలుగుతాయి. అక్కడ కనిపించని తంత్రాలను, వినిపించని రాగాలను, మహదానంద రహస్యాలను తెలుసుకోవాలన్న ఉత్సుకత కలుగుతుంది. ప్రతి అడుగులో చైతన్యం చిప్పిలి, ఆకర్షణ అభినివేశంగా మారి, మరింత లోతులకు వెళ్లడానికి ప్రోత్సాహం లభిస్తుంది. హృదయంలో ఎక్కడో దాగి ఉన్న రహస్యాలు తెలుసుకోవాలనిపిస్తుంది.

దిగంతాల నుండి పొంగిపొరలిన సంగీత తరంగాలు ఆమె ప్రజ్ఞకు మహత్తరమైన అనుభూతిని కలిగించాయి. ఆత్మ దివ్యనాదమై పయనించసాగింది. ఆ ప్రయాణం జనసంచారం, ఆత్మసంచారం లేని ఒక నూతనలోకంలో. ప్రమాదాలేమిటో ఎరగని ప్రమోదసీమ అది. పరమాద్భుతాల అన్వేషణకై జరిపే సాహసయాత్ర అది. అక్కడ గాలులు, రుతాలు అన్నీ అపూర్వాలే.

మనిషి ఆలోచనలు మనస్సుకు పరిమితమైనా, దివ్యభావన వల్ల ఆత్మ పరిశీలన, ఆంతర్దృష్టి అలవడుతుంది. మనస్సు భౌతిక శరీరంతో కలసివున్న కారణంగా అంధకారాన్ని వదలలేక, దివ్యత్వాన్ని, పరమాత్మను సులభంగా ఆమోదించదు. కాని సావిత్రి సర్వప్రకృతిలో పరమాత్మను దర్శించ గలిగింది. విశ్వరహస్యం ఆమెకు అవగతమైనపుడు ఆత్మ తనను తాను గుర్తించింది. సర్వాత్మలతో మైత్రికి సిద్ధమైంది. హృదయతంత్రులు సంగతులను పలికించాయి.

ఆత్మల్ని పలకరించాయి. అందులో దివ్యనాదాలు కొన్ని, ఈ ప్రపంచం భరించలేని మహత్తర నాదాలు మరికొన్ని.

భూలోకంలో అనుభవించిన బాధలన్నీ పైలోకాలలో సుఖాలుగా, ఆనందాలుగా మారుతుంటాయి. పరలోకాలలో అన్నీ ప్రేమకు సంకేతాలే. అన్నీ మార్మిక సంపదలే. ప్రపంచంలో సుఖాలు పూర్తిగా అనుభవించిన వారు స్వర్గంలో సుఖాలకై వెంపర్లాడరు. వారు అంతరంగంలో పునీతులై ఋషిత్వం పొందుతారు. వారికి స్వర్గ సుఖాలు అవసరం ఉండదు. ఇక్కడ భూలోకంలో కలల్లో సైతం పొందలేని సుఖాలు అక్కడ వాస్తవాలవుతాయి. అంతటి మార్మికానుభూతిని భూమి భరించలేదు. వాటి మార్మికభారం మోయలేక భూమి కంపిస్తుంది. అంచేతనే దివ్యరూపాలలో మార్మిక, దివ్యశక్తుల్ని దాచి, అవసరమైనంత వరకు విడుదల చేస్తుంది. ఆ రహస్యాలు పరమ యోగులకు మాత్రమే అర్థమవుతాయి. వారు మాత్రమే వాటిని భరించగలరు, నిగ్రహించుకోగలరు. అదే బ్రహ్మానంద స్థితి.

పైలోకాలలో బ్రహ్మానందం సర్వసాధారణమైన విషయం. భూమిపైన గాలివలె అది సర్వత్ర వ్యాపించి ఉంటుంది. అక్కడ పొందే అద్భుత అనుభూతి ముందు మనిషి అనుభవించే సుఖభోగాలు, ఆనందాలు అతి స్వల్పం. ఆ మహదానందాలు పరమాత్మ ధరించిన పీత వసనంపై మెరిసే మెరుపులు. మనిషి భౌతిక సుఖభోగాలకై వెంపర్లాడినంత కాలం స్వర్గసుఖాలకు అర్థం తెలియదు. అవగహనకు అందవు. హృదయంలో దివ్యజ్యోతి వెలగాలి. ఆనందంతో ప్రతి అణువు పులకించాలి. అప్పుడే స్వర్గలోక ప్రాంగణంలోకి ప్రవేశం లభిస్తుంది. ఇక్కడ సంపాదించే ప్రజ్ఞలో పరేంగిత ప్రజ్ఞ కొంత చొరబడుతుంది.

ఈ అనుభూతి పరంపర ఆమెకు క్షణంలో అవగతమైంది. దివ్యమందిర ద్వారాలు తెరచుకుని ఆమెకు స్వాగతం పలికాయి. లోపలకు ప్రవేశించగానే ఆమెకు కనిపించింది ఒకే ఒక్క ప్రకాశం. ఆ ప్రకాశం చేరడానికి ఎన్నో ద్వారాలు దాటవలసి ఉంటుంది. ఆ ద్వారాలు దాటిన తర్వాత అన్నీ పరలోకాలే, అన్నీ ప్రజ్ఞా భూమికలే. ఆ లోకాలను సైతం ఒక్కటొక్కటిగా అధిగమిస్తూ పోవాలి. ఒక్కొక్కటి ఒక్కొక్క తేజోమండలం. ఆరోహణంలో కడపటి లోకం చేరినప్పుడు, అక్కడ పరిమితం అపరిమితం ఏకం కావడం గమనిస్తాం. అక్కడ నిశ్చలంగా ఉన్న ఎందరో మహాత్ముల్ని ఆమె దర్శించింది. వారంతా మహదానందంలో మునిగి ఉన్నారు. వారు ఆ క్రాంతి మండలాల అధినేతలు, పాలకులు. అక్కడ అనేకమంది దేవతలు కొలువుతీరి ఉన్నారు. వారంతా అనిమేష దృష్టితో, పారదర్శక పరదాల

చాటు నుండి ఆమె రాకను గమనిస్తున్నారు. సచ్చిదానందం నింపుకున్న దివ్యతేజశ్శరీరాలు వారివి. వెలుగులు, అమృతాలు కలగలిసిన శరీరాలు వారివి. వారి అంతర్మందిరాలు, అంతరాత్మలు రత్నాలవలె ప్రకాశిస్తున్నాయి. స్వర్ణపాత్ర చేతబూనిన వారంతా అమృతపానం చేసినవారే. వారివి తేజశ్శరీరాలు. వారి ఆత్మలు బ్రహ్మానంద పారవశ్యాలు. అనురాగ జీవులను కలిపే శాశ్వతబంధం అది. పరమా నందంతో అందరూ ఒక్కలాగానే కనిపిస్తారు. ఒక్కటవుతారు. కాంతికిరణాలు రూపుదాల్చిన వారు కొందరు. సువర్ణచ్ఛాయతో మెరిసే అచ్చరలు మరికొందరు.

అక్కడ పారవశ్యంతో జాలువారిన ప్రవాహాలు స్వర్గసీమల శాంతి నదాలైనాయి. వారి శరీరాలు విద్యున్మాలికలై సువర్ణకాంతుల్ని ప్రసరిస్తున్నాయి. వారి కదలికలో నర్తకీమణుల విన్యాసం ఉంది. పదచాలనంలో తాండవ లాస్యం. అది హృదయ శీతల కేంద్రం. పరచిన వెన్నెలలు వారి రూపాలు. విశ్వశిల్పి తీర్చిదిద్దిన కళాఖండాలు అవి. వారి నడకలో లయ విన్యాసాలు ..... వారి స్వరాలలో గంధర్వ గాన లహరులు. అక్కడి వారి గీతాలే విశ్వభావనకు రూపకల్పన చేస్తాయి. ఆ రేఖలు పరమాత్మ ఆచ్ఛాదన తొలగించగలవు. అక్కడి పవనాలు ప్రజ్ఞాసాగర సంగీత ఝరులు. అక్కడ చరిస్తున్న అమృతమూర్తుల తేజశ్శరీరుల మధ్యన మన పితృదేవతలు చరిస్తారు. వారి శక్తికి పరిమితి లేదు. వారి తేజస్సుకు అవధి లేదు. మనం ఇక్కడ ఆశించేవన్నీ వారు అక్కడ హాయిగా అనుభవిస్తున్నారు.

అక్కడకు మహాత్ములు, మహర్షులు పైలోకాల నుండి దిగి వస్తుంటారు. మన సాధన, తపస్సు, ఆరాటం అక్కడకు చేరాలని. దేవతలు సైతం తమ దివ్య రూపాలను, విభూతుల్ని, భావనల్ని పైలోకాలలో దాచి వస్తుంటారు. అవి వారి సంపదలు. సత్య లోకాలలో అవి భద్రంగా ఉంటాయి. మనిషి నాలుక సత్యం పలకడానికి వెనుకాడుతుంది. పుణ్య పురుషులు సైతం కలవర పడతారు. పాపులు నిశ్చింతగా బ్రతుకుతుంటారు.

అక్కడ మెరుపులు, వెలుగులు, కాంతులు కారుణ్యంలో కలిసిపోతాయి. మహదానందంలో చిరుహాసం వలె, అగోచర సచ్చిదానంద స్వరాలు వారి వీణలపై పలుకుతాయి. ఆ దివ్యనాదాలు వినగానే ఆమె మానవ నైజం మరచిపోయింది. ప్రాపంచికబంధాల పట్టు వదలిన ప్రేమ అమరంగా మారి, అతీంద్రియ పరిష్వంగ సుఖాన్ని అనుభవించింది. పైకి వెళ్లిన కొద్దీ, ఒక్కొక్క అంతస్థు చేరుతుంటాం. మాటలతో వర్ణించలేని, మనస్సుతో భావించలేని, సృష్టికి తలమానికమైన స్వర్గలోకాలు అవి.

అక్కడ నిండి ఉన్నది అద్భుతమైన ప్రశాంతి. అది అతి సూక్ష్మ వాయువుతో తయారైంది. అది స్వర్గం కన్న ఉజ్వలం అనిపిస్తుంది. మనస్సుతో, భావనతో మాత్రం సంభావించగల వాతావరణం అక్కడిది. ఆత్మకు ప్రతిబంధకం కాని రూపాలు అక్కడ ఉంటాయి. ఆనందమే వేయి రూపాలు ధరిస్తుంది. అవి అర్ధాకృతులతో కనిపించినా అంతలోనే అంతర్ధానమవుతుంటాయి. వాటి లోపలి ఆత్మలు మాత్రం ప్రజ్ఞకు తెలుస్తుంటాయి.

మానవప్రజ్ఞ పరిపూర్ణంగా వికసించినప్పుడు అంతరంగం తేజస్సుగా మారుతుంది. అప్పుడు ప్రతి భావం, ప్రతి సంకల్పం పరమాత్మ సందేశమే అవుతుంది. ప్రతి సంకల్పంలో సత్యం కనిపిస్తుంది. సత్యం కానిది ఏదీ సంభావించడం జరగదు. అక్కడి గాలులు శాంతి సందేశాలు. అక్కడి వెన్నెలలు స్వప్నసందేశాలు. సూర్యకాంతి ఆత్మ అయితే, వెన్నెల స్వప్నాలు పండిస్తుంది. ఆ నిశ్శబ్ద ప్రశాంత చైతన్య లోకంలో అంతా ఆనందమే. అంతా అఖండశక్తి పూర్ణమే.

ఆకాశంలో ఎగిరిపోతున్న శాబకం వలె, ఆమె ఆత్మ గగనసీమలలో విహరించ సాగింది. మహోన్నత శిఖరాలను చేరుకున్నది. తనకు మాత్రమే పైకి పోతున్నట్లు తెలుస్తోంది. రెక్కల కదలిక ఎప్పుడో నిలిచిపోయింది. రిక్కల చప్పుడు ఎన్నడో ఆగిపోయింది. తనలో ఆరాటం, ఉద్విగ్నత లేవు. ఆత్మ వేరైనప్పుడు యోగి నిశ్చలంగా ఉంటాడు. అది ఆమె ప్రస్తుతం. ఆమె హృదయం ఆనందంతో బరువెక్కింది.

ఆమె హృదయం ఆనందంతో పురివిప్పిన మయూరం వలె నర్తిస్తూ, అనుభూతితో ఏవేవో లోకాలకు అలవోకగా చేరింది. అక్కడ కాలం, దూరం కలిసిపోయాయి. అపరిమితానందం సచ్చిదానందంగా మారేది అక్కడనే. బ్రహ్మానంద సాగరంలో మునిగిన కొద్దీ చిత్ర విచిత్ర లోకాలు కనిపిస్తాయి. ఆమె వాటి సూత్రాన్ని, ధర్మాన్ని గ్రహించింది. వాటి అద్భుతాలు, ఆనంద రహస్యాలు గ్రహించింది. మానవ జీవితాలను నడిపే రహస్య శక్తి అదేనని తెలుసుకున్నది. మానవ జీవితాలు ఆ చిక్కుముడులలోనే బిగుస్తుంటాయి. మానవ ప్రపంచం యావత్తు ఆ చిచ్ఛక్తికి లోబడి నడుస్తుంది. అందులో కదిలే గోళాలు, మెదిలే నిగ్రహాలు, కనిపించీ కనుపించని లోకాలు ఎన్నో ఉన్నాయి. అన్నీ శూన్యంలో గతి తప్పక చరిస్తున్నాయి. మానవ పథాలన్నింటికీ చరమగీతం పాడేది మృత్యువు. బాధలు, యాతనలు, కన్నీరు మనిషి చేసే కర్మలకు ఫలాలను అందిస్తాయి.

తాను మృత్యువుగా, అంధకారంగా గుర్తించిన దానిని ఎదుర్కొనడానికి

సర్వశక్తులు సమీకరించుకున్నది. స్వర్గలోక సౌందర్యాలు, సుఖాలు ఆమెకు అవసరం లేదిప్పుడు. సమీకృత ఆత్మశక్తితో మహత్తర రూపాన్ని పొందింది. ఒకప్పుడు భయంకర శూన్యంలో అంధకారం చొరబడి వినాశహేతువైంది. అన్ని సిద్ధులను, ప్రజ్ఞలను తనలో లయించుకుని అజేయంగా నిలిచింది. అదే మార్మికత, చివరకు అదే మారణశక్తి అయింది. నిశీధం, తమస్సులే సౌందర్యాలైనాయి. శక్తికి సైతం చీకటి నెలవైంది.

కనిపించని పరమాత్మశక్తిని అలక్ష్యం చేసి, దాని స్థానంలో అజ్ఞానం, అంధకారం ప్రవేశించి మృత్యురూపం ధరించింది. అది అధోలోకాల అసురత్వానికి సుస్థిర రూపం. అదే సౌందర్యాన్ని, ఆనందాన్ని బంధించి హరించగల అనృతమూర్తి. మృత్యు హృదయమే శూన్యం. ఆ శూన్యమే భయంకరం. అది నిశ్శబ్దం. యోగనిద్రలో జ్ఞాననేత్రం తెరుచుకున్నట్లు, ఆమె కళ్లముందు ఒక రహస్య గ్రంథం తెరుచుకుంది. అందులో బంగారంలా మెరిసే అక్షరాల వెనుక అనేక మార్మిక రహస్యాలు, సృష్టి విచిత్రాలు కదలాడాయి. ఆమె కళ్ల ముందు రూపొందిన కాంతి, తను గతంలో పడ్డ బాధల్ని, కష్టాలను మరిపించింది. ప్రకృతితో మనిషి జరిపే పోరాటాలు సత్ఫలితాలనే యిస్తాయి. మనిషి పడే కష్టాలు, యాతనలు, కార్చే కన్నీరు చివరకు మంచి ఫలితాలనే అందిస్తాయి.

పూవులకు తావి నందించే రసవిద్య, సంగీతాన్ని తరంగాలుగా మార్చే ప్రకంపనలు, ఆనందాన్ని కాంతి దళాలుగా మార్చుకున్న కలువలు, హృదయంలో నిండే మాధుర్యాలు, అన్నీ ఆమె ముందు రూపుదాల్చాయి. గ్రహాల ప్రభావం లేదు. గ్రహాల వలన కష్టాలు కలగవు. ప్రకృతి మాయ ముసుగు క్రింద "పాపం" విశ్రమించదు. ద్వేషాలు, అసూయలు అనే చీకటి తెరలు కనిపించవు. 'ప్రేమ' రూపం మార్చుకుని క్రూరంగా ప్రవర్తించే అవకాశం లేదు. 'ద్వేషం' అన్నది అతిక్రూర, భయంకర జాఢ్యం. నిస్వార్థ ప్రేమ ఒక్కటే సర్వజనామోదం. ప్రేమ ఒక్కటే పరమాత్మకు ప్రీతికరమైంది. ప్రేమ తనకు మూలకారణమైన 'ఇచ్ఛ'ను త్రోసిరాజనగలదు. మనుషుల్ని ఏకం చేసేది, బ్రతికించేది ప్రేమ ఒక్కటే. మనుషుల్ని కలిపేది ప్రేమబంధం ఒక్కటే. అది ఒక్కటే సర్వసృష్టిని తనలో ఇముడ్చుకోగలదు.

ప్రేమ ఆత్మను సైతం స్వాహా చేయగలదు. బాధల వల్ల, వైఫల్యం వల్ల నిరాశకు లోనై తనను తృణీకరించిన వారిని ప్రేమ శపిస్తుంది, బాధిస్తుంది. ప్రేమించే వారిని ప్రేమ ప్రేమిస్తుంది. ప్రేమించలేని వారిపై ఆగ్రహిస్తుంది. మృత్యువుకు ఆగ్రహించడం తప్ప ప్రేమించడం తెలియదు. ప్రకృతి చాటు నుండి

మృత్యువు తొంగిచూస్తుంది. అయినా భగవంతుని అనుగ్రహం మనిషికి కలుగుతుంది. ఈశ్వర కారుణ్యం, ప్రజ్ఞ, దివ్యత్వం అన్నీ కలిసి ఒకే ఒకసారి ఆవిష్కృతమవుతాయి. ఆరాధకులకు మూడూ ఒక్కసారే దర్శనమిస్తాయి. అన్ని దైవశక్తులు ఒకే ఆరాధనామూర్తిలో కేంద్రీకృతమవుతాయి. ఈశ్వర కరుణకు పాత్రమైన వారికి సాగరమంత సంయమనం, బ్రహ్మానందానుభూతి, స్వాతంత్ర్యం, అతీంద్రియశక్తి, పారలౌకిక ప్రజ్ఞ ప్రాప్తిస్తుంటాయి.

అతడు పరిణామంలో మహామనీషి. అతడు నామరహితుడైన పరబ్రహ్మకు ప్రతినిధి. ఓంకార ప్రణవానికి హృదయం. విశాల విశ్వానికి విపుల వ్యాఖ్య. అతనిలో దృశ్య ప్రపంచం యావత్తు ప్రతిరూపిస్తుంది. అతను విభిన్న కృతులకు ఆకృతి, కృతికర్త. దర్శనీయ ప్రపంచానికి భావం, దార్శనికుడు, ఆధారం తనే. నక్షత్రాలకు కాంతులు పొదిగేదీ తనే.

మనిషి పెరిగి పెరిగి ప్రజ్ఞావంతుడయినాడు. మానవ సంచారానికి రోదసిని సమాయత్త పరిచాడు. పదార్థాన్ని తనకు అనువుగా మలచుకున్నాడు. అణువును ఛేదించి ప్రళయం సృష్టించాడు. పరమాత్మ రహస్యం, పరమాణు రహస్యం ఒక్కటేనని గ్రహించాడు. అనుభవాలు, సంఘటనలు మానవ చరిత్ర. సాగరాలు, రోదసీ యాత్రలు మనిషి కథలోని అధ్యాయాలు. ఎదురుదెబ్బ తిన్నప్పుడు మనిషికి భగవంతుడు జ్ఞాపకం వస్తాడు.

అణువు నుండి బ్రహ్మాండం వరకు అన్నింటా పరమాత్మ సంకల్పమే పనిచేస్తుంది. ఆ సంకల్పానికి ఒక లక్ష్యం, లక్షణం ఉండదు. ఆలోచించి పథకం చేయడానికి పరప్రజ్ఞ అవసరం లేదు. అదృశ్యంగా, అప్రయత్నంగా సృష్టికార్యం సాగుతోంది. ఈ విశ్వం అంతా పరమాత్మ శరీరం. విశ్వ హృదయం విరాట్ హృదయం. ఆయనలోనే ఆయన సృష్టి నీడలా కదలాడుతుంది. సృష్టిలోని జీవజాలం అంతా సూర్యకాంతి వల్లనే జీవిస్తుంది. లోకం కనే కలలకు, భావాలకు పరమాత్మ హిరణ్యగర్భుడు.

ఈశ్వరుడు అగోచరాన్ని చూడగలడు. మన చెవులు వినలేని శబ్దాలు తాను వినగలడు. అనూహ్యమైన సత్యాలను తెలుసుకొనగలడు. మన అంతరంగంలో కొలువు తీరి మనల్ని నడిపించేది తానే. అంతరాత్మ యోగకవచం ధరించి అన్ని లోకాలను తిరిగి రాగలదు. సంకల్ప మాత్రంచే యావత్ సృష్టిని అనుష్టించగలదు. సృష్టికి రాని లోకాలను సైతం అది సంభావించగలదు.

పరమాత్మకు ప్రతినిధి అయిన అంతరాత్మది సత్యవాక్కు. వినిర్మల దృష్టి. భూత భవిష్యత్తులను తెలుసుకోగలదు. అరూపంగా ఉన్న వాటికి రూపం ఇవ్వగలదు. అగోచర పథాలను సృష్టించుకుని ఒంటరిగా పయనించగలదు. నిగూఢంగా ఉన్న అగ్నిని రగిల్చి, భరించగలదు. అవాఙ్మానసుడైన పరబ్రహ్మకు 'అంతరాత్మే' ప్రతినిధి. తాను అదృశ్యంగా ఉంటూ వెలుగును అందుకోగలదు. సచ్చిదానందాన్ని అందించే ఈశ్వరుడు తానే కాగలదు. ఆత్మ లోకాలకు తీసుకు వెళ్లేది, ఆక్రమించేది తనే.

మరొక శక్తి ప్రచ్ఛన్నంగా కదులుతుంది. అది తృతీయశక్తి. అది వెనకగా ప్రచ్ఛన్నంగా ఉంటుంది. పరబ్రహ్మను అందుకోడానికి ఈ తృతీయ శక్తి అవసరం. సమాధిలో చైతన్యంగా ఉంటూ ఈ శక్తిని పొందవచ్చు. అది చైతన్యశక్తి. అది నిశ్చలత్వం నుండి ప్రభవిస్తుంది. మన హృదయంలోనే అన్ని సత్యాలు నిక్షిప్తమై ఉంటాయి. ద్వారాలన్నీ మూసివేస్తే అవి బయటకురావు. నిమీలిత నేత్రాలే కాంతిని పొందుతాయి. మూసిన కనురెప్పల వెనుక చైతన్యం, కాంతి కలిసే ఉంటాయి. మనం ఆలోచనతో ఈశ్వరప్రజ్ఞ అందుకోలేం. ప్రశాంతి ఒక్కటే సత్యసందేశాలను మనకు అందచేస్తుంది.

పరమాణువులోను, ప్రచండాగ్నిలోను ఈశ్వరుడు ఉన్నాడు. రాయిలో, రప్పలో, మనిషిలో, దేవునిలో ఉన్నదీ ఈశ్వరుడే. ఈశ్వరుడు మనకు కనిపించకుండా నిశ్చలంగా ఉన్న కారణంగానే సృష్టి సాఫీగా సాగుతోంది. ఆయన ఉనికి వల్లనే జగత్తు నశించకుండా ఉంది. ఆయనే విశ్వ గోళానికి కేంద్ర బిందువు. ఆయనే ప్రకృతి వర్తులానికి ఆవరణ. యోగనిద్ర వల్లనే ఈశ్వరునికి అంత శక్తి సమకూరుతోంది. యోగ చైతన్యమే అమరత్వానికి, బ్రహ్మత్వానికి చిహ్నం. పైన విస్తరించి ఉండేది సచ్చిదానందం. లోపల ఈశ్వర కరుణ సర్వత్రా వ్యాపిస్తుంది. ఆ నిర్మల ప్రశాంతి నిర్వికల్ప నిర్మలానందాన్ని అందిస్తుంది. అన్ని శక్తులు మార్మిక సూత్రాలతో ఆయనతో ముడిపడి ఉంటాయి. ఆయన కారుణ్యంతో ఏర్పడిన ఈ విశ్వమే ఆయన నివాసం.

ఈశ్వర సుందర రూపానికి అనురాగాలు, ఆనందాలు ఆభరణాలు. అది తన మమతానుబంధాలతో మనుషుల్ని తనకు దాసోహం చేసుకుంటుంది. ఆ ఈశ్వరత్వమే మనిషి క్లేశాలను తొలగించి, ఆనందాలు అందించి, జీవన లాలసల్ని ఒక్కొక్కటిగా తొలగిస్తుంది. కంటికి అందని సుందర దృశ్యాలు, ఆనందాలు, అనుభూతులు యోగనిద్రలో మనకు లభిస్తాయి. కలలు అనిపించినా అవి

వాస్తవాలు మిగిల్చిన అనుభూతులే. ఆ అనుభూతులు మనల్ని విడిచిపెట్టవు. అనుభవాలతో పాటు కొన్ని అనుభూతులు కరిగిపోవచ్చు. యోగానుభూతికి క్షతి ఉండదు. ఆ అనుభూతులు దోసిళ్ళతో ప్రేమామృతాన్ని అందిస్తాయి. ప్రకృతి పాత్రలో ఇమడలేని ఆనందాలవి. అవే ఈశ్వర సౌందర్యానికి నీరాజనాలర్పిస్తాయి. అది ఈశ్వరీయత రహస్యం.

కాల గర్భంలో దాగిన విషయాలను, సత్యాలను మేధ వెలికి తీయలేదు. అవి పరిశోధనకు అందవు. ఆత్మ పరమాత్మతో కలసినప్పుడు మాత్రమే అలాంటి నిగూఢ సత్యాలు తెలుస్తాయి. యోగి హృదయంతో పూవులు, తావులు మంతనా లాడతాయి. నక్షత్రాలు గుసగుస లాడతాయి. మనస్సులోని రహస్యాలకు మంద హాసమే సమాధానం. ఏదీ పెదవిదాటి రాదు. హృదయం ప్రఫుల్లం కావలసిందే. అతనిలోని కొత్త వెలుగు, స్వర్గలోకానికి ప్రతినిధి. ఆయన దృక్పథం అమృతత్వానికి సంకేతం. అది దివ్యసంకల్పం, దివ్యానందం అవుతుంది. యుగయుగాల తేజస్సు అతనిలో ప్రజ్ఞగా ప్రభవిస్తుంది.

యోగి హృదయం విశాలం, మనస్సు నిర్మలం అయిన కొద్దీ అన్ని వైరుధ్యాలు సమసిపోయి ప్రేమ ఒక్కటే మిగులుతుంది. అతని ప్రేమలో మంచి, చెడులు కరిగిపోతాయి. అతనికి అనుక్షణం దివ్యసందేశాలు వినిపిస్తాయి. అవి గంధర్వ గానా లవుతాయి. అతను వినలేని దివ్యనాదా లుండవు. అంతా కాంతిపర్వమే. సర్వం ఆనందదాయకమే. జీవుడు చిదాకాశంలో స్వేచ్ఛగా విహరిస్తుంటాడు. ఆనందలోకాలు అతనికి స్వాగతం పలుకుతాయి. అతనికి అన్ని లోకాలను దర్శించగల ప్రజ్ఞ లభిస్తుంది. ఆత్మ పరమాత్మను గుర్తిస్తుంది.

హృదయ మందిరం నుండి వెలువడే దివ్యనాదం విశ్వవిషాదాన్ని ఆనంద హేలగా మార్చగల మధుర మార్మిక సంగీతం వలె ఆత్మకు అనుభూతమైంది.

"మానవరూపిణీ! నీవు మరణరాహిత్యం కోరుతున్నావు గాని, ఈ కాంతి కుడ్యాల అవతల ఏముందో చూడగలవా? చెప్పగలవా? ఈ దివ్య మందిర ప్రాకారాల వద్ద మెరుపులు మెరవక సదా నిద్రలో ఉన్నట్లు తోచినా అవి ఎప్పుడూ చైతన్యంగానే ఉంటాయి. సదా జాగృత స్థితిలోనే ఉంటాయి. నీలో ప్రజ్ఞ ప్రభవించినప్పుడు గానీ ఈ ద్వారాలు తెరుచుకోవు. అప్పుడే స్వర్గధామంలోకి ప్రవేశార్హత లభిస్తుంది. మనిషికి అహంకారం వల్ల జ్ఞానదృష్టి పూర్తిగా ఏర్పడదు. ఎప్పటికో గాని మనిషిలో జ్ఞాననేత్రం తెరచుకోదు. జీవుని యాత్ర చివరకు మృత్యుమందిర ముఖద్వారం వద్దనే ముగుస్తుంది. కాని అగోచర బ్రహ్మానందం

పొందాలని మనిషి ఆశిస్తుంటాడు. దేవతలు అసూయాగ్రస్తులై అన్వేషించేది నా కొరకే. అనన్య సామాన్యమైన నా దివ్యప్రజ్ఞను వారు కాంక్షిస్తుంటారు. నన్ను చేరడానికి వేనవేల మార్గాలున్నాయి. అదృశ్యంగా ఉన్న మహా తేజస్సు అందాలు నావే. ఈ భూమికి దిగివచ్చి ఆత్మ ఒక భౌతిక శరీరాన్ని ఆశ్రయించి, తన స్వస్థితిని విస్మరించి, అంధకారంలో పయనిస్తూ, అనేక కష్టాల పాలవుతుంది. గ్రహాల నీడన రోదసిలో తారాట్లాడుతుంది.

"అక్షయమైన సచ్చిదానంద విభూతిని నేను. నాపై మనస్సు లగ్నం చేసిన వారికి ఏ యాతనలు ఉండవు. చీకటిని చీల్చి చూడగలిగిన వారికి నేను కనిపిస్తాను. అస్పష్టంగా ఆకాశం చీకటి క్రింద నిశ్చలంగా ప్రవహించే రెండు శక్తులు ఒకే బ్రహ్మానందం నుండి ప్రభవించినవైనా, వేరు వేరు దిశలలో ప్రవహిస్తుంటాయి. ఒకటి భూమి వైపుగా, రెండవది ఆకాశం వైపుగా పరుగు తీస్తుంటాయి.

"భూమి స్వర్గంగా మారాలని స్వర్గం కలలు కంటుంది. భూమి తన లోపాలను మరచి స్వర్గం కావాలని ఆశ పడుతుంది. రెండూ ఆరాటపడుతూ, దూరదూరంగానే ఉంటాయి. దేని వైఫల్యం దానిది. ఏవో భయాల వల్ల రెండూ కలవలేకపోతున్నాయి. ఏకం కాలేకపోతున్నాయి. వాటి వైరుధ్యం యుగాల దూరాన్ని సృష్టించింది. సమాధిలో ఒక దాని నొకటి ప్రేమగా పలకరించుకుంటాయి. కలల్లో కలుసుకుంటాయి. వాస్తవానికి స్వర్గం స్వర్గమే, భూమి భూమిగానే మిగిలిపోతున్నది.

"లేదా, నా ఆనందసీమలలో ప్రక్కప్రక్కన చేరి సేద తీరి, విచిత్ర పరిస్థితులలో విడిపోయిన జంట వలె ఒక దానినొకటి తమకంతో చూచు కుంటాయి. కానీ పరిష్వంగ సుఖానికి నోచుకోవు. ఉద్రేకం, వాంఛ గట్టులు త్రెంచుకున్నా హద్దుమీరి ప్రవర్తించవు. శోభనరాత్రి ఏకశయ్యాగతులైన ప్రేమజంట మధ్యన నీడ అది. అసిధారావ్రతం. కృత్రిమమైన ఆ కత్తిని తొలగిస్తే చాలు ప్రేయసీ ప్రియులను కాలం, దూరం వేరు పరచలేవు. 'మాయ' తెర ఇరువురి మధ్య తొలగిపోవాలి. కాలం ఆత్మానందంలో కరిగిపోతుంది. ఆ మహత్తర సంఘటన కోసం నీవు ఎదురుచూడు! అంతవరకూ మీరిరువురూ విడివిడిగా ఉండవలసిందే. నీ స్థితిలో దివ్యచిత్రాలు అస్పష్టంగానే కనిపిస్తాయి. అవి నీ ఆలోచనారణ్యంలో చిక్కుబడి ఉన్నాయి. స్వర్గం చేరడానికి వారధి అతిసన్నగా ఉంటుంది.

"దేవతలను దర్శించాలంటే, స్వర్గం చేరాలంటే రూపభేదాలను ముందుగా

సహనంతో తొలగించుకోవాలి. అస్తి, నాస్తి విచికిత్సను వదలిపెట్టి ఆనందం కొరకు అన్వేషించాలి. ఆత్మయోగంలో బ్రహ్మానంద స్థితికి చేరాలి. ఇహపరాల మధ్యనున్న శూన్యాన్ని దాటగలగాలి. నిజంగా నీవు ఈ ప్రపంచంతో విసిగిపోయి నట్లయితే ప్రాపంచికమైన విషాదాలను లెక్కచేసేదానివి కాదు. ఈ చీకట్లను, వైతరణిని దాటి పోయేదానివి. ముందు ప్రాపంచిక బంధాలను, బంధనాలను త్రెంచి భవబంధాలను, భౌతికవాంఛలను పూర్తిగా వదిలిపెట్టు. మానవుల పట్ల దయాదాక్షిణ్యాలు చూపనవసరం లేదు.

"చైతన్యం పొంది, నీ ఆత్మ హక్కులను రక్షించుకో! భౌతిక ప్రపంచాన్ని, బాధ్యతల్ని మరచిపో. గ్రహాలను, గ్రహప్రభావాలను ఎదిరించి లాభం లేదు. అరువు తెచ్చుకున్న ఈ శరీరాన్ని ఇక్కడ వదలిపెట్టు. నీ స్వగృహమైన ఆనంద నిలయం చేరుకో. ఈశ్వర సన్నిధిలో నీవు ఒక పసిబిడ్డవు. మహర్షులు, మహాయోగులు సంచరిస్తున్న సత్యలోకంలో నీవు ఆత్మవై స్వేచ్ఛగా సంచరించు. అక్కడ ఆకాశంలో ఆధ్యాత్మిక సూర్యుడు ఎప్పటికీ అస్తమించడు. నీ ఆత్మ సూర్యుని వలె ప్రకాశిస్తుంది. దేవతల వలె నీవూ ఈ ప్రపంచం గురించి పట్టించుకోవద్దు. ముక్తాత్మవై ఆనందంలో ఉండిపో. ఓ అమృతమయీ! అనిశ్చితమైన ఈ భౌతిక కామనలు, వ్యామోహాలు, కోరికలు పూర్తిగా వదలిపెట్టు".

★ ★ ★

సావిత్రి నిర్మల హృదయం ఆ వచోమాధుర్యానికి పరవశించి మంత్ర ముగ్ధమైంది. భూమ్యాకాశాలను ముంచెత్తగల ఆనందం, ఆత్మీయమైన మరేదో సంతృప్తి కలిగింది. దాపున వున్న స్వర్గం నుండి మధురిమను అందిపుచ్చుకుంది. ఆమె విశాల నేత్రాలలో కొత్త వెలుగులు – అవి బ్రహ్మానంద సరస్సులు. మొగ్గ తొడిగిన రెండు తామరలు సూర్యరశ్మికి విచ్చుకున్నట్లు అవి విప్పారాయి.

సావిత్రి అన్నది: "జీవనంతో, మృత్యువుతో మానవాత్మను సంధాన పరుస్తున్న ఓ మహాత్మా! లోకంలో సుఖదుఃఖాలు దివారాత్రుల వంటివి. ఒక దాని వెంట ఒకటి వచ్చే సుఖదుఃఖాలు కల్పించేది నీవు. మనిషిలోని కనిపించని ఆత్మను, కనిపించని స్వర్గం వైపు అకర్షిస్తున్నావు. మృత్యు స్పర్శతో మనిషి అహంకారానికి పరీక్ష పెడతావు. నీవు ప్రసాదించే స్వర్గం నాకు వద్దు. నీవు ఇవ్వగల నరకం నాకు అవసరం లేదు.

"భౌతిక వాసనల్ని, సుఖదుఃఖాలను నేను వదులకోదలచలేదు. నేను మనసు పడిన జీవితభాగస్వామిని నాకిస్తే చాలు. ఆయన ఒక్కడు లేనందువల్ల నీ

స్వర్గలోకాలలో ఆనందాలు తగ్గిపోవు. నా లోకానికి ఆయన ఆనందం, ఆయన బ్రతికుండడం అవసరం. ఆయన సౌందర్యం, సౌశీల్యం నా లోకం పైన బంగారు వలను విసరగలవు. మహాత్ములైనా ఆ భూలోకంలో జీవించాలనే కోరుకుంటారు. ఆత్మ అభివృద్ధి చెందడానికి ఈ భూప్రపంచమే తగిన భూమిక. ఇదే కర్మక్షేత్రం. అది విశ్వశిల్పి ఎన్నిక చేసుకున్న కర్మశాల.

"ప్రభూ! ఈ భూలోకంలో మేము పొందే ఆనందం అన్ని స్వర్గ సుఖాల కన్న విలువైనది. ఒకప్పుడు ఆ పైలోకాలు నాకు నిలయాలు. నేనూ నక్షత్ర కాంతులు ప్రసరించే నందనవనాలలో విహరించాను. తేజోమండలాలలో, వెన్నెల లోకాలలో తిరిగాను. అక్కడ సలిల ప్రవాహాల మంత్ర గీతాలు విన్నాను. అక్కడ కురిసే ముత్యాల వానల్లో తడిశాను. నేను నీ క్రాంత భూములలో యధేచ్ఛగా తిరిగినదానను. స్వర్గంలో మధురోహల పరిమళాలు ఆస్వాదించాను. అక్కడి సుమధుర గంధర్వగానం విన్నాను. భావలోకాలలో, స్వప్నవీధులలో విహరించాను. ఎన్నో మహదానందాలు చవి చూచాను. ఆత్మానందం పొంది ఆనంద తాండవం చేశాను. దేవతా స్త్రీలతో కలిసి ఆడుకున్నాను. పాడుకున్నాను. అయ్యా, నీ బిడ్డలమైన మేము నడిచిన క్షేత్రాలన్నీ సౌగంధికాలే. నందన వనాలలో మా నడకలు, నర్తనలు నేనింకా మరిచిపోలేదు. ఇప్పుడు నేను ఎన్నుకున్న మార్గం జటిలమైంది, కఠినమైంది.

"నిశీధిలో దేవదానవులు పోరాటాలు సాగిస్తుంటారు. అసురసంధ్యలలో పెనుగులాడుతుంటారు. మా జీవితాల్లోని మాధుర్యాలు, విషాదాలు, దివ్యశక్తి ఆ పోరాటాలను భరించే శక్తినిచ్చాయి. అన్వేషణలో ఎదురయ్యే అవరోధాల వల్ల జీవితాన్ని ఎదుర్కొనే ధైర్యం వస్తుంది. అమృతతుల్యమైన నా ప్రేమానురాగాలు మానవతను ఆలింగనం చేసుకోడానికే ఇష్టపడతాయి. మనుషుల కష్టాలు తప్ప స్వర్గాలు నాకు అవసరం లేదు. అందరితో కలిసి పంచుకోలేని ఆనందం నాకు రుచించదు. నా ప్రేమతో ఈ ప్రపంచం నిండిపోవాలి. ఎంతమందికైనా నా ప్రేమను పంచగలగాలి. ఈ ఆకాశం క్రింద పరచుకున్న మానవజీవితం మృత్యువుతో జరిపే అంతిమ పోరాటం విజయం కోసమే. దుర్భేద్యమైన మృత్యు ధనుస్సును వంచడానికి కావలసిన శక్తి కోసమే మా తపస్సు. మాలో కొందరు బాధ్యతలు పైన వేసుకుంటారు. వారు అందుకోసం ఎన్ని త్యాగాలైనా చేస్తారు. అలుపు సొలుపు లేకుండా శ్రమిస్తారు. కదనరంగంలో కత్తి దూయనివాడు వీరుడు కాదు. ఇలాంటి పోరాటాలు ఇంకెన్ని సాగించాలో! ఓ మహాత్మా! నీ పని నీవు

చేసుకో. నీ రచనా చాతుర్యంతో మమ్మల్ని ఒక్కొక్క మహావీరునిగా మలుచు. నీవు తీర్చిదిద్దిన వారిలో ఈ సావిత్రి ఒక మణిపూస.

"ఈ సావిత్రి తన కార్యనిర్వహణ కుపయోగపడే వ్యక్తి సత్యవంతుడు. మమ్మల్ని సిద్ధం చేసి, ఆశీర్వదించి ప్రపంచంలోకి పంపించు. పాట పూర్తి కాకుండా నా వేణువును విరిచి వేయవద్దు. ఎన్నెన్నో కొత్త రాగాలు ఆలపించాలని ఉంది. కాలం మహతిపై శ్రుతి చేసే నాద స్వరూపా! నీవు నాలో పలికించదలచిన రాగాలన్నీ పలికించు. నాకు దివ్యత్వం ఆపాదించి నన్ను బాధించకు. నేను పాడుకోవలసిన పాటలు ఇంకా అనేకం మిగిలిపోయాయి.

"నావలన జీవాత్మ పరబ్రహ్మ పథం చేరుతుందని నాకనిపిస్తోంది. మానవుడే దివ్యత్వాన్ని భువికి తీసుకురాగలడు. నీవు ఆమోదించి ఆశీర్వదిస్తే మా సంకల్పం నెరవేరుతుంది. నీ సహకారం లేనిదే మా ఆశలు అరణ్య ఘోషణలవుతాయి. రాక్షస బలం ఎంత ఉండీ ప్రయోజనం లేదు. కేవలం మానవ ప్రయత్నం వల్ల సాధ్యపడదు. నీ సాయం వుంటే దైవశక్తి మా వెంట ఉంటుంది. అజ్ఞానంతో మానవజాతిని నిర్వీర్యం చేయవద్దు. మనిషి అజ్ఞానం నుండి జ్ఞానం వైపు, చీకటి నుండి వెలుగులోకి పయనించగలడు. ఆత్మలో మెరిసే మెరుపు నీవు. ఉరిమే ఉరుము నీవు. నీ ప్రజ్ఞను అంధకారానికి, మృత్యువుకు అందనీయకు."

ఆమె మాటలు పెదవి దాటలేదు. కాని భావాలు దిగంతాలలో మెత్తగా పల్లవించాయి. వాటి అర్థాలు అనంతాంబరాలలో కరిగిపోయాయి. అవి వాక్కు కన్న బలమైన స్పందనలు కలిగించాయి. మనిషి ఆలోచనలన్నింటికీ భావ రాహిత్యమే అంతిమ గమ్యం. అభావ శూన్యం నుండే ఆలోచనలు పుట్టుకొస్తాయి.

అపరాహ్ణవేళ సూర్యుడు నిప్పులు చెరిగినట్లు ఆమె ముందు రూపుదాల్చిన దివ్య పురుషుడు అన్నాడు – "భౌతిక స్వభావం స్వర్గసీమలు చేరగలదా? మానవ నైజం పరలోకస్థాయికి ఎదగ గలదా? స్వర్గలోకాలలో భౌతికత్వం ఎలా ప్రవేశిస్తుంది? భూమికి, స్వర్గానికి మధ్యన ఉన్న శూన్యాన్ని బహు కొద్దిమంది మాత్రమే దాటగలరు. దానిని అందరూ దాటలేరు. శూన్యంగా కనిపించే వెలుగుధూమం నుండి సర్వసృష్టి జరిగి, రోదసిలో సంచరిస్తుంది. ఆవలితీరం అందరికీ కనిపిస్తుంది కానీ కొందరే అక్కడకు చేరగలరు.

స్వర్గకాంతులు సకృత్తుగా మానవమేధకు అందుతాయి. ఆ దివ్య భావనలు ఆకాశంలో మిలమిల మెరిసే నక్షత్రాల వంటివి. ఆమె హృదయంలోని దివ్యభావాలు రెపరెపలాడాయి. అవి సుందర దృశ్యాలైనా ఎప్పటికీ వాస్తవం కావు. అవి ఆమెలో

సుందర స్వప్నాలుగానే మిగిలిపోతాయి. కృత్రిమమైన ఆనందబీజాలు విషాదాల్ని పుష్పిస్తాయి. వినిపించీ వినిపించని మౌనరాగాలు గొంతుదాటక మునుపే కరిగిపోతాయి. కాంతి సాగరాలపై తేలివచ్చే తరంగాలలో దేవతా సౌందర్యాలు కనిపిస్తాయి. సచ్చిదానందానుభూతులు ఆమె మనస్సును, వివేకాన్ని సగమే అలరించాయి.

అద్వైత భావన స్థిరపడినప్పుడు బంధాలు, అనుబంధాలు ఉండవు. నీతికి, రీతికి అతీతమైన పూర్ణత్వం సిద్ధిస్తుంది. అలాంటిది ఆత్మ తన కోసం తనే నిర్మించుకుంటుంది. కాలం కలుషితం చేయలేని నైర్మల్యం అక్కడ ఉంటుంది. అనుక్షణం పరమాత్మ అనుభూతితో ఆత్మ పరవశిస్తుంది, స్పందిస్తుంది. ఆత్మ అనంత బ్రహ్మానందాన్ని పొందుతుంది. అదే స్వతంత్రత, అది అవ్యక్తం, అది సత్యస్వరూపం.

ఇప్పుడు ఆమెను నక్షత్ర కాంతులు ప్రలోభపెట్టడం లేదు. దేవతాస్మృతులు అంతరించాయి. కాంతులు, నాదాలు లయించావు. పైనుండి దిగివచ్చినవి ఏవీ భూమిపైన ఎక్కువ కాలం ఉండవు. మహత్తర, దివ్యదృశ్యాలు అనేకం కనిపించినా ఏ ఒక్కటీ శాశ్వతంగా నిలవదు. ఆ మహాతేజస్సులో కొందరే పయనించగలరు. ఆ కాంతి కిరణాలను తమలో నిలుపుకోగలవారు కొద్దిమందే. అలాంటివారు అవతారపురుషులు లేదా పరమాత్మ ప్రతినిధులు, కారణజన్ములు. పరబ్రహ్మ అంశలో అరుదుగా జన్మించే వారుంటారు. వారి నాలుకపై దివ్యవాణి పలుకుతుంది. వారు చేసే ప్రతిపనికి భగవంతుని ఆమోదం లభిస్తుంది. వారు నిశ్శబ్దంలో దివ్య సంగీతాన్ని వినగలరు. యోగి హృదయానికి మాత్రమే సత్యం అవగతమవుతుంది. మహర్షులు కూడా అలాంటి దివ్య సందేశాలను సకృతుగా అందుకో గలుగుతారు.

అమరవాణి ఎప్పుడో బయటపడుతుంది. దానిని కొద్దిమంది మాత్రమే హృదయంతో విని, పదిలపరచుకోగలరు. కాంతి ప్రసరిస్తుంది కానీ మానవ హృదయ కవాటాలు సమయానికి తెరుచుకోవు. మానవత్వం భూమికే కట్టుబడి ఉండాలని కోరుతుంది. ఒత్తిడి మరీ ఎక్కువైనప్పుడు గానీ మనిషి పరాన్ని గురించి పట్టించుకోడు. ఏ మహాపురుషుడో జ్ఞాపకం చేస్తే తప్ప పరలోకం ఒకటి ఉన్నదని అనుకోడు. మరుక్షణంలో మళ్లీ రొంపిలో దిగబడతాడు. బురదలో ఉండడమే మనిషికి ఆనందం, సుఖం అనిపిస్తుంది. అదే సురక్షితం అనుకుంటాడు. దివ్యత్వం చేజారి పోతుంది. ఔన్నత్యం నశించిపోగా గుండె గుబులుతో మరింతగా పతనం వైపు పరుగు తీస్తాడు.

సామాన్య మానవుడుగా జీవించడమే సుఖం అనిపిస్తుంది. అందరి వలె బ్రతకడంలోనే ఆనందం ఉంది. అందులోనే తృప్తి. ఎక్కువ మంది భౌతిక సూత్రాలకే బందీలవుతారు. భగవంతుని రుణం ఏమాత్రం తీర్చుకుందామనుకోరు. మానవస్థాయి దాటి పోతే ఏమవుతుందోనని బెంగ. అందుచేత మనిషి ఆలోచించగలిగినా, పశుస్థాయిని దాటి పైకి ఎదగలేకపోతున్నాడు. పరిణామంలో ప్రతిప్రాణి ప్రగతికి చేరుకోవాలి. ముందుకే సాగాలి. ఈ మహావిశ్వంలో ఎలా బ్రతికినా ప్రతిప్రాణికి ఒక అర్థం, ఒక గమ్యం ఉన్నాయి. అన్నీ ప్రాకృతిక రూపానికి, జీవానికి లోబడి ఉండేవే. నియమాలు ఉల్లంఘిస్తే సృష్టిధర్మం మొక్క పోతుంది. సక్రమంగా సాగుతున్న విశ్వయాత్ర కుంటుపడుతుంది. విధి విధానం తొట్రుపడుతుంది.

మనుష్యులంతా దేవతలైతే, మనుష్యులకు దేవతలకు మధ్య నున్న అంతరం అంతర్ధానమవుతుంది. పరాన్వేషణలోని సౌందర్యం పోతుంది. భగవదన్వేషణలో అనేక శ్రమలు, కష్టాలు పడాలి. ఆపైన పరమాత్మను చేరుకోవాలి. శ్రమించి సాధించిన దానిలోనే ఆనందం, తృప్తి ఉంటుంది.

మనుషులలోవలె మానులలోనూ ఈశ్వర సంకల్పం ఉంది. మనిషి అజ్ఞానం వల్ల అది చీకటి మూలల్లో దాగివుంటుంది. అది సోమరితనాన్ని, అంధ విశ్వాసాన్ని పెంచుకుని మృత్యువు నీడకు చేరుతుంది. ఎంతకాలం చీకటిలో, అజ్ఞానంలో ఉన్నా ఎప్పుడో కాస్త చైతన్యం కలుగుతుంది. కాంతి కిరణాల వేడికి తట్టుకోలేక ఆ చైతన్యం చీకటిలోకి పారిపోతుంది. కన్నతల్లి అజ్ఞానం వల్ల బిడ్డను ఎండలో తిరగనీయదు. చీకటి గదిలో, తాళ్లతో కట్టివేస్తుంది.

మనిషి మేధస్సుతో తప్ప పరమాత్మను గ్రహించే వీలులేదు. అందుకే మనిషికి, మేధకు అంత విలువ. విశ్వరహస్యం యావత్తూ యోగనిద్రలోనే దాగి ఉంది. చైతన్య మందిర ద్వారాలు తెరవగలిగింది మానవుడొక్కడే. అయినా మనిషి అజ్ఞానానికి బందీ అయినాడు. అతనిలో చైతన్యం ప్రవేశించకుండా తలుపులు మూతపడ్డాయి. అందనంత ఎత్తున కాంతి కనిపిస్తుంది. తానున్నది చీకటిలో, అఖాతాల్లో, రెండు తెరల మధ్యన మనిషి మనస్సు చిక్కుబడి పోతుంది.

మనిషి మాటల ద్వారా, రూపాల ద్వారా సత్యాన్ని అన్వేషిస్తాడు. పై పై మెరుగులు చూచి భ్రమపడుతుంటాడు. తెలిసీ, అతిజాగ్రత్తగా అఖాతాలలోకి జారి పడతాడు. మనిషి మనస్సుతో సంపాదించే జ్ఞానం అంతా అసంపూర్ణమే.

తనలోకి తానుగా వెళ్లలేడు. అగోచర పరమాత్మను అందుకోవాలని ఆరాటపడతాడు. పరమాత్మను ఎలా అందుకోగలడు! పరమాత్మ ప్రజ్ఞను ఎలా పొందగలడు?

యుగయుగాల చీకట్లను చీల్చుకుని ఎదురుచూస్తున్న ఉషఃకాంతి ప్రభవించింది. పరమాత్మ సంకల్పం మేరకు అంతా సవ్యంగా సాగితే మానవజాతిని ముసిరిన చీకట్లు, అజ్ఞానం తొలగిపోతాయి. కాని మనిషిలో మార్పు రాకపోవచ్చు. విధి కన్న ఆత్మ బలమైనది. కాలం కలిగించే కల్లోలాలను ఆత్మ తట్టుకోగలదు. అలజడిని నిగ్రహించుకోగలదు. జీవితంలో సుఖదుఃఖాలను సమంగా అనుభవిస్తున్నా ఏ చట్టాలకు, శాసనాలకు కట్టుబడని రీతిలో అతీంద్రియ భూమికలలో ఆత్మ స్వేచ్ఛగా విహరించగలదు. మనస్సు కల్పించే అడ్డుగోడల్ని, అవరోధాల్ని ఆత్మ దాటి పోగలదు. ఆకాశంలో ఒంటరిగా ప్రయాణించగలదు. అనంత ప్రశాంతిని తనకు ఆవాసం చేసుకోగలదు.

"స్వర్ణముఖీ! సావిత్రీ! నీ మహస్సును ఉపసంహరించుకో. లేదా నీదైన పరాశక్తిలోకి వెనుతిరిగి వెళ్లిపో! ఈ లోకానికి, భావానికి అతీతమైన యోగశిఖరాన్ని చేరుకో! కాలానికి అతీతమైన నా దివ్యవర్చస్సులో సమభాగివి నీవు. కనుక ఆ పరాశక్తిలో శాశ్వతంగా కలిసిపో. నీవు జగన్మాత అంశవు. విశ్వకళ్యాణ కారిణివి. కాదనను. నిరుపయోగమైన భౌతికజీవితాన్ని త్యజించు. నిరర్థకమైన స్వప్నాలను వదలిపెట్టు. రోదసిని దాటించగల కాంతిరెక్కల్ని ధరించి పరాశక్తిలోకి పలాయనం చిత్తగించు. ఈ దేహంతో నీవు ఆ శిఖరాలను చేరలేవు. అసంతృప్తితో ఉన్నంత కాలం నీవు ఏ ఔన్నత్యం సాధించలేవు. అక్షయమైన సచ్చిదానందాన్ని ఆత్మతోనే సాధించగలవు. అప్పుడు ఆధ్యాత్మికానందాన్ని సాధించగలవు. అమృతత్వాన్ని పొందగలవు. విఫలప్రేమతో రెపరెపలాడుతున్న నీ హృదయాన్ని ముందు స్థిమిత పరచుకో. నీ భౌతిక వాంఛల్ని, కోరికల్ని పూర్తిగా వదలిపెట్టు. ప్రకృతిలో ఈ రూపాలతో ఉన్నది ఏదీ స్థిరం కాదు, శాశ్వతంగా నిలవదు. జనన మరణాల పరమలక్ష్యం ఏమిటో గమనించు. నీ జీవితాశయం ఒక్క ఈ మరణంతోనే నెరవేరుతుంది. భౌతిక శరీరంతో నీవు ఆ లక్ష్యాన్ని సాధించలేవు.

"భౌతికత్వం ఛేదించి, అనంతత్వంలోకి వెళ్లు. అందులో కరిగి, తేజస్సుగా మారి జ్యోతిరూపం దాల్చు. ఓ సాగరమా! ఈ తరంగాల్ని తిరిగి నీలో లయం చేసుకో. మహర్లోకంలో నిత్యము, సత్యము అయిన ఆనందం పొందు. నిశ్చల సంకల్పంలోని భావంగా మారిపో. అప్పుడు ప్రేయసి ఎవరో, ప్రియుడు ఎవరో

తెలుస్తుంది. అతనిని అవధిలేని నీ తేజస్సులోకి తీసుకో! లేదూ, నీవూ ఆ పరమ 'సత్యం'గా మారిపో. ఈ విచిత్ర సంఘటన ఆరంభమైన తావునే అంతమవుతుంది".

ఆ తేజస్వంతునికి సావిత్రి ఇలా సమాధానం పలికింది!

"మహా తేజోస్వరూపా! నా ఒక్కదానికి ఆనందం చూపి ప్రలోభపెట్టకు. రెండు జీవులు ఒకేసారి ప్రపంచం నుండి విముక్తమైనాయి. నాది, సత్యవంతునిది విడదీయరాని ఆత్మానుబంధం. మేమిద్దరం ఒకే లక్ష్య సిద్ధి కోసం జన్మించాం. ఈ ప్రపంచానికి మృత్యువునీడ సోకని వెలుగుని అందించాలి. పరమాత్మను భూ ప్రపంచంలో ఆవిష్కరించాలి. భౌతిక జీవనాన్ని దివ్య జీవనంగా మార్చాలి. మనిషిని, మానవతను ఉద్ధరించాలన్న మా సదాశయం మొక్కపోదు.

"దయామయా! నీ తీయని పలుకులతో ఎంతగా నన్ను ప్రలోభపెట్టినా నేను లొంగను. స్వర్గసుఖాల కోసం భూలోకాన్ని వదలుకోలేను. అక్కడ పరమాద్భుతమైన సుఖాలు ఉంటే ఉండనీ. ఈశ్వర సంకల్పం సిద్ధించడానికి మనుషులు అవసరం. ప్రపంచం అవసరం. పరిణామం మానవ కళ్యాణం ద్వారానే జరుగుతుంది. ఆ పరిణామం కొరకే సృష్టి తహతహలాడుతుంది.

"ఈ నక్షత్రాలన్నీ నిరుపయోగంగా ఏర్పడ్డాయా! ఇన్ని కాంతిగోళాలు ఎందుకిలా పరిభ్రమిస్తున్నాయి! విధికి తలవంచేట్లయితే మనిషిలో ఆత్మ ఉండడం అనవసరం. మానవ హృదయంలో ఆశయాలు, ఆశలు గూళ్లు కట్టుకో నవసరం లేదు. మహత్తరమైన ప్రకృతి నిరర్థకం కారాదు. కోట్ల సంవత్సరాల పరిణామం అర్థరహితం, నిష్ప్రయోజనం అవుతుంది. ఈ లోకంలో చరించే జీవులకు చైతన్యం ఎందుకు కలగాలి! కష్టాలు, మరణాలు చాలు విధికి! ఈ నేల స్వర్ణకాంతులకై ఎదురుచూస్తున్నది. తన పిలుపుకు స్వర్గం స్పందిస్తుందని భూమి ఎదురుచూస్తున్నది. కనుక మా సమాగమం వట్టిపోదు. ఈ దివ్య స్పర్శ నిరుపయోగం కాదు.

"నీవూ, నేను వాస్తవమైతే, ఈ ప్రపంచమూ వాస్తవమే. ఈ సృష్టిలో నీవు కనిపించకుండా మొహం చాటుచేశావు. కాని అస్తిత్వం వాస్తవమే కదా! అది అవివేకం కాదు. భగవంతుడు లోకాన్ని సృష్టిస్తే, లోకం భగవంతుని సృష్టించుకుంది. ఈ సృష్టి గుండెలో దాగిన రహస్యం బయటకు రావాలి. ఈ లోకాన్ని సృష్టించిన నీవూ ఉండాలి. సృష్టించబడిన లోకమూ ఉండాలి. రెండూ శాశ్వతం కావాలి!

"మనిషి ఎల్లకాలం మానవత పరిధిలో ఉండకూడదు. ఎల్లకాలం తన బాధల పల్లవినే పాడకూడదు. మనిషి నుండి మనీషి పరిణమించాలి. మానవుడు

దివ్య మానవుడు కావాలి. ఈ అధిమానవుడు పరమాత్మతో అనుసంధానమై పోవాలి. పరమాత్మ మానవ హృదయంలో ప్రవేశించి, శాశ్వతంగా ఉండిపోవాలి. కానప్పుడు సృష్టి, ప్రపంచం అన్నీ వ్యర్థమే అవుతాయి. కాలచక్ర భ్రమణంలో ప్రతిక్షణం నిరర్థకం అవుతుంది.

"ఈ చీకటితెరల్ని తొలగించి చూచినప్పుడు అన్నిచోట్ల నాకొక నిగూఢశక్తి దర్శన మిస్తుంది. వాటిలో ఈశ్వరీయత రూపొందుతున్నట్లు తోస్తుంది. రూపాల వెనుక ఒక సత్యం అరూపంగా గోచరమైంది. సత్యదర్శనం వల్ల దేవతలు వేసిన తెర తొలగింది. ఆ సత్యమే నన్ను పరమాత్మ అన్వేషణకు పురికొల్పింది".

ఆమెకు మృత్యువు తేజోరూపిగా సమాధానం చెప్పింది –

"మానవరూపిగా అవతరించిన ఓ జగన్మాతా! ఆత్మ సంభావించినదంతా నీవు సృష్టించలేవు. ఈ లోకాలను ఏశక్తి సృష్టించిందో ఆ మూలశక్తివి నీవు. నా సంకల్పం ఇచ్ఛ, రూపం, వాణి అన్నీ నీవే. నా ప్రజ్ఞ నీది, నా ప్రతిభ నీది. కాలం ఇలా ఎందుకు సాగుతున్నదీ నాకు తెలుసు.

"నీ హృదయంలో రగిలే తాపం వల్ల, మనిషికి లోకానికి మేలు చేయాలన్న నీ సంకల్పం కారణంగా కాలగమనంలో ఎదురయ్యే అవరోధాలను నీవు గమనించటం లేదు. పరిణామం ఎంత నెమ్మదిగా సాగితే అంత మంచిది. ఈ అంధకార ప్రపంచంలో నీ మహాశక్తిని వృధా చేయకు. ఈ చీకటి ప్రపంచాన్ని వెలుగుతో నింపాలని చూడకు. మనిషిలో పాతుకు పోయిన అమాయకత్వం అంత తొందరగా పోదు.

"మహానిశ్శబ్దం నుండి చైతన్యం పుట్టుకొస్తుంది. మనస్సులోని ప్రజ్ఞాపాటవా లను దాటి, అగోచర అదృశ్య సీమలకు పయనించగలగాలి. పరమాత్మను చేరడానికి ఎన్నెన్నో భయంకర ప్రతిఘటనలు, అవరోధాలు ఎదుర్కొనక తప్పదు. నీవు కాలం కోసం, పరమాత్మ కోసం నిరీక్షించలేని పక్షంలో నీ పని నీవు చేసుకో. విధిని ధిక్కరించగలిగితే ధిక్కరించు. శాసించు. నీ నుండి 'నిశి' భారాన్ని నేను తీసుకుంటాను. నీ స్వప్నాలను, శంకలను నేను స్వీకరిస్తాను. నా దివ్యప్రజ్ఞను ఉపసంహరించుకుంటాను. నీవు ఊహించినవన్నీ సంకేత లోకాలు. అవి వాస్తవంగా ఎక్కడా ఉండవు. విధిని శాసించదలిస్తే, నీ నిర్ణయానికి పరబ్రహ్మ ఆమోదం లభిస్తుందా?

"పరలోకాలు ఒక్కటొక్కటిగా దాటుకుంటూ పురోగమించాలి. చివరి స్థితికి

చేరినప్పుడు, దాటివచ్చిన లోకాలు ఏవీ ఉండవు. ఈ రోదసిని దాటిపోతే 'మహాప్రాణ' భూమిక వస్తుంది. అక్కడికి చేరినప్పుడు సృష్టి, స్థితి, లయల అర్థం తెలుస్తుంది. నీ మనస్సు ఎన్ని వెలుగులు చూచినా, చూపించినా లాభం లేదు. భౌతికత చాటున దాగిన సూక్ష్మ స్పందన ఎన్ని రహస్యాలను నీకు తెలియజేసినా ప్రయోజనం లేదు.

"విధిని చివరివరకు అనుభవించి తీరవలసి ఉన్నప్పుడు ఈశ్వరవాణి నీకు వినిపించి ఏం లాభం? ఇవన్నీ ఇహానికి, పరానికి మధ్య ఏర్పడిన సంబంధాలు, అనుబంధాలు. వాటికి మూలమైన దృష్టి వాటిది కాదు, జరగవలసిన పనులు జరిగిపోతుంటాయి. ప్రపంచంలో జరిగే పనులన్నింటికి కారణాలు ఉండవు. కార్య కారణ సంబంధాలు వెదికి ప్రయోజనం ఉండదు. కాలం కొసలను రెండే రెండు శక్తులు ముడివేస్తాయి. ఆత్మ సంభావించిన దాన్ని భౌతికత రూపొందిస్తుంది. ఈశ్వర సంకల్పాన్ని ఎవరైనా తలదాల్చవలసిందే. అందులో చేర్పులు, మార్పులు, మినహాయింపులు ఉండవు. ఎంత కఠినమైనా, భగవంతుని తీర్పులో మార్పు ఉండదు. ఎంత దుర్లభం అనిపించినా జరగవలసింది జరిగి తీరుతుంది. కాలంలో, లోకంలో ఈశ్వరప్రజ్ఞ ఎన్నటికీ కుంటుపడదు. చరాచర ప్రకృతిలో ఈశ్వరశాసనం అనుల్లంఘనీయం.

"జరగవలసింది లేశమాత్రం కూడా జరగకుండా పోదు. భగవంతుని శాసనం అక్షరాల అమలు జరిగిపోతుంది. పరబ్రహ్మ సంకల్పాన్ని ఎవరూ మార్చలేరు. నీవు మనిషికి, ప్రపంచానికి దివ్యత్వాన్ని కలిగించదలిస్తే, ఆధ్యాత్మికంగా దివ్య జీవనం కలిగించదలిస్తే ముందుగా ప్రపంచాన్ని, జీవన విధానాన్ని, జీవన శిల్పాన్ని గమనించు. ప్రపంచం గురించి, పరమాత్మ గురించి క్షుణ్ణంగా తెలుసుకో. అన్నీ గమనిస్తూ నీవు చేయదలచిన దానిని, నీ సంకల్పంతో సాధించు. ముందు కాలం యొక్క మర్మాన్ని గ్రహించు. విధి మలుపు తిరిగినప్పుడు కాలంపైన నీ ముద్ర వేసిపో".

★ ★ ★

ఆ మాటలు మంద్రంగా, నిశ్శబ్దంలోకి జారిపోయాయి. అందులోంచి ఒక మహాశక్తి ప్రభవించి గోళాలను కుదిపివేసింది. నవనాడులను తెంచినట్లయింది. భావాలకు, చిత్రాలకు ఆధారం కదిలింది. ఆమె మనో యవనికపై రూపాలు చెదిరి, శూన్యంలోకి జారి రంగులను కోల్పోయాయి. ఆధ్యాత్మిక తేజస్సులో స్వర్గలోకాలన్నీ అంతరించాయి.

అప్పుడు రోదసిలో ఒక కదలిక ఏర్పడింది. ఒక పిలుపు వినిపించింది. ఆత్మ పరిశోధనకు ఆరంభం, ముగింపు ఉండవు. మహాప్రస్థానం చేరడానికి క్షణకాలం పట్టదు. శూన్య సంగీతంలో ఆమెకు విశ్వభావన కనిపించింది. అది అనంతంగా రోదసి తీరాలకు సాగిపోతున్నది. భావాల ప్రసారానికి కాలంతో, దూరంతో పనిలేదు. ఆమె తానుగా ఒక అగోచర లోకం చేరింది. అక్కడ తన ఉనికి అగోచరం. శూన్యంలోనే ఆమె సంపూర్ణత్వం సాధించింది.

త్రిగుణాత్మకమైన ఈశ్వరప్రణిదానంలో ఆమె అగణిత సత్యంలో వాస్తవంగా నెలకొన్నది. అది సత్, చిత్, ఆనంద మయస్థితి. అదే గ్రహాల, గోళాల సృష్టికి ఆధారం, వాటి చలనాలకు ఆధారం. అదే ఏకైక సంధానం, నిర్మల కాంతికాసారం, బహుముఖ ప్రతిభకు ఏకైక ఆశ్రయం. అన్నీ పరమానందంలో కలిసిపోతాయి, కనిపిస్తుంటాయి. ప్రతి ఆత్మకు తాను పరమాత్మ అంశ అని తెలుసు. తాను పరమాత్మ ప్రతినిధినని తెలుస్తుంది. తాను విశ్వప్రేమను పంచియివ్వాలనీ తెలుసు. ఆ జగన్మాత అసంఖ్యాక ఆత్మలకు కన్నతల్లి. ఆమెకు అన్నీ తెలుసు. అన్నీ ఆమె సంకల్పాలే, కల్పితాలే. జగతిలోని అన్ని నాదాలను ఆమె వినగలదు. ఆమె దృష్టికి అందని విషయం ఏదీ ఉండదు. ఆమె మందిరానికి వేనవేల ప్రవేశద్వారాలు. ఆ భవ్య మందిరంలో వెలిగే దివ్యతేజస్సులోకి సృష్టిలోని చరాచరాలన్నీ చివరకు చేరవలసిందే. విశ్వాంతరాళంలో ఆత్మ సంచారం ఆగినప్పుడు పరమాత్మ ప్రశాంతికి భంగం కలుగుతుంది. ఆత్మ తిరిగి పరమాత్మ నెలవుకు చేరుకుంటుంది.

ఇప్పుడు సావిత్రి సంపూర్ణ దేవతామూర్తి. ఆమె చుట్టూ ఒక మహాశక్తి కదలాడసాగింది. ఆమెలో నిండుగా ఉజ్వల తేజస్సు మూర్తీభవించింది. కరిగిపోయిన శూన్యం నుండి ఒక స్వరం వినిపించింది. ఆ శబ్దాలు సామాన్యంగా మనిషి చెవులకు వినిపించవు. శబ్దాలు భావాలుగా అనువదించబడి, హృదయానికి నివేదనలవుతాయి.

"సావిత్రీ! ఈ మహదవకాశం మరల నీకు రాదు. విశ్వజీవులకు విశ్రమ స్థానమైన రూప, నామ, రహిత మహాశాంతి శిఖరాల నుండి నిన్ను గమనిస్తున్నాను. ఇదే పరమానందకరమైన బ్రహ్మానందం. ఇదే ఈశ్వరత్వంలోని అనంతత్వం. ఇదే అనంతత్వం సైతం రహితమయ్యే స్థితి. ఆరిపోయిన జ్యోతి పొందే తురీయస్థితి ఇది. సాగరంలో మునిగిపోయే చివరికెరటం పొందే తన్మయత్వం.

"నీ ఆలోచనల పరిభ్రమణ క్లేశానికి చరమాంకం ఇది. ఆత్మ మహాప్రస్థానాని

కిదే ఆఖరి మజిలీ. సంగీతమా! నీ స్వరాలు అరిగిపోయాయని గుర్తించు. ప్రవాహమా! ఇరువైపుల గట్లు తెగిపోతున్నాయని గమనించు".

క్షణాలు అనంత నిశ్శబ్దంలో లయించాయి. కాని, హృదయంలో తెలియని మరేదో ఆరాటం. ఆమె హృదయం ప్రశాంతంగా సమాధానం చెప్పింది.

"ప్రభూ! నీవు అనుగ్రహించే శాంతి, మనిషికి కల్లోల సమయంలో, పతనావస్థలో అనుగ్రహించ దగింది. నీవిచ్చే ప్రశాంతిలో ఆనంద స్పర్శ ఉంది".

సముద్రం మధ్యలో ఉన్న ఒక ఒంటరి ద్వీపాన్ని అలలు ఢీ కొన్నట్లు..... ఒక భీకర స్వరం శూన్యం నుండి వెలువడి ఆమెను చేరింది.

"సావిత్రీ! నీ ముందు దివ్య మందిరం తలుపులు తెరచుకుని ఉన్నాయి. నీ భౌతిక బంధాలు త్రెంచడానికే నా శక్తి సరిపోయింది. ఏ సంకోచం లేకుండా స్వర్గాన్ని కోరుకో. ఈ అవరోధాలు దాటితే కనిపించేది స్వర్గమే. నీ జ్ఞాననేత్రంతో పరమాత్మను దర్శించు. రోదసిని దాటి నిశ్శబ్దంలోకి పయనించు".

విలయం సృష్టించగల ఆ శబ్దం నిశ్శబ్దాన్ని ఛేదించి, కోటి హాహాకారాలై ఆమెను చుట్టు ముట్టింది. ఆమె సహజ గంభీరంగా, సంయమనంతో అన్నది –

"ప్రభూ! ప్రశాంతిని కోరే వారికి నీ శాంతి వచనాలు రుచిస్తాయి. ఈ అసంఖ్యాకమైన ఆత్మలలో నేను కోరదగిన మాధుర్యం లేనే లేదు".

ఉప్పెన తర్వాత నిష్క్రమించే సాగరఘోష వలె ఆ భయంకరవాణి మరొకమారు నినదించింది.

"ఉదారంగా నీకు ఆశ్రయం కల్పించదలచాను. అనన్య సామాన్యం, ప్రతిభా సముజ్వలం అయిన నా శక్తి ఉప్పొంగింది నీ కోసం. ఈ ప్రాపంచిక కల్లోలాల నుండి నిన్ను రక్షించి లాలిస్తుంది నా శక్తి".

సావిత్రి దీర్ఘంగా నిశ్వసించి, ప్రేమగా చెప్పింది.

"ప్రభూ, విషాదంలో ఉన్న వారిని నీవు రక్షిస్తావు. నీ కారుణ్యహస్తాలతో బాధా తప్త హృదయాలను సేదతీర్చి అమ్మ ఒడిలోకి చేర్చుతావు".

దూరం నుండి వినిపిస్తున్న వీణాస్వనం వలె దూరవాణి వినిపించింది. అది సావిత్రికి మరో హెచ్చరిక. "నా అద్భుతమైన నిశ్చల సచ్చిదానంద రోచిస్సులు నీకు అందించాలని నా శాంతినేత్రం తెరిచాను. చూడు! ఈ ప్రవిమలానంద సీమ ఎంత హాయిగా ప్రశాంతంగా ఉందో! ఇంతటి నిశ్శబ్దం, ప్రశాంతి మరెక్కడా

లభించదు. జీవితంలోని చేదు అనుభవాల కిక్కడ తావు లేదు. ఇక్కడి రసస్పందనలే నీ జీవన చైతన్యాలు”.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదించుకుంటూ వచ్చిన విన్నపాలు, వేడికోలు ఆరాధనా గీతాలుగా మారాయి. వినువీధుల ప్రతిధ్వనించాయి. ఆత్మ రెక్కలు విదల్చి ఎగిరిపోతున్నట్లు అనిపించింది. ఆమె సహజ దైన్యంతో వేడుకున్నది.

“ప్రభూ! నీ స్పర్శతో నా జీవనయాతనలు తొలగిపోయాయి, కాదనలేను. నీలోనే సర్వప్రాణులు జీవిస్తున్నాయి. అదీ కాదనలేను. అందరిలో ప్రవహించేది నీ ప్రేమామృతమే. అయినప్పుడు ప్రపంచం కోసం, మానవజాతి కోసం నా ప్రయత్నానికి దన్నుగా నీ ప్రేమను నాకు ప్రసాదించరాదా?”

శూన్య నిశ్శబ్దం నుండి మహదానందం ఉప్పొంగింది. రోదసి నుండి మహత్తు ప్రభవించింది. ఆ మహదానందపు తొలి తెరల వాతెరలు తనలో నిక్షిప్తమై ఉన్న లోతుల్ని చూపాయి. వాటిని ఇంకా ఇంకా అన్వేషించి అనుభవించాలని పిస్తుంది.ఆ ఆనందాలే లోకాలలో సంగీతాలుగా మారాయి.

“సుందర సుకుమారిగా అవతరించిన జగన్మాతా! అవధరించు! నీ ఆలోచనలే నావి. నీ భావాలే నావి. నేను నీ నోట పలుకుతున్నాను. నా సంకల్పం నీ ద్వారా నెరవేరుతుంది. నీవు ఎన్నుకున్న మార్గం నాకు సదా ఆమోదమే. నీవు కోరినవన్నీ మనుషులకు, లోకానికీ అనుగ్రహిస్తాను. విధి పుస్తకం నుండి బాధలను తొలగిస్తాను. నీ క్రియలు, ఆలోచనలు, పథకాలు అన్నీ నావే. కాలాంతరంలో సంకల్పం నాది, ఆచరణ నీది. కానీ, నేను వరంగా అనుగ్రహించిన మహాశాంతిని తిరస్కరించావు. ఈ అకృతులన్నీ కాలంలో కరిగిపోతాయి. లయించని ప్రశాంతిని నీవు కాదన్నావు. నా సహాయం, నా అనుగ్రహం, ఆమోదం లేకుండా నీవు ప్రశాంతిని ఎలా పొందగలవు? ఎట్లా ఆనందం అనుభవించగలవు?

“అగమ్యం, అగోచరం అయిన ఈ మహాశూన్యం నీ ఒక్కదానికోసం కాదు. చైతన్యం పొందిన నీ ఆత్మ కోసం అసలే కాదు. ఇది మమతకు, ప్రేమకు, అనురాగానికి, ప్రాణానికి, భావానికి అంతిమ మజిలీ. ఈ అరూప అనంత శూన్యంలో మిగిలింది ఏమీ ఉండదు. నా సంకల్పం నీవు ఆమోదిస్తే, నీ ఆత్మను నేను రక్షిస్తాను. నీ హృదయంలోని ప్రేమను నేను రక్షిస్తాను. ఈ ప్రపంచంలో నా కృషిభారాన్ని ఆనందంగా నీకు అప్పగిస్తాను.

“నా మహా సంకల్పం నీవు ఆమోదించావు కనుకనే విధిలో భాగం పంచుకునేందుకు సిద్ధమైనావు. మానవజాతి పట్ల మమతానురాగాలను,

దయాదాక్షిణ్యాలను కలబోసుకున్నావు. వారిని ఉద్ధరించడానికి, రక్షించడానికి ఆయత్తమైనావు. నీ సంకల్పంతో నా సంకల్పం జత పరచి నీ హృదయానికి నా బాధ్యతను బదిలీ చేస్తున్నాను. నీ ద్వారా నా కృషి సఫలమవుతుందని ఆశిస్తున్నాను. నీ స్వభావానికి నా శక్తిని అనుసంధిస్తున్నాను. నీ ఆత్మ సౌందర్యాలను నా ఆనంద నిలయాలుగా మార్చుకుంటాను. నిన్ను నా మహదానందంతో ముడివేస్తున్నాను. నీలోనే నా పవిత్ర నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటాను. పగటివేళ నీ కార్యాలలో నా శక్తి సహకరిస్తుంది. రాత్రివేళ రోదసి నుండి, తారకల నుండి మార్మిక తేజస్సు అందిస్తాను. ఈ మేఘాలు నీ కురులలో చిక్కుబడి ఉంటాయి. నా మహత్తులు, నా సత్యాలు నీ నోట వెలువడుతుంటాయి.

"సావిత్రీ! నీవు మానవాత్మకు కొత్త వెలుగు ప్రసాదించు. జన జీవనంలోకి దివ్యత్వం తీసుకురా. ఈ ప్రపంచమే నీకు ప్రయోగశాల, కర్మశాల. నీ జీవనవనంలో దివ్యబీజాలు నాటుకో. ఈ ప్రపంచంలో నీ ప్రయోగం పూర్తయినప్పుడు విశ్వమేధకి కాంతి ఆలవాలమవుతుంది. పరంవైపుగా మానవ మహావృక్షాన్ని పెరగనివ్వు. మానవ శరీరమే పరమేశ్వరుని ప్రయోగశాల. మనిషి అజ్ఞానం నుండి బయటపడినప్పుడు తనలో పరంజ్యోతిని దర్శించగలుగుతాడు. ఆలోచనలు కాంతి పూర్ణాలవుతాయి. మానవ హృదయాలు ప్రేమామృతంతో నిండుతాయి. వారి నిత్యకృత్యాలలో నా శక్తి దోబూచులాడుతుంది. అనుక్షణం వారిలో నా సంకల్పం ప్రతిబింబిస్తుంది. వారు నా కొరకే జీవిస్తారు.

"సృష్టి వైచిత్రి అదే. నీ ఆత్మ ఆడించే నాటకం ప్రదర్శించేది నేను. నీవు, నేనూ కలిసి తయారుచేసిన చరిత్ర ఇది. నీవు ఉన్నంత వరకు నీ వెంట నేనుంటాను. నిన్ను నడిపిస్తుంటాను. నీ పవిత్ర ప్రేమ కోసం ప్రపంచం నీ వెంట పడుతుంది. అయితే 'అజ్ఞానం' అనే ముసుగు నీకు రక్షగా ఉంటుంది. దేవతలు నీ మార్గాన్ని నిరోధించరు. నీ సంకల్పయాత్రకు ఎవరూ అడ్డు రారు. నా కంట పడకుండా మాత్రం నీవు తప్పించుకోలేవు.

"ఆత్మ దర్శనంతో సర్వం నీకు విదితమవుతుంది. సృష్టి రహస్యాన్ని నీవు గానే గ్రహిస్తావు. నీవు కప్పుకున్న మానవత్వపు ముసుగు జారిపోతుంది. భావనా బలానికి భౌతిక తెరలు ప్రిదిలిపోయి మనస్సు, శరీరం, హృదయం ఒక్కటిగా పనిచేస్తాయి. ప్రకృతి, ఆత్మ, పరమాత్మ ఒక్కటేనని గ్రహిస్తావు. మార్మిక సత్యాలు, సృష్టి రహస్యాలు నీ ఆత్మతోనే తెలుసుకుంటావు. నీలో సమస్త సృష్టి ప్రతిబింబాన్ని నేను చూచుకోగలను. నీ ద్వారా ప్రపంచం నన్ను పూర్తిగా అర్థం చేసుకుంటుంది.

లయించిపోయే భౌతికత్వం నీవు భరించక తప్పదు. వాటిని నా ప్రజ్ఞతో నింపక తప్పదు. నా ద్వారానే నీవు సత్యాన్ని గ్రహించవీలవుతుంది.

“అటు దైవికమైన ప్రతిఘటనల్ని ఎదుర్కోవాలి. ఇటు దైహికమైన ఈతి బాధల్ని భరించాలి. జీవితంలో ఎన్నో ఆటుపోటుల్ని ఎదుర్కోవాలి. జీవిత యాత్రలో అటు ఇటు భయంకర ఘోషలు వినిపిస్తుంటాయి. బాహ్యంగా ఎన్ని బాధలు పడినా, అపజయాలు పొందినా, ఆంతర్యంలో మాధుర్యాలకు కొదవ ఉండదు. అణువణువునా నా ప్రజ్ఞ నీకు స్ఫూర్తి నిస్తుంది.

“ఒక్క చిన్న సంఘటన చాలు మనిషి మార్గం మలుపు తిరగడానికి. ప్రతి పనికి నీ హృదయమే నీకు మార్గదర్శకత్వం వహిస్తుంది. ఆనందసమయంలోను, విషాదసమయంలోను నన్నే స్మరిస్తావు. కల్లోల సమయంలో మనశ్శాంతి నివ్వమని నన్నే అర్థిస్తావు. మంచివారితో, చెడ్డవారితో నీ ప్రేమను పంచుకో. సౌందర్య సీమలలో, అవాంఛనీయ స్థలాలలో నన్నే దర్శించు. నరకయాతనలోనూ నా స్పర్శ నీకు ఊరట కలిగిస్తుంది. నా స్పర్శ వల్లనే ఈ లోకమే నీకు స్వర్గం అనిపిస్తుంది. ఆకర్షణ లన్నింటికీ దట్టమైన అడ్డుతెర లుంటాయి. కఠిన శిలలలో సంగీతాలు వినగలవు. అగ్నిశిఖలలోనూ అందాలు కనిపిస్తాయి. గ్రహచలనాలలో నన్ను తెలుసుకోగలవు. గాలిలోనూ, ధూళిలోనూ నా ఉనికిని గుర్తించు.

“ఈ విశ్వగోళాన్ని మోస్తున్న రథచక్రాల సవ్వడిలో నా అనంతశక్తి ప్రస్ఫుటంగా నీకు కనిపిస్తుంది. అమృతం కురిసిన ప్రతిరాత్రి నీవు స్వర్గ సుఖాలు అనుభవిస్తావు. ప్రతి పూవు వికసించినప్పుడు విరజిమ్మే పరిమళం నాది. నీవు పూలతావి ద్వారా ఆఘ్రాణించేది నన్నే. నా ప్రజ్ఞనే. నేను పై నుండి నిన్ను సదా గమనిస్తుంటాను. ప్రకృతి శక్తి గుప్తంగా నీలో ఉంది. నిగూఢంగా నీలో ప్రవహిస్తున్నది. నా ఆనందం నీలోకి ప్రవహిస్తుంది. నక్షత్ర రత్నాలను పొదిగిన పవిత్ర పద్మపాత్రలో నేను నింపుకున్న మధువు నీవు ఆరగించు.

“నేను నీ గుండెను గట్టిగా అదిమినప్పుడు, నీలోకి పరలోక వాసనలు ప్రవేశిస్తాయి. అప్పుడు నీవు వినగలిగేది ఒకే రాగం. అది అనురాగం. అన్ని రాగాలను పలికించగల వీణా దండం అది. ప్రేమసాగరాలపై కదిలి నురగలలో కలిసిపోతావు. నా పట్టు నీకు భయం కలిగిస్తుంది. విచిత్ర యాతనతో ఉక్కిరి బిక్కిరి అవుతావు. ఆ బాధల పల్లకిలోనే నన్ను చూడగలవు. ప్రాపంచిక యాతనలు దుర్భరంగా కనిపించినా భరిస్తావు. అప్పుడు నా నిజసౌందర్యం నీవు చూడగలవు. కాలం కల్పించే భయంకర బాధల్ని తట్టుకోలేక కన్నీరు కారుస్తూ నా స్పర్శ

కోసం వెతుకుతావు. కాస్త మనశ్శాంతి కోసం, ఆత్మశాంతి కోసం అంగలారుస్తావు. ఈ మానవులంతా ఈ ముళ్లబాటలలో నడవక తప్పదు. నీ ప్రేమవలన వారు నాకు చేరువవుతారు. నీకు శత్రువులైనా కడకు వారంతా నన్ను ఆశ్రయించ వలసిందే. నన్ను ప్రేమించేవారు నీలో నన్ను దర్శించగలరు.

"సాటి ఆత్మల నుండి వేరుపడి నీవు ఒంటరిగా బ్రతకలేవు. అందరినీ నీవైపు ఆకర్షిస్తావు. నిన్ను చూచిన వారికి ఆనందం, తృప్తి కలుగుతాయి. అవి నా సహజ గుణాలు. వారు కష్టాలలో, కన్నీళ్లతో ఆనంద సోపానాలను శుభ్రపరుస్తారు. రెండు విరుద్ధశక్తులు ఘర్షణలో, ఒకే ఆనందం పంచుకోవడం విడ్డూరమనిపిస్తుంది.

"నీ ప్రేమను పొందగల వారికి నా పిలుపు వినిపిస్తుంది. అతి సనాతన సృష్టి సంగీతాలు నీ గొంతులో స్పష్టంగా పలుకుతాయి. నీ కారణంగానే వారు నాకు దగ్గరవుతారు. నీవు పంచిన ప్రేమలో పరవశించి, నీ ఆత్మలోనే వారు నా రూపాన్ని ఆలింగనం చేసుకుంటారు. నీ జీవితంలో దరహాసచంద్రికలు పరచు కున్నప్పుడు నేను ఏ బ్రహ్మానంద పారవశ్యంతో ఈ లోకాలను సృష్టించుకున్నానో నీకే తెలుస్తుంది.

"నీకు ఉన్నదంతా ఇతరులకు పంచడానికే, ఇతరులకు ఆనందం కలిగించడానికే. నీ సర్వస్వం నాదే అవుతుంది. ఒక పాత్ర ఆధారంతో మధువును పంచినట్లు నీవు ఆధారంగా జీవన మధువుల్ని నేను పంచిపెడతాను. అన్ని మార్గాలలో నిన్ను నా రథసారథిని చేస్తాను. నా వేణువులా గానం చేస్తాను, నిన్నే నా కత్తిలా మలచి శిక్షిస్తాను. నీ పైన నా గీతికల్ని రచించి ఆలపిస్తాను. నీవు పరమానందంతో ఊగి, తూగి పోయినప్పుడు, సర్వప్రాణులను ఒకే ఆత్మగా నీవు సంభావించ గలిగినప్పుడు నిన్ను నాకు ఆలంబన చేసుకుంటాను. నా అనంతశక్తిని లోకంలో పంచడానికి నీ సహాయం నాకు అవసరం.

"నీవు నన్ను గుర్తించకపోయినా, నీలోనే ఉంటూ ముందుకు నడిపిస్తాను. సృష్టి ఆరంభం నుండి అన్ని కాలాల్లో, జీవితంలో, బాధల్లో, సంకల్పంలో, మృత్యువులో, కల్లోలాలలో, ప్రశాంతిలో, యుగయుగాల కాలగతిలో ప్రకృతి దాచుకున్న అన్ని అనుభవాలలో ఉన్నది నేను. నన్ను ప్రేమతో ఆలింగనం చేసుకున్న వారికి ఒదిగి ఉంటాను. వారికి బందీనవుతాను. ఆ విషయం నా స్పందనలను బట్టి గ్రహించవచ్చు.

"పరమాత్మ సేవకు అంకితమైన దేవీ! ప్రేమే సర్వస్వం. సచ్చిదానంద రూపిణీ! నీవు నా విశ్వప్రేమకు ఆలంబనగా నిలిచిపో! నీ ప్రభావానికి లోనైన ప్రతిప్రాణి సృష్టిలోని మాధుర్యాలను అనుభవించి నీ కరుణకు పాత్రమవుతుంది. నాలో ఐక్యం కావడానికి అర్హత సంపాదిస్తుంది. నా అనంతకోటి రూపాలు ఆత్మలు అన్నీ తిరిగి తిరిగి నాలోకి వచ్చి చేర వలసిందే. ఓ దేవీ! విశ్వప్రేమను నీలో నింపుకుని వర్ధిల్లు. పరబ్రహ్మ విభూతులను ఎలుగెత్తి చాటు! ఒక స్వర్ణమందిరం తయారైంది. సవితృడుదయించాడు.

"సావిత్రీ! నీవు కోరినట్లు నీ సత్యవంతునితో కలిసి భూలోకానికి తిరిగి వెళ్లు. ఈ తారాపథాన్ని గగన తలాన్ని దాటించి మిమ్ము భూలోక సరిహద్దుల వరకు సాగనంపుతాను. మానవ ప్రపంచంలో ఈశ్వరశక్తి ద్వంద్వంగా పనిచేస్తుంది. ఆత్మశక్తి సృష్టిలో ఎవరికీ అర్థం కాదు. ఆ చీకటి గోళం పైకి ఇక్కడి దివ్యత్వాన్ని బదిలీ చేయడం సాధ్యం కాని పని. మానవులందరినీ అమరులుగా మార్చడం అయ్యేపని కాదు. అజ్ఞానులకే కాదు, జ్ఞానులైనవారికీ భగవంతుడు కనిపించడు. మేధ పరిమితులకు లోబడి జ్ఞానం పనిచేస్తుంది. జీవితం మమతల వలలో చిక్కుబడి ఉంటుంది. ఆత్మ తనను తాను చూచుకొనకుండా భౌతికత అడ్డుగా నిలుస్తుంది. ప్రపంచాన్ని ఉద్ధరించడానికి అవసరమైన శక్తి నీకున్నది. చీకటి వెలుగుల మధ్య తచ్చాడినా నీ ఆత్మ నిన్ను పరబ్రహ్మస్థితికి తీసుకుపోగలదు.

"గాఢతమస్సు నుండి బయలుదేరి, జీవనం ద్వారా, మనస్సు ద్వారా, పరా ప్రకృతి ద్వారా ప్రయాణం సాగించి, కాలాతీతమైన పరమాత్మ సన్నిధికి చేర్చేది నేనే. కాలగమనంలో నీ అమరత్వం తగ్గిపోదు. మలుపులలో నీ అభివృద్ధి కనిపిస్తుంది. కొత్త వెలుగు ప్రవేశిస్తుంది. తాను వదలిపెట్టిన ఔన్నత్యాలకై ఆత్మ దిగులు పడుతుంది. చేజారిన ఆనందాలు తిరిగి పొందాలని తపన పడుతుంది. అన్నింటిలో దివ్య మాధుర్యాలనే చవిచూస్తుంది. అఖండ తేజస్సు పొందడానికి అపరిమిత జీవితాన్ని వాంఛిస్తుంది. సచ్చిదానందం అనంతంగా పొందాలని ఆకాంక్ష. ఆపైన పరబ్రహ్మలో సరాసరి చేరిపోవాలని ఆత్మ ఆకాంక్ష.

"మనిషిని పశుప్రవృత్తి నుండి ఉద్ధరించగలది ఆత్మ. దివ్యభావనలు కలిగించి మానవత్వపు శిఖరాలకు చేర్చేది నేను. సత్యస్ఫూర్తితో బ్రహ్మానందం కలిగించేది నేను. మానవ జీవితంలో దివ్యత్వం నెలకొల్పవలసిందీ నేనే. భూమిపైన జీవిస్తున్న అన్ని రూపాలలో, అన్ని జీవులలో ఉన్నది నేనే. పరమాత్మను చేరదలచిన మానవాత్మను నేనే. అజ్ఞానం నుండి ప్రకృతిని ఉద్ధరించేది నేనే.

“సావిత్రీ! నా శక్తికి, రూపానికి ఆత్మవు నీవు. నా భావాన్ని శబ్దంతో బంధించి వ్యక్త పరిచేది నీవు. కాలంలో సత్యాన్ని ప్రతిష్టించవలసింది నీవు. మానవుని ఆత్మకు ఈశ్వరపథాన్ని చూపేది నీవు. ఆధ్యాత్మిక శిఖరాల నుండి లోవెలుగులు భౌతికత్వపు బయళ్లపై కురిసినప్పుడు మనస్సు అర్ధ సత్యాలను గ్రహిస్తుంది. మానవ హృదయం మానవ ప్రేమనే అర్థం చేసుకోగలదు. అందుకే మానవ జీవితం అసమగ్రంగా మిగిలిపోతున్నది. అనిశ్చితంగా ఉంటున్నది. ఈ శరీరం ఎప్పుడూ రాబోయే రోజుల్ని లెక్కిస్తుంది. అలాంటి అనిశ్చిత స్థితిలో నీవు మానవ హృదయాలలో ప్రవేశిస్తావు. అమరత్వాన్ని దాచుకున్న రూపాలలో పరకాయ ప్రవేశం చేస్తావు. మేఘాల చాటునుండి సూర్యకిరణం తొంగిచూచినట్లు, నా ప్రజ్ఞపై ముసుగు తొలగించి లోకానికి అందిస్తావు. అంతరంగంలో ప్రజ్ఞ ప్రవేశించి పొగులుతుంది. పరప్రజ్ఞ మానవ ప్రజ్ఞతో జతపడడం కష్టం. అంచేత మనిషికి నీ ప్రేమ అవసరమవుతుంది.

“అయినా మనిషి పరప్రజ్ఞనే కోరుతుంటాడు. ఈశ్వరుడు సర్వాంతర్యామి అని మనిషి నమ్మకం. తన భారం కనిపించని భగవంతుని పైన వేస్తాడు. మనస్సులో ఒక జ్యోతి నెలవంక వలె సన్నగా ఉదయిస్తుంది. అమావాస్య చంద్రుని వలె ఆత్మ దర్శనమిస్తుంది. ఆ తర్వాత మానవ జీవితం దివ్యజీవనంగా కొనసాగు తుంది. పరమాత్మ గురించి తెలుసుకో వలసింది ఎంతో ఉంది. అది ఎప్పుడో గాని బహిర్గతం కాదు.

“మనస్సు ప్రధానమే కాని దాని చేతన అస్థిరం. మనిషి శరీరాన్ని, జీవితాన్ని నడిపించేది మనస్సు. ఆత్మ రథాన్ని ఆలోచనలతో నింపేది మనస్సు. రాత్రివేళ మనస్సు వేగంగా పరుగులు తీస్తుంది. దూరంగా ఉన్న ఉషస్సులోకి మనిషిని తీసుకుపోతుంది. అదే ఆధ్యాత్మిక సాగరాల లోతులను చూపిస్తుంది. స్వప్నాలలో సత్యాన్ని, తపస్సులో బ్రహ్మానందాన్ని అందిస్తుంది.

“మనస్సుతో చేరలేని తీరాలు, అందుకోలేని గమ్యాలు ఉన్నాయి. పరిణామ క్రమంలో అందుకోవలసినవి అవి. జీవుడు కొంతకాలం అజ్ఞానంలో ఉంటాడు. తర్వాత ఎటు పోవాలో తెలియదు. అడుగు ముందుకు పడదు. గమ్యం అగమ్య మనిపిస్తుంది. కనుక ఆత్మ పురోగమనానికి మనస్సు ప్రధానం కాదు. జ్ఞాన శిఖరాలపై మహోగ్నులు రగులుతుంటాయి. ఆ వెనకగా పరమాత్మకు ఆవాసమైన తేజోమందిరం ఉంటుంది. అక్కడ నిర్గుణ సత్యం, నిర్వికల్ప శక్తి పరమాత్మకు బాసటగా ఉంటాయి. ఆధ్యాత్మికశక్తి ‘మాయ’ ముసుగును తొలగించివేయాలి. విశ్వాన్ని చక్కదిద్దడంలోనే ఆత్మ శక్తి ద్విగుణీకృత మవుతుంది.

"ఆత్మ స్వచ్ఛందంగా, స్వస్వరూపంతో దర్శనమిస్తుంది. అంధకారాన్ని చీల్చుకుని వెలువడే కాంతి నక్షత్రం అది. పరా ప్రకృతి శిఖరాలపైకి దూసుకుపోయే అగ్నిగోళం అది. మధ్యేమార్గాలను వదలి కొందరు మాత్రమే సూటి మార్గాన బ్రహ్మాన్ని ఆరాధిస్తారు. కొందరు తమకు సంక్రమించిన సిద్ధులతో, శక్తులతో తృప్తి పడతారు. ఏవేవో మార్మిక పథాలలో పయనిస్తారు. కానీ బ్రహ్మాన్ని చేరరు. అద్భుతమైన అనుభవాలు కలుగుతుంటాయి. మానసికమైన పరిమితుల్ని అధిగమించి పైకిపోయి సత్యాన్ని తెలుసుకోగలగాలి. అలాంటివారికి దివ్యత్వాన్ని అందించేది నీవే. కాని వాటి ఆంతర్యాలు, ఔన్నత్యాలు వారు గ్రహించరు. బ్రహ్మానందంలో ఒక కొంత భాగం లోకాన్ని సృష్టిస్తుంది. ఆ పరాశక్తిలోని కొంత శక్తి లోకాలను నడిపిస్తుంది. సృష్టి రహస్యంలోని ఒక అధ్యాయమే జగత్తు సర్వం.

"దివ్యత్వం మనిషిలో ప్రవేశించినపుడు జగన్మాత భూమిపైన అవతరించి నట్లే. మనుషులు సిద్ధం కావాలి. సిద్ధాత్మలలోనే భగవదంశ ప్రవేశించగలుగుతుంది. అవతారపురుషుల వల్ల పరమసత్యం మనిషికి అందుతుంది. మనశ్శరీరాన్ని మించినది ఆత్మ శరీరం. భగవంతుడు అనేక రూపాలు ధరిస్తుంటాడు. అన్ని రూపాలలోనూ పరమాత్మ అంశ ఒక్కటిగానే ఉంటుంది. మనస్సు స్పృశించలేనిది చైతన్యం. చైతన్యస్థితిని మాటలు, భావాలు వ్యక్తం చేయలేవు. చైతన్యానికి నేల ఆధారం కాదు. మనిషి కేంద్రం కాదు. కానీ జరిగే పరిణామానికి ఆధారం చైతన్యం. సృష్టికి, స్థితికి ఆధారం చైతన్యం. సత్యానికి మూలహేతువు చైతన్యం.

"మనస్సు నుండి అప్పుడప్పుడు కాంతికిరణాల వలె సత్యభావనలు వెలువడు తుంటాయి. అవి పరలోకాలనుండి మనిషిలో ప్రవేశించిన సత్య ప్రకాశికలు. అవి మనిషి ఆధ్యాత్మికాభివృద్ధికి సూచికలు. మనిషి ఎంత చిన్నప్రయత్నం చేసినా, ఫలితం పెద్దగా ఉంటుంది. స్వల్పసాధనతో అనల్ప బ్రహ్మానందం పొంద వీలున్నది.

"కొందరు ఈశ్వరప్రజ్ఞకు ప్రాతినిధ్యం వహిస్తారు. కొందరు తేజస్సుకు, ఓజస్సుకు భూమికలవుతారు. వారు యుగపురుషులుగా, ప్రవక్తలుగా, మహర్షులుగా ప్రస్తుతించ బడతారు. భౌతిక బంధాలలో చిక్కిన మనస్సుకు వారు విముక్తి కలిగించ గలరు. వారు మానవజాతిని ఉద్ధరించే మహనీయులు. వారే నూతన యుగకర్తలు, నూతన యోగకర్తలు, యోగావిష్కర్తలు.

"దివ్యత్వం తానుగా ఆవిర్భవించి, స్వర్గద్వారాలు తెరచుకుని భూమిపైకి వస్తుంది. అదే ఈశ్వరప్రజ్ఞగా మానవజాతికి అందుతుంది. అప్పుడే అధిమానవుడు ఉదయిస్తాడు. సామాన్య మానవునిలో దివ్యచైతన్యం కలుగుతుంది. పరమాత్మ

తేజస్సును, అతీంద్రియశక్తుల్ని మనిషి అందుకోగలుగుతాడు. హృదయంలో పరాశక్తి ప్రవేశిస్తుంది.

“పరమాత్మ ప్రజ్ఞ భూమికి దిగివచ్చినపుడు యోగి భగీరథుడై, ఆ శక్తిని తనపైకి తీసుకుని భరిస్తాడు. బ్రహ్మవర్చస్సుతో యోగి ప్రకాశిస్తాడు. మనస్సు, హృదయం, జీవప్రజ్ఞ, కార్మికత కలసి అవ్యక్త మహత్తును మనిషికి అందుబాటులోకి తెస్తాయి. అవి దివ్య సంకేతాలు. అది మార్మికభాష. అందుకున్న జీవప్రజ్ఞ కర్మను, మృత్యువును, యాతనల్ని రద్దు పరుస్తుంది. అజ్ఞాన మేఘాలను తరిమివేసి, జీవితానికి కొత్త నిర్వచనం యిస్తుంది. పరమార్థం చూపిస్తుంది.

“అప్పుడు జీవుడు అమరత్వానికి దగ్గరవుతాడు. మార్మిక సాగరాలు దాటివెళ్లి నిర్మలానంద లహరుల్ని వెంట తెచ్చుకుంటాడు. అప్పుడు గత జన్మలలో మరచిన మహదానందాలు స్ఫురణకు వస్తాయి. బ్రహ్మానందం క్షణక్షణం అనుభూతికి అందుతుంది. ఆత్మ సంస్కారం పరబ్రహ్మకు ప్రత్యక్ష నిదర్శనం. పరబ్రహ్మ సహస్రదళ కమలంలో అధివసించి, లోకాన్ని పాలిస్తుంటాడు. జడ ప్రపంచంలో కాస్త చైతన్యం చాలు జగత్తును మేల్కొల్పడానికి.

“భగవదంశ ప్రవేశించిన వ్యక్తి తానే భగవత్ భావనగా, సంకల్పంగా మారతాడు. తన దివ్యత్వం, తన మహత్తు తనవి కావని గ్రహిస్తాడు. ఈశ్వరశక్తికి తాను నామమాత్రపు ప్రతినిధి ననుకుంటాడు. మహాసృష్టిలో తానొక అణువు మాత్రమే. తనలో ఈశ్వరుని ప్రతిష్ఠించుకుని, తన సర్వస్వం ఈశ్వరునికి అర్పించుకుంటాడు. అతని మహత్తుకు ఊర్ధ్వమేధ కారణం. పూర్ణసత్యం అతని ఆలోచనల్ని కర్మలను నడిపిస్తుంది. పరమసత్యమే అతనికి వెలుగుబాట, మార్గదర్శి.

“అతని జీవనవిధానం, ఆలోచనాసరళి మారిపోతుంది. యాంత్రికంగా జీవించడానికి ఇష్టపడడు. తాను శక్తిపూర్ణుడై, తేజోశిఖరాలకు చేరి, ఆధ్యాత్మిక వికాసం చెంది మనీషిగా మారతాడు. భూమిని స్వర్గతుల్యంగా మార్చడం అతని లక్ష్యం. లోకాన్ని సత్యం వైపుగా పరమాత్మ దిశగా నడిపించడానికి కృషి చేస్తాడు. అతని మానవ స్వభావం మొదట దివ్య స్వభావంగా మారుతుంది. తనకు సంక్రమించిన మహాశక్తి అన్ని హద్దులను, అవరోధాలను దాటిస్తుంది. మృత్యువును సైతం నిర్లక్ష్యంచేసి అతనిని పైకి తీసుకుపోతుంది. జీవితంలో ప్రధానాంశాలన్నీ దివ్యత్వాన్ని నింపుకుంటాయి. జీవితంలో నిరాశకు, చీకటికి తావుండదు. అంతా వెలుగుమయం.

“అప్పుడు పరిణామక్రియ ప్రారంభమవుతుంది. తను చేసే ప్రతిపనీ దివ్యకార్య మవుతుంది. తనదంటూ ఏదీ ఉండదు. తనకంటూ ఏదీ చేసుకోడు. ప్రపంచాన్ని నడిపేది దివ్యప్రేమ, ఈశ్వర కరుణ. శరీరానికి దివ్యస్పర్శ తెలుస్తుంది. నశింపు నైజం నుండి ప్రకృతి తిరోగమిస్తుంది. ఆధ్యాత్మిక వెలుగులు జీవితాన్ని నడిపిస్తాయి. సాధనతో పరిపూర్ణ జ్ఞానం లభిస్తుంది. ఆలోచించ నవసరం లేకుండానే పరమసత్యాలు మనస్సుకు తెలుస్తాయి.

“మేధకు బొత్తిగా పనిలేక పరంజ్యోతిని ఆశ్రయిస్తుంది. ఈశ్వరప్రేమతో హృదయం పరవశిస్తుంది. ఆత్మజ్యోతి దర్శనం తర్వాత ప్రపంచంలో ఆశించదగింది ఏదీ కనిపించదు. మిగిలినవి ఎన్నయినా ఆ జ్యోతి క్రీనీడలే అవుతాయి. నిశ్చల చైతన్య సమాధిలో ఆ వెలుగే ప్రధానం, ఆధారం. ప్రపంచంలోని వాస్తవికతకు మించిన సత్యం మరొకటి ఉంది. దాని వెలుగు కిరణాలు మనోవీధులలో ప్రసరిస్తుంటాయి. ఒక అజ్ఞాత శక్తి మనస్సు వెనకనుండి నడిపిస్తుంది. మరో దివ్యప్రజ్ఞ మనిషి కర్మల్ని, గతాల్ని క్షాళన చేస్తుంది. మనిషి హృదయంలోనే ఆత్మ మేల్కొంటుంది. భగవద్దర్శనానికి మనస్సే రూపదర్శని. జ్ఞానదృష్టి శరీరం వల్ల ఏర్పడదు, కాని అందుకు శరీరం అవసరం. ఈశ్వరస్పర్శ జీవితంలో అడుగడుగునా తెలుస్తూ ఉంటుంది. పరాశక్తికి ప్రపంచంలో ప్రతిమనిషి హృదయం ఆవాస యోగ్యమే. అది శరీరం, జీవితం, దాచిపెట్టినా దాగని సత్యం. ఏ అజ్ఞానం ఆ సత్యాన్ని దాచి ఉంచలేదు. ప్రతి సంఘటన ఈశ్వరుడు రూపుదిద్దవలసిందే. ప్రకృతి నయనాల ద్వారా పరాశక్తి లోకాన్ని పరిశీలిస్తుంది. పరా, ప్రకృతి శక్తులు రెండూ కలిసే ఉంటాయి.

“ఈ ప్రపంచం పరమేశ్వరుని వినోదమందిరం, భూమి భగవానుని కర్మక్షేత్రం. మనిషి తాను అశాశ్వతం అనే విషయాన్ని ఎప్పుడూ జ్ఞాపకం చేసుకోడు. వీలైనంతవరకు మరచిపోయినట్లు నటిస్తూ తాను శాశ్వతంగా జీవిస్తానను కుంటాడు. తన శరీరం కాలంతో కృశించి నశిస్తుందని గమనించడు. ఎప్పుడో ప్రకృతి మార్మిక భాండాగారం మూత తెరుస్తుంది. సృష్టి పరిణామంలో ముందుకు సాగక తప్పదు. మనిషికి పరిణామం అర్థం కాదు. ప్రజ్ఞ బాహిరం కాదు.

“తాను సృష్టించుకున్న విశ్వానికి అధినేత పరమాత్మ. మానవ రూపాలతో పరమాత్మ దాగుడుమూతలాడదు. నిర్వహణ బాధ్యత ప్రకృతికి అప్పగిస్తుంది. పరమాత్మపై మాయముసుగు తొలగించి సత్యాన్ని గుర్తించడం మనిషి బాధ్యత.

అన్నింటిలోను ఈశ్వరత నిగూఢంగా ఉంటుంది. అన్నీ పరమాత్మకు ప్రతీకలే. అన్నీ పరమగుహ్యమైన బ్రహ్మానందాన్ని పొందవలసిందే.

"ఒక్కొక్కసారి క్షుద్రశక్తులు జీవుని అంటిపెట్టుకుని వేధిస్తుంటాయి. మనిషి అహంకారంతో ఆధ్యాత్మిక వికాసాన్ని చేజార్చుకుంటాడు. అయినా లోలోపల సత్యం దాగి ఉంటుంది. ఈశ్వరప్రజ్ఞ మనిషిలో ప్రవేశించే రోజు ఒకటి ఉంటుంది. ఎన్ని మలుపులు తిరిగినా కడకు గమ్యం చేరక తప్పదు. ప్రకృతిలో అన్నీ సహజంగా జరిగిపోతుంటాయి. సృష్ట్యాది నుండి ఇలాగే జరుగుతున్నది. సృష్టించబడిన ప్రతిప్రాణి ఆంతర్యం ఒక్కటే.

"అన్నింటికి అంతిమస్థితి ఒకటి ఉంటుంది. అజ్ఞానానికి అంతం ఉంది. మృత్యువుకు అంతం ఉంది. పరమసత్యం నేలను స్పృశించినప్పుడు మనిషి వెలుగు కోసం అన్వేషణ ప్రారంభించాడు. మనిషిలోని ప్రత్యణువు పరమాత్మ స్పర్శను అనుభవిస్తుంది. జీవితాంతం ఆ శక్తి అంతరంగంలో ప్రవర్ధమాన మవుతుంది. అప్పుడే మరో జీవితం ప్రారంభమవుతుంది. సత్యానికి, ప్రజ్ఞకు మనిషి శరీరం ఆశ్రయమిస్తుంది. పరా, ప్రకృతి శక్తులకు శరీరం ఆనంద నిలయం.

"ప్రపంచం ఎంత అజ్ఞానంలో ఉన్నా సత్యం ప్రతిష్ఠిత మవుతుంది. జ్ఞానం అన్నది పారదర్శకం. పారదర్శక తెరల ద్వారా సత్యకిరణాలు ప్రసరిస్తాయి. ప్రకృతి శిఖరాన సత్యం ప్రకాశిస్తుంది. ప్రపంచంలో అడుగడుగునా సత్యం మార్గదర్శకంగా ఉంటుంది. సత్యమే మనల్ని చీకటి నుండి వెలుగులోకి నడిపిస్తుంది. మానవుడు అధిమానవుడైనప్పుడు తన సంకల్పంతో లోకాన్ని మార్చగలడు. అణుప్రపంచంలో మహాద్భుతాలు చేయగలడు. ప్రకృతి నిశీధిలో అగ్నుల్ని రగల్చగలడు. ప్రపంచంలో సత్యం ఆవిష్కరించగలడు. అప్పుడు మనిషికి పరమాత్మ సందేశం వినిపిస్తుంది.

"మనిషి తనలో దాగివున్న మహత్తుల్ని గుర్తిస్తాడు. తనలో నిద్రిస్తున్న శక్తుల్ని మేల్కొల్పగలుగుతాడు. భూమి ఏర్పడినప్పుడు ప్రకృతి ప్రసాదించిన శక్తులు కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. వాటినన్నింటినీ ఇప్పుడు ఉపయోగించుకోగలడు. పరమాత్మ తనను ఈ అజ్ఞానంలో ఇంతకాలం ఎందుకు ఉంచాడో గ్రహించి, సత్యాన్ని, బ్రహ్మాన్ని, బ్రహ్మానందాన్ని వాంఛిస్తాడు. ఈశ్వర సంకల్పానికి తానే ప్రయోక్త అవుతాడు. పరమాత్మ రచనా చమత్కృతికి తానొక ఉపకరణమై మానవోద్ధరణకై దివ్యత్వాన్ని భువికి తీసుకువస్తాడు. అప్పుడు మనిషి పూర్ణమానవుడు కాగలడు.

"నిద్రిస్తున్న ప్రాపంచిక సత్యాన్ని పరమసత్యం తట్టిలేపుతుంది. అప్పుడు ఈ జడ ప్రపంచం ఖగోళానికి చైతన్య కేంద్రమవుతుంది. ఆత్మోన్నత్య ప్రభలు, ప్రకృతి ధర్మాలు వేరువేరు దిశలకు పయనించినా, తమ మూలసత్యం ఒక్కటేనని గ్రహిస్తాయి. భౌతికత్వం లోంచి ఆధ్యాత్మికత తొంగిచూస్తుంది. భౌతికత్వంలోనే ఆధ్యాత్మికత విస్తరిస్తుంది. అప్పుడు సామాన్య మానవుడు, మహామనీషి ఒకే కేంద్రబిందువు వద్ద కలుస్తారు. భూమి ఒక్కటే గ్రహగోళాలన్నింటికి సజీవకేంద్రంగా మారుతుంది.

"సామాన్య మానవులు సైతం అమరవాణిని వినగలరు. ఆత్మతో సంభాషించ గలరు. ఆధ్యాత్మిక ధర్మాలకు అందరూ తలవంచక తప్పదు. దివ్య స్పందనతో భూమి ఉత్తేజిత మవుతుంది. అంతరాంతరాలంలో మానవత్వం దివ్యంగా పరిణామం చెందుతుంది. మనిషి గుండెలో గూడుకట్టుకున్న దివ్యత్వాన్ని ప్రకృతి గుర్తిస్తుంది. కొంతమందికి పరమాత్మ సందేశం అందుతుంది. కొందరే ఈశ్వర వర్ఛస్సును భరించగలరు. అగోచరంగా ఉన్న దివ్య ద్వారం తెరచు కున్నప్పుడు, స్వర్గలాలస మనిషిని ఉద్రేక పరుస్తుంది, ఉత్తేజ పరుస్తుంది. మనస్సు అగోచర కాంతులకై ఆరాటపడుతుంది. హృదయం బ్రహ్మానందాన్ని అభిలషిస్తుంది. భౌతిక శరీరానికి ఆత్మస్పృహ ఏర్పడుతుంది. భౌతికబంధాలు క్రమంగా సడలిపోతాయి. మనిషి అప్పుడు ఆధాత్మిక జీవితం గడుపుతాడు. తనలో ఉన్న దివ్యత్వాన్ని జాగృత పరచుకుంటాడు. జ్ఞాన కిరణాలు మానవతా శిఖరాలను స్పృశిస్తాయి. మానవ స్వభావం అంతర్గతంగా మార్పుకు లోనవుతుంది.

"సత్యం ఒక్కటే జీవితానికి సరైన మార్గదర్శి. ఆలోచనలు, పనులు, పలుకులు సత్య సమ్మతం కావాలి. సత్య యోగజీవనులు పరానికి చేరువవుతారు. వారి స్థితి దేవతల స్థితితో సమానం. పరాప్రజ్ఞ ప్రవాహ సదృశంగా వారికి అందుతుంది. మూర్ఖులు సైతం జ్ఞానం పొందగలరు. మనిషి 'ఆకాంక్ష' రగిలి పొగిలి మహాతేజస్సుగా మారుతుంది.

"మనిషి అజ్ఞానం సరిహద్దులు దాటి, జ్ఞాన భూమికలు చేరతాడు. అక్కడ నుండి మహాత్ములు తేజోలోకాలలో ప్రవేశిస్తారు. మనస్సులు క్రాంతి పూర్ణాలవు తాయి. అంతరాగ్ని రగిలి, జ్ఞానం పొగులుతుంది. హృదయాలు దివ్యానందంతో పరవశిస్తాయి. మనిషి సంకల్పమే దివ్యసంకల్ప మవుతుంది. ప్రత్యగాత్మలన్నీ పరమాత్మ రూపాలేనన్న అభిజ్ఞ కలుగుతుంది. మానవ వివేకం పరాప్రజ్ఞతో, దివ్యస్పృహతో మమేకమవుతుంది. ఈ భౌతిక రూపాలలోనే అమరత్వం స్థిరపడు తుంది. మట్టిమనిషిలో సైతం అణువణువున, నరనరాన దివ్యత్వం ఉట్టిపడుతుంది.

“ప్రతి అణువులో దివ్యశక్తి ప్రవేశించి ప్రతి శ్వాసపై, ప్రతి చర్యపై, ప్రతి పలుకుపై తన ప్రభావం చూపుతుంది. ఆలోచనలు సూర్యకిరణాల వలె చురుక్కుమనిపిస్తాయి. అవి వాడిగా, వేడిగా ఉంటాయి. ప్రతి అనుభవం మధురానుభూతిని కలిగిస్తుంది. మూతబడిన మనోమందిరాలలో వెలుగులు ప్రసరిస్తాయి. శరీరంలోని ప్రతి అవయవం ఆనందంతో పులకిస్తుంది. ప్రకృతి నిండుగా పరమాత్మ స్వభావం గోచరమవుతుంది.

“అలా భూమిపైన దివ్యత్వం అవతరించి స్థిరపడుతుంది. మానవ ప్రవృత్తి దివ్యంగా మారుతుంది. చిన్నా పెద్దా పనులపై ఆధ్యాత్మిక ముద్రలు పడుతుంటాయి. ప్రతి విషయంలోను భగవత్ స్పృహ ఉంటుంది. పరమాత్మను తనలో శాశ్వతంగా నిలుపుకొనడానికి ప్రకృతి సిద్ధపడుతుంది. ఈశ్వరధర్మం మానవ ధర్మాన్ని ఆక్రమిస్తుంది. ఈశ్వరీయతకు మానవత ఆశ్రయం కల్పిస్తుంది. మానవ జీవనం అలా దివ్య జీవనంగా పరిణామం చెందుతుంది.”

★ ★ ★

దివ్య సందేశం క్రమంగా మందగించింది. అదృశ్య లోకాలు, అగాధ శూన్యాలు దాటి సావిత్రి ఆత్మ ఒక నక్షత్రం వలె మారింది. ఆమెను వింత శబ్దాలు చుట్టు ముట్టాయి. ఏవేవో నాదాలు వినిపించాయి. ఆ శబ్దాలు మందగించి నిశ్శబ్దం ఆవరించింది. గాలి తరంగాలు ఆమెను పలకరించసాగాయి. దివ్యత్వాన్ని ఆనందంగా భరించింది. అరూప స్థితిని అనుభవించింది. రోదసిలో ఒక కదలిక ఏర్పడ్డది. ఆమె ఆత్మను వెన్నంటి మరొక ఆత్మ బయలుదేరింది. ఆ కదలిక ఆత్మీయంగా ఉంది. అది తను కోరుకున్నదే, తను వాంఛిస్తున్నదే అనిపించింది. అది సత్యవంతుని ఆత్మ. ఆకృతి దాల్చింది. విలువకట్టలేని సుందరరూపం అతనిది. అద్భుత వర్ణ సమ్మిశ్రయమైన మయూర పింఛధృతి. ఇంద్రనీల కాంతులు హృదయానికి ఆహ్లాదం అందించాయి. ఆమె ఆత్మ పరిష్వంగాన్ని కోరుతున్న మరొక ఆత్మ.

ఆకృతుల్లో భేదం ఉంటుంది కాని ఆత్మ స్వరూపం అన్నింటిలో ఒక్కటే. అది వెన్నెల రేయి. నక్షత్రాలు పొదిగిన ఆకాశం అతి సుందరంగా, నీలంగా మారింది. తన నీడను చూచి తానే భ్రమపడ్డది. తన సంకల్పం ప్రేమ సాగరమైంది. ప్రకృతి నుండి పారవశ్యంలో ఒక జీవి ఉద్భవించినట్లు, ఆధ్యాత్మికానందం పొంగి పొరలింది. ఆమెను ప్రపంచంలోకి పంపింది. ఆమె రాకతో బ్రహ్మానందం ఉక్కిరి బిక్కిరైంది. పసివాని చేతికి చందమామ అందినట్లయింది. కాలాంతంవరకు

ఆత్మానుబంధం సాగుతుంది. మార్మికత ఉపభోగ్యమైంది. ఆమె తనలోనే తన ప్రేమఫలాన్ని పదిలపరచుకున్నది. వసంతంలో దాగిన పుష్పం వలె, సత్యవంతుని ఆత్మ మహాశూన్యాలను దాటి వచ్చి ఆమె సరసన చేరింది.

ఆమె భూమికి దిగి వస్తున్నప్పుడు అదృశ్యలోకాలు, పరసీమలు గతంలోకి, శూన్యంలోకి నిష్క్రమించాయి. అవి పూర్తిగా అంతర్హితమైన తర్వాత ఆమె భూకక్ష్యలో ప్రవేశించింది. ఆమెతో పాటు అనేక ఆనందాలు, సౌందర్యాలు, మార్మిక శక్తులు నేలకు దిగివచ్చాయి. జీవుడు నేలకు దిగి వస్తున్నప్పుడు ఆ వేగానికి చిత్త విభ్రమం కలిగినట్లయింది. సుడిగాలిలో చిక్కిన ఆకు వలె ప్రాణం రెపరెపలాడింది. నీట మునిగి స్పృహ కోల్పోయినట్లయింది. ఆమె హృదయం మార్దవంగా, మాధుర్యంగా మారింది. లోలోతుల అద్భుతాలు కదలాడాయి. ఆమె పైన రెక్కలు విదల్చిన చీకట్లు ముసిరాయి. ఆమెకు తల్లి ఒడిలో నిద్రిస్తున్న నిశ్చింత. కాలాతీత లోకాలనుండి పరబ్రహ్మ కాలాన్ని గమనించినట్లు, పరమాత్మ విధిని పరిశీలిస్తుంది. కాలంలో ఎన్నో యుగాలు కరిగిపోయాయి. దేవలోకం మాత్రం ప్రశాంతంగా, నిర్మలంగా ఉంది. ఒక్క క్షణంలో ఎంత మార్పు! కాల పురుషుని హృదయం కలతచెందింది. పరమాత్మ బ్రహ్మానంద మందిరంలో ఒక మెరుపు మెరిసింది. అందులో కనిపించింది పవిత్రప్రేమ.

మృత్యువును అపహసించగల ఆనందవీచిక అది. అక్షయమైన దివ్య నిక్షేపాలను ఎవరో దోచుకున్నట్లు, దివ్యమందిర ద్వారాలు ఎవరో తెరచినట్లు అనుభూతి కలిగింది. కాలం దాచిన రహస్యాలు బయటపడసాగాయి. కానీ ఇక్కడ దివ్యలోకపు ప్రశాంతి లేదు. నిశ్శబ్దంలోనే అద్భుత సామరస్యం ఏర్పడింది. ఆనంద, మాధుర్యాలతో హృదయాలు పల్లవించసాగాయి. అది బ్రహ్మానందం! అది రసమయం. శక్తి నేలకు దిగి వచ్చినప్పుడు ఆనందం సుస్థిరమయింది. విశాల విశ్వంలో సచ్చిదానందం ప్రవేశించింది.

34. పునరాగమనం

మహాసమాధి *నుండి మేల్కొని కళ్లు విప్పింది సావిత్రి. స్వస్థితిని చేరుకున్నది. సత్యవంతుని శరీరం తన ప్రక్కన ఉంది. అతనిలో చలనం లేదు. సావిత్రి స్పర్శతో అతనిలో చైతన్యం రగిలి, చలనం వచ్చింది. కళ్లు విప్పాడు. కళ్లు తెరచిన సత్యవంతునికి ఆమె తన కోసమే నిరీక్షిస్తున్నట్లు అనిపించింది. తమకంగా ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకుని కౌగిలించుకున్నాడు. ఆ కౌగిలిలో విచిత్రానుభూతి కలిగింది. ఏదో అసంభవం సంభవమైనట్లు తోచింది.*

సావిత్రిలోని పరిణామం సత్యవంతుడు గుర్తించాడు. ఆమె ఇప్పుడు ఆరాధనీయ. మానవమాత్రులు అందుకోజాలని ఆధ్యాత్మిక శిఖరాలను చేరుకున్న దివ్యసుందరి. ఇద్దరూ అరణ్యాలు దాటి వచ్చారు. ఆశ్రమం వైపు అడుగులు వేశారు. అంతలో ద్యుమత్సేనుని పరివారం ఎదురైంది. ప్రజల ఆనందోత్సాహాలకు అంతులేదు. ద్యుమత్సేనునికి చూపు వచ్చింది. కోల్పోయిన రాజ్యం వచ్చింది. అందరూ సావిత్రి మహిమను అనుభూతించారు.

మహాసమాధి నుండి సావిత్రి మేల్కొన్నది. అంతవరకు భూదేవి ఒడిలో మైమరచి నిద్రించినట్లుంది. సుషుప్తిని తమ నీడల్లో జోకొడుతున్న చెట్లు, కొమ్మలు ఆమె పైన వాలి ఉన్నాయి. ఆపైన గగనతలాన నీలిరెక్కలు విప్పుకున్న పారవశ్యం. కొమ్మకొమ్మన, రెమ్మరెమ్మన ఆనందతాండవం. అరణ్యాల మార్మిక రహస్యాలు వెదకడం కోసం ఆకుల పరదాల నుండి వెలుగులు సరదాగా తొంగిచూస్తున్నాయి. ఆకాశంలో వాడి తగ్గిన సూర్యకిరణాలు, పలచబడుతున్న కాంతులు సాయంత్రపు ప్రశాంతిని లోకానికి అందిస్తున్నాయి.

సత్యవంతుని శరీరాన్ని ఆమె స్పృశించింది. ఆమె శరీరం పులకించింది. సత్యవంతుని తన గుండెకు హత్తుకుని పరవశించింది. ఆ స్పర్శలోని వెచ్చదనం

జీవనాడుల్ని శ్రుతిచేసింది. ఆమె సర్వస్వం అతనిలో చైతన్యంగా మారింది. పరిష్వంగంలో ఆమె తనువు పులకించింది.

సమాధిస్థితిలో పొందే అతీంద్రియ సుఖం వేరు. ఇంద్రియ సుఖం వేరు. ఆ పారవశ్యం వేరు. ఈ పారవశ్యం వేరు. తానిప్పుడు మామూలు సావిత్రి. తనలో మార్పును గుర్తించింది. తన ఆత్మ సంపాదించిన మహాశక్తిని ఈ భూమి భరించలేదు. ఆమె హృదయం నింపుకున్న ఆనందాన్ని స్వర్గం భరించలేదు. అది స్వర్గాన్ని మించింది. ఇప్పుడు ఆమెలో ఊహించని తేజస్సు. అవధుల్లేని అనురాగం. ప్రాపంచిక స్పందనలు మనోవీధులలో వెలుగులైనాయి. ఆత్మానందం సాగరమైంది. లోకంలోని పవిత్రత అంతా ఆమె పరమైంది. ఆమె దివ్యత్వానికి మరింత ఉద్దీపన కలిగించింది. అద్భుత ప్రశాంతి ఆమె లోచనాలలో ఘనీభవించింది. కాలంలో, స్థితిలో నెలకొన్న మహత్తులు ఆమె వైనాయి. ఆమె ఆనందానికి సృష్టి, స్థితి, లయలు లేవు. విశాల విశ్వం యావత్తు ఆమెకు ఆనందమందిరమైంది.

ఆమె ఆత్మ దిగంతాలను దాటి యుగాలను క్షణాలుగా మార్చుకున్నది. రోదసిలో అవి కాంతిశలాకలైనాయి. శాంతి పావురం రెక్కలు విప్పి ఎగిరిపోతున్నది. ఇప్పుడామె సర్వ స్వతంత్రురాలు. అనంతానికి సుందరాకృతి. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు ఆమె ఊపిరులు కావు. భవిష్యత్తును ఆమె అనుభవిస్తున్నది. గతం సైతం ఆమె అనుభూతికి అందుతున్నది.

ఆమె జీవితం మానవజాతికి మహోదయం. అది విజయానికి ఆరంభం. గతం, భవిష్యత్తు ఆమెలో కలపోసుకున్నాయి. నిన్నలో కలిసిపోయే నేడు రేవును ఆహ్వానిస్తుంది. అన్నీ ఆమె దృష్టికి పారదర్శక చిత్రాలు. ఆత్మానందంలో కొంతసేపు మంత్రముగ్ధలా నిలిచి చైతన్యానుభూతి చెందింది. అర్ధనిమీలిత నేత్రాలతో చుట్టూ పరికించింది. గత కాలపు మాధుర్య మమతానుబంధాలను, అనుభవాలను, జ్ఞాపకాలను మూటగట్టి ఒక సుదినంగా మార్చివేసుకుంది.

సత్యవంతునికి అది స్వర్గంగా ఉంది. ఆమె పరిష్వంగం స్వర్గసుఖానుభూతి నిస్తోంది. జీవుడు ఇహ పరాల మధ్య తూగినట్లు, పసిబిడ్డ ఊయల ఊగుతున్నట్లు అతను భావాతీత సమాధిలో మైమరచాడు. ఆమె అతని పైకి వంగి, తన స్పర్శతో భౌతిక చైతన్యం కలిగించింది. మూసుకుని ఉన్న అతని కనురెప్పల్ని ముద్దాడింది. తన కంటివెలుగును అతని కళ్లలోకి బదిలీచేసింది. అది మార్మికచర్య. కేవలం ప్రేమ ప్రాసాదనంగా నిర్వహించే దివ్యకార్యం అది.

ఆ స్పర్శలో వాంఛ లేదు. ఆలింగనంలో ఆరాటం లేదు – ఆరాధన తప్ప. ఆమెలో ఆకాశపు టంచుల్ని దాటి స్వర్గం వైపుగా ప్రసరిస్తున్న కాంతి కిరణాలు, స్వర్గం నుండి భూమికి దిగివచ్చిన దివ్యత్వం నేల నాలుగు చెరగుల పరచుకున్నట్లు తోచింది. అంతటా నిశ్శబ్దం, నిగూఢం, నిస్సంగత్వం. ఆమె స్పర్శతో అతని మైకం వదిలింది. తాను మరణించిన జ్ఞాపకం ఉంది. ఆమె స్పర్శతో తను పునర్జీ వితుడైన అనుభూతి మిగిలింది. ఆమె వల్లనే తను తిరిగి భూలోకంలోకి వచ్చాడు. తన సర్వస్వం అయిన సావిత్రిని మనసా అభినందించాడు. జీవన లాలస వారిని సన్నిహితం చేసింది. గతాన్ని స్మరిస్తూ వణికే పెదవులతో అస్పష్టంగా పలవరించాడు.

"సావిత్రీ! నా మమతా సుధాపూర్ణ కాంతిమతీ! తేజస్వినీ! నీ కాంతికవాటాలు తెరచి, ప్రేమబంధంతో ముడివేసి నన్ను తిరిగి తెచ్చుకున్నావా! నీవు నా ఆత్మవు, అనురాగ దేవతవు, అర్ధాంగివి. నేను ఎన్నో కొత్తలోకాలు చూచాను. నాకు తోడుగా నీ ఆత్మ పయనించింది. ఇద్దరం కలిసి ఎన్నో చీకటి దారులు దాటిపోయాం. ఎన్నో ఆనందాలు, స్వర్గాలు నా ముందర పరచుకున్నాయి. నీవు లేని ఆ స్వర్గాలు, సుఖాలు నాకు అవసరం లేదు దేవీ!

"ఏదీ? ఆ భయంకర మృత్యువు ఏమైంది? నీకూ నాకూ మధ్య ఆ భయంకర నిశ్శబ్దంలో శూన్యంలో ఉన్నది మృత్యువే అనిపించింది. అదేనా మృత్యువు? ఆ మహాశూన్యమే మృత్యువా? నీ శక్తిని శంకించిన ఆ మృత్యువు ఎక్కడ?

"నా మనస్సులో వెలిగింది పరంజ్యోతి తేజస్సు కాదు కదూ! దివ్య తేజస్సుపై చీకట్లు ముసురుతాయా? జీవుడు మృత్యుసాగరంపై పయనించి తీరాలా? విధి నడిపించే ఇరుకుబాటలలో నలుగుతూ, కుములుతూ, వెలుగుబాటకై ఆక్రోశించ వలసిందేనా? ఆత్మ ఎల్లకాలం సాహసంతో ప్రయోగాలు చేస్తుండ వలసిందేనా? ఆత్మ పరమాత్మ నుండి వేరై జీవిగా పరిణమించింది కదా!

సావిత్రి అన్నది : "మన వియోగమే ఒక స్వప్నం సత్యా! నీవు, నేనూ ఎప్పుడూ కలిసే ఉంటాం. మనం కలిసే జీవిస్తాం. చూడు! మన పరిసరాలు, వాతావరణం ఏవీ మారలేదు. మన ఆశ్రమం, అరణ్యం, చెట్లు చేమలు, వన సౌందర్యాలు అన్నీ అలాగే ఉన్నాయి. ఆకాశం నీలంగానే ఉంది. ప్రకృతి ప్రశాంతంగానే ఉంది కదా! మన జీవితాలపై భగవంతుడు విసిరిన చీకటి పరదా తొలగిపోయింది. మన ఆత్మలు మృత్యువును చీకటిలోకి నెట్టివేశాయి. ఒక మహాస్వప్నం వాస్తవం అయ్యే ప్రమాదం తప్పిపోయింది. పరప్రజ్ఞ అడ్డుపడ్డది. జీవకోటికి పరాకాష్ట అయిన ఆత్మ స్వతంత్రమై ఈశ్వరుని ఎదుట నిలబడింది".

వారివి పరమానందభరితమైన హృదయాలు. సత్యవంతుని హృదయంలో నూతనోల్లాసం, అతని కన్నులలో కొత్త ఆరాధన కదలాడాయి.

"సావిత్రీ! నీవు ఎంత మారి పోయావు! ఇంతటి ఉజ్వల పరిణామం ఎలా సాధ్యమైంది? అపూర్వ తేజస్సుతో దేవకాంతవలె భాసిస్తున్నావు. నిన్ను మరింత సుందరం చేసి స్వర్గం నాకు బహూకరించింది. నా ఆరాధన మహోన్నతమై, నాలో వాంఛ పొగిలి, నిన్ను నా కౌగిలిలో చేర్చుకోవాలని తొందర నా తనువు, మనస్సు, ఆత్మ అన్నీ నీ ఆరాధనకే ననిపిస్తోంది. నా ఆత్మాలయంలో నీవు నిశ్చల, నిర్మల దేవేరివి. నాలో నెలకొన్న దేవతవు నీవు. నీవు నా భౌతికావస రాలకు వాంఛించనంత ఎత్తుకు ఎదిగావు. కాలం నీ పాదాల చెంత విశ్రమిస్తున్నది. ప్రపంచం అంతా నీలో అంతర్భాగమే. నీ సన్నిధి చాలు నాకు స్వర్గరుచులు అనుభవించడానికి. నీ కళ్లలో నాకు నక్షత్ర దీప్తులు కనిపిస్తున్నాయి. నీవు నా ఆత్మ రక్షణ కోసమే ఇక్కడ ఉన్నావనిపిస్తుంది.

"నీ స్వాప్నిక భావనలో ఒక స్పందన నా జీవితం. నీ ఆత్మ రెక్కల కొసమెరుపులే నా జీవనోషస్సులు, దివారాత్రుల సౌందర్యాలు నీ స్వంతం. నా హృదయాన్ని, అనురాగాన్ని నీ వెంట తీసుకువెళ్లావు. మహానిశ్శబ్దం నుండి, గాఢ సుషుప్తి నుండి లేచిన నాకు, నీ కోసమే నేను మళ్లీ బ్రతికినట్లు తెలిసింది. నీ వలన నా జీవనవలయం విస్తరించింది. నా జీవన రేఖ పొడవుగా సాగింది. ఏ విశ్వశ్రేయస్సు కోసమో నీవీ సాహసం చేశావనిపిస్తుంది. మానవ లోకానికి బ్రహ్మానందాన్ని అనుగ్రహించు. నీ ద్వారా నా జీవితాన్ని ఒక దివ్య గీతంగా మార్చు. నా తపస్సు, ధ్యానం, ధారణ అన్నీ నీకే అంకితం దేవీ!".

సావిత్రి అతని విన్నపాలు ఆలకించింది. అతనికి ప్రేమగా పాదాభివందనం చేసింది. పరదా కప్పినట్లు ఆమె నీలి కుంతలాలు అతని పాదాలను స్పృశించాయి. వీణానిక్వాణం వలె ఆమె మధురంగా పలికింది –

"కాలం ఇప్పుడు ఎంతో మారింది. కాని ఎప్పటి వలె కనిపిస్తున్నది. మనం పరమాత్మను దర్శించాం. మన జీవితాలు దివ్యత్వంతో నిండిపోయాయి. మనం పరబ్రహ్మాతో సారూప్యం చెందాం. మన జీవిత పరమార్థం గ్రహించాం. బ్రహ్మానుభూతి చెందిన మన జీవితాలు ఉదాత్తమైనాయి. దివ్య సంకల్పం ఏదో గ్రహించాం. భౌతిక ప్రేమబంధం వల్ల మనం కోల్పోయేది ఏమీ లేదు. దివ్యస్పర్శ వల్ల ప్రాపంచిక జీవనానికి మరింత పూర్ణత్వం లభిస్తుంది కానీ తగ్గదు. మన

శరీరాలు ఒకదానికొకటి ఆలంబనాలు. మనలో ఎలాంటి దివ్యస్ఫూర్తి కలుగుతుందో గమనించు. ప్రేమానురాగాలతో మన జీవితాలు పునీతమైనాయి.

"నాడు అపరాహ్నవేళ, మహారణ్యంలోకి నిన్ను వెతుకుతూ వచ్చిన మద్ర రాకుమారిని నేను. ఆనాడు నేను ఏమిటో, నేడూ నీకు అంతే. నీ ఆశల, ఆశయాల, అనురాగాల పల్లకిని. నా అయిష్టాలను సైతం నీ కోసం ఇష్టాలుగా మార్చుకున్నాను. మన జీవితంలో మిగిలినవన్నీ మధురిమలే. నీవు నా సర్వస్వం అయినట్లే నేనూ నీకు సర్వస్వం అయినాను. నీ ఆత్మకు ఆరాధనీయను, చెలిమి కత్తెను నేను. నా ప్రపంచమే నీవు. నేను కోరుతున్నది ఈ ప్రపంచాన్ని. నా ఆలోచన కోరేది స్వర్గాన్ని. నేనుండేది నేలపైన – ఆరాధించేది పరమాత్మను.

"నీ శరీరం నా శరీరానికి మరొక రూపం. నీలో రగిలే ప్రతివాంఛ నాలోనూ రగులుతుంది. నా హృదయ స్పందనలన్నీ నీ హృదయవీణ పలికించినవే సత్యా! నాకు నీవు–నీకు నేను.... వెరసి ఇద్దరం ఒక్కటే. మన ప్రణయజీవితాన్ని సరికొత్తగా ప్రారంభిద్దాం. మనం ఏ ఆనందాలూ, సుఖాలూ కోల్పోనవసరం లేదు. మనదైన ఈ ప్రపంచంలో మనంగా పయనిద్దాం. ఇది పరమాత్మ నెలవు. మానవులలో, పశుపక్ష్యాదులలో ఉన్నదీ పరమాత్మే. అనురాగంతో మనిషి తనను గుర్తిస్తాడు. ఆ ఈశ్వరత్వమే జీవితాల్ని నడిపిస్తుంది. బాధలలోనూ బ్రహ్మానందం పొందవచ్చు.

"సత్యా! ఆత్మ దర్శన ముహూర్తంలో మనం ఒకరి నొకరం గుర్తించాం. సాయంసంధ్య సమీపిస్తున్నది. పద, మన ఆశ్రమానికి చేరుదాం. ఇంక మన జీవితాలకు భయం లేదు, దిగులు లేదు. అంతా ఆనందమయమే. మనం అనుభవించవలసిన జీవితం అంతా ముందే ఉన్నది. ఓహో! లోకం ఎంత అద్భుతంగా, సుందరంగా ఉంది! మానవ జీవితం ఎంత మధురం సత్యా! మనం పొందే ఆనందం అందరికీ పంచిపెడదాం. మన ఆత్మలు ఇక్కడ అవతరించింది మన స్వార్థం కోసం కాదు. మన ఆత్మలు అరూప, అవ్యక్త పరమాత్మ నుండి వేరైనది, అగోచర, అఖండ, నిర్వికల్ప స్థితి నుండి దిగి వచ్చింది, అస్థిరమైన భూమిపైన అవతరించింది, అనేక మార్గాలలో అన్వేషణ సాగిస్తున్నదీ స్వార్థం కోసమో స్వప్రయోజనం కోసమో కాదు. ఈ రెండు సమిధలు రగిలి ఒక మహాగ్నిని సృష్టించాలి. మన రెండు కిరణాలు జతపడి ఒక కొత్త వెలుగును అందించాలి.

"మనం జన్మించింది మానవాత్మను సత్యంవైపు పరబ్రహ్మాదిశగా నడిపించడానికి. అస్థిరంగా ఉన్న మానవ జీవన ప్రణాళికను ఈశ్వరపథంలోకి త్రిప్పడానికి,

పరమాత్మకు సన్నిహితం చేయడానికి, దివ్యజీవనం దిశగా మనిషిని నడిపించడానికి".

అతని తలను తన గుండెకు అదిమిపట్టి జీవయాత్రలోనూ అంత తమకంగా పయనించాలన్న భావన వ్యక్త పరిచింది. కొంతసేపు ఇరువురు రాగబంధంలో పరవశించారు. గాఢాలింగనాలు, చుంబనాలతో అలసిపోయారు. ఆత్మలు పెనవేసుకున్నాయి. రెండు శరీరాలు, రెండు ఆత్మలుగా ఒక్కటై ఆనందతాండవం చేశాయి. చేయి చేయి కలిపి నిర్జనారణ్యాలను దాటి వచ్చారు. వారిలో అవ్యక్త వాంఛలు రగిలాయి. ఆశ్రమం దిశగా నడక సాగించారు. మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు నడుస్తూనే ఉన్నారు. వెలుగులు పడమటి తీరాలకు చేరాయి.

చెట్ల నీడల్లో చీకట్లు ప్రవేశిస్తున్నాయి. చీకటికి వారి అడుగుల సవ్వడులు వినవస్తున్నాయి. దూరం నుండి కోలాహలం వినిపించింది. చాలాకాలంగా దూరమైన కోలాహలం అది. అరణ్యశాంతిని ఆ సవ్వడి భంగపరుస్తోంది. చిరకాలంగా నిర్జనంగా, ప్రశాంతంగా ఉన్న అరణ్యప్రాంతం జనఘోషకు మేల్కొన్నది. ముసురుతున్న చీకట్లు నిశ్శబ్దాన్ని చీల్చుకు వస్తున్న జనసముదాయం. ఉరుకులతో, పరుగులతో వచ్చి కట్టెదుట నిలిచింది. వారి చేతుల్లో కాగడాలు. దీపాల వెనుక ఆనంద కళికలైన జనాలు.

అందరిలో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. అందులో ఎన్నో కొత్త ముఖాలు కనిపించాయి. జలతారు తలపాగాల వారు, పట్టుధోవతుల వారు, ఆభరణాలు, భుజకీర్తులు ధరించిన వారు, వందలాది మంది వారికి ఎదురైనారు. వేల చూపులు వారిని చుట్టుముట్టాయి. ధవళవస్త్రధారులైన రాజపురోహితులు ఆశీర్వచనాలు పలుకుతున్నారు. కరవాలాలు ధరించిన వీరులు స్వాగతం చెప్పారు. అశ్వికులు వందనం చేశారు. వారి మధ్య రాచఠీవి ఉట్టిపడుతున్న ద్యుమత్సేనుడు. ఇప్పుడాయన అంధుడు కాదు. ఆయన కళ్లు పూర్వపు కాంతుల్ని తిరిగి పొందాయి. బాహ్యప్రపంచాన్ని చూడగలుగుతున్నాడు. మహారాజదర్పంతో నడుస్తున్నాడు ద్యుమత్సేనుడు, ఆయన ప్రక్కన మహారాణి. ఆమెలో ఇప్పుడు నిరాశ లేదు ... కన్నబిడ్డ కొరకు ఆత్రుత తప్ప. వయోభారంతో వడలినట్లు కనిపించినా, పూర్వపు ఔన్నత్యం ఆమెలో తొంగిచూస్తున్నది. చీకటిలోకి జారిపోయిన వెలుగు రేపటి ఉషోదయం కోసం ఎదురుచూస్తుంది. ఆమెలో అంతరిస్తున్న సౌందర్యప్రభ రేపటి నవ మహోదయానికి సంకేతం. దూరంగా రెండు సుందర రూపాల కదలిక ఆమెకు ఉత్తేజం కలిగించింది. వృద్ధ దంపతులు పరుగున బిడ్డను చేరారు. వానికి

జన్మనిచ్చిన రాగానుబంధం వారిది. అది జన్మ బంధం. ఆనందంగా సత్యవంతుని ఆలింగనం చేసుకున్నారు.

ద్యుమత్సేనుడు వాత్సల్యంతో కన్నబిడ్డను పలకరించాడు.

"భగవంతుడు మన మొర ఆలకించాడు. దైవకృప వల్ల పోయిన రాజ్యం చేతికి వచ్చింది. నీవు ఎక్కడ ఉన్నదీ తెలియక విలవిల్లాడిపోయాం. ఈ కీకారణ్యంలో నీకు ఏమీ ప్రమాదం కలగలేదు కదా? నిన్ను చూడని ఈ నా కళ్లకు చూపెందుకు? నిన్ను చూడడానికే నేను చూపు ఆశించాను. సావిత్రీ! ఈ అదృష్టం నాది కాదు, నీది. మాకు రాజ్యం, రాజభోగాలు, సంపదలు వద్దు. మీరు మా సమక్షంలో ఉంటే అంతే చాలు. అదే పదివేలు. మిమ్మల్ని చూసు కుంటూ శేషజీవితం గడపడం మాకిష్టం."

సత్యవంతుడు నిండు హృదయంతో సమాధానం చెప్పాడు –

"నాన్నా, సర్వశుభాలకు కారకురాలు తను. సావిత్రి తన ఆత్మశక్తి చేతనే నన్ను బ్రతికించుకుంది. మొన్న మధ్యాహ్నం ఆశ్రమం వదలి వెళ్లి ఎన్నెన్నో పరసీమలలో పర్యటించాం. అయినా నేను తనకు ఆత్మబందీని. ఈ నేల, ఈ గాలి దాటి సూర్యకాంతి మండలాలలో తిరిగాం. సృష్టి రహస్యాలు చవిచూచాం."

అందరి చూపు సావిత్రి పైకి మళ్లింది. సిగ్గుతో ఆమె చెక్కిళ్లు ఎర్రనైనాయి. తలవంచి, మోహనవంశి అయింది. అందరిలో ఒకే భావం కదిలింది.

"దివినుండి దిగివచ్చిన దేవత ఈమె. మానవమాత్రుడైన సత్యవంతుని సరసన చేరింది. అసుర సంధ్యలో వెలుగుతున్న మణిదీపిక ఈమె. ఈమెకై లోకం ఎదురుచూస్తున్నది. ఇప్పుడు ఏ మహత్తర సంఘటన జరిగినా ఆశ్చర్యం లేదు. ఎన్నో అద్భుతాలను, మహత్తులను సృష్టించగల అద్భుతశక్తి ఈమెకున్నది".

ఒక పురోహితుడు ముందుకు వచ్చి నిలబడ్డాడు. అతనిలో ఒక మహర్షి సత్తముడు ఉన్నాడు – "అమ్మా! ఆత్మ స్వరూపిణీ! నీలో ఎంతటి తేజస్సు! ఎంతటి శక్తి! ఒక్క రోజులో ఎన్ని అద్భుతాలు జరిగాయి. ఈ రోజు నవయుగానికి నాంది తల్లీ".

ఆమె కనురెప్పలెత్తి చూచినప్పుడు ఎన్నో కాంతి ప్రవాహాలు, మరెన్నో దివ్యచిత్రాలు కదలాడసాగాయి. అవే అందరికి ఆనందాన్ని పంచిపెట్టాయి. ఆమె ముందు వారంతా పసివారు. ఆమె అందరికి మాతృదేవత. వారందరి ఆత్మలు,

జీవితాలు వస్తుతః ఆమెవే. కాంతి జాలు వారినట్లు ఆమె సమాధానం చెప్పింది:

"మహాత్మా! నా మనస్సు చూపిన బాటలో పయనించి ప్రేమతో జీవించాలని, ప్రేమే జీవితంగా మారాలని ఆశించాను. ప్రేమతో లోకాన్ని మార్చగలనని భావించాను. అదే నేను కోరుకున్న సత్యం".

ఆమె దివ్యరూపాన్ని తలపోస్తూ, ఆమె అమృతవాక్కులు నెమరువేస్తూ అందరు నగరాభిముఖులైనారు. అన్ని బంధాలు, అవరోధాలు తొలగించుకుని ముందుకు నడవసాగారు. ఆమె చూపిన బాటలే వారికి మార్గాలు. అందరూ నగరం ప్రవేశించారు.

నగరంలో జనం కలకలం, అడుగుల సవ్వడి, మానవ సంచారం, నిశి ప్రశాంతికి భంగం కలిగింది. పురజనుల కోలాహలం సాగర తరంగఘోష అయింది. రథం అంతఃపురం వైపుగా సాగింది. శ్వేతాశ్వాలు పూన్చిన రథం పైన సావిత్రీ సత్యవంతులు ఒకే రూపంగా దర్శనమిచ్చారు.

దివిటీల వెలుగులు చీకటిలో మిణుకుమన్నాయి. అది పెళ్లి ఊరేగింపులా ఉంది. కళ్యాణగీతికలు ఆలపించారు. వారి కొరకు మానవ ప్రపంచం నిరీక్షిస్తున్నది. ఆకాశం నిండుగా నక్షత్రాలు పరుచుకుని తొంగిచూడసాగాయి. ఆ చీకటి రాత్రి వెలుగు దారుల్ని చూపించాయి నక్షత్రాలు. కొంతసేపటికి చీకటి అంతరించింది. ఆకాశంలో పూర్ణచంద్రుడు రాజ్యం చేయసాగాడు. ఆ వెన్నెల వాడలో అంతా ప్రశాంతి, ఆత్మశాంతి. చైతన్యసమాధిలో కదలిన భావంలా రథం కదులుతోంది. అది మార్మికతత్వం వెనుక సురక్షితంగా ఉంది. ఆమె హృదయంలో ఒక ఉషస్సు!



35. లోకాలోకనం

పతంజలి మహర్షి తన 'యోగసూత్రాలు'లో వర్ణించారు ఊర్ధ్వ లోకాలు, అధోలోకాలు అవి ఏడు, ఇవి ఏడు. చతుర్దశ భువనాలు. ఊర్ధ్వలోకాలు – భూలోకం, భువర్లోకం, మహేంద్రలోకం, మహర్లోకం, జ్ఞానలోకం, తపోలోకం, సత్యలోకం – నరకలోకం నుండి మేరువు వరకు: నరలోకం లేదా భూలోకం, మేరువు నుండి ధ్రువ నక్షత్రం వరకు భువర్లోకం లేదా అంతరిక్షం. ఆపైది దేవలోకం, లేదా మహేంద్రలోకం. ఆ తర్వాతది మహర్లోకం. మన ప్రపంచాన్ని సృష్టించి నడుపుతున్నది మహర్లోకమే. ఆపైవి బ్రహ్మలోకాలు. అవి జ్ఞానలోకం, తపోలోకం, సత్యలోకం.

క్రిందివి ఏడు లోకాలు – మహాతల, రసాతల, అతల, సుతల, వితల, తలాతల, పాతాళ లోకాలు. ఇవే నరక లోకాలేమో. నరకాలు : మహాకాల, అంబరీష, రౌరవ, మహారౌరవ, కాలసూత్ర, అంధ తమిస్ర. శ్రీ అరవిందులు వర్ణించిన వాటికి, వీటికి పోలికలు ఉండవచ్చు. లేకపోవచ్చు. విశ్లేషించడం కష్టం.

అశ్వపతి యోగి. భౌతికబంధాలు త్రెంచుకుని ప్రాపంచిక వాసనల నుండి విడివడి, ఆత్మ లోకాలను చేరుకున్నాడు. అక్కడ లోకాలు, విశ్వాలు, సృష్టి అనుభవంలోకి వచ్చాయి. ఆత్మ దర్శనమైంది. సృష్టి రహస్యం తెలిసింది. వైరుధ్యాలన్నీ ప్రేమలో కరిగిపోయాయి. బాధలు, ఆనందాలు ఆత్మ చుట్టూ సుడులు తిరిగాయి. ఆయన ఊహలు, భావాలు, కల్పనలు అన్నీ వాస్తవరూపం ధరించాయి. నిర్గుణ పరబ్రహ్మకు నిర్వచనం లభించింది.

జాగృతమైన ఆత్మ అన్ని లోకాలను దర్శించగలదు. తానే కేంద్రం కాగలదు. తానే వలయం కాగలదు. భౌతిక ప్రపంచపు జయాపజయాలకు అక్కడ విలువ ఉండదు. అన్ని బంధాలు త్రెంచుకుని ముందుకు పోవాలి. ఇటు నరకాలు, అటు సత్యలోకాలు ...... ఆత్మకు రెండూ సమానమే. మనిషి విధికి కట్టుబడి ఉండనవసరం లేదు. విధిని దాటిపోవచ్చు. కర్మలను జయించవచ్చు. ఋషి అయినవాడు పరలోకాలను సులభంగా చేరగలడు.

తాను ఒంటరిగా సర్వం గమనిస్తూ పైకి పోతున్నాడు. తన చుట్టూ శూన్యం అనంతంగా వ్యాపించి ఉంది. ఆపైన అంతా అగమ్యం, అగోచరం. భౌతిక నేత్రాలకు అక్కడ ఏమీ కనిపించదు. మనస్సుతో గ్రహించలేనిదాన్ని గ్రహించగలిగాడు. మనిషిగా ఎప్పటికీ చేయలేని పనుల్ని అక్కడ సులభంగా చేయవచ్చు. అక్కడ అపరిమితమైన కాంతి ...స్పందన అపరిమితం. భూమి అస్తిత్వానికి ఆవల అంతా ఆనందస్థితి. మన భావాలకు, స్వప్నాలకు మూలమైన సుస్థితి. అది ఆత్మ ప్రయోగాలకు అనువైన వాతావరణం. అన్నింటికి ఆస్పద మైనది మూల ప్రకృతి. పరమాత్మ సంకల్పంతో సృష్టి జరుగుతుంది.

అంతర్దృష్టికి నిరవధికంగా సాగే సృష్టి కార్యం తెలుస్తుంది. విశ్వరహస్యాలు తెలుస్తాయి. విశ్వసృష్టికి సైతం లక్ష అవరోధాలు ఏర్పడ్డాయి. చిత్రమైన శక్తులు నిరోధించగా, వాటిని దాటడానికి యుక్తులు అవసరమైనాయి. విశ్వంలోని ఆకృతులన్నీ సత్యానికి ప్రతీకలే. అన్నీ స్వతంత్ర శక్తికి ధర్మసూత్రాలే. జీవశక్తి అన్ని జీవుల లోకి సమంగా చేరుతుంది. అదే ఆనందాలను, ఆలోచనలను కలిగిస్తుంది.

మహత్తర ప్రశాంతిలో కాలం కదలదు. కదలికలేని కాలంలో ప్రమోదం కదిలి విశ్వరూపశక్తి సృష్టికి పూనుకుంది. అందులో ఆనందం, విషాదం మిళితమై మిశ్రమ సంఘటనలుగా మారాయి. పరాశక్తి సంకల్పం అద్భుత సుందర విశ్వంగా రూపుదిద్దుకున్నది. బాధలు సైతం ఆత్మకు ఆనంద కారకాలే. అన్ని అనుభవాలు, అనుభూతులు ఒకే పథకంలోకి వస్తాయి. అన్నీ ఏకైక పరమాత్మకు అసంఖ్యాకమైన వ్యక్తీకరణలు.

సర్వం పరమాత్మ చెంతకు చేరవలసిందే. ఏదీ జ్ఞానదృష్టికి అందకుండా పోదు. పరమాత్మ అనుమతి లేనిది ఆయనను చేరదు. సర్వప్రాణులలో చరించే పరమాత్మ ఒక్కడే. దివ్యచైతన్యంతో కదిలేవన్నీ సాధురూపాలు. జనన మరణాలకు, క్షీణ లయలకు లోబడినవన్నీ జనన మరణాలకు అతీతమైన పరమాత్మ కృతులే. విశ్వాత్మ సంకల్పించిన భావనలు రూపాలు ధరించి, జీవులుగా మారుతుంటాయి.

అవి ఆకృతి ధరించిన పరమాత్మ భావనలు కనుక వాటి లక్ష్యం, దృష్టి ఎప్పుడూ పరమాత్మపైనే ఉంటుంది.

విశ్వరచన వివిధరూపాలలో, కోణాలలో సాగుతుంది. ఆ రూపాలే దివ్యత్వానికి ద్వారాలు తెరుస్తాయి. మనిషి అంతర్దృష్టికి అవి పూర్వ పరిచితాలు. ఆత్మకు, సత్యానికి అవి సంకేతాలు. నిరాకార బ్రహ్మత్వానికి అవి సజీవ రూపాలు. అవి అన్నీ అతనికి (ఆత్మకు) సన్నిహితమైనాయి, సహచరులైనాయి. జాగృతమైన మేధకు అలసట ఉండదు. పరమాత్మతో సంబంధం ఎప్పుడూ ఆధ్యాత్మికమే! ఆయన ఆత్మను అసంఖ్యాక సంకేతాలు, జీవస్వరాలు పరివేష్టించసాగాయి. నరక లోకాలు శ్వాసించిన స్వప్నాలవి, స్వాప్నిక భావాలవి. వాటిని ఇక్కడ అనుభూతించ గలిగితే మనిషి కర్మలు, పాపాలు అక్కడ రద్దయిపోతాయి. ప్రాపంచిక బలహీనతలు, అశక్తతలు చిరకాలం ఉండవు. ప్రతి ఆత్మ అక్కడ దివ్యస్థితిని పొందవలసి ఉంటుంది.

జీవాత్మ... అంటే ఆత్మ జీవునితో కలిసి ఉన్నంతకాలం ఒక వాతావరణాన్ని కల్పించుకుంటుంది. నిజానికి జీవుడు చేసే పనులతో ఆత్మకు సంబంధం ఉండదు. ఆత్మకు పాపాలు అంటవు. ఆత్మ ఎప్పుడూ దివ్య పథాలలో ఉన్నత శిఖరాలను చేరాలని కాంక్షిస్తుంది. తనపైకి ఎన్ని క్షుద్రశక్తులు దాడి జరిపినా, ఆత్మ చెక్కు చెదరదు, మొక్కవోదు. ఆత్మ చైతన్యం తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరై అవే పారిపోతాయి. వాటి ప్రయత్నాలు, లక్ష్యాలు, గమ్యాలు చెదిరి నిర్వీర్యమవుతాయి. అవి మొరపెట్టుకున్నా, మోసం చేసినా, మాయ చేసినా అంతా నిష్ప్రయోజనమే.

సామాన్యమేధ గ్రహించలేనివి, మానవదృష్టికి గోచరించనివి అక్కడ ఊర్ధ్వ మేధ గ్రహిస్తుంది. అంతర్దృష్టికి గోచరిస్తుంది. అలౌకిక విషయాలు అరూప దృశ్యాలు, హృదయానికి, అనుభూతికి అందుతాయి. అవి ప్రకృతి ద్వారం ద్వారా జీవుని లోపలకు ప్రవేశిస్తాయి. భౌతిక శరీరం లేకపోతే మనస్సు ఉండదు! అవి ప్రవేశించ వలసింది మనస్సులో. అవి మనస్సు నిండా ముసురుకుంటాయి. యోగి ఆత్మ దర్శనం వల్ల అనేక సిద్ధులను, మహత్తులను పొందగలడు.

అద్భుత శక్తులు, సిద్ధులు యోగికి అయాచితంగా లభిస్తాయి. అవి ఆధ్యాత్మిక జీవితానికి సోపానాలు. కాలావధుల్ని దాటి యోగి కాలం పైకి చూడగలడు. అతీంద్రియ ప్రజ్ఞకు సృష్టి సమస్తం అతి సన్నిహితం. అతీంద్రియ ప్రజ్ఞ ప్రాపంచిక విషయాలలోనూ ప్రవేశిస్తుంది, మనిషి ఆలోచనలకు పదును పెడుతుంది, సత్యస్ఫూర్తి కలిగిస్తుంది. యోగి ఆత్మ సహజంగా మహత్వ పూర్ణమవుతుంది.

పరబ్రహ్మ సంకల్పమే జగత్సర్వం. సృష్టిలోని ఆనందాలకు, అద్భుతాలకు అంతం లేదు, అవధి ఉండదు. ఆత్మీయత అనంత సౌందర్యాలను చూపిస్తుంది. కాలంలో అనుక్షణం ఈశ్వర స్పందనను అనుభూతించవచ్చు. కాలరహితమైన శబ్దం ఏదీ చెవికి సోకదు. ప్రణవనాదంలో ఈశ్వరతత్వం అవగతమవుతుంది. అన్ని భావాలకు మూలం సంకల్పం ... సంకల్పానికి మూలం ఆత్మ. ఆత్మశక్తి ఒక బిందువుపై కేంద్రీకృత మైనప్పుడు అన్ని అసమానతలు తొలగిపోతాయి. యోగి బ్రహ్మత్వం పొందుతాడు. అన్ని సంకేతాలకు ఒక్కటే వివరణ. అగోచర పరమాత్మకు అవ్యక్తమే సూటిబాట. అదే దిక్సూచి.

అద్భుతమైన కాంతి ప్రవాహానికి సంకల్పంతో వారధి నిర్మించి ఆవలి తీరం చేరాడు. అక్కడ లోకాలు విచిత్రంగా ఉన్నాయి. కనిపించినంత మేర, శూన్యంలో అసంఖ్యాకంగా కదులుతున్న కాంతి గోళాలు. పరమాత్మ దర్శనానికి పరుగులు తీస్తున్నట్లున్నాయి. ఈశ్వర సన్నిధికి చేరాలన్న తపన అది. బ్రహ్మత్వం సిద్ధించడానికి నూరు అంతస్తులు ఎదగాలి. ఉన్నత శిఖరాలపైన నిలిచిపోకుండా ప్రశాంత చైతన్యం దాటి శూన్యంలోకి చేరాలి. స్వర్గారోహణంలో ఎన్నో దివ్య మండలాలు దాటాలి. ఎన్నో సోపానాలు అధిరోహించాలి. అక్కడ మానవాత్మ నిజావాసం ఉంటుంది. అది పరబ్రహ్మకై ఆత్మ కల్పించుకున్న రూప మందిరం.

ఆత్మ భావించిన రూపంలోనే పరమాత్మ కనిపిస్తుంది. ఆత్మ సంభావించి నట్లు పరమాత్మ పలుకు వినిపిస్తుంది. ఆత్మ స్వప్రయత్నంతో విశ్వకేంద్రానికి చేరగలదు. నిశ్చల ప్రశాంతిలో ముందుకు పోయి భూలోకానికి పరలోకాలకు మధ్య ఉన్న తెరల్ని తొలగించగలదు. పరమాత్మను చేరుకునే మార్గాలు అనేకం ఉన్నాయి. యోగ సాధకులందరూ ఆశించే బ్రహ్మానందం ఒక్కటే. లోకంలో మనం పొందలేని సంపదలు, సుఖాలు పరం మనకు అందిస్తుంది. తర్వాత తిరిగి ఇక్కడకే పంపుతుంది. మనం నేలపైన జీవిస్తున్నా, మన జీవితాలపై సర్వహక్కులు పరమాత్మవే. అది ఈ మహావిశ్వానికి సమగ్ర లఘుకోశం. మొదటి అంతస్తుకు జీవుడు చేరడమే కష్టం.

ఆత్మలు అందుకోవలసిన లోకాలు, దాటవలసిన అంతస్తులు అన్నీ మనలో సంక్షిప్తరూపంలో ఉంటాయి. సృష్టి యావత్తు మనలో సూక్ష్మరూపంలో ఉంటుంది. ఇక్కడ మన లోపల ఉన్నదే అక్కడ బ్రహ్మాండంలో ఉంటుంది. అది ప్రకృతికి అనుగుణంగా కదులుతూ భౌతికత మత్తు నుండి మనల్ని మేల్కొల్పుతుంది. అదే మనకు ఆలోచించడం, అనుభవించడం, ఆనందించడం నేర్పుతుంది. మనల్ని ఇంద్రియాతీతం చేసి దివ్యత్వం కలిగించేది అదే. మన మేధకు పరబ్రహ్మను

పరిచయం చేస్తుంది. ఈ శరీరాన్ని మహదాశయాలకు భూమిక చేస్తుంది. శరీరం మృతి చెందగానే అమరత్వం అందిస్తుంది.

నిశ్చల సమాధి స్థితిలో మనం శరీర స్పృహ, బాహ్య స్మృతి కోల్పోయినపుడు, జీవుడు మహాతేజస్సు వైపుగా పయనిస్తాడు. విశ్వమంతా తానై, తానే విశ్వం అన్న అనుభూతి కలుగుతుంది. ఆ తర్వాత ఆరాధన, బ్రహ్మానందం వేరువేరుగా ఉండవు. అంతా ఆత్మోన్మీలనమే. కేవలం భౌతికదృశ్యాలు, రూపాలు ప్రకృతిని, మనస్సును స్పృశిస్తాయి. నిస్తేజమైన భౌతికశక్తి జగత్తుకు అవసరం. మనిషికి చైతన్యం వరం. చైతన్యం వల్లనే మనిషి తనకు మించిన ఆలోచన చేస్తుంటాడు. కాని జీవునికి కావలసింది పారలౌకిక ప్రజ్ఞ. మనిషి పరాన్ని అన్వేషించడానికి కారణం పారలౌకిక ప్రజ్ఞ. అదే మనల్ని భౌతిక బంధాల నుండి విముక్తం చేసి, ఆత్మ చైతన్యం కలిగిస్తుంది.

చైతన్య లోకాలన్నీ దివ్య సంకేతాలే. దేవతలు, వారి ప్రభావాలు, వారి కార్యక్రమాలు ఏవీ మనం ఊహించలేం. భౌతిక ప్రజ్ఞకు అందని సత్యాలవి. అందుకే అవి అవ్యక్తాలయినాయి. అవి మన అంతరంగాన్ని కాస్తకాస్త బయట పెడుతుంటాయి.

మన ప్రయత్నాలన్నీ ఆత్మాభివృద్ధికి సోపానాలే. భౌతిక బంధాల నుండి కాస్త కాస్త విముక్తి కలిగిస్తాయి. పరమ పథంలో ఆత్మ ముందుకు సాగిన కొద్దీ మనం ప్రకృతిని వదలి పరమాత్మకు దగ్గరవుతుంటాం. ఒక్కసారి మృత్యురహిత వలయంలో ప్రవేశిస్తే, అన్ని భయాలు తొలగిపోతాయి. చివరిదైన మృత్యుభయం కూడా ఉండదు. ఒక్క ప్రయత్నంతోనే దివ్యత్వం అందుకోగలిగిన వారి జీవితం పరబ్రహ్మకు నెలవవుతుంది.

పరాశక్తి, ఎంతో ఉదారంగా తన మహత్తును మనకు పంచియిచ్చింది. లోకంలోని విషాదం, జడత్వం తాను గ్రహించి, తన దివ్యత్వం కొంత త్యాగం చేసింది. మనలో ద్వంద్వానికి అదే అసలు కారణం. జగన్మాత రూపకల్పనే మన భౌతిక జీవనం. మహాసృష్టిలో మన ప్రపంచం ఒక చిన్న శకలం. పైలోకాల లోనే దివ్యప్రజ్ఞ విశేషంగా విస్తరిస్తుంది. మన అజాగ్రత్త వల్ల, అలక్ష్యం వల్ల ఆ ప్రజ్ఞ చేజారిపోతుంది. పరలోకాలలోని ఆత్మలు, జీవులు అన్నీ పరమాత్మ అధీనంలోనే ఉంటాయి. ఆ జీవుల జ్ఞాపకాల ఒత్తిడికి పరమాత్మ స్పందిస్తుంది. పైలోకాలలోని జీవులకు పూర్వ స్మృతులు పుష్కలంగా ఉంటాయి. మరచిపోవడం జరగదు.

అసంతుష్ట వాంఛలు హృదయాన్ని కలతపెట్టినా సంకల్పసాధన అవి మనకు

తోడై మనం సాధించే దివ్యత్వానికి అండగా నిలుస్తాయి. జగన్మాత విధించే శిక్షలే జనన మరణాలు. జీవులన్నీ ఆమె విధించే శిక్షలు ఆమోదిస్తాయి. సృష్టి నడవడానికి ఆమె శక్తిని జీవులలో ప్రవేశపెడుతుంది. ప్రపంచానికి తన ప్రమేయమే లేదన్న భావన కలిగిస్తుంది. కాని మనిషి అంతరంగం జగన్మాత శక్తిని ఆమోదిస్తుంది. బ్రహ్మాండమైన ఈ సృష్టి నిరాడంబరంగా ప్రారంభమైంది. మనిషి ఆత్మవిచారణ నిరాడంబరంగానే ప్రారంభమవుతుంది. ఇంతవరకు లోకంలో సంపూర్ణకృషి జరగలేదు. అందుకే జగన్మాత మనకు సంపూర్ణంగా అవగాహన కాదు. ఆమె రూపలావణ్యాలు మనకు అర్థం కావు. కాని ఆమె ఔన్నత్య ప్రభలు మన హృదయంలో ఎప్పుడూ తళుక్కుమని మెరుస్తుంటాయి.

వేటికి అవిగా, అస్తవ్యస్తంగా ఉన్న జీవశకలాలు కడకు చేరవలసిన గమ్యం చేరతాయి. ఆ దివ్యమూర్తి మహస్సు మన నిబంధనల్లో ఒదగదు. పరమ లక్ష్యం ఎప్పుడో తెలుస్తుంది. అప్పుడు జ్ఞానదృష్టి అలవడుతుంది. అన్ని లోకాలను దర్శించవీలైన చిత్రపటలం ఆత్మ. అది దేవతామూర్తులు సంచరించే తావు. ప్రకృతికి దూరంగా పరమాత్మ పనిచేస్తుంది. అక్కడ చైతన్యం మహాశూన్యాన్ని నింపివేస్తుంది. ఆత్మతో కలిసిన జీవుడు మానవుడు. మనిషి కాలానికి వెనుక, ముందు ఉండగలడు. అనంతత్వాన్ని సాధించగలది మానవుడే. ఒక చిన్న శకలం అనంతత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ఒక్క వ్యక్తి మొత్తం దివ్యత్వాన్ని అందుకోగలడు. విశ్వం పరిణామం చెందినప్పుడు అసంభవం సంభవమవుతుంది.

మొదట ఏర్పడ్డది నిరామయంగా ఉన్న భూమి. అది ఒకప్పుడు శూన్యం, నిరాశ్రయం, నిర్గుణం. ఆ శూన్యంలో జీవతత్వం ప్రవేశించింది. పూర్ణత్వం, శూన్యత ఒకచెట్టు కొమ్మకు విరిసినవే. శూన్యం, పూర్ణం కలయిక వల్ల ప్రతికూలత ఏర్పడ్డది. ఆ రాపిడి వల్ల, ఘర్షణ వల్ల, జీవం ఏర్పడ్డది. జీవస్పందన కలిగింది. రూపాలలో పరమాత్మ ప్రవేశం జరిగింది. జీవరూపాలన్నింటి లక్ష్యం కడకు పరమాత్మను చేరుకోవడమే.

శూన్యం తిరోగమించసాగింది. అంటే శూన్యంలో సృష్టి ప్రారంభమైంది. ఏదో ప్రాణవాయువు అగ్నిని రగిల్చింది. అగ్నిలో వాయువు కాలి, కరిగి, తిరిగి ఘనీభవించినప్పుడు గోళాలు ఏర్పడసాగాయి. భూగోళంపై భగవంతునికి ప్రేమ పుట్టుకొచ్చింది. ఆయన పాదస్పర్శ ఇక్కడ సోకింది. భగవంతుని ప్రేమ వల్లనే భూమి చుట్టూవున్న చీకటిని చీల్చుకుని వెలుగు ప్రభవించింది. మనిషికి మేధ ఏర్పడ్డది. భగవంతుడు తన ప్రజ్ఞను మనిషిలో ప్రవేశపెట్టడం వల్లనే మనిషి ఆలోచించసాగాడు. సదా భగవంతుని గురించి ఆలోచిస్తున్నాడు. మానవరూపం భగవంతునికి అనురూపమైంది.

ఒక అంధమహాశక్తి ప్రపంచాన్ని సృష్టించింది. జడ ప్రపంచంలో ఈశ్వర సంకల్పం ప్రవేశించింది. ఒకానొక ప్రాణకళ జీవికి ఆధారమైంది. భూమిపైన చీకటి మూలలకు పరమాత్మ దృష్టి ప్రసరించదు. పవిత్రమైన చోట్లా ఈశ్వర ప్రభావం తక్కువగానే ఉంటుంది. ఒక్క అతీంద్రియస్థితిలోనే పరమాత్మ నిజతత్వం గ్రహించ వీలవుతుంది. సృష్టి రహస్యం కోసం అన్వేషణ సాగేది ఆ చైతన్యంలోనే.

రోదసి ఒక భయానక వాయుసాగరం. అందులో ఎన్నో సుడులున్నాయి. ఒక సుడిగుండం నుండి ఆత్మ లేచి వచ్చింది. ఆత్మ మనిషిలో స్పృశించగానే మేధ ఏర్పడ్డది. మేధ దివ్యత్వం గురించి కలలు కనటం మొదలుపెట్టింది. మేధ పరమాత్మ అనే మహాద్భుత ప్రజ్ఞ ఒకటి ఉన్నట్లు గ్రహించింది. జీవికి మూలమైనది పరమాత్మ అని గుర్తించింది. ఒక్క అణువులో బ్రహ్మాండం ఇమిడి ఉన్నదన్న స్పృహ కలిగింది. విశ్వవిజ్ఞానం యావత్తు మనిషిలో సంక్షిప్తమై ఉన్నదన్న గ్రహింపు కలిగింది. ఈ చిన్న మానవ శరీరమే బ్రహ్మానికి ఆవాసమని, బ్రహ్మాండానికి హ్రస్వరూపమని తెలిసింది. సృష్టి మహాద్భుతాన్ని అనుభవించాలన్నా, అనుభూతించాలన్నా మానవశరీరం అవసరం. అందుకే ఆత్మలు మానవ జన్మకు రావడానికి తొందర పడతాయి.

ఋషి ఆత్మతో విశ్వ రహస్యాలను గ్రహించినా వాటిని ప్రాపంచిక విషయాల చాటున దాచి ఉంచుతాడు. కానీ, సాటి మనిషిని సమున్నత శిఖరాలపైకి చేరుస్తాడు. జన్మల నుండి కర్మ విముక్తి కలగడానికి వీలుగా ఆధ్యాత్మికతను అందిస్తాడు. పరమాత్మపిలుపు సకాలంలో నేరుగా జీవునికి వినిపిస్తుంది. ప్రశాంత సీమలలో జీవుడు ఒంటరిగానే పయనిస్తాడు. అతనికి అండ, ఆధారం తన ఆత్మశక్తి ఒక్కటే. తాను విశ్వానికి ప్రతినిధి కాక తప్పదు.

యోగికి ఆధారం నిశ్చలత్వం. అఖండ తేజస్సులోకి వెళ్లిన కొద్దీ యోగి అనుభవించేది శూన్యత, ఆత్మ తేజం. ఆ పురోగమనం ఇంతకాలమనే నియమం ఉండదు. ఒక లోకం తర్వాత మరొక లోకం. ఒక దానిని మించింది మరొకటి. యోగి భౌతిక శరీరం గురించి పూర్తిగా మరచిపోయి ఆత్మశరీరిగా మిగులుతాడు. ఒకదాని తర్వాత ఒకటిగా పరలోక శక్తులను అతని ఆత్మ పొందుతుంది. ఒక స్వర్గం తర్వాత మరొక స్వర్గం. అన్నీ ఆనందసీమలే. అన్నీ రసార్ణవాలే. అయినా మరేదో బలమైన శక్తి ఆత్మను పైకి ఆకర్షిస్తుంది.

ఆ సోపానాలు ఒంటరిగానే అధిరోహిస్తూ పైకి చేరాలి. అదృశ్యంగా అగోచరంలో గమ్యం లేని చోట గవేషణ అది.

36. సూక్ష్మలోకాలు

మనం చూడగలిగింది చూస్తున్నది స్థూలప్రపంచం. సూక్ష్మ ప్రపంచం కంటికి కనిపించని సూక్ష్మ పదార్థంతో తయారైంది. సూక్ష్మ లోకంలో ప్రవేశించడం యోగంలో రెండవ దశ. అక్కడ ఉండేవారివి యాస్ట్రల్ శరీరాలు వారు దివ్య శరీరులు. అది శక్తికి స్థావరం. మహత్తులకు కేంద్రం. యాస్ట్రల్ పవర్స్ అతీంద్రియ శక్తులు లభించేది సూక్ష్మలోకం ప్రవేశించినప్పుడు, సూక్ష్మ శరీరం పొందినప్పుడు. సాధకునికి అనేక అవరోధాలు ఏర్పడుతుంటాయి. కొంత అపజయమూ తప్పదు. నిగ్రహించుకుని ముందుకు సాగితే దివ్యత్వం అందుకోవడం అసాధ్యం కాదు. యోగికి ఆశ, నిరాశ రెండూ కూడదు. కొంతవరకే మనస్సు సహకరిస్తుంది. ఆ తర్వాత ఆ మనస్సే నిరోధిస్తుంది. లోపల యోగాగ్ని రగిలి చప్పగా చల్లారిపోతుంది. అది ఒక విచిత్రమైన స్థితి. అప్పుడు మనస్సును వదలి భగవంతునికి సర్వ సమర్పణ చేసుకున్న వారికి అవరోధాలు ఏర్పడవు. దూరాన ఉన్న దివ్యతేజస్సు క్రమంగా దగ్గరవుతుంది. కొంత కాలం అజ్ఞానం ప్రగతికి అవరోధమవుతుంది. జ్ఞానం సైతం కాళ్లకు బంధాలు వేస్తుంది. ఆర్జించుకున్నది జ్ఞానం కాదు ... అనుభవంలో సంపాదించుకున్నది జ్ఞానం. అజ్ఞానం ఎంత బాధ కలిగిస్తుందో అపరిమిత జ్ఞానం అంతకంటే ఎక్కువ అవరోధాలు కలిగిస్తుంది. అందుకే జ్ఞానాజ్ఞాన భూమిక అయిన మనస్సును దాటిపోవడం అవసరం.

అది అగోచరం, అయినా అతీంద్రియ గోచరం. జీవుడు తనకు ఆలంబనగా ఉన్న భౌతిక శరీరం, భౌతిక స్పృహ, జ్ఞానం వదులుకున్నప్పుడు నిర్మలమైన సూక్ష్మలోకాన్ని చేరగలడు. అక్కడ ఎవరికీ భౌతిక శరీరాలు ఉండవు. అక్కడి వెలుగులో కనిపిస్తారు సూక్ష్మశరీరులు. వారంతా దివ్య పురుషులు.

సృష్టిలో అదొక మహాద్భుత ఘట్టం. సూక్ష్మలోకంలో ప్రవేశించడం అందరికీ సాధ్యం కాదు. ఉన్నతమైన తపస్సు చేసినవారు, భౌతిక శరీరాలను సజీవంగా

ప్రపంచంలో వదిలి సూక్ష్మ శరీరాలతో ఆ సూక్ష్మలోకం చేరగలరు. అది అత్యంత సుందర లోకం. అక్కడ సురుచిర రూపాలను, జీవులను దర్శించవచ్చు. అన్నీ వాస్తవం అనిపిస్తాయి. ఆ వెలుగు లోకంలో మన సంకల్పాలు కొత్త ద్వారాలు తెరుస్తాయి. అక్కడి సంగీత ఋతాలు, అనుభవాలు ఆత్మకు అపరిమితశక్తి నిస్తాయి.

అది అధిభౌతిక జీవులకు ఆవాసం. అది పరమాత్మ అధీనంలోని తొలిలోకం. జగన్మాతశక్తి ప్రతిఒక్కరిలోను కనిపిస్తుంది. అక్కడి శక్తుల్ని అందుకోవడం కష్టం. వాటిని జయించడం అసంభవం. అక్కడ కాలమే అన్నింటినీ నిర్ణయిస్తుంది. జరగబోయేవన్నీ ముందే నిర్ణయమవుతాయి. అక్కడ 'అన్నీ' 'కామ్యం' వల్ల రూపుదిద్దుకుంటాయి. అందరూ కామరూపులే. మనస్సు కల్పించే చిక్కుముడుల వల్ల మనిషి ఒక జీవితకాలంలో పూర్ణత్వం పొందలేడు. ప్రాపంచిక వాసనలు, భావనలు లేని నిర్మలలోకం అది.

అస్థిరమైన వాటికి అక్కడ మనుగడ ఉండదు. రానున్నవి జ్ఞానసూచికలవుతాయి. ప్రతి పనికి పర్యవసానం ముందే తెలుస్తుంది. ఆ సూక్ష్మలోకంలో ఆత్మ ప్రవేశించకుండా ముందు కొన్ని దివ్య వాసనలు నిరోధిస్తాయి. పెనుగాలులు ఆత్మను అతలాకుతలం చేసి దూరంగా తరిమివేస్తాయి. ఆ బంగారులోకం కనిపించకుండా మబ్బులు కమ్ముతాయి. మనస్సు పనిచేసినంతకాలం ఆ అవరోధాలుంటాయి. తర్వాత ఒక కాంతి కిరణం పరానికి మార్గం చూపిస్తుంది. ఆ వెలుగు కిరణం వెంట సూక్ష్మలోకం ప్రవేశించాలి. అప్పుడు ఆకాశం నుండి అమృతం వర్షించినంత తృప్తి కలుగుతుంది.

ఒక దివ్యభావన ఆత్మకు అండగా ఉండి ముందుకు నడిపిస్తుంది. అది ప్రకృతి అవరోధాలను దాటిన తర్వాతనే మనకు దగ్గరగా వస్తుంది. అది మన శరీరం నుండి, మనస్సు నుండి ఆత్మను వేరుపరుస్తుంది. అది ఒక స్వప్నంలా వచ్చి తెర తొలగించి దివ్యత్వానికి అర్థం చెబుతుంది. అంతర్దృష్టి ఏర్పడటానికి బాహ్య ప్రజ్ఞను కోల్పోవలసిందే. దివ్యచైతన్యాన్ని భౌతికంగా భరించలేం. ఆత్మ స్వతంత్రం కావాలి. పరమాత్మ స్పందన కలిగినప్పుడు మాత్రమే ఆత్మ స్వతంత్రిస్తుంది. దివ్యత్వానికి తొలిపాదం దివ్యస్పందన.

దివ్యచైతన్యం మనకు ప్రసాదించే శక్తులు అన్నీ పరమాత్మ అనుగ్రహ చిహ్నాలే. అవి ఈశ్వరీయతకు నమూనాలు. అవి మహాద్భుతాల తొలి మెరుపులు. దివ్య పరిమళాలు. అవి మొదట కాలవృక్షం పైన స్వప్నపత్రాలుగా వికసించి

తర్వాత మన లోకంలోకి వస్తాయి. మనం లోకంలో అనుభవించేవన్నీ వాటి ప్రతిరూపాలే. దేనినైనా ముందుగా హృదయం ఆహ్వానిస్తుంది. దానిని మనస్సు గ్రహిస్తుంది. మనస్సు సృష్టించేవి ఆలోచనలు. ఆలోచనలోకి వచ్చేసరికి వాటి మౌలికత, ఉదాత్తత కొంత తగ్గిపోతుంది. దివ్యత్వం వదలి భౌతికతను ఆశ్రయించిన ప్రతిది సహజత్వాన్ని కొంత కోల్పోతుంది. ఈ ప్రపంచంలో మనం చూచే సుందర రూపాలకు శుద్ధ ప్రతులు సూక్ష్మలోకంలో ఉంటాయి. ఇక్కడ మనం అనుభవించే సుఖాలు, ఆనందాలు, సౌందర్యాలు అన్నీ నకిలీలే అవుతాయి. మానవమేధ స్వప్నించలేని మహత్తర రూపాలు అక్కడివి.

సూక్ష్మలోకంలోని సుందర కృతులకు భూలోకంలో దీటైన ప్రతికృతులుండవు. మౌలిక సౌందర్యాలు మన అంతర్ నేత్రంలో మెరుపులవలె మెరుస్తాయి. వాటి దివ్యత్వం మన హృదయాలను రంజింపచేస్తుంది. మనలో రసస్పందన కలిగిస్తుంది. దివ్య చైతన్యస్ఫూర్తి కలిగిస్తుంది. ఆ అద్భుతలోకం మన ఆత్మలు మెట్టే తొలి స్వర్గం. అది స్వర్గం అయినా, కాకపోయినా ఆత్మ ప్రవేశించే మొదటి సూక్ష్మలోకం అది. అక్కడ నుండి ఆత్మకు అనుభవాలు మొదలవుతాయి. ఆత్మ అనుభూతించడం మొదలవుతుంది. అక్కడ ప్రతిదీ అద్భుతమే. పాతకొత్తలు అక్కడ కలిసిపోయి దివ్యావిష్కరణ జరుగుతుంది. ఆత్మకు సత్యస్ఫూర్తి కలుగుతుంది.

స్వర్గ శిఖరాలపై అన్నీ అపూర్వ సౌందర్యాలే కనిపిస్తాయి. జ్ఞాననేత్రం ఏర్పడడం వల్ల దివ్యజ్ఞానం కలుగుతుంది. దివ్యలోకాల్ని దర్శించే అర్హత కలుగుతుంది. అది మార్మికలోకం. అక్కడ రహస్య మందిరాంతర్భాగాలలో పదార్థ, పరార్థ, చైతన్య సమ్మేళనం జరుగుతుంది. భౌతికమైనదంతా దివ్యంగా మారుతుంది. ఆ కలయిక అనురాగంతో జరుగుతుంది. కనుక అది మహోన్నతం, మాధుర్య భరితం అవుతుంది. ఆ రెంటి సంయోగంలో మహాశక్తి ఆధ్యాత్మిక శక్తిగా మారుతుంది. ఆనందం వెల్లివిరుస్తుంది. ఆ సంయోగం యోగ సాధనాఫలం కనుక ఇహ, పర లోకాలను సంధాన పరుస్తుంది.

ప్రతి ఆత్మ అరూపస్థితి నుండి అనంతం నుండి మానవజన్మకు రావడానికి తహతహలాడుతుంది. తనకు అనుకూలమైన శరీరాన్ని ఎన్నుకుని మాతృగర్భంలో ప్రవేశిస్తుంది. శిశోదయ వేళ ఆత్మకు భౌతిక వాసన లుండవు. జనన మరణాల స్పృహ పోతుంది. ప్రతి ఆత్మ తనదైన దివ్యత్వాన్ని పైలోకాలలో వదలి, నగ్నంగా శిశుహృదయంలో ప్రవేశిస్తుంది. జీవునితో కలిసిన ఆత్మకు అమరత్వ భావన మాత్రం లోపల ఉంటుంది. గతాన్ని మరచిపోతుంది. తానొక భౌతిక శరీరాన్ని

ఆశ్రయించిన భావన మాత్రం ఆత్మకు ఉంటుంది. అంచేత కాలంతో పయనిస్తున్నా, కాలానికి అతీతంగా ఆలోచిస్తుంది. తిరిగి తన స్వస్థితికి చేరాలని ప్రయత్నం చేస్తుంది. అందువల్లనే మనిషికి అప్పుడప్పుడు ఆత్మ సంబంధమైన ఆలోచన కలుగుతుంది. జిజ్ఞాస కలుగుతుంది. భౌతిక వాంఛలు, బాధ్యతలు జిజ్ఞాసను వెనక్కు లాగుతాయి. మనస్సు అటు ఆత్మకు, ఇటు భౌతిక శరీరానికి సమానంగా విలువ యిస్తుంది, సేవ చేస్తుంది. అనేక రూపాల్ని తయారుచేసి పెడుతుంది. భౌతిక శరీరాలు పొందలేని సుఖాలు ఇక్కడ ఆత్మ శరీరాలు సంపూర్ణంగా అనుభవిస్తాయి. ప్రపంచంలో వాస్తవం అనుకునే వాటిని సూక్ష్మలోకం మరింత వాస్తవం, సహజం, సముజ్వలం చేస్తుంది.

బరువైన భౌతిక శరీరాన్ని వదిలిన ఆత్మ విముక్తి చెంది, తేలికగా ఊర్ధ్వ లోకాలకు ఎగిరిపోతుంది. దివ్య వాతావరణం సోకగానే పరవశం చెంది, తను ఆశ్రయించిన భౌతిక శరీరాన్ని, భౌతిక ప్రపంచాన్ని అలక్ష్యం చేస్తుంది. భౌతిక శరీరాన్ని అంటిపెట్టుకున్న వాంఛలు, వాసనలు అక్కడే ఉండిపోతాయి. ఆత్మ వాటిని తన వెంట తీసుకుపోదు. ప్రాపంచికమైన కట్టడులు, కట్టుబాట్లు ఆత్మను బంధించవు, బాధించవు, నిరోధించవు. ఆత్మ నెమ్మదిగా ఒక్కొక్క లోకాన్ని దాటుకుంటూ పైకిపోతుంది. శూన్యంలో తేజోశిఖరాలపైకి చేరినప్పుడు ఆత్మ నిర్మలంగా, ఏకాంతంగా మిగులుతుంది. తాను పరమాత్మ పారదర్శక వలువలు దర్శిస్తుంది. పరమాత్మ అయినా భూమిపైన అవతరించినప్పుడు తన అనంతత్వాన్ని పైన వదిలి ఇక్కడ భౌతికమైన బరువులు మోయకతప్పదు. ఆత్మ తిరిగి వెళ్లినప్పుడు జీవునికి కర్మశేషం పెరుగుతుంది. జన్మభారం మిగులుతుంది. నిజానికి ఆత్మకు జీవుని కర్మలతో సంబంధం ఉండదు. జీవునితో కలిసివున్నా, శరీరం నుండి నిష్క్రమించినా ఆత్మకు ఏ వాసనలు అంటవు.

భౌతిక శరీరాన్ని వదలిన జీవం అన్ని ప్రాపంచిక బంధాలు, వాసనలు వదులుకుని శూన్యంలో ప్రవేశిస్తుంది. జీవునికి స్త్రీ, పురుష భేదం లేదు. అది తన ప్రకాశంతో ఒక కాంతిరూపాన్ని సంతరించుకుని, మిగిలిన జీవులతో కలిసిపోతుంది. అక్కడి వెలుగుతోనే జీవులు సూక్ష్మలోకాలను ఏర్పరచుకుంటాయి. అవి తేజోమండలాలు, శక్తిపూర్ణాలు, మహత్వపూర్ణాలు. అవి ఎంత ఆనంద నిలయాలుగా, స్వర్గాలుగా ఉన్నా, జీవుని సంకల్పం మేరకు వాటి రూపురేఖలు, విలువలు మారుతుంటాయి.

సూక్ష్మలోకాల శిఖరాలకు ఆవల నరకం ఉంటుంది. నరకాల వెలుగులు

స్వర్గం చివరి నుండి ప్రపంచం అంచుల వరకు పరచుకుని ఉంటాయి. నరకాల ఆకర్షణ, అందచందాలు స్వర్గానికి ఏ మాత్రం తక్కువైనవి కావు. నరకంలోని అధిదేవతల అందచందాలకు, ఆకర్షణకు జీవుడు ఆకర్షితుడవుతాడు. స్వర్గాన్ని కాదనుకుని నరకంలోకి పరుగుతీస్తాడు. అక్కడ మాయతెరల్లో జీవుడు బందీ అవుతాడు. అక్కడా అంతా అమరత్వమే కనిపిస్తుంది. కానీ మోసంతో మృత్యువు జీవునిపై వల వేస్తుంది. ఆ వలలో తగుల్కొనడమే నరకం. అక్కడ నుండి బయటపడాలన్న ఆలోచన జీవునికి కలగదు.

ఈ తొలి సూక్ష్మలోకంలోనే మానవప్రజ్ఞకు అగ్ని పరీక్ష ఎదురవుతుంది. ఆత్మ తనలో దాచుకున్న దివ్యప్రజ్ఞ బయటపెట్టవలసింది అక్కడే, అప్పుడే. ఇటు భౌతిక లోకాలకు అటు దివ్యలోకాలకు మధ్యన ఉండే సూక్ష్మలోకం అది. జీవుడు పైనున్న స్వర్గాలకు వెళ్లడమో, నరకాలకు వెళ్లడమో, తిరిగి భూమిపైన అవతరించడమో అక్కడే నిర్ణయమవుతుంది. అదే త్రిశంకుస్వర్గం. అదీ స్వర్గంలాగే కనిపిస్తుంది కానీ అది స్వర్గం కాదు. అక్కడ నుండి చూస్తే అటు నరకం, ఇటు భూమి, పైకిచూస్తే స్వర్గాలు కనిపిస్తాయి. అది జీవుని భూమిక. చలన రూపాలు, అచల రూపాలు అక్కడ ఉంటాయి. నశించేది, నశించనిది అక్కడే కలుస్తాయి. ఆత్మశక్తిని కాపాడుకోలేనప్పుడు జీవుడు పతనం చెంది, అటు నరకాన్నో ఇటు పునర్జన్మనో కోరడం జరుగుతుంది. మనిషి జ్ఞానం, వివేకం అక్కడ ప్రజ్ఞగా మారి సహాయపడాలి. ఆత్మ సహకరించనిది ప్రజ్ఞ పనిచేయదు. అందుకే ఆత్మ సంస్కారం అవసరం.

ఎంత ఘోర తపస్సు చేసినా దివ్యశక్తులు, మహాశక్తులు ఎవరికి పూర్తిగా లభించవు. ఆ శక్తులు మనిషికి అవసరం లేదు. అంతర్దృష్టికి మాత్రం ఆ శక్తులు తెలుస్తుంటాయి. కొన్ని వెలుగులు కనిపిస్తాయి. అవి మహాతేజస్సుకు చెందిన వెలుగులు. ఆ దివ్యతేజస్సును భూమి భరించలేదు. ఆత్మశక్తి వల్ల కొంత మహత్తు ఏర్పడుతుంది. ఆ కాస్త శక్తితోనే, మహత్తుతోనే మనిషి తప్పులు చేస్తాడు. అభ్యుదయానికి బదులు పతనం ప్రారంభమవుతుంది. మన భౌతికవాంఛలు కారణంగానే ఆత్మ సౌందర్యం మసకబారుతుంది. మనం సత్యాలను తెలుసుకో గలం. దివ్యరూపాలను దర్శించగలం. కాని అవి మన అజ్ఞానం వల్ల మనలో నిలవడం లేదు. మనిషి పతనం కావడమే ప్రపంచానికి అవసరం.

అంధశూన్యంలో పరమాత్మ ప్రవేశం సృష్టికి అవకాశం కలిగించింది. పతనమైన ప్రపంచం ఆత్మలకు ఆవాసయోగ్యమైంది. ప్రతి ఆత్మలోనూ కొంత

దివ్యత్వం దాగి ఉంటుంది. శూన్యంలో పరమాత్మ, పరమాత్మ సంకల్పంతో జీవం ఏర్పడ్డది. జీవస్పందనకు చైతన్యం కారణమైంది. సృష్టి అంతా సంకల్పమే. పతనమై జడంగా, అంధకారంగా ఉన్న భూగోళం జీవి ప్రవేశంతో చైతన్యం పొందింది. నిద్రావస్థలో ఉన్న భూమి మేల్కొన్నది. పరమాత్మకు అప్పుడు సృష్టించాలన్న సంకల్పం కలిగింది. ప్రతిజీవి జన్మకు రాక మునుపు మరణంతో స్నేహం చేస్తుంది. అది ప్రకృతి వైచిత్రి.

పరమాత్మ సంకల్పం వల్ల లోకం ఏర్పడ్డది. కనుక, స్వర్గంలాంటి దానిని ఆలోకన చేశాడు. అందుకే భూమికి స్వర్గానికి పోలికలుంటాయి. విధి భూమి పుట్టక ముందే మరణశాసనం రాసి పెట్టింది. భూమిపైన జన్మించేవన్నీ మరణించక తప్పదని శాసనం. ఇక్కడ సౌందర్యం, ఆనందం సైతం అంతరించి పోవలసిందే. ఏదీ శాశ్వతం కాకూడదు. శాశ్వతమైనదంతా స్వర్గ లోకాలకే పరిమితమైంది. అక్కడ ఉన్న ఆత్మలే ఇక్కడ శరీరాలు తొడుక్కుని, కొత్తగా సుఖాలను, కష్టాలను అనుభవిస్తుంటాయి. విరక్తి కలిగి, విసుగు పుట్టి, మరణించి, తిరిగి స్వర్గసీమలకు చేరతాయి.

భూమిపైన అవతరించిన ఆత్మ తనలో మిగుల్చుకున్న దివ్య స్పృహను ఉపయోగించి, శూన్యం నుండి పూర్ణత్వం కొరకు పాటుపడుతుంది. పరాశక్తి సైతం ఇక్కడ క్షుద్రశక్తుల చాటున దాగి ఉంటుంది. ఇక్కడ అల్పశక్తులదే పైచేయిగా ఉంటుంది. మనిషిని తీర్చిదిద్దడంలో ప్రకృతి సహకరిస్తుంది. దేవతలు సైతం చేయలేని మహత్కార్యాన్ని మనిషి నిర్వహించగలడు. అదే ఈశ్వర లీల.

మానవ జీవితం మృత్యువు శాసనానికి లోబడి కొనసాగుతుంది. అయినా జీవితంలో కొంత దివ్యత్వం ఉంటుంది. చైతన్యం పొందిన ఆత్మ ఆ దివ్యత్వాన్ని కాపాడుకుంటుంది. కోల్పోయిన జ్ఞానాన్ని తిరిగిపొందడానికి మేధ కొంతవరకు సహకరిస్తుంది. మనిషి ప్రకృతి నియమాలు అతిక్రమించక పోయినా, ఆత్మ స్వతంత్రించి, ప్రకృతిలో తలమానిక మవుతుంది. ఆత్మశక్తి ఒక్కటే ప్రకృతిని జయించగలదు.

మనిషి జీవితం ఒక దివ్యప్రబంధం. మహత్తరమైన ఆత్మ, పరమాత్మల మైత్రీబంధమే జీవితం. ప్రపంచం అసమగ్రం అయినా, మన జీవితాలు స్వల్పం అయినా, సుఖాలు క్షణికమైనా మన ప్రయత్నం కాలాన్ని ఛేదించి ముందుకు పోవడం, మూలస్థితికి చేరడం. సుస్థిరమైన పరమాత్మను చేరడమే ప్రతి ఆత్మకు లక్ష్యం. మానవరూపాలతో ఉండి పూర్ణత్వం సాధించడం, ప్రాపంచిక విషయాలలో

దివ్యత్వం అనుభవించడం మానవ లక్ష్యం. ఇక్కడ దివ్యజీవన సూత్రం అదే. పూర్ణమానవ తత్వం అదే. దివ్యత్వంలోని ఏ కొంత భాగం మనకు అందినా చాలు, పూర్ణత్వాన్ని సాధించగలం. పూర్ణ మానవుని లక్ష్యం ఉత్తమ లోకాలు కాదు, స్వర్గ సుఖాలు కాదు – ఇక్కడ ఈ ప్రపంచంలోనే దివ్యత్వం సాధించి పూర్ణమానవుడుగా, అధిమానవుడుగా రూపాంతరం చెందడం.

మానవజీవితం అశాశ్వతమని, అల్పమని ఒక నిరాశలో జీవిస్తుంటాం. ఈ నశ్వరమైన రూపంలోనే ఒక దివ్యజ్యోతి వెలుగుతుందని, ఇక్కడనే ఒక దివ్యమార్గం ఏర్పడుతుందని గ్రహించం. దివ్యమార్గంలో పయనిస్తే అది మేధను ఛేదించి ఒక మహాశక్తిని, మహాతేజస్సును మనకు అందిస్తుంది. అప్పుడు భౌతికమైన ప్రతిబంధాలు, ప్రాపంచికమైన అవరోధాలు తొలగిపోతాయి. మన ఎదుటనున్న చీకట్లు ప్రిదిలిపోతాయి. సృష్టికి మూలమైన మహాశక్తిని, మనం, ఈ శరీరంతోనే పొందగలం, అనుభవించగలం.

అప్పుడు మన జీవితం నిండా దివ్యానుభూతి పరచుకుంటుంది. మార్మిక స్పందనలు, అనుభూతులు నిత్యం కలుగుతుంటాయి. మనలోని ప్రతి అణువు చైతన్యంతో స్పందిస్తుంది, పులకిస్తుంది. హృదయం ఆనందంతో తాండవిస్తుంది. దివ్య పరిమళాలు గుబాళిస్తాయి. పరమాత్మ నుండి మహాశక్తి మనలోకి అప్రతిహతంగా ప్రవహిస్తుంది. పరమాత్మ సందేశాలు నిత్యనూతనాలుగా, నవ్యసత్యాలుగా మనకు అనుక్షణం అందుతుంటాయి.

మనిషి శరీరం దివ్యత్వాన్ని అందుకునే తీరులో తయారు కాలేదు. నిర్మాణంలోని లోపాల వలన మనిషి ఎంత తపస్సు చేసినా పూర్ణత్వం పొందలేక పోతున్నాడు. మధ్యలోనే శరీరం కృశించి, మనస్సు మందగించి, ఆత్మ నీరస పడుతోంది. శరీరం స్పందించదు. దివ్యత్వం అంతరిస్తుంది. తనలోని శక్తి అదృశ్యమవుతుంది. మనలో ఒక్క దివ్యస్ఫూర్తి మాత్రం మిగులుతుంది. లోకం కొన్ని భ్రమల్ని కలిగిస్తోంది. పరం అనుమానాస్పదమవుతోంది. ఆశించింది సగం మాత్రమే పొందగలుగుతున్నాం. నిజానికి ఈ లోకంలో మనం చేసే పనులన్నీ స్వర్గానికి ప్రతికృతులు. అసలు తెలియకుండా మనం నకిలీ ఆనందాలు పొందుతున్నాం. ఆత్మ దర్శించిన రూపాలపై మాయ ముసుగువేయదు. అవి ఈశ్వర తేజస్సు పొంది తేజస్వంతంగా ఉండిపోతాయి.

పరమాత్మ ప్రపంచాన్ని సగం పూర్తి చేసి వదిలేశాడు. మిగిలిన సగం పని పూర్తి అయితేనే పూర్ణత్వం సాధ్యం. ఏ దివ్యశక్తులు, పరాశక్తులు పూర్ణంగా

పనిచేయడం లేదు. అవసరానికి దివ్యశక్తులు పనిచేయవు. లోకం అసంపూర్ణం అయినట్లే మనిషీ అసంపూర్ణంగానే ఉన్నాడు. మనిషి పూర్ణ మానవుడు అయితే పూర్ణదివ్యత్వం అందినట్లే. అసంపూర్ణలోకంలో అసంపూర్ణ మానవుడు సంపూర్ణ మానవుడు కావడం ఎలా! అజ్ఞానం కారణంగా మనిషి సంపూర్ణత్వం పొందడం లేదు. మనిషి జ్ఞానం 'అజ్ఞానం' భూమికపై ఏర్పడుతోంది. అలా కాక 'దివ్యజ్ఞానం' సూటిగా పరం నుండి అందుకోగలగాలి.

మనకున్న సాధన సంపత్తి ఉత్తమమైనది కాదు. మనం ఉంటున్న శరీరం మనది కాదు. మనమూ శాశ్వతం కాదు. అయినా శాశ్వతమైన పరమాత్మను ఈ అశాశ్వతమైన జీవితంలోకి రమ్మని ఆహ్వానిస్తాం. జన్మకు రానంతవరకు ఆత్మలు శూన్యంలో విశ్రాంతి తీసుకుంటాయి. ఎప్పటి విషయాలనో ఆత్మలు మనకు అందిస్తాయి. భౌతికమైన ప్రకృతికి దివ్యత్వం అందదు. దివ్య మహత్తులేవీ మానవ పరిధిలోకి రావు. అవి అదృశ్యంగా మనకు అతీతంగా, అచంచలంగా ఉంటాయి. ఆత్మలోకంలో అవి సుస్థిరాలు. కాలంతో అవి కదలవు. అంతరంగంలో స్థిరంగా ఉంటాయి.

మనం భౌతికస్థితిని దాటి పైకి వెళుతున్నప్పుడు మార్గమధ్యంలోనే అతీంద్రియ స్థితి ఏర్పడుతుంది. అతీంద్రియత కాలావధిని దాటిస్తుంది. అది ఆత్మను సత్యం దాపులకు చేర్చుతుంది. సత్య సందేశాలను ఆత్మ అందుకో గలిగినప్పుడు ఆలోచనల అవసరం ఉండదు. కర్మలు చేయవలసిన అవసరం ఉండదు.

మనస్సీమలలో ఒక వెలుగు వెలిగి, ఒక వర్చస్సు జ్వలించి, క్షణకాలం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఆ వెలుగుబాటలో దిగి వచ్చిన దివ్యత్వం మనలో స్థిరపడుతుంది. మనస్సు, హృదయం కొద్దిసేపు శరీర స్పృహ కోల్పోవడం జరిగినప్పుడు జ్ఞానదృష్టి ఏర్పడుతుంది. కొన్ని దివ్య చిత్రాలు కదలాడతాయి. అది జ్ఞానదృష్టి.

అలాంటి అనుభవాలు కలిగిన తొలినాళ్లలో మన జన్మరహస్యాలు, పూర్వజన్మలు తెలుసుకుంటాం. మన గమ్యం ఏదో స్పష్టంగా తెలుస్తుంది. మన పూర్వస్థితి గతులు, ఇప్పుడు జన్మకు అర్థం ఏమిటి! ఏం సాధించాలి? అనే విషయాలు అవగాహనకు వస్తాయి. బాహ్య ప్రపంచం అసంపూర్ణం కనుక మనం పూర్ణ విజయం సాధించలేం. ప్రకృతి మన ఆత్మతత్వాన్ని గ్రహించకుండా అడ్డు పడుతుంది. కాని ఔన్నత్యం అంతరంగంలో ఉంటుంది.

భౌతిక శరీరాన్ని, నేలను అంటిపెట్టుకుని ఉన్నంత కాలం దివ్యజ్ఞానం మనల్ని చేరదు. వెలుగు దూరంగా కనిపిస్తుంది తప్ప దానిని మనం చేరలేం. అదీ మనల్ని చేరదు. అయితే ఒక శక్తి మనకు తోడుగా నిలుస్తుంది. పరమాత్మతత్వం భృక్తరహితమైనట్లు అనిపిస్తుంది. మన భౌతిక శరీరం మనకు ఆచ్ఛాదన. భగవంతునికి జీవునికీ మధ్య అదొక తెర. ఆత్మ పొందే ఔన్నత్వం కాలాతీతమైంది. ఎన్ని జన్మలు దాటినా అది మనదిగానే ఉంటుంది. మన వెంట వస్తుంది. మన చుట్టు, మన లోపల ఉన్న అగోచరశక్తి అనంతమైంది. 'ఈశ్వరీయత' లోపల మాత్రమే ఆ మహాశక్తి ఇమిడిపోతుంది. అన్ని జీవులను కలిపే బంధం భగవత్తత్వం, లేదా ఈశ్వరీయత. అలా సృష్టి సమస్తం ఒక గొలుసులా ఏర్పడుతుంది. ఒక దానికొకటి సంబంధం ఉంటుంది. ఈ విశ్వరచనలో ఒక వ్యక్తి వేరు కాదు. సృష్టికి మూలమైన పరాశక్తికి, అవాఙ్మానసగోచరుడైన బ్రహ్మానికి మధ్య మన ఆత్మలు కదులుతుంటాయి. యోగసాధనతో ఆత్మశక్తిని పొంది బ్రహ్మాన్ని చేరడం మన లక్ష్యం. జీవుడు మనోకుడ్యాలను దాటి పోగలగాలి.

జీవునికి పరలోకాల భాష తెలుసు. పరలోక జీవులతో సంభాషించగలడు. భూగోళాన్ని మించిన గోళాలు, లోకాలు అనేకం ఉన్నాయి. జీవుడు తన ఆంతర్యం గ్రహిస్తే పరలోకాలకు వెళ్లి రాగలడు. అరూపంగా, అగోచరంగా, అనామకంగా ఉన్న శక్తులు శూన్యంనుండి బయటకువచ్చి మనుషులతో కలవడానికి వేగిరపడుతుంటాయి. ఆ శక్తులు అజ్ఞానాన్ని, మృత్యువును లెక్కచేయవు.

సత్యం అనేక రూపాలలో దివ్యసీమల నుండి తొంగిచూస్తుంది. తానే ఆత్మసాక్షి అయి మన పనులకు అద్దం పడుతుంది. ఆ అద్దంలో ఆత్మశక్తులు, అనురాగాలు, అరూప బ్రహ్మానందాలు భావచిత్రాలుగా ప్రతిబింబిస్తుంటాయి. ఆ మహాశక్తులు వేయి రూపాలుగా పరిణమించి వేల రేకలుగా విప్పారుతాయి. అవే వెలుగులు.

ఆత్మ సంస్కారం పెరిగిన కొలదీ అజ్ఞాత శక్తులు మనకు అందుబాటులోకి వస్తుంటాయి. అవి మానవ ప్రవృత్తిలోకి దిగి వస్తాయి. ఆ శక్తి ఒకప్పుడు మనం సంపాదించి భద్ర పరచుకున్నదే కనుక ఇప్పుడు మనం కోరిన వెంటనే అందుతుంది. మనదవుతుంది. అప్పుడే అది సహజశక్తిగా, నిరాడంబరంగా కనిపిస్తుంది. ప్రతి ఆవరణలోను కొన్ని అతీంద్రియ శక్తులుంటాయి. కొన్ని పరమసత్యాలు ఆవిష్కృతమవుతుంటాయి. మనం కన్న కలలు, మన లక్ష్యాలు జీవితానుభవాలుగా మారతాయి.

ఒకప్పటి అనుభవాల సత్యసంధత వేరు. అనుభూతుల తీరుతెన్నులు వేరు. అన్నీ అత్యంత ప్రామాణికాలు. కొత్తగా అనిపించినా, అవి అనేక జన్మలలో మనకు సత్యాలుగా నిరూపితమైనవే. వాటి గొంతులు వినిపించకపోయినా హృదయం అందుకునేది ఆ సత్యాలే, దివ్య సందేశాలే. మాటలతో వాటిని వర్ణించడం, వివరించడం అసాధ్యం. వాటి ఫలితం ఒక్కటే, బ్రహ్మానందానుభూతి – బ్రహ్మానందస్థితి.

ఆ సత్యలోకాలకు మన ప్రపంచం పరిచయమే, సన్నిహితమే. అక్కడ సత్యస్పందన అతి తీవ్రంగా, వేగంగా ఉంటుంది. మన రూపం, శరీరం ఆత్మాభివృద్ధికి అవరోధం కాదు. సత్యాన్ని హృదయం సున్నితంగా గ్రహిస్తుంది. ఆత్మసైతం ఆనందాన్ని, సౌందర్యాన్ని అనుభవిస్తుంది. మమత, మాధుర్యం హృదయానికి సంబంధించినవి.

మనం స్వప్నాలలో చూచే సుందర రూపాలు, దృశ్యాలు సూక్ష్మలోకంలో సూక్ష్మ పదార్థంతో తయారై వాస్తవం అనిపిస్తాయి. ఆ సూక్ష్మలోకాలే మన సుందర స్వప్నసీమ లవుతుంటాయి. వాటి మహత్తు ఆనందసీమల్ని దాటి, మన ప్రపంచంలోకి ప్రవేశించి మన స్వప్నసీమలను ప్రభావితం చేస్తుంది. మనం అతీంద్రియ జ్ఞానం పొందినప్పుడు ఆ స్వప్నాలను వాస్తవం చేసుకోగలం. స్వప్న దర్శనాలను అతీంద్రియ ప్రజ్ఞతో సూక్ష్మలోకాలకు వెళ్లి అనుభవించి వస్తుంటాం.

ప్రాణాయామ సాధన వల్ల మనిషిలో తీవ్ర స్వభావం పోయి సాత్వికత ఏర్పడుతుంది. కోపతాపాలు చల్లారి సాధుత్వం ఏర్పడుతుంది. సాధుస్వభావంతో పరమాత్మజ్యోతి వెలుగులు దర్శించ వీలవుతుంది. జ్యోతిదర్శనం కాకపోయినా హృదయం సత్యాన్ని తెలుసుకో గలుగుతుంది. జ్ఞానదృష్టి ఏర్పడినప్పుడు సర్వం అవగతమవుతుంది. ఆనంద మార్గాల వెంట పరుగులిడే పాంథుల వలె మనం దివ్య సౌందర్యాలను దర్శించి, అమృతపానం చేయగలం.

ప్రాపంచిక విషయాలపై విరక్తి పెంచుకోకపోయినా సద్వర్తన, సదవగాహన వల్ల బ్రహ్మానందస్థితిని పొందవచ్చు. సౌందర్యారాధనలోనూ బ్రహ్మానందం ఉంది. ప్రేమానురాగాల స్పందన కూడా బ్రహ్మానందప్రదమే. మన ఆనందస్థితి మన ముఖాలపై కనిపించాలి.

మహర్షులు, మహాయోగుల ప్రభావంతో ఆధ్యాత్మికంగా కొందరు ఎదగగలరు. స్వతంత్రంగా సాధనచేయగల ధీమంతులే మహర్షులు, మహా యోగులు. వారికి సంస్కారం వల్ల సమదృష్టి అలవడుతుంది. సత్యాన్వేషణలో

నాల్గవ పరిణామ భూమికను చేరినవారు మాత్రమే సర్వులను సమదృష్టితో చూడగలరు, అందరినీ ప్రేమించగలరు. అప్పుడు మన ఆత్మలు విశ్వాత్మలో లీనమవుతాయి. బ్రహ్మానంద స్థితిలో ద్రష్ట వేరుగా, దృశ్యం వేరుగా ఉండవు. సృష్టించేవాడు, సృష్టించబడేదీ ఒక్కటే. ఆ మమేకస్థితి కలిగినప్పుడు మాయతెర తొలగిపోతుంది, పూర్ణత్వం సిద్ధిస్తుంది.

అక్కడక్కడ ఏరి, పోగుచేసుకున్న జ్ఞాన శకలాలు మనవి కాకపోయినా, సద్వినియోగ పరచుకోవచ్చు. అవి మన స్వంతం అయినపుడు, వాటిని మనకు అన్వయించుకోగలిగినప్పుడు, మన జ్ఞానం సంపూర్ణమవుతుంది. అలాగ ఆత్మ దర్శనం చేసుకోడానికి ఎక్కువమంది ప్రయత్నిస్తారు. అది సులభమార్గం. మనంగా శ్రమించవలసింది ఉండదు. కాని మనలోనూ జ్ఞానాగ్ని రగులుతుంది. అగ్ని రగిలి వెలుగులు వెలార్చినపుడు మనలోని చీకటి మూలలలో వెలుగు సోకుతుంది. వేడి తగులుతుంది. అప్పుడు వ్యక్తమయ్యే విషయాలు అన్నీ పరం పరాగత సత్యాలే. అవి మనల్ని చేరడమే మనలో దివ్యస్ఫూర్తికి నిదర్శనం.

అంతరాగ్ని చల్లారదు, అంతర్ జ్యోతి ఎప్పుడో గాని వెలగదు. అగ్ని రగులుతూ ఉంటుంది. దివ్య లోకాలనుండి దిగివచ్చే ఆనందాలు మనకు స్ఫూర్తి నిస్తుంటాయి. ఆత్మకు గత ఔన్నత్యాలను జ్ఞప్తి చేస్తుంటాయి. అలౌకిక భావాలకు అందమైన వ్యాఖ్యానాలు లభిస్తుంటాయి. మనం చూచే దృశ్యాలకు, అందాలకు అర్థాలు తెలియవు. ఒక తెర వాటి అర్థాలను మనకు తెలియనివ్వదు. ఆ సౌందర్యా లకు, దివ్యానందాలకు బందీలమైపోయి ఆత్మ అందుకోవలసిన శిఖరాలను చేరడానికి బద్ధకిస్తాం. సూక్ష్మ లోకాలలో అందరూ కామరూపులే. దేవతలు వారికి అధిపతులు. వారు అధిదేవతలు.

భూలోకానికి, సూక్ష్మలోకానికి మధ్య దివ్యకాంతి ప్రవాహాలే సరిహద్దులు. అవి నిష్కళంక, నిర్మల సౌందర్యాలు. అక్కడ కామరూపులు సర్వస్వతంత్రులు. ఒకరిపై ఒకరు ఆధారపడరు. అంతా పూర్ణప్రజ్ఞతో భాసిస్తుంటారు. వారికి పరమాత్మ దర్శనం కాదు. అక్కడ శబ్దమే బ్రహ్మం, నాదమే ఆధ్యాత్మిక సందేశం. పారవశ్యమే ప్రగతికి చిహ్నం. దృశ్యాదృశ్యంగా ఉన్నా అక్కడిదంతా వాస్తవమే. ప్రతివారిలోనూ సంపూర్ణ తృప్తి కనిపిస్తుంది. ప్రతి చిన్న పరిధిలో ఆనందం తాండవిస్తుంది. ప్రతి రాగం అనురాగపూర్ణం. ప్రతి రేఖ సంపూర్ణత్వానికి ప్రతీక. ప్రతి వస్తువులో దివ్యత్వం భాసిస్తుంది. ప్రతిది అందానికి, సౌందర్యానికి అమల రూపమే అనిపిస్తుంది.

ప్రతిజీవి ఆనందంతో తలమునకలౌతుంది. సమగ్రంగా, సంపూర్ణంగా ఆత్మానందాన్ని అనుభవిస్తుంది. కోరదగింది ఏదీ ఉండదు. శ్రమ ఫలించక నిరాశచెందడం ఉండదు. అక్కడ ఎవరికీ శ్రమలు, కష్టాలు, పరీక్షలు ఉండవు. బాధలు, వైఫల్యాలు ఉండవు. భయవిషాదాలు లేని ఆనందమయలోకం. నిష్ఫలమయ్యేది, నిరుపయోగం అనిపించేది ఏదీ ఉండదు.

ఆ సూక్ష్మలోకపు సరిహద్దులు దాటగానే మన ఆత్మ ఒక్కసారిగా ఆనందాన్ని అనుభవిస్తూ నిశ్చల భావాలకు నిర్మల రూపాలను కల్పించుకుంటుంది. మన ఆలోచనలు క్రమంగా వాస్తవరూపం ధరిస్తాయి. ఆ భావంతో జీవిస్తూ, సంపూర్ణంగా అనుభవిస్తూ, సూక్ష్మశరీరాలతో దివ్యజీవులు కావడం జరుగుతుంది. మనవలె అక్కడి సూక్ష్మశరీరులు అన్ని సుఖాలు అనుభవిస్తారు. మన ప్రపంచానికి ప్రతి రూపమే అది అనిపించినా, నిజానికి అసలు ప్రపంచం అదే. మనది ప్రతిరూపం.

★ ★ ★

అశ్వపతి ఇంద్రియాలు ఆనందరస భరితంకాగా, ఒక దివ్యలోకంలో ప్రవేశించాడు. అక్కడ మానవరూపాలను పోలిన రూపాలు చూచి అబ్బురపడ్డాడు. వారు దేవతామూర్తులు, సూక్ష్మశరీరులు. మనదృష్టికి అవి దివ్యరూపాలు. అవి పరిమితంగా కనిపించినా అపరిమితాలు, వారంతా సర్వస్వతంత్రులు. వారి వారి ఆధిపత్యాలు అన్నీ స్వతంత్రమైనవే. ఉన్నస్థితి కాదని, మరొక స్థితి కావాలని వారు వాంఛించరు. వారికి కోరికలు, వాంఛలు ఉండవు. ఎవరి పరిమితిలో వారు చరిస్తుంటారు.

అక్కడ ఒక పథకం ఉండదు. ఒకరి ఆధిపత్యం లేదు. అన్నీ ఉన్నా, లేనట్లే. అంతరాలు, అభ్యంతరాలు ఉండవు. అనుమానాలు లేవు. ఆశ్చర్యకాలు లేవు. అక్కడి వారు జీవులో, ఆత్మలో తెలియదు. వారు, వాటికున్న శక్తులు అద్భుతం. ఎవరూ తమ పరిధులు దాటి ప్రవర్తించరు, స్వతంత్రించరు. కానీ అందరూ స్వతంత్రులే.

అశ్వపతి ఆత్మ భూలోకం నుండి వచ్చిన జీవాత్మ అయిన కారణం దూరంగా ఆగిపోయింది. అక్కడి రూపురేఖ విలాసాలకు విభ్రమం చెంది అర్థాంతరంగా నిలిచిపోయింది. అక్కడ ఆలోచన కాంతుల్ని ప్రసరిస్తుంది. ఆ కాంతుల్ని బట్టి ఆలోచనల్ని గ్రహించవలసి ఉంది. అభ్యంతరాలు క్షణంలో సమసిపోతాయి. దేహగత జీవునికి పరిమితులుంటాయి. అభ్యంతరాలుంటాయి. ఆత్మగత జీవుడు

స్వతంత్రుడు. జీవుడు అపరిమిత సుఖాలు అనుభవించ వీలున్నది. అనుభవించా లన్న కోరిక, అనుభవించగల శక్తి జీవునిలో ఒక మూల అణిగి ఉంటాయి. చిన్న పనులతో తృప్తిపడి తన శక్తిని విస్మరిస్తాడు. తన మహదాశయాలనే జీవుడు మరచిపోవడం జరుగుతుంది. అది కాల పరిమితి. మనిషి కాలపరిమితికి లోబడి జీవిస్తుంటాడు.

ఆత్మశరీరం మనదే అయినా బహుసుందరంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. అది భారరహితమైన శరీరం కనుక గాలిలో, శూన్యంలో సైతం సులభంగా తేలిపోగలదు. ఆనందంతో ఊయల లూగుతుంది. పైనుండి వచ్చే పిలుపు ఆత్మశరీరం వినిపించుకోదు. దాని పారవశ్యం దానిది. ఎక్కడికో ఎగిరిపోవాలను కోదు. ఆత్మశరీరం అక్కడికక్కడే పూర్ణత్వం అనుభవిస్తుంది. కోరికలుండవు. ఆకాశంలోకి ఎగిరిపోవాలని, అఖాతాల్లోకి చొచ్చుకుపోవాలన్న కోరిక దానికుండదు. కలలు కనడం తెలియదు. కల్లోల పడడం తెలియదు. ఆత్మ శరీరంలో మనస్సు ఉండదు కనుక ఆలోచనకు అవకాశం లేదు. అసలు ఏ ఔన్నత్యాన్ని ఆశించడం జరగదు.

తాను చూస్తున్నది నిశ్చలన వర్ణచిత్రం. అది అరూప చిత్ర కళాఖండం. దివ్యచిత్రం స్థిరంగా ఉండదు. క్షణంలో ఒకరూపం ఏర్పడుతుంది. కాస్త ఆనందం చాలు ఆత్మ పరవశించడానికి. జీవుడు అనేక జన్మలుగా ధరిస్తున్న రూపాలతో ఆత్మ విసిగిపోయి అరూపస్థితిని వాంఛిస్తుంది. అలౌకికానందంతో మురిసి పోతుంది. కాని అంతర్గత శక్తులు నెమ్మదిగా అంతర్లోకాలకు మార్గం సుగమం చేస్తాయి.

అశ్వపతి ఆత్మ ఆ దివ్యతేజస్సును వాంఛించింది. అతని ఆత్మ ఉన్నత శిఖరాలను దాటుతూ, ప్రాపంచికమైన కాలాన్ని, దూరాన్ని అధిగమించింది. సుందరమైన స్వర్గభూముల్ని దాటి పైకి పోసాగింది.

ఇప్పుడు అశ్వపతి గమ్యం ప్రశాంతమైన అనంత రోదసి.

37. ప్రాణిలోకం

అశ్వపతి సూక్ష్మలోకం వదలి ప్రాణలోకం చేరాడు. అక్కడ జీవం ప్రధాన సూత్రం. జీవనసూత్రం అంటే పుట్టుక, పెరుగుదల, క్షీణత, మరణం. ఈ నాలుగు పరిణామాలు జీవుని దశలు. జీవన లాలస అనంతమైంది. ప్రతి అవకాశాన్ని జీవి ఉపయోగించుకుంటుంది. ఫలితాన్ని లెక్కచేయదు. కనుక ప్రమోదలు, ప్రమాదాలు, జయాలు, అపజయాలు తప్పవు. ఒకరి బాధలు, సుఖాలు మరొకరితో పంచుకోవడం ప్రాణిలోకంలో సహజ లక్షణం. చివరకు అలసిపోయి, విరక్తిచెంది మరో లోకానికి చేరాలనుకుంటారు. కష్టాలలో ప్రతి ప్రాణిలో చిరుఆశ మెరుపు వలె మెరుస్తుంది. కలల్లో బ్రతుకు తుంది. ఆ కలలు పైలోకంలోనైనా వాస్తవాలు కావాలని వాంఛిస్తుంది.

భూమిపైన కనిపించే రూపాలకు, అసలు సత్యస్వరూపాలకు మధ్య పెద్ద అఖాతం అడ్డుగా ఉంటుంది. ఆ తెరలు తొలగించి, అఖాతాన్ని దాట గలిగితే స్వప్నం వాస్తవమయినట్లు, సత్యదర్శనమయినట్లు. అందుకు సహాయ పడేది మేధ. మేధ సహాయంతో మనిషి జ్ఞానం పొందగలగాలి. అదే సత్యానికి దగ్గరగా చేరుస్తుంది, సన్నిహితం చేస్తుంది. మనిషిగా బ్రతికినంతకాలం వైఫల్యాలు, మోసాలు, బాధలు తప్పవు. అవి మానవ నైజాలు. చివరకు మనిషి మృత్యువును వాంఛిస్తాడు. శాశ్వతనిద్ర అనంత శాంతిని ప్రసాది స్తుందని ఆశ. అది జీవుని పతనస్థితి.

అశ్వపతి ఆరోహణలో సమతల శూన్యం చేరాడు. పరప్రకృతి అతని ఆరాటానికి, రాకకు కలవరపడ్డది. ఆయన మానసిక భూమికల్ని దాటి, పైనున్న కల్లోల జగతిలో ప్రవేశించాడు. అక్కడ అన్నీ సందేహాలు, అస్థిరాలు. ఏదీ వాస్తవం కాదు. విరామం లేకుండా అక్కడ కృషి జరుగుతుంది. ఎంత వెతికినా ఏమీ కనిపించదు. అంతా అయోమయం. మన ప్రశ్నలకు సమాధానం లభించదు. సమస్యలు తలెత్తుతాయి కానీ పరిష్కారాలుండవు. నేలపైన కాళ్ళు ఆనవు. అసలు

నేల ఉండీలేనట్లుంటుంది. గమ్యం లేకపోయినా, తెలియకపోయినా ఉరుకులు, పరుగులు. సంశయాంధకారంలో అశ్వపతి పయనించసాగాడు. ఎక్కడా కాలు నిలవడం లేదు.

ఎదురుగా ఎన్నటికీ చేరలేని దూరాలు కనిపించాయి. అడుగడుగునా గమ్యం చేరువైనట్లే అనిపిస్తుంది కాని దూరంగా సాగి కరిగిపోతుంది. ఏ మార్గంలో వెళ్లినా ఎక్కడకు చేరతామో తెలియని అయోమయస్థితి అంతటా. తన మనస్సుకు నచ్చేది, హృదయం మెచ్చేది ఏదీ లేదు. ఆ యాత్ర యాతనామయం అనిపించింది. అక్కడ ప్రాణికోటికి అవసరమైన జీవం అనూహ్య పరిమాణంలో ఉంది. సాగరతరంగాల ఘోషలవలె ఆత్మల ఆక్రందన, ప్రాణుల ఘోష వినిపించింది. అవి ఆ చోటు వదలి రోదసిలోకి ఎగిరిపోవాలని ఆరాట పడుతున్నాయి. అనంత ప్రశాంతిలో దుర్భర సంచలనం అది. అక్కడ పరమాత్మకు సైతం జీవితం పైన ఆశ కలుగుతుంది. అది జీవన లాలస.

పరమాత్మ తన ఇచ్ఛ వచ్చిన రూపాలను తయారు చేస్తుంది. పాత రూపాలను వదలి కొత్త వాటిని సృష్టిస్తుంది. సుఖంగా, హాయిగా ఉన్న రూపాలను మార్చి వేస్తుంది. కష్టాలను పరమాత్మ పరిగణించదు. విధికి, దురదృష్టానికి భయపడదు. పతనం కావడం, నాశనం కావడం అన్నది రూపజీవులకు సహజం. పాపాలు, అపజయాలు, యాతనలు ఏవీ తనకు అంటనట్లు పరమాత్మ మానవాత్మలతో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంది. కనిపించేదంతా ప్రయోగా త్మకమే. కనిపించని దానికోసం అన్వేషణ సాగుతుంది. ఎన్ని సత్యాలను ఎవరు వచించినా ఏదీ ప్రామాణికం కాదు పరమసత్యం కాదు. మనిషి ఆఖరు వరకు అసంతృప్తితోనే జీవిస్తాడు.

అంతర్ మేధ పథకం ప్రకారం మానవజీవితం సాగుతుంది. ఒక భావం నుండి మరొక భావానికి, ఒక దశ నుండి మరొక దశకు మారుతుంది. జీవుడు అహంకారం వల్ల, ఆర్జిత శక్తుల వల్ల పతనం చెందుతాడు. తానే సర్వశక్తి మంతుడని భావిస్తూ, బానిస బ్రతుకు సాగిస్తూ, విధిచేతి కీలుబొమ్మ అవుతుంటాడు. అసం బద్ధంగా, క్రమరాహిత్యంగా జీవించడమే జీవనసూత్రం అవుతుంది. అవకాశాలు చేజార్చుకుంటాడు. బాధలు, ఆనందాలు మనిషికి సహజలక్షణాలు. కాలచక్రం క్రింద నలిగిపోవడం, పరిస్థితులకు తలవంచి బ్రతకడం, ఔన్నత్యానికి పతనానికి మధ్య ఊగిసలాట మనిషికి సహజాలవుతాయి. వాంఛల ఊబిలో చిక్కి బయటపడలేడు. ఆకాశాన్ని, నక్షత్రాల్ని అందుకోవాలని ఆరాటపడతాడు.

ఒక శిఖరం నుండి మరో శిఖరం పైకి దూకాలని, ప్రపంచంలో తనంతటి వాడు మరొకడు ఉండకూడదని అత్యాశ.

మనిషి ముఖంపై జీవుడు విషాదాన్ని పులుముతాడు. జీవుని పథకం మేరకే మనిషి బాధల్లో, అగాధాల్లో చిక్కుబడిపోతాడు. తన పతనానికి తానే కారకుడవుతాడు. ఎప్పుడోగాని ఆత్మను గురించిన ఆలోచన కలగదు. అప్పటికి జీవితం చాలావరకు గడచిపోతుంది. గతాన్ని తలుచుకుని కుమిలిపోవడం మనిషి అవివేకం, అజ్ఞానం.

మనిషి అందివచ్చిన అవకాశాలను వదులుకుని అశాశ్వతమైన సుఖాలను కాంక్షిస్తాడు. గమ్యానికి దూరంగా పారిపోతాడు. జీవుని పథకం ముందే నిర్దేశించ బడుతుంది. తను చేసేది ప్రతి ఒక్కటి న్యాయం, ధర్మం అనిపిస్తుంది. కాని ఏ ఒక్కటి ఆత్మకు ఆనందాన్ని కలిగించదు. కొసమెరుపులా ఒక తపన మాత్రం మిగులుతుంది, లేదా అనుభవించిన సుఖభోగాల ముద్రలు మిగులుతాయి.

జీవుడు ఎన్ని అనుభవాలు పొందినా, ఎన్ని సుఖాలు, ఆనందాలు అనుభవించినా చివరకు కొంత అసంతృప్తి మిగిలే ఉంటుంది. కొత్త సుఖాలలో పాత వాసనలే కనిపిస్తాయి. ప్రతిఘడియ గతించిన వాటిని జ్ఞప్తికి తెస్తుంది. ఎంత సాధించినా కొంత అసంతృప్తి మనిషిలో మిగిలి ఉంటుంది. జీవునికి తాను ఏమి ఆశిస్తున్నదీ తెలియదు. అతి భోగాలు, సుఖాలు విసుగు పుట్టిస్తాయి. ఈ సుఖ దుఃఖాల సయ్యాటలో జీవుడు నీరసించిపోతాడు. ప్రాపంచిక జీవనంలో కష్టాలు, కామ్యాలు విసుగుపుట్టి జీవి మళ్ళీ మానవజన్మకు రాకూడదని నిశ్చయించుకుంటుంది.

ఆబగా వెతికేవానికి చేదు అనుభవాలు చేతికి అందుతుంటాయి. స్వయంకృతాపరాధాలు మనిషిని కట్టికుదుపుతాయి. గాయపడిన జీవి సుఖాలను, సానుభూతిని ఆశిస్తుంది. స్వర్గాన్ని కోరితే ప్రాప్తించేది నరకం. అవకాశం వచ్చినా ప్రమాదం కాటువేయక మానదు. విధికి తలవంచి మనిషి అలసిపోతాడు. జీవనపోరాటంలో ఓడిపోతాడు. ఆత్మ పవిత్రంగా, నిర్మలభూమికల నుండి వచ్చి, జీవునితో కలుస్తుంది. శరీరంలో ప్రవేశిస్తుంది. ఆత్మ జాగృతమైనపుడు జీవునినేత్రాలు కాంతిపూర్ణా లవుతాయి. ఆనందం కళ్లలో తొణికిసలాడుతుంది. చూపుల్లో ప్రేమ, కరుణ, శాంతి కనిపిస్తాయి. జీవుని పవిత్రభావాలన్నీ పరమాత్మ స్పందనలే. సౌందర్యారాధన, ఆనందం ఆత్మకు సహజ సద్గుణాలు. అనంత సచ్చిదానందం పొందడం ఒక్కటే ఆత్మ లక్ష్యం.

ఆత్మ ఎప్పుడు ఆనందాన్నే అన్వేషిస్తుంది. ఆనందం దిశగా పరుగు లిడుతుంది. ఎక్కడ ఆనందం కనిపిస్తే అక్కడ ఆత్మ స్పందిస్తుంది. విషాద హృదయంలోనూ ఆత్మ ప్రవేశించి ఊరట కలిగిస్తుంది, కాస్త ఉపశమనం కలిగిస్తుంది. ఆశతో జీవించే వారికి ఆనందించే మార్గాలు చూపుతుంది. లోకంలో ఆనందం కరువైనా, వాతావరణం విషాదంగా మారినా, అడుగడుగునా ప్రమాదాలు పొంచి చూచినా, హృదయంలోని ఆత్మ ఆనందాల్ని వెతుక్కోగలదు.

శూన్యరోదసి వాస్తవానికి శూన్యం కాదు. అగోచరంగా ఆనందాలు రోదసి అంతటా సుడులు తిరుగుతుంటాయి. నీలి గగనాలు ఎక్కడో దూరంగా లేవు. ఆత్మకు శరీరానికి అనుబంధం కష్టం కాదు. మన ఆశలకు భావాలంత చేరువ మనం కోరే స్వర్గం. స్వర్గం అంటే విషాదం ప్రవేశించవీలులేని తావు.

మనిషి పైపైకి వెళ్లిన కొద్దీ కనిపించేవి తేజోమండలాలు. ఆ క్రాంతి మండలాలను భౌతిక నేత్రాలతో దర్శించలేం. దేవతల పాదచాలనంతో అరిగిపోయిన ఆకాశం అగ్నుల్ని కురిపిస్తుంది. ఆకాశంలో తారకలు చెదిరిపోతాయి. చిత్రచిత్ర వర్ణమాలికలు వలయాలుగా పైకి ప్రసరిస్తూ ఆనందాలకు బాటలు ఏర్పరుస్తాయి. శూన్యంలోని శూన్యసంకేతాలను ఆత్మలు అర్థం చేసుకుంటాయి.

ఆత్మశరీరంతో సంచరించగలవారికి, జీవించగలవారికి, ప్రాపంచికమైన కన్నీరు, బాధలు, ఆరాటాలు, పోరాటాలు, ద్వేషం, ఆగ్రహం, అజ్ఞానం అడ్డురావు. వారు వేటికీ చలించరు. వేటి ప్రభావానికి లోనుకారు. వారు ఉన్నత లోకాలను గమనిస్తుంటారు. కాలానికి కట్టుబడని ఆనందతీర్థులు వారు. ఆత్మసౌందర్యం, ఆత్మానందం వారికి సర్వస్వం. ఆత్మానందంలో తేలిపోతుంటారు. జ్యోతుల వలె వెలుగుతుంటారు. అది ఈశ్వరీయత.

సామాన్య మానవునికి ఆ ఆనందం అనూహ్యం, ఆ స్థితి దుస్సాధ్యం. ఎలా ఏర్పడేది ఎవరూ చెప్పలేరు. అంతర్నేత్రానికి మాత్రమే కనిపించే ఆనందమయ ప్రపంచం అది. ఎక్కడో సుదూరాన కదిలే బొమ్మల వలె అనిపిస్తాయి. మనసున్న వారికి అవి వాస్తవాలు, అతి సన్నిహితాలు. భౌతిక స్పృహకు, ఊహకు అవి అందవు. అవి అగోచర, సుందర సీమలు. అనుభూతికి మాత్రం అందుతున్నా మనం భౌతిక శరీరంతో చేరలేని లోకాలు అవి. ఆ లోకాలలో ఉన్నవారికి విధి, మృత్యువు ఉండవు. విషాదాలు, విషయవాంఛలు లేని రహస్య తేజోమందిరాలలో, బ్రహ్మానందంలో వారు జీవిస్తుంటారు.

మనకు స్వప్నంలో, భావంలో, ధ్యానంలో అవి కన్పిస్తాయి. అంతర్లోకాల లోని సూక్ష్మదృశ్యాలుగా మెదులుతాయి. అంతర్దృష్టితో వాటిని దర్శించి, అనుభూతి చెందవచ్చు. ఆ దివ్యజీవులు అలా ఛాయా మాత్రంగా కనిపించి, అంతర్ధానమవుతూ వారి స్మృతుల్ని మన మనస్సులపై ముద్రించిపోతుంటారు. అవి మన భావ చిత్రాలు, ఊహాప్రవళికలే అయినా హృదయం లోతులలో స్పందన రగిలిస్తాయి. అవాస్తవాలనిపించినా అవి మన జీవితాలకన్నా ఎక్కువ వాస్తవాలు. మన సుఖాలను మించిన సుఖాలు, మన వాస్తవాలను మించిన సత్యాలు. అవి స్వప్నాలో, స్వాప్నిక చిత్రాలో అయితే, అవి భూలోక సంఘటనలకు ప్రతిరూపాలనిపించవు. ఆ స్వప్నాలు మన వాస్తవాలను అబద్ధం చేయగలవు. అక్కడ జీవన చిత్రాలు చంచలం అనిపించినా అవే సుస్థిరాలు. కోరుకున్న తేజస్సు, కోరిన రూపాలు, సుఖాలు, అనుభవాలు క్షణంలో ఏర్పడుతుంటాయి. ఆ ప్రశాంత మండలాలు క్షణంలో కాంతిగోళాలుగా మారతాయి. అవి బ్రహ్మానందమై, నదులై, సాగరాలై గోళాలు, లోకాలు దాటి, ప్రవహించి, మన ఆత్మల్ని ఆనందసీమలుగా మార్చుతుంటాయి.

ఒకప్పుడు అది ఒక ఆశయం, ఈశ్వర సంకల్పం అయినా ఇప్పుడు వాస్తవానికి సన్నిహితం అవుతుంది. స్వాప్నిక సత్యానికి, భౌతిక వాస్తవానికి మధ్య అశ్వపతికి సర్వం అవగతమైంది. దివ్యలోకాలు, దృశ్యాలు కంటికి కనిపించి, హృదయానికి చేరువై సంపూర్ణ ప్రేమను, ఆనందాన్ని అందించాయి. ఆ మహోన్నత సీమలు అతని దృష్టికి గోచరమై ఆత్మాకాశంలో కరిగిపోయాయి. అవి ఒక చిత్రమైన శూన్యంలో లయించినట్లయింది. ఆనంద పారవశ్యంలో దివ్యత్వం వెలుగులు పంచుతుంది. ధార్మిక శిఖరాలపైన పరిణతి చెందిన పారమార్థిక వెలుగు కిరణం ఒకటి జీవితాన్ని పరమాత్మతో అనుసంధాన పరచి కాలాతీత స్థితికి చేర్చి కాలాన్ని శాసిస్తుంది. అరూపద్రవ్యంతో రూపాలను సృష్టించగలుగుతుంది. పరమాత్మ నిశ్చలంగా ఉండి సర్వసృష్టిని శాసించగలదు. ఒకే పరాశక్తి అన్ని రూపాలను ధరిస్తుంది. ఆ పరాశక్తి ఒక్కటే సృష్టి, స్థితి, లయలకు హేతువు. ఆ శక్తి ఎక్కడ నుండి వస్తుందో, ఎక్కడ ఉంటుందో ఎవరికీ తెలియదు.

ఉన్నతాత్మలకు జీవితాలు కల్పించి పంపి జగన్మాత పరమాత్మశక్తిని సద్వినియోగ పరుస్తుంది, ఈశ్వర సంకల్పాన్ని నెరవేరుస్తుంది. జగన్మాత తాను కన్న కలలు నిజం కావడానికి మహాత్మలను ప్రయోగించి, పరమాత్మకు ప్రీతిపాత్రమవుతుంది. ఆమె ప్రతిచర్య పరమాత్మ అభిమతంగానే గ్రహించాలి.

ఆమె చర్యల్ని పరమాత్మ బలపరుస్తూ, తన అగోచరత్వాన్ని మరింత పదిలపరచుకుంటాడు.

శూన్యం నుండి ఉద్భవించిన శక్తులు మన దృశ్య ప్రపంచాన్ని ఆవిష్కరింపచేస్తుంటాయి. ఈశ్వర సంకల్పమే జగన్మాత సృష్టి విన్యాసాలు కాగా, ఈశ్వర తేజస్సు శకలాలుగా ఎక్కడో మెరుస్తుంది. జగన్మాత సంకల్పంతో ఏర్పడిన మహామేధ భూమికి దిగివచ్చి, ఆమె ప్రతినిధిగా సృష్టిని నడిపిస్తుంది. ఆ శక్తే లోకశక్తి. ఆమె సంకల్పంతో మహామేధ అనేక ప్రయోగాలు చేస్తుంది. అనూహ్య అసంభవాలు సైతం వాస్తవ రూపం ధరిస్తాయి. మానవుడు సత్యం వైపుగా ఆలోచిస్తున్నాడు. జిజ్ఞాస విశ్వవ్యాప్తమైంది. పరిణతభావాలు దివ్యభావాలుగా మారుతున్నాయి. భావ తీవ్రత క్రమంగా దివ్యదృష్టిని ప్రసాదిస్తుంది. ప్రగతిపథంలో ప్రకృతి పరమాత్మలో లీనమవుతుంది.

విశ్వబ్రహ్మ – జగన్మాతల అన్యోన్యత వల్ల, అనురాగం వల్ల ఆయన పనులన్నీ ఆమె నిర్వహిస్తుంది. విశ్వశక్తి ఆమె ద్వారా జీవులకు అందుతుంది. పరమాత్మను జగన్మాత సూత్రబద్ధం చేసింది. ఆమె నిర్వహించే కార్యాలలో పరమాత్మ తానుగా జోక్యం చేసుకోడు. ఆమె ప్రభావం లేని చోట్ల తాను నేరుగా కల్పించుకుంటాడు. పరమాత్మ అంశ కొందరి భౌతిక శరీరాలలో ప్రవేశించక తప్పదు. జగజ్జనని కల్పించే రూపాలు, సృష్టించే లోకాలు ఏవీ పరలోకాలలో నిలవలేవు. అవి అన్నీ శూన్యంలో లయించి పోవలసిందే. అలా పతనమై శూన్యంలో లయించడమే వాటి ధర్మం. బ్రహ్మానందం ఇవ్వగలిగింది చివరికి ఏమీ మిగలదు. జీవులు ఇక్కడ తమ కర్మశేషాల్ని నిర్మూలించుకుంటే ఉన్నత శిఖరాలకు చేరగలరు. అంటే అవి వదలి వచ్చిన దివ్యత్వాన్ని తిరిగి పొందగలుగుతారు.

జ్ఞాననేత్రం ఏర్పడి, సర్వజ్ఞత్వం సిద్ధించినపుడు జగన్మాత ప్రాభవాన్ని అనుభవించగలం. అంతకాలం చీకటి మాటున దాగివున్న ఆత్మశక్తి బయట కొస్తుంది. ఇది యోగి సాధనతో పొందగలడు. పైకి వెళ్ళిన కొద్దీ దివ్య తేజస్సు మనదవుతుంది. పతనమైనవారు భయంకర చీకట్లలో చిక్కుకుంటారు. రెండూ విరుద్ధ శక్తులు, రెంటివీ విరుద్ధ స్వభావాలు. జీవన పరిణతి అనేక విధాలుగా తెలుస్తుంది. అందరి గమ్యం అమరత్వమే. అమరమైన ఆత్మ ఎప్పుడూ నవోన్మేషంగా, నిర్మలంగా ఉంటుంది. తప్పిదాలతో జీవుడు అంధకారంలో ప్రవేశించే వరకు ఆత్మ పరమాత్మ ప్రతినిధిగానే మనగలుగుతుంది. నిష్కల్మషమైన అమాయకత్వానికి ప్రజ్ఞ తోడుగా నిలుస్తుంది. సత్యదర్శనంతో స్వప్రజ్ఞ రాణిస్తుంది.

జగన్మాత సృష్టిలో భయంకర లోకాలున్నాయి. ఆమె బాధలకు, కన్నీటికి, యాతనలకు అవి భూమికలు. అక్కడ ఆమె మృత్యువు ఒడిలో విశ్రమిస్తుంది. అక్కడ చిరనిద్ర ఒక్కటే శాంతిని ప్రసాదించగలదు. ఆమె తేజోరూపాన్ని వదలి చీకటి దేవతల పంచన చేరి క్షుద్రశక్తులకు పరీక్ష పెడుతుంది. ప్రతికూల శక్తులు మనిషిని ఆవహించి లోబరచుకుంటాయి. మనిషి మనసులో తిష్టవేసి, సుఖభోగాల పట్ల ఆసక్తిని పెంచుతాయి. వాటి ప్రభావంలోని వ్యక్తి మార్పును ఆశించడు. మంచిని సహించడు. వారిలో ఆత్మ ఉండీ బయటపడదు. నిజానికి మనిషి వినోదాలు, విషాదాలు రెండూ జగన్మాత చేష్టలే.

ఈ లోకాలన్నింటి నుండి స్వర్గానికి చేరే సన్నని బాట లుంటాయి. మధ్య చిన్న అఖాతం ఉన్నా, సులభంగా దాటిపో వీలున్నది. అవి అభేద్యకుడ్యాలు కాదు. ఆ రూపాలు మానవ మేధ గ్రహించలేనంత మార్మికం, జటిలం కావు. ఆ లోకాలలో సచ్చిదానందం, నిష్కళంక భావన నిగూఢంగా ఉంటాయి. పవిత్ర జీవనంతో ఇక్కడే స్వర్గ సుఖాలు అనుభవించవచ్చు. మన హృదయాలు పరిశుద్ధంగా ఉండి మంచితనం నిండి ఉంటే మనలోకి దివ్యత్వం ప్రవేశిస్తుంది. సహజంగా జీవితం ఆనందపూర్ణమవుతుంది. మనం స్వతంత్రంగా, సంపూర్ణంగా జీవించగలం. భూమార్గాలు కఠినంగా ఉన్నా, లోపల అన్ని శక్తులు ప్రవేశించగలవు. ఏవీ భౌతికమైన బాధలకు భయపడవు. ప్రేమ ఒక్కటే ఇక్కడ స్వేచ్ఛగా విహరిస్తుంది.

భౌతికత్వంలోనే ప్రకృతి తన కలల్ని పండించుకుంటుంది. అందుకే దివ్యత్వం చొరబడకుండా అవరోధాలు కల్పిస్తుంది. ఈ లోకంలో దివ్యత్వపు మెరుపులన్నీ పైపైఛాయలు. భావాతీతస్థితిలో ఎప్పుడో గాని వెలుగు కనిపించదు. ప్రశాంత తేజస్సులో పయనిస్తే సచ్చిదానందమూర్తులు ఎవరో శూన్యాన్ని దాటి క్రిందికి దిగివచ్చి మనకు సహాయపడతారు. సమాధిస్థితిలో వినిపించే నిశ్శబ్దాలు వినిర్మల ప్రేమ మధువుల్ని రుచి చూపిస్తాయి. ఈశ్వర స్పర్శతోనే లోకాలు పులకిస్తాయి. భగవంతుని కారుణ్యంలో సర్వప్రకృతి పరవశిస్తుంది. పరబ్రహ్మను భూతిలో సర్వజీవులు లయించి, తరించాలని ఆశిస్తాయి. ఈశ్వర కరుణ దీనులపై, దరిద్రులపై అపారంగా వర్షిస్తుంది. వారు అర్థించకపోయినా ఈశ్వరుడు వారికి ఆనందాన్ని ప్రసాదిస్తాడు.

అగోచరుడైన పరమాత్మను ప్రతి జీవి గుర్తిస్తుంది. ఏదో రూపంలో ఆరాధిస్తుంది. ఆ తపన తపస్సుగా, అగ్నిజ్యోతిగా పరిణమించి లోపల నిద్రిస్తున్న దైవత్వాన్ని జాగృత పరుస్తుంది. అప్పుడొక ప్రచండ మారుతం ఉప్పతిల్లినప్పుడు

భౌతిక శరీరం ఆ వేగానికి తట్టుకోలేక కూలిపోతుంది. ప్రశాంతస్థితి నెలకొన్నప్పుడు హృదయం బ్రహ్మానంద స్పందనలు తెలుసుకుంటుంది.

కాలం గళం విప్పి భగవంతుని గానం చేస్తుంది. అప్పుడే పారవశ్యం, ఆనంద రసోదయం. ఆ క్షణాలు పారవశ్యపు రెక్కలు కట్టుకుని దిగివస్తాయి. అనూహ్య సౌందర్యం స్వర్గధామంగా మారుతుంది. స్వప్నసీమల సరిహద్దులలో కరిగిపోతుంది. గగనవిహారం చేసే అద్భుతాలు శాంతి సాగరతీరాల వెంట విహరించే మృత్యుంజయులకు స్వాగతం చెబుతాయి. పరబ్రహ్మకాంతుల నుండి మహత్వాలు వెలువడతాయి. దివ్యమార్గాలన్నింటిలోనూ పరమాద్భుతాలే ఉంటాయి.

పరానుభూతి ఒక్కటే ఉత్తమమైన ఆనందం అందిస్తుంది. ఆత్మ ఆనంద లాస్యమే మానవజీవితం. ఆ ఆనందానికి ప్రేమ సహధర్మచారిణి. ఆత్మతేజస్సు సశరీరిగా భాసిస్తుంది. జీవితంలోని వైరుధ్యాలు జగన్మాత అనురాగానికి రెండు తీరాలు.

దివ్యత్వానికి తోడుగా పవిత్రత, కరుణ, అనురాగం దేవతలకు సహజ వనరులు. దివ్యలోకంలో ఎవరూ బలహీనులు కారు కనుక అనృతానికి అవకాశం లేదు. అనృతం లేని చోట అమృతం ప్రవహిస్తుంది. సత్యం ఉన్న చోట అమాయకత్వం ఉంటుంది, నిరాడంబరత్వం ఉంటుంది, ప్రేమ ఉంటుంది, కరుణ ఉంటుంది. స్వర్గంలో రగిలే ప్రేమాగ్నులతో ఆనందం ఒక సమిధ. ప్రతిభా వ్యుత్పత్తులు ఎప్పుడూ సౌందర్యారాధనలే. ప్రశాంత ఆధ్యాత్మికత ముందు ఎంతటి శక్తి అయినా తలదించుతుంది. ఎంతటి జ్ఞాని అయినా, తపశ్శాలి అయినా బ్రహ్మానందానికి తలవంచుతాడు.

ఆ లోకం ఔన్నత్యం అర్థం కాదు. అక్కడి ప్రజ్ఞలు ఎవరి స్వంతం కావు. అవి సర్వ స్వతంత్రాలు. అవి పరమాత్మకు ప్రతీకలు. ఆత్మతో దర్శించగలిగినప్పుడే వాటి మహత్తు తెలుస్తుంది. వెలుగులు కనిపిస్తాయి. పరమాత్మ వెలుగులో అన్ని శక్తులు ప్రకాశిస్తాయి. కాంతిమండలాలలో ఏ దృశ్యాలు స్థిరంగా ఉండవు. స్వప్నాలలో కదిలినట్లు జారిపోతుంటాయి. ఎక్కడ చూచినా దేవతా సమూహాలు, సమాహారాలు, అందరూ సంకల్ప సిద్ధులే. సిద్ధ సంకల్పులే. వారి విలువలే వారికి సింహాసనాలు. ఆయా దేవతల శక్తులు అద్భుతం. వారి ఆధిపత్యం స్వతంత్రం. ఎవరికెవరూ అనుబంధం కాదు.

అక్కడి వస్తుచయం సౌందర్య విలసితం. శక్తిపూర్ణం. అక్కడి వారి శక్తులన్నీ

దైవికాలు, దైవదత్తాలు. అందరూ ఒకే ధర్మాన్ని పాటిస్తారు. ఎవరెంత ప్రతిభావంతులైనా, శక్తివంతులైనా పరబ్రహ్మకు అధీనులే. ఆత్మ శరీరులు చేసే పనులన్నింటిలో దివ్యత్వం ఉంటుంది. వారివి పరిమిత ప్రణయాలు. ఆధిపత్యం లోనూ, ఆనందంలోనూ, సేవల్లోనూ అందరూ సమభాగులు. ఏ ఇద్దరిని కలిపేదైనా ప్రేమే. ప్రేమే హృదయం, ప్రేమే స్వర్గం. ప్రేమించడంలోనే స్వర్గ సుఖం ఉంది. ప్రేమ శక్తిగా పరిణమిస్తుంది.

ఆరాధన వల్ల సాధకుని శక్తి పెరుగుతుంది. చేసేది దేవతారాధన అయినా పొందేది బ్రహ్మానందం. అధిష్టానదేవత సర్వశక్తి సమన్వితురాలు. శక్తి స్త్రీ పరంగానే పెరుగుతుంది. ఏ దేవతను నిర్మలచిత్తంతో ధ్యానించినా, సమర్చించినా సంపూర్ణ సమర్పణ అవసరం. అప్పుడు ఈశ్వరీయతకు జీవుడు అర్హుడవుతాడు. సాధకునికి పూర్ణ విశ్వాసం అవసరం. ఆరాధన ఆధ్యాత్మిక ఉన్నతికి తొలిమెట్టు. ఏ లోకానికి చేరాలన్నా జగన్మాత అనుగ్రహం పొందవలసి ఉంటుంది. దైవప్రసాదాలు భక్తులకు నెమ్మదిగా సంక్రమిస్తాయి.

తేజస్సు పొందిన జీవుడు పరాశక్తి అనుగ్రహం పొందగలడు. తన ఇచ్ఛాశక్తితో ఆమెను చేరగలడు. ఆమె తేజస్సును తనలోకి సంభావించగలడు. జగన్మాత రూపాలన్నింటిలో ఆమె వర్చస్సును దర్శించి పరమాత్మకు తనను సమర్పించుకోగలడు. యోగి ప్రజ్ఞాప్రాభవాలకు, దీక్షాదక్షతకు ప్రకృతి పరవశించి, తన శక్తుల్ని అతనికి ప్రసాదిస్తుంది. ఎలాంటి అవరోధాలు కలిగించదు. యోగాగ్నిలో తాను కాలి, తపోతేజస్సుగా మారి యోగి వశమవుతుంది. అలా ప్రకృతిని జయించిన పరమాత్మను చేరగలుగుతారు.

యోగభూమికపై పరాశక్తి ఒక గోళాన్ని సృష్టించి సాధకునకు మనోనైర్మల్యం అందిస్తుంది. ఆత్మ అనుభూతి చెందిన విషయాలను మనస్సు భద్ర పరుస్తుంది. యోగి తన అనుభూతిని జ్ఞానంగా మార్చుకుంటాడు. తన సాధనతో దేవిని ప్రసన్నం చేసుకుంటాడు. దైవ శక్తులు అతని వశమవుతాయి. కాషాయాంబరాలు ఇష్టపడినా ఆమెలో రాజసం ఉట్టిపడుతుంది. ఆలోచన, శోధన, సాధన వల్ల కుండలిని చేరవచ్చు. కుండలిని దైవతానికి ఆవాసం. అదే మూలాధారం. అంతర్దృష్టితో సంకల్పించినవన్నీ వాస్తవాలవుతుంటాయి. యోగి సంకల్పం నెరవేర్చడం జగన్మాతకు యిష్టం.

దేవిశక్తిలో ఉరుములు, మెరుపులు ఉంటాయి. అందులోనే ఈశ్వర తేజస్సు ఉంటుంది. వాటిని నిలవరించేందుకు అసురశక్తులు విజృంభిస్తాయి. జీవుడు

తనపై అధికారాలను మనస్సుకు సంక్రమింప చేస్తాడు. మనస్సులో విషాదం, ఆనందం ప్రక్కప్రక్కన ఉంటాయి. ఆలోచనలు స్వప్నాలవుతాయి. స్వప్నాలు వాస్తవాలుగా మారతాయి. పరమాత్మను చేరే మార్గం దొరికే వరకు ప్రాపంచిక బాధలు తప్పవు. అక్కడ చాపల్యాలు, ఆనందాలు ఉన్నా మనస్సు, హృదయం యధేచ్ఛగా పనిచేస్తాయి. శరీరమే దివ్య మందిరం అనిపిస్తుంది. ప్రతి వాంఛ చుట్టూ ఒక తేజోవలయం ఏర్పడినప్పుడు మనిషిలో పశుప్రవృత్తి నశించి, ఆత్మ విముక్తి కలుగుతుంది. ప్రేమ, సౌందర్యారాధన, తన్మయత్వం అనేవి దివ్యాంశలు.

స్వర్గ సుఖాలకు చేరువగా నున్న ఆ లోకంలో జీవనలాలస నశించిపోదు. అక్కడ జీవితానికి అలసట ఉండదు. స్వయంకృషిలోనే తృప్తి, ఆనందం లభిస్తాయి. శక్తులను ఉత్పత్తిచేయడమే స్వర్గలోకవాసుల ప్రథమ కర్తవ్యం. అక్కడ దివ్యత్వం సదా మహత్వపూర్ణంగా ఉంటుంది. మన భౌతిక రూపాల వలె కాదు... అక్కడ దేనికీ నశింపు ఉండదు. అక్కడ జీవించడమే ఒక బ్రహ్మానంద లీల. ఎవరికీ వార్ధక్యం కలగదు. మృత్యుభయం ఉండదు. బాధలు, పరితాపాలు ఉండవు. గ్రహాల నుండి అందుకునే శక్తితో అక్కడివారు నిత్యం ఆనందంగా ఉంటారు. అందరూ పరమాత్మ వారసులే. గాలిలో, కాంతిరూపాలతో ఎగిరిపోతుంటారు. వారిని అగ్నులు, తుఫానులు కదిలించవు. సముద్ర జలాలలోను కలిసిపోగలరు. ఎంత దూరమైనా క్షణంలో, సంకల్ప మాత్రంచే వెళ్లగలరు. స్వశక్తిచే నిమిషంలో సృష్టిలోని గోళాలన్నింటిని చుట్టి రాగలరు.

అక్కడి దేవతలు నక్షత్రకాంతుల వలె అఖండ తేజస్వరూపులు. వారి వల్ల స్వర్గం మరింత కాంతివంతమవుతుంది. ఆ కాంతిని వెంటబెట్టుకునే వారు భూలోకానికి వస్తుంటారు. క్షణకాలంలో మానవ హృదయంలో దివ్యత్వాన్ని పూరించి వారు కోరిన వరాలు అనుగ్రహిస్తారు. అదే దేవతలకు మనుష్యులకు గల అనుబంధం.

పవిత్ర భావాలను ఆత్మ ఆదరిస్తుంది. ఆత్మ ఎప్పుడూ పవిత్రతనే కోరుతుంది. మనస్సు ఆలోచనలతో నిండి వాగ్రూపంలో అభివ్యక్తమవుతుంది. మనస్సుకు ఆలోచనలు ఎలా కలుగుతాయో తెలియదు. భావాలకు ఆధారాలేవో అర్థం కాదు. ప్రకృతి విలాసాలలో విజ్ఞానమే ప్రధానం. మనిషి హృదయంలో ఒక కాంతి కిరణం ప్రవేశించినప్పుడు భగవంతుని పట్ల ఆకర్షణ ఏర్పడుతుంది. దివ్యజీవులు రోదసిలో సంచరిస్తూ, సృష్టికే అందాలను అద్దుతుంటారు. యోగపూర్ణమైన ఆత్మలు పరిణామానికి సహకరిస్తాయి. సిద్ధాత్మలు సర్వ

స్వతంత్రంగా ప్రపంచ జీవులకు ఆనందాన్ని అందించడానికి వేగిర పడు తుంటాయి. వారికి కలిగేది ఆత్మతృప్తి, అందులో స్వార్థం ఉండదు. పరార్థచింతన గల ప్రతివ్యక్తికి మహాత్ములు తరతమ భేదం లేకుండా సహాయపడుతుంటారు. దివ్యాత్మలకు మానవులంతా ఒక్కటే. ప్రేమించిన వారికి శాంతిని ప్రసాదించడమే వారి లక్ష్యం.

స్వర్గభూములలో మాధుర్యాలకు కొదవుండదు. కాలపురుషుని పెదవులపై కదిలే లాస్యం అది. సంకల్పం స్వతంత్రంగా విశ్వవ్యాప్తమవుతుంది. ఆత్మ రెక్కలు విప్పుకుని బ్రహ్మానందానికై పరుగులు తీస్తుంది. ప్రతి పనిలో ఔన్నత్యం, విశ్వకళ్యాణ కాంక్ష ఉంటాయి. యోగి హృదయం నిర్మలమై, యోగాగ్నిలో కాలి సంస్కారం పొందుతుంది.

మనవలె అక్కడ ఆత్మలు విడివిడిగా ఉండవు. ఎవరికీ మనస్సు ఉండదు కనుక 'భావం' ఉండదు. ఉండేవి రెండే రెండు. ఆత్మ–సంకల్పం. సృష్టికి ఆధారమైనది సత్యం. సత్యం ఎన్నటికీ నశించదు. ఉన్నదంతా సహజశక్తి. ఊర్ధ్వ లోకాలు ఒకదానిపైగా ఒకటి ఏర్పడి ఉంటాయి. స్వర్గం అంటే సౌందర్యం. స్వర్గం అంటే సుఖం. స్వర్గలోకాలన్నీ సౌందర్యసీమలే. ఆనందలోకాలే. ఆ సూక్ష్మలోకాలలో జీవుడు స్వేచ్ఛగా, తన వాంఛల్ని తీర్చుకుంటాడు. నిర్విరామంగా సుఖాలు అనుభవిస్తాడు. జీవుని ఆనందాలకు, అనుభవాలకు అవరోధం ఉండదు. రకరకాల స్వర్గసుఖాలు కోరినన్ని అనుభవించవచ్చు.

స్వర్గలోకాలలో, విహాయసంలో ఆత్మల సంచారం, సంరంభం ఎక్కువ. స్వర్గ సుఖాలు, అనుభవాలు ఆశించని ఆత్మలు, ఆత్మ శరీరాలతో అగోచరంగా చరిస్తుంటారు. వారి స్పర్శకు మానవాత్మ మేల్కొంటుంది. సుషుప్తి నుండి ఒక్కసారిగా ఉలిక్కిపడినట్లు లేస్తుంది. అప్పుడే జన్మించిన శిశువువలె ఆనందం పట్టలేక రోదిస్తుంది. పరమాత్మ స్పృహతో ప్రేమను రుచిచూస్తుంది. ప్రతి ఆత్మ పైన పరమాత్మ సంకల్పం పనిచేస్తుంది. పరమాత్మ స్పృహ చైతన్యం కలిగిస్తుంది. మనిషికి మనస్సే సాక్షి. పరమాత్మ స్పృహ మనస్సు ద్వారా ఆత్మకు అనుభూత మవుతుంది.

ఏ కారణంగా నైనా మనిషి పతనం చెందితే ఆత్మ దివ్యత్వాన్ని కోల్పోదు. ఆత్మ తేజస్సుకు చీకట్లు అడ్డురావు. ఆత్మ ప్రగతికి ఎలాంటి అవరోధాలు ఏర్పడవు. ఆత్మకృతులన్నీ సంపూర్ణంగా ఉంటాయి. ఆత్మ దేనిపైన ఆధారపడదు. స్వతంత్రంగా ఉంటుంది. మనస్సును, ఆలోచనలను మెరుగుపరుస్తుంది. దివ్యత్వానికి బాట

లేర్పరచి, మహత్తర స్వప్నాలను కల్పిస్తుంది. తనకు కావలసిన రూపాలను సృష్టిస్తుంది. పరమాత్మ సంకల్పం తన ద్వారా నెరవేరుతుందని ఆత్మకు తెలుసు. కనుక తాను పరమాత్మకు ప్రతినిధి అవుతుంది. ఆత్మ స్వసంకల్పంతో పరమాత్మవలె మహాద్భుత కార్యాలు చేయగలదు. తానే దివ్యత్వానికి, తన్మయత్వానికి ప్రతినిధి అవుతుంది.

★ ★ ★

ఆ ఆనందలోకాలు తనను ఆహ్వానించి, స్వాగతం చెబుతున్నట్లు అశ్వపతి భావించాడు. కాని ఆ ఆనందసీమలకు చేరే మార్గం కనిపించలేదు. తనకూ స్వర్గానికి మధ్య నున్న అఖాతం దాటితే తప్ప తనలో చైతన్యం కలగదు. అతని చుట్టూ చీకట్లు కమ్ముకునే ఉన్నాయి. తనను అస్థిరత శరీరానికి కట్టివేసి, కదలనీయడం లేదు. అతనిలో తపన, అందుకోవాలన్న ఆకాంక్ష ఎక్కువైంది. ఆ లోకానికి తను చేరలేనన్న అనుమాం. ఈ లోకానికి బాధలు, విషాదాలు, విచారాలు, సుషుప్తి కలిసి రచించిన నైరాశ్య చిత్రపటం. తాను చూచిన ఆనందలోకం కేవలం తన భ్రాంతి అన్న ఊహ. సుదూరాన ఉన్న లోకం యదార్థమే అయినా, ఈ యాతనామయ ప్రపంచాన్ని వదలిపోలేని దుస్థితి తనది.

అప్పుడప్పుడు బ్రహ్మానందాన్ని పొందగలిగినా, అనుభూతి చెందుతున్నా, తన స్వభావం మానవనైజాన్ని వదలలేకపోతున్నది. అది మానవ బలహీనత. సులభంగా మనిషి ప్రవేశించగలిగేది చీకటి గదులలోకి. మనిషి ప్రాపంచికతను వాంఛిస్తూ, దానిలో తలమునకలై ఉన్నంత కాలం వెలుగులు అందవు. మనిషి ఆరాట పోరాటాలకు అలవాటుపడి అందులోనే ఆనందం, సుఖం ఉన్నాయను కున్నంత కాలం వాటినే తిరిగి తిరిగి కోరుతుంటాడు. అలా ద్వంద్వంగా జీవించడమే మనిషికి యిష్టం. సృష్టి ఏర్పడిన తొలినాళ్ళలో జీవం లేదు. మనస్సు లేదు, హృదయం, వాంఛలు లేవు.

చైతన్య రహితమైన శూన్యం నుండి భూమి ఏర్పడినప్పుడు, ఇప్పుడున్న భౌతికత్వం, భోగలాలసత్వం లేవు. కేవలం ఆకాశం, నేల, పర్వతాలు ఉండేవి. ఆ జడ ప్రపంచంలో కదలిక ఏర్పడటానికి, వాటిని కదిలించగల జీవాన్ని ప్రసాదించి, జీవానికి ఆధారమైన ఆత్మల్ని మనుషుల్లో ప్రవేశపెట్టింది దేవతలు. అప్పుడు నిశ్చల సౌందర్యంలోకి, నగ్నత్వంలోకి శబ్దాలు చొరబడి ప్రకృతిని కదిలించాయి. జడ ప్రపంచం తర్వాత శబ్ద ప్రపంచం ఏర్పడింది. జడ ప్రపంచానికి పరమాత్మ అవసరం కలగలేదు. అక్కడ జీవం, ఆత్మ ఉంటే కదా పరమాత్మను ఆరాధించడానికి, ఆహ్వానించడానికి.

జడ ప్రపంచంలో మొదట చలనం, స్పందన లేవు. వేదన సృష్టి లోపల ఇమడలేకపోయింది. ద్రవ్యంతో కలసి ఉండలేక జీవం బయటపడ్డది. కళ్లు విప్పింది. ఆత్మీయత కోసం ఆరాటపడ్డది. మాట కోసం, మమత కోసం భావం కోసం, ప్రేమ కోసం, ఆనందం కోసం వెతకసాగింది. రాత్రింబవళ్లు చీకటిలో మనలేక, ఆలంబన కోసం అర్రులు సాచింది. ఆత్మీయత కోసం పలవరించింది. మనస్సు ఏర్పడ్డది. ఆత్మ కారణంగా దివ్యత్వం మనిషిలో ప్రవేశించింది. గిరగిర తిరిగే గోళంలో నాదం ఉద్భవించింది. శూన్యం శబ్దానికి కలత చెందింది. ఏమీ లేని శూన్యంలో జీవం శ్వాస పోసుకున్నది. క్రమశః అంధకారంలో వెలుగు ప్రవేశించింది. చైతన్యం వెంట ఆనందం చొరబడ్డది. అచిరకాలంగా నిద్రిస్తున్న లోకం మేల్కొన్నది. ఆత్మ తన హక్కును పునరుద్ధరించుకుని, జీవం కోసం, ఆనందం కోసం అర్రులు చాచింది. ఆత్మ పిలుపు విన్న జీవం, తనదైన మహాప్రాణ మండలం వదలి, శూన్యాన్ని దాటి, భౌతిక ప్రపంచంలో ప్రవేశించింది. చైతన్యం పొందిన జీవికి కొన్ని బాధ్యతలు ఏర్పడ్డాయి. పరమాత్మ ఆత్మను తన ప్రతినిధిగా చేసుకుని మనిషికి అతని మనస్సు పైన ఆధిపత్యం యిచ్చింది.

ఒక దైవశక్తి ప్రపంచంలోకి దిగి వచ్చి మానవ శరీరం ధరిస్తే మనిషి జీవితం దివ్యత్వంతో నిండిపోతుంది. దైవశక్తి తన స్వభావరీత్యా తన దైవసంపదను, ప్రేమను అందరికీ పంచియిస్తుంది. మానవ రూపంలో దివ్యత్వం ఎక్కువ కాలం నిలబడదు. కనుక ఆ ఉన్న కొద్దికాలంలోనే దివ్యత్వాన్ని ప్రపంచానికి పంచి పెడుతుంది. మనిషి ఆలోచనలు, ఆశయాలు పరప్రజ్ఞతో నిండిపోతాయి. మనిషి శరీరం సైతం దివ్యతేజస్సును పొందగలుగుతుంది. భౌతిక జీవనంలో అలా దివ్యత్వం ప్రవేశించి నిలబడుతుంది. దివ్యత్వం స్వతంత్రంగా భూమిపైన నెల కొనదు. దానికి ఆధారం, ఆలంబన మనిషి.

అలా జీవస్పందన పొందిన భూమి పచ్చని చెట్లతో, ఆకులతో, పూలతో శోభించింది. ఆకాశం సగర్వంగా సముద్రంలోకి తొంగిచూచి, తన ప్రతిబింబమైన నీలిమను చూచి పరవశించింది. నదులలో జలచరాలు, అరణ్యాలలో వనచరాలు పుట్టుకొచ్చాయి. పశుపక్ష్యాదులతో లోకం కొత్త అందాన్ని సంతరించుకుంది. మనిషి మనస్సుకు ఆలోచన తోడైంది. ఆలోచించడం నేర్చిన మనిషి ఆత్మకై అన్వేషించ సాగాడు.

దివ్య మహత్తులు మనిషికి అందుబాటులోకి వచ్చేలోగా, దివ్యఫలాలు మనిషి అనుభవించేలోగా నైరాశ్యం క్రమ్ముకుంది. ఈశ్వర సంకల్పం సైతం ఆ నిరాశకు

తలవొగ్గి చీకటిలోకి జారిపోయింది. మనిషి మనస్సు, శరీరం క్లేశాలకు, కష్టాలకు గురైంది. మనిషిని బాధ, మృత్యువు వెన్నంటి బాధించసాగాయి. మనిషి ప్రాపంచిక బాధలలో పడి నలిగిపోతూ, సతమతమవుతూ అంతా తన పూర్వజన్మ దుష్కృతంగా వాపోసాగాడు. తన దివ్యత్వం గురించి, ఔన్నత్యం గురించి అనుమానాలు పెంచు కున్నాడు. కాని, అంతరంగంలోని పరమాత్మను విస్మరించాడు. ప్రపంచంలోని అందాలు, ఆనందాలు తాత్కాలికాలే. అన్ని అందాలను అంధకారం స్వాహా చేస్తుంది. అన్ని ఆనందాలను మృత్యువు మ్రింగివేస్తుంది. సుఖ దుఃఖాలు రెండూ పరమాత్మ సేవకులేనని మనిషి గుర్తించడు. మనిషిని ఆవరించిన నైరాశ్యం నీడలో మహత్తరమైన ఆత్మశక్తి, దివ్యత్వం కనిపించవు. జీవి అనుభూతించిన దివ్యానందాలు ఏవీ ఇక్కడ కనిపించవు. ఔన్నత్యం ఆదిలోనే అస్తమిస్తుంది. మనిషి మమతలు, మాధుర్యాలు చివరకు ఎండమావులవుతాయి. ఎంత తపస్సు చేసినా మనిషికి మరణం తప్పదు.

ఆత్మ అనంతత్వంపైన మానవత్వం ఒక మేలి ముసుగు. జడ ప్రకృతిపై ఆత్మచైతన్యం ఒక ఆచ్ఛాదన. ఇది మృత్యుగాధలో ఒక ఉపాఖ్యానం. మృతి లేనిది ఆత్మ విచిత్ర చరిత్ర. అది ప్రకృతి పరిణామంలో దాగిన సృష్టి వైచిత్రి.

38. అల్పప్రాణిలోకం

కారణజన్ముడైనా, సిద్ధపురుషుడైనా ప్రాపంచిక యాతనలు, బాధలు భరించక తప్పదు. మనస్సుకు ఆరంభంలో జీవితమార్గాన్ని మార్చగల శక్తి ఉండదు. మనస్సు ఆశలు కలిగించి, ఆశయాలు కల్పిస్తుంది. వివేకం చెందిన మనస్సు మనిషికి మార్గం చూపుతుంది. సాధనలోనూ శ్రమ ఉంది. ఆశయం కొంతవరకే నెరవేరుతుంది. ప్రగతికి అనేక అవరోధాలు ఏర్పడతాయి. ఆధ్యాత్మికంగా అభివృద్ధి కనిపించదు. మనస్సుకు జడత్వం ఏర్పడి మార్గం స్పష్టంగా కనిపించదు, ఆశ చావదు. అశ్వపతి అల్పప్రాణి లోకాలు చేరాడు. అక్కడ మృత్యువు ఉంది. యుగయుగాలుగా చీకటిలో, బురదలో జీవిస్తున్న ప్రాణుల లోకం అది. క్రిమికీటకాలలో, విషజంతువులలో ఉన్నదీ ప్రాణమే. మనిషి ప్రవృత్తిపరంగా జంతువులతో, విషక్రిములతో సహజీవనం సాగిస్తున్నాడు.

మానవజాతి ఎంత ప్రగతి సాధించినా ప్రేమ, అవగాహన లోపిస్తున్నది. అల్పప్రాణి లోకంలో మూడవ దశలో మనిషి తయారైనాడు. మేధోజీవి అయిన మానవుడు విజ్ఞానాన్ని సాధించాడు. మనిషి మనస్సు మహిమాలయం అయింది. నిజానికి మనిషికి మనస్సు కొంతవరకే సహాయపడుతోంది. ఆపైన మనస్సు అప్రధానం అవుతుంది. మనిషిని ఊర్ధ్వగతిన తీసుకు పోగలిగింది ఆత్మ. భౌతిక సుఖాలు, వాంఛలు మనిషిని భూమికి కట్టివేస్తాయి. అందుకే మనిషితో పాటు మనస్సు పతనమవుతోంది. ప్రజ్ఞ గాలిలో కలిసిపోతోంది. మనిషిని, అతని మేధను ఉద్ధరించవలసింది ఆత్మ.

జగచ్ఛక్తి ప్రవేశించిన శూన్యం నుండి మొదట విషాదస్వరాలు, విచ్ఛిన్నకర శక్తులు ప్రభవించాయి. ఒక భయంకర ప్రాణిలోకం ఉప్పతిల్లింది. వాతావరణం కల్లోలితమైంది. దానిని ప్రతిఘటించడానికి ఒక చైతన్యశక్తి మరొక దిశలో

కదిలింది. ప్రగాఢ సుషుప్తి నుండి చైతన్యం మెల్లగా మేల్కొన్నది. అది మరొకశక్తిపై ఆధారపడకుండా తన ప్రతిభను వింగడించసాగింది. అదే ప్రాపంచిక జ్ఞానంగా మారింది.

ఆలోచనలు అందని స్థితిలో, ఆత్మ తనను తాను ఉద్ధరించుకోవాలన్న ప్రయత్నం విరమించి, అంధకారంలో చేతులెత్తి ఆక్రోశించింది. అందుచేతనే భౌతిక యాతనలు లోపల అణచి పెట్టి బ్రహ్మానందాన్ని శూన్యస్థితిలో అన్వేషిస్తుంది. శూన్యంలో చరించడమే ఆత్మానందం. అందుచేత మనిషి ఆశించే పరాన్ని ఎప్పటికీ అందుకోలేకపోతున్నాడు. ప్రపంచంలో లభించని దానికై అన్వేషణ. జీవితంలో తీరని అసంతృప్తి. భూమిపైన ప్రశాంతంగా జీవించాలన్న తపన. జీవుడు పరమాత్మకై అన్వేషణ. జీవుడు జీవనలయను శ్రుతి చేయాలి. అందుకు ఆత్మశక్తి తోడుపడాలి.

ఒక దివ్యప్రేరణ మనిషిని ప్రాపంచిక దాస్యం నుండి విముక్తం చేస్తుంది. ఒక దివ్యభావన జీవితంలో స్పందన కలిగిస్తుంది. నాడీచలనం వల్ల జీవునిలో చైతన్యం కలుగుతుంది. అది మనస్సును సుషుప్తినుండి వేరుపరచి చైతన్యం కలిగిస్తుంది. అప్పుడు మనిషికి ఆరాటం, జిజ్ఞాస కలుగుతుంది. పరాశక్తి భూమిని సోకకపోతే భూమి జడంగానే ఉండిపోయేది. అన్ని గోళాలవలె భూగోళంసైతం నిర్జీవంగా ఉండేది. మనిషి హృదయంలో వాంఛ కలగడానికి, రగలడానికి పరాప్రకృతి కారణం. పరాశక్తి కారణం. వాంఛ రూపరహితమైనా సుఖలాలస హృదయంలో చోటుచేసుకుంటుంది. ఎన్ని బాధలు పడినా వాంఛలకు తలవొగ్గడం జరుగుతుంది. అందని వాటికై ప్రయత్నించడమే ప్రగతికి నిదర్శనం.

భూమిని స్వర్గంగా మార్చాలన్న సత్సంకల్పంతోనే దివ్యత్వం శక్తిగా భూమికి దిగివచ్చింది. భూమిపైన అవతరించగానే బాధలకు లోనైంది. జిజ్ఞాస మాటున నక్కి కూర్చున్నది. పరిణామంలో మొదటనే అపస్వరం పలికింది. మనిషి పొందవలసిన దివ్యత్వం దూరమైంది. విషాదం మనిషిని మరిన్ని పరీక్షలకు గురిచేసింది. మనిషికి బరువులు, బాధ్యతలు అధికమైనాయి. అంతటి అసంతృప్తి లోనూ మనిషి పరమాత్మను విస్మరించలేదు. పరాశక్తిని ఆరాధిస్తూనే ఉన్నాడు. అన్వేషణ ఆపడం లేదు. తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలుగుతూనే ఉంది.

మనిషి జీవితంలో బాహ్యాడంబరాలకు స్వస్తి చెప్పాలి. తనలో నిగూఢంగా ఉన్న శక్తిని బయటకు తీయాలి. తానే మనస్సై, మనస్సే ఆత్మగా మారిపోవాలి.

శరీరం అశాశ్వతం అని భావించక ప్రకృతిని జయించడానికి శరీరాన్ని కర్మక్షేత్రంగా మార్చుకోవాలి. తనలో నిద్రాణమై ఉన్న శక్తిని మేల్కొల్పినప్పుడు పరమాత్మ చేరువవుతుంది. కనిపించని మహాశక్తుల్ని పొందడం మనిషి లక్ష్యం కారాదు. ఆత్మబలంతో నిర్విరామంగా సాధన సాగించాలి, అన్వేషించాలి. భౌతిక శరీరావరణ లోనే జీవస్పందన సాధ్యం. అచేతనం నుండి అద్భుతశక్తి ఉద్భవిస్తుంది. దానిని మనం అనుభవించవచ్చు, అనుభూతి చెందవచ్చు.

రోదసీగర్భంలో జరిగిన శూన్యపరిణామం మనం గుర్తించం. జగన్మాత జడంగా ఉన్న ప్రపంచంలో ఎంత చైతన్యం కలిగించిందో మనం ఊహించలేం. ఆమె సంకల్పంతోనే మన ఆత్మ మేల్కొన్నది. విశ్వాహృదయంలో జగన్మాత కాంక్ష రగిలింది. ప్రపంచం పరాశక్తి ప్రచోదనం వల్లనే చైతన్యవంతమైంది. నిశ్శబ్దంగా ఉన్న విశ్వం నుండి శబ్దం ప్రభవించింది. మనిషికి ప్రేరణ కలిగింది. పరమాత్మ సంకల్పాన్ని జగన్మాత తన సంకల్పంగా మార్చుకుని, మానవ ప్రపంచంలో చొర బడింది.

ప్రాణికోటి జన్మించడానికి సిద్ధపడినప్పుడు జగన్మాతకు పురిటి నొప్పులు ప్రారంభమైనాయి. మొదట జన్మించింది ఆత్మ ఒక్కటే. జీవికి జీవం ప్రధానం. మనిషికి తన పూర్వస్థితి తెలియదు. తన దివ్యత్వం మరచిపోతాడు. కాని జిజ్ఞాస మాత్రం ఆత్మబద్ధమై ఉంటుంది. జగన్మాత తనను బంధించిన మనస్సునే పావుగా చేసుకుంది. సంకల్పం మాత్రం తనది, సాధనా సంపత్తి సత్యానిది. కృషి, పరిశ్రమ, ఫలితం జ్ఞానానిది.

భౌతిక శరీరానికి వ్యామోహాలు, వాంఛలు అవసరమైనాయి. అవి ప్రతిసృష్టికి అవసరం. ప్రతిసృష్టి జరగకపోతే సృష్టి స్తబ్దంగా, పరిణామరహితంగా ఆగిపోయేది. పరిణామానికి పునసృష్టి అవసరం. మనిషి కాస్త జ్ఞానం కలిగిన తర్వాత తన పూర్వస్థితిని పొందడానికి దైన సహాయం అర్థించాడు. దైవసహాయం అందనప్పుడు క్షుద్రశక్తుల సహాయం అర్థించసాగాడు. మార్మికశక్తుల కోసం తాంత్రిక పద్ధతులు అవలంభించాడు.

అతీంద్రియ లోకాలకు చేరాలంటే భౌతిక బరువులన్నీ నిరుపయోగం అవుతాయి. బరువులతో జీవుడు ముందుకు సాగడు. జీవుడు వివేకంతో ఒక్కొక్కమెట్టు ఎక్కుతుంటాడు. ఎప్పుడోగాని పరమాత్మ పిలుపు వినిపించదు. పైకి నెమ్మదిగా పోవడమే జీవికి సుఖం. మనిషి భౌతికబంధాలు త్రెంచుకుని

ఆత్మను ఆశ్రయించాలి. జీవునికి తన గత చరిత్ర తెలియదు. తను గతంలో చేసిన మంచిపనులూ తెలియవు. ఎన్ని జన్మలు గడిచినవో తెలియదు. ఏదో దివ్య తేజస్సు దిగి వచ్చి తనను ఉద్ధరిస్తుందని ఆశిస్తుంది. ఆ తేజస్సుకై అన్వేషిస్తుంది. బ్రహ్మానందం తనను పరలోకాలకు చేర్చుతుందని ఆశ. ఎప్పుడో ఒక మెరుపు మెరుస్తుంది. అదే పరమాత్మకు ప్రతినిధి. అది దివ్యపథం.

అజ్ఞానంతో ఎంత శ్రమించినా ఫలితం ఉండదు. జ్ఞానం కలిగినప్పుడు పరమాత్మ స్ఫురణ కలుగుతుంది. సుషుప్తిలో ఒక్కొక్కమెట్టు ఎక్కి పైకి పోయినకొద్దీ జీవుడు అనేకమంది దేవతల్ని దర్శిస్తుంటాడు. స్వర్గం కొరకు నరకద్వారం వద్ద వెతుకుతాడు. స్వర్గారోహణలో జీవుడు ఆత్మను వెన్నంటి పైకి పాకాలి. ఆత్మ ప్రస్థానం అతి ప్రశాంతంగా, నిశ్చలంగా సాగుతుంది. అదే జీవునికి అంతిమ యాత్ర అవుతుంది. అప్పుడు తన జన్మరహస్యం జీవునకు తెలుస్తుంది. భౌతిక శరీరంలో ఆత్మ బందీగా ఉన్నంత కాలం ఏమీ తెలియదు. ఆత్మ శరీరం నుండి వేరుపడి మహాయాత్ర ప్రారంభించినప్పుడు అసలు రహస్యం తెలుస్తుంది.

జీవికి పతనాలు, ప్రమాదాలు తప్పవు. అప్పుడప్పుడు ఆత్మవెంట పోలేక, కాలుజారి శూన్యంలోకి పోతుంటాడు. తిరిగి మనస్సును ఆశ్రయించాలని చూస్తాడు. అభావస్థితిలో మనసుజాడ తెలియదు. ఆ ప్రయాణంలో జీవునికి అడుగడుగున మృత్యువు తారసపడుతుంది. చీకటి జీవుని భయపెడుతుంది. అజ్ఞానం వల పన్నుతుంది. మధ్య మధ్య మృత్యువు ఒడిలో కునుకు తీస్తుంటాడు, లేస్తుంటాడు. ఆత్మ హెచ్చరించగానే మృత్యువు ఒడిలోంచి లేచి ఆత్మ వెంట పరుగుతీస్తాడు.

చీకటి నెలవుల్లోకి వెళ్లిపోయిన ఆత్మ మళ్లీ జన్మకు రావాలనుకోదు. సత్యానికి, తేజస్సుకు అందని దూరాలకు పోతుంది. తన స్థితిని గుర్తిస్తుంది. జన్మరాహిత్యం పొందుతుంది. బలహీనులు, భ్రష్టులు, పతితులను ఆశ్రయించిన ఆత్మలు మాత్రమే మరల జన్మను ఆశిస్తుంటాయి. అసత్యాలు కొన్ని చోట్ల సత్యాలుగా ప్రచారం పొందుతుంటాయి. దివ్యాంశతో జన్మించడం అసంభవం అనవచ్చు. జీవుడు వెలుగును, సౌందర్యాన్ని గర్హిస్తూ ప్రాపంచిక సుఖాలు మరగడం పశుప్రవృత్తిని ప్రోత్సహించడమే.

పాప కార్యాలు, పాశవిక చర్యలు ఆత్మను అంటవు. ఎప్పుడో ఆత్మ సంస్కారం పొందుతుంది. స్వర్గం నుండి పతనమై భూమిపైన జన్మించిన జీవుడు,

ఒకనాటి తన దివ్యత్వాన్ని గుర్తిస్తాడు. మానవ ప్రవృత్తిని వదలడానికి సిద్ధమవుతాడు. అజ్ఞానపు ముసుగు జారిపోతుంది. భౌతిక శరీరం అస్థిరమని గుర్తిస్తాడు. ఆ తెలివిడి కలిగినప్పుడు ఆత్మ నైరాశ్యం నుండి బయటపడి అంతవరకు అనుభవిస్తున్న మాంద్యాన్ని వదలి పెడుతుంది. అయినా జీవుని చుట్టుకున్న మాయ వదలిపోదు. వెలుగు కనిపిస్తున్నా చీకటి దారులలోనే పయనించడం జీవుని పొరపాటు. ఆ స్థితి నుండి జీవుని ఉద్ధరించడానికి దైవం దిగి రాదు. పరాన్ని ఆశించడం, గుర్తించడమే మహాపాపంగా భావిస్తారు కొందరు. నిత్యజీవితంలో దైవప్రసక్తి రానీయరు. చేజేతులా దివ్యత్వాన్ని వదులుకుంటారు. అందివచ్చిన అవకాశాలను చేజార్చుకుంటారు. పైగా ప్రాపంచికమైన ప్రమాదాల్లోకి కోరి పయనిస్తారు. వాటిని భరించడానికి జీవుడు సిద్ధపడతాడు.

రోదసిలో ఆత్మ నెలవులన్నీ పరమశూన్యాలు. పొగమంచు దట్టంగా వ్యాపించి ఏమీ కనిపించదు. ఒక్క వెలుగు కిరణం కూడా లోపలకు చొరబడదు. అది బధిరాంధకార బంధురం. అందులో ఆకృతులు, ప్రతికృతులు ఏవీ ఉండవు. అది అదృశ్యం, అరూపం, అవ్యక్తం, అయోమయం. ఆత్మకు ఏ ఆలంబన ఉండదు. ఆరాధన, అభ్యర్థన, ఆలోచన ఏవీ ఉండవు. అసలు ఆలోచించవలసిన అవసరం ఉండదు, అవకాశం రాదు.

ఆ శూన్యమే ఒక భయంకర నరకలోకంగా రూపుదిద్దుకుంటుంది. నరకం అంటేనే యాతనలమయం, బాధలమయం. పదార్థానికి పరార్థానికి మధ్య ఉన్న సన్నని సరిహద్దుపై ఆత్మ కదలాడుతుంది. ఆరంభాలు చేతికందినా అంతాలు చేజారిపోతుంటాయి.

అది అల్పప్రాణిలోకంలో ప్రాణి జన్మించి జీవితం ప్రారంభించక ముందే మరణిస్తుంది. క్షణిక జీవితాలు. కారణం గట్టినేల లేకపోవడం, చలనం లేకపోవడం. భావ రహితమైన శక్తి సంకల్పం అవుతుంది. ఆ స్థితిలో యోగి తన ఉనికిని తానే మరచిపోతుంటాడు. అది అవ్యక్తస్థితి. అక్కడ శూన్యంలో తనూ శూన్యంగా మారిపోతాడు. ఆ విచిత్ర లోకంలో అన్నీ పుట్టి వెంటనే గిట్టుతుంటాయి. కార్యకారణాలుండవు. అవ్యక్తంలో మెరిసే వెలుగురేఖతో అనేక అరూపశక్తులు కలిస్తే ఒక రూపం ఏర్పడుతుంది. అనేక కాంతికణాలు కలిస్తే వెలుగు కనిపిస్తుంది. అంధశక్తి వల్ల ఆలోచన సక్రమంగా ఉండదు. వెలుగుకోసం చీకటిలో వెతకడం అంటే అదే. అవ్యక్తశక్తి తానై చైతన్యంగా ప్రభవించాలి.

ఒక ద్రవ్యం మరొక ద్రవ్యంతో ఢీకొన్నప్పటి రాపిడివల్ల మెరిసిన మెరుపు వెలుగైంది. ఆ రాపిడి శక్తిగా మారింది. రెండు ధాతువుల సంయోగం వల్ల చలనం ఏర్పడ్డది. చైతన్యం కలిగింది. స్పందనలు వెల్లువలై, సంకల్పాలు కార్యరూపం దాల్చాయి. ప్రకృతి స్పందించడం జరిగింది. అది అంతా అసంకల్పిత ప్రతికూలచర్య. స్పందనలు ప్రవాహ సదృశంగా మారి చీకటితో తలపడడం జరిగింది. అరాచక లోకంలో స్వతంత్ర మనుగడ కోసం ఆరాటం, జీవించాలన్న తపన. కాలాన్ని సొంతం చేసుకోవాలన్న ప్రయత్నం అణువులో జరిగింది. అణుస్పందన వల్ల బ్రహ్మాండమైన సృష్టి ఏర్పడసాగింది. ప్రకృతి, ప్రతిస్పందన జీవికి సహజ ధర్మాలైనాయి.

జ్ఞానతృష్ణకు హేతువు కనిపించదు. ప్రేరణ మాత్రం ఉంటుంది. మనిషికి ఇంద్రియలాలస, చాపల్యం అవసరం. కోర్కెలు తీర్చకోడానికి ప్రజ్ఞ అవసరం లేదు. సూక్ష్మప్రాణిలోకం నిరుపయోగం అయింది. అన్నీ దుష్ఫలితాలు కలిగాయి. కృషి నిరుపయోగమైంది. ఆత్మ దానిని గుర్తించలేదు. ఎక్కడో మిణుకుమనే నక్షత్రకాంతిని చూచి తాను ఆ తేజస్సుకు ప్రతినిధి అయింది. మనస్సు లేని మహార్ణవంలో ఒంటరిగా కదిలింది. దివ్యత్వం దిగి వస్తుందన్న ఆశ ఆత్మది. లోకంలో ప్రతిపనికి ప్రయోజనం ఉంటుంది.

లక్ష్యం లేకుండా చేసినా ప్రతి పనికీ ప్రయోజనం ఉంటుంది. అది పరిణామానికి సహాయపడుతుంది. విశ్వకుండలిని మగతగా నిద్రిస్తున్న మహా సర్పం. అది మగత నుండి ఎప్పుడో బయటపడుతుంది. దానికీ జీవన లాలస ఉంది. మగత వదలకపోయినా, మనస్సు అద్భుతాలను ఊహించకపోయినా, ఆత్మ అధికారం పొందకపోయినా – పరిణామం ఆగదు. చైతన్యం పొగిలి తీరుతుంది. వల్లమాలిన వాంఛల క్రింద నలిగి, జీవన లాలసతో మగ్గి భౌతిక వాంఛలతో ఆత్మ చితికిపోతుంది. చీకటిలోనే కోరికలు విజృంభిస్తాయి. ప్రకృతి సైతం చీకటి లోనే సుఖపడడం నేర్చుకుంది. మృత్తిక నుండే ఆత్మ సంస్కృతి విప్పారుతుంది.

చీకటిలోనే పరిణామం కలుగుతుంది. అంధకారం నుండి వెలుగు ప్రసరించాలి. అజ్ఞానం నుండి జ్ఞానం ఉద్భవించాలి. ప్రకృతి పంకం నుండి పరమాత్మ ప్రభవిస్తుంది. మనోనేత్రం ఆధ్యాత్మిక వలయాలను సృష్టించి చీకటిలోకి దూసుకుపోతుంది. కాంతి ప్రవాహాల నిగూఢ రహస్యాలను ఛేదించి జడంలో చైతన్యం కలిగిస్తుంది. శారీరక వాంఛలు రగిలించి, సున్నితంగా కామాగ్ని

రగుల్చుతుంది. తనలో కామాగ్ని రగిలినట్లు జీవి గుర్తించదు. అది అనేక సంకేతాలలో వ్యక్తమవుతుంది. కామతృష్ణ అనేకరీతులలో తీరవచ్చు. బ్రాహ్మీస్థితి కలిగిన తర్వాత జీవితం వెలుగుబాటలో సాగుతుంది. ఆత్మ దేహానికి భిన్నంగా ఔన్నత్యాన్ని సంపాదిస్తుంది. సూక్ష్మశరీరంలోని ఒక నాడీ స్పందన వల్ల మనిషిలో దివ్యత్వం ఏర్పడుతుంది. అదే కాలం పొరల క్రింద సుప్త చైతన్యపు లోతులలో స్తబ్దంగా, మగతగా ఉన్న జ్ఞాపకాలను రేపుతుంది. ఆ క్రాంతి కిరణాలను మానవ నేత్రాలు భరించలేవు. కనుక అవి అనుభూతులుగా మిగిలిపోతాయి. ప్రవాహంలో తేలిపోతున్న గడ్డిపోచల వలె, ఆ జ్ఞాపకాలు నిద్రలో స్వప్నాలుగా కలవర పెడుతుంటాయి.

మనిషి జీవితం అపవిత్రం, ప్రవర్తన నీచం అయినా జీవుని అంతరంలో సత్యస్ఫూర్తి కలుగుతుంది. తనకు ప్రయత్నం లేకుండానే సత్యస్ఫూర్తి వల్ల పాపం నిర్మూలించబడుతుంది. మన పనులన్నింటిలో బ్రహ్మానంద స్పర్శ ఉంటుంది. జనన మరణాల మూగబాసలలో గత జన్మల సందేశాలు, సంస్కారాలు ఉంటాయి. సౌందర్యంలో ప్రవిమలానందం ప్రతిబింబిస్తుంది. లోకంలో సర్వేసర్వత్ర బ్రహ్మానందం దాగి ఉంది. గాలి కెరటాలలో, ఆకుల చలనాలలో ఆనందం చూడవచ్చు. ఆకుల మాటున వికసించే పూవులలో, అందచందాలలో దివ్యత్వం ఉంది, ఆనందం ఉంటుంది. చిన్న మొక్కలోనూ, మొలకలోనూ సౌందర్యం ఉంది. దానిని అనుభూతించగల సంస్కారం కావాలి. జంతువులలో, పక్షులలో మనుషులలో వలె హృదయ స్పందన ఉంటుంది. ఆ స్పందన వల్లనే సుఖలాలస కలుగుతుంది. జీవితంపై అనురక్తి ఏర్పడుతుంది. క్షణంసేపైనా సుఖించి, ఆనందించాలనిపిస్తుంది. జీవితాంతం కష్టాలకు, బాధలకు గురి అవుతున్నా చివరకు పరమాత్మను ఆశించడం జరుగుతుంది.

వెలుగుకు దూరంగా, ప్రాణుల సమూహాలలో మూగపోయి, నిశ్చేతనంగా ఉన్న జీవి, బ్రహ్మానంద స్థితిని తిరిగి పొందడం కోసం జన్మకు వస్తుంది. జీవధాతువు సుషుమ్న ద్వారా హృదయకేంద్రానికి చేరుతుంది. అదే సుఖ దుఃఖాలకు కీలకమవుతుంది. ఆంతర్యంలోని సచ్చిదానందాన్ని గుర్తించేవరకు ఆత్మ కోర్కెలకు బానిసై, దైహికసుఖాలు అనుభవిస్తుంది.

ప్రకృతి సహజమైన వ్యామోహాలను ఎవరూ నిగ్రహించలేరు. అవి రక్తంలో, భావంలో కలిసి ఉంటాయి. వాటిని కలిగించేది అనంత సచ్చిదానందమే. అది

మనిషిలో క్షణిక సుఖాల పట్ల కోరికను కలిగించి, వాంఛల్ని, ప్రేమను ఉధృతం చేస్తుంది. వాటిని నిరోధించాలని, జయించాలని ప్రయత్నిస్తాం. తద్వారా బ్రహ్మానంద స్థితిని చేరగలమని ఆశిస్తాం. వాంఛల్ని జయించి అందరితో ఆనందం పంచుకోవాలన్నదీ ఒక కోరికే. తానే సర్వంగా మారి, సర్వజగత్తును తనలో దర్శించి, విశ్వ కళ్యాణానికి తాను సహకరించాలని జీవుని సంకల్పం.

అదే మనిషి లక్ష్యం. ఆ లక్ష్యసిద్ధి కోసం సుఖాలను త్యాగం చేయడం జరుగుతుంది. ఆ ప్రయత్నంలో వైఫల్యానికి కారణం అజ్ఞానం. దేహికి ఇంద్రియ చాపల్యం ఉంటుంది. పాపకార్యాలకు ఒడబడుతుంటాడు. మనసులో దయ్యం ప్రవేశిస్తుంది. భూమిపైన మన జీవితాలు ఒక ధర్మసూత్రానికి కట్టుబడి ఉంటాయి. మనిషి మౌలిక ధర్మాలలో మార్పు కనిపించదు. మన జిజ్ఞాసలు మన పూర్వజన్మ సుకృతఫలాలు. జాగృత ప్రపంచంలో అది తొలి స్పందన. అదే పరమాత్మ తొలి పిలుపు. మనిషికి వివేకం ఏర్పడి, ఆత్మను గుర్తించినప్పుడు ఆత్మే మనిషిని నడిపిస్తుంది. జీవికి శ్వాస ఎంత అవసరమో మనిషికి ఆధ్యాత్మిక చింతన అంతే అవసరం.

అశాశ్వతమైన ప్రపంచంలో, అశాశ్వతమైన దేహంలో బందీ అయిన ఆత్మను రక్షించడం పరమాత్మ కర్తవ్యం. అందుకోసం మనిషికి ముందుగా చైతన్యం కలిగిస్తుంది పరమాత్మ. ఒక్కొక్క మలుపులో ఒక కొంత దివ్యత్వాన్ని అందిస్తూ, స్ఫూర్తినిస్తుంది. ఆత్మ క్రమంగా చైతన్యం పొందుతూ, శక్తిని సంపాదిస్తూ దివ్యత్వం దిశగా పయనిస్తుంది. అప్పుడు ప్రకృతి, పరిసరాలు కొంతవరకు దివ్యత్వం పొందగలుగుతాయి. అయినా అసురశక్తుల ప్రతిఘటన తప్పదు. లోపల నుండి ఒత్తిడి అధికమవుతుంది, ప్రతిఘటన ఎదురవుతుంది. ప్రయత్నం శూన్యం తీరానికి చేరి, నిరాశ జీవుని ఆక్రమిస్తుంది. అప్పుడు ప్రపంచం ఎంత శూన్యమో తెలుస్తుంది.

అంతులేని అంధకార శూన్యంలో ఆత్మకూడా శూన్యంగా మారిపోయి నప్పుడు, సమస్తం శూన్యం అన్న అవగాహన కలుగుతుంది. ఆస్తికత-నాస్తికత రెండూ ఒక్కటౌతాయి. సత్యం లోకంలో ఆవిష్కరింపబడనంతకాలం ఆనందం విషాదంగా, జ్ఞానం అజ్ఞానంగా కనిపిస్తుంది. ఆ రెంటినీ వదిలినప్పుడు మాత్రమే దివి భూమికి దిగి వస్తుంది. దివ్యత్వం ప్రభవిస్తుంది. వైరుధ్యాలే జీవితానికి పునాది. దివ్యత్వం ప్రభవించిన వెంటనే వైరుధ్యాలు సమసిపోతాయి. జీవకేంద్రం శూన్యమై, అందులో దివ్యచైతన్యం ప్రవేశించినప్పుడు విశ్వవ్యాప్తమైన అగోచర

శక్తి జీవుని ఆదుకుంటుంది. ఒక్క తన్మయత్వం అన్ని యాతనల్ని రద్దు పరుస్తుంది. విచిత్రమైన విశ్వరచనా ప్రక్రియతో ప్రజ్ఞ ఇరువాగుల్ని కలిపి ముడివేస్తుంది. ఇహ పర లోకాలకు అప్పుడు సఖ్యత ఏర్పడుతుంది.

ప్రపంచం ఎప్పుడూ సగం చీకటిలోను సగం వెలుగులోను ఉంటుంది. మనిషి సగం అజ్ఞానంలో, సగం జ్ఞానంలో ఉంటాడు. కనిపించని ఆత్మకై చీకట్లో అన్వేషిస్తాడు. మనిషి జీవితం వెలుగు నీడల దాగుడుమూతలాట, చీకటి వెలుగుల సయ్యాట. ప్రేమ, ద్వేషం, ఆశ, భయం, అభయం అన్నీ మనస్సు పొరలలో కదులుతుంటాయి. అవి మనస్సును వదలిపోవు. ఎప్పుడో ఆత్మ శక్తి బయటపడి వాటిని జయిస్తుంది. అప్పుడు ఆత్మ స్వతంత్రంగా ఊర్ధ్వలోకాలకు పయనిస్తుంది. శక్తి, ఆత్మ పైలోకాలలో కలుసుకుని మహాప్రజ్ఞతో ఏకమవుతాయి. వాటి మధ్య ఏకత్వమే గాని వైవిధ్యం ఉండదు. అప్పుడది ఆత్మశక్తిగా పరిణమిస్తుంది.

సచ్చిదానంద తన్మయస్థితిలోని జీవుని స్పందనతో భౌతికత్వం పులకిస్తుంది. ప్రకృతిలోనే పరాశక్తి ఉన్నట్లు ఆత్మ గుర్తిస్తుంది. భౌతిక శరీరం ఎంత అర్భకంగా ఉన్నా పరాశక్తికి ఆతిథ్యం ఇవ్వగలదు. ఈశ్వరానుగ్రహమే స్వశక్తిగా, ఆత్మశక్తిగా పరిణమిస్తుంది.

సృష్టిలోనూ అలాటి పరిణామమే చోటుచేసుకుంది. ఒక అపూర్వ సంఘటనతో జడ ప్రపంచంలో ప్రజ్ఞ విచిత్రంగా ప్రవేశిస్తుంది. సృష్టి స్థితి సగం వాస్తవం, సగం స్వాప్నికం. మనిషి సగం వాస్తవంలోనూ, సగం స్వప్నాలలోనూ జీవిస్తుంటాడు.

అల్పప్రాణిలోకంలో జీవులు మనుగడ కోరవు. దీర్ఘకాలం జీవించాలనుకోవు. పుట్టిన క్షణంలోనే నాశనమైపోతాయి. వాటికి జీవితం లేదు.

అతీంద్రియ శక్తి స్వతంత్రంగా ఏర్పడినప్పుడే తన మార్గం తను నిర్దేశించుకుంటుంది. అదే ఉత్తమం. అనురాగం, ఆనందం, బాధ ఆలంబనలుగా ఏర్పడిన మార్గం. అదే జీవితానికి రాచబాట అవుతుంది.

అల్పప్రాణిలోకంలోని ఒక చిన్న క్రిమి ప్రవర్ధమానం చెంది, రాక్షసిగా మారి ప్రకృతిని కలవర పెట్టింది. దానివల్ల లోకంలో రాక్షసానందాలు, కాలకూట విషాలు భూమిపైకి పాకి వచ్చాయి. మనుషులపైన వాటి ప్రభావం సోకింది.

స్వార్జితశక్తులు మంచికి, చెడుకు ఉపయోగపడతాయి. బలం పొందిన జంతువులది, రాక్షసులది స్వార్జితశక్తే. ప్రపంచాన్ని నాశనం చేయగల శక్తి. అవి

భయంకర శక్తుల్ని సంపాదిస్తాయి. వాటిని ప్రతిఘటించడానికి భగవంతుడు మనిషిని సిద్ధం చేయపూనుకున్నాడు. పరమాత్మ మనిషికి మేధను అదనంగా కల్పించాడు. అందులో ప్రజ్ఞను ప్రవేశపెట్టాడు. స్థూల, సూక్ష్మ లోకాల మధ్య సంచరించే ప్రజ్ఞ మనిషికి వరం. అణువు నుండి బ్రహ్మాండం వరకు మనిషి ప్రజ్ఞకు అందుతాయి. రాక్షస శక్తుల్ని రూపుమాపగలిగింది మనిషి. మనిషి చుట్టూ జంతు ప్రపంచం ఏర్పడింది. అయినా మనిషి వాటిని తన వివేకంతో, ప్రజ్ఞతో మచ్చిక చేసుకోగలిగాడు. జంతువులకు బ్రతకడమే తెలుసు. వాటికి మెదడు సగమే పనిచేస్తుంది. వివేకం, ప్రజ్ఞ ఉండవు. స్పృశించినపుడే వాటికి స్పందన తెలుస్తుంది. మనసుతో స్పందించడం మనిషికి మాత్రమే తెలుసు.

తనలో ఆత్మ ఉన్నదని తెలియనంతకాలం మనిషి సుఖదుఃఖాలకు, అసూయా ద్వేషాలకు లోనవుతాడు. మనస్సుకు తెలిసినా, దానిని భౌతిక విషయాలకే పరిమితం చేసుకుంటాడు. మనస్సు శరీరానికి శత్రువువలె వ్యవహరిస్తుంది. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు మాత్రమే మనస్సు శరీరానికి హెచ్చరిక చేస్తుంది.

మనస్సు ఆత్మ వరకు పయనించదు. తన స్వస్థానమైన హృదయాన్నే అది చేరదు. ఎంతసేపు మేధకు ఊడిగం చేయడమే మనస్సుకు ఇష్టం. ప్రతి పని వెనుకనున్న శక్తిని మనస్సు గమనించదు. జరిగే పనుల అంతరార్థాన్ని, ప్రయోజనాన్ని అసలు గుర్తించదు. పరమాత్మను గుర్తించి, గౌరవించే బాధ్యత మనస్సు తనపైన వేసుకోదు.

మానవులుగా జన్మించినా, చాలమంది తమ ప్రత్యేకతను గుర్తించరు. జీవరాశిలో తను ఒక్కడని భావిస్తాడు. నిద్రా, మైథునాలతోనే జీవితం గడుస్తుంది. తాము ఎవరో, ఎందుకు మానవజన్మకు వచ్చామో తెలుసుకోరు. ఆ విధంగా ఆలోచించరు. ప్రకృతికి అనుగుణంగా జీవించడం తప్ప వారికి అన్యం పట్టదు. జీవితంలో ఒక ఆశయం ఉండదు. బ్రతికినంత కాలం జీవించడం, సుఖించడం అంతే తెలుసు. బాహ్య జీవితంతోనే తృప్తి పడతారు. శారీరక అవసరాలు తప్ప వారు కోరేది ఉండదు. బ్రతకడం, పనిచేయడం, చావడం మూడే పనులు జీవితంలో. ఈ జన్మ పూర్తి అవగానే మరొక జన్మకు చేరాలని కోరిక. ఆత్మ, పరమాత్మ అర్థం కాని మాటలు. అలాంటివారు అంతరంగంలోకి ప్రవేశించరు. ఆ బరువును భరించలేరు. కనిపించని ఆత్మను భరించడం ఎంత కష్టం! కేవలం ప్రకృతికి లోబడి బ్రతికే మనిషి గురించి ఆత్మ పట్టించుకోదు. ఆత్మ ప్రకృతి

నియమాలను పట్టించుకోదు. కాని వాస్తవ సంఘటనల్ని ఒక దానితో ఒకటి ముడివేస్తుంది.

ఆత్మకు అవరోధాలు, నిరోధాలు ఉండవు. గాలిలో ఎగిరిపోగలదు, దూరాలకు చేరగలదు. మండుటెండల్లో, తుఫానుల్లో, ప్రచండాగ్నిలో దూసుకు పోగలదు. అన్ని బంధాలు మనిషి ఛేదించుకో గలిగితే, అన్నింటినీ ఛేదించుకుని పోగల 'ఆత్మ' శక్తి తెలుస్తుంది.

ఆత్మయోగి ఇహపరాలలో సమంగా జీవిస్తాడు. జీవితంలో అన్ని సుఖ దుఃఖాలకు స్పందిస్తాడు. ఆ స్పందనల నేపథ్యంలో అనుభూతి చెందగలడు. బాహ్యాకర్షణల నుండి, వ్యామోహాల నుండి తనను తాను రక్షించుకుంటూ, తన ఆత్మని రక్షించుకోగలడు. అంతరంగంలో మహదానందం అనుభవించగలడు. అశాశ్వతమని తెలిసీ, అందరితో కలిసి ప్రాపంచిక సుఖదుఃఖాలలో భాగం పంచుకున్నా, వాటి విలువలు వీరి ఆత్మను అంటవు. సగం కాలం సూక్ష్మలోకా లలో, భావశరీరంతో కాలం గడుపుతాడు కనుక మృత్యువాత పడకుండా జీవుని రక్షించగలడు. అతని ఆత్మశక్తి అతనికి రక్షణ కవచం.

కొందరు లోకసేవ చేస్తూ లోకానికి బలైపోతారు లేదా లోకాన్ని తాము బలి తీసుకుంటారు. కొందరు స్వార్థానికి లోనై తమ ఆధ్యాత్మికతను బలిపెడతారు. తమ యోగ శక్తిని పరాశక్తిగా వర్ణిస్తూ ప్రపంచ సంపదలు కొల్లగొడతారు. వారికి ఆధ్యాత్మిక విలువలు, జీవన ప్రణాళికలు ఉండవు. మరికొంత మంది తమ ఆలోచనా ధోరణిని ఒక సంప్రదాయంగా మార్చి, కారణజన్ముల మనిపించు కుంటారు. తమ ఆత్మకు శరీరం ఆలంబన మాత్రమే అని గ్రహించరు. వ్యసనాలకు లోనై, కామనలకు బానిసలై బ్రతుకుతారు. వీరి పశువాంఛ కామవాంఛగా మారి పతనమవుతారు. కొందరు భయంకరమైన నీతిగోడలు నిర్మించుకుంటారు. ఆ గోడల మధ్య పోరాటం సాగిస్తారు. వీరు స్వార్థం, అహంకారం వల్ల లబ్ధిపొందుతారు, లేదా తప్పులు చేసి, పాపాలు పండి, బాధలు పడతారు. పైకి పుణ్యమూర్తులుగా చలామణి అవుతారు.

కొందరు శాంతి పథాలను వదలి, అరాచక, అమానుష, హింసాత్మక చర్యలకు పాల్పడి, నిష్కృతి లేని తప్పులు చేస్తారు. జీవితాంతం విషాదం అనుభవిస్తారు. తమ నికృష్ట జీవితానికి మురిసిపోతూ తమ అకృత్యాలకు బలైన వారి శాపాలు అనుభవిస్తుంటారు. తమది రాక్షసత్వమని తెలిసీ, వదులుకోరు, మంచిగా మారాలని ఎన్నటికి ప్రయత్నించరు.

కొందరు ప్రవృత్తి రీత్యా పశుతుల్యులు. అన్ని ప్రలోభాలకు లోబడిపోతారు. ఇతరుల అవసరాలను, బలహీనతల్ని తమ స్వార్థానికి ఉపయోగించుకుంటారు. తన సుఖమే తనను ఆశ్రయించిన వారి లక్ష్యం అనుకుంటాడు. తనవంటి వారిని తన ఆప్తులుగా భావిస్తాడు. తానొక అవతార పురుషుడనని మోసం చేస్తాడు. తన జీవితానికి తానే కర్త అని, అమాయక జనాలని తాను ఉద్ధరించడానికి అవతరించానని చెప్పుకుంటాడు. తాను భగవంతుని అవతారం అని చెప్పి, తన శరీర రక్షణకు వారిని ఉపయోగిస్తాడు.

తనను ఆమోదించనివారిని శత్రువులుగా భావిస్తాడు. తనకు అయిష్టులైన వారిని చూచి భయపడతాడు. తన భజనపరులను తప్ప ఎవరినీ దగ్గరకు రానీయడు. తాను పతనం చెందుతూ హింసను, ద్వేషాన్ని ప్రోత్సహిస్తాడు. తన అదృష్టానికి తనే మురిసిపోతూ అందరితో కలహిస్తాడు. జీవితంలో సుఖభోగాలు మాత్రమే ఆశించేవారు అంతకు మించి ఆలోచించరు. ఈ లోకాన్ని దివ్య ధామంగా మార్చాలని అనుకోరు. తమలో దివ్యత్వం ప్రవేశించాలనీ కోరరు.

క్షణికమైన సుఖాలు కలిగించే ఆనందం, కోర్కెలు తీరడం వల్ల పొందే అనుభూతి, అన్నీ ఆనంద హేతువులుగానే కనిపిస్తాయి. శారీరక వాంఛలు తీరడం కోసం జరిపే పోరాటాలు, కలహాలు, కన్నీరు, కారుణ్యం అన్నీ ప్రేమ చిహ్నాలనిపిస్తాయి. జీవన పోరాటంలో 'విశ్వప్రేమ' తొంగిచూడాలి. ఎవరికి వారు తమ సుఖదుఃఖాల కోసం ఆరాటపడతారు. అజ్ఞానం అందరికీ సమానమే. ఆత్మజ్ఞానం అలవడే వరకు పొందే జ్ఞానం అంతా అజ్ఞానమే అవుతుంది. తన వారితో సుఖించమని, అందరితో ఆనందం పంచుకోమని హెచ్చరించేది అజ్ఞానం. మనిషిలో ఆశ కలిగించి, ఆ ఆశ తీరడంలోని అనుభూతి గొప్పదని చెప్పేదీ అజ్ఞానమే.

జిజ్ఞాస ఏర్పడగానే జ్ఞాపకాల గాఢ మగతలో అగాధం వంటి గతం కదలాడుతుంది. వివేకం కారణంగా సగం సగం ఆలోచన ఏర్పడుతుంది. ఏదో సత్యాన్ని తెలుసుకోవాలన్న ప్రయత్నంలో అందినంత విషయాన్ని స్వంతం చేసుకుంటుంది. ఆ విజ్ఞానం మన సుషుప్తి గుహలో దాచుకుంటాం. అలా జీవుడు అంధకారం నుండి వెలుగులోకి పయనించి, చివరకు తన గమ్యాన్ని చేరతాడు. తన చుట్టూ ఉన్న విశ్వాన్ని, విశ్వాత్మను గుర్తించి, తన జయాపజయా లతో అభివృద్ధి సాధిస్తూ, పరిసరాలతో, విధితో పోరాటం సాగించి, బాధల పల్లకిలో తన ఆత్మను గుర్తిస్తాడు. ఆత్మను గుర్తించడం అంటే తన ఔన్నత్యాన్ని తెలుసు కోవడమే.

అన్వేషణ నిలిపివేసిన వారికి ఆత్మ విశ్వాసం ఉండదు. అప్పటికి సాధించింది రద్దయిపోగా తిరిగి మొదటికి చేరడమవుతుంది. ఆత్మ స్వశక్తితో వలయాలు సృష్టిస్తుంది. కొన్ని అజ్ఞానపు పీలికల్ని మాత్రం తొలగించగలదు. జీవితాన్ని సంభావించగలదు తప్ప మేధను జాగృత పరచదు. ఇంద్రియానుభూతిని పొందగలదుగానీ ఆత్మానందం పొందలేదు. జీవనజ్యోతి కొద్దిపాటి వెలుగును, చైతన్యాన్ని ఇవ్వగలదు. కొంతమేరకే ఆనందాన్ని, పారవశ్యాన్ని కలిగిస్తుంది. చైతన్యం పాక్షికంగా ఏర్పడడం వల్ల అనుభూతి స్వల్పంగానే లభిస్తుంది. ఆత్మ లోపలికి పయనిస్తూ జీవచైతన్యం వద్ద నిలిచిపోతుంది. ఆత్మ విషయ గ్రహణం చేయగలదు.

భగవదనుభూతులు పొందడానికి కొన్ని ఆధారాలు అవసరం. భూమిపైన ఉన్నంత కాలం బ్రహ్మానందం అల్పంగానే లభిస్తుంది. ఆ కాస్తకే మనస్సు, ఆత్మ పరవశిస్తాయి. అనుభూతి మొదట అనూహ్యంగా, అగమ్యంగా ఉండి బొత్తిగా అర్థం కాదు. ఎప్పటికో అదే ఆధ్యాత్మికం అని తెలుస్తుంది. జీవితంలో ఏ చీకటి మూలనో, కోణంలోనో అజ్ఞాతంగా దివ్యత్వం దాగి ఉంటుంది.

ఇప్పుడు ప్రపంచం మూడవ పరిణామంలో ఉంది. శరీరాన్ని ఆశ్రయించిన మేధకు రూపకల్పన జరిగింది. అజ్ఞాతంగా ఉన్న విశ్వాత్మకు వెలుగుతోడైంది. ఆలోచనతో చూడగల నేర్పు మనిషికి ఏర్పడ్డది. అది మనోనేత్రం. ప్రతి పనికి ఆలోచన అవసరమవుతోంది. ఆలోచించగల మనిషి విశ్వాంతరంలోని రహస్యాలను శోధించగలుగుతున్నాడు. రోదసిపైన తన ప్రజ్ఞను ప్రయోగిస్తున్నాడు.

మూడవ పరిణామం సత్ఫలితాలనిస్తున్నా వాటికి అవరోధాలు ఏర్పడుతున్నాయి. మనిషి మేధ మరోకోణం నుండి అవరోధాలను సృష్టిస్తుంది. కాకపోతే, విశ్వంలో మానవుడి పాత్రకు విలువ పెరిగింది. మనిషి తన మేధతో విశ్వ రహస్యాలను శోధించగలుగుతున్నాడు. మనిషిలో నిస్తబ్దంగా ఉన్న మానసిక శక్తిని పదార్థం, జడజీవితం బయటకు రానివ్వదు. అది సన్నని జీరగా జీవితంలోకి జారి, ఆకాశపు యవనికను చీల్చుకుని పోయింది. అప్పుడు అనుభూతి ప్రజ్ఞగా మారసాగింది.

చైతన్యమే లేదనుకున్న విశ్వగోళాలలో చైతన్యం ఉరకలెత్తింది. మానవ చైతన్యం విశ్వచైతన్యంతో రాజీ చేసుకున్నది. ఇచ్చిపుచ్చుకునే ఒప్పందం జరిగింది. ఫలితంగా మనిషి అగాధాల నుండి అంతరిక్షం వరకు తన మేధను ఉపయోగించ

గలుగుతున్నాడు. ఒకప్పుడు మనిషికి ఈ క్రమమైన ఆలోచన, లక్ష్యం ఉండేవి కాదు. ఏదో తెలుసుకోవాలని, అన్వేషించాలని మాత్రం అనిపించేది.

మేధోపరితలం పైన పొరలు పొరలుగా ఏవో అనుభూతులు, ఆదర్శాలు, లక్ష్యాలు ఏర్పడసాగాయి. కొన్ని కామనలు, వాంఛలు, ఉద్రేకాలు విజృంభించాయి. శరీరం మరొక శరీరంతో సంపర్కసుఖాన్ని ఆశించింది. హృదయం మరొక హృదయంతో మాట్లాడడం నేర్చింది. ఆకృతి పొందని ఆలోచనలు కోరికలైనాయి. కోరికలు వాంఛలైనాయి. నరాల ఉద్రేకాలు కొత్త ఆకలిని సృష్టించాయి. ఇవి అంతరంగ చేష్టలు. ఇవి ఆలోచనల వికృత కృతులు. కాలంలోని శక్తి ప్రకంపనల వల్ల మనిషిలో విషయవాంఛలు కలగసాగాయి.

అప్పుడొక 'కామన' లోకంలో అవతరించింది. ఒక 'ఇరుసు' కేంద్రంగా భూగోళాన్ని తిప్పసాగింది. లోకాన్ని తనతో పరిభ్రమించేటట్లు చేసింది. ఆ కేంద్ర బిందువు చుట్టూ చైతన్యం గూడు కట్టింది. చైతన్యం దివ్యకాంతికి భావానువాదం. సగం ఏర్పడిన చైతన్యం భావ చిత్రానికి అందాలు అద్దింది. జీవనం సాగరమంత విశాలంగా మారిపోయింది. మనిషి పొందిన చైతన్యం వల్ల పరిసరాలలోని పశువులకు, పక్షులకు కాస్త మేధ ఏర్పడ్డది. మనిషి వలె వాటికి కోరికలు, భయాలు ఏర్పడ్డాయి. జీవి పరిణామంలో ఇదొక మహర్దశ.

అజ్ఞాన భూమికలపై ప్రజ్ఞ కదలాడసాగింది. ఎల్లెడలా జ్ఞానం ప్రవేశించింది. మానవాత్మ ఇప్పుడు సురక్షితంగా ఉంది. ఆత్మ తనదైన శాశ్వతత్వాన్ని భద్రపరచు కుంది. తను మృత్యువాత పడకుండా రక్షించుకోగలిగింది. అదే 'ఆత్మ' రక్షణ. ఆత్మ రక్షణలో అమరత్వం సాధించడం సుసాధ్యం.

జీవునికి ప్రపంచమే ఒక కర్మశాల. కష్టించి పనిచేయడమే కర్మయోగం. కర్మకౌశలం వల్ల మనిషికి వ్యక్తిత్వం ఏర్పడ్డది. వివేకం విస్తరించసాగింది. మనస్సు దృశ్య ప్రపంచానికి పరిమితం కాగా, ఆత్మ అగోచర పరమాత్మను అన్వేషించ పూనుకుంది. మనస్సు చేరరాని చోట్లకు ఆత్మ ప్రవేశిస్తుంది. ప్రకృతి పైననే వివేకం పనిచేస్తుంది. వివేకానికి పరిమితి ఏర్పడ్డది. జీవితాన్ని తీర్చిదిద్దడం వివేకం బాధ్యత. జీవితంలో ఎదురయ్యే ప్రమాదాల గురించి, జీవన గతుల గురించి, లాభనష్టాల గురించి మాత్రమే మనస్సు ఆలోచిస్తుంది. అంతమేరకే వివేకం పనిచేస్తుంది.

ఒక నియమానుసారం జీవించేవారికి ఆనందం, జ్ఞానం పరిమితంగా

లభిస్తాయి. వారికి పరాన్ని గురించి, పరమాత్మ గురించి ఆలోచన రాదు. పైకి పోయే ప్రయత్నం చేయరు. పరప్రజ్ఞను అందుకోడానికి జీవితంలో ఒక్క మలుపు చాలు. అవధిలేని జన్మపరంపరను అధిగమించడానికి ఒక్క జీవితం చాలు.

అది ఒక నిర్దుష్టమైన భావం. ఒక స్థిర సంకల్పం. ఆశయాలు నెరవేరడానికి అవకాశం రావాలి. అనవసర విషయాలపై 'ఆత్మ' శక్తిని దుర్వినియోగ పరచ కూడదు. జీవికి తెలుసు తన జీవనం భూమికే పరిమితమని. ఆత్మ జీవనం ఊర్ధ్వలోకాలలో. రెండూ కలసి శరీరంలో ఉన్నా దేని పరిమితి దానిది. దేని ఆశయం దానిది. ఆత్మ పరిధిలోకి జీవి ప్రవేశించదు. జీవునికి అంతర్దృష్టి, పరేంగిత ప్రజ్ఞ అలవడవు.

కొందరు వితండంగా ప్రజ్ఞను ఇహలోక ప్రయోజనాలకు ఉపయోగించి భ్రష్టులవుతుంటారు. వారు జీవితం యావత్తు భగవంతుని నీడలో బ్రతికినా భగవంతుని చూడలేరు. వారు నీలినీడలే స్వర్గసీమ లనుకుంటారు. వారికి స్వర్గం ఉన్నా లేనట్లే. స్వర్గం కోసం ఆకాశంలో వెదుకుతుంటారు.

మనిషి ఆలోచనలు తారుమారవుతుంటాయి. ఆలోచనలకు ఆచరణకు పొత్తు కుదరదు. జీవిత చరమాంకం వరకు శరీరానికి సేవలు చేస్తూ వచ్చిన మేధ ప్రకృతిని ధిక్కరించే సాహసం చేయదు. మనిషి స్వార్థం, అహంకారం వదలక, సుఖాలకు, భోగాలకు బానిస అవుతాడు. మృత్యుముఖంలో జీవుడు తనకేమీ పట్టనట్లు తప్పుకుంటాడు. తన పాపాలకు ఫలితం అనుభవించడానికి సిద్ధంగా ఉంటాడు. ఆత్మ జోక్యం చేసుకుని జీవుని రక్షించాలనుకోదు. ఆత్మ నిర్విచారంగా తన లోకానికి వెళ్లిపోతుంది. ఆత్మకు స్వర్గ నరకాలలో ప్రవేశం ఉండదు. జీవుడు తన కర్మలకు ఫలితం అనుభవిస్తాడు.

జీవునికి బ్రతుకుపై ఆశ చావదు. ఇంకా యింకా శరీరంతో కలిసి జీవించా లనుకుంటుంది. కాలం మాత్రం అనుమతించదు. కాలాన్ని జయించగల ఆత్మశక్తి జీవునికి ఉండదు. శారీరక అవసరాలు, బాధలు అగ్నిలో దగ్ధం అయ్యే వరకు జీవుని అంటిపెట్టుకుని ఉంటాయి. ఒక ప్రక్క కాష్టం మీద శరీరం కాలుతున్నా జీవుని కోరికలు చావవు. ఇంకా తను జీవించే ఉన్నానన్న భ్రమలో ఉంటుంది. తనవారి చుట్టూ ప్రదక్షిణం చేస్తుంది. అయినవారిని వదలి పోవడం జీవునికి ఇష్టం ఉండదు. ఎంత అనుభవించినా చివరికి మిగిలేది ఏమీ ఉండదు.

మనిషి తనలోని జీవుని, ఆత్మను విస్మరించి జీవించడం తన నిర్వాకమే

అనుకుని మిడిసిపడతాడు. ఈ ఔన్నత్యం అంతా తన స్వంతం అనుకుంటాడు. తన ప్రజ్ఞతో సాధించాననుకుంటాడు. తనలోని జీవుని, ఆత్మను బొత్తిగా తల పోయడు.

మనిషి సంపాదించే విజ్ఞానం తన శరీరానికి, ఈ ప్రపంచానికి ఉపయోగపడుతుంది. తాను శరీరానికి బందీ అయి, తన చుట్టూ ఉన్న ప్రపంచం అజ్ఞానంలో ఉన్నదనుకుంటాడు. తన కోర్కెలకు, స్వార్ధాలకు బలి అవుతూ, తన గొప్పతనానికి మురిసిపోతుంటాడు.

కార్యనిర్వహణ తప్ప ప్రజ్ఞ ఎక్కడా కనిపించదు. మనిషి తన వివేకాన్ని జీవితానికే పరిమితం చేసుకుంటాడు. అతను దర్శించేవి బాహ్య ప్రపంచ రూపాల ప్రతిబింబాలు. అతనికి అంతరాత్మ అంది రాదు. సత్యాన్వేషణ సైతం అస్తవ్యస్తంగా, మందంగా సాగుతుంది. ఆలోచనలకు కట్టుబడిన మేధ ప్రాపంచిక విషయాలను దాటి పైకి పోదు. అనేక భావాలు మనస్సును ముసురుకుంటాయి. జీవితం అర్ధాంతరంగా ముగుస్తుంది.

ఆత్మదృష్టికి భిన్న రూపాలు, విభిన్న రేఖలు ఉండవు. అగోచర ఆనందాలే ఆత్మకు సహజ సంపదలు. అతీంద్రియ లోకాలు చేరడం ఆత్మకు కష్టం కాదు. ఏమాత్రం ప్రపంచాన్ని గురించి మరచిపోనంత కాలం ఆత్మ జాగృతి కలగదు. అయినా దివ్యత్వం మనిషిలో సడలకుండా ఉంటుంది. ఆత్మ దానిని రక్షిస్తుంది.

ఆ దివ్యత్వమే మనిషిని అన్ని బాధల నుండి రక్షిస్తుంది. చీకటి అఖాతాలను సులభంగా దాటిస్తుంది. చీకటిలోనే దివ్యమందిరం మెరుస్తూ కనిపిస్తుంది. అది శూన్యం లోంచి రూపుదిద్దుకుంటుంది. అది మరీచిక. నెమ్మదిగా ఆ మందిరంలోకి ఆత్మ ప్రవేశిస్తుంది. ఆత్మ ప్రవేశంతో ఆ మందిరంలో జ్యోతి ప్రజ్వలిస్తుంది. అదే ఆత్మతేజం. అదే దివ్యత్వం.

39. చీకటి దేవతలు

అశ్వపతి చీకటిలోకాలు ప్రవేశించాడు. అవి నరకాలు – అతల, సుతల, వితల, పాతాళ, రసాతల లోకాలు. పాపులు అక్కడికి చేరడం వేరు, మహాత్ములు చేరడం వేరు. లోపలకు వెళ్లిన కొద్దీ చీకట్లు భయపెడతాయి. ఒకప్పుడు మానవులుగా దేవతలుగా ఉన్నవారే అహంకారంతో, ఆత్మవంచనతో దైవ దూషణ ఫలితంగా అక్కడికి చేరతారు. కొంతకాలం తర్వాత ఆత్మజ్ఞానం కలిగినపుడు వెలుగు లోకాలకు తిరిగి వెళతారు.

సృష్టిలో సర్వత్రా వ్యాపించి ఉన్నది ఈథర్. దాని సంకోచ వ్యాకోచాల వల్ల, అనగా శ్వాసక్రియ వల్ల జీవోత్పత్తి జరిగింది. జీవం రోదసిలో ప్రవేశించింది. ప్రాణిపుట్టుక విషయంలో జీవికి ప్రాణం సహకరించింది. ప్రాణం ప్రకృతి ధర్మాన్ని అనుసరించి ఉంటుంది. ఉద్రేకాలకు లోనైన మనస్సు వికలం చెందుతుంది. మేధ వికసిస్తే మనిషి ప్రాజ్ఞుడవుతాడు. లేకుంటే పశుప్రవృత్తి పెరుగుతుంది. మనిషికి సత్యసంధత కలిగించేది, అన్వేషణకు మార్గం సుగమం చేసేది ఆత్మశక్తి.

ప్రాపంచిక విషయాలలో మనస్సుది అగ్రస్థానం. ఉద్రేకాలు, ఉన్మాదాలు, జ్ఞాపకాలు, ఆలోచనలు మనస్సు పరిధిలోవి. మనస్సు వెలుగు కిరణాలను ప్రసరిస్తుంది. అంతరంలో ఆలోచనల్ని కలిగిస్తుంది. జిజ్ఞాస కలిగిస్తుంది. పైకి అవి అన్నీ మనఃకల్పితాలు అనిపించినా వాటి రిమోట్ కంట్రోల్ ఆత్మది. విధి ఆత్మ అధీనంలో ఉంటుంది. మనోవ్యాపారాలకు అతీతంగా ఉండేది ఆత్మ. ఆత్మశక్తితో అశ్వపతి నరకాలు దాటి ఉన్నత లోకాలు చేరగలిగాడు. ఆత్మజ్యోతి అతనికి మార్గదర్శకమైంది.

కుటిల వక్ర రూపాలకు, కుతంత్ర శక్తులకు నిలయం ఆ లోకం. అది మాయ లోకం. అది నరక లోకం. అతి నికృష్ట జీవులు నివశించే చోటు. అది

సృష్టిలో సగం తానైంది. అజ్ఞానం దానికి రక్షణ. దివ్యత్వం అవతలితీరాన, విశ్వ రహస్యాలు తెలుసుకొనడానికి చీకటి పార్శ్వం దాటక తప్పదు. అన్ని అభ్యంతరాలను అధిగమిస్తూ చీకటిలోకంలో ప్రవేశించాడు అశ్వపతి. వాటికి మూల కారణాలను వెదకసాగాడు. నరకం ఏర్పడడానికి స్వర్గమే కారణం! కాలచక్రభ్రమణానికి స్వర్గ నరకాలు రెండూ అవసరమైనాయి.

అతని ఆత్మ చీకట్లను చీల్చుకుంటూ ముందుకు సాగింది. అక్కడ వెలుగు శూన్యం. అంతా చీకటిమయం. అక్కడ ఆకాశాల, సముద్రాల అజ్ఞాన ఘోషలు. ఆత్మ, సత్యం, తేజస్సు అక్కడ నిలబడవు. చీకటి గుండెలో వెలుగుబాకు దూసుకుపోయినట్లు అతని ఆత్మ చీకటిని చీలుస్తూ ముందుకు పోయింది. ఆ చీకటి శూన్యంలో చెట్లు, చేమలు, రూపాలు నీడల్లా కదలసాగాయి. ఆకారాలు అస్పష్టంగా నీడల్లా కదులుతున్నాయి. అవి అన్నీ చీకటి ముసుగు ధరించి ఉన్నాయి. అతని ఆత్మ తేజస్సు ముందు అవి దయ్యాల్లా కదలసాగాయి.

ఆ చీకటి రూపాలు అసంఖ్యాకంగా, గుంపులుగా చరిస్తున్నాయి. వేల మార్గాలలో పరుగెత్తుతున్నాయి. విశ్వం, సుఖం, ఆనందం, వెలుగు మరచిపోయి నీడల్లా చరిస్తున్న చీకటి దేవతలు. వారు పరమాత్మ దృష్టిలోకి రారు. వారి రహస్య జీవితం భగవంతునికి తెలియదు. అక్కడ అన్నీ కుట్రలు, కుతంత్రాలు. అవే వారికి ఆనందం కలిగిస్తాయి, ఉద్రేకాలు కలిగిస్తాయి, ఆవేశాలు రగిలిస్తాయి. క్షణికానందాలు, ఆరాటాలు అన్నీ వక్రమే. ఆ చీకట్లలో వారి మధ్య భయంకర విషసర్పాలు సంచరిస్తున్నాయి. ప్రతిజీవి క్రిమి వలెనే సంచరిస్తుంది. వాటికి భయం లేదు. వాటిని చూచి మనం భయపడవలసిందే.

అవి అతి పేలవంగా, నిర్జీవంగా, శవాల్లా నడుస్తున్నాయి. రూపంలో, నిర్మాణంలో అవి మృత కళేబరాలు. అందరివీ వికృతరూపాలు అదీ సృష్టికర్త శాపమా? చాతుర్యమా? పరమాత్మ ఇంతటి వికృత క్షుద్రరూపాలను కూడా సృష్టిస్తాడా, అని ఆశ్చర్యం వేస్తుంది. వికృత రూపాలతో సంచరించే వారికి, జంతువులకు ప్రవర్తనలో తేడాలేదు. వక్ర శరీరులు, వికృత రూపులు, రాక్షసులు, పతితులు, పాపులు, భ్రష్టులు, అనాత్మ జీవులు, తమ శక్తుల్ని అహంకారంతో కోల్పోయినవారు, దైవదూరులంతా నరకానికి చేరతారు. ఆ చీకటి బ్రతుకులకు వారు పరిమితమైపోతారు.

వారంతా నరకంలో భయంకర జీవితాలు గడుపుతున్నా శక్తివంతులే. వారి

ఆకారాలలో, ప్రవృత్తులలో రాక్షసత్వం, కర్కశత్వం, నీచత్వం ఉన్నా రవంత దైవత్వం ఉంటుంది. చీకటిలోనే వారు శక్తివంతులు, బలవంతులు. వెలుగులోకి వస్తే వారు నిర్వీర్యులు, బలహీనులు అయిపోతారు. వారికి వెలుగు పరమశత్రువు. వెలుగులో వారెవరూ కాలు నిలదొక్కుకోలేరు. వారు వికృత శబ్దాలతో భావవ్యక్తీకరణ చేస్తారు. మనుషులవలె వారు భాషను ఆశ్రయించరు. భీకర శబ్దాలే వారి భాష. అక్కడకు వచ్చేవారికి నరకం చూపించడమే వారి పని.

అక్కడ ఆనందాలన్నీ విషాదాలుగా మారిపోతాయి. అందరివీ అక్రమ పద్ధతులే. మనకు సత్యాలుగా కనిపించేవి అక్కడ అసత్యాలు. అందరిలో వ్యసనాలు, ఉద్రేకాలు, ఉన్మాదాలు ఎక్కువ. అందరూ బ్రతికేది ఆ కుళ్లులో, రొచ్చులో, నరకంలోనే. వ్యసనాలు మరీ తీవ్రస్థాయికి చేరినప్పుడు మరింతగా లోపలకు కూరుకుపోతారు. అలా మరింతగా నరకంలోకి పోవడమే వారికి ఇష్టం.

మంచి, చెడులను సమదృష్టితో చూడడం సహజ ధర్మం. విజయాలకు పొంగిపోయి, అపజయాలకు క్రుంగిపోకూడదు. అక్కడ అన్నీ మోసాలు, కుతంత్రాలు, కుత్సిత ప్రయోగాలు. అక్కడ మానవ విజ్ఞానం విషతుల్యమైంది. మానవ వివేకం నిరుపయోగం. ప్రతిజీవి వ్యసనాలకు, వాంఛలకు బానిస. ఆనందాలను, విషాదాలను సమంగా భావించేవారు ఆ నరకకూపంలో పడరు. అక్కడ వ్యసన ప్రభావంతోనే జీవులు మసలుతుంటారు. ఆత్మ లేని చోట, సన్మార్గం లేని చోట, అహంకారం పెరుగుతుంది. ప్రేమ, కరుణ లేని చోట్ల రాక్షసులు ప్రవేశిస్తారు. చైతన్యం లేని చోట్లలో అసుర ప్రవృత్తి ఉంటుంది. మానవ హృదయాలను అసురులే పాలిస్తారు. మానవ స్వభావం సంశయాత్మకమైతే, మనసులో ఒక చిన్న రాక్షసుడు తిష్టవేస్తాడు.

అమాయకులు తమ మనస్సు చేసే సూచనలు సులభంగా గ్రహిస్తారు. వివేకం మనిషిని అపమార్గం పట్టిస్తుంది. వివేకం మనిషికి, సత్యానికి మధ్య అడ్డుగోడ నిర్మిస్తుంది. చీకటిబ్రతుకు అలవాటైనవారు మరింత చీకటిని ప్రేమిస్తారు. ఆశలు, ఆశయాలు మరుగున పడిపోతాయి. వివేకాన్ని క్షుద్ర శక్తులు స్వాహా చేస్తాయి. భూమిపైన మనం జీవిస్తున్నా మనపైన పెత్తనం అనేక లోకాల క్షుద్ర శక్తులది. అవి అదృశ్యంగా ఎప్పుడో మన మనస్సులో చొరబడి నిలిచిపోతాయి.

ప్రపంచంలో జీవించి ఉన్నంతకాలం మనుషుల స్వభావాలు మారవు.

శరీరాలు నశించినా స్వభావాలు మిగిలిపోతాయి. అవి సృష్టి చివరి అంచువరకు పయనిస్తాయి. అందుకే మనిషి విధికి తలవొగ్గడం జరుగుతుంది. విధి అంటే మనకు తెలియకుండానే మనలో ప్రవేశించిన పరలోకాల ప్రభావాలకు లోబడి మనం బ్రతకడం, మన బ్రతుకు తెరువును మార్చుకోవడం. పరలోక శక్తులు మనకు అనుకూలించేవి కావచ్చు లేక ప్రతికూలమైనవీ కావచ్చు.

మానవ నైజానికి అనుకూలమైన మార్గాలను మనిషి అన్వేషించాలి. శత్రువులు, మిత్రులు కలిసిపోవాలి. కష్టించినా, కలహించినా ప్రేమతో కలిసిపోవాలి. అలా కలుస్తూ, విడిపోతూ, మళ్లీ కలుస్తూ అనేక జన్మలు సాగిపోతారు. ఎప్పుడో దివ్యసాయుజ్యం చెందుతారు. ఇరుకు బాటల్లో నడుస్తూ వెలుగుకోసం పరుగులు పెడతారు. మానవ మేధ వెలుగుకోసం నిరంతరం శ్రమిస్తుంది. సృష్టి రహస్యం తెలుసుకునే వరకు మనస్సు విశ్రమించదు. ఏదో ఆలోచిస్తూనే ఉంటుంది. సత్యాన్ని గురించి తప్ప ఇతరత్రా ఎంత ఆలోచించినా గమ్యం చేరదు. పరమాత్మకు సంబంధించిన వెలుగు ఒక్కటే సత్యమైనది, నిత్యమైనది. అది ఒక్కటే ఆత్మకు ఆనందం ప్రసాదిస్తుంది.

పరమాత్మ తేజస్సు మనకు సులభంగా అందదు, బహుదూరం. దివ్యజీవనం మనలో చైతన్యం కలిగిస్తుంది. మనకు తెలియని ఆలోచనలు ఏవేవో ఆశయాలను కల్పిస్తుంటాయి. అప్పుడు హృదయం విలవిల్లాడుతుంది. మన విజయాలను ఆ శక్తులు తమవిగా చాటుకుంటాయి. మన సంకల్పం స్థిరంగా ఉంటే అల్పశక్తుల ప్రభావం ఉండదు. మన ఆత్మ స్వతంత్రం అయ్యేవరకు ఈ దుస్థితి తప్పదు. ఈశ్వర ప్రణిదానం ఒక్కటే మాయపొరల్ని తొలగించి, మనస్సును నిర్మలంగా ఉంచుతుంది. ప్రాపంచిక విషయాలలోనూ పరమాత్మ జోక్యం అవసరం. మన ఆరాధన బట్టి దివ్యత్వం ఉపకరిస్తుంది. సహజంగా మన మనస్సు పరమాత్మకు అంకితం కావాలి. అప్పుడు మన స్వప్నం కరిగి, సత్యం బయటకొస్తుంది.

భూగోళం చూడటానికి కఠినంగా, అర్థరహితంగా, నిర్జీవంగా ఉంటుంది. కాని ఒక పెద్ద యంత్రం వలె పనిచేస్తుంది. దీనిని నడిపిస్తున్న శక్తి పరమాత్మది. ఈ భూగోళానికి హద్దు లేదు. పరమాత్మ సర్వత్రా నెలకొని, నిగూఢంగా, అగోచరంగా ఉన్నట్లే ప్రపంచాన్ని నడిపే శక్తి నిగూఢంగా, అగోచరంగా ఉంటుంది.

జీవం ద్రవ్యంలో ప్రవేశించినప్పుడే స్పందన మొదలైంది, పరిణామం

ప్రారంభమైంది. ఆత్మ ప్రవేశించనంత కాలం భూమి జడంగానే ఉండిపోయింది. ఆత్మ ప్రవేశంతో చైతన్యం కలిగింది. చైతన్యం శక్తిగా మారి, రోదసిలో గోళాలను నిలిపింది. గోళాలన్నీ పరిభ్రమిస్తూ వాటి శక్తిని భూమికి పంపసాగాయి.

ఈ మార్మికత అనుభవించడానికి కాదు. దాని వెనుక ఒక విచిత్ర ప్రక్రియ సాగుతోంది. ఆ కారణంగా మహత్తర కార్యాలు జరిగి వినూత్న ఫలితాలు కలగసాగాయి. సృష్టిని సవ్యంగా నడిపించేది అగోచర పరాశక్తి. ఆ శక్తి చాలనం వల్లనే మనిషిలో నాడీకేంద్రాలు పనిచేయసాగాయి. ఈశ్వరప్రజ్ఞ వల్లనే సృష్టి ఏర్పడ్డది. లోకాలు పనిచేస్తున్నాయి. పరమాత్మ సంకల్పం నెరవేరింది.

కొంతకాలం వరకు ప్రకృతిలో చైతన్యం లేదు. ప్రకృతి గర్భం చీల్చుకుని చైతన్యం ప్రసరించడానికి చాలా కాలం తీసుకుంది. ఈ భువనాలను స్వప్నించిన పరమాత్మకు తృప్తి కలగలేదు. బ్రహ్మానందం ఏర్పడలేదు. ఒక విచిత్రశక్తి ఏదో జీవాన్ని ఏర్పరచింది. మొదట రోదసిలో విస్తరించిన ఈథర్ వలయాలుగా మారి వేగాన్ని పుంజుకుంది. ఆ వేగానికి, వేడికి సృష్టి జరిగింది. రాపిడివల్ల ఉష్ణం పుట్టింది. ఆ వేగమే ఆగి, శ్వాసగా మారింది. మనిషి కన్న ముందుగానే గ్రహాలు, గోళాలు శ్వాసించడం ప్రారంభమైంది. శ్వాసక్రియ వల్ల ఉచ్ఛ్వాస నిశ్వాసలు, సంకోచ వ్యాకోచాలు జరిగాయి. శూన్యంలో శ్వాస ఉధృతమై స్పర్శగా, స్పర్శ స్పందనగా మారింది. ఆకర్షణ వికర్షణల వల్ల ఘర్షణ ఏర్పడ్డది. విస్తరణకు సంఘర్షణ కారణం. అనుకూల, ప్రతికూల పరిస్థితులు చోటు చేసుకోసాగాయి. విశ్వ రచనకు ద్వంద్వ శక్తులు ఆధారంగా నిలిచాయి. ఇవి అన్నీ అసంకల్పితంగా జరిగినవే. పరమాత్మ ఒక ప్రణాళిక ప్రకారం ఏర్పాటు చేసినవి కావు.

రోదసీ శక్తి కేంద్రమైన విశ్వ కుండలినిలో అగ్ని రగిలి అది ప్రచండాగ్నిగా మారింది. ఆ అగ్ని ఖండాలు అన్ని గోళాలకు విస్తరించాయి. ఆ కాంతినే నక్షత్రాలు సొంతం చేసుకున్నాయి. విద్యుచ్ఛక్తి గాలిలో, నీటిలో, శబ్దంలో అన్నింటిలో చొరబడ్డది. అణుశక్తి రూపమే విద్యుత్తుగా మారింది. ఆ మహావిద్యుత్తు రూపరహితం, అగోచరం. పరమాత్మ వలె, పరమాణువు వలె అది అణుతరంగ ప్రవాహమై సృష్టిని ఉద్దీపింపచేసింది. అందుకే అణువులో బ్రహ్మాండమైన శక్తి నిక్షిప్తమైంది. కనిపించే అన్ని పదార్థాలు అణు సంయోగమే. అన్నింటిలోనూ అణుశక్తి నిబిడమైవుంది. కాంతిలో ప్రోటాన్ తీవ్రంగా చలించింది. కాంతి కిరణాలు విద్యుల్లేఖలై సృష్టిలోని చరాచరాలకు వెలుగును ప్రసాదించాయి.

అలా ఏర్పడ్డది సృష్టి-ప్రపంచం. మనిషికి సృష్టి రహస్యాలు ఎంత నిగూఢమో, ప్రపంచంలో అణుశక్తులు అంతకన్నా నిగూఢం. లోకం ఎంత విచిత్రమో అంత వాస్తవం. మనిషి మేథ తన ఆలోచనలే గొప్ప అనుకుంటుంది. అవే సత్యప్రకాశికలని భావిస్తుంది. అంచేత మనిషి తన వ్యక్తిగత దృక్పథమే వాస్తవం అంటాడు. దృశ్య ప్రపంచం అంతా తన ప్రతాపమేనన్నట్లు, తను కల్పనలు, ఊహలు, ఆలోచనలు చేస్తాడు. అలాగే జీవిత రహస్యాలను అన్వేషిస్తాడు. కృత్రిమమైన వెలుగులో, వాస్తవం కాని సత్యంకోసం సృష్టి రహస్యంపై తెరతొలగించ యత్నిస్తాడు. తన ఆలోచనపై, వివేకంపై మనిషికి అంతులేని విశ్వాసం. తాను ఆర్జించే విజ్ఞానం నిజానికి అజ్ఞానానికి ప్రతిరూపం. ఈ లోకంలో రూపుదిద్దుకున్న ప్రతి వస్తువులో మాయాశక్తి ప్రవేశించి ఉంటుంది. అదే మాయ.

ఈ చలనంలో చిక్కి కదులుతున్నట్లు, మారుతున్నట్లు కనిపించేది ఏదీ మారదు. అదే చిత్రం. ఆ విచిత్ర గతిచలనాన్ని 'కాలం' అని పిలుస్తాం. అది నిజానికి స్పందన. ఆ స్పందన ప్రతిక్షణం కలుగుతూ అనంతంలోకి ప్రవహిస్తుంది. కాల ప్రవాహం ఎక్కడా ఆగదు. విశ్వనర్తనంలో అవి గతులు, సంగతులు. ఊహాశక్తికి చలించే వస్తుచయం. శూన్యరోదసిలో అవి శక్తి కేంద్రాలు. వాటిలో మనస్సు, మమకారం, జీవచలనం ఏవీ ఉండవు.

దేవతల స్వప్నం ఫలించింది. చైతన్యం కదిలి సృష్టికి పూనుకుని, కాలానికి నియమాల సంకెళ్లు వేసింది. ప్రకృతిలో చైతన్యం ప్రవేశించడంతో నాటకం ప్రారంభమైంది. మాయతెర తొలగినట్లయింది. నాటకం ప్రారంభం కాగానే ఆత్మ మేల్కొన్నది. ఆత్మ ఒక అగోచర శక్తిగా రంగం మీదికి వచ్చింది. అప్పుడు ఘన పదార్థంలో జీవం స్పందించింది. అచేతనంగా, జడంగా, నిర్జీవంగా ఉన్న నేలపై జీవం ఆవిర్భవించింది. శూన్యంగా ఉన్న కాలంలో రవంత చైతన్యం ప్రవేశించింది. శాశ్వతమైన దివ్యత్వంతో పోల్చితే మానవ జీవనం క్షణికం. అది మరువరాని జీవనసత్యం.

కనిపించని ప్రాణం కనిపించే ఘనరూపాలలో కదలిక తెచ్చింది. స్పందన కలిగించింది. విశ్వ సంగీతం లయాన్వితమైంది. ఈ అగోచరశక్తి రెండు పాయలుగా విశ్వ కుండలినిని చేరింది. శూన్య రోదసిలో అక్కడక్కడ జీవం సమీకరించడం వల్ల జీవకణాలు ఏర్పడ్డాయి. ప్రకృతి ధర్మానుసారం జీవులు ఏర్పడుతున్నాయి. తాను ఎందుకు జన్మించింది ఏ జీవికీ తెలియదు. తన రూపురేఖలు, నిర్మాణం,

జన్మ ఏవీ తన అధీనంలో ఉండవు. ప్రతిజీవి అస్థిరమే అయినా, ప్రతిక్షణం తాను స్థిరం అనుకుంటుంది. ఆ రూపాలు కాస్త భేదంతో మళ్లీ మళ్లీ ఏర్పడుతుంటాయి, జన్మిస్తుంటాయి. తమ మనుగడకు అర్థం తెలియదు. తమలోని దివ్యాంశను, పరమాత్మను అవి గుర్తించవు. జాగృతిలో, సుషుప్తిలో అవి కలిసే ఉంటాయి. సుఖదుఃఖాలు అప్రయత్నంగా ఏర్పడుతుంటాయి. విశ్వాత్మ మూగస్పందన రెండింటికీ ఒక్కటే. జీవశక్తి తాను చలించక నిశ్చలంగా, నిగూఢంగా మహదానందం కలిగించే సౌందర్యాన్ని అందిస్తుంది.

ఆ అవ్యక్తానుభూతి పరాన్ని హృదయానికి సన్నిహితం చేస్తుంది. అదే తపస్సులో, నిద్రలో ఒక స్పందన, ఒక పులకింత అవుతుంది. అదే విశ్వరహస్యం. మూసిన కనురెప్పలలో ఆత్మానుభూతి పెరిగి, పెరిగి జన్మరాహిత్యానికి హేతువవుతుంది. దివ్యత్వం కళ్లు విప్పినా, మనిషిని ఆవరించిన మత్తు వదలదు. దివ్యమందిర ప్రవేశం సులభంగా సాధ్యపడదు. కనిపించే రూపాలను, జరిగే పనులను మాత్రమే మనం గమనించగలం. కనిపించక ఎక్కడో ఉన్న పరమాత్మను చూడలేం. ఆధ్యాత్మిక పురోగతిని, అతీంద్రియశక్తిని సైతం గుర్తించడం కష్టం. వివేకం స్పందించినప్పుడు మాత్రం కాస్త ప్రజ్ఞ బయటపడుతుంది. తన ఆలోచనా పరిధి దాటి మేధ పరుగులు తీయదు. అంతకు మించి తెలుసుకునే శక్తి మనస్సుకు ఉండదు. కనుక లోపలవున్న ఆత్మశక్తి లోపలే ఉండిపోతుంది. మనస్సుతో ఆత్మశక్తిని తెలుసుకోలేం, దానిని బయటకు తీసుకురాలేం.

మనలో కుండలినీ శక్తి ఒకటి ఉన్నదనే విషయం మనకు తెలియదు. ప్రాణశక్తి, జీవశక్తి, ఆత్మశక్తి గురించి తెలుస్తుంది. కుండలినీ శక్తి గురించి తెలియదు. కుండలినీ శక్తి కనిపించదు, కదిలించదు, శబ్దించదు. కేవలం జీవధాతువుగా ఉండిపోతుంది. విశ్వకుండలినీ శక్తి తన పరిధి దాటదు. మన కుండలిని అవధి దాటదు. వెలుగుకు, మెరుపుకు రవంత చలిస్తుంది. వాంఛల ఉధృతాన్ని అణచిపెడుతుంది. శాంతి కోసం, క్రాంతి కోసం ఆరాటపడుతుంది. వేడి తగిలితే కాని కుండలినీ శక్తికి చలనం కలగదు.

మనిషికి సుఖ భోగాల పట్ల ఆసక్తి, అనురక్తి కలిగించేది కుండలినీ శక్తి. అయినా అది కేవలం సుఖాలతో తృప్తి పడదు. స్వప్నాలతో, సౌందర్యాలతో, ఆనందాలతో తృప్తి పడదు. దాని లక్ష్యం దివ్యత్వాన్ని పొందడం. అది ఎప్పుడో, ఎక్కడో గాని జరగని పని. ఆ శక్తి ఉధృతంగా మారి, ఆర్తిగా మనస్సును చేరుతుంది. ఆపైన ప్రశాంతంగా ఇంద్రియాలను, మనస్సును అణచిపెడుతుంది. అప్పుడు

ఎంత ప్రయత్నించినా ఆత్మ సమర్పణ ఆగదు. చైతన్యరూపంలో ఈ అద్భుత క్రియ సాగుతుంది. ధ్యానస్థితిలోని స్పందనలు దివ్యత్వానికి వెలుగుబాటలు. పదార్థంలో ఆత్మ తనను తాను చూచుకుంటుంది. భౌతిక శరీరంలోకి దివ్యత్వపు వెలుగులు తెస్తుంది. అందుకు విశ్వప్రేమ, ఆత్మానందం నిదర్శనలు.

అగోచర దివ్య సంకల్పం ఒత్తిడి ఎక్కువైనప్పుడు ఆనందం చిన్న చిన్న శకలాలుగా మనిషికి అందుతుంది. అవే ఆత్మకు అనుభూతిని కలిగిస్తాయి. కాని అనుమానాలు, అవరోధాలు తప్పవు. అహంకారం కారణంగా వికృత రూపాలు ఏర్పడి, వికృత కార్యాలకు పాల్పడడం జరుగుతుంది.

భూమ్యాకాశాల మధ్య జీవజాలం ఏర్పడింది. జలచర, భూచర, వాయుచరాలు ప్రకృతిలో కదలసాగాయి. పుట్టినవన్నీ నశించేవే. కాని ప్రతి ఒక్కటి మరొక్క క్షణకాలం ఎక్కువ బ్రతికినా చాలనుకుంటుంది. మౌలికంగా మనిషిదీ పశుస్థితే. మనస్సులోని ఆలోచనా ప్రక్రియవల్ల మానవ విలువలు పెరిగాయి. ప్రకృతిలోని వ్యక్తావ్యక్తస్థితి మనిషి మనస్సుకు ఆకరమైంది. ప్రజ్ఞ సగం యాంత్రికం, సగం దార్శనికం అయింది. ప్రజ్ఞ విశ్వచలనానికి, మానవ జీవనానికి తానే కారణం అయినట్లు, కాలచక్ర వేగాన్ని, గమనాన్ని గమనించ సాగింది. ప్రజ్ఞ తానై స్వధర్మాన్ని ప్రతిష్టించపూనుకున్నది.

సృష్టికర్త మనిషిని మనీషిగా చేయదలచి అతనిలో నిగూఢంగా ఉన్న ఆధ్యాత్మిక శక్తికి పదును పెట్టసాగాడు. మనిషి కళ్లలో స్వర్గం తాలూకు స్వప్నాలను దాచాడు. పురిటి మగతలో తాను ప్రసవించిన సృష్టి అందాలకు జగన్మాత నిరుత్తరురాలైంది. సృష్టి పరిణామ వేగానికి ఆశ్చర్యపడ్డది. క్షణంలో తన ఆశయాన్ని, ఆంతర్యాన్ని గుర్తించింది. తానూ చైతన్యం పొందక తప్పలేదు. మత్తు వదిలించు కుంది. ప్రజ్ఞానంతో తన నడవడికను చక్కదిద్దుకుంది. ఆంతర్యంలోని సంకల్పాలు ఆలోచనలుగా మారసాగాయి. మూగకాంక్షలకు సంకల్పం రూపకల్పన చేయ సాగింది. ప్రలోభాలకు లోనైన ఆలోచనలు నిత్యసత్యాలైనాయి. అవి పరిణామ కార్యంలో భాగం పంచుకోసాగాయి. ఆలోచనారహితంగా భగవంతుని కార్యం నిర్వహించడమే జగద్రహస్యం. సుందర దృశ్యాలకు ఆత్మ పరవశిస్తుంది. నిర్గుణమైన ఆత్మ అనేక రూపాలు ధరించసాగింది. భౌతిక కార్యాలకు జగన్మాత ఒక ధర్మాన్ని ఏర్పరచింది. రసాయన కణాలతో శరీరాన్ని నిర్మించి, అందులో ఆలోచించే మేధను జీవయంత్రంగా అమర్చి, అంతశ్శక్తితో జీవితాన్ని నడప సాగింది.

మనిషికి స్వర్గలోకాలకు చేరాలన్న ఆశ జన్మాంతర వాసన వల్ల ఏర్పడుతుంది. అది ఆత్మ సంస్కార ఫలం. మహోన్నతమైన ఆధ్యాత్మిక శిఖరాలు చేరాలన్నది తపన. పరమాత్మను చేరాలన్నది తపస్సు. అతర్దృష్టి ఏర్పడగానే ఊర్ధ్వలోక ప్రయాణం ప్రారంభమవుతుంది. భౌతిక ప్రపంచంపైన స్వర్గం నీడ పడుతుంది. దివ్యరూపాలు అలా వచ్చి కనిపించి, మురిపించిపోతాయి. ఒక తేజోకిరణం హృదయంలో చొరబడి ఆత్మను జాగృతం చేస్తుంది. శరీరానికి ఒక అపూర్వ వర్చస్సు వరంగా లభిస్తుంది. ప్రాపంచిక స్వప్నాలు కరిగి, దివ్యజీవనం ఆకృతీకరిస్తుంది.

ఎంత మార్దవమైనా మానవప్రేమ చిరకాలం నిలవదు. ఆత్మ దివ్యత్వం పొందడానికి అహంకారం రెక్కలు విరచాలి. తాత్కాలిక ప్రయోజనాలకు, ఆకర్షణలకు దూరం కావాలి. కాల నిబంధనలు అతిక్రమించి పోవాలి. కొన్ని క్షణాలు శరీర స్పృహ కోల్పోగలిగితే దివ్యానందం పలకరిస్తుంది. తన రుచి చూపిస్తుంది. ఆ క్షణంలో సర్వం, సత్య శివ సుందర మవుతుంది. అక్కడ ఆలోచన, ప్రజ్ఞ అవసరం ఉండవు. మానవ జీవితం ఎంత స్వల్పమో అంత విశాలం. అల్ప జీవితంలో సాధించగల ప్రయోజనాలు అనల్పంగా ఉంటాయి. జీవన సంగీత మధుర స్వరాలు అనవరతం వినగలగాలి.

మనస్సు గ్రహించగలదు కాని నిగ్రహించుకోలేదు. సత్యాన్ని మనస్సు తన దగ్గరకు రానీయదు. ప్రాపంచికతే మనస్సుకు ఇష్టం. మనం ఎందుకు జన్మించామో, ఎందుకు జీవిస్తున్నామో ప్రకృతి గ్రహిస్తుంది. అందుకు మనస్సు సహకారం అవసరం లేదు. అనుక్షణం, మన ప్రతిచర్య ప్రకృతి గమనిస్తుంది. సూక్ష్మంగా పరిశీలిస్తుంది. ఆత్మ ఏ మహాలక్ష్యంతో ముందుకు సాగుతున్నదో, ఆ చేసే కర్మలకు ఫలితం ఏమిటో ప్రకృతికి తెలుసు. మన ప్రయోజకత్వం ఎంత నిష్ప్రయోజనమో తెలుసు. జీవితంలో ఉత్తమ కార్యాలన్నీ ప్రకృతి నిర్దేశించినవే. మనం కన్న కలలు నిజాలు కావాలంటే ఆధ్యాత్మికత అవసరం. మహత్తర కార్యాలే పరానికి చేరువ. ఈ లోకాలు ఎందుకు ఏర్పడిందీ మన లోపల చీకట్లు కరిగి పోయినప్పుడు తెలుస్తుంది.

మార్మిక మహాలోకంలో ప్రవేశానికి ప్రతి ఒక్కరు అర్హులే. అక్కడ జరిగే పనిలో మనమూ భాగం పంచుకోవచ్చు. అక్కడి అనురాగాలకు అర్థం మనకు తెలియదు. వాటి ప్రయోజనం మనకు అనూహ్యం. గమ్యం అగమ్యం అనిపిస్తుంది. సృష్టి రహస్యాలు అభేద్యాలు. పైపై సొగసులు మాత్రమే మనం చూడగలం. అసలు తేజస్సును దర్శించి, భరించగల శక్తి మనకు ఉండదు. మన సంకల్పం

పరమాత్మ సంకల్పంతో సరితూగదు. మన దృష్టికి మాంద్యం ఎక్కువ. అంతర్గత మహత్తుల్ని తెలుసుకోలేం. మన వివేకంతో విశ్వశక్తుల్ని అంచనా వేయలేం. ఆశూన్యసాగరాన్ని మథించగల శక్తి మన మేధకు లేదు. పైపై నురగలను తరగలను మాత్రమే స్పృశించి తృప్తి పడతాం. ఆ తరంగాల ఉధృతం ఎప్పటికి సమసి పోతుందో చెప్పలేం. ఆ మహాశక్తుల్ని మన సొంతం చేసుకోవాలని ఆరాట పడతాం, అత్యాశ పడతాం. ఆ మహాశక్తుల్ని భూమిపైకి తెచ్చి మానవ ప్రయోజనా లకు ఉపయోగించా లని మన ఆశ. అందుకు అవసరమైన మార్గం సహజంగా ఏర్పడవలసిందే.

అగోచర మహాతేజస్సు తాలూకు మెరుపులు మాత్రమే మనకు అందుతాయి. విశ్వశక్తిలోని కొన్ని శకలాలను మాత్రమే మనం భరించగలం. పూర్ణతేజస్సు, కాంతి చాలా దూరంగా ఉంటుంది. దానిని సంపూర్ణంగా మనం భరించలేం. అలాగే పూర్ణసత్యం మనకు అందదు. ఏవో కొన్ని సత్యశలాకలు అందుతుంటాయి. మహాశక్తి సాగరం పైన మన జీవితాలు బుద్బుదాలు.

మూల సత్యాలు మన వివేకానికి అందవు. ఛాయారూపాలలో సత్యం ప్రస్ఫుటం కాదు. ఏ అనుకూలాలు మనల్ని ప్రలోభపెట్టవు. మనస్సు నిర్లక్ష్యంగా ఉన్నప్పుడే మన ఆలోచనలు సాగుతాయి. అంతర్యానికి ఈ బాహ్యక్రియలు పట్టవు. అసలు మన శరీరమే మనకు అర్థం కాదు. ఎక్కడ ఏముందో మనకు తెలియదు. పైకి కనిపించే అవయవాలు తెలుస్తాయి. లోపలి భాగాలు తెలియవు. మన మనస్సులో జీవితం తాలూకు వేళ్లు ఎంత లోతుగా ఉన్నాయో తెలియదు. పైకి చెట్టు కనిపిస్తుంది. వేళ్లు కనిపించవు! మనిషి చెట్టు కాదు. చెట్టుకు చిగుళ్లు పైన ఉంటాయి. మనిషిలో కొత్త చివుళ్లు లోలోపల మొలకెత్తుతాయి. అగోచర శక్తులు ఆత్మను కదిలిస్తాయి. ఆధ్యాత్మికంగా ముందుకు సాగినకొద్దీ ఒక అగోచరశక్తి దోబూచులాడుతుంది. అది ఎవరి ఆదేశాలను పాటించదు. దానికి మార్గదర్శకత్వం అవసరం లేదు. మన అనుభూతికి అదే మూలకారణం.

మనోమందిరంలో అచేతనంగా ఉన్న భావాలు కుతంత్రం చేస్తాయి. మనలో ప్రతికూలతకు అవే కారణం. మరొక పొరలో కొన్ని నిగూఢశక్తులు ఉంటాయి. అతీంద్రియ జ్ఞానం కలిగినప్పుడు మాత్రమే ఆ మార్మికశక్తులు మేల్కొంటాయి. మనిషికి ఆత్మ సంచలనం కలగడం, దివ్యసందేశాలు అందడం జరుగుతుంది. ఎక్కడ నుండో వచ్చిన సందేశం హృదయంలో చొరబడుతుంది. అది భావంగా మారుతుంది. అదే సత్యంగా రూపాంతరం చెందుతుంది. హృదయం స్పందించి

నప్పుడే అది సత్యవాక్కు అవుతుంది. సత్సంకల్పానికి మనలోని ప్రతిఅణువు పులకిస్తుంది. అప్పుడు మనం దివ్యసందేశాలను అందుకోగలుగుతాం. ఇది నిగూఢంగా జరిగేపని.

మనిషిని నడిపే యంత్రం మనస్సు. ఆ మనస్సుకు తన శక్తి సామర్థ్యాలు, పరిమితులు తెలియవు. ఆలోచనల పుట్టుక, క్రియ, లయ ఏవీ అర్థం కావు. తను సాధించే ప్రయోజనం ఏమిటో మనస్సుకు తెలియదు. మనస్సు లేని మనిషి జడప్రాయంగా బ్రతుకుతాడు. జీవితంలో అనేక బాధాకర విషయాలుంటాయి. మనిషిలో చైతన్యం వేయివిధాల పనిచేస్తుంది. చైతన్యానికి స్పందన తప్ప ఆచరణ ఉండదు. మనస్సు తెరవెనుక కదిలే బొమ్మలు మనకు తెలియవు. మనుషులంతా మనస్సు ఆడించే బొమ్మలే. మనం ఘనకార్యాలనుకునేవి మనస్సు అలవోకగా మనచేత చేయించే పనులు. మన అనురాగ విరాగాలు సైతం మనస్సు వినోదక్రీడలే. దాని శక్తి దానికి తెలియదు. మనిషికి తన శక్తి తనకు తెలియదు. తన శక్తి అంటే మానసిక శక్తి. అలా తనకు తెలియకుండానే మనిషి, మనస్సు తమ తమ కార్యాల్ని నిర్వర్తిస్తుంటాయి.

మనస్సు చీకటి మూలల్లో క్షుద్రశక్తులు రహస్యంగా ఉంటాయి. అవి చీకటికి ప్రతినిధులైనా వెలుగును అనుకరిస్తాయి. అప్రయత్నంగా అవీ పరమాత్మ కార్యానికి సహకరిస్తుంటాయి. మనిషికి అవసరాలే అవకాశం కల్పిస్తాయి. మహత్తర సంకల్పానికి సైతం అవే మార్గాలు ఏర్పరుస్తాయి. ఈశ్వర సంకల్ప నిర్వహణకు మనం చిన్న పరికరాలం. ప్రకృతిలోని సహజశక్తులు అందుకు ఉపకరణాలు. మనిషి ఎంతసేపూ తన గురించి, తన కర్మల గురించి, తన భవిష్యత్తు గురించి ఆలోచిస్తాడు. విధి పేరున విపరీత కార్యాలకు పూనుకుంటాడు. కాలం కసిగా కాటువేసినప్పుడు విచారిస్తాడు, క్రుంగిపోతాడు. విశ్వనాటకంలో విధి మనిషికి, మనిషికి మధ్య వైవిధ్యం, వైరుధ్యం కల్పించి వినోదిస్తుంది. అదే విధి విలాసం.

క్షుద్రశక్తులు సత్యస్వరూపాన్ని తెలుసుకోలేవు. వాటి ఇచ్ఛాసంకల్పాలన్నీ దైత్యాధీనాలు. మానవ హృదయాలపైన వాటి ప్రభావం అమోఘం. మానవ ప్రవృత్తులన్నింటిపైన క్షుద్రశక్తుల ప్రభావం ఉంటుంది. వాటి ప్రమేయం ఉంటుంది. క్షుద్రశక్తుల ప్రభావానికి లోనైనవారు స్వార్థాలకు, లంపటాలకు తలవొగ్గి, బురదలో చిక్కుకుంటారు. ప్రాపంచిక సుఖాలకు మాత్రమే ప్రాధాన్యత నిచ్చి, తమలోని స్వార్థచింతనకు పట్టంకడతారు. మన మనస్సులోని చీకటి కోణాలు వాటికి

స్థిరనివాసాలు. ఆత్మమందిరం చుట్టూ అహంకారం తాలూకు కర్మాగారాలు వెలసి ఉంటాయి.

నరకంలో పొందే సుఖాలు అక్కడ సుఖంగానే ఉంటాయి. జీవునికి సుఖాలు ఎంత తృప్తినిస్తాయో, నరకాలు అంతే తృప్తినిస్తాయి. నరకం కూడా జీవునికి హాయిగానే ఉంటుంది. జీవుని విషాదప్రేమ వల్లనే మనిషికి కష్టాలు ఏర్పడతాయి. ఆ కష్టాలు మనస్సుకే గాని జీవునికి అంటవు. మొత్తం జీవిత సంఘటనల్లో వాటికి ప్రాధాన్యత ఉంటుంది. ఇక్కడి అజ్ఞానాన్నే మనిషి అందుకుంటాడు. నరకంలోని అజ్ఞానుల ప్రభావం మనిషిపైన ఎక్కువ పడుతుంది. మనిషి సంకల్పాన్ని, వాక్కును వారు మార్చగలరు. వారే మనకు కష్టాలు, కన్నీళ్లు కలిగిస్తారు. వారే మన భ్రమలకు కారకులు. జీవనరంగంపై వికృత చిత్రాలు రచించేది వారే. మన జీవనంలో విషాద దృశ్యాలు కల్పించేదీ వారే. వారు చీకటిలో కదిలే చిరుదేవతలు, క్షుద్రదేవతలు.

మనిషికి తన అదృష్టాన్ని మార్చుకునే శక్తి ఉండదు. కిరాయినటుల వలె సంభాషణలు అప్పచెప్పి, చెప్పినట్లు నటించిపోతుంటారు. వారికి స్వంత అభిప్రాయాలు ఉండవు. తమ పాత్ర పూర్తి కాగానే రంగం నుండి నిష్క్రమించి చీకటిలోకి తప్పుకుంటారు. అసురశక్తుల ప్రభావం మనిషిపైన అపరిమితం. మనిషి పురోగతిని నిరోధించడానికి అవి ప్రయత్నిస్తాయి. వాటిని ఎదుర్కొనే శక్తి మనిషి కూడదీసుకునేలోగా మృత్యువు సమీపిస్తుంది.

ఇది అల్పాయుష్కుల జీవిత చరిత్ర. మనిషిలో పశుప్రవృత్తి అధికంగా ఉన్నంత కాలం 'ఆత్మ'ను చీకటి కనిపించకుండా చేస్తుంది. మేధ బాహ్యప్రపంచానికి పరిమితం అయినంతకాలం మనిషి భౌతికసుఖాలు మాత్రమే అనుభవిస్తాడు. క్షణికభోగాల పైకి మనస్సు పోతుంది. ఎంతకాలం జీవించినా మనిషిలో ఎదుగుదల ఉండదు. ఆత్మ పరిణతి చెందదు. భూమిపైన జీవం ఏర్పడిన నాటి నుండి నర, వానర, క్రిమి, కీటక జీవన విధానం ఇలాగే ఉంది. మూలపదార్థం అదే. జీవన పద్ధతి అదే. కొత్త రూపాలతో కొత్త అందాలు ఏర్పడ్డాయి. ఆలోచన పెరగడంతో బాధలు, సమస్యలు పెరిగాయి. దివ్యత్వం తరిగిపోయింది. చివరకు మానవ జీవితం నికృష్టంగా మారింది. స్థూల పదార్థం పతన స్థితిలోనే ఉండిపోయింది. భౌతిక విజయాలు ఆత్మకు పరాజయాలు. మనం అనుభవించే సుఖాలన్నీ బాధలకు బాటలు వేస్తాయి. కష్టాలు, కఠోర శ్రమలు అనుభవించి తీరవలసిందే. బ్రతికినందుకు చివరకు చావడం తప్పదు.

ముందు నిస్తబ్ద స్థితి – తర్వాత నిశ్చేతన స్థితి. రెండూ మృత్యుస్థితులే. నిద్ర ఆ స్థితులకు దగ్గర. మనిషికి నిద్రలోనే సుఖం. మరణంలోనే విశ్రాంతి. క్రియాశీలత మనిషి పనులలో కనిపిస్తుంది. కాని వాటి ఫలితం శాశ్వతంగా నిలవదు. దేవతల ఆనందోత్సాహాలను కలల్లో దర్శిస్తాం. ఆ దివ్యదర్శన ప్రభావం మన నిత్యకృతాలపైన పడుతుంది. ఒక మహత్తర శక్తి ఆత్మను లోబరచు కుంటుంది. శరీరంలో జవసత్వాలు ఉడిగినా బ్రహ్మానందానుభూతికి తరుగుండదు. వార్ధక్యం వచ్చిన కొద్దీ ఆధ్యాత్మిక శక్తులు ప్రబలుతుంటాయి.

బలహీనతలు ఉన్నవారి, విషయవాంఛలు పెంచుకున్నవారి ఆత్మశక్తి నిరర్థకమవుతుంది. జీవితం నిరుపయోగం అవుతుంది. అల్పమైన మమతలే ప్రేమలకు, ద్వేషాలకు, అసూయకు, అనురాగానికి ఆలంబనాలు. ప్రజలతో మైత్రీబంధాలు తాత్కాలికం. మహాశక్తి తాలూకు ఆనందాలను నిలుపుకునే మనోబలం మనకుండదు. ప్రాపంచిక ఫలితాలనిచ్చే వాటినే గొప్పవిగా భావిస్తాం. అంతా కళాత్మకంగా ఉండాలి. అన్నీ మనోరంజనం కావాలి.

మనిషి తన ఈతిబాధల మధ్య, మానసిక వ్యధల మధ్య, మనోవైకల్యాల వైక్లబ్యాల ఆటుపోటుల మధ్య, ప్రాపంచిక, భౌతికసుఖాల నుండి ఊరట పొందుతాడు. భౌతిక యాతనలకు ఉపశమనం పొందడానికై సుఖాలను ఆశిస్తాడు. నిజానికి నిశ్శబ్దాన్ని మించిన శాంతి ఉండదు. తన ఆత్మశాంతి తనకు రక్షణ. అతీంద్రియ సౌందర్యమే ఆనందహేతువు. ఆధ్యాత్మిక జీవితంలో మనిషికి ఆత్మశక్తి పెరుగుతుంది. ఆ స్థితికి చేరుకునే వ్యవధి మనిషికి ఉండదు. సంప్రదాయాలకు, ఆచారాలకు తలవంచడం వల్ల మనిషి సుఖలాలసకు బానిస అవుతాడు. జీవితం భయంకర అగ్నిగుండంగా మారుతుంది. చివరకు సుఖభోగాల తాలూకు మచ్చలు మిగులుతాయి. జ్ఞాపకాలు మిగులుతాయి. హత్యలు, మానభంగాలు అనాగరక చిహ్నాలు.

సత్యాన్వేషణకు, అంతరవగాహనకు మనిషికి వ్యవధి దొరకదు. విస్మరించిన ఆత్మ గురించి, ఆత్మశక్తి గురించి ఆలోచించడు. జీవనచక్రాలపై ప్రయాణం ఎంతో కాలం సాగదు. సుదీర్ఘ జీవనపథంలో అలసట తప్పదు. కాలంతో రాజీపడి బతుకుసాగిస్తాడు. విధికి ఎదురు నిలిచినవారు ఆధ్యాత్మికంగా ముందుకు పోగలరు. కాని హృదయం అలసిపోతుంది. విధికి ఎదురు తిరిగినవారిలో కొందరే తమ గమ్యం చేరగలరు. ఎక్కువమంది విధితో, కాలంతో రాజీపడి వెనుతిరిగిపోతారు. ఓటమిని ఆమోదించినవారు పతనోన్ముఖం అయినట్లే. వారిలో చైతన్యం మిగలదు.

సంపాదించిన జ్ఞానం హరిస్తుంది. అలాంటివారు ఒక్క సారైనా పరమాత్మను అనుభూతించలేరు. వారికి బ్రహ్మానందం సిద్ధించదు.

ప్రతి వస్తువులోను సౌందర్యాంశ ఉన్నట్లే ఆనందాంశ ఉంటుంది. దానిని అనుభూతించడంలోనే ఆనందం ఉంది. ప్రతి మనిషికి ఆనందహేతువు లుంటాయి. కాని తెలిసి ప్రయత్నిస్తే తప్ప అనుభూతి కలగదు. మనిషి అన్ని రుగ్మతలకు ఆనందమే విరుగుడు. మనిషి నిరాడంబరంగా జీవించడంలోనే తృప్తి ఉంది. గత కాలపు మధురానుభూతులే రేపటి ఆశలకు పునాదులు. గతానుభవాలకు భవిష్యత్తులో విలువ ఉండదు. నిరాశా, నిస్పృహలతోనే అగోచర పరమాత్మను ఆరాధించి ఆనందిస్తాడు. కాని తన నుండి తాను వేరైనప్పుడే పరమాత్మకు సన్నిహితుడవుతాడు.

జీవుడు ధరించవలసిన పాత్ర బహు క్లిష్టమైనది. జీవన రంగస్థలం చిన్నది. నాటకమూ చిన్నదే. చిన్న కథాంశంతో పెద్ద జీవితగాథను అల్లుకోవాలి. తాను నిర్వహించే ప్రతి పనికి తానే బాధ్యుడనుకుంటే తప్ప జీవితం సాగదు. అది తప్ప మనిషి జీవితానికి మరో ప్రయోజనం కనిపించదు. 'ఇదం పూర్ణం అదం పూర్ణం, ఇదేనా మన రంగస్థలం? ప్రపంచం నుండి అనంతాత్మలోకి ఏది దారి? ఈ లోకాన్ని సృష్టించిన వెలుగును మనిషి సంపూర్ణంగా దర్శించడం ఎలా?

అస్తిత్వంలో ఏర్పడిన భావన ఒక కల్పన, ఒక అభూత ప్రక్రియ లేదా ఒక క్రియాత్మక భావన కావచ్చు. అంటే వాస్తవానికి అవాస్తవానికి మధ్య సంచారం అవుతుంది. అది అతీంద్రియ అనుభూతికొరకు చేసే ప్రయత్నం కావచ్చు. లేదా, మనస్సులో దృశ్య ప్రపంచాన్ని అంచనా వేయడం కావచ్చు. అతీంద్రియస్థితి ఏదైనా ఆత్మకు అనుకూలమవుతుంది. కాని అతీంద్రియ అనుభవం అవాస్తవం, అయోగ్యం అనిపిస్తుంది. ఆత్మ పరమాత్మలది ఒక అద్భుతమైన అనుబంధం. మనిషి తన ఆలోచనల్లో తాను జీవిస్తాడు, లేదా మేధ నమోదు చేసుకునే విషయాలను ఆమోదిస్తాడు.

వెన్నెలలో, నిద్రలో నడిచి వెళ్లేవాని వలె, అహంకారం అజ్ఞానంలో స్వప్నంలా కదలాడుతుంది. అది కాలచక్రంలో క్షణాల్ని లెక్కిస్తుంది. అవాస్తవికం అనిపించినా, కార్యకారణ సంబంధంవల్ల జీవుడు ఒక రంగం నుండి మరొక రంగానికి మారుతుంటాడు. తాను ఎక్కడ నుండి ఎక్కడకు చేరుతున్నదీ జీవునకు అర్థం కాదు.

ఇక్కడ ఉన్నది అంతా స్వప్నం. ఉండీ లేనట్లే. స్వాప్నికుడు ఎవరో, ఏం చూస్తున్నాడో తెలియదు. అంతా ఊహ. లేదా ఈ ప్రపంచం వాస్తవమైతే దానిని అర్థం చేసుకోదగిన శక్తి సామర్థ్యాలు మనకు లేనట్లే.

భయంకర కాలచక్ర భ్రమణంలో మన జీవితం ఒక మలుపు. అనేక రహస్యాలను ప్రపంచం తన గుండెలో దాచుకుంది. ఆత్మ ఈ ప్రపంచాన్ని చూచి కలత పడుతుంది, అర్థం కాక. కాని, అతీంద్రియంగా ఏర్పడే అంతర్దృష్టికి ఈ ప్రపంచం అభౌతికం అనిపిస్తుంది. అంతరాత్మ ఒకానొక స్థితిలో విశ్వానికి మూలమైన విశ్వాత్మ తానే అవుతుంది. క్రింద చీకటి వెలుగులలో మన జీవితాలు ఇలాగే సాగుతాయి.

అణువు మహావిశ్వానికి సంక్షిప్త సంకేతం. విజ్ఞానం, విశ్వం ఒక్క అణువులో ఉన్నాయి. జీవి తన పరిసరాలను విశ్లేషిస్తే, విశాల విశ్వాన్ని గణితంతో ఛేదిస్తే, జ్ఞాన వలయం ఏర్పడుతుంది, లేదా దివ్యత్వం నెలకొంటుంది, లేదా అతీంద్రియ ప్రజ్ఞ అలవడుతుంది. ఆ ప్రజ్ఞతో అన్ని లోకాలను చుట్టిరావచ్చు. రోదసీ సంపదలను అందుకోవచ్చు. అది ఎలా సాధ్యమో మనకు తెలియదు!

అయోమయ, అజ్ఞాన ప్రపంచంలో దివ్యజ్ఞానం, మతఛాందసం లేని ఆత్మజ్ఞానం ఒక్కటే సరైన నిర్వచనం ఇవ్వగలదు. అదే పరమాత్మ సంకేతాలను అందించగలదు. మన బలహీనతలపైన మతమౌఢ్యం ఎప్పుడూ దెబ్బతీస్తుంది. మన జీవితాలను, మన శరీరాలను వదలి ఆత్మలు నిష్క్రమిస్తాయి. అవి ఏ అగమ్య సీమలకు జారిపోతాయో, పారిపోతాయో మనకు తెలియదు. కాని మృత్యువు ఒక్కటే మన అమరత్వానికి రాచబాట అవుతుంది. అది కూడా తాత్కాలికమే. మన పరిమిత ప్రజ్ఞ సృష్టించుకున్న, ఊహించుకున్న అమరకోశం అది. అది మేధ పునాదిగా ఆత్మ చేసిన అసమగ్ర పరిశోధన. అదే ఆత్మ తొలి ప్రయోగం, ప్రాథమిక ప్రయత్నం.

ప్రపంచానికి మనిషి ఒక ఆటబొమ్మ. బాహ్య శక్తులకు విజ్ఞానం పరిమితం కాదు, విజ్ఞానం చివరిమెట్టూ కాదు. అది అజ్ఞానం అంచున మెరిసే మెరుపు. మనిషికి భయంకరమైన లోతులకు వెళ్లే సాహసం ఉండదు. అలాగే పరమాత్మను చేరే ధైర్యమూ ఉండదు. అంతర్యంలో మరింత లోతులకు వెళ్లగలగాలి. మేధ చిరుమెరుపుల్ని వదలిపెట్టినప్పుడు అత్యున్నత శిఖరాలు కన్పిస్తాయి. ఆ దృశ్యాలను ఆత్మతేజస్సుతో దర్శించగలం. చివరకు ఎప్పుడో ఆత్మ సాక్షిగా నిలబడుతుంది.

ఆత్మ అగోచర పరమాత్మను, పరమసత్యాన్ని చూపిస్తుంది. అప్పుడు ప్రపంచం సరికొత్తగా, నవోన్మేషంగా కనిపిస్తుంది. ప్రపంచం పరంజ్యోతి వెలుగులో దేదీప్యమానమవుతుంది. కాలక్రమేణ బహుళ ప్రయోజనాలు సిద్ధిస్తాయి.

మన జీవన సరిహద్దులు చెరిగిపోగా అనంతత్వంలో కలిసిపోతాం. పరమాత్మ పథకం మనకు అర్థం కాదు. అంతా దేవతల మహత్తర కార్యంగా భావిస్తాం. అంతా దైవికం అనుకుంటాం కాని అది మనదైన ప్రజ్ఞ. మన అన్వేషణలు, ఆరాటాలు, అగోచర, అవ్యక్త మహాశక్తి అనుమతించే చిరు ప్రయోగాలు. అంధకారంలోని జీవులకు అవి అగ్ని పరీక్షలు. సత్యానికి, బ్రహ్మానందానికి అవి సూటిబాటలు.

సగుణారాధన ద్వారా, బహు రూపారాధన ద్వారా నిర్గుణస్థితికి చేరవచ్చు. అప్పుడు సత్యదర్శనం అవుతుంది. అది మానవమేధలో వివేకంతో దోబూచు లాడుతుంది. అనేక రూపాల వెనుక ఉన్నది అరూపస్థితి. అది మన భావ, వర్ణచిత్రాల వెనుక ఒక సంకేతంగా ఉండి అన్ని ఆకృతులకు మూలమైన సత్యంగా భాసిస్తుంది. జ్ఞానజ్యోతిలో వెలుగు మూలాన్ని చూపిస్తుంది. సకల కర్మలకు అధిపతి అయిన మూర్తిని చూపిస్తుంది. అనుభూతికి సైతం అందని ఆత్మను మార్గదర్శిగా చేసుకుంటుంది. పరమాత్మ మన గమ్యం అని గుర్తుచేస్తుంది.

ఇక్కడ పనులు సహజంగా, ప్రకృతి సిద్ధంగా జరగవు. అన్ని పనులను పరప్రజ్ఞ గమనిస్తుంది. ప్రకృతి సిద్ధంగా జరిగే వాటికి పరమాత్మ ఆమోదం ఉన్నట్లు, దృగ్గోచర మహాసృష్టిని ఒక కన్ను చూస్తుంటుంది. పరమాత్మ ప్రభావం మనపైన ఉంటుంది. మనలో నిగూఢంగా, నిక్షిప్తంగా అనేక దివ్యభావన లుంటాయి. గ్రహాలను, తారకలను, మనలను నడిపించే పరాశక్తి ఒక్కటే. కనిపించని ఆ శక్తి మనలోకి చైతన్యంగా ప్రవేశిస్తుంది. ఆ మహాశక్తి మన సంసిద్ధత కోసం నిరీక్షిస్తుంది.

ఈ లోకం మనకు తెలిసిన లోకంకన్న భిన్నమైంది. మనం ఊహించే జగత్తును మించింది. మన జీవితలక్ష్యం మన ఊహలకు, మన కలలకు అందనిది. పరమాత్మ అన్వేషణలో మన ప్రయత్నాలు ఆరంభం మాత్రమే. మన ఆత్మలు ఆ పరమాత్మ నియోగించి పంపిన ప్రతినిధులు. రోదసీ సీమలలోని ఇరుకుబాటలలో, విధి వితరణ కోసం, పరమాత్మ అనుగ్రహం కోసం మనం అర్థిస్తుంటాం. ఈ మన చిరుజీవితాలు రంగస్థలంగా, మన కర్మల వెనుక గూఢచారిగా పరమాత్మ మన దివ్యత్వం కోసం పరితపిస్తున్నట్లు తోస్తుంది.

పరబ్రహ్మ దివ్యనిధి నుండి ఆత్మ ద్వారా అతిభద్రంగా, సురక్షితంగా ఒక మహాశక్తి ప్రేమగా, అనురాగవాహినిగా ప్రవహిస్తుంది. అదే నిగూఢ అగోచర బ్రహ్మానందాన్ని మనకు అందిస్తుంది. అప్పుడు ఆనందం మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అది అతీంద్రియతకు సంకేతం. స్వప్నాలలో హృదయం లోలోతుల కలిగే అనుభూతి. లోకంలోని బాధలలో లభించే ఉపశమనం. అది ప్రకృతిమాత రొమ్ము పాలు తాగి పెరిగే పసిబిడ్డ. అది అతీంద్రియారణ్యాలలో ఆడుకునే పసికూన. ఆత్మానందాలను నినదించే పరబ్రహ్మ వేణువు. ఆ పిలుపుకోసమే మనం జీవితాంతం ఎదురుచూస్తుంటాం.

రక్త మాంస నిర్మితమైన ఈ శరీరంలోనే పరమాత్మ తన అంశను ప్రవేశింప చేస్తుంది. అది ఆత్మగా మనలో ప్రకాశిస్తుంది. ఆత్మ ఎప్పుడో ఒకసారి మాయను తొలగించి బయటపడి మనలో అగ్నిని రగుల్చుతుంది. కొంత దివ్యత్వం కలిగిస్తుంది. మన శరీరంలో ఉన్న ఒక నిగూఢశక్తి అదృశ్యంగా ఉన్న పరమాత్మ దివ్యత్వాన్ని ఆరాధిస్తుంది. మన జీవితాలు అల్పమైనా మహత్తర లక్ష్యాన్ని సాధించగల సమర్థత కలవి. మనం సిద్ధంగా ఉంటే ఏ క్షణంలోనైనా దివ్యత్వం మనల్ని చేరుతుంది. దేవతలు దిగి రావడానికి, మనలో ప్రవేశించడానికి ఒకే ఒక మార్గం ఉంది. ఆ ద్వారం ద్వారా దేవతలు వినమ్రంగా లోపల ప్రవేశిస్తారు. మన స్వాప్నిక దివ్య మందిరంలో చొరబడి, మనం ఆరాధించే దేవతా రూపాలలో మమేకమవుతారు.

మనలోని దయాదాక్షిణ్యగుణాలు, ఆరాధన, త్యాగం అనురాగంగా మారి హృదయ మందిరంలో ఆనందజ్యోతుల్ని వెలిగిస్తాయి. నిశ్శబ్ద హృదయంలోనే మహత్తర పరిణామం జరుగుతుంది. అదే మన ఆధ్యాత్మిక ఔన్నత్యానికి వెలుగు, వెన్నెల. శూన్యంలో కన్న కలలు, ప్రపంచానుభవాలను ఆనందాలుగా మార్చుతాయి. సృష్టి రహస్యాలను మనకు అందిస్తాయి. మనలో నిద్రిస్తున్న దివ్యత్వాన్ని కాలమే మేల్కొల్పుతుంది. మూతపడి ఉన్న హృదయమే అసలు సిసలు ఆనందనిలయం. మృత్యువు శరీరాన్నే తప్ప, హృదయస్థ ఆత్మను తాకదు. హృదయంలోని ఆనందం దివ్య పరిమళాలను పోగు చేసుకుంటుంది. అది ఎల్లప్పుడు ఒక్క దివ్యసూత్రానికే కట్టుబడి ఉంటుంది.

మనస్సు ఎంత మూర్ఖంగా, అజ్ఞానంలో ఉన్నా ఒకప్పుడు స్వతంత్రం కాక తప్పదు. మన సంకల్పమే నెమ్మదిగా దివ్యత్వంగా రూపుదిద్దుకుంటుంది. మనలో ప్రతి అణువు అనుక్షణం దివ్యత్వాన్ని కాంక్షిస్తుంది. పరాన్ని కోరుతుంది.

మన ఆలోచనలు అఖండ తేజస్సును కాంక్షిస్తాయి. మన బలం, శక్తి పరమాత్మ అనుగ్రహించినవే. నిగూఢ బ్రహ్మానందమే ఈ లోకాలను తీర్చిదిద్దుతుంది. పరమాత్మ సౌందర్యంలోని మెరుపులే మన సౌందర్యాలు. ఇక్కడ ప్రతిదానిలోనూ జీవం ఉంటుంది. కనుక మన హృదయాలు నేరుగా దివ్యత్వాన్ని గుర్తించగలవు. మనం జ్ఞానంతో నేరుగా బ్రహ్మాన్ని అందుకోగలం.

మనిషి చేసే పాపాలు దివ్యత్వాన్ని దూరం చేస్తాయి. పాపభారం పెరిగినప్పుడు దివ్యత్వం పూర్తిగా అంతరిస్తుంది. అప్పుడు పరమాత్మ మానవరూపం ధరించి అవతరించవలసి వస్తుంది. సామాన్య మానవునిగా జీవిస్తూ, మానవాళికి మార్గం చూపడం జరుగుతుంది. అజ్ఞానంలో ఉన్నవారికి జ్ఞానం ప్రసాదించడం, లోకాన్ని ఉద్ధరించడం, వెలుగు ప్రసాదించడం అటువంటి అవతార పురుషులు చేసే పని.

ఆ పరమాత్మ సాగరఘోషతో భూమికి దిగివచ్చినప్పుడు చైతన్యం ఉరక లెత్తుతుంది. అణువణువు చైతన్యంతో పులకిస్తుంది. అందరూ బ్రహ్మానందంలో మునిగి పునీతులవుతారు. బ్రహ్మానందసాగరంలో శరీరం, మనస్సు, వివేకం, ప్రజ్ఞ మునిగిపోతాయి. ఆ ఆనందం ఈ నేలపైన లభించదు. శరీరంలోని ప్రతి అణువు పరిణామానికి లోనవుతుంది. ప్రతి అణువు దివ్యత్వాన్ని అందుకుంటుంది.

కాలంతో కదిలేది ఈ చిన్నజీవి, ఛాయగా మెదిలేది ఆత్మ. అజ్ఞానంతో విహరించే ఈ చిరురూపం కన్న కలల్ని వదలి పైకి వెళ్లాలి. అహంకారం మానవాకారంలో స్త్రీ పురుష రూపాలు ధరిస్తూ మట్టి బొమ్మకు దైవత్వాన్ని కల్పించాలని ప్రయత్నిస్తుంది. మనిషి తన శరీరానికి కాక ఆత్మకు విలువనివ్వడం జరిగినప్పుడు దివ్య కార్యక్రమం మొదలవుతుంది. తన ఆత్మనే పరమాత్మగా మార్చాలని మనిషి ప్రయత్నిస్తాడు. ఆ ప్రయత్నంలో పరమాత్మ మనిషికి పూర్తిగా సహకరిస్తుంది. దివ్యశక్తిని మనిషికి అందిస్తుంది. దివ్యస్పర్శతో మానవశరీరంలోని పాపం హరించుకుపోతుంది. కర్మ లయిస్తుంది. ఆధ్యాత్మిక క్రీడలో జీవుడు తన సర్వస్వాన్ని పరమాత్మకు కైంకర్యం చేసుకుంటాడు. అది ఒక చిత్రమైన పరిణామం.

శాపవశాన ప్రాప్తించిన వికృతరూపం వదలి దివ్యశరీరం పొందినట్లవుతుంది. అజ్ఞానం నుండి బయటపడి, నరకలోక దాస్యప్రవృత్తికి స్వస్తి పలికి, తనలోనే పరమాత్మను గుర్తించి, హృదయంలో భగవంతుని ప్రతిష్ఠించుకుని ఆరాధించినప్పుడు అందం, అనురాగం, ఆనందం ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.

ముందుగా మనిషి పొందవలసింది ఆత్మ సంస్కారం. అంటే తన ఆత్మను గుర్తించడం. ఆపైన అభ్యుదయం. మనల్ని చుట్టుముట్టిన అంధకారం నుండి బయటపడాలి. రూప ప్రపంచాన్ని దాటి ఆత్మ ఉచ్ఛస్థితికి చేరాలి. మానసిక వికారాలను అధిగమించిపోవాలి. దివ్యత్వంతో మనస్సు పరిమళించాలి. అతీంద్రియశక్తి మనలోని పశుప్రవృత్తిని అంతం చేస్తుంది. త్యాగం నెలకొంటుంది. కోరకపోయినా దివ్యశక్తులు అందివస్తాయి. శారీరకమైన అపేక్షలు, లోభాలు వదలిపోతాయి. దివ్యత్వం నిరాటంకంగా దిగి రావడానికి మనశరీరం అన్ని ఏర్పాట్లు చేసుకుంటుంది. మనం ఎంత నిస్సహాయ, దైన్యస్థితిలో ఉన్నా పరమాత్మ అనుగ్రహానికి పాత్రులం కావచ్చు. దివ్యత్వానికి మన అందచందాలు, కలిమిలేములు, సంపదలు ప్రధానం కాదు. మనలోని అజ్ఞానం, మన చుట్టూ ఆవరించిన చీకటిని తొలగించుకోడానికి సిద్ధం కావడం ఒక్కటే అర్హత.

ఈ భయంకరాంధకారాన్ని జన్మాంతర సంస్కారంతో కొంత, ఆర్జిత పుణ్యంతో కొంత తొలగించుకోవచ్చు. ఆత్మ సంస్కారంతో కల్లోలసాగరాలను దాటవచ్చు వికృతంగా, భయంకరంగా కన్పించే క్షుద్రశక్తులను దాటిపోవచ్చు. అడుగడుగునా అడ్డుపడే నీచ దేవతలను జయించవచ్చు. అన్ని ప్రభావాలను దాటిపోవాలి. మనం ఎక్కడకు ఏ మహదాశయంతో, ఏ లక్ష్యంతో పోతున్నామో తెలియదు. కాలు నిలవరించుకో వీలులేని జారుడు మెట్లపై నడవాలి. దృఢ సంకల్పంతో, దీక్షగా ముందుకు సాగాలి. మనం ముందుకు సాగినకొద్దీ మన వెనుక శూన్యం ఏర్పడుతుంటుంది. ముందరా శూన్యమే. అయినా దూరాన వెలుగులు కనిపిస్తాయి. మెరుపులు పిలుస్తాయి. శబ్దించని సవ్వడి మనవెంట నడుస్తున్నట్లు అనిపిస్తుంది. చీకటి గాయపడుతూ వెలుగుల్ని నిందిస్తుంది.

మన గుండె మనం భరించలేనంత బరువవుతుంది. అదే పెద్ద అవరోధం. ముందుకు సాగినకొద్దీ చీకట్లు దట్టంగా ముసురుతుంటాయి. చీకట్లను చీల్చుకుని ఏవో భయంకర నేత్రాలు మనల్ని నిక్కినిక్కి చూస్తుంటాయి. ఆరిపోనున్న దీపం వలె, చీకటి మిణుక్కుమంటుంది. మన చుట్టూ భూత, ప్రేత, పిశాచాల నీడలు అనేక ఆకారాలతో, వికారపు చేష్టలతో భయపెడతాయి. అజ్ఞానం, అంధకారం నిండిన గుహకు అంతు, అవధి ఉండదు. ఆ చీకటిలో ముందుకు సాగడానికి ఆత్మజ్యోతి ఒక్కటే ఆధారం.

40. చిత్రగృహం

అశ్వపతి నరలోకాన్ని అనుభూతించి, ఊర్ధ్వగమనంతో మరోలోకాన్ని చేరాడు. అది మాయకు, మర్మానికి మధ్యన ఉంది. అక్కడ మోసాలు, వ్యామోహాలు ఎక్కువగా ఉన్నాయి. చీకటి లోకాలు దాటిన తర్వాత అమృతత్వం రుచి తెలిసింది. ఆధ్యాత్మికత పెరిగినకొద్దీ పరలోకాలకు బాటలు విస్తృతమయినాయి.

మాయలోకంలో అన్నీ ద్వంద్వాలు. అక్కడ మానవత్వం, దానవత్వం, దివ్యత్వం కలగలిసి పోయాయి. స్వర్గం, నరకం, భూమి – మూడు భూమికలూ ఉన్నాయి. అక్కడ ఏమైనా సాధించవీలున్నది. అన్నింటిలోనూ జీవప్రజ్ఞ తొణికిసలాడుతుంది. అక్కడి మహాద్భుతశక్తి జీవిప్రగతికి, పరిణామానికి కాని ఆటంకాలు కాదు. మృత్యువుసైతం అవరోధం కల్పించదు. అది ఒక లోకానికి అంతం, మరో లోకానికి ఆరంభం. ఒక స్థితికి అంతం, మరొక స్థితికి ఆరంభం. అది జీవుడు కొంతకాలం విశ్రాంతి తీసుకునే లోకం. ప్రకృతి, పురుషుల లక్ష్యం పరిణామం. అయితే పరమాత్మ అనుగ్రహం లభించే వరకు, ఆధ్యాత్మికంగా జీవుడు అభివృద్ధి సాధించేవరకు మానవప్రవృత్తి, ప్రకృతి బంధం నుండి తప్పించుకోదు.

పైలోకాలలో సత్యం ప్రకాశిస్తుంది. సత్యప్రకాశంలో వెలుతురు ఉంటుంది. సూర్యుడు కనిపించడు గానీ వేడి ఉంటుంది. అది దివ్యత్వానికి మరొక మెట్టు. అది దివ్యజీవనానికి నాంది. అక్కడ ఉన్నంతసేపు అశ్వపతి తన అస్తిత్వం పూర్తిగా కోల్పోయాడు. ఆ పై లోకంలో సాంద్రతలేదు. సత్యం జాడ లేదు. మార్మిక శక్తులు కోకొల్లలు. అవే అతనిని నడిపించసాగాయి. ఆ తర్వాత జీవుని నడిపించేవి అన్నీ దివ్యశక్తులే.

తనచుట్టూ ముసిరిన చీకటిగోడలు కూలి కరిగిపోసాగాయి. దూరాన నోరువిప్పుకున్న ఒక గుహాలయం స్వాగతం చెప్పింది. అది వెలుగుబాట. శాంతిని

అన్వేషిస్తూ ఆ వెలుగుబాటన గుహలోకి ప్రవేశించాడు. ముందుకు సాగిన కొద్దీ మనస్సు నిర్మలం కాసాగింది. అయోమయం నుండి విముక్తి లభించినట్లయింది. అదొక నిర్మల ప్రపంచం. మరణాలు లేని, జననాలు స్తంభించిన మాయలోకం. అక్కడ అంతా నిర్వికార వాతావరణం. అక్కడ జీవపదార్థాలు, నిర్జీవ పదార్థాలు కలసిమెలసి ఉన్నా, ఏవీ శాశ్వతంగా ఉండిపోవు. అదొక విచిత్రలోకం.

పైన ఆకాశంలో వంపు తిరిగిన వెలుగుచాపం. ఆ రేఖను కప్పివేయడానికి యత్నించే నీలినీరదాలు. ఆ నీలిమేఘాలను తరిమివేయడానికి యత్నించే గాలి కెరటాలు, కోల్పోయిన శరీరాలకై వెదుకుతున్న ఆత్మలు, శూన్యంలో గర్జిస్తున్న ఉరుములు అక్కడ అశ్వపతికి దర్శనమిచ్చాయి. అక్కడ అతనిలో లక్ష ప్రశ్నలు తలెత్తాయి. ఆ ప్రశ్నలను దాటి ముందుకుసాగాడు. కాస్తంత ఆత్మశాంతి లభించింది. చిరు ఆశ చిగురించింది. తన రూపానికి, జీవితానికి, అన్వేషణకు సంబంధించిన సంకల్పం అది. అంతకుముందు అలాంటి సంకల్పం కలగలేదు. అది హృదయం కోరింది కాదు. మనస్సు ఆలోచించింది కాదు. కారుణ్యంవల్ల ఆకస్మికంగా ఏర్పడ్డ సంకల్పం. తెలియని విషయాలు అయినా ఆనందం కలిగించాయి. సరికొత్త మార్గంలో ప్రయాణం సాగింది. అక్కడ చైతన్యం లేదు. అక్కడ జననం మరణం ఒక ప్రక్రియ, ఒక ప్రయోగం.

అందరాని అదృష్టం ఏదో అందివచ్చినట్లయింది. అందీఅందని మహత్తరశక్తి తన ప్రభావం చూపింది. అవకాశం వచ్చినట్లే అనిపించి, అందకుండా పోయింది. అక్కడ ఏ రూపం శాశ్వతం కాదు. క్షణం కాలం నిలబడదు. అపరిమితం అనుకున్నది అంతలో కుంచించుకుపోయి, అంతర్థానమవుతుంది. ఏదైనా సున్న కన్న చిన్నగా సంకోచించగలదు, ఒకటి కన్న మిన్నగా వ్యాకోచించగలదు.

జీవి అక్కడ విశ్రమిస్తుంది. ఎక్కడికీ పోవాలనుకోదు. తిరిగి జన్మించాలనీ అనుకోదు. అసలు గమనిక ఉండదు. గమనం ఉండదు. గమనించే స్థితీ లేదు. అది చిత్రమైన, శుభ్రక్షేత్రం. ఎండకు వేడి ఉండదు. యదార్థం కాకపోయినా, ఊహల్లో సృష్టి అంచుకు చేరవచ్చు. అక్కడ కొసమెరుపుల్ని గమనించగలం. వాటి మధ్యన విహరించినా, ఆనందించినా వాటిని పొందలేము, అనుభ వించలేము. వాటిని పొంద గోరితే అక్కడి స్వప్నసుఖాలు కరిగిపోతాయి.

సత్యం వెలుగుల్లో భాసిస్తున్న పరమ సుందరలోకం అది. దాని అందాలు వినూత్నంగా, ప్రయోజనకరంగా ఉన్నాయి. ఆ పైనున్న సుందర, సురుచిర

స్వర్గాలలో దోగాడే అద్భుతాలకు అవి స్వప్నరూపాలు. కళ్లలో కదిలే కాంక్షలకు అవి కమనీయచిత్రాలు. అవి అనుభూతికి అతి చేరువ, అనుభవానికి అతి దూరం. అస్థిరమైన నేపథ్యంలో ధవళ యవనికపై స్వప్నాల కుంచెతో రంగులు దిద్దినట్లు, అర్థంకాని కళాఖండంలోని అస్పష్ట భావాలు. కదిలే చిత్రాలలోని కమనీయ కళారూపాలు.

ఆ వెలుగులు ఆ పైనున్న స్వర్గలోకాల సంధ్యారుణిమలు. అక్కడ అగ్ని కనిపిస్తుంది కాని వెలుగు ప్రసరించదు. ఆకాశంలో అరుణకాంతులు ప్రవహిస్తాయి. ఆకర్షణ అసంపూర్ణం అయినా ఆకాంక్ష సంపూర్ణంగా ఉంటుంది. అక్కడ వెలుగును అంధకారం మ్రింగివేయచూస్తుంది. శరీర సౌందర్యాలకు దేవతలు ఆకర్షితులై ఆ మాయలోకంలోకి రెక్కలు కట్టుకుని వచ్చి వాలతారు. భౌతిక సుఖాలను అనుభవించాలని ఆబగా ప్రయత్నిస్తారు. కాని, దేవతలు సరాసరి భూలోకానికి దిగిరారు. అశాశ్వతమైన భూలోకంలో వారు నిలవలేరు. మానవులతో సంబంధాలు ఏర్పరచుకోడానికి దేవతలకు మాయలోకం అనువైన ప్రదేశం. దేవ మానవ సంధానం సాధ్యమయ్యేది అక్కడే.

కోరినరూపం ధరించగల విద్య కామరూపవిద్య దేవతలకు తెలుసు. వారు భావనతో నుండి సంకల్పంతో రూపాలు సంపాదించుకోగలరు. వారి వాంఛలు, కోరికలు అంతరించిపోవు. కామరూపాలలోకి వారి కోరికలు బదిలీ అవుతాయి. కోరిన తావులలో వారు సంచరించగలరు. స్వర్గంలో తీరని కోరికలు ఇక్కడ తీర్చుకుంటారు. మానవుల తీరని కోరికలు సైతం ఈ మాయలోకంలో తీరుతుంటాయి. మనుషులు దేవతల్ని, గంధర్వులను ఈ లోకంలో పొందగలరు, వారితో సుఖించగలరు. అలాగే దేవతలు, కిన్నెర కింపురుషులు, గంధర్వులు మానవ సమాగమానికి ఇది అనువైన తావు. జీవితంలో అన్వేషణకు అంతం ఉండదు.

ఈ మాయలోకంలో ఎవరూ ఏదీ తృప్తిగా అనుభవించలేరు. అన్నీ భ్రమలనిపిస్తాయి. ఏవీ సమగ్రంగా రూపొందవేమో అనిపిస్తుంది. అందరివీ భావ శరీరాలే అయినా అవి భౌతికశరీరాలనే భ్రమ కలుగుతుంది. తృప్తి కలుగుతుంది. అక్కడివారు ఇవ్వగల సందేశం ఉండదు. మిగిల్చే అనుభూతి ఉండదు. అనుభవం సైతం భావంలో లీనమైపోతుంది. అక్కడ ఉన్నంతసేపు స్వప్నభ్రాంతి కలుగుతుంది. స్వప్నాలు వాస్తవం కావడం అంటే అదే.

మళ్లీ జన్మించాలన్న కోరిక గల జీవులు అక్కడికి చేరుతుంటాయి. వారు అక్కడ స్వార్జితశక్తులతో ఎంతకాలమైనా ఉండిపోగలరు. వారి తీరని వాంఛలే వారి శక్తిని పెంచుతుంటాయి, జీవించేలా చేస్తుంటాయి. అవి ఏ సూత్రానికి, ధర్మానికి కట్టుబడి జీవిక సాగిస్తున్నదీ గ్రహించవు. ప్రతి అవకాశానికి పరుగులు తీస్తుంటాయి. ప్రతి చిన్న సుఖానికి ఆబగా ఎగబడతాయి. ఏదీ స్థిరంగా ఉండదని తెలిసీ, దానిని వదులుకోవు. వెంపరలాట జాస్తి. అన్నీ అసమగ్ర సుఖాలు, కాని అద్భుతం అనిపిస్తాయి. ఏదీ సురక్షితం కాదు. అయినా జీవుల ఆరాటం వర్ణనాతీతం. భూమికలేని జీవాత్మలు నివసించే లోకం అది.

ఆపైన ముందుకు సాగితే ఫలితం ఉంటుంది. అప్పుడు అన్వేషణ అర్థవంతం అనిపిస్తుంది. కాంతులీనే ఆకాశం క్రింద ఆశయాలు ప్రస్థానాలవుతాయి. ఒక మహాశక్తి రెక్కలు విప్పి నీడ కల్పిస్తుంది. ప్రయాణం సురక్షితంగా ఉంటుంది. మొదట వేగుచుక్క దర్శనంతో తొలిపొద్దు అందాలు కనిపిస్తాయి. మహత్తర దివ్యజీవనానికి ఫలితం కనిపిస్తుంది.

అప్పుడొక కాంతిగోళం ఉదయించి వెలుగులో తన ఉనికిని తెలియచేసింది. ఆంతర్యపు లోతుల్ని అన్వేషించే శక్తిని ప్రసాదించింది. మనిషి అంతర్శక్తుల జోలికి పోడు. బాహ్య మహత్తులతో తృప్తిపడి, పూర్ణత్వాన్ని త్రోసివేసి, సిద్ధుల్ని కాంక్షిస్తాడు. సర్వం జగన్నాథం. అన్నీ ఎప్పటికైనా ఒక్కటవుతాయని ఆశ.

మనిషిలో అస్తిత్వకాంక్ష దినదినాభివృద్ధి చెందుతుంది. అదే జీవునకు ఉపాధేయం. ప్రాణశక్తికి సూచిక. అదే స్వయంకృతాలకు భాష్యం. చైతన్య రూపాల చలనం. ఆలోచనలకు అందని విషయ పరిజ్ఞానం. జీవన సంగీతంలో సన్నని రాగాలు వినిపిస్తాయి. అవి జీవి హృదయం పైన చెరగనిముద్రలు వేస్తాయి.

ఆత్మశక్తి బహిర్గతమైనపుడు నిజ జీవనం, పరిసర ప్రపంచం ఆనంద పూర్ణమవుతుంది. ఏదో విధంగా చిదానందం దర్శనమిస్తుంది. ఆ ఆనందం తాత్కాలికం అనిపించినా దానికీ అమృతత్వం ఉంటుంది. అది స్థిరంగా లోపల ఉండిపోతుంది. పరమ సత్యానికి ప్రయోజనం సిద్ధిస్తుంది. ఒక సుముహూర్తంలో పరమాత్మ ప్రజ్ఞ పైనుండి దిగివస్తుంది. పరబ్రహ్మానుభూతి జీవితాన్ని అలరిస్తుంది. జ్ఞానదృష్టి ఏర్పడి పూర్ణప్రజ్ఞ అనుభూతికి తెలుస్తుంది. హృదయం కిల్బిషరహితమై ప్రేమానురాగాలతో నిండిపోతుంది.

అదే నిరాకార, నిర్గుణ పరమాత్మ సాక్షాత్కారానికి నిదర్శనం. అది

అదృశ్యంగా ఆత్మశరీరిగా రూపుదిద్దుకుని, మన భౌతిక శరీరంతోనే ఉంటూ, ఇంద్రియలోలతకు అతీతంగా ఒక వెలుగును, ఆనందాన్ని సృష్టించి పెడుతుంది. అదే దివ్యత్వంగా, ఆత్మశాంతిగా మారుతుంది. అదే వాంఛలకు అతీతంగా మనిషిని ఉద్ధరిస్తుంది. హృదయానికి బ్రహ్మానందానుభూతిని అందించి, జీవితాన్ని ఆనందపూర్ణం చేస్తుంది. అప్పటికీ పరమసత్యం సగం మాత్రమే అందినట్లు

మనస్సు ప్రలోభాలకు లోనుకాదు కనుక ఆత్మ భౌతిక రూపాల నైజాన్ని గ్రహిస్తుంది. ఊహకు మాత్రం అందే విచిత్ర తేజోరూపాలు హృదయాగ్ని సోకగానే బయటపడతాయి. వాటికి దివ్యత్వం తోడుకాగా ఆత్మ తన పరిధిలోకి తీసుకుని చైతన్యంగా మార్చుతుంది. అప్పుడు మన సాధనకు ఫలితం కనిపిస్తుంది. మన ఆశయాలకు ప్రోత్సాహం లభిస్తుంది. పరాశక్తులే వచ్చి భూమిపైన నిలబడతాయి. వాటి ప్రభావముద్రలు మన జీవితంపై పడతాయి. అప్పుడు విధి సంకెళ్లు తెంచుకుని సర్వస్వతంత్రుల మవుతాం. మనకు స్వతంత్ర ప్రతిపత్తి లభిస్తుంది. జీవనసాగరంపైన చైతన్యతరంగాలు కనిపిస్తాయి.

మనం ఆశించేదంతా అక్కడ రూపం ధరిస్తుంది. కాదంటే దానిని మనం తెలుసుకోలేం. అది కావాలనీ కోరం. ప్రతిఫలం ఆశించి తపస్సు చేయడం లేదు గదా! హృదయంలో ఎప్పుడో ఒక చిన్న బీజం నాటుతుంది. అది వృక్షంగా మారినప్పుడు మన జీవితం పూర్ణవికాసం చెందినట్లు. జీవితంలో ఆ బీజం ఎప్పుడు పడుతుందో మనం గమనించకపోవచ్చు. అది చిగర్చడం, పెరగడం తెలుస్తుంది. ఆ బీజం చాలాకాలం మనలో దాగిఉంటుంది. ఆధ్యాత్మికత దిగంతాలవరకు వ్యాపించి, స్వర్గ సోపానాలు దాటించి, పరానికి చేర్చుతుంది. చైతన్యంలోనే దివ్యప్రజ్ఞను కలిగిస్తుంది. అందరూ ఆ మెట్లు ఎక్కిపోవలసినవారే. నిరంతరం దైవధ్యానంతో చైతన్యం పొందే వారుంటారు. ఆ స్థితి నుండి వెనక్కి రావడం జరగదు. అదే అనంతయాత్ర. ప్రకృత ప్రపంచం నుండి పరమాత్మలోకి పయనం. భౌతిక శరీరం నుండి ఆత్మ శరీరానికి ఆరోహణం.

జీవి తన మూలస్థితిని తెలుసుకోగానే ఇక్కడి సంస్కారా లన్నింటినీ ఒక్కటొక్కటిగా వదలివేస్తుంది. పరిణామంలో ఒక్కొక్కమెట్టు పైకిపోతుంది. ఉన్నస్థితి నుండి ఉన్నతస్థితికి చేరుతుంది. ఒక రూపం నుండి మరో రూపానికి, ఒక జన్మ నుండి మరో జన్మకు మారడం జరుగుతుంది. అలా చివరికి భావాతీత, రూపాతీత, నిరంజన స్థితిని సాధిస్తుంది.

ఆ జీవి ఒకప్పుడు ఆద్యంతాలు లేని మహాశక్తి ఒడిలో నిశ్చింతగా విశ్రమించినదే కావచ్చు. ఇప్పుడు ఆత్మ ద్వారా అమృతానందాలను అందుకుంటుంది. తాను కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందుతుంది. నిర్గుణానికి రూపాన్ని గుణాన్ని ఆపాదించి, సృష్టిలో తానుగా దాటలేని అగడ్తను దాటాలని యత్నిస్తుంది. ఆత్మ సహాయసహకారాలు లేనిదే జీవుడు ఒంటరిగా తానై దానిని దాటలేడు. ప్రాపంచికమైన గాయాలకు తాత్కాలిక చికిత్స చేసి ఉపశమనం పొందచూస్తుంది. అల్పత్వం అనే దాస్యం నుండి విముక్తిని ఆశిస్తుంది. అద్భుతమైన బ్రహ్మానందాన్ని అభిలషిస్తుంది. కాలానికి కట్టుబడి ఉన్నంతకాలం జీవునకు దాగుడుమూతలు తప్పవు.

ఇక్కడ జీవుడు తాను ఎన్నటికీ పొందలేను అని అనుకున్న ప్రశాంతిని పొందడం జరుగుతుంది. పరమాత్మను కాలానికి ముడివేస్తుంది. తన చిన్న ఆత్మతో పరమాత్మను బంధిస్తుంది, ఒక బిందువులో మహాసాగరాన్ని బంధించినట్లు. పరమాత్మ సైతం ఆత్మ పిలుపు విని దిగివస్తుంది. ఆత్మ కోరినట్లు చేస్తుంది. భగవంతుడు భక్తునికి సేవచేసినట్లు జీవుడు అనంతరోదసీ తీరంపై నిలిచి, అన్ని రూపాలలో పరమాత్మను దర్శించి, తనచుట్టూ నిండిన బ్రహ్మానందాన్ని తనలోకి ఆహ్వానిస్తుంది, అనుభూతి చెందుతుంది. ఆత్మ కార్యనిర్వహణలో అలుపు, సొలుపు ఉండదు. ఆరంభం తెలుస్తుంది గాని అంతం కనిపించదు. ముందున్న ఆశయం, లక్ష్యం తర్వాత కనిపించవు. ఒకే ఒక సంకల్పం రేఖామాత్రంగా ముందుకు నడిపిస్తుంది. ఆ సంకల్పం సైతం తనది కాదు. అదీ దైవ సంకల్పమే!

జీవుని పరిశ్రమ అనవసరం అనిపిస్తుంది. పైగా ఆ పని అతిగోప్యంగా జరుగుతుంది. జనన మరణ వలయంలో చిక్కిన మనిషి భౌతికశరీరంలో పరబ్రహ్మను బంధించడం ఎలా? సంభావించడం మంచిదా? అగోచర పరబ్రహ్మకు రూపాన్ని, భావాన్ని కల్పించి, భాషతో స్తుతించడం ఏమిటి? అసంభవం సంభవం అవుతుంది. ఆత్మ తన పథకాన్ని మార్చుకోదు. వాటిని అమలు జరిపే పద్ధతుల్ని సిద్ధం చేస్తుంది. పరబ్రహ్మ కార్యాచరణకు కొత్త మార్గాలు వెదికి, కొత్త రూపాల్ని సిద్ధం చేస్తుంది. బ్రహ్మాన్ని భౌతికంగా దర్శించ వీలుకల్పిస్తుంది. అయినా ఆత్మకు ఆ విషయం తెలియదు. తన పథకం ప్రకారం ఆత్మ ముందుకు సాగుతుంది.

లోకంలో అంతా కల్లోలమే. ఏదీ సవ్యంగా సాగదు. సత్యం జాడ లోకంలో కనిపించదు. కనిపించే ప్రతిదానిలో సత్యం ఉన్నదన్న భ్రమ కలుగుతుంది. కాలం జరిగిన కొలదీ భ్రమలు తొలగిపోతాయి. ఆత్మ తన పనిని అసంపూర్తిగా

వదలివేయవలసి వస్తుంది. శరీరం మారగానే జీవుడు మరొక శరీరాన్ని ఆశ్రయిస్తాడు. ఆత్మ చేసే పనులు పైకి కనిపించవు. ఆత్మ కృషి అనంతంగా సాగుతుంది. చైతన్య భూమికపై మనస్సు, వివేకం చిన్నచిన్న మెరుపుల్ని సృష్టిస్తుంటాయి. అనంత సత్యాన్ని ఆత్మ మనస్సుకు అందకుండా దాచివేస్తుంది. కాలానికి అందని సత్యం కాలాతీతస్థితిలో దర్శనమిస్తుంది.

ఆత్మ ఆశించే ఔన్నత్యం మనిషి ఆచరణలో కనిపించదు. ఆత్మకృషి ఎంత అనురాగపూర్ణమో అంత బాధామయం. అదే ఆనందం, అదే విషాదం, అదే వరం, అదే శాపం. ఫలితం కనిపించకపోయినా ఆత్మ శ్రమిస్తుంది. ఆత్మకృషి ఎంత జటిలమైనా దానిని మనస్సు నిరోధించదు. ఈ లోకంలో కొనసాగినంత కాలం వైఫల్యం తప్పదు. మనిషిని వివేకం, ప్రజ్ఞ అపమార్గం పట్టిస్తాయి. అవ్యక్తమైన ఆనందం, అభివ్యక్తం కాని సౌందర్యం జీవునికి రుచించవు. జీవించి ఉండాలన్న సంకల్పం ఎక్కువై, సుఖాలపట్ల వ్యామోహం పెరిగి, జీవి ఇక్కడే ఆగిపోతుంది. ఆనందం, పరాకాష్టస్థితి జీవునికి ఇష్టం కాదు. అది జీవన ధర్మం, ప్రకృతి ధర్మం అనిపిస్తుంది. ఎప్పటికీ తృప్తి లేకపోవడమే ప్రకృతి న్యాయం. అయినా ఆత్మ తన సంకల్పాన్ని వదలిపెట్టదు. అన్నిచోట్ల తన సంకల్పాన్ని విస్తరింపచేస్తుంది. ఆత్మలో అనేక రూపాలు, చిత్రాలు ఏర్పడతాయి. ఒకే వాస్తవం వేయి రూపాల దర్శనమిస్తుంది. ఒకే కొమ్మకు వేయి రెమ్మలు.

ఆత్మ సృష్టించిన లోకంలో సత్యం ఆనందంగా ప్రవేశిస్తుంది. అప్పుడు ఆత్మసృష్టించిన లోకం స్వర్గలోకం అవుతుంది లేదా సుందర స్వప్నం అవుతుంది. అది సత్యానికి నెలవు. చైతన్యభూమిక మానవమేధ వలె సంశయించదు. అవరోధాలు ఉన్నా జటిలం కావు. అది స్వప్నించే మేధను, భావించే ఆత్మను విశ్వసిస్తుంది. ఆధ్యాత్మిక సత్యాలనే ఆత్మ అన్వేషిస్తుంది. విశ్వాసం దాని ఊపిరి. ఊహ దానికి ఆధారం. ఆత్మ ఒక్కొక్కసారి భావానికి బందీ అయి, పంజరంలో చిక్కిన పక్షిలా అవుతుంది.

పరజీవితానికి ఆధారం ఆరాధన. మనం అందుకోలేని తేజస్సును పరమాత్మ మనకు అందిస్తుంది. ఆత్మ విముక్తం కావడానికి కావలసిన శాంతిని, సంయమనాన్ని కలిగిస్తుంది. దానితో జీవునికి దివ్యానుభూతి, పరబ్రహ్మ స్పర్శ కలుగుతుంది. సత్యం–శివం–సుందరం... దాని దివ్యస్వభావాలు. మన కళ్లు చూడలేని స్వర్గ సౌందర్యాలను ఆత్మ చూపిస్తుంది. మనిషి భరించలేని బాధలను, చీకట్లను ఆత్మ భరిస్తుంది. ఆత్మ అటు అమరులతో, ఇటు అసురులతో స్నేహం

చేస్తుంది. మనస్సుకు ఒక చిత్రమైన ఆరాటం కలిగించి, హృదయ మందిర కవాటాలను తెరచి, పరాన్ని చూపిస్తుంది. అప్పుడు స్వర్గారోహణకు మనస్సు సిద్ధమవుతుంది. పూర్ణత్వం కోసం అన్వేషిస్తుంది. ఆత్మాన్వేషణలో మనస్సు సహకారం కొంత అవసరం. ఒక రూపం మనస్సుకు అవసరం. సగుణారాధనతో నిర్గుణాన్ని సాధించవచ్చునని మనస్సు నచ్చచెబుతుంది. అన్ని మార్గాలు నిర్గుణ పరబ్రహ్మకు మార్గాలేనన్నది మనస్సు కల్పించే సిద్ధాంతం.

ఆత్మకు జన్మస్థలం లేదు. ఎక్కడ పుట్టిందో ఆత్మకే తెలియదు. తను చేరవలసింది పరమాత్మ సన్నిధికి అని మాత్రం తెలుస్తుంది. ఎప్పుడో, ఎక్కడో అది పరమాత్మను కలుస్తుంది. ఆ రహస్యం మనస్సుకు తెలియదు. పరమాత్మకు ఎంత సన్నిహితంగా వెళ్లినా, స్పృశించినా ఆత్మ పరమాత్మను చేజిక్కించుకోలేదు. ఆ వెలుగు అంచుల వరకు ఎగబాకుతుంది. దివ్యత్వాన్ని అందుకుని తిరిగి సృష్టి చక్రంలోకి రావలసి ఉంటుంది. ఒక జన్మవలయం పూర్తి అయిన తర్వాత ఒక్కసారి పరమాత్మ దర్శనం చేసుకుంటుంది.

ఆత్మ పురోగమనంలో ప్రతి మండలంలోను కొంత దివ్యత్వం కలుస్తుంది. భూమిపైన, స్వర్గంలో, నరకంలో ఆత్మ తన నైజాన్ని మార్చుకోదు. విధి నిర్వహణలో ఆత్మ జోక్యం కలిగించుకోదు. కర్మకు దూరంగా మసలుతుంది. అన్ని గోళాలలో అగ్నుల్ని రగిల్చేది ఆత్మశక్తి. ఆత్మశక్తి, ఆత్మోన్నత్యం మరో ప్రక్రియ ద్వారా సాధించడం కుదరని పని. తనకు ఇష్టం లేకపోయినా, పరమాత్మ సంకల్పం మేరకు తను జన్మవలయంలో తిరిగి ప్రవేశిస్తుంది. జీవం జడక్షేత్రంలో సురక్షితంగా ఉంటుంది. చైతన్యంలో ప్రవేశించడం జీవునికి ఇష్టం ఉండదు. ప్రాపంచికత నుండి తొలగిపోవడానికి జీవుడు ఇష్టపడడు. ఇక్కడ పతనం చెందినా, అజ్ఞానానికి తలవంచినా, మృత్యువు ఆవహించినా జీవుడు చలించడు. లోకంలో ఉంటూ నరకం అనుభవించడానికే జీవుడు ఇష్టపడతాడు. మోక్షం, అమృతత్వం, అమరత్వం జీవునికి రుచించవు. పరమాత్మను అన్వేషించాలని జీవుడు అనుకోడు. అంధకారంలో, అజ్ఞానంలో ఉండిపోవడం జీవికి యిష్టం.

ఆత్మ చీకటిలో, శూన్యంలో, ప్రశాంతిలో చైతన్యం పొంది, తన పని ప్రారంభిస్తుంది. అదృశ్యంగా ఉంటూనే తన పని కొనసాగిస్తుంది. అగోచరంగా ఉండే ఆత్మశక్తి బయటకు తెలియదు. అది అణువుగా ఉన్నా, మట్టిలో పూడ్చినా శక్తిపూర్ణంగానే ఉంటుంది. అది ఎంత కాలం నిద్రలో గడిపినా, ఊర్ధ్వగమనంలో

అలసట చెందదు. మృత్యువు సమీపించినప్పుడు ఆత్మశక్తి మరీ విజృంభిస్తుంది. అసలు ప్రయాణం అప్పుడే మొదలవుతుంది. అదే మహాప్రస్థానం.

తనదైన తేజస్సు తనకు అందకపోయినా, కార్యనిర్వహణకు అవసరమైన శక్తిలేకపోయినా, చీకటి రాత్రులలో నక్షత్రకాంతి కరువైనా, ఎన్ని అవరోధాలు ఏర్పడినా, తను ఆశ్రయించిన శరీరం కష్టాలకు బలి అయినా, ఆత్మ అదృశ్యంగా తనశక్తిని పెంపొందించుకుంటుంది. అజ్ఞానంలో అలమటిస్తూ కష్టాలను అధిగమిస్తూ పరమాత్ముని శిలువను తన గుండెపైన మోస్తుంది. సత్యంకోసం తాను శిలువను మోయడానికైనా సిద్ధపడుతుంది.

చీకటిలో, శూన్యంలో ఆనందం నర్తించదు. ఎంతదూరం పయనించినా నైరాశ్యమే కనిపిస్తుంది. ఎక్కడా చలనం ఉండదు. అయినా ఆత్మ తన కర్తవ్యం విస్మరించదు. తనను ఆదేశించిన పరబ్రహ్మను అనుక్షణం స్మరిస్తూ ఆరాధిస్తుంది. నిరాకార, నిర్గుణ, పరబ్రహ్మ తత్వానికి ఒక రూపం కల్పించుకుని, గుణాలు ఆపాదించుకుని, అందులోనే పరమార్థాన్ని వెతుకుతుంది. ఏమీలేని చోట తన కలలు పండించుకుంటుంది.

జనన మరణ వలయాలలో జీవుడు చిక్కివున్నంత కాలం అవిద్య, అజ్ఞానం వదలనంత కాలం, ఆత్మ ఉండీలేనట్లు లోపల నీడలా కదులుతుంది. కర్మ వలయంలో తాను చిక్కుపడిపోతుంది. భౌతికంగా కన్ను, చెవి ఆత్మను గుర్తించవు. అంచేత ఎంతకాలమైనా ఆత్మ నిద్రిస్తూనే ఉంటుంది. తిరగబడదు. ఆత్మ తిరుగుబాటు చేస్తే శిక్ష భయంకరంగా ఉంటుంది. ఆత్మద్రోహులు అలాంటి శిక్షలు అనుభవిస్తారు. తనకు సంక్రమించిన అతీంద్రియ శక్తులతో ఆత్మ కొన్ని మహత్కార్యాలు చేయిస్తుంది. మట్టితో, రాళ్లతో ఆరాధనా మూర్తుల్ని సృష్టించి సదాలోచనకు, సదవగాహనకు అవకాశం కలిగిస్తుంది. మెదడుకు కొన్ని సందేశాలను అందిస్తుంది. మనిషి హృదయం ప్రేమతో నిండిపోతుంది. అలా ఆత్మ తన సంకల్పాన్ని కొంతమేరకు నిర్వహిస్తుంది.

ఆత్మశక్తి కొన్ని ఇంద్రజాల విద్యలను ప్రదర్శిస్తుంది. కొన్ని జీవులను, రూపాలను సృష్టించి ఆయా కాలాలలో, దేశాలలో వాటి ద్వారా ఆరాధన కొనసాగిస్తుంది. ఆత్మ సుదీర్ఘ ప్రయాణం ఈ ప్రపంచం నుండి, మనిషి నుండి ప్రారంభమవుతుంది. గోళాలు, నక్షత్రాలు ఆత్మకు వెలుగునిచ్చి మార్గం చూపిస్తుంటాయి. వివేకం ఆత్మ అనుభవాలను నమోదు చేసుకుంటుంది. మన

ఇంద్రియాలు ఆత్మానుభూతికి ప్రత్యక్షసాక్ష్యాలు. ఆత్మ సత్యాసత్యాల నుండి తనకు కావలసిన శక్తిని పరిగ్రహిస్తూ దివ్యలోక మాధుర్యాలను స్వప్నిస్తూ కలల సూచిక ఆధారంగా ముందుకు సాగుతుంది. ఈ విశ్వంలో అవి ఆత్మకృతులు. చీకటి పూర్తిగా తొలగిపోయే వరకు ఆత్మాన్వేషణ సాగవలసిందే. ఆత్మ మహాయాత్రకు ఒక్కటే రహదారి – అన్వేషణ – ఆకాంక్ష అన్ని అవరోధాలను దాటిస్తుంది.

పరమాత్మను ప్రేమిస్తున్న ప్రేయసి ఆత్మ ప్రియునిపై అనురాగంతో ఇంత సాహసం చేస్తుంది. అతని జాడకోసం ఎన్ని అగోచర లోకాలైనా గాలిస్తుంది. చీకటిలో, శూన్యంలో నిర్భయంగా, చైతన్య రహితంగా తిరుగుతుంది. కనిపించని ప్రియునికి బాసలు చేస్తుంది. భాషను నేర్పుతుంది. భావ సుమాలతో అర్చిస్తుంది. తన నిండుగా అనుభూతుల్ని పండించుకుని పదిలపరచుకుంటుంది. ప్రతి అందంలో పరమాత్మనే దర్శించి మురిసిపోతుంది. అంతచేసినా పరమాత్మను చిన్న పూలతో పూజించడమే అవుతుంది. చూపులతో అనురాగాన్ని వ్యక్తం చేసి, ఆనందబాష్పాలతో అభిషేకిస్తుంది. పరమాత్మ విశాలనేత్రాలలో తన ప్రతిబింబాన్ని చూచుకుని కోటి ఆనందాలను పొందుతుంది.

తెరచాటున దాగిన తన ప్రియుని పరిష్వంగం కోసం, తన హృదయానికి హత్తుకోవడం కోసం, తన కౌగిలి వదలి శూన్యంలో కలిసిపోకుండా తన హృదయంలో నిలుపుకుంటుంది. పరమాత్మ చేరువైనప్పుడు దూరంగా ఉన్నట్లనిపిస్తుంది. వ్యతిరేకత ఆత్మకు సహజగుణం. ఆత్మ ఎప్పుడూ పరమాత్మలోనే ఉన్నా, పరమాత్మ ఆత్మలోనే ఉన్నా ఆ దాంపత్యం బయట పడదు. నిత్యకృత్యాలలో పరమాత్మను బంధించాలని ప్రయత్నిస్తుంది. తనకు బందీని చేసుకోవాలని తపన పడుతుంది. ఎప్పటికీ తామిరువురు విడిపోరాదన్న ఆకాంక్ష.

జీవుడు కొలువుండడానికి అనువైన మందిరాన్ని అంతరాంతరాన ఆత్మ సిద్ధంచేసి ఉంచుతుంది. అక్కడ జీవుడు ఆత్మను, ప్రపంచాన్ని విస్మరించి విశ్రమిస్తాడు. ఆత్మ ఒక్కసారిగా మత్తువదలి నిద్రిస్తున్న జీవుని తట్టిలేపుతుంది. జీవుడు జాగృతమై, జ్ఞానం పొందినప్పుడు ఆధ్యాత్మికత్వానికి అర్థం తెలుస్తుంది. అంతవరకు ఆత్మను మరుగున ఉంచిన మనస్సు దివ్యత్వంపై వెలుగు ప్రసరిస్తుంది. స్వాప్నికశూన్యంలో ప్రశాంతికి శూన్యానికి మధ్యన ఇంద్రచాపం వంటి వారధి ఏర్పడుతుంది. ఈ విశ్వగోళంపై వల విసిరి, ఆ వలలో చైతన్యాన్ని బంధించాలనుకుంటుంది. ప్రజ్ఞ ఆత్మకు అధీనంకాగా మిగిలిన విషయ పరిజ్ఞానం అజ్ఞానంగా మారుతుంది.

ఏ అద్భుతాలనైనా సృష్టించగల సత్తా ఆత్మదే. ఆత్మ అసంభవాలను సంభవాలు చేస్తుంది. ఎన్ని అవాంతరాలు ఏర్పడినా గమ్యం చేరుకుంటుంది. అనుశీలనలోగాని వాటి అంతరార్థం, పరమార్థం తెలియవు. వివరణకు మాత్రం అర్థాలు అందవు. అసలు ప్రపంచమే అర్థం కాని మహేంద్రజాలం. ప్రాపంచికమైన తెరలు వాస్తవసత్యాలను మరుగుపరుస్తుంటాయి. ఊర్ధ్వలోకాలకు చెందిన విషయాలన్నీ అద్భుతాలు, పరమ ఆశ్చర్యజనకాలు. ఈ విచిత్ర విశ్వంలో ఎన్నో చిత్రమైన వర్ణాలు, కాంతులు, భ్రాంతులు కనిపిస్తుంటాయి. ఆత్మ ఛేదించలేని తెరలు ఉండవు. అతీంద్రియశక్తి పొందినప్పుడు అన్నీ అనుభవానికి వస్తాయి. ఎప్పటికప్పుడు దివ్యానుభవాలు కలుగుతుంటాయి. తెర మరుగున ఉన్నంత వరకు అవి నిగూఢ రహస్యాలు. అతీంద్రియ స్పర్శ అన్ని రహస్యాలను ఛేదిస్తుంది.

భౌతిక ప్రతిబంధకాలు, తెరలు ఏవీ ఆత్మను దాచి ఉండలేవు. ఆత్మ తనకిష్టమై అజ్ఞాతంలో దాగి ఉండాల్సిందే. దివ్య సంకల్పానికి ప్రతీకలు మనం దర్శించే రూపాలు. వాటి మర్మాన్ని మనస్సుతో గ్రహించాలి. ఏది ఎలా జరిగినా అంతా పరమాత్మ సంకల్పమే. అక్కడ ప్రతి ఆలోచన, ప్రతి అనుభూతి ఒక సంఘటన. ప్రతి సంఘటనకు ప్రయోజనం ఉంటుంది. ప్రతి సంకేతం వెనుక సజీవశక్తి ఉంటుంది. అతీంద్రియ శక్తులతో, సత్యాలతో ఏర్పడేది ఆత్మలోకం. కాని ఆత్మ తనకు అవసరమైన వాటిని ఏర్పరచుకోదు. మనకు కనిపించేవన్నీ సత్యానికి ప్రతిరూపాలు, లేదా సత్యస్వరూపాలు. అసలు సత్యం ఇంద్రియాలకు అందదు. దానిని ఇంద్రియాలతో తెలుసుకోలేం. ఆత్మ కాక, దేనిని స్పృశించినా అసత్యమే అనిపిస్తుంది. అశాశ్వతం అనిపిస్తుంది. ఏది లభించినా అది పరమాత్మికం కానిదే అవుతుంది.

పరమసత్యం మనలో చైతన్యం కలిగిస్తుంది. అది సత్యరోచిస్సులనేగాని, అసలు సత్య స్వరూపాన్ని చూడనీయదు. సంకల్పంతో, ఒక సుందర దృశ్యాన్ని చిత్రించి అందులో ఒక సుందర విగ్రహాన్ని, మనిషి ప్రతిరూపంగా, సృష్టించి దానినే భగవంతుడంటుంది. అలా అని మనిషిచేత నమ్మిస్తుంది. ఆ దైవరూపం మానవ ప్రతిరూపమే. ఆ దేవుని గుణాలన్నీ మానవగుణాలే. సత్యం కోసం అన్వేషించడం కొందరికే సాధ్యం.

సత్య లోకాలలో, స్వర్గ లోకాలలో జీవిస్తున్న జీవులు స్వతంత్రులు. స్వచ్ఛందంగా, నిర్మలంగా అక్కడ ఉండిపోగలరు. వారు శరీరం ధరించినవారు కారు. కామరూపులు. కోరిన రూపాలను కోరినప్పుడు ధరించగలవారు. వారు

మన కంటికి కనిపించరు. వారు ఆత్మలో లయించి, ఆత్మ శరీరులుగా ఉంటారు. అక్కడ అనురాగంలో కరిగి, ప్రేమను నింపుకుని ఆత్మకు సన్నిహితంగా మసలుతుంటారు. వారు శరీరాలతో చేయగల పనులు బహుస్వల్పంగా ఉంటాయి. బాహ్యజీవితానికి మించింది ఆంతరిక జీవనం.

ఆ లోకంలో జీవి మిగుల్చుకున్న శక్తులన్నీ జీవశక్తులే. శరీరం, మనస్సు ఆత్మ అధీనంలో ఉంటాయి. ఆత్మమందిరంలో ఉండేది విశ్వవ్యాపకత్వం ఒక్కటే. ప్రతిజీవి పనిలోనూ విశ్వజనీనత, విశ్వస్పందన ఉంటుంది. ప్రతివారిలోను విశ్వాంతరశక్తి పనిచేస్తుంది. అందరూ తమ ఆత్మలనే విశ్వాత్మగా మార్చుకోగలరు. మనం దివ్యజీవనం అలవరుచుకున్నప్పుడు దివ్యనాదాలు మనకూ వినిపిస్తాయి. మన అంతర్నేత్రానికి దివ్యతేజస్సు కనిపిస్తుంది. మన జిజ్ఞాస, సాధన మనల్ని గమ్యం చేర్చుతుంది. మన ఆత్మలో నాటుకున్న దివ్యబీజం పెరిగి, మహావృక్షమై, శాఖోపశాఖలై, మహాశక్తుల్ని ఆర్జించడానికి తహతహ లాడుతుంది.

మన ప్రతిభలన్నీ దివ్యశిఖరాలకు చేర్చేవే. హృదయకేంద్రంలోని ప్రజ్ఞ పొంగిపొరలి, సాగరమంత అవుతుంది. ఆ సాగరంలోని సుడిగుండాలలో శక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తి పరిసరాలను ప్రభావితం చేసి, శక్తిపూర్ణం చేస్తుంది. దివ్యమందిరంలో ఎన్నో ఇరుకు గదు లుంటాయి. ప్రతి గది దివ్యత్వంతో నిండి, దివ్యపరిమళం వెదజల్లుతుంది. కాస్త దివ్యత్వం అందినా చాలు మనిషి పరమపథం చేరగలడు.

ఈ విశాల విశ్వంలో ఆత్మది సర్వాధిపత్యం. ప్రతి వ్యక్తి జీవితంలో ఆత్మ తన పాత్ర నిర్వహిస్తుంది. సూక్ష్మరూపంలో ఉండి, జీవుని సుఖదుఃఖాలు తనవిగా భావిస్తూ, జీవుని లక్ష్యాలను, వాంఛలను నెరవేర్చుతుంది. అందుకు అవసరమైన శక్తి సామర్థ్యాలను జీవునికి సమకూర్చుతుంది. మనిషి వ్యక్తిత్వం వెనుక ప్రధానపాత్రపోషణ ఆత్మదే. విధి విలాసానికి బాధ్యత ఆత్మదే.

అది ఇహలోకానికి పరలోకాలకు మధ్యనున్న సరిహద్దు. స్వర్గాలకు పయనించే వారికది తొలిమజిలీ. దివ్యజీవనానికి అది తొలి ప్రధానకేంద్రం. కాంతిగోళాలకు పయనించే వారు సైతం అక్కడ కాస్త విశ్రమించిపోతుంటారు. భూమిపైన జీవిస్తున్న మానవులకు, అక్కడి వారికి సన్నిహిత సంబంధా లుంటాయి, పోలికలు ఉన్నాయి. ఇదే భూతలస్వర్గం... ఇది స్వర్గానికి దిగువన, భూమికి పైగా ఉంటుంది. ఆ లోకం ప్రభావం వల్లనే మనలో విశ్వప్రేమ జనిస్తుంది

ఇక్కడే మన ఆత్మలు వికసించి, పరిమళిస్తాయి. అక్కడి జీవులు మన తేజోరూపాలకు ప్రతీకలు. మన ఊహా రూపాలకు, స్వప్నాలకు వారివి పరిపూర్ణ ఆకృతులు. మన వాంఛాఫలసిద్ధి ఆ లోకంలోనే జరుగుతుంది. అక్కడ ఎవరికీ వైరుధ్యాలు, స్పర్థలు, శత్రుత్వాలు ఉండవు. పరమాత్మను నిండుగా ప్రేమిస్తారు. అంతర ప్రవృత్తిని బట్టి వారి జీవితాలు నడుస్తుంటాయి. ఎన్నటికీ ఎవరి ఆధిక్యం తగ్గదు. ఔన్నత్యం చెడదు. వారి విధి విధానాలకు బాధ్యత ఆత్మది. ఆత్మకు భిన్నంగా ఏ జీవి ప్రవర్తించదు. అక్కడ ఎవరి ఆరాధన వారిది, ఎవరి దారి వారిది.

అక్కడ సత్యాసత్యాల మధ్య ఘర్షణ ఉండదు. అందరూ దివ్యత్వం వైపుగా పయనిస్తుంటారు. అక్కడ అజ్ఞానం సైతం జ్ఞానం వైపుగా పయనిస్తుంది. నక్షత్ర కాంతులలోని తేజస్సును ఆర్జిస్తుంది. గాఢనిద్రలో సైతం పరప్రజ్ఞ ప్రకాశిస్తుంది. ప్రకృతి ఒక చైతన్యంగా అక్కడి వారికి అందుతుంది. అక్కడ జీవులందరిదీ ఒకే ఆదర్శం. ఆదర్శం అందరినీ ఒకే బాటన నడిపిస్తుంది. అందరూ సత్యారాధకులే. నిత్యకృత్యాలలోనూ సత్యాన్ని ఆవిష్కరింపచేసుకుని తమ జీవితాలను సత్యపూర్ణం చేసుకుంటారు. వారే సత్యస్వరూపు లవుతారు. తమలోని సత్యమూర్తిలో కలసిపోతారు, లేక తమ అజ్ఞానాన్ని సత్యంగా జ్ఞానంగా మార్చుకోనివారు దేవదూతలుగా, యమదూతలుగా పనిచేస్తుంటారు. వారికి స్వర్గ, నరకాలు రెండూ సమానమే. విద్య అవిద్య, జ్ఞానం అజ్ఞానం ఎప్పుడూ కవలలే.

అతీంద్రియ శక్తులు ఆరాధనా పూర్వకంగా పరమాత్మ దిశగా పయనిస్తుంటాయి. ప్రతిశక్తి తనకై ఒక మందిరం నిర్మించుకుని, తన శక్తిని ప్రసారం చేస్తుంది. తన ప్రక్రియను అభివృద్ధి చేసుకుంటుంది. ఇక్కడ పాపం సైతం దివ్యత్వంతో కలిసిపోయి ఉంటుంది. ఆత్మ తన సహజ సౌందర్యంతో మానవుని హృదయాన్ని తనకు నివాసం చేసుకుంటుంది. ఆత్మశక్తిదే ప్రపంచంలో అగ్రస్థానం. తనను ఆరాధించే వారికి తన నిజస్వరూపం తెలియచేస్తుంది.

మనిషి సత్యానికి విముఖుడై, అసత్యానికి పెద్దపీట వేస్తాడు, క్షుద్రదేవతల్ని ఆరాధిస్తాడు. క్షుద్రమంత్రాలు ఉపాసించి, క్షుద్రశక్తుల్ని వశపరచుకుంటాడు. చివరకు మనస్సు వికలమై పిచ్చివాడవుతాడు. ఆత్మను హత్య చేయగల శక్తుల్ని సంపాదించి 'ఆత్మ'హత్యకు పాల్పడతాడు. ఒక్క మంచిగుణం అలాంటి వారిని ఆదుకుంటుంది. కాని వ్యామోహాలు, ప్రలోభాలు వారిని స్థిమితంగా బ్రతకనీయవు.

ప్రజ్ఞ పొందిన వారు ప్రవక్తలవుతారు. అలాంటి వారు తమ సర్వస్వం దైవానికే సమర్పణం చేసుకుంటారు.

అలాంటి వారిలో చిత్రమైన ఆకర్షణ ఉంటుంది. ఆత్మ తేజస్సుతో ఎంత ఎత్తులకైనా ఎదగగలరు. వారు సౌందర్యారాధకులు. వారికి ప్రపంచం మొత్తం ఒక నందన వనంగా, ఆనంద మందిరంగా కనిపిస్తుంది, కనువిందు చేస్తుంది. అతి సామాన్య విషయాలు వారికి అద్భుతాలుగా కనిపిస్తాయి. ప్రతి నిముషం వారికి మహత్వపూర్ణంగా తోస్తుంది. అన్నింటిలోనూ నిద్రిస్తున్న ఆనందాన్ని తట్టి లేపగలరు.

అది విజయం కాని, అపజయం కాని, స్వర్గం కాని, నరకం కాని, రెండూ వారికి సమానమే. వాటి ప్రభావాలు వారిపైన పడినా, ఆనందంగా అనుభవిస్తారు. చేసుకున్న దానికి ఫలం సంతోషంగా అనుభవిస్తారు. అక్కడి జీవనం ఆత్మకు కర్మఫలభోజ్యం. భూమిపైన మనం యిచ్చే విలువలు వేరు, అక్కడి విలువలు వేరు. మనం భౌతిక ఫలాలు ఆశిస్తాం, అక్కడివారు దివ్యఫలాలు ఆశిస్తారు. అంతర విలువలను బట్టి బాహ్యాప్రణాళిక ఉంటుంది. భావం అతలాకుతలమై వాచ్యమైనట్లు, సంకల్పం ఒక క్రియగా మారినట్లు, ఈ ప్రపంచంలో పైకి కనిపించేదంతా ఒక అంతర్గత శక్తి ప్రచలనమే అవుతుంది.

ప్రలోభాలకు లోబడని మనస్సు మాత్రమే అతీంద్రియ, ఆధ్యాత్మిక చిత్రాలను రచిస్తుంది. అంతరంగ తరంగాలు లేనప్పుడు ఏర్పడే స్పందనలు శరీరానికి పరిమితంగా తృప్తి కలిగిస్తాయి. అశరీరశక్తులు మనకు అర్థం కావు. దివ్యశక్తులు అదృశ్యంగా పనిచేస్తుంటాయి. లేదా అజ్ఞాత సీమలలో ఉండిపోతాయి. ఒక్కసారిగా ఎప్పుడో భృక్తరహితాలై బయటపడతాయి. ఇక్కడ అతీంద్రియ ప్రజ్ఞ అజ్ఞాతంగా, నిగూఢంగా ఉండిపోదు. భృక్తంగా, నిగూఢంగా ఉన్నదంతా భృక్తరహితమవుతుంది. అదృశ్యంగా ఉన్నదంతా అనుభూతికి అంది రూపం ధరిస్తుంది. రెండు మనస్సులు కలిసినప్పుడు భాష అవసరం ఉండదు. భావాలు కలబోసుకోగలవు. అవగాహన ఏర్పడుతుంది. అలాగే రెండు హృదయాలు అనుభూతిని, అనురాగాన్ని పంచుకుంటాయి. ఆ అనుభూతి నరనరాన ప్రవహించి, శరీరం నిండా వ్యాపిస్తుంది. ఒక దానిలో ఒకటి లయించిపోగలదు. రెండు ఇళ్లు కాలినప్పుడు అగ్ని ఒక్కటవుతుంది. ద్వేషం ద్వేషాన్ని, ప్రేమ ప్రేమను సులభంగా గుర్తించగలదు. ఇతరుల మనోభావాలు తరంగాలై మనలోకి ప్రవేశించి, మన సూక్ష్మశరీరాన్ని

సున్నితంగా స్పృశిస్తాయి. ఆగ్రహం పరవళ్లు త్రొక్కి విజృంభిస్తుంది, నేల కదిలేట్లు రంకెలు వేస్తుంది. ఇతరుల విషాదం మనల్ని కలచివేస్తుంది. ఇతరుల ఆనందం మన రక్తంలో పొంగి పొరలుతుంది. దూరాలను అధిగమించి హృదయాలు స్పందించగలుగుతాయి. సాగరాలను దాటి శబ్దాలు ఏకమవుతాయి. అక్కడ జీవస్పందనలు పరస్పరాంగీకారం కుదుర్చుకోగలవు. ఎంతదూరాన ఉన్న జీవాన్నయినా మరొక జీవం గుర్తించగలదు. ఒకరి చైతన్యం మరొకరి చైతన్యంతో కలుస్తుంది. అయినా ఏకత్వం సాధించినట్లు కాదు. రెండు ఆత్మలు ఏకమైనప్పుడే ఏకత్వం సాధించినట్లు. అదే ఏకాత్మసూత్రం.

అంతరంగంలో నిశ్శబ్దం గోడకట్టి చైతన్యానికి రక్షాకవచంగా పనిచేస్తుంది. ఆ లోపల జీవుడు ఏకాంతంగా ఉండిపోతాడు. అక్కడ జీవుడు అద్వితీయుడు కాని దానికి ప్రత్యేకత ఉన్నట్లు కాదు. మహత్తర శాంతి పొందినట్లు కాదు. అప్పటికింకా అంతా అసమగ్రమే. ఏర్పడేది పాక్షిక ప్రజ్ఞ. అయితే అజ్ఞానం, అంధకారం అప్పటికి పూర్తిగా తొలగిపోతాయి. జ్ఞానం అప్పటికి చైతన్యప్రజ్ఞను అందుకోవలసి ఉంటుంది. అవాఙ్మానసగోచరం అయినది అనుభూతికి అందదు. అన్నింటి మూలమయినది ఏదో పర్యవేక్షిస్తుంది.

అరూపం నుండి రూపాలు ఏర్పడి రోదసి నుండి దిగివస్తాయి. అనేక పేర్లతో వ్యవహరించబడతాయి. అక్కడ ఆద్యంతాలు రెండూ అతీంద్రియ ప్రజ్ఞలే. మధ్యలో ఏదో జరుగుతున్నట్లు అనిపిస్తుంది. వర్ణనాతీతమైన సత్యానికి అవి వ్యాఖ్యానాలు. అవ్యక్తశూన్యంలో అవి వ్యక్తమయే చిత్తరువులు. అక్కడ ఎవరికీ తమ గురించి, విశ్వం గురించి తెలియదు. అక్కడే ఉన్న సత్యం గురించీ తెలియదు. మనస్సు చేసే పనులు మాత్రమే వారికి తెలుస్తుంటాయి. విశ్వమేధ తీరుతెన్నులు వారికి అవగతమవుతాయి. వాటికి దిగువన అంధకారం, పైన అనంత తేజస్సు. శూన్యంలో పైపైకి పోతున్న అనుభూతి మాత్రం తెలుస్తుంది. ఏవో విచిత్ర సందేశాలు సృష్టికి అర్థాలు చెబుతుంటాయి. అర్థంకాని విషయాలకు ఇచ్చే సమాధానాలూ అర్థం కావు.

ఆ చిత్రగ్రహం వదలి పైకి వెళ్లిన కొద్దీ మనం ఎవరో, ఏమిటో అర్థం కాని అయోమయం ఏర్పడుతుంది. మన చుట్టూ అన్నీ సంకేతవలయాలు. అర్థంకాని సంకేతాలు. జనన మరణాల ఉద్ధృత ప్రవాహాలు దాటి, ఆత్మ పరిణామ లోకపు సరిహద్దుల్ని అతిక్రమించి, వినువీధిలో, మినువాకలో నిర్భయంగా పయనించాలి. జీవితపు స్మృతిబాటలలో నిక్షిప్తమైన ఆనందాన్ని అన్వేషించాలి.

అది అనంతయాత్ర. దానికి ముగింపు ఉండదు. ఎంతదూరం గమించినా గమ్యం తెలియదు. అన్నింటికి ఒక ఉదాత్త లక్ష్యం ఉంటుంది. పైనుండి మరొక మహత్తర లక్ష్యం ఆహ్వానిస్తుంది.

ప్రపంచం పరిధుల్ని దాటి ఆత్మ పైకి పోగానే ప్రపంచానికి, పరానికి మధ్యగల చీకటి తెర తొలగిపోతుంది. కేవలం సంకల్పంతోనే ఆత్మ పరిశోధనకు పూనుకుంటుంది. అప్పుడు ప్రాపంచిక బంధాలనుండి పూర్తి విముక్తి కలుగుతుంది. అప్పుడు ఆత్మకు ఉదాత్త సంకల్పం ఏర్పడుతుంది. అది వాంఛ కాదు– సంకల్పం మాత్రమే. ఆపైన అంతా దివ్యత్వమే. అంతా పరాప్రజ్ఞ. సుదూరాన కనిపించే తేజస్సుకై ఆత్మ పరుగులు పెడుతుంది. అక్కడ ఆత్మకు తెలిసిన దానికన్న, తెలుసుకోవలసిందే ఎక్కువ. తాత్కాలిక సంకల్పాలు, దృశ్యాలలో చిక్కుబడిపోతాయి. ప్రజ్ఞలో అవి నిష్ప్రయోజనాలవుతాయి. తాంత్రికశక్తులు పొందినవారికి అగోచర లక్ష్యం చేరుకోవాలని ఉన్నా అది సాధ్యపడదు. అది అగోచరంగానే ఉండిపోతుంది.

★ ★ ★

అశ్వపతి అనేక రూపాలను, చిత్రాలను పరిశీలించి విశ్వ రహస్యాలకు భాష్యం చెప్పుకున్నాడు. సూక్ష్మతర సంకేతాలను విశ్లేషించాడు. అర్థం కాని సిద్ధాంతాలపైనున్న మాయతెర తొలగించగలిగాడు. కాలసీమల్ని దాటుకుంటూ పోయి సృష్టి రహస్యాలను తెలుసుకున్నాడు. ఆత్మ దర్శించిన చిత్రాలకు అర్థాలు స్ఫురించలేదు. విశ్వభారాన్ని మోస్తూ విచిత్ర నర్తనంతో అర్థాలు, అంతరార్థాలు గ్రహించ యత్నించాడు. అక్కడ ఎంతదూరం పయనించినా చిరువెలుగులు తప్ప, సృష్టి ఆంతర్యాలు అందలేదు.

జీవుని ఆశయాలు, ఆలోచనలు కలిసిపోయి చిక్కుపడి ఆంతరంగిక వాంఛలు ప్రక్కత్రోవలు పడతాయి. జీవిత మజిలీలలో మనిషి కన్నకలలు ఫలిస్తాయి. అపమార్గాలలో పయనించి మహారణ్యంలో చిక్కుపడిన పాంథుని వలె ఆత్మ దారితప్పి జీవనారణ్యంలో చిక్కుపడుతుంది. తనకై తాను అన్వేషించడం ప్రారంభిస్తుంది. ఏదో కొన్ని సంకేతాలు కనిపించినా అర్థం కావు. సంకేత శబ్దాలు వినిపించినా అర్థం కాదు. అక్కడిది జ్ఞాననేత్రం భరించలేని కాంతి, తేజస్సు ఘనీభవించిన కాంతిరేఖ అది. అది చిదాకాశంలో కాంతిమాలికల్లో లయిస్తుంది. మైకం క్రమ్ముతుంది. ఆకాశంలో తారలు తప్ప ఏవీ కనిపించవు.

ఆత్మ మెరుపువేగంతో మానవమేధల్ని చదవగలదు. తెరచివున్న కిటికీ

నుండి ఆకాశాన్ని పరిశీలించడం సులభం. భౌతిక గ్రంథంలోని అధ్యాయాలను పరిశోధించి ఆత్మ తాను కోల్పోయిన సత్యాన్ని అన్వేషిస్తుంది. వాస్తవమైన ఆత్మకథలే ఈ లోకంలో అందమైన కథలు. జీవుని కుతంత్రాలు, మోసాలు బయటపడవు. ఎప్పుడో అప్రయత్నంగా అవి మలుపులు తిరుగుతాయి.

జీవుని ఔద్ధత్యం వెలుగు పొరలలో దాగి ఉంటుంది. అది పొందే శరీరం ఎలాంటిదో దానికి తెలియదు. శరీరాలను నిర్ణయించేది ఆత్మ. ఒకే జీవం ఆత్మ సాయంతో అనేక రూపాలు పొందుతుంది. ప్రతి రూపానికి, ప్రతి జన్మకు నిర్దుష్ట ప్రయోజనం ఉంటుంది. భావం కల్పించే అనేకానేక రూపాలను ఆత్మ చూడగలదు. ఆ రూపాలన్నీ ఆకర్షణీయంగా ఉంటాయి. అయితే అవి అన్నీ తాత్కాలిక రూపాలే.

వేనవేల సత్యభావనలు రూపాలుగా మారి, జీవనచిత్రాలై ఆత్మను దర్శిస్తాయి. అనంతకోటి రూపాలు నోరు వాయి లేని తమ మూగ గొంతులతో తమ వేదనల్ని ఆత్మకు నివేదిస్తాయి. తమవైన ఔన్నత్యాలను, ఔద్ధత్యాలను సూక్ష్మయవనిక పైన ప్రదర్శిస్తాయి. క్షణకాలమే అయినా వెలుగు వెల్లువలో అవ్యక్తం బహిర్గతమవుతుంది. అంతవరకు వినిపించని నాదాలు ఇప్పుడు శబ్దాలుగా వినిపిస్తాయి. అర్థంకాని ఆలోచనలు సత్యాన్ని ఆవిష్కరిస్తాయి. అగోచర పరలోకాల నుండి వినిపించే శబ్దాలు అవ్యక్త పరబ్రహ్మను జ్ఞాపకం జేస్తాయి.

మంత్రార్థమే పరమాత్మ. మంత్రమే పరమాత్మ శరీరం. అతీంద్రియ ధర్మాలన్నీ విచిత్ర రేఖాచిత్రాలు. అనురాగంతో అవి అన్నీ ముడిపడి ఉంటాయి. కాలగర్భంలో దాగిన సత్యాలు ఆత్మ తేజస్సులో ప్రకాశిస్తాయి. సారవంతమైన ఆత్మక్షేత్రం హృదయపులోతుల్లో ఉంది. అక్కడ ప్రమాదాలు, ప్రమోదాలు కలసి ఆనందంగా మారతాయి. జీవుని ఆశలు రెక్కలు విప్పుకుంటాయి. అక్కడ నీలి, బంగారు మెరుపులు అగ్ని శకలాలు. జీవుడు రహస్య మార్గం ద్వారా కర్మక్షేత్రం ప్రవేశిస్తాడు. ఆత్మ అనుభవించే బ్రహ్మానందాలను జీవుడు అనుభవిస్తాడు.

హృదయం పరివర్తన చెందడానికి ఒక్క సంఘటన చాలు. అప్పుడు హృదయం పరిపూర్ణంగా వికసిస్తుంది, ఆధ్యాత్మిక ప్రేమతో నిండిపోతుంది. ఆత్మ వికాసం మధ్యాహ్న మార్తాండుని వంటిది. తాపాన్ని కలిగిస్తుంది. యోగాగ్ని రగిలి భయపెడుతుంది. లోపలి కలకలం బయటకు తెలియదు. ఆర్భాటం చేసేవారి నుండి మహత్తులు జారిపోతాయి. వారికి సృష్టి వైచిత్రి అర్థం కాదు.

అశ్వపతి అతీంద్రియ శక్తుల మధ్య హాయిగా సంచరించాడు. వాటి సందేశాలను, సంకేతాలను అందుకున్నాడు. వాటి ప్రయోజనాన్ని అనుభవించాడు. అక్కడ జీవితం మానవజీవితం కన్న భద్రం. సత్యం హృదయానికి అవగతం. మన ఊహలకు, భావాలకు మాత్రమే అక్కడి వాస్తవాలు తెలుస్తాయి. అక్కడ అందరివీ సర్వ స్వ-తంత్ర రూపాలే.

ఆ మహోన్నత ప్రశాంత శిఖరంపై ఆత్మకు ఒక మహాశక్తి తోడుగా నిలుస్తుంది. పరమసత్యానికి మన జీవితాలు, ఆత్మ నిత్య నివేదనలు చేస్తుంటాయి. సాధనతో మాత్రమే పరమాత్మను దర్శించగలం. ధ్యానంలో ఆత్మవిముక్తమై పరమాత్మను దర్శిస్తుంది. ఆత్మను చుట్టుకున్న అహంకార ప్రవృత్తులు తొలగిపోతాయి. ఆలోచనతో పరబ్రహ్మకు ఆత్మసందేశం వినిపించవచ్చు. అందుకు నిదర్శనం ఆత్మదర్శనం, ఆత్మానుభూతి. ఒక గుమ్మంలోంచి ఇంట్లో ప్రవేశించినట్లు అంతరంగంలో ప్రవేశించాలి. అక్కడ ఆత్మకు నిజస్థితి తెలుస్తుంది. ఆత్మ జీవునితో కలిసిమెలిసి ఉంటుంది. కలిసి పయనిస్తుంది. జీవభ్రాంతి కలిగించి తానే జీవునివలె మెలుగుతుంది. అదే జీవాత్మ రహస్యం. ఆ రహస్యం పరమాత్మకు తెలుసు.

ప్రపంచంలో జీవుడు తన ఆధిపత్యం ప్రదర్శించినా, ఎన్ని ఆర్భాటాలు చేసినా, నటించినా ఆత్మ క్షమిస్తుంది. జీవుడు చేసే అద్భుతాలను, ప్రదర్శించే ఆడంబరాలను ఆత్మ ఆమోదిస్తుంది. చివరకు జీవుని ఆర్తనాదానికి తల్లడిల్లిపోయి, సానుభూతి చూపిస్తుంది. జీవుడు చేసే మాయలు, మర్మాలు ఓర్పుతో సహిస్తుంది. జీవుని సంకల్పమే తనదిగా ఆమోదిస్తుంది. విధి కర్కశ హస్తాలలో పడి జీవుడు నలిగిపోతాడు. జీవుడు తన అహంకారం వదులుకునే వరకు ఆత్మ నిరీక్షిస్తుంది. అప్పుడు ఆత్మ రంగప్రవేశం చేస్తుంది. ఆంతర్యం చేసే హెచ్చరిక వినిపించినా జీవుడు దానిని పట్టించుకోడు. జీవుని ప్రత్యణువు జీవనలాలసతో నిండి ఉంటుంది. అతని గుండె సదా ఆనందాలను, సుఖాలను కోరుతుంది. మనస్సు ఎంత శ్రమించినా ఆశించిన ఫలితాలు పొందలేదు. జీవుని హృదయం అన్నీ వాంఛిస్తుంది-ఒక్క భగవంతుని మాత్రం కోరదు. పరబ్రహ్మ ఎప్పుడూ అదృశ్యం గానే ఉంటాడు. పతనం చెందిన దేవతలు త్రిశంకుస్వర్గం చేరతారు. అగ్నిపక్షి సూర్యుని మింగాలని పరుగుతీస్తుంది. జీవుని వివిధ రూపాలను ఆత్మ గుర్తించ గలదు. అన్ని రూపాల వెనుక ఆత్మ కదలాడుతుంది. నశ్వరరూపాలలో ఆత్మ

ఒక్కటే అనశ్వరంగా ఉండేది. ఈ భూమిపైన జీవులను నడిపించేది ఆత్మశక్తి. కాని బయట ఎక్కడా ఆత్మజాడ కనిపించదు.

జీవులపైన ఆత్మప్రభావం అదృశ్యంగా పడుతుంది. కోల్పోయిన దివ్యత్వం ఆత్మకు పరోక్షానుభూతినిస్తుంది. అది నిగూఢ దివ్యత్వానికి సంకేతం. జీవితం అనేక విధాల ఆత్మను కలవరపెడుతుంది. చూడలేని చిత్రాల్ని మనస్సులో కల్పిస్తుంది. అది అక్షరరూపం ధరించని అవ్యక్త ఆత్మకథ. రంగుమాసిన వర్ణచిత్రం. అన్వేషించే కంటికి జీవిత పరమార్థం కనిపించదు. సత్యం బయటకు తెలియకుండా జీవితం తనలో దాచివేస్తుంది. జీవుని పరమార్థం ఆంతర్యంలో పరాన రాసి ఉంటుంది. పరార్థ భావన ఎక్కడో దూరంగా ఉంటుంది. అసంపూర్ణ చిత్రంలో పరమార్థం తెలియదు. మనం నిష్ఫలంగా వాటి అర్థాలు వెతుకుతాం. ఏ సమస్యకూ పూర్తి పరిష్కారం ఉండదు. సగం పరిష్కారం చూపడం ప్రతిభకాదు. దివ్యజీవనం ఏర్పరచుకుంటే దివ్య భావనలు కలుగుతాయి. అదే ఒక మార్గం చూపుతుంది. సాధనతో విశ్వ రహస్యాన్ని ఛేదించి, సత్యాన్ని తెలుసుకోవాలి. దానినే సత్యం అని నిర్ధారించడం ఎలా?

చీకటి వెలుగుల రోదసిలో, ఆధ్యాత్మికం చాటున, మార్మికత నీడన సత్యం దోగాడుతుంది. మన కన్ను సత్యం రెండవ వైపుకు చూస్తుంది. సత్యం ఒక రూపాన్ని పొందితేతప్ప మనం గుర్తించలేం. రంగుల వలను ఛేదించి చూస్తే తప్ప సత్యం కనిపించదు. సత్యం మసకచీకటిలో బందీ అయివుంటుంది. తాను చరించే లోకానికి దివ్యత్వం భయపడుతున్నట్లు, సత్యం లోకాన్ని చూచి పారి పోతుంది. ఆత్మను నడిపించేది చైతన్యం అని సత్యానికి తెలుసు.

దూరాన మెరిసే మెరుపుల్లో ఆకర్షణ ఎక్కువ. వినిపించే గానంలో పారవశ్యం అధికం. జీవుడు సైతం పారవశ్యంలోనే పరాన్ని గుర్తిస్తాడు. మన అస్తవ్యస్త జీవితంలో స్మృతి తరగలు ఎక్కువ. మన ఆంతర్యపు అయోమయస్థితికి అవి తీపి గురుతులు. మనం నేల విడిచి ఆలోచనల్లో పరుగులు తీస్తుంటాం. గతాన్ని సమీకరించడంలో ఊహకు అందినవి, స్మృతిలో మిగిలినవి మెరుపు మొయిళ్ల వలె కనిపిస్తాయి. మన భావ పథానికి ఇరువైపులా రంగురంగుల దీపకళికలు, కరిగిపోయిన సంఘటనలకు అవి అస్పష్ట సంకేతాలు. జీవుని చరిత్రలో అవి సాంకేతిక ప్రబంధాలు. చిక్కుపడిన కాలపథంలో అవి చిక్కువిడని గురుతులు.

జీవుడు పురోగమనంలో, తిరోగమనంలో ఆత్మను తన వైపు ఆకర్షించడం,

వికర్షించడం జరుగుతుంది. ఆత్మ జీవునకు చిక్కినట్లే చిక్కి జారిపోతుంది. జీవుడు ఎన్ని మార్గాలలో నడిచినా నేల గట్టిగా ఆనదు. అస్థిరత్వం తప్పదు. జీవి ప్రశంసలకు పొంగిపోయి, దాని కుతంత్రాలకు, గారడీలకు మోసపోయి, జీవస్పర్శ వల్ల కలిగే సుఖాలు మరిగి ఆత్మ దాసోహం అంటుంది. జీవి కళ్లలో స్వర్గం చూస్తుంది. జీవి సౌందర్యం 'ఆత్మ' సౌందర్యం అనుకుని తన ఔన్నత్యాలు, ఆధిక్యాలు జీవునకు కట్టబెడుతుంది. జీవుని తన్మయత్వం తనదిగా చేసుకుంటుంది ఆత్మ.

పరమాత్మ రచించిన పవిత్ర గ్రంథానికి అనువాదాలను మాత్రమే జీవుడు అర్థం చేసుకోగలడు. మూలరచనను అర్థం చేసుకుని ఆత్మ స్వంతం చేసుకోగలదు, అన్వయించుకోగలదు. పరమాత్మ రచనా చమత్కృతిలోనే సృష్టి రహస్యం ఉంది. కాని జీవనరంగంపై ఎక్కడా పరమాత్మ కనిపించదు.

మంత్రాలు, తంత్రాలు మనిషిని ప్రలోభపెట్టి లోబరచుకుంటాయి. తాంత్రిక ప్రయోజనాలు మనిషిని మురిపిస్తాయి. అవి పరేంగిత ప్రజ్ఞను కలిగించవు. కాలంలో నిలవక, అటు ఇటు మనసువెంట పరుగులు తీసి, తాత్కాలిక ఆనందాలు కలిగిస్తాయి. మనస్సు, వివేకం మనిషిని కకావికలం చేస్తాయి. ఆత్మ అభిలషించే ఆనందాన్ని అవి ఇవ్వలేవు. ఆవేదన కన్నీరై హృదయాన్ని చేరి, అందని శిఖరాలకు దారి చూపుతుంది. ఒక తీరని కోరికగా బ్రహ్మానందాన్ని చూపించి, పరం వైపుగా జీవుడు సాగేటట్లు ప్రోత్సహిస్తుంది. గత సంఘటనలు స్మృతులుగా మిగిలిపోతాయి. ఒకనాటి విషాదం అప్పుడు మధురభావనగా మారుతుంది. కన్నీరు ఆత్మను కదిలించగా విషాదంలోసైతం మధురస్వరం వినిపిస్తుంది.

అది అందుకోగల ఆనందాలు బహుస్వల్పం. బాహ్యాన్ని మాత్రం స్పృశించి, కరిగిపోతాయి. జీవుని ఆంతర్యంలో గత కాలపు స్మృతులు ప్రతిస్పందిస్తాయి. జీవుని ఆశకు చావు ఉండదు. అది ఆత్మగతం. అది ఆత్మ తీరని వాంఛ. ఆ వాంఛ భౌతిక శరీరంలో బందీ అవుతుంది. జీవితంలోని కష్టాలతో, కడగండ్లతో మనిషి గుండె గాయపడుతుంది. ఆ బాధల్ని నిలవరించడమే జీవుని పరమలక్ష్యం. మనిషి నిష్ప్రయోజక మార్గాలలో పయనిస్తుంటాడు. నిరుపయోగమైన మంత్రాలతో కుస్తీలు పట్టి, అసలైన బ్రహ్మానందానికి దూరమవుతుంటాడు. పరమపథంలో వినిపించే శబ్దాలు ఆత్మకు బాసటగా నిలుస్తాయి. అవి ప్రాపంచిక స్మృతుల్ని యదాతథంగా నిలుపుకుంటాయి. లేదా మమతకు, మాధుర్యాలకు మధ్యన నిలిచిపోతాయి. క్షుభితహృదయం ఆనందాలకై అలమటిస్తుంది.

ఒక అదృశ్యహస్తం విశ్వవీణను ఎప్పుడో శ్రుతిచేసి ఉంచింది. మన బాధల్లో చొరబడి, అంతరంగంలో నాదాలు పలికిస్తుంది. ఆ నాదాలు బాహ్యస్పృహ కోల్పోయినప్పుడు మాత్రమే హృదయానికి వినిపిస్తాయి, ఊరట కలిగిస్తాయి. అది జీవుడు ఆశించే ఆనందం, కోరుకునే ప్రశాంతి. ప్రపంచంలో ఎన్ని వైఫల్యాలు పొందినా, ఆశించదగిన ఆనందహేల అది. ఎన్ని మోసాలు జరిగినా హృదయాన్ని ఊరడించగల తారంగం అది. అది మన విశ్వాసాలను పట్టి ఉంచుతుంది. ఆ ఆనందం ఎన్ని బాధలనైనా భరించగల పుష్టిని కలిగిస్తుంది. ఆ ఒక్క ఆనందజ్వాల ఎన్నో మమతల్ని రగిలిస్తుంది.

ప్రతి విషాద హృదయంలో ఒక మూలన ఆనందం దాగివుంటుంది. భగవంతుని సృష్టిలో ఏదీ నిరుపయోగం కాదు. మనం ఓడిపోయిన కొద్దీ మనలో ఈశ్వరీయత పెరుగుతుంది. మన అపజయాలు సన్మార్గానికి పునాదులు. మన విజయాలు అపమార్గానికి దారిచూపుతాయి. మృత్యువు ఒక్కటే పైలోకాలకు మార్గం చూపగలదు.

జీవన సంగీతంలో ఎక్కువగా అపస్వరాలు పలుకుతుంటాయి. తర్వాత జీవనమే అమృతాన్ని పంచి పెడుతుంది. హృదయంలో దివ్యానందాలు చోటు చేసుకున్నప్పుడు భౌతిక లాలసలు క్రమంగా అంతరించిపోతాయి. భగవత్స్పర్శ మనిషిని ప్రలోభాలవైపు వెళ్లనీయదు. మనిషిని రక్షించేది ఈశ్వరీయత ఒక్కటే. అది మనం ఆధ్యాత్మిక మందిరం నుండి వెంటతెచ్చుకున్న సంపద. మధ్యదారిలో ఎక్కడో దానిని చేజార్చుకుని, జీవితంలోకి అడుగు పెడుతుంటాం. మనం పరలోకాలకు ప్రయాణమై వెళుతున్నప్పుడు మనం పోగొట్టుకున్న ఆధ్యాత్మిక సంపద తిరిగి మన కంటపడుతుంది.

యోగస్థితిలో బాహ్యశబ్దాలు ఏవీ వినిపించవు. అతీంద్రియ ధ్యానంలో శ్వాస సైతం స్తంభించిపోతుంది. మన చెవులకు ఏ ఇతరశబ్దాలు వినిపించవు. హృదయం వినగలిగిన శబ్దాలను మాత్రమే ఆత్మ ఆమోదిస్తుంది, అంగీకరిస్తుంది. లయించిపోయిన నాదాలు మరల మరల వినిపిస్తాయి. దివ్య నాదాలు కాలాతీతాలు. మనల్ని కలవరపరచే ప్రాపంచిక శబ్దాలు అనేకం ఉంటాయి. అవి పరమాత్మనాదం మనకు వినిపించకుండా అడ్డుపడుతుంటాయి. ప్రపంచంలోకి రాగానే 'ఆత్మ' అహంకారంగా రంగు మార్చుకుంటుంది. అహంకారానికి ప్రకృతి తోడవుతుంది.

ఎప్పుడో, ఎక్కడో ఒక దివ్యనాదం చెవిని పడుతుంది. ఎప్పుడోగాని అది హృదయం వరకు పోదు. హృదయాన్ని తాకినప్పుడు తన్మయత్వం చెంది, నిజమైన ఆనందం పొందుతాం. సౌందర్య రసాస్వాదన వల్ల హృదయం ప్లవిస్తుంది. ప్రజ్ఞ కదలాడుతుంది. ఒక అద్భుతమైన మార్మికత, మహత్తు మనలో చోటుచేసుకున్న ప్పుడు ప్రపంచంలో మరేవీ విలువైనవిగా అనిపించవు.

ఆధ్యాత్మికంగా పైకి ఎదిగినకొద్దీ జీవధాతువు తగ్గిపోతుంది. లేదా అసలు కనిపించకుండా పోవచ్చు. ఆర్జిత తాంత్రిక శక్తి ఆపైన నిష్ప్రయోజనం. శూన్యం ఆవలి తీరాన అంతా నిర్గుణం, నిరామయం. రోదసి అంచుల వరకు వెళ్లినప్పుడు జీవునకు తన కర్తవ్యం తెలుస్తుంది. కాని మనస్సు జీవుని మభ్యపెడుతుంది. హృదయం తిరిగి మార్గానికి మళ్లిస్తుంది. ప్రకృతి మాయలో భగవంతుని చిరునామా లభించదు.

జ్ఞానమార్గంలో అన్వేషిస్తే విశ్వవిజ్ఞానం లభిస్తుంది. కర్మమార్గంలో విశ్వ లయను ప్రతిష్ఠించగలం. హృదయంలో పరమాత్మ ప్రవేశానికి వీలు కల్పించాలి. మనిషి ప్రపంచాన్ని, సృష్టిని జయిస్తే భగవంతుని దర్శించినట్లే. నిర్గుణ పరబ్రహ్మాను మన చైతన్యంతో అందుకుని మనలో ప్రతిష్ఠించుకోగలిగితే మనలో ప్రతి అణువు, మన జీవితంలో ప్రతి అడుగు దివ్యత్వంతో నిండిపోతుంది. ప్రతి హృదయం పరమాత్మకు నివాసయోగ్యంగా మారాలి. నిర్గుణ పరబ్రహ్మం జీవునికి పూర్ణాను కూలం కావాలి. మన సంయమనం సృష్టికి, పరిణామానికి సంపూర్ణంగా సహకరించాలి. మన హృదయం ఆకాశమంత నిర్మలం, సాగరమంత గంభీరం కావాలి.

తన్మయత్వంలో కాలాన్ని దాటినప్పుడు శరీరం ఇచ్చే సుఖమే ఆత్మానందం అనిపిస్తుంది. ప్రపంచసుఖాలు స్వర్గసుఖాలను మరిపింపచేస్తాయి. అప్పుడు జీవితమే స్వర్గం అవుతుంది. అన్ని సుఖాలలో భగవంతుని స్పర్శ తెలుస్తుంది. మనషికి స్వర్గ నరకాల ఆలోచన ఉండదు. అతీంద్రియ సత్యం అవగతమైనపుడు శూన్యం నుండి దివ్యనాదాలు వినిపిస్తాయి. ప్రాపంచిక శబ్దాల మధ్య దివ్యనాదం వినిపించదు. ప్రకృతిని మించింది పరాప్రకృతి. ఆత్మ పైలోకాలకు వెళ్లినప్పుడు దివ్యజీవనం అనుభవిస్తుంది. కాని ఆత్మకు మానవశరీరాన్ని ఆశ్రయించి ఉండడమే ఇష్టం. మనిషిలో ఉండేది సగం దివ్యత్వమే. మిగిలిన సగ భాగం రాక్షసత్వం ఆక్రమిస్తుంది. ఆకాశానికి, భూమికి మధ్య వేలాడుతుంది ఆధ్యాత్మిక జీవనం. ఏవేవో మధుర దివ్య స్వప్నాలు ఆత్మను క్రమ్ముకుని ఉంటాయి.

జీవుడు ఆర్జించుకునే శక్తి లోకంలో అజ్ఞానాన్ని పెంచుతుంది. అసలైన ఆనందం కొరకు జీవుడు ప్రయత్నించడు. ఆత్మవైపు కదలడానికి అహంకారం అడ్డువస్తుంది. జీవుడు ఎంత శక్తి సంపాదించినా, ఎన్ని ఘనకార్యాలు చేసినా వాటి విలువలు నశించిపోతాయి. ప్రపంచాన్ని దాటి పైకి పోయేది లేదు. ఈ విషయం మనిషి హృదయానికి తెలుస్తూనే ఉంటుంది. ఏది ధర్మమో, ఏది అధర్మమో, వాటి ఫలితం ఏమిటో మనిషికి తెలుసు. వాటి ప్రయోజనాలు పరిమితమని తెలుసు. కాని అందులోనే, తన మార్గంలో పూర్ణత్వం సాధించాలని ప్రయత్నిస్తాడు.

ఆలోచనల రెక్కలపై అజ్ఞానం బరువులు మోస్తుంటాడు మనిషి. ఏదో అగోచరశక్తి మనిషి తల ఎత్తకుండా అణచివేస్తుంది. మనిషి చేసే పనులేవీ దివ్యదృష్టికి కనిపించవు. ప్రతిభకు, ప్రాభవానికి ఎప్పుడూ పరిమితులుంటాయి. అవి ప్రపంచ పొలిమేరలు దాటిపోవు. తృప్తి, శాంతి అన్నవి ఎన్నటికీ పూర్తిగా లభించవు. మనిషి ఎన్ని మంచిపనులు చేసినా, ఎన్ని మహత్తులు ప్రదర్శించినా, ఆత్మకు అవసరమైన ప్రజ్ఞ మిగలదు. చివరకు జీవుని ముఖంపై మాసిపోయిన వైభవచిహ్నాలు మిగులుతాయి. జీవుడు పొందే అన్ని ఆనందాల కన్న ఆత్మానందం విలువైంది. కళల ద్వారా పొందగలిగేది ఆత్మానందం కాదు... మానసికానందం. బంగారు ఊయలలు, కఠిన పాషాణ మార్గాలు ఏవీ ఆధ్యాత్మిక దృష్టికి పనికిరావు. మన స్వప్నాలన్నీ చివరకు శూన్యంలో లయిస్తాయి. జీవుడు కాలంతో పయనిస్తాడు. మృత్యువు వల్ల ముక్తి సాధ్యపడదు. అది విరామం మాత్రమే. ఒక భవ్యసంకల్పం మనిషిని నడిపిస్తుంది.

జీవుడు పూర్తిగా విశ్రాంతి తీసుకునేది పరమాత్మలోనే. జీవికి అంతిమలక్ష్యం పరమాత్మను చేరడమే. ఎవరికైనా మృత్యువు ప్రధాన ద్వారమే తప్ప అంతిమ గమ్యం కాదు. మనలో ఏవేవో కదలికలు, ప్రేరణలు ఉంటాయి. ఆత్మలు సైతం నిగూఢంగా సంచరిస్తూ గమనిస్తుంటాయి. ఒక జన్మ నుండి మరో జన్మకు వెళ్లినప్పుడు, ఒక లోకం నుండి మరో లోకానికి మారినప్పుడు శరీరం వదలిన ప్రతిసారి కర్మఫలాలు వెంటతగిలి వస్తుంటాయి. జీవి యాత్రలో విరామం ఉండదు. విశ్రాంతి లభించదు. కాలం ఆగదు. జీవుని ప్రయాణం ఆగదు. కాలంలో ప్రతి కదలిక జీవుని ముందుకు నడిపిస్తుంది. ఈ చైతన్య ప్రవాహం ఏ సాగరంలోనూ కలవదు. జీవుడు తీరంవెంట మజిలీలు చేసుకుంటూ పయనిస్తుంటాడు. జీవుడు ఎంతదూరం పయనించినా, ఎన్ని మజిలీలు చేసినా

కాలచక్రంలో భాగంగా కర్మచక్రం తిరుగుతుంది. చేయవలసిన పని ఎప్పటికప్పుడు ఇంకా మిగిలే ఉంటుంది.

అనిశ్చిత ప్రపంచంలో అన్వేషణ అనంతంగా సాగుతుంది. కాలప్రవాహంలో ఎప్పుడూ కల్లోలాలు ఉంటాయి. వేయి జన్మలెత్తినా జీవుడు అసంపూర్ణంగానే ఉంటాడు. ఒకే జీవి వేల రూపాలు ధరిస్తుంది. జన్మవలయం నుండి బయట పడాలన్న ప్రయత్నం ఎప్పుడోగాని చేయదు. ప్రతి కొత్తపని రేపటికి పాతబడి పోతుంది.

ఎన్ని అలంకరణలు చేసినా కంటికే ఆనందం. పాత కథలకు కొత్త మెరుగులు పెడుతుంటాయి. అలా చేసి మనస్సును మభ్యపెట్టడం జరుగుతుంది. చిత్రం వేరైనా రంగులు పాతవే. నేపథ్యం మారిన కారణంగా కొత్త చిత్రం అనిపిస్తుంది.

★ ★ ★

అదొక విచిత్రలోకం. మాయాలోకం. అందులో అన్నీ విచిత్ర జీవులు, విచిత్ర సంఘటనలు, క్రియలు. అది ఆత్మల సంచారంతో క్రిక్కిరిసి ఉంది. సకల సృష్టికి అది విపణి. మేధస్సుకు, హృదయానికి, సృష్టికి అది కేంద్రం. వర్తులం ఆరంభమైనచోటనే అంతం అయినట్లు ఆత్మలు ఇక్కడ నుండి బయలుదేరి, జన్మలెత్తి, చివరకు ఇక్కడకే వస్తాయి. అగోచరంలో పూర్ణత్వం సాధించాలన్న సంకల్పంతోనే ప్రతి ఆత్మ బయలుదేరుతుంది. ప్రయాణం ముందుకే సాగుతుంది. ఒక్కొక్క జన్మలో కొంత పూర్ణత్వం సాధించాలని సంకల్పం. అన్ని ప్రయత్నాలు నిష్ఫలం అవుతాయి. అన్ని యత్నాలకు తలమానికం వంటిది సత్యం. గమ్యం చేరేవరకు, లక్ష్యం సాధించేవరకు ఏమీ చెప్పలేం. రూపం నశించినా సంకల్పం నిలుస్తుంది. సంకల్పానికి ఎన్నటికీ నశింపు ఉండదు. సంకల్పం ఒక్కటే పూర్ణత్వ సాధనకు ఆధారం.

మనం శాశ్వతమైన విలువలు ఏవీ సాధించలేం. లోకం ఎప్పటికప్పుడు నిత్యనూతనం అనిపిస్తున్నా ఎప్పటికీ అసంపూర్ణంగానే ఉంటుంది. మనంగా ఏవీ పూర్తిగా చేయలేం, సాధించలేం. విశ్వరూప దర్శనం అసంభవం. విశ్వంలో ఒక కొంత మేర చూడగలం. సృష్టి పరిణామాన్ని ఎంత శోధించినా ఏమీ అర్థం కాదు. కార్య కారణ సంబంధం ఉన్నట్లు అనిపిస్తుంది. విరుద్ధ శక్తుల మధ్య పోరాటం, ప్రతికూల శక్తుల మధ్య ఘర్షణ. రెండూ ఒకటి కావడమే పూర్ణత్వం.

జగన్నాటకానికి అదే ముగింపు. గమ్యం లేకుండా జీవుల గ్రహయాత్రలు, రోదసిలో చీకట్లలో విధి రాసిన రాతల్ని చదవడం, ఆత్మలు సైతం లక్ష్యం లేకుండా జన్మకు రావడం ... ఇలా సాగుతోంది సృష్టి.

జీవి యాత్రకు అంతం ఉండదు. అంతం చూడాలని ఆరాటమే జీవన పోరాటం. ఓడిపోతూ పోరాడటం. గత వైభవాల పైన దృష్టి. ఒకప్పుడు పరిపూర్ణంగా ఉండి ఇప్పుడు ఏమీ కనిపించని దివ్యత్వం. ప్రతి గుండె గుబగుబ లాడుతుంది ... కదలాడుతుంది. ప్రపంచానికి అందనంత దూరంలో ఉన్న దివ్యత్వం పరసీమల నుండి ప్రలోభపెడుతుంది... చవులూరిస్తుంది. మన ప్రాపంచిక పరిజ్ఞానం వెనక స్మృతిపథంలో దివ్యత్వం దోబూచులాడుతుంది. ప్రేమ, ఆనందం నింపుకున్న హృదయాలు తృప్తిగా ఉంటాయి. నిండుగా ఉంటాయి.

ఆధ్యాత్మికంగా లోతులకు వెళ్లినకొద్దీ మనల్ని మనం మరచిపోతాం. శూన్యంలో ప్రయాణం భయం వేస్తుంది. ఆత్మకు తన పూర్వవైభవం తెలిసినా, జీవిగా స్వర్గాన్ని కోరి స్వర్గసుఖాలలో మునిగిపోతుంది. పారవశ్యం చెందుతుంది. సచ్చిదానందానికి ఇవతల స్వర్గసుఖాలకు పైగా ఆత్మానందం పొందుతుంది. ఆ ప్రజ్ఞ మనదేనని మనకూ తెలుసు. అది ఆత్మప్రజ్ఞ. అదే ఆత్మానందం. దానికి స్వర్గసుఖాలతో, సచ్చిదానందంతో సంబంధం ఉండదు. ఆధ్యాత్మిక ప్రగతి వల్ల, మార్మిక స్పర్శ వల్ల మనలో ప్రజ్ఞ మేల్కొంటుంది. మనం లోతులలో ఆత్మసాక్షిగా సత్యాన్ని దర్శిస్తాం. ఇది ప్రపంచంలో మనం సత్యం అనుకునేదానికన్న భిన్నమైనది. విశిష్టమైనది. ఆత్మ దానిని అన్వేషించి అందుకోగలదు. అన్వేషణ మనది, అందించేది ఆత్మ. వెరసి అది ఆత్మాన్వేషణ.

మనం దివ్యత్వానికై వెంపర్లాడుతుంటాం. మానవ జన్మకు దివ్యత్వ సాధనే పరమావధి అని మన నమ్మకం. ఈ ప్రపంచంలో పూర్ణమానవుడుగా జీవించడానికి కాక స్వర్గానికి వెళ్లాలని తహతహ. పై లోకాలు గొప్పవని, అవి ప్రశాంత లోకాలని, ఆనంద లోకాలని మన అంచనా. కోల్పోయిన స్వర్గం చేరాలన్న ఆరాటం. మనం సహకరిస్తే జీవుడు ఇక్కడే అన్ని సుఖాలు పొందగలడు... అన్ని ఆనందాలు అనుభవించగలడు. కానీ మనం ఆనందం కోరకుండా సుఖాల్ని కోరి బాధల్ని తెచ్చుకుంటాం. మన శరీరాన్ని కష్టాలకు బలిచేస్తుంటాం. ఒక చీకటి కోణం నుండి వెలుగును చూడ ప్రయత్నిస్తాం. మనం ఉన్నచోటునే వెలుగుమయం

చేసుకోవాలని ప్రయత్నించం. ఎక్కడో ఉన్నది మనకు కావాలి, ఉన్నదానిని అనుభవించడానికి మనసొప్పదు.

ఎప్పటికీ విజయం పొందలేమని తెలిసీ అటుగానే పయనిస్తాం. పోరాటం సాగిస్తాం. ఆరాట పోరాటాలలో ఆనందం లభించదు. శక్తులు సంపాదించి మనస్సును మరింతగా రణక్షేత్రం చేసుకుంటాం. తీరని కోర్కెలు, ఆశలు తర్వాత స్వర్గంలో తీర్చుకోవచ్చునని ఒక ఊరట. స్వర్గం అనేది శూన్యం లేదా మన ఊహ మాత్రమేనని గుర్తించం. ఊహించిన స్వర్గం మనకు చచ్చినా దొరకదు. ఆశ మనిషిని బ్రతికిస్తుంది.

ఒక రోజున పరమాత్మ మన పిలుపు విని మనకు వరాలు ప్రసాదిస్తాడని ఆశ. ఒక శాంతి మంత్రం అనుగ్రహిస్తాడని ఆశ. ఆ పరబ్రహ్మాంశ ఈ లోకంలో మనిషిగా జన్మించినప్పుడు ఈశ్వర రహస్యాలు భృక్తరహితం అవుతాయి. అప్పుడు పరబ్రహ్మ స్వయంగా తనను ఆరాధించేవారిని తన లోకానికి అనుమతిస్తాడు. ఆత్మ స్వతంత్రం కావడానికి సత్య యోగసాధన అవసరం. అదే ఆత్మదర్శన సూత్రం. పవిత్రమైన ప్రేమకు మాత్రమే పరమాత్మను చూపగల శక్తి ఉంది. అజ్ఞానం తొలగిపోయి, మానవ హృదయాలు ఆనందంతో నిండాలి.

మన అన్వేషణకు, ఆరాటానికి స్వస్తి పలకటం మంచిది. చేయవలసింది ఆత్మద్వారా సత్యశోధన. జీవికి కావలసింది చనిపోవడం, మళ్లీ జన్మించడం కాదు. శాశ్వతత్వం. ఒక కోరిక తీరితే మరిన్ని కోరికలు పుట్టుకొస్తాయి. మరోజన్మ కోరిక అలాంటిదే. ఒక ఆశయం సిద్ధిస్తే మరిన్ని ఆశయాలు పుట్టుకొస్తాయి. అందుకే మళ్లీ మళ్లీ జన్మించవలసి రావడం జరుగుతోంది. తనను తాను తెలుసుకునేవరకు ఆత్మ విశ్రమించదు. జనన మరణాలు ఆత్మకు ప్రధానం కాదు. వాటి అవసరం ఆత్మకు లేదు. జనన మరణ వలయం నుండి తప్పుకో గలగాలి. తర్వాత మాత్రం ఆత్మ విశ్రమిస్తుందని చెప్పలేం. కాకుంటే కర్మబంధం లేని కారణజన్మకు రావడం జరుగుతుంది. పరబ్రహ్మాసాక్షిగా సచ్చిదానందం అనుభవిస్తాం. ప్రజ్ఞ పొందిన మనిషిలో అజ్ఞానం మిగలదు. ప్రతి పని, ప్రతి ఆలోచన బ్రహ్మానందం కలిగిస్తుంది. శాంతిని ప్రసాదిస్తుంది. అప్పుడు మనం ఈశ్వర ప్రణిదానంలో జీవిస్తాం.

ప్రతి జన్మ పరమాత్మకు చేర్చే బాటలో ఒక మజిలీ. పైనుండి ప్రసరించే వెలుగుల్ని చీకటి మింగేస్తుంది. ఆత్మలో ప్రకాశించే వెలుగులు చీకటికి తెలియవు.

కనుక ఆత్మ ప్రకాశం అవసరం. అతీంద్రియానందమే ఆత్మకు పూర్ణత్వం ప్రసాదిస్తుంది. అప్పుడు భగవంతుడు మనలోనే ఉంటాడు. పరమాత్మ మన వెంట ఉంటుంది. ఆత్మ తన ప్రత్యేకతను నిలుపుకుంటుంది. ప్రదర్శిస్తుంది. జీవునికి పూర్వస్థితిగతులు తెలుస్తాయి. అంతవరకు విధికి తలవొగ్గవలసిందే. అనేక సంఘటనలు మళ్లీ మళ్ళీ జరుగుతుంటాయి జన్మ మృత్యువులు రెండూ కీలక కేంద్రాలు. ప్రతి పుట చివర ఒక ప్రశ్నార్థకం కనిపిస్తుంది. ప్రతి జీవి చరిత్ర ఒక ఉద్గ్రంథమే. 'అవును' అనుకుంటూ యోజనాల దూరం పయనిస్తాం. అయినా పయనం ఆగదు. కాలచక్రం కదులుతూ ఉంటుంది. జననం వల్ల ప్రయోజనం ఉండదు. మృత్యువు వల్ల విముక్తి కలగదు. జీవుడు బ్రతుకులో బందీ అయినంతకాలం అమరత్వం సాధ్యం కాదు. ఆత్మ లయించదు. దేవతల అత్యాశ వల్ల మన ప్రపంచం ఏర్పడ్డది. పరమాత్మ దేవతలను మనల్నీ గమనిస్తూ ఉంటుంది.

41. యమలోకం

శూన్యంలో ఎంత దూరం పయనించినా అంతా చీకటే. ఆ చీకటే నరకం. అక్కడ అన్నీ వక్రీకరణలు. అన్నింటికి వక్రభాష్యాలు. మనకు తెలిసిన, మనం ఆరాధించే ప్రేమ, అనురాగం, దివ్యత్వం, వెలుగు అక్కడ వక్రమై, వికృతరూపం దాల్చుతాయి. అక్కడ రూపాలు విషం కక్కుతుంటాయి. అనురాగం, ప్రేమ విషపూరితాలు. చీకటి అవతల ఉంది తమస్సు. అక్కడ గాలి విషం, ప్రాణమూ విషమే. అక్కడకు చేరే వారంతా పాపులు. అందరూ శాపగ్రస్తులే. వారికి గతం గుర్తుండదు. పూర్వవైభవం తెలియదు. స్వయంకృతాపరాధం వల్లనే నరకం చేరామన్న స్పృహ ఉండదు. అదే లోకం వారికి. అవతల స్వర్గం ఉందని, ఆ పైన సత్యలోకాలు ఉన్నాయని గ్రహించరు.

ఇంకా ముందుకు పోతే పాపులు సైతం ప్రవేశించలేని శూన్యం కనిపిస్తుంది. అక్కడ ఇల్లు, వాకిలి ఉండవు. అన్నీ ఉన్నట్లు భ్రమ కలుగుతుంది. చీకటినీడలు కదులుతుంటాయి. ఏవీ కనిపించవు. అది మాయలోకం. అక్కడ కాలు నిలవదు. ఏదో శక్తి జీవుల్ని శూన్యంలోకి లాగివేస్తుంది. శూన్యంలో లయం చేసుకుంటుంది. అక్కడ దయ్యాలు, పిశాచాలు వేదాలు వల్లిస్తుంటాయి. నీతిసూత్రాలు పఠిస్తాయి. అక్కడ జీవులు దేవతల వేషాలు ధరించగలరు. కొత్తగా వచ్చే వారికి తామే దేవతలమన్న భ్రమ కల్పించి, తమ వలలో వేసుకుంటారు. వారికి దుష్టశక్తులు, క్షుద్రశక్తులు చాలా ఉంటాయి. వాటివల్ల మరింత పతనం చెందుతారు.

అహంకారం, అజ్ఞానం కారణంగా జీవుడు ఈ నరకంలో ప్రవేశిస్తాడు. మతం మనిషిని మూఢుని చేస్తుంది. తపస్సు వల్ల ఎవరైనా నరకానికి వెళ్లే ప్రమాదం నుండి తప్పించుకోవచ్చు. అక్కడ అశ్వపతి తన అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఏర్పడ్డది. కాని తిమిరంతో సమరం సాగించి, దానికి చిక్కకుండా దాటిపోగలిగాడు. అతని ఆత్మ కొత్తశక్తిని కూడగట్టుకున్నది. ఆత్మశక్తితో నరకాన్నిదాటి పోగలిగాడు.

ప్రాపంచిక విషయాలనుండి నిష్క్రమించిన మనస్సు నిశ్చలమై, నిర్మలమై సత్యాన్వేషణ ప్రారంభిస్తుంది. అజ్ఞానం నుండి, కన్నీటి నుండి, కష్టాల నుండి దూరంగా జరిగిన హృదయం జీవితంలో అపజయానికి కారణాలు గ్రహిస్తుంది. దృశ్య ప్రపంచానికి దూరంగా, శూన్యంలోకి దృష్టి సారించినపుడు అగోచర, అతీంద్రియ నిర్గుణం అనుభూతికి అందుతుంది. శూన్యంలో నిద్రిస్తున్న అగోచర స్థితి సృష్టిని తనలో దాచుకోగలదు. అది ప్రాణకోశం, జీవమయం. అందులోని చిరుజల్లులు మన జీవితాలు. మహాప్రాణ స్పందన వల్లనే సృష్టి, లోకాలు ఏర్పడ్డాయి. పదార్థం, మనస్సు అన్నవి తర్వాతి పరిణామాలు. ఆ శూన్యం కన్న కలలే మన చైతన్య భవాలు.

ప్రకృతి రహస్యాలను దాచిన తెర తొలగినప్పుడు విశ్వయాతన స్పష్టంగా తెలుస్తుంది. ఆ స్థితిలో అశ్వపతిని అజ్ఞానం కబళించ యత్నించింది. మహాపాపం తలెత్తి భీకరంగా చూచింది. లోకం అంతా చీకటిలో లయించిపోతున్నప్పుడు అంచున నిలబడి అటు శూన్యాన్ని, ఇటు సృష్టిని గమనించవచ్చు. అజ్ఞానం నుండి తమస్సు ఏర్పడింది. శూన్యం కళ్లు విప్పి ఆశ్చర్యంగా తాను కన్న రూపాలను గమనించింది. శూన్యం నుండి ఉద్భవించిన సృష్టికి జీవం తోడుగా నిలిచింది. అవి సృష్టి ఆరంభాలు. ఆ వెనక నిశి ముసుగులో చీకటి జొరబడింది. చీకటి సృష్టిని పాక్షికంగా లోబరచుకుంటుంది. చీకటికి తన శక్తి తెలుసు. లోకానికి తన అవసరం ఉంటుంది. చీకటిలోనే శక్తులు విజృంభించడం గమనించదగిన విషయం.

అసలు సృష్టి చీకటిలోనే జరిగింది. చీకటి నుండే సృష్టి ఏర్పడింది. కనుక సృష్టించబడినవన్నీ చీకటిలో లయిస్తాయి. కడకు చీకటినే ఆశ్రయిస్తాయి. జీవబీజంలోని శూన్యగర్భంలో చీకటి దాగి ఉంటుంది. చీకటి మాటున మృత్యువు పొంచిచూస్తుంది. కనుక జనన మరణాలు జీవునిలో కలిసే కదులుతుంటాయి. లోకాన్ని మృత్యువు నాశనం చేస్తున్నదని భయపడతాం. కాని అది ప్రకృతి సహజం. అది మృత్యువు కర్తవ్యం. చీకటి అగాధాల నిశ్శబ్దం నుండి, మహామాయ తెరచాటు

నుండి, శూన్యహృదయం నుండి, రూపరాహిత్యం నుండి, అభావం నుండి భావం ఏర్పడుతుంది. ఆ భావం జీవులపై మరణముద్ర వేస్తుంది. ఆ ముద్ర ఆత్మను తట్టి అమరత్వానికి ప్రోత్సహిస్తుంది. జీవితంపై మృత్యువు నీడ పడినప్పుడు మన పాపాలు, విషాదాలు, బాధలు ప్రక్కన పెట్టి ఆత్మను ఆశ్రయిస్తాం. ఆత్మ సత్యాన్ని, తేజస్సును, ఆనందాన్ని అందిస్తుంది.

జీవుడు స్వరూపాన్ని కోల్పోవడం ఒక మలుపు. రూపరాహిత్యం కావడం గొప్ప తపస్సు. ప్రకృతి సహజంగానే ప్రతిజీవిని క్షీణింపచేస్తుంది. మనస్సు అందుకు ప్రతికూలంగా ఆలోచిస్తుంది, ప్రయత్నిస్తుంది. జీవితంలోని అన్ని మలుపులలో అమృతత్వం లభిస్తుంది. కాని మనస్సు ఆ మలుపుల్ని గుర్తించదు. సత్యాన్ని అవహేళన చేస్తుంది. ముఖం చాటుచేస్తుంది. ఆత్మ అందించే సందేశాలను హృదయం ద్వారాకాక మనస్సు ద్వారా వినడానికి ప్రయత్నించి మనం అసలైన జ్ఞానాన్ని దూరం చేసుకుంటాం. పైగా ఏవో క్షుద్రశక్తులను ఆరాధించి ఆహ్వాని స్తుంటాం. జీవనయాత్రలో మజిలీలను చెరిపివేసుకుంటాం. కాలం చెక్కిన శాసనాలను చెరిపివేస్తాం. విశ్వధర్మం ఆధారంగా నకిలీ రూపాలను తయారు చేసుకుని, వాటికి దివ్యత్వం ఆపాదించి మనమే ప్రాణప్రతిష్ట చేసి మురిసి పోతుంటాం.

మృత్యువునీడ మనపైన పడకుండా చేసుకోలేం. ప్రేమ, వెలుగు మృత్యువు నీడలో తమ స్వభావాల్ని కోల్పోతాయి. ప్రేమానురాగాలు, ఆరాధనలు ప్రలోభాలకు లోనై ప్రమాదాలుగా మారుతుంటాయి. అమృతం విషతమమవుతుంది. స్వర్గం నరకతుల్య మవుతుంది. దుష్టశక్తులు, క్షుద్రశక్తులు దైవశక్తుల్ని మనకు అందకుండా చేస్తాయి.

మన జీవితాలపైన విషాదమేఘాలు క్రమ్మినప్పుడు మనస్సు అనృతాలనే ఇష్టపడుతుంది. నిత్యనైమిత్తిక కార్యాలలో దోషాలు దొర్లుతుంటాయి. అంతా నిరాశ. ఎంత పోరాడినా అపజయాలు ఎదురవుతుంటాయి. వైఫల్యాలకు అసలు కారణం అర్థం కాదు. ఏ ఆశ కనిపించదు. వెలుగు కనిపించదు. హృదయక్షేత్రంలో నాటుకున్న అజ్ఞానబీజం మొలకెత్తుతుంది. అది పెరిగి మానై విషఫలాలనే పండిస్తుంది. ఆ విషఫలాలనే మనిషి మృత్యువుకు నివేదన చేస్తాడు. శూన్యశిఖరాల నుండి చీకటిముసుగు వేసుకుని అజ్ఞానం దిగివస్తుంది. ఆ ముసుగు మృత్యు సేవకులు, యమదూతలు. వారు అప్పుడప్పుడు మరణసందేశాలను అందించి పోతుంటారు. వారే మన పాపాలకు, దుష్టవర్తనకు కారకులు. ఆ చీకటి స్వరాలను

మనం వినిపించుకోము. మృత్యువు చేతులుచాపినా మనం గమనించం. ఏ రూపం కనిపించదు. కానీ మృత్యువు రాకుండా ఆగదు. వక్ర లిపిలో విధిరాత ఉంటుంది. దానికి మనం వక్రభాష్యం చెప్పుకుంటాం. అదే విధి శాసనం, విధి శాపం అయి కూర్చుంటుంది.

విధి కారుణ్యదృష్టితో జీవుని పరామర్శిస్తుంది. అప్పుడు మనం సరిగా అర్థం చేసుకోము. విధి చూపులో అందం, ఆర్ద్రత ఉంటాయి. అహంకారంతో వాటిని గుర్తించం. రవంత సంతోషం కలిగినప్పుడు విధి అనుగ్రహాన్ని గుర్తించం. సత్యానికి, ప్రేమకు హృదయం పరవశిస్తుంది. అన్ని ఆనందాల మధ్య, సుఖాల మధ్య కాస్త గుండెకోత ఉంటుంది. కొన్ని ఇరుకుబాటలలో భయం తొంగిచూస్తుంది. కనిపించని మానవ కృత్యాలపై విధి పడగనీడలు పడతాయి. విషాదాలకు, పాపాలకు మృత్యువే చరమాంకం.

నరకలోకంలో వెలుగు ఉండదు, ఆనందం కనిపించదు. ఎవరు ఎంత కాలం అక్కడ ఉన్నా అపశృతులే, అవకృతులే. ఆత్మ సైతం భయంకర యాతనలకు తలొగ్గుతుంది. అక్కడ సాధించే ప్రగతి మృత్యువు వైపు దారి చూపుతుంది. కాస్తంత వెలుగు జీర కనిపించినా, దానిలోనూ మృత్యుభయం ఉంటుంది. శవాలు లేచి సంచరిస్తున్నట్లు తోస్తుంది. రూపాలు వికృతాలైనా సర్వస్వతంత్రంగా వ్యవహరిస్తాయి. వికృత సౌందర్యం చూచి అవి తృప్తిచెందుతాయి. పాపకృత్యాలతో పరవశిస్తాయి. క్షుద్రశక్తులు వాటి ద్వారా ప్రకోపిస్తాయి. కుట్రలను, కుతంత్రాలను విందారగిస్తాయి. గాలులు సైతం చీకటిని నింపుకుంటాయి. మనిషికి అక్కడ మనుగడ ఉండదు.

ఎవరి కళ్లలో చూచినా భయం, కల్మషం, కాఠిన్యమే. అక్కడి జీవుల వ్యామోహంలో పాపాలు తిష్టవేస్తాయి. అప్పుడు ఆత్మకు నిజస్వరూపం తెలుస్తుంది. ప్రకృతి తనలో మంచిచెడులను దాచుకుంటుంది. మంచిలో కన్న చెడులోనే సాంత్వన లభిస్తుంది. మనిషిలో అహంకారం పెరిగితే నరకానికి బాట ఏర్పడుతుంది. పాప కార్యాల వల్ల, పుణ్య కార్యాల వల్ల అహంకారం పెరుగుతుంది. రెండూ నరకం వైపు మార్గం చూపిస్తాయి.

అక్కడ ఒక్కొక్క బాటలో జీవులు కుప్పతెప్పలుగా పడివుంటారు. సామాన్యమైన జీవనం వారికి ఉండదు. అన్నీ చీకట్లోకి జారిపోవడానికి తొందరపడుతుంటాయి. వాటికి వెలుగుకన్నా చీకటంటేనే ఇష్టం. జీవితంలోని ఔన్నత్యాలన్నీ అనుమానా స్పదమే. అన్ని సౌందర్యాలు కడకు క్షీణించిపోయేవే. మన శక్తియుక్తులు ఏవీ

భగవంతుని ముందు పనికిరావు. మన విశ్వాసాలు, మన నమ్మకాలు, మన కల్పనలు, మన అన్వేషణ నిరుపయోగాలు. మనం ఆర్జించుకున్న జ్ఞానమూ పనికిరాదు.

చీకటిని చీల్చుకుని వచ్చిన ఒక ఆకారాన్ని అశ్వపతి గమనించాడు. అది బాహ్యదృష్టికి, మనస్సుకు అందేది కాదు. అది మనిషి బాధలు, విషాదాలు రూపుకట్టిన రూపం. దాని ఊపిరులు మనిషికి అగ్నిజ్వాలలు. ఆ విచిత్ర వికృతాకారం నుండి అన్ని అకృత్యాలు బయట పడతాయి. వాతావరణంలో ఒక విషవలయం ఏర్పడినప్పుడు ప్రపంచం యావత్తు భయంకర శక్తులు వ్యాపిస్తాయి. మనం ఎటు తిరిగినా, ఎవరి సాయం అర్థించినా వ్యతిరిక్తత కనిపిస్తుంది. ఆ శక్తులు మనల్ని నిర్వీర్యం చేస్తాయి, అతలాకుతలం చేస్తాయి. నల్లని, నగ్న రూపాలు మనల్ని చుట్టివేస్తాయి. అదృశ్యంగా అవి మనపై స్వారీ చేస్తుంటాయి. మన కలల్ని భగ్నం చేస్తాయి. అడుగడుగునా దుష్టశక్తులు తారసపడతాయి. వాటి చూపులు అరిష్టాలు కలిగిస్తుంటాయి. జీవితంలో ప్రతి మలుపు భయపెడుతుంది. ఏ క్షణంలోనైనా మృత్యువు కబళించడానికి సిద్ధంగా ఉంటుంది. మనిషి ఆత్మశక్తితో పోరాటం సాగించాలి. ఆ భయంకర చర్యల్ని నిరోధించే శక్తి మనిషికి ఉంది. మాయను ఛేదించగలది సత్యం ఒక్కటే.

అక్కడ ఎవరికీ తామెందుకు పతనం చెందింది తెలియదు. తమ పతనానికి కారకులెవరో తెలియదు. అప్పటికి కొంత స్మృతి మిగిలి ఉంటుంది కనుక కాస్త కాస్త తెలుస్తుంది. ఎటు ఎంతదూరం వెళ్లినా తిరిగి బయలుదేరినచోటకే వచ్చి చేరడం జరుగుతుంది. అక్కడ మార్గాలు అనిర్మితాలు. ఎవరూ వేసినవి కావు. ఎవరికి ఏవీ స్వంతం కావు. అందులో ఎవరైనా ప్రవేశించవచ్చు. అక్కడ ఎవరూ శాశ్వతంగా ఉండిపోరు.

ఆ పాపకూపం ఒకరి సొంతం కాదు. ఒక్క ఆవాసం కనిపించదు కాని నివసించే వారు అసంఖ్యాకం. అది భూమికి నరకానికి మధ్యనున్న ఒక మాయలోకం. అక్కడ అవాస్తవానిదే రాజ్యం. ఏదీ స్పష్టంగా కనిపించని చిత్రమైన చీకటి. ఇదీ అని చెప్పడానికి అక్కడ ఏమీ ఉండదు. కేవలం శూన్యం. సమస్తాన్ని మింగిన శూన్యం. మచ్చుకైనా ఒక వస్తువు ఉండదు. అది కనీసం హృదయానికైనా అనిపించదు. మాయ, మోసం, కపటం, కుచ్చితం అక్కడి సహజగుణాలు. ఆ మోసంలో, మాయలో అక్కడ జీవులు బ్రతుకుతుంటాయి. అంతా అస్థిరం. అందరి రూపాలు భ్రమలనిపిస్తాయి. అవి శూన్యశరీరాలు. శూన్యంలో తయారైనవి. శూన్యం నుండి పుట్టుకొచ్చినవి. అవి తమవి కాని రూపాలు ధరిస్తాయి. ఆకారం

పొందుతాయి. క్షణంలో కరిగిపోయే రంగుల్ని పులుముకుంటాయి. అవాస్తవాలకు అవి అద్దం పడతాయి. ఇంద్రధనుస్సులోని రంగులు సైతం అక్కడ మాడి నల్లబడతాయి. అవాస్తవ సౌందర్యం వారిది. ఏదీ నిలబడుతుందన్న నమ్మకం లేదు. కన్నీటిపై ఆనందం, పాపంపైన పుణ్యం కనిపిస్తాయి. ద్వేషం ప్రేమను, ఆనందాన్ని మ్రింగివేస్తుంది. అనృతం సత్యాన్ని స్వాహాచేయగా మృత్యువు ఆనందిస్తుంది. లోకంలో అన్ని కృత్యాలకు మూలమైన శక్తులు, యుక్తులు, ప్రపంచంలోని విరుద్ధశక్తులు అక్కడ స్నేహం చేస్తాయి. కలిసిమెలిసి ఉంటాయి. అవి అన్నీ కలిసి పరమాత్మను కనిపించకుండా దాచిపెడతాయి. వాటి ప్రభావం సర్వత్ర వ్యాపిస్తుంది. వాటి ముద్రలు ప్రతిగుండెపైన మిగిలిపోతాయి. అంతా వికటహాసం. వికటలాస్యం. అన్నీ కలిసి మృత్యుమార్గం సుగమం చేస్తాయి. ఎవరూ మృత్యువు రాకను నిరోధించరు. మృత్యువు వచ్చి పైన పడేవరకు ఎవరికీ తెలియదు.

ఆత్మజ్ఞానం పొందినవారు ముందుగా మృత్యువును గుర్తించగలరు. రానున్న దివ్యజీవనం వారికి తెలుస్తుంది. ఆ మహత్తర క్షణం కోసం నిరీక్షిస్తారు. మృత్యువు ఎదురుగా వచ్చి నిలబడినా భయపడరు. అదే దివ్యంగా కనిపిస్తుంది. మృత్యువు వారిని దివ్యలోకాలకు చేర్చే ఆప్తుడు. సద్ధర్మంతో, సత్క్రియతో ఆ లోకాన్ని వారు దాటిపోతారు. స్వీయ ప్రజ్ఞతో ఆత్మను ఉద్ధరించుకుంటారు. సత్యపథంలో పయనించి జన్మవిముక్తులు కాగలరు. తమ శక్తిని, ప్రజ్ఞను మహత్కార్యాలకే వినియోగిస్తారు. హృదయం నుండి వచ్చే సందేశాలను అందుకుని చక్కగా అనుసరిస్తారు. అవి వారికి ఆత్మప్రబోధాలు. మనస్సు స్వతస్సిద్ధంగా బందీ అవుతుంది. తర్కం అక్కడ పనిచేయదు.

అశ్వపతి అక్కడి పరిసరాలను ఆత్మశక్తితో దివ్యంగా మార్చగలిగాడు. అక్కడ పరిసరాలన్నీ పాపంతో మేటవేసి ఉన్నాయి. అక్కడ సత్యవచనం మహాపాపం అవుతుంది. అక్కడ చిరునవ్వు చిందించినా ప్రమాదం ముంచుకొస్తుంది. అంతా భద్రంగానే కనిపిస్తుంది. కానీ అసత్యం సత్యం ముసుగు వేసుకుంటుంది. మిత్రులు సైతం శత్రువులుగా, గూఢచారులుగా మారతారు. కత్తి పట్టిన ప్రతిచేయి వేటు వేయకుండా ఉండదు. అక్కడికి చేరడం అంటే మృత్యు కౌగిలిలోకి చేరడమే.

అక్కడ అశ్వపతికి ఒక ప్రమాదం ఎదురై మృదువుగా హెచ్చరించింది. అతని గుండెపై ఒత్తిడి పెరిగింది. మనస్సులో భయం నీడ కదిలింది. గుండెలోంచి ఒక ఆర్తనాదం ... మూలుగు. అర్థించినా అక్కడ రక్షించేవారు లేరు. ఎవరికి వారు తమకు పట్టనట్లు మృత్యుముఖంలోకి పరుగులు తీస్తున్నారు. ఎంత జాగ్రత్త వహించినా నిరుపయోగమే. అక్కడకు చేరిన తర్వాత మృత్యుగహ్వరంలో

చొరబడవలసిందే. కొంతకాలం నిరీక్షించిన తర్వాత గాని బయటపడడం జరగదు. ఏ తృప్తి లేకపోగా అసంతృప్తి మిగులుతుంది. ఆ తర్వాత విధి జీవుని నడిపిస్తుంది. అక్కడ ఒక్క రక్షిత ప్రదేశం కనిపించదు. ఎవరూ నిద్రించరు. విశ్రాంతి కోరరు. అది ఒక భయంకర సంగ్రామసీమ. అంతా మాయ. ఎవరి బ్రతుకు వారిదే. ఒకరి కోసం ఒకరు చూడరు, పట్టించుకోరు.అందరు అందరితో కలహిస్తుంటారు, ద్వేషిస్తుంటారు.

మంచితనం మనస్సులో కాస్త మిగిలిపోతుంది. సత్యం పారిపోతుంది కనుక మనస్సుకు సమాధానం లభించదు. వెలుగును సైతం చీకటి తన గుండెలో దాచుకుంటుంది. అహంకారం వల్ల జ్ఞానం పతనం చెందుతుంది. పరమ పవిత్రమైన విషయాలు సైతం విషభోజ్యాలనిపిస్తాయి.

అశ్వపతి ఇంకా పైకి వెళ్లాడు. రంగం మారినా జీవన విధానంలో మార్పు కనిపించలేదు. అది రాజధాని, రాజ్యంలేని రాజధాని. దానికి ప్రభువు లేడు. ఉన్నవారంతా జీవులే, క్షుద్రజీవులు. అది అతిప్రాచీనమైన అజ్ఞాన నగరం. ఏమాత్రం వెలుగుసోకని చీకటి రాజ్యం అది. అక్కడ ప్రతివారు చీకటిలోనే సంచరిస్తారు. ఏదో ఒక దుష్టమార్గం ఎన్నుకోవాలని తలపడుతుంటారు. ఎవరికి వారు ఇంకా పాపపంకిలంలో దిగాలనే ప్రయత్నం. కల్మషంతో పాపాల్ని కడిగివేసుకో చూస్తారు, లేదా సమష్టిగా మహాపాపాల్ని పండించుకుంటారు.

అక్కడ 'అహం' ఆధిక్యత వహించి, సింహాసనంపై తిష్టవేస్తుంది. 'అసత్యం' దాని ప్రక్కన ఠీవిగా రాణివాసం చేస్తుంది. ఈ లోకం అంతా వారిద్దరిదే. కఠోరశాసనంతో అసత్యం సత్యంగా ఆమోదించబడుతుంది. సర్వత్రా జరిగేవి అకృత్యాలే కనుక వాటికే విలువ. అక్కడ అందరూ చెప్పేవి అసత్య కథనాలే కనుక ఒక దానితో ఒకటి పొత్తు కలవవు. అసత్యం సైతం అధికారం చలాయిస్తూ కఠినంగా అక్కడ విషయాలు బయటకు పొక్కకుండా కట్టడిచేస్తుంది. అన్యాయం అనిపించినా దేని ప్రత్యేకత దానిది.

'ఇచ్ఛ' అన్నది కొందరిలో కనిపిస్తుంది. వారంతా ఉన్నత వర్గీయులు. మౌలికంగా వారికీ ఒక ధర్మం, న్యాయం ఉన్నట్లే అనిపిస్తుంది. అయితే ధర్మస్థాపన ప్రయత్నం చేయరు. ఎవరైనా స్వతంత్రిస్తే అణచివేయడం జరుగుతుంది. ఎవరిలో కరుణ, దయ, సహనం మచ్చుకైనా కనిపించవు. ప్రతివర్గం తమదే న్యాయం అంటుంది.

మన సనాతన ధర్మంతో నైతికత ముడిపడివుంది. మనం అత్యంత భక్తి

శ్రద్ధలతో అభిమానించే ధర్మం స్వర్గలోకపు ధర్మాలకు అనుబంధం. ఒకనాటి కఠోర నియమాలు, నిష్ఠలు, ఆచారాలు తర్వాత శాసనాలై అనుల్లంఘ నీయాలవుతాయి. ఒకనాటి అనాగరక స్వభావాలు క్రమేపీ నాగరికతా చిహ్నాలవు తుంటాయి. అవి ప్రాచీన సంస్కృతి చిహ్నాలుగా అభిమానించబడతాయి. ఎక్కడైనా నైతిక విలువలు కఠినంగా పాటించవలసిందే. నీతి చాటున అభ్యంతర కార్యాలు నిరభ్యంతరంగా సాగించవచ్చు. ఆత్మశక్తి ఒక్కటే అసలైన సత్యం, స్వధర్మం.

ప్రకృతిలో జీవి మనుగడకు 'ఆకలి' ప్రధానం. ఆకలిగొన్న జంతువు మరో జంతువును వేటాడుతుంది. తన ప్రాణం నిలవడం కోసం మరొక ప్రాణిని చంపుతుంది. ఆత్మలేని జీవులు తమకోసమే జీవిస్తాయి. మనిషి పరమాత్మకోసం మనుగడ సాగించాలి. మనిషి ప్రతికూల శక్తుల మధ్య జీవిస్తూ తన అస్తిత్వం కోసం ఇతరుల బలహీనతలపై దెబ్బతీస్తాడు. సాటివారి పాపకృత్యాలు సహించలేక సత్యాగ్రహం చేస్తాడు. ఇతరులకు అపకారం చేస్తున్నానని అనుకోడు. ఇతరులపై రాళ్లు రువ్వడం తేలిక. తానొక ధర్మదేవత ననుకుని తీర్పు యిస్తాడు. తనదే న్యాయం అనుకుంటాడు. న్యాయంగా ఉన్నచోట్ల తీర్పు అన్యాయంగా ఉంటుంది. అకృత్యాలను, అహంకార చర్యలను మనిషి బలపరచడం వల్ల స్వార్థం, లోభం, ప్రలోభం ఎక్కువవుతున్నాయి. ధర్మచ్యుతి పెద్దమనుషుల వల్లనే జరుగుతుంది. ధర్మరక్షణ కొద్దిమంది వల్ల మాత్రమే జరుగుతుంది.

మతాన్ని మూఢంగా విశ్వసించేవారు సంప్రదాయాలు, ఆచారాలు సృష్టించిపెడతారు. తమ సిద్ధాంతాలు అందరూ ఆమోదించాలని, అందరూ తమ చెప్పుచేతల్లో మెలగాలని మతాధిపతుల అత్యాశ. తమను కాదన్న వారిని చిత్రహింసలకు గురిచేస్తారు. పాపాలు, కర్మలు, నరకాలు అని భయపెట్టి లోబరచుకుంటారు. మతాన్ని రక్షించుకునేందుకు మార్గాలు సవాలక్ష. ఈ మతచాందసులే నిజమైన వంచకులు, హంతకులు. మత దురభిమానం వల్లనే మనుషుల మధ్య, జాతుల మధ్య వైషమ్యాలు, పోరాటాలు. ప్రతి మతం రక్తపాతం వెనక ఉంది. రక్తంతో పునీతమవుతోంది. కాలం అందరి నియంతృత్వాలను హరించివేస్తుంది. కాలానికి కనికరం ఉండదు. కుత్సితాలు, కుతంత్రాలు తాత్కాలికంగా విజయం పొంది ఆధిక్యత సాధించినా కాలంలో నిలవలేవు. లోకంలో విశేష ప్రచారం పొందినవే వాస్తవాలుగా, సత్యాలుగా నిలబడుతుంటాయి. అసలైనదాన్ని, దివ్యమైనదాన్ని, సత్యమైనదాన్ని అవహేళన చేస్తారు. వితండ వాదంతో మభ్యపెడతారు. సామాన్యులు ఆమోదించరు, ఆచరించలేరు. మాన్యులు

తమకు నచ్చినట్లు మార్చివేస్తారు. అంచేత అసలు సిసలైన యోగసాధన, ఆధ్యాత్మిక జీవనం దూరమవుతుంది. స్వాప్నికుడు తన కలలే వాస్తవాలనుకున్నట్లు ఈ మతాభిమానులు తమ నమ్మకాలే ప్రామాణికాలంటారు. ప్రతీ మతచర్య ఉన్మాద చర్యే. ప్రతి మతబోధ ఒక అసత్య ప్రేలాపనే అవుతుంది. అనురక్తి మనస్సులో దాగివుంటుంది. అజ్ఞానం ముసుగులో సత్యం అసత్యంగా, అసత్యం అయోగ్యంగా కనిపిస్తుంది. అప్పుడు యోగసాధకుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. ఊర్ధ్వ గమనంలో అవే పెద్ద ఆటంకాలు. సత్యయోగమార్గం అనుసరిస్తే నరకాలు దాటిపోవచ్చు. స్వర్గాన్ని కోరినంత మాత్రాన చేతికందదు. నరకం నుండి తప్పించు కోవాలంటే సత్యాన్ని ఆశ్రయించక తప్పదు. హృదయాన్ని పరబ్రహ్మ భావంతో నింపుకోవాలి. సూక్ష్మబుద్ధితో, సదసద్వివేచన చేయకపోతే మాయవలలో చిక్కి నరకంలోకి జారిపడడం జరుగుతుంది.

మన వెనకాలే శత్రువు ఉన్నంత జాగ్రత్తగా ముందుకు నడవాలి. కాకుంటే వెన్నుపోటు తప్పదు. అప్పుడు అకస్మాత్తుగా నరకంలో పడిపోతాం. పాపం ఎప్పుడూ వెనుక నుండే దెబ్బతీస్తుంది. వివేకంతో ఆధ్యాత్మికంగా సాగిపోతున్న వ్యక్తిని కాలం, విధి, దురదృష్టం నిర్బంధించవు, కట్టివేయవు. అలాంటి వారి గురించి దేవతలకు సమాచారం అందక, వాళ్ల పేర్లను పట్టిక నుండి తొలగించి వేస్తారు. అది దేవతల తొలి ఓటమి. మనిషి దైవశక్తులకు అతీతంగా ఎదగడానికి అదే మార్గం. అలాంటివారి 'ఆత్మ' నక్షత్రం వలె ఒంటరి దవుతుంది.

పరమాత్మను హృదయంలో నిలుపుకున్నవారికి ఏ ప్రమాదం కలగదు. వారు ఆత్మస్థైర్యమే కవచంగా, విశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగిపోతారు. అలాంటి వారిపై కన్నెర్ర చేసేవారు, వారికి అపకారం చేయతలపెట్టినవారు తామే భంగపడతారు. అవమానం పాలవుతారు. వారి కాంతి కిరణాల ధాటికి తట్టుకోలేరు. అలా ప్రమాదాలను, ఆటంకాలను దాటి, నిర్మల ప్రశాంత వాతావరణం సృష్టించుకుని సర్వస్వతంత్రులు కాగలరు. స్వేచ్ఛగా జీవించగలరు. ఆత్మతేజస్సు వారి మార్గంలోని చీకట్లను తొలగిస్తుంది. వారు సునాయాసంగా పరిధుల్ని దాటిపోతారు. పరలోకాల పిలుపు వినిపిస్తుంది. ఆపైన ప్రతిఘటన ఉండదు. సంశయం ఉండదు. ఎవరూ వారి దారికి అడ్డురారు. ఆ స్థితికి చేరడం కష్టం. క్రిందికి దిగిరావడం సులభం.

అశ్వపతి కోరి చీకట్లోకి పయనించాడు. అది నిశి కన్న భయంకరం. గాఢాంధకారం. నరకం కన్న అసహ్యంగా ఉంది. అది మహాపాపాలకు, పాప

కృత్యాలకు పరాకాష్ట అనిపించింది. పుణ్యాత్ములు సైతం అక్కడ నిలవలేరు. అక్కడ సత్యం, పుణ్యం, పరమాత్మ వేటి ప్రస్తావన లేదు. ఎంతటి దివ్యశక్తులైనా అక్కడ నిర్వీర్యం, నిరుపయోగం అవుతాయి. అది ఏ జీవి చొరరాని భయంకర తమస్సు.

ఒక్క క్షణం మనం అచలస్థితిలో, సమాధ్యవస్థలో మనోభూమిక దాటి, మహానిశ్శబ్ద శూన్యంలో ప్రవేశిస్తే మన ప్రపంచాన్ని, భౌతికతను దాటిపోయినట్లే అవుతుంది. భౌతిక, మానసిక సరిహద్దుల్ని దాటినట్లే. ఆ తర్వాత అనుభూతితో తప్ప కంటితో గమనించేది ఉండదు.

అశ్వపతి అటువంటి శూన్యస్థితికి చేరాడు. అక్కడ ఆత్మ రహితంగా, సర్వం పోగొట్టుకున్న వానివలె శూన్యహృదయంతో, శూన్యమనస్సుతో, శూన్యంలో సంచరించసాగాడు. చీకటిగోడల మధ్య అంధకారంలో సంచారం. చుట్టూ చీకటి రూపాలు, చీకటి రాగాలు. రాక్షసశక్తులు నిర్మించిన పాపసౌధాలు అవి. అవి అమానుష నివాసాలు. భూత ప్రేత మందిరాలు.

ఆ నరకంలో పాపమే మహాసుఖం అనిపిస్తుంది. పతనంలో పరమానందం కలుగుతుంది. చీకటి నగరాలలో స్వాప్నిక జీవనం. దానంత నికృష్టం, హేయం మరొకటి ఉండదనిపిస్తుంది. అంధకార లోకంలో అన్నీ అక్రమాలే.

శాపగ్రస్థమైన దేవత తన దివ్యత్వాన్ని కోల్పోయి, నిరాశతో క్రుంగిపోతుంది. నిరాశ్రయ మవుతుంది. ఒక మహారాణి కులటగా మారితే, తన అందచందాలను నిస్సిగ్గుగా ప్రదర్శించి రసికుల్ని అలరిస్తుంది. తాను పతనమవుతూ ఇతరుల్ని పతనంలోకి లాగుతుంది. ఒక దేవదాసి తన పొందు ఎందరికో అందించి సుఖపెడుతుంది. అక్కడి వారంతా అలాంటి పతితలు, భ్రష్టులు, కఠిన హృదయులు. రాజసం వారి నైజగుణం. చీకటి తప్పుల్ని, మానవ బలహీనతగా మభ్యపెడతారు. రక్తమాంసాలలో పాపాలు ఇంకిపోగా, వ్యామోహాలను అలంకరించుకుంటారు. ప్రకృతి ప్రసాదించిన వరాలను, అవకాశాలను అవివేకంతో తిరస్కరించి కడకు నరకానికి చేరుకున్నవారు. వారంతా మృణ్మయపాత్రలో అమృతాన్ని సేవించాలనుకుంటున్నవారు.

మాయలోకానికి ఆమె రాణి. ఆమె చుట్టూ వికృత రూపాలు. పాపులు, రాక్షసులు, దయ్యాలు, పిశాచాలు చీకటి నుండి పుట్టుకొస్తుంటారు. అకృత్యాలలో వారిది అందెవేసిన చేయి. సుందర రూపాలు ఆ దేవేరికి నచ్చవు. సహజ ప్రవృత్తులు ఆమెకు నచ్చవు. ఆ విచిత్ర రూపాలు ఆమె మెప్పు పొందుతాయి. ఆ పైశాచిక

కృత్యాలతో మానవజీవి మనలేదు. మనిషి వివేకం అక్కడ పనిచేయదు. ఆమె కల్మషం, కుటిలత్వం పెరిగినకొద్దీ దుష్టశక్తులు విజృంభిస్తాయి. వారంతా విచిత్రరూపాలతో భూమిపైకి వస్తారు. వాటి ప్రభావం మనుషులపైన పడుతుంది. అవి మనిషి మనస్సును సులభంగా ఆక్రమిస్తాయి.

ఆ మాయారూపానికి ప్రకృతి లొంగిపోయి వికృతిగా మారుతుంది. దాని ప్రభావం వల్ల మనిషిలో క్షుద్రవాంఛలు చెలరేగుతాయి. ఆనందం స్థానే ఆవేదన, అరాచకం ప్రవేశిస్తాయి. ఇంద్రియలోలత్వం పెరిగి ద్వేషం దానికి తోడవుతుంది. అన్నీ కలిసి 'హింస'ను ఆశ్రయిస్తాయి. అదే మనిషి హింసాప్రవృత్తికి కారణం. చేసిన పాపాలకు మృత్యువు సమాధానం చెబుతుంది.

ఆ నరకం ఒక విచిత్రమైన అనుభూతిని కలిగిస్తుంది. ఆత్మకు ఇష్టం లేనిదాన్ని మనసు మోజుపడేటట్లు చేస్తుంది. నరాలను బలహీనపరచి, వాంఛలను పెంచుతూ మనిషిని భోగలాలసుని చేస్తుంది. లైంగికవాంఛలు, ఉద్రేకాలు తీయతీయగా మధురంగా ఉంటాయి. అందుకే లోకంలో మనుషులకు సుఖభోగలాలస అతిగా ఉంటుంది. నరకంలో సౌందర్యం, అనుభూతి ఉండవు. ఉద్రేకాలు, ఉన్మాదాలు, కామనలు ఎక్కువ. అక్కడ అవి తీరేమార్గం లేక, తీరినా తృప్తి లేక ఆ గుణాలున్న మనుషులలో ప్రవేశించి ఇంద్రియలోలత్వంతో అన్ని కామనలు తీర్చుకుంటాయి.

ఇక్కడ ఇంద్రియచాపల్యాలను, వ్యామోహాలను జయిస్తే అక్కడ ఈ రకమైన నరక యాతన లుండవు. వివేకం వాటిని నిరోధించగలదు. భౌతిక సుఖాలను, లాలసను, వ్యామోహాలను రెచ్చగొట్టేది ఇంద్రియచాపల్యం. వాటిని జయిస్తే అదే శక్తి కేంద్ర మవుతుంది. దైవం పేరున అకృత్యాలు, పాపాలు చేయడం మనిషి కనిపెట్టిన కొత్త సిద్ధాంతం. పతనం చెందినకొద్దీ పాపకార్యాలపైకి మనసు పోతుంది. మనిషి ఆలోచనలు భయంకరంగా తయారవుతాయి.

భౌతికజీవితంపట్ల వ్యామోహమే పదార్థ విజ్ఞానానికి ఆధారం. పట్టు తప్పిన మనస్సు పశుత్వం వైపు పరుగులు తీస్తుంది బాహ్యప్రపంచంలో ఎక్కడా సత్యం కనిపించదు. చీకటి గుహల్లో సత్యాన్వేషణ చేయాలి. చైతన్యంతో ఆత్మను శోధించి, సత్యాన్ని దర్శించాలి. ప్రకృతి పైపొరలను చీల్చుకుని వాంఛలు పైకొస్తాయి. దానినే మనం వాస్తవ జీవితం, ప్రకృతి సహజం అనుకుంటాం. లోకంలో వాతావరణం కల్మషమైపోయింది. పాశవిక వాంఛలు మనిషిలో పుట్టుకొస్తున్నాయి. మనిషి తన బలహీనతలనే ప్రేమిస్తాడు, పోషిస్తాడు.

అశ్వపతిని కాలాగ్నులు చుట్టుముట్టాయి. పైశాచిక ఆనందం వికటాట్టహాసం చేసింది. ఎటుచూచినా భయంకరమైన అమానుష చర్యలు. అన్నీ రాక్షసచర్యలు. అవి హోరు మంటూ అతనిని క్రమ్మివేశాయి. ఆ హోరులో దివ్యనాదాలు వినిపించవు. కళ్లు మూసుకున్నా నరకం కళ్లలో కదులుతుంది. అక్కడ ఉన్నది అందరూ అలాంటి జీవులే. వారిది రాక్షసప్రవృత్తి. వారిలో ఎక్కడో కాస్త మానవత్వం బాధగా మూలుగుతుంది.

మనిషిలో దివ్యజీవనం ప్రశాంతంగా నెలకొనాలి. జీవితం నిర్మలంగా సాగాలి. ఎన్ని అంతరాగ్నుల్ని అయినా ఆత్మ భరిస్తుంది. ప్రళయాలు వచ్చినా ఆత్మ చలించదు. చైతన్యవంతమైన ఆత్మ చీకటిని, అజ్ఞానాన్ని దాటి వివేకంలో పట్టుపడకుండా జీవితంలో ప్రవేశించి అస్థిర ప్రకృతిని సుస్థిరంగా మార్చుతుంది. అదే 'ఆత్మ' చేసే పని.

ఆ లోకంలో అంతటా కనిపించేది ఒకే ఒక రాక్షస ప్రవృత్తి. అదే అక్కడ శక్తి. తను సృష్టించుకున్నదే అయినా తననే నిర్దయగా చూస్తుంది. దాని గుండెలో కరుణ, కళ్లలో ఆర్ద్రత ఉండవు. దాని గుండె కాలకూట విషంతో నిండి ఉంటుంది. ఇతరుల బాధలలో అది ఆనందం పొందుతుంది. పతనంలో, మృత్యువులో దరహాసం వింటుంది. ఎలాగైనా క్షుద్రశక్తిని పొందడం దాని లక్ష్యం. దాని దృష్టిలో లోకం అంతా పాపపంకిలం. అక్కడిది నరకపాలన. పాపం చేసినవారు చేరవలసిన లోకం అది. నియంతృత్వం క్రింద అందరివీ బానిస బ్రతుకులే. ఒకే పథకం క్రింద పాపులంతా నరకయాతనలు అనుభవిస్తారు. అశ్వపతికి వారంతా సజీవదయ్యాల్లాగా కనిపించారు. అయితే వారిని భావంతోనే పలకరించాలి. అందరూ నీచంగా, అమానుషంగా ప్రవర్తిస్తారు. వారిది క్షుద్ర జీవితం.

ఎప్పటికైనా దైవత్వం పొందగలమన్న ఒక ఆశ ఉంటుంది. మానసిక పరిపక్వత వల్ల దివ్యత్వం సాధించగలమన్న ఆశ పోదు. ఎప్పుడో ఒక జ్ఞానకిరణం ప్రసరించి వారి ప్రవృత్తి మారుతుంది. నరకం నుండి విముక్తి లభిస్తుంది. మనకు పరిచయమైన సుందర రూపాలు అక్కడ వికృతంగా మారిపోతాయి.

అశ్వపతి తేజస్సు కోసం తహతహ లాడాడు. అతని దృష్టి అంతర్ముఖమైంది. అక్కడా నరకం నీడలే కనిపించాయి. అనుభూతికి అందిన దానిలో అసత్యం ఉండదు. నరకంలోని రాక్షసులు, భూతాలు, దయ్యాలు, పిశాచాలు అన్నీ నకిలీ దేవతారూపాలు ధరించగలవని తెలుసుకోగలిగాడు. అయినా వారిని నిరాశ

వదలదు. వారు ప్రేమ కోసం, కరుణ కోసం అంగలార్చుతుంటారు. ఎక్కడా రవంత ప్రేమ, కారుణ్యం కనిపించవు. ఎటు చూచినా అత్యాశ, స్వార్థం, ద్వేషం, అసూయ. బాధితులకు ఉపశమనం ఉండదు, ఊరట కలగదు. ఎవరికీ ఒక మంచి మాట మాటాడే సాహసం ఉండదు. అక్కడ బానిసత్వానికి, యాతనలకు అలవాటు పడిపోతారు. తమ రక్త పిపాసను లాంఛనం చేసి లోకంలో అజ్ఞానానికి తామే వారసులనిపిస్తారు.

బానిస బ్రతుకు మనస్సును ఆలోచించ నీయదు. తనకు దాసోహం అన్న వారిపై అనృతం పెత్తనం చలాయిస్తుంది. అసత్య సూత్రంతో ఏర్పడిన మతాలు, జాతులు అసత్యంతోనే 'ఆత్మ'హత్యలు చేస్తుంటాయి. అక్కడ ఎవరికి వారే మోసానికి గురి అవుతుంటారు. ఆ వాతావరణంలో సత్యం ప్రవేశించదు. వారికి జుగుప్సలోనే ఆనందం లభిస్తుంది. అక్కడిదంతా హైన్యం, దైన్యం, నికృష్టం, వికృతం. అంతటా దరిద్రం, నైచ్యం, విషాదం. ఆ వాతావరణంలో బ్రతకడమే వారికిష్టం. అదే తృప్తిగా ఉంటుంది. అసలు దివ్యత్వం పొందాలన్న కోరిక చచ్చిపోతుంది. నరకం కాక మరో లోకం ఉందని, ఉంటుందని వారు నమ్మరు. ఆ చీకటి జీవితాలకు వెలుగు, వేడి అవసరం లేదు.

అంధకారం వెలుగును లోపల ప్రవేశించనీయదు. దాని సంకల్పం దానిది. దాని యిష్టం దానిది. అక్కడ కలల్లో ఆకలి నశిస్తుంది. ఉంటే బానిసత్వం. కాకుంటే అధికారం. కఠోర, భీకర ధర్మానికి నదురు, బెదురు ఉండదు. అదొక పెద్ద రాక్షసి. దాని రూపం భయంకరం. ఆకారంలో మృగం. దాని గర్జనకు ఆకాశం దద్దరిల్లి పోతుంది. 'సత్య' ప్రియుల గుండెల్లో గుబులు పుడుతుంది. ఆ అరుపుకు ప్రతివారు దాసోహం చేయవలసిందే. అంధకారంలో వినిపించేవన్నీ ఆక్రందనలే.

అశ్వపతి సంకల్పంతో మహాతేజస్వి అయినాడు. ఆయనది సూర్యకాంతి. ఇప్పుడు నరలోక జీవులంతా పిపీలికాలుగా కనిపించసాగారు. పాపుల తొక్కిసలాట, అగ్నులు, హాహాకారాలు అతనిని ఏమీ చేయలేకపోయాయి. తమస్సు నుండి తేజస్సులోకి పయనించసాగాడు. వాటితో పోరాటం సాగించాడు. అన్ని క్షుద్రశక్తులు నిష్క్రమించసాగాయి. ఒక్క ఉదుటున గగనంపైకి చేరుకున్నాడు. నరకం దూరంలో నిష్క్రమించి లయించిపోయింది.

★ ★ ★

సంధ్యాతీరంలో ముందుకు సాగాడు.

అశ్వపతి చుట్టూ ఒక ఆధ్యాత్మిక శూన్యం వలయంగా ఏర్పడ్డది. అది మాయ అనిపించింది. తాను ఏకాకి. అది ఏకాంతం. అయినా హాయిగా ఉంది. మనస్సు ఏదో ఉపద్రవాన్ని శంకించింది. ఆ శూన్య పత్రంపై ఏదైనా రాసుకోవచ్చు. అప్పుడు ఏవో సందేశాలు అందసాగాయి. సంధ్య చీకటిలోకి జారిపోతున్న అనుమానం కలిగింది. అక్కడక్కడా గజిబిజిగా అల్లుకుని పెనవేసుకున్న చెట్లు, నీడలు. అతను శూన్యంలో మృత్యువును అనుభూతించాడు. అయినా ఏదో ప్రతికూలత తెలుస్తోంది. మృత్యుహేల వెలుగును, సత్యాన్ని భరించదు. శూన్యంలో శూన్యంగా జీవించడం దాని విలక్షణత.

ప్రతికూల స్వరాలు అనేకం వినిపించసాగాయి. వెలుగు నెగళ్లవలె ఆలోచనలు ముసురుకున్నాయి. చీకటి సైతం విచిత్రరూపాలు ధరించసాగింది. మృత్యువు నోరు విప్పి తనలోకి జీవుల్ని ఆకర్షిస్తోంది. ఆ ప్రమాదం నుండి అశ్వపతి తనను రక్షించుకోగలిగాడు. తన ఆత్మశక్తి వల్ల జీవుల రూపాలు, ఆవాసాలు కరిగిపోసాగాయి. ఏకాంతం ప్రశాంతంగా ఉంది. ఆలోచన అంతరించగానే అన్నీ అంతరించాయి. జీవుడుసైతం శూన్య స్వనం వినగలుగుతున్నాడు. అది శూన్యంలో లయించిన లోకపు ఛాయారూపం ... చివరకు లోకంలో ఏదీ మిగల నట్లే శూన్యంలోనూ ఏదీ మిగలదు. సృష్టి శూన్యం నుండి ఏర్పడినా, తిరిగి శూన్యంలో లయించవలసిందే.

ఇప్పుడు మహాశూన్యంలో అశ్వపతి ఆత్మసాక్షిగా, ఒంటరిగా మిగిలాడు. ఇది అని వర్ణించ వీలుకాని శూన్యస్థితి. నిజానికి అది స్థితి కూడా కాదు. సంకల్పం ఘనీభవించి బీజమై, జీవమైంది. మేధస్సులేని జీవం శరీరాన్ని భరించ లేదు. అన్ని జీవులను శూన్యం తనలో లయింపచేసుకుంటుంది. చివరికి మిగిలేది శూన్యం! ఆకృతి లేని ఒక మహాసర్పం కోరలలో చిక్కినట్లు, శూన్యం పట్టులో విలవిల్లాడాడు. శూన్యం నోరు విప్పి తనను కబళించ యత్నించింది. ఆ శూన్యం మహానరకాన్ని సైతం తన కడుపులో దాచుకోగలదు.

అశ్వపతి ఆత్మ రూపరహితమై, దాదాపు శూన్యంగా మారింది. అఖాతాలలోకి జారిపోసాగింది. అతని మనస్సులో ఆరాటం. ఆరాటంపై అరూపశూన్యం ఒత్తిడి ఎక్కువైంది. చీకటి గుహవంటి గుండె గడ్డకట్టినట్లయింది. ఏదో ఒక సూచన వచ్చి సూటిగా గుండెలో గుచ్చుకుంది. అది కుండలినీ శక్తి. మూలాధారం నుండి

పైకి పొంగి, అనాహతాన్ని చేరడం జరిగింది. అతను శూన్యంలో జారిపడకుండా ఆ శక్తి ఉద్ధరించింది. శ్వాసమాత్రం అతనికి ఆలంబనగా మిగిలింది.

మనిషి అస్తిత్వం కోసం ఆరాటమే జీవన పోరాటం. శూన్యంలో ఆశ చావని ఆత్మ పెనగులాడింది. స్మృతి, విశ్వాసం నశించిపోతాయి. అవే ఆత్మకు ఉన్నత పథంలో సహాయపడతాయి. అణువణువున, కణకణాన విపరీతమైన ఒత్తిడి. ఇది అనరాని అవ్యక్తవేదన ... అతనిని భయపెట్టసాగాయి. ఒక కల్లోల సాగరం క్షణంలో నిశ్చలంగా, గంభీరంగా మారినట్లు ఆ నిశ్శబ్దం అతనిని విచలితుణ్ని చేసింది.

అది పరమాత్మ కరుణ కావచ్చు! అది దివ్యత్వం కావచ్చు. ఆవేదన వల్ల పరలోక వాంఛ సన్నగిల్లింది. ఆశ కరిగిపోయింది. సృష్టి లయలోని సరిహద్దును దాటి స్వస్థితిని పొందాలి. దేశ, కాల యాతనలు జీవుడు అనుభవించాలి. ఆవేదన నుండి పరమప్రశాంత స్థితికి చేరడం సులభం. ఇప్పుడు అతని గుండె జీవరహిత శూన్యంతో నిండిపోయింది. ఒకప్పుడు అదే గుండె మహత్తుకు నెలవు, తేజస్సుకు ఆవాసం, మహాశక్తికి కేంద్రబిందువు. ఇప్పుడు అది శూన్యం, నిర్గుణం. అది అచలస్థితిని పొందింది. ఒక విశ్వాసం గాని, ఆశ గాని అందులో ప్రవేశించ వీలులేదు. అసలు ఆత్మ శూన్యంలో లయించినప్పుడు ఆత్మలోనే జీవుని ఆశలన్నీ లయిస్తాయి. ఆత్మ శాశ్వతం అయినా మనిషిలోని దివ్యత్వాన్ని తనతో తీసుకు పోతుంది. ఆత్మ శరీరం నుండి వేరైపోయిన తర్వాత పరం ఉండదు, పరమాత్మ ప్రమేయం ఉండదు.

వ్యక్తిత్వం ఒకటి మిగిలినా భయం పోదు. అణువణువునా వేదన సమ్మెట దెబ్బలు కొడుతుంది. అశ్వపతిలో ఒక్క ఉదుటుకు అంతర్దృష్టి ఏర్పడింది. ఆత్మ శాంతి, మానసిక ప్రశాంతి ఏర్పడ్డాయి. భయం స్థానంలో ఒక దివ్యజ్యోతి వెలుగు కనిపించింది. తన శక్తి తనలోకి తిరిగి వచ్చి చేరినట్లయింది. ఇప్పుడు తను పూర్ణ మానవుడు. తానొక పూర్ణయోగి. తనలో ఉన్నది యోగలయ. ప్రాపంచికమైన బాధలు భరించడానికి, యాతనల్ని ఎదుర్కొనడానికి సిద్ధమైనాడు. ఇప్పుడు అతనికి ఒక్క క్షణంలో ప్రకృతిపై ఆధిక్యత ఏర్పడ్డది. తన ఆత్మశక్తితో నరకాన్ని అధిగమించి పోగలిగాడు.

42. మృత్యులోయ

ప్రపంచం మిథ్య కాదు. జీవితం మాయ కాదు. లోకాలు వాస్తవమే. ప్రపంచం మిథ్య అయితే దాన్ని సృష్టించిన బ్రహ్మ మిథ్య కావాలి. లోకం వాస్తవం కనుక పరలోకాలూ వాస్తవమే, పరమాత్మ వాస్తవమే. అమరత్వానికి అడ్డుపడేది అసుర ప్రవృతి. మనిషికి, స్వర్గానికి మధ్య ఉన్నది నరకం. అది అయోమయం. మనలో అయోమయం తొలగిపోతే నరకం, యమలోకం దాటి పోయినట్లే.

తపస్సు వల్ల ఆత్మ చీకటి నుండి వెలుగులోకి పయనిస్తుంది. జీవుని కర్మ బంధించి నరకంలోకి లాగుతుంది. ఏవంత అజ్ఞానమూ పూర్ణత్వానికి అవరోధమే. మాయకు అంగరక్షకులు వ్యసనాలు. మనిషికి సుఖాలు వ్యసనాలుగా మారినప్పుడు నరకం కనిపిస్తుంది.

అశ్వపతి స్వర్గమార్గంలో నరకాన్ని గమనించాడు. అక్కడ మృత్యువును, బాధలను, యాతనలను అనుభూతించాడు. నరకంలోని తమస్సును ఆత్మ శక్తితో ఛేదించగలిగాడు. నరకంలో ఉన్నంతకాలం జీవికి విశ్రాంతి ఉండదు. ఆత్మకు శాంతి ఉండదు.

నరకద్వారం చేరగానే అశ్వపతికి చేష్టలుడిగాయి. ఆలోచనలో యాతన ప్రవేశించింది. భయం, అవిశ్వాసం మాయకు చిక్కినట్లయింది. వాటిలోంచి బయట పడడం అసంభవం అనిపించింది. నరకంలో శిక్షాకాలం పూర్తి అవడం అంటే కర్మ విముక్తి కావడమే. అప్పుడు జీవికి ఒక్కసారి పూర్వస్మృతి కలుగుతుంది. వివేకం మేల్కొంటుంది. బుద్ధి పనిచేస్తుంది. ఆత్మ మార్గం చూపుతుంది. అయోమయం వదలిపోతుంది. నరకం శూన్యంలో లయిస్తుంది. నరకం ఒక మానసిక విభ్రమం.

అశ్వపతి చీకటి గుండెను చీల్చి చూడగలిగాడు. లోపల చైతన్యం ఘనీభవించి జడప్రాయంగా ఉంది. అంధకారం అనంతంగా, భయంకరంగా

కనిపించింది. ఎక్కడా ప్రాణస్పందన, జీవస్పర్శ ఉండదు. పరమసత్యం సైతం ఆ చీకటిలో చిక్కుపడింది. అక్కడ పరమాత్మకూ ప్రవేశం లేదు. అది చీకటి రాజ్యం. అంతా అయోమయం.

ఆ చీకటిలో దివ్యత్వం ప్రవేశించదు. వెలుగు దూరదు. ఎవరి సహాయం లేకుండానే నిశి ఆ తమస్సును సృష్టించుకుంది. చీకటి రక్కసిగా మారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. దానికి సత్యభాషణ వినిపించదు. అది సత్యం ప్రవచించదు. తన ఇష్టం వచ్చిన రూపాలు ధరిస్తుంది. అజ్ఞానం సహాయంతో అయోమయాన్ని సృష్టించింది. అక్కడిదంతా వికృతం, అరాచకం. అది ఆత్మ లేని రాక్షసలోయ.

చీకటి అగాధాల నుండి అరాచకశక్తి పైకొచ్చి భయంకర శక్తుల్ని ప్రసవిస్తుంది. రాక్షస గణాన్ని సృష్టిస్తుంది. అవి రూపాలు, ఆకారాలు లేనిశక్తులు. అవి మనుషుల బలహీనతలపై దాడిచేసి కామనల్ని సంకల్పంతో కలిగిస్తాయి. అహంకారాన్ని పెంచుతాయి. మనిషిలోని దుర్గుణాలకు అవి మూలం. ఆ యమకూపంలో వాటిదే చైతన్యం, వాటిదే శక్తి. సృష్టిలో అజ్ఞానం, అశాంతిని సృష్టించేవి ఆ శక్తులే. మనిషికి విషాదాన్ని, వియోగాన్ని కలిగించేవి అవే. శూన్యంలోని అగోచర శక్తులకు ప్రతినిధులు అవి.

ఈ శూన్యంలో ఒక నీడ ప్రవేశించింది. అది చీకట్లో దయ్యాల్ని, క్షుద్ర దేవతల్ని సృష్టించింది. వాటికి రాక్షస ప్రవృత్తులను కల్పించి లోకంపైకి వదలింది. ఈ ప్రపంచంలో ప్రవేశించిన ఆ క్షుద్రశక్తులే మనిషిని పాపకార్యాలకు ఉసికొల్పి, తర్వాత నరకానికి తీసుకుపోయి ప్రత్యక్ష నరకం చూపిస్తాయి.

అశ్వపతి చీకటి వలయాలు ఛేదించి లోపలకు తొంగిచూచాడు. అయో మయ దృష్టితో తన దృష్టిని కలిపి చూచాడు. చీకట్లో తారాడే అవాస్తవం కనిపించింది. చైతన్యం సైతం చీకటిగా మారిపోతున్నది. అది దుర్భరం అనిపించింది. అది భయంకర స్వప్నంలా ఉంది. శూన్యంలో చీకటి లుంగలు చుట్టుకున్నట్లు తోచింది. అక్కడ నక్షత్ర కాంతి చొరబడడం లేదు. అది అసత్య లోకానికి ప్రధాన ద్వారం. అది పతనానికి, మోసానికి ప్రవేశ ద్వారం. ఆధ్యాత్మిక జీవులెవరు అటువైపు వెళ్లరు. కనుక ఆ నరకం వారి అనుభవంలోకి రాదు. అక్కడ తిరిగే జీవులంతా ఒకప్పుడు మానవులే. అప్పుడు ఆత్మ తేజస్సుతో బ్రతికిన వారే. ఇక్కడ అందుకు విరుద్ధమైన నరకం చేరుకున్నారు.

మహాశూన్యంలో లయించినా జీవులకు, లోకాలకు అంతిమ గమ్యం పూర్ణత్వమే అవుతుంది. ఏ లోకంలో ఎంతకాలం జీవి గడిపినా మరల బయటపడి పూర్ణత్వం వేపు సాగాలి తప్పదు. విశ్వ మేధస్సును అజ్ఞానం కబళించలేదు. పరమాత్మ శూన్యం నుండి లోకాన్ని తిరిగి సృష్టించగలదు. శూన్యంలో లయించింది తిరిగి శూన్యం నుండే ఉద్భవిస్తుంది. శూన్యంలో లయించిన జీవుడు కొంతకాలం నిద్రించి, మేల్కొంటాడు. ఆ శూన్యం జడ ప్రకృతికి, నిర్గుణ తత్వానికి కీలకం. అక్కడ జనన మరణాల వలయంతో పయనించి కడకు బ్రహ్మాన్ని చేరడం జరుగుతుంది.

పరమాత్మ ప్రణాళిక ఏదీ అక్కడ అమలు కాదు. అక్కడ ప్రతిక్షణం పరమాత్మ శాసనాలకు విపరీత వ్యాఖ్యలు వినిపిస్తుంటాయి. అక్కడ మూడు తలల విషనాగులు బుసకొడుతుంటాయి. వారి ఆలోచనలన్నీ అపసవ్యంగా, వికృతంగా ఉంటాయి. వారి దోష దృష్టులే దిష్టి దీపాలుగా వెలుగుతుంటాయి. ప్రతి మందిరం నుండి ఏడుపులు, పెడబొబ్బలు, ఆర్తనాదాలు వినిపిస్తుంటాయి. దుర్భరమైన వాసనలు పాపాగ్ని హోమ కుండాల నుండి వెలువడుతుంటాయి. అవి అపవిత్ర మంత్రాలకు రగులుతుంటాయి. ఆ నరకంలో ప్రతిభా సంపన్నులు, పండిత ప్రకాండులు ఉన్నారు. వారు క్షుద్రమంత్రాలు వల్లిస్తున్నారు. క్షుద్రోపాసన చేస్తున్నారు. అక్కడ యాతన ఒక్కటే అందరికీ భోజ్యపదార్థం. వేదన చెందే మనస్సు బాధలు పడే శరీరాన్ని ఆకర్షిస్తుంది. హింసతో ఆనందం పొందడం అక్కడి జీవన న్యాయం. బాధ ఒక్కటే పరమావధి.

మంచి అనేమాట మహాపాపం వలె వినిపిస్తుంది. దుర్గుణాలు విషవృక్ష ఫలాలు. అక్కడ పాపం సహజగుణం. ఉదాత్త భావాలు అపవిత్రంగా మారి పోతాయి. సుందర రూపాలు రాక్షస చర్యలకు పూనుకుంటాయి. స్వర్గంపైన నరకం నల్లని ముసుగు కప్పివేసి కనపడనీయదు, ఆలోచన లోనికి రానీయదు. అక్కడ పరిణామ రహస్యం ఎవరికీ తెలియదు. ఒక భయంకర రూపం మృత్యువుగా పరిగణింపబడుతుంది. ఆ మృత్యురూపం సర్వజీవులను మ్రింగివేస్తుంది. దాని రూపం, చూపులు భయంకరం. అది కనిపించకుండా కాటు వేస్తుంది, కబళిస్తుంది. మృత్యువు చేతిలోని త్రిశూలం ఒక్క వ్రేటులో మూడు లోకాల్ని నాశనం చేయ గలదు.

శూన్యంలో జీవం లయించగానే ఆత్మ లయిస్తుంది. కాలం సైతం నిరామయం అవుతుంది. ఆ స్థితిలో శూన్యంలో జీవం ఏర్పడుతుంది. జీవంతో

ఆశ నిరాశలు ఏర్పడతాయి. జీవానికి ఆశ నిరాశలు ఉచ్ఛ్వాస నిశ్వాసల వంటివి. ఒక కాంతి కిరణం మొలకెత్తి శూన్యాన్ని, చీకటిని చీల్చివేస్తుంది. సృష్టి వెనుక భగవంతుడు కనిపించడు. భగవంతుడు తన అంశను ఆత్మకు అందించి జీవుల్ని నడిపిస్తుంటాడు.

సృష్టి మర్మాన్ని, మార్మిక సత్యాన్ని ఆత్మ సులభంగా గ్రహిస్తుంది. అవ్యక్తం, నిర్గుణం అన్నవి మౌలిక ధర్మాలు. సత్యం వలె ధర్మం అగోచరంగా ఉంటుంది. మౌలిక శక్తులన్నీ అగోచరంగానే ఉంటాయి. ఇంద్రియాలకు అందవు. ఆలోచనకు స్పందించవు. అనుభూతికి మాత్రం తెలుస్తుంటాయి. అందుచేత సత్యాన్వేషణ, పరమాత్మ అన్వేషణ చీకటిలో, శూన్యంలో జరుగుతుంది. జీవి మనస్సు ద్వారా సుస్థిరత్వాన్ని కాంక్షిస్తుంది.

చీకటిలో సత్యం కనిపించదు. అజ్ఞానం నింపుకున్న చీకటి సత్యానికి అవకాశం ఇవ్వదు. చీకటిలోనే విశ్వరూపం దర్శనమిస్తుంది. ప్రకృతి సహజమైన మాయనే అజ్ఞానం అంటారు. అప్పుడొక సంఘటన చోటు చేసుకుంది. అంధ కారంలో నిద్రిస్తున్న ఒక శక్తి మేల్కొని శూన్యాన్ని చీల్చుకుని పైకుబికి వచ్చింది. అది నక్షత్రాలపై ఆధిక్యత సంపాదించింది. అది భూమి. అంత పెద్ద భూగోళాన్ని మృత్యువు ఆవహించింది. ఇతర గోళాలన్నీ భూమి చాటుకు చేరుకోసాగాయి.

భూమిని ఒక అవ్యక్త శక్తి రక్షించసాగింది. ఒక సంకల్పం దానికి అండగా నిలిచింది. అదే విశ్వంలోని భూగోళం విశిష్టత. విశ్వం మొదట ఏర్పడినపుడు దాని కొక ప్రయోజనం లేదు. అది ఒక ప్రయోగం మాత్రమే. ముందు ఘనపదార్థం ఏర్పడ్డది. అందులో జీవం లేదు. కాని పరమాత్మ సంకల్పం నిరుపయోగం కారాదు. అందువల్ల నిర్జీవ జడంలో చైతన్యం ఏర్పడి, పరిణామానికి అవకాశం కలిగింది.

జీవపదార్థం అపరిమితంగా పెరగడంతో క్షయం అవసరమైంది. జీవం పెరుగుదలను నియంత్రించడానికి మృత్యువు ఏర్పడింది. మనిషికి అదనంగా ఆలోచించగల మేధ ఏర్పడ్డది. మనస్సును, ఆలోచనల్ని నిమంత్రించడానికి ఆత్మ అవసరమైంది. మనస్సు పైన ఆధిపత్యం ఆత్మ తీసుకుంది. ఆత్మకు ఆనందం పరమావధి. అన్ని వేదనల్ని హరించగలది ఆత్మానందం. అన్ని జీవుల్ని హరించగలది మృత్యువు. భగవంతుడు ఆత్మకు మాత్రమే అనుభూతమయ్యే ఏర్పాటు జరిగింది. ఆత్మకు పైన పరమాత్మ. అదే ఈశ్వరుడు. అదే భగవంతుడు. ఆత్మశక్తిని నిరోధించడానికి ఒక ప్రతికూలత విశ్వంలో చోటు చేసుకున్నది. ఆ ప్రతికూలతకు

మనస్సు నాయకత్వం వహించింది. మనస్సుకు మృత్యువు అండగా నిలిచి, జీవుని వెనక దాగింది. ప్రతికూలత వల్ల అనృతానికి, విషాదానికి, మృత్యువుకు ప్రాధాన్యం ఏర్పడ్డది. ప్రపంచంలో అన్నిచోట్ల వీటి ఆధిక్యత కనిపిస్తుంది.

జీవిని విధి తన చెప్పుచేతల్లో ఉంచుకుంది. పరమాత్మ సంకల్పం విధి ప్రమేయంతో వికల్పం చెందింది. పరిణామానికి విధి అడ్డు నిలిచింది. విధి ప్రమేయంతో పరిణామం వికృతరూపం దాల్చింది. మానవ జీవితంలో విధి అద్వితీయమైన పాత్ర పోషిస్తుంది. అది కారణంగా ప్రాపంచిక విషయాలలో అసత్యం, దోషం ఎక్కువై సత్యం సన్నబడింది. అజ్ఞానం సర్వత్రా వ్యాపించసాగింది. మనస్సు వెనకదాగిన వివేకం తొట్రుపడింది. ఈ సందిగ్ధంలో ప్రజ్ఞ అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. ప్రజ్ఞ కనిపించక పోవడం వల్ల అవివేకం, అజ్ఞానం అధికమైనాయి. మానవత్వం వికృతంగా మారసాగింది.

అప్పుడొక జ్ఞానకిరణం మనిషిలో ప్రవేశించింది. హృదయం ఎప్పుడూ సత్యాన్ని గ్రహించడానికి సిద్ధంగా ఉంటుంది. హృదయంలో ప్రవేశించిన జ్ఞానం పెరిగి పెరిగి పరమాత్మను చేరాలని పరితపిస్తుంది. ప్రతి నిరీశ్వరవాదిలోనూ ఈశ్వరత్వం ఉంటుంది. అది కొందరిలో ఆత్మశక్తిగా, కొందరిలో దైవభక్తిగా నెలకొంటుంది. దైవారాధకులకు అవరోధాలు తక్కువ. కొంతవరకు వారికి దైవం అనుకూలిస్తుంది. ఆత్మదర్శనం కోరే వారికి అవరోధాలు ఎక్కువ. దివ్యశక్తుల సాయం కోరకుండా ఆత్మశక్తిని పెంపొందించుకొనేవారు అతి తక్కువగా ఉంటారు. వారే పరిణామానికి సహాయ పడతారు. సత్యాన్వేషణ ఎవరికి వారుగా ప్రతి ఒక్కరు జరపవలసి ఉంటుంది. ఒకరి అన్వేషణ మరొకరికి సహాయపడదు. పరమాత్మ శక్తిని తెలుసుకోవడం దేవతలకు సాధ్యం కాదు. మనిషి మాత్రమే ఆత్మ ద్వారా పరమాత్మను అన్వేషించగలడు, దర్శించగలడు. ఆత్మశక్తి క్షీణించినప్పుడు మనిషి పశువుతో సమానం. కాని పరమాత్మ అలాంటి పతనం ఆమోదించదు. మనిషిలో ఆత్మ చైతన్యం కలిగిన వెంటనే ఆ బాధ్యత పరమాత్మ తాను తీసుకుంటుంది. ఆత్మను జాగృతం చేయడం పరమాత్మ పని. అప్పుడు మనిషి హృదయమే ఒక దివ్యమందిరం అవుతుంది.

జగన్మాత శక్తి సామర్థ్యాలు మనిషి అంచనాకు అందవు. అమ్మ అనుగ్రహాన్ని కొలవలేం. జగన్మాత స్ఫూర్తి బ్రహ్మానంద సదృశం. మనిషిలోని వికృత కోర్కెల్ని చంపి, ఆత్మను ఉద్ధరిస్తుంది. పుణ్యంచేసిన వారినీ నరకానికి పంపుతుంది. ఆ అనుభవం జీవికి కొంత అవసరం. చీకటి బాటలలో పయనించే వానికి వెన్నెల

హాయిగా ఉంటుంది. కారు మేఘాలు క్రమ్మి, చీకట్లు ముసిరితే మనిషి పథవిహీనుడు అవుతాడు. ఆ ఒంటరితనంలో మహాకాళి అతనిని మ్రింగివేయవచ్చు. యోగాగ్ని రగిలినప్పుడు ఆ తాపాన్ని భరించలేక, దివ్య శక్తిని భరించలేక, మహాయోగి అయినా శరీరత్యాగం చేయక తప్పదు. శరీరం దగ్ధం అయినా ఆత్మ యోగాగ్నిని భరిస్తుంది.

భౌతిక శరీరాన్ని ప్రేమిస్తూ, భౌతిక సుఖాలు వదులుకోనంతకాలం మనస్సు, హృదయం పరమాత్మకు కైంకర్యం కావు. అప్పుడు జీవుడు మృత్యువుకు తలవంచు తాడు. మృత్యువుతో భౌతిక స్వభావం యావత్తు కుప్పకూలిపోతుంది. ఆపైన భావం ఒక్కటే జీవునకు అండగా నిలుస్తుంది. కాని ఆత్మవిశ్వాసం లేని కారణంగా జీవి ఓటమి పాలవుతుంది.

ప్రతి గుండెలో కొంత సందడి ఉంటుంది. కొంత చైతన్యం ఉంటుంది. దివ్యత్వం పోయి, దాని స్థానంలో ప్రజ్ఞ చోటుచేసుకుంటుంది. ఆత్మ ఉన్నత శిఖరాలకు చేరిన తర్వాత పరమాత్మ సహకారం అవసరం ఉండదు. యోగి హృదయం శూన్యమై నిర్మలమవుతుంది. ఆకాశంలో సువర్ణకాంతులు కనిపించవు. ఆహితాగ్ని జ్వాలలు సమసిపోతాయి. హృదయం ప్రణవాన్ని మాత్రమే వింటుంది. జీవుల పాపపుణ్యాలను నమోదు చేస్తున్న దేవతాగ్రంథం నుండి అతని పేరు తొలగిపోతుంది. స్వర్గంలో అతనికై కేటాయించిన స్థానం ఉండదు. ఇది మృత్యువు ఆడించే నాటకం. పతనమైన 'ఆత్మ' కథకు అదే ముగింపు.

జీవుడు తనలోని దివ్యత్వాన్ని కోల్పోయినప్పుడు శరీరం, మనస్సు నశించి పోతాయి. ఆత్మ కొన్ని భయంకర శక్తులకు ఆలవాలమవుతుంది. కొన్ని క్షుద్ర శక్తులను సంపాదిస్తుంది. జ్ఞానం, అజ్ఞానం సమపాళ్లలో ఆత్మను హింసిస్తాయి. కొందరు ఆత్యాశతో క్షుద్రశక్తుల్ని ఆరాధించి, వశం చేసుకుని, కాంతిని శాంతిని ద్వేషిస్తారు. జీవితాన్ని దుర్భరం చేసుకుంటారు. వారి హృదయంలో దైవానికి, గురువుకు స్థానం ఉండదు. సంక్రమించిన అతీంద్రియ శక్తులతో మురిసిపోతారు. అవే ఈశ్వర కారుణ్యం వారికి అందకుండా చేస్తాయి. పరమాత్మ మందిరద్వారాలు మూతపడిపోతాయి. వారు ఆరాధించే క్షుద్రశక్తులే అడుగడుగునా వారికి అడ్డు తగులుతుంటాయి. వెలుగుల ప్రసారాన్ని అవి నిరోధిస్తాయి. మంచి పనులకు అడ్డు తగులుతుంటాయి. మనపైన పెద్ద బరువుపడినప్పుడు బ్రహ్మానందం మనకు అందదు. దివ్య సందేశాలను మన మేధస్సు గ్రహించదు. దివ్యత్వ ప్రవేశాన్ని మనస్సు నిరోధిస్తుంది.

క్షుద్రశక్తులు ప్రసాదించే వరాలు మనిషిని వివశుణ్ని చేస్తాయి. వారి దృష్టిలో ఆ నీచకార్యాలే గొప్పవి. సత్యం వల్ల విజయం సాధించడం అసాధ్యం అనుకుంటారు. మనిషి ఒకసారి పతనం చెందితే తర్వాత అన్నీ పతనాలే ప్రాప్తిస్తాయి.

చేజేతుల పతనమవుతున్న వారిని, క్షుద్ర ఉపాసనలు చేసేవారిని ఏ దివ్యశక్తి రక్షించదు. వారికి కుతంత్రాలే ఇష్టం. రహస్యంగా బ్రతకడమే ఇష్టం. ఆ భ్రమలకు, మాయలకు లోబడి పతనానికి, బాధలకు అలవాటు పడతారు. వారికి భౌతిక సుఖాలు యిష్టం. వారు యజ్ఞయాగా ల్లాంటివి రహస్య ప్రదేశాల్లో నిర్వహిస్తారు. ఏవేవో తాంత్రిక మంత్రాలు వల్లించి, తాంత్రిక శక్తుల్ని ఆవాహన చేసుకుంటారు. మిత్రావరుణులను ఆవాహన చేసి రహస్య మంత్రాలు చదువుతారు.

క్షుద్రశక్తులు చీకటిలో పెట్రేగిపోతాయి. వెలుతురులో బలహీనమవుతాయి.

ఆ క్షుద్రశక్తులు దేవతల రూపాలు ధరిస్తుంటాయి. వారిలో కొందరు, మహాశక్తివంతులు. అభావ, అనాత్మ మండలాలనుండి దిగి వచ్చి పరమాత్మపై యుద్ధం ప్రకటిస్తారు. ఆ శక్తులు చీకటిలో ఉంటాయి. చీకటిలోనే విజృంభిస్తాయి. వెలుగు సోకగానే అవి శక్తిహీనమవుతాయి. చీకట్లోకి దివ్యత్వం ప్రవేశించదు.

అక్కడ యమదూతలు భయానక రూపాలతో, మారణాయుధాలు ధరించి, చీకటి దేవతలై విశ్వనాటకరంగంపైన జరిగే విషాదనాటకాల్ని గమనిస్తుంటారు. తమ పాత్ర పోషణ పూర్తిచేసినవారంతా యమసదనానికి చేరుతుంటారు. ఎంతటి దివ్యాంశ సంభూతులైనా మానవ జన్మ ఎత్తిన తర్వాత, కర్మ విముక్తి కోసం ఇక్కడకు రాక తప్పదు. ఒక్క రోజైనా ఇక్కడ గడపక తప్పదు. ఈ మాయలోకం దాటకుండా ఎవరూ స్వర్గం చేరరు, సత్యలోకాలకు వెళ్లరు.

అశ్వపతి ధైర్యంగా ఆ ద్వారం చేరాడు. అనంతకాలంగా సాగుతున్న పాప పుణ్య సంకుల సమరంలో తానూ నైరాశ్యం నిండిన చీకటిలో ప్రవేశించాడు. అయితే ఆత్మ తేజస్సుతో ఆ చీకట్లను చీల్చిముందుకుపోగలిగాడు. అతని ప్రవేశంతో ముసిరిన చీకట్లు ప్రిదిలిపోయాయి. ఆ ప్రవేశద్వారం దాటి మాయలోకం ప్రవేశించాడు. బ్రహ్మానందానుభవం లేని ఆత్మలు అక్కడ తారసపడ్డాయి. అంధునికి వెలుగు తెలియనట్లు అక్కడి ఆత్మలకు బ్రహ్మానందం తెలియదు. అక్కడి జీవులు పాపకార్యాలనే గొప్పగా భావిస్తారు. వారి దృష్టిలో పుణ్యకార్యాలు చేయడం మహాపాపం. విషాదం, విద్రోహచింతన అక్కడివారి సహజగుణాలు. ఆ మాయా

సదనంలోని ధర్మం ప్రకారం బాధలు, విషాదాలు ఆమోదనీయ వినోదాలు. సర్వత్రా అలముకున్న ఆనందరాహిత్యం అక్కడ స్తబ్ధతను అలరిస్తుంది. నరకయాతనలు, బాధలు అక్కడ నిత్యోత్సవాలు. అక్కడ సంతోషాన్ని రద్దు చేస్తూ శాసనం చేశారా అనిపిస్తుంది. అక్కడివారు ఆనందాన్ని, వినోదాన్ని పాపాలుగా పరిగణిస్తారు. అక్కడ ఎవరి మేధస్సు శంకించదు, ప్రశ్నించదు. హృదయం మూతపడి, మూగపోయి ప్రసాదనంగా ఉంటుంది. అక్కడ నిద్ర ఉండదు. మగతగా పడి ఉండడమే విశ్రాంతి. అక్కడి బాధలకు మృత్యువు పరిష్కారం చూపదు. ఎవరికీ విశ్రాంతి నివ్వదు. ఆత్మ మరింతగా హింసకు గురికావడం జరుగుతుంది. జీవుని హింసలో ఆత్మకూ భాగం ఉంటుంది.

అశ్వపతి అక్కడి బాధల్ని గమనిస్తూ మరింతగా లోతులకు వెళ్లగలిగాడు. ఎంత దూరం వెళ్లినా, ఎంత చూచినా జీవుల బాధలు, యాతనలు ఒక్కలాగానే అనిపించాయి. హాహాకారాలు, ఆక్రందనలు, ఏడుపులు, పెడబొబ్బలు, గావుకేకలు ... అక్కడివారు హింసలోనే వికృతానందం పొందుతున్నారు. ఒకరి బాధ మరొకరికి ఆనందం కలిగిస్తుంది.

అక్కడ ఆలోచించడం, జీవించడం కూడా భయంకర శిక్షలే అవుతాయి. శ్వాస భారంగా ఉంటుంది. ఆశలు శాపాలవుతాయి. శరీరం ఎన్ని దెబ్బలనైనా తట్టుకుంటుంది. ఒక శిక్షకు మరొక శిక్షకు మధ్యన కాసేపు విరామం. ఆ భయంకర జీవితాన్ని ఎవరూ వ్యతిరేకించరు. ఎవరూ మార్చడానికి ప్రయత్నించరు. మరింత క్రూరంగా హింసించబడాలని తొందరపడుతుంటారు. ప్రతి హృదయం శిలాసదృశం, ప్రతి శరీరం పాషాణం, ప్రతి మదిలో విషాదం. అనుభవానికి రాని మాధుర్యాలపై విరక్తి పెరుగుతుంది. ఎవరికీ మానసిక శాంతి అన్నది తెలియదు. బాధలు అనుభవించినకొద్దీ తృప్తి కలుగుతుంది. ప్రతి క్షణం కన్నీరు కార్చనిదే ఎవరికీ తృప్తి ఉండదు.

కర్మలు అనుభవించడం పూర్తయినవారు అదృశ్యమైపోతారు. వాళ్లు ఎక్కడకు పోయేదీ, ఏమయ్యేదీ ఎవరికీ తెలియదు. అలా ఒక్కరు మాయమైనా చాలు మిగత వారు వినోదిస్తారు. లేకుంటే పైశాచికానందాన్ని అనుభవిస్తారు. ప్రతి గుండె అసూయాద్వేషాలతో పొగులుతుంది. ప్రతి హృదయం హత్యానిరతి, ద్వేషం, కామంతో పేట్రేగిపోతుంది. ప్రతి భావన ఒక వికృత, రాక్షస చర్యకు దారి తీస్తుంది. వారంతా కాలం పైన చెరగని ముద్రలు వేస్తుంటారు.

అది దుర్భర విషాద నాటకం. మృత్యురథచక్రం క్రింద పడి నలిగిపోయే వారు, అంధకారంలో దిగులుగా తిరిగేవారు, గుండెలో గూడుకట్టుకున్న భయంతో కుమిలేవారు, పాపాలతో కనలినవారు – ఆ నరకాన్ని ఇష్టంగా అనుభవిస్తారు. అటువంటి మహాపాపుల నిలయం నరకం. సాలెగూడులో చిక్కిన ఆత్మ బయట పడదు. అక్కడి నరక ధర్మానికి, క్రూర న్యాయానికి తలొగ్గవలసిందే. శిథిలమై కూలిపోతున్న గోడల మధ్య, దయలేని అన్యాయ దేవతను ఆరాధిస్తూ, మోకాళ్లపై కఠిన శిలా తలాలపై నడవాలి. దుర్విధి పరచిన జటిల, కుటిల బయళ్లు అవి. దాటవలసిన ప్రతి శిల కుత్తుకలు ఉత్తరించగల గండశిల. ప్రతి పోటుకు గుండె గాయపడి రక్తం ఉవ్వెత్తున చిందుతుంది. బాటల ప్రక్క మోడులైన చెట్లు శవాల్లా కనిపిస్తుంటాయి. అవి కూడా విషాదం మూర్తీభవించిన అమూర్త ప్రతిమలే. ప్రతి ఇంటి గవాక్షం వద్ద ఒక యమభటుడు కాపలాకాస్తుంటాడు. అదను దొరికితే కత్తి దూసి వేటు వేస్తాడు. అక్కడివన్నీ శిథిల మందిరాలు. మాడి మసి బారిన గృహాలు. వారివి దగ్ధమైన శరీరాలు. కమురుకంపు కొట్టే కళేబరాలు. శవాలు చితినుండి లేచి నడుస్తున్నట్లుంటాయి. శత్రువినాశ గీతాలు ఆలపిస్తూ కరాళనృత్యం చేస్తుంటారు. తామే ఉన్నతులం అంటూ భజన చేసుకుంటారు. వారి చర్యలు భగవంతుడు మెచ్చుతాడని ఆశ. పాపకార్యాలు చేసినా స్వర్గానికే వెళతామని దురాశ.

అక్కడ దయకు, కారుణ్యానికి అవకాశం లేదు. తరగని శక్తి, చెరగని దీక్ష, చిక్కని భయాలు, అంధకారం కలగలిపి ఒక భయంకర మూర్తిని ప్రకల్పించుకుని దానిని ఆరాధిస్తారు. తాము సృష్టించుకున్న మూర్తులనే పూజిస్తారు. తమ రూపాలు, తమ గుణాలు ఆ మూర్తులకు ఆపాదిస్తారు. తమని అణచివేసిన పాదాలనే పూజిస్తారు. అది భయంకర విషాద లోకం.

ద్వేషానికే అక్కడ విలువ. విషాదం, ద్వేషం, కార్పణ్యం అవి కలిగించే గుణాలు. ఇతరుల బాధలు, ద్వేషాలు వారికి విందు చేస్తాయి. ఆ విషాదమే వారి కిష్టం. ప్రతిఒక్కరిలోనూ రాక్షస ప్రవృత్తి పొరలుతుంది. నరకంలో ప్రధానాధికారం ద్వేషానిది. ప్రతి ఒక్కరిలో ద్వేషం నిండి ఉంటుంది. ద్వేషమే ఆత్మను కాల్చి, దగ్ధం చేస్తుంది. ఆత్మ పతనం కావటం వారికి వికృతానందం కలిగిస్తుంది.

అక్కడ మరొక వర్గంవారున్నారు. వారిలో అనురాగం, మమత సమసిపోవు. వాటి ప్రభావం వల్ల వారు నరకంలోనైనా నిశ్చలంగా ఉంటారు. ఏమీ పట్టించుకోరు. నరకయాతనలు వీరు అనుభవించరు. కేవలం గమనిస్తుంటారు.

అలా ఇతరుల్ని గమనించడమూ ఒక విధమైన శిక్షే. అది చూచి తట్టుకోవడమూ కష్టమే. వారిపైన ఎన్ని కుటిల శక్తుల్ని ప్రయోగించడం జరిగినా వారు చలించరు. విధికి బందీలయి మానసికంగా శిక్షలు అనుభవిస్తారు. వారు చేసిన పాపాలు వారికి తెలుసు. పశ్చాత్తాపంతో వారికి నిష్కృతి లభిస్తుంది. అలాంటి వారంతా పుణ్యమూర్తులు. అయినా నరకంలో ఒక్క క్షణమైనా గడపక తప్పదు.

అశ్వపతి ఆత్మ సాహసించి ఆ భయంకర మృత్యులోయలోకి మరింతగా గాఢాంధ సాంద్రతలోకి చొరబడింది. ఆ చీకట్లు, అగడ్తలు అతి భయంకరంగా, జుగుప్సాకరంగా ఉన్నాయి. సృష్టి ఆరంభంలో అనాగరకంగా అలాగే ఉండేదేమో లోకం! చీకటి హృదయాన్ని అర్థం చేసుకొనడానికి చీకటిలో పరిశోధించక తప్పదు. నరకంలోకి వెళితేతప్ప నరకం అంటే ఏమిటో తెలియదు. అతని కోసం నరకలోకం తలుపులు తెరుచుకున్నాయి. భయంకర వేదనలు, రోదనలు స్వాగతం పలికాయి. అక్కడి బీభత్సం, భీకరత్వం గుండెను పట్టివేసింది. ఆ పైన రోదసి శీతలీకరించినట్లు మంచుగడ్డలా మారింది.

నరకపథాలు అంధకారమయాలు. మనస్సు అక్కడ హత్యాభిరతిని కలిగిస్తుంది. అనుక్షణం ఎవరినైనా హింసించి, హత్య చేయాలన్న కోరిక కలుగుతుంది. మృత్యువు అనేక సంకేతాలలో తెలుపిస్తుంది. కాలనాగువలె పడగవిప్పి బుసలుకొడుతుంది. క్రూర, భీకర, ఏకాంత, నరక పథాలలో నిస్సహాయంగా, నిర్మోహంగా తిరగసాగాడు. వైతరణి నదీ తీరాన రక్తదాహంతో తిరుగుతున్న తోడేళ్లను, రాబందులను చూచాడు. మనుషుల రక్తం రుచిమరిగిన పైశాచిక జాగిలాలు బాటలకు ఇరువైపుల పరుగులు పెడుతున్నాయి. ఆ మృత్యు లోయలన్నీ విధి సమరాంగణాలే. అక్కడ జీవులు నీడలుగా, ఛాయలుగా పోరాటం సాగిస్తున్నాయి.

నరకంపై తిరుగుబాటు చేసినవారు భయంకరమైన దెబ్బలకు గురి అవుతూ కుమిలిపోతున్నారు. ఆ గాయాలు మానవు. వెర్రితలలు వేసే మారణశక్తికి లోబడని జీవుల్ని కటకటాల్లో బంధిస్తున్నారు. వారంతా విషాదపు ఉచ్చుల్లో చిక్కుబడిపోతారు. లేదా, తమ అనుమానాల బురదలో కూరుకుపోతుంటారు. లేదా, నైరాశ్య పాపకూపాలలో మునిగి తేలుతుంటారు. ఆ కాలకూట విషాన్ని ఒక్కొక్క చుక్క బలవంతంగానైనా మింగకతప్పదు.

ఆశ, ఆనందం మచ్చుకైనాలేని ఆ నరకంలో అశ్వపతి యమ యాతనలు అనుభవించాడు. అయినా అతని ఆత్మ సత్యతేజస్సును కోల్పోలేదు. తనకు

కదిలే శక్తి లేకపోయినా అన్నివిధాల అశక్తుడైనా, చుట్టూవున్న వాతావరణం ప్రళయభీకరంగా ఉన్నా, తనను దుష్టశక్తులు బంధించి బాధించినా తన ఆత్మజ్యోతిని ఆరిపోకుండా కాపాడుకోగలిగాడు. అతని ఆత్మ భావరహిత, భారరహిత శూన్యంలో ప్రవేశించగలిగింది. అగడ్తలు, అఖాతాలు దాటింది. ఆలోచన, వివేకం నశించినా ఆత్మ చైతన్యంగానే ఉంది. ఆత్మతో చూడగలిగాడు. విషయాలు గ్రహించగలిగాడు. అనంత విశ్వంలో ఆత్మ ఒక అణువు. ఆత్మ పరిణామం చెందుతూ మహాశక్తిని ఆర్జించి బ్రహ్మాండాన్నే శాసించగలదు. అతని ఆత్మ గతచైతన్యం పొందగలిగింది. అతనికి సృష్టి నిరుపయోగంగా, ప్రతి పదార్థం నిరర్థకంగా తోచింది.

చైతన్య రహితంగా శూన్యంలోకి చేరిన ఆత్మ పూర్ణత్వం పొందుతుంది. అలా పూర్ణత్వం పొందిన ఆత్మకు అపజయం ఉండదు. అతని ఆత్మ అఖాతాల, అగాధాల, అంధకారాల ఆంతర్యాలు గ్రహించింది. రోదసి కూడా నిర్జీవం, నిరుపయోగం అనిపించింది. ఆ నిర్జీవ రోదసి మొదట ప్రపంచాన్ని ప్రసవించింది. పుట్టినప్పుడు ప్రపంచానికి జీవం లేదు. నిర్జీవంగా ఉన్నది సృష్టి. మనస్సు లయించినప్పుడు చైతన్యం ప్రభవిస్తుంది. వ్యగ్రమైనపుడు ఉన్న చైతన్యం కూడా నశిస్తుంది. నిర్జీవ ప్రపంచంలో చైతన్యం కదలాడింది. అంధకారంలో వెలుగు ప్రవేశించింది. మనిషిలో ప్రజ్ఞ మేల్కొన్నది.

అశ్వపతి సృష్టి రహస్యాన్ని తెలుసుకోగలిగాడు. క్రమంగా చీకట్లు విచ్చుకోసాగాయి. చైతన్య రాహిత్య భూమిక చివరి అంచుకు చేరుకున్నాడు. అక్కడ జీవం 'తన' ఆత్మ భావంతో తనకొరకై ఎదురుచూస్తున్నది. అంతా చైతన్య రహితంగా ఉంది. ఏది ఎందుకో తెలియకుండానే సృష్టించబడింది. అంతా అయోమయం. ప్రస్తుతం, భవిష్యత్తు అయోమయం. ఇప్పటికి అలాంటి ఖగోళాలు ఎన్ని పుట్టి నశించి ఉంటాయో లెక్కలేదు. జీవుల వలె గోళాలు, లోకాలు పుట్టి నశిస్తుంటాయి. విశ్వ సంకల్పం ఎప్పుడూ మగతలో ఉంటుంది. ప్రకృతి పరిణామ రహస్యం అతనికి తెలిసింది.

అశ్వపతి తనను ఒక వెలుగు వలయం చుట్టిందని, ఒక అదృశ్యహస్తం ఆదుకుందని గ్రహించగలిగాడు. తన ఆవేదనలను, వేదనలను ఆ వెలుగు క్షాళనం చేసింది. ఆ అదృశ్యహస్తం తనను ఊరడించి, ఉపశమనం కలిగించింది. తనను ఊరడించి బ్రహ్మానందం కలిగించింది. ఆ హస్తచాలనంలోనే అమృతం దొరికింది. పరమాత్మ స్పృహ కలిగింది. జీవన వలయంలో మృత్యువు పాత్ర నామమాత్రం.


'లయం'లోనే సృష్టికి అవసరమైన స్థితి ఉంది. దివ్యత్వాన్ని పొందడానికి భౌతిక సుఖాలను త్యాగం చేయక తప్పదు. స్వర్గం చేరడానికి నరకద్వారం దాటిపోక తప్పదు. అదే దగ్గర మార్గం.

★ ★ ★

అప్పుడు కనిపించింది అతీంద్రియ మాయామందిరం. ఆ మందిర కర్మాగారంలోనే జీవుల ఉత్పత్తి జరుగుతుంది. పూర్వగాథ లెన్నో నిరుపయోగంగా పడివున్నాయి. అక్కడ అజ్ఞానం కుప్పతెప్పలుగా పేరుకుపోయి ఉంది. అక్కడ చైతన్యంగా ఉన్నది ఆధ్యాత్మిక శ్వాస ఒక్కటే. ఆత్మకు మాత్రమే ప్రకృతి తన రహస్యాలను విప్పి చూపుతుంది. ఆత్మజ్ఞానికి సృష్టిరహస్యం యావత్తు తెలుస్తుంది. సత్యం ముందు అసత్యం వీగిపోతుంది. బాధలకు కారకాలయినవన్నీ కడకు నశించిపోతాయి. వాటి స్థానంలో క్రాంతి భావనలు నెలకొంటాయి.

మయబ్రహ్మ అదృశ్య లిపిలో విశ్వరచన సాగిస్తాడు. భౌతిక రూపాలన్నీ అతని అక్షరాలు. మేధస్సుతో ఆ భాషను అర్థం చేసుకోవడం కష్టం. ప్రజ్ఞ కావాలి. దానికి దివ్యత్వం తోడు నిలవాలి. చీకటి, అజ్ఞానం తొలగిపోయినప్పుడు మాత్రమే ప్రజ్ఞాభాస్కరుడు ఉదయిస్తాడు. బ్రహ్మ రచనా చమత్కృతి అణువణువునా ప్రకట మవుతుంది. ప్రగతి సాధించిన ప్రతి హృదయంపైన పరమాత్మ ముద్ర పడితీరు తుంది. పరబ్రహ్మ తత్వానికి ప్రభాతగీతం వినిపిస్తుంది. చైతన్య పూర్ణమైన ప్రతి జీవకణంలో పరమాత్మ ప్రవేశిస్తుంది. కాలంలో 'ప్రేమ' ఒక్కటే చెరగనిది, నశింపు కానిది. విశ్వ మహాగ్రంథంలో సచ్చిదానందమే చివరి అధ్యాయం. యోగసాధన ఒక్కటే పరమాత్మ మందిరానికి దారి.

మనిషి పవిత్రంగా జీవించినంత కాలం మృత్యుభయం ఉండదు. పరమాత్మను ఆరాధించే వారిపై మృత్యువునీడ పడదు. మాయామందిరం క్షణంలో మాయమవుతుంది. నరకం అదృశ్యమవుతుంది. అంధకారం క్షణంలో స్వప్నం వలె కరిగిపోతుంది. శూన్యంలో సృష్టి లయించినట్లు పరమాత్మలో ఆత్మ లయించి పోతుంది. కాలం ఏర్పరచిన గాయాలు ఆత్మను బాధించవు. పరమాత్మ సమక్షంలో భిన్నత్వానికి చోటులేదు. అంతా బ్రహ్మమే, అంతా పరబ్రహ్మమే. హృదయంలో ఒక చైతన్య కిరణం ప్రవేశించగానే అనాత్మభావన అంతరిస్తుంది. ఆత్మ చైతన్యవంత మవుతుంది.


దివ్యజీవనం

43. గంధర్వలోకం

***మృత్యులోయ** నుండి బయటకు వచ్చిన అశ్వపతికి తిరిగి ప్రాణం పోసుకున్నట్లు, మరొక జన్మ ఎత్తినట్లు అనిపించింది. అమృతపానం చేసినంత ఆనందంగా ఉంది. ఎటుచూచినా అందాలు, ఆహ్లాదాలు. మనస్సు ఉల్లాస భరితమైంది. అన్నీ కాంతిసీమలు. అంతటా ప్రేమ, తేజస్సు .... ప్రకృతి ఆనందంతో పులకిస్తున్నది. కొండలు, కోనలు, నదులు, నదాలు స్వాగతం చెప్పాయి.*

సంకల్పమాత్రంచే నందనవన విహారం, గంధర్వగానాలు. ఎటుచూచినా అప్సరసలు, అపురూప సౌందర్యాలు, యవ్వన విలాసాలు, ప్రేమలు, ఆలింగనాలు భోగాలు ... అందరూ సువర్ణ శరీరులు. నరకాన్ని క్షణంలో మరచిపోగలిగాడు. ఇది గంధర్వలోకం. అతని శరీరం, మనస్సు, ఆత్మ పులకించాయి. శరీరానికి వినూత్న కాంతి ఏర్పడ్డది. మనస్సుకు కొత్త తేజస్సు, ఆత్మకు ఓజస్సు సమకూరాయి. భౌతిక స్వభావం పోయి దివ్యస్వభావం ఏర్పడ్డది. అదే దివ్యానందం. ఆ సుఖాలను, పరిసరాలను వదులుకోడానికి జీవి ఇష్టపడదు. అందుకే అవి స్వర్గసుఖాలు.

అశ్వపతి చుట్టూ కాంతివలయం ఏర్పడ్డది. ఆ కాంతికి ఆనందం తోడైంది. అది అవ్యక్త పరమానందం. ఎటుచూచినా సువర్ణదీప్తులు, మందస్మితాలు. ఆనందం స్వేచ్ఛగా విహరించసాగింది. అమృతపానం చేసిన చందంగా అశ్వపతి కళ్లు మత్తుగా ఉన్నాయి. ఆయనలో అపూర్వ తేజస్సు, అనూహ్యమైన దివ్యత్వం, బంగారు వెలుగు. ఆ ఆనందాలు దేవతలకే పరిమితం. దైవశాసనంతో విచ్చుకునే పారవశ్యాలు. ఆ ఆనందం సహజమైనది, సర్వ స్వతంత్రమైనది. అన్ని లోకాలకు సరిపడేంత ఆనందం ఇక్కడ ఉంది. జీవరాశి మొత్తానికి అందించినా ఇక్కడి ఆనందం తరిగిపోదు. విధి, కర్మ అనేవి ఇక్కడ సుఖాలను చలింపచేయవు. ఇక్కడ భోగాలపై కాలం నీడ పడదు. ఏ విపత్కర పరిస్థితులు దానిని మొక్కపోనీయవు. ఇక్కడ

ఆనందాలకు, అనుభూతులకు కట్టడులు లేవు. ఎవరికీ జరా, మృత్యు, భయా లుండవు. బాధ లుండవు. ప్రమాదాలకు లోనయ్యే అవసరం ఉండదు.

అనురాగాలకు, ఆత్మీయతలకు కరకట్ట లుండవు. అందరి కోరికలు అన్నీ తీరిన తృప్తి. అంతా అద్భుతం, ఆనందం, వెలుగు. వెన్నెల ప్రపంచంలో ఉన్నతంగా జీవించినవారు ఇక్కడ సదానందజీవులుగా మారి, సుఖిస్తారు. విశ్వప్రేమను పొంది విశ్వాత్మలవుతారు. ఇక్కడి సచ్చిదానంద లహరులు అనింద్యాలు, అచంచలాలు. ఇక్కడి సీమలన్నీ వెన్నెల వెలుగుల తావులు, గాలులు మధుర మహదానందాలను పంచుతుంటాయి. వాతావరణం నిత్య సురభిలశోభితం. ఇక్కడ నెలకొన్నది నిశ్శబ్ద ప్రశాంత మాధుర్యం. ఇక్కడి గాలులకు దివ్యానుభూతిని కలిగించే గుణం ఉంది. ఆత్మను తాకి పరవశింపచేయగల మహిమ ఉంది. ఆ పారవశ్యపు పరిష్వంగం ఆపాత మధురంగా, మమేకంగా ఉంటుంది. ప్రతిక్షణం రసానుభూతి కలుగు తుంది, తన్మయత్వం కలుగుతుంది.

అశ్వపతి ఆ ప్రశాంతిలో, ప్రజ్ఞావిభవంతో ముందుకుసాగి, ఒక ప్రమోద సీమను చేరుకున్నాడు. తాంత్రిక దర్పణంలో చూచినపుడు ఆత్మ స్వతంత్రంగా విహరిస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే అతని ఆత్మ ఆనందసీమలలో విహరించి స్వతంత్ర ప్రతిపత్తిని పొందింది. ఇప్పుడు అతని చుట్టూ ఒక కాంతి వలయం ఏర్పడ్డది. అనేక శక్తులు సంక్షిప్త రూపంలో అతనికి చేరసాగాయి. ఆనందగిరులు, ప్రవిమలసీమల దర్శనమైంది. జలపాతాలు సైతం అమృతాన్ని అందిస్తున్నాయి. వనాంతాలలో మహాశాంతి నెలకొన్నది. అతని చూపుకు ఎన్నో సుందర నగరాలు కనిపించసాగాయి. అవి గంధర్వుల నివాసాలు.

దివ్యరోదసీ సీమల ఆవల నుండి మృదు మధుర సంగీతాలు మంద్రంగా వినిపిస్తున్నాయి. ఏవో అదృశ్య హస్తాలు మీటుతున్న వీణాస్వనాలు ఆహ్లాదంగా వినిపించసాగాయి. నీలివెన్నెల పరచుకున్న స్వర్గసీమలో అనురాగం పరవళ్లు త్రొక్కుతోంది. ఆ సంగీత సౌరభాలు అమరం. ఆ శృంగార సామ్రాజ్యంలో ఆనందశిఖరాలు దూరంగా దర్శనమిచ్చాయి. సంధ్యారుణిమలో అవి కాలిపోతున్న భ్రాంతి కలిగింది.

అంతటా నవ నవోన్మేష నైర్మల్యం ఆవిష్కరించినట్లు, ఆనంద రోచిస్సులతో నేల నిండినట్లు, మందహాసాల మాధుర్యాలతో తావులు పులకించినట్లు అనుభూతి కలిగింది. సంగీత రుతాలు నదీనదాలను దాటి నీలాకాశాన్ని నింపివేశాయి. ఆ పైన అరణ్యసీమల అందాలు. ఆ నిశ్శబ్దంలో, ప్రశాంతిలో, ఆనంద రసార్ణవంలో

ఆత్మ సులభంగా అతీంద్రియ శిఖరాలకు చేరుతుంది. తేజస్వినులైన దేవతలు నివశించే ఆ స్వర్గం అమృతోపమానమైన అనురాగంతో అతనిని ఆహ్వానించింది. అక్కడివన్నీ కాలానికి కట్టుబడని పరిపూర్ణ విషయాలు. అక్కడి సౌందర్యం సృష్టికి మూలభూతమైన సౌందర్యం. అక్కడి ప్రశాంతి మహత్తర పవిత్రతతో పునీతమైంది. అక్కడ ప్రేమతో బంగారు కలల్ని పండించుకోవచ్చు. మనోన్మీలనమే అక్కడి శక్తికి ఆనవాలు. కామనలు రగిలి రగిలి జ్వాలామాలికలుగా మారతాయి. ప్రతి అనుభూతి దివ్యానుభూతిగా మారుతుంది. తారాపథాలలో స్వప్నాలు పరుగులు తీస్తాయి. సామాన్య విషయాలే అక్కడ మాన్య విషయాలవుతాయి. దివ్యత్వం పొందిన ఆత్మ అకస్మాత్తుగా మహత్తులు సంపాదిస్తుంది. బాధలన్నీ సుఖాలుగా మారిపోతాయి. ఇక్కడ ఎవరికీ నరకం గురించిన ఆలోచన రాదు.

మానవ జీవితంలోని మహదాశయాలు ఇక్కడ సులభంగా నెరవేరతాయి. తీరని కోర్కిలన్నీ తీర్చుకున్న ఆత్మశరీరులు మధుపానంతో మత్తెక్కినవారి వలె సోలిపోతుంటారు. రగిలే ఊహలు సత్యాలవుతాయి. వేదనలన్నీ కాలిపోగా ఆత్మ మృత్యురాహిత్య స్థితికి చేరుతుంది. అణగిపోయిన ఆలోచనలు పైకి పొంగుకొస్తాయి. వివేకం పరిపూర్ణంగా వికసించేది స్వర్గంలోనే. హృదయం ప్రేమతో నిండిపోయేది స్వర్గంలోనే. మాధుర్యాలకు పరిమితి ఉండదు. ఆ మహత్వకాంక్షకు, ఆకర్షణకు ఏదీ అడ్డుకాదు. స్థితప్రజ్ఞ అన్ని జ్ఞాన కవాటాలను తెరుస్తుంది.

దీర్ఘకాలంగా వేదనలకు అలవాటుపడిన ఆత్మ ఇక్కడ ప్రశాంతిని అనుభవిస్తుంది. నిర్విచారంగా, మహదానందంగా గడిచేకాలం గతంలో తగిలిన గాయాలను మాన్చుతుంది. ఇక్కడి దివ్యశక్తుల్ని ఆత్మ అలవోకగా పొందుతుంది. కనుక ఏ బాధలు, భయాలు, విచారాలు జీవుని దరికి రావు. మనం వివేకంతో చేరలేని రసరమ్యలోకాలవి. వాటి సౌందర్యం తరగదు. పరిమళాలు క్షీణించవు. అక్కడ అందరికీ దివ్యదృష్టి ఉంటుంది. సంగీతం మనస్సుకు మత్తెక్కిస్తుంది. హృదయం విశ్వమంత విశాలం అవుతుంది. అశ్వపతి చెవులకు నిగూఢ మార్మిక నాదాలు వినిపించసాగాయి.

కనిపించని సీమల నుండి నాదాలు వినిపించాయి. అవి మాటలకు అందని సుందర భావరాగాలు. ఆ భావాలను భాష వ్యక్తం చేయలేదు. ఆలోచనలు సంకల్పాలను సృష్టించగలవు. అశ్వపతి తన ప్రజ్ఞను ఈశ్వరప్రజ్ఞతో జతపరచి ఆనంద శిఖరాలను చేరుకున్నాడు. అతని శరీరం ఆకాశతత్వంగా మారింది. కాంతిశరీరం ఏర్పడ్డది. స్వర్లోకద్వారాలు కాంతిప్రవాహాలు దాటిన తాను నిలబడిన

చోట దివ్య కాంతు లీనుతున్నది. అక్కడ తను కోరనిశక్తి ఒకటి ప్రాప్తించింది. భౌతిక, మానసిక హద్దుల్ని దాని సాయంతో దాటిపోవచ్చు. ఆ శక్తి దివ్యత్వాన్ని మానవ పరిధిలోకి తీసుకురాగలదు. అయినా దివ్యత్వపు వన్నె, వాసి తగ్గదు. తన దివ్యత్వం తగ్గదు. అది అనంతం. ఎందరికి పంచినా తరగని దివ్యామృతం. అక్కడ సౌందర్యం, అనురాగం, ప్రేమ, కరుణ – ఏవీ తరిగిపోవు. ఎవరూ తమ విశిష్టతను కోల్పోరు. శరీరం, ఆత్మ సచ్చిదానందంలో కలిసిపోయి ఒక్కటవుతాయి. సాకార, నిరాకారాల మధ్య అంతరం తరిగి పోతుంది.

అక్కడ ప్రతి దృశ్యం నుండి, ప్రతి శబ్దం నుండి అమరత్వాన్ని అందుకోవచ్చు. ప్రజ్ఞతో పరమాత్మను చేరవచ్చు. అలౌకిక బ్రహ్మానందం నిత్యభోజ్య మవుతుంది. ఆంతర్యం ఆత్మకు అదనపు శక్తి నిస్తుంది. భౌతికతలో దివ్యత్వం సుస్థిరమవు తుంది. అమరలోకవాసులకు, తనకు భేదం లేదు. ఆ లోకంలో ప్రవేశించగానే స్వర్గపౌరసత్వం లభించినట్లయింది. తనకు దేవతల హోదా లభించింది. అక్కడి దివ్యసీమలలో తనకు సమాన వాటా, అధికారం ఏర్పడింది.

అసంభవం అనుకున్న పరమాత్మ స్పందన తనలో కలిగింది. అదే తనను పరమాత్మ సన్నిధికి చేర్చగల రహస్యం. తనకు ఈశ్వరానుభూతి కలిగింది. నరనరాన దివ్యత్వం ప్రసరించసాగింది. ఇప్పుడు తాను పరమాత్మకు సరైన ప్రతినిధి. తనలో ఆంతర్జ్యోతి వెలిగినపుడు, తన సంకల్పాలపై ఆ వెలుగు సోకినపుడు బ్రహ్మానందం పొందగలిగాడు. పరమాత్మ స్పర్శ తన హృదయానికి సోకి పరవశం కలిగించింది. తన అనుభూతి దివ్యానుభూతి అయింది. అందులో విశ్వలయ ఉంది. సత్యసందేశాలు సంకేతాలుగా అందసాగాయి. విశ్వపురుషుని కరుణ తనను ప్రేమరూపంలో చేరింది. ఆ 'విశ్వప్రేమ' భూలోకంలోని తన జీవికను అద్భుతంగా మార్చుతుంది. జీవితం ఆనందనిలయ మవుతుంది. మానవ జీవితానికి ఆ మాత్రం చిరుఆనందం చాలు.

★ ★ ★

అవ్యక్త బ్రహ్మానందంలోని ఒక బిందువు ఒక అంశ మనలో ప్రవేశించగానే మనలోని ప్రతి అణువు మహదానందంతో పులకించి, పునీత మవుతుంది. జీవుడు అగ్నులలో కాలి పవిత్రుడై అమృతసేవనానికి అర్హుడవుతాడు. దివ్యత్వం భౌతిక శరీరాన్ని సైతం పవిత్రం చేస్తుంది, కర్మరహితం చేస్తుంది. అప్పుడు ఆత్మశక్తి దివ్యచేతనగా మారుతుంది. అమరత్వం కాలాన్ని దాటి వచ్చి జీవుని వరిస్తుంది.

44. మనోమయ లోకాలు

స్వర్గలోకాలలో కిన్నెర, కింపురుష, దేవ, గంధర్వులతో సహజీవనం. తరగని సుఖాలు. వారంతా నిత్యయౌవనులు. భూలోకంలో ఉన్నంతకాలం పరం అనీ, పరబ్రహ్మ మనీ తపస్సు చేసి, స్వర్గాన్ని చేరి సుఖాలు మరిగి, గతం మరచిపోతుంటారు. అదీ ఒక మాయలోకమే. స్వర్గసుఖాలు మాయ చేస్తాయి. అశ్వపతి ఇంకా ముందుకు వెళ్లి మనోమయ లోకాలు చేరుకున్నాడు. అక్కడ ఆత్మస్థైర్యం ఏర్పడ్డది. ప్రజ్ఞ ప్రకృతి ధర్మాలను దాటిపోగలిగింది. ప్రజ్ఞ ముందు ప్రపంచంలోని విజ్ఞానం ఏదీ పనికి రాదు. ఆత్మకు శక్తులు, జీవునకు సిద్ధులు ఏర్పడతాయి. ఎవరూ ఆ సిద్ధుల్ని తమ స్వార్థానికి ఉపయోగించరు. అలా ఉపయోగిస్తే అహంకారం పెరుగుతుంది. అహంకారం పెరిగినప్పుడు పైకి పోవడం జరగదు.

*మనోమయ లోకాలు మూడు శ్రేణులు : ఒకటి **భావనామండలం.** మనిషి తన బుద్ధిని ప్రతిభగా పదునుపెట్టుకునేది ఇక్కడనే. వివేకంలో వేల సూక్ష్మ యంత్రాలు పనిచేస్తాయి. ఏదీ సంప్రదాయాన్ని దాటిపోదు, స్వతంత్రించడం జరగదు. రెండవది **ప్రజ్ఞామండలం.** ఇక్కడ అసలు దివ్యజ్ఞానం లభిస్తుంది. స్వతంత్రం కలుగుతుంది. సంప్రదాయాల్ని ధిక్కరించడం ప్రజ్ఞా విశేషం. మూడవది **జ్ఞానమండలం.** ఇక్కడ యోగి ప్రవక్తగా మారతాడు. సత్యాన్ని దర్శించి ఆత్మయోగి అవుతాడు. తాను చెప్పేదే సత్యం. ఏ ఇతర ప్రమాణాలు అతనికి అవసరం ఉండదు. తన దర్శనమే తనకు ప్రామాణికం. మన ప్రవక్తలు, మహర్షులు, తాత్వికులు ఈ శ్రేణిలోని వారు.*

మన సర్వస్వం అక్కడ వదలి ముందుకు సాగాలి. జగత్తు లయించి ఆత్మ పరమాత్మను చేరేవరకు ఒంటరి ప్రయాణమే. గమ్యం చేరేవరకు ప్రయాణం, ప్రగతి ఆగదు. గమ్యం కనిపించదు. అయినా ఆకర్షణ తగ్గదు. దేవతలు అనేక అవరోధాలు కల్పిస్తారు. వాటిని దాటుకుంటూ ముందుకుపోవాలి. ఆత్మ అగ్నిశిఖ

వలె పైకి పోతుంది. ఒక జీవితకాలంలో భూమిపైన వేనవేల సుఖాలు అనుభవిస్తాం. కొంత పవిత్రతను సంపాదించుకుంటాం. అవి, ఇవి అన్నీ సచ్చిదానంద సాగర తరంగాలలో తుడిచిపెట్టుకుపోతాయి. అన్నీ బ్రహ్మానందంలో కరిగిపోతాయి. ఆత్మ కొంత దివ్యత్వాన్ని ఆర్జించుకుంటుంది. ఆ దివ్యత్వం ఆధారంగా పరమాత్మిక మహత్తు కొంత లభిస్తుంది. ఆ కాస్త మహత్తు జీవునికి గొప్ప సంతృప్తి నిస్తుంది. దివ్య స్పర్శతో మానవ జీవితం పరవశిస్తుంది. తనకున్న పరిధిలోనే మనిషి అనంతత్వాన్ని అనుభవించగలడు. కాలం కరిగిపోతున్నా కాలాతీతమైన ఆనందానికై శ్రమిస్తాడు. బ్రహ్మానందం కొంత పొందినా గొప్ప తృప్తి లభిస్తుంది.

అమృతత్వంలోకి మనిషి పయనిస్తున్న కొలదీ దివ్యజీవనం పెరుగుతుంది, అన్వేషణ ఎక్కువవుతుంది. కానీ అవేవీ నిలవవు. స్వర్గమార్గంలో పొందిన అను భూతులు కడవరకు వెంట రావు. మహత్తులు మిగలవు. కాని జీవుడు ఆ సౌందర్యాలకు పరవశిస్తాడు. ఆ మాధుర్యాలను మహద్భాగ్యంగా స్వీకరిస్తాడు. తృప్తి కలిగినప్పుడు ఇంకా పైకి వెళ్లాలన్న కోరిక ఉండదు. తీరిన కోరికల మధుర స్మృతులు మనిషికి ఆనందం కలిగించి తృప్తినిస్తాయి. కాని ముందుకు సాగినకొద్దీ ఆత్మ గతాన్ని, సుఖాలను విస్మరిస్తుంది. ఆత్మ సకలసృష్టిని తనదిగా చేసుకోవాలను కుంటుంది. స్మృతులు తీయగా, హాయిగా ఉంటాయి. కాని ఏ స్మృతులు ఎక్కువ కాలం నిలవవు. స్వప్నాలవలె గతంలోకి జారిపోతాయి. స్మృతులు దాటిన తర్వాత జీవునికి మిగిలేది నిశ్చలత్వం.

ఒక్క ఆత్మ మాత్రమే ఈ లోకాలన్నీ చుట్టిరాగలదు. అదే తేజస్సుగా మారగలదు. అదృశ్య, అగోచర సీమలను ఆత్మ దాటిపోగలదు. మనోభూమికలలో తేజస్సుగా మారి ముందుకు సాగి పోగలదు. అశ్వపతి ఆ ధావళ్యసీమల్ని దాటాడు. అక్కడ రాత్రి, పగలు వేరువేరుగా లేవు. రెండూ కలగలిసిపోయాయి. చీకటి వెలుగులు కలిసి పరచుకున్న బాటలు. ఆలోచన పరిధి దాటి ఆత్మ వేరయ్యే చోటు అది. అస్థిరంగా ఉన్నవన్నీ అక్కడ ఏకమై సుస్థిరమవుతాయి. జ్ఞానం అజ్ఞానంతో స్నేహం చేస్తుంది. అనుమానాలు, ఆలోచనలు ఏర్పడి అస్థిరత ఏర్పడుతుంది.

మనిషికి భావనాబలం తగ్గినప్పుడు లక్ష్యం చెదిరిపోతుంది. నిరాశ ఆవహిస్తుంది. వైఫల్యం కనుచూపు మేరలో కనిపిస్తుంది. మేధ తన ప్రత్యేకతను కోల్పోతుంది. ఈ లోకంలో మనిషి మనుగడ వంటిదే పైలోకం లోని జీవుని మనుగడ. స్థిరత్వం ఉండదు. లక్ష్యం ఉండదు. మన ఊహల వంటివే అక్కడ

జీవుని సంకల్పాలు. నేల లోపల ఏముందో, ఆకాశం ఆవల ఏముందో జీవికి తెలియదు. ఆలోచనకు అందదు. ఏదో ఉన్నదనే ఆశ మిగులుతుంది. దానిని గురించి మనస్సు తీవ్రంగా ఆలోచించదు.

ఇది ప్రగతి బాటలో మన తొలి అనుభవం. మొదటిది అనుభూతి. భౌతిక బంధాలు వదిలించుకుని ఆత్మ కొంత చైతన్యం పొందుతుంది. ఆత్మ ఎప్పుడూ పరలోకాల గురించి, పర రూపాల గురించి, సంభవాల గురించి తలపోస్తుంది. ఇక్కడ ఉన్నంతకాలం ఆ లోకం పోకడ, అలోకరీతి ఆత్మకు అర్థం కాదు. ఆత్మ సైతం తన పరిధిని దాటిపోదు. జీవునితో కలిసి ప్రపంచంలోని సుఖదుఃఖాలు అనుభవిస్తుంది. ఒక పట్టాన ఆత్మ స్వతంత్రించదు. ఎల్లప్పుడు సంప్రదాయానికి, మనస్సుకు లోబడి ఉంటుంది.

ఆత్మను తానే నడుపుతున్నానన్న భ్రమలో ఉన్న మనస్సు బాధలను, కష్టాలను ఆహ్వానిస్తుంది. సుఖాన్వేషణలో కష్టాలను ఎదుర్కొనడం మనస్సు లక్షణం. సత్యాన్ని తెలుసుకోవాలని మనస్సు శతధా ప్రయత్నించి ఓడిపోతుంది. ఆ శక్తి తనకు లేదని మనస్సు గ్రహించదు. అది ప్రకృతి శక్తి అని భ్రమిస్తుంది గాని ఆత్మకు ప్రాధాన్యత నివ్వదు. మనస్సు చీకటిగదులలో సజీవ చిత్రాలు రచించు కుంటుంది. అన్నీ ఒక క్రమంగా ఏర్పడడంవల్ల ఆ ప్రతిభ తనదే ననుకుంటుంది మనస్సు. ఆ మానసచిత్రాలలో శాశ్వతత్వం ఉండదు. 'సత్యస్ఫూర్తి' ఉండదు. మనస్సు ఎప్పుడూ తాత్కాలిక ప్రయోజనాలనే ఆశిస్తుంది.

మనస్సు భౌతిక శరీరానికి సంబంధించింది కనుక ప్రాపంచిక పరిధుల లోపలనే తిరుగుతుంది. శరీరానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తుంది. శరీరానికి విధేయంగా ప్రవర్తిస్తూ అందుకు అనుకూలంగా ఆలోచిస్తూ విషయవాంఛలు, లాలసలు ప్రేరేపిస్తుంది. మనస్సు అందించే సుఖాలు, భోగాలు, సంపదలు అన్నీ ఈ లోకానికి పరిమితమైనవే. మొదటినుండి వితండంగా ఆలోచించడానికి మనస్సు అలవాటుపడ్డది. సవ్యంగా ఆలోచించదు. నిజాన్ని కప్పిపుచ్చడం దానికి అలవాటు. తన అజ్ఞానాన్ని జ్ఞానంగా ప్రచారం చేస్తుంది. తన భావనను పటిష్టం చేసుకో ప్రయత్నించదు. తను పన్నిన ఉచ్చుల్లో తనే చిక్కుపడిపోతుంది.

మసక వెలుగులో తన నీడను చూచి ఆత్మ అని భ్రమిస్తుంది. జీవుడు పూర్తిగా మనస్సుపైన ఆధారపడతాడు ... మహారాజు సేవకులపై ఆధారపడినట్లు, ప్రబుద్ధులైన మంత్రుల సలహా పాటించినట్లు, సాక్ష్యం లేకపోయినా న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు, రాగప్రస్థారం తెలియని గాయకునివలె, ప్రాథమిక పరిజ్ఞానం

లేని కళాకారుని వలె జీవుడు బ్రతుకుతాడు. మనస్సుకు జీవుడు అనుకూలంగా బ్రతకడం నేర్చాడు.

సృష్టిలో తన పాత్ర మహోత్కృష్టమైందని మనిషి గ్రహించడం లేదు. తనకు తెలిసిందే జ్ఞానమని విర్రవీగుతాడు. ఉన్నదానితో తృప్తిపడతాడు. ఈ ప్రపంచంలో జీవులందరి కంటే తాను భిన్నమని చెప్పుకుంటాడు. తానే సృష్టికి కర్త ననుకుంటాడు. తన ప్రాథమిక స్థితిని దాటడం లేదు. జ్ఞానం వైపు ఎదగాలన్న బుద్ధిని పెంచు కోవడం లేదు. లోకంలోని అల్పత్వాన్ని అధిగమించడం మనిషి లక్ష్యం. ఆధ్యాత్మికంగా ఎదగాలి. యోగాగ్నిలో కాలిపోతే తప్ప జ్ఞానం లభించదు. తాను ఒక చిన్న క్రిమి. పరిణామంలో తాను భగవంతుని స్థాయికి చేరాలి. మనిషిగా బ్రతుకుతూనే దివ్యత్వం పొందే అవకాశం మనిషికే ఉంది. అశాశ్వత స్థితి నుండి శాశ్వతమైన స్థితిని సాధించగలది మానవుడే.

చీకటిలోకం పైన అప్పుడప్పుడు దివ్యమైన వెలుగులు ప్రసరిస్తుంటాయి. ఆ మెరుపులు ఎంతో దివ్యజ్ఞానాన్ని లోకంపైన కురిపిస్తాయి. వాటిని అందుకోగలది మానవుడే! జ్ఞానభాస్కరుని కాంతిలో వెలుగులు స్వంతం చేసుకోవాలి. ఆ జ్ఞాన కిరణాలు మన మేధస్సుకు పదునుపెడతాయి. విశ్వశక్తి మన గుమ్మం ముందు నిలబడినా గుర్తించం, స్వాగతించం. మన అనుమానాలు, ఆలోచనలు రెక్కలు విప్పుకుని జీవుని అపమార్గం పట్టిస్తాయి.

ఎప్పుడో మన జీవితంలో ఒక మార్మికస్ఫూర్తి కలుగుతుంది. ఒక్కసారిగా ప్రకృతిశక్తులు బయటపడతాయి. భౌతికత నుండి అద్భుతశక్తులు ఉద్గమిస్తాయి. మన ప్రాపంచికతకు అవే మెరుగులు పెడతాయి. మనస్సు అజ్ఞానం సరిహద్దులు దాటిపోదు.

కార్యకారణసూత్రంపై లోకం ఏర్పడినట్లు, జీవుల జననమరణాలు ఏర్పడుతున్నట్లు అనిపిస్తుంది. రూపాలు నశించి, మరల ఏర్పడడం జరుగుతుంది. మనిషి మేధ అలా తన ఆధిక్యత నిరూపించుకుంటుంది. కాని, పరమాత్మ సంకల్ప ఫలంగా భూమికి దిగివచ్చిన జీవం భౌతికరూపాలను ధరిస్తుంది. అణువు, కృణువు పరమాత్మకు రెండు నేత్రాలు. సూక్ష్మలోకానికి భిన్నంగా భౌతికప్రపంచం, స్థూలశరీరానికి భిన్నంగా సూక్ష్మశరీరం రూపొందించింది పరమాత్మ. అలా అవ్యక్త ప్రపంచానికి వ్యక్తప్రపంచానికి అనుసంధానం జరిగింది.

ఇంద్రియాతీతమైనది ఇంద్రియగ్రాహ్యమైంది. అనుభూతికి అందేది అనుభవానికీ అందుతున్నది. ప్రతివస్తువుకు వినిమయం ఏర్పడ్డది. గుర్తింపుకోసం,

సౌలభ్యంకోసం ఒక పేరు అవసరమైంది. రూపం వెనుక భావం ఏర్పడ్డది. సృష్టి అణుసూత్రానికి కట్టుబడింది. వివేకానికి తగిన రూపం ఏర్పడ్డది. అదే విశ్వం, అదే విశ్వరూపం.

అంతకు మించిన మహత్తర కార్యం మరొకటి జరిగింది. రోదసి నుండి ప్రసరించిన ప్రాణం చెట్టుచేమలలో, జంతువులలో, పక్షులలో, క్రిమికీటకాలలో చొరబడి, చలనం కలిగించి, ప్రాణం ప్రసాదించింది. మనిషిలోని ప్రాణం వివేకంగా పరిణామం చెందింది. దేహదారుఢ్యానికి సూర్యరశ్మి అవసరమైంది. వెలుగు సోకిన ప్రతిపదార్థంలోనూ జీవస్పందన ఏర్పడ్డది. మనస్సు పరిసరాలను గూర్చి ఆలోచించ సాగింది. మనిషికి పరంగురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాస కలిగింది. త్రికోణాలు, చతుష్కోణాలతో ఆకృతులు ఏర్పడ్డాయి. సంకేతాలు ఆధారంగా అగోచరశక్తితో సృష్టిరహస్యాలు చదవ వీలుకలిగింది.

చైతన్యం నిండిన ప్రకృతిలో పులకింత తన ప్రతినిధిగా మానవుని ఎంపిక చేసి వివేకం, విజ్ఞానం, చేతన, స్పందన, అనుభూతి మనిషికి వరాలుగా అనుగ్రహించింది. అప్పటికింకా అజ్ఞానం నిద్రలోనే ఉంది. ప్రజ్ఞ, వివేకం మనిషికి పూర్తిగా అలవడని కాలం అది.

తర్కం వైయక్తికంగా తన ప్రతిభకు ఆత్మను ఆధారం చేసుకుంది. విశ్వ రహస్యాలు తెలుసుకొనడానికి ప్రజ్ఞ అవసరం. విజ్ఞానానికి సత్యం, విచికిత్స ఆధారం. తర్కంవల్ల సత్యం మరణించి అసత్యం పీఠ మెక్కింది. అసత్యం వల్ల అవగాహన దెబ్బ తిన్నది. భగవత్ కార్యాన్ని మనస్సుకు బదులు యంత్రం చేయ సాగింది. జీవితం యాంత్రికమై పోయింది.

ఎవరికీ ఆత్మ కనిపించదు. సత్యం కనిపించదు. సత్యస్వరూపాన్ని దర్శించగల అంతర్దృష్టి, జ్ఞాననేత్రం ఏర్పడలేదు. మనిషి పైపై మెరుగులకే మురిసిపోతున్నాడు. మెరుపుల్ని వెలుగులుగా భ్రమిస్తున్నాడు. అజ్ఞాత శిఖరాల నుండి ఎప్పుడో ప్రజ్ఞ ఒక కెరటంలా వస్తుంది. ఒక కాంతి కనిపిస్తుంది. ఆ కాంతిలో పరంజ్యోతిని, తేజోశిఖరాలను దర్శించవీలుంది. ఆ వెలుగువాడలో ప్రవేశిస్తే పరమాత్మను దర్శించ వచ్చు.

మనిషి భావనతో మురిసిపోతాడు. అదే యదార్థం అని భ్రమిస్తాడు. కల్పనలో అనేక చిత్రాలను రచిస్తాడు. ఎన్నడూ చూడని సౌందర్యాలను కల్పించు కుంటాడు. అదే స్వర్గమని, సుందరమని మురిసిపోతాడు. మార్మిక మహాసౌధం

లోని అలంకరణ లోపంవల్ల మనిషి ఆకర్షితుడు కాడు. కాల్పనిక జగత్తు అతి సుందరంగా ఉంటుంది. అవాస్తవ ప్రపంచంలో వెలుగు ప్రసరించదు.

లోకంలో దివ్యత్వం కాస్త ప్రవేశించినా మార్మికసత్యాలు పూర్తిగా బయట పడవు. ఆత్మ సైతం కల్పనలతో, కథలతో మురిసిపోతుంది. అసలైన దివ్యరుచుల్ని ఆత్మ మరచిపోతుంది. అసంపూర్ణమైన మాధుర్యాలతో తృప్తిపడుతుంది. మనస్సు పూర్తిగా అటువైపు తిరిగి ఆలోచించదు. వివేకాన్ని సరిగా ఉపయోగించుకోదు. ప్రాపంచిక సంఘటనలనే మనస్సు వాస్తవసత్యాలుగా నమ్మి ఆత్మను మభ్య పెడుతుంది.

సత్యలోకాలనుండి జారిపడిన ఆలోచనలు మనిషిలో ప్రవేశించగానే ప్రాపంచిక ప్రయోజనాలకు పరిమితమైపోతాయి. అవి గుంపులుగా హృదయంలో చొరబడినా దివ్యత్వాన్ని నిలుపుకునేవి కొన్ని మాత్రమే. అవి కొన్ని మన కంటి దీపాలై మనస్సును రంజింపచేస్తాయి. అవే మన పరిశ్రమలు, స్వప్నాలు, కల్పనలు. వాటితోనే లోకాన్ని, అందాలను, ఆత్మను అనుభవిస్తాం. అలా ఒక దివ్యబీజం మనిషిలో నెలకొంటుంది.

ఒక్కసారి దివ్యతేజోకిరణం మనస్సులో జొరబడితే ఏదో తెలుసుకోవాలన్న కోరిక కలిగి, జిజ్ఞాస పొటమరిస్తుంది. అది ఆరాటంగా మారితే చాలు సత్యాన్వే షణకు బాటలు ఏర్పడతాయి. ఉన్నత విషయాలు తెలుసుకోవడమే సత్యాన్వేషణ. సూర్యోదయ సమయంలో ప్రసరించే తొలివెలుగు కిరణాల ద్వారా మనకు సత్యస్ఫూర్తి కలుగుతుంది. సత్యం మన ఆలోచనల్లో చోటుచేసుకుంటుంది. అవి తొలినాళ్లలో చాపల్యంగా అనిపిస్తాయి. మనస్సు దానికి సహకరిస్తుంది. ఆత్మ మార్గాన్ని సుగమం చేస్తుంది.

పసిపిల్లలు కట్టుకునే గుజ్జనగూళ్ల వలె, మన ఆలోచనలు నిర్మించే మార్మిక సౌధాలు కుప్పకూలిపోతుంటాయి. విశ్వశిల్పి మనిషి నిర్మాణంలో ప్రవేశపెట్టిన మహాద్భుతయంత్రం మనస్సు. భగవంతుడు మనిషిలో ఇష్టపడేది మనస్సు. మనస్సు ద్వారా మనిషి అజ్ఞానాన్ని గుర్తించాలని భగవంతుని సంకల్పం. ఆలోచనలు శూన్యం నుండి ఏర్పడతాయి. మనస్సు తాను మేల్కొని, తనలోపల నిద్రిస్తున్న జ్ఞానాన్ని నిద్ర లేపాలి. జ్ఞానం మన ముంగిటకు పిలవకుండా రాదు. మనం సభక్తికంగా, ప్రేమగా, గౌరవంగా ఆహ్వానించాలి. అది మన ప్రపంచానికి వెలుపల ఉంటుంది. దాని ఉనికి, మనికి మనకు తెలియదు. మన అంతరాత్మకు రహస్య నెచ్చెలి జ్ఞానం. మనస్సుకు సైతం తెలియకుండా అంతరాత్మ చాటున దాగి

ఉంటుంది. జీవితంలో ఎప్పుడో దివ్యత్వం ప్రవేశించినప్పుడు అది నేరుగా వెళ్లి జ్ఞానాన్ని స్పృశిస్తుంది. దివ్యస్పర్శతో జ్ఞానం మేల్కొంటుంది.

సదసద్వివేకం కలగనిదే జ్ఞానం బయటపడదు. అజ్ఞానం వెనుక అంధ కారంలో జ్ఞానం దాగి ఉంటుంది. అజ్ఞానం తనను తాను చూచుకుని మురిసి పోతుంది తప్ప భగవంతుని దిశగా చూడదు. సత్యాన్ని తన దరికి రానీయదు. భౌతికత 'సత్యా'న్ని కప్పివేస్తుంది. పరమాత్మ రూపాన్ని ఊహకు వదిలిపెడుతుంది. అజ్ఞానం తెర తొలగించుకుని జ్ఞానం బయటకొస్తుంది.

మనస్సు సులభంగా లొంగదు. విజ్ఞానంతో తలపడుతుంది. అవివేకం వల్ల జ్ఞానం తొట్రుపడుతుంది. ఆధ్యాత్మిక ప్రగతి నెమ్మదిగా సాగుతుంది. భౌతికమైన అన్ని శక్తుల కన్న మనోబలం గొప్పది. మనిషి కండబలంతో, స్వశక్తితో సాధించలేని పనులు మనస్సుతో సాధించవచ్చు. భూమిపైన కనిపించే రూపాలన్నీ నశించేవే. కంటికి కనిపించని వాటిని మనస్సు గ్రహిస్తుంది. ఆలోచనవల్ల మనస్సులో చిరుజ్యోతి వెలుగుతుంది. ఆత్మ తనను తాను గమనించదు కాని జ్ఞానకిరణాలను అందుకుంటుంది. సత్యాన్ని తనకు విధేయంగా ఉండేట్లు చేసుకుంటుంది. ప్రకృతి సహజమైన అనేకత్వాన్ని తొలగించి ఏకత్వం సాధిస్తుంది. చరాచర జగత్తును ఒక్క తాటిపైన నడిపిస్తుంది.

అంతర్‌సామ్రాజ్యంలో ఆత్మ ఒక్కటే అధిపతి. ఆత్మరుషిగా ప్రజ్ఞతో బయటపడే శక్తుల్ని కనిపెడుతూ రక్షిస్తుంది. ఆలోచనకు గల పరిమితి ప్రజ్ఞకు తెలుసు. దాని సానుకూలత తెలుసు. కనుక జ్ఞానదృష్టికి ప్రజ్ఞ అందుతుంది. పైకి ఎన్నిచీకట్లు దోబూచులాడినా అంతర్జ్యోతి ప్రకాశిస్తూనే ఉంటుంది. అది సత్కార్యాచరణకు ప్రోత్సాహం ఇస్తుంది. అంతర్జ్యోతి వెలుగులు బాహ్యప్రపంచాన్ని చక్క బెట్టగలవు.

ఆత్మ తన మండలంలో తొట్రుపడదు, తప్పిపోదు. సూక్ష్మశక్తుల నన్నింటినీ సంపాదిస్తుంది. మనస్సు దాని కొనలను కూడా చేరదు. కాని ఆత్మశక్తుల్ని తనవి చేసుకోవాలనుకుంటుంది. సత్యాన్వేషణ జరిపే యోగిని చిమ్మ చీకటి నుండి వెలుగు బాటలోకి నడిపిస్తూ అగోచర పరమాత్మ ముంగిట నిలుపుతుంది. మూడు శరీరాలతో నిండిన మనిషి ఆత్మ ఆధీనంలో ఉంటాడు. మూడింటిలో చిన్నది భౌతిక శరీరం. ఇది బాహ్యదృష్టికి కనిపిస్తుంది. దీనికి ఆలంబన సంకల్పం. వాస్తవాలను మాత్రమే భౌతిక శరీరం ఆమోదిస్తుంది. ప్రకృతికి అనుకూలంగా బ్రతకడం భౌతికశరీరానికి ఇష్టం. మానవప్రకృతి, బాహ్యప్రకృతి ఒక్కటే. పంచ

భూతాలు శరీర నిర్మితికి ఎంత అవసరమో, ప్రకృతికీ అంతే అవసరం. రెండింటి ధర్మాలు ఒక్కటే. మనిషి ఆలోచన సంప్రదాయబద్ధంగా ఉన్నంతకాలం అనాగరిక లక్షణాలను వదలదు. జీవితం సంప్రదాయపు ఉచ్చులలో కట్టుబడిఉన్నంతకాలం ముందుకు కదలదు. భౌతిక సుఖాలకు, భోగాలకు, సంపదలకు మనిషి దాసోహం అవుతాడు. ప్రాపంచిక చక్రాలలో ఇరుక్కుని నలిగిపోతాడు తప్ప బయటపడడు. సామాజిక అలవాట్లనే మానవ ధర్మాలుగా భ్రమిస్తాడు. మానసికమైన తన బలహీనతలను సత్యాలుగా భ్రమిస్తాడు.

మనిషి తన అనుభవాలు ఆధారంగా ఏర్పడిన ఆలోచనలతో ఒక వలను ఏర్పాటుచేసుకుని, చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుంటాడు. ఎంతకాలం జీవించినా జీవన విధానం మారదు. శైలి మారదు. సాధించేదీ ఉండదు. అందినంత వరకు అనుభవించి, అవకాశం ఉన్నంతవరకు సంపాదించి, కర్మయోగి ననుకుంటాడు. తాను, అంటే 'ఆత్మ' నివశిస్తున్న ఈ శరీరం తనకు తాత్కాలికమైన ఆశ్రయం అనుకోక, ఇది తన స్వతం అని భ్రమిస్తాడు. 'ఆత్మ' తన శరీరానికి అతిథి అనుకుంటాడు. మార్పును అంగీకరించడం, పరిణామం చెందడం మహాపాపం అనుకుంటాడు. కొత్తను అంగీకరించడానికి మనసొప్పదు. గతంలోకి కూరుకు పోవడం, గతంలో బ్రతకడం మనిషికి ఇష్టం. ఒక్కొక్క అడుగు ఆచితూచి వేస్తాడు. గమ్యం మాత్రం చేరడు. అగోచరం అంటే అనుమానం. అంధకారం అంటే భయం. శూన్యం అంటే గగుర్పు. తన అజ్ఞానాన్ని అతి జాగ్రత్తగా కాపాడుకుంటాడు. సాహసం చేయాలంటే వెరపు. ఉజ్వల జీవితం పట్ల శంక. మహదానందాలు పొందాలన్నా, ఔన్నత్యం సాధించాలన్నా, ప్రమాదాలు దాటాలని భయం. అంచేత సాదాసీదాగా జీవించడానికి ఇష్టపడతాడు.

ఎంత శ్రమించినా మనస్సుపైన పడిన ప్రాపంచిక ముద్రలు చెరిగిపోవు. ఏర్పరచుకున్న అభిప్రాయాలు, అభిమతాలు సమసిపోవు. నిజానికి అవి ఎంత తక్కువైతే మనిషికి అంత ఎక్కువ విలువ. మనిషి తన జ్ఞాపకాలే ప్రతిభకు నిదర్శనా లనుకుంటాడు. తన వివేకానికి అందినవిషయాలు మాత్రమే సత్యాలని నమ్ముతాడు. బాహ్యవిషయాలను మాత్రమే వాస్తవాలని, అవే సత్యాలని నమ్మడం మనిషి అజ్ఞానం. మనిషి వివేకం ప్రాపంచిక విషయాలను దాటి పైకి పోదు. తనకు తెలిసిన విషయాలు, చేస్తున్న పూజలు తనకు మోక్షం ప్రసాదిస్తా యనుకుంటాడు.

ప్రాచీన పద్ధతులన్నీ పవిత్రమైనవని, పరమ ప్రామాణికాలని, ఆ సంప్ర

దాయాలను, ధర్మాలను మార్చరాదని పిచ్చి నమ్మకం. వారసత్వంగా, ఆచారంగా, సంప్రదాయంగా వస్తున్న వాటిని మన్నించి, గౌరవించి, పాటిస్తే చాలు భగవంతుడు మెచ్చి ముక్తి నిస్తాడని భ్రమ. అవన్నీ సాక్షాత్తు భగవంతుడు ఏర్పరచిన బాటలేనని విశ్వసిస్తాడు. ప్రకృతికి భిన్నంగా ప్రవర్తించడం 'పాపం' అని భయపడతాడు. అన్నీ ప్రపంచంలో యథాప్రకారం సాగిపోవలసిందేనని నమ్మకం.

లోకరక్షకుడైన ఈశ్వరుడే మనిషి మనస్సుగా మారడం జరిగింది. అందుకే మనిషి కార్యాలన్నీ మనస్సు ఆధీనంలో జరుగుతుంటాయి. అంటే సర్వం ఈశ్వరాధీనమనే అర్థం. శరీరంలోని అవయవాలు వేటికి అవిగా పనిచేస్తుంటాయి. వేటి బాధ్యతలు అవి చక్కగా నిర్వహిస్తాయి. సంప్రదాయంలో ఎంతకాలం జీవించినా మనిషికి అలసట ఉండదు. ఇంకా యింకా జీవించి ఉండాలనిపిస్తుంది. కాలంతో సంప్రదాయాలు మారుతుంటాయి. జీవనశైలి మారుతుంది. అయినా ప్రాయికంగా మూలసూత్రం మారదు. మనుగడ మారదు. ప్రాచీనతను మన్నించడం జరుగుతుంది. కొత్త వెలుగు ఏ మాత్రం సోకినా మనస్సు భయపడుతుంది. తన సంపదను ఎవరో దోచుకోడానికి వస్తున్నట్లు కలతపడుతుంది. వివేకానికి మనస్సే రక్షణ. పరలోకాల ఆలోచనలు దానిలో చొరబడకూడదు. మనిషి తను గడ్డి, గాదం తిని బ్రతుకుతూ మహత్కార్యాలను సాధిస్తున్నాననుకుంటాడు.

జీవుడు చేసే మంచి పనుల వెనక పరమాత్మ ఉంటుంది. ఈశ్వర సంకల్పం మనిషి తెలుసుకోడు. జీవితంలో అప్పుడప్పుడు దివ్యస్పందనలు కలుగుతాయి. అహంకారం వల్ల వాటిని గుర్తించడు. రోదసిలో ఎన్ని నక్షత్రాలు గతి తప్పక సంచరించడం లేదు! ప్రపంచం మారుతున్నట్లు తెలియదు. స్తబ్దంగా ఉంటుంది. మారుతున్నా అందులో మారనితనమే ఎక్కువ. పరిణామం చివరకు శూన్యం పాలవుతుంది. కొత్త తొడుగుతో పాతరూపం సరికొత్తగా పుడుతుంది. మనిషి క్రియాశక్తి కిచ్చిన ప్రాధాన్యం ఆంతర్యానికి ఇవ్వడు. అది విశ్వహృదయంపైన శివ తాండవం.

మూడు రూపాలలో రెండవది రుద్రరూపం. అది రౌద్రం. భయంకరంగా గార్దభ వాహనంపైన వస్తుంది. నరసింహావతారం విజ్ఞానానికి ప్రతీక. నారసింహం యోగచిహ్నం. తద్వారా యోగాగ్ని విస్తరిస్తుంది. యోగాగ్నిలో మానవ మమకారాలు నశిస్తాయి. అప్పుడు మనిషి తపన యోగాగ్నిగా మారుతుంది. మనిషి అనేక జన్మలలో అనేక పేర్లతో వ్యవహరించాడు. జన్మలు మారినా తృప్తిలేదు. ఏదో కావాలన్న తపన, ఏది కావాలో తెలియనితనం. లక్ష్యం లేకుండా ఎన్ని జన్మ

లెత్తినా సాధించేది ఉండదు. ఆత్మ పరమాత్మనే అన్వేషిస్తుంది. అనేక జన్మలలో అనేక మార్గాలు అవలంభిస్తూ, భిన్న మార్గాలలో నడవడం వల్ల గమ్యం చేరడం జరగదు. అన్ని జన్మల అపమార్గాలు మనిషిలో వైవిధ్యాన్ని ఏర్పరుస్తాయి.

ఒక కాంక్ష గుండెను రగుల్చుతుంది. అది చీకటి రాత్రి మెరిసే మెరుపు. మనిషిని స్వర్గంవైపు నడిపిస్తూ నరకంలోకి తోస్తుంది. అది సత్యాన్ని సైతం బురద లోకి లాగుతుంది. తన శక్తుల్ని క్షుద్ర ప్రయోజనాలకు వినియోగిస్తుంది. తనలోని ఎరుపు, నీలం, బంగారు రంగుల్ని నల్లని బూడిదరంగుగా మార్చుకుంటుంది. జీవితంలో నిరాశ స్వల్పంగా ప్రవేశించి, విశ్వరూపం దాల్చి, సుఖాలను అనంతంగా అనుభవించాలన్న కాంక్షను రగిలిస్తుంది. తాను అనుభవించిన సుఖాలకు మురిసి పోయి అవే శాశ్వతం కావాలని మనిషి ఆరాటపడతాడు.

ఈ కాంక్ష ఒక జ్వలిత జ్వాల. ఒక భయంకర సర్పం. దానికి నల్లని మేఘం వంటి తోక. దానివెంట వచ్చేవి కోరికలు, విషనాగులు. అది భయంకరంగా తల విదల్చుతుంది. అది కక్కే విషం విజ్ఞానం కాదు. శూన్యాకాశంలో ఏర్పడే వాయుగుండంలో ఆ సర్పం బుసలు కొడుతుంది. సర్వాన్ని మ్రింగాలనుకుంటుంది. శూన్యంలో పుట్టి శూన్యంలోనే లయిస్తుంది. మధ్యంతరంలో తానే సర్వం అయినట్లు భావిస్తుంది. అది చంచల మనస్సు. దానికి తెలుసుకోవాలన్న తపన తప్ప నిలుపుకునే శక్తి శూన్యం. దాని అస్థిరత్వానికి అవధి ఉండదు. తప్పులు చేయడం మనస్సుకు సహజగుణం. ఎప్పుడో తన ఆశలు నెరవేరే ఒక మంచి ఆలోచన వస్తుంది. అప్పుడు సంకల్పం మిగలదు.

మనస్సు తను చీకటిలో ఉంటూ వెలుగు రూపాలను చూడాలని ప్రయత్నిస్తుంది. చీకటి గుహలలో చొరబడి సుందర దృశ్యాలకోసం అన్వేషిస్తుంది. లేదా తాను చీకటి సుడిగుండాలలో చిక్కుకుని భవిష్యత్తుకు సంబంధించిన బంగారు కలలు కంటుంది. ఎన్ని రంగులపూలు పూయిస్తుందో చెప్పలేం! మన కలలకు మన జీవన విలాసాలే భూమికలు. అనేక దివ్యరూపాలను దర్శిస్తాం. శక్తులను గుర్తిస్తాం. కానీ వేటినీ అందుకోం. మనస్సు, ఆత్మ, వివేకం సహాయం లేకుండా పరమాత్మను అందుకోవాలని ప్రయత్నిస్తుంది. అది అసంభవం అని గ్రహించదు. అసంభవం కోసం తన శక్తిని వృథా చేస్తుంది. సూటిబాటను వదలి వక్రమార్గాలలో ప్రయత్నిస్తుంది. సాధించిన కొద్దిపాటి విజయాన్ని దుర్వినియోగం చేస్తుంది. తీరని కోర్కెలపై 'కర్మ' ముద్ర వేస్తుంది. మిగిలిన కాస్త పుణ్యంతో స్వర్గానికి నిచ్చెనలు వేస్తుంది.

జీవితంతో రాజీపడడం మనస్సుకు బాగా తెలుసు. అంచేత జీవితపథంలో తన పద్ధతిని మార్చుకోదు. ఆ పద్ధతివల్ల ఫలితం లేదని తెలిసినా మారదు. తప్పులు చేస్తుంది. పశ్చాత్తాపం చెందుతుంది. అంతే! జీవిత చదరంగంలో మనస్సు తన పద్ధతిని అనుసరిస్తూ అందినంత ఫలితాన్ని అనుభవిస్తుంది. ఎన్ని తప్పులు జరిగినా, ఫలితాలు లేకపోయినా విశ్వాసం తగ్గదు. జీవుని ఆంతరంగిక ధర్మాలను మనస్సు పరిగణించదు. మనస్సు వైఫల్యాలు జీవుడు పట్టించుకోడు. ఎప్పటి కప్పుడు మనస్సుకు, జీవునకు హెచ్చరికలు అందుతుంటాయి.

జీవితంలో మనం ప్రయత్నిస్తాం. ఫలితం ఆశిస్తాం. విజయం ఆశించినా అందకపోవచ్చు. మనం ప్రయోగాలు చేస్తాం. పూర్తి విశ్వాసంతో, పూర్ణ ప్రజ్ఞతో చేస్తే ఫలితం ఉంటుంది. మనలో పూర్ణప్రజ్ఞ ఉండదు. ప్రతి ప్రయోగంలో మేధ, అనుభూతి తోడుకావాలి. మన కృషి సద్యఃఫలితాలు ఇవ్వకపోయినా వృధా కాదు. ఆ ప్రయత్నం, ప్రయోగం మన విశ్వాసానికి బలం చేకూరుస్తుంది. మరింత శక్తి నిస్తుంది. మహత్కార్యాలు ఏవీ ఒక పథకం ప్రకారం జరగవు. అసంకల్పితంగా జరుగుతుంటాయి. ప్రజ్ఞ గుర్తించినదాన్ని కాంక్ష అందుకోగలదు. అంతర్దృష్టి ఎప్పుడూ పరంపైన కేంద్రీకృతమవుతుంది. తేజస్సు చాటున విశ్వభావన దాగి ఉంటుంది. పైకి తేజోబింబం కనిపిస్తుంది. శూన్యంలోనే విజ్ఞాననిధులు గుప్తంగా ఉంటాయి.

దివ్యదృష్టి ఏర్పడినా వివేకం దానిని పరిమితంగానే ఉపయోగించు కుంటుంది. ఒక్క వెలుగులోనే దివ్యత్వం కనిపిస్తుంది. మనం చీకటికి అలవాటు పడి వెలుగును భరించలేం. అజ్ఞానం, అయోమయం మన మనోమయ భూమికలు.

మానసిక శక్తులలో మూడవది ఉత్తమమైనది. మనోభూమిక అడుగుపొరల నుండి పైకి ఆలస్యంగా, నెమ్మదిగా వస్తుంది. అది ముందు అస్థిరత్వాన్ని వదులుకుని కౌశలం చూపుతుంది. అది ముందు భౌతికతకు తల వొగ్గినట్లే అనిపిస్తుంది. కొంత తొట్రుబాటు, తొందరపాటు కనిపించినా అది అస్థిరత్వం కాదు. తర్వాత వివేకం మొగ్గతొడిగి సదసద్వివేచక్షణ కలుగుతుంది. ఈ దృష్టి ఒక్క ముహూర్తంలో ఏర్పడుతుంది. నిర్మలాంతఃకరణ దాని ప్రణాళిక. అది ఏర్పడిన వారికి ప్రసన్నతాదృష్టి, ఆర్ద్రత ఉంటుంది. అది సుస్థిరంగా ఉండిపోతుంది. అదే ప్రజ్ఞ.

ఆత్మశోధనకు, యోగసాధనకు జ్ఞానదృష్టి అవసరం. యోగశక్తితో విశ్వ రూపాన్ని దర్శించవీలుంది. కోట్ల జీవుల చావు పుట్టుకలు జ్ఞాననేత్రానికి తెలుస్తాయి.

ఆత్మ కాలాన్ని అధిగమించి విశ్వంలోకి నిష్క్రమిస్తుంది. విశ్వాత్మగా సంచరిస్తుంది. భూమి, గ్రహాలు, నక్షత్రాలు ఆత్మకు చిరపరిచితాలు. వాటితో ఆత్మకున్న మైత్రి జీవునికి తెలియదు. అన్ని లోకాలలో సంచరించగలది ఆత్మ ఒక్కటే.

మనస్సు నిరంతరం అవిశ్రాంతంగా శ్రమిస్తూ విశ్వప్రణాళికకు నామ మాత్రంగా సహకరిస్తుంది. కాలంలో ఏర్పడేవన్నీ రేఖాగణితాలే. మనస్సు అందుకున్న సత్యశకలాలను కుప్పపోసుకుంటుంది. అవి మనస్సుకు ఏ మాత్రం ఉపయోగించవు. ఆత్మ మాత్రమే సత్యాన్ని అందుకోగలదు. పరమాత్మ రహస్యం ఏమిటో మనస్సుకు అంతుపట్టదు. మనస్సు ఏకాగ్రతను సాధించలేదు. నిశ్శబ్దాన్ని భరించలేదు. శక్తిపాత ప్రవాహాన్ని అదుపు చేయాలని, అతీంద్రియతను అర్థం చేసుకోవాలని 'వివేకం' ప్రయత్నిస్తుందిగాని ఫలితం ఉండదు. తను నియమాలు ఏర్పరుస్తుంది. మానసిక నియమాలలో పరమాత్మ ఒదిగిపోదు. పరమాత్మ సంకల్పం వల్లనే మనలో ప్రజ్ఞ ప్రవేశిస్తుంది. ప్రజ్ఞాకిరణం మనల్ని నడిపిస్తుంది. మనస్సు లోకం కోసం వక్రమార్గాలలో నడుస్తుంది. వివేకం, ఆలోచన, సంప్రదాయం మనస్సును పెడత్రోవలకు లాగుతాయి. ప్రకృతికి భిన్నంగా ప్రవర్తించడమే మనస్సు కోరే స్వతంత్రత.

మానసిక సంయమనం ఉన్నా, మనోనిబ్బరం లేక జీవిత పోరాటాలు తప్పనిసరి అవుతుంటాయి. ఎంత నైతికంగా, పవిత్రంగా జీవించినా, జీవితంలో ఆరాటాలు, పోరాటాలు తప్పవు. మనస్సు అన్వేషిస్తూనే ఉంటుంది. అజ్ఞానం నుండి ప్రపంచాన్ని రక్షించడంలో ఆత్మ వెనుకాడదు. శతాబ్దాలుగా మనస్సు శ్రమిస్తున్నది, సృష్టిని అన్వేషిస్తున్నది, తనవంతు కృషి చేస్తున్నది అందుకే. మానసిక శక్తి గొప్పదే. అయినా మనస్సు తన పరిధులు దాటిపోదు. తన కర్మశాలను వదలి పెట్టదు. కర్మ నిబద్ధత మానసిక ధర్మం.

మనస్సు దేనినైనా సృష్టించగలదు. విశ్వరహస్యాలను సైతం ఛేదిస్తుంది. కాని తనకు నిర్దేశించిన క్షేత్రాన్ని వదలదు. మనస్సుకు తెలుసు కనిపించే ఈ లోకం కరిగిపోతుందని, స్థిరంగా ఉండదని. తాను మరో ప్రపంచాన్ని సృష్టించు కుంటుంది. తన ఆలోచనలకు పదును పెడుతుంది. మనస్సు యొక్క కృషి ఫలితాలు చివరకు పరమాత్మకు చెందుతుంటాయి.

ప్రజ్ఞావంతుడు సంకల్పమాత్రంచే మనోక్షేత్రంలో ఉండిపోగలడు. వివేకం, విజ్ఞానం అతనికి సహచరులు. సత్యాన్ని తనలోకి ఆహ్వానిస్తాడు. విరుద్ధ తత్వాలను సమన్వయించగలడు. ప్రకృతిని సైతం ఒక మాంత్రికుని వలె స్వాధీనం చేసు

కుంటాడు. ప్రజ్ఞ సునిశితం, స్వతంత్రం. ప్రజ్ఞ వెల్లవేసిన గోడలపై ప్రకృతి చక్కని రూపచిత్రాలు రచిస్తుంది. విశ్వవిజ్ఞానాన్ని మేధస్సులోకి బదిలీ చేస్తుంది. అన్నీ సంకేతాలు, సంకీర్ణాలే ... వాటిని ప్రజ్ఞ విశ్లేషించగలదు.

ప్రజ్ఞాలయంలో ఎటు తిరిగినా పరమాత్మ వివిధ రూపాలలో దర్శన మిస్తుంది. ప్రకృతిలోని సుందర దృశ్యాలు, ఉదాత్త విషయాలు అన్నీ ఈశ్వరలీలలే, ప్రజ్ఞకు ఉపకరణాలే. మనిషి స్వీయప్రజ్ఞతో ఉన్నతస్థితికి చేరినప్పుడు ఇంద్రియా తీతంగా సమాధిస్థితికి చేరగలడు. అప్పుడు మనస్సు కాదనేది ఉండదు. అది మౌలికమైన శక్తిని కించపరచదు. దివ్యలోకాలనుండి వచ్చే ప్రభల్ని కాదనదు. ప్రజ్ఞ వేయిరూపాల ప్రభవిస్తుంది. కాని మనస్సు అన్నింటినీ అనుమానిస్తుంది.

ప్రపంచంలో అత్యుత్తమం అనుకున్నవేవీ ప్రజ్ఞ ముందు నిలబడవు. ప్రాపంచిక విషయాలు, విలువలు సన్నగిల్లి ఏవో సంకేతాలు మిగులుతాయి. మార్పు ప్రగతికి సంకేతం. ప్రజ్ఞది గమ్యంలేని యాత్ర. ప్రజ్ఞ ఎక్కడా విశ్రమించదు. ఎక్కడా ఆగదు. సృష్టి మొత్తాన్ని ప్రజ్ఞ దర్శిస్తుంది. ప్రతి పనికి వివేకం అవసరం. ప్రపంచ రూపకానికి వివేకం దర్శకత్వం వహిస్తుంది. మనిషికి వివేకమే ఒక శక్తి. ఆలోచన మించి పైమెట్టులో ఉంటుంది వివేకం. వివేకం చేసే విన్యాసాలు మనస్సుకు, ఆలోచనకు తెలియ నవసరం లేదు.

పరమాత్మ ఒక్కొక్కసారి తర్కాన్ని ఆశ్రయిస్తుంది. సత్యంపై వాదప్రతివాదాలు జరుగుతాయి. మాటలతో ఎంతకాలం దెబ్బలాడినా సత్యం దొరకదు. సత్యం తర్కానికి, హేతువుకు, వాదనలకు అందదు. ఆలోచనకు అది అగ్ని పరీక్ష పెడుతుంది. శూన్యంలో ప్రజ్ఞ మరింతగా బలపడుతుంది. ప్రజ్ఞ ఏకాంతంగా, స్వచ్ఛంగా, స్వతంత్రంగా అభివృద్ధి చెందుతుంది. ప్రజ్ఞతో ఎవరూ పోటీపడలేరు. ప్రాపంచిక ధర్మాలు ఏవీ ప్రజ్ఞ ముందు నిలబడవు. మిణుగురు వంటి మేధకు ప్రజ్ఞాకిరణాలు సూర్యకిరణాల వంటివి. ప్రజ్ఞ చైతన్యంగా పైనుండి ప్రభవిస్తుంది. ఆ కిరణాలు చీకటిలో ప్రకాశిస్తాయి. అజ్ఞానాన్ని తరిమివేస్తాయి.

ప్రజ్ఞ తన హక్కును వదులుకుని మనస్సుకు ఆ బాధ్యతలు అప్పగిస్తుంది. మేధ తర్కబద్ధంగా ఆలోచించి, ప్రజ్ఞకు నియమాలు ఏర్పాటుచేస్తుంది. మనస్సు నగ్నసత్యాన్ని ప్రజ్ఞ వెలుగులో దర్శించవలసిందే. యాంత్రికంగా సాగే లోకం వెంట ప్రజ్ఞ ప్రచ్ఛన్నంగా సాగుతుంది. తనను కనిపించనీయదు. బండికి కట్టిన ఎద్దులాగా, ప్రజ్ఞ అనవసరపు బరువుల్ని మోస్తుంది. కాలాన్ని ధిక్కరించడం ప్రజ్ఞకు ఇష్టం ఉండదు.

అమాయకత్వంలో ప్రజ్ఞ గొప్పగా ప్రకాశిస్తుంది. తనను అన్వేషించే వారికి సహకరిస్తుంది. అయితే మనిషి యోగ్యతను, అర్హతను పరీక్షకు పెట్టకుండా ప్రజ్ఞ చెంతకు చేరదు. ప్రజ్ఞ తనకేమీ తెలియనట్లు నటిస్తుంది. తన అమాయకత్వాన్ని చాటుకుంటుంది. తాను అమాయకత్వం నటిస్తుంది. అహంకారం యావత్తు కరిగిపోతే తప్ప మనిషిలో ప్రజ్ఞ ప్రవేశించదు. యుగయుగాల విశ్వాసాలను, సంప్రదాయాలను వదులుకోనిదే ప్రజ్ఞ బయటపడదు. ప్రజ్ఞ పొందినవాడు జ్ఞాని. జ్ఞాని మాత్రమే భగవంతుని చేరగలడు. కరిగిపోయిన కలలు నిజం కాదు. ప్రకృతి రహస్యాన్ని గుర్తించడం వరకే మనస్సు ఉపయోగం. శాసనాలు, ధర్మాలు సత్యానికి అడ్డుగోడ లవుతాయి. లోతులకు వెళ్లి రహస్యాలు స్వయంగా శోధించడమే ప్రజ్ఞా విశేషం.

ప్రజ్ఞతో పరిశీలించినపుడు ఈ సృష్టి ఒక మహాయంత్రం అనిపిస్తుంది. స్వయం సత్తాక యంత్రం. అర్థం లేనట్లు కనిపించినా, వ్యర్థం కానిది. లోకంలో అన్నీ యథావిధిగా సాగుతుంటాయి. ఏదీ వ్యర్థం కాదు, ఏదీ నిరుపయోగం కాదు. అన్నింటికి ఉపయోగాలు, ప్రయోజనాలు ఉన్నాయి. చమత్కారంలో, చతుర సంభాషణలో, సున్నితమైన మనస్సులో ప్రజ్ఞ దాగి ఉంటుంది. అనాగరిక, అజ్ఞాన సీమలలో పయనించి, సన్మార్గాన్ని ఏర్పరుస్తుంది. దివ్యపథాన్ని చూపుతుంది. ప్రజ్ఞకు ఆలోచనలు, పథకాలు ఉండవు. సంకల్పాలు ఉండవు. అయినా లక్ష పనులు చేస్తుంది. ప్రజ్ఞకు మేధ సహకారం అవసరం ఉండదు. పరమాత్మ ప్రతినిధిగా ప్రజ్ఞ సృష్టిని నడపగలదు.

ప్రజ్ఞకు ఒక సంకల్పం ఉండదు. ప్రజ్ఞ ప్రయోజనం ఆశించదు. కార్యకారణ సంబంధాలు ఉండవు. ప్రయోజన లక్ష్యం లేకుండానే ప్రజ్ఞ పనిచేస్తుంది. అది చిన్న శక్తిగా మనిషిలో ప్రవేశిస్తుంది. జీవితం మృత్యువుతో ముగుస్తుంది కాని ప్రజ్ఞ మృత్యువు తర్వాత కూడ విస్తరిస్తుంది. జీవిత కాలంలో చైతన్యంగా పని చేస్తుంది. జీవునికి ఇదంతా అయోమయం. ప్రజ్ఞ చేసే పనులు జీవి అంచనాలకు అందవు. జీవుడు 'నేనెవరు? ఎందుకు పుట్టాను? ఎందుకు మరణిస్తున్నాను?' అని ప్రశ్నించుకుంటాడు.

ఈ విశ్వ మహాయంత్రాన్ని నడిపించడంలో మన మనస్సు, భావాలు ప్రధానపాత్ర పోషిస్తుంటాయి. కాని మన సంకల్పాలు మాత్రం భౌతిక సూత్రానికే కట్టుబడి ఉంటాయి. మనం జ్ఞానం అనుకునేది మన కల్పన. ప్రజ్ఞ ఒక్కటే స్వతంత్రం. ఆత్మను గురించి, జీవుని గురించి మనం ఆలోచించడం అనవసరం.

పదార్థం వాస్తవికసత్యం. ప్రపంచంలోని అందాలను, అద్భుతాలను వదులుకో నవసరంలేదు. పరమసత్యాలు అతి నిరాడంబరంగా ఉంటాయి. ఆత్మ సంస్కారం అలవడకుండా చైతన్యం పొందడం అసంభవం. ఆత్మ తాను సృష్టించిన లోకాన్ని కుంచింపచేస్తుంది. ఒకసారి సృష్టి శూన్యంలో లయించిపోతే మరల కొత్త సృష్టి ఏర్పడుతుంది. ఆత్మ జాగృతమైనపుడు లోకంలోని లోపాలు చక్కబడతాయి.

యుగయుగాల జడత్వాన్ని పరిగణనలోకి తీసుకుంటే పరిణామం చాలా మందంగా సాగినట్లు అనిపిస్తుంది. అంతా చివరకు సందేహంగా మిగులుతుంది. ప్రజ్ఞ కరిగిపోతుంది. సృష్టి నీరసపడుతుంది. నీరవ నిశ్శబ్దమే ప్రళయం. అదే యుగాంత సంకేతం.

నిగూఢంగా ఉన్న సత్యాన్ని మనిషి దర్శించలేడు. సత్యానికి వాస్తవానికి మధ్య నున్న అఖాతం చాలా పెద్దది. అందుకే మనిషి ఆర్జించిన జ్ఞానం అంతా అజ్ఞానంగా మారిపోతున్నది. అంచేతనే జగత్తు మాయ అంటాం. ఏదీ అర్థం కాదు. అంతా శూన్యం. అంతా ఈశ్వరలీల. విశ్వ వైచిత్రి, లోతులు మనిషి ప్రజ్ఞకు అందవు. వాటి మూలశక్తులన్నీ పరమాత్మ ఆధీనంలో ఉంటాయి. విలువల మధ్య విభేదాలు విచ్ఛిత్తికి మార్గాలు. జగత్తు బీటలు వారి పగుళ్లు కనిపిస్తాయి. లోకం సక్రమంగా సాగదు.

ఒక మహాశక్తి విజృంభణ జరిగినప్పుడు ఏర్పడిన సుడులలో విశ్వం రూపు దాల్చింది. ఆద్యంతాలు లేని శూన్య రోదసిలోని సంచలనం ఒక సంకల్పానికి కారణమైంది. సృష్టికి పూర్వం ఒక ఆలోచన, ఆశయం లేవు. శక్తి సంకల్పమే రూపుదిద్దుకుని లోకంగా మారింది. కార్యకారణాలు రెండూ నిరాకారాలే. ప్రాణి ప్రవేశానికి పదార్థం అవసరమైంది. పరిణామంలో అనంత రూపాలు ఏర్పడినా ప్రకృతికి ఒక అగోచరశక్తి ఆధారం. అప్పుడు నీతి, రీతి, ఆదర్శాలు, ధర్మాలు లేవు. ఒక ఆశయం లేకుండా, అవసరం కొద్దీ జీవి మనుగడ ప్రారంభమైంది. అన్ని ఏర్పడినా అంతటా చీకటి అలముకుంది.

జీవితంపైన ప్రతికూలశక్తుల ప్రభావం ఎక్కువ. ఆలోచనలు జీవునిపై దాడి చేస్తాయి. అరాచకశక్తుల్ని అదుపులో ఉంచాలి. మనం అనుభవించే స్వేచ్ఛ నామ మాత్రం. జనన మరణాల వంటివే సృష్టి వినాశాలు. అవి రెండూ కలిసే ఉంటాయి. అవి మనిషి గుండెపై సదా నర్తిస్తుంటాయి. ఆ నర్తనమే మహాకాళి ప్రళయనర్తనం.

సృష్ట్యాదిలో జీవి శూన్యంలో మునిగి, పాకుతూ పోయి, ఆధారం కోసం వెదకసాగింది. కాలు నిలవరించడానికి గట్టి నేల తగల లేదు. వెతకగా, వెతకగా ఒక చిన్ని అణువు తగిలింది. జీవస్పర్శ తగిలిన అణువు బ్రహ్మాండంగా ఇమిడింది. బ్రహ్మాండ విశ్వంలో అణువు స్వల్పమేగానీ అణువులోనే బ్రహ్మాండం ఉన్నది. సృష్టి, విశ్వం అణువు ఆధారంగా ఏర్పడ్డవి. అప్పుడు విశ్వం నడవడానికి శక్తి అవసర మైంది. దానిని నడిపించే బాధ్యతను ఆత్మ తనపైన వేసుకుంది. జడ ప్రపంచంలో ఉత్తమజీవి అయిన మనిషి ఏర్పడ్డాడు. మనిషికి మనస్సు అదనంగా ఏర్పడడంవల్ల ప్రపంచాధిపత్యం మనిషికి దక్కింది. మనిషి తన వివేకంతో అనంత శక్తిని అందుకోసాగాడు. ఆ శక్తికి ఆత్మశక్తిని జోడించి జోడుగుర్రాలపై కాలపథాల వెంట జీవన రథాన్ని పరుగుతీయించాడు. మనస్సు వల్ల ఆలోచన, ఆలోచన వల్ల బుద్ధి పెరిగింది. మనిషికి అవసరాలు పెరిగాయి. ఆంతర్యం నిర్గుణం, నిరాకారం, నిశ్చలం అయినా పైకి రూపం, రసం, గంధం అవసరమైనాయి. సృష్టి పూర్ణ వికాసానికి మనిషికి పూర్ణత్వం అవసరం. మనిషి పూర్ణమానవుడు అయినప్పుడు విశ్వానికి పూర్ణత్వం సిద్ధిస్తుంది. సమాజ వికాసం కోసం ఒక యంత్రాంగం అవసరమయింది.

మూలకారణమైన ఆత్మను మనిషి మరచిపోయాడు. ప్రకృతి పరిశోధనతో మనిషి అవసరాలు తీర్చడంలో శాస్త్రవిజ్ఞానం పెరిగింది. ప్రపంచానికి, మనిషి మనుగడకు ఒక ప్రత్యేక న్యాయం అవసరమైంది. బాహ్యావసరాలు ఆధారంగా కొత్త సత్యాలు, ధర్మాలు ఏర్పడ్డాయి. అవి మనిషికి ప్రగతి, అభ్యుదయం అయినాయి. మనిషి అవసరాలు పెంచుకోవడమే ప్రగతి. మనిషి ఆలోచన భూమికి సమాంతరంగా సాగినా భౌతిక అవసరాలకే పరిమితమైంది. ఆత్మ అవసరాలు మరచి, మనిషి తన శరీరావసరాలకు ప్రాధాన్య మివ్వసాగాడు. ఫలితంగా మనిషిలో 'వివేకం' పెరిగింది. మేధ విస్తరించింది. ఆలోచన పెరిగింది. ఆత్మ మరుగున పడిపోయింది.

చీకటి గర్భంలో భూగోళం. భూగోళంపైన ప్రకృతి ఆచ్ఛాదనలు. శిఖరాగ్రాన మనిషి ... ఇది యుగయుగాల మానవ మస్తిష్క శ్రమకు ఫలితం. అది పరిణామ లక్ష్యం కాదు గానీ జీవి లక్ష్యం అదే. మనిషి పతన హేతువు అదే. మనిషికి, ప్రపంచానికి ఆత్మతో అవసరం తీరింది. ఆత్మ లేకపోయినా మనిషి సుఖంగా బ్రతకడం నేర్చాడు. ఆత్మ ప్రశాంతంగా ఉండి మనిషిని పట్టించుకోవడం మానివేసింది. మనిషి ప్రకృతిని జయించాలని, తన చెప్పుచేతల్లో పెట్టుకోవాలని

తొలి నుండి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ సాధ్యపడడం లేదు. మనిషి అత్యాశతో ఉన్నంతకాలం అరాచకమే ధర్మంగా చలామణీ అవుతుంది.

హృదయంలోని జీవుడు మనస్సును స్వేచ్ఛగా ఉండనివ్వడు. ప్రకృతిని లోబరచుకోవాలనే మనిషిని భగవంతుడు క్షమించడు. విశ్వాత్మ అనేక రూపాలు ధరించగలదు. పరమాత్మ స్పర్శకు విధిసైతం ప్రయ్యలవుతుంది. జీవితం అలా సాగుతూ ఎక్కడో ఒక పెద్ద మలుపు తిరుగుతుంది. అప్పుడు మానవమేధ పరమాత్మను గుర్తిస్తుంది. సత్యాన్ని కోరుతుంది. మనిషి తన ప్రయత్నాలన్నీ విఫలమైనపుడు గానీ ఆత్మను ఆశ్రయించడు. పరమాత్మను స్మరించడు. తన శక్తిని మించిన పరాశక్తి ఒకటి ఉన్నదని తెలుసుకోడు.

నేలబారు జీవితంలోనూ చైతన్యం పొందవచ్చు. సూర్యరశ్మి నేలను సోకగానే చైతన్యం కలుగుతుంది. వేడి పుడుతుంది. భౌతిక జీవితంలోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుంది. ఇహలోక సుఖాలు అనుభవిస్తూనే పరలోకాన్ని చేరవచ్చు. భాను మండలాలలో సర్వం కాంతిపూర్ణమే. ఈ లోకంలో అరూపంగా కనిపించేవి అక్కడ రూపాల్ని పొందుతాయి. ఇక్కడ సంకరంగా, అపవిత్రంగా ఉన్నవి అక్కడ పవిత్రత పొందుతాయి. అయినా అన్నీ క్షణికాలే. క్షణంలో మాయమవుతాయి.

ప్రజ్ఞ – మన కర్మలకు అతీతంగా పనిచేస్తుంది. సత్యాన్ని దర్శిస్తుంది. మనిషికి, మనిషి ప్రవర్తనకు మధ్య నిలిచి సృష్టి వైచిత్రిని గమనిస్తుంది. దాని వెనక ఉన్న చాలనశక్తిని పరాశక్తిగా గుర్తిస్తుంది. ప్రజ్ఞ పొందిన మనిషి తన జ్ఞానంతో సత్కార్యాలు నిర్వహిస్తూ, మరిన్ని మంచిపనులు చేయాలని ప్రయత్నిస్తాడు. అందుకున్న వెలుగుతో తృప్తిపడక, మహాతేజస్సుకై తపస్సు చేస్తాడు. ధారణ చేస్తాడు. అతని చుట్టూ తేజోవలయం ఏర్పడుతుంది. ఆత్మశక్తి పెరుగుతుంది. తనకున్న పరిధిలోనే శ్రమిస్తాడు. తనలోని ఔన్నత్యం గుర్తించి దానిని విశ్వకళ్యాణ కార్యానికి వినియోగిస్తాడు. అది తన కర్తవ్యంగా భావిస్తాడు.

వివేకానికి సృష్టిరహస్యం అందదు. బుద్ధి, జ్ఞానం సత్యాన్ని తెలుసుకోలేవు. సత్యం ఆలోచనల పరదాల చాటున, బుద్ధికి దూరంగా ఉంటుంది. ఆత్మ మాత్రమే అక్కడికి చేరగలదు. ఆత్మజ్ఞానం అలవడని వారికి సత్యం అసలు తెలియదు. మనస్సు చిన్నచిన్న విషయాలనే ఆలోచిస్తుంది. ఆత్మస్పర్శ వల్ల సత్యస్ఫూర్తి కలుగుతుంది. అది మనిషిని అజ్ఞానం నుండి సగం ఉద్ధరిస్తుంది. నిద్ర లేపుతుంది. అజ్ఞానంలో ఉన్నవారికి సత్యం తనను గుర్తించేటట్లు, తన రూపాలను దర్శించేటట్లు చేస్తుంది. సత్య సంపూర్ణ దర్శనం అయ్యేది ఆత్మకు.

మన వివేకం ఏ కొద్దిగా పనిచేసినా ఒక మెట్టు పైకి పోయి, అనుభూతి చెందగలం. జ్ఞానం, వివేకం అన్నవి బ్రహ్మానందానుభూతి ముందు నిలబడవు. అసలు సిసలైన ఆనందం పరమాత్మ అనుభూతితోనే లభిస్తుంది. మన వివేకం, ఆలోచన హెచ్చరిస్తాయి – స్థిరసంకల్పం కలిగి ఆత్మసమర్పణ చేసుకున్నవారే లక్ష్యాన్ని చేరగలరని. జీవుడు కొంతవరకుపోయి మరల అజ్ఞానంలోకి జారి పోతుంటాడు. జీవుడు తెలుసుకునేవి పాక్షిక సత్యాలు, అర్థ సత్యాలు. తానై పరమాత్మకు అంకితం కావాలని జీవుడు ఆరాటపడడు. సత్యం నిగూఢంగా ఉన్నంతకాలం జీవునికి ఏమీ అర్థం కాదు. అంతా అయోమయం. ఆత్మను ముందుగా దర్శించగలిగితే దాని వెంట సత్యం దర్శనమవుతుంది.

సర్వం ఖల్విదం బ్రహ్మ అన్న ఊహతో ఆత్మ తనది కాని దివ్యతేజస్సును వాంఛిస్తుంది. ఆత్మ తనను తాను గుర్తించినపుడు తనలో పరమాత్మను పోల్చుకో గలుగుతుంది. జీవునికి, వివేకానికి సత్యం యొక్క ప్రతి రూపం, ఒక ఛాయ మాత్రమే కనిపిస్తుంది. పరమాత్మను తన హృదయంలోనే ప్రతిష్టించుకోవాలన్న జీవుని ప్రయత్నం సఫలం కాదు. తనలోని ఆత్మద్వారా ఆ పని కొంతవరకు నెరవేరుతుంది.

పరమాత్మను సంపూర్ణంగా దర్శించడం అసాధ్యం. ఎప్పుడో రెండు దివ్య నేత్రాలు కనిపిస్తాయి. ఒక జ్యోతి కనిపిస్తుంది. అదే పరంజ్యోతి, పరమాత్మ వెలుగు అనుకోవాలి. మనం బుద్ధి దాటి పోము కనుక స్వస్వరూపం తెలియదు. 'బుద్ధి మసకమారి' అడ్డు నిలుస్తుంది. మన ఆత్మకూడా ఎప్పుడోతప్ప పరమాత్మను పూర్తిగా దర్శించదు. మనం ఈ చిన్న చేతులతో బ్రహ్మాండమంతా నిండిన పరమాత్మను ఎలా పట్టుకోగలం!

పరప్రజ్ఞ అనేక మార్గాలలో, అనేక రూపాలతో, మనలో ప్రవేశిస్తుంది. కారుమేఘాల మాటున దాగిన నక్షత్రకాంతి అది. మనం చూచినా గుర్తించలేని రూపంలో ఉంటుంది. ఈ లోకంలో దాని ప్రతిరూపాలకై అన్వేషిస్తాం. ఎక్కడ వినిర్మలానందం కనిపించినా అది సచ్చిదానందమే. ఎప్పుడో ఒకరోజున పరేంగిత ప్రజ్ఞ చీకట్లను చీల్చుకుని, అజ్ఞానాన్ని తరిమివేసి, మనలో చొరబడుతుంది. అప్పుడు మన జీవనశైలిలోనే మార్పు వస్తుంది. దృక్పథంలో మార్పు కనిపిస్తుంది. అది జ్ఞానం. అది సుజ్ఞానం. అప్పుడు మనకు ఎదురయ్యేవి చీకట్లు కావు. వెలుగు నెగళ్లు. కొంతకాలం ప్రజ్ఞ మన అజ్ఞానంతో చెలిమి చేస్తుంది. చేయి చేయి

కలుపుతుంది. తానే చీకటి దారులలో నడిపించి వెలుగులోకి తీసుకుపోతుంది.

చీకటి ముడుల్ని మనం విప్పలేం. చీకటి చిక్కు దారాలని సరిచేయలేం. ప్రయత్నిస్తే విడిన దారాలు మనల్ని చిక్కుల్లో ముడివేస్తాయి. సంఘర్షణ తప్పదు. ఎప్పుడో మనం చేస్తున్న తప్పుల్ని తెలుసుకుంటాం. జ్ఞానాగ్ని రగులుతుంది. వెలుగులోకి వస్తాం. అప్పుడు మన భావనలే పవిత్రంగా మారతాయి. హృదయం ఉపనిషత్సత్యాలను వినిపిస్తుంది. అవి జ్ఞానంతో కలిసిన సత్యాలని తెలుస్తుంటాయి. ఆ సందేశాలపై పరమాత్మ ఆమోదముద్ర కనిపిస్తుంది. పరంజ్యోతి నుండి వెలువడే వెలుగుకిరణాలవి.

పరలోకాల నుండి వెలువడిన తేజస్సు ప్రజ్ఞగా ప్రపంచంలోకి ప్రవహిస్తుంది. ప్రపంచాన్ని చుట్టివేస్తుంది. అది చైతన్య ప్రవాహాలను దాటి మార్మిక హృదయాలను స్పృశిస్తుంది. అది యోగుల హృదయాల్ని చైతన్యపూర్ణం చేస్తుంది. కాంతిపూర్ణం చేస్తుంది. అప్పుడు యోగి అపూర్వ జ్ఞానభాండాలను స్వయంగా అందుకుంటాడు. సత్యాలు నేరుగా అతనికి అందుతాయి. ఆ ప్రజ్ఞ పరమాత్మకు, పరలోకానికి సన్నిహితం.

త్రిమూర్త్యాత్మకమైన ప్రజ్ఞను పొందిన జ్ఞానులు ప్రాణస్పందన, చలనం లేని శూన్యరోదసిలో పరబ్రహ్మాన్ని ఆరాధిస్తుంటారు. వారు స్వర్గాలు, స్వర్గసుఖాలు కోరరు. కాలచక్ర భ్రమణంలోకి రారు. సరాసరి బ్రహ్మాన్ని చేరడమే వారి ఏకైక లక్ష్యం. ఆ మహోన్నత స్థితినుండి వారు లోకాన్ని గమనిస్తుంటారు. వారు సూర్య చంద్రుల వలె లోకానికి వెలుగు, వెన్నెల ప్రసాదిస్తారు. వారిది లోకోద్ధారక శక్తి. జీవన రథాన్ని నడిపించేది అదే శక్తి. దివ్యపథాలకు చేర్చేదీ అదే. శూన్య రోదసి, నీలి గగనాలు వారికి ఆవాసమైనా వారి శక్తి, తేజస్సు ఏకమై భానుమండలం వలె ప్రకాశిస్తుంది. ఆ శక్తికి పరమాత్మ అతి సమీపం. అది దివ్యసందేశాలను మానవులకు అందిస్తుంది.

ఆ శక్తి, తేజస్సు మనలో ప్రవేశించి స్థిరపడినప్పుడు సంప్రదాయపు రాతి కోటల్ని బ్రద్దలు కొట్టగలం. మనల్ని బంధించిన ఆచారాల తాళ్లను తెంచుకోగలం. పూర్వపద్ధతుల్ని వదలి, మనదైన మార్గాన్ని ఎన్నుకోగలం. అతీంద్రియ ప్రజ్ఞ అన్ని కర్మలను నిర్మూలిస్తుంది. ఆత్మ రెక్కలు కట్టుకుని భవిష్యత్తులోకి పరంవైపుగా ఎగిరిపోయి, తన కలలకు సుందర మందిరాలు నిర్మించుకుంటుంది. అది భవిష్యత్తును దర్శించగలదు కాని కొత్తగా తానేమీ సృష్టించుకోదు. తన స్వప్నాలకు

సుందరరూపాల్ని సంతరించగలదు. లోకంలో ఏ మానవుడు సృష్టికి ప్రతిసృష్టి చేయలేడు. ఉన్నదానిని దర్శించడమే గొప్ప. గోచర, అగోచరాలను దర్శిస్తే చాలు.

కాలు నిలవని శూన్యంలో ఆత్మ అరూప భావాలను పండిస్తుంది. వాటికి జీవం పోసి లోకంలోకి పంపడం తెలియదు. ప్రజ్ఞతో జరుగుతున్న దానిని మాత్రం గమనిస్తుంది. అతీంద్రియ, భావాతీత మండలాలలో స్థిరంగా ఉంటూ ఆత్మ మన ఈ లోకాన్ని పాలించగలదు. సరిదిద్దగలదు. తాను మాత్రం శూన్యంలో తేజస్సుగా ఉండిపోతుంది.

45. మహర్లోకాలు

మనిషి మేధ కల్పించే మూడులోకాలు దాటిపోవాలి ... అశ్వపతి అలా ముందుకుపోగా దివ్యరోచిస్సులు స్వాగతించాయి. అది ఆత్మ స్థితి. మానసిక స్థితుల్ని దాటినప్పుడు ఆత్మ స్వతంత్రిస్తుంది. అసలు సుఖం స్వర్గంలో లేదు. 'స్వ' స్థితిని వదిలి 'ఆత్మ'లో లీనమైనప్పుడు మూడులోకాలు ఎదురౌతాయి. అవి భూలోకానికి దగ్గర. అక్కడ జీవులు మనుషుల్లాటివారు. వారు మానవ రూపాలకు పూర్ణస్వరూపులు. అది ఆత్మ తొలిలోకం. అక్కడ కొంత సత్యలోక పరిజ్ఞానం అలవడుతుంది. అది స్వర్గం కాదు, భూలోకం కాదు. మధ్యస్థమైన సుందరసీమ. అక్కడివారికి మనుషులతో సఖ్యసంబంధాలు ఉంటాయి. వారి సంకల్పం మేరకు ఇక్కడ మనుషులు ప్రవర్తిస్తారు.

రెండవలోకం సూక్ష్మశరీరులుండేది. వీరి శక్తి అనుపమానం. వీరు సత్యాన్ని ఇట్టే గ్రహించగలరు. వీరివి దేవతా శక్తులు. కానీ వీరు దేవుళ్లు, దేవతలు కారు – పుణ్యపురుషులు. మూడవది చైతన్యలోకం. ఇక్కడకు చేరడం బహు కష్టం. స్వతంత్రంగా తపస్సు చేసి పండిపోయినవారు మాత్రమే ఇక్కడకు చేరతారు. వారికి కోరిక లుండవు. అక్కడినుండి సరాసరి సత్యలోకాలకే ప్రయాణం. అక్కడకు చేరినవారు మళ్లీ జన్మించరు. అది మహర్షుల తపోభూమి.

ఆపైన మన శక్తియుక్తులు పనిచేయవు. మనస్సు పూర్తిగా లుప్తమవుతుంది. మానసికశక్తులు నిష్క్రమిస్తాయి. తపోశక్తి ఒక్కటే ఆధారం. అక్కడితో సృష్టి అంతమైనట్లు కాదు. జీవుని పని పూర్తయినట్లు కాదు. మానవ మేధ స్థానంలో దివ్యభావన ప్రవేశిస్తుంది. భౌతికత్వం ఆపైన నిష్ప్రయోజనం. మనస్సులోని అన్ని జాగాలలో దివ్యత్వం నిండిపోతుంది. అక్కడినుండి అన్నివైపుల శూన్యంలోకి ఎగబ్రాకాలని యత్నిస్తుంది.

దివ్యత్వం ఆత్మభూమికపై అనంతంగా ప్రవహిస్తుంది. ప్రశాంతిని అన్వేషిస్తూ పరుగుతీస్తుంది. ఆధ్యాత్మిక శక్తి ముందు అమాయకంగా నిలబడుతుంది. మనస్సు శిఖరాలను దిగివచ్చి నిష్క్రమిస్తుంది. అప్పుడు భావాతీతస్థితి ఏర్పడుతుంది.

కారణం – ఆత్మ. ఆత్మ అనంతం ... అనశ్వరం. మనస్సు వల్ల, ఆలోచన వల్ల ఆత్మ ఏర్పడదు. ఆలోచన కారణంగా ప్రజ్ఞ ఏర్పడదు. ఆత్మ తానుగా ఏర్పడి, తన ఉనికిని స్థిరపరచుకుంటుంది. అది రూపం, భావం లేని చోటులలో సంచరిస్తుంది. అయితే ఆత్మ నెలకొనడానికి భౌతిక శరీరం అవసరం. భౌతిక శరీరాన్ని అంటీముట్టకుండా దానిలోపల అరూపంగా, అదృశ్యంగా ఉంటుంది. శరీరానికి తెలియకుండా ఆత్మ రెక్కలు కట్టుకుని ఆకాశంలోకి ఎగిరిపోతుంది.

రోదసిలో, శూన్యంలో ఆత్మ తనని తాను గుర్తిస్తుంది. తన శక్తి అపారమని, పారమాత్మికమని తెలుసుకుంటుంది. గుర్తించిన ఆత్మకు శక్తులు, మహత్తులు, సిద్ధులు ఏర్పడతాయి. మనస్సును వదలి దివ్యభావనతో ఆత్మ సంచరించి తన కొక లోకాన్ని ఏర్పరచుకోగలదు. ఆత్మశిఖరంపైన ఆలోచనలు ఉండవు. మనిషి చూపుకు అందని అనంత శూన్య సీమలవి. నీలి గగనాల క్రిందుగా, మేధ తాలూకు వెలుగులు కనిపిస్తుంటాయి. ఆత్మను ఆలంబన చేసుకుంటే మనకు పరిచయం లేని మహర్లోకాలకు చేరతాం.

మనిషి ఔన్నత్యాలకు, ప్రతిభకు, ప్రజ్ఞకు మూలం ఆత్మ. మనం ఆశించే అనంత జిజ్ఞాస అదే. మనిషి శక్తి సామర్థ్యాలకు మూలస్థానం అదే. మన ఆశలు నెరవేరడానికి అక్కడ నుండి అనుమతి లభించవలసిందే. లోకం విస్తరించినంత మేర దాని ప్రభావం సోకుతుంది. అది దివ్యస్వప్నాలను సైతం దాటిపోతుంది. దాని ప్రభావంతోనే మనం జీవితంలో ఉన్నతస్థితులు పొందగలుగుతాం. అది భావాతీత తేజోమండలం. అక్కడ అద్భుతమైన సంపద లున్నాయి. వాటి ప్రభావం మానవ జీవితాలపైన పడుతుంది. అది కాలవేగాన్ని మించిన వేగంతో పయనించ గలదు. దాని శక్తి ప్రపంచ నియమాలను పాటించదు. మన ధర్మసూత్రాలు అక్కడ వర్తించవు. ప్రజ్ఞ మనిషికి, భగవంతునికి మధ్య వారధి. దాని తేజస్సును పొంది అజ్ఞానంతో, మృత్యువుతో పోరాడవచ్చు.

నిర్గుణ, నిర్వికార రోదసిలో పరాశక్తి, సౌందర్యం చేయిచేయి కలిపి స్నేహం చేస్తాయి. ఆత్మగత సత్యాలు దేవతారూపం ధరిస్తాయి. ఆ దేవతలు ప్రతిఒక్కరు తనకొరకు ఒక లోకాన్ని సృష్టించుకుంటారు. అక్కడ ఎవరిపైన శాపాల, పాపాల ముద్రలుండవు. స్వచ్ఛమైన తేజస్సుతో సత్యం ప్రకాశిస్తుంది. ఆ పరమసత్యంతో

సంధానపరిచేది తపస్సు. అక్కడ ఎవరికీ దృష్టి చెడదు. ఆలోచన వృధా పోదు. భూలోకంలోని కష్టాలు, కన్నీళ్లు అక్కడ ఉండవు. ఆ తేజోలోకాలలో స్వప్నజీవితం గడుపుతూ అమృతత్వం పొందవచ్చు.

ఆ లోకం ఆనందపూర్ణం, తేజోమయం, శక్తినిలయం. అక్కడ చేరిన వారంతా మహాపురుషులు, ఋషులు, మహాత్ములు. వారు సచ్చిదానందం తమ స్వంతం చేసుకుని, దివ్యులై, తేజశ్శరీరాలతో భాసిస్తుంటారు. మన శ్రమ, ఆర్తి, ఆరాటం అక్కడ ఉండవు. అవి సర్వసంపూర్ణ పవిత్రసీమలు. మనిషి అసమగ్ర ఆలోచనలు అక్కడ నిలవవు. ప్రాపంచికమైన కలతలు, కల్లోలాలు అక్కడ మచ్చుకు కనిపించవు.

మన జీవాత్మలు ప్రపంచసుఖాలు మరిగి, బాంధవ్య మమకారాలు తెంచుకోలేక, ఈ ప్రపంచంలో మళ్లీ మళ్లీ జన్మిస్తుంటాయి. రోదసీ సువర్ణ రోచిస్సులను ఛేదించుకుని ఒక తేజోకిరణం మనిషి నైరాశ్య జీవితం పైన సోకుతుంది. స్వర్గ లోకాల నుండి ఒక దివ్యసంకల్పం దిగివచ్చి మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. మనకు తెలియకుండా ఒక దివ్యాంశ మనలో ప్రవేశించి, ఒక మహత్తు చూపించి, మన జీవన వృక్షానికి కొత్తచివుళ్లు తొడుగుతుంది.

మన జీవితాలు బరువుగా, భారంగా సాగుతుంటాయి. మానవ నైజానికి, స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తిస్తాం. ఉండదగిన విషయాలపై మనకు విశ్వాసం కలగదు. లోకంలోని సుఖదుఃఖాలకు అంతులేని ప్రాధాన్యత నిస్తాం. పరమాత్మను చేరుకోవాలన్న చిరుకోరిక హృదయంలో ఏమూలనో దాగి ఉంటుంది. ఆ కోరికను ఆత్మ రక్షిస్తూ ఉంటుంది. మన లక్ష్యం బలంగా ఉన్నప్పుడు పరిసర ప్రభావాలు మనపైన పడవు. బంగారు భవిష్యత్తు మనలోకి తొంగిచూస్తుంది. అప్పుడు భగవంతుని చూపు మనపైన ప్రసరిస్తుంది. భగవదనుగ్రహంతో అసంభవ కార్యాలు సైతం సులభంగా నెరవేరతాయి. మనిషి సహజంగా వికాసంచెంది మహాత్ముడు కాగలడు. ఆ దివ్యసంకల్పాన్ని మృత్యువు సైతం కదిలించలేదు. మన ప్రయత్నాలు విఫలమైనా మనలో చైతన్యం నిండుగా ఉంటుంది. సంకల్పం చెదరనంత కాలం మనం ప్రగతిబాటలో పయనిస్తున్నట్లే. కానప్పుడు జీవితం ఎంతగా వృధా చేసుకున్నామో అనిపిస్తుంది!

ప్రోత్సాహం వేరెక్కడ నుండో లభించదు. ఈ లోకం మనది. ఇక్కడ జీవిస్తున్నది మనం. భౌతిక ప్రపంచపు సరిహద్దులు దాటిపోవలసిందీ మనమే.

ఎవరో వచ్చి మనల్ని ఉద్ధరించరు. సాహసం చేయవలసింది మనం. పైలోకంలోకి ప్రవేశార్హతలు మనమే సంపాదించుకోవాలి. మన హక్కులు మనం వెతుక్కోవాలి. స్వర్గాన్ని వదలి భూలోక జీవనాన్ని వరించింది మనమే. ఇక్కడ మనం ప్రవాసులం. మనస్సు జాగృతమైనపుడు ఒక వెలుగుకిరణం ఆత్మను నిద్రలేపి మనకు పరిచయం చేస్తుంది. మన ఆత్మను మనం గుర్తిస్తే అజ్ఞానం మనల్ని వదిలినట్లే.

జీవుడు భూలోకంలో ఒక ప్రవాసిగా జీవిస్తూ అవిరళ కృషి చేసి, జీవన లాలస పెంచుకుని ప్రపంచానికి బందీ అవుతున్నాడు. ఇక్కడ సమకూర్చుకున్న గుణాలు క్రౌర్యం, కాఠిన్యం, కల్మషం వదులుకోలేకపోతాడు. అయినా స్వర్గసుఖాలు, దివ్యలోకాలు కావాలని కలలు కంటాడు. తాను ఊహించిన దేవతలవలె జీవించా లనుకుంటాడు. తన పూర్వపు ఔన్నత్యాన్ని స్మరించుకుంటూ బ్రతుకుతుంటాడు. ప్రపంచంలో కల్మషం, కశ్మలం మధ్య బ్రతుకుతూ ఏవేవో ఔన్నత్యాలను ఊహించు కుంటాడు. దివ్య, సుందర, ఆనంద లోకాలు వాంఛిస్తాడు. చేజార్చుకున్న స్వర్గాలు తనలో కనీసం స్మృతులుగానైనా మిగలవు. అందుకే అనవరతం అసంతృప్తి, చిరాకు, వైరాగ్యం. ఊహల్లో మునిగితేలడం, వాస్తవానికి సత్యానికి దూరం కావడం జరుగుతుంది.

ఆత్మ వెలుగు వెన్నెల బాటలలో పయనిస్తూ తన తేజస్సుకు తానే ఛాయగా మారుతుంది. ప్రపంచంలో అవక తవకలకు నాయకత్వం వహిస్తున్నది తానేనని తెలుసుకోదు. ప్రపంచ సుఖాలే నిత్యసత్యాలుగా భ్రమించి మనస్సును, శరీరాన్ని అందుకు సిద్ధం చేస్తుంది. ఈ అవాస్తవాలలో చిక్కి అసలు లక్ష్యాన్ని మరచిపోతుంది. తను వదులుకున్న శక్తుల్ని, హక్కుల్ని పొందాలని ఆత్మ ప్రయత్నించడమే సాధన తొలిమెట్టు – జిజ్ఞాస. ఆత్మ సామ్రాజ్యం తనది. తానే అధిపతి. జన్మకు రాని ఆత్మల మధ్య తన స్థానం సుస్థిరంగానే ఉంటుంది. తన అమృతత్వం ఎప్పటికీ చెక్కుచెదరదు. తన సచ్చిదానందం ఎన్నటికీ తరిగిపోదు.

ఇక్కడ మనం కనే స్వప్నాలు ఆ పైలోకాలలో వాస్తవాలు. ఆంతర్యం వాటి సత్యాలను దాచిపెడుతుంది. మనం ఉన్నతస్థితికి చేరినపుడు ఆ వాస్తవాలు మనకు అందుబాటులోకి వస్తాయి. అవి మన ఆలోచనల్లో మనోభూమికపై ఎంతో కాలంగా ఉన్నవే. మన భౌతిక మనో సంకల్పాలు, కోరికలు వాటిని చీకట్లోకి తోసి వేస్తాయి. మన ఆలోచనలు దివ్యత్వాన్ని మనవేపు రాకుండా నిరోధిస్తాయి. అవి ఆధ్యాత్మిక శిఖరాలపైన మనకోసం నిరీక్షిస్తుంటాయి. ఆ శిఖరాలు బయట ఎక్కడో ఉన్నవి కావు – మన లోపలివే. అదృశ్యంగా, గుప్తంగా ఉండి సమయంకోసం ఎదురు

చూస్తుంటాయి. ఆత్మ జాగృతమైన క్షణంలో అవి మెరుపుల్లా బయటకొస్తాయి. వాటి సౌందర్యం, శక్తి, ఔన్నత్యం మన ఊహలకు అందవు.

వాటి తాలూకు అనుభూతి అప్పుడప్పుడు మనకు కలుగుతుంది. అనుభూతి చెందిన మేరకు ఆ స్వర్గసుఖాలను, సవర్నశిఖరాలను ఆశిస్తాం. ఆధ్యాత్మిక మార్మిక గుహలలో అవి దాగి ఉంటాయి. అప్పుడప్పుడు మన మనస్సులోకి, ఆలోచనల్లోకి తొంగిచూస్తుంటాయి. ఆత్మలు మాత్రమే ఆ తేజస్సులో పయనించగలవు. అవి ఆత్మకు పరిచయమైన ప్రదేశాలు.

ఆపైన నీలినీడల పరదాలు కనిపించవు. మానససీమలో పరమాత్మభావన ప్రవేశిస్తుంది. అప్పుడు మనకు బ్రహ్మానందపు తొలి అనుభూతి కలుగుతుంది. ఆ నిర్మల ప్రశాంత సీమలో అశ్వపతి అద్భుత తేజస్సును దర్శించాడు. అవి కాంతి సీమలు, భావనాలోకాలు. ప్రతి పనికి అక్కడ ప్రజ్ఞ ప్రధానం. మన వివేకం, విజ్ఞత అసలు పనిచేయవు. అక్కడ పదార్థం వేరుగా ఉండదు. ప్రతి సంకల్పం పదార్థ విజ్ఞానమే. అనుభూతి రెక్కలు విదిల్చి స్వేచ్ఛగా విహరిస్తుంది. సత్యం మనల్ని ప్రేమగా లాలిస్తుంది. ఒక్క కాంతికిరణం చాలు ఆ లోకాలను దర్శించడానికి. సంకల్పమనే రథమే అన్ని తావులకు తీసుకుపోతుంది. అక్కడ జీవించడం అంటే చైతన్యం పొందడం. అన్ని లోకాల జ్ఞానం మనకు అందుబాటులో ఉంటుంది. చిరుసత్యాలే అద్భుతమైన ఆనందాన్ని కలిగిస్తాయి. ఆ ఆనందమే ఆ లోకాన్ని అమృతమయం చేస్తుంది. హృదయాన్ని బ్రహ్మానంద పారవశ్యంతో నింపుతుంది. అక్కడ లభించే సచ్చిదానందం అపూర్వం, అనంతం. అగోచరం నుండి అఖండ ప్రజ్ఞ ప్రభవిస్తుంది. అనూహ్యంగా అమరత్వం మనదవుతుంది.

అక్కడ ఆకాశంలో పరుచుకునే అరుణకాంతులు శక్తిని, ప్రజ్ఞను అందిస్తాయి. అదే పరమాత్మ పాదపంకేరుహనీలిమ. పరమసత్యం సువర్ణకాంతి కిరణ పుంజంలా, దివ్యతేజస్సు ప్రవాహ సదృశంగా అందుతుంది. అది మహాప్రశాంతి. అది కాంతివనం. ఆ సహజావాసాలు మనకు ఆవాసాలవుతాయి.

తపస్సు పరాకాష్టకు చేరినపుడు అతీంద్రియ స్థితిలో నిర్వికల్ప సమాధి ఏర్పడుతుంది. అప్పుడు ఆధ్యాత్మిక శిఖరాలను దర్శించగలం. అక్కడ కాలనియమం ఉండదు. ప్రకృతి స్వచ్ఛందంగా ఆత్మలో లీనమవుతుంది. ఆత్మ పరమాత్మ దాపులకు పరుగుతీస్తుంది. అక్కడ త్రిగుణాతీతమైన చిన్నలోకం ఎదురవుతుంది. అది ఆరోహణపథంలో తొలిప్రస్థానం. ఆపైవన్నీ తేజోలోకాలు. ఒక్కొక్క శూన్యాన్ని

దాటుకుంటూ పైపైకి పోవలసి ఉంటుంది. శూన్యంలో అనేక కాంతిసీమలు కనిపిస్తాయి. ఆ శాంతిలోనే అమరత్వం.

ఆ లోకాలు దివ్యం, శక్తిపూర్ణం, అమృతమయం అయినా తొలి లోకాలు మానవప్రజ్ఞకు అందేటంత దగ్గరగా ఉంటాయి. అక్కడ అధిదేవతలు మనకు ఆలోచనలు కలిగిస్తుంటారు. వారి సుగుణాలను, ఔన్నత్యాన్ని కొంత మనకు పంచియిస్తారు. ఎంత ఉన్నతస్థితికి చేరినా మన ఆత్మలు అక్కడి శిఖరాలను అందుకోలేవు. ముల్లోకాలను చేరడానికి మూడుమార్గాలు ఉన్నాయి. సాధారణ ప్రజ్ఞతో ఆ లోకాలు చేరడం కష్టం. మనం ఎంతపైకి వెళ్లినా మన దృష్టి నేల పారుగానే ఉంటుంది. కొన్ని బాటలు నిలువుగా ఉంటాయి. కొన్ని వాలుగా ఉంటాయి. నిలువు మార్గాన అందరూ పోలేరు. వాలుమార్గాన వెళ్లినవారు క్రింది లోకాలను చూస్తూ, మానవ ప్రపంచంతో సంబంధాలు కొనసాగించవచ్చు.

ఆత్మ పురోగమిస్తున్నప్పుడు కొన్ని శక్తులు ఉపాసనా మంత్రసిద్ధికి అడ్డుపడతాయి. ఆత్మాభివృద్ధికి అవరోధం కలిగిస్తాయి. పరవిద్యను వేయి సూత్రాలతో బంధించి ఆత్మను చికాకు పెడతాయి. మొత్తంమీద జీవితానికి దివ్యత్వాన్ని అందిస్తాయి. అక్కడివారు ప్రజ్ఞకు, ధర్మానికి కర్తలు. సత్యానికి ప్రతినిధులు. మనస్సుకు, మహాత్మకు మధ్య సంధాతలు. దివ్యత్వాన్ని లోకానికి అందించగలవారు. అగోచరానికి రూపం అద్ది, పరమాత్మ ప్రతినిధులై లోకాలకు తేజస్సును, గోళాలకు కాంతిని అందిస్తారు. అవి అన్నీ సంకేతాలు. లోకానికి వెలుగు అందించేవి అవే. ఆ వెలుగులో మనం దివ్యత్వాన్ని అన్వేషించాలి. మార్మిక సత్యంలో అనేక రూపాలున్నాయి. వాటిని అందుకోగలిగితే అవే స్వర్గాలు. వారే దేవతలు.

ఆ దివ్యసీమలను చేరడం మన తొలి ప్రయత్నం. అక్కడ లభించేది స్వల్పం. కాని మనిషికి సరైన నిర్వచనం అక్కడే లభిస్తుంది. సంపూర్ణానందానికి అవి చిహ్నాలు. కాని ప్రకృతి శక్తుల అవరోధం తప్పదు. అక్కడ జీవునికి తన నిజస్థితి తెలుస్తుంది. చెరిగిన భగవంతుని రూపమే మనిషి. ఆపైన క్రమంగా దేవతల దర్శనం లభిస్తుంది. వారు కాలాతీతమూర్తులు, బ్రహ్మానందజీవులు. అటు ప్రకృతికి, ఇటు పరమాత్మకు దేవతలు ప్రీతిపాత్రులు. వారు మేధపై వత్తిడితెచ్చి ద్రవ్య ప్రపంచాన్ని కల్పిస్తారు. వారి సూక్ష్మశక్తులు మానవ జీవితానికి ఆరంభాలు. వారు అకృత్యాలను సైతం కల్పిస్తుంటారు. వారంతా నిత్యయౌవనులు, పరమాత్మ ముద్దుబిడ్డలు. ఈ లోకాలలో జీవించడం వారికి నిత్య క్రీడ.

ఈ మహాసృష్టికి వారంతా శిల్పులు, కళాకారులు, కార్మికులు, శ్రామికులు, రోదసిని గణితం వేయగలవారు. పరమాత్మను నేపథ్యంలో ఉంచి అన్ని బాధ్యతలు తామే నిర్వహిస్తారు. పరమేశ్వరుని సంకల్పం మేరకు ఆత్మలకు జన్మకార్యక్రమం వీరే నిర్దేశిస్తారు. మనస్సు ద్వారా, వివేకం ద్వారా ఆత్మలు జ్ఞానం పొందేటట్లు చేస్తారు. ఆత్మలకు మాత్రమే దివ్యజ్ఞానం అందిస్తారు. ఆత్మలు గ్రహించిన ప్రజ్ఞను దేవతలు ఉపయోగించుకుని ప్రకృతిలో సాదృశ్య రూపాలను దిద్దుతారు. అగోచరానికి గోచర రూప కల్పన చేస్తారు.

పరమాత్మ శక్తి యావత్తు పరబ్రహ్మ సచ్చిదానంద హేతువవుతుంది. ఆ శక్తిని జ్ఞానంతో సంపాదించి విశ్వపరిణామానికి ఉపయోగించాలి. క్రమబద్ధంగా విశ్వం సాగుతున్నట్లు అనిపిస్తుంది. విశ్వం ఒక సమగ్రరూపం. పరమాత్మ కొన్ని ఆత్మలకే అందుతుంది. ప్రతి అణువులోను బ్రహ్మాండం ప్రతిబింబిస్తుంది. ప్రతి అణువు బ్రహ్మాండానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. కాలం క్షణాలుగా మారింది ... బ్రహ్మాండం అణువులుగా మారినట్లు.

అదృశ్యంగా ఉన్న మహాత్ముల సంకల్పమే విశ్వశక్తి. సృష్టి మొత్తం అంకెల గారడి, సంకేతాల పారడి. అపూర్వం, అపురూపం అయిన విశ్వంలో అందం, ఆధిక్యత చోటుచేసుకున్నాయి. మహాత్ములు సంకల్పం చేస్తే రూపం, గుణం ఏక మవుతాయి. ప్రతిసంఘటనపై మహాత్ముల ప్రభావం ఉంటుంది. పరిసరాలపై దివ్యత్వం ప్రసరిస్తుంది. సంకల్పం దివ్యసంఘటన కాదు. ఆత్మ చేస్తున్న మహ త్కార్యం కాదు. అన్నీ దైవికంగా జరుగుతున్నట్లు అనిపిస్తాయి. అన్నీ భగవత్ కార్యాలే, విద్యుక్తధర్మాలే అనిపిస్తాయి. ఆ స్థితికి చేరడం అంటే ఆధ్యాత్మికంగా రెండవమెట్టు పైకి ఎక్కినట్లు అవుతుంది.

మనం ఆర్జించిన శక్తి ఏదైనా కొద్దికాలమే నిలుస్తుంది. ఆర్జిత శక్తుల ప్రభావం ఎప్పుడూ పరిమితమే. అనేక శక్తులు కలిసినప్పుడే ఒక మహత్కార్యం చేయ వీలుపడుతుంది. ప్రతిక్షణం ఆ శక్తులు నిరూపితమవుతుంటాయి. మహత్కార్యాలు దైవఘటనలు. అవి భగవంతుని నిర్ణయాలు. ఆ దివ్యమూర్తుల నిర్ణయాలు అనింద్యాలు. అవి మన మనస్సులపై మెరుపులవలె దాడిచేస్తాయి. అవి జీవితంలో అప్రయత్నంగా జరిగే సంఘటనలపై, సున్నిత భావాలపై ముద్ర వేస్తాయి.

పరమాత్మ నుండి ఆత్మ ప్రభవించినా ఆత్మ పరమాత్మకై అన్వేషిస్తుంది. ఒకనాడు శాశ్వతమైంది నేడు జనన మరణాలకు అనుబంధమైంది. తనదైన

అమరత్వాన్ని మరచి, జీవునితో కలసి మహాపాపాలు చేస్తుంది. మరల జ్ఞానం పొంది పరమాత్మ సన్నిధికి చేరాలని ఆరాటపడుతుంది. నశిస్తుందని తెలిసీ శరీరానికి పెద్దపీట వేస్తుంది. తన స్థితిని, ఉనికిని పూర్తిగా మరచిపోతుంది. ఎంత జ్ఞానం సంపాదించినా మనిషి నశించక తప్పదు. జ్ఞానం ఆత్మపర మవు తుంది. మళ్లీ మరో శరీరం ధరించే వరకు ఆ సంస్కారాన్ని ఆత్మ తనతోనే ఉంచు కుంటుంది.

ఈ ప్రపంచంలో జరిగే విషయాలు ఏవీ పరమాత్మ పట్టించుకోదు. విశ్వ ధర్మాలకు తనకు సంబంధం ఉండదు. ఇవి ఏవీ పరమాత్మ దృష్టిలోకి రావు. ప్రాపంచిక ఔన్నత్యాలన్నీ రోదసీ తీరాలలో కరిగిపోతాయి. కాలానికి అతీతమైన ఆత్మ కాలానికి బందీ అవుతుంది. బానిసలాగా సేవ చేస్తుంది. అన్ని అధికారాలు మనస్సుకు ధారాదత్తం చేసి, మనస్సే మనిషిపై ఆధిపత్యం వహించేటట్లు చేస్తుంది.

ప్రపంచంలో మనిషి వేయిమార్గాల వెలుగుకై అన్వేషిస్తాడు. సృష్టికి రాని శక్తి ప్రకృతిపై ఆధిపత్యం చలాయిస్తుంది. సృష్టి లోతులలో ఆత్మ దీపాలు వెలిగి స్తుంది. ఆ వెలుగుకు కాలంతో, దూరంతో, స్థితితో సంబంధం ఉండదు. అదే పరమాత్మ చిత్రచయనిక.

పైపైకి వెళ్లిన కొలదీ దేవతలు పలు హోదాలలో దర్శనమిస్తారు. అనిమేషులై అనవరతం అగోచరాన్ని అన్వేషిస్తుంటారు. వారి కళ్లు ప్రసరించే కాంతిలో తామే విశ్వానికి అధికారులమన్న అహం కనిపిస్తుంది. వారు మనస్సుతో జీవిస్తూ సత్యాన్ని గ్రహిస్తారు. మనం హృదయకేంద్రంపై అంతర్దృష్టిని నిలిపినపుడు కాలం తెరను తొలగించి దివ్యసత్యాలను దర్శించగలం. కనిపించే రూపాల వెనుక దాగిన కనిపించని సత్యాన్ని తెలుసుకోగలం.

ఆలోచనా పరిధినుండి జారిపోయిన సంగతులు దివ్యదృష్టికి కనిపిస్తాయి. ఇంద్రియాలకు పట్టుబడని విషయాలు అతీంద్రియ జ్ఞానానికి అందుతుంటాయి. కళాకారులు, శిల్పులు, గణితజ్ఞులు, దైవజ్ఞులు – అంతా సృష్టిరహస్యాలను విశ్లేషించి గోచరప్రపంచంతో కలుపుతుంటారు. వారి పరిధిలో అతీంద్రియశక్తిని పొందుతుంటారు. మహాశక్తిని అనేకరూపాల ఆరాధిస్తుంటారు. వారంతా మానసికంగా యోగులు. జగన్మాతను వివిధ రూపాలలో ఆరాధిస్తుంటారు. వారంతా ఆత్మాన్వేషులే. జగన్మాత సంకల్పాన్ని, సౌందర్యాలను అందుకుంటారు. తమ స్ఫూర్తికి, ప్రజ్ఞకు వివిధ కళా, వైజ్ఞానిక రూపాలు కల్పిస్తారు. అన్వేషించే జ్ఞాననేత్రానికి అగోచరం తెలుస్తుంది. పరమాత్మ రహస్యాలకు టీకా టిప్పణి

లభిస్తుంది. మహాశూన్యంలో సుందరచిత్రాలు, అంధకారంలో వెలుగురేకలు కనిపిస్తాయి. సృష్టిరహస్యం ఒక రేఖాగణితం.

అందుకున్న సంకేతాలకు ఒక క్రమం ఏర్పడి అనుశీలించినపుడు అతీంద్రియ ప్రతిభ ఒక మలుపు తిరుగుతుంది. సృష్టికి అర్థం, విశ్వానికి నిర్వచనం తెలుస్తుంది. ఆ స్థితి సమకూరిన తర్వాత జీవితంలో గొప్ప సంయమనం ఏర్పడుతుంది. అలా దివ్యత్వం, జగత్తత్వం అనుభవానికి అందుతుంది. విశ్వాన్ని విశ్లేషించడమే విజ్ఞానం. విజ్ఞాన శాస్త్రవేత్తలు ప్రకృతికి భాష్యం చెబుతారు. వారికి సృష్టిరహస్యం అంకెలలో కనిపిస్తుంది. విశ్వాత్మను విశ్లేషించి, రహస్యాలను తెలుసుకుంటారు. విశ్వధర్మాన్ని, నిర్మాణవైచిత్రిని వివరిస్తారు. జరగడానికి వీలున్న వాటినే శాస్త్రజ్ఞులు పరిశోధిస్తారు. ఆత్మసంబంధ విషయాల జోలికి శాస్త్రజ్ఞులు పోరు. కనిపించని వాటిని గణితం వేస్తారు. అవకాశాన్ని సూచిస్తారు దైవజ్ఞులు. అన్నిటికి సృష్టి, స్థితి, లయలు ఆధారం.

విధికి అందకుండా గిరగిర తిరిగే శక్తులెన్నో అగోచరంగా ఉండి పోతుంటాయి. వాటి వెనుక ఒక చాలనశక్తి ఉంటుంది. వాటి గమ్యం, లక్ష్యం మన అంచనాలకు అందదు. అవి ఏ ప్రయోజనం ఆశిస్తున్నాయో వాటికే తెలియదు. కాని వాటి ఉనికి ఒక సిద్ధాంతం అవుతుంది. వాటి శక్తులు దివ్యశక్తులుగా మారతాయి.

మనం ఏర్పరచుకున్న నియమాలు, ఆచారాలు సంప్రదాయాలుగా మారి మనలనే బంధిస్తాయి. లక్ష సంప్రదాయాలు, సవాలక్ష మలుపులు తిరుగుతాయి. కోటి ఆశలు కలిగిస్తాయి. ఏదీ పరమసత్యాన్ని చూపించదు. గమ్యాన్ని చేరనీయదు. అన్నీ ధర్మాలుగా చలామణీ అవుతాయి. మనకు అనుకూలమైన మార్గాన్ని నమ్మి అదృష్టం వెతుక్కుంటాం. అదే గమ్యం అనుకుంటాం. విజ్ఞానం మనలో అహంకారాన్ని పెంచుతుంది. అంత ప్రజ్ఞ మన స్వంతం అనుకుని భగవంతుని నిర్లక్ష్యం చేస్తాం. ఈశ్వరశక్తి కోటి మార్గాలలో ప్రసరిస్తుంది. ఏ మార్గం ఎలాంటి జ్ఞానం కలిగిస్తుందో మనకు తెలియదు. మన ప్రజ్ఞ ఆలోచన క్రింద దాగి ఉంటుంది. ప్రతి దేవుడు ఒక రూపంలో దర్శనమిస్తాడు. ఆ దేవుళ్లు తమకు నిర్దేశించిన పాత్రలను మాత్రమే పోషిస్తారు. ఏ దేవుడు తనదికాదని పనిలో చొరబడడు. ఒక్కొక్క దేవునికి ఒక్కొక్క శక్తి ఉంటుంది. మనం అర్థించినా, అరిచినా వారు పట్టించుకోరు. దేవతల వలె, మానవులూ ఒక్కొక్క రంగంలో నిష్ణాతులు అవుతుంటారు.

పరమాత్మ ప్రతి సంకల్పం, ప్రతి చర్య లోకానికి ఎంతగానో ఉపకరిస్తుంది. నిరుపయోగమైన పనులు భగవంతుడు కల్పించడు. లోతుగా ఆలోచించేవారికి వాటి ఆంతర్యం, అంతరార్థం తెలుస్తాయి. అవి అన్నీ భగవంతుడు కల్పించేవి. కొన్ని దివ్యత్వం తగ్గి లీలలుగా మిగిలిపోతాయి.

జగన్మాత సందేశాలు, సంకల్పాలు అన్నీ ఆ సచ్చిదానంద సీమల నుండే ప్రభవిస్తాయి. ఆమె మమతకు, ప్రేమకు అవి చిహ్నాలు. ఆమె మమతా మాధుర్యాలే మనకు కార్యకారణాలు, దివ్యలీలలు. ఆమె మూల రూపాన్ని మనం భరించలేం కనుక ఉత్సవమూర్తిని కల్పించుకుని ఆరాధిస్తాం. ఆమె అసలు రూపాన్ని, సౌందర్యాన్ని, శక్తిని, తీక్షణతను భరించే శక్తి మనకు లేదు. ఆమె హృదయ స్పందనలు వింటేనే తల్లడిల్లిపోతాం. ఆమె తన దివ్యసంకల్పాలను ఎన్నడూ బహిర్గతం చేయదు. అన్వేషించేవారికన్న ఆరాధించేవారికి, అనురాగంతో పూజించే వారికి అమ్మ హృదయం అర్థమవుతుంది.

జీవుల జనన మరణాలే కాక సమస్తలోకాల సృష్టిలయలు ఎన్నడో నిర్ణయించ బడ్డాయి. రోదసికి సైతం హద్దులు, సరిహద్దులు ఏర్పడే ఉన్నాయి. ఔన్నత్యాలకు అంచులున్నాయి. అంతరంగంలోని లోతులూ తెలిసినవే. మనం వెళ్లగలిగినంత మేరకే అవి పరిమితం. తెలుసుకునేవరకు అన్నీ నిగూఢసత్యాలే. సృష్టిలో అన్నింటికి రూపాలు ఏర్పడ్డాయి. పేర్లు మనం పెట్టినవి. నిర్వహణ అదృశ్యశక్తిది. గణనలోకి రాని సృష్టి ఏదీ ఉండదు. అన్నింటినీ ఆవరించి ఉంటుంది శూన్యవలయం. శూన్యంలోకి వెళితే సృష్టిరహస్యం తెలుస్తుంది కాని పరమసత్యం తెలియదు. ఎవరికీ పరబ్రహ్మ అర్థం కాదు. అది బ్రహ్మరహస్యం. జ్ఞానం పొందినంతమాత్రాన పరమాత్మ రహస్యం తెలియాలని లేదు. విశ్వం లోతులకు వెళ్లగలగడమే జ్ఞాని పరమార్థం.

మూడు అంతరాలను దాటి గమ్యం చేరుకోడానికి చాలా ధైర్యం కావాలి. స్వతంత్రం కావాలి. మెరిసే శిఖరాలు అధిరోహించాలి. భగభగమండే మంటలను దాటాలి. గగనాన్ని చేరాలి. స్వతంత్రంగా పయనించిన మహాత్ములు, మహర్షులు మాత్రమే ఆ గుహ్యసీమలు చేరగలరు. వారు మాత్రమే సృష్టి, స్థితి, లయల్ని గ్రహించగలరు. విశ్వచైతన్యం పొంది పరమాత్మను చేరుకోగలరు. వారు స్వయంగా ఆర్జించుకున్న ఈశ్వరశక్తిని పంచడానికే ప్రపంచంలో అవతరిస్తారు. వారు కారణ జన్ములు, సిద్ధయోగులు. ఈ లోకాన్ని ఉద్ధరించగలది వారి ఆత్మశక్తి. అజ్ఞానంలో ఉన్న మానవత జ్ఞానాన్ని సరాసరి పొంది తట్టుకోలేదు. అందుకనే ఆ పని కారణ

జన్మల అవతరణతో జరుగుతుంది. మనల్ని చక్కదిద్దేది చైతన్యం. మనస్సు మహాద్భుత శక్తిని సమీకరించుకోగలదు. మనస్సు ఒక మార్గమే తప్ప అదే సర్వస్వం కాదు.

ఈ ప్రపంచం, సృష్టి ప్రమాదవశాత్తు ఏర్పడలేదు. సృష్టించబడిన దేదీ నిరుప యోగం కాదు. మనం విధికృతాలు అనుకునేవి మన స్వంత కార్యాలు. వాటికి విధితో సంబంధం లేదు. విశ్వవైచిత్రిని గ్రహించగలది ప్రజ్ఞ. సత్యం కారణంగా జీవులు, సంఘటనలు ఏర్పడతాయి. ఉన్నతస్థితికి చేరినప్పుడు ఈశ్వరవాణి వినిపిస్తుంది. భవిష్యత్తులో జరగబోయే విషయాలు తెలుస్తాయి. భావనలో పరబ్రహ్మ స్ఫూర్తి కనిపిస్తుంది. ఆ భావం నుండి ఆధ్యాత్మికత పెంపొందుతుంది. మన జ్ఞానానికి పైమెట్టు ఈశ్వరీయత. ఈశ్వరప్రజ్ఞ కారుణ్యంగా దిగివస్తుంది. అది పరలోకాల నుండి మనల్ని సోకే నిశ్శబ్దస్పర్శ. అదే దివ్యస్పందన. మన అజ్ఞానానికి అది చివరికొస. మనలో నిగూఢంగా, నిక్షిప్తంగా ఉన్న శక్తే మనలో ఈశ్వరీయతను కలిగిస్తుంది. ఉద్దీపింపచేస్తుంది. అయినా ప్రాపంచిక కర్మాచరణలు తప్పవు. ఒక మహాశక్తి మనకు తెలియకుండానే మనలో ప్రవేశిస్తుంది.

రోదసిలోని కొన్ని శక్తులు మనకు అసలు అందవు. అవి విధికృతాలుగా మనల్ని ప్రభావితం చేస్తుంటాయి. మనలోని అజ్ఞానం సత్యానికి ఉపకరణ మవుతుంది. మనం అహంకారంతో ఎంత పోరాడినా విధిని మార్చలేం. మనలో ఎప్పుడో చైతన్యశక్తి కదులుతుంది. అప్పుడు మన సంకల్పం బలపడి విధిని మార్చుతుంది. ఈశ్వరశక్తి మనల్ని తాకినప్పుడు మనలోని జీవాత్మలు సమర్పణ చేసుకుంటాయి. మానవస్వభావం పోయి దివ్యస్వభావం ఏర్పడుతుంది.

వయస్సుతో పాటు మనలో ఈశ్వరీయత పెంపొందుతుంది. ఆ సమయం వచ్చేవరకు మనలోనే ఉన్న పరతత్వం మనకు గోచరించదు. అది ఒక్కసారి మనల్ని మృత్యుతత్వం నుండి అమృతత్వానికి తీసుకుపోతుంది. అది నిగూఢం. మన వివేకానికి అందదు. అవగాహనకు రాదు. అది మార్మికం. అది ఆత్మగతం. అచంచలం, అవ్యక్తం అయినా జ్ఞానదృష్టికి వ్యక్తమవుతుంది. మనల్ని అహంకారం, ఆలోచన వదలినపుడు ఆ స్థితి కలుగుతుంది. అది వెలుగుబాటలో నడిపించి, మహాతేజస్సును అందిస్తుంది. అప్పుడు దివ్యత్వం జీవితాన్ని పూర్తిగా ఆక్రమిస్తుంది.

మహోన్నత సత్యం మన ఆలోచనా పరిధిలో ఉండదు. ప్రజ్ఞ స్వతంత్రంగా తన ధర్మాన్ని ఏర్పరచి నెరవేర్చుతుంది. కాని అది మనకు విధివిలాసం

అనిపిస్తుంది. మనం ఎంత పాటుపడినా, శ్రమించినా ప్రకృతి ధర్మాన్ని మార్చలేం. మన నైజాన్ని మార్చుకోగలం. ఆలోచనకు అందని శక్తి ఉత్తమోత్తమం.

మనిషి అహంకారం వల్ల భగవంతుని కాదని తన మేధాశక్తితో సత్యాన్ని అందుకోవాలని చూస్తాడు. మనస్సు ఎప్పటికీ సత్యస్వరూపాన్ని తెలుసుకోలేదు. అందుకు భగవంతుని కారుణ్యంతోపాటు శుద్ధ మనస్సు అవసరం. ఏ రూపాలకు, గుణాలకు లొంగని శుద్ధతత్వం అవసరం. మనస్సును పూర్తిగా దాటి పోగలగాలి.

అన్వేషణ తొలిదశలో రూపం కొంతవరకు సహాయ పడుతుంది. కొంత కాలం రూపారాధన, సగుణారాధన అవసరమవుతుంది. తర్వాత నిర్గుణారాధన తప్పదు. వివేకం పూర్తిగా నిష్క్రమించాలి. ఆలోచన అంతరించాలి. బాహ్య ప్రపంచం పూర్తిగా శూన్యంలో లీనమైపోవాలి. అప్పుడు హృదయం పరమాత్మ రాకను గుర్తించ గలుగుతుంది. అనుభూతి స్వాగతం చెబుతుంది. ప్రపంచం ఎంత అయదార్థమో అప్పుడు అవగత మవుతుంది. అప్పుడే అనంత సత్యాలు తెలుస్తాయి. అప్పుడు అంకెల గారడీ ఉండదు. మంత్రాలు పనిచేయవు.

అనంతశిఖరాలను అందుకోడానికి భాష, భావన అవసరం లేదన్న గ్రహింపు కలుగుతుంది. శుద్ధతత్వం అదేనన్న స్పృహ కలుగుతుంది. ఆ పరమాత్మ కోసం శూన్యంలో పయనిస్తూ నిర్గుణంలోనే అన్వేషిస్తాం. ఆ ప్రయత్నంలో ఎంత దూరం వెళ్లినా శూన్యమే అవుతుంది. శూన్యమే అనిపిస్తుంది. ఎన్నో అగ్నుల్ని, శైత్యాలను దాటిపోవాలి. జీవించి సాధించేది ఏమీ లేదని తెలిసి శూన్యాన్ని ఆశ్రయిస్తాం. మన సాధనలు, ప్రయత్నాలు అన్నీ శూన్యసాగరతీరం వరకే. అన్నీ ఆ శూన్యంలో తీరంలోనే కరిగిపోతాయి.

ఒక చిన్న సూత్రం విశ్వాన్ని విశ్లేషించగలదు. ప్రకృతిని నిమంత్రించగలదు. ఎన్ని తపస్సులు చేసినా ఆర్జించే జ్ఞానం ఒక్కటే. ఆత్మ ప్రగతికి మనస్సు అడ్డు పడుతుంది. అన్ని సమస్యలకు దివ్యజీవనం ఒక్కటే పరిష్కారం. మేధస్సు పని ఆగిపోయినపుడు 'ఆత్మ' కార్యం ప్రారంభమవుతుంది. ఆపైన ఆలోచించవలసింది, తెలుసుకోవలసింది ఏమీ ఉండదు. ఆధ్యాత్మిక ప్రగతిపథంలో శూన్యమే మహా ప్రస్థానం.

మనం కల్పించుకున్న దేవతలు, సంకల్పించిన దేవుళ్లు మనతోనే పెద్ద నాటకం ఆడిస్తుంటారు. కాలానికి అందని కాంతిని కాలంలో కరిగించి, అనంత కాలాన్ని గంటలలోకి, క్షణాలలోకి విభజించి, మనల్ని వశపరచుకుంటారు. సత్యాన్ని

బంధించడానికి అనేక మార్గాలు చూపిస్తారు. ఈ దేవతలు వారి ఊహల్ని, వ్యూహాల్ని కలగలిపి వలపన్ని మనపైన విసురుతారు. వారి ఆనందాలకు మనల్ని బందీలను చేస్తారు. వారి స్వప్నాలను మనకు స్వర్గాలుగా చూపిస్తారు. మనం ఆ దేవతల్ని ఆదర్శంగా తీసుకుని స్వర్గసుఖాలను కాంక్షిస్తాం. ఆ దేవతలు మనల్ని ఆసరా చేసుకుని వారి కోరికలు మనద్వారా తీర్చుకుంటారు. సత్యం ఎప్పుడూ మనిషి మేధస్సుకు అందదు. మనస్సుకు బందీ కాదు. కాని మనిషి అడుగడుగునా తాను 'సత్య' సంధుడనని చెబుతాడు. ఒక మహారాణి సేవకుని ఇంట్లో బందీగా ఉండడం అసంభవం. మానవ హృదయరాజ్ఞి సత్యం. మనిషి సంపదలు, సమారాధనలు, సమర్చనలు అన్నీ నిగూఢంగా సత్యారాధనలే అవుతాయి. మనిషి ప్రశాంతిని సాధిస్తే సత్యం దరిదాపులకు చేరినట్లు. సత్యం విలువ మారదు, వన్నె తగ్గదు. అది ఎప్పటికీ అమూల్యంగానే ఉంటుంది. మనం గొప్పగా ఆరాధించి, పూజించే దేవుళ్లు, దేవతలు మనలాగా సత్యాన్ని తెలుసుకోవలసినవారే.

మనిషి స్వభావాన్ని బట్టి మనస్సు మారుతుంది. మనిషి ఏ దిశగా పయనిస్తే మనస్సు అదే దిశగా ఆలోచిస్తుంది. సంకల్పం మనది. మనస్సును జీవుడు మార్చవచ్చు. మన స్వభావాన్ని, సంకల్పాన్ని మనస్సు ఆమోదించి చేయూతనిస్తుంది. జీవితాన్ని తేజోపూర్ణం చేయగల సత్సంకల్పాలను, సదాలోచనలను కలిగిస్తుంది మనస్సు. మనస్సు, జీవుడు పరస్పరాశ్రితాలుగా మసలుతుంటాయి. జీవుని సంకల్పాన్ని నెరవేర్చడం మనస్సు పని. సంకల్పాన్ని బట్టి మనిషిలో దివ్యత్వం చోటుచేసుకుంటుంది. జీవితాన్ని కాంతిపూర్ణం చేస్తుంది. ఈశ్వరీయత దివ్యత్వా కాంక్షకు అన్నివిధాల సహకరిస్తుంది. మనిషి పరప్రజ్ఞను అందుకున్నప్పుడు మనీషి కాగలడు, మహాత్ముడు కాగలడు, మహర్షి కాగలడు. ఆ ప్రజ్ఞ మనిషిని దివ్యపథంలో ముందుకు నడిపిస్తుంది.

ప్రియుడు తన ప్రియసఖిని ఆలింగనంలో బంధించినట్లు ఈశ్వరీయత మనిషిని తన వలయంలో బంధిస్తుంది. ఇక్కడ ప్రేమస్థానంలో దివ్యత్వం ప్రవేశిస్తుంది. హృదయంలో నెలకొన్న దివ్యత్వమే ప్రియబాంధవి. తన ప్రేమతో, ఆరాధనతో మనిషి దివ్యత్వాన్ని తనది చేసుకుంటాడు. ప్రియపరిష్వంగంలో అలుపు సొలుపు ఉండవచ్చుకాని దివ్యపరిష్వంగంలో జీవుడు అలసిపోడు. ఆ దేవత అనుక్షణం తనతోనే ఉండాలని ఆశిస్తాడు. ఆమె ఆనందమే తనది. తన శరీరం, మనస్సు సదా ఆనందంతో పులకించాలి, తాను పరవశించాలి. ఒకసారి అనుభూతి

చెందిన తర్వాత దివ్యత్వాన్ని వదలడు. జగన్మాతను స్మరిస్తే చాలు పారవశ్యం కలుగుతుంది.

దివ్యభావనే ఒక దేవత. ఒక ఆరాధ్యదేవత. ఆమె స్మరణే అనుభూతి. జగన్మాత రూపం ఎప్పుడూ నిత్యనూతనంగా ఉంటుంది. అనుక్షణం పారవశ్యం కలిగిస్తుంది. ప్రతి పదంలో, లాస్యంలో కొత్తభావాలు కలుగుతాయి. కొత్త ఆకర్షణ, అనుభూతి కలుగుతుంది. ఆమెలో తను లయించడమే తృప్తి. అదే స్వర్గం. అదే స్వర్గసుఖం. ఆ కారుణ్యక్రీడలో సత్యం ప్రభవిస్తుంది. సత్యం మరెక్కడో వేరుగా, దూరంగా ఉండదు. పారవశ్యంలోనే సత్యం ఉంది.

జగన్మాత యోగిని పరవశంతో తన గుండెకు హత్తుకుని లాలిస్తుంది. ఆమెకు అతను పసిబిడ్డ. బిడ్డను కౌగిలిలోకి తీసుకున్నప్పుడు కలిగే పారవశ్యం ముందు, అనుభూతి ముందు, ప్రేమ ముందు స్వర్గం చిన్నబోతుంది. మానవ హృదయమే జగజ్జనని ఆవాసం. మనిషి తన సంకల్పం మేరకు ఆమెను సంభావించగలడు. ఏరూపంలో కోరితే ఆ రూపంలోనే అమ్మ కనికరిస్తుంది. వేయిరూపాలూ ఆమెవే, అన్ని మంచి గుణాలూ ఆమెవే.

ఆలోచన పరిధిలో దివ్యత్వం ఇమిడిపోగలదు. భావ మందిరంలో ఇమడగలిగినంత చిన్నగా జగన్మాత తనను కుదించుకోగలదు. మనిషి భావాన్ని బట్టి దివ్యత్వ రూపం మారుతుంది. మనిషి ఆత్మసంస్కారానికి అనుకూలంగా, అనుగుణంగా జగన్మాత మారి, మనిషి మానసిక స్థాయికి దిగివస్తుంది. అందుచేత ప్రతిమనిషి భక్తితో తృప్తి చెందుతాడు. ఎవరికి వారు తమ పుణ్యకార్యాలతో, తమ పూజాపురస్కారాలతో జన్మరాహిత్యం పొందినట్లే తృప్తిపడతారు. ప్రతి ఒక్కరికీ తనదే మంచిమార్గం అనిపిస్తుంది. కాని లోకంలో జగన్మాత పూర్ణరూపాన్ని దర్శించినవారు లేరు. పూర్ణమానవుడు లేడు. ఆ జగన్మాత తేజస్సులో లేశమాత్రానికే మూర్ఛిల్లిపోవడం జరుగుతుంది. ఆమె అఖండసౌందర్యంలో మనం దర్శించ గలిగింది అణుమాత్రమే.

మన ఆలోచనలు, వర్ణనలు పూర్ణసత్యాన్ని చేరవు. ఒక్క సత్యకిరణం వెలుగుతో సమస్త విశ్వం సాగిపోతున్నది. మన పరిమితభావం చిరుదీపాలను వెలిగిస్తుంది. మన అహంకార ప్రవృత్తి ఆ దీపజ్యోతిని దర్శించనీయదు. చిరుతేజస్సుకే మనం పరవశమైపోయి విశ్వరూపాన్ని గురించి పట్టించుకోం. జగన్మాత అనంతస్థితిని మనం ఊహించలేం. మనం స్వతంత్రులం కావడం లేదు. సామాన్యులే కాదు, మాన్యులు, మహర్షులు సైతం జగన్మాతను తెలుసు

కోలేరు. మానవత్వం అమరత్వానికి పరిమితి విధిస్తుంది. మన హద్దులు మరచి మహాశక్తిని స్వంతం చేసుకోవాలనుకుంటాం. ప్రపంచాన్ని పూర్తిగా మరచిపోనంత కాలం దివ్యసీమలకు చేరడం దుస్తరం. అక్కడకు చేరగలిగితే తప్ప అమ్మతత్వం, అమృతత్వం అర్థం కావు. అమ్మ ప్రేమకు మనల్ని మనం సమర్పించుకోవాలి.

అప్పుడు నిర్గుణ పరబ్రహ్మస్థితి తెలుస్తుంది. నిర్మలమైన మనస్సు అద్దంలా పనిచేస్తుంది. ఆ అద్దంలో నిర్గుణ పరబ్రహ్మను దర్శించవీలవుతుంది. ఒక తేజస్సు మనలోకి దిగివస్తుంది. అంతవరకు ఎదురుచూడక తప్పదు. సత్యరూపాలన్నింటి కన్న అసలు సత్యం విలువైంది. సత్యం వేయిరూపాలలో దర్శనమిస్తుంది. మన ఆరాధనా రూపాలలోనే జగజ్జనని దర్శనం లభిస్తుంది. అయినా సత్యం అనంతం, అఖండం, అద్వితీయం!

46. సత్య సాయుజ్యం

***విశ్వాంతర** యానంలో అశ్వపతి మరొక అంతస్తు పైకి చేరాడు. అతనికి చూచినంతమేర తృప్తి కలగలేదు. ఇంకా పైకి పోవాలన్న తపన తగ్గలేదు. ఇంకా యింకా అన్వేషించాలి. సృష్టి కడపటి అంచుకు చేరాలి. తీరని జిజ్ఞాసతో ముందుకు సాగాడు. మూడు మనోమయ లోకాలను సులభంగా దాట గలిగాడు. తర్వాత సత్యలోకం. యోగి అనుభవించగోరే సాయుజ్యస్థితి. మనం పొందే బ్రహ్మానందం, ఈశ్వరీయత, ప్రేమ, ప్రాణం అక్కడివే. ఒక దిశగా వేయిరేకులుగా విచ్చుకున్న జ్ఞానపద్మం, వేరొకదిశగా మహాతేజస్సు. పద్మం ఆత్మానుభూతికి, తేజస్సు ఆత్మజ్ఞానానికి ప్రతీకలు. అశ్వపతి ఆ రెండింటినీ సమదృష్టితో దర్శించాడు. అప్పుడు మృత్యురాహిత్యం అనుభూతమైంది. బ్రహ్మత్వం, ప్రజ్ఞానం ఏకమయ్యే చోటు అది.*

సత్యం అల్లంత దూరాన కనిపించి కవ్విస్తుంది. పరమాత్మ స్పర్శతోనే పరమసత్యం జాగృత మవుతుంది. మనకు తెలిసిన విషయాలను విస్మరించి, అవిశ్రాంతంగా సత్యాన్ని అన్వేషిస్తూ ముందుకు పోతే అడుగడుగున ఒక తేజోలోకం తటస్థపడుతుంది. మనకు తెలిసిన విషయపరిజ్ఞానం మరుగున పడిపోయి జ్ఞానం మెరుపులు కనిపిస్తాయి. ఆ మెరుపుల వెలుగులో శిఖరాలు కనిపిస్తాయి. ఒక్కొక్క శిఖరాగ్రాన సత్యం అదృశ్యంగా ఉంటుంది. జనన మరణాలకు అతీతమైన తేజస్సు అది. ఆత్మ ఒక్కొక్క అంతస్తు దాటి పైకిపోతున్న కొద్దీ ఎక్కడికక్కడ అదే స్వర్గం అనిపిస్తుంది.

మహా పరనిర్వాణ పథంలో అడుగడుగునా ఒక కొత్త రుచి, కొత్త అనుభూతి, ఆనందం, పరవశం. జీవుని ఆరోహణలో కొత్త వలయాలు ఏర్పడుతుంటాయి. అగ్నిలో శరీరం కాలి విలవిల లాడినట్లు, యోగాగ్నికి ఆత్మ అధిక తేజస్సును, కాంతిని పొందుతుంది. మనలో రగిలే జ్వాల మన ప్రగతికి ఆలంబన. మన

ఆత్మ దర్శించేది పరమాత్మ తేజస్సు. ఆ రహస్యం ఆత్మకు తెలియదు. యోగి ప్రతి కదలికను పరమాత్మ గమనిస్తూ ఉంటుంది. ఆత్మ తన ప్రయాణంలో ఏ మాత్రం తొందరపడదు. అభ్యుదయానికి సంకల్పమే తప్ప ప్రమేయం ఉండదు.

ప్రతి అంతస్తులోను రెండువైపుల మేధ కల్పించిపెట్టిన స్వర్గాలు కనిపిస్తుంటాయి. అవి ఆత్మ స్వప్నించిన సుందరలోకాలు. అవి చంద్రుని చుట్టూ పరచుకున్న వెన్నెల వనాలు. ఒకదానిని మించిన మరొక కాంతి ప్రవాహం. అవి ఆనందంతో పులకించే ఆత్మకే అనుభూతం. సచ్చిదానంద పారవశ్యం హృదయగతం. నిసర్గ సౌందర్యం బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది. అవి అమరలోక నందన వనాలలో విరబూసిన సరోజాలు.

భౌతికత్వంలో బందీ అయిన జీవుడు, చైతన్యం పొంది స్వర్గలోకాన్ని కాంక్షిస్తాడు. క్రింద అంధకార లోకాలుంటాయి. రెండు లోకాల మధ్యది మన ప్రపంచం. మనది జీవలోకం. మనం ఆశించేది అమృత సరోజం. ఆకాశానికి ఆవల శూన్యంలో మన ఆత్మ సంచరిస్తుంది. అక్కడి సౌందర్యం, ఆనందం మనకు తెలియవు. మనం ఈ బాధామయ ప్రపంచంలో ఉంటూ వాటిని ఊహించలేం. మనల్ని ప్రకృతి వాసనలు పూర్తిగా వదిలిపోతే ఈశ్వర సాన్నిధ్యం చేరగలం. జీవితంలో చేసిన త్యాగాలు, తపస్సు అందుకు ఉపకరిస్తాయి.

మానవ హృదయంలో బీజం ఇక్కడే పడుతుంది. దివ్యస్పర్శతో అది మొలకెత్తుతుంది. అప్పుడు మన లోకం ఒక దివ్యమందిరం అవుతుంది. అన్నింటిలోను పరమాత్మను లేదా 'మమాత్మా సర్వభూతాత్మా' అంటూ మన ఆత్మ వంటి దానినే అందరిలోనూ చూడగలం. పరమ సుఖాలు, ఆనందాలు మనవైనప్పుడు దివ్యత్వానికి మన జీవితం లోబడుతుంది. సర్వస్వం పరమాత్మకు సమర్పణ చేయడమవుతుంది. ఆత్మ సచ్చిదానందానికి దగ్గరవుతుంది. ఎన్నటికీ తరగని చిదానందం అనుభూతికి వచ్చి ఈశ్వర విలాసం ఆత్మపరమవుతుంది. అప్పుడు భూలోకమే స్వర్గతుల్యమనిపిస్తుంది.

తమ ఉనికిని తెలియనీయక, తమ శక్తుల్ని దాచుకున్న పెద్దపెద్ద దేవుళ్లు అప్పుడు కోరకుండానే వరాలు ఇస్తుంటారు. ప్రతి అణువులో అగ్ని రగిలి చైతన్యం నిండి, మహాప్రాణం పరవళ్లు తొక్కుతుంది. అది మనిషి పూర్ణత్వానికి చిహ్నం. మనం లక్ష్యాన్ని చేరుకున్నట్లు. అప్పుడు పరంజ్యోతి దర్శనం లభిస్తుంది. జనన మరణాలకు అతీతమైన దివ్యశరీరం ఏర్పడుతుంది. ఆలోచనలు చల్లగా ఉంటాయి. ఆనందసీమలలోనే మన నిత్యవిహారం.

దివ్యత్వం సోకగానే మనలోని శక్తి కేంద్రాలు, రవి కిరణాలు సోకగానే విచ్చుకునే పుష్పాలవలె, విచ్చుకుంటాయి. మనస్సు నిర్మలంగా మారి దివ్య తేజస్సు ఆహ్వానిస్తుంది. సూక్ష్మశరీరం పరమాత్మ ప్రేమను అందుకుంటుంది. హృదయం మాధుర్యంతో నిండిపోతుంది. మనం కాలానికి భయపడకుండా స్వతంత్రం అనుభవిస్తాం. అప్పుడు ఈ ప్రపంచంలో మనం జీవించి ఉన్నంతకాలం ప్రతి నిముషం ఉపయోగకర మవుతుంది. జీవితానికి పరమ ప్రయోజనం చేకూరు తుంది.

పైలోకాల అనుభవాలు, అనుభూతులు అన్నీ అమృత తుల్యాలే. మన లోకంలో మొగ్గతొడిగి, అక్కడ ఆ లోకంలో పుష్పించి, పరిమళిస్తాయి.

అది జ్వాలామందిరం. అక్కడ సర్వం నిగూఢం, నిర్గుణం. ఈశ్వర భావన, బ్రహ్మానందం రెండూ తేజస్సులే. దివ్యసంకల్పంలో బ్రహ్మానందమే సత్యం. అక్కడ వినిపించేవన్నీ దివ్యనాదాలే. ఈశ్వరానుభూతి ప్రవాహంలా మనల్ని చేరుతుంది. అక్కడి ప్రశాంతత, మాధుర్యం మనలోకంలో ఎంత వెదికినా లభించదు. వాటి నీడలను ఇక్కడ మనం అనుభవిస్తాం. మనలోకంలోని సుఖాలు, ఆనందాలు అక్కడా ఉంటాయి. వాటిపై అమరత్వ ముద్ర ఉంటుంది. అవి కనలిపోవు, కరిగి పోవు. తమి తరగదు, భ్రమ కలగదు. అక్కడ సంగీత రుతాలు పరమాద్భుతం. మనం భూలోకంలో వాటి తొలిపొద్దులు మాత్రం చూడగలం. మనకు సంపూర్ణ పారవశ్య క్షణాలు కొన్ని ఏర్పడతాయి. ఆత్మ వాంఛిస్తే దివ్యత్వం దగ్గిరవుతుంది. అప్పుడప్పుడు ఇక్కడా మనం స్వర్గం రుచి చూస్తాం. ఆ కొద్ది క్షణాల అనుభూతి శాశ్వతం చేసుకోడానికే స్వర్గారోహణం. అక్కడ ఒకే కొమ్మకు పూసిన వేలవేల పుష్పాలవలె, ఒక స్వర్గంలోనే అసంఖ్యాకంగా ఆనందనెలవులు ఏర్పడతాయి. వాటిని పొందడమే పరమానందం.

ఈ స్వర్గలోకాలు దాటిన తర్వాత మృత్యుంజయ మహాగ్ని మండలం కనిపిస్తుంది. అది పరమ శీతలాగ్ని. జీవుడు కోరే పరమపథ సీమ అది. మన లోకపు చీకట్లు, విషాదాలు దాటిపోయిన ఆత్మ ఆలోచనల సమాధుల్ని చీల్చుకొని, ఒంటరిగా, స్వేచ్ఛగా ఆ మండలాన్ని చేరుతుంది. ప్రకృతి బంధాలలో బందీ అయి ఉన్నంతకాలం ఆత్మ విముక్తం కాదు, స్వతంత్రం పొందదు. అది అగ్నిలా గుండెలో మండుతుంది. దేవతల పౌరోహిత్యం వల్ల ఏ ఆత్మా మృత్యుంజయ స్థితిని చేరదు. మానవత, మానవ జీవితాలు దేవతల కైంకర్య దేవాలయాలు. ఆ దేవుళ్లకు ధూపదీప నైవేద్యాలు లభించేది ఇక్కడ మనలోనే.

హృదయంలో ఒక్కసారి వెలిగించుకున్న జ్యోతి ఎప్పటికీ ఆరిపోదు. సత్యాన్వేషణలో రగిలే అగ్నిశిఖ మానవ మాయా వలయాలను ఛేదించుకుని పైకి పోయి సూర్య చంద్రులతో పోటీపడి, పరబ్రహ్మ ముంగిట వాలుతుంది, అక్కడ తలవంచుతుంది. ఆపైన అదృశ్యమై పరమాత్మలో లీనమవుతుంది. పురోగమించే ఆత్మకు ఈ స్వర్గ లోకాలన్నీ సోపానాలు. భయంకరమైన అఖాతాలు దాటిపోతే, నియమాలు చెరిపి వేస్తే, అనంత తేజస్సుకు, అక్షయ శక్తులకు నిలయాలైన స్వర్గాలను చేరగలం. ఆ తర్వాత సత్య శిఖరాలను అధిరోహించడం సులభం. గగన సీమలలో సత్య సంకేతాలు ఆత్మను ఆ దివ్యపథాలకు ఆహ్వానిస్తుంటాయి.

ఆ లోకంలోని వారంతా మహాత్ములే. మహా తపోనిధులు, పరమయోగులు. వారు అనవరతం ఆధ్యాత్మిక తేజస్సుతో సంచరిస్తుంటారు. పరం గురించి, పరమాత్మ గురించి భావిస్తుంటారు. విధి పరచిన ఇరుకుబాటలు దాటి వచ్చిన వారు కనుక వారిని విధి విలాసాలు అంటవు. ఉన్నత ప్రభలకై ఎదురుచూస్తూ ఈశ్వరభావన హృదయం నిండా నింపుకుని, శూన్యంలో శూన్యంగా హిరణ్యా లోకాల దిశగా పోతుంటారు.

పరాన్వేషణ అంత సులభం కాదు. ఎన్నో పర్వతాలు దాటాలి. ఉరుము లురిమినా, పిడుగులు వర్షించినా చలించకూడదు. పట్టు విడవకూడదు. అలసట, నిరుత్సాహం ఉండకూడదు. నిశ్శబ్దంలో పయనించేటప్పుడు వినిపించే భయంకర శబ్దాలను భరించగలగాలి. మనం ఎంత దూరం పయనించినా లక్ష్యం అందనంత దూరంలో ఉంటుంది. మన శక్తి యుక్తులు బొత్తిగా చెల్లుబాటు కావు. కేవలం ఆత్మబలంతో, సంకల్పశక్తితో ముందుకు సాగాలి. అప్పుడే ఆశించిన గమ్యం చేరగలం.

అది సాధించడానికై యమ నియమాలు ఏర్పడ్డాయి. మానవ ప్రయత్నాలన్నీ నిష్ప్రయోజనా లవుతాయి. మన శరీరాలు, హృదయం పైకి ఎగరలేవన్నది సత్యం. మనలో నిగూఢంగా ఉన్న శక్తిని ముందుగా గుర్తించాలి. ఆ శక్తి ఉజ్వలించి నప్పుడు ప్రగతి సాధించగలం. ప్రాపంచికమైన అనుభవాలను పూర్తిగా త్యాగం చేయవలసి ఉంటుంది. చీకటి బాటలలో మన విజ్ఞానం కొవ్వొత్తిలా కాలిపోతూ మనకు వెలుగునిస్తుంది. మన విజ్ఞానం పూర్తిగా అంతరించిపోయినపుడు సత్య ప్రకాశం కనిపిస్తుంది. మనం ఆర్జించుకున్న జ్ఞానం, కల్పించుకున్న విలువలు ఏవీ పనికిరావు. మన మంచితనం, పవిత్ర జీవనం సైతం చందనపు బొమ్మలుగా మిగులుతాయి.

మనిషికి జ్ఞానోదయం కావడం అంత సులభం కాదు. ఇంద్రియ సుఖాలకు వశుడైన మనిషి చెమటోడ్చి, శ్రమించి, ధనం, కీర్తి సంపాదించి అలసిపోయి శరీరం జీర్ణావస్థకు చేరినప్పుడు, జీవితం చివరి అంచుకు చేరినప్పుడు, జ్ఞానం కలిగి మృత్యువును జయించాలన్న తపన కలుగుతుంది. అసంపూర్ణ మానవుడు మృత్యువును జయించ లేడు, మృత్యు భయాన్ని వదలడు. అహంకారం, స్వార్థం అడుగడుగునా అడ్డు పడుతుంది.

మన పతనాన్ని చవిచూడని లోకాలే నిజమైన ఆనందలోకాలు. అక్కడ మన సంకల్పానికి సత్యం తోడుగా నిలుస్తుంది. ఆత్మశక్తి పరాశక్తితో జత కడుతుంది. అమాయకత్వం వల్ల ప్రజ్ఞ కలగకుండా పోదు. ప్రజ్ఞ అజ్ఞానుల దరికి చేరదు. ఈశ్వరీయత స్వతఃసిద్ధంగా, సహజంగా ఏర్పడుతుంది. అప్పుడే ఆత్మ స్వతంత్రంగా, యధేచ్ఛగా పురోగమించగలదు. అప్పుడు మనలో మన ఆత్మను చూచుకోగలం. ఆత్మకు స్వ స్వరూప దర్శనంతో బ్రహ్మానందం సులభమవుతుంది. ఆనంద స్థితిలో దివ్య స్వభావం ఏర్పడుతుంది. మానవ స్వభావం పోయి దివ్యస్వభావం ఏర్పడుతుంది. అవి అన్నీ పూర్ణత్వానికి, దివ్యత్వానికి సోపానాలు.

★ ★ ★

అశ్వపతి పూర్ణపురుషుడై మహదాకాంక్షతో సత్యలోకాలు చేరుకున్నాడు. అక్కడి సౌందర్యాలు, ఔన్నత్యాలు అనుభవించాడు. అక్కడ మహత్తులు పొందాడు. వాటితో తృప్తి పడక ఇంకా ముందుకు సాగాడు. స్వచ్ఛమైన హిరణ్యకాంతి మార్గం చూపింది. అడుగడుగునా మహత్తర భావాలు, అనుభూతులు కలిగాయి. అవి ప్రజ్ఞావిశేషాలు. ఒకే ఒక దివ్యప్రజ్ఞకు అవి అన్నీ ఉపాంగాలు. అన్ని అనుభూతులు ఒకే పరానుభూతిగా, అన్ని ప్రజ్ఞలు ఒకే పరాశక్తిగా మారాయి. ఆ మహాశక్తి ఒక్కటే అన్ని లోకాలను పాలిస్తుంది. అది ఈశ్వరీయత, అది అనశ్వరం.

అక్కడ మన తపస్సుకు, సాధనకు అనుకూలంగా ఆయా ద్వారాల వద్ద మహాత్ములు స్వాగతం చెబుతారు. అక్కున చేర్చుకుంటారు. అఖండ తేజస్సు పరానికి ఏకైక సంకేతంగా మిగులుతుంది.

మార్గమధ్యంలో ఒక దేవదూత పురోగమిస్తున్న ఆత్మకు అమృతభాండం అందిస్తుంది. అక్కడ ప్రతిది సత్య సమ్మతమే. సత్యానికి ప్రతినిధి. అదే విశ్వానికి, విశ్వ హృదయానికి సరైన నిర్వచనం. అదే సమగ్రతకు, సంపూర్ణత్వానికి సమాధానం. అదే పరానికి, సత్య లోకానికి సరైన మార్గం. ఈ నిర్గుణాలన్నీ కలుసుకునే లోకాలున్నాయి. అక్కడ వేయి నాల్కలతో ఆనందామృతం పానం

చేయవచ్చు. తేజస్సు తేజస్సులో, అగ్ని అగ్నిలో ఏకమైనట్లు ఆత్మ పరమాత్మతో మమేకమవుతుంది. అక్కడ ఏ ఆత్మ వేరు కాదు. ఎవరికీ వ్యక్తిత్వం మిగలదు. పరమాత్మలో తనను దర్శించుకోవడమే ప్రతి ఆత్మ పని, అంతిమ లక్ష్యం. ఆ పైన అంతా అనంత సచ్చిదానందమే.

అశ్వపతి విశ్వపతిగా దివ్యలోకం ప్రవేశించాడు. అక్కడ అందరూ అందరితో సమానం. అందరివీ తేజశ్శరీరాలు. అందరూ ఆనందమూర్తులు. అన్ని శక్తులు, అన్ని సౌందర్యాలు అందరివీ, అందరి సొంతం. అక్కడ ఎవరి లోకం వారు నిర్మించుకుని, ఎవరికి వారు స్వతంత్రంగా, పూర్ణంగా ఉంటారు. క్షణంలో తమలోకాల్ని విస్మరించి, ఏకాత్మగా మారిపోతారు.

మన ప్రపంచం నుండి అక్కడికి చేరడానికి అనేక మార్గాలున్నాయి. అనేక మంత్రాలున్నాయి. అన్ని మార్గాలను, అన్ని మంత్రాలను వదలి ఆత్మను ఆశ్రయించిన వారికి తమదైన మార్గం తెలుస్తుంది. ఎవరు వేసుకున్న బాటలో వారే పయనించాలి. ఎవరికి వారు ఒంటరిగా, స్వతంత్రంగా పయనించాలి. దివ్యలోకవాసులు ఎప్పుడూ మనకోసం సిద్ధంగానే ఉంటారు.

47. మానసాత్మ

ప్రపంచంలో అన్ని పర్వతశిఖరాలలో ఎత్తయినది ఎవరెస్టు శిఖరం. అది ఎవర్ + రెస్టు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేది. మనిషికి ప్రశాంతి నిచ్చేది మానసాకాశం. అశ్వపతి తనలోని ఎవరెస్టు శిఖరం ఎక్కాడు. అక్కడ కనిపించింది మానసాత్మ. ఆపైన అధిరోహించవలసిన శిఖరాలు లేవు. ఆశించదగిన స్వర్గాలు, సత్యాలు లేవు. ప్రశాంతమైన కేంద్రబిందు స్థితి అది. అదే ఆత్మ ప్రస్థానం. మహాపర నిర్వాణయాత్రలో అది చివరి మజిలీ. జీవుడు ఆశించే మహాపర నిర్వాణం. ఒక్క కిరణం సోకితే చాలు ప్రాపంచిక స్పృహ కలుగుతుంది. జీవుడు సంకల్ప మాత్రంచేత భూమిని చేరి స్వశరీరంలో ప్రవేశిస్తాడు. భూమిపైన తనకు గల అనుభవ జ్ఞానాన్ని జీవుడు వదులుకోడు. ఎన్ని లోకాలకు వెళ్ళినా జీవుని వైఫల్యాలు వెంట తగులుతుంటాయి. మనస్సుకు, సాధనకు మహాశాంతి సమాధానం కాదు. అది గమ్యం, లక్ష్యం కాదు.

ఆత్మను సమాధాన పరచగలది పరమాత్మ ఒక్కటే. ఎక్కడున్నది పరమాత్మ? కడకు అంతా శూన్యమే మిగులుతోంది. శూన్యంలోనే ఆత్మ లయిస్తోంది. ఎటుచూచినా జీవప్రవాహాలు, ఆ ప్రవాహాలకు అటు ఇటు వృక్షాలు. అదేనా సత్యం? అయితే జగత్తుకు అర్థం ఏమిటి? పరమార్థం ఏది? పైన మహాప్రశాంతి, క్రింద అంతా అశాంతి. పైన వెలుగులు, క్రింద చీకట్లు. ఇదేనా సృష్టి రహస్యం?

చివరకు అశ్వపతి మహాయోగివలె నిర్వికల్ప సమాధి స్థితిని చేరుకున్నాడు. అక్కడ నిశ్శబ్దంలో విశ్వలయ కనిపించింది. విశ్వనాదం వినిపించింది. కాని ఆత్మ ఆవేదనను ఎవరూ పట్టించుకోరు. అసలు అక్కడ ఎవరూ లేరు సమాధానం చెప్పడానికి. ఆత్మ వేసుకునే సవాలక్ష ప్రశ్నలకు జవాబులు లేవు, సందేహాలకు సమాధానం రాదు. అసలు ప్రశ్నలు, సందేహాలు శూన్యంలో లయించిపోయి,

ఉండీలేనట్లు, తన ఆత్మ మాత్రం మిగిలింది. అన్ని ఆశలు, ఆశయాలు కరిగిపోయాయి. మహత్తరమైన ఆ ప్రశాంతిలో అంతా నిశ్చలం, నిర్గుణం. ఆలోచనల చివరిపుటలో 'సమాప్తి' సూచిక. నిశ్శబ్ద శూన్యంలో 'విరామం' ఆ ప్రశాంతి.

ఆరోహణలో చివరి లోకపు కడపటి రేఖపై తాను ఒంటరిగా, ఆత్మసాక్షిగా, తన మానసాత్మ తోడుగా, మహాశూన్యంలో తనూ శూన్యమై, తేజస్సుగా కాంతి వలయంలో నిలిచాడు. ఆ మహాశూన్యంలో ఒక మూలన ఎక్కడో తనదైన జీవం కదిలింది. అది మహా శక్తిపూర్ణమై నిశ్చలంగా, ఒంటరిగా ఉండిపోయింది. తన నుండి ఉద్భవించిన లోకంలో తనకు స్థానం లేదు. నిలువ నీడలేదు. తాను పొందిన విజయాలను మరచిపోయాడు. తన అపజయాలు సైతం గుర్తుకు రావడం లేదు. విషాద ఆలాపన చెవిని పడినా చలనం లేదు. మంచికీ, చెడుకూ జీవుడు స్పందించడం లేదు. ప్రళయం వచ్చినా ఆత్మ చలించదు.

ఇప్పుడు తన ఆత్మ అన్ని కార్యాలకు కర్త, అన్నింటికి ప్రత్యక్షసాక్షి. తానే అసంఖ్యాక రూపాలను సృష్టించగలదు. అన్ని ఆలోచనలు, చర్యలు నిబ్బరంగా భరిస్తుంది. ప్రకృతిలో జరిగే సంఘటనలన్నీ నిర్మోహంగా చూస్తుంది. ఆ కార్యాలన్నింటినీ తాను ఆమోదించి తీరుతుంది.

అతని మనస్సు ఒక మహా ప్రశాంతి నిలయమైంది. ఆ ప్రశాంతినే పరమాత్మ ఆమోదించేది. శబ్దం నిశ్శబ్దంలో అట్టడుగున ఉంటుంది. ఆ ప్రగాఢ నిశ్శబ్దం నుండి కార్మికత ఉదయిస్తుంది. మొదట మేధ నిశ్శబ్దంగానే ఉంటుంది. ప్రాపంచికతా నిస్తబ్దంగానే ఉంటుంది. పరమాత్మ నాటిన బీజం నిస్తులంగా ఉంటుంది. ఆత్మకు నిశ్శబ్దమే మార్మిక జన్మభూమి.

బ్రాహ్మీస్థితికి చేరినప్పుడు అద్భుత ప్రశాంతి ఏర్పడుతుంది. ఆత్మ దర్శనంలో మహాశక్తులు కరిగిపోయి, ఆత్మ నిరాడంబరంగా, నగ్నంగా తనను తాను గుర్తిస్తుంది. అప్పుడే సంకల్పం ఒక భావంగా పొటమరిస్తుంది. ఆత్మ, సంకల్పం కలిసినప్పుడు రెండు శక్తుల రాపిడికి వేడి పుట్టినట్లు సృష్టి ఏర్పడుతుంది.

నిర్మలాత్మ జీవుని ఆవాసం. జీవునితో ఆత్మ సహచరిస్తుంది. హృదయపు లోతులలో నిశ్శబ్ద సందేశాలను ఆత్మ వినగలుగుతుంది. అక్కడి ప్రశాంతత, అనంతత్వం, అమరత్వం అన్నీ ఆత్మ సొంతం. అప్పుడు ఆత్మకు స్వతంత్రత, సర్వశక్తులు లభిస్తాయి.

మనిషి భావించిన చిత్రాలకు ఆత్మ ప్రాణం పోసినా తన ప్రత్యేకతను కోల్పోదు. తాను రూపొందించిన సుందర చిత్రాలు చూచి ఆత్మ మురిసిపోతుంది. ప్రపంచాన్ని, దానిలోని అద్భుతాలను ఆశ్చర్యంగా తిలకిస్తుంది. అగ్ని వాయువుల్ని సంధాన పరచి, శక్తిని ఉత్పత్తి చేస్తూ ప్రపంచాన్ని నడిపిస్తుంది, కానీ, తనదైన ఆత్మతత్వాన్ని వింగడించదు.

అప్పుడు జీవునకు అన్నీ తెలుస్తాయి. ఏ వాంఛలూ తనవి కావు, ఏ సంకల్పాలూ తనవి కావు. అది ముముక్షుస్థితి. ముముక్షువు తన లక్ష్యాన్ని, గమ్యాన్ని మరచిపోతాడు. 'గమనిక' ఒక్కటే అతనిలో మిగిలి ఉంటుంది. ఏదీ తనకు కావాలని కోరడు, నిజానికి తనకు ఏదీ అవసరం ఉండదు. చివరకు మోక్షమూ ఆశించడు.

యోగ సమాధిలో ఎంతకాలమైనా ఉండిపోగలడు. కాలాన్ని జయించి, కాలాతీతంగా జీవించగలడు. తన ప్రశాంత స్థితిలో సమస్త విశ్వాన్ని దర్శించ గలడు. మనం చూచే వాటిపైన, వినే వాటిపైన తెర పడుతుంది. ఏదీ చూడాలని పించదు, వినాలనిపించదు. ఇంద్రియ కార్యాలపై ఆసక్తిపోతుంది. అది అన్ని ప్రజ్ఞలకు మూలమైన మహాప్రజ్ఞను అందుకునే మార్గం.

మాయావాదులు కనిపించేది ఏదీ వాస్తవం అనరు. అంతా మాయ అని కొట్టివేస్తారు. అసలు వివేకంతో ఆలోచించరు. వారు అజ్ఞానంతో జ్ఞానాన్ని అంచనా వేస్తారు. చైతన్యం పొందినా, ఔన్నత్యం సాధించినా గమ్యం ఉండదు. చివరకు తమ వివేకాన్నే అనుమానించే స్థితి ఏర్పడుతుంది. వారు మానసిక శక్తుల్ని బలంగా విశ్వసిస్తారు. కంటికి కనిపించేదే వాస్తవం, సత్యం అంటారు. నిరూపణ కానివి నమ్మరు. భౌతికవాదులు మాయావాదులకన్నా కాస్త మెరుగు. కనీసం కనిపించేదైనా వాస్తవం అని నమ్ముతారు. సత్యాన్వేషులు అవీ ఇవీ పట్టించుకోరు.

అజ్ఞానం అగ్రసింహాసనం అధిష్ఠించి ఉన్నంత కాలం, జ్ఞానం బయట పడదు. భావాలు సైతం బలహీనమవుతాయి. చీకటిలో ఉండే వ్యక్తి వెలుగు భరించలేడు. మన ఆలోచనలు క్రమంగా కరిగిపోయే మేఘమాలికలు. ఒక్కసారి వినిపించి తరంగాలుగా మారిపోతాయి. ఆలోచన నిరాధారంగా గాలిలో వేలాడే సాలెగూడు వంటిది. అతి సున్నితంగా ఉంటుంది. అది విశ్వవృక్షం పైన క్షణకాలం కనిపించి మాయమవుతుంది. జీవుడు అక్కడ కొంతకాలం నిలిచి జ్ఞానఫలాలు ఆస్వాదిస్తాడు. మసక వెలుగులో ఆ ఫలాలు కనిపించక, నిరాశ పడతాడు. మనిషి

మనస్సు పరిధిలో ఎంతో సాధించాలని ప్రయత్నిస్తాడు. కాని భావచిత్రాలు గాలికి ఎగిరిపోతాయి. సాలెగూడులో చిక్కుపడిన ఆలోచనలు ఎటూ కదలవు.

మానసమందిరం ఒక మాయా మందిరం. అందులో వెన్నెల వెలుగులు, మెరిసే మెరుపులు ఉంటాయి. వాస్తవానికి అదే భవ్యమందిరం అనిపిస్తుంది. అక్కడి నుండి తిరోగమనం సులభం. మనిషి అజ్ఞానంలోకి నిష్క్రమిస్తాడు. సత్య సంకేతాలుగా కొన్ని వెలుగులు కనిపించినా నమ్మడు. ఆ మెరుపుల వెనుక నిగూఢ సత్యం ఉంటుంది. భ్రమలు అనిపించేవన్నీ వాస్తవాలకు ప్రతిబింబాలే. మనిషి ఈ లోకం నుండి నిష్క్రమించే వరకు అవి భ్రమలుగానే ఉంటాయి.

మనస్సు ఎప్పుడూ గతానికి విశ్రాంతి మందిరం. పురాతన సత్యాలు భూతాలుగా మారతాయి. భయంకరమైన ఆలోచనలు కలుగుతుంటాయి. ఈశ్వర విభూతులు అతి నిశ్శబ్దంగా వివేకపు కలుగులలోకి చొరబడతాయి. మనం కూల్చుకున్న భవనాల పునాదులు మిగులుతాయి. లేదా పాడుబడిన మందిర అవశేషాలు కనిపిస్తాయి. ఇక్కడ జీవుడు, ఆత్మ పనికిమాలినట్లు కనిపిస్తాయి. నిష్ప్రయోజనమైన వాటిని మనిషి దివ్య వరాలుగా భావించి మురిసిపోతుంటాడు. ప్రకృతి సంపదలు తనవిగా చేసుకుని తృప్తి పడతాడు, పొంగిపోతాడు. అజ్ఞానం చిలవలు పలవలు వేస్తుంది తప్ప తగ్గదు. సృష్టిలో ఏదో లోపం ఉన్నట్లు అనిపిస్తుంది. అన్నీ గాలి మేడలే. వేటికీ గట్టి పునాదులుండవు.

ఒక వక్రకాంతిరేఖ కొసమెరుపు సోకి మనిషి తన వివేకం, విశ్వాసం కోల్పోతుంటాడు. 'మాయ' ప్రభావం వల్ల ఆత్మను సైతం దారి మళ్లిస్తాడు. అతిగా ఊహించడమే ప్రతిభ అనుకుంటాం. మన ప్రతిభ ఖగోళం నిండా విస్తరిస్తుంది. ప్రతిభ క్షణికం. అదంతా మన వివేకం చేసే గారడీ. వివేకం సృష్టి రహస్యాలను విశ్లేషించదు. పరమాత్మ తాను ఎన్నిక చేసిన మహాత్ములనే తన ప్రతినిధులుగా లోకంలోకి పంపుతుంది.

మేధావులకు సృష్టి వాస్తవమా? అవాస్తవమా? అన్నది పరిష్కారం కాదు. ప్రపంచం తామరాకుపై నీటిబిందువు అంటారు, లేదా శూన్యంలో వేలాడుతున్న గోళం అంటారు. వారికి ఈశ్వరవిభూతి అర్థం కాదు. జీవికి, పరంజ్యోతికి మధ్య అజ్ఞానం తెరవేస్తుంది. అసలు భగవంతుని వదలి, విగ్రహాల్ని ఆరాధించి మనిషి తృప్తి పడతాడు.

అంతరాత్మ మనిషిని మోసగిస్తుంది. ఈ అంతరాత్మ మేధోజనిత వివేకానికి మరో రూపం. ఈ అంతరాత్మ మనస్సుకు నీడవంటిది. అది పూర్తిగా మనస్సా

కాదు, ఆత్మా కాదు ... మానసాత్మ. అది కాలానికి, ప్రపంచానికి విధేయమై శూన్యంలో విహరిస్తుంది. అది పరమాత్మ సంబంధి అసలే కాదు.

మనస్సును నిశ్చలపరిచి సాధించే సమాధిస్థితిలో ప్రశాంతిగానీ, అతీంద్రియ శక్తిగానీ కనిపించదు, లభించదు. అక్కడ జగన్మాత ప్రేమ, పరమాత్మ అనుగ్రహం లభించవు. జగజ్జనని తన బిడ్డల్ని గుండెలో పదిలంగా దాచుకుంటుంది. ఆమె తన కౌగిలిలో సమస్త విశ్వాన్ని లాలిస్తుంది. అప్పుడు లభించే తన్మయత్వం వేరు. సృష్టికి ఆధారమైనది సచ్చిదానందం లేదా ఈశ్వర విభూతి. అది ప్రేమించే హృదయానికి మాత్రమే లభించే వరం.

మనోగతమైన ఆంతర్యం, అదే అంతరాత్మ. ఆత్మ వేసే ప్రశ్నలకు సమాధానం లభించదు. అందుకు సూటిమార్గం గాని, ఖచ్చితమైన సూత్రం గానీ ఉండవు. అంతరాత్మను నమ్మి పయనించేవారికి పరలోకపు బాటలన్నీ మూతపడి పోతాయి. ఎవరికి వారు ఈ 'అంతరాత్మ' ఖైదు నుండి విముక్తమై ఆత్మ జ్యోతిని దర్శించాలి, జ్ఞానదృష్టిని అలవరచుకోవాలి. తన మార్గం ఎన్ను కోవడంలో అనేక ప్రతికూలాలు, వైరుధ్యాలు ఎదురవుతాయి. కాని అనుభూతి చెందగలిగినవారికి అసలు మార్గం కనిపిస్తుంది.

అశ్వపతికి అంతా శూన్యమే కనిపించింది. అది నిరాకారం, నిర్గుణం. తనభావం అరూపశూన్యంలో లయించి పోసాగింది. క్రింద అంతా అంధకారం. ఆలోచనకు, ఆరాధనకు మధ్య ఒక నాదం వినిపించింది. అది అజ్ఞానంలో వినిపించే గొంతు. మనిషి జ్ఞానానికి, అజ్ఞానానికి మధ్య, జీవసాగరంలో పైన ఎగసిపడే కెరటం. శూన్య హృదయంలో కల్లోలం. అనేక శక్తులు, రూపాలు, ఆలోచనలు, తరంగాలు ఆకృతి దాల్చడానికి ఆత్రుతపడుతుంటాయి, మునిగి తేలుతుంటాయి. అదే లోకాలన్నింటికీ మూలమైన శూన్యస్థితి. అదే మృత్యువు. మార్మిక శూన్యతే–మృత్యువు.

మనిషి పరాన్ని అన్వేషించక తప్పదు. ఆరాటపడక తప్పదు. పరమాత్మను ప్రసన్నం చేసుకోడానికైనా, చేరడానికైనా తపస్సు ఒక్కటే మార్గం. నిశ్చలంగా, నిర్మలంగా, ఆత్మపరంగా సాధన సాగాలి. అందులో మనస్సు ప్రమేయం కూడదు. శబ్ద ప్రపంచాన్ని దాటి నిశ్శబ్దంలో పయనించడమే సాధన. నిశ్చల సమాధిలో సృష్టి స్థితి రహస్యం తెలుస్తుంది.

జీవుడు ముందుకు పోయిన కొలదీ, వెలుగు చీకట్లు రెండూ అతనిని

నిరోధిస్తాయి. అడుగు ముందుకు పడదు. జీవుడు అహంకారంతో ఒంటరిగా పయనించకూడదు. ఆత్మను తోడు తీసుకుపోవాలి. జీవులు సంచరించే పరలోకాల్లో ఏవీ శాశ్వతం కావు. అన్నీ చావటం కోసం పుడతాయి. పుట్టడం కోసం చస్తుంటాయి. అమరత్వం సాధించడం కోసం మనిషి మళ్లీ మళ్లీ జన్మిస్తుంటాడు. జన్మించిన తర్వాత జీవుడు తన లక్ష్యాన్ని మరచిపోతాడు. ఆలోచన వలయంలో చిక్కుబడిపోతాడు.

జీవించడమే ఒక బంధం - బంధం వీగిపోవడమే విముక్తి.

48. విశ్వాత్మ

సదసత్తుల మధ్య ఆగిపోయిన అశ్వపతి ఎదుట నిశ్శబ్దాలు విచ్చుకున్నాయి. మనస్సుపై పొర తొలగింది. ఒక మహా తేజస్సు ప్రభవించింది. అదే పరమాత్మను చేరడానికి ప్రవేశ ద్వారం. అదే ప్రధాన ద్వారం. లోపల భయంకర నిశ్శబ్దం నుండి ఒక మందస్వరం వినిపించసాగింది. అవి మంజీర నాదాలు. ఆపై లోకాలకు ఆకృతి ఉండదు. ఎటుచూచినా తేజస్సు. ఎటు పరికించినా బ్రహ్మత్వం. అది బ్రాహ్మీస్థితి. అది విశ్వాత్మ. ఎటు పయనించినా ఆత్మ ఒక్కటే పయనిస్తుంది. మనిషిగా చెప్పుకొనడానికి అవసరమైన శరీరం, మనస్సు ఎప్పుడో నశించాయి. ఆత్మ ఎవరికీ చెందదు, దానికి పేరుండదు. ఆత్మ ఒక్కటే పరమాత్మను చేరుతుంది. విశ్వాత్మగా పరిణమిస్తుంది. ఆత్మ సామ్రాజ్యమే ఆనందసామ్రాజ్యం. అది అనంతం. జనన మరణ వలయం దాటి సిద్ధి పొందిన మహాత్ములు అక్కడికి చేరుకోగలరు.

అశ్వపతి సదసత్తుల నుండి ఆదిస్థితికి చేరాడు. అక్కడ ప్రకృతి లేదు, పురుషుడు లేదు. రెండూ ఎప్పుడో ఒక్కటైనాయి. ఆ రెంటికి ఆవల ఉన్నది పరాప్రకృతి. అశ్వపతి పరాప్రకృతి ముందు వినమ్రుడై, ఆత్మసమర్పణం చేశాడు. ఆ శక్తి కళ్లువిప్పి చూచినట్లయింది. ఆ చూపులో శాంతి, క్రాంతి, తేజస్సు, ఓజస్సు, కరుణ, ప్రేమ జాలువారుతున్నాయి. ఆ శక్తి ముందు తన స్థితి 'అణు' మాత్రం. ఆ బ్రహ్మానందంలో తానొక చలనం అనిపించింది.

మనిషి జిజ్ఞాసకు సరైన సమాధానం దొరికింది. మనోమయ లోకాల ఆవల వెలిగే మహా తేజస్సు ఆ జిజ్ఞాసకు సమాధానం. శక్తి నోరు విప్పినట్లు ఒక కాంతి యవనిక జారింది. ప్రణవ నాదంతో ఒక మార్మిక మార్గం ఏర్పడ్డది. అది ఆత్మకు మహాభినిష్క్రమణం. అది మహాపర నిర్వాణం. బాహ్య ప్రపంచానికి అందనంత దూరంలో ఆ కాంతి విశ్వ హృదయంలోకి నిర్గమించింది. ఆ వెలుగు కూపంలో ఈశ్వర దర్శనం అయింది.

ఆ నిగూఢపథంలో ఆత్మ పరుగులు తీసింది. అనేక అరూప, అదృశ్య పొరలు, భూమికలు దాటిన తర్వాత విశ్వహృదయంలో విశ్రమించి పరవశ మవుతుంది. హృదయ కేంద్రం నుండి ఒక నాదం ఉద్భవించింది. అది పిలుపు, అది స్వాగత నాదం. ఆ పిలుపు మనస్సు లోతులకు చేరుతుంది. మన కాంక్షను అది ఆకాంక్షగా మారుస్తుంది.

విశ్వ హృదయం ఎలుగెత్తి పిలిచినట్లు ఆ నాదం ఘనీభవించిన గగనాన్ని చీల్చుకుని వస్తుంది. యోగి హృదయంలో ఆ నాదం చొరబడి, సృష్టి సందేశాన్ని అందిస్తుంది. అప్పుడు దివ్యానందం కలుగుతుంది. హృదయ స్వర్ణపాత్రిక నుండి ఆనందం అమృతం వలె పొంగిపొరలి జాలువారుతుంది. అది మనస్సుకు తాకి, వర్చస్సుగా మారి, ఆత్మానందంగా పరిణమిస్తుంది. అదే మనలో జ్వలించే జ్ఞాన జ్యోతి ...

మనిషి తాను ఆశించిన ఆధ్యాత్మిక భూములు చేరువవుతున్న కొద్దీ అద్భుతమైన ప్రేమను దర్శిస్తాడు. ప్రేమపూర్ణు డవుతాడు. తన ప్రమేయం లేక కొంతకాలం చీకటిదారులలో పయనించినా, ఆ దివ్య ప్రేమ పరిష్వంగానికి మాత్రం దూరం కాడు. హృదయం వినిపించే నాదం అతనిని ముందుకే నడిపిస్తుంది. ఆ శూన్యం నుండి ఎన్ని శబ్దాలు ఉద్భవించినా అది నిశ్శబ్దమే. చివరకు అన్ని శబ్దాలు నిశ్శబ్దంలో లయించిపోవలసిందే! ఆనందానుభూతికి అదొక దివ్య సంకేతం. మన హృదయాన్ని పరవశింపచేయగల పిలుపు అది. అది దివ్య ప్రేమ సందేశం. కానీ మనస్సుకు దాని విలువ తెలియదు. కేవలం హృదయానికి మాత్రమే పరిమితమైన ఆనందం అది.

అప్రయత్నంగా ఈశ్వరసందేశం చెవిని పడుతుంది. చెవులు మూసుకుంటే మరీ గంభీరంగా వినిపిస్తుంది. అప్పుడు సృష్టి వైచిత్రి కొద్దికొద్దిగా బహిర్గత మవుతుంది. అది ఆత్మ చుట్టూ ప్రదక్షిణలు చేసిచేసి అలసిపోయి నిశ్శబ్దమవుతుంది. అది మన స్మృతి తీరాల వెంట పరుగులు తీస్తుంది. అది ఏకాంతంలో మనల్ని ఉన్మీలనం చేయగల మురళీనాదం. మోహనవంశి. అదే మన కన్నులలో ఆనంద కుసుమాలు పూయిస్తుంది.

నిశ్శబ్దాన్ని చీల్చుకొని వెలువడే ప్రణవం వెలుగులో, చీకటిలో సైతం వినిపిస్తుంది. అది ఆధ్యాత్మిక చైతన్య వికాసం. అవి నిశ్శబ్ద కంకణ నిర్వాణాలు. హృదయగత విలాసాలు. ఆ శబ్ద నర్తనమే పరమ ప్రశాంతిని కలిగిస్తుంది. విస్మరించిన అనుభూతుల మాధుర్యాలు హృదయాన్ని తిరిగి చేరుకుంటాయి. ఆ

నాదం వేదంలా, స్వరయుక్తంగా దూరతీరాల నుండి వినిపించే మారుతం వలె, ఒంటెల ఘంటానాదం వలె, అరణ్యసంగీతం వలె, దేవాలయ గంటస్తంభం నాదం వలె వినిపిస్తుంది. వేసవిలో సుందరోద్యానాలలో పూలతావులకై పరుగులు తీసే భ్రమరకుమార ఝుంకారనాదం వలె, అనంతసీమలనుండి హృదంతర సీమలకు బదిలీ అవుతుంది. ఒక మాధుర్య పరిమళం గాలిలో తేలివస్తుంది. ఒక మార్మికానందం మనస్సును తాకుతుంది. అతీంద్రియ ప్రజ్ఞ మనల్ని చేరుతున్న అనుభూతి కలుగుతుంది. గుండె ప్రేమతో నిండిపోతుంది. ఒక ఆత్మీయస్పర్శ మన కాళ్లకు బంధాలు వేస్తుంది. ఒక హాసరేఖ లోకం రూపురేఖల్ని మార్చి వేస్తుంది.

మహాయోగి అశ్వపతి నిరాకార, నిర్గుణ స్థితికి చేరి నిరంజనుడైనాడు. అది ఏమాత్రం శబ్దం చొరరాని ప్రశాంత అనురాగ మందిరం. తాను మెట్టిన శిఖరాలు తెలుస్తున్నాయి. ఇప్పుడు తనలో ఎన్ని లోకాలైనా ఇమిడిపోగలవు. తానిప్పుడు సృష్టికి మూలమైన కేంద్రబిందువును చేరుకున్నాడు. ఎన్ని వలయాలు ఏర్పడినా, ఎంతగా విస్తరించినా కేంద్రబిందువు ఒక్కటే. అది పరమాత్మ హృదయ కేంద్రం. అవి కాలపురుషుని వలయాలు.

అన్ని లోకాల నుండి ప్రవిమలాత్మలు అక్కడకు చేరతాయి. అక్కడ జీవం, శక్తి – అన్నీ పరమాత్మ రూపాలే. ఆ పరబ్రహ్మమే సర్వం తానవుతాడు. తానే అన్నింటా ప్రభవిస్తాడు. తాను కానిది సృష్టిలో ఏదీ లేదనిపిస్తుంది. ప్రకృతిలో ప్రమాదాలకు, ప్రమోదాలకు కారణం తనే. తానే స్పందనగా, ప్రేమగా మారిపోతాడు. ప్రతిఫలాన్ని ఆశించకుండా ప్రేమించగలడు భగవంతుడు. మంచిచెడులను సమంగా భరించగలడు భగవంతుడు. అన్ని ప్రాపంచిక రుగ్మత లకు చికిత్స జరపగలది భగవత్ ప్రేమ ఒక్కటే. అన్ని అనుభవాలను ఆనందంలోకి అనువదించ గలిగింది ప్రేమ. అనేక జన్మ లెత్తి విశ్వాన్ని శిశువుగా మార్చి ఊయించగలదీ ప్రేమే. ఎంతటి బాధనైనా తన స్పర్శతో సమయించగలదు ప్రేమ. ఎన్ని దుష్కర్మ లాచరించినా క్షమించి మనిషిని పరమాత్మ వైపు నడిపించగలది ప్రేమ. అనృతం నుండి అమృతం పొగిలించగలదు ప్రేమ. ఎవరిలోనైనా దివ్యస్పందన కలిగించగల గుణం దొడ్డది.

ఆత్మ తానే విశ్వాత్మ అయి ఈశ్వర కార్యంగా తానే ఒక జ్యోతిగా మారుతుంది. ఒక బీజం నాటుతుంది. ఆ బీజం నుండి మళ్లీ సృష్టి ఉద్భవిస్తుంది. ఆత్మజ్యోతి వెలుగు మృత్యువును తరిమివేస్తుంది. అప్పుడు సర్వం ప్రేమపూర్ణం,

అతీంద్రియం అవుతుంది. సర్వత్రా ఈశ్వర తత్త్వం ప్రస్ఫుటమవుతుంది. మాయ తెరలు, మర్మాలు, అడ్డంకులు ఏవీ ఉండవు. కాలం, దూరం పరమాత్మ విషయంలో ఆటంకాలు కావు.

మనిషి హృదయపు లోతులలో జ్ఞానతృష్ణ కలిగినపుడు అది అందరికీ అమృతాన్ని పంచిపెడుతుంది. అందరినీ ప్రేమతో ఏకం చేస్తుంది. ఆరాధనతో అందుకున్న బ్రహ్మానంద స్థితి అజరామర మవుతుంది. మానవ హృదయాలన్నీ ఆనందం పొందడానికి అర్హాలే. విశ్వప్రేమ, అనురాగం ఎవరిలోనైనా ఏర్పడగలవు. పరమాత్మ శక్తి అతి నిగూఢంగా, అజ్ఞాతంగా మనిషిలో ప్రవేశిస్తుంది. సత్యం, సౌందర్యం, ఆనందం, కరుణ అన్నీ విశ్వప్రేమకు మూలసూత్రాలు. ప్రతి మనిషి జీవితంలో అటువంటి మలుపు ఒకటి ఉంటుంది. అటువంటి మహత్తర ముహూర్తం ఒకటి నిద్ర లేపుతుంది.

అక్కడ అశ్వపతి చుట్టూ ఉన్నది ఆత్మ. తనలో ఉన్నదీ ఆత్మే. సర్వం ఆత్మమయం. పైన ఆకాశమూ ఆత్మతత్త్వమే. క్రింద ఉపాధీ ఆత్మ తత్త్వమే. సర్వత్రా ఆత్మ ప్రజ్ఞ అనుభూత మయింది. ఆలోచించ నవసరం కనిపించలేదు. అయినా జ్ఞానం అందుబాటులో ఉంటుంది.

ఏకాత్మభావనతో సర్వం యజ్ఞకృత మవుతుంది. యజ్ఞభావం ఏర్పడుతుంది. చైతన్యం మరో చైతన్యానికి సహకరిస్తుంది. మమాత్మా సర్వ భూతాత్మా అని భావం నెలకొంటుంది. ఒక ఆత్మ మరొక ఆత్మను ఆత్మీయంగా సంభావిస్తుంది. మాటా పలుకూ అవసరం లేదు ఆత్మల పరిచయాలకు. ఆత్మవీక్షణంతో సర్వం గమనించ వీలుంది. అన్ని ఆత్మరూపాలు పరమాత్మ ప్రతిరూపాలనిపిస్తాయి.

అక్కడ ప్రత్యేకించి జీవం లేకపోయినా ఒక మహాద్భుతమైన శక్తి ఉంటుంది. అది సున్నితం. అందనంత లోతు. అందుకోలేనంత ఎత్తు. అదే ఆధ్యాత్మిక మహాశక్తి. ఒక ఆత్మ మరొక ఆత్మకు మాత్రమే జవాబిస్తుంది. అది స్పందన. అదే అనుభూతి. అది అవగతం, అంతర్గతం. ఆత్మలన్నీ స్వతంత్రంగా, ఆనందంగా తెరలు, అడ్డుగోడలు లేకుండా ప్రవర్తిస్తాయి. ఆ ఆత్మీయతలే మానవ భూమికపై ప్రేమానురాగాలుగా పరిమళిస్తాయి. అక్కడ ఏ ఆత్మకు శరీరం అవసరం ఉండదు. మనస్సూ అవసరం లేదు. ఆత్మకు మాత్రమే క్షీణత ఉండదు. మృత్యువు దాని దరికి రాదు. ప్రతీ ఆత్మది శాశ్వతత్త్వమే. ప్రతి ఆత్మ ఇతర ఆత్మల స్పర్శ పొందగలదు. అదే ఆత్మీయస్పర్శ, ఆత్మానందం, ఆత్మానుభూతి.

మనం నిద్రలో అద్భుతమైన కలలు కంటాం. అప్పుడు మనకు శరీరలు జ్ఞానం ఉండదు. స్థితి ఉండదు. మన వ్యక్తిత్వానికి విలువ ఉండదు. స్వప్నం

ఒక్కటే వాస్తవం అనిపిస్తుంది. ఆత్మస్థితీ అంతే. ఆత్మ స్వయంగా, స్వీయప్రజ్ఞతో విషయ గ్రహణం చేస్తుంది. ఆకారాలు ప్రధానం కాదు. అవి స్వప్న సదృశాలు. ఎవరు ఎంతకాలం జీవించినా ప్రేమను ఆశ్రయించ వలసిందే. హృదయం హృదయంతో పలకడానికి భాష అవసరం లేదు, భావం అవసరం లేదు. అనుభూతి చాలు. మనిషికి మనస్సు అవసరం కనుక మనస్సుకు భావం అవసరం. భావ వ్యక్తీకరణకు భాష అవసరం. ఆత్మల భాష వేరు!

అది సుందర సురుచిర ఆధ్యాత్మిక సీమ. నదీనదాలు, ఆనందవనాలు, సరోవరాలు, కొండకోనలు ఆత్మశూన్యంలో దర్శన మిస్తాయి. అక్కడి బయళ్లు, లోయలు అన్నీ ఆత్మాశ్రయాలే. సుందరవనాలు పరిమళ శోభితాలు. అవి ధ్యానస్థితిలో యోగి దర్శించగల పరలోకసీమలు.

అక్కడ వీచే గాలులు ప్రజ్ఞాపూర్ణాలు. పరిమళాలు రంగుల వెలుగు నీడలలో ప్రవహిస్తాయి. అన్ని మాధుర్యాలు కలబోసి స్వర్గ వాతావరణం కలిగిస్తాయి. ఆ సౌందర్యాలు ఆత్మకు మాత్రమే అనుభూత మవుతాయి. కంటికి కనిపించవు. అక్కడ సౌందర్యాలు సహజంగా భాసిస్తాయి. వాటికి అలంకారాలు, శోభలు అవసరం ఉండదు. అన్ని రూపాలు ఈశ్వరుని ప్రతిరూపా లనిపిస్తాయి. అవి అన్నీ ఆత్మను పరివేష్టించిన శక్తులు. అక్కడ లోకాలు, ఆత్మలు సహజసిద్ధాలు.

ఇక్కడి వారంతా ఒకప్పుడు భూమిపైన శరీరాలు ధరించినవారే. ఇక్కడ విశ్వయోగులై తేజశ్శరీరాలతో అనవరతం ధ్యానస్థితిలో ఉంటారు. యోగచైతన్యం పొంది ఉంటారు. వీరు ఎప్పుడో స్వర్గ నరకాల సరిహద్దుల్ని అధిగమించి వచ్చిన వారు. ఏవేవో పుణ్యకార్యాలు చేసి, తపస్సు చేసి, కర్మయోగులై ఇక్కడికి చేరినవారు. పరనిర్వాణ పథంలో స్వర్గాలు, నరకాలు దర్శించి వచ్చినవారు. అన్ని లోకాలు దాటి సృష్టికి మూలమైన విశ్వాత్మను చేరుకున్నారు. ఇక్కడ సత్యం సైతం ప్రశాంతిలో కరిగిపోయి ఉంటుంది. ప్రకృతి పురుషులు యోగనిద్రలో ఒక్కటై ఉంటారు.

★ ★ ★

ధ్యానంలో యోగులు తమ పూర్వజన్మల్ని, పూర్వస్థితిని తెలుసుకుంటారు. రానున్న జన్మలను సైతం తెలుసుకోగలరు. మున్ముందు ఈ జీవితం ఎలా గడుస్తుందీ గుర్తిస్తారు. వీరు గతానికి వారసులు. భవిష్యత్తుకు వైతాళికులు. తమ భవిష్యజ్జీవితాన్ని తామే నిర్దేశించుకుంటారు. భవిష్యత్ జన్మలకు సుందర రూప కల్పన చేసుకుంటారు.

ఎవరు ఎన్ని లోకాలు దర్శించివచ్చినా అందరి వ్యక్తిత్వం ఒక్కటే. ఎవరెన్ని రూపాలు ధరించి వచ్చినా అందరి ఆత్మ ఒక్కటే. అయితే మేధస్సు ఆత్మరూపాల్ని గుర్తించలేదు. కొత్తకొత్త జన్మలలో కొత్త రూపాలతో, కొత్త పేర్లతో చలామణి అవుతుంది. చిరిగిపోయిన పుటల్లో వాటి రూపాలు, ఛాయలు కనిపించవు. కాని ఆత్మ ప్రతిజన్మలో కొంత ప్రగతిని సాధిస్తూనే ఉంటుంది. పరబ్రహ్మను చేరేవరకు ఆత్మ విశ్రమించదు. మళ్లీ మళ్లీ జన్మిస్తూనే ఉంటుంది.

సుఖదుఃఖాలు అనుభవించే ఆత్మ మరొక జన్మకు వెళ్లవలసిన అవసరం ఏర్పడుతుంది. మనస్సు కారణంగా మనిషి అనేక పొరపాట్లు, తప్పులు చేసి, ఆత్మకు క్షోభ కలిగిస్తుంటాడు. అందుచేతనే ఈ తప్పటడుగులు, ఆలస్యం, గమ్యం చేరలేకపోవడం. బాహ్య జీవితాన్ని, అంతర్‌జీవితాన్ని సమన్వయపరిస్తే ఈ చిక్కు లుండవు.

అశ్వపతి సృష్టి కేంద్రబిందువును చేరుకున్నాడు. ఆత్మ ఒక స్థితి నుండి మరొక స్థితికి చేరుతూ, చివరకు బయలుదేరిన చోటుకు వచ్చి నిస్సంగమవుతుంది. అక్కడ అరూప శక్తితో కలిసి అచంచల మహాశక్తిగా మారుతుంది. విశ్వాత్మకు మరొక సృష్టివాంఛ కలిగేవరకు మహాత్మలు విశ్రాంతి తీసుకుంటాయి.

సృష్టించబడినదంతా లయించిపోవడం సహజం. పరమేశ్వరుని దృష్టి సోకినప్పుడు లయించినవే తిరిగి ప్రాణం పోసుకుని రూపం ధరిస్తాయి. కొంతకాలం జీవులు, శక్తులు, ప్రాణులు, సంకల్పాలు శూన్యంలో విశ్రాంతి తీసుకుంటాయి. అక్కడ తమ గతాన్ని సింహావలోకనం చేసుకుని, పునర్వ్యవస్థీకరించబడి, కొత్తజన్మలకు కొత్తరూపాల్ని సిద్ధం చేసుకుంటాయి. అలా రూపాలను మార్చుతూ, జన్మలు మారుతూ, ఆత్మలు ప్రగతిపథంలోకి పయనిస్తుంటాయి. మృత్యువాత పడినా, మృత్యువును తమకు ఉపయోగకరంగా మార్చుకుని కొంత కాలం యోగనిద్రలో ఉండి, కొత్తచైతన్యం సంతరించుకుని, దేవతల మధ్య తమ స్థానాలను సుస్థిరం చేసుకుంటాయి. అలా తిరుగుతూ సృష్టిలో తమవంతు కార్యం నిర్వర్తిస్తాయి.

ఇక్కడ లోకాలను తయారుచేసే మాయామందిరం ఉంది. ఒక జన్మకు మరో జన్మకు మధ్య కొంత విరామం ఏర్పడినట్లుగానే ఒక సత్కర్మకు మరొక సత్కర్మకు మధ్య విరామం ఏర్పడుతుంది. ఒక స్వప్నానికి మరొక స్వప్నానికి పోలిక ఉండనట్లే ఒక జన్మకు మరొక జన్మకు పోలిక కనిపించదు.

ఆపైన ఉండేవన్నీ ఆనంద సీమలు. శాంతి నిలయాలు. వెలుగుకు, ఆశకు, ప్రేమకు అవి ఆవాసాలు. సచ్చిదానందానికి, ప్రశాంతికి అవి ఊయల హొయలు. అశ్వపతి ప్రాపంచికతను పూర్తిగా దాటిపోయిన తర్వాత కాస్త మైకం కమ్మినట్లయింది. అదొక మగత. ఆ మత్తులో పారమాత్మిక చైతన్యం కలిగింది. ఇంద్రియాల జ్ఞానం వదలిన తర్వాతనే ప్రజ్ఞానం ఏర్పడుతుంది. భాష, భావం అవసరం లేకుండా సత్యాన్ని గ్రహించ గలిగిన స్థితి అది. అప్పుడు ఆత్మతత్వం నుండి జీవుడు వేరుపడతాడు.

అశ్వపతి యోగాత్మ లోవెలుగుల బాటలలో దివ్యచిత్తరుల మధ్య, దేవతల ప్రత్యక్ష పర్యవేక్షణ క్రింద, ఒక చైతన్యమూర్తిగా ముందుకు సాగింది. తిరిగి రానవసరం లేని చివరి అంచుకు చేరుకున్నది. అప్పుడు మానవత్వం దివ్యత్వం కడపటి అంచుకు చేరినట్లు అయింది.

స్త్రీ పురుషులు సంయోగ పారవశ్యంలో ఇరువురు శరీరాలను మరచి ఒక్కటవుతారు. ఏకాత్మగా మారిపోతాడు. అది యోగ–సంయోగ రహస్యం. రెండు శరీరాలు సంయోగించినపుడు ఆత్మలు సైతం ఏకమవుతాయి. ఆత్మల ఏకత్వమే పరమానందం కలిగిస్తుంది. పారవశ్యంలో పరమానందం లభిస్తుంది. ఇరువురు సృష్టి మూలస్థితికి చేరి, ఆనందాన్ని అనుభవిస్తారు. అది పరమాత్మ – జగన్మాత కలసిన పారవశ్యం. ఆ పారవశ్య ఫలమే సృష్టి. దృశ్య ప్రపంచానికి మూలం. ఇరువురిలోని సమైక్యతా భావన సమారాధన అవుతుంది. అవ్యక్తానందమే వ్యక్త ప్రపంచానికి బీజం.

జగన్మాత, ఆత్మ ఆరాధనను ఆశిస్తుంది, తాను అందుకోలేని శిఖరాలపై ఉంటూ ఆత్మను తనవైపు ఆకర్షిస్తుంది. యోగికి మాత్రమే జగన్మాత సంపూర్ణ సహకారం లభిస్తుంది. పరమాత్మను చేరడానికి అన్ని వీళ్లు కల్పించి, అన్ని రక్షణలు ఇస్తుంది. అన్ని లోకాలను తన శక్తితో రక్షిస్తూ జీవుడు కర్మ విముక్తం అయ్యే వరకు ఆత్మను తానే రక్షిస్తుంది. ఆయా లోకాలకు తీసుకుపోయి అందాలను చూపించి, విలువల్ని అందిస్తుంది. తాను అన్నింటికీ అతీతంగా, అదృశ్యంగా ఉండి, అన్నింటికీ తానే ఆధారమవుతూ మహాశక్తిని అనుగ్రహిస్తుంది. ఆమెకు సృష్టిలో చొరరాని ప్రదేశం లేదు. యుగాలు మారినా జగన్మాత ప్రేమ తరగదు. లోకాల సంఘటనలన్నీ ఆమె ప్రకల్పనలే. ఈ సృష్టి ఆమె లీలావినోదం.

జగన్మాత శక్తి ముందు విశ్వాత్మ సైతం తలవంచుతుంది. ఆమె సంకల్పానికి, రచనా చమత్కృతికి జోహారులర్పించి చేతులెత్తి నమస్కరిస్తుంది. జగన్మాత ఆమోదం

తెలిపినపుడు ఆత్మ ఈ లోకాలను వదలి ఆమెను చేరుతుంది. 'మహామాయ' తెరను తొలగించుకుని 'ఆత్మ' జగన్మాతను దర్శించాలి. ఒక్క జ్యోతి దర్శనం మాత్రమే జగన్మాత ఉనికిని ఆత్మకు ఎరుకపరుస్తుంది.

ఆమె తీక్షణమైన కాంతిని ఆత్మసైతం భరించలేదు. రేఖా మాత్రంగా ఆమె దివ్యరూపాన్ని చూస్తుంది. ఆమె ప్రసాదించే తేజస్సును ఏకొద్దిగానో మనం అందు కుంటాం. ఆ సచ్చిదానందాన్ని బహు కొద్దిగానే మనం అనుభవిస్తాం. అదే మనకు మహాతేజస్సు. అదే మనకు మహాశక్తి. అవి ఆధారం చేసుకునే మనం ఆమె సచ్చిదానంద సాగరాలలోకి ప్రవహిస్తాం.

మనం ఆధ్యాత్మిక మైకంలో అమృతపానం చేసి, ఆత్మతోనే జగన్మాతను ఆరాధిస్తాం. ఏ మాటలు, మంత్రాలు, పూజలు అవసరం ఉండదు. ఆరాధనకు, సమర్పణకు మంత్రాలు, శక్తులు అవసరం లేదు. నిర్మల హృదయంతో ప్రేమించడమే ఆత్మ సమర్పణ.

అశ్వపతి జగన్మాత పాదాలపై వాలిపోయాడు.

49. విశ్వదర్శనం

***అశ్వపతి** అన్ని లోకాలు సందర్శించాడు. తిరిగి తనదైన భౌతిక శరీరంలో ఆత్మ తిరిగి ప్రవేశించింది. పరానికి, ఇహానికి మధ్య మళ్లీ 'మాయ' తెరపడింది. పరజ్ఞానం మరుగైంది. పరప్రజ్ఞ మాయమైంది. ఇది అశ్వపతి యోగప్రజ్ఞ. యోగానుభవ విశేషం. ఇంతటి యోగానుభవం పొందిన అశ్వపతి ఇప్పుడు నవ్యమానవుడైనాడు. ఆయన మనీషి. అతనిలో నూతన కాంతి ప్రవేశించింది. నూతన చైతన్యం కలిగింది. ఇప్పుడు సంకల్పమాత్రంచే పరప్రజ్ఞ అందుతుంది. ప్రత్యేకించి యోగసాధన చేయనవసరం లేదు.*

ఒకసారి సాధకుడు పొందిన యోగానుభవం ఏదీ వృధా కాదు. ప్రతి అనుభవం అతనిని ఒక మెట్టుపైకి చేర్చుతుంది. అశ్వపతి సాధించిన విజయం మానవ జాతికి మహోపకారం చేసింది. అది మానవతకు దివ్యత్వాన్ని అద్దింది. శ్రీ అరవింద యోగి ఆశించింది అదే. మహాయోగి శ్రీ అరవిందుల అనుభవాలే అశ్వపతి అనుభవాలు, అనుభూతులు.

అపూర్వమైన అనుభవాలు పొందిన అశ్వపతి తిరిగి భౌతిక ప్రపంచంలోకి చేరుకున్నాడు. కాలాతీతమైన శూన్యాలను, శాంతిసీమలను వదలి, తిరిగి శబ్ద ప్రపంచంలో ప్రవేశించాడు. తాను గ్రహించింది, అనుభవించింది, అనుభూతించింది ఒక కలగా కరిగిపోసాగింది. మరపు కలుగుతోంది. పైన సర్వసాక్షి- క్రింద జగత్తు. తాను ఒంటరిగా, ప్రశాంతంగా నిలిచాడు. విశ్వవాణి పిలుపుకు దూరమైనాడు.

ఇప్పుడు తానొక విశిష్ట వ్యక్తి. ఒక విశుద్ధ నిర్మల కాంతి అతనిని పరివేష్టించింది. దివ్య దృష్టి ఏర్పడింది. ఏ రూపాలు లేని నిర్గుణత్వంలో నిర్మలంగా, నిశ్చలంగా తాను ఎంతకాలమైనా ఉండిపోగలడు. క్షణంలో బ్రహ్మానంద స్థితికి చేరగలుగుతున్నాడు. ఇప్పుడు ఇటు తన ఆత్మ, అటు పరమాత్మ రెండే శాశ్వత

సత్యాలు. మిగిలిన ప్రపంచం తనకు లెక్కలేదు. స్వర్గాలు పరిగణనలోకి రావడం లేదు. అదే సత్యం. ఆత్మ, పరమాత్మ. అదే సత్యజ్ఞానం.

మనోలోకాలు ఒక్కొక్కటి దాటి పైకి వెళ్లినకొద్దీ వెలుగునీడల్ని దాటిపోవచ్చు. తన లోపల నిర్మలంగా ఉండిపోగలడు. అది ఆత్మకు అంతుపట్టని సౌమ్యలోకం. అది పూర్ణం, శూన్యం, నిర్మలం. అన్నింటికీ అంతిమ స్థితి. అందులోనే సర్వం లయిస్తుంది. మళ్లీ ఉద్భవిస్తుంది. సగుణంగా ఉన్నవన్నీ నిర్గుణంలో కలిసిపోతాయి. ఆత్మశిఖరాగ్రం నుండి సమస్త విశ్వాన్ని, లోకాలను దర్శించవచ్చు, గమనించ వచ్చు. అది శాంతికి ఆవాసం, జ్ఞానానికి ఆలయం. అనంతసృష్టికి ఆధారం. ఈశ్వర సాన్నిధ్యానికి చేర్చగల తేరు అది. బ్రహ్మానందంలో నడిచే తావు. ఆలోచనా తరంగాల్ని దాటించగల సేతువు అది. మనం చెవులతో వినలేని ప్రణవనాదం అక్కడిది. జ్ఞానం, జ్ఞాతం, జ్ఞేయం – మూడూ అక్కడ ఒక్కటవుతాయి. ప్రేయసి, ప్రియుడు, ప్రేమ – మూడూ ఒక్కటవుతాయి. అక్కడ అన్నీ మౌలికంగా పూర్ణత్వంతో భాసిస్తాయి. సృష్టికి పూర్వపు పూర్ణత్వం అది. సృష్టి పరిణామంలోని చివరి పూర్ణత్వమూ అదే. విశ్వ కర్మలన్నీ పూర్వపు స్వప్నాలు. ఆధ్యాత్మికతకు అదే పుట్టిల్లు. అక్కడే ఆధ్యాత్మికత జన్మిస్తుంది. పరమాత్మకై అన్వేషణ ఆరంభం ముగింపు అక్కడే.

వేయిన్నొక్క మార్గాలు ఈశ్వరత్వానికి దారిచూపిస్తాయి. భగవంతునికి అవి మంగళ హారతులు. భవబంధాల నుండి విముక్తం అయిన జీవుడు పరమాత్మ మందిర ద్వారం చేరుకుంటాడు. అప్పుడు ఒక బలీయమైన అంతర్వీక్షణ ఏర్పడుతుంది. దిదృక్ష కలుగుతుంది. ఆంతర్యంలోకి చొచ్చుకుపోగలుగుతాడు. లోపలికి వెళ్లిన కొలదీ అద్భుత లోకాలు, సౌందర్యాలు ఎదురవుతాయి. సృష్టి మర్మాలు తెలుస్తుంటాయి. మార్మిక సత్యాలు అవగతమవుతాయి. ఆ ప్రశాంతిలో శక్తి, అనురాగం ఉరకలు వేస్తాయి. విశ్వప్రేమ పొంగిపొరలుతుంది. ఆ సమాధి బ్రహ్మానందానుభూతిని కలిగిస్తుంది. అతీంద్రియ మధురాగ్ని రగిలి కీలలై, నాల్కలు సాచి, శిఖరానికి ఎగబాకుతుంది. ఒకే పరమాత్మ అనేక రూపాలలో దర్శన మిస్తుంది.

ఆత్మ తేజస్సు నిరవధికంగా పెరిగి ప్రేమగా, అనంతంగా, ఆనందంగా, అనుభూతిగా రూపాంతరం చెందుతుంది. అక్కడ అన్ని నెలవులు భగవదనుగ్రహ పాత్రాలే. అన్ని ఆత్మలు ప్రశాంతంగా పరమాత్మ నీడకు చేరి విశ్రమిస్తాయి. అన్ని శక్తులకు మూలమైనది సత్యం. అన్ని శక్తులు ఆధ్యాత్మిక రూపాలను సంతరించు

కుంటాయి. మనిషికి ఆత్మశక్తి అందుబాటులోకి వస్తుంది. అన్ని చైతన్యాలు, ప్రేరణలు దివ్యానుభూతిని కలిగిస్తాయి.

అశ్వపతి ఆత్మగత నిశ్శబ్ద ప్రశాంతిని దాటి భావాతీత స్థితికి చేరుకున్నాడు. మానవ ప్రపంచానికి, మనిషికి అతీతమైన, అతీంద్రియ శక్తుల్ని పొందగలిగాడు. బ్రహ్మానంద లోకాలు దర్శించాడు. సృష్టిలోని అన్నింటి ఆంతర్యం గ్రహించి విశ్వరచనా ప్రక్రియను తెలుసుకున్నాడు. మార్మిక వీధులు దాటి జ్ఞాన శిఖరాన్ని చేరుకున్నాడు. అక్కడ భావం అభావమై అంతరంగ ప్రజ్ఞలో లయించిపోయింది. అనుభూతి శాంతిసాగరాలను దాటించింది. దివ్యదృష్టి ప్రపంచ సరిహద్దుల్ని అధిగమించింది.

పరబ్రహ్మ సాక్షాత్కారంతో బ్రహ్మత్వం పొందినవానివలె అతను మహర్షి అయి బ్రహ్మజ్ఞానంతో పాటు దివ్యవర్చస్సునూ పొందాడు. అతీంద్రియ ప్రజ్ఞతో సర్వలోకాలు దాటి సత్యలోకం చేరాడు. తన ఆంతర్యంలో అద్వితీయుడుగా ఆత్మశరీరంతో ఉండిపోగలిగాడు. అక్కడ తన ఆత్మ తిరిగినంతమేర తన ఆత్మ సామ్రాజ్యం. ఇప్పుడు మనస్సు కల్పించే భ్రమలు లేవు. పూర్ణవిముక్తి లభించింది. సర్వస్వతంత్ర ప్రజ్ఞ అలవడింది. కాలం కల్పించే అవరోధాలు భయపెట్టవు. చైతన్యం తనలోకి అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తున్నది. అది సహజక్రియగా మారింది. తానే చైతన్యం అయినాడు. ఆ చైతన్యం సృష్టికార్యనిర్వహణను విరామం లేకుండా కొనసాగిస్తుంది. అంతటి సృష్టికి ఆత్మశక్తి ఒక్కటే ఆకరం అని గ్రహించాడు.

అక్కడ సంపూర్ణ విశ్వరూపం దర్శించగలిగాడు. అగోచరంగా, అదృశ్యంగా ఉన్న రహస్యాలు తెలియడమే విశ్వరూప దర్శనం. అరూపంగా యవనిక మాటున దాగివున్న రహస్యాలు బయట పడడమే విశ్వరూప దర్శనం. అమృత తుల్యమైన అనురాగాలు, ప్రేమలు తనవైనాయి. అసామాన్య విషయ విజ్ఞాన గ్రంథం ఆవిష్కరించినట్లయింది. ఒకేఒక్క ఆత్మసూత్రంతో విశ్వరహస్యం తెలివిడి అయింది. ఊర్ధ్వ గమనానికి, అతీంద్రియ ప్రస్థానానికి అనేక సూత్రాలు, మార్గాలు ఉన్నాయి. విశ్వజ్ఞానం ఒక్కటే. గణితం ఒక్కటే. పరిశోధనలు వేరు వేరు. ఆకారాల వెనుక దాగిన నిరాకారాన్ని గుర్తించడమే పరిశోధనల అంతిమ గమ్యం. అదే పరమ సత్యం.

అశ్వపతి నిర్మల హృదయంతో లయబద్ధంగా కదిలే గోళాల చలనాలు వినగలిగాడు. త్రయాగ్నుల్ని సేవించగలిగాడు. సుషుప్తి, సమాధి స్థితులలో కడపటి అంచులు చేరి ప్రణవనాదాన్ని వినగలిగాడు. పరమసత్యాన్ని గుర్తించ గలిగాడు.

మార్మిక శబ్దసంపుటితో తన ఆత్మను మేల్కొల్పాడు. శబ్దానికి మూలమైన నాదం, నాదానికి మూలమైన ప్రణవం ఉపాసించాడు. ఆత్మ తేజస్సులో సుస్నాతుడైనాడు.

నిద్ర, మృత్యువు అనే భయంకర అవరోధాలు దాటి, చైతన్యంతో విశాల విశ్వ హృదయాన్ని దాటి, మెరుపుగా పయనించి, జన్మ రాహిత్య స్థితికి చేరాడు. మరొక అడుగు ముందుకు వేస్తే ఆత్మ సైతం శూన్యంలో లయిస్తుంది. అదే పరమాత్మను చేరడానికి చివరి మజిలీ. స్వప్న సదృశమైన ప్రపంచానికి అది కడపటి సువర్ణ రేఖ. జీవుని రక్షించే అగ్నులకి, భక్షించే అగ్నులకు మధ్యన నిలిచాడు. అతనిప్పుడు చేరిన తావు పరమ సత్యానికి నెలవు. అక్కడ వెలుగు సరిహద్దుల్ని చేరుకున్నాడు. నిర్గుణ పరబ్రహ్మ దర్శనంతో పరవశించాడు.

పైన కనిపిస్తున్నవన్నీ అగ్ని మండలాలు. మహాగ్ని రెక్కలు సాచి లోకాన్ని కబళిస్తున్నట్లుంది. ఆ అగ్నిలో కాలి, కొన్ని గ్రహాలు నక్షత్రాలుగా మారాయి. మరికొన్ని లోకాలుగా రూపుదిద్దుకుని దేవతల ఆధిపత్యం క్రింద ఉండిపోయాయి.

విశ్వవిజ్ఞానానికి ఆకరమైన ప్రజ్ఞ అచేతనంగా, నిర్మలంగా, నిశ్చలంగా ఉండిపోయింది. దానిని మనస్సుతో అంచనా వేయడం, తెలుసుకోవడం దుస్తరం. దివ్యజీవనంతో మాత్రమే జ్ఞానం గ్రహించ వీలున్నది. ప్రశాంతిలో పరమాత్మ చిరునామా లభిస్తుంది. ఆయన తెలుసుకోగలిగినంతా తెలుసుకున్నాడు. సృష్టి నఖశిఖ పర్యంతం పర్యటించాడు. పర్యాలోకించాడు. ముల్లోకాలు, భగభగ మండే అగ్నిగోళాలు దర్శించాడు. అటు నరకాల్ని గమనించాడు. ఒక మార్మికత మినహా సర్వం అతనికి తెలిసింది. పరబ్రహ్మ నిగూఢతత్వం అర్థమైంది. కానీ అసలు పరమాత్మ అంటే ఏమిటి? పరబ్రహ్మం అంటే ఏమిటి? అది మార్మిక సత్యం.

అతని అంతరంగంలో లోకాలు తరంగాలుగా బయటపడసాగాయి. ప్రచ్ఛన్న లోకాల రహస్యాలు తెలిశాయి. దివ్యలోకవాసులు అక్కడి తమవారితోనే ప్రేమగా ఉంటారు. వారి లోకం వారిది. వారివన్నీ సంకేతాలు, స్వర్గాలు. అంతరంగలోకాల అఖాతాల నుండి బయటపడినా పరలోకపు అగ్నిజ్వాలాల్లో పడి దగ్ధమవడం ఖాయం. అన్ని శక్తులు వలయాలు తిరుగుతూ, సుడిగుండంలో అంతరించినట్లు అన్ని శక్తులు పరాశక్తిలో లయించిపోతాయి. అవి అన్నీ ఒక దిశగా ప్రవహించి సాగరంలో లీనమవుతాయి. జీవులంతా ఆ మహాసాగరంలోని బిందువులు.

సకల జీవరాశిని భరించగల విశ్వంభర సృష్టిని బహుముఖాలతో, పలు విధాలుగా శాసిస్తుంది. ఆ మహౌన్నత్యంలో తాను ఒక కిరణం. ఇప్పుడు తాను

సంకల్పమాత్రంచే తేజో రూపం ధరించగలడు. తన లోకంలో అసత్యానికి తావు లేదు. వేరు వేరుగా కనిపించే శక్తు లన్నింటికీ మూలశక్తి ఒక్కటే. అది తీరాలు లేని చైతన్యసాగరం. ప్రతి వ్యక్తి విశ్వాత్మలో ఎక్కడో పయనిస్తుంటాడు. పరాశక్తి పలువిధాల మనిషిని మురిపిస్తుంది. అలరిస్తుంది. పరబ్రహ్మ దర్శనానుభూతికి అవి అవసర కార్యాలు, సహచరులు.

ఆత్మ సంకేతంగా, ఔన్నత్యం ఒక అవసరంగా మారి ఈ శరీరం ఆత్మ కార్యానికి సిద్ధమవుతుంది. దివ్యత్వం, అతీంద్రియత అరూపంగా ఉంటాయి. చైతన్యంలో అతీంద్రియత రాణిస్తుంది. పరప్రజ్ఞతో పూర్ణత్వం సిద్ధిస్తుంది. పూర్ణత్వంలోనే విశ్వకామన, శ్రేయస్సు ఉంటాయి. ఆత్మకు చైతన్యం అతి సన్నిహితం. ఆత్మకు దూరాలు, తీరాలు ఉండవు. అది అన్ని కాలాలకు వర్తిస్తుంది.

చైతన్య పరదాలు ఆలోచనల్ని చించివేస్తాయి. ఆలోచనలు ఎప్పుడూ బాహ్య ప్రపంచానికి అనుకూలంగా ఉంటాయి. మనం చూడగలిగినంతమేర అగ్ని రగులుతుంది. మన జీవితం ఆత్మకు ఆధారం. మన అనుభూతి విశ్వలయకు ఆనంద తరంగం. ఆత్మశక్తికి, కాంతికి తాను ప్రతినిధిగా మారాడు. తిరిగి శరీరంలో ప్రవేశించిన ఆత్మ అతనికి మరో జన్మ నిచ్చింది. అతను పసివాడు, అమాయకుడు, కాలాతీతుడు, కాలరహితుడు, ప్రాజ్ఞుడు అయినాడు. అతని తేజోరూపం ఒక తేజోగోళంగా మారింది.

ఒక మహత్తర తేజస్సు అశ్వపతి హృదయాన్ని పలకరించింది. అంతర్వీక్షణకు అనంత విజ్ఞానం అందింది. సర్వాన్ని భావించి, సంభావించగల మహాప్రజ్ఞ ఏర్పడ్డది. ఇప్పుడు తాను కనిపించని పరమాత్మను చూడగలడు. చైతన్య రూపులంతా అతని హృదయానికి నేస్తాలు. మహర్లోకాలలో సూక్ష్మశరీరాలతో ఉండేవారు అతని పిలుపుకు పలుకుతారు. దేవతలు సైతం అతని సంకల్పానికి స్పంది స్తున్నారు.

అశ్వపతి ఆత్మ ప్రకృతితో సమతుల్యం సాధించింది. ప్రకృతితో ప్రతిస్పందిం చింది. మహాశక్తులన్నీ అతని వశమైనాయి. అతని మేధ మహాతేజస్సుతో, శాంతితో నిండింది. సర్వజ్ఞత్వం అతని హృదయాన్ని వశపరచుకుంది. సామాన్యమేధ భరించ లేని ఆలోచనలు అతని స్వంతం.

భౌతిక శరీరం భరించలేని శక్తులు అతను భరించగలడు.

విశ్వమేధ రహస్యాలను అతను విశ్లేషించగలడు.

ఉన్నతస్థితిలో ఆత్మ పొందగల ఆనందాలన్నీ అనుభవించగలడు.

దివ్యతేజస్సుతో దివ్యజీవనం సాగిస్తూ, పారమార్థిక సౌహార్దాలను అనుభవిస్తూ, ఇహ లోకాన్ని పరంతో జతపరచ గలిగాడు.

ఇహ పరాలను ఒకే రేఖపైకి తేగలిగాడు.

దైహికప్రజ్ఞ పరప్రజ్ఞతో సంధానపడ్డది.

తానిప్పుడు దేవతల్ని సైతం శాసించగలడు.

విశ్వశక్తి తనదైంది.


అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ

మాస్టర్ యోగాశ్రమ సమాచారం


- పరబ్రహ్మాంశ సంభవులైన మాస్టర్ సి.వి.వి.గారు ఆవిష్కరించిన నూతన యోగం "భృక్త రహిత తారక రాజయోగం".
- దీనిని సత్యయోగమనీ, మాస్టర్‌యోగమనీ సాధకులు, శ్రీవారి శిష్య ప్రశిష్యులు అభిమానంతో పిలుచుకుంటారు.
- మాస్టర్ యోగం నిత్యనూతనమై, ఎప్పటికప్పుడు సరికొత్త అనుభవాలను సాధకులకు కలిగిస్తుంది. వినూత్న యోగానుభూతులను కలుగజేస్తూ సత్యావిష్కారం చేస్తూంది.
- మాస్టర్ సి.వి.వి.గారి 'ప్రాణా ట్రీట్-యోగా టీచ్' అనే యోగ సూత్రం ఆధారంగా, లక్ష్యంగా "మాస్టర్ యోగాశ్రమం" నెలకొల్పబడింది.
- శ్రీ శార్వరి నిర్దేశకత్వంలో మాస్టర్ యోగాశ్రమం వేలమందిని జిజ్ఞాసా పరుల్ని చేస్తూ సత్య యోగమార్గంలో నడిపిస్తున్నది.
- మాస్టర్ యోగ హృదయావిష్కారం చేస్తూ శ్రీశార్వరి ఇప్పటికి 50పైగా యోగంపైన గ్రంథాలు రచించి ప్రచురించడం జరిగింది.
- శ్రీశార్వరి మాస్టర్ సి.వి.వి.గారి యోగవిభూతితో, యోగస్పర్శతో అనితరసాధ్యంగా యోగచికిత్సలు నిర్వహిస్తూ, వేలమందికి శారీరక, మానసిక రుగ్మతలకు చికిత్సలు చేశారు ... చేస్తున్నారు.
- మాస్టర్ యోగాశ్రమం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మే (29-31) డిసెంబరు (29-31) తేదీలలో ప్రత్యేక సమావేశాలు జరుగుతుంటాయి.
- సాధకులు, జిజ్ఞాసులు ప్రతి సాయంత్రం 6 గంటలకు సమావేశానికి హాజరై ధ్యానం చేసుకోవచ్చు. ప్రతి ఆదివారం సాయంత్రం ప్రత్యేక సమావేశాలు ఉంటాయి.
- యోగచికిత్స కోరేవారు, కొత్తగా యోగంలో చేరదలచినవారు ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకుని రావలసి ఉంటుంది.



మాస్టర్ యోగాశ్రమం, తిరుమలగిరి, సికింద్రాబాద్.

ఫోను : 040-27790094, 9393933946











మాస్టర్ శార్వరి రచనలు


ధ్యాన, యోగ, తాత్విక, చారిత్రక రచనలు

1.	భగవాన్ చరణాలు (మార్మిక కవితలు)	రూ. 250/-
2.	వివేకానందం	200/-
3.	ఇహం : పరం : మనం	200/-
4.	యోగామ్యూజింగ్స్	100/-
5.	అతీత మానసం	100/-
6.	మాస్టర్స్ యోగదర్శిని	100/-
7.	ధ్యానం:యోగం ఎలా చేయాలి?	200/-
8.	దివ్యజ్ఞానం (మహాచైతన్యం)	100/-
9.	కుండలిని	100/-
10.	శక్తిపాతం	100/-
11.	సమాధి	100/-
12.	మృత్యువు తర్వాతి జీవితం	100/-
13.	భృక్తం - రహితం - తారకం	100/-
14.	యోగానంద లహరి	100/-
15.	యోగవిజయాలు	100/-
16.	స్పందన : యోగానుభవాలు	100/-
17.	ఆత్మదీపాలు	100/-
18.	కర్ణమహాభారతం	200/-
	శ్రీశార్వరి ఆత్మయోగిసత్యకథ	
19.	మొదటి భాగం- జీవనయోగం	200/-
20.	రెండవ భాగం - యోగజీవనం	200/-
21.	మూడవ భాగం - యోగావిజన్	100/-
22.	సామ్రాట్ అశోక	150/-
23.	ప్రియదర్శి - అశోక - II	150/-
24.	సిద్ధార్థ	100/-
25.	చాణక్య	150/-
26.	శంబల	150/-
27.	గురుగీత	100/-
28.	ధర్మభిక్షువు మిలారేపా!	100/-
29.	భగవాన్ బుద్ధ	200/-
30.	మహాత్మా జీసస్	100/-
31.	సద్గురు సాయిబాబా	100/-
32.	సద్గురు రమణ	200/-
33.	అరవింద దర్శనం	100/-
34.	కొత్తకోణంలో కృష్ణమూర్తి	100/-
35.	మాస్టర్ సి.వి.వి.	100/-
36.	అవతార్ మెహర్‌బాబా	100/-





37.	భగవాన్ రజనీష్ – ధ్యానసూత్ర	100/–
38.	పరేంగిత ప్రజ్ఞ (దాదాజీ ఆత్మకథ)	100/–
39.	మాడం బ్లవట్స్కీ	100/–
40.	ఆంధ్రమహాసావిత్రి – వచనం	600/–
41.	అరవింద సావిత్రి–మార్మిక కావ్యం	600/–
42.	విశ్వదర్శనం	200/–
43.	గురుదర్శనం	200/–
44.	యోగప్రభ	200/–
45.	పరావిద్య	100/–
46.	మాస్టర్ ప్రేయర్స్ (తెలుగు)	200/–
47.	మాస్టర్ ప్రేయర్స్ : 'ఎం' కోర్సు	100/–
48.	గీతాజ్ఞానయజ్ఞం	100/–
49.	శ్రీ కృష్ణావతారం	100/–
50.	యోగాశ్రమలేఖలు	100/–
51.	సత్యసంహిత	100/–
52.	యోగచికిత్స	100/–
53.	మాస్టర్ యోగ చరిత్ర	150/–
54.	హస్తసాముద్రికం	150/–
55.	మంజరీ ద్విపద : కథలు	100/–

BOOKS IN ENGLISH BY MASTER SARVARI

56.	MASTER PRAYERS	100/–
57.	IMMORTALS OF SHAMBHALA	175/–
58.	LOVE 'N' YOGA	175/–
59.	CHRIST CONSCIOUSNESS	150/–
60.	SPIRITUAL JOURNEY OF JESUS CHRIST	350/–
61.	IN SEARCH OF GURU	250/–
62.	IN SEARCH OF GOD	200/–
63.	IN SEARCH OF SOUL	200/–
64.	THE MYSTERY OF KUNDALINI	200/–
65.	THE LIFE BEYOND DEATH	200/–
66.	TRUTH IS PATHLESS PATH	150/–
67.	THE MYSTIC MASTER	250/–
68.	WAY TO PARADISE	250/–

MASTER YOGAASHRAM

Plot No. 89, Krishna Enclave,
M.D. Farm Road, Kanajiguda, Tirumalagiri,
SECUNDERABAD - 500 015.
Cell : 93 93 93 39 46, 93 93 93 39 39
E-mail : drvaasili@yahoo.co.in
www.yogaalaya.org www.yogaalaya.com

